*Saheeh Bukhari (Vol-6)*
*(Telugu)*

# సహీహ్ బుఖారీ

## (6వ సంపుటం)

మూలం

**హజ్రత్ అల్లామా వహీదుజ్జమాఁ (రహ్మ)**

తెలుగు అనువాదం

**ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

ప్రకాశకులు :
**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్**
సందేశభవనం, లక్కడ్‌కోట్, ఛత్తాబజార్,
హైదరాబాద్–500 002.
ఫోన్: 040–24564583

# Saheeh Bukhari *(Vol-6)*

## Saheeh Bukhari (Vol-6) (Telugu)

**TIP Series No.** : **356**

Written by : **Hazrat Allama Waheeduzzaman** (R.H.)

Translated by : **Muhammad Azeezur Rahman**

*All Rights Reserved with Publishers*

First Edition : April 2024

Copies : 500

**Price : Rs. 450/-**

Published by : **Telugu Islamic Publications Trust (Regd.)**
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 040 - 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

విశ్వసించిన ప్రజలారా!
అల్లాహ్ పిలుపునకూ, ఆయన ప్రవక్త
పిలుపునకూ జవాబు పలకండి–
ప్రవక్త మీకు జీవితాన్ని ప్రసాదించే
దాని వైపునకు మిమ్మల్ని
పిలిచినప్పుడు.

*(అల్ అన్ఫాల్ : 24)*

# విషయసూచిక

# 1. యుద్ధాల ప్రకరణం-2 (కితాబుల్ మగాజీ)


| | | |
|---|---|---|
| భూమిక | | xv |
| అధ్యాయం : 30 | కందక యుద్ధం | 01 |
| అధ్యాయం: 31 | అహ్జాబ్ యుద్ధం నుండి ప్రవక్త మహనీయులు(సఅసమ్) తిరిగి రావటం | 12 |
| అధ్యాయం : 32 | జాతిర్రిఖా యుద్ధం గురించి | 17 |
| అధ్యాయం : 33 | బనీ ముస్తలఖ్ యుద్ధం గురించి | 21 |
| అధ్యాయం : 34 | అన్మార్ యుద్ధం గురించి | 22 |
| అధ్యాయం : 35 | అపనింద (ఇఫ్క్) సంఘటన | 23 |
| అధ్యాయం : 36 | హుదైబియా యుద్ధం గురించి | 34 |
| అధ్యాయం : 37 | ఉక్ల్, ఉరైనా తెగల వృత్తాంతం | 50 |
| అధ్యాయం : 38 | జాతె ఖరద్ పోరు గురించి | 51 |
| అధ్యాయం : 39 | ఖైబర్ యుద్ధం గురించి | 53 |
| అధ్యాయం : 40 | దైవప్రవక్త(స) ఖైబర్ వాసులపై తహసీల్దారును నియమించటం | 77 |
| అధ్యాయం : 41 | ఖైబర్ వాసులతో దైవప్రవక్త(స) వ్యవహారం | 78 |
| అధ్యాయం : 42 | ఖైబర్‌లో మేక మాంసంలో విషం కలిపి ప్రవక్త(స) ముందుంచటం | 78 |
| అధ్యాయం : 43 | జైద్ బిన్ హారిసా(రజి) యుద్ధం గురించి | 79 |
| అధ్యాయం : 44 | ఉమ్రా ఖజా గురించి | 80 |
| అధ్యాయం : 45 | మూతా యుద్ధం | 85 |
| అధ్యాయం : 46 | ఉసామా బిన్ జైద్(రజి)ను దైవప్రవక్త(స) 'హురుఖాత్' తెగవారిపై దండయాత్రకు పంపటం | 88 |
| అధ్యాయం : 47 | మక్కా విజయం గురించి | 89 |
| అధ్యాయం : 48 | మక్కా విజయం (హిజ్రీ 8, రమజాన్ నెలలో) | 91 |
| అధ్యాయం : 49 | మక్కా విజయం నాడు దైవప్రవక్త (సఅసమ్) జెండాను ఎక్కడ పాతిపెట్టారు? | 93 |
| అధ్యాయం : 50 | దైవప్రవక్త(స) ఎత్తయిన ప్రదేశం నుండి మక్కా నగరంలో ప్రవేశించటం | 98 |
| అధ్యాయం : 51 | మక్కా విజయం సందర్భంగా దైవప్రవక్త(స) ఎక్కడ విడిది చేశారు? | 99 |
| అధ్యాయం : 52 | ప్రవక్త (సఅసమ్) రుకూ సజ్దాలలో ఈ విధంగా వేడుకునేవారు | 100 |

| | | |
|---|---|---|
| అధ్యాయం : 53 | మక్కా విజయం సందర్భంగా దైవప్రవక్త(స) మక్కాలో ఆగి ఉండటం | 103 |
| అధ్యాయం : 54 | అబ్దుల్లాహ్ బిన్ సాలబా బిన్ సుఅయ్ర్(రజి) తెలిపారు | 103 |
| అధ్యాయం : 55 | హునైన్ యుద్ధం గురించి | 110 |
| అధ్యాయం : 56 | అవ్తాస్ యుద్ధం గురించి | 115 |
| అధ్యాయం : 57 | తాయఫ్ యుద్ధం గురించి... | 117 |
| అధ్యాయం : 58 | నజ్ద్ వైపునకు దైవప్రవక్త(స) పంపిన సైనిక దళం గురించి | 128 |
| అధ్యాయం : 59 | ఖాలిద్ బిన్ వలీద్(రజి)ను బనీ జజీమా తెగ వైపునకు పంపటం | 128 |
| అధ్యాయం : 60 | అబ్దుల్లాహ్ బిన్ హుజాఫా సహ్మీ (రజి), అల్ఖమా బిన్ ముజజ్రజ్ ముద్లిజీ (రజి)ల వెంట ఒక సైనిక దళాన్ని పంపటం గురించి | 129 |
| అధ్యాయం : 61 | దైవప్రవక్త(స) అబూ మూసా అష్అరీ(రజి)ని, ముఆజ్ బిన్ జబల్(రజి)ను యమన్‌కు పంపటం | 130 |
| అధ్యాయం : 62 | వీడ్కోలు హజ్జ్‌కు ముందు అలీ బిన్ అబీ తాలిబ్(రజి)ను ఖాలిద్ బిన్ వలీద్(రజి)ను యమన్‌కు పంపించటం | 134 |
| అధ్యాయం : 63 | జుల్ ఖలసా యుద్ధ ప్రస్తావన | 138 |
| అధ్యాయం : 64 | జాతిస్సలాసిల్ యుద్ధం గురించి | 140 |
| అధ్యాయం : 65 | జరీర్ బిన్ అబ్దుల్లాహ్ బజలీ (రజి) యమన్ వైపునకు వెళ్ళటం | 142 |
| అధ్యాయం : 66 | సైఫుల్ బహ్ర్ యుద్ధం గురించి | 143 |
| అధ్యాయం : 67 | హిజ్రీ 9వ యేట అబూబక్ర్(రజి) జనులతో కలసి హజ్జ్ చేయటం | 145 |
| అధ్యాయం : 68 | బనీ తమీమ్ బృందం రాక గురించి | 146 |
| అధ్యాయం : 69 | ముహమ్మద్ బిన్ ఇస్హాఖ్ కథనం: | 147 |
| అధ్యాయం : 70 | అబ్దుల్ ఖైస్ దూతల గురించి .... | 148 |
| అధ్యాయం : 71 | బనూ హనీఫా ప్రతినిధి బృందం, సుమామా బిన్ ఉసాల్ గురించి.... | 152 |
| అధ్యాయం : 72 | అస్వద్ అన్సీ వృత్తాంతం | 155 |
| అధ్యాయం : 73 | నజ్రాన్ క్రైస్తవుల వృత్తాంతం | 157 |
| అధ్యాయం : 74 | ఉమాన్, బహ్రైన్‌ల గురించి | 159 |
| అధ్యాయం : 75 | యమన్ నుండి అష్అరీ తెగవారి రాక | 160 |
| అధ్యాయం : 76 | దౌస్ తెగ గురించి, తుఫైల్ బిన్ అమ్ర్ దౌసీ (రజి) గురించి | 164 |
| అధ్యాయం : 77 | 'తయ్' తెగ ప్రతినిధి బృందం- అదీ బిన్ హాతిమ్(రజి) వృత్తాంతం | 165 |

అధ్యాయం : 78 హజ్జతుల్ వదా (వీడ్కోలు హజ్జ్) 166
అధ్యాయం : 79 తబూక్ యుద్ధం గురించి 175
అధ్యాయం : 80 కాబ్ బిన్ మాలిక్(రజి) వృత్తాంతం 178
అధ్యాయం : 81 'హిజ్ర్' బస్తీ మీదుగా దైవప్రవక్త(స) సాగిపోవటం 188
అధ్యాయం : 82 కిస్రా (ఈరాన్ చక్రవర్తి)కి, ఖైసర్ (రోము చక్రవర్తి)కి ఉత్తరాలు వ్రాయటం 189
అధ్యాయం : 83 మహాప్రవక్త(స) వ్యాధి, ఆయన పరమపదించిన సంఘటన 191
అధ్యాయం : 84 మరణ సమయంలో దైవప్రవక్త(స) నోట వెలువడిన ఆఖరి మాటలు 207
అధ్యాయం : 85 మహోదయుని (సఅసమ్) మహాప్రస్థానం గురించి 208
అధ్యాయం : 86 హజ్రత్ ఆయిషా(ర.అ) అస్వద్ బిన్ యజీద్‌తో ఇలా అన్నారు : 208
అధ్యాయం : 87 మరణవ్యాధికి గురై ఉన్న కాలంలో దైవప్రవక్త(స) ఉసామా బిన్ జైద్(రజి)ను సేనాధిపతిగా నియమించి పంపటం 209
అధ్యాయం : 88 అబుల్ ఖైర్ గారు సునాబిహీని ఉద్దేశించి 210
అధ్యాయం : 89 దైవప్రవక్త(స) మొత్తం ఎన్ని యుద్ధాలు చేశారు? 210

# 2. ఖుర్ఆన్ వ్యాఖ్యాన ప్రకరణం (కితాబుత్తఫ్సీర్)

## 1. ఫాతిహా సూరా వ్యాఖ్యానం

అధ్యాయం : 1 ఫాతిహా సూరా వ్యాఖ్యానం 211
అధ్యాయం : 2 'గైరిల్ మగ్‌జూబి అలైహిమ్ వలజ్జాల్లీన్' అన్న దైవ వచనానికి వివరణ 213

## 2. అల్ బఖరా సూరా వ్యాఖ్యానం

అధ్యాయం : 1 "అల్లాహ్ ఆదమ్‌కు అన్ని వస్తువుల పేర్లూ నేర్పాడు" 214
అధ్యాయం : 2 'వ ఇజా ఖలవ్ ఇలా షయాతీనిహిమ్' 216
అధ్యాయం : 3 ఇతరులను అల్లాహ్‌కు సమానులుగా నిలబెట్టకండి 216
అధ్యాయం : 4 దైవోపదేశం 218
అధ్యాయం : 5 "గుర్తుకు తెచ్చుకోండి, మేము మీతో ఇలా అన్నాము; 218
అధ్యాయం : 6 ఎవరయితే జిబ్రీల్(అ) పట్ల శత్రుత్వం కలిగి ఉంటారో... 219
అధ్యాయం : 7 మేము కోరిన మా ఆయత్‌ను రద్దుపరుస్తాము లేదా మరిపింపజేస్తాము. 221

అధ్యాయం : 8 “అల్లాహ్ తన కొరకు సంతానం చేసుకున్నాడు” (2: 116) 222
అధ్యాయం : 9 అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: 222
అధ్యాయం : 10 ఇబ్రాహీమ్ (అ) ఇస్మాయీల్ (అ)లు కాబా గోడల్ని ఎత్తే సమయంలో... 223
అధ్యాయం : 11 “మేమంతా అల్లాహ్‌నూ, ఆయన హితోపదేశాన్ని విశ్వసించాము” 224
అధ్యాయం : 12 దైవోపదేశం 224
అధ్యాయం : 13 మధ్యస్థ సమాజం 225
అధ్యాయం : 14 అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు 226
అధ్యాయం : 15 దైవోపదేశం 227
అధ్యాయం : 16 నీవు వారికి ఏ నిదర్శనం చూపినా... 227
అధ్యాయం : 17 గ్రంథం వొసగబడిన వారు 228
అధ్యాయం : 18 సత్కార్యాల వైపునకు శీఘ్రుత కనబరచాలి 229
అధ్యాయం : 19 మీరు ఎక్కడి నుండి బయలుదేరినా... 229
అధ్యాయం : 20 షఆయిరిల్లాహ్ (అల్లాహ్ చిహ్నాలు) 230
అధ్యాయం : 21 అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: 231
అధ్యాయం : 22 ప్రతీకార న్యాయం (ఖిసాస్) సమాజానికి ఊపిరి 232
అధ్యాయం : 23 ఉపవాసాలు విధిగా నిర్ణయించబడటం 234
అధ్యాయం : 24 ఈ ఉపవాసాలు లెక్కించదగిన కొన్ని రోజులు మాత్రమే 235
అధ్యాయం : 25 అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : 236
అధ్యాయం : 26 ఉపవాస కాలంలోని రాత్రి సమయాలలో మీ భార్యల వద్దకు పోవటం... 236
అధ్యాయం : 27 అన్నపానీయాలను, కోర్కెలను త్యజించవలసిన సమయం 237
అధ్యాయం : 28 దైవాగ్రహానికి దూరంగా ఉండటమే అసలు సత్కార్యం 238
అధ్యాయం : 29 పీడన (ఫిత్నా) అంతమయ్యే వరకు 239
అధ్యాయం : 30 మేలు చేసేవారిని అల్లాహ్ ఇష్టపడతాడు 241
అధ్యాయం : 31 అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : 242
అధ్యాయం : 32 “హజ్జ్ కాలం వచ్చేవరకు మీలో ఎవరయినా ‘ఉమ్‌రహ్’ చేసినట్లయితే.. 242
అధ్యాయం : 33 హజ్జ్ సందర్భంగా దైవానుగ్రహాన్ని అన్వేషిస్తే... 243
అధ్యాయం : 34 అరఫాత్‌లో ఆగటమే అసలు హజ్జ్ 243

అధ్యాయం : 35 ఇహపరాలలోని మంచిని కోరుతూ ప్రార్థించటం 244
అధ్యాయం : 36 సత్యానికి బద్ధ విరోధి 245
అధ్యాయం : 37 స్వర్గ ప్రవేశం గురించి... 245
అధ్యాయం : 38 మీ స్త్రీలు మీ పంట పొలాలు 246
అధ్యాయం : 39 విడాకులు 248
అధ్యాయం : 40 భర్త చనిపోయిన స్త్రీల ఇద్దత్ (గడువు) 248
అధ్యాయం : 41 అస్ర్ నమాజ్ ప్రాధాన్యత 251
అధ్యాయం : 42 విధేయులైన దాసులుగా (నిశ్శబ్దంగా) నిలబడటం 252
అధ్యాయం : 43 ప్రమాదం పొంచి ఉన్నప్పుడు... 252
అధ్యాయం : 44 "మీలోని వారెవరయినా మరణించి, వారి భార్యలు సజీవంగా ఉంటే 253
అధ్యాయం : 45 ఇబ్రాహీమ్(అ)కు కలిగిన సందేహం 254
అధ్యాయం : 46 జీవితాంతం సదాచరణ చేసి, చివరి దశలో... 254
అధ్యాయం : 47 అభిమాన ధనులు 255
అధ్యాయం : 48 వ్యాపారం ధర్మసమ్మతం– వడ్డీ నిషిద్ధం 256
అధ్యాయం : 49 వడ్డీ నశిస్తుంది, దానధర్మాలు వికసిస్తాయి 257
అధ్యాయం : 50 హెచ్చరిక 257
అధ్యాయం : 51 ఆనాటి పరాభవం నుండి కాపాడుకోండి 257
అధ్యాయం : 52 అల్లాహ్ అన్నింటిపైన అధికారం కలవాడు 258
అధ్యాయం : 53 అల్లాహ్‌తో ఒడంబడిక 258

## 3. ఆలె ఇమ్రాన్ సూరా వ్యాఖ్యానం

అధ్యాయం : 1 మర్యమ్ తల్లి అభ్యర్థన 261
అధ్యాయం : 2 బాధాకరమైన శిక్షకు గురయ్యేవారు 261
అధ్యాయం : 3 గ్రంథవహులకు దైవ సందేశం 263
అధ్యాయం : 4 సత్కార్య స్థాయి 269
అధ్యాయం : 5 యూదుల ద్రోహబుద్ధి 270
అధ్యాయం : 6 శ్రేష్ట సమాజం విధులు, బాధ్యతలు 271
అధ్యాయం : 7 పిరికితనం బయటపడిన వేళ... 272

అధ్యాయం : 8 నిర్ణయాధికారం 272
అధ్యాయం : 9 మీరు పలాయనం చిత్తగించినప్పుడు... 273
అధ్యాయం : 10 నిశ్చింత స్థితి (నిద్ర మత్తు) ఆవహించిన వేళ... 274
అధ్యాయం : 11 దైవం మరియు దైవప్రవక్త పిలుపునకు సమాధానం .... 274
అధ్యాయం : 12 పిసినిగొట్టులకు హెచ్చరిక 275
అధ్యాయం : 13 గ్రంథవహుల, ముష్రిక్కుల నోట కష్టం కలిగించే మాటలు విన్నప్పుడు... 276
అధ్యాయం : 14 చేయని పనులకు కూడా తమకు జేజేలు లభించాలని కోరుకునేవారు... 278
అధ్యాయం : 15 విజ్ఞులకు సూచనలు 280
అధ్యాయం : 16 చింతన చేసేవారు 281
అధ్యాయం : 17 దుర్వర్తనులకు సహాయకుడు ఉండడు 282
అధ్యాయం : 18 స్వామీ! మా వల్ల జరిగిన తప్పులను మన్నించు 283

## 4. అన్ నిసా సూరా వ్యాఖ్యానం

అధ్యాయం : 1 అన్యాయానికి దూరంగా ఉండేందుకు 284
అధ్యాయం : 2 అనాథల సంరక్షకుడు పేదవాడై ఉంటే... 285
అధ్యాయం : 3 వారు హక్కుదారులు కాకపోయినా సరే... 286
అధ్యాయం : 4 సంతానం లేని భార్యల ఆస్తిలో... 287
అధ్యాయం : 5 బలవంతంగా స్త్రీలకు వారసులు కావటం... 287
అధ్యాయం : 6 హక్కుదారులు 288
అధ్యాయం : 7 ఎవరికీ రవ్వంత అన్యాయం జరగదు 289
అధ్యాయం : 8 ముహమ్మద్(స)ను మానవాళిపై సాక్షిగా నిలబెట్టినప్పుడు 291
అధ్యాయం : 9 తయమ్ముమ్ ఆదేశం 292
అధ్యాయం : 10 విధేయత 293
అధ్యాయం : 11 విశ్వాసానికి (ఈమాన్‌కు) ప్రమాణ నికషం 294
అధ్యాయం : 12 దైవానుగ్రహానికి పాత్రులైనవారు... 295
అధ్యాయం : 13 బాధితులను దుర్మార్గుల చెర నుండి విడిపించటానికి... 296
అధ్యాయం : 14 అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : 296
అధ్యాయం : 15 బాధ్యతా రాహిత్యం 297
అధ్యాయం : 16 బుద్ధిపూర్వకంగా ఒక మోమిన్‌ని చంపటం 297

అధ్యాయం : 17 'సలామ్' చేసిన తరువాత కూడా... 298
అధ్యాయం: 18 వారు ఉభయులూ సమానులు కారు 299
అధ్యాయం : 19 తమ ఆత్మలకు అన్యాయం చేసుకుంటూ ఉండేవారి గురించి 301
అధ్యాయం : 20 అల్లాహ్ అమిత దయాళువు 302
అధ్యాయం : 21 ప్రమత్తత పనికిరాదు 302
అధ్యాయం : 22 స్త్రీల వ్యవహారంలో ధార్మిక తీర్పు 303
అధ్యాయం : 23 కపటుల గమ్యస్థానం 304
అధ్యాయం : 24 అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: 305
అధ్యాయం : 25 'కలాలా' విషయంలో ధార్మిక తీర్పు 306

## 5. అల్ మాయిదా సూరా వ్యాఖ్యానం

అధ్యాయం : 1 ఇస్లామ్ ధర్మం పరిపూర్ణం గావించబడిన రోజు 307
అధ్యాయం : 2 తయమ్ముమ్ ఆజ్ఞ 308
అధ్యాయం : 3 యూదుల అవిధేయత 309
అధ్యాయం : 4 దైవాదేశం 310
అధ్యాయం : 5 సమస్త గాయాల కొరకు సమానమైన ప్రతీకారం 311
అధ్యాయం : 6 సందేశ ప్రదానం : ఆవశ్యకత 312
అధ్యాయం : 7 అర్థంలేని ప్రమాణాల గురించి... 313
అధ్యాయం : 8 అతివాదం అనర్థదాయకం 314
అధ్యాయం : 9 షైతాను పనులు 314
అధ్యాయం : 10 మంచి వైపునకు మరలి వచ్చినవారు 316
అధ్యాయం : 11 ఏరి కోరి నష్టాల్లో పడకండి 316
అధ్యాయం : 12 భ్రమల వలయంలో చిక్కుకున్నవారు 317
అధ్యాయం : 13 సాక్ష్యం– మానవాళి సమక్షంలో! 319
అధ్యాయం : 14 క్షమాభిక్ష దైవాధీనం 320

## 6. అల్ అన్ఆమ్ సూరా వ్యాఖ్యానం

అధ్యాయం : 1 కానరాని నిధి నిక్షేపాలు 321
అధ్యాయం : 2 హెచ్చరిక 321
అధ్యాయం : 3 రుజుమార్గాన ఉన్నవారు 322

అధ్యాయం : 4 ప్రవక్తల మధ్య విచక్షణ పాటించకూడదు 323
అధ్యాయం : 5 మార్గబోధన 323
అధ్యాయం : 6 బెడిసికొట్టిన తలబిరుసుతనం 324
అధ్యాయం : 7 నీతిబాహ్యతకు దూరంగా ఉండాలి 324


## 7. అల్ ఆరాఫ్ సూరా వ్యాఖ్యానం


అధ్యాయం : 1 నిషిద్ధమైనవి 326
అధ్యాయం : 2 అల్లాహ్‌తో మూసా (అ) సంభాషించినప్పుడు.... 326
అధ్యాయం : 3 మన్న్- సల్వా 328
అధ్యాయం : 4 మానవులారా! 328
అధ్యాయం : 5 'హిత్తతున్' 329
అధ్యాయం : 6 ఎవరేమన్నను.... 330


## 8. అల్ అన్‌ఫాల్ సూరా వ్యాఖ్యానం


అధ్యాయం : 1 నీచాతి నీచమైన కోవకు చెందిన జంతువులు 333
అధ్యాయం : 2 ప్రవక్త మిమ్మల్ని పిలిచినప్పుడు.... 334
అధ్యాయం : 3 దైవప్రవక్త అవిశ్వాసుల మధ్యన ఉన్నంత కాలం... 335
అధ్యాయం : 4 క్షమాభిక్షకై వేడుకున్నట్లయితే... 335
అధ్యాయం : 5 పీడన సమసిపోయే వరకూ... 336
అధ్యాయం : 6 సహన స్థయిర్యాలతో... 338
అధ్యాయం : 7 బలహీనత దృష్ట్యా 339


## 9. అత్ తౌబా సూరా (సూరయె బరాత్) వ్యాఖ్యానం


అధ్యాయం : 1 తెగత్రెంపుల ప్రకటన 341
అధ్యాయం : 2 తుది గడువు 341
అధ్యాయం : 3 అల్టిమేటమ్ 343
అధ్యాయం : 4 యుద్ధం అనివార్యమైనప్పుడు... 344
అధ్యాయం : 5 జకాత్ ఇవ్వనివారి పర్యవసానం 345
అధ్యాయం : 6 వెండీ బంగారాలు నరకాగ్నిలో కాల్చబడే రోజు 346
అధ్యాయం : 7 సరైన గణన పద్ధతి 346
అధ్యాయం : 8 వారిద్దరూ గుహలో ఉన్నప్పుడు... 347
అధ్యాయం : 9 హృదయాలను గెలవవలసి ఉన్నవారు 351
అధ్యాయం : 10 హేళన చేసే కుత్సితులు 352
అధ్యాయం: 11 కపటాగ్రేసరుల నేపథ్యంలో 353

అధ్యాయం : 12 దైవాజ్ఞ 355
అధ్యాయం : 13 కపట నీతి 356
అధ్యాయం : 14 తప్పు ఒప్పుకున్నవారు.... 357
అధ్యాయం : 15 తస్మాత్ జాగ్రత్త! 358
అధ్యాయం : 16 దైవ కారుణ్యానికి నోచుకున్న ధన్యజీవులు 359
అధ్యాయం : 17 వ్యవహారం వాయిదా వేయబడిన ఆ ముగ్గురు 359
అధ్యాయం : 18 సత్యవంతులకు తోడుగా ఉండండి 361
అధ్యాయం : 19 ఆ ప్రవక్త ఎటువంటి వాడంటే.... 362

## 10 యూనుస్ సూరా వ్యాఖ్యానం

అధ్యాయం : 1 ఫిరౌన్ మునిగిపోతున్నప్పుడు 365

## 11. హూద్ సూరా వ్యాఖ్యానం

అధ్యాయం : 1 గుండెల్లోని గుట్టును సయితం ఎరిగినవాడు 366
అధ్యాయం : 2 దైవ సింహాసనం నీటిపై ఉండేది 367
అధ్యాయం : 3 తమ ప్రభువుకు అబద్ధాన్ని అంటగట్టినవారు 368
అధ్యాయం : 4 ప్రభువు ఒక దుర్మార్గపు నగరాన్ని శిక్షించ దలిస్తే... 368
అధ్యాయం : 5 సత్కార్యాలు దుష్కార్యాలను దూరం చేస్తాయి 369

## 12. యూసుఫ్ సూరా వ్యాఖ్యానం

అధ్యాయం : 1 నిశ్చయంగా నీ ప్రభువు సర్వజ్ఞుడు, మహా వివేకి 370
అధ్యాయం : 2 గొప్ప సూచనలు 371
అధ్యాయం: 3 అత్యుత్తమ సహనం 371
అధ్యాయం : 4 అన్యాయ వర్తనులు సాఫల్యం పొందలేరు 373
అధ్యాయం : 5 విషయం తేటతెల్లమైనప్పుడు... 374
అధ్యాయం : 6 చివరకు ప్రవక్తలు ప్రజలను గురించి నిరాశ చెందినప్పుడు 375

## 13. అర్రాద్ సూరా వ్యాఖ్యానం

అధ్యాయం : 1 అల్లాహ్ సర్వజ్ఞాని 377

## 14. ఇబ్రాహీమ్ సూరా వ్యాఖ్యానం

అధ్యాయం : 1 మేలు జాతి చెట్టు ఉపమానం 378
అధ్యాయం : 2 స్థిరమైన వాక్కు ఆధారంగా 379
అధ్యాయం : 3 మేలును మరచిన వారి పర్యవసానం 380

## 15. అల్ హిజ్ర్ సూరా వ్యాఖ్యానం


అధ్యాయం : 1 ఇది మేము చేసిన పని 381
అధ్యాయం : 2 దైవాగ్రహానికి పాత్రులైన వారి బస్తీల నుండి సాగిపోతున్నప్పుడు... 382
అధ్యాయం : 3 పదేపదే పఠించబడే ఏడు వచనాలు 383
అధ్యాయం : 4 విభేద కారకుల వైపునకు పంపబడిన హెచ్చరిక 383
అధ్యాయం : 5 మరణం తథ్యం 384


## 16. అన్ నహ్ల్ సూరా వ్యాఖ్యానం


అధ్యాయం : 1 అతి నికృష్టమైన వయస్సు 385


## 17. బనీ ఇస్రాయీల్ సూరా వ్యాఖ్యానం


అధ్యాయం : 1 అల్లాహ్ తన శక్తి సూచనలను తన ప్రవక్తకు చూపించడానికి 386
అధ్యాయం : 2 మానవుడు గౌరవనీయుడు 387
అధ్యాయం : 3 దైవ సంప్రదాయం 387
అధ్యాయం : 4 కృతజ్ఞుడుగా మెలగిన మా దాసుడు నూహ్ (అ) 387
అధ్యాయం : 5 జబూర్ గ్రంథం 392
అధ్యాయం : 6 వారు నిస్సహాయులు 392
అధ్యాయం : 7 వీరూ బలహీనులే, వారూ బలహీనులే 393
అధ్యాయం : 8 శపించబడిన వృక్షం 393
అధ్యాయం : 9 దైవదూతలు హాజరయ్యే సమయం 394
అధ్యాయం : 10 మఖామె మహ్మూద్ 395
అధ్యాయం : 11 అసత్యం ఏనాటికైనా సమసిపోయేదే 396
అధ్యాయం : 12 ఆత్మ గురించి 396
అధ్యాయం : 13 మధ్యే మార్గాన్ని అవలంబించండి 397


## 18. సూరతుల్ కహ్ఫ వ్యాఖ్యానం


అధ్యాయం : 1 మానవుడు పరమ జగడాల మారి 399
అధ్యాయం : 2 ఖిజర్ వృత్తాంతం 400
అధ్యాయం : 3 రెండు నదుల సంగమ స్థలానికి చేరనంత వరకూ... 405
అధ్యాయం : 4 చేప విచిత్రంగా నదిలోకి వెళ్ళిన వేళ... 409
అధ్యాయం : 5 నష్టపోయిన వారు 412
అధ్యాయం : 6 వారి కర్మలన్నీ వృధా 413

## 19. మర్యమ్ సూరా వ్యాఖ్యానం

అధ్యాయం : 1 మనోవేదన 414
అధ్యాయం : 2 దైవాజ్ఞతోనే దైవదూతల అవతరణ 415
అధ్యాయం : 3 సత్య తిరస్కారి అయిన ఆ వ్యక్తి 415
అధ్యాయం : 4 అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : 416
అధ్యాయం : 5 అంతా లిఖించబడుతుంది 417
అధ్యాయం : 6 వట్టి చేతులతో మా సమక్షంలో హాజరవుతాడు 418

## 20. తాహా సూరా వ్యాఖ్యానం

అధ్యాయం : 1 ఆదమ్- మూసాల సంవాదన 419
అధ్యాయం : 2 ఆషూరా ఉపవాసం 420
అధ్యాయం : 3 షైతాన్ మీ బహిరంగ శత్రువు 420

## 21. అల్ అంబియా సూరా వ్యాఖ్యానం

అధ్యాయం : 1 "అది మా బాధ్యత" 422

## 22. అల్ హజ్జ్ సూరా వ్యాఖ్యానం

అధ్యాయం : 1 ప్రళయం నాటి భూకంపం 424
అధ్యాయం : 2 మార్గ విహీనతకు పరాకాష్ట 426
అధ్యాయం : 3 ప్రభువు గురించి రెండు వర్గాల మధ్యన వివాదం 426

## 23. అల్ మోమినూన్ సూరా

## 24. అన్ నూర్ సూరా వ్యాఖ్యానం

అధ్యాయం : 1 లియాన్ (శాప ప్రమాణం) 429
అధ్యాయం : 2 నేనే గనక అబద్ధీకుడనైతే... 431
అధ్యాయం : 3 భార్య శిక్ష నుండి తప్పించుకోవాలంటే.. 432
అధ్యాయం : 4 ఐదోసారి స్త్రీ ప్రమాణం 434
అధ్యాయం : 5 చాలా పెద్ద అబద్ధం 434
అధ్యాయం : 6 అతి పెద్ద అభాండం (ఇఫ్క్ సంఘటన) 435
అధ్యాయం : 7 దైవ కృప ఉండకపోతే... 444
అధ్యాయం : 8 అల్లాహ్ దృష్టిలో ఇది చాలా పెద్ద విషయం 444
అధ్యాయం : 9 వినగానే దానిని ఎందుకు ఖండించలేదు? 445
అధ్యాయం: 10 హెచ్చరిక 446
అధ్యాయం : 11 అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు 446
అధ్యాయం : 12 అశ్లీలత వ్యాపించాలని కోరే వారి పర్యవసానం 447
అధ్యాయం : 13 అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు 453

# భూమిక

'హదీసు'కు సంబంధించిన ముఖ్యమయిన, అవసరమయిన చర్చలన్నీ ఈ క్లుప్తమయిన 'భూమిక'లో చేర్చడం సాధ్యపడదు. వీటిగ్గాను ప్రత్యేకంగా వేరే రచన అవసరం. ప్రస్తుతానికి హదీసు సంకలనం, సంచయనాలకు సంబంధించిన సంక్షిప్త మయిన ఒక స్వరూపాన్ని పఠితల ముందుంచడం జరిగింది. ప్రవక్త ప్రవచనాల అమూల్యమయిన సంపద గత 14 వందల ఏళ్ళుగా ఎన్నెన్ని దశలు దాటుకుంటూ మన వరకు చేరిందో విజ్ఞతకు, వివేచనకు, మార్గదర్శకత్వానికి మూలమయిన ఈ వెలలేని ఖజానా తమ తరువాతి తరాలకు భద్రంగా చేరవెయ్యడానికి ఏయే పవిత్రాత్మలు తమ జీవితాలను అంకితం చేశాయో, అవసరమైతే తమ ప్రాణాలకు సైతం ఎలా తెగించి ఈ కార్యాన్ని నిర్వహించాయో కాస్తయినా బోధపరచడానికి ఇందులో కృషి జరిగింది.

## ప్రవక్త ప్రవచనాలు మనకు మూడు విధాలుగా చేరాయి.

1. ముస్లిమ్ సముదాయం నిరంతర ఆచరణ
2. లిఖితపూర్వకంగా భద్రపరిచిన సంకలనాలు, పుస్తకాలు.
3. జ్ఞాపకశక్తి ఆధారంగా ఉల్లేఖన ప్రక్రియ- అంటే పాఠ్య పఠనాల ద్వారా.

ఈ విధంగా సంచయనం, సంకలనం, రచనలు జరిగిన మొత్తం కాలాన్ని నాలుగు దశలుగా విభజించవచ్చు.

1. ప్రవక్త కాలం నుంచి మొదటి శతాబ్ది హిజ్రీ వరకు
2. మొదటి శతాబ్ది మొదలుకుని రెండవ అర్థ శతాబ్ది వరకు
3. రెండవ అర్థ శతాబ్ది మొదలుగా నాల్గవ శతాబ్ది చివరి వరకు.
4. అయిదవ శతాబ్ది మొదలుకుని ఇంకా కొనసాగుతోంది.

## మొదటి దశ

ఈ కాలంలో హదీసు సంచయన కర్తలు, ఆనాటి లిఖిత ప్రతులు, సంచయనాల వివరాలు ఇలా ఉన్నాయి.

# ప్రఖ్యాత హదీసు స్మర్తలు

| సంఖ్య | పేరు | మరణం | వయసు | ఉల్లేఖనాలు |
|---|---|---|---|---|
| 1. | హజ్రత్ అబూహురైరా (రజి) (అబ్దుర్రహ్మాన్) శిష్యులు 800 | హి.59 | 78 | 5374 |
| 2. | హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) | హి.68 | 71 | 2660 |
| 3. | హజ్రత్ ఆయిషా సిద్దికా (ర.అ) | హి.58 | 67 | 2210 |
| 4. | హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) | హి.73 | 84 | 1630 |
| 5. | హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) | హి.78 | 94 | 1560 |
| 6. | హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) | హి. 93 | 103 | 1286 |
| 7. | హజ్రత్ అబూ సయీద్ ఖుద్రి (రజి) | హి. 74 | 84 | 1170 |

వెయ్యికన్నా ఎక్కువ హదీసులు జ్ఞాపకమున్న ఘనులయిన ప్రవక్త సహచరులు వీరు. వీరుకాక హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (హి.63), హజ్రత్ అలీ (హి. 40), హజ్రత్ ఉమర్ ఫారూక్ (హి. 23) వీరంతా 500 నుంచి వెయ్యి వరకు హదీసులు ఉల్లేఖించినవారు.

అలాగే హజ్రత్ అబూబక్ర్ (హి. 13), హజ్రత్ ఉస్మాన్ (హి.36), హజ్రత్ ఉమ్మె సలమా (హి.59), హజ్రత్ అబూ మూసా అష్అరీ (హి.52), హజ్రత్ అబూజర్ గిఫ్ఫారీ (హి.32), హజ్రత్ అబూ అయ్యూబ్ అన్సారి(హి. 51), హజ్రత్ ఉబై బిన్ కఅబ్(హి.19), హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (హి.18)- వీరంతా వందకు పైగా 500కు తక్కువగా హదీసులు ఉల్లేఖించారు.

వీరేకాక ఆ కాలంలోని గొప్ప అనుచర గణాన్నీ మరువలేము. వారి అనన్య మయిన పరిశ్రమ వల్లనే ప్రవక్త సంప్రదాయ సంపద అంతా ప్రవక్త అనుచర సము దాయానికి అందగలిగింది. ప్రళయం వరకూ తరగని ఈ సంపద ద్వారా ముస్లిమ్ సముదాయం ప్రయోజనం పొందుతూనే ఉంటుంది.

కొందరు మహనీయుల పరిచయం క్రిందనిస్తున్నాము.

1. **సయీద్ బిన్ ముసయ్యిబ్ :** ఫారూకీ హయాంలో రెండవ సంవత్సరం మదీనాలో పుట్టారు. హి. 105లో మరణించారు.

   హజ్రత్ ఉస్మాన్, హజ్రత్ ఆయిషా, హజ్రత్ అబూ హురైరా, హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (ర) ద్వారా హదీసు విద్యనభ్యసించారు.

2. **ఉర్వా బిన్ జుబైర్ :** ఈయన మదీనాకు చెందిన ప్రముఖ పండితుల్లో

పరిగణించబడతారు. హజ్రత్ ఆయిషా అక్క కుమారులు. అధికాంశం తన పిన్ని చెప్పిన హదీసులను ఉల్లేఖించారు. ఇంకా హజ్రత్ అబూ హురైరా, హజ్రత్ జైద్ బిన్ సాబిత్ వద్ద కూడా శిష్యరికం చేసిన ఘనత ఉంది. ఈయన శిష్యుల్లో సాలిహ్ బిన్ కైసాన్, ఇమామ్ జుహ్రి లాంటి పండితులున్నారు. ఈయన హి.94లో పరమపదించారు.

3. **సాలిమ్ బిన్ అబ్దుల్లా బిన్ ఉమర్:** మదీనాకు చెందిన 7 గురు షరీఅత్ వేత్తల్లో ఈయన్ని గణిస్తారు. ఈయన తన తండ్రి గారు, ఇతర ప్రవక్త సహచరుల ద్వారా హదీసు పాండిత్యాన్ని గడించారు. నాఫె జుహ్రి తదితర ప్రముఖ అనుచరులు ఈయన శిష్యులు. హి. 106లో మరణించారు.

4. **నాఫె మౌలా అబ్దుల్లా బిన్ ఉమర్:** వీరు హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ శిష్యుల్లో ప్రముఖులు, ఇమామ్ మాలిక్‌కు గురువు. హదీసువేత్తల దృష్టిలో ఈ ప్రమాణ పరంపర (మాలిక్ నాఫె నుండి, ఆయన అబ్దుల్లా బిన్ ఉమర్ నుండి, ఆయన దైవ సందేశహరుల నుండి) సిల్సిలతుజ్జహబ్ (స్వర్ణ పరంపర)గా పరిగణించ బడుతుంది. ఈయన హి.117లో దివంగతులయ్యారు.

## తొలి దశలోని లిఖిత సంపద

1. **సహీఫా సాదికా:** ఇది హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (హి.13-వయసు 77) సంకలనం చేసింది.

   హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్‌కు రచన, సంకలనాల అభిరుచి మెండుగా ఉండేది. దైవ సందేశహరులు పలికే ప్రతి మాటను రాసుకునేవారు. ఈ విషయంలో స్వయాన ప్రవక్త మహనీయులు ఆయనకు అనుమతినిచ్చారు. ఈ సంకలనంలో ఒక వెయ్యి హదీసులుండేవి. చాలాకాలం వరకు వారి వంశంలో భద్రంగా ఉండేవి. ఇప్పుడు అది ముస్నద్ ఇమామ్ అహ్మద్‌లో ఒక భాగమయిపోయింది.

2. **సహీఫా సహీహా:** సంకలన కర్త, హుమామ్ బిన్ మునబ్బిహ్ (హి.101). వీరు హజ్రత్ అబూ హురైరా గారి ప్రముఖ శిష్యుల్లో ఒకరు. ఈయన తన గురువు ఉల్లేఖనాలన్నింటినీ ఒకేచోట గ్రంథస్థం చేసుకున్నారు. దాని రాత ప్రతులు బెర్లిన్, డెమాస్కస్ గ్రంథాలయాల్లో ఉన్నాయి. ఇంకా ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ తన విఖ్యాత ముస్నద్‌లోనూ 'అబూ హురైరా' అన్న శీర్షికన ఈ మొత్తం పుస్తకాన్ని యథాతథంగా చేర్చారు. (ముస్నద్ అహ్మద్, సంపుటి 2, పుటలు

312- 318) ఈ సంకలనం కొన్నేళ్ళ క్రితం డాక్టర్ హమీదుల్లా (ప్యారిస్) ప్రయత్నాల ఫలితంగా హైదరాబాద్‌లో ప్రచురించడం జరిగింది. ఇందులో 138 ఉల్లేఖనాలున్నాయి.

ఈ సహీఫా, హజ్రత్ అబూ హురైరా ఉల్లేఖనాలన్నింటిలోని ఒక భాగం మాత్రమే. దీని ఉల్లేఖనాలు అనేకం బుఖారి, ముస్లిమ్ గ్రంథాలలోనూ దొరుకుతాయి. పదాలు ఒకేలాగుంటాయి. పెద్ద వ్యత్యాసం కనిపించదు.

3. **బషీర్ బిన్ సహీక్:** హజ్రత్ అబూహురైరా శిష్యుల్లో రెండవ వారు. ఈయన కూడా ఒక సంకలనం తయారు చేశారు. దీన్ని ఈయన హజ్రత్ అబూ హురైరాకు చివరి రోజుల్లో వినిపించి ధ్రువీకరించుకున్నారు.

4. **ముస్నద్ అబూహురైరా :** దీని ప్రతులు సహచరుల కాలంలోనే గ్రంథస్థమయ్యాయి. దీని ఒక ప్రతి హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ తండ్రి, అబ్దుల్ అజీజ్ బిన్ మర్వాన్ (ఈజిప్ట్ గవర్నర్ హి.86) వద్ద కూడా ఉండేది. అబ్దుల్ అజీజ్ బిన్ మర్వాన్ కసీరా బిన్ ముర్రాకు, 'నీ వద్ద సహచరులు ఉల్లేఖించిన హదీసులుంటే వాటిని వ్రాసి పంపు. హజ్రత్ అబూ హురైరా హదీసులు అక్కరలేదు. అవి నా వద్ద గ్రంథస్థమయి ఉన్నాయి' అని వ్రాశారు. 'ముస్నద్ అబూ హురైరా' గ్రంథ ప్రతి ఒకటి, ఇమామ్ ఇబ్ను తయిమియ్య వ్రాసినది జర్మనీ గ్రంథాలయంలో భద్రంగా ఉంది.

5. **సహీఫా హజ్రత్ అలీ:** ఇమామ్ బుఖారి విశదీకరించిన దాని ప్రకారం, ఇది చాలా ఘనమయిన సంపుటం. ఇందులో జకాత్, మదీనా పవిత్రత, హజ్జతుల్ విదా ప్రసంగం, ఇస్లామీయ రాజ్యాంగ అంశాలు లాంటి విషయాలు అనేకం ప్రస్తావించబడి వున్నాయి.

6. **ప్రవక్త మహనీయుని ప్రసంగ పాఠం :** మక్కా ప్రవేశం నాడు, అబూ షా యమని కోరిక మేరకు దైవ ప్రవక్త తన ప్రసంగాన్ని సవివరంగా రాయించారు. ఈ ప్రసంగంలో మానవ హక్కులకు సంబంధించిన ముఖ్యమయిన వివరాలున్నాయి.

7. **సహీఫా హజ్రత్ జాబిర్ :** హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా ఉల్లేఖనాలను ఆయన శిష్య గణం, వహబ్ బిన్ మునబ్బ(హి.110), సులైమాన్ బిన్ కైస్ లష్కరి వ్రాత మూలకంగా సంకలనం చేసుకున్నారు. ఈ సంకలనంలో హజ్ విధి నిషేధాలు, వీడ్కోలు హజ్ ప్రసంగం ఉన్నాయి.

8. **హజ్రత్ ఆయిషా(ర) ఉల్లేఖనాలు :** హజ్రత్ ఆయిషా ఉల్లేఖనాలను ఆవిడ శిష్యుడు ఉర్వా బిన్ జుబైర్ వ్రాసి భద్రపరిచారు.

9. **ఇబ్నె అబ్బాస్ ఉల్లేఖనాలు :** హజ్రత్ అబ్దుల్లా ఇబ్నె అబ్బాస్ ఉల్లేఖనాల అనేక సంకలనాలున్నాయి. హజ్రత్ సయీద్ బిన్ జుబైర్ తాబయీ కూడా ఈయన ఉల్లేఖనాలను వ్రాసి సంకలనం చేసుకున్నారు.

10. **అనస్ బిన్ మాలిక్ సహీఫాలు:** సయీద్ బిన్ హిలాల్ ప్రకారం, "హజ్రత్ అనస్ తాను వ్రాసిపెట్టుకున్న ప్రతుల్ని మాకు చూపి, 'ఈ ఉల్లేఖనాలు నేను స్వయంగా దైవ సందేశహరుని నోట విన్నాను, అప్పుడే రాసుకున్నాను, తరువాత ఆయన (స)కు వినిపించి ధ్రువీకరించుకున్నాను కూడా' అని అనేవారు".

11. **అమ్ర్ బిన్ హజ్మ్ :** ఈయన్ని యమన్ గవర్నరుగా నియమించి పంపేటప్పుడు ప్రవక్త మహనీయులు (స) రాతమూలకంగా ఒక సూచనా పత్రాన్ని ఇచ్చి పంపారు. ఈయన ఆ సూచనాపత్రాన్ని భద్రపరచటమేకాక దైవప్రవక్త ఇచ్చిన ఇంకా 21 ఆదేశ పత్రాలను జతచేసి ఒక పుస్తకాన్నే సంకలనం చేశారు.

12. **సమురా బిన్ జున్దబ్ పుస్తకం:** ఇది ఈయన తనయునికి వారసత్వంలో లభించింది. ఇందులోనూ ఉల్లేఖనాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి.

13. **సహీఫా సఅద్ బిన్ ఉబాదా :** హజ్రత్ సఅద్ బిన్ ఉబాదా ప్రవక్త సహచరులు, అజ్ఞానకాలం నుండే చదవనూ, వ్రాయనూ వచ్చినవారు.

14. **హజ్రత్ నాఫె లేఖలు:** సులైమాన్ బిన్ మూసా ఉల్లేఖనం ప్రకారం, అబ్దుల్లా బిన్ ఉమర్ చెబుతూ ఉంటే నాఫె (ర) వ్రాస్తూ ఉండేవారు.

15. మ'అన్ ఉల్లేఖనం ప్రకారం, 'అబ్దుర్రహ్మాన్ బిన్ అబ్దుల్లా బిన్ మస్ఊద్(ర) నా ఎదుట గ్రంథం తీసి ప్రమాణం చేస్తూ 'ఇది నా తండ్రి అబ్దుల్లా బిన్ మస్ఊద్ తన స్వహస్తాలతో వ్రాసిన గ్రంథం' అని అన్నారు."

పరిశోధనను అన్వేషణను ఇంకా కొనసాగిస్తే ఇవి కాక ఇంకా ఎన్నో ఉదాహరణలు, సంఘటనలు దొరకవచ్చు.

ఈ దశలో ప్రవక్త సహచర మాన్యులు, గొప్ప అనుచరులు ఇతోధికంగా తమ వ్యక్తిగత స్మృతిలోని హదీసుల్ని గ్రంథస్థం చెయ్యడం పట్ల శ్రద్ధ చూపారు. కాని రెండవ దశలో సంచయన, సంపాదన కార్యం ఇంకా విస్తృతి పొందింది. హదీసు సంకలనకర్తలు తమకు సొంతంగా తెలిసిన వాటితోపాటు తమ నగరం, ప్రాంతంలోని పండితుల్ని కలుసుకుని వారి ఉల్లేఖనాలను సయితం క్రమబద్ధం చేశారు.

## రెండవ దశ

ఈ దశ దాదాపు రెండవ శతాబ్ది (హి|జీ) తొలి యాభయ్యేళ్ళకు ముగుస్తుంది. ఈ దశలో అనుచరుల ఒక పెద్ద వర్గం సిద్ధమయింది. ఈ వర్గంలోనివారు తొలి దశలోని లిఖిత సంపదనంతా విస్తృత సంకలనాలతో క్రోడీకరించారు.

## హదీసు సంకలన కర్తలు

**1. ముహమ్మద్ బిన్ షిహాబ్ జుహ్రీ (మ : హి.124) :** ఈయనను సమకాలీన హదీసువేత్తలలో ముఖ్యులుగా పరిగణించేవారు. ఈయన హదీసు విద్యను దిగువ పేర్కొన్న మహనీయ వ్యక్తుల ద్వారా అభ్యసించారు.

**సహచరుల్లో :** 1. అబ్దుల్లా బిన్ ఉమర్(రజి) 2. అనస్ బిన్ మాలిక్ (ర) 3. సహల్ బిన్ సఅద్(ర).

**అనుచరుల్లో :** సయీద్ బిన్ ముసయ్యిబ్, మహ్మూద్ బిన్ రబీ ప్రభృతులు.

ఈయన గారి శిష్యగణంలో, ఇమామ్ ఔజాయి, ఇమామ్ మాలిక్, సుఫియాన్ బిన్ ఉయియ్యాన వంటి హదీసువేత్తలున్నారు. ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ హి.శ. 101లో ఈయనకు హదీసులు సంకలనం చేసే కార్యాన్ని అప్పగించారు. ఈయనతోపాటు మదీనా గవర్నరు అబూబక్ర్ ముహమ్మద్ బిన్ ఉమర్ బిన్ హజ్మ్‌కు ఆదేశాలు పంపి, ఉ్రమా బిన్తు అబ్దుర్రహ్మాన్, కాసిమ్ బిన్ ముహమ్మద్ వద్ద వున్న హదీసు భండారాన్నీ గ్రంథస్థం చెయ్యమని ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ పురమాయించారు.

పైన పేర్కొన్న ఉమ్రా, హజ్రత్ ఆయిషాకు ముఖ్య శిష్యురాలు. కాసిమ్ బిన్ ముహమ్మద్ ఆవిడ సోదరుని కొడుకు. హజ్రత్ ఆయిషా తన సంరక్షణలో వీరికి శిక్షణ, బోధనలు గరిపారు.

ఇంతేకాక హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ ఇస్లామీయ రాజ్యంలో బాధ్యతా యుత స్థానంలో ఉన్న నాయకులందరినీ హదీసుల్ని కూడబెట్టాలని, వాటిని క్రమబద్ధం చేయాలన్న తాకీదుతో ఫర్మానాలు జారీ చేశారు. ఫలితంగా హదీసు పెను గ్రంథాలే రాజధాని నగరమయిన డెమాస్కస్ చేరాయి. ఖలీఫా వాటి నకళ్ళను రాజ్యంలో మూల మూలన చేరవేశారు.

ఇమామ్ జుహ్రీ హదీసు సంకలనాన్ని సిద్ధం చేసిన తరువాత ఆ కాలంలోని ఇతర విద్యావంతులు సయితం సంకలనం, సంపాదన కార్యక్రమాలు చేపట్టారు.

2. అబ్దుల్ మలిక్ బిన్ జరీహ్ (హి. 150) మక్కాలో ఈ మహత్కార్యాన్ని చేపట్టారు.

3. ఇమామ్ ఔజాయి (హి. 157) - సిరియాలో

4. ముఅమ్మర్ బిన్ రాషిద్ (హి.153) - యమన్‌లో

5. ఇమామ్ సుఫియాన్ సౌరి (హి. 161)- కూఫాలో

6. ఇమామ్ హమ్మాద్ బిన్ సల్లమ(హి. 167) - బస్రాలో

7. ఇమామ్ అబ్దుల్లా బిన్ ముబారక్ (హి. 181)- ఖురాసాన్‌లో

వీరంతా హదీసుల సంకలనం, వాటి క్రమబద్ధీకరణ కృషిలో మున్ముందు ఉండిన మహనీయులు.

8. ఇమామ్ మాలిక్ బిన్ అనస్(హి.93- 179): మదీనాలో ఇమామ్ జుహ్రీ తరువాత ప్రవక్త హదీసు సంకలనా శుభకార్యం చేపట్టే ఘనత తనకే దక్కింది. ఈయన నాఫె, జుహ్రీ ఇంకా ఇతర ప్రముఖ పండితుల వద్ద విద్యనభ్యసించారు. ఈయన గురువుల సంఖ్య 900 వరకు ఉందని అంటారు. ఈ విద్యామృత సరోవరం నుండి హిజాజ్, సిరియా, ఇరాక్, పాలస్తీనా, ఈజిప్ట్, ఆఫ్రికా, స్పెయిన్‌కు చెందిన వేలాది ప్రవక్త సంప్రదాయ పిపాసువులు తనివితీరా గ్రోలారు. ఈయన శిష్యుల్లో లైస్ బిన్ సఅద్ (హి.175), ఇబ్ను ముబారక్ (హి. 181), ఇమామ్ షాఫియీ (హి. 204), ఇమామ్ ముహమ్మద్ బిన్ హసనుష్షైబాని (హి.189) లాంటి మహామహులున్నారు.

ఈ దశలో హదీసు సంకలనాలు అనేకం జరిగాయి. వీటిలో ఇమామ్ మాలిక్ సంకలనం చేసిన ముఅత్తాకు ప్రత్యేక స్థానముంది. దీని సంకలనా కాలం హి.130 నుండి 141 మధ్యన ఉంటుంది. మొత్తం ఉల్లేఖనాల సంఖ్య 1700. వీటిలో నుంచి మర్ఫూ 600; ముర్సల్ 228, మౌకూఫ్ 613; అనుచరుల సూక్తులు 285 ఉన్నాయి. ఈ దశలోని కొన్ని ఇతర సంకలనాల పేర్లు : 1. జామె సుఫియాన్ సౌరి (హి.161) 2. జామె ఇబ్ను ముబారక్ (హి.181); 3. జామె ఇమామ్ ఔజాయి (హి.157), 4. జామె ఇబ్ను జురైజ్ (హి.150) 5. కితాబుల్ ఖరాజ్, కాజీ అబూ యూసుఫ్ (హి.183); 6. కితాబుల్ ఆసార్, ఇమామ్ ముహమ్మద్(హి.189)

ఈ దశలో ప్రవక్త మహనీయుని హదీసులు, సహచరుల అనుచరుల ఫత్వాలు (తీర్పులు)- అన్నింటినీ ఒకే గ్రంథంలో సంచయనం చేసేవారు. అయితే ఫలానా విషయం సహచరుల లేక అనుచరుల సూక్తి అని లేక ప్రవక్త(స) హదీసు అని విశదీకరించడం జరిగేది.

## మూడవ దశ

ఇది దాదాపు హిజ్రీ 150 మొదలు 400 వరకు ఉంటుంది. ఈ దశ ప్రత్యేకతలు ఇవి :

1. ప్రవక్త ప్రవచనాలను (హదీసులను) సహచరుల 'ఆసార్' (ప్రభావకాలు), అనుచరుల సూక్తుల నుండి వేరు చేసి సంకలనం చెయ్యడం జరిగింది.
2. విశ్వసనీయమయిన ఉల్లేఖనాల సంకలనాలు వేరుగా తయారయ్యాయి. ఈ విధంగా అన్వేషణ, పరిశోధన, అనుశీలనల తరువాత రెండవ దశలోని రచనలు మూడవ దశలో ఘనమయిన పుస్తకాలుగా రూపొందాయి.
3. ఈ దశలో ఉల్లేఖనాలను ప్రోగు చెయ్యడమేకాక హదీసు శాస్త్రాన్ని భద్రపరచడా నికి హదీసువేత్తలు వందకు పైగా వివిధ విద్యల్ని ఆవిష్కరించారు. వాటి మీద ఇప్పటివరకు వేలాది పుస్తకాల రచన జరిగింది.

   'వారు చేసిన కృషికి దైవానికి కృతజ్ఞతలు, దైవం వారి ఆ కృషికి గాను ఉత్తమమయిన ప్రతిఫలాన్నివ్వుగాక'

   ఆ విద్యల్లో కొన్నింటి క్లుప్తమయిన పరిచయం

## 1. అస్మాఉర్రిజాల్ విద్య

ఈ విద్యలో ఉల్లేఖకుల జీవిత విశేషాలు, జనన కాలం, వారి గురువులు, శిష్యులు ఇత్యాది విషయాల వివరాలు; విద్యాప్రాప్తికై చేసిన ప్రయాణాలు, వారి విశ్వసనీయత ప్రమాణాన్ని గురించి హదీసువేత్తల నిర్ణయాలున్నాయి. ఇది చాలా విస్తృతమయిన శాస్త్రం, ఆసక్తికరమయింది కూడా.

కొందరు పక్షపాత బుద్ధి గల ప్రాచ్య విద్యా నిపుణులయిన పాశ్చాత్యులు (Orientalists) కూడా దీని ప్రశస్తతను కొనియాడకుండా ఉండలేకపోయారు. ఈ శాస్త్రం వల్ల అయిదు లక్షల మంది ఉల్లేఖకుల జీవన వృత్తాంతాలు భద్రంగా ఉన్నాయి. ఈ ప్రత్యేకతలో ముస్లిమ్ పండితులకు సరితూగేవారు దొరకడం అసాధ్యం.

ఈ శాస్త్రంలో వందలాది పుస్తకాలు రచించారు. కొన్నింటి పేర్లు :

**అ)** **తహ్జీబుల్ కమాల్ - రచయిత :** ఇమామ్ యూసుఫ్ (హి.742). ఈ శాస్త్రంలో ఇది అత్యంత ప్రామాణికమయిన గ్రంథం.

**ఆ)** **తహ్జీబుత్తహ్జీబ్ :** రచయిత - హాఫిజ్ ఇబ్ను హజర్, బుఖారీ టీకా కర్త, ఈ గ్రంథం 12 సంపుటాల్లో ఉంది; (హైదరాబాద్ దాయరతుల్ మఆరిఫ్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రచురించింది).

ఇ) తజ్కిరతుల్ హుఫ్ఫాజ్ - రచయిత : అల్లామా జహబి (హి. 748)

## 2. ముస్తలహుల్ హదీస్ విద్య

ఇది హదీసు విద్యకు ప్రాతిపదిక సూత్రావళి. ఈ శాస్త్రం వెలుగులోనే హదీసుల స్థాయి, బలహీనతల నియమాలు తెలుస్తాయి.

ఈ శాస్త్రానికి సంబంధించిన ప్రఖ్యాత పుస్తకం 'ఉలూముల్ హదీసు'. దీన్ని 'ముకద్దమ ఇబ్నుస్సలాహ్' అని కూడా అంటారు. రచయిత : అబూ ఉమర్, ఉస్మానిబ్నుస్సలాహ్ (హి. 577)

గత 100 ఏళ్ళల్లో హదీసు సూత్రావళి మీద రెండు గ్రంథాలు వెలువడ్డాయి.

**(అ) తౌజీహున్నజర్ - రచయిత:** అల్లామా తాహిర్ బిన్ సాలిహ్ అల్ జజాయిరీ (హి.1338)

**(ఆ) కవాయిదుత్తహదీసు - రచయిత** : అల్లామా సయ్యద్ జమాలుద్దీన్ కాసిమీ (హి.1332)

మొదటి పుస్తకం విషయ విస్తృతికి, రెండవది సక్రమ సంకలనానికి ఖ్యాతి గడించాయి.

## 3. గరీబుల్ హదీసు విద్య

ఈ శాస్త్రంలో హదీసుల్లోని కఠినపదాల శాబ్దిక అర్థాల పరిశోధన విరివిగా జరిగింది. ఈ శాస్త్రంలో ఇది కాక అల్లామా జమఖ్షరీ (హి.538) రచించిన అల్ ఫాయిక్, ఇబ్నుల్ అసీర్ (హి.606) రచించిన నిహాయ ప్రముఖమయినవి.

## 4. తఖ్రీజుల్ అహాదీస్ విద్య

ప్రముఖ ఖుర్ఆన్ వ్యాఖ్యాన గ్రంథాలు, ఫికహ్ గ్రంథాలు, సూఫీయిజానికి సంబంధించిన గ్రంథాలు, విశ్వాసాలకు సంబంధించిన గ్రంథాలు- వీటన్నింటిలో ప్రస్తావించిన ఉల్లేఖనాలకు మూల గ్రంథాలేవీ అన్న విషయం తెలుసుకోదలిస్తే ఈ శాస్త్రం ఉపయోగపడుతుంది. ఉదాహరణకు, 'హిదాయ' (బుర్హానుద్దీన్ అలీ బిన్ అబీబక్ర్ అల్ మర్గీనాని (హి. 592). 'ఇహ్యాఉల్ ఉలూమ్' (ఇమామ్ గజాలి -హి. 505)లలో అనేక ఉల్లేఖనాలు, ఎలాంటి ప్రామాణికత తెలుపకుండా, మూలాన్ని తెలుపకుండా ప్రస్తావనలోకి వచ్చాయి. ఎవరైనా ఆ ఉల్లేఖనాల ప్రామాణికత ఏ పాటిదని, ఏఏ ప్రముఖ హదీసు పుస్తకాల్లో అవి వచ్చాయని తెలుసుకోగోరితే ఈ శాస్త్రానికి సంబంధించిన పుస్తకాల్లో అవి లభ్యమవుతాయి. మొదట పేర్కొన్న పుస్తకం కోసం హాఫిజ్ జైలయి (హి. 792) రచించిన 'నసబుర్రాయ' అన్న పుస్తకాన్ని, హాఫిజ్ ఇబ్ను హజర్ అస్కలాని (హి.852) వ్రాసిన 'అద్దరాయ' అన్నదాన్నీ చూడవలసి వుంటుంది. రెండవ పుస్తకంలోని హదీసుల

కొరకు హాఫిజ్ జైనుద్దీన్ ఇరాకీ (హి. 808)రచించిన 'అల్ ముగ్నీ అన్ హమలిల్ అస్ఫార్' అనేది ఉచితమయింది.

## 5. అల్ అహాదీసుల్ మౌజూఅ విద్య

ఈ శాస్త్రంలో పండితులు ప్రత్యేక పుస్తకాలు రచించారు. 'మౌజూ' (కల్పించిన-అబద్ధపు) ఉల్లేఖనాలను వేరు చేశారు. ఈ విషయంలో కాజీ షౌకాని (హి.1255) రచించిన 'అల్ ఫవాయిదుల్ మజ్మూఅ'తోపాటు హాఫిజ్ జలాలుద్దీన్ సుయూతి (హి.911) వ్రాసిన 'అల్ లఆలి అల్ మస్నూఅ' ప్రముఖమయినవి.

## 6. అన్నాసిఖ్ వల్ మన్సూఖ్ విద్య

ఈ శాస్త్రంలో ఇమామ్ ముహమ్మద్ బిన్ మూసా హాజమి హి.784- వయసు 35) రచించిన 'కితాబుల్ ఈ'తిబార్' చాలా ప్రామాణికమయింది. ఖ్యాతి గడించింది కూడా.

## 7. అత్ తౌఫీక్ బైనుల్ అహాదీస్- విద్య

ఈ శాస్త్రంలో, స్థూలంగా చూస్తే పరస్పర విరుద్ధంగా కనిపించే ఉల్లేఖనాల మధ్య సమాన అర్థాన్వయం చెయ్యడం జరిగింది. ప్రథమంగా ఇమామ్ షాఫియి (హి. 204) ఈ విషయాన్ని చర్చించారు. ఈయన వ్రాసిన పుస్తకం 'ముఖ్తలిఫుల్ హదీసు' అనే పేరుతో ఖ్యాతి గడించింది. ఇమామ్ తహావి (హి. 321) రచించిన 'ముష్కిలుల్ అసార్' అనే పుస్తకం కూడా ఈ శాస్త్రంలో ఉపయోగకరమయిన పుస్తకమే.

## 8. అల్ ముఖ్తలిఫ్ వల్ ముఅత్తలిఫ్ విద్య

ఈ శాస్త్రంలో ముఖ్యంగా ఉల్లేఖన కర్తల పేర్లు, వాళ్ళ సంతానం, తండ్రిపేర్లు, బిరుదులు, తాత ముత్తాతల పేర్లు, లేక గురువుల పేర్లు ఒకేలా కనిపించిన వారి ప్రస్తావన వుంది. ఇలాంటి అనుమానాస్పద స్థితి వల్ల ఎరుగని వ్యక్తి అపార్థానికి గురయ్యే ఆస్కారముంది. ఈ శాస్త్రంలో హాఫిజ్ ఇబ్ను హజర్ విరచితమయిన 'తాబీర్ అల్ మున్తబహ్' అనే పుస్తకం చాలా సమగ్రమయింది.

## 9. అత్రాఫుల్ హదీస్ విద్య

ఈ శాస్త్రం ద్వారా ఏ ఉల్లేఖనం ఏ పుస్తకంలో ఉందో, దాని ఉల్లేఖనకర్తలెవరో తెలుస్తుంది. ఉదాహరణకు మీకు 'ఇన్నమల్ ఆమాలు బిన్నియ్యాత్' అనే హదీసు

వాక్యం ఒకటి గుర్తుంది. అది ఎక్కడి నుండి లభించిందో, ఉల్లేఖనం పూర్తి పాఠమేమిటో, ఉల్లేఖన కర్తలెవరో మీరు తెలుసుకోదలిస్తే ఈ శాస్త్రానికి సంబంధించిన పుస్తకాలను చూడవలసి వుంటుంది. ఈ శాస్త్రాన్ని హాఫిజ్ మజి (హి. 742) రచించిన 'తుహఫతుల్ అష్రాఫ్' అన్న పుస్తకంలో సవివరంగా చర్చించడం జరిగింది. ఇందులో 'సిహాసిత్తా' (ఆరు అతి సవ్యమయిన హదీసు పుస్తకాలు)లోని ఉల్లేఖనాల పట్టిక మొత్తం వచ్చేసింది. ఈ పుస్తకంలో హాఫిజ్ అబూ యూసుఫ్ మజీ 26 సంవత్సరాలు వెచ్చించారు. ఎంతో కఠిన శ్రమతో దీన్ని పూర్తి చేశారాయన. నేటి ప్రాచ్య శాస్త్రాల పాశ్చాత్య నిపుణులు (Orientalists) ఇలాంటి పుస్తకాలను అనుసరించే కాస్త కొత్తరూపంలో హదీసుల పట్టిక ఒకటి తయారు చేశారు. ఉదాహరణకు 'కునూజుస్సున్నహ్' అనే పుస్తకం ఇంగ్లీషులో ప్రచురించారు. దాని అరబీ అనువాదం క్రీ.శ. 1934లో ఈజిప్ట్ నుండి వెలువడింది. ఇప్పుడొక విస్తృత పట్టిక 'అల్‌ము'జముల్ ముఫహ్రిస్' అనే పేరుతో సంకలనం చేస్తున్నారు. దీని 20 సంపుటాలు వెలువడ్డాయి.

## 10. ఫిక్‌హుల్ హదీస్

ఈ శాస్త్రంలో ధార్మిక ఆదేశాలకు సంబంధించిన హదీసుల మర్మ హేతువును, అందులో నిగూఢమయి ఉన్న వివేచనను ఆవిష్కరించడం జరిగింది. ఈ విషయం మీద హాఫిజ్ ఇబ్ను కయ్యిమ్ (హి. 751) రచించిన 'ఆలాముల్ మౌకియీన్' అన్న పుస్తకంతోపాటు షా వలీయుల్లా 'హుజ్జతుల్లాహుల్ బాలిగ' అనే పుస్తకం ప్రయోజన కరమయినవి. ఇవేకాక జీవితంలోని విభిన్న సమస్యల్ని స్పర్శిస్తూ పండితులు వేర్వేరు పుస్తకాలు రచించారు. ఉదాహరణకు ఆర్థిక విషయాలకు సంబంధించిన పుస్తకం 'కితాబుల్ అమ్వాల్'ని అబూ ఉబైదా కాసిమ్ బిన్ సల్లామ్ (హి.224) వ్రాశారు. అలాగే భూమి, సేద్యపు భూమి, ఉష్ర్ (పంటలో జకాత్) ఖరాజ్ ఇత్యాధి విషయాల మీద కాజీ అబూ యూసుఫ్ వ్రాసిన 'కితాబుల్ ఖరాజ్' అత్యుత్తమ రచన. ఇంకా సున్నత్ (ప్రవక్త సంప్రదాయం) షరీఅత్‌కు మూలం అనడానికి, హదీసు తిరస్కారులు వ్యాపింపజేసిన అపార్థాలను తొలగించడానికి దిగువ పేర్కొన్న పుస్తకాలు చూడవచ్చు.

1) కితాబుల్ ఉమ్మ్ 7వ సంపుటం; 2) అల్ రిసాల (ఇమామ్ షాఫియి); 3) అల్ ముఆఫికాత్, నాల్గవ సంపుటం (అబూ ఇస్‌హాక్ షాతిబి (హి.790); 4) సవాఇకు ముర్సల, సం.2 (ఇబ్నుకయ్యిమ్), 5) అల్ అహ్‌కామ్ (ఇబ్ను హజ్మ్ ఉన్దులుసి హి.456); 6) తర్జుమానుస్సున్న (ఉర్దు, మౌలానా బద్రెఆలమ్, మీరఠీ); 7) ఇస్బాతుల్ ఖబర్ (మా

తండ్రి గారు, మౌలానా హాఫిజ్ అబ్దుస్సత్తార్ హసన్, ఉమర్‌పూరి, హి. 1324), హదీసు, ఖుర్ఆన్ (మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది) 9) ఇన్కారె హదీస్ కా మన్జర్ ఔర్ పస్‌మన్జర్ (ఇష్తిఖార్ అహ్మద్ బల్ఖి), 10) కొంతకాలం ముందు అల్లామా ముస్తఫా సబాయి, అల్ ముస్లిమూన్ అనే పత్రికలో, హదీసులు తార్కిక నిదర్శనాలన్న విషయం మీద వ్యాసాల పరంపర ప్రారంభించారు. వాటి ఉర్దూ అనువాదం మౌలానా మలిక్ గులామ్ అలీ గారు చేశారు. ఈ పుస్తకం 'నాతె రసూల్' పేరుతో వెలువడింది.

హదీసు విద్యల చరిత్ర, తదితర సంబంధిత చర్చలకుగాను దిగువ ప్రస్తావించిన రచనలు సమగ్రమైనవి, ప్రయోజనకరమయినవి.

1) ముకద్దమ ఫత్‌హుల్ బారి (హాఫిజ్ ఇబ్ను హజర్); 2) జామె బయానుల్ ఇల్మ్ వ అహ్‌లిహీ, (హాఫిజ్ ఇబ్ను అబ్దుల్ బర్ ఉందులుసి(హి.463) 3) ముఅరిఫతు ఉలూముల్ హదీస్ (ఇమామ్ హాకిమ్- హి.405); 4) ముకద్దమ తుహఫతుల్ అహూజీ (మౌలానా అబ్దుర్రహ్మాన్ ముబారక్‌పూరి- హి.1353) ఈ పుస్తకం కొత్తగా వచ్చిన పుస్తకాలన్నింటిలో సమగ్రమయింది, ప్రయోజనకరమయిందీను; అలాగే 5) ముకద్దమ ఫత్‌హుల్ ముల్హిమ్ (మౌలానా షబ్బీర్ అహ్మద్ ఉస్మాని); 6) తద్వీనె హదీస్ (ఉర్దూ- మౌలానా మనాజిర్ అహ్సన్ గీలాని)

## మూడవ దశలో హదీసు సంకలన కర్తలు

ఈ దశలో ఖ్యాతిగాంచిన హదీసువేత్తల ప్రామాణిక గ్రంథాలను క్రింద పరిచయం చేస్తున్నాము.

1) **ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (హి.164- 241):** ఈయనగారి ప్రముఖ సంకలనం 'ముస్నద్ అహ్మద్' పేరుతో ఖ్యాతి గడించింది. ఇందులో 30 వేల ఉల్లేఖనాలున్నాయి. దీని సంపుటాలు 24. చెప్పుకోదగ్గ హదీసులన్నీ ఇందులో ఉన్నాయి. ఇందులో సంకలనా విధానం విషయ శీర్షికనుబట్టికాక ఉల్లేఖన కర్త అయిన ప్రవక్త సహచరుని శీర్షికన జరిగింది. దీన్ని అధ్యాయాల రీత్యా అంటే విషయానుక్రమంగా తిరిగి కూర్చే పని హసనుల్ బన్నా షహీద్ తండ్రిగారు అయిన అహ్మద్ అబ్దుర్రహ్మాన్ సాఅతి ప్రారంభించారు. ఇప్పటివరకు 14 సంపుటాలు వెలువడ్డాయి. ఈజిప్ట్‌కే చెందిన ప్రముఖ పండితులు అహ్మద్ షాకిర్ కూడా ఈ సందర్భంలో పని చేస్తున్నారు. ఇప్పటివరకు 15 భాగాలు సంకలనమయ్యాయి.

2. **ఇమామ్ ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్ అల్ బుఖారి (హి.194- 256):** ఈయన గారి పుట్టుక సంవత్సరం అరబీ సంఖ్యా శాస్త్రం రీత్యా 'సిద్క్' (194) మరణ సంవత్సరం 'నూర్' (256) వస్తాయి. ఇమామ్ బుఖారి రచనల్లో అన్నింటికన్నా ప్రముఖమయింది, ప్రామాణికమయింది 'సహీహ్ బుఖారి'. దాని పూర్తి పేరు 'అల్ జామి ఉస్సహీహుల్ ముస్నదుల్ ముఖ్తసర్ మిన్ ఉమూరు రసూలుల్లాహి సల్లల్లాహు అలైహి వ ఆలిహి వసల్లం వ అయ్యామహ్.'

ఈ గ్రంథ సంకలనంలో 16 ఏళ్ళు పట్టాయి. ఆయన ద్వారా నేరుగా సహీహ్ బుఖారి చదివిన శిష్య గణం సంఖ్య 90వేల వరకు ఉంటుంది. కొన్ని పర్యాయాలు ఒకే సమావేశంలో హాజరైన వారి సంఖ్య 30వేల వరకు చేరేది. ఇలాంటి సమావేశాల్లో ఆయన చెబుతూ ఉండగా తిరిగి చెప్పి వ్రాయించే వారి సంఖ్య 300కు మించి ఉండేది. మొత్తం హదీసుల సంఖ్య 9684. అయితే పునరుక్తమయిన ఉల్లేఖనాలు (ముకర్రర్ రివాయాత్), అప్రామాణికమయిన ఉల్లేఖనాలు (తాలీకాత్), సహచరుల సాక్ష్యాధారమయిన ఉల్లేఖనాలు (షవాహిద్ అసార్), ముర్సల్ హదీసులను తీసివేస్తే మర్ఫూ ఉల్లేఖనాలు 623 మిగులుతాయి. ఇతర హదీసువేత్తలను పోల్చి చూస్తే ఉల్లేఖనకర్తలను ఏరివేసే ప్రమాణం ఈయన కాస్త ఉన్నతంగా పెట్టారు.

3. **ఇమామ్ ముస్లిమ్ బిన్ హజ్జాజ్ కషీరి (హి.202- 261):** ఇమామ్ బుఖారి, ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ ఈయన గురువుల్లోనూ, ఇమామ్ తిర్మిజీ, అబూ హాతిమ్ రాజి, అబూబక్ర్ బిన్ ఖుజైమా ప్రభృతులు ఈయన శిష్యగణంలోని వారు. ఈయన సంకలనం 'సహీహ్ ముస్లిమ్' సంకలనాక్రమం రీత్యా ప్రముఖమయిందిగా పరిగణించబడుతుంది.

4. **అబూ దావూద్ అష్అస్ బిన్ సులైమాన్ సజిస్తానీ (హి. 202- 275):** ఈయన ప్రముఖ సంకలనం 'సునన్ అబూ దావూద్' పేరుతో ప్రఖ్యాతమయింది. ఇందులో అధికాంశం ధర్మశాస్త్ర ఆదేశాలకు సంబంధించిన ఉల్లేఖనాలను సమగ్ర రూపంలో ఒకచోట చేర్చడం జరిగింది. ఫికహ్‌కు సంబంధించిన, శాసనాంగానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఇది అత్యుత్తమ మూల గ్రంథమని చెప్పవచ్చు.

5. **ఇమామ్ అబూ ఈసా తిర్మిజి(హి. 209- 279):** ఇందులో ఫికహ్‌కు సంబంధించిన విషయాలను, విభిన్న పంథాల వివరాలను విశదపరచడం జరిగింది.

6. **ఇమామ్ అహ్మద్ బిన్ షుఅయిబ్ నసాయి (హి. 303):** ఈయన సంకలనం పేరు 'అస్సుననుల్ ముజ్‌తబా'

7. **ఇమామ్ ముహమ్మద్ బిన్ యజీద్ బిన్ మాజా కుజ్‌వయిని (హి. 273):** ఈయన పుస్తకం సునన్ ఇబ్ను మాజా పేరుతో ప్రఖ్యాతమయింది.

   ముస్నద్ అహ్మద్ తప్ప మిగతా 6 గ్రంథాలను హదీసువేత్తల పరిభాషలో 'సిహాహ్ సిత్తా' అంటారు. కొందరు పండితులు ఇబ్ను మాజాకు బదులు ముఅత్తా 'ఇమామ్ మాలిక్'ని సిహాహ్ సిత్తాలో ఒకటిగా పరిగణిస్తారు.

   ఇవికాక ఆ దశలో ఇంకా అనేక ప్రయోజనకరమయిన, సమగ్రమయిన రచనలు, సంకలనాలు జరిగాయి. వాటిని వివరించడం ఇక్కడ సాధ్యపడదు. బుఖారి, ముస్లిమ్, తిర్మిజీ ఈ మూటిని 'జామె' అని అంటారు. అంటే వీటిలో విశ్వాసాలు, ఆరాధనలు, నైతిక నియమాలు, వ్యవహారాలు తదితర సకల విషయాలకు సంబంధించిన హదీసులున్నాయన్నమాట. అబూ దావూద్, నసాయి, ఇబ్నుమాజ- వీటిని సునన్ అని అంటారు. అంటే వీటిలో క్రియాత్మక జీవితానికి సంబంధించిన ఉల్లేఖనాలు మటుకే ఉన్నాయని అర్థం.

## హదీసు గ్రంథాల వర్గీకరణ

హదీసువేత్తలు ఉల్లేఖనాల బలం, సవ్యతల ఆధారంగా హదీసు గ్రంథాలన్నింటినీ నాలుగు వర్గాలుగా విభజించారు.

1. **ముఅత్తా** ఇమామ్ మాలిక్, సహీహ్‌బుఖారి, సహీహ్ ముస్లిమ్. ఈ మూడు గ్రంథాలు, సవ్యత రీత్యాను, ఉల్లేఖనకర్తల విశ్వసనీయత దృష్ట్యాను అత్యున్నత స్థాయికి చెందినవి.

2. **అబూ దావూద్, తిర్మిజి, నసాయి-** ఈ గ్రంథాల ఉల్లేఖనకర్తలు కొందరు విశ్వసనీయత రీత్యా మొదటి వర్గానికి కాస్త దిగువన ఉన్నవారు. అయినా ఇవీ విశ్వసనీయ గ్రంథాలే. ముస్నద్ అహ్మద్ కూడా వీటితో సమంగా పరిగణించబడుతుంది.

3. **దారిమి (హి.225),** ఇబ్ను మాజ, బైహకీ, దారుల్‌ఖుతని (హి.385), తబ్రానీ (హి.360) పుస్తకాలు, తహావి (హి.311) రచనలు, ముస్నద్ షాఫియీ, ముస్తద్‌రక్ హాకిమ్ (హి. 405) - ఈ గ్రంథాలలో సహీహ్ (సవ్యమయినవి), జయీఫ్ (బలహీనమయినవి) అన్ని రకాల ఉల్లేఖనాలున్నాయి. కాని విశ్వసనీయమయిన ఉల్లేఖనాలే అధికంగా ఉన్నాయి.

4. **ఇబ్ను జరీర్ తబ్రీ (హి.310)** రచనలు, ఖతీబ్ బగ్దాదీ(హి.463) పుస్తకాలు, అబూ నుఅయిమ్ (హి.403), ఇబ్ను అసాకిర్ (హి.571), దైలమి, ఫిర్దౌస్ కృతికర్త (509), కామిల్ ఇబ్ను అదీ (హి.365), ఇబ్ను మర్దూయ (హి.410) సంకలనాలు, వాకిది(హి.207) ఇంకా ఇలాంటి ఇతర రచయితల పుస్తకాలు ఈ కోవకు చెందినవి. ఈ పుస్తకాలు కలగూర గంప లాంటివి. మౌజూ (కల్పిత) ఉల్లేఖనాలు కూడా వీటిలో అధికంగా చోటు చేసుకున్నాయి. సాధారణ మత బోధకులు, సూఫీ పండితులకు ఆధారాలు ఈ గ్రంథాలే. అయితే కష్టపడి ప్రక్షాళన జరిపితే ఈ సంకలనాల నుండి కూడా మణిమాణిక్యాలు వెదికి తీయవచ్చు.

## నాల్గవ దశ

ఈ దశ దాదాపు అయిదవ శతాబ్ది హిజ్రీ నుండి మొదలయింది. ఇంకా కొనసాగు తోంది. దీనికి పూర్వం మూడవ దశలో జరిగిన సంకలనా విధానం ముగిసింది. ఈ సుదీర్ఘ కాలంలో జరిగిన రచన, పరిశోధనా కార్యకలాపాల వివరాలు ఇవి:

1. ప్రముఖ హదీసు గ్రంథాల టీకా తాత్పర్యాలు, వివరణలు, ఇతర భాషల్లోకి అనువాదాలు జరిగాయి.
2. పైన పేర్కొన్న హదీసు శాస్త్రాల మీద అనేక రచనలు జరిగాయి. వాటి వ్యాఖ్యా నాలు, వివరణలు, సంక్షిప్తాలు వ్రాయడం జరిగింది.
3. పండితులు తమ అభిరుచులకనుగుణంగా లేక అవసరాల రీత్యా మూడవ దశలో జరిగిన సంకలనాల నుండి హదీసులను ఎన్నుకుని ప్రయోజనకర మయిన కూర్పులు చేశారు. వాటిలో కొన్ని దిగువన ఇస్తున్నాము.

అ) **మిష్కాతుల్ మసాబీహ్** (వలీయుద్దీన్ ఖతీబ్): ఇందులో విశ్వాసాలు, ఆరాధ నలు, నైతిక నియమాలు, వ్యవహారాలు, సామాజిక నియమాలు, ప్రళయ దిన వివరాలు ఇత్యాది విషయాలకు సంబంధించిన ఉల్లేఖనాలన్నీ సమకూర్చడం జరిగింది.

ఆ) **రియాజుస్సాలిహీన్** (ఇమామ్ అబూ జక్రియ్యా యహ్యా బిన్ షరఫ్ నవవి- ఈయన 'ముస్లిమ్' గ్రంథానికి టీకా కూడా వ్రాశారు. హి.676) ఈ గ్రంథం అధికంగా నైతికత, మర్యాదలకు సంబంధించిన హదీసులున్న పుస్తకం. ప్రతి ఆధ్యాయం ప్రారంభంలో శీర్షికను బట్టి ఖుర్ఆన్ వచనాలను కూడా ఉటంకించడం జరిగింది. ఇది ఈ గ్రంథం ప్రత్యేకత(*తెలుగులో ఇది 'హదీసు కిరణాలు' పేరుతో ప్రచు రించబడింది*). సహీహ్ బుఖారి సంకలనా విధానం కూడా ఇదే.

4) **ముస్తకల్ అఖ్‌బార్** (ముజద్దిదుద్దీన్, అబుల్ బర్కాత్, అబ్దుస్సలామ్ బిన్ తైమియ్యా -హి.652) : ఈయన ప్రఖ్యాత ఇస్లామీయ తత్వవేత్త షేఖుల్ ఇస్లామ్ తకీఉద్దీన్ అహ్మద్ బిన్ తైమియ్యా (హి.728) గారి పితామహులు. కాజి షౌకాని, ఈ గ్రంథానికి నైలుల్ ఔతార్ పేరిట ఒక టీకా వ్రాశారు.

5. **బులూగుల్ మరామ్** (హాఫిజ్ ఇబ్ను హజర్, బుఖారి టీకా కర్త (హి.852)ఇందులో అధికంగా ఆరాధనలు, వ్యవహారాలకు సంబంధించిన హదీసులే ఉన్నాయి. *(తెలుగులో ఇది 'హదీసు మకరందం' పేరుతో ప్రచురించబడింది)* ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్ సనాని (హి.1182) 'సుబులుస్సలామ్' పేరిట దీనికి టీకా వ్రాశారు. 'మిస్కుల్ ఖిత్తామ్' పేరిట మరో టీకా ఫార్సీ భాషలో నవాబ్ సిద్దీకుల్ హసన్ ఖాన్ (హి.1307) వ్రాశారు. ఈ గ్రంథాల్లో చాలా వాటికి చాలా కాలం క్రితమే ఉర్దూలోనికి అనువాదం జరిగింది. వాటి ప్రచురణ కూడా జరిగింది.

## భారతదేశంలో

మన దేశంలో మొట్టమొదట షేఖ్ అబ్దుల్ హక్ ముహద్దిస్ దహ్లావీ బిన్ సైపుద్దీన్ తుర్క్ (హి.1052) హదీసు విద్యాజ్యోతిని ప్రకాశింపజేశారు. ఆయన తరువాత హజ్రత్ షా వలీయుల్లా (హి.1176), ఆయన సంతానం, సేవాపరాయణులు, బోధనాగ్రహకులయిన శిష్యుల అవిరళ పరిశ్రమ వల్ల ఈ భూభాగంలో ప్రవక్త సంప్రదాయ కాంతి నలుమూలలా వ్యాపించింది. 'భూమి దాని ప్రభు జ్యోతితో ప్రకాశమానమయి పోయింది.' *(దివ్యఖుర్‌ఆన్ -అజ్ జుమర్ : 69)*

షా వలీయుల్లా తరువాత ఈ దేశంలో అనువాదాలు, టీకాలు, చిన్నచిన్న సంకలనాలు, ప్రచురించే సత్కార్య క్రమం ఇంకా కొనసాగుతూనే ఉంది.

'నేను సత్పురుషుల ప్రేమికుణ్ణే కాని వారిలోని వాణ్ణి కాను.'

దీని ద్వారానయినా బహుశా దైవం నాలో సదాచారాన్ని అనుగ్రహిస్తాడేమో! ప్రవక్త కాలం నుండి నేటివరకు హదీసులు వ్రాసే, వాటిని ఉల్లేఖించే కార్యక్రమం సదా ఎడతెగకుండా సాగుతూనే ఉందని పై వివరాల వల్ల తెలుస్తోంది. ఈ విజ్ఞాన పరిశోధనా పరంపరలో పగలూ దేదీప్యమానమయినదే, రేయీ ఉజ్వలమానమయినదే!

**- అబ్దుల్ గఫ్ఫార్ హసన్ ఉమర్‌పూరి**

అపార కరుణామయుడు పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

كِتَابُ الْمَغَازِي

# 1. యుద్ధాల ప్రకరణం-2

## (కితాబుల్ మగాజీ)

## అధ్యాయం : 30

## కందక యుద్ధం

**దీనినే అహ్జాబ్[1] యుద్ధం అని కూడా అంటారు. కందక యుద్ధం హిజ్రీ 4వ సంవత్సరం షవ్వాల్ నెలలో జరిగిందని మూసా బిన్ ఉఖ్బా తెలియజేశారు.**

**1) ఇబ్నె ఉమర్ (రజి) కథనం: ఉహూద్ యుద్ధ సందర్భంగా ఇబ్నె ఉమర్ (రజి) తనను తాను ప్రవక్త మహనీయుని (సఅసమ్) ముందు సమర్పించుకున్నారు (సైనిక దళంలో తనను కూడా భర్తీ చేసుకోమని ప్రాధేయపడ్డారు). ఆ సమయంలో**

30-1. 'అహ్జాబ్' అనేది 'హిజ్బ్'కు బహువచనం. ఏదేని ఒక వర్గాన్ని, ముఠాను, కూటమిని హిజ్బ్ అంటారు. ఈ యుద్ధంలో అబూ సుఫ్యాన్ ఎన్నో సైనిక కూటములను రెచ్చగొట్టి ముస్లింలపై దండెత్తటానికి సమాయత్తం చేశాడు. అందుకే దీనిని 'అహ్జాబ్ యుద్ధం'గా కూడా వ్యవహరిస్తారు.

ఈ సందర్భంగా దైవప్రవక్త(స) హజ్రత్ సల్మాన్ ఫార్సీ (రజి) సలహాపై మదీనా నగరం చుట్టూ కందకం త్రవ్వించారు. ఈ త్రవ్వకంలో దైవప్రవక్త(స) స్వయంగా పాల్గొన్నారు. ఒక వైపున అవిశ్వాసుల సైనిక సంఖ్య పదివేల వరకూ ఉంటే మరో వైపున ముస్లిం సైనికులు కేవలం మూడు వేల మంది ఉన్నారు. 20 రోజుల వరకూ అవిశ్వాసులు మదీనా నగరాన్ని దిగ్బంధం చేశారు. చివరకు అల్లాహ్ వారిపై తుఫాను గాలిని పంపాడు. దాంతో వారు పలాయనం చిత్తగించారు. ఈ పరిణామంపై అబూ సుఫ్యాన్ సిగ్గుతో కుంచించుకుపోయాడు. "ఇక మీదట సత్య తిరస్కారులు మనపైన దండెత్తి రారు. మనమే వారిపై దండయాత్ర చేస్తామ"ని దైవప్రవక్త(స) వక్కాణించారు.

**ఆయనకు 14 ఏండ్లు. అందువల్ల దైవప్రవక్త(స) ఆయనకు అనుమతి ఇవ్వలేదు. అయితే కందక యుద్ధ సందర్భంగా ఈయన దైవప్రవక్త(స) సమక్షంలోకి వచ్చినప్పుడు, ప్రవక్త(స) ఆయనకు అనుమతిని ప్రదానం చేశారు. అప్పటికి ఆయనకు 15 సంవత్సరాలు.**

**2) హజ్రత్ సహ్లా బిన్ సాద్ (రజి) వివరించారు: మేము ప్రవక్త మహనీయుల (సఅసమ్) వారితోపాటు కందకంలో ఉన్నాము. సహచరమాన్యులు (రజి) కందకం త్రవ్వుతుంటే, మేము ఆ మట్టిని మా భుజాలపై మోసుకుని వెళుతున్నాము. ఆ సమయంలో దైవప్రవక్త(స) ఇలా ప్రార్థిస్తూ ఉన్నారు : "దేవా! పరలోక జీవితమే అసలు సుఖవంతమైనది. కనుక నీవు అన్సార్లను, ముహాజిర్లను క్షమించు."[1]**

**3) హజ్రత్ అనస్(రజి) చెప్పగా తాను విన్నానని హుమైద్ తెలిపారు: అనస్ (రజి) ఇలా చెప్పారు– ప్రవక్త మహనీయులు (సఅసమ్) కందకం వైపు ఏతెంచారు. చలి తీవ్రంగా ఉన్న కాలంలో ఉదయంపూట ముహాజిర్లు కందకం త్రవ్వే పనిలో నిమగ్నులై ఉన్నారు. సేవకులచేత పని చేయించడానికి వారి వద్ద సేవకులు కూడా లేరు. వారి శ్రమను, ఆకలిని చూసి దైవప్రవక్త(స) ఇలా వేడుకున్నారు:**

**"అల్లాహ్! విలాసవంతమైన జీవితమంటే పరలోక జీవితమే. కనుక అన్సార్లను, ముహాజిర్లను మన్నించు."**

**దీనికి జవాబుగా ప్రవక్త సహచరులు (రజి) ఇలా పలికారు :**

**"జిహాద్ చేస్తామని దైవప్రవక్త(స) సమక్షంలో ప్రతిజ్ఞ చేసినవారము మేము. మా బొందిలో ప్రాణమున్నంత వరకూ పోరాడతాము."**

**4) హజ్రత్ అనస్ (రజి) తెలిపారు: మదీనా చుట్టూ అన్సార్లు, ముహాజిర్లు కందకం మట్టిని త్రవ్వటంలో, మట్టిని తమ వీపులపై మోయటంలో నిమగ్నులై పోయారు. ఆ సమయంలో వారి నోట ఈ కవిత జాలువారేది:**

**"మా బొందిలో ప్రాణం ఉన్నంతవరకు ఇస్లామ్‌పై స్థిరంగా ఉంటామని ముహమ్మద్(స) సమక్షంలో ప్రతిజ్ఞ చేసినవారము మేము".**

---

2–1. కందక యుద్ధం జరిగిన కాలం చాలా గడ్డుకాలం. అన్సార్, ముహాజిర్ సహచరుల ప్రయాసను చూసి దైవప్రవక్త(స) గుండె చలించింది. వారిని ఓదార్చడానికి, వారిలో ఆత్మ విశ్వాసాన్ని నూరిపోయడానికి ఆయన(స) ఈ విధంగా దైవాన్ని వేడుకున్నారు. ప్రాపంచిక జీవితంలో ఎదురయ్యే కష్టనష్టాలపై ఓర్పు వహించటం ఒక విశ్వాసికి చాలా అవసరం అన్న సందేశం కూడా ఇందులో ఉంది.

ఇది విని దైవప్రవక్త(సఅసమ్) ఇలా ప్రార్థించారు :

"ఓ అల్లాహ్! శుభం అన్నది కేవలం పరలోక శుభమే. కనుక నీవు అన్సార్లకు, ముహాజిర్లకు శుభాన్నీ, సమృద్ధిని ప్రసాదించు."

అనస్ (రజి) ఇలా అన్నారు: ఆ రోజుల్లో తిండి సమస్య ఎంత తీవ్రంగా ఉందంటే, ఒక గుప్పెడు (లేదా రెండు గుప్పెళ్ళు) యవలు వాసన వచ్చే కొవ్వులో వేసి (వండి) వారి ముందు వడ్డిస్తే (అదే మహాభాగ్యం అనుకొని) వారు తినేసే వారు. వాస్తవానికి రుచీ పచీ లేని ఆ కొవ్వు గొంతుకు అతుక్కుపోయేది. అందులో నుంచి దుర్వాసన వచ్చేది.

**5)** అయ్‌మన్ హబ్‌షీ ఇలా వివరించారు: నేను జాబిర్ (రజి) సన్నిధికి వెళ్ళినప్పుడు ఆయన ఇలా వివరించి చెప్పారు: మేము కందక యుద్ధ సందర్భంగా కందకం త్రవ్వడంలో నిమగ్నులమై ఉన్నాము. అంతలో ఒక కఠినమైన బండరాయి బయల్పడింది. గడ్డ పలుగుతో (పారతో) అది పగులలేదు. అందువల్ల కందకం త్రవ్వడంలో అవరోధం ఏర్పడింది. ప్రవక్త ప్రియ సహచరులు దైవప్రవక్త(స) సన్నిధికి వెళ్ళి బండరాయి పగలటం లేదని చెప్పారు. దానికి దైవప్రవక్త(స), "పదండి, నేను దిగుతున్నాను" అన్నారు.

ఆయన (స) లేచి నిలబడ్డారు. ఆ సమయంలో (ఆకలి తీవ్రత కారణంగా) ఆయన కడుపుపై రాయి కట్టబడి ఉంది. అప్పటికి మూడు రోజుల నుండి మాకు తినడానికి ఒక్క మెతుకు కూడా లభ్యమవలేదు. దైవప్రవక్త (స) ఆ స్థితిలోనే తన చేత్తో గడ్డ పలుగు పట్టుకుని బండరాయిపై ఒక దెబ్బ వేయగానే అది ఇసుక దిబ్బ మాదిరిగా కూలిపోయింది. 'దైవప్రవక్తా! నాకు ఇంటికి వెళ్ళేందుకు అనుమతి ఇవ్వండి' అని నేను విన్నవించుకున్నాను.

(ఇంటికి రాగానే) నా భార్యతో, 'దైవప్రవక్త (స)ను ఆకలిగొన్న స్థితిలో చూసి ఓర్చుకోలేకపోయాను. ఇంట్లో ఏమైనా తినడానికి ఉందా?' అని అడిగాను. దానికి ఆమె, 'ఉంది. ఒక మేక పిల్ల కూడా ఉంది' అని చెప్పింది. నేను మేక పిల్లను జిబహ్ చేశాను. మా ఆవిడ పిండి సిద్ధం చేసింది. తరువాత మేమిద్దరం కలిసి పొయ్యిపై మాంసం కుండ పెట్టాము. పిండి నానబెట్టాము. మాంసం ఉడుకుతుండగా నేను దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి 'దైవప్రవక్తా! భోజనానికి ఇంటికి విచ్చేయండి. కొద్దిగా భోజనం తయారయింది. ఒకరిద్దరిని కూడా తమరు వెంట

**బెట్టుకుని రావచ్చు' అని చెప్పాను. "భోజనం ఎంత ఉంది?" అని ఆయన(స) అడిగారు. నేను వివరంగా చెప్పాను. దానికి ఆయన(స) "ఓహో! ఇది చాలా ఎక్కువ. పైగా స్వాదిష్టమైన వంటకం" అంటూ, "పొయ్యి మీద ఉన్న కుండను దించకూడదనీ, కొలనులో నుంచి రొట్టెలను కూడా బయటకు తీయకూడదని నీ భార్యకు చెప్పు. నేను ఇప్పుడే వస్తున్నాను" అని సూచించారు. తరువాత తన సహచరులతో "మీరంతా నాతో రండి" అన్నారు. అన్సార్లు, ముహాజిర్ సహచరు లంతా సిద్ధమయ్యారు.**

**జాబిర్(రజి) తన ఇంటికి వెళ్ళి, 'ఇప్పుడెలా?' దైవప్రవక్త(స) తన ముహాజిర్, అన్సార్ సహచరులందరినీ వెంటబెట్టుకుని వస్తున్నార'ని తన భార్యతో అన్నారు. దానికి ఆమె, 'ఆయన(స) మీతో ఏమైనా అన్నారా?' అని అడిగింది. 'అవును. అన్నారు' అని చెప్పారు జాబిర్(రజి).**

**దైవప్రవక్త(స) తన సహచరులతో, "ఇంట్లోకి రండి. కాని తొక్కిసలాట జరగ కూడదు" అని సూచించారు. తరువాత దైవప్రవక్త(స) రొట్టెల్ని ముక్కలుగా చేసి, వాటిపై మాంసం ముక్కల్ని పెట్టసాగారు. పొయ్యిపైనున్న కుండపై మూకుడు ఉంది. అలాగే కొలను కూడా మూయబడి ఉంది. దైవప్రవక్త(స) తన సహచరులకు భోజనం వడ్డించసాగారు. రొట్టెలు, మాంసం తీసి వడ్డిస్తూనే ఉన్నారు. సహచర మాన్యులంతా కడుపు నిండా తిన్నారు. కడకు భోజనం మిగిలి వుంది. తరువాత ఆయన(స) జాబిర్ భార్యనుద్దేశించి, "ఈ భోజనం నువ్వూ తిను. జనులకు కానుకగా కూడా పంపు. ఎందుకంటే ప్రస్తుతం వారు ఆకలితో అలమటిస్తున్నారు"[1] అని సూచించారు.**

---

5–1. పై ఉల్లేఖనంలో కందకం త్రవ్వే విషయంతోపాటు మరెన్నో అంశాలు ముందుకు వచ్చాయి. దైవప్రవక్త(స) ఆకలి తీవ్రత కారణంగా తన కడుపుకు రాయి కట్టుకోవడం వాటిలో ఒకటి.

భోజనంలో 'సమృద్ధి' (బరకత్) జరగటం ప్రవక్త(స) వారి అద్భుతాలలో ఒక అద్భుతం. ఇలాంటి అద్భుతాలు ఆయన(స) ద్వారా అనేకం జరిగాయి. హజ్రత్ జాబిర్(రజి) ప్రస్తావన కూడా హదీసులలో పదేపదే వస్తూ ఉంటుంది. ఒకసారి జాబిర్(రజి) తన తండ్రి అమరగతినొందిన తరువాత ఆయన చేసిన అప్పులను గురించి దైవప్రవక్త(స) ముందు చెప్పుకుని, దుఆ చేయమని కోరారు. అప్పుడు కూడా ఇలాంటి అద్భుతమే జరిగింది.

**6)** హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) చెప్పగా తాను విన్నానని సయీద్ బిన్ మీనా తెలిపారు: జాబిర్(రజి) ఇలా చెప్పారు– కందక త్రవ్వకం జరుగుతున్న సమయంలో దైవప్రవక్త(స) తీవ్రమైన ఆకలిబాధతో ఉన్నట్లు నేను పసిగట్టాను. నేను వెంటనే నా భార్య దగ్గరకు వచ్చి, 'నీ దగ్గర తినడానికి ఏమైనా ఉందా? నా ఉద్దేశంలో ప్రవక్త మహనీయులు(స) బాగా ఆకలితో ఉన్నట్టున్నారు' అని చెప్పాను. మా ఆవిడ ఇంట్లోనుంచి ఒక సంచి తీసుకువచ్చింది. అందులో ఒక 'సా' యవలు ఉన్నాయి. మా ఇంట్లో ఒక మేక పిల్ల కూడా కట్టబడి ఉంది. నేను వెంటనే ఆ మేకపిల్లను జిబహ్ చేశాను. మా ఆవిడ విసుర్రాయితో యవల పిండి సిద్ధం చేయసాగింది. నేను మేక పిల్లను కోసి మాంసం సిద్ధం చేసేసరికి పిండి కూడా తయారయింది. మాంసాన్ని ముక్కలు చేసి కుండలో వేసి దైవప్రవక్త(స) సేవలో హాజరయ్యాను.

దైవప్రవక్త(స), సహాబా ముందు తాను సిగ్గుపడేలా చేయరాదని నా భార్య ముందుగానే నన్ను హెచ్చరించింది. అందుకే నేను దైవప్రవక్త(స) దగ్గరకు వచ్చి ఆయన(స) చెవిలో 'దైవప్రవక్తా! మేము ఒక మేక పిల్లను జిబహ్ చేశాము. మా వద్ద ఒక సా యవల పిండి కూడా ఉంది. కాబట్టి తమరు ఒకరిద్దరు సహచరులను వెంటబెట్టుకుని మా ఇంటికి రండి' అని నెమ్మదిగా చెప్పాను. అయితే దైవప్రవక్త హెచ్చు స్వరంతో, "ఓ కందకం వారలారా! జాబిర్ మీ కొరకు భోజనం సిద్ధం చేశాడు. కనుక మీరంతా మీ పనిని వదలిపెట్టి త్వరగా భోజనానికి రండి" అని పిలిచారు. తరువాత దైవప్రవక్త(స) నాతో, "నేను వచ్చే వరకూ పొయ్యిపై ఉన్న కుండను దించకండి. అలాగే రొట్టెలు కాల్చటం కూడా మొదలెట్టకండి" అని తాకీదు చేశారు. నేను ఇంటికి వచ్చాను. దైవప్రవక్త(స) కూడా తన సహచరులను వెంటబెట్టుకుని మా ఇంటికి బయలుదేరారు. ఇంట్లో మా ఆవిడ నాపై మండి పడింది. 'ఏం చేయను? దైవప్రవక్త(స)కు చెప్పాల్సింది చెప్పాన'ని ఆమెను సముదాయించాను. చివరకు మా ఆవిడ నానబెట్టిన పిండిని తెచ్చింది. దైవప్రవక్త(స) పవిత్ర లాలాజలాన్ని అందులో కలిపి శుభం కొరకు ప్రార్థించారు. కుండలో కూడా ఆయన(స) తన లాలాజలాన్ని కలిపి బరకత్ కొరకు వేడుకున్నారు.

ఆ తరువాత ఆయన(స), "ఇప్పుడు రొట్టెలు చేసే ఆవిణ్ణి పిలవండి. నా ముందరే రొట్టెలు చేయాలి. మాంసం కుండలో నుంచి తీయండి గాని కుండ మాత్రం పొయ్యి మీది నుండి దించకూడదు" అని తాకీదు చేశారు– ప్రవక్త ప్రియ

**సహచరులు (ర.అన్హుమ్) వెయ్యిమంది వరకూ ఉన్నారు. దైవసాక్షిగా చెబుతున్నాను. ఆ కొద్దిపాటి భోజనాన్నే వారంతా సుష్టుగా తిన్నారు. అందరూ తిని వెళ్ళిపోయాక కూడా పొయ్యి మీద ఉన్న కుండ మొదట్లో ఉడికినట్లుగానే ఉడుకుతూ ఉంది. అలాగే పిండి రొట్టెలు కూడా తరగలేదు.**

**7) హజ్రత్ ఆయిషా(ర.అ) "శత్రువులు మీపైకి పైనుండీ, క్రింది నుండీ దండెత్తి వచ్చినప్పుడు, భయం వల్ల మీ కళ్ళు తేలగిల్లినప్పుడు, మీ గుండెకాయలు గొంతులలోనికి వచ్చినప్పుడు... " (33: 10) అనే ఆయత్ను ప్రస్తావిస్తూ, ఇది కందక యుద్ధం నేపథ్యంలో అవతరించిందని చెప్పారు.[1]**

**8) హజ్రత్ బరా బిన్ ఆజిబ్ (రజి) వివరించారు : కందక యుద్ధ సందర్భంగా (కందకం త్రవ్వబడుతున్నప్పుడు) దైవప్రవక్త(స) స్వయంగా మట్టిమోస్తూ కనిపించారు. తత్కారణంగా ఆయన(స) ఉదర భాగంపై దుమ్ము పేరుకుపోయింది. ఆ సమయంలో ప్రవక్త మహనీయుని (స) అధరాల మీదుగా జాలువారుతున్న వచనాలివి :**

**"దైవసాక్షిగా! అల్లాహ్యే గనక లేకుంటే మాకు సన్మార్గం లభించేది కాదు. మేము దానధర్మాలు చేయటంగానీ, నమాజ్ ఆచరించటం గానీ చేసేవారం కాము. కనుక (ఓ దేవా!) మా హృదయాలపై స్థిమితాన్ని, నెమ్మదిని అవతరింపజెయ్యి. ఒకవేళ మాపై దండెత్తి వచ్చిన అవిశ్వాసులతో మేము ముఖాముఖి అయ్యే మాటైతే మా పాదాలకు నిలకడను ప్రసాదించు. వారు గనక మమ్మల్ని పరీక్షకు గురి చేయదలిస్తే మేము సుతరామూ దానికి తల ఒగ్గము"– 'తల ఒగ్గము... తల ఒగ్గము' అని అంటున్నప్పుడు ఆయన(స) కంఠస్వరం పెరిగేది.**

---

7–1. కందక యుద్ధ సమయంలో ముస్లింలు ఎదుర్కొన్న కష్టాలు వర్ణనాతీతం. వారి వద్ద తిండిగింజలు లేవు. దానికి తోడు ఎముకలు కొరికే చలి! అదీగాక తమ ఒడంబడిక దారులైన బనూ ఖురైజా యూదులు నమ్మకద్రోహం చేశారు. ఒకవైపునుంచి అబూ సుఫ్యాన్, మరోవైపు నుంచి గిత్ఫాన్ అవిశ్వాసులు అరేబియాలోని సైనిక కూటములను ఏకత్రం చేసి ఒకేసారి మదీనాపై దండెత్తారు. ఆ విధంగా శత్రువులు పదివేల మంది వరకూ ఉండగా ముస్లింల సంఖ్య మూడు వేలకు మించిలేదు.

అయితే దైవ సహాయం ముస్లింల పక్షాన ఉంది. మూడు వారాల పాటు మదీనా నగరాన్ని ముట్టడించిన బహుదైవారాధకులు తుఫాను గాలికి తట్టుకోలేక వట్టి చేతులతో తోక ముడిచారు. ఆ విధంగా వారి ఎత్తులన్నీ చిత్తయిపోయాయి.

**9)** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా ప్రవచించారు: "నాకు తూరుపు గాలి ద్వారా సహాయం చేయ బడింది. ఆద్ జాతి పడమటి గాలి ద్వారా అంతమొందించబడింది."

**10)** మహనీయ బరా బిన్ ఆజిబ్ (రజి) ఇలా అంటూ ఉండేవారు: అహ్జాబ్ యుద్ధ సందర్భంగా, అంటే కందక యుద్ధం జరిగిన నాడు నేను ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్)ను చూశాను. ఆయన కందకంలోని మట్టిని మోస్తూ ఉన్నారు. ఆ మట్టి పడటం వల్ల ఆయన ఉదర భాగంలోని చర్మం సయితం మాకు కనబడలేదు. ఆయన(స) ఛాతీపై వెంట్రుకలు గుబురుగా ఉన్నాయి. ఆ సమయంలో ఆయన(స) అబ్దుల్లాహ్ బిన్ రవాహ కవితలు చెబుతూ మట్టి మోస్తున్నారు–

"ఓ అల్లాహ్! నీవే గనక సన్మార్గం చూపకపోతే మాకు సన్మార్గం లభించేది కాదు. మేము సదకా ఇవ్వటంగానీ, నమాజ్ ఆచరించటం గానీ సాధ్యమయ్యేది కాదు. కనుక నీవు మాపైన నీ తరఫున ప్రశాంతతను అవతరింపజెయ్యి. ఒకవేళ శత్రువును మేము మార్కొనవలసి వస్తే, మా పాదాలకు స్థిరత్వాన్ని ఇవ్వు. వీళ్ళు అకారణంగా మా మీద దండెత్తి వచ్చారు. వీళ్లు గనక మా ద్వారా ఏదైనా ఉపద్రవాన్ని సృష్టించగోరితే మేము ఎంతకీ సహించేది లేదు"–

దైవప్రవక్త (స) చివరి వాక్యం పలుకుతున్నప్పుడు సాగదీసి పలికారని ఉల్లేఖకుడు చెప్పారు.

**11)** "నేను పాల్గొన్న మొట్టమొదటి యుద్ధం కందక యుద్ధం" అని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు.

**12)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) ఇలా వివరించారు: నేను (నా సోదరి) ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ హఫ్సా (ర.అ) ఇంటికి వెళ్ళాను. ఆ సమయంలో ఆమె శిరోజాల నుండి నీటి బిందువులు రాలుతున్నాయి. "జనులు ఏం చేశారో చూశావా? [1] ప్రభుత్వాధికారం వ్యవహారంలో అసలు నన్ను ఎవరూ పట్టించుకోనేలేదు"[2] అని ఆమెతో అన్నాను. దానికి ఆమె "నీవు వెళ్ళి జనులను

12–1. హజ్రత్ అలీ(రజి)కి– ముఆవియా (రజి)కి మధ్యన సిఫ్ఫీన్ యుద్ధం జరిగినప్పటి విషయమిది. ఇప్పుడు తమ పరిపాలకునిగా ఎవరిని చేసుకోవాలి? అని ప్రజలు తీవ్రంగా ఆలోచిస్తున్న సందర్భం అది!

**కలుసుకో. వారు నీ కొరకు నిరీక్షిస్తున్నారేమో! నీవు సమయానికి చేరుకోకపోవటం వల్ల ప్రజల్లో చీలిక వస్తుందేమో!"[3] నని ఆమె అభిప్రాయపడింది. ఆ విధంగా ఉమ్ముల్ మోమినీన్ పట్టుబట్టడం వల్ల నేను వెళ్ళాను.[4] కాని అప్పటికే జనులు అక్కడి నుండి వెళ్ళిపోయారు.[5] అప్పుడు ముఆవియా (రజి) లేచి నిలబడి ప్రసంగిస్తూ,[6] "ఖిలాఫత్ వ్యవహారంపై మాట్లాడదలచినవారు ఎవరో తల ఎత్తండి. మేము**

---

12–2. మరి చూడబోతే నా తండ్రి (ఉమర్ బిన్ ఖత్తాబ్) అత్యుత్తమమైన రీతిలో ఖిలాఫత్ వ్యవస్థను నడిపిన వ్యక్తి.

12–3. అంటే బహుశా నీవు వెళ్ళటం వలన ప్రజల మధ్యన గల అభిప్రాయ భేదాలు సద్దుమణుగుతాయేమో! ప్రజలు నీకు అధికార బాధ్యతలు అప్పగించటం కూడా అసంభవం ఏమీ కాదు.

12–4. అంటే అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) తన సోదరి, ఉమ్ముల్ మోమినీన్ ప్రోద్బలంపై అక్కడికి వెళ్ళక తప్పలేదు.

12–5. అంటే ప్రజలు తర్జన భర్జన చేసుకుని వెళ్ళిపోతున్న సమయంలో అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) అక్కడికి చేరుకున్నారు.

12–6. ఇంతకీ ఆ సమావేశంలోని ప్రజలు చర్చించుకున్న మీదట ఇచ్చిన సలహా ఏమిటంటే ఇరువర్గాల వారు తమ తమ తరఫున ఒక్కో వ్యక్తిని తీర్పరిగా నియమించాలి. తీర్పరులిద్దరూ కలసి నిర్ణయించిన దానిని ఇరువర్గాల వారు శిరసావహించాలి.

హజ్రత్ అలీ (రజి) పక్షం తరఫున అబూ మూసా అష్అరీ (రజి), ముఆవియా పక్షం తరఫున అమ్ర్ బిన్ ఆస్ (రజి) తీర్పరులుగా ప్రతిపాదించబడ్డారు. అంటే వారిద్దరితో కూడిన ఒక ప్రత్యేక బెంచ్ ఏర్పాటు చేయబడింది.

"లేవండి, మన ఇద్దరి మధ్య పరస్పర సలహా సంప్రతింపుల తరువాత ఖరారైన విషయం ఏమిటో ప్రకటించండి" అని అమ్ర్ బిన్ ఆస్ అబూ మూసా అష్అరీతో అన్నారు. అబూ మూసా అష్అరీ వేదిక ఎక్కి ఇలా ప్రసంగించారు: "ప్రజలారా! తీర్పరులమైన మేమిద్దరం ఖిలాఫత్ గురించి బాగా ఆలోచించి, ఈ వివాదాన్ని రూపుమాపటం కోసం అలీ (రజి), ముఆవియా (రజి)లు– ఇద్దరినీ పదవీచ్యుతుల్ని చేయటం తప్ప మరో మార్గం లేదని నిర్ణయించుకున్నాము. ప్రజలు మెచ్చిన తదుపరి ఖలీఫా ఎవరో నిర్ణయమయ్యే వరకూ ఖిలాఫత్ వ్యవహారాలన్నింటినీ పర్యవేక్షించే బాధ్యత మజ్లిసె షూరా (పార్లమెంట్)పై ఉంటుంది. అందువల్ల నేను అలీ (రజి), ముఆవియా (రజి)– ఇద్దరినీ బర్తరఫ్ చేస్తున్నాను" అని చెప్పి వేదిక నుండి నిష్క్రమించారు.

**అతని కన్నా, అతని బాబుకన్నా ఎక్కువగా ఖిలాఫత్‌కు హక్కుదారులం"[7] అన్నారు. మరయితే మీరు ముఆవియా ప్రసంగానికి సమాధానం ఎందుకు ఇవ్వలేక పోయారు?" అని హబీబ్ బిన్ అబీ మస్లమా (అనే సహాబీ–రజి) అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి)ను అడగ్గా, "నేను దీటుగా జవాబివ్వడానికి సిద్ధమయ్యాను. ధర్మోన్నతి కొరకు నీతోనూ, నీ బాబుతోనూ పోరాడినవారు ఖిలాఫత్‌కు నీకన్నా ఎక్కువ హక్కుదారులు అని చెప్పాలన్న ఆలోచన వచ్చింది.[8] కాని సముదాయంలో చీలిక ఏర్పడుతుందేమోనని, రక్తపాతం జరుగుతుందేమోనని జంకాను. ఎందుకంటే నా**

---

అప్పుడు అమ్ర్ బిన్ ఆస్(రజి) వేదిక ఎక్కి ప్రసంగించసాగారు : "ప్రజలారా! విన్నారు కదా! అబూ మూసా(రజి) తన మనిషిని, అంటే అలీ (రజి)ని పదవి నుండి తొలగించారు. నేను కూడా ఆయన్ని తొలగించాను. ఇక నా అభ్యర్థి అయిన ముఆవియాను ఖిలాఫత్‌పై కొనసాగనిస్తున్నాను. ఆయన ఉస్మాన్(రజి) ప్రతినిధిగా పదవీ బాధ్యతల్ని స్వీకరిస్తారు. ఉస్మాన్ (రజి) హంతకులపై ప్రతీకారం చేస్తారు". అమ్ర్ బిన్ ఆస్ ప్రసంగం వినగానే ప్రజల్లో కలకలం రేగింది. చాలామంది అమ్ర్ పన్నాగం పట్ల నిరసన తెలుపుతూ సభలో నుండి లేచి వెళ్ళిపోయారు. అప్పుడు ఉమయ్యా ప్రసంగిస్తూ 'ఖిలాఫత్ వ్యవహారంపై మాట్లాడదలచిన వారెవరో తల ఎత్తండి' అని అన్నాడు.

అమ్ర్ బిన్ ఆస్ తనను మోసగించారని, ఆయన నాకు చెప్పిందొకటి, చేసిందొకటి అని అబూ మూసా అష్అరీ(రజి) తరచూ తన ఆవేదనను వెల్లడించేవారు.

ఈ రకమయిన రాజకీయపుటెత్తుగడలు సహాబా స్థాయికి ఎంతమాత్రం శోభించవు. అమ్ర్ బిన్ ఆస్ ఒక సహాబీ కావటం వలన మేము ఇంతకన్నా ఎక్కువగా చెప్పలేక పోతున్నాము– అల్లాహుమ్మగ్‌ఫిర్ లనా.

12–7. అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి)ను ఉడికించే ఉద్దేశంతో ముఆవియా వ్యంగ్యంగా పలికిన పలుకులు ఇవి. నిజానికి ముఆవియా కన్నా అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఖిలాఫత్ పదవికి ఎక్కువ హక్కుదారులు. ఈయన తండ్రి ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) సుదీర్ఘ కాలం ఖలీఫాగా అత్యుత్తమ పరిపాలనను అందించారు. ఎన్నో రాజ్యాలను జయించారు. తాను అడుగుపెట్టిన చోటల్లా ఇస్లామీయ ప్రభుత్వాన్ని స్థాపించారు. ఇక హజ్రత్ అలీ(రజి) విషయానికి వస్తే ఆయన ఆ సమయంలో అందరికన్నా ఎక్కువగా ఖిలాఫత్‌కి అర్హులు.

12–8. హజ్రత్ అలీ (రజి) గొప్పదనం గురించి చెప్పాలంటే ఆయన అంతకుముందు ముఆవియాతోనూ, ముఆవియా తండ్రి అబూ సుఫ్యాన్‌తోనూ వారిద్దరూ అవిశ్వాసులుగా ఉన్నప్పుడు పోరాడి ఉన్నారు.

మాటను ప్రజల్లో కొందరు మరోలా అర్థం చేసుకోవచ్చు. (సహనశీలుర కోసం) అల్లాహ్ స్వర్గంలో సిద్ధం చేసి ఉంచిన అనుగ్రహ భాగ్యాలను తలచుకుని సంయమనం పాటించాను" అని అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) చెప్పారు. దానికి హబీబ్ బిన్ మస్లమా రజి), "మంచి పని చేశారు. మీరు ఆపదలో చిక్కుకోలేదు"[9] అని అభిప్రాయపడ్డారు.

**13)** సులైమాన్ బిన్ సురద్(రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసమ్) కందక యుద్ధ సందర్భంగా (అవిశ్వాసులు విఫలమై తిరిగి వెళ్ళిపోతున్నప్పుడు) ఇలా పలికారు: "ఇక మీదట వారు ఎన్నటికీ మనపైన దండెత్తి రారు. మనమే వారిపై దండెత్తుతాము"[1]

**14)** సులైమాన్ బిన్ సురద్ (రజి) కథనం ప్రకారం అరేబియాలోని పలు కూటములు (కందక పోరాటంలో విఫలమై) వెనుతిరిగి పోయినప్పుడు మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా పలికారు : "ఇక మీదట మేము వారితో యుద్ధం చేస్తాము. వారు మా మీదకు దండెత్తి రారు. మేమే వారిపై దండయాత్ర చేస్తాము."

**15)** కందక యుద్ధ సందర్భంగా దైవప్రవక్త (సఅసమ్) ఈ విధంగా అధిక్షేపించారని హజ్రత్ అలీ (రజి) తెలిపారు: "ఈ సత్య తిరస్కారులు ఏ విధంగా మమ్మల్ని సూర్యాస్తమయం వరకూ మధ్యస్థ నమాజు (అస్ర్ నమాజు) చేసుకోనివ్వలేదో, అదే విధంగా అల్లాహ్ వారి నివాస గృహాలను, సమాధులను అగ్నితో నింపుగాక!"

**16)** మహనీయ జాబిర్(రజి) కథనం : కందక యుద్ధ సందర్భంగా హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) సూర్యాస్తమయం తర్వాత తిరిగి వస్తూ సత్య తిరస్కారులైన ఖురైషులను తూలనాడసాగారు. ఆయన ఇలా అన్నారు: 'దైవప్రవక్తా! పొద్దుగూకుతోంది. నేనింతవరకు అస్ర్ నమాజ్ చేయలేదు'. దానికి దైవప్రవక్త(స) "దైవసాక్షిగా! నేను సయితం నమాజ్ చేయలేద"న్నారు. చివరకు మేము దైవప్రవక్త(స)తోపాటు

---

12–9. అంటే ఒక విధంగా హబీబ్(రజి) అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) అభిప్రాయంతో ఏకీభవించారు.

13–1. దైవప్రవక్త(స) చెప్పినట్లుగానే జరిగింది. కందక యుద్ధం తరువాత అవిశ్వాసుల ఆత్మ విశ్వాసం క్షీణించింది. ఆనాటి నుంచీ వారు మదీనాపై దండయాత్ర చేయలేదు.

బుత్‌హాన్ లోయలోకి వెళ్ళాము. నమాజు కొరకు దైవప్రవక్త(స) వుజూ చేసు కున్నారు. మేము కూడా వుజూ చేశాము. సూర్యుడు పూర్తిగా అస్తమించాక అస్ర్ నమాజ్ చేశాము. ఆ తరువాత మగ్రిబ్ నమాజ్ ఆచరించాము.

**17)** మహనీయ జాబిర్(రజి) చెప్పగా తాను విన్నానని ముహమ్మద్ బిన్ మున్కదిర్ తెలియజేశారు (జాబిర్ ఇలా చెప్పేవారు): కందక యుద్ధం జరుగుతున్న కాలంలో ప్రవక్త మహనీయులు (సఅసమ్) "అవిశ్వాసుల సైనిక శిబిరంలోని సమాచారాన్ని తెచ్చేదెవరు?" అని అడిగారు. దానికి జుబైర్(రజి) 'చిత్తం. నేను సిద్ధంగా ఉన్నాన'ని చెప్పారు. "అవిశ్వాసుల సైనిక శిబిరంలోని సమాచారాన్ని సేకరించేదెవరు?" అని దైవప్రవక్త(స) ప్రశ్నించగా, ఈసారి కూడా జుబైర్(రజి) 'నేను' అని బదులిచ్చారు. మూడవసారి కూడా దైవప్రవక్త(స) ఇలాగే అడిగినప్పుడు, 'నేను సిద్ధంగా ఉన్నాను దైవప్రవక్తా!' అని సమాధానమిచ్చారు జుబైర్(రజి). అప్పుడు దైవప్రవక్త(స) ఇలా వక్కాణించారు : "ప్రతి ప్రవక్తకు హవారీలు (ప్రత్యేక సహాయకులు) ఉంటారు. నా హవారీ మాత్రం జుబైర్."[1]

**18)** హజ్రత్ అబూ హురైరా(రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా అంటూ ఉండేవారు : "అల్లాహ్ తప్ప మరో నిజ ఆరాధ్య దైవం లేనేలేడు. ఆయన ఒకే ఒక్కడు. ఆయన ముస్లిం సేనలకు గౌరవం (విజయం) వొసగాడు. తన దాసునికి (అంటే ముహమ్మద్-సఅసమ్-కు) ప్రత్యేకంగా తోడ్పాటునందించాడు. సైనిక కూటములను తానొక్కడే తరిమికొట్టాడు. ఇక దీని తరువాత ఏ వస్తువూ ఆయన ముందు నిలువజాలదు."[1]

---

17-1. జుబైర్(రజి) దృఢ సంకల్పాన్ని, ధైర్యసాహసాలను పరీక్షించడానికే దైవప్రవక్త(స) మూడు సార్లు ప్రశ్నించారు. మూడుసార్లు కూడా ఆ సహాబీ వజ్ర సంకల్పంతో సమాధానం ఇవ్వడంతో ఆయనకు 'హవారీ' అనే కితాబు ఇచ్చారు.

18-1. కందక యుద్ధం ముగిసిన శుభ సందర్భంగా దైవప్రవక్త(సఅసమ్) నోట కృతజ్ఞతా పూర్వకంగా జాలువారిన వచనాలివి. అరేబియాలోని శత్రు సైనిక కూటములన్నీ ఒక్కసారిగా మదీనా పురముపై దండయాత్ర చేశాయి. అయితే అల్లాహ్ అవిశ్వాసుల అపవిత్ర ఉద్దేశ్యాలన్నింటినీ చిత్తుచేసి, ముస్లింలను రక్షించాడు.

**19)** అబ్దుల్లాహ్ బిన్ అబీ ఔఫా(రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సఅసమ్) కందక యుద్ధ సందర్భంగా ఇలా ప్రార్థించారు : "ఓ అల్లాహ్! గ్రంథాన్ని అవతరింపజేసినవాడా! శీఘ్రంగా లెక్కతేల్చేవాడా! అవిశ్వాసుల సేనలను ఓడించు. ఓ అల్లాహ్! వారిని పరాజయం పాల్జెయ్యి. ఓ అల్లాహ్! వారిని నిలదొక్కు కోకుండా చెయ్యి."

**20)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం : ప్రవక్త మహ నీయులు ముహమ్మద్(సఅసమ్) యుద్ధ రంగం నుండి గానీ, హజ్జ్ నుండి గానీ, ఉమ్రా నుండి గానీ తిరిగి వస్తున్నప్పుడు, అన్నిటికన్నా ముందు మూడుసార్లు "అల్లాహు అక్బర్" అని పలికేవారు. ఆ తరువాత ఇలా అనేవారు: "అల్లాహ్ తప్ప మరో నిజ ఆరాధ్య దైవం లేడు. ఆయన అద్వితీయుడు. సహవర్తులు ఎవరూ లేని వాడు. సార్వభౌమత్వం ఆయనదే. స్తోత్రం ఆయనకే శోభాయమానం. ఆయన ప్రతిదీ చేయగల సమర్థుడు. (ఓ అల్లాహ్!) మేము తిరిగి వస్తున్నాము– పశ్చాత్తాప పడుతూ! (నిన్ను) ఆరాధిస్తూ!! మా ప్రభువు సన్నిధిలో ప్రణమిల్లుతూ!!! మా ప్రభు వును స్తుతిస్తూ!!!! అల్లాహ్ తన వాగ్దానాన్ని నిజం చేసి చూపాడు. తన దాసునికి (ప్రత్యేకంగా) సహాయం చేశాడు. సత్యతిరస్కారుల సైనిక కూటములను తానొక్కడే చిత్తుగా ఓడించాడు."

## అధ్యాయం : 31

## అహ్జాబ్ యుద్ధం నుండి ప్రవక్త మహనీయులు(సఅసమ్) తిరిగి రావటం, బనూ ఖురైజాపై దండెత్తటం, ఆ తెగ వారిని ముట్టడించడం

**21)** హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు: "కందక యుద్ధం నుండి తిరిగి రాగానే ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఆయుధాలను విడిచి స్నానం చేశారు. అంతలోనే హజ్రత్ జిబ్రీల్ (అలైహిస్సలామ్) ఆయన వద్దకు వచ్చి, 'ఏమిటీ, మీరు అప్పుడే ఆయుధాలు విడిచారా? దైవసాక్షి! మేమింకా ఆయుధాలు విడువనే లేదు. పదండి, వారిపై దండెత్తండి' అని అన్నారు. 'ఎవరిపైన?' అని దైవప్రవక్త(స)

---

ఈ వచనాలను దైవప్రవక్త(స) తరచూ ప్రసంగాల సందర్భంగా పలుకుతూ ఉండే వారు. మనం కూడా వాటిని పఠిస్తూ ఉండాలి. ముఖ్యంగా హజ్జ్ సందర్భంగా హాజీలు ఈ వచనాలను పఠించటం పుణ్యప్రదం.

"ఆ అల్లాహ్‌యే తొలివాడు, తుదివాడు. ఆయనే బాహ్యం, ఆయనే గూఢం."

**ప్రశ్నించగా 'అదిగో, వారిపైన' అంటూ జిబ్రీల్(అ) యూదు తెగ బనూ ఖురైజా వైపు సంజ్ఞ చేశారు. అందువల్ల దైవప్రవక్త (స) బనూ ఖురైజా తెగ వారిపై దండెత్తారు."[1]**

**22) మహనీయ అనస్(రజి) కథనం : "ప్రవక్త మహనీయులు(సఅసమ్) బనూ ఖురైజాకు వ్యతిరేకంగా సైనిక చర్యకు వెళ్ళినప్పుడు, జిబ్రీల్ (అలైహిస్స లామ్)తో స్వారీ అయిన దైవదూతల కారణంగా బనూ గనమ్ తెగ వీధిలో రేగిన దుమారాన్ని నేను ఇప్పుడూ తిలకిస్తున్నాను."**

**23) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు : అహ్జాబ్ యుద్ధం నుండి తిరిగి వచ్చిన మీదట దైవప్రవక్త(సఅసమ్), "ముస్లిములంతా బనూ ఖురైజా వాడకు చేరుకున్న తర్వాతే అస్ర్ నమాజ్ చేయాల"ని ఆదేశించారు. కొంతమంది మార్గమధ్యంలో ఉండగానే అస్ర్ నమాజ్ వేళ అయింది. అప్పుడు కొంతమంది సహచరమాన్యులు (రజి) 'మేము మార్గమధ్యంలో నమాజ్ చేయలేము (ఎందుకంటే బనూ ఖురైజా వాడకు చేరుకున్న తర్వాతే అస్ర్ నమాజ్ చేయాలన్నది దైవప్రవక్త(స) ఆదేశం)' అని అన్నారు. అయితే, 'దైవప్రవక్త(స) ఉపదేశంలోని ఉద్దేశం అది కాదు' అని మరికొంతమంది సహాబా అభిప్రాయపడ్డారు. తరువాత ఈ విషయాన్ని దైవప్రవక్త(స) ముందు ప్రస్తావిస్తే, ఆయన(స) ఏ ఒక్కరినీ తప్పు పట్టలేదు.[1]**

---

21-1. కందక యుద్ధ సందర్భంగా బనూ ఖురైజా తెగవారు మదీనా పురములో అశాంతి అలజడులను వ్యాపింపజేసి, తమ ద్రోహబుద్ధిని చాటుకున్నారు. అందుకే వారిపై దండెత్తడం అనివార్యమైంది.

23-1. ఆ రెండు వర్గాలలో ఒకరిది తప్పు, మరొకరిది ఒప్పు అయి ఉండవచ్చు. కాని వారిరువురి సంకల్పంలో దోషం లేదు. అందువల్ల దైవప్రవక్త(స) ఏ ఒక్కరినీ తప్పు పట్టలేదు.

దీనివల్ల తెలిసే ఒక ముఖ్య విషయం ఏమిటంటే ముజ్తహిద్ (షరీఅత్ సూత్రాన్ని సమస్యకు అన్వయించే వ్యక్తి)కి మూలాధారం ఏదీ లభించనప్పుడు, అతడు 'ఖియాస్' (అంచనా) ఆధారంగా ఒక అభిప్రాయానికి రాగలడు. ఒకవేళ అతని అభిప్రాయం తప్పయినప్పటికీ, అతను నిలదీతకు గురి కాడు. పైగా అతనికి ఒకింత పుణ్యఫలం ప్రాప్తమవుతుంది. అందుకే 'ముజ్తహిదీన్' (శాసనాన్వయకర్తలు) సదా ప్రశంసార్హులు. వారిని మనం ఆదరించాలి.

ఆ 'ముజ్తహిదీన్'లో ఇమామ్ అబూ హనీఫా, ఇమామ్ షాఫియి, ఇమామ్ మాలిక్, ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్, ఇమామ్ సుఫియాన్ సౌరీ, ఇమామ్ ఔజాయి,

**24)** హజ్రత్ అనస్(రజి) కథనం: ప్రవక్త ప్రియ సహచరులు (ర.అన్ హుమ్) తమ ఖర్జూరం తోటల్లోని కొన్ని చెట్లను దైవప్రవక్త(సఅసమ్) కొరకు (కానుకగా) ప్రత్యేకించారు. కడకు బనూ ఖురైజా, బనూ నజీర్ తెగల వారిపై విజయం సాధించిన మీదట దైవప్రవక్త(స) ఆ కానుకలను వాపసు చేశారు. అందువల్ల నా ఇంటివారు కూడా ఆ ఖర్జూర చెట్లను వాపసు తీసుకునేందుకు నన్ను దైవప్రవక్త(స) వద్దకు పంపారు. దైవప్రవక్త(స) ఆ ఖర్జూర చెట్లను ఉమ్మె అయ్‌మన్‌కు ఇచ్చి ఉన్నారు. అంతలో ఆమె గారు కూడా వచ్చి, ఒక వస్త్రాన్ని నా మెడలో వేసి 'ఎవరి స్వాధీనంలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని తోడుగా చెబుతున్నాను. ఈ ఖర్జూర చెట్లు నీకు లభించవు. ఎందుకంటే, అవి నాకు దైవ ప్రవక్త(సఅసమ్) ద్వారా కానుకగా లభించాయి' అని అన్నారు. లేదా అలాంటి మాటలనే ఆమె గారన్నారు. ఈ మాటలు విన్న దైవప్రవక్త(స), "దానికి బదులుగా నీవు నా నుండి ఇంత తీసుకో" అని నచ్చజెప్పారు. దానికి ఆమె, 'దైవసాక్షిగా! అలా కుదరద'ని అంది. చివరకు దైవప్రవక్త(స) ఆమెకు "పదిరెట్లు అధికంగా ఇస్తాన"ని చెప్పిన మీదట ఆమె అంగీకరించింది.[1]

**25)** అబూ సయీద్ ఖుద్రీ (రజి) చెప్పగా తాను విన్నానని అబూ ఉమామా తెలిపారు. (అబూ సయీద్ ఖుద్రీ ఇలా చెప్పారు): బనూ ఖురైజా తెగవారు సాద్ బిన్ ముఆజ్(రజి)ను మధ్యవర్తిగా అంగీకరించి యుద్ధ విరమణ చేసినప్పుడు, ప్రవక్త మహనీయులు సాద్ బిన్ ముఆజ్ (రజి)ను పిలిపించడానికి మనిషిని పంపారు. ఆయన గాడిదపై స్వారీ అయి వచ్చారు. దైవప్రవక్త(స) నమాజ్ కొరకు ప్రత్యేకించు కున్న స్థలం వద్దకు సాద్ వచ్చినప్పుడు, "మీ నాయకునికి స్వాగతం పలికేందుకు లేచి నిలబడండి" అని దైవప్రవక్త(స) అన్సార్లను ఆదేశించారు. లేదా ఇలా

---

ఇమామ్ ఇస్‌హాఖ్, ఇమామ్ దావూద్ జాహిరీ, ఇమామ్ బుఖారీ, ఇమామ్ ఇబ్నె జరీర్ తబ్రీ మొదలగువారు ఎన్నదగినవారు.

ఆ తరువాతి కాలంలో కూడా పలువురు ప్రముఖ ముజ్తహిదీన్ గడిచారు. వారిలో ఇమామ్ ఇబ్నె హజమ్, ఇమామ్ ఇబ్నె తైమియ్యా, ఇమామ్ ఇబ్నె ఖయ్యిమ్, ఇమామ్ షౌకానీ వంటివారు ముఖ్యులు.

24-1. ఉమ్మె అయ్‌మన్(ర.అ) పట్ల దైవప్రవక్త(సఅసమ్) ఔదార్యానికి, వాత్సల్యానికి ఇదొక మచ్చుతునక. అదీగాక ఆమె తన పెంపుడు కుమారుని భార్య కూడా. అంతేకాదు, ఆమె గారు తొలి కాలంలోనే ఇస్లామ్ స్వీకరించిన మహిళామణి.

అన్నారు: “మీకన్నా ఉత్తముడైన వాని గౌరవార్థం లేచి నిలబడండి”. ఆ తర్వాత సాద్ బిన్ ముఆజ్(రజి)తో “బనూ ఖురైజా జనులు నిన్ను మధ్యవర్తిగా అంగీకరించి, ఆయుధాలు పడవేశార”ని అన్నారు. చివరకు సాద్ (రజి) తన తీర్పును వినిపిస్తూ, ‘వారిలో యుద్ధం చేయగల శక్తి ఉన్నవారిని వధించాలి. వారి పిల్లల్ని, స్త్రీలను ఖైదీలుగా చేసుకోవాలి’ అన్నారు. ఈ తీర్పు విన్న దైవప్రవక్త(స), “నీవు అల్లాహ్ తీర్పుననుసరించి నిర్ణయం గైకొన్నావు” అన్నారు. లేదా ఇలా అన్నారు: ‘సార్వభౌముని (అంటే అల్లాహ్) ఆజ్ఞానుసారం తీర్పు ఇచ్చావు.”

**26)** విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) వివరించారు: కందక యుద్ధ సందర్భంగా సాద్(రజి) గాయపడ్డారు. హిబ్బాన్ బిన్ అరీఖా అనే ఒక ఖురైషు వ్యక్తి ఆయనపై బాణం సంధించాడు. అది ఆయన భుజంలో నుండి ఛాతీ వరకు దూసుకెళ్ళింది. దైవప్రవక్త (సఅసమ్) సాద్(రజి) కొరకు మస్జిద్‌లోనే గుడారం వేయించారు. ఎప్పటికప్పుడు పరామర్శిస్తూ ఆయన యోగక్షేమాలు తెలుసుకుంటూ ఉండవచ్చన్న ఉద్దేశంతో ఈ ఏర్పాటు చేశారు.

కందక యుద్ధం నుండి తిరిగి వచ్చాక దైవప్రవక్త(స) ఆయుధాలను విడిచి స్నానం చేశారు. అంతలోనే దైవదూత జిబ్రీల్(అ) ఆయన(స) దగ్గరకు వచ్చారు. ఆయన తన తలపైనున్న దుమ్ము ధూళిని దులుపుకుంటున్నారు. ఆయన దైవ ప్రవక్త(స)నుద్దేశించి, “ఏమిటి, మీరు అప్పుడే ఆయుధాలు విడిచేశారా, దైవసాక్షి! నేనింకా ఆయుధాలు విడువ లేదు. ఎందుకంటే మీరు వారిపైన సైనిక చర్య జరప వలసి ఉంది” అని చెప్పారు. “ఎవరిపైన?” అని దైవప్రవక్త(స) అడగ్గా, “అదిగో వారిపైన” అంటూ బనూ ఖురైజా వాడ వైపు సంజ్ఞ చేశారు. దైవప్రవక్త(స) బనూ ఖురైజా వాడ వరకూ చేరుకున్నారు. (**15** రోజుల సైనిక దిగ్బంధం తరువాత) సాద్ బిన్ ముఆజ్(రజి)ను మధ్యవర్తిగా అంగీకరిస్తూ బనూ ఖురైజా తెగవారు ఆయుధాలు పడవేశారు. దైవప్రవక్త(స) సాద్‌కు నిర్ణయాధికారం ఇచ్చారు. సాద్(రజి) ఇలా అన్నారు: “ఈ వ్యవహారంలో నా తీర్పు ఏమిటంటే, వారిలో ఎంతమంది యుద్ధం చేయగల శక్తి కలిగి ఉన్నారో వారందరినీ హతమార్చాలి. వారి స్త్రీలు పిల్లలను ఖైదీలుగా చేసుకోవాలి. వారి సొమ్ములను, ఆస్తిపాస్తులను (ముస్లింల మధ్య) పంచిపెట్టాలి”.

ఆయిషా(ర.అ) కథనం ప్రకారం సాద్ (రజి) ఈ విధంగా కూడా వేడుకున్నారు : “దేవా! నీ ప్రవక్తను అబద్ధీకరించి ఆయన్ని తన స్వస్థలం నుండి

**వెళ్ళగొట్టిన జాతి వారికి వ్యతిరేకంగా పోరాడాలన్నదే నా ప్రగాఢ వాంఛ. ఇంతకన్నా ప్రియమైనది నాకు మరొకటి లేదు. ఇక మీదట మాకూ- వారికీ మధ్యన యుద్ధాన్ని నీవు పరిసమాప్తం చేశావేమోననిపిస్తోంది. ఒకవేళ ఖురైషులను మార్కొనే అవకాశం గనక మిగిలి ఉంటే, అప్పటివరకూ నన్ను దానికొరకు సజీవంగా ఉంచు. అప్పుడు నేను నీ మార్గంలో యుద్ధం చేస్తాను. ఒకవేళ యుద్ధాల పరంపరను నీవు సమాప్తం చేసి ఉంటే, నా గాయాలను తిరగదోడేలా చేయి. ఆ గాయాలతోనే నాకు మరణం వచ్చేలా చూడు."**

**ఇలా ప్రార్థించిన మీదట, ఆయన ఛాతీపై మానుతున్న గాయం కాస్తా మళ్ళీ పుండుగా మారింది. మస్జిద్‌లో గిఫ్ఫార్ తెగవారి గుడారం కూడా ఉండేది. రక్తం వారి వైపునకు ప్రవహిస్తూ రావటంతో, వారంతా ఆందోళన చెంది 'ఓ గుడారు వారలారా! మీ వద్ద నుండి ఈ రక్తం రావడానికి కారణమేమిటి?' అని అడిగారు. వారంతా తేరుకుని చూస్తే, సాద్(రజి) గాయం నుండి రక్తం స్రవిస్తున్నట్లు కనిపించింది. దాంతోనే ఆయన(రజి) తనువు చాలించారు.[1]**

**27) బరా బిన్ ఆజిబ్(రజి) కథనం : ప్రవక్త మహనీయులు(సఅసమ్) హస్సాన్ బిన్ సాబిత్(రజి)తో, "బహు దైవారాధకుల నిందారోపణలను ఖండించు. జిబ్రీల్(అలైహిస్సలామ్) నీకు సహాయకుడుగా ఉన్నార"ని అన్నారు.**

**(వేరొక సనదు ప్రకారం)**

**బరా బిన్ ఆజిబ్(రజి) తెలిపారు : బనూ ఖురైజా యుద్ధ సందర్భంగా దైవప్రవక్త(సఅసమ్) హస్సాన్ బిన్ సాబిత్‌నుద్దేశించి, "ముష్రిక్కుల చేష్టలను ఖండించు. జిబ్రీల్(అలైహిస్సలామ్) నీకు తోడుగా ఉన్నారు" అని పలికారు.**

---

26-1. హిజ్రత్ అనంతరం ప్రవక్త మహనీయులు(స) యూదులకు చెందిన వివిధ తెగలతోనూ, పరిసర ప్రాంతాలలోనున్న బహు దైవారాధకులతోనూ శాంతి ఒప్పందం చేసుకున్నారు. కాని యూదులు, తమకు అవకాశం దొరికినప్పుడల్లా వెన్నుపోటు పొడిచేవారు. మరీ ముఖ్యంగా కీలకమైన కందక పోరాటం సందర్భంగా బనూ ఖురైజా యూదులు బాహాటంగా ఒప్పందాన్ని ఉల్లంఘించి, ఖురైషులకు సహాయం చేశారు. అందుకే కందక యుద్ధానంతరం, దైవాజ్ఞననుసరించి బనూ ఖురైజాపై సైనిక చర్య జరపటం అనివార్యమైంది. దివ్య ఖుర్‌ఆన్‌లోని అల్ హష్ర్ సూరా ఈ నేపథ్యంలోనే అవతరించింది.

వేరొక ఉల్లేఖనం ప్రకారం సాద్ బిన్ ముఆజ్(రజి) పడుకుని ఉండగా- యాదృచ్ఛికంగా- ఒక మేక వచ్చి ఆయన ఛాతీపై కాలుమోపింది. దాంతో ఆయన గాయం తిరగదోడింది. అదే ఆయన మరణానికి కారణం అయింది.

## అధ్యాయం : 32

# జాతిర్రిఖా యుద్ధం గురించి

ఈ యుద్ధం ముహారిబ్ తెగవారితో జరిగింది. వారు ఖసఫా సంతతి వారు. ఈ ఖసఫా బనూ సాలబాకు చెందినవాడు. అది గిత్‌ఫాన్ తెగలోని ఒక శాఖ. దైవప్రవక్త(స) ఈ యుద్ధ సందర్భంగా 'నఖ్ల్' అనే ప్రదేశంలో విడిది చేశారు. ఈ యుద్ధం ఖైబర్ యుద్ధానంతరం జరిగింది. ఎందుకంటే అబూ మూసా అష్అరీ (రజి) ఖైబర్ యుద్ధం జరిగిన తరువాతనే ఇథియోపియా నుండి మదీనాకు వచ్చారు (జాతిర్రిఖా యుద్ధంలో ఈయన పాల్గొన్నట్లు ఉల్లేఖనాల ద్వారా రూఢీ అవుతోంది).

జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) కథనం: ప్రవక్త మహనీయులు(సఅసమ్) తన సహచరులతో కలసి హిజ్రీ ఏడవ సంవత్సరంలో (లేదా ఏడవ యుద్ధంలో) 'సలాతె ఖౌఫ్' ఆచరించారు- అంటే జాతిర్రిఖా యుద్ధ సందర్భంగా. దైవప్రవక్త(స) ఈ నమాజ్‌ను 'జీఖఅద' స్థలంలో చేశారని అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) చెప్పారు.

ప్రవక్త మహనీయులు(సఅసమ్) ముహారిబ్ యుద్ధ దినాన బనీ సాలబాలో తన సహచరులతో కలసి 'నమాజె ఖౌఫ్' ఆచరించారని జాబిర్ (రజి) అబూ మూసాతో చెప్పారు.

జాబిర్(రజి)కథనం: ప్రవక్త మహనీయులు(సఅసమ్) జాతిర్రిఖా యుద్ధం కొరకు 'నఖ్ల్' అనే ప్రదేశం నుండి బయలుదేరారు. అక్కడ ఆయనకు గిత్ఫాన్ తెగ వారు ఎదురుపడ్డారు. కాని యుద్ధం జరగలేదు. అయితే అవిశ్వాసులు ఏ క్షణం లోనయినా ముస్లింలపై అకస్మాత్తుగా మెరుపు దాడి చేసే ప్రమాదం పొంచి ఉండటం వల్ల దైవప్రవక్త(స) రెండు రకతుల 'నమాజె ఖౌఫ్' చేయించారు- తాను జీఖర్ద్ యుద్ధంలో దైవప్రవక్త(స)తో కలసి పాల్గొన్నట్లు యజీద్ సలమా బిన్ అక్వా (రజి)తో అన్నారు.

**28)** హజ్రత్ అబూ మూసా అష్అరీ(రజి) వివరించారు : మేము ప్రవక్త మహనీయుల(సఅసమ్)తో కలసి ఒక యుద్ధానికి బయలుదేరాము. మేము మొత్తం ఆరుగురం ఉన్నాము. అయితే మాకు వాహనంగా ఒక్కగానొక్క ఒంటె మాత్రమే ఉంది. వంతులవారీగా దానిపై కూర్చునే వారం. సుదీర్ఘ పాదయాత్ర! కఠోరమైన ప్రయాణం!! తత్కారణంగా మా పాదాలపై పగుళ్ళు వచ్చాయి. నా పాదాలకు గాయాలైనాయి. కాలిగోళ్ళు రాలిపోయాయి. అందువల్ల మేము మా పాదాలకు

గుడ్డపేలికలు కట్టుకుని నడవసాగాము. అందుకే ఆ యుద్ధానికి 'గుడ్డ పేలికల యుద్ధం (గజ్వయె జాతిర్రిఖా)' అనే పేరు పడింది.

అబూ మూసా అష్అరీ(రజి) ఈ హదీసును వినిపించడానికైతే వినిపించారు. కాని ఆ విధంగా వ్యక్తం చేయడం ఆయనకు సయితం ఇష్టం లేదు. 'ఈ హదీసును నేను వినిపించవలసింది కాదు' అని అంటూ ఉండేవారు. ఎందుకంటే తమ త్యాగాలను గురించి అలా చెప్పుకోవటం మంచిది కాదని ఆయన తలపోశారు.

**29)** సాలెహ్ బిన్ ఖవ్వాత్, దైవప్రవక్త(సఅసమ్)తో కలసి జాతిర్రిఖా యుద్ధంలో పాల్గొన్న ఒక సహాబీ ఆధారంగా తెలియపరచిన హదీసు - దైవ ప్రవక్త(స) నమాజె ఖౌఫ్ ఆచరించారు (అంటే భయోత్పాతం నెలకొని ఉన్నప్పుడు నమాజ్ చేయించారు). ఆ నమాజ్ ఎలా చేయించబడిందంటే; మొదట ఒక సైనిక సమూహం దైవప్రవక్త(స)ను అనుసరిస్తూ నమాజ్ చేసింది. తన వెనుక నిలబడి నమాజ్ చేస్తున్నవారికి ఆయన(స) ఒక రకఅత్ నమాజ్ చేయించారు. ఆ తరువాత ఆయన(స)లేచి నిలబడ్డారు. ఈ లోగా వెనుకనున్న వారు తమ నమాజ్ను పూర్తి చేసుకుని, శత్రువుకు ఎదురుగా నిలబడ్డారు. ఆ తర్వాత రెండవ జట్టు వచ్చింది. దైవప్రవక్త(స) తాను చేయవలసిన రెండవ రకఅత్ను ఆచరించారు. రుకూ, సజ్దాల తర్వాత ఆయన 'ఖాయిదా'లో కూర్చున్నారు. వెనుకనున్న ముఖ్తదీలు తమ రెండవ రకఅత్ను పూర్తి చేశారు. చివరకు ఆయన(స) వారందరితో కలసి సలామ్ చేశారు.

**30)** సాలెహ్ బిన్ ఖవ్వాత్ నుండి సహ్ల్ బిన్ అబీ హస్మా సంగ్రహించి ఇలా వివరించారు: నమాజె ఖౌఫ్ (భయాందోళనల స్థితిలో చేసే నమాజ్)లో ఇమామ్ ఖిబ్లా వైపునకు తిరిగి నిలబడతాడు. ముస్లింలలోని ఒక జట్టు అతనితో పాటే నమాజ్లో పాల్గొంటుంది. ఆ సమయంలో ముస్లింలలోని రెండవ జట్టు శత్రువుకు ఎదురుగా నిలబడి ఉంటుంది. వారు శత్రువు వైపే ముఖం త్రిప్పి ఉంటారు. ఇమామ్ తన వెనుకనున్న జట్టుకు ఒక రకఅత్ నమాజ్ చేయిస్తాడు (ఒక రకఅత్ పూర్తి కాగానే ఈ ముఖ్తదీలు నిలబడి) అదే స్థలంలో ఇమామ్ లేకుండానే- ఒక రుకూ, రెండు సజ్దాలతో-రెండవ రకఅత్ను పూర్తి చేసుకుంటారు. తరువాత వారు శత్రువును నిలువరించడానికి వెళ్ళిపోతారు. ఆ తరువాత ఇమామ్ రెండవ జట్టుకు ఒక రకఅత్ నమాజ్ చేయిస్తాడు. ఆ విధంగా ఇమామ్కు రెండు

రకతులు లభిస్తాయి. కాగా; ఆ రెండవ జట్టు- ఒక రుకూ, రెండు సజ్దాలతో- రెండవ రకఅత్‌ను ఆచరిస్తుంది.

**31)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఇలా తెలిపారు: "నేను నజ్ద్ ప్రాంతం వైపు (గిత్ఫాన్ తెగ వారిని ప్రతిఘటించడానికి) దైవప్రవక్త (సఅసమ్)తో కలసి వెళ్ళాను. అక్కడ మేము శత్రువును మార్కొన్నాము. వరుసలు తీరి నిలబడ్డాము."

**32)** సాలిమ్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ తన తండ్రి ఆధారంగా ఈ విధంగా తెలిపారు: ప్రవక్త మహనీయులు(సఅసమ్) భయాందోళనల స్థితిలో చేసే నమాజ్‌ను మొదట ఒక బృందంతో ఆరంభించారు. ఆ సమయంలో రెండవ బృందం శత్రువు వైపునకు తిరిగి నిలబడి ఉంది. మొదట నమాజ్ చేసిన బృందం శత్రువును నిలువరించడానికి వెళ్ళగా, అప్పటివరకూ నమాజ్ చేయని రెండవ బృందం వచ్చి నిలబడింది. దైవప్రవక్త(స) ఆ రెండవ బృందానికి కూడా ఒక రకఅత్ నమాజ్ చేయించారు. పిదప ఆయన(స) సలామ్ చేశారు. అప్పుడు వెనుక నున్న ఆ ముఖ్తదీలు నిలబడి తమ రెండవ రకఅత్‌ను నెరవేర్చారు.

**33)** తాను ప్రవక్త మహనీయుల(సఅసమ్)తో కలసి నజ్ద్ పరిసర ప్రాంతాలలో యుద్ధానికి వెళ్ళానని జాబిర్(రజి) చెప్పారు.

**34)** మహనీయ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి), తాను దైవప్రవక్త (సఅసమ్)తో కలసి నజ్ద్ క్షేత్రానికి యుద్ధం చేయడానికి వెళ్ళినట్లు తెలిపారు. యుద్ధం నుండి దైవప్రవక్త(స) తిరిగి వస్తున్నప్పుడు ఆయన కూడా తిరిగి రాసాగారు. వారు ఒక లోయ వద్దకు చేరుకునేసరికి మధ్యాహ్నం విశ్రాంతి తీసుకునే వేళ అయింది. ఆ లోయలో తుమ్మచెట్లు ఉన్నాయి. దైవప్రవక్త(స) అక్కడే విడిది చేశారు. ప్రవక్త సహచరులు కూడా చెట్ల నీడ కోసం ఆ లోయలో నలుమూలలా విస్తరించారు. దైవప్రవక్త(స) కూడా ఒక తుమ్మ చెట్టు క్రింద మేను వాల్చారు. తన ఖడ్గాన్ని ఆ చెట్టుకు వ్రేలాడదీశారు. జాబిర్ (రజి) ఇలా అన్నారు : మేము నిద్రలోకి జారుకున్న కొద్దిసేపటికే దైవప్రవక్త(స) మమ్మల్ని కేకేసి పిలిచారు. మేము ఆయన(స) సన్నిధికి చేరుకునే సమయానికి ఒక పల్లెటూరి వ్యక్తి ఆయన(స) ఎదురుగా కూర్చుని ఉన్నాడు. "ఈ వ్యక్తి నా ఖడ్గంతో నా మీదే దాడి చేయ బోయాడు. అప్పుడే నాకు మెలకువ వచ్చింది. నా ఖడ్గం ఇతని స్వాధీనంలో

ఉంది. 'ఈ రోజు నా బారి నుండి నిన్ను రక్షించేవాడెవడు?' అని ఇతనడిగాడు. నేను 'అల్లాహ్' అన్నాను. అంతే, అతను ఇలా చతికిలబడ్డాడు"అని దైవప్రవక్త(స) చెప్పారు. దైవప్రవక్త(స) ఆ పల్లెటూరి వ్యక్తిని శిక్షించలేదు.

అబూ సలమా బిన్ అబ్దుర్రహ్మాన్ గారు మహనీయ జాబిర్(రజి)నుండి ఇలా ఉటంకించారు: మేము దైవప్రవక్త(సఅసమ్)తోపాటు జాతిర్రిఖా యుద్ధానికి వెళ్ళాము. మేము ఒక చోటికి చేరుకున్నప్పుడు దట్టమైన నీడనిచ్చే వృక్షం ఒకటి కనిపించింది. మేము ఆ వృక్షాన్ని దైవప్రవక్త(స) విశ్రాంతి కొరకు ప్రత్యేకించాము. (అందరూ విశ్రమిస్తున్న సమయంలో) ఒక బహు దైవారాధకుడు వచ్చి చెట్టుకు వ్రేలాడుతున్న ఖడ్గాన్ని స్వాధీనపరచుకుని, దైవప్రవక్త(స)పై దాడి చేయడానికి సన్నద్ధడయ్యాడు. 'నువ్వు నాకు భయపడుతున్నావా?' అని అతనడిగాడు. దానికి దైవప్రవక్త(స) "లేదు" అని చెప్పారు. 'ఈ రోజు నా నుండి నిన్ను రక్షించే వాడెవడు?' అని అతనడిగాడు. దానికి ఆయన "అల్లాహ్" అని పలికారు. తరువాత సహచర మాన్యులు ఆ వ్యక్తిని మందలించారు. నమాజ్ కొరకు తక్బీర్ చెప్పబడింది. అప్పుడు దైవప్రవక్త(స) మొదట ఒక జట్టుకు రెండు రకతుల 'సలాతుల్ ఖౌఫ్' చేయించారు. మొదటి జట్టు అక్కడి నుండి నిష్క్రమించగానే, ఆయన రెండవ జట్టుకు కూడా రెండు రకతుల నమాజ్ చేయించారు. ఆ విధంగా దైవప్రవక్త(స) నాలుగు రకతుల నమాజ్ చేసినట్లయింది. వెనుకనున్న ముఖ్తదీలకు మాత్రం రెండేసి రకతులు చొప్పునే లభించాయి. ఆ సందర్భంగా దైవప్రవక్త(స)పై దాడి చేయబోయిన వ్యక్తి పేరు గౌరస్ బిన్ హారిస్. దైవప్రవక్త ఆ సందర్భంగా ముహారిబ్ ఖసఫా తెగతో యుద్ధం చేశారు.

అబూ జుబైర్ గారు జాబిర్(రజి)తో ఇలా అన్నారు : మేము దైవప్రవక్త (సఅసమ్)తోపాటు 'నఖ్ల్' ప్రదేశంలో ఉండగా, ఆయన(స) మాకు 'నమాజె ఖౌఫ్' చేయించారు. తాను దైవప్రవక్త(స)తోపాటు నజ్ద్ క్షేత్రంలో నమాజ్ ఖౌఫ్ ఆచరించానని మహనీయ అబూ హురైరా(రజి) చెప్పారు. అబూ హురైరా (రజి) మొట్టమొదటిసారి దైవప్రవక్త(స) సేవలో ఖైబర్ యుద్ధ సందర్భంగా హాజరయ్యా రన్నది గమనార్హం.[1]

---

34-1. దైవప్రవక్త(స) ఒక ఖర్జూర చెట్ల ప్రాంతంలో 'ఖసఫా' అనే తెగవారిపై యుద్ధం చేశారు. ఆ యుద్ధం నుండి తిరిగి వస్తూ మధ్యాహ్నం ఒక చోట విశ్రాంతి కొరకు ఆగారు. సహచరమాన్యులంతా చెట్ల నీడలను ఆశ్రయించారు. ఆ సమయంలో గౌరస్

## అధ్యాయం : 33

# బనీ ముస్తలఖ్ యుద్ధం గురించి

**బనూ ఖుజాఅ తెగవారితో జరిగిన యుద్ధమది. దానికి గల మరో పేరు 'మురైసీ యుద్ధం.'**

**ఈ యుద్ధం హిజ్రీ 6వ సంవత్సరంలో జరిగిందని ఇబ్నె ఇస్‌హాఖ్ తెలిపారు. మూసా బిన్ ఉఖ్‌బా ప్రకారం ఇది హిజ్రీ 4వ యేట జరిగింది. నోమాన్ బిన్ రాషిద్ గారు జుహ్రీ నుండి ఉటంకించిన దాని ప్రకారం 'ఇఫ్క్ సంఘటన' మురైసీ యుద్ధ సందర్భంగానే ఎదురయింది.**

**35) అబూ ముహైరీజ్ తెలిపారు: నేను మస్జిద్‌లో ప్రవేశించగానే మస్జిద్‌లో అబూ సయీద్ ఖుద్రీ (రజి) కనిపించారు. నేను ఆయన దగ్గర కూర్చుని, 'అజ్ల్' గురించి ఆయన్ని ప్రశ్నించాను. దానికి ఆయన ఇలా వివరించారు: మేము ప్రవక్త మహనీయుల(సఅసమ్)తో కలసి బనీ ముస్తలఖ్ యుద్ధానికి బయలుదేరాము. ఆ యుద్ధంలో మాకు కొంతమంది అరబ్బు ఖైదీలు (యుద్ధప్రాప్తిగా) చేజిక్కారు. వారిలో స్త్రీలు కూడా ఉన్నారు. మరి ఆ ప్రయాణంలో మాలో కామ వాంఛ తీవ్రతరమైంది. స్త్రీ పొందు లేకుండా ఉండటం మాకు దుర్లభం అయిపోయింది. అదే సమయంలో– మరోవైపు మేము 'అజ్ల్' పద్ధతిని పాటించగోరాము. పిల్లలు పుట్టకూడదన్న ఉద్దేశంతో మేము ఆ పద్ధతిని అనుసరించదలిచాము. కాని మా మధ్యన దైవ ప్రవక్త(స) ఉండగా, ఆయన్ని సంప్రదించకుండా 'అజ్ల్' పద్ధతిని పాటించటం సమంజసం కాదు కదా! అందుకే ఈ విషయమై మేము దైవప్రవక్త(స)ను అడగ్గా, ఆయన(స) ఇలా అన్నారు: "మీరు 'అజ్ల్'ను (పాటించినా) పాటించకపోయినా ముంచుకు వచ్చిందేమీ లేదు. ఎందుకంటే ప్రళయదినం వరకూ పుట్టవలసిన ప్రాణి తప్పకుండా పుడుతుంది."[1]**

---

బిన్ హారిస్ అనే వ్యక్తి ఖడ్గం చేబూని దైవప్రవక్త తలగడ దగ్గర నిలబడ్డాడు. కాని తన ప్రయత్నంలో విఫలుడైన మీదట ఆ వ్యక్తి ప్రవక్త(స) సమక్షంలో నిర్యుద్ధ సంధి ప్రతిపాదన చేశాడు. దైవప్రవక్త(స)తో యుద్ధం చేసేవారికి సహాయం చేయనని కూడా మాటిచ్చాడు. దైవప్రవక్త(స) ఆ వ్యక్తిని మన్నించి వదలిపెట్టేశారు. అతను తన తెగ వారి వద్దకు వెళ్ళి 'నేను ఈ రోజు ఒక గొప్ప వ్యక్తిని కలుసుకుని వచ్చాన'న్నాడు.

వాఖిదీ ప్రకారం; తరువాత ఆ వ్యక్తి ముస్లింగా ధర్మపరివర్తన చెందాడు. అతని ద్వారా చాలామంది సన్మార్గం పొందారు.

**36) మహనీయ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి) తెలిపారు: మేము దైవ ప్రవక్త(స)తోపాటే యుద్ధం చేయడానికి నజ్ద్ క్షేత్రం వైపునకు పయనమయ్యాము. మధ్యాహ్న సమయానికి ఆయన(స) ఒక అడవి ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ తుమ్మ చెట్లు ఎక్కువగా ఉన్నాయి. ఆయన(స) ఒక దట్టమైన వృక్షం నీడలో విశ్ర మించారు. తన ఖడ్గాన్ని చెట్టుకొమ్మకు వ్రేలాడదీశారు. సహచరమాన్యులు కూడా చెట్ల నీడల్లో సేద దీరడానికి నలువైపులా వెళ్ళిపోయారు. మేము విశ్రమించే ప్రయ త్నంలో ఉండగానే దైవప్రవక్త(స) మమ్మల్ని బిగ్గరగా పిలిచారు. మేము ఆయన (స) దగ్గరకు వచ్చే సమయానికి ఆయనకు ఎదురుగా ఒక పల్లెటూరి బైతు కూర్చుని ఉన్నాడు. దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "ఈ వ్యక్తి నన్ను సమీపించే సమయానికే నేను నిద్రలో జారుకున్నాను. ఇతను నా ఖడ్గాన్ని స్వాధీనం చేసుకున్నాడు. అంత లోనే నాకు మెలకువ వచ్చింది. ఇతను నా ఖడ్గాన్ని పట్టుకుని నా తల వద్ద నిలబడి ఉన్నాడు. 'ఈ రోజు నా నుండి నిన్ను రక్షించేవాడెవడు?' అని గద్దించాడు. "అల్లాహ్" అని నేననగానే, ఖడ్గాన్ని ఒరలో పెట్టేసి, ఇదిగో ఇలా కూర్చున్నాడు- కాని దైవప్రవక్త(స) ఆ పల్లెటూరి బైతును దండించ లేదు.**

## అధ్యాయం : 34
# అన్మార్ యుద్ధం గురించి

**37) మహనీయ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) తెలిపారు: నేను అన్మార్ యుద్ధ సందర్భంగా దైవప్రవక్త(సఅసమ్)ను చూశాను. ఆయన ఒంటెపై స్వారీ అయి ఉన్న స్థితిలోనే నఫిల్ నమాజ్ చేస్తూ ఉన్నారు. ఆ సమయంలో ఆయన(స) తూరుపు దిక్కుకు తిరిగి ఉన్నారు.**

---

35-1. భార్యతో సమాగమం జరుపుతున్నప్పుడు, లైంగికవాంఛ పరాకాష్టకు చేరి వీర్య స్ఖలనం జరగబోతుందని అనిపించగానే పురుషాంగాన్ని స్త్రీ యోనిలోనుంచి బయటకు తీసెయ్యడాన్నే 'అజ్ల్' అంటారు. ఆ విధంగా స్త్రీ గర్భవతి కాకుండా జాగ్రత్తపడటం అన్నమాట. కుటుంబ నియంత్రణ పద్ధతుల్లో ఇది కూడా ఒకటి. అయితే ఆలుమగలు ఎన్ని కట్టుదిట్టమైన పద్ధతుల్ని అనుసరించినా ఎప్పుడో ఒకసారి 'విఫలం' అవటం తథ్యం. ఆ విధంగా పుట్టబోయే శిశువును వారు ఈ లోకంలో పాదం మోపకుండా అడ్డుకోలేరు.

## అధ్యాయం : 35

# అపనింద (ఇఫ్క్) సంఘటన

**38)** ఉర్వా బిన్ జుబైర్, సయీద్ బిన్ ముసయ్యిబ్, అల్ఖమా బిన్ వక్కాస్, ఉబైదుల్లాహ్ బిన్ అబ్దుల్లాహ్- ఈ నలుగురు ప్రముఖుల ద్వారా దైవప్రవక్త పవిత్ర సతీమణి హజ్రత్ ఆయిషా(ర.అ)పై మోపబడిన అపనింద (ఇఫ్క్ సంఘటన)కు సంబంధించిన వివరాలు కూలంకషంగా మనకు అందాయి. సంఘటనలోని ఒక్కో భాగాన్ని ఒకరు ఇంకొకరికన్నా బాగా విశదీకరించినప్పటికీ మొత్తానికి ప్రతి భాగం ఇతరులు చెప్పిన దానిని నిజమని ధ్రువపరుస్తోంది. వీరు నలుగురూ ఉటంకించిన దాని ప్రకారం అమ్మ ఆయిషా(ర.అ) ఇలా వివరించారు :

ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఎప్పుడు ప్రయాణ సంకల్పం చేసుకున్నా తన సతీమణుల పేరిట చీటీలు వేసి, ఎవరి పేరు వస్తే వారిని తన ప్రయాణంలో తోడుగా ఉంచటం ఆనవాయితీ. ఒక యుద్ధ ప్రయాణ సందర్భంగా ఆయన(స) చీటీలు వేసినప్పుడు, నా పేరు వచ్చింది. అందువల్ల నేను దైవప్రవక్త(స)తోపాటు ప్రయాణానికి బయలుదేరాను. పరదా ఆజ్ఞ వచ్చిన తరువాత జరిగిన ప్రయాణ మది. అందువల్ల నన్ను ఒంటె తొట్లతో సహా లేపి- ఒంటెపై ఉంచి- స్వారీ చేయిం చటం జరిగేది. తొట్లతో సహా దింపటం జరిగేది. ఆ విధంగా మేము ప్రయాణానికి బయలుదేరాము. యుద్ధ లక్ష్యం నెరవేరిన తరువాత దైవప్రవక్త(స) తిరుగు ప్రయాణమయ్యారు. మదీనా నగరం కొంత దూరాన ఉండగా మేము ఒకచోట విడిది చేశాము. రాత్రిపూటే అక్కడి నుండి బయలుదేరాలని దైవప్రవక్త(స) ప్రకటన చేయించారు. ప్రకటన విన్నంతనే నేను లేచి బిడారు ఆగి ఉన్న స్థలానికి కొంత దూరం వెళ్ళి, కాలకృత్యాలు తీర్చుకుని, నా వాహనం ఉన్న చోటికి తిరిగి వచ్చాను. అక్కడికి చేరుకునే సమయానికి 'జుఫార్' (యమన్‌లోని ఒక ప్రదేశం పేరు)లో తయారు చేయబడిన నా కంఠహారం కనిపించలేదు. నేను మళ్ళీ ఆ హారాన్ని వెతుక్కుంటూ వెళ్ళాను. ఈ అన్వేషణలో ఆలస్యం అయిపోయింది. ఈ లోగా నేను కూర్చునే తొట్లను లేపి ఒంటెపై ఉంచేవారు వచ్చి నా ఒంటెపై ఉంచారు.

ఆ రోజుల్లో స్త్రీలు తేలిగ్గా, బక్కపలచగా ఉండేవారు. వారి శరీరాలపై ఎక్కువ మాంసం ఉండేది కాదు. ఎందుకంటే వారికి ఆహారం స్వల్పంగానే లభ్య మయ్యేది. అందువల్ల తొట్లను లేపే సేవకులు దానిని లేపినప్పుడు, దాని బరువు

విషయంలో వారు వ్యత్యాసాన్ని తెలుసుకోలేకపోయారు. అదీగాక ఆ రోజుల్లో నేను నవ యువతిని. ఆ విధంగా వారు ఒంటెను లేపి ప్రయాణమైపోయారు. బిడారు అక్కడి నుండి వెళ్ళాక గాని నా కంఠహారం దొరకలేదు. నేను నా గుడారం వద్దకు వచ్చే సమయానికి అక్కడ ఎవరూ లేరు. పిలిచేవారూ లేరు. పిలుపునకు జవాబిచ్చే వారూ లేరు. అందుకే నేను నా గుడారం వద్దకు వచ్చి ఆగాను. నేను లేనన్న సంగతి తెలియగానే నన్ను తీసుకెళ్ళడానికి వారు తప్పకుండా వస్తారని భావించి, అక్కడే కూర్చున్నాను. ఆ నిరీక్షణలోనే నాకు నిద్రపట్టేసింది.

సఫ్వాన్ బిన్ ముఅత్తల్ సులమీ(రజి) బిడారు వెనుక వచ్చేవారు. ఎందు కంటే సైనికులు మరిచిపోయిన వస్తువులను సేకరించే బాధ్యత ఆయనకు అప్పగించ బడింది. ఆయన నిద్రిస్తున్న ఒక మనిషి నీడను చూసి నన్ను సమీపించారు. ఆయన నన్ను గుర్తుపట్టారు. పరదా ఆజ్ఞ అవతరించక పూర్వం ఆయన నన్ను చూసి ఉన్నారు. నన్ను గుర్తుపట్టగానే ఇన్నాలిల్లాహి... పఠించసాగారు. ఆ శబ్దానికి నాకు మెలకువ వచ్చింది. తక్షణం నేను నా దుప్పటిని ముఖంపై కప్పుకున్నాను. అల్లాహ్ సాక్షిగా! నేనాయనతో ఒక్క మాట కూడా మాట్లాడలేదు. 'ఇన్నాలిల్లాహి...' అనే మాట తప్ప మరొకటి నా నోట వెలువడలేదు. ఆయన ఒంటె దిగి, దాని ముంగాలిని మడతపెట్టి కూర్చోబెట్టారు. నేను వెంటనే లేచి ఒంటెపై స్వారీ అయ్యాను. ఆయన ఒంటె పగ్గం పట్టుకుని– ముందుండి– నడక సాగించారు. మేము పయన బృందాన్ని చేరుకునే సమయానికి మధ్యాహ్నం అయింది. పయన బృందం విడిది చేసి ఉంది.

విశ్వాసుల మాత ఇలా అన్నారు: జరిగింది మాత్రం ఇది. అయితే నాశన మవవలసినవాడు నాశనమయ్యాడు. ఈ అపనిందకు సారథ్యం వహించినవాడు (కపటాగ్రేసరుడు) అబ్దుల్లాహ్ బిన్ ఉబై. అతను ఈ అభాండం గురించి చర్చించే వాడని, తన సమావేశాలలో ఈ సంఘటనను ప్రస్తావించేవాడని, దానిని ధ్రువ పరిచే వాడని, చాలా శ్రద్ధతో వినేవాడని, దీనిని వ్యాపింపజేయడానికి కూపీలు లాగేవాడని ఉర్వా చెప్పారు– ఈ అపనిందనలో పాల్గొన్నవారిలో చాలామంది ఉన్నప్పటికీ ఉర్వా తన సనదులో మిస్తహ్ బిన్ ఉసాసా, హస్సాన్ బిన్ సాబిత్, హమ్నా బిన్తె జహష్ తప్ప వేరితరుల పేర్లు ప్రస్తావించలేదు. ఈ అపనిందను మోపినవారు చాలామంది ఉన్నారని అల్లాహ్ స్వయంగా సెలవిచ్చాడు. కాని ఈ వ్యవహారంలో అందరికన్నా ఎక్కువగా పాపం పంచుకున్నవాడు అబ్దుల్లాహ్ బిన్

ఉబై బిన్ సలూల్. ఉర్వా ఇలా అన్నారు: అయినప్పటికీ అమ్మ ఆయిషా(ర.అ) ఈ పాపంలో పాలుపంచుకున్న వారి గురించి ఆచితూచి మాట్లాడేవారు. మరీ ముఖ్యంగా హస్సాన్ బిన్ సాబిత్(రజి)ను గురించి ఎవరయినా చెడుగా ప్రస్తావిస్తే, ఆమె వారించేవారు. "(అయ్యో! ఆయన గురించి అలా అనకండి). నా తండ్రి, నా తండ్రికి తండ్రి, నా గౌరవం, ముహమ్మద్(స) గౌరవ రక్షణ నిమిత్తం 'డాలు'గా ఉంటాయి అని కవిత్వం చెప్పింది హస్సానే కదూ!" అనేవారు.

ఆయిషా(ర.అ) ఆ సంఘటనను గురించి ఇలా వివరించారు : తరువాత మేము మదీనా చేరుకున్నాము. ఇంటికి చేరుకున్న తరువాత నేను అస్వస్థతకు గురయ్యాను. దాదాపు నెల రోజుల వరకూ అనారోగ్యంతో మంచం పట్టాను. ఈ లోగా అపనిందను మోపినవారు ప్రజల మధ్యన ఏవేవో చెప్పుకున్నారు కాని నాకు అదేమీ అర్థం కాలేదు. కాకపోతే ఒక విషయం నన్ను బాగా సంశయానికి లోను చేసేది. అదేమిటంటే లోగడ నాకు జబ్బు చేసినప్పుడు, దైవప్రవక్త(స) నా ఆరోగ్యం పట్ల చూపినంత శ్రద్ధ ఈసారి చూపటం లేదు. ఆయన ఇంట్లోకి వచ్చి నప్పుడు సలామ్ చేసి, 'ఆరోగ్యం ఎలా ఉంది?' అని మాత్రం అడిగేవారు. ప్రవక్త మహనీయుల(స) వారి ఈ వైఖరి నన్ను అనుమానంలో పడవేసేది. కాని (నలు వైపులా) వ్యాపించిన కీడు గురించి నాకేమీ తెలీదు.

అయితే ఆరోగ్యం కాస్త కుదుట పడిన తరువాత నేను ఉమ్మె మిస్తహ్‌తో కలసి (మదీనా జనావాసానికి దూరంగా ఉన్న) 'మనాసీ' ప్రదేశానికి వెళ్ళాను. అది మా ఆడవాళ్ళకు బహిర్భూమిగా ఉండేది. కేవలం రాత్రివేళల్లోనే మేము అక్కడికి వెళ్ళేవారం. మరుగుదొడ్లు మా ఇండ్లకు దగ్గరలో నిర్మించబడక పూర్వం జరిగిన సంఘటన ఇది- ఆ కాలంలో మేము కాలకృత్యాలు తీర్చుకోవటానికి ఊరి బయటికి వెళ్ళేవారము. ఇది మాకు ఇబ్బందికరంగానే ఉండేది. నేనూ, ఉమ్మె మిస్తహ్- ఇద్దరం కలసి బహిర్ ప్రదేశానికి వెళ్ళాము. ఉమ్మె మిస్తహ్ ఎవరో కాదు, ఆమె అబూ రహమ్ బిన్ ముత్తలిబ్ బిన్ అబ్దె మునాఫ్ కూతురు. ఆమె తల్లి సఖ్ర్ బిన్ ఆమిర్ కుమార్తె. ఆమె అబూబక్ర్ సిద్దీఖ్(రజి)కు పినతల్లి అవుతుంది. ఆమె కుమారుడే మిస్తహ్ బిన్ ఉసాసా(రజి).

నేనూ, ఉమ్మె మిస్తహ్ కాలకృత్యాలు తీర్చుకున్న మీదట ఇంటికి తిరిగి వస్తుం డగా ఉమ్మె మిస్తహ్ తన దుప్పట్లో చిక్కుబడ్డారు. అంతే, ఆ క్షణంలో ఆమె నోట 'మిస్తాహ్ పాడుగాను!' అన్న మాట వెలువడింది. దానికి నేను, 'అయ్యో! అలా

అంటారేమిటి? బద్ర్ సంగ్రామంలో సయితం పాల్గొన్న సహాబీ గురించి అలా చెడుగా మాట్లాడవచ్చునా?' అన్నాను. దానికి ఆమె '(అయ్యో! మహాతల్లి!) నీ గురించి మిస్తహ్ ఏమంటున్నాడో నీవు వినలేదా?' అన్నది. 'ఏమన్నారేమిటి?' అని నేను అడగ్గా, ఆమె వివరంగా చెప్పింది. తరువాత ఆమె, అపనింద మోపిన వారి మాటల్ని కూడా వినిపించింది. ఆ మాటలు విన్న క్షణం నుంచి నా జబ్బు మరింత తీవ్రతరమయింది. నేను ఇంటికి వెళ్ళిన తర్వాత దైవప్రవక్త(స) నా కుటీరానికి వచ్చి సలామ్ చేశారు. ఆరోగ్యం ఎలా ఉంది? అని అడిగారు. 'కొన్నాళ్ళపాటు నా తల్లిదండ్రుల వద్దకు వెళ్ళగోరుతున్నాను. అనుమతి ప్రదానం చేయండి' అని కోరాను. ఈ అపనింద సంగతి తల్లిదండ్రులకు తెలియపరిచి నిజానిజాల గురించి కనుక్కోవాలనుకున్నాను. దైవప్రవక్త(స) నాకు అనుమతి ప్రదానం చేశారు. మా అమ్మ దగ్గరకు వెళ్ళి నగరంలో వ్యాపిస్తున్న ఈ వదంతుల గురించి దర్యాప్తు చేశాను. 'అమ్మా! దుఃఖించకు. దైవసాక్షి! ఒక అందగత్తె అగు స్త్రీని ఒక భర్త అమితంగా ప్రేమిస్తుండగా, ఆమెకు సవతులు కూడా ఉంటే ఆమెపై ఇలాంటి నీలాపనిందలు మోపబడకుండా ఉండటం, ఆమె తప్పులెన్నకుండా ఉండటం అనేది బహు అరుదు' అంది అమ్మ. 'సుబ్హానల్లాహ్! (ఈ సంఘటనతో నా సవతులకు సంబంధం ఏమిటి?) ఈ చర్చ జరుగుతున్నది బయట ప్రజల్లో కదా!' అన్నాను.

ఆమె ఇంకా ఇలా అన్నారు: ఆ క్షణం నుంచీ నా ఏడుపు ఆగలేదు. రాత్రంతా ఏడుస్తూనే ఉన్నాను. తెల్లవారింది. కాని నా కన్నీటి ప్రవాహం ఆగలేదు. నిద్ర కూడా పట్టడం లేదు.

మరోవైపు దైవప్రవక్త(స) అలీ బిన్ అబీ తాలిబ్(రజి), ఉసామా బిన్ జైద్ (రజి)లను పిలిపించి, తన భార్యను తన నుండి వేరుపరిచే విషయమై సంప్రతించారు. ఎందుకంటే అప్పటివరకూ ఈ వ్యవహారం గురించి ఆయన(స)పై వహీ (దైవవాణి) అవతరించలేదు. ఉసామా బిన్ జైద్(రజి) తనకు తెలిసిన దానిని దైవ ప్రవక్త(స)కు చెప్పారు. '(దైవప్రవక్తా!) నేను మీ సతీమణిలో మేలు తప్ప మరొకటి చూడలేద'ని సాక్ష్యమిచ్చారు ఉసామా. కాని మహనీయ అలీ(రజి) ఇలా అన్నారు : 'దైవప్రవక్తా! అల్లాహ్ మీపై ఎలాంటి ఇబ్బందినీ ఉంచలేదు. మీరు కోరుకుంటే లోకంలో ఇంకా చాలామంది స్త్రీలు ఉన్నారు'. తరువాత దైవప్రవక్త(స) బరీరా (ర.అ)ను పిలిచి, దర్యాప్తు చేశారు. "ఆయిషా (ర.అ)పై అనుమానం వచ్చే విషయం ఏదయినా నీవు గమనించావా?" అని అడిగారు. దానికి ఆమె, 'మీకు

సత్యం ఇచ్చి పంపిన వాని సాక్షిగా! నేనామెలో చెడు విషయమేదీ చూడలేదు. కాకపోతే చిన్న పిల్ల కదా! పిండి నానబెట్టి నిద్రపోతుంది. అంతలో మేక వచ్చి ఆ పిండి తినేసిపోతుంది' అని చెప్పింది.

హజ్రత్ ఆయిషా(ర.అ) ఇంకా ఇలా అన్నారు: ఆ రోజు దైవప్రవక్త(స) తన సహచరమాన్యులనుద్దేశించి ప్రసంగించారు. వేదికనెక్కి (కపటి) అబ్దుల్లాహ్ బిన్ ఉబై వైఖరి గురించి ప్రస్తావించారు. "ఓ ముస్లింలారా! ఏ వ్యక్తి ఆగడాలైతే ఇప్పుడు నా భార్య వ్యవహారం వరకూ చేరాయో అతని బారి నుండి నాకు తోడ్పడేవారెవరు? దైవసాక్షిగా! నేను నా భార్యలో మంచి తప్ప మరొకటి ఎరుగను. వారు ఏ వ్యక్తి గురించి చెబుతున్నారో (అమ్మ ఆయిషా-ర.అ-ను ఒంటెపై ఎక్కించుకుని వచ్చిన సఫ్వాన్ బిన్ ముఅత్తల్-రజి) అతనిలో కూడా నేను మంచి తప్ప మరొకటి ఎరుగను. అతనెప్పుడు మా ఇంటికి వచ్చినా నాతోపాటే వచ్చాడు" అని చెప్పారు.

ఈ ప్రసంగం విని బనీ అష్హల్ తెగ సోదరుడు సాద్ బిన్ ముఆజ్(రజి) లేచి, 'దైవప్రవక్తా! నేను మీకు తోడ్పడతాను. ఒకవేళ అతను ఔస్ తెగవాడై ఉంటే నేనతని మెడ నరికేస్తాను. ఒకవేళ అతను మా తెగవాడై ఉంటే, మీరేమని ఆజ్ఞాపిస్తే దానిని మేము శిరసావహిస్తాము' అన్నారు. ఇది విని ఖజ్రజ్ తెగకు చెందిన ఓ వ్యక్తి లేచి నిలబడ్డారు. హస్సాన్ తల్లి ఆ వ్యక్తికి వరుసకు చెల్లి అవు తుంది. అంటే సాద్ బిన్ ఉబాదా(రజి)! ఆయన ఖజ్రజ్ తెగ నాయకుడు. అంత వరకూ ఆయన ఎంతో సౌజన్యశీలుడుగా, నిజాయితీపరుడుగా ప్రసిద్ధి చెందారు. కాని ఆ క్షణంలో ఆయనపై వర్గ తెగల దురభిమానం ఆధిపత్యం వహించింది. ఆయన సాద్ బిన్ ముఆజ్(రజి)ను ఉద్దేశించి, 'దైవసాక్షి! నీవు అబద్ధీకుడవు. నీవు అతనిని చంపలేవు. నీలో అంత దమ్ము లేదు లే. ఒకవేళ ఆ వ్యక్తి నీ తెగవాడై ఉంటే, అతని హత్య ఊసి కూడా ఎత్తి ఉండేవాడవు కావు' అన్నారు. దాని మీదట సాద్ బిన్ ముఆజ్ బాబాయి కుమారుడైన ఉసైద్ బిన్ హుజైర్ లేచి, సాద్ బిన్ ఉబాదాతో, 'అల్లాహ్ సాక్షిగా! నీవు అబద్ధీకుడవు. మేమతన్ని అవశ్యంగా కడతేరు స్తాము. నీవు కూడా ఒక కపటివి అనటంలో సందేహం లేదు. ఎందుకంటే నీవు మునాఫిక్‌ల కొమ్ము కాస్తున్నావు' అన్నారు. అంతే ఔస్- ఖజ్రజ్ తెగల మధ్య వాతావరణం వేడెక్కింది. పరస్పరం కత్తులు దూసుకుంటారేమో అన్నట్టుంది

పరిస్థితి. అప్పటివరకూ వేదికపైనే ఉన్న దైవప్రవక్త(స) అందరినీ శాంతపరిచారు. దాంతో అందరూ నిశ్శబ్దంగా ఉండిపోయారు. దైవప్రవక్త(స) కూడా అక్కడినుండి నిష్క్రమించారు.

హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు: ఆ రోజంతా నేను ఏడుస్తూనే గడిపాను. నా కన్నీళ్ళు ఆగలేదు. కునుకు పట్టలేదు. ఏడ్చి ఏడ్చి నా గుండె బద్ధలయ్యేలా ఉంది. ఉదయం పూట నా తల్లిదండ్రులు నా దగ్గరకు వచ్చారు. అప్పటికి రెండు రాత్రులు, ఒక పగలు ఏడ్పులోనే గడిచిపోయాయి. అంతలో ఒక అన్సార్ మహిళ నా దగ్గరకు రావడానికి అనుమతి కోరింది. ఆమె కూడా నాతోపాటు కూర్చుని ఏడ్వసాగింది. మేము ఆ స్థితిలో ఉండగానే దైవప్రవక్త(స) విచ్చేశారు. సలామ్ చేసి కూర్చున్నారు. నా మీద అపనింద మోపబడినప్పటి నుండి దైవప్రవక్త(స) నా దగ్గర కూర్చోలేదు. నెల రోజులు పూర్తిగా గడిచిపోయాయి. నా సౌశీల్యం గురించి 'వహీ' ద్వారా ఆయన(స)కు సమాచారం ఏదీ అందలేదు. నా దగ్గర కూర్చున్న తర్వాత ఆయన(స) సాక్ష్య వచనం (కలిమయె షహాదా) పఠించి, ఇలా అన్నారు: "అమ్మాబాద్! ఆయిషా! నీ గురించి నాకు ఈ విధమైన సమాచారం అందింది. నీవు గనక ఈ వ్యవహారంలో నిర్దోషివి, శీలవతివి అయి వుంటే, అల్లాహ్ ఖుద్దుగా నీ సౌశీల్యాన్ని ప్రకటిస్తాడు. కాని ఒకవేళ నీవు ఏదయినా పాప సంకల్పం చేసుకుని ఉంటే క్షమాపణకై అల్లాహ్‌ను ప్రార్థించు. ఆయన సన్నిధిలో పశ్చాత్తాపపడు. ఎందుకంటే దాసుడు తన తప్పులను ఒప్పుకుని, దైవ సన్నిధిలో క్షమాపణ కోరినప్పుడు అల్లాహ్ అతని పశ్చాత్తాపాన్ని ఆమోదిస్తాడు."

విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అంటున్నారు: ప్రవక్త మహనీయులు(సఅసమ్) తన మాటను పూర్తి చేసిన తరువాత నా కన్నీళ్ళు పూర్తిగా ఇంకిపోయాయి. ఒక్క చుక్క కన్నీరు కూడా కళ్లలో ఉన్నట్టు అనిపించలేదు. 'నా తరఫున మీరు దైవప్రవక్త(స)కు సమాధానం ఇవ్వండి' అని నేను మొదట నా తల్లిదండ్రులను కోరాను. 'దైవసాక్షి! దైవప్రవక్త(స)కు సమాధానం ఏమివ్వాలో నాకు అర్థం కావటంలేద'ని నాన్న చెప్పారు. 'దైవప్రవక్త(స) చెప్పిన మాటలకు జవాబు ఇవ్వండి' అని అమ్మను అభ్యర్థించాను. 'అయ్యో! నేను దైవప్రవక్త(స)కు ఏం చెప్పాలో నాకేమీ పాలుపోవటంలేద'ని అమ్మ చెప్పింది. అందువల్ల నేను స్వయంగా విన్నవించుకోవలసిన పరిస్థితి ఏర్పడింది- నిజానికి నేనప్పటికి చిన్న పిల్లనే. ఖుర్ఆన్ కూడా అప్పటికి నేను ఎక్కువగా చదువుకోలేదు. (నేనిలా

అన్నాను:) 'అల్లాహ్ సాక్షిగా! మీరంతా కూడా ఇలాంటి వదంతుల్ని వింటున్నారనీ, విషయం మీ మనస్సుల్లో నాటుకుందనీ, మీరంతా దానిని నిజమని నమ్మారని నాకు అర్థమవుతోంది. ఆ అపనిందతో నాకెలాంటి సంబంధం లేదని నేను చెప్పినా మీరు దానిని నమ్మరు. ఒకవేళ నేను తప్పు ఒప్పుకుంటే- నేనే పాపం చేయలేదన్న సంగతి అల్లాహ్‌కు బాగా తెలుసు. కాని- మీరంతా దానిని నమ్మేస్తారు. కాబట్టి దైవసాక్షిగా! నా ఉపమానం, మీ దృష్టాంతం యూసుఫ్(అలైహిస్సలామ్) తండ్రి లాంటిది. ఆ సమయంలో ఆయన, 'సరే. ఓర్చుకుంటాను. బాగా ఓర్చుకుంటాను. మీరు కల్పిస్తున్న మాటల విషయంలో సహాయం కోసం అల్లాహ్‌నే అర్థించాలి' అన్నారు.

నేను మరోవైపు ముఖం త్రిప్పుకుని పడకపై మేను వాల్చాను. ఈ వ్యవహారంలో నేను నిర్దోషినన్న సంగతి దైవానికి తెలుసు. ఆయన స్వయంగా నా నిర్దోషిత్వాన్ని ప్రకటిస్తాడని భావించాను. ఎందుకంటే నేను ముమ్మాటికీ నిర్దోషిని. కాని అల్లాహ్ సాక్షిగా! ఆయన 'వహీ' (దైవవాణి) ద్వారా ఖుర్‌ఆన్‌లో నా నిర్దోషిత్వాన్ని ప్రకటిస్తాడని మాత్రం నేను ఊహించలేదు. ఎందుకంటే, నా గురించి అల్లాహ్ 'వహీ'ని అవతరింపజేసేంతటి స్థాయి నాకు లేదని భావించాను. దైవప్రవక్త(స) కల గంటారని, ఆ కలలో దేవుడు నా పవిత్రతను గురించి ఎరుకపరుస్తాడని మాత్రమే అనుకున్నాను.

కాని దైవసాక్షిగా! దైవప్రవక్త(స) అక్కడి నుంచి లేవకముందే, ఇంటి సభ్యుల్లో కూడా ఎవరూ అక్కడి నుండి నిష్క్రమించకముందే ఆయన(స)పై దైవవాణి (వహీ) అవతరణ ప్రారంభమైంది. ఆ క్షణంలో ముత్యాల్లా ఆయన(స) ఒంటిపైనుండి చెమట బిందువులు రాలసాగాయి. నిజానికి అది తీవ్రమైన చలికాలం. 'వహీ' అవతరించినప్పుడే ఆయన(స)పై ఆ స్థితి ఆవరించేది. ఈ పరిస్థితి తొలగిపోయిన తరువాత ఆయన పెదవులపై చిరునవ్వు చిందింది. ఆ క్షణంలో ఆయన(స) నోట వెలువడిన మొట్టమొదటి మాట, "ఆయిషా! అల్లాహ్ నీ నిర్దోషిత్వాన్ని అవతరింపజేశాడు". అప్పుడు మా అమ్మ ఎంతో ఆనందోత్సాహంతో, 'అమ్మాయి! వెళ్ళి, దైవ ప్రవక్త(స) సమక్షంలో నిలబడు' అంది. దానికి నేను, 'దైవసాక్షి! నేనాయన సమక్షంలో నిలబడటమేమిటి? నేను గౌరవోన్నతుడైన అల్లాహ్‌కు తప్ప వేరెవరికీ కృతజ్ఞతలు తెలుపను (ఎందుకంటే, ఆయనే నా నిర్దోషిత్వాన్ని ప్రకటించాడు)' అని పలికాను.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

*"ఈ అభాండాన్ని సృష్టించి తీసుకువచ్చినవారు, మీలోని ఒక వర్గం వారే. ఈ సంఘటనను మీ విషయంలో కీడుగా భావించకండి. పైగా ఇది మీకు మేలైనదే. ఎవడు ఇందులో ఎంత పాత్ర వహించాడో, వాడు అంతే పాపాన్ని మూట గట్టుకున్నాడు. ఇంకా ఈ బాధ్యతలో పెద్ద భాగాన్ని తన నెత్తిపై వేసుకున్న వ్యక్తికి పెద్ద శిక్షే పడుతుంది." (అన్ నూర్ : 11)*

ఈ సంఘటన నేపథ్యంలో మొత్తం పది ఆయత్‌లు అవతరించాయి. నూర్ సూరాలోని ఈ ఆయత్‌లు అవతరించినప్పుడు అబూబక్ర్ సిద్దీఖ్(రజి) తన కుమార్తెపై అపనింద మోపేవారితో కుమ్మక్కు అయిన మిస్తహ్ బిన్ ఉసాసాపై కోపంతో, ఇక మీదట నేనతని ఖర్చుల నిమిత్తం డబ్బు ఇవ్వనని ఒట్టేసుకున్నారు. (మిస్తహ్ పేదవారు, పైగా అబూబక్ర్‌కు బంధువు కూడా. ఈ కారణంగా ఆయన మిస్తహ్‌కు ఆర్థిక సహాయం చేసేవారు). దానిపై అల్లాహ్ ఈ ఆయత్‌ను అవతరింప జేశాడు:

*"మీలోని ప్రముఖులు, స్థితిపరులు తమ బంధువులకూ, నిరుపేదలకూ, అల్లాహ్ మార్గంలో వలస వచ్చిన ప్రజలకూ, సహాయం చేయకూడదని ప్రమాణం చేయరాదు. వారిని క్షమించాలి, వారి (తప్పుల)ని ఉపేక్షించాలి. మిమ్మల్ని అల్లాహ్ క్షమించాలని మీరు కోరుకోరా? అల్లాహ్ గుణం ఏమిటంటే, ఆయన క్షమించే వాడూ, కరుణించేవాడూను. (నూర్ : 22)*

ఈ ఆయత్ అవతరించినప్పుడు అబూబక్ర్(రజి) చలించిపోయారు. 'దైవ సాక్షిగా! అల్లాహ్ నా తప్పుల్ని మన్నించాలన్నదే నా ఆకాంక్ష' అని పలికారు. మిస్తహ్‌కు చేసే ఆర్థిక సహాయాన్ని తిరిగి కొనసాగించారు. 'దైవసాక్షిగా! నేనతనికి ఇచ్చే భృతిని ఇక ఎన్నటికీ ఆపను' అని కూడా చెప్పారు.

అమ్మ ఆయిషా(ర.అ) ఇంకా ఇలా అన్నారు: దైవప్రవక్త(స) నా గురించి ఉమ్ముల్ మోమినీన్ జైనబ్ బిన్తె జహష్(ర.అ)ని కూడా సంప్రతించారు. "ఆయిషా గురించి నీకు ఏం తెలుసు? నీవు ఆమెలో గమనించిన విషయం ఏమిటి?" అని ఆయన(స) అడిగినప్పుడు, 'దైవప్రవక్తా! (నేనామెకు వ్యతిరేకంగా సాక్ష్యం ఇవ్వటం నుండి) నేను నా కళ్ళు చెవులను కాపాడుకుంటున్నాను. దైవసాక్షిగా! నేను ఆమెలో మంచి తప్ప మరొకటి ఎరుగను' అని ఆమె చెప్పారు. ప్రవక్త సతీమణులలో నాకు సమ ఉజ్జీ కాగల వారెవరయినా ఉన్నారంటే ఆమె జైనబ్ బిన్తె జహష్ మాత్రమే.

కాని అల్లాహ్ ఆమెలోని భయభక్తుల మూలంగా, సౌశీల్యం కారణంగా ఆమెను (ఉపద్రవం నుండి) సురక్షితంగా ఉంచాడు. కాకపోతే ఆమె సోదరి హమ్నా మాత్రం నాశనమయ్యే వారితోపాటు నాశనమయ్యింది.

ఈ హదీసు ద్వారా ప్రముఖుల నుండి అందిన సమాచారం ఇదేనని ఇబ్నె షిహాబ్ తెలిపారు.

అమ్మ ఆయిషా(ర) ఈ విధంగా చెప్పినట్లు కూడా ఉర్వా ఉటంకించారు: “అల్లాహ్ సాక్షిగా! ఏ సహాబీతోపాటు ఈ అపనిందను అంటగట్టడం జరిగిందో, ఆయన దీనిని గురించి, ‘సుబ్‌హానల్లాహ్! ఎవరి చేతిలో నా ప్రాణముందో ఆ ప్రభువు సాక్షిగా! అసలు ఈ రోజు వరకూ నేను ఏ స్త్రీ వస్త్రం కూడా విప్పలేదు’ అనేవారు. ఈ సంఘటన జరిగిన కొన్నాళ్ళకే ఆయన దైవమార్గంలో పోరాడి అమరగతినొందారు.”

**39)** జుహ్రీ ఇలా వివరించారు: “ఆయిషా(ర.అ)పై అపనింద మోపిన వారిలో అలీ(రజి) కూడా ఉన్నారా?” అని ఖలీఫా వలీద్ బిన్ అబ్దుల్ మలిక్ నన్ను అడిగినప్పుడు, ‘లేదు, మీ జాతి (ఖురైషు) వారైన ఇద్దరు మనుషులు అబూ సలమా బిన్ అబ్దుర్రహ్మాన్, అబూబక్ర్ బిన్ అబ్దుర్రహ్మాన్ బిన్ హారిస్‌లు నాకు ఏమని తెలియపరిచారంటే, ‘ఈ వ్యవహారంలో అలీ(రజి) మౌనం వహించార’ని ఆయిషా(ర.అ) తమతో చెప్పారు.

**40)** ఆయిషా(ర.అ) తల్లి గారైన ఉమ్మె రూమాన్(ర.అ) తనతో ఇలా చెప్పినట్లు మస్రూఖ్ బిన్ అజ్దా తెలిపారు: ఆమె ఇలా అన్నారు- నేనూ, ఆయిషా కూర్చుని ఉండగా ఒక అన్సార్ మహిళ వచ్చి, ‘అల్లాహ్ ఫలానా ఫలానా వారిని నాశనం చేయుగాక!’ అని చెప్పింది. ‘అలా అంటావేమిటి?’ అని ఉమ్మె రూమాన్ అడగ్గా, ‘నా కొడుకు కూడా ఆ వదంతుల్ని వ్యాపింపజేసే వారి పంచన చేరాడ’ని అంది. ‘ఇంతకీ విషయం ఏమిటో చెప్పావు కాదు’ అని ఉమ్మె రూమాన్ ప్రశ్నించగా, అపనింద మోపిన వారి మాటల్ని ఆమె వివరించి చెప్పింది. ‘ఏమిటి, దైవ ప్రవక్త (సఅసమ్) కూడా ఈ వదంతుల్ని విన్నారా?’ అని ఆయిషా(ర.అ) అడిగితే, ‘అవును. ఆయన(స) కూడా విన్నార’ని ఆమె చెప్పింది. ఇది వినగానే ఆయిషా స్పృహ తప్పి పడిపోయింది. ఆమె స్పృహలోకి వచ్చేసరికే చలి జ్వరంతో వణుకుతోంది. నేను ఆమెపై ఆమె బట్టలు బాగా కప్పివేశాను. ఆ తర్వాత దైవప్రవక్త(స)

వచ్చి, "ఈమెకు ఏమయింది?" అని అడిగారు. 'దైవప్రవక్తా! ఈమెకు బాగా చలి జ్వరం ఉంది' అని నేను సమాధానమిచ్చాను. "బహుశా ఈమె ఆ వదంతుల్ని గురించి విని ఉంటుంది" అన్నారాయన(స). దానికి ఉమ్మె రూమాన్ 'అవున'ంది. ఆ తర్వాత ఆయిషా(ర.అ) లేచి కూర్చొని ఇలా అన్నారు: "అల్లాహ్ సాక్షిగా! నేను నిర్దోషినని అల్లాహ్‌పై ప్రమాణం చేసి చెప్పినా మీరు నా మాట నమ్మరు. ఒకవేళ నేను ఏదయినా సంజాయిషీ ఇచ్చినా నా సంజాయిషీని మీరు అంగీకరించరు. మీరూ మరియు నా ఉపమానం యాఖూబ్ (అ), ఆయన కుమారుల వంటిది. ఆ సమయంలో ఆయన (యాఖూబ్), 'మీరు కల్పిస్తున్న మాటల విషయంలో సహాయం కొరకు అల్లాహ్‌నే అర్థించాల'ని అన్నారు. ఉమ్మె రూమాన్ ఇలా అన్నారు: 'ఆయిషా(ర.అ) చెప్పింది విన్నమీదట దైవప్రవక్త(స) తిరిగి వెళ్ళిపోయారు. సమాధానం ఏమీ ఇవ్వలేదు. అల్లాహ్ స్వయంగా ఆ ప్రతిష్ఠంభనను తొలగిస్తూ తన వాణిని అవతరింపజేశాడు. అప్పుడు ఆమె దైవప్రవక్త(స)తో, 'నేను అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. మీకు గానీ, మరొకరికి గానీ కృతజ్ఞతలు తెలుపను' అన్నారు.

**41)** ఇబ్నె అబీ ములైకా కథనం: హజ్రత్ ఆయిషా(ర.అ) గారు నూర్ సూరాలోని 'తలఖ్ఖవ్ నహూ బిఅల్ సినతికుమ్' అనే ఆయత్‌ను పారాయణం చేసి, దానిపై వ్యాఖ్యానిస్తూ అల్ వలఖూ అనే పదానికి అర్థం 'పెద్ద అబద్ధం' అనేవారు.[1] అమ్మ ఆయిషాకు ఈ ఆయత్‌ల గురించి ఇతరులకన్నా బాగా తెలుసు. ఎందుకంటే అవి ప్రత్యేకంగా ఆమె పవిత్రతను చాటుతూ అవతరించాయని ఇబ్నె అబీ ములైకా చెప్పారు.

**42)** హిషామ్‌తో, ఆయన తండ్రి ఇలా అన్నారు: నేను హజ్రత్ ఆయిషా (ర.అ) సమక్షంలో హస్సాన్ బిన్ సాబిత్(రజి)ను గురించి చెడుగా మాట్లాడి నప్పుడు, 'ఆయన్ని గురించి చెడుగా మాట్లాడకండి. ఎందుకంటే ఆయన గారు దైవప్రవక్త(సఅసమ్) తరఫున సత్య తిరస్కారులకు దీటుగా జవాబిచ్చేవారు' అని ఆమె అన్నారు. ఆయిషా (ర.అ) ఇంకా ఇలా అన్నారు: ఒకసారి ఆయన (హస్సాన్) ఖురైషు బహుదైవారాధకుల పుట్టు పూర్వోత్తరాలను ఎండగట్టడానికి దైవప్రవక్త(స) అనుమతి కోరారు. "మరి అలాగైతే నా వంశ పరంపర సంగ

---

41-1. అంటే ఆ సందర్భంగా మీరు మీ నోళ్ళతో యథేచ్ఛగా అబద్ధం చెప్పసాగారు.

**తేమిటి?" అని దైవప్రవక్త(స) ప్రశ్నించగా, 'నేను తమరిని నానబెట్టిన పిండిలో నుంచి వెంట్రుకను తీసినంత లాఘవంగా వేరు పరుస్తాను కదా!' అన్నారు.**

**తన తండ్రి ఉర్వా తనతో ఈ విధంగా చెప్పారని హిషామ్ తెలిపారు : నేను హస్సాన్(రజి) గురించి చెడుగా మాట్లాడాను. ఎందుకంటే ఆయన కూడా అమ్మ ఆయిషా(ర.అ)పై అపనింద మోపటంలో పెద్ద పాత్ర పోషించారు.**

**43) మస్రూఖ్ కథనం: మేము హజ్రత్ ఆయిషా(ర.అ) సమావేశానికి వెళ్ళినప్పుడు, అక్కడ హస్సాన్ బిన్ సాబిత్ కూడా ఉన్నారు. ఆ సమయంలో ఆయన అమ్మ ఆయిషా(ర.అ)కు కవితలు వినిపిస్తున్నారు. వాటిలో ఒక కవితకు అర్థం ఇది:**

**"ఆమె నిప్పులాంటిది. శీలవతి. ఆమెపై ఎన్నటికీ అపనింద మోపటం తగదు. ఆమె ప్రతి ఉదయం ఆకలిగొని, అమాయకురాళ్ళైన తన సోదరీమణుల మాంసం తినదు."**

**హజ్రత్ ఆయిషా(ర.అ) ఈ కవిత విని, "కాని మీరైతే అలా నిరూపించుకో లేకపోయారు కదా!" అని చురక అంటించారు.**

**మస్రూఖ్ ఇలా అన్నారు : నేను అమ్మ ఆయిషా(ర.అ)ను 'అసలు మీరు ఆయన్ని (హస్సాన్‌ను) ఇక్కడికి ఎందుకు రానిస్తారు? అపనిందను మోపటంలో కీలకపాత్ర పోషించిన వానికి చాలా పెద్ద శిక్ష పడుతుంది[1] అని అల్లాహ్ స్వయంగా సెలవిచ్చాడు కదా!' అని విన్నవించుకోగా విశ్వాసుల మాత ఇలా అన్నారు : "కంటి చూపు పోవటం కన్నా పెద్ద శిక్ష ఇంకేముంటుంది? (వృద్ధాప్యంలో హస్సాన్ బిన్ సాబిత్‌కి కంటిచూపు పోయింది)'. ఆయిషా(ర.అ) ఇంకా ఇలా అన్నారు : "హస్సాన్ (తన కవితల ద్వారా) దైవప్రవక్త(స)ను సమర్థించేవారు.**

---

43-1. అసలు ఈ ఆయత్ కపటుల నాయకుడైన అబ్దుల్లాహ్ బిన్ ఉబై నేపథ్యంలో అవత రించింది. మస్రూఖ్ ఇక్కడ పొరబడ్డారు. అమ్మ ఆయిషా(ర.అ) గారికి హస్సాన్ బిన్ సాబిత్ వల్ల మనస్తాపం కలిగిన మాట నిజమే అయినప్పటికీ, ఆయన గురించి ఎవరయినా చెడుగా ప్రస్తావిస్తే మాత్రం ఆమె సహించలేకపోయేవారు. హస్సాన్ వల్ల తప్పు జరిగిన సంగతి నిజమే. కాని ఈ రకమయిన తప్పు మరికొంతమంది సహాబా వల్ల కూడా జరిగింది. తరువాత అల్లాహ్ వారిని క్షమించాడు. వారి పశ్చాత్తాపాన్ని ఆమోదించాడు. దాంతో ఆ వ్యవహారం సద్దుమణిగింది. కాకపోతే ఆ ప్రస్తావన

## అధ్యాయం : 36

# హుదైబియా యుద్ధం గురించి[1]

అల్ ఫత్హ్ సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : "విశ్వాసులు వృక్షం క్రింద నీతో విధేయతా ప్రమాణం చేస్తున్నప్పుడు, అల్లాహ్ వారి పట్ల ప్రసన్నుడయ్యాడు." **(48: 18)**

**44)** జైద్ బిన్ ఖాలిద్(రజి) కథనం : హుదైబియా సంఘటన జరిగిన సంవత్సరం మేము ప్రవక్త మహనీయుల(సఅసమ్)తో కలసి బయలుదేరాము. ఆ సందర్భంగా ఒక రోజు రాత్రి వర్షం కురిసింది. దైవప్రవక్త(స) ఫజ్ర్ నమాజ్ చేయించిన మీదట మమ్మల్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ, "మీ ప్రభువు ఏమన్నాడో తెలుసా?" అని అడిగారు. దానికి మేము, 'అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకే బాగా తెలుసు' అని చెప్పాము. అప్పుడాయన (స) ఇలా అన్నారు : "అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు: తెల్లవారినప్పుడు నా దాసుల్లో కొంతమంది నాపై విశ్వాసం(ఈమాన్) ఉన్న స్థితిలో తెల్లవార్చారు. మరికొంతమంది నన్ను తిరస్కరించిన స్థితిలో తెల్లవార్చారు. ఎవరయితే, 'మాపై ఈ వర్షం దైవ కారుణ్యంతో, ఆయన అనుగ్రహంతో, ఆయన ఉపాధితో కురిసింద'ని అన్నాడో అతను నన్ను విశ్వసించిన వాడవుతాడు, నక్షత్రాల ప్రభావాన్ని త్రోసిపుచ్చినవాడవుతాడు. మరెవడయితే, 'ఈ వర్షం ఫలానా నక్షత్ర ప్రభావం వల్ల కురిసిందని అంటాడో, అతను నక్షత్రాలను విశ్వసించినవాడు, నన్ను తిరస్కరించినవాడయ్యాడు."

**45)** మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) మొత్తం నాలుగు ఉమ్రాలు చేశారు. ఇవన్నీ జీకఅద నెలలోనే జరిగాయి. కాని ఆయన (స) హజ్జ్‌తోపాటుగా చేసిన ఉమ్రా మాత్రం జిల్‌హజ్జా నెలలో జరిగింది. హుదైబియా ఒడంబడిక జరిగిన సంవత్సరంలో కూడా ఆయన(స)

---

ఎప్పుడయినా వచ్చినప్పుడు, ఆయిషా(ర.అ) మనస్సు సహజంగానే నొచ్చుకునేది. హస్సాన్ గారి కవిత విన్నప్పుడు ఆమె ఆ విధంగా స్పందించటం మానవ సహజమైన దౌర్బల్యం.

36-1. 'హుదైబియా' అనేది అసలు మక్కా సమీపంలోనున్న ఒక బావి. మహాప్రవక్త హిజ్రీ

ఉమ్రా ఉద్దేశ్యంతోనే వెళ్ళారు. కాని మరుసటి సంవత్సరం దానిని (ఖజా ఉమ్రాగా) జీకఅదలోనే నెరవేర్చారు. మరొక ఉమ్రాను ఆయన(స) 'జీరానా' నుండి సంకల్పించుకుని చేశారు. అక్కడ (జీరానాలో) ఆయన హునైన్ యుద్ధప్రాప్తిని పంపిణీ చేశారు. ఇది కూడా జీకఅద నెలలోనే జరిగింది. ఇంకొక ఉమ్రాను ఆయన(స) హజ్జ్‌తోపాటు చేశారు.

**46)** అబ్దుల్లాహ్ బిన్ అబీ ఖతాదాతో, ఆయన తండ్రి అబూ ఖతాదా(రజి) ఇలా వివరించారు: మేము హుదైబియా సంవత్సరం దైవప్రవక్త(సఅసమ్)తో కలసి పయనమయ్యాము. సహచర మాన్యులంతా 'ఇహ్రామ్' కట్టుకున్నారు. కాని నేనప్పటికి ఇహ్రామ్ దీక్ష బూనలేదు.

**47)** బరా బిన్ ఆజిబ్(రజి) తెలిపారు: మీరు (అల్ ఫత్హ్ సూరాలో ప్రస్తావించబడిన) విజయాన్ని 'మక్కా విజయం'గా పేర్కొంటున్నారు. మక్కా విజయం విజయమే (దానిని ఎవరూ కాదనరు). కాని మేము మాత్రం హుదైబియా యుద్ధ సందర్భంగా జరిగిన 'బయ్‌తె రిజ్వాన్'ను సిసలైన విజయంగా భావిస్తున్నాము. ఆ రోజు మేము దైవప్రవక్త(స)తో పాటు **1400** మందిమి ఉన్నాము. 'హుదైబియా' అనబడే ఒక బావి అక్కడ ఉండేది. మేము ఆ బావిలో నుంచి ఒక చుక్క నీరు కూడా మిగలకుండా తోడుకున్నాము. (నీరంతా) అయిపోయిందన్న విషయం దైవప్రవక్త(స)కు తెలిసినప్పుడు ఆయన(స) ఆ బావి దగ్గరకు వచ్చారు. బావి ప్రక్కన కూర్చుని ఒక పాత్రలో నీరు తెమ్మని ఆదేశించారు. ఆ నీటితో ఆయన వుజూ చేసి, నీరు పుక్కిలించి ప్రార్థించారు. పిదప ఆ నీరంతా ఆ బావిలో కుమ్మరించారు. మేము కొన్ని గడియల పాటు బావిని అలాగే వదిలేశాము. తరువాత మేము మాకు కావలసినంత నీరు తోడుకుని త్రాగాము. మా వాహనాలకు (పశువులకు) కూడా త్రాపాము.

**48)** బరా బిన్ ఆజిబ్(రజి) కథనం: మేము హుదైబియా యుద్ధ సందర్భంగా దైవప్రవక్త(సఅసమ్)వెంట **1400** మందిమి వరకూ ఉన్నాము. లేదా

---

6వ యేట జిల్‌హజ్జా నెలలో అక్కడికి వెళ్ళి ఆగారు. అక్కడే ఒక తుమ్మచెట్టు క్రింద 'బైఅతె రిజ్వాన్' అనే ప్రతిజ్ఞ చేయించటం జరిగింది. ఈ సంఘటన 'హుదైబియా ఒడంబడిక'గా ప్రసిద్ధి చెందింది.

అంతకంటే ఎక్కువ సంఖ్యలోనే ఉన్నాము. ఒక బావివద్ద సైనికులు మోహరించారు. వారు ఆ బావిలోని నీరంతా తోడేసుకున్నారు (ఒక చుక్క నీరు కూడా బావిలో లేకుండా పోవటంతో) వారు దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి, విషయం వివరించారు. దైవప్రవక్త(స) బావి వద్దకు వచ్చి బావి గట్టుపై కూర్చున్నారు. "ఇదే బావి నీరు ఒక బక్కెట్టులో తీసుకురండి" అని ఆజ్ఞాపించారు. నీరు సమర్పించబడింది. ఆయన ఆ నీటిలో పుక్కిలించి, దైవాన్ని వేడుకున్నారు. "కాస్సేపు ఈ బావిలోని నీరు తోడ కండి" అని ఉపదేశించారు. ఆ తర్వాత సైనికులంతా ఆ బావి నీరు త్రాగారు. తమ వాహనాలకు (ఒంటెలకు) కూడా త్రాపారు. వారు ఆ ప్రదేశాన్ని వదిలి పోయేవరకూ బావి నీరు తరగలేదు.

**49)** మహనీయ జాబిర్(రజి) కథనం: హుదైబియా యుద్ధ సందర్భంగా సైనికులంతా దాహంతో బాధపడాల్సి వచ్చింది. దైవప్రవక్త(సఅసమ్) ముందు ఒక నీటి పాత్ర ఉంది. ఆ నీటితో ఆయన(స) వుజూ చేశారు. సహచరమాన్యులు దైవప్రవక్త(స) సన్నిధిలో హాజరయ్యారు. "ఏమిటి సంగతి?" అని అడిగారు కారుణ్య మూర్తి(స). దానికి వారు, 'దైవప్రవక్తా! ప్రస్తుతం మా దగ్గర నీరు లేదు. వుజూ చేయడానికి గానీ, త్రాగడానికి గానీ బొత్తిగా నీళ్ళు లేవు. మీ వద్ద పాత్రలో ఉన్న నీరు మాత్రమే ఉంది' అని విన్నవించుకున్నారు. దైవప్రవక్త(స) తన చేతిని ఆ పాత్రలో ముంచారు. అప్పుడు నీరు ఆయన(స) చేతివ్రేళ్ళ మధ్యలోనుండి నీటి బుగ్గలా పెల్లుబికింది. ఉల్లేఖకుడు ఇలా అన్నారు : 'మరి మేమంతా దాహం తీర్చు కున్నాము. వుజూ చేసుకున్నాము'. (సాలిమ్ ఇలా అన్నారు) 'మీరంతా ఎంతమంది ఉన్నారు?' అని. నేను జాబిర్(రజి)ను అడిగితే, 'ఒకవేళ మేము లక్ష మందిమి ఉన్నా ఆ నీరు మాకు సరిపోయేది. అయితే ఆ సమయంలో మా సంఖ్య **1500** వరకూ ఉంది' అని ఆయన చెప్పారు.

**50)** ఖతాదా ఇలా అన్నారు: నేను సయీద్ బిన్ ముసయ్యిబ్‌తో, "హుదైబియా ఒడంబడిక సమయంలో దైవప్రవక్త(సఅసమ్) వెంట **1400** మంది సహాబా ఉన్నట్లు నాకు జాబిర్(రజి) చెప్పార"ని అన్నాను. దానికి సయీద్ బిన్ ముసయ్యిబ్ ఇచ్చిన సమాధానం ఇది : "నాకు జాబిర్(రజి) ద్వారా తెలిసిందేమంటే; ఆ సంద ర్భంగా **1500** మంది సహాబా ఉన్నారు. వారంతా హుదైబియాలో దైవప్రవక్త(స) సమక్షంలో విధేయతా ప్రమాణం (బయ్అత్) చేశారు.

**51)** అమ్ర్ బిన్ దీనార్ ఇలా అన్నారు: నేను జాబిర్(రజి) చెప్పగా విన్నాను.

ఆయన కథనం ప్రకారం హుదైబియా ఒడంబడిక సందర్భంగా దైవప్రవక్త (సఅసమ్) ఇలా వక్కాణించారు : “మీరు భూవాసులలోకెల్లా ఉత్తములు”. ఆ సందర్భంగా మేము **1400** మందిమి వరకూ ఉన్నాము. ఒకవేళ నాకు ఇప్పుడు కంటిచూపు ఉండి ఉంటే ‘ఆ వృక్షం’ ఉన్న స్థలాన్ని చూపెట్టగలిగే వాణ్ణి... అబ్దుల్లాహ్ బిన్ అబీ అవ్ఫా(రజి) ఇలా అన్నారు: చెట్టు వారి (బయ్‌తె రిజ్వాన్‌లో పాల్గొన్న సహచరమాన్యుల) సంఖ్య **13** వందలు. అంటే అస్లమ్ తెగవారు ముహాజిర్లలో **8**వ వంతు వరకూ ఉన్నారు.

**52)** మిర్దాస్ అస్లమీ (రజి) చెప్పగా ఖైస్ బిన్ అబీ హాజిమ్ విన్నారు: ఆయన (హుదైబియా ఒడంబడిక సందర్భంగా) వృక్షం క్రింద విధేయతా ప్రమాణం చేసినవారిలో ఒకరు. ఆయన ఇలా అనేవారు : (ప్రళయదినానికి సమీపంలో) సజ్జనులు లేపుకోబడతారు. అందరికన్నా మంచివారు అందరికన్నా ముందు రప్పించుకోబడతారు. దాని మీదట ఆ తరువాతి వారి వంతు వస్తుంది. ఆ తరువాత పనికిమాలిన ఖర్జూరాల మాదిరిగా పనికిరాని వారు మిగిలి ఉంటారు. వారికి దైవ సన్నిధిలో ఎలాంటి విలువ ఉండదు.

**53)** మర్వాన్ బిన్ హకమ్, మిస్వర్ బిన్ మఖ్రమాలిరువురూ చెప్పగా తాను విన్నానని ఉర్వా బిన్ జుబైర్ తెలియజేశారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) హుదైబియా సంఘటన జరిగిన సంవత్సరం రమారమి వెయ్యి మంది ప్రియ సహచరులతో కలిసి బయలుదేరారు. జుల్‌హులైఫా స్థలానికి చేరుకున్న మీదట ఆయన(స) ఖుర్బానీ పశువులకు మెడలో హారం (కంఠపాశం) వేశారు. వాటి మూపురాలను కొద్దిగా చీల్చి గుర్తులు వేశారు. అక్కడి నుంచే ‘ఇహ్రామ్’ (వస్త్రం) కట్టుకున్నారు.

అలీ బిన్ మదీనీ ఇలా అన్నారు: నేను ఈ హదీసును సుఫ్యాన్ బిన్ యసార్ ద్వారా ఎన్నిసార్లు విన్నానో నాకే గుర్తులేదు. ఆయన జుహ్రీ ఆధారంగా ఏమనేవారంటే, కంఠహారం తొడిగించటం, గుర్తులు వేయటం గురించి తనకు జ్ఞాపకం లేదన్నారు. దాని అర్థమేమిటో నాకు అవగతం కాలేదు. అంటే గుర్తులు వేసి, కంఠహారం తొడిగించిన ప్రదేశం మరిచిపోయారా? లేక మొత్తం హదీసు ఆయనకు జ్ఞాపకం లేకుండాపోయిందా? అన్నది బోధపడలేదు.

**54)** కాబ్ బిన్ ఉజ్రా (రజి) కథనం: నా తలలోని పేలు నా ముఖంపై పడటాన్ని దైవప్రవక్త (సఅసమ్) గమనించి, "వీటి మూలంగా నీకు బాధ కలుగుతోందా?" అని నన్ను అడిగారు. దానికి ఆయన 'అవున' న్నారు. "అలాగైతే శిరోముండనం చేయించుకో" అని దైవప్రవక్త(స) ఆదేశించారు. ఆ సమయంలో ఆయన హుదైబియాలో ఉన్నారు (ఉమ్రా కొరకు ఇహ్రామ్ దీక్షబూని ఉన్నారు). తాము ఉమ్రా నుండి నిలువరించబడతామన్న సంగతి ఆయనకు తెలీదు. కాని హుదైబియాలోనే ఇహ్రామ్‌ను విడువవలసి వచ్చింది. తాను ఎలాగైనా సరే ఉమ్రా చేసుకోవాలి, మక్కాలో ప్రవేశించాలన్న ఆకాంక్ష ఆయనలో ప్రబలంగా ఉండేది. అప్పుడు అల్లాహ్ ఫిదియా (పరిహార) ఆజ్ఞను అవతరింపజేశాడు. అంటే ఇహ్రామ్ స్థితిలో శిరోముండనం చేయించుకోవటం లాంటి చర్యలకుగాను 'ఫిదియా' (పరిహారం) చెల్లించాలి, ఒక 'ఫర్ఖ్' ఆహార ధాన్యాన్ని నిరుపేదలకు ఇవ్వాలని లేదా ఒక మేకను జిబహ్ చేయాలని లేదా మూడు రోజులపాటు ఉపవాసం పాటించాలని దైవప్రవక్త(స) కాబ్‌కు ఆజ్ఞాపించారు.

**55)** తన తండ్రి తనతో చెప్పారని జైద్ బిన్ అస్లమ్(రజి) తెలిపారు: ఆయన తండ్రి ఇలా చెప్పారు– నేను ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)తోపాటు మార్కెట్‌కు వెళ్ళాను. ఒక నవ యువతి ఉమర్(రజి)ను కలుసుకుని ఇలా విన్నవించుకుంది: 'విశ్వాసుల నాయకా! నా భర్త చనిపోయారు. ఆయన తన వెనుక కొంతమంది చిన్న చిన్న పిల్లల్ని వదలిపోయారు. అల్లాహ్ తోడు! ఇప్పుడు ఆ పిల్లలకు వండి పెట్టడానికి (కనీసం) మేక కాలిగిట్టలు కూడా లేవు. పంట పొలాలు గానీ, పాలిచ్చే పశువులు గానీ లేవు. వారు దారిద్ర్యంలో ఆకలిదప్పికలతో చచ్చిపోతారేమోనన్న భయం నాకు ఉంది. నేను ఖుఫాఫ్ బిన్ ఈమా అల్ గిఫారీ(రజి) కుమార్తెను. నా తండ్రి దైవప్రవక్త(సఅసమ్)తో కలసి హుదైబియా సంగ్రామంలో పాల్గొన్నారు'. అది విని మహనీయ ఉమర్(రజి) కొన్ని క్షణాలపాటు నిశ్చేష్టులై నిలబడిపోయారు. ఆ తరువాత ఇలా అన్నారు: "అలాగా అమ్మా! నీ వంశీయులకు మా వంశం వారితో (ఖురైషులతో) దగ్గరి సంబంధం ఉంది". తరువాత ఆయన ఇంట్లో కట్టబడి ఉన్న ఒక బలమైన ఒంటెవైపు తిరిగి, దాని వీపుపైన ఆహార ధాన్యం నిండి ఉన్న రెండు గోనెసంచులను మోపి, ఆ సంచుల మధ్యలో కొంత నగదును, నిత్యావసర వస్తువుల్ని, బట్టల్ని కూడా ఉంచారు. ఆ ఒంటె త్రాడును ఆమె చేతికిస్తూ "వీటిని తీసుకెళ్ళు. ఇవి అయిపోకముందే, అల్లాహ్ వీటికన్నా మేలైన వస్తువుల్ని నీకు

సమకూరుస్తాడు" అని ఓదార్చారు. అక్కడ ఉన్న ఒక వ్యక్తి 'అమీరుల్ మోమినీన్! మీరు ఆమెకు చాలా ఎక్కువ ఇచ్చారేమో!' అని అభిప్రాయపడగా, "(ఒరేయ్ దౌర్భాగ్యుడా!) నీ తల్లి నీ స్థితిపై రోదించుగాక! దైవసాక్షిగా! ఈమె తండ్రి, ఈమె సోదరుడు ఇప్పటికీ నా కళ్ళ ముందే కదలాడుతూ ఉన్నట్లే ఉంది. సుదీర్ఘకాలం పాటు ఒక కోటను ముట్టడించినప్పుడు వారు నాతోనే ఉన్నారు. ఎట్టకేలకు ఆ కోట కైవసం అయింది. తెల్లవారాక మేము వారిద్దరికి చెందవలసిన యుద్ధప్రాప్తిని వసూలు చేశాము" అని చెప్పారు.

**56)** సయీద్ బిన్ ముసయ్యిబ్‌తో ఆయన తండ్రి (ముసయ్యిబ్ బిన్ హిజ్న్) ఇలా చెప్పారు : "నేను ఆ వృక్షాన్ని (విధేయతా ప్రమాణం ఏ చెట్టు క్రింద జరిగిందో దానిని) చూశాను. కాని తరువాత నేను అక్కడికి వచ్చినప్పుడు, దానిని గుర్తుపట్ట లేకపోయాను"– 'తరువాతి కాలంలో ఆ వృక్షం ఏదో నాకు జ్ఞాపకం లేకుండా పోయింద'ని మహ్మూద్ బిన్ గీలాన్ తెలిపారు.

**57)** తారిఖ్ బిన్ అబ్దుర్రహ్మాన్ ఇలా వివరించారు: నేను హజ్జ్ చేసే ఉద్దేశ్యంతో వెళుతూ దారిలో ఒకచోట కొంతమంది నమాజ్ చేయటం చూశాను. 'ఇది ఏ మస్జిద్?' అని వారిని అడిగితే, 'ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఏ వృక్షం క్రింద విధేయతా ప్రతిజ్ఞ (బైఅతె రిజ్వాన్) చేయించారో ఆ వృక్షం యిది' అని వారు చెప్పారు. తరువాత నేను సయీద్ బిన్ ముసయ్యిబ్ దగ్గరకు వచ్చి, ఈ సంగతి తెలియపరచగా, ఆయన ఇలా అన్నారు: 'నా తండ్రి ముసయ్యిబ్ బిన్ హిజ్న్ నాతో ఇలా అన్నారు– ఆ వృక్షం క్రింద దైవప్రవక్త(స) సమక్షంలో బైఅత్ చేసినవారిలో ఆయన ఒకరు– (ఆయన ఇలా అనేవారు) 'మరుసటి సంవత్సరం నేను అక్కడికి వెళ్ళినప్పుడు ఆ వృక్షం ఉన్న స్థలాన్ని మరిచిపోయాను'. సయీద్ ఇలా అన్నారు: 'మహాప్రవక్త(స) ప్రియ సహచరులు సయితం ఆ వృక్షాన్ని గుర్తుపట్టలేకపోయారు. మరలాంటప్పుడు ఆ స్థలాన్ని మీరెలా గుర్తుపట్టగలిగారు? అంటే మీరు వారికన్నా ఎక్కువ జ్ఞాన సంపన్నులయ్యారా?"[1]

---

57–1. ప్రవక్త ప్రియ సహచరులు తెలుసుకోలేకపోయిన దానిని మీరెలా కనుగొన్నారు? అని సయీద్ బిన్ ముసయ్యిబ్ ప్రశ్నించటం గమనార్హ విషయం. ఇబ్నె సయీద్ గారు నాఫె నుండి ప్రామాణికంగా ఉటంకించిన దాని ప్రకారం; కొంతమంది ఆ వృక్షం వద్దకు వచ్చి, అక్కడ నమాజ్ చేస్తున్నారని హజ్రత్ ఉమర్(రజి)కు సమాచారం అందినప్పుడు, ఆ వృక్షాన్ని నరికివేయమని ఆయన ఆజ్ఞాపించారు. ఈ హదీసు

**58)** సయీద్ బిన్ ముసయ్యిబ్‌తో ఆయన తండ్రి ఇలా అనేవారు– ఆయన కూడా ఆ వృక్షం క్రింద దైవప్రవక్త(సఅసమ్) సమక్షంలో విధేయతా ప్రతిజ్ఞ చేసినవారిలో ఒకరు– "మరుసటి సంవత్సరం మేము అటు వెళ్ళినప్పుడు, అది ఏ వృక్షమో తెలియలేదు."[1]

**59)** తారిఖ్ బిన్ అబ్దుర్రహ్మాన్ వివరించారు: సయీద్ బిన్ ముసయ్యిబ్ సమావేశంలో ఒకసారి 'ఆ చెట్టు' ప్రస్తావన వచ్చినప్పుడు, ఆయన నవ్వి, ఆ చెట్టు క్రింద విధేయతా ప్రమాణం చేసిన వారిలో తాను కూడా ఉన్నానని మా నాన్న గారు నాతో చెప్పారని అన్నారు.

**60)** అబ్దుల్లాహ్ బిన్ అబీ అవ్‌ఫా (రజి) చెప్పగా తాను విన్నానని అమ్ర్ బిన్ ముర్రా తెలిపారు. ఆయన బయ్‌తె రిజ్వాన్‌లో పాల్గొన్నవారిలో ఒకరు. ఆయన ఇలా వివరించారు : ప్రవక్త మహనీయుల(సఅసమ్) సేవలో ఎవరయినా ఏ జాతి జనులకు చెందిన దానం అయినా (సదఖా) తీసుకుని వస్తే, "అల్లాహ్! వారిపై నీ కారుణ్యాన్ని కురిపించు" అని ప్రార్థించేవారు. మా నాన్న గారు కూడా తన జకాత్ సొమ్మును తీసుకుని ఆయన(స) సన్నిధిలో హాజరైనప్పుడు, "దేవా! అబీ అవ్‌ఫా కుటుంబీకులపై నీ కారుణ్యాన్ని కురిపించు" అని దీవించారు.

**61)** అబ్బాద్ బిన్ తమీమ్ కథనం : హర్రా యుద్ధ సందర్భంగా (మదీనా వాసులు) యజీద్‌కు వ్యతిరేకంగా అబ్దుల్లాహ్ బిన్ హంజలా సమక్షంలో విధేయతా ప్రమాణం (బయ్‌త్) చేయసాగారు. ఇది గమనించిన అబ్దుల్లాహ్ బిన్ జైద్ 'మీరంతా ఏ విషయంపై విధేయతా ప్రమాణం చేస్తున్నారు?' అని అడగ్గా దానికి ప్రజలు 'ప్రాణాలకు తెగించి పోరాడతామని ప్రమాణం చేస్తున్నామ'ని అన్నారు. 'అయ్యో! దైవప్రవక్త(సఅసమ్) తదనంతరం నేను ఇప్పుడు ఎవరి సమక్షంలో కూడా ప్రాణాలకు తెగించి పోరాడతానని ప్రమాణం చేయను' అని అబ్దుల్లాహ్ బిన్

ద్వారా రూఢీ అయ్యేదేమిటంటే; ప్రజలు ఏ వస్తువును పూజించే ప్రమాదం పొంచి ఉన్నదో, ఎక్కడ షిర్క్ జరిగే అవకాశం ఉందో, దానిని రూపుమాపటం సమంజసమే.

58–1. ఆ వృక్షం కనబడకుండా పోవటంలో లేదా సందేహాస్పదం కావటంలో కూడా మర్మం ఉంది. ఆ వృక్షాన్ని ప్రజా సామాన్యం పవిత్రంగా భావించి, దానిని పూజా స్థలంగా చేసుకునే ప్రమాదం ఉండటం వల్ల ఆ వృక్షం గురించి సంశయంలో పడవేయటం జరిగింది.

**జైద్(రజి)చెప్పారు. దైవప్రవక్త(స)తో కలసి హుదైబియా యుద్ధంలో పాల్గొన్నవారిలో ఆయన ఒకరు.[1]**

**62) మా నాన్న గారు నాతో ఇలా అన్నారని ఇయాస్ బిన్ సలమా బిన్ అక్వా తెలియజేశారు: ఆయన వృక్షం క్రింద విధేయతా ప్రమాణం చేసిన (అస్‌హాబె షజర్) వారిలో ఒకరు. ఆయన ఇలా అన్నారు– "మేము ప్రవక్త మహనీయుల (సఅసమ్)తోపాటు జుమా నమాజ్ చేసి తిరిగి వస్తున్నప్పుడు, గోడల నీడ మేము సేద దీరేంతగా విస్తరించి ఉండేది కాదు."**

**63) యజీద్ బిన్ అబీ ఉబైద్ కథనం: హుదైబియా ఒడంబడిక సంద ర్భంగా మీరంతా దైవప్రవక్త(సఅసమ్) సమక్షంలో ఏ విషయంపై ప్రతిజ్ఞ చేశారు? అని నేను సలమా బిన్ అక్వా (రజి)ను ప్రశ్నించగా, "ప్రాణాలకు తెగించి పోరాడ తామ"ని ఆయన సమాధానమిచ్చారు.**

**64) అలా బిన్ ముసయ్యిబ్ గారికి ఆయన తండ్రి ఇలా వివరించారు: నేను బరా బిన్ ఆజిబ్(రజి) సన్నిధిలో హాజరై, 'మీకు శుభం! మీకు దైవప్రవక్త (సఅసమ్) సాంగత్య భాగ్యం ప్రాప్తమయింది. మీరు వృక్షం క్రింద దైవప్రవక్త(స) సమక్షంలో విధేయతా ప్రమాణం కూడా చేశార'ని విన్నవించుకోగా, "అబ్బాయి (అది నిజమేననుకో)! కాని దైవప్రవక్త(స) పరమపదించిన తరువాత మేము ఏమేమి చేశామో నీకేం తెలుసు?"[1] అని పలికారు.**

**65) సాబిత్ బిన్ జహ్హాక్(రజి) అబూ ఖలాబాతో ఇలా అన్నారు : "నేను వృక్షం క్రింద దైవప్రవక్త(సఅసమ్) సమక్షంలో విధేయతా ప్రమాణం చేశాను."**

---

61–1. హిజ్రీ 61వ యేట జరిగిన సంఘటన ఇది. మదీనా వాసులు యజీద్‌లోని దుర్మార్గాన్ని చూసి, అతని ముందు చేసిన 'ప్రతిజ్ఞ'ను భంగపరిచి, అబ్దుల్లాహ్ బిన్ హంజలాను తమ పరిపాలకునిగా చేసుకున్నారు. (ఈయన తండ్రి హంజలా ఎవరో కాదు, ఒక యుద్ధంలో అమరగతినొందినప్పుడు దైవదూతల చేత స్నానం చేయించ బడిన సౌభాగ్యవంతుడు). ఈ విషయం తెలుసుకున్న యజీద్ ముస్లిం బిన్ ఉఖ్‌బా నేతృత్వంలో ఒక భారీ సైన్యాన్ని మదీనాపైకి పంపి మారణకాండ సృష్టించాడు.

64–1. ఇది బరా బిన్ ఆజిబ్(రజి) లోని వినమ్రతకి, అణకువకి ఒక మచ్చుతునక. ఆ పుణ్య పురుషులు గొప్ప త్యాగాలు చేసి కూడా దురాచారాలకు దూరంగా ఉండి కూడా సతతం ఆత్మ పరిశీలన చేసుకుంటూ ఉండేవారు. గర్వం, బడాయి వంటివి వారిలో ఏ కోశానా ఉండేవి కావు.

**66)** మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి) కథనం: "ఓ ప్రవక్తా! మేము నీకు స్పష్టమైన విజయాన్ని ప్రసాదించాము" **(48:1)** అనే దైవవచనం హుదైబియా ఒడంబడిక నేపథ్యంలోనే అవతరించింది. అప్పుడు ప్రవక్త ప్రియ సహచరులు, 'దైవప్రవక్తా! మీకు శుభం. కాని మా కోసం ఏముంది?' అని విన్నవించుకోగా, "విశ్వాసులైన పురుషులూ, స్త్రీలూ శాశ్వతంగా ఉండేటందుకు ఆయన వారిని క్రింద కాలువలు ప్రవహించే వనాలలో ప్రవహింపజేయాలని..." అనే ఆయత్ అవతరించింది **(48: 5)**. షూబా ఇలా అన్నారు : నేను కూఫాకు వచ్చినప్పుడు ఈ హదీసును పూర్తిగా ఆయన ముందు ప్రస్తావించాను. అప్పుడు ఆయన ఇలా అన్నారు : "మేము నీకు స్పష్టమైన విజయాన్ని ప్రసాదించాము" అనే వాక్యానికి భావార్థం అనస్(రజి) ద్వారా చెప్పబడింది. "ముబారక్ ముబారక్" అనేది ఇక్రిమా చేత నకలు చేయబడింది.

**67)** మజ్‌జా బిన్ జాహిర్ అస్లమీతో ఆయన తండ్రి జాహిర్ బిన్ అస్వద్ (రజి) ఇలా చెప్పారు: ఆయన కూడా బయ్‌తె రిజ్వాన్‌లో పాల్గొన్నవారే. ఆయన ఇలా అన్నారు– 'నేను కుండలో గాడిద మాంసం వండుతుండగా దైవప్రవక్త (సఅసమ్) తరపున ప్రకటన గావించే వ్యక్తి ఒకతను, దైవప్రవక్త(స) గాడిద మాంసాన్ని నిషేధించారని ప్రకటించాడు.

మజ్‌జా తన తెగకే చెందిన ఒక సహాబీ గురించి ఏమన్నారంటే, ఆయన కూడా బయ్‌అతె రిజ్వాన్‌లో పాల్గొన్నారు. ఆయన పేరు అహ్‌బాన్ బిన్ ఔస్(రజి). ఆయన మోకాళ్ళలో బాధ ఉండేది. అందువల్ల ఆయన(నమాజ్‌లో) సజ్దా చేసినప్పుడు, తన మోకాలి క్రింద మెత్తని దిండు ఉంచుకునేవారు.

**68)** సువైద్ బిన్ నోమాన్(రజి) కథనం: ఆయన కూడా బయ్‌అతె రిజ్వాన్‌లో విధేయతా ప్రమాణం చేశారు. ఆయన ఇలా అన్నారు: ఆ దృశ్యం ఇప్పటికీ నా కళ్ళ ముందే ఉంది. దైవప్రవక్త(సఅసమ్) కోసం, ఆయన ప్రియ సహచరుల కోసం సత్తు అంబలి సమర్పించబడినప్పుడు వారు దానిని సేవించారు. ఈ ఉల్లేఖనాన్ని ముఆజ్ కూడా షూబా ఆధారంగా అనుసరించారు.

**69)** అబూ జమ్‌రా ఇలా అన్నారు : నేను ఆయిజ్ బిన్ అమ్ర్(రజి)ను అడిగాను– ఆయన దైవప్రవక్త(స) ప్రియ సహచరులలో ఒకరు. బయ్‌అతె రిజ్వాన్‌లో కూడా పాల్గొన్నారు. 'విత్ర్ నమాజ్‌ను (ఒక రకఅత్ చేసిన మీదట)

భగ్నపరచటం సమంజసమేనా?' అని ఆయన్ని అడిగితే, "నీవు గనక రాత్రి మొదటి భాగంలో విత్ర్ చేసుకుని ఉంటే రాత్రి చివరి భాగంలో దానిని ఆచరించకు"[1] అని చెప్పారు.

**70)** జైద్ బిన్ అస్లమ్ తెలియజేశారు: ఆయన తండ్రి అస్లమ్ ఒకానొక ప్రయాణం (హుదైబియా ప్రయాణం)లో ప్రవక్త మహనీయుల(సఅసమ్) వెంట ఉన్నారు. రాత్రి సమయం. ఆ సమయంలో ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) దైవ ప్రవక్త(స)ను వెన్నంటి ఉన్నారు. ఉమర్ ఆయన(స)కు ఏదో అడిగారు. కాని ఆయన (స) సమాధానం ఇవ్వలేదు (ఎందుకంటే ఆ సమయంలో దైవప్రవక్తపై దైవవాణి అవతరిస్తూ ఉంది. ఆ సంగతి ఉమర్‌కు తెలీదు). ఉమర్ మళ్ళీ అడిగారు. ఈ సారి కూడా జవాబు రాలేదు. ఆయన మళ్ళీ ప్రశ్నించగా మూడవ సారి కూడా దైవప్రవక్త(స) నుండి సమాధానం రాలేదు.

అప్పుడు ఉమర్ (తన మనసులో) ఇలా అనుకున్నారు: 'ఉమర్! నీ తల్లి నీ పరిస్థితిపై ఏడ్వ. దైవప్రవక్త(స)ను నీవు మూడు సార్లు ప్రశ్నించావు. ఒక్కసారి కూడా నీకు జవాబు ఇవ్వలేదు'. తరువాత ఉమర్(రజి) తన ఒంటెను వేగంగా తోలుకుని, ముస్లింలందరికన్నా ముందుకు వెళ్ళిపోయారు. తన గురించి దైవాజ్ఞ ఏదయినా అవతరిస్తుందేమోనని ఉమర్ భయపడిపోయారు. కొన్ని క్షణాల తర్వాత ఒక వ్యక్తి నా పేరు పెట్టి పిలవటం నేను విన్నాను.

ఆయన(రజి) ఇలా అన్నారు: నేను ముందు నుంచే భయాందోళనకు గురై ఉన్నాను. నా ప్రవర్తనపై ఎక్కడ వహీ అవతరించిందోనని నేను వణికిపోయాను. తరువాత నేను దైవప్రవక్త(స) సన్నిధిలో హాజరై సలామ్ చేశాను. ఆయన(స) ఇలా అన్నారు : "రాత్రి నాపైన ఒక సూరా అవతరించింది. సూర్యుడు ఎక్కడెక్కడి వరకు ఉదయిస్తాడో ఆ జగమంతటికన్నా నాకు ఈ సూరా ప్రియమైనది"- ఆ తరువాత ఆయన(స), 'ఇన్నాఫతహ్‌నా లక ఫతహమ్ముబీనా' (ప్రవక్తా! మేము నీకు స్పష్టమైన విజయాన్ని ప్రసాదించాము) అనే వాక్యాన్ని పారాయణం చేశారు.[1]

---

69-1. అంటే 'విత్ర్'ను భగ్నపరచకు. ఇంతకుముందు కూడా ఇది చర్చకు వచ్చింది. మాలికీల, హనఫీల, షాఫయీల పంథా కూడా ఇదే. కాని అహ్లె హదీసు వారి దృష్టిలో ఒక రకఅత్ విత్ర్ నమాజ్ చేసిన తరువాత, తదుపరి రకఅత్‌ను భగ్న పరచటం సరైనదే. ఇబ్నె ఉమర్(రజి) ద్వారా కూడా ఇలాగే ఉటంకించబడింది.

**71)** మిస్వర్ బిన్ మఖ్రమా, మర్వాన్ బిన్ హకమ్‌లిరువురూ ఇలా తెలిపారు. వారు ఒకరింకొకరికి జ్ఞాన బోధ చేసుకుంటూ ఉంటారు. వారిలా వివరించారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) హుదైబియా సందర్భంగా దాదాపు వెయ్యి మంది సహచరమాన్యులతో ప్రయాణమయ్యారు. 'జుల్ హులైఫా' వద్దకు చేరుకోగానే ఖుర్బానీ పశువుల మెడలలో త్రాడు వేశారు. వాటికి గుర్తులు కూడా వేశారు. అక్కడి నుంచే ఇహ్రామ్ దీక్ష కూడా బూనారు. పిదప ఆయన(స) ఖుజాఅ తెగకు చెందిన ఒక మనిషిని గూఢచర్యం కొరకు ముందుకు పంపారు. ఆయన స్వయంగా కూడా ప్రయాణాన్ని కొనసాగించారు. 'గదీరుల్ అష్తాత్' ప్రదేశానికి చేరుకునేసరికి ఆయన(స) గూఢచారి కూడా సమాచారం సేకరించి వచ్చారు. గూఢచారి ఇలా అన్నారు : 'ఖురైషులు మీకు వ్యతిరేకంగా పెద్ద సైన్యాన్ని సమీకరించారు. వివిధ తెగలను పిలిపించారు. వారంతా మీతో యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉన్నారు. మిమ్మల్ని ఎలాగైనా సరే కాబా గృహం వద్దకు రాకుండా చూడాలన్నది వారి ఏకైక లక్ష్యం'.

అప్పుడు దైవప్రవక్త(స) తన సహచరులను పిలిచి, "నాకు సలహా ఇవ్వండి. కాబా గృహం వరకూ చేరకుండా అడ్డుకుంటున్న సత్య తిరస్కారుల స్త్రీలపై, పిల్లలపై దాడి చేయటం మీ ఉద్దేశ్యంలో సమంజసమేనా? ఒకవేళ వారు మాతో తలపడితే... అల్లాహ్ బహుదైవారాధకుల బారి నుండి మన గూఢచారులను సురక్షితంగా ఉంచాడు. ఒకవేళ వారు మనల్ని ప్రతిఘటించకుండా ఉంటే, మనం వారిని ఓడిపోయిన జాతి అనుకుని వదిలేద్దాం" అన్నారు. దానిపై అబూబక్ర్(రజి), 'దైవ ప్రవక్తా(స)! తమరు కేవలం దైవగృహాన్ని సందర్శించి ఉమ్రా చేసుకునే సంకల్పంతో బయల్దేరారు. ఒకరిని హత్య చేయటంగానీ, ఒకరితో యుద్ధం చేయడం గానీ మీ ఉద్దేశం కానేకాదు. కాబట్టి మీరు దైవ గృహానికి పదండి. అప్పటికీ ఎవరయినా మనల్ని దైవగృహం వరకూ చేరుకోకుండా అడ్డుకుంటే, మనం వారితో యుద్ధం చేద్దాం' అన్నారు. "మరి అలాగైతే అల్లాహ్ పేరుతో ముందుకు పదండి" అని దైవ ప్రవక్త(స) చెప్పారు.

---

70–1. దైవప్రవక్త(స)పై అల్ ఫత్హ్ సూరా అవతరిస్తున్న సంగతి ఉమర్(రజి)కు తెలీదు. తెలిస్తే మూడుసార్లు ప్రశ్నించేవారు కారు. తన ప్రశ్నకు దైవప్రవక్త(స) నుండి సమాధానం రాకపోవటంతో ఆయన లోలోపలే భయపడిపోవటం గమనార్హం. అల్ ఫత్హ్ సూరాలో ఇటు దైవప్రవక్త(స)కు, అటు ముస్లింలకు కూడా శుభవార్త వినిపించబడింది.

**72)** ఉర్వా బిన్ జుబైర్ గారు అందించిన సమాచారం. ఈయన మర్వాన్ బిన్ హకమ్, మిస్వర్ బిన్ మఖ్రమా చెప్పగా విన్నారు. ఈ ఉల్లేఖకులిరువురూ దైవప్రవక్త(సఅసమ్) నుండి హుదైబియా ఉమ్రా గురించి వివరించారు. ఆ సంఘటనలోని కొంత సమాచారాన్ని ఉర్వా తనకు తెలియజేశారని ముస్లిం బిన్ షిహాబ్ చెప్పారు : దాని ప్రకారం దైవప్రవక్త(స)కి- ఖురైషుల ప్రతినిధి అగు సుహైల్ బిన్ అమ్ర్‌కి మధ్యన ఒక నిర్ణీత గడువు కొరకు నిర్యుద్ధ సంధి జరిగి, ఆ దస్తావేజును వ్రాయిస్తూ ఉండగా, "మా (మక్కా) మనిషి ఎవరయినాసరే, అతడు మీ మతస్థుడైనాసరే పారిపోయి మీ దగ్గరకు వచ్చి, మీ శరణు కోరినట్లయితే మీరతనిని మాకు అప్పగించాలి. మేము అతని పట్ల మాకు ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తాము" అని సుహైల్ షరతు విధించాడు. సుహైల్ ఈ షరతుపై మొండిపట్టు పట్టాడు. దైవప్రవక్త(స) ఆ షరతును అంగీకరించారు. కాని ముస్లింలు మాత్రం దానికి ససేమిరా అన్నారు. (తమ దగ్గరకు వచ్చిన ఒక ముస్లింను అవిశ్వాసులకు ఎలా అప్పగిస్తాం? అన్నది ముస్లింల ప్రశ్న). ఒకవేళ ఇలా జరగదనుకుంటే ఈ సంధి కూడా జరగదు అని సుహైల్ హఠం చేశాడు. ఎట్టకేలకు దైవప్రవక్త(స) దీనికి తన ఆమోదం తెలిపారు. సరిగ్గా ఆ సమయంలోనే మక్కా నుండి పారిపోయి వచ్చిన సుహైల్ కుమారుడు అబూ జందల్‌ను దైవప్రవక్త(స) షరతుకు కట్టుబడి అతని తండ్రికి అప్పగించారు. అబూ జందల్ ఇస్లామ్ స్వీకరించారు. ఆయన ఇనుప సంకెళ్ళలో బంధించబడి ఉన్నారు. నిర్యుద్ధ సంధి జరిగివున్న గడువు కాలంలో కొంతమంది ముస్లిం స్త్రీలు మక్కా నుండి హిజ్రత్ చేసి మదీనా వచ్చారు. ఉమ్మె కుల్సుమ్ బిన్తె ఉఖ్బా బిన్ ముఅయ్‌త్ కూడా వారిలో ఒకరు. ఆ సమయంలో ఆమె నవ యువతి. ఆమె కుటుంబీకులు దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి ఆమెను తమకు అప్పజెప్పమని కోరారు. అప్పుడు అల్లాహ్ విశ్వసించిన స్త్రీలకు సంబంధించి ఆయత్‌ను అవతరింపజేశాడు.

మహాప్రవక్త(సఅసమ్) సతీమణి హజ్రత్ ఆయిషా(ర.అ) కథనం ప్రకారం అవతరించిన దైవాదేశం యిది: "ప్రవక్తా! విశ్వసించిన స్త్రీలు నీ వద్దకు వచ్చి..." (చివరి వరకు). ఈ ఆయత్ అవతరించిన మీదట దైవప్రవక్త(స), హిజ్రత్ చేసి వచ్చిన స్త్రీలను మొదట బాగా కనిపెట్టుకుని ఉండేవారు. ఆ విధంగా వలస వచ్చిన స్త్రీలకు వారి భర్తలు ఇచ్చి ఉన్న సొమ్ములన్నింటినీ వారికి వాపసు చేయవలసిందిగా కూడా దైవప్రవక్త(స) ఆజ్ఞాపించారు.

**73)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఒకసారి అరాచకం నెలకొని ఉన్న కాలంలో ఉమ్రా చేసే సంకల్పంతో బయలుదేరారు. ఆ సందర్భంగా ఆయన (రజి) ఇలా అన్నారు : "ఒకవేళ దైవగృహం వరకూ వెళ్ళకుండా నన్ను అడ్డుకోవటం జరిగితే (హుదైబియా సందర్భంగా) దైవప్రవక్త(స)తోపాటు చేసిన పనినే ఇప్పుడూ చేస్తాను"– అందుచేత ఆయన కేవలం ఇహ్రామ్ దీక్షబూనారు. ఎందుకంటే దైవప్రవక్త(స) కూడా హుదైబియా సందర్భంగా కేవలం ఇహ్రామ్ దీక్షబూనారు.

**74)** నాఫె కథనం ప్రకారం– మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఇహ్రామ్ కట్టుకున్న పిదప ఇలా అన్నారు: "ఒకవేళ బైతుల్లాహ్ వరకూ చేరుకోకుండా నన్ను నిలువరించటం జరిగితే, ఖురైష్ సత్య తిరస్కారులు దైవప్రవక్త(స)ను నిలువరించినప్పుడు, ఆయన(స) చేసిన పనినే నేనూ చేస్తాను." పిదప ఆయన (రజి) ఈ ఆయత్‌ను పారాయణం చేశారు– "వాస్తవంగానే అల్లాహ్ ప్రవక్తలో మీకు ఒక మంచి ఆదర్శం ఉంది." **(33 : 21)**

**75)** నాఫె కథనం : మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కుమారులలో ఒక అబ్బాయి ఆయనన్నుద్దేశించి, '(నాన్నా!) ఈ ఏడాది మీరు ఉమ్రా కొరకు వెళ్ళకుండా ఉంటే బాగుండేదేమో! ఎందుకంటే మీరు కాబా గృహం వరకూ వెళ్ళ లేరేమో! అని నా అనుమానం' అని సలహా ఇచ్చారు. దానిపై ఇబ్నె ఉమర్(రజి) ఇలా అన్నారు: "లోగడ మేము దైవప్రవక్త(సఅసమ్)తో కలసి ఉమ్రా కొరకు ప్రయాణమయ్యాము. కాని ఖురైష్ అవిశ్వాసులు కాబా గృహం వరకూ చేరుకో కుండా మమ్మల్ని అడ్డుకున్నారు. అందువల్ల దైవప్రవక్త ఖుర్బానీ పశువులను హుదైబియాలోనే జిబహ్ చేసి, శిరోముండనం చేయించుకున్నారు. ప్రవక్త ప్రియ సహచరులు కూడా తలలు గొరిగించుకున్నారు. ఆ సందర్భంగా దైవప్రవక్త(స), "నేను నా మీద ఒక ఉమ్రాను తప్పనిసరి (వాజిబ్) చేసుకున్నానన్న విషయానికి మీరే సాక్షులు!" అని పలికారు. (ఆ విధంగా సహచరమాన్యులపై కూడా ఆ ఉమ్రా తప్పనిసరి అయింది).కనుక ఈ రోజు నన్ను బైతుల్లాహ్ వరకూ చేరుకోనిస్తే నేను కూడా ప్రదక్షిణ (తవాఫ్) చేసుకుంటాను. ఒకవేళ నన్ను అడ్డుకుంటే, ఆనాడు దైవప్రవక్త(స) చేసినదే నేనూ చేస్తాను. మరి కొద్ది దూరం ముందుకుపోయిన తరువాత, 'నేను నా మీద ఉమ్రాతోపాటు హజ్జ్‌ను కూడా తప్పనిసరిగా ఖరారు చేసుకున్నాను. ఈ విషయానికి మీరే సాక్షులు' అని చెప్పారు. 'నా దృష్టిలో హజ్జ్,

ఉమ్రాలు రెండూ ఒకలాంటివే' అని కూడా పలికారు. తరువాత ఆయన (మక్కా చేరుకోగానే) ఒకసారి ప్రదక్షిణ (తవాఫ్), సయీ చేశారు. చివరకు ఆ రెండింటినీ నెరవేర్చారు.

**76)** నాఫే వివరించారు: ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) కన్నా ముందే అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఇస్లామ్‌లో ప్రవేశించినట్లు జనులు చెప్పుకుంటున్నారు. నిజానికి ఇది తప్పు. ఇంతకూ జరిగిందేమిటంటే తన గుర్రాన్ని తీసుకురావలసిందిగా ఉమర్(రజి) తన కుమారుడు అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి)ను పంపారు. ఆ సమయంలో ఆ గుర్రం ఒక అన్సారీ సహాబీ వద్ద ఉంది. ఆ గుర్రంపైనే స్వారీ అయి యుద్ధ రంగానికి వెళ్ళాలనుకున్నారు ఉమర్(రజి). ఆ సందర్భంగా దైవప్రవక్త(స) ఒక చెట్టు క్రింద కూర్చుని, విధేయతా ప్రమాణం చేయించుకుంటు న్నారు. ఈ సమాచారం అప్పటికింకా ఉమర్(రజి)కు చేరలేదు. అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) మొదట బయ్అత్ (విధేయతా ప్రమాణం) చేసి, ఆ తరువాత గుర్రం తీసుకోవడానికి వెళ్ళారు. తీరా ఆయన ఆ గుర్రాన్ని తీసుకుని వచ్చే సమయానికి ఉమర్ (రజి) యుద్ధ కవచం ధరిస్తున్నారు. దైవప్రవక్త(స) చెట్టు క్రింద కూర్చుని ప్రతిజ్ఞ చేయించుకుంటున్న సంగతిని తన తండ్రికి తెలియజేశారు ఇబ్నె ఉమర్. అప్పుడాయన తన కుమారుణ్ణి వెంటబెట్టుకుని వెళ్ళి విధేయతా ప్రమాణం (ప్రతిజ్ఞ, బయ్అత్) చేశారు. ఈ విషయం ఆధారంగా జనులు 'ఉమర్‌కన్నా ముందు అబ్దుల్లాహ్ ఇస్లామ్‌లో ప్రవేశించారు'ని అంటున్నారు (ఇది సరైనది కాదు).

అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు: హుదైబియా ఒడంబడిక సందర్భంగా దైవప్రవక్త(స) వెంట ఉన్న ప్రవక్త ప్రియ సహచరులు వివిధ చెట్ల నీడల్లోకి విస్తరించారు. ఉన్నట్టుండి అకస్మాత్తుగా చాలామంది సహచరమాన్యులు దైవప్రవక్త(స) చుట్టూ గుమిగూడారు. అప్పుడు ఉమర్(రజి), "అబ్బాయి, అబ్దుల్లాహ్! జనులు దైవప్రవక్త(స) వద్ద ఎందుకు గుమిగూడారో చూడు!" అని చెప్పగా, అబ్దుల్లాహ్ వెళ్ళి, ప్రజలు విధేయతా ప్రమాణం చేస్తున్న వైనాన్ని తిలకించారు: ఆయన స్వయంగా కూడా విధేయతా ప్రమాణం చేశారు. తరువాత వెళ్ళి తన తండ్రికి సమాచారం అందజేశారు. అప్పుడు ఉమర్(రజి) కూడా వచ్చి ప్రమాణం చేశారు.

**77) ఇస్మాయిల్ బిన్ అబీ ఖాలిద్ కథనం: నేను అబ్దుల్లాహ్ బిన్ అబీ అవ్ఫా(రజి) చెప్పగా విన్నాను - ఆయన ఏమన్నారంటే; ప్రవక్త మహనీయులు (ఖజా) ఉమ్రా చేసినప్పుడు మేము కూడా ఆయన(స) వెంట ఉన్నాము. దైవ ప్రవక్త(స) కాబా గృహ ప్రదక్షిణ చేసినప్పుడు మేము కూడా ప్రదక్షిణ చేశాము. దైవప్రవక్త(స) నమాజ్ చేసినప్పుడు మేము కూడా నమాజ్ చేశాము. దైవప్రవక్త(స) సఫా- మర్వాల 'సయీ' కూడా చేశారు. ఆ సమయంలో మేము ఆయనకు రక్షా కవచంగా ఉన్నాము- ఏదైనా అవాంఛనీయమైన సంఘటన జరగరాదన్న ఉద్దేశ్యంతో.**

**78) అబూ వాయల్ కథనం: సహ్ల్ బిన్ హునైఫ్(రజి) సిఫ్ఫీన్ యుద్ధం (ఈ యుద్ధం మహనీయ అలీ-రజి-కి- ముఆవియా-రజి-కి మధ్య జరిగింది) నుండి తిరిగి వచ్చినప్పుడు, పరిస్థితుల స్వరూపాన్ని గురించి తెలుసుకోవడానికి మేము ఆయన దగ్గరకు వెళ్ళాము. ఆయన ఇలా అన్నారు : మీరు ఈ యుద్ధంపై మీ మీ అభిప్రాయాలను వ్యక్తం చేసి బడాయి పోకండి.[1] నేను 'అబూ జందల్ రోజున' కూడా (హుదైబియాలో) ఉన్నాను.[2] ఒకవేళ దైవప్రవక్త(స) ఆజ్ఞను ఉల్లంఘించటం సంభవమై ఉంటే, నేను ఆ రోజే ఆజ్ఞోల్లంఘనకు ఒడిగట్టి ఉండేవాణ్ణి. సంక్లిష్టమైన కార్యసాధన కోసం మేము మా ఖడ్గాలను భుజాలకు వ్రేలాడదీసుకున్నప్పుడల్లా పరిస్థితుల స్వరూపం మా కొరకు సులభతరం**

---

78-1. 'సిఫ్ఫీన్' అనేది ఒక ప్రదేశం పేరు. ఈ ప్రదేశంలోనే హజ్రత్ అలీ (రజి)కి- ముఆవియా (రజి)కి మధ్య పోరాటం జరిగింది. రెండు ముస్లిం వర్గాల మధ్య జరిగిన సమరమది.

78-2. హదీసు మూలంలో 'యౌమె అబూజందల్' ప్రస్తావన వచ్చింది. అబూ జందల్ సంఘటన ముస్లింల పాలిట ఒక పరీక్ష. ఒకవైపు హుదైబియా ఒప్పందం దస్తావేజు పూర్తిగా వ్రాయకముందే, అబూ జందల్ ఇస్లామ్ స్వీకరించి మక్కా నుండి హుదైబియాకు పారిపోయి వచ్చారు. తనను ముస్లింలు ఆదుకుంటారని అబూ జందల్ ఆశించారు. అతనిని అవిశ్వాసులకు తిరిగి అప్పగించటం తమకు అవమాన కరం అని ముస్లింలు తలపోశారు. కాని దైవప్రవక్త(స) హుదైబియా ఒడంబడికకు కట్టుబడి, ఆ బాధిత వ్యక్తిని మక్కా ఖురైషులకు అప్పగించారు.

కాబట్టి మీరు మీ మీ స్వంత అభిప్రాయాలపై గర్వపడకండి. షరీఅత్ కోణం నుండి విషయాన్ని తరచి చూడండి అన్నది సహ్ల్ బిన్ హునైఫ్(రజి) పలుకుల్లోని అంతరార్థం.

**అయిపోయింది. మేము ఆ సంక్లిష్ట సంక్షోభాన్ని అధిగమించామన్న విషయం దైవానికి, దైవప్రవక్త(స)కు బాగా తెలుసు. కాని ఈ యుద్ధ పరిస్థితి కదు విచిత్రం. ఈ యుద్ధంలో మేము (ఉపద్రవం యొక్క) ఒక రంధ్రాన్ని మూసివేస్తే, రెండవ రంధ్రం తెరచుకునేది. ఆ సమయంలో ఏం చేయాలో మాకు బోధపడేది కాదు.**

**79) కాబ్ బిన్ ఉజ్రా (రజి) తెలియజేశారు: ఆయన ఉమ్రా హుదైబియా సందర్భంగా ప్రవక్త మహనీయులు(సఅసమ్) సమక్షంలో హాజరైనప్పుడు, తలలోని పేలు తన ముఖంపై పడటం గమనించారు. "నీ తలలో నుంచి రాలుతున్న ఈ పేలు నీకు ఇబ్బందికరంగా ఉన్నాయా?" అని అడిగారు దైవప్రవక్త(స). దానికి ఆయన(రజి) 'అవున'న్నారు. "అలాగైతే శిరోముండనం చేయించుకో. (దానికిగాను పరిహారంగా) మూడు రోజులపాటు ఉపవాసం ఉండు లేదా ఆరుగురు నిరుపేద లకు అన్నం తినిపించు లేదా ఏదైనా పశువును ఖుర్బానీ ఇవ్వు" అని దైవప్రవక్త(స) బోధించారు- ఈ మూడు పనులలో ముందుగా దేనిని ప్రస్తావించారో తనకు కచ్చితంగా జ్ఞాపకం లేదని ఉల్లేఖకుడు (అయ్యూబ్ సఖ్తియానీ) చెప్పారు.**

**80) కాబ్ బిన్ ఉజ్రా (రజి) ఇలా వివరించారు: హుదైబియా ఒడంబడిక సందర్భంగా మేము దైవప్రవక్త(సఅసమ్) వెంట ఉన్నాము. ఇహ్రామ్ కట్టుకుని ఉన్నాము. అటు బహుదైవారాధకులు మమ్మల్ని కాబా గృహం వైపునకు పోనివ్వటం లేదు. నా తల వెంట్రుకలు పొడవుగా ఉన్నాయి. తలలోని పేలు నా ముఖంపై పడసాగాయి. ఇది గమనించిన దైవప్రవక్త(స), "ఈ పేలు నీకు బాధ కలిగిస్తు న్నాయా?" అని అడిగారు. దానికి నేను 'అవున'న్నాను. అప్పుడు ఈ ఆయత్ అవతరించింది: *"కాని మీలో ఎవరయినా వ్యాధిగ్రస్తులై లేదా తల బాధకు లోనై (ఖుర్బానీ తన స్థానానికి చేరకముందే) శిరో ముండనం చేయించుకుంటే దానికి పరిహారంగా ఉపవాసం ఉండాలి లేక దానధర్మాలు చేయాలి లేదా ఖుర్బానీ ఇవ్వాలి.*[1]**

---

80-1. ఈ ఉల్లేఖనాలన్నింటిలో- ఏదో ఒక విధంగా- హుదైబియా సంఘటన ప్రస్తావనకు వస్తుంది. ఈ కారణంగానే ఈ అధ్యాయంలో వాటన్నింటినీ పొందుపరచవలసి వచ్చింది.

ఇహ్రామ్ దీక్షలో ఉన్నప్పుడు వ్యాధి బాధ అధికమైనట్లయితే శిరోముండనం చేయించుకోవటంలో దోషం లేదు. కాని ఫిదియా (పరిహారం) చెల్లించటం తప్పనిసరి.

## అధ్యాయం : 37
# ఉక్ల్, ఉరైనా తెగల వృత్తాంతం

**81)** మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి) ఉల్లేఖించారు: ఉక్ల్, ఉరైనా తెగలకు చెందిన కొంతమంది ప్రవక్త మహనీయుల (సఅసమ్) సన్నిధికి వచ్చి ఇస్లామ్ స్వీకరించారు. తరువాత వారు 'దైవప్రవక్తా! మేము పశువులను పెంచు తాము. మా వద్ద పంట పొలాలు లేవు. (అందువల్ల మేము ఒక్కోసారి కేవలం పాలు త్రాగి పొద్దుపుచ్చుతాము)' అని విన్నవించుకున్నారు. మదీనా గాలి నీరు వారికి పడలేదు. అందువల్ల దైవప్రవక్త(స) వారి కోసం కొన్ని ఒంటెల్ని సమకూర్చి, ఒక ఒంటెల కాపరిని కూడా ఇచ్చి హర్రా ప్రదేశానికి పంపారు. "ఈ ఒంటెల పాలు, మూత్రం త్రాగండి (మీ జబ్బు నయమవుతుంది)" అని వారికి సూచించారు. వారంతా పశువుల మేత ప్రదేశానికి వెళ్ళారు. కాని 'హర్రా' ప్రదేశానికి చేరగానే వారు ఇస్లామ్‌నుండి ధర్మభ్రష్టులై, దైవప్రవక్త(స) ద్వారా పంపబడిన పశువుల కాపరిని కూడా చంపేసి, ఒంటెల్ని తోలుకుని పరారయ్యారు. ఈ విషయం తెలుసు కున్న దైవప్రవక్త(స) కొంతమంది సహచరుల్ని వారి వెనుకే పంపించారు (వారంతా బందీలుగా మదీనాకు తీసుకురాబడ్డారు). దైవప్రవక్త(స) ఆదేశానుసారం వారి కళ్ళల్లో వేడివేడి దబ్బనాలు త్రిప్పబడ్డాయి (ఎందుకంటే వారు పశువుల కాపరిని అలాగే చిత్రహింసలు పెట్టారు). తరువాత వారిని హర్రా క్షేత్రంలో నిస్సహాయు లుగా వదలిపెట్టడం జరిగింది. ఆ స్థితిలోనే వారక్కడ ప్రాణం విడిచారు. ఖతాదా కథనం ప్రకారం, ఆ తర్వాత దైవప్రవక్త(స) దానధర్మాలు చేయమని తన సహచరు లకు ఆజ్ఞాపించారు. 'ముస్లా' చేయడాన్ని (మృతుని శరీరావయవాలను కోసి, రూపురేఖలు మార్చివేయడాన్ని) నిషేధించారు.[1]

**82)** అబూ ఖిలాబా 'మౌలా' అగు అబూ రజా తెలిపారు : ఆయన అబూ ఖిలాబా వెంట సిరియాలో ఉండగా ఖలీఫా ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ ప్రజలతో

81-1. ఆ పశువుల కాపరి పేరు యసార్ నూబీ (రజి). ఉక్ల్, ఉరైనా తెగలవారు ధర్మభ్రష్టులై, ఒంటెల్ని తోలుకుని పారిపోతున్నప్పుడు ఆ కాపరి వాళ్ళను ప్రతిఘటించాడు. దాంతో వారంతా కలసి అతని కాళ్ళు చేతుల్ని నరికేశారు. అతని కళ్ళల్లో, నాలుకలో ముళ్ళు దిగబెట్టారు. ఆ బాధతోనే ఆ సహాబీ అసువులు బాసారు. అందుకే ప్రతీకార న్యాయంగా వారందరినీ ఆ విధంగా శిక్షించటం జరిగింది. 'హర్రా' అనేది మదీనా నగరం వెలుపల ఉన్న ఓ రాతి ప్రదేశం.

**సలహా సంప్రతింపులు జరుపుతూ 'ఆ ఖసామత్' గురించి మీ అభిప్రాయం ఏమిటి? అని అడిగారు. దానికి సమాధానంగా ప్రజలు, 'అది సత్యబద్ధమైనది' అని చెప్పారు. దాని ప్రకారం మీకు పూర్వం దైవప్రవక్త(స), సన్మార్గగాములైన ఖలీఫాలు నిర్ణయం గైకొనేవారు అని కూడా వారు చెప్పారు. అబూ రజా ఇలా అన్నారు: ఆ సమయంలో అబూ ఖిలాబా ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్(రహ్మాలై) సింహాసనం వెనుకే ఉన్నారు. అంతలో అంబసా బిన్ సయీద్ కల్పించుకుని 'మరి అలాగైతే ఉర్రైనా తెగవారికి సంబంధించి అనస్(రజి) హదీసు సంగతేమిటి?' అని సందేహపడ్డారు. దానిపై అబూ ఖిలాబా ఇలా అన్నారు: 'అనస్ (రజి) స్వయంగా నాకు ఆ విషయం తెలిపారు.'[1]**

## అధ్యాయం : 38

# జాతె ఖరద్ పోరు గురించి

**'గత్ఫాన్' తెగ బహుదైవారాధకులు దైవప్రవక్త(సఅసమ్)కు చెందిన 20 పాలిచ్చే ఒంటెల్ని తోలుకుని పారిపోతున్న సందర్భంగా జరిగిన పోరాటమిది. ఇది ఖైబర్ యుద్ధంకన్నా మూడు రాత్రులు ముందు సంభవించింది.[1]**

---

82–1. హత్యా నేరానికి సంబంధించిన సాక్ష్యాధారం లభించనప్పుడు, శవం ఏదైనా ఊరిలో లేదా వాడలో లభ్యమైనప్పుడు, ఆ ప్రాంతంలోని అనుమానితులైన వారిలోనుండి యాభై మందిని పిలిచి వారిచేత 'ప్రమాణం' చేయించటం జరుగుతుంది. దీనినే 'ఖసామత్' అంటారు. దైవప్రవక్త(స) ఉర్రైనా తెగవారి చేత ప్రమాణం చేయించలేదు కదా! వారిపై ప్రతీకార న్యాయం (ఖిసాస్) చేశారు కదా! అన్న అంబసా సందేహం సరైనది కాదు. ఎందుకంటే ఉర్రైనా జనుల హత్యానేరం రుజువైనది. నేరం రుజువు కానప్పుడే, వ్యవహారం అనుమానాస్పదం అయినప్పుడే 'ఖసామత్' (ప్రమాణం) ప్రసక్తి వస్తుంది.

ఉల్లేఖనంలో ఖలీఫా హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ పేరు వచ్చింది. ఆయన న్యాయశీలుడైన పరిపాలకుడుగా ఖ్యాతి గడించారు. ఇమామత్, ఇజ్తెహాద్, మఆరిఫత్, అహాదీస్, ఆసార్– విద్యలలో ఆయన నిష్ణాతులన్న విషయాన్ని అందరూ అంగీకరిస్తారు. అంతేకాదు, ఆయన్ని తన కాలపు 'ముజ్తహిదె ఇస్లామ్' (ఇస్లామ్ శాసనాన్వయకర్త)గా కూడా అంగీకరిస్తారు. హదీసుల క్రోడీకరణ కోసం, హదీసులను లిఖించే ప్రక్రియ కోసం ఆదేశాలను జారీ చేసిన ఘనత కూడా ఆయనకు దక్కింది.

38–1. జాతె ఖరద్ అనేది ఒక నీటి చెలమ పేరు. అది గత్ఫాన్ తెగ వారు నివసించే ప్రాంతానికి సమీపంలో ఉండేది.

**83)** సలమా బిన్ అక్వా (రజి) చెప్పగా తాను విన్నానని యజీద్ బిన్ అబీ ఉబైద్ తెలియజేశారు: సలమా ఇలా చెప్పారు- ఫజ్ర్ అజాన్ కంటే ముందే నేను (మదీనా నుండి గాబా ప్రాంతం వైపు) బయలుదేరాను. ఆ రోజుల్లో దైవప్రవక్త (సఅసమ్) గారి పాలిచ్చే ఒంటెలు 'జాతుల్ ఖరద్'లో మేత మేసేవి. దారిలో నాకు అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) గారి సేవకులు ఎదురుపడి 'దైవప్రవక్త(స) ఒంటెలు పట్టుకోబడ్డాయి' అని చెప్పారు. 'ఎవరు పట్టుకున్నార'ని నేను అడిగితే, 'గత్ఫాన్ తెగవారు' అని వారు చెప్పారు. ఆ తర్వాత నేను మూడుసార్లు బిగ్గరగా గొంతెత్తి 'యా సబాహా!' అని అరిచాను. ఆ విధంగా నేను మదీనా ఇరువైపులా దిక్కులు పిక్కటిల్లేలా కేక పెట్టి ప్రమాదం గురించి ప్రజలను అప్రమత్తం చేశాను. పిదప వేగంగా పరుగెత్తుతూ ఆ బందిపోటు దొంగలను సమీపించాను. ఆ సమయంలో వాళ్ళు పశువులకు నీరు త్రాపటానికి దిగారు. నేను వారిపై బాణ వర్షం కురిపించ సాగాను. నేను విలువిద్యలో ప్రవీణుడ్ని. "నేను అక్వా పుత్రుడను. ఈ రోజు అల్పులు నాశనమయ్యే రోజు" అని కవిత్వం చెప్పసాగాను. ఇలా పదేపదే పలుకుతూ విలువిద్యను ప్రదర్శించాను. ఎట్టకేలకు వారి చెర నుండి ఒంటెల్ని విడిపించుకో గలిగాను. అంతేకాదు, ఆ బందిపోట్లకు చెందిన ముప్ఫయి దుప్పట్లు కూడా నా వశమయ్యాయి.

సలమా ఇంకా ఇలా అన్నారు: అంతలోనే ప్రవక్త మహనీయులు(సఅసమ్) కూడా తన సహచర మాన్యులతో కలసి అక్కడికి విచ్చేశారు. 'దైవప్రవక్తా! నేను నిరాఘాటంగా బాణవర్షం కురిపించి వాళ్ళకు నీరు త్రాగేందుకు కూడా వీలు చిక్కకుండా చేశాను. పైగా వాళ్ళు ఇప్పుడు కాలినడకన పోతున్నారు. వారిని పట్టు కోవడానికి తమరు తక్షణం సైనికుల్ని వెంబడించండి' అని విన్నవించుకున్నాను.

దానికి ఆయన, "అక్వా పుత్రుడా! నీవు ఎవరినయినా లొంగదీసుకున్న ప్పుడు, వారి పట్ల మృదువుగా మసలుకో" అన్నారు. సలమా (రజి) ఇలా అన్నారు: 'తరువాత మేము తిరుగుముఖం పట్టాము. దైవప్రవక్త(సఅసమ్) నన్ను మదీనా చేరుకునేవరకూ తన ఒంటెపై వెనుక కూర్చోబెట్టుకుని వచ్చారు.[1]

---

83-1. మహనీయ సలమా బిన్ అక్వా (రజి) ధైర్యసాహసాల మూలంగా, తన విలువిద్య కారణంగా బందిపోటు దొంగల ముఠాపై సునాయాసంగా పట్టు బిగించగలిగారు.

వేరొక ఉల్లేఖనం ప్రకారం సలమా (రజి) సలా కొండపైకెక్కి 'యా సబాహా! (అయ్యో! ఉదయ కాలపు విపత్తు) అని ఎలుగెత్తి ప్రకటించారు. ఆ ధ్వని మదీనాలో ప్రతిధ్వనిం

## అధ్యాయం : 39

# ఖైబర్ యుద్ధం గురించి

**84) సువైద్ బిన్ నోమాన్(రజి) తెలియజేశారు: ఖైబర్ యుద్ధం కొరకు దైవప్రవక్త(సఅసమ్)తోపాటు వెళ్ళిన వారిలో ఆయన కూడా ఉన్నారు (ఆయన ఇలా అన్నారు:) ఖైబర్ పల్లపు ప్రాంతంలో ఉన్న 'సహ్‌బా'కు చేరుకున్న మీదట దైవప్రవక్త(స) అస్ర్ నమాజ్ చేశారు. తరువాత ఆయన(స) భోజనం సమకూర్చమని కోరారు. సత్తు పిండి తప్ప మరొక ఆహార పదార్థమేదీ ఆయన సమక్షంలో హాజరు పరచబడలేదు. ఆయన(స) ఆదేశానుసారం అదే నానబెట్టబడింది. దానినే ఆయనా తిన్నారు, మేమూ తిన్నాము. ఆ తరువాత మగ్రిబ్ నమాజ్ కొరకు ఆయన(స) లేచి నిలబడ్డారు (ముందు నుంచే వుజూ చేసిన స్థితిలో ఉన్నందున) కేవలం పుక్కిలించారు. మేమూ పుక్కిలించాము. పిదప నమాజ్ చేశారు. ఈ నమాజ్ కొరకు మళ్ళీ వుజూ చేయలేదు.**

**85) సలమా బిన్ అక్వా (రజి) కథనం : మేము ప్రవక్త మహనీయుల (సఅసమ్)తోపాటు ఖైబర్‌కు బయలుదేరాము. రాత్రి పూట మా పయన బృందం సాగిపోతుండగా ఒక సహాబీ (ఉసైద్ బిన్ హుజైర్) ఆమిర్‌తో, 'ఆమిర్! కొన్ని కవితలు వినిపించు' అని కోరారు. ఆమిర్ ఒక కవి. మిత్రుని కోరికపై ఆయన తన వాహనం నుండి దిగి కవితలు వినిపించసాగారు–**

**'ఓ అల్లాహ్! నీవే గనక లేకుంటే మాకు సన్మార్గం లభించేది కాదు.**
**మేము దానధర్మాలు చేయటంగానీ, నమాజ్ చేయటం గానీ సంభవమయ్యేది కాదు.**
**కనుక మమ్మల్ని శీఘ్రంగా మన్నించు.**
**మేము బ్రతికున్నంత వరకూ మా ప్రాణాలు నీ మార్గంలో సమర్పితం.**
**ఒకవేళ మేము (శత్రువును) మార్కొనవలసి వస్తే**

---

చింది. అది బుధవారం రోజు. ఈ పిలుపుపై దైవప్రవక్త(స) అయిదు లేక ఏడు వందల మందిని తీసుకుని అక్కడికి వచ్చారు. 'నాతోపాటు వంద మందిని పంపించండి. వారి మెడలు వంచి హాజరుపరుస్తాన'ని సలమా దైవప్రవక్త(స)ను అభ్యర్థించారు. దానికి సమాధానంగా దైవప్రవక్త(స). "అదుపులోకి వచ్చిన శత్రువు పట్ల మృదువైఖరి అవలంబించాల"ని సూచించారు.

మా పాదాలకు స్థిరత్వాన్ని ప్రసాదించు. మా పైన ప్రశాంతతను అవతరింప జెయ్యి.

మమ్మల్ని వారు (అసత్యం వైపునకు) పిలిచినప్పుడు, మేము నిరాకరిస్తున్నాము.

ఈ రోజు వారు అరుస్తూ మాకు వ్యతిరేకంగా కదన రంగానికి కదలి వచ్చారు'.

"ఇంతకీ ఈ కవితలు చెబుతున్నది ఎవరు?" అని దైవప్రవక్త(సఅసమ్) విచారించగా, 'ఆమిర్ బిన్ అక్వా' అని జనులు చెప్పారు. దానికి దైవప్రవక్త(స), "అల్లాహ్ అతనిపై తన కారుణ్యాన్ని కురిపించుగాక!" అని పలికారు. ఈ మాట విన్న ప్రియ సహచరులు (రజి) 'దైవప్రవక్తా! మీరతన్ని అప్పుడే అమరగతి నొందేవానిగా ఖరారు చేసేశారు. అతని (కవితల) ద్వారా మరింత లబ్ది పొందే అవకాశం మాకు కల్పించాల్సింది' అని విన్నవించుకున్నారు.

తరువాత మేము ఖైబర్ చేరుకుని కోటను ముట్టడించాము. ఆ సందర్భంగా మేము ఎన్నో బాధల్ని భరించాల్సి వచ్చింది. పస్తులుండాల్సి వచ్చింది. ఎట్టకేలకు అల్లాహ్ మాకు విజయం ప్రసాదించాడు. కోట కైవసం కానున్న రోజు రాత్రి సైనిక గుడారాల వద్ద పలుచోట్ల మంటలు కనిపించాయి. అది గమనించిన దైవప్రవక్త(స), "ఎన్నో చోట్ల మంటలు కనిపిస్తున్నాయి. ఏమిటి విశేషం?" అని అడిగితే, 'మాంసం వండటానికి నిప్పు రాజేశార'ని సహచరమాన్యులు సమాధానమిచ్చారు. "ఇంతకీ ఏ పశువుల మాంసం?" అని మహాప్రవక్త(స) ప్రశ్నించగా, పెంపుడు గాడిదల మాంసం' అని సహచరులు జవాబిచ్చారు. "వద్దు. ఆ మాంసం అంతా పార వేయండి. ఆ కుండల్ని పగులగొట్టండి" అని మహాప్రవక్త(స) ఆదేశించారు. దానికి ఒక సహచరుడు, 'దైవప్రవక్తా! మాంసాన్ని పారవేసి, కుండల్ని కడిగితే సరిపోదా!?' అని సందేహపడగా, "సరే, అలాగే కానివ్వండి" అని ఆయన(స) చెప్పారు. (తెల్లవారాక సహచరమాన్యులు యుద్ధం కొరకు) వరుసలు తీరి నిలబడినప్పుడు, ఆమిర్(రజి) కరవాలం మరీ చిన్నదిగా కనిపించింది. అందుచేత ఆయన ఒక యూదునిపై అదుపు సాధించినప్పుడు, వంగి అతని పిక్కలపై వ్రేటు వేయబోయారు. కాని ఆ ప్రయత్నంలో స్వయంగా ఆయన మోకాలిలోనే అది దిగబడింది. ఆ గాయంతోనే ఆయన అసువులు బాసారు.

సైన్యం తిరిగి వస్తుండగా, 'దైవప్రవక్త(స) సలమా బిన్ అక్వా(రజి) చెయ్యి పట్టుకుని, "ఏమిటి విశేషం?' అని ప్రశ్నించారు. దానికి నేను, 'దైవప్రవక్తా! నా తల్లిదండ్రులు మీకు సమర్పితం. ఆమిర్(రజి) చేసుకున్నదంతా వ్యర్థమైపోయిందని కొంతమంది చెప్పుకుంటున్నారు (కారణం ఆయన చేతిలో ఉన్న ఖడ్గం స్వయంగా ఆయన శరీరాన్నే గాయపరిచింది)'. దానికి సమాధానంగా ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా అన్నారు : "ఆ విధంగా చెప్పేవాడు అబద్ధీకుడు. వాస్తవానికి అతనికి (ఆమిర్‌కు) రెండింతల పుణ్యఫలం ప్రాప్తమవుతుంది". తరువాత ఆయన (స) తన చేతివ్రేళ్ళు రెండింటినీ కలిపి, "అతను బాధను భరించడంతోపాటు దైవమార్గంలో జిహాద్ కూడా చేశాడు. ఈ రకమయిన ఉదాహరణను నెలకొల్పిన అరబ్బు బహుశా అరుదే"[1] అన్నారు. వేరొక ఉల్లేఖనం ప్రకారం, "మదీనాలో ఆమిర్ వంటి అరబ్బు బహుశా పుట్టలేదేమో!" అన్నారు.

**86)** మహనీయ అనస్(రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు(సఅసమ్) రాత్రివేళ ఖైబర్‌కు చేరుకున్నారు. ఆయన(స) ఏదయినా జాతి వారిపై దండెత్త డానికి రాత్రివేళ వెళ్ళినప్పుడు వెంటనే దండెత్తేవారు కారు. తెల్లవారే వరకూ నిరీక్షించేవారు. తెల్లవారాక యూదులు గడ్డపారలు, తట్టలు తీసుకుని (పంట పొలాల వైపు) బయలుదేరారు. కాని వారు దైవప్రవక్త(స) ను చూడగానే, దైవ సాక్షిగా! ముహమ్మద్ సైన్యంతో సహా వచ్చేశార'ని అరుస్తూ వెళ్ళారు. అప్పుడు దైవ ప్రవక్త(స) ఇలా అన్నారు : "ఖైబర్ నాశనమయ్యింది. మేము ఏ జాతి మైదానంలో నయినా మోహరించామంటే హెచ్చరించబడిన జనుల ఉదయం దయనీయంగా ఉంటుంది."[1]

(వేరొక సనదు)

ముహమ్మద్ బిన్ సీరిన్‌తో అనస్ బిన్ మాలిక్(రజి) ఇలా అన్నారు : మేము

---

85-1. హదీసులో ఖైబర్ యుద్ధ ఘట్టాలు కొన్ని విశ్లేషించబడ్డాయి. ఈ కారణంగానే దీనిని ఈ అధ్యాయం క్రింద తీసుకోవటం జరిగింది. హదీసులో ప్రస్తావనకు వచ్చిన ఆమిర్(రజి) ఖైబర్ సర్దారును ఎదుర్కొనే ఉద్దేశ్యంతో ముందుకు వెళ్ళారు. కాని ఆయన కరవాలం స్వయంగా ఆయన చేత్తోనే ఆయన మోకాలిలో దిగబడింది. ఆ గాయంతోనే ఆయన అమరగతినొందారు. ఆమిర్‌ది ఆత్మహత్య అన్న సందేహం కొంతమందికి కలిగింది. ఈ సందేహాన్ని నివృత్తి చేయడానికే దైవప్రవక్త(స) ఆమిర్ గొప్పతనాన్ని కొనియాడారు.

ఉదయ సమయాన ఖైబర్ చేరుకున్నాము. యూదులు పారలు తదితర వ్యవసాయ పనిముట్లతో బయటకు వచ్చారు. కాని వారు దైవప్రవక్త(సఅసమ్)ను చూడగానే, 'అమ్మో. దైవసాక్షిగా! ముహమ్మద్(స) తన సైనికులతో సహా వచ్చేశార'ని అరుస్తూ వెనుతిరిగారు. అప్పుడు దైవప్రవక్త(స) "అల్లాహ్‌యే గొప్పవాడు, సర్వోన్నతుడు. నిశ్చయంగా మేము ఎప్పుడయినా, ఏ జాతి జనుల ముంగిట అయినా వాలామంటే హెచ్చరించబడిన వారి ఉదయం చెడుగా పరిణమిస్తుంది" అని పలికారు. పిదప మాకు అక్కడ గాడిద మాంసం లభించింది. కాని దైవప్రవక్త(స) తరఫున ప్రకటన గావించే వ్యక్తి 'దైవం మరియు ఆయన ప్రవక్త మీకు గాడిద మాంసం తినడాన్ని నిషేధించారు. ఎందుకంటే అది అపవిత్రమైనది' అని ప్రకటించాడు.[1]

**87)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) ఉల్లేఖనం: (ఖైబర్ యుద్ధ సందర్భంగా జరిగిన సంఘటన) ఒక వ్యక్తి ప్రవక్త మహనీయుల (సఅసమ్) సన్నిధికి వచ్చి, 'గాడిదల మాంసం భక్షించబడుతోంది' అని విన్నవించుకున్నారు. దానిపై దైవప్రవక్త(స) మౌనం వహించారు. ఆ వ్యక్తి రెండవసారి కూడా వచ్చి, 'జనులు గాడిదల మాంసం భక్షించబోతున్నారు' అని ఫిర్యాదు చేశారు. ఈసారి కూడా ఆయన (స) మౌనంగా ఉండిపోయారు. మరి ఆ వ్యక్తి మూడవసారి కూడా ప్రవక్త(స) సన్నిధికి వచ్చి, 'గాడిదలు స్వాహా కానున్నాయ'ని విన్నవించుకున్నప్పుడు, దైవప్రవక్త(స) ప్రకటన గావించే ఒక వ్యక్తితో ఇలా ప్రకటన చేయించారు: "అల్లాహ్, ఆయన ప్రవక్త(స) పెంపుడు గాడిదల మాంసం తినడాన్ని మీ కొరకు నిషేధించారు". అంతే, పొయ్యిలపై ఉన్న మాంసం కుండలన్నీ తలక్రిందులుగా చేయబడ్డాయి. ఆ సమయంలో ఆ కుండల్లో మాంసం కుతకుతా ఉడుకుతూ వుంది.

**88)** అనస్ బిన్ మాలిక్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఖైబర్ సమీపానికి చేరుకుని ఫజ్ర్ నమాజ్ చేశారు. అప్పటికింకా చీకటి పూర్తిగా తొలగిపోలేదు. (నమాజ్ అనంతరం) దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "అల్లాహ్‌యే

---

86-1. వాఖిదీ సేకరించిన సమాచారం ప్రకారం, ముస్లింలు ఖైబర్‌పై దండెత్తి వస్తున్నారన్న సంగతి యూదులకు ముందు నుంచే తెలుసు. వారు ప్రతి రాత్రి సాయుధులై బయల్దేరేవారు. కాని ఆ రాత్రి మటుకు వారు అలసత్వానికి లోనయ్యారు. ఆ రాత్రి వారి కోడి కూడా కూయలేదు. తెల్లవారిన తర్వాత వాళ్లు వ్యవసాయ పనిముట్లను పట్టుకుని పొలాలకు వెళ్ళసాగారు. ఆ సందర్భంగానే అకస్మాత్తుగా వారి దృష్టి ముస్లిం సేనలపై పడింది. దాంతో వారు నిర్ఘాంతపోయారు.

గొప్పవాడు. ఖైబర్ నాశనమైనట్లే. నిశ్చయంగా మేము ఏదయినా జాతి ముంగిట వాలామంటే (ముందుగా) హెచ్చరించబడిన జనుల ఉదయం విపత్కరంగా పరిణమించిందన్నమాటే."

పిదప యూదులు భయపడుతూనే వీధుల్లోకి వచ్చారు. చివరకు దైవ ప్రవక్త(స) వారిలో యుద్ధం చేయగల శక్తి ఉన్నవారిని వధించారు. వారి స్త్రీలను, పిల్లలను ఖైదీలుగా చేసుకున్నారు. ఖైదీలలో ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ సఫియ్యా (ర.అ) కూడా ఉన్నారు. తొలుత ఆమె దిహ్యాకల్బీ (రజి) అనే సహాబీ వాటాలోనికి వచ్చారు. తరువాత ఆమె దైవప్రవక్త(స) అంతఃపురంలోనికి వచ్చారు. ఆయన(స) ఆమెను నికాహ్ చేసుకున్నారు. 'మహ్ర్'గా ఆమెకు బానిసత్వం నుండి స్వేచ్ఛను ప్రసాదించారు.

అబ్దుల్ అజీజ్ బిన్ సుహైబ్ గారు సాబిత్‌ను, 'అబూ ముహమ్మద్! దైవప్రవక్త (స) సఫియ్యా(ర.అ)కు మహ్ర్‌గా ఏమిచ్చారో నీవు అడిగావా?' అని ప్రశ్నించగా, అవునంటూ సాబిత్ తలూపారు.

**89)** అనస్ బిన్ మాలిక్(రజి) చెప్పగా తాను విన్నట్లు అబ్దుల్ అజీజ్ బిన్ సుహైబ్ తెలిపారు : ఆయన(అనస్) ఇలా చెప్పారు– 'సఫియ్యా(ర.అ) దైవప్రవక్త (సఅసమ్) ఖైదీలలో ఒకరుగా ఉన్నారు. ఆయన(స) ఆమెకు స్వాతంత్ర్యం ప్రసా దించి, నికాహ్ చేసుకున్నారు. 'మరైతే దైవప్రవక్త(స) ఆమెకు మహర్‌గా ఏమిచ్చారు?' అని సాబిత్(రజి) అనస్(రజి)ను ప్రశ్నించగా, 'స్వయంగా ఆమెనే ఆమె మహర్‌గా ఇచ్చారు– అంటే ఆమెకు స్వేచ్ఛను ప్రసాదించారు'[1] అని అనస్(రజి) సమాధానమిచ్చారు.

**90)** మహనీయ సహ్ల్ బిన్ సాద్ సాయిదీ(రజి) వివరించారు: ప్రవక్త మహ నీయులు ముహమ్మద్(సఅసమ్) తన సైన్యంతోపాటు ఖైబర్ ముష్రిక్కులను మార్కొ న్నారు. ఇరువైపుల నుండీ భీకర పోరు జరిగింది. తరువాత దైవప్రవక్త(స) తన

---

89–1. హజ్రత్ సఫియ్యా(ర.అ) ఖైబర్ యూదుల్లో ఉన్నత వంశీయురాలు. ఆమె గారు ఖైబర్ యుద్ధానికి పూర్వమే తన ఒడిలో చంద్రుడు వచ్చి వాలినట్లు కలగన్నారు. యుద్ధానంతరం సంధి జరిగిన పిమ్మట దైవప్రవక్త(స) ఆమెను అనేక పరమార్థాల దృష్ట్యా బానిసత్వం నుండి స్వేచ్ఛను ప్రసాదించి, తన అంతఃపురంలోనికి తెచ్చుకున్నారు. ఆ విధంగా ఆమె కల నిజమయింది. ఆమె గౌరవ మర్యాదలు కూడా ఇనుమడించాయి.

గుడారం వైపు వచ్చారు. యూదులు కూడా తమ తమ గుడారాల వైపు తిరిగి వెళ్లారు.

అప్పుడు ప్రవక్త సహచరుల్లోని ఒక యోధుని వీరోచిత పోరాటం గురించి ఒక వ్యక్తి ప్రస్తావిస్తూ, యూదుల్లోని ఏ వ్యక్తి అతనికి ఎదురుపడినా, అతను ఆ వ్యక్తిని వెంబడించి, అతనిని వధించి గాని వదలిపెట్టడు. ఈ రోజు మా అందరి తరఫున అతను చూపిన ధైర్యం, తెగువ అనితర సాధ్యమైనది అని ఆ వ్యక్తిని కొనియాడారు. కాని దైవప్రవక్త(స) ఆ వ్యక్తి గురించి చెబుతూ, "అతను నరకానికి పోతాడు" అన్నారు. (ఆ మాట విని అందరూ ఆశ్చర్యపోయారు). అప్పుడు ఒక సహాబి, 'నేను అతనిని వెన్నంటి ఉంటాను' అన్నారు.

తరువాత ఆ సహాబీ ఆ యోధుని వెనుకే ఉండి, అతని కదలికల్ని జాగ్రత్తగా గమనించసాగారు. ఆ యోధుడు నిలబడిన చోటే ఆయన కూడా నిలబడేవారు. అతను పరుగెత్తిన వైపే ఆయన కూడా పరుగెత్తేవారు. చివరకు ఆ యోధుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఆ బాధకు తట్టుకోలేక, తనకు తొందరగా మరణం రావాలని కోరుకున్నాడు. అతను తన ఖడ్గాన్ని తలక్రిందులుగా నేలలో పాతిపెట్టి ఖడ్గపు మొనపై తన ఛాతీని ఉంచి, బలంగా నొక్కాడు. ఆ విధంగా అతను ఆత్మహత్య చేసుకున్నాడు.

అప్పటి వరకూ ఆ యోధుని కదలికల్ని గమనిస్తూ ఉన్న సహాబీ దైవ ప్రవక్త(స) సన్నిధికి వచ్చి, 'తమరు దేవుని సత్య సందేశహరుడని నేను సాక్ష్యమిస్తున్నాను' అని విన్నవించుకున్నారు. "ఇంతకీ ఏమయింది?" అని దైవప్రవక్త(స) విచారించగా, ఆ సహాబీ ఇలా వివరించారు: కొద్దిసేపటి క్రితమే తమరు ఫలానా వ్యక్తి గురించి, "అతడు నరకానికి పోతాడు" అని చెప్పినప్పుడు, చాలామంది మనస్తాపానికి గురయ్యారు. నేను వారిని శాంతపరుస్తూ, ఆ యోధుణ్ణి నేను పసిగడుతూ ఉంటానని మాటిచ్చాను. అందుకే నేను ఆ యోధుడి వెనుకాలే ఉండి, అతని కదలికల్ని గమనించసాగాను. ఒక దశలో ఆ యోధుడు తీవ్రంగా గాయపడి, తనను మృత్యువు తొందరగా కబళించాలన్న ఆత్రుతతో, ఖడ్గాన్ని నేలలో పాతిపెట్టి ఆ ఖడ్గం మొనపై తన ఛాతీ పడేలా తనను పడవేసుకుని, తన ప్రాణాన్ని తానే తీసుకున్నాడు అని వివరించి చెప్పారు. ఆ సందర్భంగానే ఆయన(స) ఇలా

**వక్కాణించారు: "ఒక మనిషి జీవితాంతం స్వర్గవాసుల ఆచరణ చేస్తాడు. కాని అతను నరకవాసి అయి ఉంటాడు. అదేవిధంగా మరో మనిషి జీవితాంతం నరక వాసుల పనులు చేస్తుంటాడు. కాని వాస్తవానికి అతడు స్వర్గవాసి అయి ఉంటాడు."[1]**

**91) అబూ హురైరా (రజి) తనకు ఈ విధంగా చెప్పినట్లుగా సయీద్ బిన్ ముసయ్యిబ్ తెలిపారు : మేము ఖైబర్ యుద్ధంలో పాల్గొన్నాము. దైవప్రవక్త(స) ఒక వ్యక్తి గురించి– ఆ వ్యక్తి ఆయన(స)తో కలసి యుద్ధంలో పాల్గొన్నాడు– తనను తాను ముస్లింగా చెప్పుకునేవాడు. "కాని ఆ వ్యక్తి నరకవాసులలో ఒకడు" అని దైవప్రవక్త(స) చెప్పారు. తరువాత యుద్ధం మొదలవగానే ఆ వ్యక్తి వీరోచితంగా పోరాడాడు. తీవ్రంగా గాయపడ్డాడు. ఆ గాయాలు అతనికి భరించ శక్యం కానివిగా ఉన్నాయి. అందువల్ల అతను తన అంబులపొదిలో నుంచి ఒక బాణం తీసి, దానిని తన గుండెలో బలంగా గుచ్చాడు. ఈ దృశ్యాన్ని చూసిన సహచర మాన్యులు దైవప్రవక్త(స) సన్నిధికి పరుగెత్తుకుని వచ్చి, 'దైవప్రవక్తా! తమరు చెప్పినదానిని అల్లాహ్ నిజం చేసి చూపాడు. ఆ వ్యక్తి ఖుద్దుగా తన గుండెల్లో బాణం గుచ్చి ఆత్మహత్యకు ఒడిగట్టాడు' అని చెప్పారు. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: "ఓ యీ ఫలానా వ్యక్తీ! పో. పోయి స్వర్గంలో కేవలం విశ్వాసులు (మోమినీన్) మాత్రమే ప్రవేశిస్తారని ప్రకటించు. కాకపోతే అల్లాహ్ అవిధేయుల ద్వారా కూడా తన ధర్మానికి సేవ చేయించుకుంటాడు"– ఈ ఉల్లేఖనాన్ని మామర్ గారు జుహ్రీ నుండి ఉటంకించారు.[1]**

---

90–1. ఆ వ్యక్తి పరిణామ స్వరూపం ఎలా ఉండబోతుందో దైవప్రవక్త(స)కు ముందుగానే 'వహీ' ద్వారా తెలియజేయబడింది. ఆయన(స) చెప్పినట్లే జరిగింది. ఆ యోధుడు ఆత్మహత్య చేసుకుని, హరామ్ చావు చచ్చాడు. నరకాగ్నికి ఆహుతి అయ్యాడు. అందుకే మనలో ప్రతి ఒక్కరూ మన అంతిమ పరిణామం గురించి చింతన చేస్తూ ఉండాలి. మేలైన ముగింపుకై ప్రార్థిస్తూ ఉండాలి.

91–1. తిబ్రానీలోని ఒక ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త(స) ఆ వ్యక్తి గురించి, "అతడు నరకవాసి" అని చెప్పినప్పుడు జనులు బాధపడ్డారు. 'దైవప్రవక్తా! ఇంత శ్రమపడే వ్యక్తి నరకానికి పోతే, ఇక మా లాంటి వాళ్ళు ఏమై పోవాలి?' అని కూడా సందేహం వ్యక్తం చేశారు. దానికి సమాధానంగా ఆయన(స), "ఈ వ్యక్తి నరకవాసి. ఇతను తన కాపట్యాన్ని దాచిపెడుతున్నాడ"ని అన్నారు.

**92) అబూ మూసా అష్అరీ (రజి) వివరించారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఖైబర్‌పై సైనిక చర్యకు పూనుకున్నప్పుడు– లేదా ఇలా అన్నారు– ప్రవక్త మహనీయులు(స) ఖైబర్ వైపు ప్రయాణమైనప్పుడు, జనులు ఒక లోయ గుండా సాగిపోతూ 'అల్లాహు అక్బర్–అల్లాహు అక్బర్–లా ఇలాహ ఇల్లల్లాహ్ (అల్లాహ్‌యే గొప్పవాడు– అల్లాహ్‌యే మహోన్నతుడు– అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేనేలేడు) అని బిగ్గరగా పలికారు. అప్పుడు దైవప్రవక్త(స), "మీరు మీ ఆత్మలపై దయజూపండి. మీరు మొరపెట్టుకునేది చెవిటి వాడినో, మీకు బహుదూరాన ఉన్నవాడినో కాదు. మీరు ఎవరినయితే మొరపెట్టుకుంటున్నారో ఆయన అందరి కన్నా ఎక్కువగా వినేవాడు, మీకు చాలా సమీపంలో ఉన్నవాడు, పైగా ఆయన మీకు తోడుగా ఉన్నాడు"[1] అని చెప్పారు.**

**దైవప్రవక్త(సఅసమ్) వాహనంపై, వెనుక కూర్చుని ఉన్న నేను, 'లాహౌల వలా ఖువ్వత ఇల్లా బిల్లాహ్' అని పలకటం ఆయన(స) విన్నారు. "ఓ అబ్దుల్లాహ్ బిన్ ఖైస్!" అన్నారు. దానికి నేను, 'హాజిరయ్యాను దైవప్రవక్తా!' అన్నాను. "స్వర్గ నిధులలో ఒక నిధి అయిన ఒక వచనం ఏదో నేను నీకు తెలుపనా?" అనడిగారు. దానికి నేను, 'తప్పకుండా తెలియజేయండి దైవప్రవక్తా! నా తల్లిదండ్రులు మీకు సమర్పితం' అని విన్నవించుకున్నాను. అప్పుడాయన(స), "ఇదిగో విను. ఆ కలిమా ఇది: లాహౌల వలా ఖువ్వత ఇల్లా బిల్లాహ్"[2]**

---

ఇకపోతే అబూ హురైరా(రజి) ఖైబర్ యుద్ధం ముగిసిన తరువాతే దైవప్రవక్త(స) దగ్గరకు వచ్చారు. అందువల్ల ఆ యుద్ధం ఖైబర్ యుద్ధం కాదు, అది హునైన్ యుద్ధం అన్న సందేహం కూడా వ్యక్తమయింది. అయితే సహీహ్ బుఖారీ ప్రతులలో మాత్రం 'ఖైబర్' అనే ఉంది.

92–1. అంటే తన జ్ఞానపరంగా సర్వసామాన్యంగానూ, తన కరుణా కటాక్షాల రీత్యా ప్రత్యేకంగానూ మీకు తోడుగా ఉన్నాడు.

92–2. ఖైబర్ ముట్టడి నిమిత్తం ఇస్లామీయ సైన్యం మదీనా నుండి బయలుదేరిన తరువాత జరిగిన ఒక ఘటనను ఇక్కడ చిత్రించటం జరిగింది. ఈ కారణంగానే ఈ హదీసును ఇక్కడ పొందుపరచటం జరిగింది. ప్రతిసారీ దైవ సంస్మరణ నిమిత్తం, దైవాన్ని బిగ్గరగా మొరపెట్టుకోవలసిన అవసరం లేదు. ఎక్కడెక్కడ బిగ్గరగా పలకమని దైవప్రవక్త(స) చెప్పారో ఆ సందర్భాలలో మాత్రమే బిగ్గరగా పలకాలి. మనం పాటించే ప్రతి ఆచరణ ప్రవక్త(స) బోధనల ప్రకారమే ఉండాలి.

**93)** యజీద్ బిన్ అబీ ఉబైద్(రజి) తెలిపారు: నేను సలమా బిన్ అక్వా (రజి) కాలిపిక్కపై మానిన ఒక గాయపు చిహ్నాన్ని చూసి, 'ఓ అబూ ముస్లిం! ఈ గాయం ఎలా అయింది!' అని అడిగాను. దానికి ఆయన, 'ఓహో అదా! అది ఖైబర్ యుద్ధ సందర్భంగా అయిన గాయం' అని సలమా చెప్పారు. తరువాత ఆయన ఇలా అన్నారు: 'నేను దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళాను. ఆయన ఆ గాయంపై మూడుసార్లు (పవిత్ర వచనాలు పఠించి) ఊదారు. దాని శుభం వల్ల ఈ రోజు వరకూ ఈ గాయం కారణంగా నాకెలాంటి బాధ కలగలేదు'.

**94)** సహ్ల్ బిన్ సాద్ సాయిదీ(రజి) కథనం: ఒక సంగ్రామంలో (ఖైబర్‌లో) దైవప్రవక్త(స)కు- బహుదైవారాధకులకు మధ్య హోరాహోరీ పోరాటం జరిగింది. చివరకు ఇరువర్గాల సైనికులు తమ తమ గుడారాలకు వెళ్ళిపోయారు. ముస్లిములలో ఒక వ్యక్తి ఉండేవాడు. బహుదైవారాధకుల మనిషి అతనికి ఎక్కడ ఎదురుపడినా, అతన్ని తరుముకుంటూ వెళ్ళి కడతేర్చేవాడు. 'దైవప్రవక్తా! ఈ రోజు ఫలానా వ్యక్తి ప్రదర్శించిన ధైర్యసాహసాలను, చూపిన తెగువను వేరెవరూ చూపలేక పోయార'ని ఎవరో వివరించి చెప్పగా, "అతను నరకవాసులలో ఒకడు" అని దైవప్రవక్త(స) సెలవిచ్చారు. 'అయ్యో, అతను నరకవాసి అయినట్లయితే, ఇక మా బోటివాళ్ళు స్వర్గానికి ఎలా పోగలరు?' అని కొంతమంది సహచరమాన్యులు సందేహం వెలిబుచ్చారు. దానిపై ఒక సహాబీ, 'సరే, నేను ఆ వ్యక్తి వెనుకే ఉండి అతన్ని కనిపెట్టుకుని ఉంటాన'న్నారు. ఆ క్షణం నుంచీ ఆయన ఆ వ్యక్తిని ప్రత్యేకంగా గమనించసాగారు. అతను పరుగెత్తినప్పుడు ఆయన కూడా పరుగెత్తేవారు. అతను నెమ్మదిగా నడిచినప్పుడు కూడా ఆయన అతని వెనుకే ఉండేవారు. చివరకు ఆ వ్యక్తి యుద్ధ రంగంలో తీవ్రంగా గాయపడ్డాడు. తనకు తొందరగా మరణం రావాలన్న ఉద్దేశంతో ఖడ్గపు ముష్టిని నేలలో పాతిపెట్టి ఖడ్గపు మొన తన ఛాతీకి గుచ్చుకునే విధంగా దానిపైన పడ్డాడు (ఆత్మహత్య చేసుకున్నాడు). అప్పుడు ఆ సహాబీ దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి, 'తమరు దేవుని సత్య సందేశహరులని నేను సాక్ష్యమిస్తున్నాను' అన్నారు. "ఏమిటి విశేషం?" అని దైవప్రవక్త(స) విచారించగా, జరిగినదంతా ఆయన దైవప్రవక్త(స)కు వివరించారు. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా ఉద్బోధించారు : "ఒక వ్యక్తి పైకి స్వర్గవాసుల మాదిరి ఆచరణ

**చేస్తుంటాడు. కాని వాస్తవానికి అతను నరకవాసి అయి ఉంటాడు. అలాగే మరొక వ్యక్తి నరక వాసుల మాదిరి పనులు చేస్తుంటాడు. కాని యథార్థానికి అతను స్వర్గవాసి అయి ఉంటాడు."[1]**

**95) అబూ ఇమ్రాన్ కథనం : మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి) శుక్రవారం నాడు (బస్రాలోని ఒక మస్జిద్‌లో) ప్రజలు తమ తలలపై దుప్పట్లు కప్పుకుని ఉండటం గమనించి, "వీళ్ళను చూస్తుంటే యూదుల మాదిరిగా కనిపిస్తు న్నారు"[1] అని అన్నారు.**

**96) సలమా (రజి) ఇలా వివరించారు: హజ్రత్ అలీ(రజి) ప్రవక్త మహ నీయుల (సఅసమ్)తోపాటు ఖైబర్ యుద్ధానికి వెళ్ళలేకపోయారు. ఎందుకంటే ఆ సమయంలో ఆయన కంటి జబ్బుకు గురై ఉన్నారు. కాని ప్రవక్త మహనీయులు (స) వెళ్ళిన తరువాత అలీ(రజి) ఆలోచనలో పడిపోయారు. నేను దైవప్రవక్త (స)తో కలసి యుద్ధంలో కూడా పాల్గొనలేనంత అశక్తుడుగా ఉన్నానా? అని అంతర్మథనం చెందారు. అందుకే ఆయన(రజి) కూడా కదన రంగానికి తరలి వచ్చారు. ఏ రోజున ఖైబర్ విజయం వరించనున్నదో, దానికి ఒక రోజు ముందు రాత్రి దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "రేపు నేను ఇస్లామీయ ధ్వజాన్ని ఎవరికి ఇస్తానో..." లేదా ఇలా అన్నారు: "అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త ఎంతగానో ఇష్టపడే వ్యక్తికి రేపు నేను ధ్వజం ఇస్తాను. అతని చేతుల మీదుగానే విజయం వరిస్తుంది"– మాలో ప్రతి ఒక్కరూ ఈ భాగ్యం తమకే దక్కాలని ఆశించారు. కాని (మరునాడు జనులు) 'ఇదిగో అలీ వచ్చేశారు' అని చెప్పారు. దైవప్రవక్త(స) అలీ చేతికే ధ్వజం ఇచ్చారు. ఆయన చేతుల మీదుగానే విజయం వరించింది.**

---

94–1. అందుకే అంతిమ పరిణామం మేలైనదై ఉండాలి అంటారు. ఇకపోతే, ఆత్మహత్య ఇస్లాంలో నిషిద్ధం. ఆత్మహత్యకు ఒడిగట్టినవాడు హరామ్ చావు చచ్చినట్లే.

95–1. బహుశా వాళ్ళు తరచూ దుప్పట్లు కప్పుకుంటారేమోనని హాఫిజ్ ఇబ్నె హజర్(రహ్మ) అభిప్రాయపడ్డారు. అనస్ బిన్ మాలిక్(రజి) అలా చెప్పినంత మాత్రాన దుప్పట్లు కప్పు కోవటాన్ని తప్పు పట్టినట్లు అర్థం కాదు. కాకపోతే దుప్పట్లు కప్పుకున్న తీరు యూదులను పోలి ఉందని ఆయన చెప్పదలిచారు. వేరొక హదీసులో యూదుల పద్ధతులకు భిన్నంగా ఆచరించండి అని ఉంది.

**97) హజ్రత్ సహ్ల్ బిన్ సాద్(రజి) తెలిపారు : ఖైబర్ యుద్ధ సందర్భంగా ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఇలా సెలవిచ్చారు : "రేపు నేను ఒక వ్యక్తి చేతికి జెండా ఇస్తాను. అతను అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను అమితంగా ప్రేమించేవాడై ఉంటాడు. అల్లాహ్, ఆయన ప్రవక్త కూడా అతన్ని ఎంతగానో ఇష్టపడతారు"- ఉల్లేఖకుడు ఇలా అన్నారు : ఆ రాత్రంతా అందరూ ఎంతో ఉత్కంఠతో గడిపారు. ఇంతకీ దైవప్రవక్త జెండాను ఎవరి చేతికి ఇస్తారా!? అని తీవ్రంగా ఆలోచించు కుంటూ ఉండిపోయారు. తెల్లవారాక అందరూ దైవప్రవక్త(స) చుట్టూ గుమి గూడారు. ఆ పతాకం తమకే దక్కుతుందని ప్రతి ఒక్కరూ ఆశించారు. కాని దైవ ప్రవక్త(స) ఆ ఉత్కంఠను ఛేదిస్తూ, "అలీ బిన్ అబీ తాలిబ్ ఎక్కడ?" అని ప్రశ్నిం చారు. 'దైవప్రవక్తా! ఆయన కళ్ళలో బాధ ఉంది' అని సమాధానం ఇవ్వబడింది. "అతన్ని పిలవండి" అని ఆదేశించారు ప్రవక్త మహనీయులు(స). అలీ (రజి) రాగానే, దైవప్రవక్త(స) తన లాలాజలాన్ని ఆయన(రజి) కళ్ళలో పూసి, ఆయన ఆరోగ్యం కొరకు దుఆ చేశారు. ఈ దుఆ (ప్రార్థన) ఫలితంగా ఆయన కంటి జబ్బు పూర్తిగా నయమైపోయింది. అసలు ఆయనకు అంతకు ముందు జబ్బు లేనట్లే ఆయన కళ్ళు నిర్మలంగా కనిపించాయి. అలీ(రజి) ధ్వజాన్ని చేబూనిన తర్వాత ఇలా విన్నవించుకున్నారు: 'దైవప్రవక్తా! వారూ మనలాగే పరివర్తన చెందనంత వరకూ నేను వారితో పోరాడతాను'. దానికి దైవప్రవక్త(స), "ఇలాగే ముందుకు సాగిపోండి. వారి మైదానంలోకి అడుగుపెట్టగానే మొదట వారికి ఇస్లామ్ సందేశం చేరవేయండి. అల్లాహ్‌కు వారిపై గల హక్కులేమిటో విశదీకరించండి. అల్లాహ్ సాక్షిగా! నీ ద్వారా ఒక్క వ్యక్తికి సన్మార్గం ప్రాప్తించినా అది నీ పాలిట ఎర్రని ఒంటెల కన్నా మేలైనది."[1]**

---

97-1. ఈ హదీసు ద్వారా విదితమైనదేమంటే; యుద్ధం ఇస్లామ్ ప్రథమ ధ్యేయం కాదు. ధర్మపరిచయమే ఇస్లామ్ మొట్టమొదటి లక్ష్యం. అవతలివారు ధర్మపరిచయం తర్వాత ప్రభావితులై దేవుని ఏకత్వం (తౌహీద్) ముందు ఆత్మ సమర్పణ చేసుకున్నట్లయితే అప్పుడు యుద్ధం చేయటం ధర్మసమ్మతం కాదు. అల్లాహ్ కలహ కారకులను ఇష్టపడడని, ఆయన సదా న్యాయాన్ని, సంధిని, శాంతిని ఇష్టపడతాడని ఖుర్ఆన్‌లో స్పష్టంగా చెప్పటం జరిగింది.

మహనీయ అలీ (రజి)ని ఖైబర్ విజేత అని ఎందుకంటారంటే, ఆయన చివరి ఘట్టంలో ఇస్లామీయ ధ్వజం అందుకున్నారు. ఆయన చేతుల మీదుగానే అల్లాహ్ ఖైబర్‌ను వశపరిచాడు. ఎర్రని ఒంటెలు అలనాడు అరేబియాలో విలువైన ఆస్తిగా భావించబడేవి.

**98) మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి) వివరించారు: మేము ఖైబర్ ప్రదేశానికి చేరుకున్నాము. పిదప అల్లాహ్ ప్రవక్త మహనీయులు(సఅసమ్)కు ఘన విజయం ప్రసాదించాడు. ఆ సందర్భంగా దైవప్రవక్త(స) సమక్షంలో సఫియ్యా బిన్తె హుయ్యి బిన్ అఖ్తబ్ (ర.అ) అందచందాల ప్రస్తావన వచ్చింది. ఆమె భర్త (యుద్ధంలో) వధించబడ్డాడు. అప్పటికి ఆమె వివాహమై ఎక్కువ కాలం కూడా గడవలేదు. అందువల్ల దైవప్రవక్త(స) ఆమెను తన కొరకు ప్రత్యేకంగా ఎంపిక చేసుకున్నారు.[1] పిదప దైవప్రవక్త(స) మదీనాకు తిరుగు ప్రయాణమయ్యారు. చివరకు మేము 'సద్దస్సహ్బా' ప్రదేశానికి చేరుకునే నాటికి విశ్వాసుల మాతృమూర్తి సఫియ్యా (ర.అ) బహిష్టు స్థితి నుండి పరిశుద్ధతనొందారు. అప్పుడు దైవప్రవక్త(స) ఆమెతో సమాగమం జరిపారు. తరువాత ఆయన(స) 'హైస్'[2] అనే వంటకాన్ని తయారు చేయించి, దానిని ఓ చిన్న విస్తరి (దస్తర్ఖాన్)పై ఉంచి, "నీకు దగ్గరలో ఉన్న వారిని భోజనానికి పిలువు" అని నన్ను ఆదేశించారు. దైవప్రవక్త(స) ఉమ్మల్ మోమినీన్ సఫియ్యా (ర.అ)ను తన అంతఃపురంలో చేర్చుకున్న సందర్భంగా ఇచ్చిన వలీమా విందు అదే. తరువాత మేము మదీనా వైపునకు పయనమయ్యాము. ఆ సందర్భంగా దైవప్రవక్త(స) ఒంటెపై సఫియ్యా(ర.అ) కొరకు అబా (తెర) కట్టడం నేను చూశాను. ప్రయాణానికి ముందు దైవప్రవక్త(స) ఒంటె దగ్గరలో కూర్చుని, తన మోకాలిని మడతపెట్టి కూర్చున్నారు. హజ్రత్ సఫియ్యా (ర.అ) ఆయన(స) మోకాలిపై పాదం మోపి ఒంటె ఎక్కారు.**

**99) మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి) చెప్పగా హుమైద్ తవీల్ విన్నారు: ప్రవక్త మహనీయులు(సఅసమ్) సఫియ్యా బిన్తె హుయ్యి(ర.అ) కోసం మార్గమధ్యంలో మూడు రోజులపాటు విడిది చేశారు. చివరకు ఆమెతో సమాగమం జరిపారు. ఆ విధంగా ఆమె కూడా విశ్వాసుల మాతలలో ఒకరయ్యారు.**

---

98–1. హజ్రత్ సఫియ్యా(ర.అ) యుద్ధప్రాప్తి (మాలె గనీమత్)గా ముస్లింల స్వాధీనంలోనికి వచ్చారు. సహచరమాన్యుల సలహాపై దైవప్రవక్త(స) ఆమెను తన కొరకు ఎంపిక చేసుకున్నారు. హజ్రత్ సఫియ్యా అసలు పేరు జైనబ్. కాని దైవప్రవక్త(స) ఆమెను తన కొరకు ప్రత్యేకంగా ఎంపిక చేసుకోవటం వల్ల ఆమె 'సఫియ్యా'గా పిలువబడ్డారు. సఫియ్యా అంటే ఎంపిక చేసుకోబడినది అని అర్థం.

98–2. 'హైస్' అనే వంటకాన్ని ఖర్జూర పండ్లలో నెయ్యి, జున్ను ముక్కలు కలిపి తయారు చేస్తారు.

**100)** మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి) చెప్పగా హుమైద్ విన్నారు- ఆయన ఇలా చెబుతుండేవారు: ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఖైబర్‌కి- మదీనాకి మధ్యలో (సద్దస్సహ్‌బా స్థలంలో) విడిది చేశారు. అక్కడే ఆయన(స) సఫియ్యా (ర.అ)తో శయనించారు. తరువాత నేను దైవప్రవక్త(స) తరఫున ముస్లింలను వలీమా విందుకు ఆహ్వానించాను. ఆయన(స) ఇచ్చిన ఆ వలీమా విందులో రొట్టెలుగానీ, మాంసం గానీ లేవు. విస్తరి పరచమని ఆయన (స) బిలాల్‌ని ఆజ్ఞాపించారు. విస్తరి పరచబడింది. దానిపై ఖర్జూరాలు, నెయ్యి, జున్ను ముక్కలు కలుప బడిన ఆహార పదార్థం ఉంచబడింది.

ఇంతకీ సఫియ్యా(ర.) విశ్వాసుల మాతల కోవకు చెందినవారా? లేక యాజమాన్యంలోనికి వచ్చిన బానిస స్త్రీల కోవకు చెందినవారా? అని కొంతమంది ముస్లింలు ప్రశ్నించగా, 'దైవప్రవక్త(స) గనక ఆమెను పరదా (హిజాబ్)లో ఉంచినట్లయితే ఆమె విశ్వాసుల మాతల జాబితాలోనికి వస్తారని, ఒకవేళ ఆమెను పరదాలో ఉంచకుండా ఉంటే అది బానిసత్వానికి ఆనవాలు అని కొందరు సమాధానమిచ్చారు. చివరకు బయలుదేరే సమయం ఆసన్నమైనప్పుడు, దైవ ప్రవక్త(స) ఆమె కొరకు తన వాహనంపై తన వెనుక కూర్చునేందుకు తెర కట్టారు.

**101)** అబ్దుల్లాహ్ బిన్ ముగఫ్ఫల్(రజి) తెలిపారు: "మేము ఖైబర్‌ను ముట్టడించినప్పటి సంఘటన! ఎవరో ఒక వ్యక్తి కొవ్వు నింపబడిన ఒక సంచిని మా వైపు పడవేశాడు. నేను దానిని ఎత్తుకోవడానికి పరుగెత్తాను. వెనక్కి తిరిగిచూస్తే దైవప్రవక్త(సఅసమ్) నిలబడి ఉన్నారు. నేను సిగ్గుతో కుంచించుకుపోయాను."

**102)** అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తమతో చెప్పినట్లుగా నాఫే, సాలిమ్‌లు ఉటంకించారు. ఖైబర్ యుద్ధ సందర్భంగా దైవప్రవక్త(సఅసమ్) పచ్చి వెల్లుల్లిని, పెంపుడు గాడిదల మాంసాన్ని తినటం నుండి వారించారు. పచ్చి వెల్లుల్లి తినటం నుండి వారించిన సంగతి కేవలం నాఫే ద్వారానే ఉటంకించబడింది. పెంపుడు గాడిదల మాంసం తినటం నుండి వారించిన విషయం కేవలం సాలిమ్ ద్వారా ఉటంకించబడింది.

**103)** మహనీయ అలీ బిన్ అబీ తాలిబ్(రజి) కథనం : ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఖైబర్ యుద్ధ సందర్భంగా స్త్రీలతో 'ముతా' (తాత్కాలిక నికాహ్) చేసుకోవడాన్ని, పెంపుడు గాడిదల మాంసం తినడాన్ని నిషేధించారు.[1]

**104)** **మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) వివరించారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఖైబర్ యుద్ధ సందర్భంగా పెంపుడు గాడిదల మాంసం తినడాన్ని నిషేధించారు.**

**105)** **మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తమతో చెప్పినట్లుగా నాఫే, సాలిమ్‌లు ఉటంకించారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) పెంపుడు గాడిదల మాంసం తినటం నుంచి వారించారు.**

**106)** **హ(జత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి) వివరించారు: ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఖైబర్ యుద్ధ సందర్భంగా పెంపుడు గాడిదల మాంసం తినడాన్ని నిషేధించారు. అయితే గు(రాల మాంసం తినేందుకు అనుమతించారు.**[1]

**107)** **ఇబ్నె అబీ అవ్‌ఫా(రజి) చెప్పగా తాను విన్నానని షైబానీ వివరించారు: ఖైబర్ యుద్ధ సందర్భంగా మేము బాగా ఆకలితో ఉన్నాము. మరోవైపు కుండలలో (గాడిదల మాంసం) కూర ఉడుకుతోంది. కొంతవరకు ఉడికింది కూడా. అంతలోనే దైవప్రవక్త(సఅసమ్) తరఫున ప్రకటన గావించే వ్యక్తి ఒకతను, 'గాడిదల మాంసాన్ని ఏ కాస్త కూడా తినకండి. దానిని పారవేయండి' అని ప్రకటించాడు.**

**ఇబ్నె అబీ అవ్‌ఫా(రజి) ఇలా అన్నారు: దైవప్రవక్త(స) ఇలా ప్రకటన చేయించడానికి కారణం యుద్ధప్రాప్తిలోని అయిదవ భాగాన్ని ('ఖుమున్'ను) ఇంకా వేరుపరచకపోవటమేనని కొంతమంది సహచరమాన్యులు (రజి) చెప్పుకున్నారు. మరి కొంతమంది ఏమనుకున్నారంటే నిజంగానే ఇది (శాశ్వతంగా) నిషేధించ బడింది. ఎందుకంటే గాడిద పెంట తింటుంది.**

---

103–1. అంతకు మునుపు స్త్రీలతో 'ముతా' (తాత్కాలికంగా మనువాడటం) ధర్మసమ్మతంగా ఉండేది. కాని ఇప్పుడది ప్రళయదినం వరకూ నిషిద్ధమే. రాఫిజీలు (షియా వర్గీయులు) ఇప్పటికీ 'ముతా'కు అనుకూలంగా ఉన్నారు. కాని ఇది అధర్మం.

మరికొన్ని ఉల్లేఖనాల ప్రకారం మక్కా విజయం సందర్భంగా కూడా 'ముతా'కు అనుమతించబడింది. కాని హజ్జతుల్ విదాలో 'ముతా' శాశ్వతంగా నిషేధించ బడింది. హ(జత్ ఉమర్(రజి) తన హయాంలో వేదికనెక్కి 'ముతా' నిషేధించబడినట్లు నిర్ద్వంద్వంగా ప్రకటించారు.

106–1. ఈ హదీసు ఆధారంగా ఇమామ్ షాఫియి(రహ్మ) కూడా గు(రాల మాంసాన్ని హలాల్ (ధర్మసమ్మతం)గా ఖరారు చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇన్‌షా అల్లాహ్ జిబహ్ ప్రకరణంలో రానున్నాయి.

**108)** తనకు బరా, అబ్దుల్లాహ్ బిన్ అబీ అవ్ఫా(రజి)లిద్దరూ తెలియపరచి నట్లుగా అదీ బిన్ సాబిత్ చెప్పారు: వారు (ఖైబర్ యుద్ధ సందర్భంగా) దైవప్రవక్త (సఅసమ్)తోపాటే ఉన్నారు. తరువాత వారికి గాడిదలు లభించాయి. వారు వాటిని కోసి మాంసం వండారు.  కాని అంతలోనే దైవప్రవక్త(స) తరఫున ప్రకటన చేసే వారొకరు, “కుండలను కుమ్మరించండి (మాంసాన్ని పారవేయండి)” అని ప్రకటించారు.

**109)** బరా బిన్ ఆజిబ్(రజి), అబ్దుల్లాహ్  బిన్  అబీ అవ్ఫా(రజి) చెప్పగా తాను విన్నానని అదీ బిన్ సాబిత్ వివరించారు.  ఆ  మహానుభావులిద్దరూ ఖైబర్ యుద్ధ సందర్భంగా మహాప్రవక్త(సఅసమ్) చెప్పిన విషయాన్ని ఇలా ఉల్లేఖించారు: “కుండలలో  ఉన్న మాంసాన్ని పారవేయండి”- ఆ సమయంలో కుండలు పొయ్యిలపై ఉన్నాయి.

**110)** బరా బిన్ ఆజిబ్(రజి) ఇలా అన్నారు: “మేము ప్రవక్త మహనీయుల (సఅసమ్)తోపాటు యుద్ధంలో పాల్గొన్నాము”- తరువాత ఆయన ఇంతకుముందు వచ్చిన హదీసును ఉటంకించారు.

**111)** బరా బిన్ ఆజిబ్(రజి) వివరించారు: ఖైబర్  యుద్ధ సందర్భంగా ప్రవక్త మహనీయులు(సఅసమ్), పెంపుడు గాడిదల మాంసాన్ని పారవేయాలని, అది పచ్చి మాంసం అయినాసరే,  వండినదైనా సరే  పారవేయాల్సిందేనని ఆజ్ఞాపించారు. ఆ తరువాత ఆయన(స) ఎన్నడూ ఆ మాంసం తినమని మమ్మల్ని ఆజ్ఞాపించలేదు.

**112)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) ఇలా అన్నారు: దైవప్రవక్త (సఅసమ్) గాడిదల మాంసాన్ని నిషేధించడానికి ప్రధాన కారణం బరువు మోసే పశువుల్ని భక్షిస్తూపోతే అవి అంతరించిపోతాయన్న ఆందోళనచేత అలా అన్నారో లేక కేవలం ఖైబర్ యుద్ధ దినాన పెంపుడు గాడిదల మాంసాన్ని నిషేధించారో నాకు తెలీదు.

**113)** అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి)కథనం: ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఖైబర్ యుద్ధ  సందర్భంగా  మాలె గనీమత్ (యుద్ధప్రాప్తి) నుండి వాహనాలున్న వారికి (గుర్రం కలవారికి) రెండు వాటాలిచ్చి,  కాలి నడకన  వచ్చిన సైనికులకు ఒక వాటా ఇచ్చారు. నాఫే గారు ఈ విషయాన్ని విశదీకరిస్తూ,  ఎవరయినా ఒక

సైనికుని వద్ద గుర్రం ఉంటే అతనికి మొత్తం మూడు వాటాలు లభించాయి (ఒక వాటా సైనికునికి, రెండు వాటాలు గుర్రానికి లెక్కన) అని అన్నారు.

**114)** జుబైర్ బిన్ ముత్‌యిమ్(రజి) తెలియజేశారు : నేనూ, ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్(రజి)– ఇద్దరం కలిసి ప్రవక్త మహనీయుల (సఅసమ్) సన్నిధిలో హాజరై, 'దైవప్రవక్తా! తమరు ఖైబర్‌లో లభించిన యుద్ధప్రాప్తిలోని ఐదవ భాగం (ఖుముస్) నుండి బనూ ముత్తలిబ్ వారికి ప్రదానం చేశారు. కాని మమ్మల్ని ఉపేక్షించారు. వాస్తవానికి మీతో బంధుత్వ సంబంధం విషయంలో మేము మరియు వారు (బనూ ముత్తలిబ్) సమానులమే కదా!' అని విన్నవించుకున్నాము. దానికి ఆయన(స), "అవును, నిశ్చయంగా బనూ హాషిమ్, బనూ ముత్తలిబ్ ఒక్కటే" అన్నారు. జుబైర్ బిన్ ముత్‌యిమ్(రజి) ఇలా అన్నారు: 'దైవప్రవక్త బనూ అబ్దెషమ్స్‌కు, బనూ నౌఫల్‌కు (అయిదవ భాగం నుండి) ఏమీ ఇవ్వలేదు.'[1]

**115)** అబూ మూసా అష్‌అరీ(రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) హిజ్రత్ చేశారన్న సమాచారం మాకు అందినప్పుడు, మేము యమన్‌లో ఉన్నాము. అందువల్ల మేము దైవప్రవక్త(స)ను కలుసుకునే సంకల్పంతో వలస పోయాము– నేనూ నా సోదరులిద్దరు. వారిద్దరికన్నా నేను చిన్నవాణ్ని. నా సోదరు లలో ఒకరి పేరు అబూ బుర్దా, మరొకరి పేరు అబూ రుహ్మ్. ఆయన ఇంకా ఇలా అన్నారు : మేము యాభై మందికి పైచిలుకే లేదా యాభై మూడు మందిమి లేదా యాభై రెండు మందిమి ఉన్నాం. మేము ఓడలో ప్రయాణమయ్యాము. కాని మా ఓడ మమ్మల్ని నజాషీ రాజ్యానికి తీసుకెళ్ళింది. అక్కడ మేము జాఫర్ బిన్ అబీ తాలిబ్(రజి)ను కలుసుకున్నాము. ఆయన మాకన్నా ముందే మక్కా నుండి అబిసీనియా దేశానికి వలస పోయారు. మేము ఆయనతోపాటే అక్కడ ఉండసాగాము. తరువాత మేమంతా కలిసి మదీనాకు బయలుదేరాము. మేము అక్కడ దైవప్రవక్త(స)ను కలుసుకునే నాటికే ఆయన(స) ఖైబర్‌ను జయించారు.

కొంతమంది మాతో, అంటే ఓడపై ప్రయాణమై వచ్చినవారితో 'మేము

114–1. ఎందుకంటే అబ్దె మునాఫ్‌కు నలుగురు కుమారులు– 1) హాషిమ్ 2) ముత్తలిబ్ 3) అబ్దె షమ్స్ 4) నౌఫల్. దైవప్రవక్త(స) హాషిమ్ సంతతిలోనివారు. నౌఫల్ సంతానంలో జుబైర్ బిన్ ముత్‌యిమ్(రజి) ఉన్నారు. ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్(రజి) అబ్దె షమ్స్ సంతతికి చెందినవారు.

మీకన్నా ముందే హిజ్రత్ చేశాము' అని అన్నారు. మాతోపాటే ఓడలో ప్రయాణం చేసి వచ్చిన అస్మా బిన్తె ఉమైస్ (జాఫర్ భార్య) ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ హఫ్సా(ర.అ) దగ్గరకు వచ్చింది. ఆమె కూడా సహాబాతో కలిసి నజాషీ రాజ్యానికి వలస పోయింది. అంతలో హజ్రత్ ఉమర్(రజి) కూడా హఫ్సా(ర.అ) ఇంటికి వచ్చారు. ఆ సమయంలో అస్మా బిన్తె ఉమైస్(ర.అ) అక్కడే ఉన్నారు.

ఉమర్(రజి) ఆమెను చూడగానే 'ఎవరీమె?' అని అడిగారు. 'ఈమె అస్మా బిన్తె ఉమైస్(ర.అ)' అని హఫ్సా చెప్పారు. 'ఓహో! అబిసీనియా దేశం నుండి ఓడలో ప్రయాణం చేసి వచ్చినది ఈమెగారే కదూ!' అన్నారు ఉమర్. 'అవునండి' అన్నారు అస్మా. అప్పుడు ఉమర్ ఆమెతో, 'హిజ్రత్ చేసే విషయంలో మేము మీకన్నా ముందంజలో ఉన్నాము. అందువల్ల మీకన్నా మేము దైవప్రవక్త(స)కు సన్నిహితులము' అని చెప్పారు. ఈ మాట విని అస్మా బిన్తె ఉమైస్(ర.అ)కు చాలా కోపం వచ్చింది. ఆమె ఇలా అన్నారు : 'ఎంతమాత్రం కాదు. దైవసాక్షిగా! మీరంతా దైవ ప్రవక్త(స)కు తోడుగా ఉన్నారు. మీలో ఆకలిగొన్నవారికి దైవప్రవక్త(స) అన్నం తినిపించేవారు. తెలియనివారికి జ్ఞానబోధ చేసేవారు. కాని మేము బహుదూరాన, అబిసీనియాలో శత్రువుల దేశంలో నివసించేవారం. ఈ బాధలన్నీ మేము దైవం మరియు దైవప్రవక్త మార్గంలోనే భరించాము. దైవసాక్షిగా చెబుతున్నాను. మీరు చెప్పిన మాటను నేను దైవప్రవక్త(స)కు వినిపించేవరకూ అన్నం తినను. పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టను. అక్కడ మమ్మల్ని (కొందరు) బాధించేవారు, హెచ్చరించేవారు. బెదిరించేవారు. ఇదంతా నేను దైవప్రవక్త(స)కు చెబుతాను. దీని గురించి ప్రశ్నిస్తాను. అల్లాహ్ సాక్షిగా! నేను అబద్ధం చెప్పను. విషయాన్ని వక్రీకరించను. జరిగిన దానిపై హెచ్చుతగ్గులు కూడా చేయను'.

అంతలోనే దైవప్రవక్త(స) అక్కడికి ఏతెంచారు. అప్పుడామె, 'దైవప్రవక్తా! ఉమర్ నాతో ఈ విధంగా చెప్పార'ని ఫిర్యాదు చేసారామె. "మరి నీవు దానికి సమాధానంగా ఏమన్నావు?" అని ఆయన(స) అడిగారు. 'నేను ఆయన గారికి ఈ విధంగా సమాధానమిచ్చాను' అని ఆమె వివరించారు. అంతా విన్న మీదట దైవప్రవక్త (సఅసమ్): "ఆయన మాకు నీకన్నా ఎక్కువ సన్నిహితుడేమీ కారు. ఆయనకూ, ఆయన తోటివారికి కేవలం ఒక హిజ్రత్ మాత్రమే ప్రాప్తమయింది.

అయితే ఓడలో ప్రయాణం చేసిన మీరు రెండు హిజ్రత్‌ల భాగ్యం దక్కించుకున్నారు” అని ఓదార్చారు.

అస్మా బిన్తె ఉమైస్(రజి) ఇలా అనేవారు : ఈ సంఘటన తర్వాత అబూ మూసా(రజి)తోపాటు ఓడవారంతా నా దగ్గరకు తండోపతండాలుగా వచ్చి ఈ హదీసు గురించి నన్ను అడిగేవారు. వారి దృష్టిలో తమ గురించి దైవప్రవక్త(స) పలికిన పలుకు కన్నా సంతోషకరమైనది, గర్వించదగినది వారి కొరకు మరొకటి లేదు. అబూ మూసా(రజి) ఈ హదీసును నా ద్వారా పదేపదే వినేవారని అస్మా బిన్తె ఉమైస్(ర.అ) చెప్పినట్లుగా అబూ బుర్దా తెలిపారు.

అబూ బుర్దా (రజి) గారు అబూ మూసా అష్అరీ (రజి) ద్వారా ఉటంకించిన దాని ప్రకారం ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఈ విధంగా పలికారు : “అష్అరీ వర్గీయులు రాత్రిపూట మదీనాలో తమ నివాస గృహాలకు వచ్చి ఖుర్ఆన్ పారాయణం చేసినప్పుడు, వారి కంఠస్వరం ఆధారంగా నేను వారిని గుర్తు పడతాను. పగటిపూట నేను వారి నివాస గృహాలను చూడకపోయినప్పటికీ (ఖుర్ఆన్ పారాయణం ఆధారంగా వారిని గుర్తు పడతాను. ఈ అష్అరీ వర్గీయులలో వివేకవంతుడైన ఒక పురుషుడు ఉన్నాడు. అతనికి అవిశ్వాసుల వాహనదారులు లేక శత్రువులు ఎదురుపడినప్పుడు, ‘ఇప్పటివరకూ నా స్నేహితులంతా మీ కోసమే ఎదురు చూశారు. కాస్త ఆగండి, లేదా కొంచెం గడువు ఇవ్వండి (వాళ్ళు మీ సంగతి చూసుకుంటారు)’ అని అంటాడు.”[1]

**116)** హజ్రత్ అబూ మూసా అష్అరీ(రజి) తెలిపారు: ఖైబర్ విజయం తర్వాతనే మేము దైవప్రవక్త(సఅసమ్) సేవలో హాజరయ్యాము. కాని దైవప్రవక్త(స) మాకు సయితం (యుద్ధప్రాప్తిలో నుండి) వాటా ఇప్పించారు. ఆయన(స) మాకు తప్ప యుద్ధంలో పాల్గొనని మరెవరికీ యుద్ధప్రాప్తి (మాలె గనీమత్)లో నుండి వాటా ఇవ్వలేదు.

---

115–1. హదీసు చివర్లో అష్అరీ వర్గీయుల్లోని ‘హకీమ్’ (విజ్ఞుని) ప్రస్తావన వచ్చింది. ‘హకీమ్’ అనేది అతని పేరో లేక అతనిలోని విజ్ఞత వివేచనల కారణంగా అతనిని అలా వ్యవహరించేవారో తెలీదు. అయితే ఆ వ్యక్తి ధైర్యశాలి. సమయోచితంగా స్పందించేవాడు. అసాధారణమైన తన తెలివిడితో ప్రత్యర్థులను బోల్తా కొట్టించేవాడు. తనకు ప్రాణాపాయం ఉందని పసిగట్టగానే తాను ఒంటరిగా లేనని, తన వెంట చాలా మంది ఉన్నారని చెప్పి శత్రువు బారి నుండి ఆత్మరక్షణ చేసుకునేవాడు.

**117)** హజ్రత్ అబూ హురైరా(రజి) నుండి ఇబ్నె ముతీ గారి స్వేచ్ఛనొందిన బానిస సాలిమ్ విని తెలియజేశారు: (అబూ హురైరా(రజి) ఇలా అన్నారు). ఖైబర్ ప్రాంతంపై విజయం వరించినప్పుడు యుద్ధప్రాప్తిగా వెండీ బంగారాలు లభించ లేదు, ఆవులు, ఒంటెలు, తోటలు, వస్తు సామగ్రి లాంటివి లభించాయి. తరువాత మేము దైవప్రవక్త(స)తోపాటు 'వాదియె ఖురా' వైపు మరలాము. ఆ సందర్భంగా దైవప్రవక్త(స) వెంట మిద్అమ్ అనే ఒక బానిస వ్యక్తి ఉన్నాడు. జిబాబా తెగకు చెందిన ఒక వ్యక్తి ఆ బానిసను దైవప్రవక్త(స) వద్దకు కానుకగా పంపాడు. ఆ బానిస దైవప్రవక్త(స) ఒంటెపైనున్న తొట్లను దించుతుండగా ఎటువైపు నుంచో ఒక బాణం వచ్చి తగిలింది. జనులు ఆ దృశ్యాన్ని చూసి, 'ఈ వీర మరణం శుభప్రదమవుగాక!' అన్నారు. కాని దైవప్రవక్త(స), "అసంభవం. ఎవరి చేతిలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షిగా! ఖైబర్‌లో చేజిక్కిన యుద్ధప్రాప్తి (మాలె గనీమత్)లోనుంచి, పంపిణీకి ముందే ఇతను దొంగిలించిన దుప్పటి అగ్నిజ్వాలగా మారి ఇతనిపై మండుతున్నది" అన్నారు. ఇది విని ఒక సహాబీ ఒకటి లేదా రెండు చెప్పు వారులు తీసుకువచ్చి, నేను వీటిని తీసుకున్నాను అన్నారు. "(ఒకవేళ నీవు తీసుకువచ్చి, జమ చెయ్యకుండా ఉంటే) ఇవి కూడా నీ పాలిట నరకంలోని ఒకటి లేదా రెండు వార్లుగా పరిణమించేవి"[1] అన్నారు మహాప్రవక్త(స).

**118)** మహనీయ ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) ఇలా అనేవారు: "బాగా వినండి! ఏ దేవుని చేతిలో నా ప్రాణముందో ఆయన సాక్షిగా చెబుతున్నాను- భవిష్యత్ కాలంలోని ముస్లింలు దారిద్ర్యానికి లోనై, ఏమీ లేని దుర్భర స్థితిలో ఉంటారన్న భయమే గనక నాకు లేకుంటే, నా ఖిలాఫత్ కాలంలో జయించబడే పట్టణాలను దైవప్రవక్త(స) ఖైబర్‌ను పంచిపెట్టినట్లుగా పంచి పెట్టేసేవాణ్ణి. కాని ముస్లింల కొరకు కొంత (ఆర్థిక) నిధి ఉండాలని, వారు (అవసరం వచ్చినప్పుడు) పంచుకోవాలని నేను కోరుకుంటున్నాను."

---

117-1. అప్పగింత (అమానతు)లో ద్రోహం (ఖియానత్) చేయటం ఎంత ఘోరమైన అపరాధమో ఈ హదీసు ద్వారా విదితమవుతోంది.

118-1. ఉమర్(రజి) కోరుకున్నట్లే జరిగింది. ఆయన తదనంతర కాలంలో ముస్లింలు ప్రపంచం నలుమూలలా విస్తరించారు. రాజ్య అవసరాలు, వారి అవసరాలు పెరిగాయి. అప్పుడు వారు షరీఅత్ ఆదేశాలకనుగుణంగా ఆ ఒనరులను పంపకం చేసుకున్నారు.

**119)** ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) ఈ విధంగా చెప్పినట్లుగా జైద్ బిన్ అస్లం తండ్రి ఉటంకించారు: "ఒకవేళ నా తర్వాత రాబోయే ముస్లింల గురించి చింత లేకపోయినట్లయితే, నా పరిపాలనా కాలంలో ఏ పట్టణం జయించబడినా, నేను దానిని దైవప్రవక్త(సఅసమ్) ఖైబర్‌ను పంచిపెట్టినట్లుగా పంపిణీ చేసేవాణ్ణి."[1]

**120)** అన్‌బస బిన్ సయీద్ తెలిపారు: అబూ హురైరా (రజి) ప్రవక్త మహనీయుల(సఅసమ్) సమక్షంలో హాజరై (ఖైబర్ యుద్ధ ప్రాప్తిలో నుండి) తనకూ వాటా ఇవ్వమని అర్థించారు. అప్పుడు సయీద్ బిన్ ఆస్ కుమారుడు (అబాన్ బిన్ సయీద్-రజి) 'దైవప్రవక్తా! ఈయన గారికి ఇవ్వకండి' అని చెప్పారు. దానిపై అబూ హురైరా(రజి), 'ఓహో! ఇతనా! (ఉహుద్ యుద్ధంలో) నోమాన్ బిన్ ఖౌఖర్ (సహాబీ)ని వధించినది ఇతనే కదూ!'అని వ్యాఖ్యానించారు. ఈ మాట వినగానే అబాన్ కోపంతో మండిపడుతూ, 'వాహ్వా! ఖుదూముజ్జాన్ పర్వతశ్రేణుల్లోనుంచి ఊడిపడిన 'వబ్ర్' (పిల్లికన్నా చిన్నదైన ఒక జంతువు) మాటలు బాగానే నేర్చారే!" అన్నారు.

(వేరొక కథనం)

మహనీయ అబూ హురైరా(రజి) సయీద్ బిన్ ఆస్ (రజి)కు ఇలా తెలియ జేశారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) అబాన్ (రజి)ను ఒకానొక యుద్ధం నిమిత్తం మదీనా నుండి నజ్ద్ ప్రాంతం వైపు పంపారు. తరువాత అబాన్(రజి)తన సహవాసుల సమేతంగా దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చే సమయానికే ఖైబర్ జయించబడింది. ఆ కాలంలో ముస్లింల పేదరికం గురించి ఏమని చెప్పేది! వారి గుర్రాలపైని జీనులో కూడా ఖర్జూరపు బెరడు నింపబడి ఉండేది (కనీసం చర్మపు జీను కూడా ఉండేది కాదు).

'దైవప్రవక్తా! యుద్ధప్రాప్తిలో నుండి వీరికి వాటా ఇవ్వకండి' అని అబూ హురైరా(రజి) అన్నారు. అది విని అబాన్, 'ఓయీ వబ్ర్! నువ్వెంత? జాన్ పర్వతాల మీది నుండి దిగి వచ్చినవాడివి. నువ్వు నీ హద్దులో ఉండు' అన్నారు.

---

119-1. అంటే జయించబడిన రాజ్యాల ద్వారా వచ్చిన ప్రాప్తిని, రెవెన్యూను, భూములను ముస్లింలకు జాగీరుగా రాసి ఇచ్చేసేవాణ్ణి. వాటిని ప్రభుత్వ బొక్కసంలో జమ చేసేవాణ్ణి కాను. కాని రానున్న కాలంలో ముస్లింలుగా ధర్మపరివర్తన చెందేవారిని నిరుపేద లుగా వదలిపెట్టడం సమంజసం కాదు. అందుకే ఈ ధనాన్ని బైతుల్‌మాల్‌లో జమ చేయిస్తున్నాను.

**దానిపై దైవప్రవక్త(స), "అబాన్! కూర్చో" అని చెప్పారు. చివరకు దైవప్రవక్త(స) వారికి వాటా ఇవ్వలేదు.[1]**

**121) అమ్ర్ బిన్ యహ్యా బిన్ సయీద్ కథనం : మా తాత గారు మాతో ఏమన్నారంటే; అబాన్ బిన్ సయీద్(రజి) దైవప్రవక్త(సఅసమ్) సన్నిధిలో హాజరై సలామ్ చేశారు. ఆ సమయంలో అక్కడే ఉన్న అబూ హురైరా(రజి), 'దైవప్రవక్తా! ఇబ్నె ఖౌఖల్‌ను వధించిన వ్యక్తి ఇతనే' అన్నారు. దానికి సమాధానంగా అబాన్ అబూహురైరా(రజి)తో ఇలా అన్నారు: 'జాన్ కొండలపైనుండి దిగి వచ్చిన ఈ అడవిపిల్లి నా తప్పులెన్నే అంతటివాడవటం ఆశ్చర్యంగా ఉందే. అల్లాహ్ నా చేతుల మీదుగా ఇబ్నె ఖౌఖల్‌కు వీర మరణం వొసగి ఆయనకు గౌరవం ప్రసాదించాడు. ఆయన ద్వారా నన్ను చంపి, నన్ను పరాభవం పాల్జేయలేదు'[1]**

**122) విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) ఆధారంగా ఉర్వా ఉటంకించారు: దైవప్రవక్త(సఅసమ్) పుత్రిక హజ్రత్ ఫాతిమా(ర.అ) అబూ బకర్ సిద్దీఖ్ (రజి) దగ్గరకు ఎవరినో పంపించి, తనకు రావలసిన వారసత్వ హక్కు**

---

120-1. ఉహుద్ యుద్ధంలో ఇబ్నె ఖౌఖల్(రజి) అనే సహాబీని వధించే నాటికి అబాన్ బిన్ సయీద్(రజి) ముస్లిం కారు. యుద్ధంలో తనకు ప్రత్యర్థిగా ఉన్న ఇబ్నె ఖౌఖర్(రజి)ను ఆయన హతమార్చారు. అయితే అబూ హురైరా ఆ విషయాన్ని ఎత్తి చూపేసరికి అబాన్‌కు కోపం వచ్చి, అబూ హురైరా(రజి)ను కించపరిచే విధంగా మాట్లాడారు. (అల్లాహ్ ఆయన్ని మన్నించుగాక!)

'జాన్' అనేది ఒక పర్వతశ్రేణి. అది అబూహురైరా (రజి) తెగవారు నివసించే ప్రదేశంలో ఉంది.

121-1. అబాన్ బిన్ సయీద్(రజి) ఆ విధంగా పలకటంలోని ఉద్దేశం ఏమిటంటే; నేను ఇబ్నె ఖౌఖల్(రజి)ను వధించిన కాలంలో అవిశ్వాసిగా ఉన్నాను. నా చేతుల మీదుగా దేవుడు ఆయనకు అమరగతిని వొసగాడు. ఆ విధంగా ఇబ్నె ఖౌఖల్ షహీద్‌గా ప్రసిద్ధి చెందారు.

దేవుడు నాకు చేసిన మరో మేలు ఏమిటంటే, నేను ఇబ్నె ఖౌఖల్ చేత వధించబడి ఉంటే, తిరస్కార స్థితిలో చచ్చిపోయేవాణ్ణి. అది నా పాలిట పరాభవంగా పరిణమించేది. ఇప్పుడు నేను ముస్లింని. దైవాన్ని, దైవప్రవక్త(స)ను హృదయ పూర్వకంగా విశ్వసించినవాణ్ణి. కాబట్టి గతంలో జరిగిన సంఘటనలను ఇప్పుడు ప్రస్తావించకుండా ఉండటం మంచిది.

అబాన్(రజి) ఇచ్చిన సమాధానం విని దైవప్రవక్త(స) మౌనం వహించారు.

ఇప్పించమని కోరారు. అంటే అల్లాహ్ తన ప్రవక్త(స)కు మదీనాలో, ఫదక్‌లో ప్రసాదించిన ఆస్తిలోనుంచి, ఖైబర్‌లోని అయిదవ భాగం (ఖుముస్)లోనుంచి తన వాటా ఇవ్వమని అడిగించారు. దానికి సమాధానంగా అబూబక్ర్(రజి) ఇలా అన్నారు: "ప్రవక్తలమైన మాకు ఆస్తి అంటూ ఏదీ ఉండదు. మేము ఏది వదలిపోయినా అదంతా 'సదఖా'(దానం) అవుతుంది. కాకపోతే ముహమ్మద్(స) కుటుంబీకులు దానినుండి లబ్ధి పొందుతూ ఉంటారు" అని దైవప్రవక్త(స) స్వయంగా ఉపదేశించారు. నేను దైవసాక్షిగా చెబుతున్నాను- దైవప్రవక్త (సఅసమ్) విడిచిపోయిన 'సదఖా'లో నేను ఎలాంటి పరివర్తన చేయజాలను. దైవప్రవక్త(స) కాలంలో అది ఎలా ఉండేదో ఇప్పుడూ అది అదే స్థితిలో ఉంటుంది. అందులో (దాని పంపకం విషయంలో) దైవప్రవక్త(స) తన జీవిత కాలంలో అవలంబించిన పద్ధతినే నేనూ అవలంబిస్తాను".

ఆ విధంగా అబూ బకర్(రజి) ఫాతిమా (ర.అ)కు వారసత్వం రూపేణా ఏమీ ఇవ్వలేదు. తత్కారణంగా ఫాతిమా(ర.అ) అబూ బకర్(రజి) పట్ల కినుక వహించారు. ఆయనతో గల సాధారణ సంబంధాలను త్రెంచుకున్నారు. మరణ కాలం వరకూ ఆమె గారు అబూబక్ర్‌తో మాట్లాడలేదు.

హజ్రత్ ఫాతిమా(ర.అ) దైవప్రవక్త(స) పరమపదించిన తర్వాత కేవలం ఆరు నెలలు మాత్రమే జీవించి ఉన్నారు. ఆమె మరణించినప్పుడు ఆమె భర్త అలీ(రజి) రాత్రి పూట ఆమె అంతిమ సంస్కారం జరిపారు.[1] అబూబకర్(రజి)కు కూడా ఆ సమాచారం చేరవేయకుండా తాను స్వయంగా నమాజె జనాజా చేయించారు.[2] ఫాతిమా(ర.అ) జీవించి ఉన్నంతకాలం ప్రజలు హజ్రత్ అలీ(రజి) బాగోగుల పట్ల శ్రద్ధ కనబరిచేవారు. కాని ఫాతిమా(ర.అ) కాలం చేసిన తరువాత జనులు తన పట్ల ముభావంగా ఉన్నట్లు అలీ(రజి) పసిగట్టారు. ఆ సమయంలో ఆయన మహనీయ అబూబకర్(రజి)తో సంధి చేసుకుని, ఆయన సమక్షంలో విధేయతా ప్రమాణం చేయాలన్న నిర్ణయానికి వచ్చారు. అప్పటికి అబూబక్ర్(రజి) ఖలీఫాగా బాధ్యతలు స్వీకరించి ఆర్నెల్లు గడిచినా అబూబకర్(రజి) సమక్షంలో ఆయన విధేయతా ప్రమాణం (బయ్అత్) చేయలేదు.[3]

---

122-1. ఎందుకంటే తనను రాత్రిపూట ఖననం చేయవలసిందిగా హజ్రత్ ఫాతిమా(ర.అ) వసీయతు చేసి ఉన్నారు. రాత్రి సమయంలో అంతిమ సంస్కారం జరిగినట్లయితే

**ఎట్టకేలకు ఆయన అబూబకర్‌ను పిలువనంపారు. తన దగ్గరకు ఒంటరిగా రావాలని, వేరెవరినీ వెంటబెట్టుకుని రాకూడదని కబురంపారు. ఉమర్(రజి) ఆయన వెంట రావటం అలీ(రజి)కి ఇష్టంలేదు.[4] 'దైవసాక్షిగా! ఎట్టి పరిస్థితిలోనూ అక్కడికి వెళ్ళవద్ద'ని ఉమర్(రజి) అబూబకర్(రజి)కు సలహా ఇచ్చారు.[5] దానికి అబూబకర్(రజి) "ఎందుకు? ఒంటరిగా వెళితే ఏమవుతుంది? దైవసాక్షిగా చెబుతున్నాను- నేను ఒంటరిగానే వెళతాను" అన్నారు.**

**అన్నట్లే ఆయన అలీ(రజి) దగ్గరకు వెళ్ళారు. అలీ(రజి) అల్లాహ్‌ను సాక్షిగా పెట్టి ఇలా అన్నారు: 'అల్లాహ్ మీకు వొసగిన గౌరవాన్ని, మీకు ప్రసాదించిన అనుగ్రహ భాగ్యాలను, మీకు వొసగిన మేలును, విశిష్టతను మేము అంగీకరిస్తున్నాము. ఈ విషయంలో ఎలాంటి సందేహానికి తావులేదు. కాని మీరు మా పట్ల అతిగా వ్యవహరించారు (ఖిలాఫత్ వ్యవహారంలో మమ్మల్ని కనీసం సంప్రతించనయినా లేదు). దైవప్రవక్త(స)తో మాకు గల బంధుత్వ సంబంధం దృష్ట్యా మీరు మమ్మల్ని సంప్రతించి ఉండాల్సిందన్నది మా భావన'.**

---

మరింత బాగా పరదా పాటించినట్లవుతుందన్నది ఆమె అభిప్రాయమై ఉండవచ్చు.

122-2. ఆమె నమాజె జనాజాకు హజ్రత్ అబ్బాస్(రజి) సారథ్యం వహించారని మరికొందరు పేర్కొన్నారు.

122-3. అలీ(రజి)తోపాటు బనీ హాషిమ్‌కు చెందినవారెవరూ 'బయ్అత్' చేయలేదు. ఎందుకంటే అబూబకర్ సిద్దీఖ్(రజి) ఖిలాఫత్‌ను వారు సమంజసమైనదిగా భావించలేదు. తామంతా దైవప్రవక్త(స) మరణ శోకంలో ఉండగా తమను కనీసం మాట వరుసకు కూడా సంప్రతించకుండా వారసుణ్ణి ఎంపిక చేసుకోవటం అన్యాయం అన్నది వారి వాదన.

ఇదిలా ఉండగా ఆరుమాసాల పాటు హజ్రత్ అలీ(రజి) 'బయ్అత్' చేయకుండా ఉండటానికి గల కారణాలలో ఒకటేమంటే, దైవప్రవక్త(స) పరమ పదించిన తరువాత హజ్రత్ ఫాతిమా(ర.అ) ఆరోగ్యం బాగా క్షీణించింది. ఆమెను ఓదార్చటం, పరామర్శించటం, సపర్యలు చేయటం వంటి పనులతో మహనీయ అలీ(రజి)కి తీరిక లేకుండా పోయింది.

122-4. ఎందుకంటే హజ్రత్ ఉమర్(రజి)ది కరకు స్వభావం. ఆయన రావటం వల్ల వ్యవహారం బెడిసికొడుతుందేమోనని అలీ(రజి) భావించారు.

122-5. అప్పటికే బనూ హాషిమ్ ప్రజలలో అబూబక్ర్ (రజి) పట్ల అసమ్మతి పెరగటం వల్ల,

ఈ మాటలు విని అబూబకర్(రజి) తల్లడిల్లిపోయారు. దాదాపు స్పృహ కోల్పోయారు. మాట్లాడగలిగే స్థితిలోకి వచ్చాక ఇలా అన్నారు : "ఎవరి అధీనంలో నా ప్రాణముందో ఆ దేవుని సాక్షిగా! దైవప్రవక్త(స) బంధువుల పట్ల సద్భావనతో మెలగటమనేది నాకు నా బంధువుల పట్ల సద్వ్యవహారం చేయటం కన్నా ప్రియమైనది. కాని నాకూ - మీ పరివారానికి మధ్యన ఏ ఆస్తిపాస్తుల విషయంలో అభిప్రాయ భేదం వచ్చిందో అందులో నేను సత్యం నుండి, మంచి నుండి వైదొలగ లేదు. ఈ వ్యవహారంలో దైవప్రవక్త(స) ఏ మార్గాన్ని అవలంబించగా నేను గమనించానో, సరిగ్గా ఆ మార్గాన్నే నేనూ అవలంబించాను."

ఈ సంభాషణ ముగిసిన తరువాత అలీ (రజి) అబూ బక్ర్(రజి)తో, 'మధ్యాహ్నం తరువాత నేను మీ సమక్షంలో విధేయతా ప్రమాణం (బయ్అత్) చేస్తాను' అన్నారు. మహనీయ అబూబకర్(రజి) జుహ్ర్ నమాజ్ అనంతరం వేదిక (మింబర్)పైకి వచ్చి, క్లుప్తంగా ప్రసంగించారు. తరువాత మహనీయ అలీ(రజి) వ్యవహారాన్ని ప్రస్తావించారు. ఇప్పటివరకూ ఆయన విధేయతా ప్రమాణం చేయ కుండా ఉండటానికి గల కారణం కూడా వివరించారు. పిదప హజ్రత్ అలీ(రజి) 'ఇస్తిగ్ఫార్' చేసి, తషహ్హుద్ పఠించి, ఆ పైన అబూ బకర్(రజి) త్యాగనిరతిని, ప్రత్యేకతలను విశదీకరించారు. ఆ తర్వాత ఇలా అన్నారు: ఏదయితే నేను అబూబకర్(రజి) గురించి అభిప్రాయపడ్డానో, దాని మూలంగా ఆయన పట్ల మాకు ఎలాంటి అసూయ లేదు. అల్లాహ్ ఆయనకు ప్రసాదించిన గౌరవోన్నతులను (ఖిలాఫత్ను) కాదనటం కూడా మా ఉద్దేశం కాదు. కాకపోతే మా అభ్యంతరమల్లా ఒక్కటే- ఖిలాఫత్ వ్యవహారంలో మమ్మల్ని సంప్రతించి, మా అభిప్రాయం కూడా తెలుసుకోవాల్సింది. ఈ వ్యవహారంలో మేము ఉపేక్షించబడ్డాము. అది మాకు ఆవేదనను మిగిల్చింది. అలీ(రజి) మనోవేదనను విని ముస్లింలు స్వాగతించారు, మీరు చెప్పేది సమంజసం అంటూ హర్షం వెలిబుచ్చారు. ఈ సంఘటన తర్వాత ముస్లింలు మహనీయ అలీ(రజి) పట్ల మరింత ప్రేమాదరణలతో మెలగసాగారు.[6]

---

వారంతా అబూబక్ర్(రజి) పట్ల మర్యాదగా మాట్లాడరేమోనని ఉమర్(రజి) అనుమానించారు.

122-6. మహనీయ అలీ(రజి) ఎంతో విజ్ఞతతో, దూరదృష్టితో వ్యవహరించారు. అదే సమ యంలో ఆయన తన మనసులోని మాటను దైవ గృహంలో- ప్రజల సమక్షంలో-

**123) విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు: ఖైబర్ ప్రాంతంపై విజయం లభించినప్పుడు, "ఇక ఖర్జూర పండ్లతో మా మనసు నిండి పోతుంది"[1] అని చెప్పాము.**

**124) అబ్దుర్రహ్మాన్ బిన్ ఉమర్(రజి) తెలిపారు : "ఖైబర్‌పై విజయం లభించనంతవరకూ మేము లేమికి గుర్తై ఉండేవారము."[1]**

## అధ్యాయం : 40

# దైవప్రవక్త(స) ఖైబర్ వాసులపై తహసీల్దారును నియమించటం

**125) అబూ సయీద్ ఖుద్రీ(రజి), అబూ హురైరా(రజి)లిరువురూ ఇలా తెలిపారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఒక సహచరుణ్ణి (సవాద్ బిన్ గజియా– రజిను) ఖైబర్‌పై అధికారిగా నియమించి పంపారు. ఆయన అక్కడి నుండి నాణ్యమైన ఖర్జూరాలను తెచ్చారు. "ఖైబర్‌లోని ఖర్జూర పండ్లన్నీ ఇలాగే ఉంటాయా?" అని దైవప్రవక్త(స) దర్యాప్తు చేయగా, 'లేదు, దైవసాక్షిగా ఓ దైవ ప్రవక్తా! అక్కడి ఖర్జూరాలన్నీ ఇలా ఉండవు. నేను రెండు లేక మూడు 'సా'ల నాసిరకం ఖర్జూరాలను ఇచ్చి వాటికి బదులుగా ఒక 'సా' నాణ్యమైన ఖర్జూరాలను**

---

ఎలాంటి దాపరికం లేకుండా చెప్పారు. దాంతో ప్రజల్లో ఉన్న సందేహాలన్నీ పటా పంచలై పోయాయి. హజ్రత్ అలీ(రజి) విధేయతా ప్రమాణం చేసిన మీదట బనూ హాషిమ్ వర్గం వారంతా ఆయన్ని అనుసరించారు. ఆ విధంగా అబూబకర్ సిద్దీఖ్(రజి) ఖిలాఫత్‌పై ఏకాభిప్రాయం ఏర్పడినట్లయింది. దీని తర్వాత కూడా ఎవర యినా ఆ ఖిలాఫత్ సరైనది కాదని భావిస్తే వారు ప్రవక్త ప్రియ సహచరుల(రజి)ను వ్యతిరేకించినట్లే. అలాంటి వారికి ఈ ఆయత్ కఠిన హెచ్చరికగా ఉంది. "తనకు రుజుమార్గం విశదమైనప్పటికీ ఎవడయినా ప్రవక్తకు వ్యతిరేకంగా నడుం బిగిస్తే విశ్వాసుల వైఖరిని కాక మరొకరి వైఖరిని అవలంబిస్తే అతన్ని మేము అతడు మళ్ళిన దిక్కుకే నడిపిస్తాము..." (4: 115)

123–1. ఎందుకంటే ఖైబర్‌లో ఖర్జూర తోటలు చాలా ఎక్కువగా ఉండేవి. అక్కడి దిగుబడి కూడా అధికమే. కాబట్టి ఇక నుండి మదీనా నగరానికి ఖర్జూరపండ్లు చాలా ఎక్కువగా వస్తూ ఉంటాయని అమ్మ ఆయిషా(ర.అ) తలపోశారు.

124–1. ఖైబర్ విజయం తరువాత ముస్లింలకు కలిమి ప్రాప్తించింది. అక్కడి నుండి భారీ ఎత్తున ఖర్జూరాలు మదీనాకు వచ్చేవి. యుద్ధప్రాప్తి క్రింద వ్యవసాయ భూములు కూడా ముస్లింల మధ్య పంపిణీ చేయబడ్డాయి.

తీసుకుంటూ ఉంటాన'ని ఆ సహాబీ విన్నవించుకున్నారు. దానికి దైవప్రవక్త(స) "అలా చేయకండి. నాణ్యమైన ఖర్జూరాలు తీసుకోవాలనే అనుకుంటే మీ దగ్గరున్న ఖర్జూరాలన్నింటినీ దిర్హములకు బదులుగా అమ్మేయండి. అలా వచ్చిన దిర్హములతో నాణ్యమైన ఖర్జూరాలను కొనుగోలు చేయండి" అని బోధించారు.

అబూ హురైరా(రజి) గారి మరో ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త(స) అన్సార్ కుటుంబీకులకు చెందిన బనీ అదీ సోదరుణ్ని ఖైబర్ అధికారిగా నియమించి పంపారు.

## అధ్యాయం : 41

# ఖైబర్ వాసులతో దైవప్రవక్త(స) వ్యవహారం

**126)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఖైబర్ వ్యవసాయ భూములను, తోటలను యూదుల వద్దనే ఉండనిచ్చి, సాగు చేసే బాధ్యతను వారికి అప్పగించారు. వ్యవసాయోత్పత్తుల్లో చెరి సగభాగం తీసుకునే విధంగా ఒప్పందం చేసుకున్నారు.

## అధ్యాయం : 42

# ఖైబర్‌లో ఒక మేక మాంసంలో విషం కలిపి దైవప్రవక్త(స) ముందు సమర్పించటం

ఈ విషయాన్ని దైవప్రవక్త(స) ఆయిషా(ర.అ)కు తెలుపగా, ఆమె ఉర్వాకు వివరించి చెప్పారు.

**127)** మహనీయ అబూ హురైరా(రజి) ఉల్లేఖనం: ఖైబర్ విజయం తర్వాత దైవప్రవక్త(సఅసమ్)కు ఒక యూదు మహిళ, ఒక మేక మాంసాన్ని కానుకగా పంపింది. అయితే అందులో విషం కలుపబడి ఉంది.[1]

---

127–1. విష ప్రయోగం చేసిన ఆ యూదు మహిళ పేరు జైనబ్. దైవప్రవక్త(స)కు మేక ముంగాలి మాంసం ఎంతో ఇష్టమని ఆమె ఎవరి ద్వారానో తెలుసుకుని, అందులో ఎక్కువ విషం కలిపింది. దైవప్రవక్త(స) ఒక మాంసపు ముక్క రుచి చూసి, దానిని కక్కేశారు. ఆయన వెంట ఉన్న బిషర్ బిన్ బరా (రజి) ఆ మాంసం తిని ప్రాణం విడిచారు. తన వెంట ఉన్న ఇతర సహచరులను ఆ మాంసం తినవద్దని ప్రవక్త(స) పురమాయించారు.

## అధ్యాయం : 43

# జైద్ బిన్ హారిసా(రజి) యుద్ధం గురించి[1]

**128) అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఉసామా బిన్ జైద్(రజి)ను ఒక సైనిక దళానికి అధిపతిగా నియమించారు. ఈ నియామకంపై కొంతమంది అభ్యంతరం తెలిపారు. అప్పుడు ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఇలా అన్నారు: "ఈ రోజు ఈ అబ్బాయి నియా మకంపై మీకు అభ్యంతరం ఉంటే, కొన్నాళ్ళ క్రితం ఇతని తండ్రి (జైద్ బిన్ హారిసా) సారథ్యం పట్ల కూడా మీకు ఇలాంటి అభ్యంతరమే ఉండేది. అవునా! దైవసాక్షిగా! అతను సైనిక సారథ్యానికి అన్ని విధాలా తగినవాడు. అదీగాక అతను, ఈ అబ్బాయి ఉసామా బిన్ జైద్ మాదిరిగానే నాకు ఎంతో ప్రియతముడు."[1]**

---

బైహఖీ ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త(స) ఆ స్త్రీని పిలిపించి విచారిస్తే, 'మీరు దేవుని సత్య సందేశహరులై ఉంటే, దేవుడు మీకు ఎలాగూ ఈ విషయం ఎరుక పరుస్తాడు. ఒకవేళ మీరు అబద్ధీకులై ఉంటే మీ మరణం వల్ల పీడ విరగడవుతుందని భావించాను' అని చెప్పింది.

దైవప్రవక్త(స) ఆ స్త్రీని బిషర్ బిన్ బరా (రజి) కుటుంబీకులకు అప్పగించారు. వారు ఆమెను ప్రతీకారంగా హతమార్చారు. ఈ హదీసు ద్వారా బోధపడినదేమంటే విషమిచ్చి చంపటం కూడా హత్యానేరం క్రిందికే వస్తుంది. దానికిగాను 'ఖిసాస్' (ప్రతీకారం) తప్పనిసరి.

43-1. హజ్రత్ జైద్ బిన్ హారిసా(రజి)ను దైవప్రవక్త(సఅసమ్) అనేక యుద్ధాలకు సేనాధిపతిగా చేసి పంపారు. సలమా ఇలా అన్నారు: మేము ఆయనతో కలిసి ఏడు యుద్ధాలు చేశాము. మొదట 'నజ్ద్' వైపు వెళ్ళాము. తరువాత బనూ సులైమ్ వైపు, ఆ తరువాత ఖురైష్ వర్తక బిడారాల వైపు వెళ్ళాము. ఈ బిడారులలో దైవప్రవక్త(స) అల్లుడైన అబుల్ ఆస్ బిన్ రబీ(రజి) ఖైదీగా పట్టుబడ్డారు. పిమ్మట బనూ సాలబా వైపు వెళ్ళాము. అటుపిమ్మట వాదీ అల్ ఖురా వైపు వెళ్ళాము. ఆపైన బనూ ఫిజారా వైపు పంపబడ్డాము. ఈ చివరి యుద్ధాన్నే ఇమామ్ బుఖారీ (రహ్మ) ఈ అధ్యాయంలో చేర్చి ఉంటారని హాఫిజ్ ఇబ్నె హజర్ అభిప్రాయపడ్డారు. ఆ యుద్ధంలో అగ్రశ్రేణి సహాబా పాల్గొన్నారు. ఉదాహరణకు- మహనీయ అబూబకర్, మహనీయ ఉమర్, మహనీయ అబూ ఉబైదా, సాద్, సయీద్, ఖతాదా తదితర సహచరమాన్యులు (రజిఅల్లాహు అన్హుమ్).

128-1. అప్పట్లో ఈ విధంగా అర్థం లేని అభ్యంతరాలు లేవనెత్తే వారి నాయకుడు అయాష్ బిన్ అబీ రబీయా. దైవప్రవక్త(స) ఒక కుర్రవాణ్ణి ముహాజిర్లకు నాయకునిగా చేయటం

## అధ్యాయం : 44

# ఉమ్రా ఖజా గురించి[1]

ఈ హదీసును అనస్ (రజి) ప్రవక్త మహనీయుల (సఅసమ్) నుండి ఉటంకించారు.

**129)** బరా బిన్ ఆజిబ్(రజి) వివరించారు : ప్రవక్త మహనీయులు (సఅసమ్) జీఖఅద మాసంలో ఉమ్రా కొరకు దీక్ష బూనారు.

కాని మక్కా వారు ఆయన్ని నగరంలో ప్రవేశించకుండా అడ్డుకున్నారు. చివరకు ఇరువర్గాల మధ్య ఒప్పందం జరిగింది. ఒప్పందం ప్రకారం (వచ్చే సంవత్సరం) ముస్లింలు కేవలం మూడు రోజుల కొరకు మక్కాకు రావచ్చు. ఒప్పందం ఇలా లిఖించబడింది : "ఇది దైవప్రవక్త యగు ముహమ్మద్(సఅసమ్) చేసుకున్న ఒడంబడిక... "ఖురైషు అవిశ్వాసులు వెంటనే దానికి అడ్డు తగులుతూ, 'మేము మిమ్మల్ని దైవప్రవక్త(స)గా అంగీకరించేటట్లయితే, మిమ్మల్ని ఇక్కడ నిలువరించాల్సిన అవసరమేముంటుంది? మా దృష్టిలో మీరు కేవలం అబ్దుల్లాహ్ కుమారుడగు ముహమ్మద్ మాత్రమే' అన్నారు. దానికి ఆయన (స) "నేను దైవప్రవక్తను, ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్‌ను కూడా" అని పలికారు. తరువాత అలీ(రజి)ని

---

విద్రోహం అని వ్యాఖ్యానించాడు. మరి కొంతమంది కూడా అతని అభ్యంతరాన్ని సమర్థించారు. ఈ సమాచారం హజ్రత్ ఉమర్(రజి)కు తెలిసింది. ఆయన వారికి సర్దిచెప్పి, విషయాన్ని దైవప్రవక్త(స)కు చేరవేశారు. ఈ ధోరణిపై దైవప్రవక్త(స) కినుక వహించి, ప్రసంగించారు. ఉసామా(రజి) సారథ్యంలో సైనిక దళాన్ని పంపమని ఆయన(స) తన మరణానికి ముందు కూడా గట్టిగా తాకీదు చేశారు. ఆ సైనిక దళం మదీనా పొలిమేరల్లో ఉండగానే మహాప్రవక్త (స) పరమపదించారు. ప్రథమ ఖలీఫా(రజి) హజ్రత్ అబూబక్ర్ పదవీ బాధ్యతలు చేపట్టగానే ఉసామా సారథ్యంలో ఆ సైనిక దళాన్ని యుద్ధానికి పంపించారు.

44-1. హిజ్రీ 6వ సంవత్సరంలో మక్కా ఖురైషులు దైవప్రవక్త(స)ను, ఆయన సహచరులను హుదైబియాలో నిలువరించిన కారణంగా, ఒడంబడికననుసరించి వారు అక్కడే శిరోముండనం చేయించుకుని, ఖుర్బానీ ఇచ్చి మదీనాకు తిరిగి వెళ్ళిపోయారు. కాబా ప్రదక్షిణ చేసి, సఫా- మర్వాల మధ్య సయీ చేసే అవకాశం వారికి లభించలేదు. అందుచేత దైవప్రవక్త(స) మరుసటి సంవత్సరం తన సహచరుల సమేతంగా మక్కాకు వచ్చి ఉమ్రా (ఖజా) చేసి వెళ్ళారు.

ఉద్దేశించి, "దైవప్రవక్త అనే వాక్యాన్ని చెరిపివెయ్యి" అని సూచించారు. కాని అలీ (రజి) ససేమిరా అన్నారు. 'ఎంతమాత్రం అలా జరగదు. దైవసాక్షిగా! నేనా వాక్యాన్ని ఎన్నటికీ చెరపలేను' అన్నారు. దైవప్రవక్త(స) ఆ వ్రాతపత్రాన్ని తన చేతిలోకి తీసుకున్నారు. దైవప్రవక్త(స)కు వ్రాయటం రాదు. కాని ఆ క్షణంలో ఆయన(స) ఆ వాక్యాన్ని, "ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్ చేసుకున్న ఒడంబడిక"గా మార్చేశారు... వచ్చే ఏడాది మక్కాకు వచ్చినప్పుడు ముస్లిములు ఆయుధాలు చేబూని రాకూడదు. కాకపోతే (ఒక్కొక్కరు) ఒక కరవాలం తెచ్చుకోవచ్చు. అది కూడా ఒరలోనే ఉండాలి. ఒకవేళ మక్కావాసులలో ఎవరయినా వీరి వెంట వెళ్ళదలిస్తే, అతన్ని తమ వెంట తీసుకెళ్ళలేరు. కాని వీరి సహచరులలో ఎవరయినా మక్కాలో ఉండిపోదలిస్తే, వాళ్ళను తీసుకుపోకూడదు'.

(ఈ ఒడంబడిక ప్రకారం) ఆయన(స) మరుసటి సంవత్సరం మక్కాలో ప్రవేశించారు (ఉమ్రా చేశారు). కాని మూడు రోజులు పూర్తవగానే మక్కావారు అలీ(రజి) దగ్గరకు వచ్చి, 'గడువు ముగిసింది, కాబట్టి ఇక బయలుదేరమని మీ నాయకునికి చెప్పండి' అన్నారు.

దైవప్రవక్త(స) మక్కా నుండి బయలుదేరినప్పుడు, హమ్జా(రజి) కూతురు 'బాబాయి... బాబాయి' అంటూ వెంటపడింది. అలీ(రజి) ఆ పాపను ఎత్తుకున్నారు. ఆమె చెయ్యి పట్టుకుని, ఫాతిమా (ర.అ) వద్దకు వచ్చి, 'నీ బాబాయి కూతుర్ని ఎత్తుకో. నేను ఈమెను తీసుకువచ్చాన'ని అన్నారు. ఈ వ్యవహారంలో అలీ, జైద్, జాఫర్‌ల మధ్య అభిప్రాయభేదం ఏర్పడింది. 'ఈ పాపను నేను తీసుకువచ్చాను. ఈమె నా పినతండ్రి కూతురు' అని అలీ(రజి) వాదించగా, 'ఈమె నా బాబాయి కూతురు. ఈమె పినతల్లి నా వివాహ బంధంలో ఉంది' అని జాఫర్ (రజి) వాదించారు. 'లేదు. ఈమె నా సోదరుని కుమార్తె' అని జైద్ పట్టుపట్టారు. కాని దైవప్రవక్త(స) మాత్రం పినతల్లి పక్షాన తీర్పు వినిపించారు. "పినతల్లి కన్న తల్లికి ప్రత్యామ్నాయం వంటిది" అని పలికారు. అలీ (రజి)ని ఉద్దేశించి, "నీవు నా వాడవు. నేను నీ వాడను" అన్నారు. జాఫర్(రజి)తో, "రూపురేఖలలో, నీతి నడవడికలలో నీవు నన్ను పోలి ఉన్నావ్" అని చెప్పారు. ఇక జైద్(రజి)తో, "నీవు నా సోదరుడివి. నాచేత స్వేచ్ఛనొందిన 'మౌలా'వి" అని పలికారు. హమ్జా కూతుర్ని

**మీరు మీ నికాహ్‌లోకి తెచ్చుకోండి' అని అలీ(రజి) దైవప్రవక్త(స)కు సలహా ఇవ్వగా, "లేదు. ఆ పిల్ల నా పాలవరుస సోదరుని కుమార్తె"[1] అని దైవప్రవక్త(స) చెప్పారు.**

**130) మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఉల్లేఖించారు : ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) ఉమ్రా చేసే సంకల్పంతో బయలుదేరారు. కాని ఖురైషు అవిశ్వాసులు ఆయన్ని(స) కాబా గృహం వద్దకు చేరుకోకుండా అడ్డుకున్నారు. అందువల్ల దైవప్రవక్త(స) తన ఖుర్బానీ పశువును హుదైబియాలోనే జిబహ్ చేసి, శిరోముండనం చేయించుకున్నారు. వచ్చే ఏడాది ఉమ్రా చేసుకునే విధంగా వారితో ఒడంబడిక చేసుకున్నారు. కాని ఆయుధాలు ధరించి రాకూడదని (కేవలం ఒక కరవాలాన్ని ఒరలో పెట్టుకుని రావచ్చుని) ఆంక్ష విధించటం జరిగింది. మక్కా వారు కోరుకున్నంత కాలమే మక్కాలో ఉండాలన్నది మరో షరతు. ఒడంబడికననుసరించి దైవప్రవక్త(స) మరుసటి సంవత్సరం ఉమ్రా చేశారు. మక్కా నగరంలో ప్రవేశించారు. మూడు రోజుల వరకూ అక్కడ ఉన్నారు. గడువు ముగిసిందని మక్కావారు చెప్పటంతో అక్కడి నుండి వెళ్ళిపోయారు.**

---

129-1. హమ్జా (రజి) దైవప్రవక్త(స)కు బాబాయి మాత్రమే కారు, పాలవరుస సోదరుడు కూడా. అంటే పసితనంలో వారిద్దరూ ఒకే స్త్రీ పాలు త్రాగి ఉన్నారు. అందువల్ల ఆ పిల్ల ఆయన(స)తో వివాహానికి ధర్మసమ్మతం కాజాలదు.

దైవప్రవక్త(స)కు చదవటం, వ్రాయటం రాదు. ఆయన నిరక్షరాసి. కాని ఆ క్షణంలో ఆయన ఖురైషులు అభ్యంతరం తెలిపిన వాక్యాన్ని కొట్టివేసి తన స్వహస్తాలతో "అబ్దుల్లాహ్ కుమారుడగు ముహమ్మద్" అని వ్రాయటం ఒక అద్భుతం.

ఈ హదీసు ద్వారా హజ్రత్ జాఫర్(రజి) విశిష్టత తెలిసివస్తోందని హాఫిజ్ ఇబ్నె హజర్ అభిప్రాయపడ్డారు. ఎందుకంటే ఆయన రూపురేఖలలోనూ, నీతీ నడవడికల్లోనూ దైవప్రవక్త(స)ను చాలావరకు పోలి ఉండేవారు.

ఇకపోతే ఆ చిన్నపిల్ల. జాఫర్(రజి) జీవించి ఉన్నంత కాలం ఆమె జాఫర్(రజి) సంరక్షణలోనే ఉంది. జాఫర్ అమరగతినొందిన మీదట అలీ(రజి) సంరక్షణలోకి వచ్చింది. అలీ(రజి) సంరక్షణలోనే పెరిగి పెద్దదయింది. ఆ సందర్భంగానే ఆయన దైవప్రవక్త(స)తో, "ఆమెను వివాహమాడండి" అని సలహా ఇచ్చారు. కాని దైవ ప్రవక్త(స) ఈ ప్రతిపాదనను నిరాకరించడానికి కారణమేమిటో పై హదీసులో వచ్చింది.

**131)** ముజాహిద్ ఇలా వివరించారు: నేనూ, ఉర్వా బిన్ జుబైర్– ఇద్దరం మస్జిదె నబవీలోకి వెళ్ళాము. ఆ సమయంలో అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఆయిషా(ర.అ) కుటీరానికి దగ్గరలోనే కూర్చుని ఉన్నారు. దైవప్రవక్త(సఅసమ్) మొత్తం ఎన్ని ఉమ్రాలు చేశారని ఉర్వా ప్రశ్నించగా, 'నాలుగు ఉమ్రాలు చేశారు. వాటిలో ఒకటి మాత్రం రజబ్ నెలలో చేశార'ని అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) చెప్పారు.

మేము, ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ ఆయిషా(ర.అ) తన ఇంట్లో మిస్వాక్ చేస్తున్న శబ్దం విన్నాము. అప్పుడు ఉర్వా, 'ఓ విశ్వాసుల మాతా! అబూ అబ్దుర్రహ్మాన్ (అబ్దుల్లాహ్ బిన్ ఉమర్) ఏమంటున్నారో విన్నారా? దైవప్రవక్త(స) మొత్తం నాలుగు ఉమ్రాలు చేశారని అంటున్నారు' అని ప్రశ్నించగా, ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు : "దైవప్రవక్త(స) ఎప్పుడు ఉమ్రా చేసినా అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కూడా ఆయన వెంట ఉండేవారు. కాని ఆయన(స) రజబ్ నెలలో మాత్రం ఉమ్రా చేయలేదు"[1]

**132)** అబ్దుల్లాహ్ బిన్ అబీ అవ్ఫా(రజి) ఇలా చెప్పేవారు : "ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఉమ్రా చేసినప్పుడు, మేము ఆయన(స)కు రక్షావలయంగా నిలబడి ముష్రిక్కులు, ముష్రిక్కు కుర్రవాళ్ళు కీడు తలపెట్టకుండా కాపాడేవారం."[1]

**133)** అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) సయీద్ బిన్ జుబైర్‌తో ఇలా అన్నారు: ప్రవక్త మహనీయులు(సఅసమ్) తన ప్రియ సహచరులతో కలసి ఉమ్రా చేయడానికి మక్కా నగరంలో ప్రవేశించినప్పుడు. 'చూడండి! కొంతమంది ఇప్పుడు మీ వద్దకు వస్తున్నారు. మదీనా జ్వరం వారిని నీరసించిపోయేలా చేసింది' అని బహుదైవారాధకులు పరస్పరం చెప్పుకున్నారు. అందువల్ల దైవప్రవక్త(స) తన

131–1. అమ్మ ఆయిషా(ర.అ) చెప్పిన మాట విని అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) నిశ్శబ్దంగా ఉండిపోయారు. అందువల్ల ఈ విషయంలో అమ్మ ఆయిషా(ర.అ) పలుకు ప్రామాణికమైనదని రూఢీ అయింది. (ఖుస్తులానీ)

132–1. హుదైబియా ఒడంబడిక జరిగిన మరుసటి సంవత్సరం దైవప్రవక్త(స) ఉమ్రా చేసినప్పటి సందర్భమిది. అప్పటికి మక్కా బహుదైవారాధకుల హృదయాలు ఇస్లామ్ పట్ల, ఇస్లామ్ ప్రవక్త(స) పట్ల నిర్మలంగా లేవు. వారు దైవప్రవక్త(స)కు కీడు తలపెట్ట వచ్చునని ముస్లింలు అనుమానించారు. అందుకే ఈ భద్రతా ఏర్పాటు.

సహచరులతో "మొదటి మూడు ప్రదక్షిణలలో 'రమల్' చేయండి (అంటే భుజాలు ఎగురవేస్తూ వేగంగా, నిటారుగా నడవండి). రుక్నె యమానీ - హజ్రె అస్వద్‌ల మధ్య మాత్రం మామూలుగానే నడవండి" అని ఆజ్ఞాపించారు. మరైతే ప్రదక్షిణ లన్నింటిలోనూ రమల్ చేయమని మాత్రం ఆజ్ఞాపించలేదు. సహచరులు ప్రయాస పడరాదన్న ఉద్దేశ్యంతో ఆయన(స) అలా ఆదేశించారు. 'ఖుఅయ్‌ఖియాన్' పర్వతంపై నిలబడి ముస్లింలను చూస్తున్న బహుదైవారాధకుల కంటికి ముస్లింలు బలహీనంగా కనిపించరాదన్న ఆలోచనతో దైవప్రవక్త(స) ఈ విధంగా ఆజ్ఞాపించారు.

**134)** మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) కాబా గృహ ప్రదక్షిణ సందర్భంగా 'రమల్' చేయమని ఆజ్ఞాపించినా, సఫా- మర్వాల మధ్యన పరుగెత్తమని చెప్పినా (అక్కడి) బహుదైవారాధకుల ముందు తమ బలాన్ని ప్రదర్శించడానికే అలా చెప్పారు.[1]

**135)** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ మైమూనా(ర.అ)ను నికాహ్ చేసుకున్నప్పుడు ఆయన(స) ఇహ్రామ్ దీక్షలో ఉన్నారు. ఆమెతో సమాగమం జరిపే సమయానికి ఇహ్రామ్ దీక్ష విరమించి ఉన్నారు. దైవప్రవక్త(స) ఆమెతో సమాగమం జరిపిన 'సరిఫ్' స్థలంలోనే ఆమె మరణించారు. హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) ద్వారానే ఉల్లేఖించబడిన మరో హదీసు ప్రకారం దైవప్రవక్త(స) 'ఉమ్రా ఖజా' సందర్భంగా మైమూనా(ర.అ)ను వివాహమాడారు.[1]

---

134-1. అంటే మదీనా వాతావరణంలో ముస్లింలు నీరసించిపోలేదని సంకేతప్రాయంగా తెలియజేశారు. భుజాలు ఎగురవేస్తూ వేగంగా నడవటాన్ని 'రమల్' అంటారు. అది ఇప్పటికీ సంప్రదాయంగానే ఉంది.

135-1. హజ్రత్ మైమూనా (ర.అ) ఇబ్నె అబ్బాస్‌కు పినతల్లి అవుతారు. ఆమె సోదరి ఉమ్ముల్ ఫజ్ల్ అబ్బాస్(రజి)గారి భార్య. అబ్బాస్ గారే దైవప్రవక్త(స)తో మైమూనా నికాహ్ జరిపించారు.

'సరిఫ్' అనేది మక్కాకు పది మైళ్ళ దూరానవున్న ఒక చిన్న గ్రామం. హిజ్రీ 51వ సంవత్సరంలో హజ్రత్ మైమూనా (ర.అ) ఈ గ్రామంలోనే తనువు చాలించటం విశేషం.

## అధ్యాయం : 45

# మూతా యుద్ధం

**ఈ యుద్ధం సిరియా రాజ్యంలోని 'బల్ఖా'లో హిజ్రీ 8వ యేట జరిగింది.**

**136) మహనీయ ఇబ్నె ఉమర్(రజి) తెలిపారు: ఆ రోజు (మూతా యుద్ధం జరిగిన నాడు) నేను జాఫర్ తయ్యార్(రజి) శవం వద్ద నిలబడి, ఆయన శరీరంపై ఉన్న ఖడ్గాల, ఈటెల గాయాలను పరిశీలించాను. ఆయన శరీరం ముందు భాగంలో 50 గాయాలు కనిపించాయి గాని వీపుపై ఒక్క గాయం కూడా కనిపించ లేదు.**

**ఇబ్నె ఉమర్(రజి) గారి ద్వారానే అందిన మరో హదీసు... ప్రవక్త మహ నీయులు(సఅసమ్) మూతా యుద్ధానికి సేనాధిపతిగా జైద్ బిన్ హారిసా(రజి)ను నియమించారు. దైవప్రవక్త(స) ఇలా ఉపదేశించారు : "జైద్ గనక యుద్ధంలో వీర మరణాన్ని ఆస్వాదిస్తే, జాఫర్‌ను సేనాధిపతిగా చేసుకోండి. ఒకవేళ జాఫర్ కూడా అమరగతినొందితే అబ్దుల్లాహ్ బిన్ రవాహ నాయకుడుగా ఉంటాడు" - అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఇలా అన్నారు : 'యుద్ధంలో నేను కూడా పాల్గొన్నాను. యుద్ధా నంతరం మేము జాఫర్(రజి)ను వెతికితే, ఆయన శవం అమరవీరుల శవాల గుట్టలో కనిపించింది. నేను ఆయన శరీరంపై 90కిపైగా ఈటెలు, ఖడ్గాల గాయాలు చూశాను.'[1]**

**137) హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) వివరించారు : (మూతా) యుద్ధంలో జైద్, జాఫర్, అబ్దుల్లాహ్ బిన్ రవాహా (రజిఅల్లాహు అన్‌హుమ్)లు అమరగతినొందిన సమాచారం అందకముందే, వారు అమరగతినొందారని సహచరమాన్యులకు తెలియజేశారు. ఆయన(స) ఇలా చెబుతూ పోయారు-**

---

136-1. హజ్రత్ జాఫర్ తయ్యార్(రజి) మూతా యుద్ధంలో జరిపిన వీరోచిత పోరాటం చిరస్మరణీయం. రొమ్ముపై అసంఖ్యాకమయిన గాయాలయ్యాయి. కాని ఆయన వీపుపై ఒక్క గాయం కూడా కనిపించలేదు. అంటే బొందిలో ప్రాణం ఉన్నంతవరకూ ఆయన వెన్ను చూపకుండా పోరాడారు.

జాఫర్(రజి) అబూ తాలిబ్ కుమారుడు. అమరగతినొందిన మీదట అల్లాహ్ ఆయనకు స్వర్గంలో రెండు రెక్కలు ప్రసాదించాడు. వాటితో ఆయన స్వర్గంలో తాను కోరిన చోటికి ఎగిరి వెళ్ళే స్వేచ్ఛను పొందారు. ఈ కారణంగానే ఆయనకు 'తయ్యార్' అనే బిరుదు లభించింది- రజిఅల్లాహు అన్‌హు వ రజాహ్.

**"ఇప్పుడు జైద్(రజి) ధ్వజం చేబూని ఉన్నాడు. అతను వధించబడ్డాడు. ఇదిగో, ఇప్పుడు జాఫర్(రజి) పతాకం పట్టుకున్నాడు. అతను కూడా అమరగతినొందాడు. ఇప్పుడు ఇబ్నె రవాహా (రజి) జెండా పట్టుకున్నాడు. అతను కూడా అమరగతి నొందాడు- ఇలా అంటున్నప్పుడు దైవప్రవక్త(సఅసమ్) కళ్ళ నుండి కన్నీటి ధార ప్రవహిస్తూ ఉంది. ఎట్టకేలకు దేవుని కరవాలాలలోని ఒక కరవాలం ఖాలిద్ బిన్ వలీద్(రజి) పతాకాన్ని తన చేతిలో తీసుకున్నాడు. అల్లాహ్ అతని చేతుల మీదుగా విజయం ప్రసాదించాడు."[1]**

**138) హజ్రత్ ఆయిషా (ర.అ) చెప్పగా తాను విన్నానని అమ్రా బిన్తె అబ్దుర్రహ్మాన్ తెలిపారు. ఆమె ఇలా అన్నారు: జైద్ బిన్ హారిసా, జాఫర్ బిన్ అబీ తాలిబ్, అబ్దుల్లాహ్ బిన్ రవాహా (రజిఅల్లాహు అన్హుమ్)లు అమరగతినొందిన వార్త అందినప్పుడు, ఆయన (మస్జిద్‌లో) కూర్చుని ఉన్నారు. ఆయన(స) ముఖార విందంలో దుఃఖం కొట్టొచ్చినట్లే కనిపిస్తోంది- ఆయిషా(ర.అ) ఇలా అన్నారు- నేను తలుపు చాటు నుండి చూస్తూ ఉన్నాను. అంతలో ఒక వ్యక్తి వచ్చి, 'దైవప్రవక్తా! జాఫర్ (రజి) ఇంటి స్త్రీలు బిగ్గరగా పెడబొబ్బలు పెడుతూ ఏడుస్తున్నారు' అని చెప్పాడు. దానికి ఆయన(స), "అలా ఏడ్వవద్దని వారికి చెప్పు" అని పురమాయిం చారు. ఆ వ్యక్తి వెళ్ళి, మళ్ళీ తిరిగి వచ్చాడు. 'నేను వాళ్ళను వారించాను. కాని వాళ్ళు నా మాటను లక్ష్యపెట్టడం లేదు' అని చెప్పాడు. దైవప్రవక్త(స) రెండవసారి అతనికి "అలా రోదించవద్దని వారికి గట్టిగా చెప్పు" అని తాకీదు చేశారు. ఆ వ్యక్తి వెళ్ళి మళ్ళీ తిరిగి వచ్చి ఇలా విన్నవించుకున్నాడు: 'దైవసాక్షిగా! వాళ్ళను ఓదార్చడానికి నేను చాలా ప్రయత్నించాను. కాని వాళ్ళు ఏమాత్రం నా మాటను**

---

137-1. దైవప్రవక్త(స) ఈ యుద్ధంలో పాల్గొనలేదు. కాని ఆయన(స) మదీనాలోనే ఉండి కదనరంగాన్ని వీక్షించారు. ఆయన(స)కు 'వహీ' ద్వారా అక్కడ జరిగేదంతా తెలియజేయటం జరిగింది. ఆయన(స)కు అగోచరాల జ్ఞానం లేదు. కాని దివ్యవాణి ద్వారా విషయం వివరించబడింది. హజ్రత్ జాఫర్(రజి) ఈ యుద్ధంలో కుడిచేతిలో పతాకం పట్టుకుని ఉన్నారు. శత్రువులు ఆయన కుడిచేతిని నరికేయడంతో, ఎడమ చేత్తో జెండా పట్టుకున్నారు. ఎడమ చేతిని కూడా నరికివేయడంతో ఆయన వీర మరణాన్ని ఆస్వాదించారు. అల్లాహ్ ఆయనకు స్వర్గంలో రెండు రెక్కలు- పక్షి మాదిరిగా- ప్రసాదించాడని, వాటితో ఆయన స్వర్గంలో తాను కోరిన చోటికి ఎగిరి పోతున్నారని దైవప్రవక్త(స) చెప్పారు.

**లెక్క చేయలేదు'. "అలాగైతే వాళ్ళ నోట్లో ఇంత మన్ను పొయ్యి" అన్నారు దైవ ప్రవక్త(స). ఉమ్ముల్ మోమినీన్ ఇలా అన్నారు : '(ఏం మనిషివయ్యా నువ్వు?) అల్లాహ్ నీ ముక్కుకు మన్ను తగిలేలా చేయుగాక! నీవు ఆ స్త్రీలను వారి చేష్ట నుండి ఆపనూ లేదు. దైవప్రవక్త(స)కు మనోవేదన కలిగించకుండా ఆగనూ లేదు'.**

**139) ఆమిర్ ఇలా అన్నారు : అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) గారు జాఫర్ బిన్ అబీ తాలిబ్(రజి) కుమారునికి ఎప్పుడు 'సలామ్' పంపినా 'అస్సలాము అలైక యా ఇబ్నె జిల్‌జనాహైన్!' అని చెప్పేవారు (అంటే ఓయీ రెండు రెక్కల వాని పుత్రుడా! నీపై శాంతి వర్షించుగాక! అని పలికేవారు).**

**140) ఖాలిద్ బిన్ వలీద్(రజి) చెప్పగా తాను విన్నానని ఖైస్ బిన్ అబీ హాజిమ్ వివరించారు : ఖాలిద్ బిన్ వలీద్ ఇలా అన్నారు– "మూతా యుద్ధంలో నా చేతుల మీదుగా తొమ్మిది ఖడ్గాలు విరిగిపోయాయి. చివరకు యమన్‌లో తయారైన ఒక చిన్న కరవాలం మాత్రమే మిగిలింది."**

**141) హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్(రజి) కథనం: మూతా యుద్ధంలో శత్రువులతో పోరాడుతున్నప్పుడు, నా చేతుల్లోని తొమ్మిది కరవాలాలు విరిగి పోయాయి. ఆఖరికి కేవలం ఒక్క యమనీ కరవాలం మాత్రమే నా చేతిలో మిగిలింది.**

**142) నోమాన్ బిన్ బషీర్(రజి) తెలిపారు : అబ్దుల్లాహ్ బిన్ రవాహా (ఒకసారి అస్వస్థతకు గురై) స్పృహ కోల్పోయినప్పుడు, ఆయన సోదరి అమ్రా బిగ్గరగా ఏడుస్తూ 'అయ్యో నా అన్న. ఎంత చక్కనివాడు నా అన్న...' అంటూ ఆయన సుగుణాలను ఏకరువు పెట్టసాగింది. అయితే అబ్దుల్లాహ్ బిన్ రవాహా (రజి) స్పృహలోకి రాగానే, "నీవు నాలోని ఏ మంచిని ప్రస్తావించినా, 'నీవు నిజం గానే అలాంటి వాడివా?' అని నన్ను ప్రశ్నించటం జరిగేది" అన్నారు.**[1]

---

142–1. వేరొక ఉల్లేఖనం ప్రకారం దైవదూతలు ఇనుప చువ్వను ఎత్తి పట్టుకుని "నీవు నిజంగా అలాంటి సుగుణాలు కలవాడివేనా?" అని అడిగేవారు. దీనినిబట్టి తెలిసే దేమంటే కొన్ని జబ్బులు చేసినప్పుడు, మరణానికి ముందే దైవదూతలు మనిషికి కానవస్తారు. అబ్దుల్లాహ్ బిన్ రవాహా (రజి)కు స్పృహ వచ్చింది. ఆయన ఆరోగ్యవంతు లయ్యారు. మూతా యుద్ధంలో వీర మరణాన్ని ఆస్వాదించినది ఈ అబ్దుల్లాహ్ బిన్ రవాహా (రజి)యే.

**143)** నోమాన్ బిన్ బషీర్(రజి) కథనం : అబ్దుల్లాహ్ బిన్ రవాహా (రజి) అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయారు. పిదప ఆయన పై హదీసు తరహాలో (జరిగిన దంతా) వినిపించారు. అయితే మూతా యుద్ధంలో ఆయన అమరగతి నొంది నప్పుడు, ఆయన సోదరి ఏడ్వలేదు.[1]

## అధ్యాయం : 46

# ఉసామా బిన్ జైద్(రజి)ను దైవప్రవక్త(స) 'హురుఖాత్' తెగవారిపై దండయాత్రకు పంపటం

**144)** హుసైన్ బిన్ జున్దబ్ ఇలా అన్నారు: నేను ఉసామా బిన్ జైద్(రజి) చెప్పగా విన్నాను- ఆయన ఏమన్నారంటే; ప్రవక్త మహనీయులు(సఅసమ్) మమ్మల్ని హుర్‌ఖా తెగవారి వైపునకు పంపారు. మేము ప్రాతఃకాలం వారిపైన దాడి చేసి, వారిని ఓడించాము. తరువాత నేనూ, ఒక అన్సారీ సహాబీ కలసి ఆ తెగకు చెందిన ఒక వ్యక్తి (మిర్దాస్ బిన్ అమ్ర్)తో తలపడ్డాము. మేమతన్ని లొంగ దీసుకునే సరికి అతను 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అని పలికాడు. ఈ కలిమాను వినగానే అన్సార్ సహాబీ వెంటనే ఆగిపోయారు. కాని నేను అతన్ని నా బరిసెతో పొడిచి చంపేశాను.

మేము తిరిగి వచ్చిన మీదట జరిగినదంతా దైవప్రవక్త(స)కు వినిపించాము. దానికి ఆయన(స), "ఉసామా! అతను లా ఇలాహ ఇల్లల్లాహ్(కలిమా) పఠించిన మీదట కూడా నువ్వు అతన్ని వధించావా?" అని అడిగారు. 'అతను ప్రాణభయం తోనే అలా పలికాడు.(మనస్ఫూర్తిగా అతడు కలిమా పఠించలేదు)' అని నేను విన్నవించుకున్నాను. కాని ఆయన(స) మాటిమాటికీ అదే మాట అనసాగారు. (లా ఇలాహ ఇల్లల్లాహ్ అని పలికిన మీదట కూడా అతన్ని వధించావా? అని). ఆ సమయంలో నా మనసులో 'అయ్యో! నేను ఈ రోజుకు ముందు ఇస్లామ్ స్వీకరించకుండా ఉంటే బాగుండేదే' అన్న కోరిక జనించింది.[1]

---

143-1. మృతుని వద్ద పెడబొబ్బలు పెడుతూ రోదించడం, మృతుని యాతనకు కారణమవు తుందన్న విషయం ఆమెకు తెలిసిన తరువాత ఆమె జాగ్రత్తపడింది. రక్త సంబంధీ కుల మరణంపై బాధ కలగటం, కంట కన్నీరొలకటం సహజమే. దానిపై ఎలాంటి వారింపు లేదు. హాహాకారాలు చేయటం, మృతుని గుణగణాలను తలచుకుని రోదిం చటం మాత్రం సరైనది కాదు.

**145) సలమా బిన్ అక్వా(రజి) ఈ విధంగా అంటూ ఉండేవారు : నేను దైవప్రవక్త(సఅసమ్)తోపాటు ఏడు యుద్ధాలలో పాల్గొన్నాను. దైవప్రవక్త(స) పంపిన మరో తొమ్మిది సైనిక దళాలలో కూడా వెళ్ళాను (ఆ దళాలతోపాటు దైవ ప్రవక్త రాలేదు). ఈ దళాలకు కొన్నిసార్లు అబూబక్ర్(రజి) సారథ్యం వహిస్తే కొన్నిసార్లు ఉసామా బిన్ జైద్(రజి) అధిపతిగా ఉండేవారు.**

**146) సలమా బిన్ అక్వా (రజి) ఇలా అన్నారు : నేను ప్రవక్త మహనీయుల (సఅసమ్)తో కలిసి ఏడు యుద్ధాలలో పాల్గొన్నాను. నేను ఇబ్నె హారిసాతో కూడా కలిసి జిహాద్ చేశాను. దైవప్రవక్త(స) ఉసామాను మాపైన అధిపతిగా నియమించారు.[1]**

**147) సలమా బిన్ అక్వా (రజి) చెప్పినట్లుగా యజీద్ బిన్ అబీ ఉబైద్ ఉటంకించారు: నేను దైవప్రవక్త(సఅసమ్)తో కలసి ఏడు యుద్ధాలలో పాల్గొన్నాను. ఈ సందర్భంగా ఆయన ఖైబర్ యుద్ధం, హుదైబియా యుద్ధం, హునైన్ యుద్ధం, జాతుల్ ఖరద్ యుద్ధాలను ప్రస్తావించారు. మిగతా యుద్ధాల పేర్లను తాను మరచి పోయానని యజీద్ చెప్పారు.**

## అధ్యాయం : 47

# మక్కా విజయం గురించి [1]

**మక్కా వారిని అప్రమత్తం చేసే ఉద్దేశంతో హాతిబ్ బిన్ అబీ బల్తా వ్రాసిన ఉత్తరం గురించి....**

---

144-1. ఎదుటి వ్యక్తి 'కలిమయె తయ్యిబా' (సద్వచనం) పఠించిన తర్వాత కూడా ఉసామా అతనిని చంపటం పట్ల దైవప్రవక్త(స) తీవ్రమయిన ఆవేదనను వ్యక్తం చేశారు. ఆయన(స) పదేపదే అలా అంటుండడంతో ఉసామా సిగ్గుతో, పశ్చాత్తాప భావంతో కుమిలిపోయారు. ఎందుకంటే కలిమా పఠించక పూర్వం మనిషి వల్ల జరిగిన అపరాధాలన్నింటినీ దేవుడు క్షమిస్తాడు. అందుకే కలిమా పఠించే ఒక వ్యక్తిని 'కాఫిర్' అని యథేచ్ఛగా చెప్పటం చాలా పెద్ద పాపం. అదీగాక ఇలాంటి పోకడ వల్ల ముస్లింల మధ్యన గల సంఘీభావం తుత్తునియలై పోతుంది.

146-1. 'ఇబ్నె హారిసా' అంటే ఉసామా తండ్రి జైద్ అని అర్థం చేసుకోవాలి. హారిసా ఉసామా (రజి) తాత గారి పేరు.

47-1. హుదైబియా ఒడంబడికలోని ఒక షరతు ప్రకారం అటు ఖురైషుల మిత్ర పక్షాలుగానీ, ఇటు ముస్లింల మిత్రపక్షాలు గానీ పరస్పరం కయ్యానికి కాలు దువ్వకూడదు. బనూబకర్ తెగవారు ఖురైషుల మిత్రపక్షంగా ఉండగా, బనూ ఖుజాఅ తెగవారు

**148)** హజ్రత్ అలీ(రజి) ద్వారా తాను విన్నానని ఉబైదుల్లాహ్ బిన్ రాఫే తెలియజేశారు: అలీ(రజి) ఇలా చెప్పారు– నన్నూ, జుబైర్‌ను, మిఖ్దాద్‌ను ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఒక పనిపై పంపిస్తూ, "మక్కా మార్గంలో సాగిపోండి. 'రౌజాఖాఖ్' అనే చోటికి మీరు చేరుకోగానే ఒంటెపై స్వారీ అయి వెళుతున్న ఒక స్త్రీ మీకు కనిపిస్తుంది. ఆమె వద్ద ఒక ఉత్తరం ఉంది. దానిని మీరు తీసుకోండి" అని ఆదేశించారు. అలీ (రజి) ఇలా అన్నారు: మా గుర్రాలు మమ్మల్ని చాలా వేగంగా గొనిపోసాగాయి. మేము సరిగ్గా 'రౌజాఖాఖ్' ప్రదేశానికి చేరుకోగానే ఒంటెపై స్వారీ అయి వెళుతున్న ఒక మహిళ కనిపించింది (ఆమె పేరు సారా లేక కన్వర్). మేము ఆమెను ఆపి, "ఏదీ, నీ దగ్గర ఉన్న ఉత్తరం ఇటివ్వు", అని అడిగాము. దానికి ఆమె, 'నా దగ్గర ఉత్తరం గిత్తరం ఏమీ లేద'ని బుకాయించింది. 'చూడమ్మా! నీవు మర్యాదగా ఆ ఉత్తరం ఇస్తే సరి. లేకపోతే నిన్ను వివస్త్రను చేసి వెతకాల్సి ఉంటుంద'ని హెచ్చరించగానే, ఆమె ఆ ఉత్తరాన్ని తన జడలో నుంచి తీసి ఇచ్చింది.

మేము ఆ ఉత్తరాన్ని తీసుకుని దైవప్రవక్త(స) సేవలో హాజరయ్యాము– 'ఈ ఉత్తరం హాతిబ్ బిన్ అబీ బల్తా తరఫున...మక్కావారి పేర (సఫ్వాన్ బిన్ ఉమయ్యా, సుహైల్ బిన్ అమ్ర్, ఇక్రిమా బిన్ అబీ జహల్‌ల పేర)...' అని ఆ వ్రాత మొదల యింది. ఆ తరువాత, దైవప్రవక్త(స) త్వరలో మక్కా వారిపై దండయాత్ర చేయబో తున్నారన్న సమాచారం అందులో ఉంది. దైవప్రవక్త(స) హాతిబ్‌ను పిలిపించి, "హాతిబ్ ఏమిటిది?" అని నిలదీసి అడిగారు. దానికి ఆయన, 'దైవప్రవక్తా! నా వ్యవహారంపై నిర్ణయం గైకొనటంలో తొందరపడకండి. ఎందుకు అలా చేశానో మీకు వివరంగా చెబుతాను. అసలు విషయం ఏమిటంటే ఇతర ముహాజిర్ల మాదిరిగా నేను ఖురైషు వంశీయుణ్ణి కాను. కేవలం వారితో మైత్రీ సంబంధం మాత్రమే నాకు ఉంది. అయితే ముహాజిర్లందరికీ మక్కావారితో బంధుత్వ సంబంధం ఉంది. తత్కారణంగా మక్కా ఖురైషులు ఏదో ఒక విధంగా ముహాజిర్ల

---

అకస్మాత్తుగా బనూ ఖుజాఅపై దండెత్తారు. ఈ సందర్భంగా ఖురైషులు బనూ బకర్‌కు సహాయం చేశారు. బనూ ఖుజాఅ తెగవారు దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి, ఈ నియమోల్లంఘనపై ఫిర్యాదు చేశారు. తత్కారణంగా దైవప్రవక్త(స) మక్కావారిపై చర్య గైకొనవలసి వచ్చింది.

ఇల్లూ వాకిళ్ళను, సాధనా సంపత్తులను కనిపెట్టుకుని ఉంటున్నారు. (కాని నాకు ఆ అవకాశం లేదు) నేను వారికి ఏదైనా ఒక ఉపకారం చేస్తే, దానికి ప్రత్యుప కారంగా వాళ్ళు నా కుటుంబీకులకు కీడు తలపెట్టకుండా ఉంటారని భావించాను. ఇస్లామ్ నుండి తిరిగిపోయి నేను ఈ చేష్టకు ఒడిగట్టలేదు. నా హృదయంలో అవిశ్వాసం (కుఫ్ర్) భావన కూడా లేదు. నన్ను నమ్మండి' అని సంజాయిషీ ఇచ్చారు.

అంతా విన్న మీదట, "మీ ముందు ఇతను చెప్పినదంతా నిజం" అన్నారు దైవప్రవక్త(స). 'దైవప్రవక్తా! తమరు ఆనతినిస్తే నేను ఈ కపటి మెడ నరికేస్తాన'ని ఉమర్(రజి) విన్నవించుకోగా, 'వద్దు. ఇతను బద్ర్ సంగ్రామంలో పాల్గొన్న యోధు లలో ఒకడు. నీకేం తెలుసు? బద్ర్ సంగ్రామంలో పాల్గొన్నవారి పోరాట పటిమను (నింగినున్న) అల్లాహ్ వీక్షించాడు. (ముమ్తహినహ్ సూరాలో) అల్లాహ్ ఆ యోధుల గురించి ఇలా సెలవిచ్చాడు: "విశ్వసించిన ప్రజలారా! మీరు గనక నా మార్గంలో జిహాద్ చేయటానికీ, నా ప్రసన్నతను పొందటానికీ (స్వస్థలాన్ని విడిచి ఇళ్ళ నుండి) బయలుదేరినపుడు నాకూ, మీకూ శత్రువులైన వారితో స్నేహం చేయకండి. అసలు మీరు వారితో స్నేహం ఎలా చేస్తారు; మీ వద్దకు వచ్చిన సత్యాన్ని వారు విశ్వసించటానికి నిరాకరించారు కదా! కేవలం మీరు మీ ప్రభువైన అల్లాహ్‌ను విశ్వసించారనే నేరంపై వారు దైవప్రవక్తనూ, స్వయంగా మిమ్మల్నీ దేశ బహిష్కర ణకు గురి చేశారు. ఇదీ వారి వైఖరి. ఇలాంటి వారికి మీరు రహస్యంగా స్నేహ సందేశం పంపుతారా? వాస్తవానికి మీరు రహస్యంగా చేసేది, బహిరంగంగా చేసేది అంతా నాకు బాగా తెలుసు. మీలో అలా ఎవరు చేసినా అతను నిశ్చయంగా రుజుమార్గం తప్పిపోయినట్లే." *(అల్ ముమ్తహినహ్ **60: 1**)*

### అధ్యాయం : 48

## మక్కా విజయం (హిజ్రీ 8, రమజాన్ నెలలో)

**149)** ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసమ్) రమజాన్ నెలలో మక్కాను జయించారు. ఇబ్నె అబ్బాస్(రజి) ద్వారానే మరో ఉల్లేఖనం : మక్కా విజయం సందర్భంగా ప్రవక్త మహనీయులు(సఅసమ్)

ప్రయాణానికి బయలుదేరినప్పుడు ఉపవాసంతో ఉన్నారు. కాని ఆయన ఖుదైర్- ఉస్ఫాన్‌ల మధ్యన గల 'కదీద్' చెలమ దగ్గరకు చేరుకున్నప్పుడు ఉపవాసాన్ని విరమించారు. ఆ తరువాత దైవప్రవక్త(స) రమజాన్ నెల ముగిసేవరకూ ఉపవాసం పాటించలేదు.[1]

**150)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) తెలిపారు : "ప్రవక్త మహనీయులు(సఅసమ్) మదీనా నుండి (మక్కా వైపునకు) ప్రయాణమయ్యారు. ఆ సమయంలో ఆయన(స) వెంట పది లేక పన్నెండు వేల మంది సైనికులున్నారు. అప్పటికి దైవప్రవక్త(స) మదీనాకు ఏతెంచి ఎనిమిదన్నరేండ్లు పూర్తయ్యాయి (అది రమజాన్ నెల). దైవప్రవక్త(స)తోపాటు ఆయన ప్రియ సహచరులు కూడా ఉపవాసం పాటిస్తూ ఉన్నారు. కాని ఖుదైర్- ఉస్ఫాన్‌ల మధ్యన గల 'కదీద్' అనే చెలమ దగ్గరకు చేరుకున్న మీదట ఆయన(స) ఉపవాసాన్ని భగ్నపరిచారు. సహచరమాన్యులు (రజి) కూడా తమ తమ ఉపవాసాలను భగ్నపరిచారు- జుహ్రీ ఇలా అన్నారు : దైవప్రవక్త(స) ఏదేని విషయంలో ఆఖరిలో ఆచరించినదే అనుయాయులకు అనుసరణీయం కావాలి.

**151)** ఇబ్నె అబ్బాస్(రజి) కథనం : ప్రవక్త మహనీయులు(సఅసమ్) రమజాన్ మాసంలో హునైన్ వైపునకు బయలుదేరారు. ఆ సమయంలో ముస్లింలలో కొందరు ఉపవాసంతో ఉంటే, మరికొందరు ఉపవాసంతో లేరు. అయితే దైవప్రవక్త(స) వాహనంపై కుదురుగా కూర్చున్న మీదట ఒక పాల పాత్రనో లేక నీళ్ళ పాత్రనో తెప్పించి దానిని తన అరచేత్తో పట్టి (చూపిస్తూ) సేవించారు. ఆ తరువాత రోజా పాటించని సహచరులు రోజా పాటిస్తున్నవారిని ఉద్దేశించి

---

149-1. ఎందుకంటే ప్రయాణంలో బాటసారికి ఉపవాసాన్ని విరమించే అనుమతి ఉంది. అదీగాక ఉపవాసం వల్ల మనిషి సహజంగానే నీరసించిపోతాడు. మరీ ముఖ్యంగా జిహాద్ కొరకు వెళ్ళేవారు గనక ఉపవాసవ్రతం పాటించటం వల్ల లక్ష్యాన్ని ఛేదించటం కష్టతరమైపోతుంది. ఈ కారణంగానే- ఈ ప్రయాణంలో దైవప్రవక్త(స) ఉపవాసం పాటించలేదు. తన సహచరులకు కూడా ఉపవాసాలను విరమించమని సూచించారు. ఈ ఆజ్ఞ ఇప్పటికీ వర్తిస్తుంది. "మీలో ఎవరయినా వ్యాధిగ్రస్తులుంటే లేక ప్రయాణంలో ఉంటే, వేరే దినాలలో ఆ ఉపవాస దినాలను పూర్తి చెయ్యాలి." (అల్ బఖరా : 184)

**'ఇప్పుడు మీరు కూడా ఉపవాసాన్ని భగ్నపరచండి' అని చెప్పటం దైవప్రవక్త గమనించారు.**

**152) మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా వివరించారు: మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) రమజాన్ నెలలో (మక్కా వైపునకు) ప్రయాణమయ్యారు. ఆ సమయంలో ఆయన (స) ఉపవాస స్థితిలో ఉన్నారు. 'ఉస్ఫాన్' స్థలానికి చేరు కోగానే ఆయన(స) మంచినీళ్ళు అడిగారు. అది పగటి వేళ. తన సహచరులందరికీ కనిపించే విధంగా ఆయన(స) ఆ నీరు త్రాగారు.[1] అంటే ఆ ప్రయాణంలో ఆయన (స) ఉపవాసం పాటించలేదు. చివరకు ఆయన మక్కాలో ప్రవేశించారు.**

**ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అంటూ ఉండేవారు: దైవప్రవక్త(స) కొన్ని ప్రయాణాలలో ఉపవాసం ఉండేవారు. కొన్ని ప్రయాణాలలో ఉపవాసం ఉండే వారు కారు. కనుక ప్రయాణంలో ఉన్నప్పుడు కోరినవారు ఉపవాసం ఉండవచ్చు. కోరినవారు ఉండకపోవచ్చు. (ఎందుకంటే) బాటసారికి ఉపవాసాన్ని విరమించే అనుమతి ఉంది.**

## అధ్యాయం : 49

# మక్కా విజయం నాడు దైవప్రవక్త(సఅసమ్) జెండాను ఎక్కడ పాతిపెట్టారు?

**153) హిషామ్ బిన్ ఉర్వా తన తండ్రి గారి నుండి ఇలా ఉటంకించారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) మక్కా వైపునకు బయలుదేరినప్పుడు ఖురైషులకు ఆ సమాచారం అందింది. అప్పుడు అబూ సుఫ్యాన్ బిన్ హరబ్, హకీమ్ బిన్ హిజామ్, బుదైల్ బిన్ వరఖా– వీరు ముగ్గురూ కలిసి దైవప్రవక్త(స) రాక గురించి**

---

152-1. హిజ్రీ శకం 8వ యేట రమజాన్ నెలలో ముస్లింలు మక్కా వారిపై సైనికచర్య గైకొన డానికి మక్కాకు పయనమయ్యారు. ఎందుకంటే హిజ్రీ 6వ సంవత్సరంలో మక్కా నాయకులు ముస్లింలతో చేసుకున్న హుదైబియా ఒడంబడికను ఉల్లంఘించి బనూ ఖుజాఅ తెగవారిపై దాడి జరిపారు. బనూ ఖుజాఅ పీడితులు తమతో మైత్రీ సంబంధం కలిగి ఉన్న దైవప్రవక్త(స)కు ఫిర్యాదు చేసి సహాయం కొరకు అర్థించారు. రమజాన్ నెల 20వ తేదీన దైవప్రవక్త(స) విజేతగా మక్కా నగరంలో ప్రవేశించారు. ఆ సందర్భంగా ఆయన(స) సర్వసామాన్యమయిన మన్నింపుల ప్రకటన చేశారు. చంపదగిన శత్రువులకు కూడా క్షమాభిక్ష పెట్టారు.

నిర్ధారించుకోవడానికి మక్కా నుండి బయల్దేరారు. వారు కాలినడకన వస్తూ, 'మర్రజ్జహ్‌రాన్'[1]కు చేరుకునేసరికి, అనేకచోట్ల మంటలు కనిపించాయి. అవి అరఫాత్ మైదానంలోని మంటల్లా ఉన్నాయి. 'ఈ మంటలు ఎవరు పెట్టారు? ఇవి అరఫాత్ మైదానంలోని మంటల్లా ఉన్నాయి కదూ!'[2] అని అబూ సుఫ్యాన్ చెప్పగా, 'ఇవి బనీ అమ్ర్(ఖుబా తెగలవారు) వెలిగించిన మంటలు' అని బుదైల్ బిన్ వరఖా అభిప్రాయపడ్డాడు. దానికి అబూ సుఫ్యాన్, 'లేదు. బనూ అమ్ర్ తెగవారు ఇంత మంది ఉండరు' అని అన్నాడు.

ఈ సంభాషణ జరుగుతుండగానే దైవప్రవక్త(స) భద్రతా సిబ్బంది, వాళ్ళను నిర్బంధించి ప్రవక్త సమక్షంలో హాజరుపరిచారు. ఆ తరువాత అబూ సుఫ్యాన్ ఇస్లామ్ స్వీకరించాడు. పిదప దైవప్రవక్త(స) మక్కా నగరంవైపు సాగిపోతూ, "గుర్రాలు సవ్వడి చేస్తూ సాగిపోయే దారి ప్రక్కన అబూ సుఫ్యాన్ (రజి)ను నిలబెట్టండి. ఆయన గారు ముస్లింల సైనిక బలాన్ని ప్రత్యక్షంగా వీక్షించాలి" అని హజ్రత్ అబ్బాస్(రజి)కు సూచించారు. ఈ సూచనానుసారం అబూ సుఫ్యాన్‌ను నిలబెట్టవలసిన చోటే నిలబెట్టారు అబ్బాస్. వివిధ తెగలవారి సైనిక దళాలు ఒక్కొక్కటిగా అబూ సుఫ్యాన్ ముందునుంచే కదం తొక్కుతూ సాగిపోతుంటే ఆ దృశ్యాన్ని ఆశ్చర్యచకితులై వీక్షించారు అబూ సుఫ్యాన్.

ఒక సైనిక దళం తన ముందు నుండి సాగిపోతుండగా, 'అబ్బాస్! ఇది ఏ దళం?' అని అబూసుఫ్యాన్ అడగ్గా, 'ఇది గిఫ్ఫార్ తెగ' అని ఆయన చెప్పారు. దానికి అబూ సుఫ్యాన్, 'నాకు గిఫ్ఫార్ తెగవారితో పనేమిటి?' అన్నారు. అంతలోనే జుహైనా తెగవారి దళం సాగిపోయింది. వారిని గురించి కూడా అబూ సుఫ్యాన్ అదే ప్రశ్న వేశారు. బనూ సులైమ్ తెగవారు సాగిపోతున్నప్పుడు కూడా వారి గురించి అదే ప్రశ్న. చివరకు ఓ భారీ సైనిక దళం ముందుకు వచ్చింది. అటువంటి సైనిక దళాన్ని ఆయన అంతకుముందు ఎప్పుడూ చూడలేదు. 'ఎవరు వీరు?' అని

153-1. 'మర్రజ్జహ్‌రాన్' అనేది మక్కా నగరానికి ఒక మంజిల్ దూరాన ఉంది. దానిని ఇప్పుడు 'వాదియె ఫాతిమా'గా వ్యవహరిస్తున్నారు.

153-2. ఇస్లామ్‌కు పూర్వం అరబ్బు తెగలవారు హజ్జ్ సందర్భంగా అరఫాత్ మైదానంలో రాత్రిపూట తమ తమ తెగల ఉనికిని చాటుకోవటానికి వేర్వేరుగా మంటలు పెట్టుకునేవారు.

**అబూ సుఫ్యాన్ ప్రశ్నించగా, 'ఇది అన్సార్ల దళం... సాద్ బిన్ ఉబాదా (రజి) ఈ దళానికి అధిపతి. ఆయన చేతుల్లోనే అన్సార్ల ధ్వజం ఉంది' అని అబ్బాస్ సమాధానమిచ్చారు.**

**'అబూ సుఫ్యాన్! ఈ రోజు రక్తం చిందించే రోజు. ఈ రోజు కాబా గృహ ప్రాంగణంలో యుద్ధం చేసేందుకు ఆనతి లభించింది' అని సాద్ బిన్ ఉబాదా (రజి) రెచ్చగొట్టే విధంగా మాట్లాడారు.**

**దానికి అబూ సుఫ్యాన్, 'ఓహో! అబ్బాస్! ఖురైషులు నాశనమయ్యే దినం వచ్చేసిందన్నమాట!!'[3] అని వ్యాఖ్యానించారు.**

**అంతలోనే అతి చిన్న సైనిక దళం ఒకటి వచ్చింది. ఆ దళంలో దైవ ప్రవక్త(స)తోపాటు కొంతమంది సహచరమాన్యులు కూడా ఉన్నారు. దైవప్రవక్త(స) ధ్వజాన్ని జుబైర్ బిన్ అవ్వామ్(రజి) పట్టుకుని ఉన్నారు. దైవప్రవక్త(స) అబూ సుఫ్యాన్ ముందు నుండి సాగిపోతుండగా, 'సాద్ బిన్ ఉబాదా ఏమన్నారో మీకు తెలుసా?' అనడిగారు. దానికి దైవప్రవక్త(స), "ఏమన్నాడు?" అని దర్యాప్తు చేయగా, 'ఈ రోజు ఖురైషులందరినీ సంహరించటం జరుగుతుందని సాద్ చెప్పిపోయాడ'ని అబూ సుఫ్యాన్ వివరించారు. దానికి ఆయన(స), "సాద్ చెప్పింది తప్పు. అసలు విషయం ఏమిటంటే ఈ రోజు అల్లాహ్ కాబా గౌరవాన్ని, ఔన్న త్యాన్ని మరింతగా పెంచాడు. ఈ రోజు కాబా గృహానికి గిలాఫు తొడిగించ బడుతుంది" అని చెప్పారు.**

**తన ధ్వజాన్ని (జన్నతుల్ మఅలాకు సమీపంలో ఉన్న) 'హుజూన్'లో పాతిపెట్టమని ఆయన(స) ఆజ్ఞాపించారు.**

**(వేరొక సనదు ప్రకారం) ఉర్వా ఇలా అన్నారు: తనకు అబ్బాస్(రజి) చెప్పి నట్లుగా నాఫే నాకు ఇలా తెలియపరిచారు: అబ్బాస్ గారు జుబైర్ బిన్ అవ్వామ్**

---

153-3. దైవప్రవక్త(స) అబూ సుఫ్యాన్ ముందు నుండి సాగిపోతున్నప్పుడు, 'దైవప్రవక్తా! మీరు మీ జాతి వారిని సంహరించమని ఆజ్ఞాపించారా?' అని దేవునిపై ఒట్టేసి మరీ అడిగాడు. దానికి దైవప్రవక్త(స), "లేదు" అని అన్నారు. అప్పుడు అబూ సుఫ్యాన్, సాద్ బిన్ ఉబాదా (రజి) చెప్పిన మాటను ప్రస్తావించగా ఆయన(స) ఇలా అన్నారు: "ఈ రోజు కనికరించే రోజు. ఈ రోజు అల్లాహ్ ఖురైషులకు గౌరవం ప్రసాది స్తాడు"- తర్వాత ఆయన(స) సాద్ చేతిలో ఉన్న జెండాను తీసుకుని, దానిని ఖైస్‌కు అందించారు.

(రజి)తో, 'ఓ అబూ అబ్దుల్లాహ్! (మక్కా విజయం తర్వాత) జెండాను ఇక్కడే (హుజూన్‌లోనే) పాతిపెట్టమని దైవప్రవక్త(స) మీకు ఆజ్ఞాపించారా?' అని అడిగారు.

ఉల్లేఖకుడు ఇలా అంటున్నారు : ఆ రోజు దైవప్రవక్త(రజి), మక్కా మెరక ప్రాంతమైన 'కదా' వైపు నుండి నగరంలో ప్రవేశించమని ఆజ్ఞాపించారు. అయితే దైవప్రవక్త(స) మాత్రం 'కదా' పల్లపు ప్రాంతం గుండా నగరంలో ప్రవేశించారు. ఆ రోజు ఖాలిద్(రజి) దళంలోని ఇద్దరు సహచరులు- హుబైష్ బిన్ అష్‌అర్, కుర్జ్ బిన్ జాబిర్ ఫిహ్రీ అమరగతి నొందారు.[4]

**154)** అబ్దుల్లాహ్ బిన్ ముగఫ్ఫల్ (రజి) ఈ విధంగా చెప్పగా తాను విన్నానని ముఆవియా బిన్ ఖుర్రా తెలియజేశారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) మక్కా విజయం సందర్భంగా తన ఒంటెపై కూర్చుని అల్ ఫతహ్ సూరాను మధు రాతి మధురంగా పారాయణం చేస్తూ ఉన్నారు- ముఆవియా బిన్ ఖుర్రా(రజి) ఇలా అన్నారు : జనం నన్ను చుట్టుముడతారన్న భయమే గనక నాకు లేకుంటే అబ్దుల్లాహ్ బిన్ ముగఫ్ఫల్ (రజి) చదివి వినిపించినట్లుగా నేను కూడా చదివి వినిపించేవాణ్ణే.

**155)** ఉసామా బిన్ జైద్(రజి) తెలిపారు: మక్కా విజయం సందర్భంగా దారిలో ఉన్నప్పుడు నేను దైవప్రవక్త(స)ను, 'యా రసూలల్లాహ్! తమరు రేపు (మక్కాలో) ఎక్కడ విడిది చేస్తారు?' అని అడిగాను. దానికి ఆయన(స) "మా కోసం అఖీల్ ఏదైనా ఇల్లు విడిచిపెడితేగా! (అన్నీ అమ్ముకున్నాడు)" అని చెప్పారు.

తరువాత ఆయన(స) ఇలా అన్నారు : "విశ్వాసి అవిశ్వాసికి వారసుడు కాలేడు. అలాగే అవిశ్వాసి కూడా విశ్వాసికి వారసుడు కాలేడు."

'మరైతే అబూ తాలిబ్ ఆస్తి ఎవరికి లభించింది?' అని జుహ్రీని (ఎవరో) అడిగితే, 'అఖీల్, తాలిబ్‌లు ఆయన ఆస్తికి వారసులయ్యారు' అని చెప్పారు.[1]

---

153-4. ఖాలిద్ బిన్ వలీద్(రజి) తన సైనిక దళాన్ని తీసుకుని మక్కాలో ప్రవేశించినప్పుడు సఫ్వాన్ బిన్ ఉమయ్యా, సుహైల్ బిన్ అమ్ర్ కొంతమంది మనుషులతో వచ్చి స్వల్పంగా ప్రతిఘటించారు. ఈ ప్రతిఘటనలో 13 మంది అవిశ్వాసులు చనిపోగా, ఇద్దరు ముస్లింలు అమరగతినొందారు.

155-1. అఖీల్, తాలిబ్- ఇద్దరూ అప్పటికి ముస్లింలు కాలేదు. అందువల్ల అబూ తాలిబ్ ఆస్తికి వారిద్దరూ వారసులయ్యారు. అలీ, జాఫర్‌లకు ఆస్తి సంక్రమించలేదు. కారణం వారిద్దరూ ఇస్లామ్ స్వీకరించటమే.

**156) హజ్రత్ అబూ హురైరా(రజి) కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా ప్రవచించారు : "ఇన్‌షా అల్లాహ్, అల్లాహ్ మాకు గనక విజయం ప్రసాదిస్తే, ఖైఫ్ బనీ కనానాలో మేము విడిది చేస్తాము. అవిశ్వాసానికి మద్దతు ఇస్తామని ఖురైషులు ప్రతిజ్ఞ చేసింది ఆ స్థలంలోనే."[1]**

**157) హజ్రత్ అబూ హురైరా(రజి) ఉల్లేఖించారు : ప్రవక్త మహనీయులు (సఅసమ్) హునైన్ ప్రయాణానికి సంకల్పించుకున్నప్పుడు, "దైవచిత్తమయితే రేపు మేము 'ఖైఫ్ బనీ కనానా'లో ఆగుతాము. అక్కడే ఖురైషులు కుఫ్ర్‌కు (సత్య తిరస్కారానికి) మద్దతుగా ప్రతిజ్ఞ చేశారు" అని చెప్పారు.**

**158) హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) తెలిపారు: మక్కా విజయం సందర్భంగా ప్రవక్త మహనీయులు(సఅసమ్) మక్కా నగరంలో ప్రవేశించినప్పుడు ఆయన తలపై శిరస్త్రాణం ఉంది. ఆయన(స) దానిని దించుతుండగానే ఒక సహాబీ వచ్చి "ఇబ్నె ఖతల్ పవిత్ర కాబా గృహం తెర పట్టుకుని (మాటేసి) ఉన్నాడ"ని చెప్పగా "అతనిని అక్కడికక్కడే చంపేయండి" అని దైవప్రవక్త(స) ఆదేశించారు.[1] 'ఆ రోజు దైవప్రవక్త(స) ఇహ్రామ్ వస్త్రం ధరించి లేరని మేము భావిస్తున్నాము. నిజము దేవు డెరుగు' అని ఇమామ్ మాలిక్ అభిప్రాయపడ్డారు.**

---

156-1. మెరక ప్రాంతాన్ని 'ఖైఫ్' అంటారు. అది కొండంత ఎత్తు ఉండదుగాని గుట్ట మాదిరిగా ఉంటుంది. ఇప్పుడు ఆ స్థలంలో 'మస్జిదె ఖైఫ్' ఉంది. ఒకప్పుడు మక్కాలోని సత్య తిరస్కారులు ఆ స్థలంలోనే సమావేశమై ఇస్లామ్‌కు, ప్రవక్త కుటుంబీకులకు వ్యతిరేకంగా ప్రతినబూనారు. కాని అల్లాహ్ అవిశ్వాసుల తలబిరుసుతనం బెడిసికొట్టేలా చేశాడు. కడకు ఇస్లామ్ పతాకం మక్కాలో రెపరెపలాడింది. 'సత్యం వచ్చేసింది. అసత్యం మటుమాయమైంది. అసత్యం ఏనాటికైనా మటుమాయం అయ్యేదే." (బనీ ఇస్రాయీల్ : 81)

158-1. ఇబ్నె ఖతల్ ఇస్లామ్ స్వీకరించిన మీదట ధర్మభ్రష్టుడు (ముర్తద్) అయ్యాడు. ఒక హత్యా నేరానికి కూడా ఒడిగట్టాడు. దైవప్రవక్త(స)ను తూలనాడుతూ పాటలు పాడే వాడు.

మక్కా విజయం సందర్భంగా అతన్ని కాబా తెర వెనుక నుండి బయటకు తీసి మఖామె ఇబ్రాహీమ్‌కి - జమ్‌జమ్ బావికి మధ్యన గల స్థలంలో హతమార్చటం జరిగింది. ఇక మీదట ఏ ఒక్క ఖురైషు వ్యక్తిని కూడా అలాంటి నిస్సహాయ స్థితిలో చంపరాదని దైవప్రవక్త(స) ఆజ్ఞాపించారు.

**159)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) తెలిపారు : మక్కా విజయం నాడు ప్రవక్త మహనీయులు(సఅసమ్) మక్కా నగరంలో ప్రవేశించి నప్పుడు దైవగృహం (కాబా) చుట్టూ **360** విగ్రహాలు ఉండేవి. దైవప్రవక్త(స) తన చేతిలో ఉన్న బెత్తంతో వాటిని కొడుతూ ఈ ఆయత్‌లను పఠించసాగారు- "సత్యం వచ్చేసింది. అసత్యం సమసిపోయింది". "సత్యం వచ్చేసింది. అసత్యం వల్ల పూర్వం కూడా ఏమీ కాలేదు. ఇక మీదట కూడా ఏమీ కాదు."

**160)** మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) వివరించారు : ప్రవక్త మహనీయులు (సఅసమ్) మక్కా నగరానికి ఏతెంచినప్పుడు, ఆయన(స) కాబా గృహంలోని విగ్రహాలను బయటికి తీయనంతవరకు లోపల ప్రవేశించలేదు. ఆ విగ్రహాలలో ఇబ్రాహీమ్(అ), ఇస్మాయీల్(అ)ల బొమ్మలు కూడా ఉన్నాయి. వాటి చేతుల్లో (పాచికల) బాణాలు ఉన్నాయి. దైవప్రవక్త(స) దీనిని గమనించి, "అల్లాహ్ ఈ బహుదైవారాధకులను నాశనం చెయ్యి. ఈ మహనీయులు ఎన్నడూ పాచికలు విసర లేదన్న సంగతి వీరికి బాగా తెలుసు" అన్నారు. తరువాత ఆయన(స) కాబా గృహం లోపలికి వెళ్ళి, నలువైపులా తక్బీర్ పలికి, బయటికి వచ్చారు. ఆయన(స) నమాజ్ చేయలేదు.

## అధ్యాయం : 50

# దైవప్రవక్త(స) ఎత్తయిన ప్రదేశం నుండి మక్కా నగరంలో ప్రవేశించటం

మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు: మక్కా విజయం నాడు ప్రవక్త మహనీయులు(సఅసమ్) తన వాహనంపై కూర్చొని ఎత్తయిన ప్రదేశం నుండి మక్కా నగరంలో ప్రవేశించారు. ఉసామా బిన్ జైద్(రజి) ఆయన వాహనంపై ఆయన(స) వెనుక కూర్చుని ఉన్నారు. ఆయన వెంట బిలాల్(రజి), కాబా తాళం చెవులను భద్రపరిచే ఉస్మాన్ బిన్ తల్హా (రజి) కూడా ఉన్నారు.

దైవప్రవక్త(స) తన ఒంటెను మస్జిద్ సమీపంలో (మస్జిద్ బయట) కూర్చో బెట్టి, కాబా గృహం తాళాలు తీసుకురమ్మని ఆదేశించారు. పిదప ఆయన(స) బైతుల్లాహ్ లోపల ప్రవేశించారు. ఆయన(స) వెంట ఉసామా బిన్ జైద్, బిలాల్,

159-1. దైవప్రవక్త(స) ఈ సందర్భంగా పఠించిన మొదటి ఆయత్ బనీ ఇస్రాయీల్ సూరా (81)లో ఉంది. రెండవ ఆయత్ సబా (49) సూరాలోఉంది. ఇక్కడ సత్యం అంటే ఇస్లామ్ ధర్మం అనీ, అసత్యం అంటే విగ్రహారాధన అనీ అర్థం.

ఉస్మాన్ బిన్ తల్హా (రజిఅల్లాహు అన్‌హుమ్)లు కూడా ఉన్నారు. ఆయన (స) లోపల చాలాసేపు ఉన్నారు. బయటకు రాగానే జనులు (లోపల ప్రవేశించేం దుకు) ఎగబడ్డారు. అందరికన్నా ముందు లోపలికి వెళ్ళినవారు అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి). ఆయన బైతుల్లాహ్ తలుపు వెనుక బిలాల్(రజి) నిలబడి ఉండటం చూసి, 'దైవప్రవక్త(స) ఇక్కడ నమాజ్ చేసిన చోటేది?' అని అడిగారు. దైవ ప్రవక్త(స) నమాజ్ చేసిన స్థలాన్ని బిలాల్ ఆయనకు చూపెట్టారు. అయితే, దైవ ప్రవక్త(స) అక్కడ ఎన్ని రకతుల నమాజ్ చేశారో అడగటం మరచిపోయానని అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) చెప్పారు.[1]

**161)** విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు : ప్రవక్త మహ నీయులు (సఅసమ్) మక్కా విజయం సందర్భంగా 'కదా' వైపు నుండి నగరంలో ప్రవేశించారు. 'కదా' మక్కా మెరక ప్రదేశంలో ఉంది.

**162)** హిషామ్ తన తండ్రి ఉర్వా నుండి ఇలా ఉటంకించారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) మక్కా విజయం లభించిన సంవత్సరం 'కదా' వైపు నుండి నగరంలో ప్రవేశించారు. 'కదా' మక్కా ఎత్తయిన ప్రదేశంలో ఉంది.

### అధ్యాయం : 51

## మక్కా విజయం సందర్భంగా దైవప్రవక్త(స) ఎక్కడ విడిది చేశారు?

**163)** ఇబ్నె అబీ లైలా తెలిపారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) చాష్త్ నమాజ్ చేసిన సంగతిని ఉమ్మె హానీ (ర.అ) తప్ప మరెవరూ మాకు తెలియజేయ లేదు. ఆమె ఇలా అన్నారు: మక్కా జయించబడిన తరువాత దైవప్రవక్త(స) తన ఇంట్లోనే స్నానం చేసి 8 రకతుల నమాజ్ ఆచరించారు. దైవప్రవక్త(స) అంత

---

50-1. ఇబ్నె అబ్బాస్(రజి) ఉల్లేఖనంలో, దైవప్రవక్త(స) కాబా గృహం లోపల నమాజ్ చేయలేదని ఉంది. కాని బిలాల్ (రజి) ఉల్లేఖనంలో నమాజ్ చేసినట్లు ఉంది. ఇదే సరైనది. బహుశా ఇబ్నె అబ్బాస్(రజి) ఆ సమయంలో బయట ఉండటం వల్ల పూర్తి సమాచారం ఆయనకు తెలిసి ఉండదు.

ఆయన(స) కాబా గృహం లోపలికి వెళ్ళి వచ్చిన తరువాత తాళం చెవులను ఉస్మాన్ బిన్ తల్హా (రజి) చేతికి ఇస్తూ, "ఈ తాళాలు ఇక మీదట నీ కుటుంబీకుల వద్దనే ఉంటాయి. వీటిని నీకు నేనివ్వటంలేదు, అల్లాహ్ ఇస్తున్నాడు. దౌర్జన్యపరుడు అయిన వాడే వీటిని నీ నుండి లాక్కుంటాడు" అని చెప్పారు.

**తేలికపాటి నమాజ్ చేస్తుండగా నేనెన్నడూ చూడలేదు. అయినప్పటికీ ఆ నమాజులో ఆయన(స) రుకూ సజ్దాలు నింపాదిగా చేశారు. (కాకపోతే పారాయణం క్లుప్తంగా చేశారు)[1]**

## అధ్యాయం : 52

**హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) రుకూ సజ్దాలలో ఈ విధంగా వేడుకునేవారు : "సుబ్హానకల్లాహుమ్మ రబ్బనా వ బిహమ్దికల్లాహుమ్మగ్ ఫిర్లీ."[1]**

**164) మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) తెలిపారు : హజ్రత్ ఉమర్(రజి) తన దర్బారులో, బద్ర్ సంగ్రామంలో పాల్గొన్న ప్రముఖ సహాబా ఆసీనులై ఉండగా, నన్ను కూడా దర్బారుకు పిలుచుకునేవారు. అది గమనించిన కొంతమంది, 'ఈ కుర్రవాణ్ణి తమరు ఎందుకు పిలిచారు? ఇతని సమ వయస్కులైన పిల్లలు మా ఇండ్లలో కూడా ఉన్నారు కదా!' అని ప్రశ్నించగా, "ఈ అబ్బాయి పాండితీ ప్రకర్ష ఎటువంటిదో మీకూ తెలుసు" అని ఉమర్(రజి) సమాధానమిచ్చారు.**

**ఆ తర్వాత మరోసారి హజ్రత్ ఉమర్(రజి) ఆ మహనీయులను తన దర్బారుకు ఆహ్వానించి, నన్ను కూడా రమ్మని కబురంపారు. నా పరిజ్ఞానానికి ఖలీఫా ఉమర్(రజి) పరీక్ష పెట్టబోతున్నారని నేను ఊహించాను. తరువాత ఆయన అందరినీ ఉద్దేశించి, "ఇజాజాఅ నస్రుల్లాహి వల్ ఫత్హ్– వ రయ్‌తన్నాస యద్ఖులూన ఫీదీనిల్లాహి అఫ్వాజా... సూరాను పూర్తిగా పఠించి, దీని గురించి మీరేమనుకుంటున్నారు?" అని అడిగారు. 'దైవస్తోత్రం చేసి, క్షమాపణకై ఆయన్ని**

163–1. మక్కా విజయం తర్వాత మహాప్రవక్త(స) ఉమ్మె హానీ ఇంట నమాజ్ చేస్తున్న సమయంలో పొద్దెక్కుతూ ఉండటం వల్ల అది చాష్త్ నమాజ్ అని చాలా మంది భావించారు. కాని అది దైవానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆచరించిన నమాజ్. తరువాతి కాలంలో కూడా ముస్లిం నాయకులు ఈ సంప్రదాయాన్ననుసరించి ఏదైనా రాజ్యం లేక నగరంపై విజయం లభించినప్పుడు కృతజ్ఞతాపూర్వకంగా నమాజ్ చేసేవారు.

52–1. అంటే, "ఓ అల్లాహ్! నీవు పరమ పవిత్రుడవు. మా ప్రభూ! మేము నిన్నే స్తుతిస్తున్నాము. దేవా! నన్ను క్షమించు" అని అర్థం. దీనిని బట్టి రుకూ సజ్దాలలో దైవాన్ని వేడుకోవటం నిషిద్ధం కాదని తెలుస్తోంది. 'ఇజాజాఅ నస్రుల్లాహి' సూరా అవతరించిన తరువాత– అంటే మక్కా విజయం తర్వాత– ఆయన(స) ప్రతి నమాజులో ఈ విధంగా వేడుకోసాగారు.

**వేడుకోమని ఉపదేశించబడింది. ఎందుకంటే దేవుడు మనకు సహాయం చేశాడు. విజయం చేకూర్చాడు' అని ఒకరంటే, 'దీని గురించి తమకు ఏమీ తెలియద'ని కొందరు సమాధానమిచ్చారు. మరికొందరు ఏమీ చెప్పకుండా మౌనం వహించారు. తరువాత ఆయన ఇబ్నె అబ్బాస్(రజి) వైపు తిరిగి "ఇబ్నె అబ్బాస్! నీ అభిప్రాయం కూడా ఇదేనా?" అని అడిగితే, 'లేద'ని జవాబిచ్చాను. "మరైతే దీని గురించి నువ్వే మంటావ్?" అని ప్రశ్నించారు ఖలీఫా. దానికి నేను 'ఇందులో దైవప్రవక్త(స)కు మరణకాలం సమీపించిందన్న సంకేతం ఇవ్వబడింది. అల్లాహ్ సహాయం, విజయం లభించిన తర్వాత- అంటే మక్కా విజయం వరించిన మీదట దైవ ప్రవక్త(స) సందేశ కార్యం పూర్తి కావచ్చిందని, కనుక ఇప్పుడు ఇతోధికంగా మన్నింపునకై దైవాన్ని వేడుకోవాలని, ఆయన పశ్చాత్తాపాన్ని స్వీకరించేవాడని ఈ సూరాలో చెప్పటం జరిగింది' అని అన్నాను. దానికి ఉమర్(రజి), "నేనూ అదే అనుకుంటున్నా"[1] నని అన్నారు.**

**165) అబూ షురైహ్ అదవీ (రజి) గారు మదీనా నాయకుడైన అమ్ర్ బిన్ సయీద్‌తో ఇలా అన్నారు: ఆ సమయంలో అమ్ర్ బిన్ సయీద్ (అబ్దుల్లాహ్ బిన్ జుబైర్- రజికు వ్యతిరేకంగా) మదీనాకు సైనిక దళాన్ని పంపుతూ ఉన్నారు. షురైహ్ ఇలా అన్నారు: ఓ నాయకుడా! మీ ఆనతి ఉంటే మక్కా విజయం వరించిన మరునాడు దైవప్రవక్త(స) ప్రబోధించిన ఒక హదీసును మీకు వినిపించదలిచాను. ఆ హదీసును నా రెండు చెవులూ విన్నాయి. నా మనోమస్తిష్కాలు దానిని జ్ఞాపకం ఉంచుకున్నాయి. దైవప్రవక్త(స) ఈ విషయం వినిపిస్తున్నప్పుడు నేను నా కళ్ళతో**

---

164-1. హజ్రత్ ఉమర్(రజి) 'దీన్'కు సంబంధించిన ఒక్కగానొక్క ప్రశ్న వేసి ఇబ్నె అబ్బాస్(రజి) జ్ఞాన సంపన్నత ఎటువంటిదో పెద్దలకు తెలిసివచ్చేలా చేశారు. అల్లాహ్ ఆది మానవుడైన ఆదమ్‌కు జ్ఞానం వొసగి పెద్దపెద్ద దైవదూతలపై ఆయనకు గల ప్రాధాన్యతను నిరూపించటం వంటిదే ఇదీను. నస్ర్ సూరాలో దైవప్రవక్త(స) మరణ సమాచారం ఉందని ఇబ్నె అబ్బాస్(రజి) చెప్పినది అక్షరాలా నిజం.

ఇబ్నె అబ్బాస్(రజి) ఆ కాలపు గొప్ప విద్వాంసులు. విద్వాంసుడు, జ్ఞాన సంపన్నుడు అయిన వ్యక్తి వయసులో చిన్న వాడైనప్పటికీ పెద్దల సరసన కూర్చోగలడు. అంతేకాదు, వయోవృద్ధుల కన్నా కీలకమైన స్థానాన్ని పొందగలడు. మన ధర్మ ఖలీఫాలు, ఆ తరువాత వచ్చిన పరిపాలకులలో కూడా కొంతమంది విద్వాంసులను ఆదరించారు.

**ఆయన్ని తదేకంగా తిలకించాను. దైవప్రవక్త(స) మొదట దైవస్తోత్రం చేసిన మీదట ఇలా ఉపదేశించారు: "నిశ్చయంగా అల్లాహ్ మక్కా నగరాన్ని పవిత్ర నగరిగా ఖరారు చేశాడు. ఏ మానవ మాత్రుడూ దీనిని తన తరఫున పవిత్ర నగరంగా ఖరారు చేయలేదు. కనుక అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని విశ్వసించే వ్యక్తి ఎవరికీ ఈ నగరంలో రక్తపాతం సృష్టించటం, ఇక్కడి చెట్లు నరకటం ధర్మసమ్మతం కాదు. మక్కా విజయం నాడు దైవప్రవక్త(స) అలా చేశారు కదా! అని ఎవరయినా ప్రశ్నిస్తే, అల్లాహ్ కేవలం తన ప్రవక్త(స) కొరకు కొన్ని ఘడియల పాటు అందుకు అనుమతించాడని చెప్పండి. నిన్నటి రోజున ఏ విధంగా ఈ నగరం పవిత్రమై ఉండేదో ఈ రోజు కూడా అదేవిధంగా పవిత్రమై ఉంది. ఇక్కడ ఉన్నవారు ఇక్కడ లేనివారికి నా ఈ సందేశాన్ని చేరవేయండి"– మరైతే అమ్ర్ బిన్ సయీద్ మీకు ఏమని సమాధానం ఇచ్చాడు? అని జనులు అబూ షురైహ్‌ను అడిగితే, 'ఈ విషయాలు నీకన్నా ఎక్కువగా నాకు తెలుసు. పవిత్రాలయం ఏ పాపాత్మునికీ ఆశ్రయం ఇవ్వదు. ఒకరిని హత్య చేసి పరారైన వారికీ, కల్లోల జనకునికి కూడా అది ఆశ్రయం ఇవ్వదు' అని అతను నాకు జవాబిచ్చాడు[1] అని అబూ షురైహ్ చెప్పారు.**

---

165–1. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) యజీద్ సమక్షంలో విధేయతా ప్రమాణం (బైఅత్) చేయలేదు. అందుచేత ఆయన్ని ఎలాగైనా సాధించాలన్న కక్షతో యజీద్ మదీనా గవర్నర్ అమ్ర్ బిన్ సయీద్‌ను ఉసిగొల్పాడు. యజీద్ ఆదేశంపై మదీనా గవర్నర్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి)కు వ్యతిరేకంగా సైన్యాన్ని పంపాడు. మక్కాలో సైనిక చర్యను నివారించే ఉద్దేశ్యంతో అబూ షురైహ్ అతనికి ప్రవక్త హదీసును వినిపించారు. కాని అధికార మదాంధుడైన మదీనా గవర్నర్‌కు ఈ ఉపదేశం బుర్రకెక్కలేదు.

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) ఎవరో కాదు, అబూ బకర్ సిద్దీఖ్(రజి) మనవడు. అస్మా బిన్తె అబూబకర్(రజి) కుమారుడు. పరాక్రమశాలి. దైవప్రవక్త(స) మక్కానుండి మదీనాకు హిజ్రత్ చేసి వచ్చిన కాలంలో ముహాజిర్లలో జన్మించిన ఇస్లామ్ తొలి ముద్దుబిడ్డడు. 'ఖుబా'లో ఆయన జన్మించినప్పుడు దైవప్రవక్త(స) ఖర్జూరాన్ని నమలి తన లాలాజలంతో సహా ఆయన నోట్లో వేశారు. హజ్జాజ్ బిన్ యూసుఫ్ హిజ్రీ 71వ సంవత్సరం జమాది ఉస్సానీ 17వ తేదీ మంగళవారం నాడు ఆయన్ని కిరాతకంగా వధించాడు.

**166)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఈ విధంగా చెప్పగా తాను విన్నానని హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి) తెలిపారు: ఆయన(స) మక్కా విజయం నాడు పవిత్ర మక్కానగరిలో ఇలా ప్రకటించారు : "అల్లాహ్, ఆయన ప్రవక్త మద్యం (సారాయి) క్రయవిక్రయాలను పూర్తిగా నిషేధించారు."

### అధ్యాయం : 53

## మక్కా విజయం సందర్భంగా దైవప్రవక్త(స) మక్కాలో ఆగి ఉండటం

**167)** మహనీయ అనస్(రజి) ఉల్లేఖనం: "మేము దైవప్రవక్త (సఅసమ్)తో పాటు (మక్కాలో) పదిరోజుల వరకూ ఆగాము. ఈ వ్యవధిలో మేము ఖస్ర్ నమాజ్ చేసేవారము."

**168)** హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: "ప్రవక్త మహనీయులు (సఅసమ్) మక్కాలో పందొమ్మిది రోజులు విడిది చేశారు. ఈ కాలంలో మేము కేవలం రెండు రకతుల నమాజ్ మాత్రమే (ఖస్ర్) చేశాము."

**169)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) తెలిపారు: మేము ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్)తోపాటు ప్రయాణంలో (మక్కా విజయం అనంతరం) పందొమ్మిది రోజుల వరకూ– మక్కాలో– విడిది చేశాము. ఇబ్నె అబ్బాస్ (రజి) ఇలా అన్నారు: పందొమ్మిది రోజుల వరకూ మేము ప్రయాణంలో ఖస్ర్ నమాజ్ చేసేవారము. అంతకన్నా ఎక్కువ రోజులు ఆగవలసి వస్తే పూర్తి నమాజ్ చేసుకునేవారం.

### అధ్యాయం : 54

అబ్దుల్లాహ్ బిన్ సాలబా బిన్ సుఅయ్ర్(రజి) తెలిపారు : "ప్రవక్త మహనీయులు(సఅసమ్) మక్కా విజయం నాడు తన హస్తాన్ని (ప్రేమతో) నా ముఖంపై నిమిరారు."

**170)** జుహ్రీ తెలిపారు: అబూ జమీలా (రజి) మాకు హదీసు వివరించినప్పుడు మేము సయీద్ బిన్ ముసయ్యిబ్ వెంట ఉన్నాము. తాను దైవప్రవక్త (సఅసమ్) సహచర్యం పొందానని, మక్కా విజయం (యుద్ధం) కొరకు దైవ ప్రవక్త(స)తో బయలుదేరానని అబూ జమీలా చెప్పారు.[1]

**171)** అబూ ఖిలాబా కథనం: అమ్ర్ బిన్ సలమా(రజి) దగ్గరకు వెళ్ళి 'ఆ విషయం గురించి' ఎందుకు అడగరు? అని కొందరు నాతో అన్నప్పుడు నేను అమ్ర్ బిన్ సలమా(రజి) దగ్గరకు వెళ్ళి నాకు కలిగిన సందేహాన్ని వెల్లడించాను. ఆయన నా సందేహానికి సమాధానమిస్తూ ఇలా అన్నారు : అజ్ఞాన కాలంలో మేము ఒక చెలమ దగ్గర నివసించేవారం. అది ప్రజల రాకపోకల మార్గం. వాహన దారులు మా దగ్గరి నుండి సాగిపోతున్నప్పుడు, 'జనులు (ఆ వ్యక్తి గురించి) ఏమను కుంటున్నారు? ఇప్పుడు అతని పరిస్థితి ఎలా ఉంది?' అని అడిగేవారం (దైవప్రవక్త ముహమ్మద్- సఅసమ్-ను దృష్టిలో పెట్టుకుని వేసే ప్రశ్నలివి). దానికి ఆ ప్రయా ణీకులు, 'అల్లాహ్ తనను ప్రవక్తగా చేసి పంపాడని, అల్లాహ్ తనపై దివ్యవాణిని అవతరింపజేస్తున్నాడని లేదా 'వహీ' అవతరింపజేశాడని ఆయన అంటున్నారు (వారు ఖుర్ఆన్‌లోని ఏదయినా ఒక ఆయత్‌ను కూడా వినిపించేవారు)'. నేను ఆ ఆయత్‌ను అప్పటికప్పుడే కంఠస్థం చేసుకునేవాణ్ణి. ఆ వాక్యాలు నా హృదయ కవాటాలను తట్టేవి. మరోవైపు అరబ్బులు తమ ఇస్లామ్ స్వీకార నిర్ణయాన్ని మక్కా విజయం వరకూ వాయిదా వేశారు. వారిలా అనేవారు: 'ఈ ప్రవక్తను ఆయన జాతి ప్రజలతో (ఖురైషులతో) తలపడనివ్వండి. ఒకవేళ ఆయన గనక వారిపై ఆధిపత్యం వహిస్తే ఆయన నిజంగానే సత్యవంతుడైన ప్రవక్త అయి వుంటారు.'

మక్కా విజయం తర్వాత అన్ని తెగలవారు ఇస్లామ్ స్వీకరించటంలో ముందంజ వేశారు. మా నాన్నగారు కూడా తన తెగవారందరితో సహా ఇస్లామ్ స్వీకరించటంలో శీఘ్రత కనబరిచారు. ఆయన గారు మదీనా నుండి తిరిగి వచ్చినప్పుడు, 'దైవసాక్షిగా! నేను సత్యవంతుడైన ఒక ప్రవక్త దగ్గరి నుండి వస్తు న్నాను' అని అన్నారు. ఆయన ఏమన్నారంటే, "ఫలానా నమాజ్ ఫలానా వేళ ఈ ఈ విధంగా చేయండి. నమాజ్ వేళ కాగానే మీలోని ఒక వ్యక్తి అజాన్ ఇవ్వాలి. అందరికన్నా అధికంగా ఖుర్ఆన్ కంఠస్థం అయివున్న వ్యక్తి నమాజ్‌కు సారథ్యం వహించాలి" అన్నారు.

అప్పుడు తెగలోని జనులు, తమలో ఖుర్ఆన్ ఎక్కువగా కంఠస్థం అయివున్న వారెవరు? అని తర్జనభర్జన చేసుకున్నారు. నాకన్నా ఎక్కువగా ఖుర్ఆన్

---

170-1. ఇబ్నె ముందా, అబూ నుఅయ్మ్, ఇబ్నె అబ్దుల్ బర్ కూడా ఈ అబూ జమీలా(రజి)ను సహాబా జాబితాలో ప్రస్తావించారు. హజ్జతుల్ విదాలో కూడా ఈయన దైవప్రవక్త(స) వెంట ఉన్నారు.

కంఠస్థం అయివున్నవారెవరూ తెగవారికి దొరకలేదు. అందుచేత వారు నన్నే తమ ఇమామ్‌గా చేసుకున్నారు. నిజానికి అప్పటికి నా వయసు ఆరు లేక ఏడు సంవత్సరాలే. నా దగ్గర ఒక దుప్పటి ఉంది. నేను దానిని చుట్టుకుని (నమాజ్‌లో) సజ్దా చేసినప్పుడు, నా శరీరంలోని వెనుక భాగం నగ్నం అయిపోయేది. 'ముందు మీ ఖారీ (ఖుర్‌ఆన్‌ను పఠించేవాని) పిరుదుల్ని కప్పి ఉంచండి' అని తెగకు చెందిన మహిళ చురక అంటించింది. చివరకు వారు ఒక వస్త్రాన్ని కొనుగోలు చేసి, నా కోసం ఒక (పొడవాటి) చొక్కాను కుట్టించారు. నాకు ఆ చొక్కా తొడగటం వల్ల కలిగినంత సంతోషం మరే వస్తువు వల్ల కూడా కలగలేదు.[1]

**172)** హజ్రత్ ఆయిషా(రజి) కథనం : ఉతబా బిన్ అబీ వఖ్ఖాస్ (అజ్ఞాన కాలంలో చనిపోయేముందు) తన సోదరుడు సాద్ బిన్ అబీ వఖ్ఖాస్‌ను పిలిచి, 'జమా బిన్ ఖైస్ దగ్గర ఉన్న బానిస స్త్రీ ద్వారా జన్మించిన పిల్లవాణ్ని నువ్వు ఎత్తుకో. ఎందుకంటే ఆ పిల్లవానికి తండ్రిని నేనే' అని వసీయతు చేశాడు.

అందువల్ల– మక్కా విజయం సందర్భంగా దైవప్రవక్త(సఅసమ్)మక్కా నగరంలో ప్రవేశించి (విడిది చేసి)నప్పుడు, సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ ఆ పిల్లవాణ్ణి ఎత్తుకుని దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చారు. జమా కుమారుడగు అబ్ద్ బిన్ జమా కూడా ఆయనతోపాటే వచ్చాడు. 'ఈ పిల్లవాడు నా సోదరుని కుమారుడు. ఇతను తన కొడుకు అని నా సోదరుడు వసీయతు చేసి మరీ పోయాడ'ని సాద్ బిన్ అబీ వఖ్ఖాస్(రజి) వాదించారు. కాని అబ్ద్ బిన్ జమా, 'దైవప్రవక్తా! ఈ పిల్లవాడు నా సోదరుడు. నా తండ్రి జమా కుమారుడు. ఎందుకంటే ఇతను నా తండ్రి పడకపైనే పుట్టాడు' అని నివేదించుకున్నాడు. జమా బానిస స్త్రీకి పుట్టిన ఆ పిల్లవాణ్ని దైవప్రవక్త(స) పరిశీలనగా చూశారు. ఆ పిల్లవాడు నిజంగానే (సాద్ సోదరుడైన) ఉతబా బిన్ అబీ వఖ్ఖాస్‌ను పోలి ఉన్నాడు.

---

171–1. ప్రాజ్ఞతకు చేరని అబ్బాయి (నా బాలిగ్) కూడా నమాజ్‌కు సారథ్యం వహించటం సరైదేనని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతోంది. కాకపోతే ఆ అబ్బాయికి శుచీ శుభ్రతల గురించి, విధుల (ఫరాయెజ్) గురించి, నఫ్ల్ (స్వచ్ఛంద) ఆరాధనల గురించి అవగాహన ఉండాలి. షాఫియీలు, అహ్లె హదీసు వారు ఈ పంథాకు అనుకూలంగా ఉన్నారు. అయితే హనఫీలు మాత్రం దీనితో విభేదించారు. 'నా బాలిగ్' అబ్బాయి ఫరాయెజ్‌లకు సారథ్యం (ఇమామత్) వహించటం సమ్మతం కాదన్నది హనఫీ పంథా.

కాని దైవప్రవక్త(స) షరీఅత్ శాసనాన్ననుసరించి, "ఓ అబ్ద్ బిన్ జమా! ఈ పిల్లవాణ్ణి నువ్వే ఎత్తుకో. ఇతను నీ సోదరుడు. ఎందుకంటే ఇతను నీ తండ్రి పడకపై, అతని బానిస స్త్రీ కడుపున పుట్టాడు" అని తీర్పు వినిపించారు. కాని మరో వైపున ఆయన(స) ఉమ్ముల్ మోమినీన్, జమా కుమార్తెయగు సౌదా (ర.అ)ను పిలిచి, "సౌదా! ఈ అబ్బాయి పట్ల పరదా పాటించు" అని ఆజ్ఞాపించారు. ఎందుకంటే ఆ పిల్లవానికి ఉతబా బిన్ అబీ వక్కాస్ పోలికలు ఉండటాన్ని దైవప్రవక్త(స) పసిగట్టారు.

దైవప్రవక్త(స) ఈ విధంగా ప్రవచించారని కూడా అమ్మ ఆయిషా(ర.అ) తెలియజేశారు: "పిల్లవాడు ఎవరి భార్య లేక బానిస స్త్రీ కడుపున పుడతాడో, ఆ వ్యక్తికే చెందుతాడు. వ్యభిచారం చేసినవాడి వాటాలోనికి రాళ్ళు మాత్రమే వస్తాయి."[1] అబూ హురైరా(రజి) ఈ హదీసును బిగ్గరగా చాటిచెబుతుండేవారని ఇబ్నె షిహాబ్ తెలిపారు.

**173)** ఉర్వా బిన్ జుబైర్ తనకు ఈ విధంగా తెలియజేశారని జుహ్రీ చెప్పారు: మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) కాలంలో– మక్కా విజయం సందర్భంగా– ఒక స్త్రీ (ఒక ఆభరణాన్ని) దొంగిలించింది. ఉర్వా ఇలా అన్నారు: ఉసామా బిన్ జైద్(రజి) దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి ఆమె కొరకు సిఫారసు చేసినప్పుడు ప్రవక్త ముఖారవిందం రంగు మారిపోయింది. "అల్లాహ్ విధించిన ఒకానొక హద్దు (శిక్ష) విషయంలో నీవు సిఫారసు చేయడానికి నా దగ్గరకు వచ్చావా?"అని ఆగ్రహం వెలిబుచ్చారాయన(స). 'యా రసూలల్లాహ్! నా క్షమాపణకై అల్లాహ్‌ను ప్రార్థించండి' అని ఉసామా విన్నవించుకున్నారు.

మరి మధ్యాహ్నం తర్వాత దైవప్రవక్త(స) తన సహచరమాన్యులనుద్దేశించి ప్రసంగించారు. అల్లాహ్‌ను ఆయన ఘనతకు తగ్గ రీతిలో స్తుతించిన తరువాత ఇలా అన్నారు : "అమ్మాబాద్! మీ పూర్వీకులు నాశనమవడానికి కారణమేమిటంటే, ఒకవేళ వారిలోని ఉన్నత వంశీయుడు, గౌరవనీయుడు ఎవరయినా దొంగతనం

---

172-1. ఈ హదీసు ఇంతకుముందు కూడా వచ్చింది. మరోసారి దీనిని ఇక్కడ పునరావృతం చేయటంలోని ఉద్దేశ్యం, ఈ సంఘటన మక్కా విజయం సందర్భంగా జరగటమే. 'వ్యభిచారి భాగంలోనికి రాళ్ళు మాత్రమే వస్తాయి' అని చెప్పటం ద్వారా చెడును నివారించేందుకు ఎన్ని విధాలుగా చర్యలు గైకొనబడ్డాయో అర్థమవుతోంది.

**చేస్తే వారు అతనిని విడిచి పెట్టేసేవారు. ఒకవేళ ఎవరయినా ఒక బలహీనుడు గనక దొంగతనం చేస్తే అతనికి శిక్ష విధించేవారు. వినండి! ఎవరి స్వాధీనంలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షి! ఒకవేళ ముహమ్మద్ పుత్రిక ఫాతిమా దొంగతనం చేసినా, నేను ఆమె చేతిని నరకడానికి వెనుకాడను".**

**ఆ తరువాత దైవప్రవక్త(స) ఆదేశాన్ననుసరించి ఆ స్త్రీ చేయి నరకబడింది. పిదప ఆ స్త్రీ నిష్కల్మషమైన హృదయంతో పశ్చాత్తాపపడింది. వివాహం కూడా చేసుకుంది. ఆయిషా(ర.అ) ఇలా అన్నారు: "తరువాత ఆమె తరచూ నా దగ్గరకు వస్తూ ఉండేది. ఆమెకు ఏదయినా అవసరం ఉంటే నేను దైవప్రవక్త(స) ముందు ప్రస్తావించేదానిని."[1]**

**174) ముజాషా బిన్ మస్ఊద్(రజి) వివరించారు: మక్కా విజయం తర్వాత నేను నా సోదరుడు ముజాలిద్‌ను తీసుకుని దైవప్రవక్త(సఅసమ్) సమక్షంలో హాజరయ్యాను. 'దైవప్రవక్తా! హిజ్రత్ చేసే విషయంపై మీరు ఇతని చేత బైఅత్(ప్రతిజ్ఞ) చేయించుకుంటారని, నేనితన్ని మీ దగ్గరకు తీసుకువచ్చాన'ని అన్నాను. దానికి ఆయన(స) "హిజ్రత్ చేసినవారు దాని పుణ్యఫలాన్ని పొందారు" (అంటే హిజ్రత్ చేసే కాలం గడిచిపోయింది) అని సెలవిచ్చారు. 'మరైతే తమరు ఇతని చేత మరే విషయంపై ప్రమాణం చేయించుకుంటారు?' అని నేను విన్న వించుకోగా, "ఈమాన్, ఇస్లామ్, జిహాద్ పైన" అని దైవప్రవక్త(స) చెప్పారు.**

**అబూ ఉస్మాన్ నహ్దీ ఇలా అంటున్నారు : ఆ తరువాత నేను (ముజాషా సోదరుడు) అబూ సయీద్ ముజాలిద్‌ను కలుసుకున్నాను. ఆయన ఆ ఇద్దరు**

---

173-1. అహ్మద్‌లోని ఒక ఉల్లేఖనం ప్రకారం ఆ స్త్రీ స్వయంగా దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి, 'దైవప్రవక్తా! నా పశ్చాత్తాపం ఆమోదించబడుతుందా?' అని అడిగింది. దానికి ఆయన(స) "ఈ రోజు నీవు, నీ తల్లి కడుపున జన్మించిన నాటి స్థితిలో- పునీతంగా- ఉన్నావమ్మా" అని చెప్పారు.

ఇస్లామీయ శిక్షల నేపథ్యం ఎటువంటిదంటే, అవి గనక ఒకసారి విధించబడ్డా యంటే, తరువాత ఆ అపరాధి పాప ప్రక్షాళన చెంది దైవసన్నిధిలో స్వీకృతి పొందు తాడు. శిక్షలు అమలుపరచబడే చోట నేరాలు కూడా తగ్గిపోతాయి. హదీసులో ప్రస్తావనకు వచ్చిన ఆ స్త్రీ మఖ్‌జూమ్ తెగకు చెందిన కులీన స్త్రీ. ఆమె పేరు ఫాతిమా. తరువాత బనూ సులైమ్‌కు చెందిన ఒక వ్యక్తి ఆమెను వివాహమాడారు.

అన్నదమ్ముల కన్నా పెద్దవారు. నేను ఆయన్ని కూడా ఈ హదీసును గురించి విచారించగా, 'ముజాషీ హదీసును సరిగ్గానే వివరించాడ'ని ఆయన ధ్రువపరిచారు.[1]

**175)** ముజాషా బిన్ మస్ఊద్(రజి) తనతో ఈ విధంగా చెప్పినట్లుగా అబూ ఉస్మాన్ నహ్దీ తెలియజేశారు: నేను నా సోదరుడు (అబూ మాబద్–రజి)ను, హిజ్రత్‌పై బయ్అత్ చేయించే ఉద్దేశంతో దైవప్రవక్త(స) సన్నిధికి తీసుకెళ్ళాను. అయితే దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: "హిజ్రత్ పుణ్యఫలం హిజ్రత్ చేసిన వారితోనే పరిసమాప్తం అయింది. అయితే నేను ఇతని చేత ఇస్లామ్‌పై, జిహాద్‌పై బయ్అత్ (ప్రతిజ్ఞ) చేయిస్తాను."

అబూ ఉస్మాన్ ఇలా అన్నారు: తరువాత నేను అబూ మాబద్(రజి)ను కలుసుకుని, ఆ విషయం గురించి ప్రశ్నిస్తే, ముజాషా(రజి) విషయాన్ని సరిగ్గానే చెప్పాడని ఆయన అన్నారు.

**176)** ముజాహిద్ ఇలా అన్నారు: నేను అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి)తో "నేను సిరియా దేశానికి హిజ్రత్ చేయాలనుకుంటున్నాను" అని చెప్పాను. దానికి ఆయన, "ఇప్పుడు హిజ్రత్ అనేది లేదు. జిహాద్ మాత్రమే మిగిలి ఉంది. కనుక వెళ్ళి జిహాద్ కొరకు ప్రయత్నించు. ఆ భాగ్యం నీకు దక్కితే మంచిదే. లేకపోతే తిరిగి వచ్చేయ్" అన్నారు.

**177)** మక్కా విజయం తరువాత హిజ్రత్ (దైవమార్గంలో వలసపోవటం) అనేది ఇక మిగిలి లేదని మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) చెబుతూ ఉండేవారు.

**178)** అతా బిన్ అబీ రబాహ్ వివరించారు: నేను ఉబైద్ బిన్ ఉమైర్‌తో కలసి హజ్రత్ ఆయిషా(ర.అ) దగ్గరకు వెళ్ళాను. హిజ్రత్ గురించి ఉబైద్ ఆమె గారిని ప్రశ్నించగా, ఆమె ఇలా అన్నారు: ఇప్పుడు హిజ్రత్ అనేది మిగిలిలేదు. పూర్వం ముస్లింలు తమ ధర్మరక్షణ కోసం అల్లాహ్, ఆయన ప్రవక్త(స) వైపునకు శరణు పొందడానికి వచ్చేవారు. ధర్మం (దీన్) కారణంగా తాము పరీక్షకు గురి చేయబడతామేమోనన్న భయం వారికి ఉండేది. ఇప్పుడు అల్లాహ్ ఇస్లామ్‌కు

---

174–1. తరువాత హదీసును చివరి వరకూ వినిపించారు. మహాప్రవక్త(స) ప్రియ సహచరులు గానీ, ఆ తరువాత తాబయీలు గానీ హదీసులను ధ్రువపరచుకునే విషయంలో ఎంత పకడ్బందీగా వ్యవహరించేవారో దీనినిబట్టి అర్థం చేసుకోవచ్చు.

**ప్రాబల్యం వొసగటం వల్ల ముస్లిం తాను కోరిన చోట దైవారాధన చేసుకోగలడు. ఇప్పుడు మిగిలి ఉన్నదల్లా జిహాద్, జిహాద్ సంకల్పమే.**

**179) ముజాహిద్ కథనం: ప్రవక్త మహనీయులు(సఅసమ్) మక్కా విజయం నాడు ప్రసంగించడానికి నిలబడి ఇలా అన్నారు: "అల్లాహ్ భూమ్యాకాశాలను సృష్టించిన నాడే మక్కాను పవిత్ర నగరిగా ఖరారు చేశాడు. కనుక ఈ నగరం అల్లాహ్ ఆజ్ఞానుసారం ప్రళయదినం వరకూ పవిత్ర నగరంగానే ఉంటుంది. నాకు పూర్వం కూడా ఇది ఎన్నడూ ఎవరి కొరకు కూడా (నిషేధాజ్ఞల ఉల్లంఘనకై) ధర్మ సమ్మతం గావించబడలేదు. నా తర్వాత కూడా ఎవరి కొరకు కూడా ధర్మసమ్మతం (హలాల్) కాజాలదు. నా కోసమైనా కేవలం ఒక గడియ కాలం కొరకు మాత్రమే హలాల్ గావించబడింది. ఇక్కడ - పుణ్యక్షేత్ర పరిధిలో- వేటాడదగిన జంతువుల జోలికి పోకూడదు. ముళ్ళ వృక్షాలను నరకరాదు. ఇక్కడి గడ్డిని కూడా పెకలించ కూడదు. ఇక్కడ క్రింద పడివున్న వస్తువుల్ని కూడా ఎత్తుకోరాదు- ప్రకటన చేసే ఉద్దేశం ఉన్నవారు మాత్రమే ఆ వస్తువులను ఎత్తుకోవాలి". అప్పుడు అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్(రజి), 'దైవప్రవక్తా! ఇజ్ఖిర్ గడ్డి విషయంలో అనుమతిని ప్రదానం చేయండి. ఎందుకంటే ఆ గడ్డి కంసాలులకు, ఇండ్ల నిర్మాణానికి ఉపయోగపడు తుంది' అని విన్నవించుకోగా, "సరే, ఇజ్ఖిర్ గడ్డికి ఈ ఆజ్ఞ వర్తించదు" అని దైవప్రవక్త(స) చెప్పారు.**

**వేరొక ఉల్లేఖనంలో ఇబ్నె జురైజ్ ద్వారా కూడా ఇలాగే ఉటంకించబడింది. ఆయన అబ్దుల్ కరీమ్ బిన్ మాలిక్ నుండి, మరాయనేమో ఇబ్నె అబ్బాస్(రజి), అబూ హురైరా(రజి)ల నుండి సంగ్రహించిన దాని ప్రకారం కూడా ప్రవక్త మహ నీయులు (సఅసమ్) ఇలాగే ఉపన్యసించినట్లు ఉంది.**[1]

---

179-1. ముజాహిద్ గారు తాబయి కాబట్టి ఈ హదీసు 'ముర్సల్'గా పరిగణించబడింది. ఇమామ్ బుఖారీ(రహ్మ) ఈ హదీసును హజ్జ్ ప్రకరణంలో, సమర ప్రకరణంలో కూడా 'వసల్' చేశారు.

ప్రవక్త(స) ప్రబోధనం ప్రకారం కాబా గృహ పరిధి పవిత్రమైనది. ఆ పరిధిలో రక్తపాతం సృష్టించటం గానీ, చెట్లు నరకడం గానీ, వేటాడటం గానీ నిషిద్ధం. కాకపోతే 'షిర్క్'ను రూపుమాపేందుకు గాను ఒక దినములో ఒక గడియకాలం సైనిక చర్య గైకొనేందుకు అంతిమ దైవప్రవక్త(స)కు అనుమతి ఇవ్వబడింది.

## అధ్యాయం : 55
# హునైన్ యుద్ధం గురించి

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

(ఆ సందర్భాన్ని ఒకసారి జ్ఞప్తికి తెచ్చుకోండి) హునైన్ సంగ్రామం రోజున[1] ఆయన సహాయం యొక్క మహిమను మీరు చూసి ఉన్నారు. ఆ రోజు మీరు మీ సంఖ్యాబలాన్ని చూసి గర్వపడ్డారు. కాని అది మీకు ఏ విధంగానూ పనికి రాలేదు. భూమి విశాలమైనది అయినప్పటికీ మీకు ఇరుకైపోయింది. మీరు వెన్నుచూపి పారిపోయారు. తరువాత అల్లాహ్ తన (తరపు నుండి) ప్రశాంత స్థితిని తన ప్రవక్తపై, విశ్వాసులపై అవతరింపజేశాడు; ఇంకా మీకు కనిపించని దళాలను దించాడు. సత్య తిరస్కారులను శిక్షించాడు. సత్యాన్ని తిరస్కరించే వారికి లభించే ప్రతిఫలం ఇదే. తరువాత (మీరు దీనిని కూడా చూశారు) ఇలా శిక్షించిన తరువాత, అల్లాహ్ తాను కోరినవారికి పశ్చాత్తాప భాగ్యాన్ని కూడా ప్రసాదిస్తాడు. అల్లాహ్ మన్నించేవాడూ, కరుణించేవాడూను." *(అత్ తౌబా : 25-27)*

**180)** ఇస్మాయీల్ బిన్ అబీ ఖాలిద్ అందించిన సమాచారం : ఆయన ఇలా అన్నారు - నేను అబ్దుల్లాహ్ బిన్ అబీ అవ్ఫా(రజి) చేతికి అయిన గాయపు గుర్తును చూశాను. దాని గురించి ఆయన చెబుతూ, "నేను హునైన్ యుద్ధంలో దైవప్రవక్త(స) వెంట ఉన్నప్పుడు అయిన గాయం ఇది" అన్నారు. 'ఏమిటి, మీరు హునైన్ యుద్ధంలో పాల్గొన్నారా?' అని నేను అడగ్గా, "అంతకుముందు కూడా అనేక యుద్ధాలలో పాల్గొన్నాన"ని ఆయన చెప్పారు.

---

55-1 'హునైన్' అనేది ఒక పర్వత లోయ. అది మక్కాకి- తాయఫ్ పట్టణానికి మధ్యన ఉంది. మక్కా విజయం అనంతరం షవ్వాల్ నెల 6వ తేదీన దైవప్రవక్త(స) అక్కడకు వెళ్ళారు. మాలిక్ బిన్ ఔఫ్ అనేక అరబ్బు తెగలను సమీకరించి ముస్లింలతో యుద్ధానికి సన్నద్ధుడవుతున్నాడని దైవప్రవక్త(స)కు సమాచారం అందింది. హవాజిన్, సఖీఫ్ తెగలు వాటిలో ఎన్నదగినవి. సంఖ్యాపరంగా శత్రువుల కంటే చాలా అధికంగా ఉన్న తమను ఇక ఎదిరించేవారెవరు? అన్న మితిమీరిన ధీమా ముస్లింలలో ఏర్పడింది. కాని అల్లాహ్ ముస్లింల ఈ మితిమీరిన ధీమాను, నిర్లక్ష్యాన్ని బెడిసికొట్టేలా చేయడానికి యుద్ధరంగంలో తొలుత పరాజయం అంచులకు చేర్చి, ఆ తరువాత విజయం వొసగాడు. కేవలం దైవ సహాయంతోనే విజయం సాధ్యం అనే విషయాన్ని ముస్లింలకు గుర్తు చేశాడు.

**181)** బరా బిన్ ఆజిబ్(రజి) చెప్పగా నేను విన్నానని అబూ ఇస్‌హాఖ్ తెలిపారు : ఒక వ్యక్తి ఆయన(బరా) దగ్గరకు వచ్చి, 'ఓ అబూ అమ్మారా! ఏమిటి, మీరు కూడా హునైన్ యుద్ధ సందర్భంగా వెన్ను చూపిన వారిలో ఉన్నారా?' అని ప్రశ్నించగా, ఆయన ఇలా సమాధానమిచ్చారు : "ప్రవక్త మహనీయులు(సఅసమ్) మాత్రం తానున్న స్థానం నుండి కదలలేదని నేను సాక్ష్యమిస్తున్నాను. కాకపోతే జాతి జనులలో దూకుడు స్వభావం కలవారు తమ తొందరపాటును కనబరిచారు. హవాజిన్ తెగవారు వారిపై ఎడతెగకుండా బాణ వర్షం కురిపించారు. అబూ సుఫ్యాన్ బిన్ హారిస్(రజి)[1] దైవప్రవక్త(స) స్వారీ అయివున్న తెల్లని కంచెర గాడిద పగ్గాలను పట్టుకుని నిలబడి ఉన్నారు. ఆ సమయంలో దైవప్రవక్త(స), "నేను దైవప్రవక్తను, ఇందులో అబద్ధానికి ఆస్కారమే లేదు. నేను అబ్దుల్ ముత్తలిబ్ సంతతివాడను" అని ఎలుగెత్తి పిలుస్తున్నారు (తన సహచరులను).

**182)** అబూ ఇస్‌హాఖ్ కథనం: '(ప్రవక్త సహచరులైన) మీరు హునైన్ యుద్ధం జరిగిన దినాన దైవప్రవక్త(సఅసమ్)ను విడిచి యుద్ధరంగం నుండి పారి పోయారని విన్నాను. నిజమేనా?' అని ఎవరో బరా బిన్ ఆజిబ్(రజి)ను అడిగితే, 'దైవప్రవక్త(స) మాత్రం వెన్ను చూపలేదు. ఇంతకీ జరిగిందేమిటంటే హవాజిన్ తెగవారు విలువిద్యలో ఆరితేరినవారు. ఆ సమయంలో దైవప్రవక్త(స) ఇలా అంటూ ఉన్నారు : "నేను దైవసందేశహరుడను. అబద్ధీకుడను కాను. నేను అబ్దుల్ ముత్తలిబ్ పు(పౌ)త్రుడను."

**183)** బరా బిన్ ఆజిబ్(రజి) చెప్పగా అబూ ఇస్‌హాఖ్ విన్నారు : ఖైస్ తెగకు చెందిన ఒక వ్యక్తి ఆయన్ని (బరా) 'ఏమిటి, హునైన్ యుద్ధం జరిగిన దినాన మీరంతా దైవప్రవక్త(స)ను విడిచి, యుద్ధరంగం నుండి పారిపోయారా?' అని అడగ్గా, ఆయన ఇలా బదులిచ్చారు : కాని దైవప్రవక్త(స) మాత్రం తానున్న చోటి నుండి కదలలేదు. మరోవైపు హవాజిన్ తెగవారు విలువిద్య నిపుణులు. ఆరంభంలో మేము వారిపై దాడి చేసినప్పుడు, వారు వెనక్కి తగ్గారు. దాంతో మేము యుద్ధప్రాప్తిని పోగు చేసుకోవటంలో నిమగ్నులం అయిపోయాము. చివరకు మేము

---

181-1. హదీసులో ప్రస్తావనకు వచ్చిన అబూ సుఫ్యాన్ బిన్ హారిస్(రజి) ఎవరో కారు, ఆయన వరుసకు దైవప్రవక్త(స)కు పినతండ్రి కుమారుడే. మక్కా విజయానికి కొంచెం ముందుగా ఆయన దైవప్రవక్త(స)ను కలుసుకుని, ఇస్లామ్ స్వీకరించారు.

వారి బాణాలను ఎదుర్కోవలసి వచ్చింది. దైవప్రవక్త(స) తన తెల్లని కంచెర గాడిదపై స్వారీ అయి ఉండటం నేను కళ్ళారా చూశాను. అబూ సుఫ్యాన్(రజి) దాని కళ్ళాన్ని పట్టుకుని ఉన్నారు. దైవప్రవక్త(స) ఇలా అంటున్నారు: "నేను దైవ ప్రవక్తను. ఇందులో అబద్ధం అన్నది లేదు"[1] - తరువాత దైవప్రవక్త(స) తన వాహనం నుండి దిగారని ఇస్రాయీల్, జుహైర్ తెలియపరిచారు.

**184)** మిస్వర్ బిన్ మఖ్రమా (రజి) తెలిపారు: (హునైన్ యుద్ధానంతరం) హవాజిన్ తెగవారు ముస్లింలుగా ధర్మపరివర్తన చెంది దైవప్రవక్త(సఅసమ్) సన్నిధికి వచ్చినప్పుడు తమ సంపదలను, తమ తెగకు చెందిన యుద్ధ ఖైదీలను తమకు వాపసు చేయమని విన్నవించుకున్నారు. దానికి సమాధానంగా దైవ ప్రవక్త(స) ఇలా అన్నారు : "నా వెంట ఎంతమంది ఉన్నారో మీరు చూస్తూనే ఉన్నారు. చూడండి! ధర్మబద్ధమైన దానిని నేను అన్నిటికన్నా ఎక్కువగా ఇష్టపడ తాను. కాబట్టి మీరు రెండింటిలో ఏదైనా ఒక దానిని కోరుకోండి. మీరు మీ ఖైదీల నైనా విడిపించుకోండి లేదా మీ సంపదనయినా తీసుకోండి." దైవప్రవక్త(స) తాయఫ్ నుండి తిరిగి వచ్చిన మీదట దాదాపు పది రోజుల వరకూ వాళ్ళ రాక కోసం నిరీక్షించారు.

దైవప్రవక్త(స) రెండింటిలో ఒక దానినే ఆమోదిస్తారన్న విషయం వారికి స్పష్టమైపోయాక, 'సరే. మా ఖైదీలను మాకు వాపసు చేయండి' అని వారు విజ్ఞప్తి చేశారు.

అప్పుడు దైవప్రవక్త(స) ముస్లిములను ఉద్దేశించి ఉపన్యసించారు : అల్లాహ్‌ను, ఆయన ఘనత్వానికి తగ్గ రీతిలో స్తుతించిన తర్వాత ఇలా అన్నారు- "అమ్మాబాద్! మీ సోదరులు (హవాజిన్ తెగకు చెందినవారు) పశ్చాత్తాపపడి, ముస్లింలుగా పరివర్తన చెంది మన వద్దకు వచ్చారు. కాబట్టి వారి యుద్ధ ఖైదీలను వారికి వాపసు చేయాలన్నది నా అభిప్రాయం. అందుచేత ఎవరయినా (ప్రాపంచిక ప్రతిఫలాన్ని అపేక్షించకుండా) ఇష్టపూర్వకంగా తమ వద్ద ఉన్న ఖైదీలను వాపసు చేసినట్లయితే ఇది వారి పాలిట శ్రేయస్కరం. వారి హక్కు ఎటూ పోదు. ఇక మీదట

---

183-1. తిర్మిజీ ఉల్లేఖనం ప్రకారం యుద్ధ మైదానంలో వంద మంది ముస్లింలు కూడా లేని పరిస్థితి ఏర్పడింది. కాని దైవప్రవక్త(స) మొక్కవోని సాహసంతో తన వాహనంపై స్వారీ అయి ఉన్నారు.

యుద్ధ ప్రాప్తిగా వచ్చిన దానిలో నుంచి వారి హక్కును చెల్లించటం జరుగుతుంది. కనుక వారి ఖైదీలను వారికి వాపసు చేయవలసిందిగా కోరుతున్నాను". దానికి సహచరమాన్యులు, 'దైవప్రవక్తా! మేము హృదయపూర్వకంగా వాపసు చేయగోర్తు న్నాము' అన్నారు. దానికి ఆయన(స), "అలా కాదు, ఎవరు ఇష్టపూర్వకంగా వాపసు చేయగోర్తున్నారో, మరెవరు అన్యమనస్కంగా ఇవ్వదలుస్తున్నారో మాకు తెలియటం లేదు. అందుకే ఒక పని చేయండి. మీరందరూ మీ మీ గుడారాలకు వెళ్ళండి. మీ నాయకులు మిమ్మల్ని సంప్రతించిన మీదట, వారొచ్చి మీ నిర్ణయం ఏమిటో నాకు చెప్పాలి" అన్నారు. దైవప్రవక్త(స) సూచించినట్లుగానే అందరూ తమ తమ స్థానాలకు తిరిగి వెళ్ళిపోయారు. వారి పర్యవేక్షకులు వారితో చర్చించిన మీదట దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి, 'అందరూ సంతోషంగా, హృదయపూర్వకంగా అంగీకరించార'ని చెప్పారు.[1]

హవాజిన్ తెగవారి యుద్ధ ఖైదీలను గురించి తనకు అందిన హదీసు ఇదేనని ఇబ్నె అబ్బాస్(రజి) చెప్పారు.

**185)** హజ్రత్ ఇబ్నె ఉమర్(రజి) కథనం: మేము హునైన్ యుద్ధం నుండి తిరిగి వస్తుండగా, ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) దైవప్రవక్త(స) సన్నిధికి వెళ్ళి, తాను అజ్ఞాన కాలంలో ఉండగా ఏతెకాఫ్ పాటిస్తానని మొక్కుకున్నట్లు చెప్పారు. దానికి దైవప్రవక్త(స), "మొక్కుబడిని తీర్చుకో" అని ఆదేశించారు.

**186)** అబూ ఖతాదా(రజి) వివరించారు: హునైన్ యుద్ధం కొరకు మేము ప్రవక్త మహనీయులు(సఅసమ్)తో కలసి బయలుదేరాము. యుద్ధం మొదలైనప్పుడు ముస్లింలు తడబడ్డారు. ఆ సమయంలో ఒక బహుదైవారాధకుడు ఒక ముస్లింపై ఆధిపత్యం వహించటాన్ని నేను గమనించి, వెనుక నుంచి వెళ్ళి అతని మెడపై ఒక్క ఖడ్గపు వ్రేటు వేశాను. అతని కవచాన్ని కోసివేశాను. అంతే, అతను నా వైపు తిరిగి అమాంతం నాపై లంఘించాడు. ఆ క్షణంలో మృత్యువు నా కళ్ళ ముందే

184-1. హవాజిన్ ప్రతినిధి బృందంలో 24 మంది ఉన్నారు. వారిలో అబూ బుర్ఖాన్ సాదీ కూడా ఉన్నాడు. అతను దైవప్రవక్త(స)తో, 'యా రసూలల్లాహ్! ఈ ఖైదీలలో మీ పాలవరుస సంబంధం రీత్యా మీకు ఎంతోమంది తల్లులు, పినతల్లులు, చెల్లెళ్ళు ఉన్నారు. కాబట్టి తమరు మాపై దయజూపండి. మమ్మల్ని అందరినీ విడిచిపెట్టండి. అల్లాహ్ మీపై అపారంగా కరుణిస్తాడు' అని అభ్యర్థించాడు. దానికి దైవప్రవక్త(స) ఎలా స్పందించారో పై హదీసులో వచ్చింది.

కదలాడినట్లు అనిపించింది. కడకు అతను మరణించడంతో, నాకు అతని బెడద తప్పింది. తరువాత ఉమర్(రజి) నాకు తారసపడ్డారు. 'ఇంతకీ జనులకేమైపోయింది?' అని నేను ఆయన్ని అడిగాను. 'బహుశా దైవాదేశం ఇదేనేమో!' అన్నారాయన.

తరువాత ముస్లింలు తిరగబడ్డారు. (యుద్ధం ముగిసిన తరువాత) ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఉపవిష్టులై "ఎవరయినా యుద్ధంలో ప్రత్యర్థిని చంపి ఉంటే, అతను దానికి సంబంధించిన సాక్ష్యాధారం కూడా కలిగి ఉంటే, దానిని సమర్పించాలి. అప్పుడు హతుని సంపత్తి, ఆయుధాలు అతనికి ఇవ్వబడతాయి" అని సెలవిచ్చారు. మరైతే నా వ్యవహారంలో సాక్ష్యమిచ్చేవారెవరు? అని మనసులో అనుకుని, నిశ్శబ్దంగా కూర్చుండిపోయాను. దైవప్రవక్త(స) రెండవసారి కూడా అదేవిధంగా సూచించారు. రెండవసారి కూడా నేను మనసులో అలాగే అనుకుని, కూర్చుండిపోయాను. దైవప్రవక్త(స) ఇంకొకసారి కూడా ఆదేశించడంతో నేను లేచి నిలబడ్డాను. "అబూ ఖతాదా! ఏమిటి సంగతి?" అని అడిగారు ప్రవక్త మహనీయులు(స). నేను ఆయన(స)కు జరిగినదంతా వివరించి చెప్పాను. అప్పుడు ఒక వ్యక్తి (అస్వద్ బిన్ ఖుజాయి అస్లమీ) జోక్యం చేసుకుని, 'ఈయనగారు చెప్పేది నిజం. ఆ హతుని సంపత్తి నా దగ్గర ఉంది. అది నాకు దక్కేలా తమరు ఈయనగారిని ఒప్పించండి' అని విన్నవించుకున్నారు. అప్పుడు అబూబకర్(రజి) కల్పించుకుని, 'లేదు. దైవసాక్షిగా అలా జరగనేరదు. దైవ కిశోరాలలోని ఒక యువ కిశోరం దైవం, దైవప్రవక్త తరఫున పోరాడినప్పుడు దైవప్రవక్త(స) అతనికి చెందవలసిన హక్కును నీకివ్వటమా? అలా జరగదు' అని పలికారు. అప్పుడు ప్రవక్త మహనీయులు(స), "(అబూబకర్) నిజం చెప్పారు. నీవు ఆ సంపత్తిని అబూ ఖతాదాకు ఇచ్చేయ్" అని ఆదేశించారు.

ఆయన ఆ సంపత్తిని నాకు ఇచ్చేశారు. దాంతో నేను సలమా తెగవారి వాడలో ఒక తోటను కొన్నాను. ఇస్లామ్ స్వీకరించిన పిదప నాకు లభించిన తొలి సంపద అది.

**187)** అబూ ఖతాదా (రజి) వివరించారు : హునైన్ యుద్ధం జరిగిన రోజు నేను ఒక బహు దైవారాధకునితో పోరాడుతున్న ఒక ముస్లింను చూశాను. అదే సమయంలో వారిద్దరికీ వెనుక వైపున మరొక బహుదైవారాధకుడు ఆ ముస్లింను చంపడానికి మాటేసి ఉన్నాడు. ముందు నేను అతని వైపే వెళ్ళాను. నన్ను చంపడా

నికి అతను చెయ్యి ఎత్తాడు. నేను వేగంగా అతని చెయ్యిపై వ్రేటు వేసి, అతని చేతిని నరికివేశాను. ఆ తరువాత అతను నన్ను గట్టిగా పట్టుకుని కుదిపి వేశాడు. నేను భయపడిపోయాను. కొన్ని క్షణాల్లోనే అతను నన్ను వదిలేశాడు. డీలా పడి పోయాడు. నేనతన్ని త్రోసి, పిదప వధించాను. మరోవైపు ముస్లింలు కదన రంగం నుండి పారిపోతున్నారు. నేను కూడా వారితోపాటే పరుగెత్తాను. ఆ సమయంలో నాకు ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) తారసపడ్డారు. 'జనులు ఎందుకు ఇలా పరారవు తున్నారు' అని నేనడిగితే, 'బహుశా దైవాజ్ఞ ఇదే కాబోలు' అని అన్నారాయన. ఆ తరువాత జనులు దైవప్రవక్త(స) దగ్గర గుమిగూడారు. ఆ సందర్భంగా దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు : "ఎవరయితే ఫలానా హతుణ్ణి తాను వధించినట్లు సాక్ష్యం సమర్పిస్తాడో అతనికి ఆ హతుని వస్తువులన్నీ లభిస్తాయి."

అప్పుడు నేను, నా చేత వధించబడిన హతుల విషయంలో సాక్ష్యాలు సమర్పించడానికి లేచాను. కాని ఏ ఒక్క సాక్షి కూడా నాకు కనిపించలేదు. గత్యం తరం లేక నేను కూర్చుండిపోయాను. ఇప్పుడు నా ముందున్న మార్గం ఒక్కటే-జరిగినదంతా దైవప్రవక్త(స)కు విన్నవించుకున్నాను. అప్పుడు ప్రవక్త సమక్షంలోనే కూర్చుని ఉన్న ఒక వ్యక్తి (అస్వద్ బిన్ ఖుజాయి అస్లమీ- రజి), 'దైవప్రవక్తా! ఈయన గారు వధించిన హతుని వస్తు సామగ్రి నా దగ్గర ఉంది. ఆ సామగ్రి అంతా నాకు చెందేలా ఈయన గారిని ఒప్పించండి' అని విజ్ఞప్తి చేశారు. హజ్రత్ అబూబకర్(రజి) ఆయనకు అడ్డు తగులుతూ, 'అలా ఎన్నటికీ జరగదు. దైవం, దైవప్రవక్త కొరకు పోరాడిన దైవ కిశోరాలలోని ఒక కిశోరాన్ని కాదని, అతని హక్కును ఖురైషుల్లోని ఒక పిరికిపందకు ఇవ్వటమా?! దైవప్రవక్త(స) అలా ఎన్నటికీ చేయరు' అన్నారు. అప్పుడు దైవప్రవక్త లేచి నిలబడి, ఆ వస్తుసామగ్రిని తనకు ఇచ్చారని అబూ ఖతాదా (రజి) చెప్పారు. నేను ఆ సంపత్తితో ఒక తోటను కొనుగోలు చేశాను. నేను ఇస్లాం స్వీకరించిన తరువాత నాకు లభించిన తొలి సొమ్ము అదే అని అబూ ఖతాదా తెలిపారు.

### అధ్యాయం : 56

## అవ్తాస్ యుద్ధం గురించి[1]

**188)** అబూ మూసా అష్అరీ(రజి) తెలిపారు : ప్రవక్త మహనీయులు

56-1. హవాజిన్ తెగవారు నివసించే ప్రదేశంలోని ఒక లోయ పేరు 'అవ్తాస్'. హునైన్ యుద్ధం తరువాత అవ్తాస్‌లో ఒక చిన్న యుద్ధం జరిగింది. ఎందుకంటే హవాజిన్

(సఅసమ్) హునైన్ యుద్ధం నుండి తీరిక లభించిన తరువాత అబూ ఆమిర్(రజి) నాయకత్వంలో ఒక సైనిక దళాన్ని అవ్‌తాస్ లోయ వైపునకు పంపారు. ఈ పోరాటంలో దురైద్ బిన్ సుమ్మాతో ముఖాముఖీ అయింది. అతను వధించబడ్డాడు. అతని సైన్యం కూడా ఓటమి పాలయింది. అబూ మూసా అష్‌అరీ(రజి) ఇలా అన్నారు: ప్రవక్త మహనీయులు (స) అబూ ఆమిర్‌తోపాటు నన్ను కూడా (అవ్‌తాస్‌కు) పంపించారు. అబూ ఆమిర్ (రజి) మోకాలికి బాణం గుచ్చుకుంది. బనీ జూషమ్‌కు చెందిన ఒక వ్యక్తి ఆయనపై బాణం సంధించాడు. నేను ఆయన గారి దగ్గరకు వెళ్ళి, "బాబాయి! ఈ బాణాన్ని మీపై వదలినవాడెవడు?" అని అడిగాను. 'అడుగో! ఆ జూషమీ నా హంతకుడు. అతడే నాపైన బాణాన్ని ఎక్కుపెట్టాడ'ని అతని వైపు సంజ్ఞ చేశారాయన. నేను అతనివైపు పరుగెత్తాను. అతన్ని సమీపించాను. కాని అతను నన్ను చూడగానే వేగంగా పరుగెత్తాడు. నేనతన్ని వెంబడించాను. "పిరికిపందా! నీకు సిగ్గులేదా?" అని రెచ్చగొట్టాను. చివరకు అతను ఆగిపోయాడు. మేము పరస్పరం కత్తులు దూసుకున్నాము. కడకు నేనతన్ని వధించాను. తరువాత అబూ ఆమిర్(రజి) దగ్గరకు వెళ్ళి, "అల్లాహ్ మీ హంతకుణ్ణి చంపించాడ"ని అన్నాను. దానికి ఆయన : 'ముందు నా మోకాలి నుండి ఈ బాణాన్ని వెలికి తియ్యి. దీని నుండి పస కారుతోంది' అన్నారు. తరువాత ఆయన, 'నా భ్రాతృజుడా! దైవప్రవక్త(స)కు నా సలామ్ చెప్పు. నా మన్నింపు కొరకు ప్రార్థించమని చెప్పు' అని కోరారు.

తరువాత ఆయన నన్ను సైనిక దళంపై తాత్కాలిక అధిపతిగా నియమించారు. ఆ తరువాత ఆయన కొద్దిసేపటికే తనువు చాలించారు (అమరగతి నొందారు). నేను ఆ ప్రయాణం నుండి తిరిగి వచ్చిన మీదట దైవప్రవక్త(స) సేవలో హాజరయ్యాను. ఆయన తన ఇంట్లో ఓ నులక మంచంపై కూర్చుని ఉన్నారు. దానిపై పడక, దుప్పటి లాంటిదేదీ లేదు. ఆయన(స) వీపుపై ఆ నులక మంచం (నార) గుర్తులు స్పష్టంగా కనిపించాయి.[1] నేను ఆయన(స)కు నా గురించి, మా బాబాయి గురించి జరిగినదంతా విడమరచి చెప్పాను. తన మన్నింపునకై ప్రార్థించ

---

తెగకు చెందిన కొంతమంది హునైన్ యుద్ధ సందర్భంగా అవ్‌తాస్‌కు పారిపోయారు. అందుచేత దైవప్రవక్త(స) ఒక సైనిక దళాన్ని అక్కడికి పంపిస్తూ అబూ ఆమిర్ అష్‌అరీ(రజి)ని దానికి అధిపతిగా నియమించారు. 'తాయఫ్' వైపునకు దైవప్రవక్త(స) స్వయంగా వెళ్లారు.

**మని ఆయన ప్రత్యేకంగా కోరారని కూడా దైవప్రవక్త(స)కు విన్నవించుకున్నాను. అప్పుడాయన(స) నీరు తెమ్మని కోరారు. వుజూచేసి, చేతులెత్తి "దేవా! ఉబైద్ అబూ ఆమిర్‌ను మన్నించు" అని ప్రార్థించారు. ఆ సమయంలో నేను ఆయన(స) చంకల లోని తెల్లదనాన్ని చూశాను. 'నా కొరకు కూడా అల్లాహ్‌ను ప్రార్థించండి' అని నేను అభ్యర్థించాను. దానికి ఆయన(స), "అల్లాహ్! అబ్దుల్లాహ్ బిన్ ఖైస్ పాపా లను కూడా క్షమించు. ప్రళయదినాన అతనికి మంచి స్థానం ప్రసాదించు" అని ప్రార్థించారు. అబూ బుర్దా ఇలా అన్నారు: 'ఒక దుఆ అబూ ఆమిర్(రజి) కొరకు, మరొక దుఆ అబూ మూసా(రజి) కొరకు చేయటం జరిగింది.**

## అధ్యాయం : 57

# తాయఫ్ యుద్ధం గురించి...

**మూసా బిన్ ఉఖ్‌బా ప్రకారం ఈ యుద్ధం హిజ్రీ 8వ సంవత్సరం షవ్వాల్ నెలలో జరిగింది.[1]**

**189) తన తల్లి, ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ ఉమ్మె సలమా(ర.అ) చెప్పారని జైనబ్ బిన్తె అబీ సలమా తెలియజేశారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) తన గుడారానికి విచ్చేసిన సమయంలో అక్కడ ఒక నపుంసకుడు (హిజరా) కూర్చుని ఉన్నాడు. అతను అబ్దుల్లాహ్ బిన్ అబీ ఉమయ్యాతో, 'ఓ అబూ**

---

188-1. సుబ్‌హానల్లాహ్! ఒక సువిశాల భూభాగానికి రాజ్యాధిపతిగా, మార్గబోధకునిగా ఉన్న వ్యక్తి నిరాడంబర జీవితానికి ఇంతకన్నా నిదర్శనం ఏం కాగలదు? విశ్రాంతి తీసుకోవడానికి కేవలం ఒక నులక మంచం. దానిపైన ఒక దుప్పటి కూడా లేదు.

57-1. మక్కాకు ముప్ఫయి మైళ్ళ దూరాన ఉన్న ఒక చిన్న పట్టణం 'తాయఫ్'. దీనిని 'తాయఫ్' అని ఎందుకంటారంటే ఇది నూహ్ (అ) కాలంలో సంభవించిన తుఫానులో నీటిపై తేలియాడుతూ ఉంది లేదా హజ్రత్ జిబ్రీల్(అ) దీనిని సిరియా రాజ్యం నుండి తెచ్చి పవిత్ర కాబా గృహం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. ఈ పట్టణానికి చుట్టూ ఒక ప్రహరీ గోడ కట్టించటం వల్ల దీనికి తాయఫ్ అనే పేరు పడిందని మరికొందరు అంటారు. ఈ ప్రహరీ గోడను సదఫ్ తెగకు చెందిన ఒక వ్యక్తి నిర్మించాడు. అతను హజర్‌మోత్‌లో ఒకరిని చంపి, అక్కడి నుండి పరారై వచ్చాడు. ఎంతో సారవంతమైన ప్రదేశం తాయఫ్. అక్కడ రకరకాల నాణ్యమైన పండ్లు, ఆహార ధాన్యాలు లభ్యమవుతాయి. అక్కడి వాతావరణం కూడా ఆహ్లాదకరంగా ఉంటుంది. అందుకే వేసవి కాలంలో మక్కా నుండి చాలామంది విశ్రాంతి కొరకు ఈ పట్టణానికి వస్తుంటారు.

**అబ్దుల్లాహ్! చూడు, రేపు ఒకవేళ అల్లాహ్ మీకు తాయఫ్ పట్టణంపై విజయం వొసగినట్లయితే గీలాన్ బిన్ సలమా కూతురు (బాదియా)ను నువ్వు తీసేసుకో. ఆమె ఎంత ముద్దుగా బొద్దుగా ఉంటుందంటే, ఆమె నడుస్తూ ముందుకు వచ్చినప్పుడు, పొట్టపై నాలుగు వొంపులు, వెనక్కి తిరిగి వెళుతున్నప్పుడు పక్కనుంచి నాలుగు మడతలు - ఇలా మొత్తం ఎనిమిది మడతలు కనిపిస్తాయి' అని చెబుతుండగా, దైవప్రవక్త(స) అతని మాటలు విన్నారు- అంతే, "ఆ వ్యక్తి ఇక మీదట నీ ఇంటికి రాకూడదు" అని దైవప్రవక్త(స) నాకు గట్టిగా తాకీదు చేశారు.[1]**

**190) దైవప్రవక్త(సఅసమ్) ఆ రోజుల్లో తాయఫ్ పట్టణాన్ని ముట్టడించి ఉన్నారని హిషామ్ తెలియజేశారు.**

**191) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) వివరించారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) తాయఫ్ పట్టణాన్ని ముట్టడించినప్పుడు శత్రువుకు ఎలాంటి నష్టం చేకూర్చలేదు. చివరకు ఆయన(స), "దైవచిత్తమయితే ఇక మనం తిరిగి వెళ్ళిపోతాం" అన్నారు. విజయకేతనం ఎగురవేయకుండా తిరిగిపోతామనే సరికి, అది ముస్లింలకు బాధాకరం అనిపించింది. 'అయ్యో! విజయం సాధించకుండానే వెళ్ళిపోతామా!?' అని ఆశ్చర్యం వెలిబుచ్చారు ప్రియ సహచరులు. దానికి దైవప్రవక్త(స), "మరి అలాగైతే రేపు ప్రాతఃకాలమే యుద్ధ రంగంలోనికి వచ్చేయండి" అని ఆదేశించారు. సహచరమాన్యులు తెలతెలవారుతుండగానే యుద్ధరంగానికి వచ్చేశారు. కాని వారిలో చాలా మంది క్షతగాత్రులయ్యారు. అప్పుడు దైవప్రవక్త(స), "ఇన్షా అల్లాహ్ రేపు మనం తిరిగి వెళ్ళిపోతున్నాం" అన్నారు. ఈ నిర్ణయానికి సహచరమాన్యులు సంతోషించడంతో దైవప్రవక్త(స) నవ్వేశారు.[1] సహచరుల సంతోషాన్ని పసిగట్టి దైవప్రవక్త(స) చిరుమందహాసం చేశారని సుఫ్యాన్(రజి) చెప్పారు.**

---

189-1. ఆ నపుంసకుని పేరు 'హీత్' అని, అతనిని దైవప్రవక్త(స) మదీనా నగరంలో ప్రవేశించకుండా ఆంక్షలు విధించారని కూడా తెలుస్తోంది. ఆ నపుంసకుడు వృద్ధాప్యానికి చేరుకున్నప్పుడు ద్వితీయ ఖలీఫా హజ్రత్ ఉమర్(రజి) తన పరిపాలనా కాలంలో ఈ ఆంక్షలో కొంత సడలింపు ఇచ్చారు. అంటే ఆ వ్యక్తి ప్రతి శుక్రవారం మదీనాలోకి వచ్చి ముష్టెత్తుకోవచ్చు. ఆ తరువాత అతను నగరం నుండి బయటికి వెళ్ళిపోవాలి.

191-1. ఈ యుద్ధంలో ఎటొచ్చీ ముస్లింలకే నష్టం వాటిల్లింది. ఎందుకంటే తాయఫ్ వాసులు కోటలో తలదాచుకున్నారు. ఒక ఏడాది కాలానికి సరిపడా ఆహార

**192)** దైవమార్గంలో అందరికన్నా ముందు బాణాలు సంధించిన సాద్ బిన్ అబీ వక్కాస్(రజి), కొంతమంది ముస్లింలతో కలసి తాయఫ్ కోటపైకి ఎక్కిన అబూబక్రా(రజి) చెప్పగా నేను విన్నానని అబూ ఉస్మాన్ నహ్దీ తెలియజేశారు– ఆ ఇరువురు ప్రియ సహచరులు దైవప్రవక్త(సఅసమ్) ఇలా ప్రవచించినట్లుగా చెప్పారు : "ఎవరయితే తెలిసి కూడా తన తండ్రిని కాదని, వేరొకరికి పుట్టినట్లుగా చెప్పుకుంటాడో అతని కొరకు స్వర్గం నిషిద్ధం."

ఈ విషయాన్ని చేరవేసిన ఆ ఇద్దరు సహాబీలు నమ్మకస్తులు. వారిలో ఒకరు– సాద్ బిన్ అబీ వక్కాస్(రజి). ఆయన దైవమార్గంలో అందరికన్నా ముందు విలువిద్యను ప్రదర్శించారు. రెండవవారు, అబూబక్రా(రజి). తాయఫ్ కోటపై నుండి దిగివచ్చిన ముప్పయి మంది యోధులలో ఆయన చివరివారు.

**193)** అబూ మూసా అష్అరీ(రజి) చెప్పినట్లుగా అబూ బుర్దా తెలిపారు: నేను ప్రవక్త మహనీయుల(సఅసమ్)కు దగ్గరలోనే ఉండగా, ఆయన(స) మక్కా–మదీనాల మధ్యలో ఉన్న 'జీరానా' అనే స్థలంలో వాహనం నుంచి దిగుతున్నారు. ఆయన(స) వెంట బిలాల్(రజి) కూడా ఉన్నారు. అంతలోనే ఒక పల్లెటూరి బైతు దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి, 'తమరు నాకు చేసిన వాగ్దానాన్ని ఎందుకు నెర వేర్చటం లేదు?' అని అడిగాడు. దానికి ఆయన(స), "నీకు శుభవార్త!" అన్నారు. దానికి అతను 'శుభవార్తలు మీరు నాకు చాలానే వినిపించారు లెండి' అన్నాడు. అది విని దైవప్రవక్త(స) తన ముఖాన్ని అబూ మూసా, బిలాల్‌ల వైపునకు త్రిప్పు కున్నారు. ఆ క్షణంలో ఆయన(స) కోపంలో ఉన్నట్లు కనిపించారు. "ఈ వ్యక్తి శుభవార్తను వాపసు చేసేశాడు. మీరిద్దరైనా దానిని స్వీకరించండి" అని దైవ ప్రవక్త(స) సూచించగా, 'మేము స్వీకరించామ'ని వారిద్దరూ సమాధానమిచ్చారు.

---

ధాన్యాలు నిల్వ చేసుకున్నారు. దైవప్రవక్త(స) 18 లేక 25 దినాలు తాయఫ్‌ను దిగ్బంధం చేశారు. కోట లోపలి నుండి శత్రువులు బాణాలు ప్రయోగించేవారు. ఇనుప ముక్కలను కాల్చి విసిరేవారు. దీనివల్ల అనేకమంది ముస్లిం యోధులు అమరగతినొందారు. అప్పుడు దైవప్రవక్త(స) నౌఫల్ బిన్ ముఆవియా(రజి)ను సంప్రదించారు. 'వీళ్ళు గుంటనక్కల వంటివారు. వారు తమ కన్నం (స్థావరం)లో దూరారు. ఒకవేళ మీరు ఇక్కడే మోహరించి ఉంటే నక్కలను పట్టుకున్న వారవు తారు. ఒకవేళ వాటిని వదిలేస్తే, అవి మీకు నష్టమేమీ చేకూర్చలేవు' అని ఆయన సలహా ఇచ్చారు.

**తరువాత ఆయన(స) ఒక పాత్రలో నీరు తీసుకురమ్మని కోరారు. తన రెండు చేతులనూ, ముఖాన్ని ఆ నీటితో కడిగారు. ఆ నీటిలోనే పుక్కిలించారు. "ఈ నీటిని త్రాగండి. దీంతో మీ ముఖాలను, రొమ్ములను తడుపుకోండి. శుభవార్తను గ్రహించండి" అని సూచించారు. వారిద్దరూ ఆ నీళ్ళ పాత్రను తీసుకుని దైవ ప్రవక్త(స) చెప్పినట్లే చేశారు. తెర వెనుక నుండి ఈ వైనాన్ని గమనిస్తూ ఉన్న ఉమ్మె సలమా(ర.అ), 'మీ తల్లి కోసం కూడా కొద్దిగా మిగిల్చి ఉంచండి" అని కోరారు. అందువల్ల వారిద్దరూ ఆమె కోసం కూడా ఆ ఉపయోగిత నీటిని కొంత మిగిల్చి ఉంచారు.**[1]

**194) తన తండ్రి యాలా ఇలా అన్నారని సఫ్వాన్ బిన్ యాలా బిన్ ఉమయ్యా తెలిపారు : ప్రవక్త మహనీయులు (సఅసమ్)పై 'వహీ' అవతరిస్తూ ఉండగా నేనాయన్ని చూస్తే ఎంత బాగుండేది! అన్న కుతూహలం నాలో ఉండేది. జీరానాలో దైవప్రవక్త(స) విడిది చేసి ఉన్న స్థలంలో ఒక వస్త్రం ద్వారా ఆయనకు నీడ కల్పించటం జరిగింది. అక్కడ ఆయన(స)తోపాటు మరికొంతమంది సహచరమాన్యులు కూడా ఉన్నారు. ఆ సమయంలో ఒక పల్లెటూరి వ్యక్తి అక్కడికి వచ్చాడు. అతను పొడవాటి జుబ్బా (అంగీ) తొడిగి ఉన్నాడు. సుగంధ ద్రవ్యం పూసుకుని ఉన్నాడు. 'దైవప్రవక్తా! తన జుబ్బాలో సువాసన పూసుకున్న మీదట ఉమ్రా కొరకు ఇహ్రామ్ దీక్షబూనిన వ్యక్తి గురించి మీరేమంటారు?' అని అతను ప్రశ్నించాడు. అప్పుడు హజ్రత్ ఉమర్(రజి), తక్షణం రావలసినదిగా యాలాకు సంజ్ఞ చేశారు. యాలా (రజి) వచ్చి, (దైవప్రవక్త-సఅసం-ను చూడటానికి) తన తలను లోపలికి దూర్చారు. ('వహీ' అవతరణా ప్రభావం వల్ల) ఆ క్షణంలో**

---

193-1. ఆ పల్లెటూరి బైతుకు ఏమైనా కొంత సొమ్ము ఇస్తానని దైవప్రవక్త(స) బహుశా చెప్పి ఉంటారు. దానిని ఆసరాగా చేసుకుని ఆ అనాగరికుడు మొరటుగా మాట్లాడాడు. ఈ ప్రపంచంకన్నా మేలైనది (స్వర్గం) అతనికి ప్రాప్తించాలని దైవప్రవక్త(స) అభిలషించారు. కాని అతను దానిని తిప్పి కొట్టాడు. ఆ భాగ్యం బిలాల్‌కు, అబూ మూసాకు ప్రాప్తమయింది.

'జీరానా' మక్కా-మదీనా మధ్యలో ఉన్న స్థలం అని చెప్పటం కన్నా తాయఫ్-మక్కాల మధ్యన ఉన్న స్థలం అంటే బాగుంటుంది. ఉల్లేఖకుని వల్ల ఇక్కడ మరుపు జరిగి ఉంటుంది.

**దైవప్రవక్త ముఖారవిందం ఎర్రగా కందిపోయి ఉంది. ఉచ్వాస నిశ్వాసలు చాలా వేగంగా ఉన్నాయి. కొద్దిసేపటి వరకూ ఇదే పరిస్థితి! తరువాత ఆ ప్రభావం తగ్గాక, "ఇందాక ఉమ్రా గురించి ప్రశ్నించిన వ్యక్తి ఎక్కడ?" అని దైవప్రవక్త(స) అడిగారు. ఆ వ్యక్తిని వెతికి హాజరుపరచటం జరిగింది. దైవప్రవక్త(స) అతనిని ఉద్దేశించి, "నీవు పూసుకున్న సువాసనను మూడుసార్లు కడుక్కో. నీ జుబ్బాను విడువు. హజ్జ్‌లో చేసినట్లుగానే ఉమ్రాలో కూడా చెయ్యి (అంటే తవాఫ్, సయీ చెయ్యి)"[1] అని సూచించారు.**

**195) అబ్దుల్లాహ్ బిన్ జైద్ బిన్ ఆసిమ్(రజి)[1] కథనం: హునైన్ యుద్ధ సందర్భంగా అల్లాహ్ తన ప్రవక్తకు ప్రసాదించిన విజయప్రాప్తి (మాలె గనీమత్)ని ఆయన(స) బలహీన విశ్వాసుల మధ్యన పంపిణీ చేశారు (వారంతా మక్కా విజయం తర్వాత ఇస్లామ్ స్వీకరించారు).[2]అందులో నుంచి అన్సార్లకు ఏమీ ఇవ్వ లేదు. దానిపై అన్సార్లు వ్యాకులతకు గురయ్యారు. ఇతరులకు విజయప్రాప్తి ఇవ్వ బడినప్పుడు, దైవప్రవక్త(స) తమకు ఎందుకు ఇవ్వలేదు? అన్నది వారి ఆక్షేపణ... తరువాత దైవప్రవక్త(స) అన్సార్లను ఉద్దేశించి ఉపన్యసించారు : "ఓ అన్సారులారా! మిమ్మల్ని నేను మార్గభ్రష్టులుగా కనుగొన్నాను. పిదప అల్లాహ్ నా ద్వారా మీకు సన్మార్గం ప్రసాదించాడు (ఇది నిజం కాదా?) మీ మధ్య శత్రుత్వం, అనైక్యత ఉండేది. అల్లాహ్ నా ద్వారా మీ మధ్య ప్రేమానురాగాలను సృజించాడు (అవునా!?)[3] మీరు అగత్యపరులుగా ఉండేవారు. అల్లాహ్ నా ద్వారా మిమ్మల్ని**

---

194-1. 'హజ్జ్ ప్రకరణం'లో ఈ హదీసుపై చర్చ జరిగింది. హజ్జతుల్ విదా హదీసు తరువాత ఈ హదీసు రద్దయిందని ఖుస్తులానీ అభిప్రాయపడ్డారు. హజ్రత్ ఆయిషా(ర.అ) ఇహ్రామ్ దీక్షబూనుతున్నప్పుడు, దైవప్రవక్త(స) సువాసనను పూసుకున్నారని ఆ హదీసులో ఉంది. కనుక సువాసన పూసుకోవటం సమ్మతమే.

195-1. ఈయన సుప్రసిద్ధ సహాబీ. బూటకపు ప్రవక్త ముసైలిమా కిజ్జాబ్‌పై చావుదెబ్బ తీసింది ఈయనేనంటారు. హిజ్రీ 63లో యజీద్ సేనల చేతిలో అమరగతినొందారు.

195-2. అప్పుడప్పుడే కొత్తగా ధర్మపరివర్తన చెందినవారి హృదయాలను జయించటానికి ఆయన(స) యుద్ధప్రాప్తి పంపిణీలో వారికి ప్రాధాన్యత ఇచ్చారు. అప్పటికి వారి విశ్వాసం ఇంకా బలపడలేదు. ఈ యుద్ధప్రాప్తిని అధికంగా పొందినవారిలో అబూ సుఫ్యాన్, సుహైల్, హువైతిబ్, హకీమ్ బిన్ అబుస్సనాబిల్, సఫ్వాన్ బిన్ ఉమయ్యా, అబ్దుర్రహ్మాన్ బిన్ యర్బూ ఎన్నదగినవారు.

నిరపేక్షాపరులుగా చేశాడు."- ఆయన(స) పలికే ఒక్కొక్క మాటను అన్సార్లు నిజమని ధ్రువీకరిస్తూ 'మేము దైవానికి, దైవప్రవక్త(స)కు అందరికన్నా ఎక్కువగా రుణపడి ఉన్నామ'ని చెప్పసాగారు. "నేను అడిగే దానికి మీరు సమాధానం చెప్పరేమీ?" అని దైవప్రవక్త(స) రెట్టించగా, 'దైవం మరియు దైవప్రవక్త(స) మాకు చేసిన మేలు చాలా గొప్పది' అని అన్సార్లు బదులిచ్చారు.

తరువాత దైవప్రవక్త(స) ఇలా అన్నారు : "మీరు తలచుకుంటే మరో విధంగా కూడా నాకు సమాధానం ఇచ్చి ఉండేవారు (జనులు మిమ్మల్ని అబద్ధీకరిస్తూ ఉన్న సమయంలో మీరు మా దగ్గరకు వచ్చారు. అప్పుడు మేము మిమ్మల్ని సత్య వంతులని ధ్రువీకరించాము[4] అని కూడా సమాధానం ఇచ్చి ఉండేవారు...). "జనులు ఒంటెల్ని, మేకల్ని తోలుకుని తమ తమ ఇండ్లకు వెళుతుండగా మీరు దైవప్రవక్తను మీ వెంటబెట్టుకుని వెళ్ళటం మీకు ఇష్టకరం కాదా!? ఒకవేళ హిజ్రత్ ప్రాశస్త్యమే గనక లేకుంటే నేను కూడా అన్సార్లలోని ఒక వ్యక్తి అయి ఉండేవాణ్ణి. జనులు ఏ పర్వతలోయగుండా లేక కనుమ గుండా నడిచివెళ్ళినా నేను మాత్రం అన్సార్లు సాగిపోయే కనుమలో, లోయలో నడవటానికే ఇష్టపడతాను. అన్సార్లు శరీరానికి అతుక్కుని ఉండే 'అస్తర్' గుడ్డ వంటివారు.[5] మిగతా ప్రజలు పైకి కని పించే వస్త్రం లాంటివారు. నా తదనంతరం ఇతరులకు అన్సార్లపై ప్రాధాన్యతను ఇవ్వటాన్ని మీరు గమనిస్తారు.[6] కాబట్టి కౌసర్ సరస్సు వద్ద నన్ను కలుసుకునే వరకూ మీరు ఓపిక పట్టండి."[7]

---

195-3. అంటే పరస్పరం శత్రువులుగా ఉన్న ఔస్- ఖజ్రజ్ తెగల మధ్యన ప్రేమానురాగాలు పెంపొందాయి.

195-4. వేరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది: "మీరు గనక కోరితే ఈ విధంగా కూడా అని ఉండేవారు- 'మీ సందేశాన్ని ఎవరూ నిజమని ధ్రువీకరించడానికి సిద్ధంగాలేని సమయంలో మేము మిమ్మల్ని సత్యవంతులని ధ్రువపరిచాము. మీకు సహాయపడే వారెవరూ లేని సమయంలో మేము మీకు సహాయం చేశాము. మీకు ఎక్కడా ఆశ్రయం లభించనప్పుడు మేము మీకు ఆశ్రయం కల్పించాము. ఒకవేళ మీరు అలా అని ఉంటే అది సత్యమే.."

195-5. పలుచటి వస్త్రాలు కుట్టేటప్పుడు శరీర భాగాలు కనిపించకుండా ఉండటానికి లోపల 'అస్తర్' గుడ్డను వేస్తారు. అవి శరీరావయవాలను మరుగుపరుస్తాయి.

195-6. పదవుల నియామకంలో మిమ్మల్ని ఉపేక్షిస్తారు. మీ సేవలను విస్మరించటం జరుగుతుంది.

**196)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) తెలిపారు : హవాజిన్ తెగవారి సొమ్ములలో నుండి అల్లాహ్ తన ప్రవక్తకు (విజయప్రాప్తిగా) ప్రసాదించదలచిన దానిని ప్రసాదించినప్పుడు, అన్సార్లలోని కొంత మంది ఆవేదన చెందారు. ఎందుకంటే దైవప్రవక్త(స) కొంతమందికి నూరేసి ఒంటెల చొప్పున ఇచ్చినప్పుడు, కొంతమంది ఇలా అన్నారు 'అల్లాహ్ తన ప్రవక్తను క్షమించుగాక! ఆయన ఖురైషులకైతే విరివిగా ఇస్తున్నారు. కాని మమ్మల్ని వదిలేశారు. నిజానికి ఇప్పటికీ మా ఖడ్గాల నుంచి వారి రక్తం కారుతూనే ఉంది.'

అనస్ (రజి) ఇలా అన్నారు: అన్సార్లు చెప్పుకుంటున్న ఈ మాటలు దైవ ప్రవక్త(స) వరకూ చేరాయి. ఆయన(స) వారిని పిలిపించి ఒక తోలు గుడారంలో సమావేశపరిచారు. అందరూ ఒకచోట చేరిన మీదట దైవప్రవక్త(స) నిలబడి, "మీరు చెప్పుకుంటున్న మాటలు నా వరకూ చేరాయి. నిజమేనా?" అని అడిగారు. అన్సార్లలోని విజ్ఞులు, 'అయ్యా దైవప్రవక్తా! మాలోని మర్యాదస్తులు, నాయకులెవరూ అలాంటి మాటలు అనలేదు. కాకపోతే మాలోని నవ యువకులు కొందరు అలా చెప్పుకున్నారు. అల్లాహ్ తన ప్రవక్త(స)ను క్షమించుగాక! ఆయన(స) ఖురైషులకు ఇస్తూ ఉన్నారు. కాని మమ్మల్ని వదిలిపెట్టేశారు. చూడబోతే మా ఖడ్గాల నుంచి ఇప్పటికీ వాళ్ళ రక్తం కారుతూనే ఉంది' అని వారు చెప్పినది నిజమే అని విన్నవించుకున్నారు.

అప్పుడు ప్రవక్త మహనీయులు(స) ఇలా అన్నారు: "నేను, ఇప్పుడిప్పుడే ఇస్లామ్‌లోకి ప్రవేశించిన వారికి ఇస్తూ ఉంటాను. ఆ విధంగా వారి హృదయాలకు ఊరట కల్పిస్తాను. ఇతరులు సిరిసంపదలతో తిరిగి వెళ్ళగా, మీరు దైవప్రవక్త(స)ను వెంటబెట్టుకుని మీ ఇండ్లకు వెళ్ళటాన్ని మీరు ఇష్టపడరా? దైవసాక్షిగా! వారు తీసుకెళ్ళే దానికన్నా మీరు మీతోపాటు తీసుకెళ్ళేది మేలైనది." దానికి అన్సార్లు, 'దైవప్రవక్తా! దీనిపట్ల మేము సంతుష్టులమై ఉన్నామ'ని పలికారు. ఆ తరువాత కారుణ్యమూర్తి (సఅసమ్) ఇలా అన్నారు: "నా తదనంతరం మీపై ఇతరులకు ప్రాధాన్యత ఇవ్వటాన్ని మీరు గమనిస్తారు. ఆ సమయంలో మీరు సంయమనం పాటించండి. దైవాన్ని, దైవప్రవక్త(స)ను కలుసుకునేవరకూ మీరు నిగ్రహం

---

195-7. అయినప్పటికీ మీ సమకాలికులైన పరిపాలకులపై తిరుగుబాటు చేయకండి.

**చూపాలి. నేను కౌసర్ సరస్సు వద్ద మిమ్మల్ని కలుసుకుంటాను". అనస్(రజి) ఇలా అన్నారు : 'కాని అన్సార్లు సంయమనం పాటించలేదు'[1]**

**197) మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి) వివరించారు : మక్కా విజయం నాడు ప్రవక్త మహనీయులు(సఅసమ్) విజయప్రాప్తిని పంపిణీ చేసినప్పుడు (కొందరు) అన్సార్లు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఆ సందర్భంగా దైవప్రవక్త (స), "ఇతరులు తమ వెంట ప్రపంచాన్ని తీసుకుపోతుండగా, మీరు మీ వెంట దైవప్రవక్తను తీసుకెళ్ళటం మీకు సంతోషదాయకం కాదా?" అని అడిగారు. దానికి అన్సార్లు, 'ఇది మాకు సంతోషదాయకమే' అని విన్నవించుకున్నారు. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "జనులు ఏదయినా పర్వతలోయ లేదా కనుమ గుండా నడిచిపోతుంటే నేను మాత్రం అన్సార్లు నడిచిపోయే లోయ లేక కనుమ లోనే నడుస్తాను."**

**198) (తన తాతగారైన) హజ్రత్ అనస్(రజి) తమకు తెలియజేశారని హిషామ్ బిన్ జైద్ బిన్ అనస్ తెలియజేశారు: హునైన్ యుద్ధ సందర్భంగా హవాజిన్ తెగవారితో పోరు మొదలైనప్పుడు దైవప్రవక్త(సఅసమ్) వెంట పదివేల మంది సైనికులు ఉన్నారు. వారిలో మక్కా విజయం తర్వాత దైవప్రవక్త(స) ద్వారా 'విడిచిపెట్టబడిన' ఖురైషులు కూడా ఉన్నారు.[1] కాని వారు వెన్ను చూపారు.**

---

196–1. దైవప్రవక్త(సఅసమ్) పరమపదించినప్పుడు, నాయకత్వం విషయంలో పట్టుబట్టిన అన్సార్ సహాబీ సాద్ బిన్ ఉబాదా(రజి)ను దృష్టిలో పెట్టుకుని బహుశా హజ్రత్ అనస్(రజి) అలా అని ఉంటారు. అయితే అన్సార్లలోని అత్యధికులు సాద్ బిన్ ఉబాదా(రజి) అభిప్రాయంతో ఏకీభవించలేదు. వారు ఖురైషులనే ఖలీఫాలుగా అంగీకరించారు.

198–1. ఉల్లేఖనంలో "విడిచిపెట్టబడినవారు" అనే పదం వచ్చింది. ఇక్కడ విడిచిపెట్టబడిన వారు అంటే అర్థం; మక్కా విజయం తర్వాత దైవప్రవక్త(స)చే క్షమాభిక్ష పొందిన ఖురైషులన్నమాట. ప్రవక్త(స) చేసిన సర్వ సామాన్యమైన మన్నింపుల ప్రకటనకు ప్రభావితులై వారు ఇస్లాంలో ప్రవేశించారు. కాని వారిలో ఇంకా విశ్వాసం బలపడ లేదు. హునైన్ యుద్ధ సందర్భంగా వారు వెన్ను చూపి పారిపోవటానికి గల కారణా లలో ఇదీ ఒకటి. అయినప్పటికీ దైవప్రవక్త(స) ఔదార్యం వారిపై వర్షించింది. తత్ఫలి తంగా వారు భవిష్యత్తులో ఇస్లామ్‌కు అండగా నిలిచారు. అలాంటి వారిలో అబూ సుఫ్యాన్, ముఆవియా, హకీమ్ బిన్ హిజామ్ తదితరులు ఉన్నారు.

అప్పుడు దైవప్రవక్త(స), "ఓ అన్సారులారా! అని పిలిచారు. దానికి వారు, 'హాజ రయ్యాము దైవప్రవక్తా! మీ ఆజ్ఞాపాలనకు మేము సిద్ధంగా ఉన్నాము. మేము మీ ఎదుటే హాజరై ఉన్నాము' అని పలికారు. అప్పుడు దైవప్రవక్త(స) తన వాహనం మీది నుంచి దిగి, "నేను దైవ దాసుడను, దైవ సందేశహరుడను" అన్నారు.

ఎట్టకేలకు బహుదైవారాధకులు ఓటమిని చవిచూశారు. మక్కావిజయం తర్వాత దైవప్రవక్త(స) తాను 'విడిచిపెట్టినవారికి', ముహాజిర్లకు విజయప్రాప్తిలో నుంచి ఇచ్చారు. కాని అన్సార్లకు ఏమీ ఇవ్వలేదు. దానిపై అన్సార్లు తమ ఆవేదనను వ్యక్తపరచగా, దైవప్రవక్త(స) వారందరినీ పిలిచి, ఒక గుడారంలో సమావేశపరిచి "ఇతరులు ఒంటెల్ని, మేకలను తమ వెంట తోలుకుపోగా మీరు దైవప్రవక్తను మీ వెంట తీసుకుపోవటంపై మీరు సంతోషంగా లేరా?" అని అడిగారు. ఆయన(స) ఇంకా ఇలా కూడా అన్నారు: "జనులు ఒక కనుమ లేదా లోయలో నడిచిపోతుం డగా, అన్సార్లు వేరే కనుమ లేదా లోయ గుండా నడిస్తే నేను మటుకు అన్సార్ల కనుమలో నడిచిపోవడానికే ఇష్టపడతాను."

**199)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) ఖతాదాతో ఇలా అన్నారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) అన్సార్ వర్గానికి చెందిన కొంతమందిని సమావేశపరచి ప్రసంగిస్తూ ఇలా అన్నారు : "ఖురైషులు ఇప్పుడిప్పుడే అజ్ఞాన యుగం (రక్తపాతం సృష్టించటం, విధ్వంసం చేయటం) నుండి విముక్తి పొందారు. వారికి ఊరట కల్పించటం, వారి హృదయాలను గెలవటం అసలు నా ఉద్దేశం. జనులు ప్రపంచాన్ని తీసుకుని వెళ్ళగా, మీరు దైవప్రవక్త(స)ను మీ వెంట తీసుకుని వెళ్ళటం పట్ల మీరు సంతోషంగా లేరా?" అక్కడ ఉన్న అన్సార్లంతా 'ఎందుకు లేము? (ఇది మాకు సంతోషదాయకమే)' అన్నారు. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: "ఒకవేళ ఇతర జనులు ఏదైనా లోయగుండా సాగిపోతుంటే, నేను మటుకు అన్సార్లు నడిచివెళ్ళే కనుమ గుండా నడచి వెళ్ళడానికే ఇష్టపడతాను."

**200)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు(సఅసమ్) హునైన్ యుద్ధానంతరం విజయప్రాప్తిని పంపిణీ చేస్తుం డగా, అన్సార్లలోని ఒక వ్యక్తి (అతను మునాఫిక్), 'ఈ పంపిణీలో దైవప్రసన్నతను దృష్టిలో ఉంచుకోలేదు' అని వ్యాఖ్యానించాడు. నేను దైవప్రవక్త(స) సన్నిధిలో హాజరై అతని ప్రేలాపనను గురించి తెలియపరిచాను. ఇది విని ఆయన(స) ముఖం రంగు

**మారిపోయింది. "అల్లాహ్ మూసా(అలైహిస్సలామ్)పై దయజూపుగాక! ఆయనకు ఇంతకన్నా ఎక్కువ మనస్తాపం కలిగించటం జరిగింది. అయితే ఆయన ఓర్పు వహించార"ని [1] దైవప్రవక్త(స) చెప్పారు.**

**201) అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) తెలిపారు: హునైన్ యుద్ధ సందర్భంగా ప్రవక్త మహనీయులు(సఅసమ్) కొంతమందికి చాలా ఎక్కువ పశు వుల్ని ప్రదానం చేశారు. అఖ్రా బిన్ హాబిస్ మనసును గెలుచుకునే ఉద్దేశ్యంతో అతనికి నూరు ఒంటెల్ని ఇచ్చారు. ఉయైనా బిన్ హసన్‌కు కూడా అంతే ఇచ్చారు. అలాగే మరి కొంతమంది ప్రముఖులకు కూడా ప్రదానం చేశారు. ఈ పంపిణీని చూసి ఒక వ్యక్తి, 'ఈ పంపకంలో దైవ ప్రసన్నతను లక్ష్యపెట్టుకోలేద'ని చెప్పాడు. (ఇబ్నె మస్ఊద్–రజి ఇలా అన్నారు). ఈ మాటను నేను దైవప్రవక్త(స) వరకూ తప్పక చేరవేస్తానన్నాను. దైవప్రవక్త(స) ఇది విని, "అల్లాహ్ మూసా (అ)ను కరుణించుగాక! ఆయనకు ఇంతకన్నా ఎక్కువే బాధపెట్టడం జరిగింది. కాని ఆయన సహనం వహించారు."[1] అని చెప్పారు.**

**202) హిషామ్ బిన్ జైద్ బిన్ అనస్ బిన్ మాలిక్‌తో మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి) అన్నారు: హునైన్ యుద్ధం జరిగిన రోజు హవాజిన్, గత్ఫాన్ తెగల వారు తమ పశువులను, ఆలుబిడ్డలను తీసుకుని యుద్ధ మైదానానికి బయలు దేరారు. ఆ సమయంలో ప్రవక్త మహనీయుల(సఅసమ్) వెంట పదివేల మంది**

---

200–1. హజ్రత్ మూసా(అ)ది బిడియపడే స్వభావం. ఆయన అందరి నుండీ కనుమరుగై ఒంటరిగా స్నానం చేసేవారు. అంతే, ఆయనలో లోపాలు ఎంచాలన్న బుద్ధి పుట్టింది ఇస్రాయీల్ సంతతి వారికి. ఆయనకు వరిబీజం ఉందని ఒకడంటే, ఆయనకు బొల్లి వ్యాధి ఉందని మరొకడు అనేవాడు. ఈ రకమయిన అపవాదులకు ఆయన అతీతు లని తేల్చాలని దేవుడు నిర్ణయించాడు. చివరకు ఆయన ఏ లోపం లేని వారని తేల్చాడు. అల్ అహ్‌జాబ్ సూరాలోని 69వ ఆయత్ ఈ సందర్భంగా గమనార్హం.

దైవప్రవక్త(స) గురించి వ్యర్థ ప్రేలాపనకు పాల్పడేముందు ఆ కపట విశ్వాసి ఒకటికి పదిసార్లు ఆలోచించవలసింది. దైవప్రసన్నతను దైవప్రవక్త(స) దృష్టిలో పెట్టుకోకపోతే మరెవరు పెట్టుకుంటారు? తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు.

201–1 'సహనం' కూడా విచిత్రమయిన అనుగ్రహ భాగ్యమే. అది దైవప్రవక్తల లక్షణం. సహనం, నిగ్రహం వహించినవాడు సఫలీకృతుడయ్యాడు. చివరకు సహనమూర్తి శత్రువే పరాభవం పాలయ్యాడు.

సైనికులు ఉన్నారు. వారిలో మక్కా విజయం సందర్భంగా దైవప్రవక్త(స) మేలు చేసి (క్షమించి) వదలిపెట్టినవారు కూడా ఉన్నారు. మరి వారంతా యుద్ధరంగంలో వెన్ను చూపి పారిపోయారు. దైవప్రవక్త(స) ఒంటరిగా మిగిలారు. ఆ రోజు దైవప్రవక్త(స) రెండుసార్లు పిలుపు ఇచ్చారు. రెండు పిలుపులూ ఒండొక దానికి భిన్నంగా ఉన్నాయి. ఆయన(స) కుడి వైపునకు తిరిగి, "ఓ అన్సార్ వర్గీయులారా!" అని పిలిచారు. దానికి వారు, 'దైవప్రవక్తా! మేము హాజరయ్యాము, మీకు శుభం. మేము మీతోనే ఉన్నాము. పోరాడటానికి సిద్ధంగా ఉన్నాము' అని పలికారు. తరువాత ఆయన(స) ఎడమ వైపునకు తిరిగి, "ఓ అన్సారులారా!" అని కేకేశారు. దానికి వారు, 'మేము హాజరయ్యాము దైవప్రవక్తా! మీకు శుభవార్త. మేము మీ వెంటే ఉన్నామ'ని బదులిచ్చారు.

ఆ సమయంలో దైవప్రవక్త(స) ఒక తెల్లని కంచెర గాడిదపై స్వారీ అయి ఉన్నారు. ఆయన(స) వాహనం మీద నుండి దిగి, "నేను దైవదాసుడను, దైవ సందేశహరుడను' అని పలికారు. చివరకు అవిశ్వాసులు ఓటమి పాలయ్యారు. ఆ యుద్ధంలో భారీ ఎత్తున విజయప్రాప్తి (మాలె గనీమత్) లభించింది. దానిని ఆయన(స) ముహాజిర్ల, ఖురైషుల మధ్యన పంపిణీ చేశారు. ఆ విజయప్రాప్తి నుండి అన్సార్లకు ఏమీ ఇవ్వలేదు. దానిపై అన్సార్లలోని కొంతమంది నవ యువకులు (కినుక వహించి), 'క్లిష్ట సమయంలో మేము పిలువబడతాము. విజయ ధనం మాత్రం ఇతరులకు ఇవ్వబడుతుంది' అన్నారు.

ఈ మాట దైవప్రవక్త(స) వరకూ చేరింది. ఆయన(స) అన్సార్లను ఒక గుడారంలో సమావేశపరచి, "ఓ అన్సార్ వర్గీయులారా! మీ గురించి నేను విన్న మాట నిజమేనా?" అని అడిగారు. దానికి వారు మౌనం వహించారు. అప్పుడు దైవప్రవక్త(స) "ఓ అన్సార్ వర్గీయులారా! ప్రజలు తమ వెంట ప్రపంచాన్ని తీసుకుపోతూ ఉండగా, మీరు దైవప్రవక్త(స)ను మీ వెంట తీసుకుపోవటంపై మీరు సంతోషంగా లేరా?" అని అడిగితే, 'మేము దీనిపై సంతుష్టులమై ఉన్నామ'ని వారు చెప్పారు. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "ఒకవేళ జనులు ఒక లోయ గుండా నడిచి వెళుతుండగా, అన్సార్లు మరో లోయ గుండా నడిచి వెళుతుంటే నేను మాత్రం అన్సార్ల లోయ మీదుగానే నడచి వెళ్ళడానికి ఇష్టపడతాను"[1] దానిపై

202-1. 'ముస్లిం'లో పొందుపరచబడిన ఉల్లేఖనం ప్రకారం ఆయన(స) హజ్రత్ అబ్బాస్ (రజి)కు, "రిజ్వాన్ వృక్షం క్రింద విధేయతా ప్రమాణం చేసిన వారిని పిలవండి"

**హిషామ్, 'ఓ అబూ హమ్జా (తాతగారూ!) ఆ సమయంలో తమరు అక్కడ ఉన్నారా?' అని అడిగితే, 'నేను దైవప్రవక్త(స)ను ఎప్పుడు విడిచి ఉన్నానని?' అని అనస్(రజి) బదులిచ్చారు.**

## అధ్యాయం : 58

# నజ్ద్ వైపునకు[1] దైవప్రవక్త(స) పంపిన సైనిక దళం గురించి

**203) అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) నజ్ద్ వైపునకు ఒక సైనిక దళాన్ని పంపారు. ఆ దళంలో నేనూ ఉన్నాను. (విజయప్రాప్తిగా) మా వాటా క్రింద ఒక్కొక్కరికి పన్నెండు ఒంటెల చొప్పున వచ్చాయి. అదనంగా కానుకగా ఒక్కొక్కరికి మరో ఒంటె చొప్పున కూడా లభించింది. ఈ విధంగా మాలో ప్రతి ఒక్కరూ పదమూడు ఒంటెల చొప్పున తీసుకుని వాపసు అయ్యారు.**

## అధ్యాయం : 59

# దైవప్రవక్త(స) ఖాలిద్ బిన్ వలీద్(రజి)ను బనీ జజీమా తెగ వైపునకు పంపటం[1]

**204) అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఖాలిద్ బిన్ వలీద్(రజి)ను బనీ జజీమా తెగవారి వైపునకు పంపారు. ఖాలిద్ బిన్ వలీద్(రజి) ఆ తెగవారికి ఇస్లామ్ సందేశం అందజేశారు. అయితే**

---

అన్నారు. దానికి అబ్బాస్, 'ఓ రిజ్వాన్ వృక్షం వారలారా! మీరంతా ఎక్కడికెళ్ళారు?' అని పిలిచేసరికి తల్లులు తమ పిల్లల వైపు వాత్సల్యంతో పరుగెత్తినట్లే వారు పరుగెత్తుకుని వచ్చారు. 'మేము హాజరయ్యాము, మేము హాజరయ్యాము' అని పలికారు.

58–1. ఇమామ్ బుఖారీ (రహ్మ) దీనిని తాయఫ్ యుద్ధం తర్వాత ప్రస్తావించారు. కాని యుద్ధాల గురించి వ్రాసిన చరిత్రకారులు మాత్రం, ఈ సైనిక దళాన్ని మక్కా విజయానికి మాత్రమే దైవప్రవక్త(స) పంపినట్లుగా పేర్కొన్నారు. ఇబ్నె సాద్ ఇలా అన్నారు: "ఇది హిజ్రీ 8వ సంవత్సరం షాబాన్ మాసంలో జరిగిన సంఘటన.

59–1. మక్కా విజయం తర్వాత జరిగిన సంఘటన ఇది. దైవప్రవక్త(స) 350 మందిని ఖాలిద్ బిన్ వలీద్(రజి) సారథ్యంలో ఈ తెగవారి వద్దకు పంపారు. ఇది యుద్ధం కొరకు పంపిన పయన బృందం కాదు, బనీ జజీమాకు ఇస్లామ్ సందేశం అందజేయడానికి వారు పంపబడ్డారు.

వారికి 'అస్లమ్నా' (మేము ఇస్లామ్ స్వీకరించాము) అని పలకటం రాదు. దానికి బదులు వారు 'సబానా' (మేము మా పూర్వీకుల ధర్మం నుండి తొలగిపోయాము) అని పలికారు.

అంతే, ఖాలిద్ వారిని హతమార్చటం, ఖైదీలుగా పట్టుకోవటం మొదలెట్టారు. తరువాత మాలో ప్రతి ఒక్కరికీ ఖైదీలను నిర్బంధించి ఉంచేందుకు ఆదేశించారు. తరువాత మా కస్టడీలో ఉన్న ఖైదీలందరినీ సంహరించమని ఖాలిద్ బిన్ వలీద్(రజి) ఆజ్ఞాపించారు: "దైవసాక్షిగా! నా అదుపులో ఉన్న ఖైదీని నేను సంహరించను. అంతేకాదు, నా సహచరులలోని ఏ ఒక్కరు కూడా ఈ ఆజ్ఞను శిరసావహించరు" అని నేను నిర్ద్వంద్వంగా చెప్పేశాను. మేము తిరిగి వచ్చిన తరువాత జరిగినదంతా దైవప్రవక్త(స)కు నివేదించుకున్నాము. ఆయన(స) తన రెండు చేతులెత్తి "అల్లాహ్! ఖాలిద్ ద్వారా జరిగిన ఈ చేష్టతో నాకెట్టి సంబంధం లేదని ప్రకటిస్తున్నాను"[1] అని మొరపెట్టుకున్నారు.

### అధ్యాయం : 60

## అబ్దుల్లాహ్ బిన్ హుజాఫా సహ్మీ (రజి), అల్ఖమా బిన్ ముజర్రజ్ ముద్లిజీ (రజి)ల వెంట ఒక సైనిక దళాన్ని పంపటం గురించి. దీనినే 'సరియ్యా అన్సార్' అని కూడా అంటారు.

**205)** మహనీయ అలీ (రజి) వివరించారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఒక చిన్న సైనిక దళాన్ని పంపుతూ ఒక అన్సార్ సహాబీ(అబ్దుల్లాహ్ బిన్ హుజాఫా సహ్మీ-రజి)ని ఆ దళానికి అమీర్(అధిపతి)గా నియమించారు. అందరూ తమ అమీర్కి విధేయత చూపాలని సైనికులను ఆదేశించారు. తరువాత

204-1. మరి చూడబోతే ఖాలిద్ బిన్ వలీద్(రజి) ఆ పయన బృందానికి నాయకుడు (అమీర్). అయినప్పటికీ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తమ నాయకుని ఆజ్ఞను శిరసావహించ లేదు. ఎందుకంటే ఆ ఆజ్ఞ షరీఅత్కు విరుద్ధమైనది. బనీ జజీమా ప్రజలు 'సబానా' అని పలకటంలోని అంతరార్థం 'నిరాకరణ' కాదు. 'మేము విధేయత కనబరిచాము' అని వారు చెప్పదలిచారు. అలాంటి పరిస్థితిలో ఖాలిద్ బిన్ వలీద్ నిగ్రహం పాటించా ల్సింది. అందుకే దైవప్రవక్త(స) ఈ చేష్టతో తనకెట్టి సంబంధం లేదని ప్రకటించారు. అయినా ఖాలిద్ను శిక్షించలేదు. ఎందుకంటే ఖాలిద్ వల్ల జరిగిన ఈ చర్య 'ఇజ్తెహాదీ ఖతా' (షరీఅత్ అన్వయింపులో జరిగిన పొరపాటు) క్రిందికి వస్తుంది.

ఏదో ఒక విషయంపై అమీర్‌కు కోపం వచ్చి 'మీరంతా నాకు విధేయత చూపాలని దైవప్రవక్త(స) ఆజ్ఞాపించలేదా?' అని అడిగారు. దానికి వారంతా ముక్తకంఠంతో 'అవును, ఆజ్ఞాపించార'ని చెప్పారు. 'అలాగయితే అందరూ కలసి కట్టెల్ని పోగు చేయండి' అన్నారు ఆ అమీర్. అందరూ కలసి కట్టెల్ని పోగు చేశాక, 'ఆ కట్టెలకు నిప్పు అంటించండి' అని ఆదేశించారు అమీర్. అమీర్ ఆజ్ఞానుసారం వారు నిప్పు అంటించారు. ఆ కట్టెలు మండిన తరువాత, 'అందరూ ఆ అగ్నిలో దూకండి' అని ఆ సైన్యాధిపతి ఆజ్ఞ జారీ చేశారు. సైనికులు అంత పనీ చేసేవారే. కాని వారిలోని కొంతమంది మరి కొందరిని అడ్డుకుంటూ, 'అయ్యో! ఈ అగ్ని యాతనకు భయపడే కదా మనం దైవప్రవక్త(స) మార్గాన నడిచేది!' అన్నారు. ఈ విధంగా ఆ వ్యవహారంపై తర్జనభర్జన జరుగుతుండగానే కొంత సమయం గడిచి అగ్ని కూడా చల్లారిపోయింది. ఆ తరువాత సైన్యాధిపతి కోపావేశం కూడా చల్లారింది. చివరకు ఈ సమాచారం దైవప్రవక్త(స)కు చేరినప్పుడు, "ఒకవేళ వారు గనక అందులో దూకి ఉంటే ప్రళయదినం వరకూ అందులోనుంచి బయటపడేవారు కారు. విధేయత చూపాలన్న ఆజ్ఞ కేవలం సత్కార్యాలకే వర్తిస్తుంది సుమా!"[1] అని చెప్పారు.

### అధ్యాయం : 61

## వీడ్కోలు హజ్జ్‌కు ముందు దైవప్రవక్త(స) అబూ మూసా అష్అరీ(రజి)ని, ముఆజ్ బిన్ జబల్(రజి)ను యమన్‌కు పంపటం

**206)** హజ్రత్ అబూ బుర్దా (రజి) తెలిపారు: ప్రవక్త మహోదయులు (సఅసమ్) అబూ మూసా అష్అరీ, ముఆజ్ బిన్ జబల్ (రజిఅల్లాహు అన్హుమా) లను యమన్ అధికారులుగా నియమించి పంపారు. ఆ ఇద్దరు సహచర మాన్యులను ఒక్కో రాష్ట్రానికి గవర్నర్లుగా చేశారు. ఉల్లేఖకుడు ఇలా అంటున్నారు- యమన్‌లో రెండు రాష్ట్రాలుండేవి. దైవప్రవక్త(స) ఆ ఇద్దరు అధికారులనుద్దేశించి, "చూడండి, ప్రజల కొరకు సౌలభ్యాలను సమకూర్చండి. ఇబ్బందుల్లో పడవేయ కండి. వారిని సంతోషపరచేందుకు కృషి చేస్తూ ఉండండి. ధర్మం (దీన్) పట్ల

---

205-1. ఇమామ్ అయినా, అమీర్ అయినా, ఖలీఫా అయినా పీర్ ముర్షిద్ అయినా- కేవలం ఖుర్ఆన్ హదీసుల పరిధిలోనే వారికి విధేయత చూపాలి. వారు గనక ధర్మ విరుద్ధమైన పని చేయమని ఆజ్ఞాపిస్తే, దానిని శిరసావహించనవసరం లేదు.

వైషమ్యాన్ని జనింపజెయ్యకండి" అని బోధించారు. ఆ మహనీయులిరువురూ తమ తమ గురుతర బాధ్యతలను నిర్వర్తించడానికి బయలుదేరారు. ఆ ఇరువురిలో ఏ ఒక్కరు తమ తమ రాష్ట్ర పరిధిలో పర్యటించినా, తమకు సమీపంలో ఉన్న తమ తోటి అధికారిని కలుసుకోవటానికి వచ్చి సలామ్ చేసేవారు.

ఒకసారి ముఆజ్ బిన్ జబల్(రజి) తన రాష్ట్ర సరిహద్దుల వరకూ వెళ్ళి, దగ్గరలోనే ఉన్న అబూ మూసా అష్అరీ (రజి)ని కలుసుకోవటానికి, తన కంచెర గాడిదపై స్వారీ అయి వెళ్ళారు. తీరా అక్కడకు వెళ్ళి చూస్తే, ఆయన కూర్చుని ఉన్నారు. ఆయన దగ్గర కొంతమంది జనులు గుమిగూడి ఉన్నారు. ఆయన ఎదుట ఒక వ్యక్తి చేతులను అతని మెడ వరకు బిగించి కట్టారు. ముఆజ్ ఆయన్ని ఉద్దే శించి, 'ఓ అబ్దుల్లాహ్ బిన్ ఖైస్! ఏమిటిది?' అని అడిగారు. దానికి అబూ మూసా, 'ఈ వ్యక్తి ఇస్లామ్ స్వీకరించిన మీదట ధర్మభ్రష్టుడు (ముర్తద్) అయిపోయాడు' అని చెప్పారు. 'అలాగా! మరి ఇతన్ని వధించేవరకూ నేను నా వాహనం మీది నుంచి దిగను' అన్నారు ముఆజ్. 'వధించడానికే ఇతన్ని ఇక్కడకు రప్పించటం జరిగింది. కాబట్టి మీరు వాహనం పైనుండి దిగండి' అన్నారు అబూ మూసా అష్అరీ(రజి). కాని ఆయన మాత్రం వాహనం నుండి దిగలేదు. అతన్ని హత మార్చే వరకూ దిగేది లేదని స్పష్టంగా చెప్పేశారు. చివరకు అబూ మూసా అష్అరీ (రజి) ఆజ్ఞపై ఆ ధర్మభ్రష్టునికి మరణ దండన విధించటం జరిగింది. అప్పుడు ఆయన(రజి) తన వాహనం మీది నుండి దిగివచ్చారు.[1]

ఆ సందర్భంగానే ఆయన, 'ఓ అబ్దుల్లాహ్! మీరు ఖుర్ఆన్‌ను ఎప్పుడెప్పుడు, ఎలా పారాయణం చేస్తూ ఉంటారు?' అని అడిగారు. దానికి ఆయన(రజి), 'నేను కొద్దికొద్దిగా అన్ని వేళల్లో పఠిస్తూ ఉంటాన'ని చెప్పారు. తరువాత ముఆజ్(రజి)తో, 'ఓ ముఆజ్! మీరు ఖుర్ఆన్‌ను ఎలా పఠిస్తారు?' అని ప్రశ్నించగా, 'నేను రాత్రి మొదటి భాగంలో నిద్రిస్తాను. కొంతవరకు నిద్రించిన మీదట లేచి అల్లాహ్ నా పేర రాసిపెట్టినంత భాగం ఖుర్ఆన్ పారాయణం చేస్తాను. ఆ విధంగా మేల్కొని ఉన్న సమయంలో అల్లాహ్ నుండి ఆశించే పుణ్యాన్నే నిద్రావస్థలో ఉన్నప్పుడు కూడా ఆశిస్తాను' అని సమాధానమిచ్చారాయన.

---

206-1. హజ్రత్ ముఆజ్ బిన్ జబల్(రజి)లోని 'విశ్వాసం' (ఈమాన్) ఆయన చేత అలా పలికించింది. ఎందుకంటే ధర్మభ్రష్టుణ్ణి చూడగానే ఆయనకు దైవప్రవక్త(స) హదీసు జ్ఞాపకం వచ్చింది. "ఇస్లామ్ స్వీకరించిన మీదట ముర్తద్ అయిపోయిన వ్యక్తిని వధించమని" దైవప్రవక్త(స) చెప్పారు. షరీఅత్ ప్రకారం ధర్మభ్రష్టునికి దండన

**207)** సయీద్ బిన్ అబీ బుర్దా తన తండ్రి నుండి, ఆయన తన తండ్రి అబూ మూసా అష్అరీ (రజి) నుండి ఉటంకించిన దాని ప్రకారం ప్రవక్త మహా దయులు (సఅసమ్) ఆయన్ని (అబూ మూసాను) యమన్‌కు పంపించారు. ఆ సందర్భంగా అబూ మూసా(రజి) యమన్‌లో తయారయ్యే పానీయాల గురించి దైవప్రవక్త(స) సమక్షంలో సందేహం వ్యక్తం చేశారు. "ఇంతకీ ఆ పానీయాలేవి?" అని దైవప్రవక్త(స) దర్యాప్తు చేయగా, అవి 'బిత్అ', 'మిజ్ర్' అని అబూ మూసా చెప్పారు. 'బిత్అ' అంటే ఏమిటి? అని నేను (సయీద్ బిన్ అబూ బుర్దా) (నా తండ్రి) అబూ బుర్దాను అడిగితే, 'తేనెతో తయారు చేసిన మద్యాన్ని బిత్అ అంటారు. మిజ్ర్ యవలతో తయారు చేయబడుతుంది' అని ఆయన వివరించారు- "మత్తు నిచ్చే ప్రతి వస్తువు నిషిద్ధమే" అని దైవప్రవక్త(స) సెలవిచ్చారు.

**208)** సయీద్ బిన్ అబీ బుర్దా తన తండ్రి నుండి ఉటంకించిన దాని ప్రకారం ప్రవక్త మహనీయులు(సఅసమ్), తన తాతగారైన అబూ మూసా అష్అరీ (రజి)ని, ముఆజ్ బిన్ జబల్(రజి)ను యమన్ అధికారులుగా నియమించి పంపారు. ఆ సందర్భంగా ఆయన(స) ఇలా ఉపదేశించారు : "ప్రజలకు సౌలభ్యాలను సమకూర్చండి. వారిని కష్టాలపాలు చెయ్యకండి. ప్రజలకు శుభవార్తలను వినిపిస్తూ ఉండండి. ధర్మం (దీన్) పట్ల వైషమ్యం కలిగించకండి. మీరిద్దరూ పరస్పరం సహకార భావంతో మెలగండి." అప్పుడు అబూ మూసా అష్అరీ(రజి) ఇలా విన్నవించుకున్నారు : 'దైవప్రవక్తా! మా దేశంలో (యమన్‌లో) యవలతో మద్యం తయారు చేయబడుతుంది. అది 'మిజ్ర్'గా పిలువబడుతుంది. దానికి దైవప్రవక్త(స) "మత్తుగొలిపే ప్రతి వస్తువూ నిషిద్ధమే" అని స్పష్టం చేశారు. తరువాత వారిద్దరూ ప్రయాణమయ్యారు. ఆ సందర్భంగానే ముఆజ్ అబూ మూసాతో, 'మీరు ఖుర్ఆన్ ఏ విధంగా పారాయణం చేస్తుంటారు?' అని అడగ్గా, 'నిలబడి, కూర్చుని

---

విధించనంతవరకూ అబూ మూసా అష్అరీ (రజి) దగ్గర కూర్చోవటం సమంజసం కాదని తలపోశారు ముఆజ్.

యమన్‌లోని ఎగువ ప్రాంతానికి ముఆజ్ అధికారిగా నియమించబడ్డారు. దిగువ ప్రాంతానికి అబూ మూసా అష్అరీ అధికారిగా ఉండేవారు. దైవప్రవక్త(స) యమన్ ప్రాంతాన్ని ఎంతో ప్రశంసించారు. దాని శుభం వల్ల ఆ ప్రాంతంలో గొప్ప విద్వాంసులు జన్మించారు. హదీసులకు వ్యాఖ్యానంగా "నైలుల్ అవ్‌తార్" గ్రంథాన్ని రచించిన అల్లామా షౌకానీ (రహ్మ) యమన్ దేశస్థులే.

కూడా పఠిస్తూ ఉంటాను. నా వాహనం మీద స్వారీ అయి ఉన్నప్పుడు కూడా కొంత వ్యవధితో పారాయణం చేస్తుంటాను' అని చెప్పారు. అప్పుడు ముఆజ్(రజి) ఇలా అన్నారు : 'కాని నా విధానం మరోలా ఉంది. నేను రాత్రి తొలి భాగంలో నిద్రిస్తాను. తరువాత లేచి జాగారం చేస్తాను. (ఆరాధనలో నిమగ్నుణ్ణి అవుతాను). ఆ విధంగా మేల్కొని ఉన్న స్థితిలో లభించే పుణ్యాన్నే నిద్రావస్థలో కూడా ఆశిస్తాను'. వారు ఒక గుడారం వేసుకున్నారు. వారిద్దరూ పరస్పరం సమావేశమవుతుండే వారు. ఒకసారి ముఆజ్ అబూ మూసాను కలుసుకోవడానికి వచ్చినప్పుడు, ఒక వ్యక్తి బంధించబడి ఉండటం గమనించాను. 'ఇతని సంగతేమిటి?' అని ముఆజ్ అడిగారు. దానికి అబూ మూసా 'ఇతనొక యూదుడు. స్వయంగా ఇస్లామ్ స్వీకరించాడు. కాని ఇప్పుడితను ధర్మభ్రష్టుడు (ముర్తద్) అయిపోయాడ'న్నారు. దానికి ముఆజ్(రజి), 'నేనతన్ని హతమార్చకుండా ఉండలేన'న్నారు.

**209)** హజ్రత్ అబూ మూసా అష్‌అరీ(రజి) తెలిపారు : దైవప్రవక్త(స) నన్ను నా జాతి వారిలోనికి (యమన్‌కు) పంపారు. నేను అక్కడి నుండి తిరిగి వచ్చినప్పుడు దైవప్రవక్త(స) అబ్‌తహ్ లోయలో (మక్కాలో) విడిది చేసి ఉన్నారు. ఆయన(స) నన్నుద్దేశించి, 'అబ్దుల్లాహ్ బిన్ ఖైస్! నీవు హజ్జ్ కొరకు ఇహ్రామ్ కట్టుకున్నావా?" అని అడిగారు. దానికి నేను, 'అవును దైవప్రవక్తా!' అని చెప్పాను. "ఇహ్రామ్ కట్టుకున్నప్పుడు ఏమని పలికావు?" అని ఆయన ప్రశ్నించగా, 'దేవా! నేను హాజరయ్యాను అనే వచనాన్ని పలికాన'ని సమాధానమిచ్చాను. మీరు ఏ విధంగా ఇహ్రామ్ కట్టుకున్నారో అదే విధంగా నేను కూడా ఇహ్రామ్ కట్టుకున్నానని కూడా చెప్పాను. "నీవు నీ వెంట ఖుర్బానీ పశువును కూడా తెచ్చుకున్నావా?" అని ఆయన(స) తిరిగి అడిగితే, 'నేను నా వెంట ఏ ఖుర్బానీ పశువును కూడా తేలేద'ని అన్నాను. "అలాగైతే నీవు మొదట దైవగృహం (కాబా) ప్రదక్షిణ చెయ్యి. సఫా– మర్వాల మధ్యన సయీ చెయ్యి. ఈ క్రియలను ఆచరించిన మీదట ఇహ్రామ్ ఆంక్షల నుండి విముక్తి నొందు (హలాల్ అయిపో)" అని దైవప్రవక్త(స) సూచించారు. నేను అలాగే చేశాను. బనూ ఖైస్ తెగకు చెందిన మహిళ నా తల దువ్వింది. హజ్రత్ ఉమర్(రజి) ఖలీఫా అయ్యేవరకు మేము ఈ నియమం ప్రకారమే ఆచరించాము (దీనినే హజ్జె తమత్తు అంటారు. ఇది కూడా సున్నతే).

**210)** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) వివరించారు : ప్రవక్త మహోదయులు (సఅసమ్) ముఆజ్ బిన్ జబల్(రజి)ను యమన్ ప్రాంతానికి అధికారిగా

నియమించి పంపేటప్పుడు ఈ విధంగా హితబోధ చేశారు: "నీవు గ్రంథం కల ప్రజలైన యూదు, క్రైస్తవ జాతుల వైపునకు పంపబడుతున్నావు. నీవు వారి వద్దకు చేరుకున్నప్పుడు 'అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేదు, ముహమ్మద్(స) అల్లాహ్ సందేశహరుడు' అన్న వచనానికి సాక్ష్యం పలకాలని వారికి పిలుపునివ్వు. వారు గనక నీవు ఇచ్చిన ఈ పిలుపును అంగీకరిస్తే అల్లాహ్ ప్రతి రోజూ వారిపై అయిదు వేళల నమాజ్‌ను విధించాడ'ని వారికి చెప్పు. ఒకవేళ వారు దీనికి కూడా ఒప్పుకుంటే అల్లాహ్ వారిపై జకాత్‌ను కూడా విధించాడని, అది వారి ధనవంతుల నుండి స్వీకరించి వారిలోని నిరుపేదల్లోనే పంపిణీ చేయబడుతుందని కూడా వారికి తెలియపరచు. వారు ఈ విషయాన్ని కూడా ఒప్పుకున్నట్లయితే (జకాత్ వసూళ్ళ సమయంలో) వారి నాణ్యమైన వస్తువుల్ని తీసుకునే పద్ధతిని విడనాడండి. బాధితుని ఆక్రందనకు ఎల్లవేళలా భయపడుతూ ఉండండి. ఎందుకంటే బాధితుని ఆక్రంద నకూ– అల్లాహ్‌కు మధ్యన ఎలాంటి అడ్డూ ఉండదు".

**211)** హజ్రత్ ముఆజ్(రజి) కథనం : ఆయన యమన్ చేరుకున్నప్పుడు ఫజ్ర్ నమాజ్ చేయించారు. ఆయన అన్ నిసా సూరా పారాయణం చేస్తూ "*వత్తఖజ ల్లాహు ఇబ్రాహీమ ఖలీలా (ఇబ్రాహీమ్‌ను అల్లాహ్ తన మిత్రునిగా చేసుకున్నాడు)*" అనే ఆయత్‌ను పఠించినప్పుడు, వారిలోని ఒక వ్యక్తి (నమాజులో నిలబడి ఉన్న స్థితిలోనే) 'ఇబ్రాహీమ్ తల్లి కన్నులకు చలువ ప్రాప్తమై ఉంటుంది'[1] అని చెప్పేశాడు.

### అధ్యాయం : 62

## వీడ్కోలు హజ్జ్‌కు ముందు అలీ బిన్ అబీ తాలిబ్(రజి)ను, ఖాలిద్ బిన్ వలీద్(రజి)ను యమన్‌కు పంపించటం

**212)** అబూ ఇస్‌హాఖ్ ఇలా అన్నారు: "నేను బరా బిన్ ఆజిబ్(రజి) చెప్పగా విన్నాను. ఆయన ఏమనే వారంటే– ప్రవక్త మహనీయులు(సఅసమ్) మమ్మల్ని ఖాలిద్ బిన్ వలీద్(రజి)తోపాటు యమన్‌కు పంపారు. తరువాత ఖాలిద్ స్థానంలో హజ్రత్ అలీ(రజి)ని నియమిస్తూ ఇలా హితవు పలికారు: ఖాలిద్‌తో కలిసి వెళ్ళినవారు గనక కోరుకున్నట్లయితే నీతో కలిసి మళ్ళీ యమన్‌కు తిరిగి వెళ్ళవచ్చని

211–1. అంటే తన కుమారుడు అల్లాహ్‌కు ప్రియ నేస్తం అయినందుకు ఆయన తల్లికి అమితా నందం కలిగి ఉంటుంది. ఆ వ్యక్తి తెలియక నమాజులో మాట్లాడాడు. తెలియకుండా ఇలాంటి పొరపాటు చేయటం వల్ల నమాజ్ భగ్నం అవదు.

**చెప్పండి. లేదంటే వారు తిరిగి రావచ్చు. బరా(రజి) ఇలా అన్నారు : నేను మాత్రం అలీ(రజి) వెంట మళ్ళీ యమన్‌కు వెళ్ళినవారిలో ఒకణ్ణి. నాకు అనేక ఊఖియాలు (వెండి రూపంలో) యుద్ధప్రాప్తిగా లభించాయి.**

**213) అబ్దుల్లాహ్ బిన్ బురైదాకు ఆయన తండ్రి (బురైదా బిన్ హసీబ్-రజి) ఇలా వివరించి చెప్పారు: ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఖాలిద్ బిన్ వలీద్(రజి) స్థానంలో అలీ (రజి)ని పంపించారు - విజయప్రాప్తిలోని అయిదవ భాగాన్ని (ఖుముస్‌ను) తీసుకురావటానికి. నాకు అలీ(రజి) పట్ల విరోధ భావం కలిగింది. నేనాయన్ని స్నానం (గుసుల్) చేస్తుండగా చూశాను. నేను ఖాలిద్(రజి)తో "అలీ ఏం చేస్తున్నారో మీరు చూడటం లేదా? (ఆయన ఒక బానిస స్త్రీతో సమాగమం జరిపారు)" అన్నాను.**

**తరువాత మేము దైవప్రవక్త(స) సన్నిధికి చేరుకున్నప్పుడు, ఆయన(స) ముందు ఈ విషయాన్ని కూడా ప్రస్తావించాము. "బురైదా! నీకు అలీ పట్ల శత్రుత్వం ఉందా?" అని అడిగారు దైవప్రవక్త(స). దానికి నేను 'అవున'న్నాను. అప్పుడాయన (స) ఇలా ఉపదేశించారు : "అలీని శత్రువుగా చూడకు. ఎందుకంటే 'ఖుముస్' (అయిదవ భాగం)లో అతనికి ఇంతకన్నా ఎక్కువ హక్కు ఉంది."[1]**

**214) అబూ సయీద్ ఖుద్రీ (రజి) చెప్పగా తాను విన్నానని అబ్దుర్రహ్మాన్ బిన్ అబూ నుఅయిమ్ వివరించారు- అబూ సయీద్ ఖుద్రీ (జి) ఇలా చెప్పారు.**

---

213-1. ఇంతకీ అసలేం జరిగిందంటే హజ్రత్ అలీ(రజి) 'ఖుముస్'లో భాగంగా వచ్చిన ఒక బానిస స్త్రీ (ఆమె అందగత్తె కూడా)తో సమాగమం జరిపారు. ఈ సంగతి తెలిసిన బురైదాకు అలీ(రజి)పై అనుమానం వచ్చింది. ఆయన అమానతులో ఖియానత్ చేశారని (ద్రోహానికి పాల్పడ్డారని) అనుమానించారు. కాని వాస్తవానికి అది 'ఖియానత్' కాదు. ఎందుకంటే విజయప్రాప్తి అయిదవ భాగం (ఖుముస్) అల్లాహ్, ఆయన ప్రవక్తకు చెందినది. దానికి అలీ (రజి) హక్కుదారులు. బహుశా అలీ(రజి)కి దైవప్రవక్త(స) పంపిణీ అధికారం కూడా ఇచ్చి ఉంటారు.

తన యాజమాన్యంలోకి వచ్చిన ఆ బానిస స్త్రీ బహుశా కన్య అయి వుంటుంది. లేదా ఆమె బహిష్టు అనంతరం ఆ రోజే పరిశుద్ధత నొంది ఉంటుంది. అందువల్ల ఇస్తెబ్రా ప్రసక్తి ఇక్కడ వచ్చి ఉండకపోవచ్చు.

విషయం తేటతెల్లమైన తర్వాత తాను అలీ(రజి)ని అందరికన్నా ఎక్కువగా ప్రేమించసాగానని బురైదా చెప్పారు.

అలీ బిన్ అబీ తాలిబ్ (రజి) యమన్ ప్రదేశం నుండి, శుద్ధిచేయబడిన ఒక తోలు సంచిలో కొన్ని బంగారు ముక్కలను దైవప్రవక్త(స) వద్దకు పంపించారు. అది పూర్తిగా ముడి బంగారం. ఆ బంగారం ముక్కలకు అంటుకుని ఉన్న గనిలోని మట్టి కూడా ఇంకా తొలగించలేదు. ఉల్లేఖకుడు ఇలా అన్నారు- దైవప్రవక్త(స) ఆ బంగారాన్ని నలుగురు వ్యక్తులకు పంచిపెట్టారు. ఉయైనా బిన్ బద్ర్, అఖ్రా బిన్ హాబిస్, జైద్ ఖైల్, నాల్గవ వ్యక్తి అల్ఖమా లేదా ఆమిర్ బిన్ తుఫైల్. ఆయన(స) సహచరులలోని ఒక వ్యక్తి దీనిపై వ్యాఖ్యానిస్తూ, 'ఈ బంగారానికి వారికన్నా మేము ఎక్కువ హక్కుదారులము' అన్నారు. ఈ విషయం దైవప్రవక్త(స)కు తెలిసినప్పుడు, "మీకు నాపైన నమ్మకం లేదా? వాస్తవానికి నింగినున్న అల్లాహ్ నన్ను నమ్మాడు. ఆయన దివ్యవాణి (వహీ) ఉదయం, సాయంత్రం నాపై అవతరిస్తుంది" అని పలికారు. ఉల్లేఖకుడు ఇలా అన్నారు- అంతలోనే ఒక వ్యక్తిలేచాడు. అతని కళ్ళు లోపలికి పోయి ఉన్నాయి. అతని రెండు బుగ్గలు ఉబ్బి ఉన్నాయి. అతని నుదురు కూడా ఉబ్బి ఉంది. గడ్డం గుబురుగా ఉంది. గుండు గీయించుకుని ఉన్నాడు. లుంగీ బాగా పైకి లేపి(కట్టి) ఉన్నాడు. అతను నిలబడి, 'దైవప్రవక్తా! అల్లాహ్‌కు భయపడండి' అన్నాడు. దానికి సమాధానంగా దైవప్రవక్త(స) ఇలా అన్నారు : "నీ ధోరణి కడు శోచనీయం. నేను ఈ భూమండలంలో అందరికన్నా అధికంగా అల్లాహ్‌కు భయపడేవాణ్ణి కానా?"- తరువాత ఆ వ్యక్తి వెళ్ళిపోసాగాడు. అప్పుడు ఖాలిద్ బిన్ వలీద్(రజి) కల్పించుకుని, 'దైవప్రవక్తా! అతని తల నరకమంటారా?' అని విన్నవించుకున్నారు. దానికి ఆయన(స), 'వద్దు. బహుశా అతను నమాజ్ చేసే వ్యక్తి అయి ఉండవచ్చు" అన్నారు. 'నమాజ్ చేసేవారిలో కూడా చాలామంది నోటితో ఇస్లామ్ గురించి ఉపన్యాసాలిస్తారు. కాని వారి మనోక్షేత్రంలో ఇస్లామ్ ఉండద'ని ఖాలిద్ బిన్ వలీద్ (రజి) వ్యాఖ్యానించగా, "జనుల మనసులలో ఏముందో త్రవ్వి తీసే ఆజ్ఞ నాకు ఇవ్వబడలేదు. వారి కడుపులు చించే ఆజ్ఞ కూడా నాకు వొసగబడలేదు" అని ప్రవక్త మహోదయులు(స) చెప్పారు. తరువాత ఆయన(స) వెనుతిరిగిపోతున్న ఆ వ్యక్తి (కపటి) వైపు చూసి ఇలా అన్నారు : "ఇతని సంతతిలోనుండి ఒక వర్గం బయల్దేరుతుంది. అది దైవగ్రంథాన్ని మధురాతి మధురంగా పారాయణం చేస్తుంది. కాని అది వారి గొంతు నుండి క్రిందికి దిగదు. బాణం వేట జంతువులోనుండి దూసుకుపోయినట్లే ధర్మం (దీన్)

**నుండి వారు వెడలిపోయి ఉంటారు"[1] "ఒకవేళ వారి కాలంలో నేను గనక ఉండేటట్లయితే, సమూద్ జాతి మాదిరిగా సంహరిస్తాన"ని[2] కూడా ఆయన(స) అన్నట్లు నా అనుమానం (అని ఉల్లేఖకుడు తెలిపారు).**

**215) జాబిర్(రజి)కథనం : హజ్రత్ అలీ(రజి) యమన్ నుండి మక్కాకు చేరుకున్నప్పుడు, దైవప్రవక్త(స) ఆయనకు, "నీవు నీ ఇహ్రామ్ దీక్షపై స్థిరంగా ఉండు" అని సూచించారు.**

**(వేరొక సనదు ప్రకారం)**

**జాబిర్(రజి) ఇలా అన్నారు: అలీ (రజి) తన రాష్ట్రం (యమన్) నుండి (మక్కాకు) వచ్చినప్పుడు, "అలీ! నీవు ఎటువంటి ఇహ్రామ్ దీక్షబూనావు? (హజ్జ్ కొరకు ఇహ్రామ్ కట్టుకున్నావా? లేక ఉమ్రా నిమిత్తం ఇహ్రామ్ కట్టుకున్నావా?) అని దైవప్రవక్త(స) అడిగితే, 'మీరు ఇహ్రామ్ దీక్ష బూనినట్లే నేను కూడా దీక్ష బూనాను' అని అలీ(రజి) చెప్పారు. దానికి దైవప్రవక్త(స) "అలాగైతే ఖుర్బానీ పశువులను పంపు. ఏ సంకల్పంతో ఇహ్రామ్ కట్టుకున్నావో దాని ప్రకారమే ఆచరించు" అని సూచించారు– హజ్రత్ అలీ(రజి) దైవప్రవక్త(స) కొరకు ఖుర్బానీ పశువులను తోలుకుని వచ్చారు.**

**216) బకర్ బిన్ అబ్దుల్లాహ్ గారు అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ముందు, అనస్(రజి) తనతో ఇలా ప్రస్తావించారని అన్నారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఉమ్రా మరియు హజ్– రెండింటి కొరకు ఇహ్రామ్ కట్టుకున్నారు. మేము కూడా ఆయన(స)తోపాటే హజ్జ్ కొరకు ఇహ్రామ్ దీక్ష బూనాము. తీరా మేము మక్కాకు వచ్చాక, "తమ వద్ద ఖుర్బానీ పశువులు లేనివారు, తమ హజ్జ్ ఇహ్రామ్**

---

214–1. వేరొక ఉల్లేఖనంలో, వారు ముస్లిములను వధించి విగ్రహారాధకుల్ని విడిచి పెట్టేస్తారని ఉంది.

214–2. దైవప్రవక్త(స) వారి ఈ భవిష్యవాణి కూడా నిజమయింది. హజ్రత్ అలీ(రజి) పరిపాలనా కాలంలో వారు 'ఖారిజీల' రూపంలో తలెత్తారు. ఆయన వారిని సంహరించారు.

ఈ కాలంలో కూడా నక్కజిత్తులు గల ఇలాంటి వంచకులు చాలామంది ఉన్నారు. వారు ఖుర్ఆన్‌ను బాగా పారాయణం చేస్తారు. కాని వారి నుండి వాంఛించబడేది వారి హృదయ కవాటాలను తాకదు.

దీక్షను ఉమ్రా ఇహ్రామ్ దీక్షగా చేసుకోండి (అంటే కాబా గృహ తవాఫ్ చేసి, సయీ చేసి ఇహ్రామ్‌ను విడువండి)" అని దైవప్రవక్త(స) సూచించారు. దైవప్రవక్త(స) వద్ద మాత్రం ఖుర్బానీ పశువు ఉంది. తరువాత అలీ బిన్ అబీ తాలిబ్(రజి) యమన్ నుండి తిరిగి వస్తూ, ఇహ్రామ్ కట్టుకుని హాజరయ్యారు. "ఇంతకీ ఏ తరహా ఇహ్రామ్ కట్టుకున్నావు? మా వెంట నీ భార్య ఫాతిమా(ర.అ) కూడా ఉంది" అని దైవప్రవక్త(స) ఆయన్ని అడగ్గా, 'తమరు ఏ తరహా ఇహ్రామ్ కట్టుకున్నారో అటు వంటి ఇహ్రామ్‌నే నేనూ కట్టుకున్నాన'ని అలీ(రజి) సమాధానమిచ్చారు. "అలాగైతే నీ ఇహ్రామ్ (సంకల్పం)పై స్థిరంగా ఉండు. ఎందుకంటే మా వెంట ఖుర్బానీ పశువు ఉంది"[1] అని ఆయన(స) చెప్పారు.

### అధ్యాయం : 63

## జుల్ ఖలసా యుద్ధ ప్రస్తావన

**217)** జరీర్ బిన్ అబ్దుల్లాహ్ బజలీ(రజి) వివరించారు : అజ్ఞాన కాలంలో 'జుల్‌ఖలసా' అనే ఒక విగ్రహాలయం ఉండేది. దానిని కాబా యమానియా (యమనీ కాబా)గా, కాబా షామియా (సిరియా కాబా)గా కూడా పిలిచేవారు. దైవప్రవక్త(స) నన్ను పిలిచి, 'జుల్ ఖలసా వేదన నుండి నాకు ముక్తి ఎందుకు నివ్వరు?" అని ప్రశ్నించారు. అందువల్ల నేను (నా అహ్మస్ తెగకు) 150 మంది రౌతులను తీసుకుని జుల్ ఖలసా విగ్రహాలయం వైపు బయలుదేరాము. దానిని నేలమట్టం చేసి, అక్కడున్న వారందరినీ సంహరించాను. తరువాత మేము దైవ ప్రవక్త(స) సన్నిధిలో హాజరై జరిగినదంతా వివరించి చెప్పాము. ఆయన(స) మా తెగవారి కోసం ప్రార్థించారు.[1]

---

216-1. ఈ హదీసులన్నింటిలో ఏదో ఒక కోణం నుంచి హజ్రత్ అలీ (రజి) యమన్‌కు వెళ్ళిన ప్రస్తావన వస్తుంది. ఇదే ఈ అధ్యాయంలోని ప్రధానాంశం.

217-1. ఎందుకంటే ఆ విగ్రహాలయానికి వచ్చినవారు, అక్కడ కూర్చొని ఇస్లామ్‌కు వ్యతి రేకంగా కుట్రలు పన్నేవారు. దైవప్రవక్త(స)ను పరిహసించే ఉపాయాలు ఆలోచించే వారు. పవిత్ర కాబాపై విమర్శలు గుప్పించేవారు. ఏ విధంగా చూసినా ఇస్లామ్‌కు నష్టం కలిగించే ప్రయత్నాలు చేసేవారు. అందువల్ల రాజ్యంలో శాంతిభద్రతల్ని కాపాడటానికి సైనిక చర్య అనివార్యం అయింది.

ప్రశాంత పరిస్థితిలో ఏ మతావలంబీకుల ఆరాధనాలయాన్నయినా కూల్చడానికి ఇస్లామ్ అంగీకరించదు. హజ్రత్ ఉమర్(రజి) తన పరిపాలనా కాలంలో జిమ్మీలైన యూదుల, క్రైస్తవుల ప్రార్థనా స్థలాలకు పూర్తి భద్రత కల్పించారు.

**218)** జరీర్ బిన్ అబ్దుల్లాహ్ బజలీ (రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) నాతో, "నీవు 'జుల్‌ఖలసా' వ్యవహారంలో నన్ను నిశ్చింతగా ఉండేలా ఎందుకు చేయవు?" అని అన్నారు. అది ఖష్‌అమ్ తెగవారి విగ్రహాలయం. దానిని 'యమనీల కాబా' అని పిలిచేవారు. అందువల్ల నేను నూటయాభై మంది అహ్మస్ తెగ రౌతులను వెంటబెట్టుకుని బయలుదేరాను. వారంతా మంచి రౌతులు. కాని నేనే గుర్రంపై కుదురుగా కూర్చోలేకపోయేవాణ్ణి. దైవప్రవక్త(స) తన చేత్తో నా రొమ్ముపై చరిచారు. ఆయన చేతివేళ్ళ ప్రభావాన్ని నేను నా అంతర్యంలో ఆస్వాదించాను. తరువాత ఆయన(స) ఇలా ప్రార్థించారు : "దేవా! ఇతనిని మంచి గుర్రపు రౌతుగా చెయ్యి. ఇంకా– ఇతనిని స్వయంగా మార్గం చూపేవానిగా, మార్గం పొందినవానిగా చెయ్యి."

తరువాత వారు ఆ విగ్రహాలయం వైపునకు ప్రయాణమయ్యారు. దానిని కూల్చి, దగ్ధం చేశారు. తరువాత దైవప్రవక్త(స)కు ఆ కబురంపారు. జరీర్ రాయబారి వచ్చి ఇలా విన్నవించుకున్నాడు: 'మీకు సత్యం ఇచ్చి పంపినవాని సాక్షిగా! అది దురద జబ్బున్న ఒంటెలా కాలి భస్మీపటలం అయిన మీదటే నేను మీ దగ్గరికి వచ్చాను'. అది విని దైవప్రవక్త(స) అహ్మస్ తెగ వారి ఒంటెలలో, ఆ జనులలో శుభాన్ని వొసగమని దైవాన్ని ఐదుసార్లు వేడుకున్నారు.

**219)** జరీర్ బిన్ అబ్దుల్లాహ్ బజలీ(రజి) తెలియజేశారు: "జుల్ ఖలసా విషయంలో నేను నిశ్చింతగా ఉండేలా నీవు చర్య గైకొనవేమీ?" అని ప్రవక్త మహోదయులు (సఅసమ్) నన్ను అడిగారు. దానికి నేను, 'దైవప్రవక్తా! మీ ఆజ్ఞను పాలించడానికి సిద్ధంగా ఉన్నాన'ని అన్నాను. పిదప నేను అహ్మస్ తెగకు చెందిన **150** మంది అశ్వారూఢులను వెంటబెట్టుకుని బయలుదేరాను. వారంతా మంచి రౌతులు. కాని నేనే సరిగ్గా గుర్రపు స్వారీ చేయలేకపోయేవాణ్ణి. ఈ విషయం నేను దైవప్రవక్త(స) ముందు ప్రస్తావించగా, ఆయన(స) తన చేతిని నా రొమ్ముపై చరిచారు. దాని ప్రభావాన్ని నేను నా గుండె నిండా ఆస్వాదించాను. తరువాత దైవప్రవక్త(స) ఇలా వేడుకున్నారు: "దేవా! ఇతనిని మంచి రౌతుగా చెయ్యి. ఇతనిని సన్మార్గం చూపే వానిగా, స్వయంగా సన్మార్గం పొందేవానిగా తీర్చిదిద్దు". ఆ రోజు తర్వాత నేను ఎన్నడూ గుర్రం మీది నుండి క్రింద పడలేదు. 'జుల్ ఖలసా ఒక

విగ్రహాలయం. యమన్‌లో ఖష్‌అమ్, బజలా తెగలవారు దీనిని పర్యవేక్షించేవారు. ఆ విగ్రహాలయంలో అనేక విగ్రహాలుండేవి. వాటిని వారు పూజించేవారు, దానినే వారు 'కాబా' అని కూడా అనేవారు.

జరీర్ అక్కడకు చేరుకోగానే దానికి నిప్పంటించారు. తరువాత దానిని నేలమట్టం చేశారు.

జరీర్(రజి) అక్కడకు చేరుకున్నప్పుడు ఏం జరిగిందంటే; బాణాల ద్వారా జోస్యం చెప్పే ఒక స్థానిక వ్యక్తి, 'దైవప్రవక్త(స) దూతలు ఇక్కడికి వచ్చేశారు. మీరు గనక వారికి దొరికారంటే, వారు మీ మెడలు నరికేస్తారు' అని ముందస్తుగా హెచ్చరించాడు. అతను తన జోస్యం చెప్పటం పూర్తి కాకముందే జరీర్(రజి) అక్కడకు చేరుకుని, "ఈ జోస్యపు బాణాలు విరిచి లా ఇలాహ ఇల్లల్లాహ్ అని పలుకు. లేదంటే ముందు నీ మెడ నరికేస్తాను" అన్నారు. అప్పుడు ఆ వ్యక్తి తన బాణాలను విరిచేసి సాక్ష్యవచనం పలికాడు. ఆ తరువాత జరీర్ అహ్మస్ తెగకు చెందిన ఒక వ్యక్తి– అబూ అర్తా (రజి)ను శుభవార్త వినిపించడానికి దైవప్రవక్త(స) దగ్గరకు పంపించారు. అతను దైవప్రవక్త(స) సన్నిధికి రాగానే 'దైవప్రవక్తా! మీకు సత్యం ఇచ్చి పంపినవాని సాక్షిగా చెబుతున్నాను. ఆ విగ్రహాలయాన్ని దురద జబ్బున్న ఒంటెను కాల్చినట్లుగా కాల్చి బూడిద చేసిన మీదట గాని నేను మీ దగ్గరకు రాలేదు' అని విన్నవించుకున్నాడు. ఆ తరువాత దైవప్రవక్త(స) అహ్మస్ తెగ వారి గుర్రాల, రౌతుల శుభం కొరకు ఐదుసార్లు ప్రార్థించారు.

## అధ్యాయం : 64

# జాతిస్సలాసిల్ యుద్ధం గురించి

లఖ్మ్, జుజామ్ తెగలతో జరిగిన యుద్ధమిది.[1]

**220) అబూ ఉస్మాన్ నహ్దీ (రజి) కథనం : ప్రవక్త మహనీయులు(సఅసమ్)**

---

64–1. ఈ యుద్ధం హిజ్రీ 8వ సంవత్సరం జమాది ఉల్ ఆఖిర్ నెలలో 'వాది అల్ ఖురా' వద్ద జరిగింది. ఇది మదీనాకు వెళ్ళే మార్గంలో ఉంది. దీనిని 'జాతిస్సలాసిల్' అని ఎందుకు అన్నారంటే, ఈ యుద్ధంలో అవిశ్వాసులు హోరాహోరీగా పోరాడేందుకు తమ శరీరాలను సంకెళ్ళతో బంధించుకుని అభ్యాసం చేశారు.

**అమ్ర్ బిన్ ఆస్(రజి)ను 'జాతిస్సలాసిల్' యుద్ధం కొరకు సేనాధిపతిగా నియమించి పంపారు.**

**అమ్ర్ బిన్ ఆస్(రజి) ఇలా అన్నారు: నేను యుద్ధం నుండి తిరిగి రాగానే సరాసరి దైవప్రవక్త(స) సన్నిధికి వెళ్ళి, '(దైవప్రవక్తా!) మీకు అందరికన్నా ఎక్కువ ప్రియతములు ఎవరు?' అని అడిగాను. దానికి ఆయన(స) "ఆయిషా" అన్నారు. 'పురుషులలో ఎవరు ప్రియమైనవారు?' అని నేనడిగితే, "ఆమె తండ్రి" అని ఆయన(స) చెప్పారు. 'ఆ తరువాత ఎవరు?' అని అడిగితే, "ఉమర్" అన్నారు. ఆ విధంగా ఆయన(స) అనేక మంది పేర్లు చెప్పారు. అందుకే నేను నిశ్శబ్దంగా ఉండిపోయాను. ఎందుకంటే నా పేరు అందరికన్నా చివర్లో ఉంటుందేమోనను కున్నాను.**[1]

---

220-1. ఈ యుద్ధం కొరకు మూడు వందల మంది ముహాజిర్లను, అన్సార్లను పంపటం జరిగింది. వారితోపాటు ముప్ఫయి గుర్రాలు కూడా ఉన్నాయి. అమ్ర్ బిన్ ఆస్(రజి)ను ఆ సైనిక దళానికి అధిపతిగా నియమించారు. అమ్ర్(రజి) శత్రు రాజ్యానికి సమీపించ గానే మరింతమంది సైనికులను పంపమని కబురంపారు. అప్పుడు దైవప్రవక్త(స) అబూ ఉబైదా బిన్ జర్రాహ్(రజి) సారథ్యంలో మరో రెండు వందల మంది సైనికు లను పంపారు. వారిలో అబూబక్ర్, ఉమర్ కూడా ఉన్నారు.

అబూ ఉబైదా అక్కడకు చేరుకోగానే తాను సైన్యానికి నాయకునిగా ఉండాలను కున్నారు. కాని అమ్ర్ బిన్ ఆస్(రజి) తన అభ్యంతరం తెలియజేస్తూ, 'దైవప్రవక్త(స) మిమ్మల్ని నా సహాయం కొరకు పంపారు. కాబట్టి సైన్యాధిపతిగా నేనే ఉంటాన'న్నారు. అబూ ఉబైదా(రజి) దీనికి అంగీకరించారు.

హాకిమ్‌లోని ఉల్లేఖనంలో ఇలా వుంది : అమ్ర్ బిన్ ఆస్(రజి) తమ సైనిక దళం విడిది చేసిన చోట మంట పెట్టడాన్ని వారించారు. కాని హజ్రత్ ఉమర్(రజి) దీనికి ఎదురు చెప్పడంతో, హజ్రత్ అబూబక్ర్(రజి) కల్పించుకుని, 'మీరు ఊరుకోండి. దైవప్రవక్త(స) అమ్ర్‌ను నాయకునిగా నియమించారు. అదీగాక బహుశా అమ్ర్‌కు రణతంత్రం బాగా తెలిసి ఉండవచ్చు' అని సముదాయించారు.

బైహఖీలోని ఉల్లేఖనం ప్రకారం అమ్ర్ బిన్ ఆస్(రజి) యుద్ధం నుండి తిరిగి రాగానే, దైవప్రవక్త(స) సేవలో హాజరై తన సందేహాన్ని వెలిబుచ్చారు (పై హదీసులో వచ్చి నట్లుగా) తాను అబూబక్ర్, ఉమర్‌లకన్నా దైవప్రవక్త(స)కు ఎక్కువ ప్రియతముణ్ణి అని ఆయన ఊహించుకున్నారు. కాని దైవప్రవక్త(స) సమాధానం విన్న మీదట ఆయనకు వాస్తవం తెలిసి వచ్చింది.

## అధ్యాయం : 65

# జరీర్ బిన్ అబ్దుల్లాహ్ బజలీ (రజి) యమన్ వైపునకు వెళ్ళటం

**221)** జరీర్ బిన్ అబ్దుల్లాహ్ బజలీ(రజి) కథనం: నేను (యమన్ నుండి మదీనాకు తిరిగి వచ్చేందుకు) సముద్ర మార్గం గుండా ప్రయాణం సాగించాను. ఆ సందర్భంగా నాకు యమన్‌కు చెందిన జూకలా, జూ అమ్ర్ అనే ఇద్దరు వ్యక్తులు కలిశారు. నేను దైవప్రవక్త(సల్లల్లాహు అలైహి వ సల్లమ్) గురించి వారికి చెప్ప సాగాను. వారిలో జూఅమ్ర్ అనే వ్యక్తి, 'ఓహెూ! మీరు ఆయన గురించేనా చెప్పేది, ఆయన పరమపదించి మూడ్రోజులయింది' అన్నాడు. వారిద్దరూ నాతో పాటే (మదీనాకు) ప్రయాణమై ఉన్నారు. దారిలో మాకు మదీనా నుండి వస్తున్న కొంతమంది కనిపించారు. మేము వారిని అడిగితే, దైవప్రవక్త(స) పరమపదించిన సమాచారాన్ని వారు నిజమని ధ్రువీకరించారు. దైవప్రవక్త ప్రతినిధి (ఖలీఫా)గా అబూబక్ర్(రజి) ఎన్నికయ్యారని, అక్కడి ప్రజలంతా ఇప్పుడు క్షేమంగానే ఉన్నారని వారు చెప్పారు. వారిద్దరూ నాతో ఇలా అన్నారు: 'మేము అక్కడికి వచ్చామనీ, దైవచిత్తమయితే మరోసారి మదీనాకు వస్తామని మీ నాయకుని (అబూబక్ర్)కి చెప్పండి'. ఇలా చెప్పి వెళ్ళిపోయారు వారిద్దరు.

ఈ సంగతి నేను అబూబక్ర్(రజి) ముందు ప్రస్తావించినప్పుడు, "మరి వారిద్దరినీ నీవు వెంటబెట్టుకుని ఎందుకు రాలేదు?" అన్నారు. చాలా రోజుల తర్వాత- ఉమర్(రజి) పరిపాలనా కాలంలో- జూఅమ్ర్ ఒకసారి నాతో ఇలా అన్నాడు: 'జరీర్! మీ మేలు ఒకటి నా మీద ఉంది. మీకొక మాట చెబుతాను, వినండి. మీలోని నాయకుడు ఎవరయినా చనిపోయినప్పుడు మీరు (వెంటనే) మరో నాయకుణ్ణి ఎన్నుకునే విధానానికి కట్టుబడి ఉన్నంత కాలం మీ అరబ్బులు క్షేమంగా ఉంటారు. కాని (నాయకత్వ) వ్యవహారం కత్తులు దూసుకునే వరకూ వస్తే, మీ నాయకులు చక్రవర్తులుగా వ్యవహరించటం మొదలెడతారు. వారు చక్రవర్తుల మాదిరిగానే ఆగ్రహిస్తారు. వారి లాగానే సంతోషిస్తారు.[1]

---

221-1. హజ్రత్ జరీర్ బిన్ అబ్దుల్లాహ్ బజలీ(రజి) సందేశ ప్రచారం నిమిత్తం యమన్‌కు వెళ్ళి ఉంటారు. దారిలో ఆయనకు జూఅమ్ర్ తారసపడి, దైవప్రవక్త(స) పరమ పదించిన వార్తను వినిపించాడు. అప్పటికి దైవప్రవక్త(స) మరణించి మూడు రోజు లయింది. ఈ వార్త జూఅమ్ర్‌కు మరెవరి ద్వారానయినా అంది ఉండవచ్చు.

## అధ్యాయం : 66

# సైఫుల్ బహ్రా యుద్ధం గురించి

ఈ సైనిక దళం ఖురైషుల వర్తక బిడారు కోసం మాటేసి కూర్చుంది. అబూ ఉబైదా బిన్ జర్రాహ్(రజి) ఈ దళానికి అధిపతిగా ఉన్నారు.[1]

**222)** జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ అన్సారీ(రజి) తెలిపారు: ప్రవక్త మహో దయులు (సఅసమ్) సముద్ర తీరప్రాంతం వైపునకు ఒక సైనిక దళాన్ని పంపారు. ఆ సైనిక దళానికి అబూ ఉబైదా బిన్ జర్రాహ్(రజి)ను అధిపతిగా నియమించారు. ఆ సైనిక దళంలో మూడు వందల మంది యోధులు ఉన్నారు. మేము మదీనా నుండి బయలుదేరాము. దారిలో ఉండగానే మా ఆహార ధాన్యాలు అయి పోయాయి. అబూ ఉబైదా (రజి) ఆదేశానుసారం జనుల వద్ద ఉన్నదంతా ఒకచోట ప్రోగు చేస్తే రెండు బస్తాల ఖర్జూరపండ్లు ప్రోగయ్యాయి. ఆనాటి నుంచీ అబూ ఉబైదా కొద్దికొద్దిగా ఆ ఖర్జూరాలనే ఇచ్చేవారు. అవి కూడా అయిపోవచ్చాయి. అప్పుడు మా వాటా క్రింద– ఒక్కొక్కరికి– ఒక్క ఖర్జూరపండే వచ్చేది. వహబ్ ఇలా అన్నారు: 'కేవలం ఒక్క ఖర్జూరపండుతో ఏమవుతుంది?' అని నేను జాబిర్ (రజి)ను అడిగితే, 'ఆ ఒక్క ఖర్జూరమే మహాభాగ్యం. అది కూడా అయిపోయినప్పుడు మాకు దాని విలువ తెలిసి వచ్చింది' అన్నారు– చివరకు మేము సముద్ర తీరానికి చేరు కున్నాము. అక్కడ పర్వత గుట్టలాంటి చేప ఒకటి సముద్రంలో నుంచి బయట పడటం మేము గమనించాము. ఆ చేపను మా సైనికులంతా 18 రాత్రులపాటు తిన్నాము. తరువాత అబూ ఉబైదా (రజి) ఆదేశానుసారం ఆ చేప ప్రక్కటెముకలు

---

జూఅమ్ చేసిన ఆఖరి హితవు చాలా ముఖ్యమైనది. అది అక్షరాలా నిజమయింది. సన్మార్గగాములైన మొదటి నలుగురు ఖలీఫాల కాలంలో ప్రజల (ముస్లింల) సలహా సంప్రతింపుల ద్వారా ఖిలాఫత్ వ్యవహారం తేల్చబడేది. కాని ఈరాన్, రోము చక్రవర్తుల మాదిరిగా– తర్వాత కాలంలో బలప్రయోగం ద్వారా జనులు రాజ్యాధికారం చేజిక్కించు కోవటం మొదలెట్టినప్పటి నుండీ సంఘీభావం దెబ్బతిన్నది. ఖిలాఫత్ స్థానంలో రాజరికం వచ్చేసింది.

66–1. ఈ సంఘటన హిజ్రీ 8వ సంవత్సరం రజబ్ నెలలో సంభవించటంపై సందేహం కలుగుతుంది. ఎందుకంటే ఆ రోజుల్లో ఖురైషులతో ముస్లింలు నిర్యుద్ధ సంధి చేసుకుని ఉన్నారు. అందువల్ల అది జుహైనా తెగ వారితో జరిగిన యుద్ధం అని మరికొందరు పేర్కొన్నారు. ఇదే సరైనదని అనిపిస్తోంది.

రెండింటిని- కమాన్‌లాగా- నిలబెట్టాము. అవి ఎంత ఎత్తుగా ఉన్నాయంటే, ఒక ఒంటె తనపైన కట్టబడిన తొట్లతో సహా దాని క్రింది నుంచి వెళ్ళిపోయింది. ఆ తొట్ల చేప ఎముకలకు తగలనయినా లేదు.

**223)** జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి) నుండి అమ్ర్ బిన్ దీనార్ ఉటంకించిన హదీసు : (జాబిర్ ఇలా అన్నారు) ప్రవక్త మహనీయులు(సఅసమ్) మూడు వందల మందితో కూడిన దళాన్ని పంపించారు. మా దళానికి అబూ ఉబైదా బిన్ జర్రాహ్ (రజి)ను అమీర్‌గా నియమించారు. ఖురైషు వర్తక బిడారు కోసం పొంచి ఉండటం మా లక్ష్యం. సముద్ర తీర ప్రాంతంలో మేము **15** రోజుల వరకూ కాపు కాశాము. ఈ ప్రయాణంలో మేము తీవ్రంగా ఆకలిదప్పులకు ఓర్చుకోవలసి వచ్చింది. కడకు మేము తుమ్మ ఆకులను తినవలసిన పరిస్థితి ఏర్పడింది. అందుకే ఈ దళానికి 'ఆకుల దళం' అనే బిరుదు వచ్చింది. తరువాత యాదృచ్ఛికంగా సముద్రం మా కోసం చేప లాంటి దానిని తీరంలో పడవేసింది. దాని పేరు అంబర్. మేము దానిని **15** రోజుల వరకూ తిన్నాము. దాని కొవ్వును నూనెగా ఉపయోగించు కుంటూ శరీరాలకు మాలిష్ చేసుకున్నాము. తత్ఫలితంగా మా శరీర చర్మాలు నిగనిగలాడాయి. మేము కోల్పోయిన శారీరక సత్తువ తిరిగి వచ్చింది. తరువాత అబూ ఉబైదా (రజి) ఆ చేప ప్రక్కటెముక ఒక దానిని తీసి నిలబెట్టి, సైనికుల్లో అందరికన్నా పొడుగరి అయిన వ్యక్తిని దాని క్రింది నుండి నడిచిపోనిచ్చారు.

సుఫ్యాన్ బిన్ ఉయైనా ఒకసారి ఇలా వివరించారు- ఒక ప్రక్కటెముకను నిలబెట్టి ఒక వ్యక్తిని ఒంటెపై కూర్చోబెట్టి ఆ ప్రక్కటెముక క్రింది నుంచి పోనిచ్చారు.

జాబిర్(రజి) ఇలా అన్నారు: సైనికుల్లోని ఒక వ్యక్తి మొదట మూడు ఒంటె లను జిబహ్ చేశారు. తరువాత మరో మూడు ఒంటెల్ని జిబహ్ చేశారు. మూడవ సారి కూడా మూడు ఒంటెల్ని కోయబోతే అబూ ఉబైదా(రజి) వద్దని వారించారు. ఎందుకంటే ఈ విధంగా ఒంటెల్ని కోస్తూ పోతే ప్రయాణం ముందుకు సాగదు.

.... ఖైస్ బిన్ సాద్(రజి) ప్రయాణం నుండి తిరిగి వచ్చిన తరువాత తన తండ్రి (సాద్ బిన్ ఉబాదా-రజి)తో ఇలా అన్నారు: 'ఆ సైనిక దళంలో నేనూ ఉన్నాను. మాకు ఆకలైనప్పుడు ఒంటెల్ని కోయండి అని అబూ ఉబైదా చెప్పారు. నేను ఒంటెల్ని జిబహ్ చేశాను. మళ్ళీ ఆకలైనప్పుడు ఒంటెల్ని కోయండి అని అబూ ఉబైదా పురమాయించారు. నేను జిబహ్ చేశాను. మూడవసారి కూడా మాకు

బాగా ఆకలైనప్పుడు ఒంటెల్ని కోయమని అబూ ఉబైదా ఆదేశించారు. నేను జిబహ్ చేశాను. మళ్ళీ ఆకలైనప్పుడు అబూ ఉబైదా ఒంటెల్ని కోయరాదని ఆజ్ఞాపించారు.

**224)** ఇబ్నె జురైజ్ తెలిపారు– ఆయనకు అమ్ర్ బిన్ దీనార్ తెలియజేశారు. మరాయనేమో జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి) చెప్పగా విన్నారు. ఆయన(జాబిర్) ఇలా వివరించారు: "మేము 'ఆకుల దళం'లో పాల్గొన్నాము. అబూ ఉబైదా (రజి) మా నాయకునిగా ఉన్నారు. మాకు తీవ్రంగా ఆకలయింది. చివరకు సముద్రం నిర్జీవంగా ఉన్న ఒక భారీ చేపను బయట పడవేసింది. అలాంటి చేపను మేము అంతకుముందెన్నడూ చూడలేదు. దానిని అంబర్ అనేవారు. ఆ చేపను మేము పదిహేను రోజుల వరకూ తిన్నాము. తరువాత అబూ ఉబైదా(రజి) దాని ఎముకను (ప్రక్కటెముకను) నిలబెట్టించి, ఒక మనిషిని ఒంటెపై స్వారీ చేయించి, దాని క్రింది నుండి పోనిచ్చారు. తరువాత మేము మదీనాకు తిరిగి వచ్చినప్పుడు దైవప్రవక్త(స)కు జరిగినదంతా వినిపించాము. అది విని, "అల్లాహ్ మీ కొరకు పంపించిన ఉపాధిని తినండి. ఒకవేళ ఆ ఆహారంలో మీవద్ద ఏదన్నా మిగిలి ఉంటే, నాకూ కొంత తినిపించండి" అని చెప్పారాయన(స). అందువల్ల ఒక వ్యక్తి ఆ చేప మాంసంలోని కొంత భాగాన్ని ఆయన(స) సేవలో సమర్పించారు. దానిని ఆయన ఆరగించారు.[1]

### అధ్యాయం : 67

## హిజ్రీ 9వ యేట అబూబక్ర్(రజి) జనులతో కలసి హజ్జ్ చేయటం

**225)** మహనీయ అబూహురైరా (రజి) ఉల్లేఖనం: ప్రవక్త మహోదయులు (సఅసమ్) హజ్జతుల్ విదాకు ముందే అబూబక్ర్(రజి)ను హజ్జ్‌కు పంపారు. ఆ హజ్జ్ యాత్రకు అబూబక్ర్(రజి)ను అమీర్‌గా నియమించారు. ఆ సందర్భంగా అబూబక్ర్ నన్ను ఖుర్బానీ దినాన (మినాలో) ప్రకటన చేసేందుకు పంపారు. ఆ

224–1. ఈ ఉల్లేఖనం ద్వారా విదితమయ్యేదేమంటే సముద్రపు నీటిలోని చేప చచ్చిపోయిన స్థితిలో లభ్యమైనప్పటికీ దానిని తినటం సమంజసమే. అయితే హనఫీలు ఏమంటారంటే, ఆ సైనికులు గత్యంతరం లేని స్థితిలో ఉండటం వల్ల అది వారికి ధర్మసమ్మతం అయింది. కాని ఈ భావాన్వయం సరైంది కాదు. ఎందుకంటే ఆ మాంసాన్ని దైవప్రవక్త(స) కూడా తిన్నారు. ఆ సమయంలో ఆయన(స) గత్యంతరం లేని పరిస్థితిలో లేరు కదా!

**ప్రకటన సారాంశం ఇది: "ఈ ఏడాది తర్వాత ఏ బహుదైవారాధకుడు కూడా (దైవ గృహాన్ని సందర్శించి) హజ్జ్ చేయడానికి రాకూడదు. దిగంబరులై కాబా గృహ ప్రదక్షిణ చేయకూడదు."[1]**

**226) బరా బిన్ ఆజిబ్(రజి) తెలిపారు : పూర్తిగా (ఒకేసారి) అవతరించిన చిట్టచివరి సూరా సూరయె బరాత్(తౌబా సూరా)[1] అన్నిటికన్నా ఆఖరిలో అవతరించిన ఆయత్ "యస్తఫ్తూనక- ఖులిల్లాహు యుఫ్తీకుమ్ ఫిల్ కలాలతి..." (ప్రవక్తా! ప్రజలు నిన్ను 'కలాలా' విషయంలో ధార్మిక తీర్పు అడుగుతున్నారు- అన్ నిసా : 176) ఆయత్.[2]**

## అధ్యాయం : 68

# బనీ తమీమ్ బృందం రాక గురించి[1]

**227) ఇమ్రాన్ బిన్ హుసైన్ కథనం: బనూ తమీమ్ తెగకు చెందిన కొంత మంది దైవప్రవక్త(సఅసమ్) సన్నిధికి వచ్చినప్పుడు, "ఓ బనూ తమీమ్ వారలారా! (స్వర్గలోక) శుభవార్తను స్వీకరించండి" అని చెప్పారు. దానికి వారు, 'శుభవార్తను**

---

225-1. హిజ్రీ 9వ యేట జరిగిన సంఘటన ఇది. హజ్జతుల్ విదా (అంతిమ హజ్ యాత్ర లేదా వీడ్కోలు హజ్జ్) హిజ్రీ 10వ యేట జరిగింది. హిజ్రీ 9వ సంవత్సరం జీఖఅద మాసంలో అబూబక్ర్ (రజి) మదీనా నుండి బయలుదేరారు. ఆయనతోపాటు 300 మంది ఉన్నారు. దైవప్రవక్త(స) 20 ఒంటెల్ని కూడా వారికి ఇచ్చి పంపారు. ఈ సందర్భంగా దైవప్రవక్త(స) అధికార ప్రకటన చేయించారు. పై హదీసులో అది ప్రస్తావించబడింది. ఆ ప్రకటన తర్వాత నగ్నంగా కాబా ప్రదక్షిణ చేయటం, బహుదైవారాధకులు హజ్జ్ యాత్ర చేయటం వంటివి నిషేధించబడ్డాయి.

226-1. తౌబా సూరా పూర్తిగా ఒకేసారి అవతరించిందన్న విషయంపై సంశయం కలగవచ్చు. సూరాలోని ఎక్కువ భాగం చివర్లో అవతరించిందని అర్థం చేసుకోవాలి. ఉల్లేఖకుడు కూడా బహుశా ఈ అర్థంలోనే గ్రహించి ఉంటారు.

226-2. అంటే- ఆస్తి హక్కుకు సంబంధించి అవతరించిన చివరి ఆయత్. అన్యధా దైవప్రవక్త(స) మరణానికి కొన్ని రోజుల క్రితం అవతరించిన చిట్టచివరి ఆయత్ ఇది : "అల్లాహ్ వద్దకు మీరు మరలివెళ్ళే రోజున జరిగే పరాభవం నుండి, కలిగే ఆపద నుండి రక్షించుకోండి..." (2: 281)

68-1 వీరు హిజ్రీ శకం 8వ యేట చివర్లో దైవప్రవక్త(స) జీరానా నుండి తిరిగి వచ్చినప్పుడు వచ్చారు. ఆ బృందంలో అతారిద్, అఖ్రా, జబర్‌ఖాన్, అమ్ర్, ఖబ్బాబ్, నుఅయ్‌మ్, ఖైస్, ఉయైనా బిన్ హసన్ ఉన్నారు.

**మీరు మాకు ఎలాగూ చేరవేశారు. కొంత సొమ్ము కూడా ఇవ్వండి' అన్నారు. వారి ఈ సమాధానం విని దైవప్రవక్త(స) ముఖారవిందంపై అసహన ఛాయలు ప్రస్ఫుటమయ్యాయి.[1] అంతలోనే యమన్ నుండి ఒక బృందం దైవప్రవక్త(స) దగ్గరకు వచ్చింది. ఆయన(స) వారినుద్దేశించి, బనూ తమీమ్ ప్రజలు శుభవార్తను ఎలాగూ స్వీకరించలేదు. మీరైనా స్వీకరించండి" అని చెప్పగా, 'దైవప్రవక్తా! మేము శుభవార్తను స్వీకరించాము' అని వారు పలికారు.**

## అధ్యాయం : 69

**ముహమ్మద్ బిన్ ఇస్‌హాఖ్ కథనం: ఉయైనా బిన్ హిస్న్ బిన్ హుజైఫా బిన్ బద్ర్‌ను ప్రవక్త మహనీయులు(సఅసమ్) బనీ తమీమ్ తెగకు చెందిన బనూ అంబర్ శాఖ వైపునకు పంపారు. ఆయన వారిపై దండెత్తి అనేకమందిని హతమార్చి, వారి స్త్రీలను ఖైదీలుగా పట్టుకున్నారు.[1]**

**228) మహనీయ అబూహురైరా(రజి) తెలిపారు: బనూ తమీమ్ తెగవారిలోని మూడు సద్గుణాలను గురించి మహాప్రవక్త(సఅసమ్) నోట విన్నప్పటి నుండీ నేను ఆ తెగవారిని అభిమానిస్తాను. ఈ తెగ వారి గురించి మహాప్రవక్త(స) ఇలా వక్కాణించారు: ఒకటి : "బనూ తమీమ్ తెగవారు దజ్జాల్ పట్ల నా అనుచర సమాజంలో అందరికన్నా కఠినులుగా నిరూపించుకుంటారు". బనూ తమీమ్ తెగకు చెందిన ఒక మహిళా ఖైదీ హజ్రత్ ఆయిషా(ర.అ) ఇంట ఉండేది. రెండు: "ఈమెను విడుదల చేయండి. ఎందుకంటే ఈమె ఇస్మాయీల్(అలైహిస్సలామ్) సంతతికి చెందిన మహిళ" అని దైవప్రవక్త(స) ఆదేశించారు. ఆ తెగవారి నుంచి**

---

227-1. దైవప్రవక్త(స) మోముపై అసహనం వ్యక్తమవడానికి కారణం సుస్పష్టమే- తమీమ్ తెగవారు పరలోకంలో లభించే స్వర్గసుఖాలపై ప్రాపంచిక సొమ్ములకు ప్రాధాన్యత ఇచ్చారు.

69-1. ఈ పోరాటానికి కారణం బనూ అంబర్ జనులు ఖుజాఅ తెగవారిపై దౌర్జన్యం చేయడమే. దైవప్రవక్త(స) ఉయైనా వెంట యాభై మందిని పంపారు. వారిలో అన్సార్లు గానీ, ముహాజిర్లు గానీ లేరు. ఉయైనా తన వెంట ఉన్న యాభై మందితోనే బనూ అంబర్‌ను చెల్లాచెదురు చేసి పదకొండు మంది పురుషులను, పదకొండు మంది స్త్రీలను, పిల్లలను బందీలుగా పట్టుకున్నారు.

**జకాత్ సొమ్ము వసూలై వచ్చేది. మూడు: "ఇది ఒక జాతికి చెందిన జకాత్ సొమ్ము (లేదా ఇలా అన్నారు). ఇది నా జాతి వారి జకాత్ సొమ్ము".**

**229) అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) తెలిపారు: తమీమ్ తెగకు చెందిన కొంతమంది (వాహనాలపై) ప్రవక్త మహోదయుల(సఅసమ్) వద్దకు వచ్చి, 'మాపైన ఒక నాయకుణ్ణి నియమించండి' అని విన్నవించుకున్నారు. ఖాఖా బిన్ మాబద్ బిన్ జురారా(రజి) నాయకుడుగా ఉంటే బావుంటుందని అబూబక్ర్(రజి) ప్రతిపాదించారు. 'దైవప్రవక్తా! తమరు అక్రా బిన్ హాబిస్(రజి)ను వారి నాయకునిగా నియమించటం మంచిద'ని ఉమర్(రజి) సూచించారు. దానిపై అబూబక్ర్(రజి) స్పందిస్తూ 'ఎంతసేపటికీ నాతో విభేదించటమే మీ పని' అని ఉమర్(రజి)తో అన్నారు. దానికి ఉమర్(రజి) సమాధానమిస్తూ, 'విభేదించాలన్నది నా ఉద్దేశం కానేకాదు' అన్నారు. వారిద్దరి మధ్య మాటామాటా పెరిగింది. హెచ్చు స్వరంతో వాదించుకోసాగారు. అప్పుడు అల్ హుజురాత్ సూరాలోని ఈ ఆయత్ అవతరించింది- "విశ్వాసులారా! అల్లాహ్, ఆయన ప్రవక్త ముందు యథేచ్ఛగా (విచ్చలవిడిగా) వ్యవహరించకండి..." [1] (అల్ హుజురాత్ : 1)**

## అధ్యాయం : 70

# అబ్దుల్ ఖైస్ దూతల గురించి [1]....

**230) అబూ జమ్రా ఇలా అంటున్నారు: నేను ఇబ్నె అబ్బాస్(రజి)ను ఇలా**

229-1. ఇది చాలా ప్రమాదకరమైన తప్పిదం. "మీతో విభేదించాలన్నది నా ఉద్దేశం కానేకాదు. వ్యవస్థ ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని ఇలా అన్నాను" అని ఉమర్(రజి) చెప్పారు. బుఖారీ గ్రంథ వ్యాఖ్యాత ఒకరు ఉమర్(రజి) పలుకుల్ని తర్జుమా చేశారు: "అవున్లెండి. ఎంతసేపటికీ మీ అభిప్రాయంతో విభేదించటమే నా లక్ష్యం కదూ!" ఇలాంటి తర్జుమా వల్ల ఆ మహనీయులిద్దరి వ్యక్తిత్వానికి మచ్చ తగులుతుంది. వారిద్దరూ ఎంత నిష్కల్మషమైన హృదయులంటే ఎప్పుడయినా, ఏదయినా విషయంలో అభిప్రాయ భేదం వచ్చినా, వారు దానిని వెంటనే పరిష్కరించుకునేవారు. ముఖ్యంగా మహనీయ ఉమర్(రజి), మహనీయ అబూ బక్ర్(రజి) మాటకు విలువనిచ్చి, గౌరవించేవారు. మహనీయ అబూబక్ర్(రజి) కూడా అంతే.

70-1. ఇది ఓ సుప్రసిద్ధ తెగ. ఈ తెగవారు బహ్రైన్‌లో నివసించేవారు. మదీనా మునవ్వరా తరువాత జుమా (శుక్రవారం) నమాజును తమ గ్రామంలో స్థాపించినది అబ్దుల్ ఖైస్ తెగవారే.

అడిగాను- 'నా దగ్గర ఒక బాన ఉంది. అందులో నా కోసం 'నబీజ్' (ఖర్జూర పానీయం) తయారు చేయబడుతుంది. అది తీయగా ఉన్నన్నాళ్ళు నేను దానిని త్రాగుతుంటాను. ఒక్కోసారి చాలా ఎక్కువగా త్రాగి జనుల మధ్యన కూర్చుని ఉంటాను. ఆ సమయంలో ఎక్కడ అవమానం ఎదురవుతుందోనన్న భయం కూడా ఉంటుంది. (అంటే వీడు త్రాగుబోతు అని జనులు నా వెనుక చేరి ఎగతాళి చేస్తారేమోనన్న శంక కలుగుతుంది)'. దీనికి సమాధానంగా హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఇలా అన్నారు : అబ్దుల్ ఖైస్ తెగకు చెందిన ఒక ప్రతినిధి బృందం మహా ప్రవక్త (సఅసమ్) సన్నిధికి వచ్చింది. ఆ బృందాన్ని ఉద్దేశించి ఆయన(స), "వచ్చిన వారు బాగా వచ్చారు. పరాభవం పాలయ్యే, సిగ్గుపడే పరిస్థితిని రానీయలేదు (అంటే సంతోషంగా ఇస్లామ్ స్వీకరించారు. అన్యథా సిగ్గుపడాల్సిన పరిస్థితి ఎదురయ్యేది)" అన్నారు. అప్పుడు ఆ ప్రతినిధులు 'దైవప్రవక్తా! మాకూ- మీకూ మధ్యన బహుదైవారాధకుల తెగలు కొన్ని అవరోధంగా ఉన్నాయి. అందువల్ల మేము నిషిద్ధ (హరామ్) మాసాలలో మాత్రమే మీ దగ్గరకు రాగలము. కనుక తమరు మాకు ధర్మాదేశాలను, సూచనలను వినిపించండి. వాటిని పాటించడం ద్వారా మేము స్వర్గ ప్రవేశానికి అర్హులం కాగలము. మా వెంట రాలేకపోయిన వారికి కూడా ఈ ఆదేశాలను చేరవేస్తాము' అని విన్నవించుకున్నారు. దానికి దైవప్రవక్త(స) ఇలా ఉపదేశించారు: "నేను మీకు నాలుగు విషయాలను గురించి (ఆచరించమని) ఆదేశిస్తాను. నాలుగు విషయాల నుండి ఆపుతాను. నేను ఆదేశించే విషయాలేమంటే, మీరు అల్లాహ్‌ను విశ్వసించాలి. అల్లాహ్‌ను విశ్వసించటమంటే ఏమిటో మీకు తెలుసా? అల్లాహ్ తప్ప వేరొక నిజ ఆరాధ్య దైవం లేదని మీరు సాక్ష్యమివ్వాలి. నమాజును స్థాపించాలి. జకాత్‌ను ఇవ్వాలి. రమజాన్ నెల ఉపవాసాలు పాటించాలి. యుద్ధప్రాప్తి (మాలె గనీమత్)లో నుండి ఐదవ భాగాన్ని (బైతుల్ మాల్‌కు) చెల్లించాలి. ఇంకా నేను మిమ్మల్ని నాలుగు విషయాల నుండి వారిస్తున్నాను. సొరకాయ బుర్రలో, చెక్కబడిన కొయ్య పాత్రలో, పచ్చని లక్క పిడతలో, లోతైన పాత్ర (బాన)లో 'నబీజ్'ను పులియబెట్టడాన్ని వారిస్తున్నాను."[1]

---

230-1. ఈ ప్రతినిధులు రెండుసార్లు వచ్చారు. మొదటిసారి 12 మంది వచ్చారు. రెండవసారి వచ్చినప్పుడు ఆ ప్రతినిధుల సంఖ్య 40 వరకూ ఉంది. వారు రాబోతున్నారన్న శుభవార్తను దైవప్రవక్త(స) తన సహచరులకు ముందే వినిపించారు. ఆ పాత్రలలో

**231)** మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) కథనం : అబ్దుల్ ఖైస్ తెగకు చెందిన ప్రతినిధులు దైవప్రవక్త(సఅసమ్) సన్నిధికి వచ్చినప్పుడు, 'దైవప్రవక్తా! మాది రబీయా తెగలోని ఒక శాఖ. మీకూ- మాకూ మధ్యన ముజిర్ తెగ అవిశ్వాసులు అవరోధంగా ఉన్నారు. మేము మీ వద్దకు కేవలం పవిత్ర (నిషిద్ధ) మాసాలలో మాత్రమే రాగలము. కాబట్టి మేము ఆచరించడమే కాకుండా మా వెంట రాలేక పోయిన వారికి వివరించి చెప్పే మార్గదర్శక సూత్రాలను మాకు బోధించండి' అని విన్నవించుకున్నారు. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా ఉద్బోధించారు : "నేను మీకు నాలుగు విషయాలను ఆచరించవలసినదిగా, మరో నాలుగు విషయాలను విడనాడ వలసినదిగా ఆదేశిస్తున్నాను. (ఆచరించాల్సిన విషయాలు ఇవి :) మీరు అల్లాహ్‌ను విశ్వసించాలి. అంటే అల్లాహ్ తప్ప మరో నిజ ఆరాధ్య దైవం లేదని నమ్మాలి. (ఆ సమయంలో ఆయన తన చేతివ్రేలితో ఒక్కడు అని సంజ్ఞ చేశారు). నమాజ్ చేయాలి. జకాత్‌ను విధిగా ఇవ్వాలి. విజయప్రాప్తి (మాలె గనీమత్)లో నుంచి ఐదవ భాగాన్ని ప్రభుత్వ కోశాగారంలో జమ చేయాలి. ఇంకా నేను మిమ్మల్ని దుబ్బా, నఖీర్, హంతమ్, ముజఫ్ఫత్ వంటి మత్తు పదార్థాల నుండి వారిస్తున్నాను."

**232)** (ఇబ్నె అబ్బాస్ బానిస యగు) కురైబ్ తెలిపారు: ఇబ్నె అబ్బాస్, అబ్దుర్రహ్మాన్ బిన్ అజ్‌హర్, మిస్వర్ బిన్ మఖ్రమా ప్రభృతులు తనను హజ్రత్ ఆయిషా(ర.అ) వద్దకు పంపిస్తూ ఇలా అన్నారు: "ఉమ్ముల్ మోమినీన్‌కు మా సలామ్ చెప్పు. అస్ర్ అనంతరం రెండు రకతుల నమాజ్ గురించి ఆమె గారిని అడుగు. మీరు వీటిని చదువుతున్నారని మాకు తెలిసింది. ఆ నమాజ్ చేయటం నుండి దైవప్రవక్త(స) వారించారని కూడా మాకు తెలిసింది. ఇబ్నె అబ్బాస్ ఏమన్నారంటే, ఈ రెండు రకతులు ఆచరించిన వారిని నేను ఉమర్(రజి)తో కలిసి (ఆయన పరిపాలనా కాలంలో) దండించేవాణ్ణి"- కురైబ్ ఇలా అన్నారు : నేను ఉమ్ముల్ మోమినీన్ (హజ్రత్ ఆయిషా-ర.అ) సేవలో హాజరై వారి సందేశాన్ని చేరవేశాను. దానికి ఆమె, "ఈ విషయం గురించి ఉమ్మె సలమా(ర.అ)ను అడగండి" అన్నారు. నేను తిరిగి వచ్చి, జరిగినదంతా చెప్పాను. ఆ విషయమే అడగటానికి వాళ్ళు నన్ను ఉమ్మె సలమా(ర.అ) దగ్గరకు పంపారు.

---

'నబీజ్' అనే పానీయం త్రాగవద్దని ఎందుకు ఆదేశించారంటే ఖర్జూరాలను వాటిలో పులియబెట్టి త్రాగినప్పుడు అది మత్తు పానీయంలా అయ్యేది.

**(ఇదంతా విన్న మీదట) ఉమ్మె సలమా (ర.అ) ఇలా అన్నారు : "నేను కూడా ఈ విషయం దైవప్రవక్త(స) ద్వారా విన్నాను. అస్ర్ నమాజు తర్వాత రెండు రకతుల నమాజ్ చేయడాన్ని ఆయన(స) వారించేవారు. కాని ఒకసారి మాత్రం ఆయన(స) ఈ నమాజ్ చేశారు. ఆ తరువాత నా దగ్గరకు వచ్చారు. ఆ సమయంలో నా దగ్గర బనూ హరామ్ తెగకు చెందిన కొంతమంది స్త్రీలు కూర్చుని ఉన్నారు. దైవప్రవక్త(స) రెండు రకతుల నమాజ్ చేశారు. ఇది గమనించిన నేను, నా సేవకురాలిని ఆయన(స) దగ్గరకు పంపిస్తూ 'నీవు దైవప్రవక్త(స) ప్రక్కనే నిలబడు. (ఆయన గారు నమాజ్ ముగించిన మీదట) దైవప్రవక్తా! అస్ర్ నమాజ్ తర్వాత ఈ రెండు రకతులు ఆచరించడాన్ని తమరు స్వయంగా వారించారట కదా! కాని ఈ రోజు మీరు ఖుద్దుగా ఈ రెండు రకతులు చేస్తుండగా చూశానని అమ్మ గారు (ఉమ్మె సలమా) అంటున్నారు. ఇంతకీ ఏమిటి విశేషం!? అని అడుగు. ఒకవేళ దైవప్రవక్త(స) చేత్తో సైగ చేస్తే వెనక్కి జరుగు' అని సూచించాను. నా సేవకురాలు నేను చెప్పినట్లే చేసింది. దైవప్రవక్త చేత్తో సంజ్ఞ చేయగానే ఆమె వెనక్కి జరిగింది. దైవప్రవక్త(స) ఆ నమాజ్‌ను చేసిన మీదట ఇలా అన్నారు: "ఓ అబూ ఉమయ్యా కూతురా! అస్ర్ నమాజ్ అనంతరం రెండు రకతుల నమాజ్ గురించి అడగటానికి నీవు వచ్చావు. అసలు జరిగిందేమిటంటే, అబ్దుల్ ఖైస్ తెగకు చెందిన కొంతమంది ఇస్లామ్ స్వీకరించి, తమ తెగవారి సందేశాన్ని తీసుకుని నా వద్దకు వచ్చారు. వారితో సంభాషణ జరుపుతూ నేను జుహ్ర్ నమాజ్ తర్వాత చేయవలసిన రెండు రకతుల నమాజ్‌ను చేయలేకపోయాను. ఇప్పుడు నేను చేసినది ఆ రెండు రకతులే."[1]**

**233) మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) తెలిపారు : దైవప్రవక్త మస్జిద్ (అంటే మస్జిదె నబవీ) తరువాత మొట్టమొదట జుమా నమాజ్ స్థాపించబడిన మస్జిద్ అబ్దుల్ ఖైస్ తెగవారి మస్జిదె జువాసా. జువాసా బహ్రైన్‌లోని ఒక పేట పేరు.**

232-1. హదీసు చివర్లో అబ్దుల్ ఖైస్ తెగ ప్రతినిధి బృందం ప్రస్తావన వచ్చింది. ఇదే ఈ అధ్యాయంలోని ప్రధానాంశం.

తహావీ (రహ్మ) ఉల్లేఖనంలో ఇలా వుంది: "నా దగ్గరకు జకాత్ ఒంటెలు వచ్చాయి. వాటిని తనిఖీ చేస్తూ నేను ఈ రెండు రకతుల నమాజ్ చేయటం మరిచిపోయాను. నాకు జ్ఞాపకం వచ్చిన మీదట ఆ రెండు రకతులను ఇంట్లో ఆచరించాను". అబూ ఉమయ్యా ఎవరో కాదు, ఉమ్మె సలమా(ర.అ) తండ్రి.

## అధ్యాయం : 71

# బనూ హనీఫా ప్రతినిధి బృందం, సుమామా బిన్ ఉసాల్ గురించి[1]....

**234)** హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసమ్) కొంతమంది రౌతులను నజ్ద్ క్షేత్రం వైపునకు పంపుతూ బనూ హనీఫా తెగ నాయకుడైన సుమామా బిన్ ఉసాల్‌ను బందీగా తీసుకురమ్మని ఆదేశించారు. బందీగా తీసుకురాబడిన సుమామాను మస్జిదె నబవీలోని ఒక గుంజకు కట్టేశారు. దైవప్రవక్త(స) తన ఇంట్లో నుండి అతని వద్దకు వచ్చి, "నీ పట్ల ఎలా వ్యవహరించ మంటావ్?" అని అడిగారు. దానికి అతను, 'ముహమ్మద్! నా దగ్గర మంచి ఉన్నది. (అయినప్పటికీ) మీరు నన్ను చంపేసినట్లయితే యుద్ధ కాముకుడైన ఒక వ్యక్తిని చంపిన వారవుతారు. ఎందుకంటే అతను యుద్ధంలో ముస్లింలను చంపి ఉన్నాడు. ఒకవేళ మీరు నాకు ఉపకారం చేసినట్లయితే కృతజ్ఞతా భావం కల వ్యక్తికి ఉపకారం చేసినవారవుతారు. కాని ఒకవేళ మీకు ధనమే కావాలనుకుంటే మీకు ఎంత కావాలో చెప్పండి, ఇస్తాను' అన్నాడు. దైవప్రవక్త(స) అతని వద్ద నుండి నిష్క్రమించారు.

మరునాడు అతనికి మళ్ళీ అదే ప్రశ్న వేశారు- "సుమామా! చెప్పు, నీ పట్ల ఎలా ప్రవర్తించమంటావు?"అని. దానికి అతను, ఇంతకు ముందు చెప్పిందే చెబుతాను- 'మీరు గనక మేలు చేసినట్లయితే కృతజ్ఞతలు తెలుపుకునే వానికి మేలు చేసినట్లవుతుందని అంటాను' అన్నాడు. దైవప్రవక్త(స) మళ్ళీ తిరిగి వెళ్ళిపోయారు.

మూడవ రోజు కూడా దైవప్రవక్త(స) అతనికి అదే ప్రశ్న వేశారు- "చెప్పు, ఇప్పుడేమంటావు?" అని. దానికి అతను, 'ఇంతకుముందు అన్నదే అంటాను. ఇంకేమంటాను?' అన్నాడు. దైవప్రవక్త(స) తన సహచరులతో, "సుమామాను విడిచిపెట్టండి" అని ఆదేశించారు. (త్రాళ్ళు విప్పబడ్డాయి. అంతే) అతను మస్జిదె

---

71-1. 'బనూ హనీఫా' అనేది యమామా ప్రాంతానికి చెందిన ఒక సుప్రసిద్ధ తెగ. ఈ ప్రతినిధి బృందం హిజ్రీ 9వ సంవత్సరంలో వచ్చింది. వాఖిదీ ప్రకారం ఈ బృందంలో 17 మంది ఉన్నారు. వారిలో ముసైలిమా కిజ్జాబ్ కూడా ఉన్నాడు.

ఇక సుమామా బిన్ ఉసాల్(రజి) ప్రముఖ సహాబాలో ఒకరు. ఈయన వృత్తాంతం బనీ హనీఫా ప్రతినిధి బృందం రాకకు ముందే ప్రస్తావనకు వచ్చింది.

**నబవీకి సమీపంలో ఉన్న ఒక తోటలోనికి వెళ్ళి, స్నానం చేసి మస్జిద్‌లోనికి ప్రవేశించాడు. 'అష్‌హదు అంల్లా ఇలాహ ఇల్లల్లాహు వ అష్‌హదు అన్న ముహమ్మదర్రసూలుల్లాహ్ (అల్లాహ్ తప్ప వేరొక నిజ ఆరాధ్య దైవం లేదని నేను సాక్ష్యమిస్తున్నాను. ముహమ్మద్ దైవప్రవక్త అని కూడా నేను సాక్ష్యం పలుకుతున్నాను)' అనే కలిమా పఠించాడు. తరువాత ఇలా అన్నాడు: 'ఓ ముహమ్మద్! దైవసాక్షిగా చెబుతున్నాను. ఈ భూమండలంలో మీ ముఖం కన్నా ఎక్కువ చెడ్డది నా దృష్టిలో మరొకటి ఉండేది కాదు. కాని ఈ రోజు నాకు మీ ముఖారవిందం కన్నా ప్రియమైనది మరొకటి లేదు. దైవసాక్షి! నా దృష్టిలో ఏ మతధర్మం కూడా మీ మతధర్మం కన్నా ఎక్కువగా ద్వేషించదగినదిగా ఉండేది కాదు. కాని ఈ రోజు మీ మతధర్మం నాకు అన్ని మతధర్మాల కన్నా ప్రియమైనది. దైవసాక్షి! నాకు ఏ నగరం కూడా మీ నగరం కన్నా ఎక్కువ చెడ్డదిగా ఉండేది కాదు. కాని ఈ రోజు మీ నగరం కన్నా ప్రియమైన నగరం నా దృష్టిలో మరొకటి లేదు. మీ సైనికులు నన్ను పట్టుకునే సమయంలో నేను ఉమ్రా సంకల్పం చేసుకుని ఉన్నాను - ఇప్పుడు తమరి ఆజ్ఞ ఏమిటో సెలవీయండి'.**

**ప్రవక్త మహనీయులు(స) అతనికి శుభవార్త వినిపిస్తూ ఉమ్రా చేసుకోమని సెలవిచ్చారు. సుమామా మక్కా చేరుకున్నప్పుడు ఎవరో ఒకతను, 'నీవు ధర్మభ్రష్టుడవు అయిపోయావు' అన్నాడు. దానికి సుమామా, 'లేదు. నేను ముహమ్మద్(స)తోపాటు విశ్వసించాను. దైవసాక్షిగా చెబుతున్నాను. ఇక నుంచి ముహమ్మద్(స) అనుమతి లేకుండా యమామా నుండి ఒక్క గోధుమ గింజ కూడా మీ వద్దకు చేరదు' అని కరాకండీగా చెప్పేశారు.[1]**

**235) హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) కథనం : ప్రవక్త మహనీయుల(సఅసమ్) కాలంలో ముసైలిమా అబద్ధాగ్రేసరుడు వచ్చి 'ముహమ్మద్ గనక నన్ను, తన**

---

234-1. 'నీవు ధర్మపరివర్తన చెందావా?' అని మక్కాలో కొంతమంది ఆయన్ని ప్రశ్నించారు. దానికి సుమామా, 'లేదు. నేను ధర్మపరివర్తన చెందలేదు. పైగా నేను దైవాజ్ఞాబద్ధుణ్ణి అయ్యాను' అని చెప్పారు. ఇకమీదట మక్కా వారికి ఆహార ధాన్యాలు పంపరాదని కూడా ఆయన తన తెగ వారికి ఆజ్ఞాపించారు. చివరకు మక్కా వాసులు దైవప్రవక్త(స)కు ఉత్తరం వ్రాస్తూ, "మీరు బంధువుల పోషణాభారం వహిస్తారు. రక్త సంబంధీకుల హక్కు గురించి నొక్కి వక్కాణిస్తారు. కాని సుమామా మాకు తిండిగింజలు అందకుండా కట్టడి చేశాడు" అని అభ్యర్థించారు. ఇది తెలుసుకుని దైవప్రవక్త నిలువెల్లా కరిగిపోయారు. మక్కా జనులకు ఆహార ధాన్యాలు పంపేందుకు సుమామాకు అనుమతి ఇచ్చారు- సల్లల్లాహు అలైహి వసల్లం.

**తదనంతరం ప్రతినిధిగా చేసే మాటైతే నేను ఆయనకు విధేయత చూపుతాన'ని చెప్పాడు. అతని వెంట అతని జాతి (బనూ హనీఫా)కి చెందిన ఒక పెద్ద సైనిక దళం కూడా ఉంది. దైవప్రవక్త(స) అతనికి హితబోధ చేసేందుకు, అతని వద్దకు వెళ్ళారు. ఆయన(స) వెంట సాబిత్ బిన్ ఖైస్ బిన్ షమ్మాస్(రజి) కూడా ఉన్నారు. ఆ సమయంలో దైవప్రవక్త(స) చేతిలో ఒక బెత్తం ఉంది. ముసైలిమా కిజ్జాబ్ తన సైనికులతో విడిది చేసి ఉన్న స్థలానికి ఆయన(స) వెళ్ళి, "ఒకవేళ నీవు నా నుండి ఈ బెత్తం అడిగినా అది నీకు ఇవ్వబడదు. అల్లాహ్ నీ గురించి చేసిన నిర్ణయాన్ని దాటి నీవు ముందుకు పోలేవు. నీవు గనక నా విధేయత పట్ల విముఖత చూపినట్లయితే అల్లాహ్ నిన్ను అంతమొందిస్తాడు. నాకు కలలో చూపించబడిన వాడివి బహుశా నువ్వే అయి ఉండవచ్చు. ఇక నీ ప్రశ్నలకు సమాధానం నా తరఫున సాబిత్ బిన్ ఖైస్(రజి) ఇస్తారు"- ఇలా చెప్పిన మీదట దైవప్రవక్త(స) తిరిగి వచ్చేశారు.**

**ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అన్నారు: "కలలో ఏ వ్యక్తి పర్యవసానం నాకు చూపించబడిందో, ఆ వ్యక్తి బహుశా నువ్వేనని నా అనుమానం" అన్న దైవప్రవక్త (స) పలుకుల్లోని నేపథ్యం ఏమిటని నేను అడిగితే అబూ హురైరా(రజి) నాకు ఇలా వివరించారు: 'దైవప్రవక్త(స) నాతో ఇలా అన్నారు- నేను నిద్రలో ఉండగా నా చేతులకు రెండు బంగారు మురుగులు ఉన్నట్లు చూశాను. ఇది చూసి నాకెంతో దుఃఖం కలిగింది. నిద్రలోనే నాకు దివ్యావిష్కృతి అందింది- ఆ మురుగులను ఊదేసేయ్ అని నాకు వహీ ద్వారా సూచించబడింది. నేను వాటిపై ఊదగానే అవి ఎగిరిపోయాయి. నా తదనంతరం ఇద్దరు అబద్ధాగ్రేసరులు పొడసూపుతారని నేను ఈ కలకు భావాన్వయం చేసుకున్నాను. ఆ ఇద్దరిలో ఒకడు అస్వద్ అన్సీ, రెండవవాడు ముసైలిమా కిజ్జాబ్." ఆ ఇద్దరినీ అల్లాహ్ గాలిలో పొట్టు ఎగిరినట్లుగానే తుదముట్టించాడు.**[1]

---

235-1. అస్వద్ అన్సీ దైవప్రవక్త(స) హయాంలోనే సంహరించబడ్డాడు. ముసైలిమా కిజ్జాబ్ మొదటి ఖలీఫా అబూబక్ర్(రజి) కాలంలో వధించబడ్డాడు. ఎట్టకేలకు సత్యమే జయిస్తుంది. అసత్యం ఎంత ఆర్భాటం చేసినా అది సమసిపోవలసిందే. ఈనాడు అస్వద్‌ను, ముసైలిమాను అనుసరించేవాడు ఒక్కడూ లేడు. మహనీయ ముహమ్మద్ (స)ను అనుసరించేవారు మాత్రం ప్రళయం వరకూ ఉంటారు.

**236)** మహాప్రవక్త(సఅసమ్) ప్రవచించినట్లుగా హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు : "స్వప్నంలో నా దగ్గరకు భువిలోని నిధులు తీసుకురాబడ్డాయి. నా చేతుల్లో రెండు బంగారు మురుగులు ఉంచబడ్డాయి. అది నాకెంతో బాధాకరం అయింది. ఆ తర్వాత వాటిని ఊదేసెయ్యి అని నాకు వహీ పంపబడింది. నేను ఊదగానే అవి ఎగిరిపోయాయి. నేను దాని భావార్థం గురించి ఆలోచిస్తే నేను రెండు అబద్ధీకుల మధ్యన ఉన్నట్లు గ్రహించాను. ఆ ఇద్దరిలో ఒకడు సనా వాసి (అస్వద్ అన్సీ), రెండవవాడు యమామా నివాసి (ముసైలిమా కిజ్జాబ్).

**237)** అబూ రజా ఉత్తారీ (రహ్మ) చెప్పగా తాను విన్నానని మెహ్దీ బిన్ మైమూన్ తెలియజేశారు: ఆయన ఇలా చెప్పారు : మేము పూర్వకాలంలో ఏదైనా రాయిని పూజించేవారం. ఒకవేళ దానికన్నా మంచి రాయి దొరికితే మొదటి రాయిని పారవేసి కొత్త రాయిని పూజించటం మొదలెట్టేవారం. ఒకవేళ మాకు రాయి దొరక్కపోతే ఒక మట్టి దిబ్బను తయారు చేసి, ఒక మేకను తెచ్చి దాని పాలతో ఆ దిబ్బను అభిషేకం చేసేవారం. ఆ తరువాత దాని చుట్టూ ప్రదక్షిణ చేసేవారం. రజబ్ నెల రాగానే "ఇది ఈటెలు బల్లాలను దూరంగా ఉంచే నెల" అని అనేవారం. మా దగ్గర ఉన్న ఇనుప బల్లాలను, బాణాలను మా నుంచి దూరంగా ఉంచేవారం. వాటిని ఏదో ఒక మూల విసిరివేసేవారం."

మెహ్దీ బిన్ మైమూన్ ప్రకారం అబూ రజా ఇంకా ఇలా అన్నారు : "మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ప్రభవించే నాటికి నేను పిన్న వయస్కుణ్ణి. అప్పుడు నేను నా ఇంటి ఒంటెలను మేపేవాణ్ణి. తరువాత ఆయన(స) మక్కాపై విజయం సాధించారన్న సమాచారం అందగానే మేము నరకంలోకి వెళ్ళిపోయాం. అంటే ముసైలిమా కిజ్జాబ్‌కు విధేయులమయ్యాము."[1]

## అధ్యాయం : 72

# అస్వద్ అన్‌సీ వృత్తాంతం

**238)** ఉబైదుల్లాహ్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ ఉతబా కథనం: ముసైలిమా కిజ్జాబ్ మదీనా నగరానికి వచ్చినప్పుడు బిన్తె హారిస(హారిస్ కూతురు) ఇంట్లో ఆగాడన్న

537-1. హజ్రత్ అబూ రజా మొదట ముసైలిమా కిజ్జాబ్ విధేయతా పరిధిలో చేరారు. తరువాత ఆయనకు సన్మార్గ భాగ్యం ప్రాప్తించింది. ఇస్లామ్ స్వీకరించారు. కాని ఈయనకు దైవప్రవక్త(స)ను సందర్శించే అవకాశం లభించలేదు.

**సంగతి మాకు తెలుసు. ఎందుకంటే హారిస్ కూతురు అతని భార్య. ఈవిడ అబ్దుల్లాహ్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ ఆమిర్ తల్లి కూడా. ప్రవక్త మహనీయులు (సఅసమ్) అతనికి హితబోధ చేయడానికి అక్కడికి విచ్చేశారు. సాబిత్ బిన్ ఖైస్ బిన్ షమ్మాస్(రజి) కూడా దైవప్రవక్త(స) వెంట ఉన్నారు. దైవప్రవక్త(స) తరపు వక్తగా సాబిత్ ప్రసిద్ధి చెందారు. ఆ సమయంలో దైవప్రవక్త(స) చేతిలో ఒక బెత్తం ఉంది. దైవప్రవక్త(స) అతని దగ్గరకు వచ్చి నిలబడ్డారు. అతనితో మాట్లాడారు. అతనికి ఇస్లామ్ సందేశం వినిపించారు. 'మీ తదనంతరం మీరు నన్ను మీ అధికార ప్రతినిధిగా ప్రకటించే మాటైతే నేను ఇస్లామ్ స్వీకరిస్తాన'ని ముసైలిమా కిజ్జాబ్ అన్నాడు. దైవప్రవక్త(స) అతని ప్రతిపాదనకు సమాధానమిస్తూ, "చూడు, నీవు ఈ బెత్తం ఇవ్వమని అర్థించినా దీనిని నీకు ఇవ్వను. నాకు కలలో చూపించబడిన వారిలో ఒకడు నీవని నేను భావిస్తున్నాను. ఇదిగో, ఈయన సాబిత్ బిన్ ఖైస్. నీ ప్రశ్నలన్నింటికీ నా తరపున ఈయన సమాధానమిస్తార"ని అన్నారు. ఆ తరువాత దైవప్రవక్త తిరిగి వచ్చేశారు.**

**ఉబైదుల్లాహ్ బిన్ అబ్దుల్లాహ్ ఇలా అన్నారు: దైవప్రవక్త(స) కన్న ఆ కల గురించి నేను ఇబ్నె అబ్బాస్(రజి)ను అడిగితే, ఆయన ఇలా వివరించారు: దైవ ప్రవక్త(స) ఇలా చెప్పినట్లు నాకు తెలిసింది– "కలలో నా చేతులకు రెండు బంగారు మురుగులు తొడిగించబడ్డాయి. అది గమనించి నేను కలవరం చెందాను. వాటి వల్ల నేను ఎంతో వ్యాకులత చెందాను. పిదప నాకు అయిన ఆజ్ఞ మేరకు నేను వాటిని ఊదేశాను. దాంతో ఆ రెండు మురుగులు ఎగిరిపోయాయి. నేను ఆ కల ద్వారా గ్రహించిన భావార్థం ప్రకారం ఇద్దరు అబద్ధీకులు పొడసూపుతారు". వారిద్దరిలో ఒకడు అస్వద్ అన్సీ. అతనిని యమన్ ప్రాంతంలో ఫేరోజ్ వధించాడు. రెండవవాడు ముసైలిమా కిజ్జాబ్[1].**

---

238–1. ముసైలిమా కిజ్జాబ్ పెళ్ళాం పేరు కైసా బిన్తె హారిస్. ముసైలిమా వధించబడిన తరువాత అబ్దుల్లాహ్ బిన్ ఆమిర్ ఆమెను వివాహమాడారు. ఆమె కడుపున పుట్టిన బిడ్డడే అబ్దుల్లాహ్ బిన్ ఆమిర్. ఉల్లేఖకుడు పొరపాటున ఒక 'అబ్దుల్లాహ్' అనే పదాన్ని వదిలేశారు. మేము తర్జుమాలో దానిని చేర్చి 'అబ్దుల్లాహ్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ ఆమిర్' అని చేశాము. కొన్ని ప్రతులలో ఆవిడ అబ్దుల్లాహ్ బిన్ ఆమిర్ పిల్లలకు తల్లి అని ఉంది.

## అధ్యాయం : 73

# నజ్రాన్[1] క్రైస్తవుల వృత్తాంతం

**239) హుజైఫా(రజి) కథనం: నజ్రాన్‌కు చెందిన ఆఖిబ్, సయ్యిద్ అనే ఇద్దరు నాయకులు ప్రవక్త మహనీయులు(సఅసమ్)తో 'ముబాహిలా' చేయడానికి వచ్చారు. కాని వారిద్దరిలో ఒకడు రెండవ వానితో, "అలా చేయకు. ఎందుకంటే దైవసాక్షిగా! ఒకవేళ ఈయన గారు నిజంగానే దైవప్రవక్తే అయి ఉన్నప్పటికీ మనం ఆయనతో 'ముబాహిలా' జరిపితే, మనం బ్రతికి బట్టకట్టజాలము. మన సంతానం కూడా మిగిలి ఉండదు"[1] అని హెచ్చరించాడు. తరువాత వారిద్దరూ దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి, "మీరు అడిగినంత జిజ్‌యా ఇవ్వడానికి మేము సిద్ధంగా ఉన్నాము. మీరు మా వద్దకు నిజాయితీపరుడైన ఒక అధికారిని పంపించండి. మీరు ఎవరిని పంపినా అతను నిజాయితీపరుడై ఉండాలి" అని ప్రతిపాదించారు. సమాధానంగా దైవప్రవక్త(స) ఇలా అన్నారు : "నేను మీ వద్దకు ఒక వ్యక్తిని పంపుతాను. అతను పూర్తిగా నిజాయితీపరుడు, నమ్మకస్థుడు అయి ఉంటాడు"[2] ప్రవక్త ప్రియ సహచరులు దైవప్రవక్త(స) నిర్ణయం కొరకు ఎదురు చూశారు. అప్పుడాయన(స), "అబూ ఉబైదా బిన్ జర్రాహ్! లే" అన్నారు. ఆయన లేచి నిలబడినప్పుడు, "ఇతను ఈ ఉమ్మత్‌కు చెందిన నిజాయితీపరుడు (అమీన్)" అని పలికారు.**

---

73-1. నజ్రాన్ అరేబియాలోని ఒక పెద్ద పట్టణం. అక్కడ క్రైస్తవులు పెద్ద సంఖ్యలో ఉండే వారు.

239-1. మహాప్రవక్త(స) నజ్రాన్ ప్రముఖులకు హితబోధ చేశారు. వారికి ఇస్లామ్ సందేశం అందజేశారు. కాని వారు అంగీకరించలేదు సరికదా తమ మాటపై హఠం చేశారు. అప్పుడు దైవప్రవక్త(స), "సరే. అలాగైతే రండి, మనం 'ముబాహిలా' చేద్దాం" అని సవాలు విసిరారు.

'ముబాహిలా' అంటే ఇరువర్గాల వారు సంవాదన జరిపి, తాము మాత్రమే సత్యంపై ఉన్నామని పట్టుబట్టినప్పుడు, రెండు వర్గాల మధ్యన విభేదం తీవ్రస్థాయికి చేరినప్పుడు, ఆ ఇరు వర్గాల వారు దైవ సమక్షంలో ప్రార్థించాలి- 'దేవా! మాలో ఎవరు అసత్యంపై మొండికేశారో వారిపై నీ శిక్షను అవతరింపజెయ్యి' అని వేడుకోవాలి.

239-2. చివరకు నజ్రాన్ క్రైస్తవులు రాజీకి వచ్చారు. అంటే తాము సత్యంపై లేమన్న విష

**240) అబూ హుజైఫా(రజి) తెలిపారు : నజ్రాన్ వాసులు ప్రవక్త మహనీయుల(సఅసమ్) సమక్షంలోకి వచ్చి, 'మా వెంట నిజాయితీపరుడైన ఒక మనిషిని పంపించండి' అని కోరారు. దానికి సమాధానంగా దైవప్రవక్త(స) ఇలా అన్నారు : "నేను మీ వెంట సర్వ విధాలా నిజాయితీపరుడు, నమ్మకస్థుడైన ఒక వ్యక్తిని పంపిస్తాన"ని అన్నారు. ఆ వ్యక్తి ఎవరోనని సహచరమాన్యులు ఉత్సుకతతో ఎదురు చూశారు. దైవప్రవక్త(స) అబూ ఉబైదా బిన్ జర్రాహ్(రజి)ను పంపారు.[1]**

**241) హజ్రత్ అనస్(రజి) కథనం ప్రకారం ప్రవక్త మహోదయులు ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు: "ప్రతి సముదాయంలో అమీనులు (నమ్మకస్తులు, నిజాయితీపరులు) ఉంటారు. నా సముదాయపు 'అమీన్' అబూ ఉబైదా బిన్ జర్రాహ్."**

---

యాన్ని పరోక్షంగా అంగీకరించారు. ఇస్లామీయ రాజ్యానికి కప్పం చెల్లించడానికి ఒప్పుకున్నారు. దైవప్రవక్త(స)తో వారు చేసుకున్న సంధి ప్రకారం రజబ్ నెలలో వెయ్యి జతల బట్టలు, సఫర్ నెలలో వెయ్యి జతల దుస్తులు ఇచ్చుకోవాలి, ప్రతి జతతో పాటు ఒక ఊఖియా వెండి కూడా ఇవ్వాలి.

ఈ క్రైస్తవ బృందం వచ్చినప్పుడే దైవప్రవక్త 'మస్జిదె నబవీ'లో సగం స్థలాన్ని ఖాళీ చేయించి, క్రైస్తవులకు వారి పద్ధతి ప్రకారం దైవారాధన చేసుకునే సౌకర్యం కల్పించారు. ప్రవక్త(స) వారి పరమత సహనానికి ఇంతకన్నా ప్రబల తార్కాణం ఇంకేం కావాలి.

మహనీయ అబూ ఉబైదా బిన్ జర్రాహ్ (రజి) విశిష్టత కూడా ఈ హదీసు ద్వారా విదితమవుతోంది.

240-1. హజ్రత్ అబూ ఉబైదా బిన్ జర్రాహ్(రజి) స్వర్గలోక శుభవార్త అందుకున్న పదిమంది సహాబాలో ఒకరు. ముస్లిం సముదాయపు 'అమీన్' (నిజాయితీపరుడు)గా ఖ్యాతి గడించారు. హజ్రత్ ఉస్మాన్ బిన్ మజ్‌వూన్(రజి)తో పాటే ఇస్లామ్ స్వీకరించారు. రెండు హిజ్రత్‌లు చేసిన ఘనత ఈయనకు దక్కింది. యుద్ధాలన్నింటిలో పాల్గొన్నారు. ఉహుద్ యుద్ధ సందర్భంగా శిరస్త్రాణంలోని రెండు కొక్కెములు దైవప్రవక్త(స) దవడలో గుచ్చుకున్నప్పుడు, ఈయన తన పల్లతో వాటిని బయటకు లాగారు. దాంతో ఆయన పల్లు రెండు రాలిపోయాయి. పొడుగరి. సుందర స్వరూపులు. అమ్‌వాస్‌లో ప్రబలిన ప్లేగు వ్యాధి వాతన పడి హిజ్రీ 18వ సంవత్సరంలో మరణించారు. అప్పటికి ఆయనకు 58 సంవత్సరాలు.

## అధ్యాయం : 74

# ఉమాన్, బహ్‌రైన్‌ల గురించి

**242)** జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) వివరించారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) నాతో ఇలా అన్నారు– "నా దగ్గరకు బహ్‌రైన్ నుండి డబ్బు వచ్చినప్పుడు, నీకు ఇంతేసి ఇంతేసి– మూడు దోసిళ్ళు నింపి– ఇస్తాను". కాని బహ్‌రైన్ నుండి రెవిన్యూ సొమ్ము వచ్చే నాటికి దైవప్రవక్త(స) పరమపదించి ఉన్నారు. అందుచేత ఆ డబ్బు అబూబక్ర్(రజి) దగ్గరకు తేబడింది. అప్పుడాయన, 'దైవ ప్రవక్త(స) ఎవరికయినా రుణపడి ఉంటే లేదా ఆయన(స) ఎవరికయినా ఏదైనా వాగ్దానం చేసివుంటే వారు నా దగ్గరకు రావాలి' అని ప్రకటన చేయించారు.

జాబిర్(రజి) ఇలా అన్నారు: నేను అబూబక్ర్ దగ్గరకు వచ్చి, దైవప్రవక్త నాకు చేసిన వాగ్దానాన్ని గురించి చెప్పాను. "ఇంత ఇంత ఇస్తానని మూడు దోసిళ్ళ నిండా ఇస్తాన"ని నాతో అన్నారని చెప్పాను. తరువాత అబూబక్ర్(రజి) నాకు అంత డబ్బు ఇచ్చారు కూడా.

తరువాత నేను ఒకసారి ఆయన్ని కలుసుకుని డబ్బు గురించి ప్రస్తావించాను. కాని ఆయన ఈసారి నాకు ఇవ్వలేదు. నేను మరోసారి వెళ్ళాను. కాని ఈసారి కూడా ఆయన ఏమీ ఇవ్వలేదు. నేను మూడవసారి వెళ్ళాను. కాని ఈసారి కూడా ఆయన నాకు ఏమీ ఇవ్వలేదు. అందువల్ల నేనాయనతో 'నేను మీ దగ్గరకు ఒకసారి వచ్చాను. కాని మీరు ఇవ్వలేదు. మళ్ళీ వచ్చాను. కాని మీరు ఇవ్వలేదు. తరువాత మూడవసారి వచ్చాను. కాని మీరు ఈసారి కూడా ఇవ్వడం లేదు. మీరు నాకు ఇవ్వదలచుకుంటే ఇవ్వండి లేదంటే నేను నీకు ఇవ్వదలచుకోలేదు, నేను పిసినారిని అని అయినా స్పష్టంగా చెప్పేసేయండి' అని నిష్ఠూరంగా చెప్పాను. దానికి సమాధానంగా అబూబక్ర్(రజి), "నేను పిసినారినని అంటావా!? పిసినారి తనాన్ని మించిన లోపం మరేముంటుంది?" అన్నారు. ఈ మాటను ఆయన మూడుసార్లు పలికారు. తరువాత ఇలా అన్నారు : "చూడు, నేను నీ కోర్కెను దాట వేసినప్పుడల్లా ఎలాగైనా నీకు ఇవ్వాలనే (మనసులో) అనుకున్నాను...[1]

... ఇదే సనదు ప్రకారం జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి) చెప్పగా తాను విన్నానని ముహమ్మద్ బిన్ అలీ బాఖర్ తెలిపారు. నేను (జాబిర్) అబూబక్ర్ వద్దకు

**వెళ్ళినప్పుడు ఆయన ఒక దోసిలి నిండా నాకు డబ్బు ఇచ్చారు. 'వాటిని లెక్కించుకో' అని అన్నారు. నేను లెక్కిస్తే ఐదు వందలున్నాయి. 'మరో రెండుసార్లు అంతే డబ్బు తీసుకో' అని ఆయన అన్నారు.**

## అధ్యాయం : 75

# యమన్ నుండి అష్అరీ తెగవారి రాక

**(వీరు ఖైబర్ విజయం సందర్భంగా ఒక బృందం రూపంలో- హిజ్రీ 7లో- దైవప్రవక్త(స) సన్నిధిలో హాజరయ్యారు) అప్పుడు అబూ మూసా అష్అరీ (రజి) దైవప్రవక్త(స)తో, 'అష్అరీ తెగవారు నా వారు. నేను వారిలోని వాణ్ణి' అన్నారు.**

**243) అబూ మూసా అష్అరీ (రజి) ఇలా అన్నారు: నేనూ, నా సోదరుడైన అబూ రహమ్(లేదా అబూ బర్దా) యమన్ నుండి వచ్చిన కొత్తలో- చాలా రోజుల వరకు- ఇబ్నె మస్ఊద్(రజి)ను, ఆయన తల్లి ఉమ్మె అబ్దుల్లాహ్ (ర.అ)ను దైవప్రవక్త(స) కుటుంబ సభ్యులని తలపోసేవారం. ఎందుకంటే వారిద్దరూ రేయింబవళ్ళలో అనేకసార్లు ప్రవక్త(స) ఇంటికి వస్తూ పోతుండేవారు. ఎల్లవేళలా దైవ ప్రవక్త(స)ను వెన్నంటి ఉండేవారు.[1]**

**244) అబూ ఖిలాబాతో జహ్దమ్ ఇలా అన్నారు : అబూ మూసా అష్అరీ (రజి) గారు మహనీయ ఉస్మాన్ (రజి) ఖిలాఫత్ కాలంలో కూఫా అధికారిగా నియమితులై వచ్చినప్పుడు, జర్మ్ తెగ వారికి ఆయన ఎంతో మర్యాద చేశారు- జహ్దమ్ ఇలా అన్నారు : మేము ఆయన వద్ద కూర్చుని ఉన్న సమయంలో, ఆయన కోడి కూరతో ఉదయపు భోజనం (టిఫిన్) చేస్తున్నారు. అక్కడ కూర్చుని ఉన్న వారిలో ఒకతన్ని (పేరు తెలియలేదు) కూడా అబూ మూసా భోజనానికి**

---

242-1. మహనీయ అబూబక్ర్(రజి) పలుకుల్లోని అంతరార్థం ఏమిటంటే, ఆయన తన వాటా క్రింద వచ్చిన 'ఖుముస్' (ఐదవ భాగం)లో నుండి ఇవ్వదలిచారు. 'ఖుముస్' ప్రత్యేకంగా రాజ్యాధిపతి అయిన ఖలీఫాకు లభిస్తుంది. ఆ పద్దులో నుంచి ఆయన కోరిన వారికి, కోరినంతగా ఇచ్చే అధికారం కలిగి ఉంటారు.

243-1. హజ్రత్ అబూ మూసా అష్అరీ(రజి) మొదట కొంతమంది యమనీలతోపాటు అబిసీనియా దేశానికి వలసపోయారు. తరువాత అక్కణ్ణుంచి జాఫర్ బిన్ అబూ తాలిబ్(రజి)తో కలసి దైవప్రవక్త(స) దగ్గరకు వచ్చారు.

పిలిచారు. కాని ఆ వ్యక్తి సున్నితంగా తిరస్కరిస్తూ, 'కోడి పెంట తింటూ ఉండగా నేను చూశాను. అప్పటి నుండీ కోడిమాంసం పట్ల నాకు ఏవగింపు కలిగింద'ని అన్నాడు. దానికి అబూ మూసా, "చాల్లెద్దూ, నీ చాదస్తం గాని దైవప్రవక్త(స) కోడి మాంసం తింటూ ఉండగా నేను స్వయంగా చూశాన"ని అన్నారు. కాని ఆ వ్యక్తి కోడిమాంసం తినననని ఒట్టేసుకుని ఉన్నాడు. కాని అబూ మూసా(రజి) పట్టు బడుతూ, "సరే లేవయ్యా! నీ ప్రమాణ భంగానికి చికిత్స నేను చెబుతాను. ముందు నువ్వు వచ్చి భోజనం చెయ్యి. ఒకసారి ఏమయిందంటే; మేము అష్అర్ తెగకు చెందిన కొంతమందిమి కలిసి దైవప్రవక్త(స) సన్నిధిలో హాజరై, (తబూక్ యుద్ధ ప్రయాణం కొరకు) కొన్ని వాహనాలను సమకూర్చమని అభ్యర్థించాము. "మీకు ఇవ్వడానికి వాహనాలు లేవు" అని దైవప్రవక్త(స) చెప్పారు. మేము మరోసారి కూడా వాహనాలను ఇవ్వమని ఆయన్ని కోరగా, "దైవసాక్షిగా! నేను మీకు వాహనా లను సమకూర్చలేన"ని ఆయన(స) మాకు బదులిచ్చారు. కాని కొద్ది సమయమైనా గడవకముందే యుద్ధప్రాప్తి క్రింద కొన్ని ఒంటెలు వచ్చాయి. దైవప్రవక్త(స) ఆ ఒంటెలలో నుండి ఐదింటిని మాకు ఇప్పించారు. మేము వాటిని స్వీకరించాము కూడా. కాని కొన్ని క్షణాల తర్వాత 'అయ్యో! మేము దైవప్రవక్త(స)ను మోస పుచ్చాము కదా! ఆయన్ని పరధ్యానంలో ఉంచాము. ఆయన ఒట్టేసుకున్న సంగతిని మనం ఆయనకు గుర్తు చేయలేదు. ఇట్టి పరిస్థితిలో మాకు మేలు అన్నది జరగద'ని చెప్పుకుని తిరిగి ఆయన(స) సన్నిధికి వెళ్ళాము. 'దైవప్రవక్తా! మాకు వాహనాలు సమకూర్చలేనని తమరు ప్రమాణం చేసి మరీ చెప్పారు కదా! కాని తరువాత మాకు వాహనాలు ఇచ్చారు' అని విన్నవించుకున్నాము. దానికి ప్రవక్త మహోదయులు (స), "నిజమేననుకోండి. కాని నేను ఎప్పుడు ప్రమాణం చేసినా, దానికన్నా మేలైన మార్గం నా ముందుకు వచ్చినప్పుడు, నేను మేలైన దానినే చేస్తాను (అయితే ప్రమాణ భంగానికి గాను పరిహారం ఇస్తాను)" అన్నారు.

**245)** ఇమ్రాన్ బిన్ హుసైన్(రజి) కథనం: తమీమ్ తెగవారు ప్రవక్త మహనీయుల(సఅసమ్) వద్దకు వచ్చినప్పుడు, "తమీమ్ తెగవారలారా! మీకు శుభవార్త" అని ఆయన(స) పలికారు. దానికి ఆ తెగవారు, 'శుభవార్త సంగతి సరే. మాకు కొంత సొమ్ము ఇవ్వండి' అని బదులిచ్చారు. అది విని దైవప్రవక్త(స) ముఖారవిందం వివర్ణమైంది. తరువాత యమన్ నుండి కొంతమంది అష్అరీలు

వచ్చారు. ఆయన(స) వారినుద్దేశించి, "తమీమ్ తెగవారు శుభవార్తను గ్రహించ లేదు. ఓ యమన్ వాసులారా! మీరైనా దానిని స్వీకరించండి" అని చెప్పగా, 'చిత్తం దైవప్రవక్తా! మేము సంతోషంగా స్వీకరిస్తున్నామ'ని[1] బదులిచ్చారు.

**246)** అబూ మస్ఊద్(రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త(సఅసమ్) ఇలా ప్రవచించారు : "విశ్వాసం (ఈమాన్) అటు వైపున ఉంది". ఇలా చెబు తున్నప్పుడు ఆయన(స) తన చేత్తో యమన్‌వైపు సంజ్ఞ చేశారు. "నిర్దయ, హృదయ కాఠిన్యం ఒంటెల తోక వెనుక నడిచే వారిలో ఉంటుంది. అటువైపు (తూరుపు వైపు) షైతాన్ కొమ్ములు రెండు ఉదయిస్తాయి" అని పలికారు. అంటే రబీఅ, ముజర్ తెగవారు.[1]

**247)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) ప్రవచించారని హజ్రత్ అబూ హురైరా(రజి)ఉల్లేఖించారు: "చూడండి, మీ వద్దకు యమనీలు వచ్చారు. వారి హృదయ తెరలు సన్నగా ఉంటాయి. వారి హృదయాలు మృదువైనవి. యమన్ ప్రజల విశ్వాసం ఉత్తమమైనది. వారి విజ్ఞత, వివేచన కూడా బహు చక్కనిది. గర్వం, అహంకారం ఒంటెల వారిలో ఉంటుంది. నెమ్మది, సర్దుబాటు అనేది మేకల వారిలో ఉంటుంది."

**248)** మహనీయ అబూ హురైరా(రజి) ఉల్లేఖనం : ప్రవక్త మహోదయుల (సఅసమ్) ప్రవచనం– "విశ్వాసం (ఈమాన్) యమన్‌దే. ఉపద్రవం అనేది అదిగో, అటువైపున ఉంది. అటువైపు నుండే షైతాన్ కొమ్ము బయల్పడుతుంది."

**249)** అబూ హురైరా(రజి) కథనం ప్రకారం మహాప్రవక్త(సఅసమ్) ఇలా ప్రవచించారు: "మీ వద్దకు యమనీలు వచ్చారు. వారు మృదు మనస్కులు. వారి

---

245–1. ఇక్కడ పాఠకుల్లో ఒక సందేహం కలగవచ్చు. బనూ తమీమ్ జనులు హిజ్రీ 9లో వచ్చారు. అష్‌అరీ తెగవారు హిజ్రీ 7వ సంవత్సరంలోనే వచ్చారు కదా! అని ప్రశ్నించ వచ్చు. దీనికి జవాబు ఏమిటంటే అష్‌అర్ తెగవారిలో కొంతమంది బనూ తమీమ్ జనుల తరువాత వచ్చారు.

246–1. సూర్యోదయ సమయంలో సూర్య కిరణాలు కుడి ఎడమల వైపు వ్యాపిస్తాయి. ఆ సమయంలో బహు దైవారాధకులు తూర్పుకు తిరిగి సూర్యుణ్ణి పూజిస్తారు. హదీసులో వచ్చిన షైతాన్ రెండు కొమ్ములు అంటే యిదే.

హృదయాలపై ఉన్న పొర పలుచనిది. ధర్మావగాహన యమనీలలో ఉంది. విజ్ఞత, వివేచన కూడా యమన్‌దే."[1]

**250)** అల్ఖమా ఇలా వివరించారు: మేము అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్(రజి) దగ్గర కూర్చుని ఉండగా సుప్రసిద్ధ సహాబీ మహనీయ ఖబ్బాబ్ బిన్ అరత్(రజి) అక్కడికి విచ్చేశారు. "ఓ అబూ అబ్దుర్రహ్మాన్! మీ దగ్గర కూర్చుని ఉన్న ఈ నవ యువకులు (మీ శిష్యులు) మీ మాదిరిగానే ఖుర్‌ఆన్ పారాయణం చేస్తారా?" అని అడిగారు. దానికి ఇబ్నె మస్‌ఊద్(రజి), "మీరు కోరినట్లయితే పారాయణం చెయ్యమని ఎవరితోనయినా చెప్పనా?" అన్నారు. "తప్పకుండా" అన్నారు ఖబ్బాబ్. అప్పుడు ఇబ్నె మస్‌ఊద్, "అల్ఖమా! నీవు పారాయణం చెయ్యి" అని పురమాయించారు. అప్పుడు జియాద్ బిన్ హుదైర్ సోదరుడైన జైద్ బిన్ హుదైర్ 'తమరు ఖుర్‌ఆన్ పారాయణం కొరకు అల్ఖమాను ఆదేశిస్తున్నారా! వాస్తవానికి అతను మాలాగా చక్కగా పారాయణం చెయ్యలేడు కదా!' అని సందేహం వ్యక్తం చేశారు. దానికి ఇబ్నె మస్‌ఊద్(రజి) 'ఓహెూ! అదా నీ సందేహం. నీవు కోరితే దైవప్రవక్త (స) నీ జాతి వారి గురించి వినిపించిన హదీసును వినిపిస్తాను' అని అన్నారు.

అల్ఖమా ఇలా అన్నారు: "నేను మర్యమ్ సూరాలోని యాభై ఆయత్‌లను పారాయణం చేసి వినిపించాను. తరువాత ఇబ్నె మస్‌ఊద్(రజి), ఎలా పఠించాడు? అని అడగ్గా, "చాలా బాగా పఠించాడ"ని ఖబ్బాబ్(రజి) చెప్పారు. ఇబ్నె మస్‌ఊద్(రజి) ఇలా అన్నారు: "నేను ఏ ఆయత్‌ను ఎలా పఠిస్తే, అల్‌ఖమా కూడా అలాగే పఠిస్తాడు". తరువాత ఆయన ఖబ్బాబ్ (రజి) వైపు ఎగాదిగా చూశారు. ఆయన చేతిలో బంగారు ఉంగరం ఉండటం గమనించి, "ఈ ఉంగరాన్ని తీసి పారవేసే సమయం ఇంకా ఆసన్నం కాలేదా?" అని అడిగారు. దానికి ఖబ్బాబ్, "ఈ రోజు తరువాత ఇక మీరు ఎన్నడూ నా చేతిలో ఈ ఉంగరం చూడరు" అంటూ ఆ ఉంగరాన్ని తీసేశారు.[1] ఈ హదీసును గుందర్ షూబా నుండి ఉటంకించారు.

---

249-1 ఈ హదీసు ద్వారా యమన్ ప్రజల ప్రాధాన్యత ద్యోతకం అవుతోంది. హదీసు విద్య పట్ల యమన్ వాసులలో గల శ్రద్ధాసక్తులు వేరితర దేశాల్లో లేదు. హృదయాల పొర పలుచగా ఉండటం అన్న మాటలోని ఆంతర్యం ఏమిటంటే, వారు సత్యాన్ని తొందరగా స్వీకరిస్తారు. ఇది విశ్వాసానికి (ఈమాన్‌కు) తార్కాణం.

## అధ్యాయం : 76

# దౌస్ తెగ గురించి, తుఫైల్ బిన్ అమ్ర్ దౌసీ (రజి) గురించి[1]

**251) మహనీయ అబూహురైరా(రజి) కథనం: తుఫైల్ బిన్ అమ్ర్ దౌసీ (రజి) దైవప్రవక్త(సఅసమ్) సన్నిధికి వచ్చి, 'దౌస్ తెగవారు నాశనమయ్యారు. వారు నా సందేశాన్ని త్రోసిపుచ్చారు. తమరు వారి కోసం దుఆ చేయండి' అని విన్నవించుకున్నారు. అప్పుడు ఆయన(స) ఆ తెగ వారి కోసం దైవాన్ని ఇలా వేడుకున్నారు- "దేవా! దౌస్ తెగ వారికి సన్మార్గం చూపు. వాళ్ళను నా దగ్గరకు తీసుకురా."**

**252) హజ్రత్ అబూ హురైరా(రజి) తెలిపారు : నేను నా స్వస్థలం నుండి దైవప్రవక్త(సఅసమ్) సన్నిధికి బయలుదేరినప్పుడు ఈ కవిత చదివాను : "బాధా కరమైన ఈ రాత్రి ఎంత సుదీర్ఘమైనదైనా ఇది మాత్రం నాకు 'కుఫ్ర్' నుండి విముక్తి నొసగింది."**

---

250-1. జైద్ బిన్ హుదైర్ బనూ అసద్ తెగవారు. అల్ఖమా నఖ్ఆ తెగకు చెందినవారు. దైవప్రవక్త(స) నఖ్ఆ తెగవారి కోసం ప్రార్థించేవారు.

బహుశా ఖబ్బాబ్ బిన్ అరత్(రజి) పురుషులు బంగారు ఉంగరం తొడుక్కోవడాన్ని 'అవాంఛనీయం' (మక్రూహ్)గా మాత్రమే భావించేవారేమో. కాని అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) హెచ్చరించిన పిదప, అది పురుషులకు నిషిద్ధం అని తెలుసుకుని ఆ ఉంగరాన్ని తీసివేశారు.

76-1. 'దౌస్' అనేది యమన్ దేశంలోని ఒక తెగ. తుఫైల్ బిన్ అమ్ర్ దౌసీ ఈ తెగకు చెందినవారే. ఈయన్ని 'జున్- నూర్' అని కూడా అంటారు. ఈయన మక్కా వచ్చి ఇస్లామ్ స్వీకరించిన తరువాత, దైవప్రవక్త(స) ఈయన్ని, ఈయన తెగ వారి వైపునకు ధర్మప్రచారకునిగా చేసి పంపారు. ఈయన తండ్రి ముస్లిం అయ్యాడు. కాని తల్లి మాత్రం ధర్మపరివర్తన చెందలేదు. తెగవారు కూడా ఆయన సందేశాన్ని స్వీకరించ లేదు. కేవలం ఒక్క అబూ హురైరా (రజి) మాత్రమే ఇస్లామ్ స్వీకరించారు.

తరువాత తుఫైల్ అభ్యర్థనపై దైవప్రవక్త(స) 'దౌస్' తెగ కోసం ప్రార్థించారు. అంతే, ఆ తెగవారంతా ధర్మపరివర్తన చెందారు. తనకు ఏదయినా 'చిహ్నం' వొసగమని తుఫైల్ అభ్యర్థించారు. దైవప్రవక్త (స) ఈయన కొరకు 'దేవా! కాంతి వొసగమ'ని దుఆ చేయగా, దేవుడు ఆయన వేడుకోలును ఆమోదించాడు. తత్ఫలితంగా తుఫైల్ రెండు కళ్ళ మధ్యనుండి కాంతి ప్రసరించేది. దాంతో ఆయనకు రాత్రి చీకట్లో కూడా వెలుగు ఉండేది.

నా బానిస మార్గమధ్యంలో నన్ను వదిలి పారిపోయాడు. నేను దైవ ప్రవక్త(స) సన్నిధిలో హాజరై ఆయన సమక్షంలో విధేయతా ప్రమాణం (బైయత్) చేశాను. నేను అక్కడ కూర్చుని ఉండగానే నా బానిస ప్రత్యక్షమయ్యాడు. "అబూ హురైరా! ఇదిగో నీ బానిస" అన్నారు దైవప్రవక్త(స). దానికి నేను, "దైవ ప్రీతి కొరకు ఈ క్షణం నుండే ఇతనికి స్వేచ్ఛను ప్రసాదిస్తున్నాన"ని అన్నాను.

## అధ్యాయం : 77
# 'తయ్'[1] తెగ ప్రతినిధి బృందం- అదీ బిన్ హాతిమ్(రజి) వృత్తాంతం

**253)** అదీ బిన్ హాతిమ్(రజి)[1] ఇలా వివరించారు: మేము ఉమర్(రజి) పరిపాలనా కాలంలో ఒక బృందం రూపంలో ఆయన దగ్గరకు వచ్చాము. ఆయన మాలోని ఒక్కొక్క వ్యక్తిని పేరు పెట్టి మరీ పిలువసాగారు. అప్పుడు నేను ఆయన గారితో, "అమీరుల్ మోమినీన్! మీరు నన్ను గుర్తుపట్టలేదా?" అని అడిగాను. దానికి ఆయన, "నిన్ను గుర్తు పట్టకపోవటమేమిటి? వీళ్ళంతా అవిశ్వాసులుగా ఉన్న కాలంలో నీవు ఇస్లామ్ స్వీకరించావు. వీళ్ళంతా వైముఖ్యం ప్రదర్శించినప్పుడు నీవు ఇటువైపునకు మరలి వచ్చావు. వీళ్ళంతా విశ్వాస ఘాతుకానికి పాల్పడుతున్న కాలంలో నీవు నమ్మదగ్గ నేస్తంగా నిరూపించుకున్నావు. వీళ్ళంతా సత్యాన్ని త్రోసి పుచ్చుతున్న రోజుల్లో నీవు సత్యాన్ని కనుగొన్నావు" అని సమాధానమిచ్చారు. ఇది విని నేను, "చాలు. ఇక నాకు ఏమైనా ఫరవాలేదు"[2] అన్నాను.

---

77-1. 'తయ్' అనేది ఒక తెగ పేరు. 'తయ్' అంటే గుండ్రంగా ఉండేది అని అర్థం. ఆ తెగ వారికి ఆ పేరు ఎందుకు వచ్చిందంటే ఆ ప్రదేశంలో అందరికన్నా ముందు గుండ్రని బావిని నిర్మించినది ఆ తెగవారే.

253-1. ఈయన 'తయ్' తెగకు చెందినవారు. ఈయన తండ్రి హాతిమ్ తాయి గొప్ప ధర్మదాతగా సుప్రసిద్ధులు.

253-2. అంటే, మీకు నా పరిస్థితి తెలిసి ఉన్నప్పుడు, నా విలువ ఏమిటో మీరు గుర్తించి నప్పుడు నన్ను పేరు పెట్టి పిలువకపోయినా ఫరవాలేదు. పూర్వాశ్రమంలో అదీ బిన్ హాతిమ్ క్రైస్తవుడు. ఈయన సోదరీమణిని ప్రవక్త(స) వేగుల వారు బందీగా పట్టుకున్నారు. అయితే దైవప్రవక్త(స) ఆమెకు మేలు చేసి విడుదల చేశారు. ఆ తరువాత తన సోదరీమణి సలహాపై అదీ బిన్ హాతిమ్ మహాప్రవక్త(స) వద్దకు వచ్చి చర్చ జరిపారు. చర్చల అనంతరం ఇస్లామ్ స్వీకరించారు.

## అధ్యాయం : 78

# హజ్జతుల్ వదా[1] (వీడ్కోలు హజ్జ్)

**254)** హజ్రత్ ఆయిషా(ర.అ) ఉర్వా బిన్ జుబైర్‌కు ఇలా వివరించారు : అంతిమ హజ్జ్‌యాత్ర సందర్భంగా మేము ప్రవక్త మహనీయుల(సఅసమ్)వెంట బయలుదేరాము. మేము ఉమ్రా నిమిత్తం ఇహ్రామ్ దీక్ష బూనాము. దైవప్రవక్త(స) తన సహచరులనుద్దేశించి, "ఎవరి దగ్గర 'హదీ' (ఖుర్బానీ పశువు) ఉందో, వారు ఉమ్రాతోపాటు హజ్జ్ కొరకు కూడా ఇహ్రామ్ కట్టుకోవాలి. ఈ రెండింటి క్రియలు నెరవేర్చేవరకూ ఇహ్రామ్ దీక్షను విడనాడకూడదు" అని సూచించారు. నేను ఆయన వెంట మక్కా చేరుకునేసరికి బహిష్టు స్థితికి లోనయ్యాను. అందువల్ల కాబా గృహ ప్రదక్షిణ గానీ, సఫా- మర్వాల సయీ గాని చేయలేకపోయాను. నేను నా పరిస్థితిని గురించి దైవప్రవక్త(స)కు బాధతో చెప్పుకోగా "జడ విప్పుకుని, దువ్వుకో. ఆ తరువాత హజ్జ్ కొరకు ఇహ్రామ్ కట్టుకో. ఉమ్రా మాత్రం చేయకు" అని నాకు సూచించారు. నేను అలాగే చేశాను. మేము హజ్జ్ చేసిన మీదట దైవప్రవక్త, నా సోదరుడు అబ్దుర్రహ్మాన్ బిన్ అబూబకర్‌తోపాటు 'తన్‌యీమ్' నుండి (ఉమ్రా కొరకు) ఇహ్రామ్ దీక్షబూనడానికి నన్ను పంపారు. "ఇది నీవు చేయలేకపోయిన ఉమ్రా ఖజా" అని ఆయన(స) నాతో చెప్పారు. ఆయిషా(ర.అ) ఇంకా ఇలా అన్నారు : ఎవరయితే కేవలం ఉమ్రా నిమిత్తం ఇహ్రామ్ కట్టుకున్నారో వారు కాబా గృహ ప్రదక్షిణ చేసి, సఫా- మర్వాల సయీ కూడా చేసి ఇహ్రామ్‌ను విప్పేశారు.

---

78-1. 'వదా' అంటే 'వీడ్కోలు', 'సెలవు' అని అసలు అర్థం. ఈ హజ్జ్ యాత్ర సందర్భంగా అంతిమ దైవప్రవక్త(స) తన సముదాయానికి అమూల్యమైన ప్రబోధనలు చేసి సెలవు తీసుకున్నారు.

మదీనాకు హిజ్రత్ చేసిన తరువాత దైవప్రవక్త(స) ఒకే ఒక హజ్జ్ చేశారు. అదే హజ్జతుల్ వదా. కాకపోతే హిజ్రత్‌కు పూర్వం ఆయన మూడుసార్లు హజ్జ్ చేశారని కొంతమంది హదీసువేత్తలు వెలికి తీశారు. అంతిమ హజ్జ్ యాత్రకు ఆయన హిజ్రీ 10, జీఖఅద 26వ తేదీన మదీనా నుండి జుహ్ర్ నమాజ్ చేసి బయలుదేరారు. ఈ యాత్రలో ఆయన వెంట దాదాపు లక్షా ఇరవై నాలుగు వేల మంది వరకూ ఉన్నారు. జుల్‌హిజ్జా నెల 4వ తేదీ ఉదయం ఆయన పవిత్ర మక్కాకు చేరుకున్నారు. ఆ సంవత్సరం అరఫా దినం శుక్రవారం నాడు వచ్చింది. ఈ యాత్ర చేసిన మూడు నెలల తర్వాత ఆయన(స) పరమపదించారు.

**తరువాత 'మినా' నుండి తిరిగి వచ్చాక వారు (హజ్జ్‌కు సంబంధించిన) రెండవ తవాఫ్ చేశారు. అయితే హజ్జ్‌తోపాటు ఉమ్రా కొరకు కూడా ఇహ్రామ్ కట్టుకున్న వారు ఒకే తవాఫ్ (ప్రదక్షిణ) చేశారు.[1]**

**255) హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) చెప్పినట్లుగా అతా బిన్ అబీ రబాహ్ ఉటంకించారు: ఉమ్రా చేసిన వ్యక్తి కేవలం కాబా గృహ ప్రదక్షిణతోనే 'హలాల్' అయిపోతాడు. అంటే ఇహ్రామ్ దీక్షలో ఉన్న ఆంక్షలన్నింటి నుండీ అతను విముక్తుడవుతాడు (అతను అప్పటికింకా సఫా- మర్వాల సయీ చేయకపోయినా సరే). ఇబ్నె జురైజ్ ఇలా అన్నారు: 'ఇబ్నె అబ్బాస్ ఈ అంశాన్ని ఎక్కడి నుండి వెలికి తీశారు?' అని నేను అతాను అడిగితే, 'సుమ్మ మహిల్లుహా ఇలల్ బైతిల్ అతీఖ్ (హజ్జ్:33) నుండి. ఈ ఆజ్ఞ ఆధారంగానే దైవప్రవక్త(స) తన సహచరులకు, హజ్జతుల్ వదాలో ఇహ్రామ్‌ను విప్పమ'ని సూచించినట్లుగా ఆయన సమాధాన మిచ్చారు. 'ఈ ఆజ్ఞ అరఫాత్ విడిది అనంతరం వర్తిస్తుంది కదా!' అని నేను సందేహపడగా, 'కాని ఇబ్నె అబ్బాస్(రజి) పంథా మాత్రం ఇదే. అరఫాత్‌లో విడిది చేసిన తరువాత అయినా విడిది చేయక ముందయినా- ఎట్టి పరిస్థితిలోనూ ఇహ్రామ్‌ను విప్పటం సరైనదే' అని ఆయన అన్నారు.**

**256) హజ్రత్ అబూ మూసా అష్‌అరీ (రజి) ఇలా వివరించారు: నేను ప్రవక్త మహనీయుల(సఅసమ్) సన్నిధిలో హాజరయ్యాను. ఆ సమయంలో ఆయన (స) 'వాదియె బత్‌హా' (రాతి ప్రదేశం)లో ఆగి ఉన్నారు. "నీవు హజ్జ్ నిమిత్తం ఇహ్రామ్ కట్టుకున్నావా?" అని ఆయన(స) అడిగారు. నేను 'అవున'న్నాను. "ఎటువంటి ఇహ్రామ్ దీక్ష బూనావు?" అని ఆయన(స) ప్రశ్నించగా, 'దైవప్రవక్త(స) బూనినటువంటి ఇహ్రామ్ దీక్షనే బూనాను' అని నేను సమాధానం ఇచ్చాను. దానికి ఆయన "ఉమ్రా కొరకు మొదట కాబా గృహ ప్రదక్షిణ చెయ్యి. ఆ తరువాత సఫా- మర్వాల 'సయీ' చేసి ఇహ్రామ్ ఆంక్షల నుండి విముక్తి పొందు" అని నాకు సూచించారు. అందువల్ల నేను బైతుల్లాహ్ తవాఫ్ చేసి, సఫా- మర్వాల మధ్య**

---

254-1. ఎందుకంటే ఉమ్రాకు సంబంధించిన క్రియలు హజ్జ్‌లో అంతర్భాగమై పోయాయి. దానిని ప్రత్యేకంగా నెరవేర్చాల్సిన అవసరం లేకుండాపోయింది. కాకపోతే దీంతో హనఫీలు ఏకీభవించరు. ఈ హదీసు ఇంతకుముందు 'హజ్జ్ ప్రకరణం'లోనూ గడిచింది.

**సయీ కూడా చేసిన మీదట ఖైస్ తెగకు చెందిన ఒక మహిళ ఇంటికి వెళ్ళాను. ఆమె నా తలలోని పేలు తీసింది.'[1]**

**257) అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఇలా తెలిపారు: ప్రవక్త సతీమణి హ|్రజత్ హఫ్సా (ర.అన్హా) నాకు తెలిపిన విషయమేమంటే దైవప్రవక్త(స) వీడ్కోలు హజ్జ్ యాత్ర సందర్భంగా తన భార్యలకు ఇలా ఆదేశించారు: "మీరంతా ఉమ్రా చేసిన పిదప ఇహ్రామ్ ఆంక్షల నుండి బయటపడండి (అంటే ఇహ్రామ్‌ను విడువండి)". 'దైవప్రవక్తా! మరి మీరు ఈ ఆంక్షల నుండి విముక్తం కావటం లేదు' అని (హఫ్సా) అడగ్గా, "నేను నా తలవెంట్రుకలను కూర్చుకున్నాను. నా ఖుర్బానీ పశువు మెడలో హారం వేశాను. అందుచేత నేను ఖుర్బానీ ఇచ్చేవరకూ ఇహ్రామ్‌ను విప్పలేను" అని ఆయన వివరించారు.**

**258) హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) కథనం: హజ్జతుల్ వదా సందర్భంగా ఖష్అమ్ తెగకు చెందిన ఒక మహిళ దైవప్రవక్త(స) సమక్షంలో ఒక ప్రశ్న వేసింది. ఆ సమయంలో ఫజల్ బిన్ అబ్బాస్(రజి) ప్రవక్త వెనుకే వాహనంపై కూర్చుని ఉన్నారు. 'దైవప్రవక్తా! దేవుని ఏ హక్కును దాసులు నెరవేర్చవలసి ఉన్నదో (అంటే హజ్జ్ విధి) అది నా తండ్రిపై కూడా విధితమై ఉంది. కాని ఆయన వృద్ధాప్యం కారణంగా వాహనంపై కూర్చోలేని స్థితిలో ఉన్నారు. మరైతే నేను ఆయన గారి తరఫున హజ్జ్ చేయగలనా?" అని ఆ స్త్రీ ప్రశ్నించగా, 'అవును. చేయగలవు'[1] అని ఆయన(స) సమాధానమిచ్చారు.**

**259) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు : మక్కా విజయం నాడు ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఏతెంచారు. ఆయన స్వారీ అయివున్న 'ఖస్వా' అనే ఒంటెపై, వెనుక ఉసామా బిన్ జైద్(రజి) కూర్చుని ఉన్నారు. ఆయన**

---

256–1. ఈ రకమయిన ఇహ్రామ్‌నే 'హజ్జె తమత్తు'గా వ్యవహరిస్తారు. అయితే దైవప్రవక్త(స) మాత్రం 'హజ్జె ఖిరాన్'కు సంబంధించిన దీక్ష బూనారు. కాని అబూ మూసా అష్అరీ (రజి)కి హజ్జె తమత్తు సులభంగా ఉంటుందన్న తలంపుతో దైవప్రవక్త ఆ మేరకు సలహా ఇచ్చారు. ఇప్పటికీ హజ్జె తమత్తుయే ఉత్తమం. ఎందుకంటే ఇందులో హాజీకి వెసులుబాటు ఉంటుంది.

258–1. ఈ హదీసు ఇంతకుముందు కూడా 'హజ్జ్ ప్రకరణం'లో వచ్చింది. దీని ద్వారా 'హజ్జె బదల్' చేయవచ్చు అన్న విషయం రూఢీ అవుతోంది. అయితే తన హజ్జ్ ముందుగా చేసిన వ్యక్తి మాత్రమే హజ్జె బదల్‌ని చేయటం ధర్మసమ్మతం.

(స)తోపాటు బిలాల్, ఉస్మాన్ బిన్ తల్హా కూడా ఉన్నారు. ఆయన(స) కాబా గృహం వద్ద తన ఒంటెను కూర్చోబెట్టి, "కాబా గృహం తాళం చెవులు తీసుకురా" అని ఉస్మాన్ బిన్ తల్హా (రజి)ను ఆదేశించారు. ఆయన తాళం చెవులు తెచ్చి, కాబా గృహ ద్వారం తెరిచారు. దైవప్రవక్త(స) లోపలికి వెళ్ళారు. ఆయన(స)తో పాటు ఉసామా, బిలాల్, ఉస్మాన్‌లు కూడా లోపలికి ప్రవేశించారు. ఆ తరువాత వారు కాబా ద్వారాన్ని లోపలి నుండి మూసివేశారు. చాలాసేపటి వరకు వారు లోపలే (ఆరాధనల్లో, వేడుకోళ్ళలో నిమగ్నులై) ఉన్నారు. ఆయన(స) బయటికి రాగానే జనులు కాబా గృహం లోపలికి వెళ్ళడానికి ఎగబడ్డారు. నేను అందరికన్నా ముందు లోనికి ప్రవేశించాను. ఆ క్షణంలో బిలాల్ (రజి) ద్వారం వెనుక నిలబడి ఉండటం గమనించి, 'దైవప్రవక్త(స) నమాజ్ చేసిన స్థలం ఏది?' అని అడిగాను. ఆయన ఆ స్థలం (సైగతో) చూపారు. కాబా గృహానికి లోపల ఆరు స్తంభా లున్నాయి. అవి రెండు వరుసల్లో ఉన్నాయి. ఆయన(స) మొదటి వరుసలోని రెండు స్తంభాల మధ్యన నమాజ్ చేశారు. ఆ సమయంలో కాబా గృహ ద్వారం ఆయన (స) వీపు వెనుక ఉండగా ఆయన ముఖారవిందం ద్వారానికి ఎదురుగా ఉన్న గోడవైపు ఉంది. ఆయన(స) నిలబడిన స్థలానికి– గోడకు మధ్యన మూడు మూరల ఎడం ఉంది. 'దైవప్రవక్త(స) లోపల ఎన్ని రకతుల నమాజ్ చేశారు?' అని బిలాల్‌ని అడగటం తాను మరిచిపోయానని ఇబ్నె ఉమర్(రజి) తెలిపారు. ఆయన(స) నమాజ్ చేసిన స్థలంలో ఎర్రని రంగు గల పాలరాయి పరచబడి ఉంది.

**260)** ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ ఆయిషా(ర.అ) తమతో చెప్పినట్లుగా ఉర్వా బిన్ జుబైర్, అబూ సలమా బిన్ అబ్దుర్రహ్మాన్ ఉటంకించారు: ఆమె ఇలా అన్నారు– హజ్జతుల్ వదా సందర్భంగా ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ సఫియ్యా (ర.అ) బహిష్టు స్థితికి లోనయ్యారు. అప్పుడు దైవప్రవక్త(స), 'ఏమిటి, ఈవిడ మూలంగా మనం ఆగిపోవలసి ఉంటుందా?"[1] అని అడిగారు. దానికి నేను, 'దైవ ప్రవక్తా! ఆమె మక్కాకు చేరుకోగానే 'తవాఫె జియారత్' చేసింది' అని అన్నాను. "అలాగా! అలాగయితే ఆమె కూడా మనతోపాటే బయల్దేరవచ్చు (తవాఫె వదా చేయనవసరం లేదు)" అని దైవప్రవక్త(స) చెప్పారు.

260–1. ఆమె 'తవాఫె జియారత్' చేయలేదేమోనని భావించి ఆయన(స) అలా అన్నారు.

**261)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఇలా అనేవారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) మా మధ్యన ఉన్న కాలంలోనే మేము 'హజ్జతుల్ వదా' అని అంటుండేవారం. హజ్జతుల్ వదా భావార్థం ఏమిటో మాకు తెలీదు.[1] తరువాత ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఒకసారి దైవస్తోత్రం చేసి, మసీహ్ దజ్జాల్ గురించి చాలా వివరంగా విపులీకరించారు. ఆయన(స) ఇలా అన్నారు: "అల్లాహ్ ద్వారా పంపబడిన ప్రవక్తలంతా మసీహ్ దజ్జాల్ గురించి తమ సముదాయాల వారిని హెచ్చరించారు. నూహ్(అ) తన జాతి వారికి అతనిని గురించి భయబోధ చేశారు. ఆ తరువాత వచ్చిన ప్రవక్తలు కూడా భయపెట్టారు. వాడు మీలో నుండే బయల్పడతాడు. కనుక బాగా గుర్తుంచుకోండి. వాడు అబద్ధీకు డనడానికి మీకు ఏ ఆధారమూ లభించకపోతే, ఈ ఒక్క ఆధారం చాలు. అదేమి టంటే, ఆ శాపగ్రస్తుడు ఒంటి కన్ను కలవాడై ఉంటాడు. మీ ప్రభువు మాత్రం ఒంటి కన్నుకలవాడు కాడు. వాడి కన్ను ద్రాక్షపండు మాదిరిగా ఉబ్బి ఉంటుంది. బాగా వినండి! అల్లాహ్ ఈ రోజును (అరఫా దినాన్ని), ఈ నగరాన్ని, ఈ నెలను హరామ్ (నిషిద్ధం, పవిత్రం)గావించినట్లే పరస్పరం మీరు రక్తపాతం సృష్టించ డాన్ని, మీ ధనాన్ని హరామ్ గావించాడు. చెప్పండి! నేను మీకు విషయాన్ని చేర వేశానా?" దానికి ప్రవక్త సహచరులు, 'అవును. మీరు విషయాన్ని చేరవేశార'ని చెప్పారు. అప్పుడాయన(స) మూడుసార్లు, "అల్లాహ్! దీనికి నీవే సాక్షివి" అని పలికారు. ఆ తరువాత ఇలా అన్నారు: "చూడండి! నా తదనంతరం మీరు ధర్మ భ్రష్టులై ముస్లింల మెడలు నరుక్కోకండి. ఇది కడు శోచనీయం."[2]

**262)** జైద్ బిన్ అర్ఖమ్(రజి) వివరించారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) మొత్తం 19 యుద్ధాలు చేశారు. హిజ్రత్ తరువాత ఒకే ఒక హజ్జ్ చేశారు. ఈ హజ్జ్ తరువాత ఇక ఆయన హజ్జ్ యాత్ర చేయనే లేదు. అదే హజ్జతుల్ వదా (వీడ్కోలు హజ్జ్ లేదా అంతిమ హజ్జ్)- అయితే మరో హజ్జ్‌ను ఆయన (స) హిజ్రత్‌కు పూర్వం చేసినట్లు అబూ ఇస్‌హాఖ్ చెప్పారు.[1]

---

261-1. 'వదా' అనే పదాన్ని గురించి అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) సందిగ్ధంలో పడ్డారు. ఇంతకీ వదా (వీడ్కోలు) అనేది మక్కా నగరానికి వర్తిస్తుందా? లేక మహాప్రవక్త(స)కు వర్తిస్తుందా? అన్నది ఆయన సందేహం. అయితే ఈ హజ్జ్ యాత్ర జరిగిన కొన్నాళ్ళ తరువాతే దైవప్రవక్త(స) పరమపదించారు.

**263)** జరీర్ బిన్ అబ్దుల్లాహ్ బజలీ (రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) వీడ్కోలు హజ్జ్ సందర్భంగా జరీర్(రజి)తో ఇలా అన్నారు: "(నేను చెప్పేది వినగలిగేలా) జనులను నిశ్శబ్దంగా ఉండమని చెప్పు". తరువాత ఇలా అన్నారు : "నా తదనంతరం ఒకరింకొకరి మెడలు నరుక్కుంటూ అవిశ్వాసులుగా మారకండి."

**264)** అబూబక్రా (రజి) కథనం: ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఇలా ప్రబోధించారు– "కాలచక్రం తిరిగి తిరిగి, అల్లాహ్ భూమ్యాకాశాలను సృష్టించిన నాటి స్థితికి చేరుకుంది. చూడండి! సంవత్సరానికి 12 నెలలు ఉంటాయి. వాటిలో నాలుగు నెలలు పవిత్రమైనవి (నిషిద్ధ మాసాలు). వాటిలో మూడు ఒకదాని తరువాత ఒకటి వస్తాయి– జీఖఅద, జిల్‌హజ్జా, ముహర్రమ్. నాల్గవ మాసం రజబ్. అది జమాది ఉల్ ఊలా నెలకి–షాబాన్‌కి మధ్యన ఉంటుంది. (ఆ తరువాత ఆయన–స ఇలా అడిగారు) "ఇది ఏ నెల?" దానికి మేము 'ఈ విషయం అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకే బాగా తెలుసు' అని బదులిచ్చాము. ఇది విని ఆయన(స) కొన్ని క్షణాలు మౌనం వహించారు. బహుశా ఆయన(స) ఈ ప్రఖ్యాత నెలకు మరో పేరు పెట్టనున్నారేమోనని తలపోశాము. కాని ఆయన(స), "ఇది జిల్‌హజ్జా నెల కాదా?" అని అడిగారు. 'అవును. ఖచ్చితంగా అదే' అని మేము విన్నవించుకున్నాము.

తరువాత ఆయన(స) "ఇది ఏ నగరం?" అని ప్రశ్నించారు. దానికి మేము, 'అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తే బాగా ఎరుగు' అని సమాధానమిచ్చాము. ఆయన (స) మళ్ళీ నిశ్శబ్దంగా ఉండిపోయారు. బహుశా ఆయన, ఈ విశ్వవిఖ్యాత నగరానికి మరో పేరు పెడతారేమోనని భావించాము. కాని ఆయన(స) నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ, "ఇది మక్కా (పుణ్యపురి) కాదా?" అని అడిగారు. దానికి మేము, 'ఎందుకు కాదు? (నిశ్చయంగా ఇది పవిత్ర మక్కా నగరమే)' అని చెప్పాము.

---

261–2. అంటే అకారణంగా, అన్యాయంగా సాటి ముస్లింను చంపటం అవిశ్వాసం (కుఫ్ర్)తో కూడిన చేష్ట.

262–1. ఇది అబూ ఇస్‌హాఖ్ ఊహ మాత్రమే. నిజానికి ఆయన(స) మక్కాలో ఉన్న కాలంలో ఏటేటా హజ్జ్ చేసేవారు.

పిదప ఆయన(స) "ఇది ఏ దినం?" అని అడిగారు. 'ఈ సంగతి అల్లాహ్‌కు, ఆయన సందేశహరునికే బాగా తెలుసు' అని చెప్పాము. ఆయన(స) ఈసారి కూడా కొన్ని క్షణాలు మౌనం వహించారు. బహుశా ఈ దినానికి గల సుప్రసిద్ధ నామానికి బదులు ఆయన మరో పేరు పెట్టబోతున్నారేమోనని మేము ఊహించాము. కాని ఆయన(స) మమ్మల్ని ఉద్దేశించి "ఇది యౌమున్నహర్ (ఖుర్బానీ దినం) కాదా?"[1] అని అడిగారు. 'ఖచ్చితంగా ఇది ఖుర్బానీ దినమే' అని మేము చెప్పాము.

ఆ తరువాత "ఈ దినం, మీ ఈ నగరం, మీ ఈ నెల పవిత్రం (నిషిద్ధం) అయినట్లే మీ రక్తం, మీ సంపద, మీ మాన మర్యాదలు పవిత్రం (నిషిద్ధం) గావించబడ్డాయి. మీరు అతి త్వరలోనే మీ ప్రభువును కలుసుకోబోతున్నారు. ఆయన మిమ్మల్ని మీ ఆచరణల గురించి ప్రశ్నించనున్నాడు. చూడండి! నా తదనంతరం మీరు మార్గభ్రష్టులై పరస్పరం మీ మెడలు నరుక్కోకండి. ఇక్కడ ఉన్నవారు ఇక్కడ లేనివారికి ఈ విషయాన్ని చేరవేయండి. ఇక్కడ ఉండి విన్నవారి కన్నా ఇక్కడ లేనివాడు ఈ సందేశాన్ని విని బాగా జ్ఞాపకం ఉంచుకోవచ్చు". ముహమ్మద్ బిన్ సీరీన్ గారు ఈ హదీసును ప్రస్తావించినప్పుడల్లా 'ముహమ్మద్(స) సత్యం పలికారు' అని అనేవారు- తరువాత ఆయన(స) ఇలా అన్నారు: "నేను సందేశాన్ని మీకు చేరవేశానా?". ఆయన(స) రెండుసార్లు ఇలా అన్నారు.

**265)** ఖైస్ బిన్ ముస్లిమ్‌తో తారిఖ్ బిన్ షిహాబ్ ఇలా అన్నారు : కొంత మంది యూదులు '(మీ గ్రంథంలో) ఒక ఆయత్ అవతరించింది. ఒకవేళ ఆ ఆయత్ గనక మాకు అవతరించి ఉంటే మేము పండుగ చేసుకునేవాళ్ళం' అన్నారు. దానికి హజ్రత్ ఉమర్(రజి), "అది ఏ ఆయత్?" అని అడిగారు. దానికి సమాధానంగా వారిలా అన్నారు- "అల్ యౌము అక్మల్తులకుమ్ దీనుకుమ్ వ

264-1. ఇంతకీ జరిగిందేమిటంటే, అప్పట్లో బహుదైవారాధకులు నిషిద్ధ మాసాలను తమ స్వార్థ ప్రయోజనాలకనుగుణంగా వెనక్కీ ముందుకీ జరుపుకునేవారు. నెలల్ని తారుమారు చేసేవారు. ఉదాహరణకు- ముహర్రమ్ నెలలో పోరాడటం నిషిద్ధం. కాని ఆ నెలలో యుద్ధం చేయటం అవసరం అని వారు భావిస్తే ఆ నెలను సఫర్ మాసంగా పరిగణించి, సఫర్ మాసానికి ముహర్రమ్ మాసం అని పేరు పెట్టేవారు. ఈ విధంగా వారు అనాదిగా నెలలను తారుమారు చేస్తూ, దైవ ధర్మంతో చెలగాటమాడేవారు. అంతిమ దైవప్రవక్త(స) తన వీడ్కోలు హజ్జ్ యాత్ర సందర్భంగా ఈ వ్యవస్థలోని చెడుగును సంస్కరించారు.

**అత్‌మమ్తు అలైకుమ్ నీ మతీ" (ఈనాడు నేను మీ ధర్మాన్ని మీ కొరకు పరిపూర్ణం చేశాను. మీపై నా అనుగ్రహాన్ని పూర్తి చేశాను)'. అది విని ఉమర్(రజి) ఇలా అన్నారు : "అవును, ఈ ఆయత్ ఎక్కడ, ఏ సందర్భంలో అవతరించిందో నాకు బాగా తెలుసు. దైవప్రవక్త(సఅసమ్) అరఫాత్ మైదానంలో- హజ్జతుల్ వదా సందర్భంగా- నిలుచుని ఉండగా ఈ ఆయత్ అవతరించింది."[1]**

**266) ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ ఆయిషా(ర.అ) ఉర్వా బిన్ జుబైర్‌తో ఇలా అన్నారు : మేము ప్రవక్త మహనీయుల(సఅసమ్)తో కలసి (హజ్జ్ యాత్రకు) బయలుదేరినప్పుడు, మాలో కొంతమంది ఉమ్రా నిమిత్తం ఇహ్రామ్ కట్టుకున్నారు. కొందరు హజ్జ్ నిమిత్తం ఇహ్రామ్ కట్టుకున్నారు. ఇంకా కొందరు హజ్జ్‌తోపాటు ఉమ్రా కొరకు కూడా ఇహ్రామ్ కట్టుకున్నారు. ఎవరయితే హజ్జ్ కొరకు ఇహ్రామ్ దీక్షబూనారో, లేదా హజ్జ్‌తోపాటు ఉమ్రా కొరకు కూడా ఇహ్రామ్ దీక్ష బూనారో, వారు ఖుర్బానీ దినాన (10వ రోజున) హలాల్ అయ్యారు (అంటే ఇహ్రామ్ దీక్ష నుండి విముక్తులయ్యారు).**

**267) ఇమామ్ మాలిక్ తమకు తెలియజేసినట్లుగా అబ్దుల్లాహ్ బిన్ యూసుఫ్ వివరించారు- తరువాత ఇదే హదీసును విశదీకరించారు. అందులో ఇలా వుంది : 'మేము ప్రవక్త మహనీయుల(సఅసమ్)తో కలసి అంతిమ హజ్జ్ యాత్రకు బయలుదేరాము..'**

**268) సాద్ బిన్ అబీ వక్కాస్(రజి) తన కుమారుడు ఆమిర్ బిన్ సాద్‌తో ఇలా అన్నారు: హజ్జతుల్ వదా సందర్భంగా ప్రవక్త మహనీయులు(సఅసమ్) నన్ను పరామర్శించడానికి వచ్చారు. నా అస్వస్థత నన్ను దాదాపు మృత్యుముఖం వరకూ చేర్చింది.**

**నేను దైవప్రవక్త(స)తో, 'యా రసూలల్లాహ్! నా అస్వస్థత ఏ స్థితికి చేరిందో తమరు చూస్తూనే ఉన్నారు. నా దగ్గర సంపద ఉంది. నా ఒక్కగానొక్క కూతురు మాత్రమే దానికి వారసురాలు. మరైతే ఈ సంపదలో మూడింట రెండొంతులు**

---

265-1. తిర్మిజీలో ఉన్న ఒక ఉల్లేఖనంలో హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా ఉల్లేఖించారు: "ఆ రోజు రెండు పండుగలు. ఒకటి; అది శుక్రవారం రోజు. అంటే ముస్లింల సాప్తాహిక పండుగ. రెండవది; అరఫా దినం. ఇది పండుగ దినం కన్నా ఎక్కువ శ్రేష్టమైనది."

దానం చేయమంటారా?' అని అడిగాను. దానికి ఆయన,

"వద్దు" అన్నారు.

'పోనీ సగం ఆస్తి దానం చేయనా?' అని అడిగాను.

"వద్దు" అనే సెలవిచ్చారు ప్రవక్తశ్రీ(స).

'పోనీ, మూడింట ఒక వంతు ఇవ్వమంటారా?' అని అడిగితే,

ప్రవక్త మహోదయులు(స) ఇలా ఉపదేశించారు: "మూడింట ఒక వంతు కూడా ఎక్కువే. నీవు నీ వారసులను నీ వెనక అభాగ్యులుగా, వారు ఇతరుల ముందు చేయి చాచి ముష్టెత్తుకునే వారిగా వదలిపోవటం కన్నా, వారిని స్థితి మంతులుగా వదలిపోవటం మిన్న. నీవు ఏం ఖర్చుపెట్టినా, తద్వారా దైవప్రసన్న తను చూరగొనాలన్నది నీ లక్ష్యమై ఉంటే దానికిగాను నీకు పుణ్యఫలం ప్రాప్తమవు తుంది. ఆఖరికి నీవు నీ భార్య నోటికి అందించే అన్నం ముద్దకు కూడా నీకు పుణ్యఫలం లభిస్తుంది."

'దైవప్రవక్తా! (వ్యాధి కారణంగా) నేను నా సహచరులతోపాటు మదీనా చేరుకోలేనా?' అని నేను విన్నవించుకోగా,

"ఒకవేళ నీవు చేరుకోలేకపోయినా, నీవు గనక దైవప్రసన్నతను బడసే ఉద్దేశ్యంతో ఏదైనా ఆచరణ చేసినట్లయితే, దైవ సన్నిధిలో నీ అంతస్తు ఉన్నతమవు తుంది. ఇకపోతే నీకు నీ అస్వస్థత గురించి బెంగ పట్టుకుంది. కాని నీవు ఇంకా (చాలా కాలం) బ్రతుకుతావని నేనాశిస్తున్నాను. నీవల్ల కొంతమందికి (ముస్లిం లకు) లాభం చేకూరుతుంది. మరి కొంతమందికి (ఇస్లామ్ శత్రువులకు) నష్టం కలుగుతుంది. ఓ అల్లాహ్! నా సహచరుల హిజ్రత్ (వలస)ను పరిపూర్ణం గావించు. వారిని వెనక్కి మరల్చకు. కాని సాద్ బిన్ ఖౌలాపై ఎలాగూ విపత్తు ముంచుకు వచ్చింది." సాద్ బిన్ ఖౌలా మక్కాలో మరణించటం పట్ల దైవప్రవక్త(స) తన దుఃఖాన్ని ఈ విధంగా వ్యక్తపరిచారు.[1]

---

268-1. ఈ హదీసు ఇంతకుముందు కూడా గడిచింది. అయితే ఈ సంఘటన 'హజ్జతుల్ వదా' సందర్భంగా జరగటం వల్ల దీనిని మళ్ళీ పునరావృతం చేయవలసి వచ్చింది. ఇకపోతే 'ముహాజిర్' అయిన వ్యక్తి తాను ఏ స్థలం నుండి హిజ్రత్ చేశాడో, అదే స్థలంలో తనువు చాలించటం అంతగా మంచిది కాదు.

**269)** హ్రజత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) నాఫేకు అందించిన సమాచారం ప్రకారం ప్రవక్త మహనీయులు(సఅసమ్) అంతిమ హజ్జ్ యాత్ర సందర్భంగా శిరోముండనం చేయించుకున్నారు.

**270)** ఇబ్నె ఉమర్(రజి) తెలిపారు: అంతిమ హజ్జ్ యాత్ర సందర్భంగా ప్రవక్త మహనీయులు(స) తమ శిరోముండనం చేయించుకున్నారు. ఆయన(స) వెంట ఉన్న సహచరుల్లో కొంతమంది శిరోముండనం చేయించుకోగా, మరి కొంత మంది జుత్తు కత్తిరించుకున్నారు.

**271)** హ్రజత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) తెలిపారు: తాను ఒక గాడిదపై స్వారీ అయి వచ్చినప్పుడు, దైవప్రవక్త(స) 'మినా'లో నిలబడి జనులకు నమాజ్ చేయిస్తున్నారు. హజ్జతుల్ వదా సందర్భంగా జరిగిన సంఘటన ఇది. తన గాడిద ఆ పంక్తిలో కొంత భాగం దాటిపోయింది. తరువాత ఆయన వాహనం దిగి, జనుల పంక్తిలో నిలబడ్డారు.

**272)** తన తండ్రి ఉర్వా తనతో చెప్పినట్లుగా హిషామ్ బిన్ ఉర్వా తెలిపారు: హజ్జతుల్ వదా సందర్భంగా దైవప్రవక్త(సఅసమ్)– ప్రయాణంలో– ఎంత వేగంగా వెళ్ళారని ఉసామా(రజి)ను ప్రశ్నించగా, ఆ వేగం మధ్యస్థంగా ఉండేదని, దారి విశాలంగా ఉన్నప్పుడు వేగం పెంచేవారని తెలియజేశారు.

**273)** అబూ అయ్యూబ్(రజి) తెలిపారు: అంతిమ హజ్జ్‌యాత్ర సందర్భంగా ఆయన దైవప్రవక్త(సఅసమ్)తోపాటు మగ్రిబ్, ఇషా నమాజులు కలిపి చేశారు.[1]

**అధ్యాయం : 79**

# తబూక్ యుద్ధం గురించి. దీనికి గల మరో పేరు 'ఆర్థిక ఇబ్బందుల యుద్ధం'[1]

273–1. పై హదీసులన్నింటిలో ఏదో ఒకవిధంగా 'హజ్జతుల్ వదా' ప్రస్తావన వచ్చింది. అందుచేతనే ఇమామ్ బుఖారీ (రహ్మ) ఈ హదీసులను ఇక్కడ పొందుపరిచారు. ఇది ఆయన భావాన్వయ నైపుణ్యానికి ఒక నిదర్శనం.

79–1. మూలంలో 'ఉస్రత్' అనే పదం వచ్చింది. ఉస్రత్ అంటే కష్టం, లేమి, ఆర్థిక ఇబ్బంది అన్న అర్థాలు వస్తాయి. ఈ యుద్ధ సందర్భంగా ప్రవక్త సహచర మాన్యులకు కావలసినన్ని వాహనాలు లేవు. ఆహార పదార్థాలు, దుస్తులు కూడా లేవు. ఇది హిజ్రీ 9వ సంవత్సరం రజబ్ నెలలో ఎదురైన పరిస్థితి. ఈ యుద్ధ ప్రస్తావన తౌబా సూరాలో

**274)** మహనీయ అబూ మూసా అష్అరీ (రజి) కథనం: నా స్నేహితులు కొందరు నన్ను దైవప్రవక్త(స) సన్నిధికి పంపించి, వాహనాలుగా కొన్ని పశువుల (ఒంటెల) కోసం అభ్యర్థించమని కోరారు. వారంతా ఆయన (స)తో కలసి ఇక్కట్ల యుద్ధం (తబూక్ యుద్ధం)లో పాల్గొనాలని కోరుకున్నారు. నేను వెళ్ళి, 'దైవప్రవక్తా! నా స్నేహితులు నన్ను మీ దగ్గరకు పంపించారు. తమరు ఎలాగైనా సరే వారి కొరకు వాహనాలను (ఒంటెలను) సమకూర్చండి' అని విన్నవించుకున్నాను. దానికి ఆయన(స), "దైవసాక్షిగా! నేను నీకు వాహనాలను సమకూర్చలేను" అని నిర్ద్వంద్వంగా చెప్పేశారు. నేను ఆయన(స) సన్నిధిలో హాజరైన సమయంలో ఆయన(స) కోపావేశంలో ఉన్నారు. ఈ విషయాన్ని నేను పసిగట్టలేకపోయాను. ఆయన(స) నిరాకరించడంతో నేను తీవ్ర దుఃఖానికి లోనై తిరిగి వచ్చేశాను. బహుశా నేను వాహనాలను ఇవ్వమని అడిగిన కారణంగా ఆయన(స) ఆగ్రహం చెందారేమోనన్న శంక నన్ను కలచివేసింది.[1] నేను నా స్నేహితుల దగ్గరకు వచ్చి దైవప్రవక్త(స) చెప్పిన మాటను వారికి వినిపించాను. కాని ఇలా చెప్పిన కొద్ది సమయానికే నేను బిలాల్(రజి) పిలుపును విన్నాను– 'ఓ అబ్దుల్లాహ్ బిన్ ఖైస్!' అని ఆయన కేకేసి పిలుస్తున్నారు. నేను ఆయన పిలుపుకు స్పందించగానే 'దైవ ప్రవక్త(స) మిమ్మల్ని రమ్మంటున్నార'ని అన్నారు. నేను దైవప్రవక్త(స) సన్నిధిలో హాజరవగానే, "ఇదిగో ఈ రెండు జతలు. ఇవిగో, వీటిని కూడా తోలుకుని వెళ్ళు" అన్నారు. ఆ విధంగా ఆయన(స) మొత్తం ఆరు ఒంటెల్ని మాకు సమ కూర్చారు. ఆ ఒంటెల్ని ఆయన(స) అప్పుడే సాద్ (రజి) నుండి కొనుగోలు చేశారు. ఇంకా ఇలా వక్కాణించారు: "వీటిని నీ స్నేహితులకు ఇవ్వు. దైవం లేక దైవప్రవక్త మీకు వాహనాలుగా వీటిని సమకూర్చారు. వీటిపై స్వారీ అవండి అని వారికి చెప్పు"–

నేను ఆ ఒంటెల్ని తోలుకుని నా సహవాసుల వద్దకు వెళ్ళాను. ఇదిగో దైవప్రవక్త మీకు వాహనాలుగా ఈ ఒంటెల్ని ఇచ్చారు. అయితే దైవసాక్షిగా! మొదట

---

వివరంగా వచ్చింది. అది తీవ్రమైన ఎండాకాలం. ఖర్జూర పంట కోతకు వచ్చి ఉంది. అటువంటి సమయంలో ప్రియ సహచరులు యుద్ధ ప్రయాణానికి బయల్దేరడ మన్నది వారి విశ్వాసానికి పరీక్ష. కపటులు బాహాటంగానే ఈ ప్రయాణానికి నిరాకరించారు. తౌబా సూరాలోని 94వ ఆయత్‌లో ఇలాంటి ద్వంద్వ నీతిపరుల ప్రస్తావన వచ్చింది.

**దైవప్రవక్త(స) నిరాకరించిన వైనాన్ని విన్న సహచరమాన్యుల వద్దకు మీరు రావలసి ఉంటుంది. ఎందుకంటే దైవప్రవక్త(స) నాతో మొదట చెప్పిన మాటను నేను వక్రీకరించి ఉంటానన్న అనుమానం మీకు రావచ్చు'[2] అని చెప్పాను. దానికి వారు, 'అయ్యో! మీ సత్యనిబద్ధత పట్ల మాకు ఎలాంటి అనుమానం లేదు. కాని ఒకవేళ మీరు అంతగా పట్టుబడితే, మేము అలాగే వస్తాము' అన్నారు.**

**అబూ మూసా(రజి) వారిలో నుండి కొంతమందిని తీసుకుని దైవప్రవక్త(స) పలుకుల్ని విన్న సహచరుల వద్దకు వచ్చారు- అంటే దైవప్రవక్త(స) మొదట్లో వాహనాలను సమకూర్చడానికి నిరాకరించి, ఆ తర్వాత ఒంటెల్ని ఇచ్చిన సంగతిని వారి చేత ధ్రువీకరించుకోవాలనుకున్నారు. ఆ సహచరమాన్యులు(రజి) కూడా ఈ విషయాన్ని నిజమని ధ్రువపరిచారు.**

**275) ముస్అబ్ బిన్ సాద్ తన తండ్రి నుండి ఉటంకించారు: ప్రవక్త మహనీయులు(సఅసమ్) తబూక్ యుద్ధానికి వెళుతూ[1] మదీనాలో అలీ(రజి)ని తన స్థానంలో ఆపద్ధర్మ అధికారిగా నియమించారు. దానికి అలీ(రజి), "మీరు నన్ను పసిపిల్లల, మహిళల మధ్యన వదలివెళుతున్నారా?"[2] అని విన్నవించుకోగా, ఆయన(స) ఇలా అన్నారు : "మూసా (అలైహిస్సలామ్) కొరకు హారూన్(అ) ఎలాంటి వారో నా కొరకు నీవు అలాంటి వాడవు. ఇది నీకు సంతోషకరం కాదా?**

---

274-1. అబూ మూసా అష్అరీ(రజి) దుఃఖానికి అసలు కారణం వాహనాలు లభించక పోవటం కాదు. తన అభ్యర్థన కారణంగా దైవప్రవక్త(స) మనస్సు నొచ్చుకుందేమో నన్నదే ఆయన బాధ. సుబ్హానల్లాహ్. ప్రవక్త సహచరమాన్యుల ప్రేమాభిమానం, త్యాగశీలం గురించి ఏమని చెప్పేది!

274-2. తన సహవాసులు తనను అబద్ధీకుడు అనుకుంటారేమోనన్న అనుమానం అబూ మూసా(రజి)ను పీడించింది. తాను వారితో అబద్ధం చెప్పలేదన్న దానికి సాక్ష్యాధారాలు సమర్పించి, తాను సచ్ఛీలుడనని నిరూపించుకోవాలనుకున్నారు.

275-1. రోము సామ్రాజ్యపు క్రైస్తవులు ముస్లింలపై దండయాత్రకు సన్నాహాలు చేస్తున్నారన్న సమాచారం దైవప్రవక్త(స)కు అందింది. ఈ దండయాత్ర కొరకు వారు అరేబియాలోని కొన్ని తెగలవారి సహాయ సహకారాలు పొందుతున్నారని కూడా తెలిసింది. అందువల్ల దైవప్రవక్త(స) స్వయంగా రాజ్య సరిహద్దుల వరకూ వెళ్ళి తాము ప్రతిఘటనకు సిద్ధంగా ఉన్నామన్న సంకేతాన్ని ప్రత్యర్థికి ఇవ్వాలనుకున్నారు. ఈ యుద్ధం కొరకు హజ్రత్ ఉస్మాన్(రజి) రెండు వందల ఒంటెల్ని వాటి వీపులపై ఉన్న సరుకుతో సహా సమర్పించుకున్నారు. ఈ త్యాగానికి దైవప్రవక్త(స) ప్రసన్నులై,

**కాకపోతే వ్యత్యాసం ఒక్కటే. అదేమంటే నా తదనంతరం మరో ప్రవక్త ఉండడు."[3]**

**276) తన తండ్రి తనతో చెప్పినట్లుగా సఫ్వాన్ బిన్ యాలా బిన్ ఉమయ్యా తెలియజేశారు : (ఆయన తండ్రి ఇలా చెప్పారు)- నేను ప్రవక్త మహనీయుల (సఅసమ్)తో కలసి ఇబ్బందుల యుద్ధం (తబూక్ యుద్ధం)లో పాల్గొన్నాను. యాలా ఇలా అనేవారు: 'నేను చేసుకున్న ఆచరణలన్నింటిలో దీనిపైనే నాకు గట్టి నమ్మకం ఉండేది. ... యాలా ఇంకా ఈ విధంగా కూడా తెలిపారు: 'ఈ సందర్భంగా నేను (నాకు సహాయంగా ఉండటానికి) ఒక పని మనిషిని కూడా పెట్టుకున్నాను. అయితే ఆ వ్యక్తి మరో వ్యక్తితో గొడవ పడ్డాడు. వారిలో ఒకడు ఇంకొకని చేతిని కరిచాడు (ఎవరు ఎవరి చేతిని కరిచాడో తనకు జ్ఞాపకం లేదని ఉల్లేఖకుడు చెప్పారు). మొత్తానికి ఎవరి చేయి కరవబడిందో, అతను తన చేతిని కరచిన వాని నోటి నుండి బలంగా లాక్కున్నాడు. తత్కారణంగా కరచినవాని నోట్లోని పన్ను ఒకటి ఊడిపోయింది. వారిద్దరూ దైవప్రవక్త(స) సన్నిధిలో హాజరయ్యారు. అయితే దైవప్రవక్త(స) పన్ను ఊడిపోయిన వ్యక్తికి 'దియత్' (నష్టపరిహారం) ఇప్పించలేదు. పైగా దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "అతను నీ నోట్లోనే తన చేతిని ఉండనిస్తే ఒంటె మాదిరిగా అతని చేతిని నమలి ఉండే వాడివి."**

## అధ్యాయం : 80

# కాబ్ బిన్ మాలిక్(రజి) వృత్తాంతం

**(ఈయన తబూక్ యుద్ధంలో వెనుక ఉండిపోయిన వారిలో ఒకరు). వారి గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "వ్యవహారం వాయిదా వేయబడిన ఆ ముగ్గురిని కూడా అల్లాహ్ క్షమించాడు."[1]**

---

"ఇక మీదట ఉస్మాన్ ఆచరణ ఎలా ఉన్నా అది అతనికి హాని కలిగించదు" అని వక్కాణించారు.

275-2. అంటే, తాను యుద్ధానికి పనికిరానా!? అన్నది మహనీయ అలీ(రజి) ఆవేదన.

275-3. ఈ హదీసు ద్వారా మహనీయ అలీ(రజి) గొప్పదనం తేటతెల్లమవుతోంది. ఒక్క ప్రవక్తా పదవిని మినహాయిస్తే తక్కిన గొప్ప లక్షణాలన్నీ ఆయనలో ఉండేవి. అంత మాత్రాన షియా వర్గీయులు తలపోస్తున్నట్లుగా దైవప్రవక్త(స) తదనంతరం అలీ(రజి) ఖిలాఫత్‌కు హక్కుదారులు అన్న ఆధారమేదీ ఈ పలుకుల ద్వారా రూఢీ అవదు.

**277) అబ్దుల్లాహ్ బిన్ కాబ్ బిన్ మాలిక్ కథనం: (కాబ్ బిన్ మాలిక్–రజి–కు వృద్ధాప్యంలో కంటిచూపు పోయినప్పుడు ఆయన కుమారుల్లో ఈయన గారే కాబ్‌ను పట్టుకుని దారిలో నడిపించేవారు). ఆయన ఇలా అన్నారు: నేను కాబ్(రజి) ద్వారా, ఆయన తబూక్ యుద్ధంలో పాల్గొనలేకపోవడానికి సంబంధించిన వృత్తాంతాన్ని విన్నాను. ఆయన (కాబ్ బిన్ మాలిక్) ఇలా వివరించారు–**

**“నేను ఒక్క తబూక్ యుద్ధం తప్ప మరే యుద్ధంలో కూడా దైవప్రవక్త(స)తో కలసి పాల్గొనకపోవటం అనేది జరగలేదు. కాకపోతే బద్ర్ సంగ్రామంలో కూడా నేను పాల్గొనలేదు. అయితే ఆ యుద్ధంలో పాల్గొనలేకపోయిన వారిపై దైవ ప్రవక్త(స) ఎలాంటి అసంతృప్తిని వ్యక్తపరచలేదు. ఎందుకంటే అదొక అనూహ్య పరిణామం. ఆ సమయంలో దైవప్రవక్త(స) కేవలం ఖురైషు వర్తక బిడారు అన్వేషణలో బయలుదేరారు. కాని దైవాజ్ఞపై, ఎలాంటి ముందస్తు సన్నాహాలు లేకుండానే ఆయన(స) తన శత్రువులతో తలపడాల్సి వచ్చింది. అయితే నేను ‘అఖబా ప్రతిజ్ఞ’ జరిగిన రాత్రి దైవప్రవక్త(స) సేవలో హాజరైన వారిలో ఒకణ్ణి. మేము (మక్కాలో) ఇస్లాం ధర్మోన్నతికై శపథం చేసిన రాత్రి అది. నా దృష్టిలో అది బద్ర్ సంగ్రామంకన్నా ప్రియమైనది. కాకపోతే బద్ర్ యుద్ధం గురించి జనులు చాలా ఎక్కువగా చర్చించుకుంటారు.**

**మూడవ విషయం: నేను తబూక్ యుద్ధ సందర్భంగా దైవప్రవక్త(స)తో కలసి పాల్గొనలేకపోయిన రోజుల్లో ఆర్థికంగా చాలా బలోపేతంగా ఉన్నాను. అంతకుముందెన్నడూ నేను ఆర్థికంగా అంతగా స్థితిమంతుణ్ణి కాను. దైవసాక్షిగా! అంతకు మునుపెన్నడూ నా దగ్గర రెండు ఒంటెలు లేవు. కాని ఆ సందర్భంగా మాత్రం నా వద్ద రెండు ఒంటెలున్నాయి.**

**దైవప్రవక్త(స) ఏ యుద్ధానికయినా బయలుదేరవలసి ఉంటే, ఆ ప్రదేశం గురించి చూచాయగా మాత్రమే తెలియజేసేవారు. కాని ఈ యుద్ధ సందర్భం వచ్చినప్పుడు అలా చేయలేదు– అప్పుడు ఎండలు మండిపోతున్నాయి. ప్రయాణం**

---

80–1. అంటే, ఆ ముగ్గురు తబూక్ యుద్ధానికి వెళ్ళకపోయినప్పటికీ దయతో అల్లాహ్ వారిని క్షమించాడు. ఎందుకంటే వారు ముగ్గురూ చిత్తశుద్ధి కలవారు. వారిలో ఒకరు కాబ్ బిన్ మాలిక్, రెండవ వారు మురారా బిన్ రబీ, మూడవ వారు హిలాల్ బిన్ ఉమయ్యా.

కూడా సుదీర్ఘమైనది. పైగా అది ఎడారి ప్రయాణం. దానికితోడు శత్రువులు చాలా పెద్ద సంఖ్యలో ఉన్నారు. సర్వవిధాలా ఎన్నో కష్టాలు ఎదుర్కోవలసి ఉంది. అందుచేత ప్రవక్త మహనీయులు(స) ఈ యుద్ధం గురించి ప్రతి విషయం క్షుణ్ణంగా విడమరిచి చెప్పేశారు. మేము యుద్ధ సన్నాహాలు చేసుకోవాలన్నదే దీని ఉద్దేశం. ఏ మార్గం గుండా ప్రయాణం చేయవలసి ఉందో కూడా ఆయన(స) ముందుగానే సూచించారు. ఈ సందర్భంగా ముస్లింలు కూడా ఆయన(స) వెంట భారీ సంఖ్యలో ఉన్నారు. ఎంత ఎక్కువ మంది ఉన్నారంటే రిజిస్టరులో వారి పేర్లు నమోదు చేయటం కూడా కష్టమైపోయింది.

కాబ్(రజి) ఇలా అన్నారు: యుద్ధానికి వెళ్ళదలచని వ్యక్తి ఎవరయినా, తన గైర్హాజరు గురించి ఎవరికీ తెలియదని ఊహించడానికి కూడా ఆస్కారముంది. దైవవాణి అవతరిస్తే తప్ప ఎగనామం పెట్టినవారి గురించి తెలిసిరాదు. దైవ ప్రవక్త(స) ఈ ప్రయాణానికి బయలుదేరుతున్న రోజుల్లో ఖర్జూర పంట చేతికొచ్చి ఉంది. చెట్ల క్రింద కూర్చుని జనులు సేద తీరుతూ ఉండేవారు. ఒకవైపు దైవ ప్రవక్త(స), మరోవైపున ముస్లింలు కూడా ప్రయాణ సన్నాహాల్లో నిమగ్నులై ఉన్నారు. కాని నేను మాత్రం ఇప్పుడే తొందరేముందీ, రేపటి నుంచి తయారీ చేసు కుంటే సరిపోతుందిలే అని నా మనసుకు సర్ది చెప్పుకునేవాణ్ణి. ఈ విధంగా అనుదినం దాటవేస్తూ గడిపాను. తయారీ చేసుకోగలననే మితిమీరిన ధీమా నాది. సౌలభ్యాలు ఉండేవి. ఇలా ఊహించుకుంటూ ఉండే లోగానే పుణ్యకాలం దాటి పోయింది. ఈ లోగా జనులంతా తమ ప్రయాణ సన్నాహాలు పూర్తి చేసుకున్నారు. దైవప్రవక్త(స) వారందరినీ వెంటబెట్టుకుని ప్రయాణమయ్యారు.

అప్పటివరకూ నేను తయారీ ఏమీ చేసుకోలేదు. ఆ సమయంలో కూడా నేను నా మనసుకు సర్దిచెప్పుకున్న విషయం ఒక్కటే- రేపో ఎల్లుండో ప్రయాణ ఏర్పాట్లు చేసుకుంటే సరిపోదా? వేగంగా వెళ్ళి పయన బృందాన్ని చేరుకోలేనా ఏమి?

రెండవ రోజు ఏర్పాట్లకు సిద్ధమయ్యాను. కాని ఆ రోజు కూడా ఏమీ చేయలేకపోయాను. మూడవ రోజు ఈ పని కానిద్దాం అనుకున్నాను. కాని ఆ రోజు కూడా గడిచిపోయింది. ఆ విధంగా సమయం గడిచిపోయింది. మరోవైపు ప్రయాణ బృందం చాలా దూరం వెళ్ళిపోయింది. యుద్ధంలో పాల్గొనటమనేది సుదూర విషయం, కనీసం అక్కడకు వెళ్ళి వారిని కలుసుకున్నా సరిపోయేదే! అలా

చేసినా బాగుండేది. కాని నా అదృష్టంలో అది కూడా లేదు.

దైవప్రవక్త(స) మదీనా నుండి వెళ్ళిన తరువాత నేను మదీనా వీధుల్లోకి వెళ్ళినప్పుడు నాకెంతో బాధ కలిగేది. ఎందుకంటే, నాకు తమ ముఖాల నుండి కాపట్యం వొలికేవారే కనిపించేవారు. లేదా అల్లాహ్ వికలాంగులుగా, వృద్ధులుగా ఖరారు చేసినవారు కానవచ్చేవారు. దైవప్రవక్త(స) నా గురించి ఎవరినీ, ఏమీ అడగలేదు. కాని ఆయన(స) తబూక్ చేరుకున్న మీదట, ఒక సమావేశంలో,"కాబ్ బిన్ మాలిక్ ఎక్కడ?" అని దర్యాప్తు చేశారు. దానికి సమాధానంగా బనూ సలిమాకు చెందిన ఒక వ్యక్తి, 'దైవప్రవక్తా! అతని అహంకారం అతనిని రానివ్వలేదు (అతను తన అందచందాలు, భోగభాగ్యాలపై మిడిసిపడుతున్నాడు)' అని చెప్పాడు. ఇది విన్న ముఆజ్ బిన్ జబల్ (రజి), 'నీవు అతని గురించి చెప్పిన మాట చాలా చెడ్డది. దైవప్రవక్తా! దైవసాక్షిగా చెబుతున్నాను. మాకు అతని గురించి మంచి తప్ప మరొకటి తెలీదు' అన్నారు. దైవప్రవక్త(స) మౌనం వహించారు.

కాబ్ బిన్ మాలిక్(రజి) ఇలా అన్నారు: ప్రవక్త మహనీయులు(స) తిరిగి వస్తున్నారని తెలిసినప్పుడు, నాకు విచారం పట్టుకుంది. రేపు దైవప్రవక్త(స) ఆగ్రహం నుండి తప్పించుకోవటానికి ఏదయినా కుంటి సాకు వెతకాలన్న ఆలోచన వచ్చింది. దీని గురించి నేను కుటుంబంలోని ప్రతి విజ్ఞుడ్ని సంప్రతించాను. కాని దైవప్రవక్త(స) మదీనా నగరాన్ని సమీపించారన్న వార్త అందగానే నా మదిలోని తప్పుడు ఆలోచనలన్నీ పటాపంచలైపోయాయి. దైవప్రవక్త(స) సమక్షంలో అబద్ధం చెప్పి నన్ను నేను ఏవిధంగానూ కాపాడుకోలేనని నిశ్చయించుకున్నాను. అందుకే ఏమయినా సరే నిజం చెప్పాలని సంకల్పించుకున్నాను.

దైవప్రవక్త(స) ఉదయం పూట ఏతెంచారు. ఆయన(స) ఎప్పుడు, ఏ ప్రయాణం నుండి వచ్చినా, మొదట మస్జిద్‌కు వెళ్ళి రెండు రకతుల నమాజ్ చేసి, అక్కడున్న జనులతో సమావేశమవటం ఆనవాయితీ. ఆయన(స) నమాజ్‌ను ముగించగానే జనులు ఆయన(స) సమక్షంలోకి రావటం మొదలెట్టారు. యుద్ధంలో పాల్గొననివారు ప్రమాణాలు చేస్తూ తమ సంజాయిషీ ఇచ్చుకుంటున్నారు. అలా కుంటిసాకులు చెబుతున్నవారి సంఖ్య ఎనభై వరకూ ఉంది. వారు పైకి చెబుతున్న కారణాలను దైవప్రవక్త(స) ఆమోదించారు. వారి నుండి ప్రమాణం తీసుకున్నారు. వారి మన్నింపునకై దైవాన్ని ప్రార్థించి, వారి అంతరంగ వ్యవహారాన్ని దైవానికే వదలిపెట్టారు.

ఆ తరువాత నేను ప్రవక్త(స) ఎదుట హాజరయ్యాను. నేను సలామ్ చేస్తే ఆయన(స) చిరునవ్వు చిందించారు. ఆ నవ్వులో కోపం తొంగిచూస్తోంది. "ఇలా రా!" అని ఆయన(స) పురమాయించారు. నేను ఆయన(స)కు మరింత దగ్గర జరిగి కూర్చున్నాను. "చెప్పు. నీవు యుద్ధంలో పాల్గొనకపోవడానికి కారణం ఏమిటి? నీవు కూడా వాహనాన్ని కొనలేకపోయావా?" అని దైవప్రవక్త(స) ప్రశ్నించారు.

సమాధానంగా నేను ఇలా విన్నవించుకున్నాను-

'నా దగ్గర వాహనం ఉంది. దైవసాక్షి! తమరు గాకుండా మరెవరయినా ప్రాపంచిక వ్యక్తి నా ఎదుట ఉంటే, నేను ఏదో ఒక సాకు చెప్పి అతని ఆగ్రహం నుండి తప్పించుకోగలిగి ఉండేవాణ్ణి. నేను అందగాణ్ణి మాత్రమే కాదు, అందమైన మాటలు చెప్పే నేర్పు కూడా నాకు ఉంది. కాని దైవసాక్షిగా! నేను ఈ రోజు మీ సమక్షంలో ఏదయినా అబద్ధపు సంజాయిషీ ఇచ్చి, మిమ్మల్ని మభ్యపెట్టినా అతి త్వరలోనే అల్లాహ్ మీకు నా గురించి నిజం తెలియజేస్తాడు. అప్పుడు మీరు నా పట్ల ఆగ్రహం చెందుతారు. దీనికి బదులు నేను ఈ రోజే మీతో నిజం చెప్పి నట్లయితే మీకు నా మీద కోపం వచ్చినప్పటికీ, అల్లాహ్ నన్ను క్షమిస్తాడన్న ఆశ ఉంది. దైవసాక్షిగా చెబుతున్నాను. నేను మీ వెంట రాలేకపోవడానికి తగు కారణ మేదీ లేదు. దైవసాక్షి! ఆ సమయంలో నేను మంచి స్థితిలోనే ఉన్నాను. అయినాసరే మీతో కలసి రాలేకపోయాను'.

ఇది విని, దైవప్రవక్త "ఇతను నిజం చెబుతున్నాడు. సరే. ఇక వెళ్ళు. అల్లాహ్ స్వయంగా నీ వ్యవహారంలో ఏదయినా నిర్ణయం తీసుకునే వరకూ నిరీక్షించు" అన్నారు.

నేను లేచి రాసాగాను. నా వెనుకే బనూ సలిమా తెగకు చెందిన కొంత మంది పరుగెత్తుకుంటూ వచ్చి, 'దైవసాక్షి! నీవు లోగడ ఏదయినా తప్పు చేసిన సంగతి మాకు తెలియదు. ఏమయినా నీవు పొరపాటు చేశావు. ఇతరుల మాదిరి గానే నీవు కూడా దైవప్రవక్త(స) ఎదుట ఏదయినా సంజాయిషీ ఇవ్వలేక పోయావా? అలా చేసి ఉంటే, నీ పాపాల మన్నింపునకై దైవప్రవక్త(స) చేసే ప్రార్థనే సరిపోయేది కదా!' అన్నారు. వారు నన్ను ఆ విధంగా నిందిస్తుంటే, తిరిగి వెళ్ళి ప్రవక్త(స) సమక్షంలో ఏదయినా అబద్ధపు సంజాయిషీ ఇచ్చి రావాలన్న దురా లోచన నాలో కలిగింది. 'ఏమిటి, నా లాగే ఇంకా ఎవరయినా ప్రవక్త ఎదుట

నిజం చెప్పారా?' అని వాళ్ళను అడిగాను. దానికి వారు, 'అవును. నీలాగే మరో ఇద్దరు మహానుభావులు కూడా విషయాన్ని ఉన్నదున్నట్లుగా చెప్పారు. నీకు లభించిన సమాధానమే వారికీ లభించింది' అన్నారు. ఇంతకీ ఎవరు వారు?' అని నేనడిగితే, 'మురారా బిన్ రబీ ఉమరీ, హిలాల్ బిన్ ఉమయ్యా వాఖిఫీ' అని వారు చెప్పారు. వారిద్దరూ సత్పురుషులు, బద్ర్ యుద్ధంలో కూడా పాల్గొన్నవారు. అందుచేత వారి వ్యవహారసరళి నాకు ఆదర్శప్రాయం అయింది. ఆ ఇద్దరు సహాబీల పేర్లు విన్న మీదట నేను సరాసరి నా ఇంటికి వచ్చేశాను.

మా ముగ్గురితో ఎవరూ మాట్లాడవద్దని దైవప్రవక్త(స) తన సహచరులకు తాకీదు చేశారు. తబూక్ యుద్ధంలో పాల్గొనని చాలామందిలో మేము ముగ్గురమే ఈ బహిష్కారానికి గురయ్యాము. జనులు మాకు దూరంగా మసలుకోసాగారు. అందరూ ఒక్కసారిగా మారిపోయారు. మా పట్ల లోకమంతా మారిపోయినట్లు అనిపించింది. యాభై రోజుల వరకూ మేము ఇదే స్థితిలో గడిపాము. నా లాగా ఆంక్షలకు గురైన నా సహచరులిద్దరూ తమ ఇండ్ల నుండి బయటకు రావటమే మానేశారు. వారిద్దరూ అదే పనిగా ఏడుస్తూ ఉండేవారు. కాని నేను మాత్రం ధైర్యంగా బయట తిరిగే వాణ్ణి. ముస్లింలతోపాటు సామూహిక నమాజ్‌లో పాల్గొనే వాణ్ణి. అంగళ్ళ వద్ద నడయాడే వాణ్ణి. కాని నాతో ఎవరూ మాట్లాడేవారు కారు. నేను దైవప్రవక్త(స) నమాజ్ చేసి కూర్చుని ఉండగా ఆయన దగ్గరకు వెళ్ళి సలామ్ కూడా చేసేవాణ్ణి. నా సలామ్‌కు జవాబుగా ఆయన(స) అధరాలు కదలాడుతున్నాయా? లేదా? అని కూడా ఆసక్తిగా గమనించేవాణ్ణి. ఆయన(స) దగ్గరలోనే నిలబడి నమాజ్ చేసేవాణ్ణి. నమాజులోనే ఆయన్ని క్రీగంట చూసేవాణ్ణి. నేను నమాజులో లీనమై ఉన్నప్పుడు దైవప్రవక్త(స) నా వైపు చూసేవారు. మరి నేను ఆయన వైపు చూడగానే, ఆయన తన ముఖారవిందాన్ని మరోవైపు త్రిప్పుకునేవారు. ఈ విధంగా నా యెడల ప్రజల విముఖత నానాటికీ పెరుగుతూ పోయింది.

ఒకరోజు నేను అబూ ఖతాదా (రజి) తోట గోడ పైకెక్కాను. ఆయన నా పినతండ్రి కుమారుడే. ఆయనతో నాకు బాగా చనువు ఉండేది. నేనాయనకు సలామ్ చేశాను. కాని దైవసాక్షి! ఆయన కూడా నా సలామ్‌కు జవాబు ఇవ్వలేదు. 'అబూ ఖతాదా! అల్లాహ్ సాక్షిగా అడుగుతున్నాను. నాకు దైవం, దైవప్రవక్త(స) పట్ల ఎంత ప్రేమ ఉందో నీకు తెలీదా?' అని అడిగాను. కాని ఆయన సమాధానం ఇవ్వలేదు. నేను రెండవసారి కూడా దైవం మీద ఒట్టేసి అదే ప్రశ్న వేశాను. కాని

ఆయన ఈసారి కూడా మౌనం వహించారు. నేను మూడవసారి కూడా ఆయన్ని దైవంతోడుగా అదే ప్రశ్న అడిగితే, ఈసారి బదులిచ్చారు– 'ఆ విషయం అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకే తెలుసు' అని.

అంతే, ఈ జవాబు విని నా కళ్ళల్లో నీళ్ళు చిమ్ముకుని వచ్చాయి. నేను గోడ దిగి తిరిగి వచ్చేశాను.

ఒక రోజు నేను మదీనా మార్కెట్టుకు వెళుతుండగా, ఆహార ధాన్యం అమ్మడానికి నగరం వచ్చిన ఒక రైతు, 'కాబ్ బిన్ మాలిక్ ఎక్కడుంటారు?' అని జనుల్ని అడుగుతున్నాడు. జనులు నా వైపు సైగ చేశారు. ఆ వ్యక్తి నా దగ్గరకు వచ్చి గస్సాన్ దేశపు రాజు (క్రైస్తవ రాజు) తరపున వ్రాయబడిన ఒక ఉత్తరాన్ని నాకు ఇచ్చాడు. ఆ ఉత్తరంలో ఇలా లిఖించబడింది– "అమ్మాబాద్! మీ నాయకుడు (ముహమ్మద్–సఅసమ్) మీ పట్ల విపరీతంగా ప్రవర్తిస్తున్నారని మాకు తెలిసింది. దేవుడు మిమ్మల్ని పుట్టించింది అవమానాలు భరించడానికి కాదు. మీరు మా దగ్గరకు వచ్చేసేయండి. మేము మిమ్మల్ని అత్యుత్తమ రీతిలో సత్కరిస్తాము."

ఈ ఉత్తరాన్ని చదివిన మీదట (నిట్టూర్పు విడిచి) ఇది కూడా ఒక పరీక్షే అన్నాను. నేనా ఉత్తరాన్ని పొయ్యిలో పడేసి కాల్చివేశాను. యాభై రోజుల్లో నలభై దినాలు గడిచిన తరువాత దైవప్రవక్త(స) తన దూతను నా వద్దకు పంపారు. 'నీవు నీ భార్యకూ దూరంగా ఉండాలన్నది దైవప్రవక్త(స) ఆదేశం' అన్నాడతను. 'ఏమిటి, నేనామెకు విడాకులు ఇవ్వాలా? పోనీ నేనేం చెయ్యాలో చెప్పమనండి' అన్నాను. దానికి అతను, 'విడాకులు ఇవ్వనవసరం లేదు. ఆమెకు దూరంగా ఉండు, చాలు' అన్నాడతను. (నిజం చెప్పిన) నా ఇద్దరు మిత్రులకు కూడా ఇదే ఆజ్ఞ లభించింది. 'నీవు నీ పుట్టింటికి వెళ్ళిపో. ఈ వ్యవహారంలో అల్లాహ్ ఏదయినా నిర్ణయం చేసేవరకూ నీవు అక్కడే ఉండు' అని నేను నా భార్యకు చెప్పాను.

కాబ్(రజి) ఇలా అన్నారు: (సంఘ బహిష్కరణకు గురైన) హిలాల్ బిన్ ఉమయ్యా(రజి) ఇల్లాలు దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి, 'దైవప్రవక్తా! హిలాల్ బిన్ ఉమయ్యా ముసలివారై పోయారు. ఆయన దగ్గర సేవకులు కూడా లేరు. నేనాయన సేవలో ఉంటే, అది మీ ఆగ్రహానికి కారణం కాదు కదా!' అని సందేహపడింది. దానికి ఆయన(స), "సేవ చేసుకో. కాని ఆయనతో సమాగమం జరుపరాదు" అని వివరించి చెప్పారు. దానికి ఆమె, 'అయ్యో. ఆయనలో కదిలే, కదిలించే శక్తి

కూడా లేదు. అదీగాక– ఆంక్షలు విధించబడిన నాటి నుండి ఆయన కంట వొలికే కన్నీటి ప్రవాహం ఎంతకీ ఆగటంలేద'ని చెప్పింది.

'హిలాల్ బిన్ ఉమయ్యా(రజి) భార్యకు ఆయన సేవలో ఉండే అనుమతిని దైవప్రవక్త(స) ఇచ్చినట్లుగానే మీకూ ఇవ్వవచ్చు. మీరు వెళ్ళి ఆనతి కొరకు అభ్యర్థించండి' అని నా కుటుంబీకులు సలహా ఇచ్చారు. దానికి నేను 'దైవసాక్షిగా! దాని కోసం నేను దైవప్రవక్త(స)ను ఎట్టి పరిస్థితిలోనూ అభ్యర్థించను. నేను యువకుణ్ణి. అనుమతి కోసం వెళితే ఆయన(స) ఏమంటారో తెలీదు' అన్నాను.

ఈ విధంగా మరో పది రోజులు పూర్తయ్యాయి. యాభయ్యవ రోజు నేను ఫజ్ర్ నమాజ్ చేసి, నా ఇంటి కప్పుపై కూర్చుని ఉన్నాను. అల్లాహ్ ప్రస్తావించినట్లుగా నా ప్రాణం లోలోపలే కొట్టుకుంటోంది. భూమి ఎంతో విశాలంగా ఉండి కూడా నా కొరకు ఇరుకైపోయింది. సరిగ్గా అదే సమయంలో నేను ఎలుగెత్తి పిలిచేవాని ఒక పిలుపును విన్నాను. సలా కొండపైకెక్కి అతను, 'ఓ కాబ్ బిన్ మాలిక్! నీకు శుభవార్త!' అని పిలుస్తున్నాడు. అంతే, నేను సాష్టాంగపడిపోయాను. నాపైన ఉన్న ఆంక్షలు ఎత్తివేయబడ్డాయని నాకు అర్థమయింది. ఫజ్ర్ నమాజ్ తర్వాత దైవప్రవక్త(స), దైవ సన్నిధిలో మా పశ్చాత్తాపం ఆమోదించబడిందని తెలియజేశారు. నాకు ఈ శుభవార్త వినిపించడానికి జనులు పరుగులు తీస్తూ రాసాగారు. నా మిత్రులిద్దరి వద్దకు కూడా వెళ్ళి ఈ శుభవార్త వినిపించారు. ఒక వ్యక్తి (జుబైర్ బిన్ అవ్వామ్–రజి) గుర్రమెక్కి దౌడు తీస్తూ వస్తున్నారు. అటు అస్లమ్ తెగకు చెందిన ఒక సహచరుడు కొండపైకెక్కి దిక్కులు పిక్కటిల్లేలా పిలుస్తున్నారు. ఆ పిలుపు గుర్రపు వేగం కన్నా ఎక్కువగా నా కర్ణపుటాలను తాకింది. సలా కొండ పైకెక్కి పిలుపు ఇచ్చిన సహాబీ నన్ను సమీపించగానే, నా ఒంటిపైనున్న రెండు వస్త్రాలను తీసి– ఆ సంతోషంలో ఆయనకు ఇచ్చేశాను. దైవసాక్షిగా! ఆ సమయంలో ఆ రెండు వస్త్రాలు తప్ప నా దగ్గర (కానుకగా ఇవ్వదగిన) మరో వస్తువు లేదు. తరువాత నేను (అబూ ఖతాదా–రజి)ను అడిగి రెండు వస్త్రాలు తీసుకుని తొడుక్కున్నాను.

ఆ తర్వాత నేను దైవప్రవక్త(స) సన్నిధికి బయలుదేరాను. జనులు తండోప తండాలుగా తరలి వచ్చి నా పశ్చాత్తాపం స్వీకృతి పట్ల శుభాకాంక్షలు తెలుపుకో సాగారు. 'దైవ సన్నిధిలో ఆమోదముద్ర పొందిన నీ పశ్చాత్తాపం శుభమవుగాక!' అని పలుకుతున్నారు. చివరకు నేను మస్జిద్‌లో ప్రవేశించాను. అక్కడ ప్రవక్త

మహనీయులు(స) కూర్చుని ఉన్నారు. నలువైపులా సహచరమాన్యుల సందోహం ఉంది. తల్హా బిన్ ఉబైదుల్లాహ్ (రజి) నా వైపునకు దూసుకువచ్చి కరచాలనం చేశారు. నాకు శుభాకాంక్షలు తెలిపారు. దైవసాక్షిగా! (అక్కడ ఉన్న) ముహాజిర్లలో ఆయన ఒక్కరు తప్ప వేరెవరూ నా రాకపై లేచి నిలబడలేదు. తల్హా (రజి) యొక్క ఈ ఉపకారాన్ని నేను ఎన్నటికీ మరువలేను.

కాబ్(రజి) ఇలా అన్నారు: నేను దైవప్రవక్త(స)కు సలామ్ చేశాను. (తన మోముపై సంతోషం తొణికిసలాడుతుండగా) ఆయన(స) ఇలా అన్నారు : "ఈ శుభకరమైన రోజు నీకు శుభమవుగాక! నీ జీవిత కాలంలో ఇది అత్యంత శుభకరమైన దినం." 'దైవప్రవక్తా! ఈ శుభవార్త మీ తరపున వినిపించబడు తోందా? లేక అల్లాహ్ తరపునా?' అని నేను అడిగితే, "లేదు. అల్లాహ్ తరఫు నుండే" అని ఆయన(స) బదులిచ్చారు. దైవప్రవక్త(స)కు ఏదన్నా విషయంపై సంతోషం కలిగితే ఆయన ముఖారవిందం పున్నమి చంద్రునిలా ప్రకాశించేది. ఆయన మోమును గని మేము ఆ విషయాన్ని అర్థం చేసుకునేవారం.

తరువాత నేను ఆయన(స) ఎదుట కూర్చుని, 'దైవప్రవక్తా! నా పశ్చాత్తాపం స్వీకరించబడిన సంతోషంలో నేను నా ఆస్తినంతటినీ దైవం, దైవప్రవక్త మార్గంలో దానం చేసెయ్యనా?' అని విన్నవించుకున్నాను. దానికి ఆయన(స), "అంతా వద్దు. నీ కోసం కూడా కొంత ఉంచుకోవటం మంచిది" అన్నారు. 'అలాగైతే ఖైబర్‌లో నాకు లభించిన వాటాను నా దగ్గర ఉంచుకుంటాన'ని అన్నాను. తరువాత ఇలా విన్నవించుకున్నాను- 'దైవప్రవక్తా! నిజం చెప్పినందువల్ల అల్లాహ్ నాకు మోక్షం ప్రసాదించాడు. ఇప్పుడు నేను నా పశ్చాత్తాపం ఆమోదించబడిన సంతోషంలో నేను చేసే ప్రతిజ్ఞ ఏమిటంటే, నేను జీవించి ఉన్నంత కాలం నిజం తప్ప మరొక మాట పలకను.'

అంతే, దైవప్రవక్త(స) సమక్షంలో నేను ప్రతిజ్ఞ చేసిన నాటి నుండీ, నిజం చెప్పిన కారణంగా అల్లాహ్ నాకు అనుగ్రహించినంతగా మరే ముస్లింకు కూడా అనుగ్రహించినట్లు నేనెరుగను. కనీసం అబద్ధం చెప్పాలన్న ఆలోచన కూడా నా మదిలో కలుగలేదు. మిగిలిన జీవితంలో నన్ను ఇలాగే అల్లాహ్ (అబద్ధం నుండి) సురక్షితంగా ఉంచుతాడని ఆశిస్తున్నాను. అల్లాహ్ (మా గురించి) తన ప్రవక్తపై దివ్య వచనాలను అవతరింపజేశాడు-

"అల్లాహ్ క్షమించాడు ప్రవక్తనూ, బహుకష్టకాలంలో ప్రవక్తకు తోడ్పడిన ముహాజిరులనూ, అన్సారులనూ. వారిలో కొందరి హృదయాలు వక్రత్వం వైపునకు మొగ్గినప్పటికీ (కాని వారు ఆ వక్రత్వాన్ని అనుసరించకుండా ప్రవక్తకు తోడ్పడి నప్పుడు) అల్లాహ్ వారిని క్షమించాడు. నిస్సందేహంగా ఆయన వారి పట్ల వాత్స ల్యంతో, కనికరంతో వ్యవహరించాడు. ఇంకా వ్యవహారం వాయిదా వెయ్యబడిన ఆ ముగ్గురిని కూడా ఆయన క్షమించాడు. ఇంత పెద్ద వైశాల్యం కలిగి ఉండి కూడా, భూమి వారికి ఇరుకైపోయింది. వారి ప్రాణాలు కూడా వారికి భారమై పోయాయి. అల్లాహ్ నుండి తమను కాపాడుకోవటానికి స్వయంగా అల్లాహ్ కారుణ్యం తప్ప వేరే ఆశ్రయం ఏదీ లేదని వారు తెలుసుకున్నారు. అప్పుడు అల్లాహ్ కనికరంతో వారి వైపునకు మరలాడు, వారు ఆయన వైపునకు మరలి వచ్చేటందుకు. నిశ్చయంగా ఆయన చాలా క్షమించేవాడూ, కరుణించేవాడూను. విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్‌కు భయపడండి. సత్యవంతులకు తోడ్పడండి."
***(అత్ తౌబా : 117-119)***

దైవసాక్షిగా! అల్లాహ్ తరఫు నుండి సన్మార్గ భాగ్యం లభించిన మీదట, దైవప్రవక్త(స) సమక్షంలో నిజం చెప్పటం కన్నా గొప్ప వరం నా దృష్టిలో మరొకటి లేదు. ఇది కేవలం దైవ కటాక్షం. నేను అబద్ధం చెప్పి, నన్ను నేను నాశనం చేసుకో లేదు. ఇతరులు అబద్ధం చెప్పి నాశనమయ్యారు. దైవవాణి అవతరిస్తున్న రోజుల్లో అల్లాహ్ అబద్ధం చెప్పేవారిని అధిక్షేపించినంత తీవ్రంగా మరెవరినీ అధిక్షేపించ లేదు.

"నీవు మరలి వచ్చిన తరువాత వారు నీ ముందు ప్రమాణాలు చేస్తారు, నీవు వారిని ఉపేక్షించాలని. కనుక నీవు వారిని తప్పకుండా ఉపేక్షించు. ఎందు కంటే, వారొక మాలిన్యం వంటివారు. వారి అసలు స్థానం నరకం. అది వారి సంపాదనకు ప్రతిఫలంగా వారికి లభిస్తుంది. వారు నీ సమక్షంలో ప్రమాణాలు చేస్తారు, వారికి నీవు ప్రసన్నుడవు కావాలని. వాస్తవానికి, ఒకవేళ నీవు వారి పట్ల ప్రసన్నత చూపినా అల్లాహ్ మటుకు అటువంటి విద్రోహులకు ఎన్నటికీ ప్రసన్నుడు కాడు". (తౌబా : **95,96**)

కాబ్(రజి) ఇలా అన్నారు: మేము ముగ్గురం దైవప్రవక్త(స) సమక్షంలో ప్రమాణాలు చేసిన వారి నుండి వేరయ్యాము. దైవప్రవక్త(స) వారు చెప్పేదానిని అంగీకరించి, వారి నుండి ప్రమాణం తీసుకున్నారు. వారి మన్నింపునకై ప్రార్థిం

**చారు కూడా. అయితే దైవప్రవక్త(స) మా వ్యవహారాన్ని దైవానికే అప్పగించారు. అల్లాహ్ స్వయంగా దాని తీర్పు చేశాడు. దివ్యవచనం- "వ్యవహారం వాయిదా వేయబడిన ఆ ముగ్గురిని కూడా ఆయన క్షమించాడు" (9: 118)లోని అర్థం ఇదే. దీని అర్థం మేము యుద్ధానికి వెనుకంజ వేశామన్నది కాదు. (అబద్ధపు) ప్రమాణాలు చేసి, సాకులు చెప్పిన వారి నుండి మేము వేరయ్యాము అన్నదే దీని అసలు అర్థం.[1]**

## అధ్యాయం : 81

# 'హిజ్ర్' బస్తీ మీదుగా దైవప్రవక్త(స) సాగిపోవటం

**278) మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) వివరించారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) హిజ్ర్ ప్రదేశం నుండి సాగిపోతున్నప్పుడు ఇలా ఉద్బోధించారు: "తమ ఆత్మలకు అన్యాయం చేసుకున్న జనుల బస్తీ నుండి సాగి పోతున్నప్పుడు మీరు దుఃఖంతో విలపిస్తూ సాగిపోండి. ఎందుకంటే వారిపై వచ్చి పడిన ఆపద లాంటిది మీపైన కూడా రాకూడదు సుమా!" ఇలా చెప్పిన తరువాత ఆయన(స) తన తలపై దుప్పటి కప్పుకుని - ఆ ప్రదేశం దాటేవరకూ- చాలా వేగంగా అక్కడి నుండి ముందుకు సాగిపోయారు.[1]**

**279) అంతిమ దైవప్రవక్త(సఅసమ్) హిజ్ర్ వాసుల గురించి తన సహచరు లకు భయ బోధ చేస్తూ ఇలా ప్రవచించారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు: "దైవాగ్రహానికి గురైన ఈ జనుల బస్తీ మీదుగా మీరు పోవలసి వస్తే ఏడుస్తూ మరీ సాగిపొండి. వారిపై వచ్చిపడిన విపత్తు మీపైన రాకూడదు సుమా!"**

---

277-1. సుబ్‌హానల్లాహ్! వ్యవహారం వాయిదా వేయబడిన ఆ ముగ్గురు సహచరమాన్యులు బలహీన విశ్వాసం కల ముస్లింలు కారు. పైగా వారు నికార్సయిన ముస్లింలు. ఆ ముగ్గురు మహనీయులు అధర్మపు సొమ్ము తినలేదు. రక్తపాతం సృష్టించలేదు. అశ్లీల కార్యాలకు ఒడిగట్టలేదు. కాని నిజం చెప్పినందుకు పడిన తాత్కాలిక శిక్షను అనుభవించి ఊర్ధ్వలోకాల నుండి శుభవార్త అందుకున్నారు.

హజ్రత్ కాబ్ బిన్ మాలిక్(రజి) అన్సార్ సహాబీ. 'రెండవ బైఅతె అఖబా'లో పాల్గొన్న ధన్యులు. 77 ఏళ్ళ వయసులో హిజ్రీ 50లో మరణించారు.

278-1. దైవప్రవక్త మహనీయ సాలెహ్(అలైహిస్సలామ్) జాతి (సమూద్) జనులు నివసించిన బస్తీ పేరు 'హిజ్ర్' అని ఉల్లేఖనాలలో ఉంది. తీవ్రమయిన భూకంపం, పిడుగుల ద్వారా ఆ జనావాసం ధ్వంసం చేయబడింది. మహాప్రవక్త ముహమ్మద్(స) తబూక్ యుద్ధ ప్రయాణ సందర్భంగా ఆ బస్తీ నుండి సాగిపోతున్నప్పుడు తన సహచరులను హెచ్చరించారు. ఈ ప్రదేశం సిరియా రాజ్యానికి- మదీనా నగరానికి మధ్యన ఉంది.

**280)** తన తండ్రి ముగీరా బిన్ షూబా(రజి) తనతో చెప్పారని ఉర్వా బిన్ ముగీరా తెలియజేశారు: "ప్రవక్త మహనీయులు (సఅసమ్) కాలకృత్యాలు తీర్చుకోవడానికి (దూరం) వెళ్ళారు. (ఆయన తిరిగి రాగానే) ఆయన(స) వుజూ చేసుకునేందుకుగాను నేను నీళ్ళు తీసుకుని వెళ్ళాను. ఈ సంఘటన తబూక్ యుద్ధ సందర్భంగా జరిగినట్టు ఆయన చెప్పినట్లుగా నాకు గుర్తు. దైవప్రవక్త(స) ఆ నీటితో ముఖం కడుక్కున్నారు. మోచేతుల సమేతంగా తన రెండు చేతుల్ని కడుక్కోవాలని ఆయన(స) సంకల్పించుకున్నప్పుడు, ఆయన చొక్కా చేతులు బిగుతుగా ఉన్నట్టు అనిపించాయి. అందువల్ల ఆయన తన చేతుల్ని చొక్కా క్రింది నుంచి బయటికి తీసి, కడుక్కున్నారు. పిదప తన మేజోళ్ళపై 'మసహ్' చేశారు.

**281)** అబూ హుమైద్ సాయిదీ (రజి) కథనం: మేము దైవప్రవక్త (సఅసమ్)తో పాటు తబూక్ యుద్ధం నుండి తిరిగి వస్తుండగా, మదీనా నగరం సమీపించినప్పుడు (ఆయన-స మదీనా వైపు సంజ్ఞ చేస్తూ) "అదిగో అది తాబా. అదేమో ఉహుద్ పర్వతం. అది మమ్ము ప్రేమిస్తోంది. మేము దానిని ప్రేమిస్తున్నాము" అని పలికారు.

**282)** హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) తబూక్ నుండి తిరిగి వస్తూ, మదీనా నగరాన్ని సమీపించినప్పుడు ఇలా ప్రవచించారు: "మదీనాలో చాలామంది ఉన్నారు. మీరు ఎక్కడెక్కడ నడచినా, ఏ ఏ లోయలను మీరు దాటిపోయినా వారు (హృదయ పూర్వకంగా) మీతోపాటే ఉన్నారు." దానికి సహచరమాన్యులు, 'దైవప్రవక్తా! వారు (మా వెంట రాకుండా) మదీనాలో ఉండిపోయినప్పటికీనా?' అని విన్నవించుకోగా, "అవును. వారు మదీనాలో ఉన్నప్పటికీ, మానసికంగా మీతోపాటే ఉన్నారు. ఎందుకంటే వారు ఒకానొక కారణంగా అక్కడ ఆగిపోవలసి వచ్చింది" అని దైవప్రవక్త(స) చెప్పారు.

అధ్యాయం : 82

# కిస్రా (ఈరాన్ చక్రవర్తి)కి, ఖైసర్ (రోము చక్రవర్తి)కి ఉత్తరాలు వ్రాయటం

**283)** అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) తెలిపారు : ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఈరాన్ చక్రవర్తి కిస్రా పేరున ఒక ఉత్తరం వ్రాయించి, అబ్దుల్లాహ్ బిన్ హుజాఫా సహ్మీ(రజి)కి ఇస్తూ, "ఈ ఉత్తరాన్ని (కిస్రా సామంతుడైన)

**బహ్రైన్ గవర్నర్‌కు అందజేయి" అని ఆజ్ఞాపించారు. కిస్రా ఆ ఉత్తరాన్ని చదివి (గర్వాహంకారంతో) చించి ముక్కలు ముక్కలు చేసేశాడు. తరువాత దైవప్రవక్త(స) అతన్ని అధిక్షేపిస్తూ అతన్ని కూడా తునాతునకలుగా చేసెయ్యమని దైవాన్ని వేడు కున్నారు.[1]**

**284) అబూ బక్రా (రజి) గారు హసన్ బస్రీతో ఇలా అన్నారు : జమల్ యుద్ధ సందర్భంగా నాకు ప్రవక్త మహనీయులు(సఅసమ్) చెప్పి ఉన్న ఒక పలుకు జ్ఞాపకం వచ్చింది. దాంతో నేను, ఆయిషా(ర.అ) మరియు ఆమె సైనికులతో కలసి**

---

283–1. వాఖిదీ ప్రకారం ఆ ఉత్తరంలో ఇలా లిఖించబడింది :

"బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్. దైవప్రవక్త ముహమ్మద్ తరఫున పారసీక చక్రవర్తి కిస్రాకు....

"ఎవరయితే సన్మార్గాన నడుస్తూ అల్లాహ్‌ను విశ్వసిస్తాడో, అల్లాహ్ తప్ప మరో నిజ ఆరాధ్య దైవం లేదని, ఆయన ఏకేశ్వరుడని, ఆయనకు సాటి ఎవరూ లేరని సాక్ష్య మిస్తాడో, ముహమ్మద్ దైవదాసుడని, దేవుని తరఫున పంపబడిన సందేశహరుడని విశ్వసిస్తాడో అతను సురక్షితంగా ఉంటాడు. నేను నిన్ను దైవాజ్ఞ మేరకు ఇస్లామ్ వైపు నకు పిలుస్తున్నాను. ఎందుకంటే, నేను అల్లాహ్ తరఫున మానవాళి వైపునకు పంప బడ్డాను... కనుక నీవు ముస్లిమ్‌వి అయిపో. అన్యథా పారసీకులందరి పాపభారం నీ మీద పడుతుంది."

అతను ఆ ఉత్తరానికి ఎలాంటి విలువ ఇవ్వలేదు సరికదా దానిని చించి పారేశాడు. అంతేకాదు, అతను తన గవర్నర్ బాజాన్‌కు ఉత్తరం రాస్తూ, 'నీవు మదీనా వెళ్ళి ఆ ప్రవక్తతో మాట్లాడు. అతను దైవప్రవక్తనన్న దావాను ఉపసంహరించుకుంటే సరి. లేదంటే అతని తలను నరికి నా సమక్షంలో సమర్పించు' అని ఆజ్ఞాపించాడు.

బాజాన్ మదీనా వచ్చి, కిస్రా ఉత్తరువును దైవప్రవక్త(స)కు వినిపించాడు. అది విని దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు : "నీకు ఒక విషయం తెలియాలి. ఈ రోజు రాత్రి నా ప్రభువు, కిస్రా కుమారుడు షేర్‌వియా ద్వారా అతన్ని అంతమొందించాడు. ఇప్పుడు మీ ప్రభుత్వం ముక్కచెక్కలు కానున్నది"– ఈ సంఘటన హిజ్రీ 7వ సంవత్సరం జమాదివుల్ ఊలా నెలలో సంభవించింది. ఆ తరువాత షేర్‌వియా 6 నెలల వరకూ పారసీక రాజుగా ఉన్నాడు. ఒకరోజు రాజ్య కోశాగారంలో అతనికి ఒక సీసా కనిపించింది. దానిపై 'లైంగిక సామర్థ్యాన్ని పెంచే మందు' అని వ్రాసి ఉంది. అతను దానిని త్రాగగానే మృత్యువాతన పడ్డాడు. నిజానికి అది విషం. ఆ తర్వాత కిస్రా మనవరాలు– అంటే షేర్‌వియా కూతురు – పూరాన్ పరిపాలకురాలు అయింది. ఆ తరువాత పారసీక సామ్రాజ్యం పతన దిశలో పయనించింది.

(అలీ-రజి) సైన్యంతో యుద్ధం చేసే సంకల్పాన్ని ఉపసంహరించుకున్నాను. ఆయన ఇలా అన్నారు : పారసీక దేశస్థులు కిస్రా మనవరాలిని సింహాసనంపై కూర్చోబెట్టి ఆమెకు రాజ కిరీటం తొడిగించారని దైవప్రవక్త(స)కు తెలిసినప్పుడు, "తమ రాజ్యాధికారాన్ని ఒక స్త్రీకి కట్టబెట్టిన జాతి ఎన్నటికీ బాగుపడదు" అని పలికారు.

**285)** సాయిబ్ బిన్ యజీద్ ఇలా అనేవారు : బాల్యంలో నేను దైవప్రవక్త(స)కు స్వాగతం పలకటానికి తోటి బాలలతో కలిసి సనియతుల్ వదా వరకు వెళ్ళిన సంగతి నాకు ఇప్పటికీ జ్ఞాపకం ఉంది. అప్పుడు దైవప్రవక్త(స) తబూక్ యుద్ధం నుండి తిరిగి వస్తూ ఉన్నారు.

**286)** సాయబ్ బిన్ యజీద్ ఇలా అన్నారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) తబూక్ యుద్ధ ప్రయాణం నుండి మదీనాకు తిరిగి వస్తున్నప్పుడు, నేను నా తోటి బాలురతో కలిసి 'సనియతుల్ వదా' లోయ వరకు వెళ్ళిన విషయం నాకు ఇప్పటివరకూ జ్ఞాపకం ఉంది.

## అధ్యాయం : 83

## మహాప్రవక్త(స) వ్యాధి, ఆయన పరమపదించిన సంఘటన

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"(ఓ ముహమ్మద్!) నీవూ మరణిస్తావు, వారూ మరణించవలసినవారే. చివరకు ప్రళయ దినాన మీరంతా మీ ప్రభువు సమక్షంలో మీ మీ వ్యాజ్యాలను వినిపిస్తారు." (అజ్ జుమర్ : 30, 31)

హజ్రత్ ఆయిషా(ర.అ) ఉర్వాతో ఇలా అన్నారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) మరణ వ్యాధికి గురై ఉన్నప్పుడు ఇలా అనేవారు : "ఆయిషా! ఖైబర్‌లో నేను నా నోట్లో వేసుకున్న (విషపూరితమైన) అన్నపు ముద్ద ఇప్పటికీ నా మీద ప్రభావం చూపుతూనే ఉంది. ఆ విష ప్రభావంతో నా కంఠనాళం తెగిపోయేలా ఉంది."

**287)** ఉమ్మె ఫజ్ల్ బిన్తె హారిస్(ర.అ) అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి)తో ఇలా అన్నారు : "ప్రవక్త మహనీయులు(స) మగ్రిబ్ నమాజ్‌లో "వల్ ముర్సలాతి ఉర్ఫా" సూరాను పారాయణం చేస్తుండగా నేను విన్నాను. ఆ తరువాత ఆయన(స) తనువు చాలించే వరకూ మళ్ళీ మాకు నమాజ్ చేయించలేదు."

**288) హ[జత్ ఇబ్నె అబ్బాస్(రజి) తెలిపారు : మహనీయ ఉమర్(రజి) (బాల్యంలో) నన్ను తన సమావేశాలలో కూర్చోబెట్టుకునేవారు. దీనిపై అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) అభ్యంతరం తెలుపుతూ, ఇతని లాంటి పిల్లలు మీకూ ఉన్నారు కదా! అన్నారు. దానికి ఉమర్(రజి), "ఈ అబ్బాయికి నేనెందుకు ఇంతగా ప్రాధాన్యత ఇస్తున్నానో మీకూ తెలుసు" అన్నారు. తరువాత ఉమర్(రజి) ఇబ్నె అబ్బాస్(రజి)తో, 'ఇజాజాఅ నస్రుల్లాహి వల్ ఫత్హు' (నస్ర్-1) ఆయత్ గురించి ప్రశ్నించగా, 'ఇందులో దైవప్రవక్త(స) మరణ సమాచారం ఉంది' అని చెప్పారు. అప్పుడు ఉమర్(రజి), "ఈ ఆయత్ గురించి నీవు చెబుతున్నదే నేనూ అనుకుంటున్నా'[1] ని అన్నారు.**

**289) విశ్వాసుల మాత హ[జత్ ఆయిషా(ర.అ) ఉర్వా బిన్ జుబైర్‌తో ఇలా అన్నారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఎప్పుడయినా అస్వస్థతకు గురైనప్పుడు 'ముఅవ్వజాత్' (సూరయె ఇఖ్లాస్, సూరాయె ఫలఖ్, సూరయె నాస్) పఠించి, తన చేతులపై ఊది, వాటిని తన శరీరంపై స్పర్శించేవారు. కాని ఆయన (స) మరణ వ్యాధికి గురైనప్పుడు, నేనే ఆ సూరాలను పఠించి ఊదటం మొదలెట్టాను. ఇంకా ఆయన చేతిని ఆయన శరీరంపై తడిమే దానిని (స్వస్థత చేకూరుతుందన్న ఆశతో అలా చేసే దానిని).**

**290) హ[జత్ ఆయిషా(ర.అ) అబ్బాద్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్‌తో ఇలా అన్నారు : మరణ ఘడియలలో నేను ప్రవక్త మహనీయుని (సఅసమ్) మాటలను చెవియొగ్గి మరీ విన్నాను. ఆ సమయంలో ఆయన(స) తన వీపును నా శరీరానికి ఆనించి ఉన్నారు. ఇలా అంటున్నారు- "దేవా! నన్ను క్షమించు. నాపై కనికరించు. నన్ను ఉన్నత మిత్రుల సరసన చేర్చు."[1]**

---

288-1. మొదటి విషయం, ఇబ్నె అబ్బాస్(రజి) దైవప్రవక్త(స) పిన తండ్రి కుమారుడు. దానికి తోడు పసితనం నుండే ఆయన పండితుడు. జ్ఞాన సంపన్నుడయిన వ్యక్తిని అందరూ ఆదరించాలి.
ఈ సూరా అవతరించిన మీదట దైవప్రవక్త(స) ఎక్కువ సమయం దైవారాధనలో, పాపాల మన్నింపునకై వేడుకోవటంలో గడిపేవారు.

290-1. ఎంతటి వారైనా, వారికి దైవ సామీప్యం లభించి ఉన్నా తప్పుల మన్నింపునకై దైవాన్ని వేడుకోవటం ధర్మం. ఇదే దైవదాస్య భావానికి చిహ్నం. నిజానికి ఆయన(స) తప్పులన్నింటినీ మన్నిస్తున్నట్లు అల్లాహ్ ప్రకటించాడు. అయినప్పటికీ మహాప్రవక్త(స) ఒక దాసునిగా ఆదర్శాన్ని నెలకొలిపారు.

**291)** మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) సయీద్ బిన్ జుబైర్ ముందు గురు వారం గురించి ప్రస్తావిస్తూ, 'గురువారం నాడు ఏం జరిగిందో తెలుసా?' అనడి గారు. ఆ రోజు దైవప్రవక్త(స) వ్యాధి తీవ్రతరమయింది. అప్పుడాయన(స), "ఏదయినా (వ్రాత సామగ్రి) తీసుకురండి, నేను మీ కొరకు వీలు వ్రాస్తాను. మీరు గనక దాని ప్రకారం నడుచుకుంటే ఎన్నటికీ సన్మార్గం వీడరు" అని పలికారు. అయితే దీనిపై సహచరమాన్యులలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. నిజానికి దైవప్రవక్త(స) సమక్షంలో అలాంటి తర్జన భర్జన జరగకూడదు. 'ఆయన(స) వ్యాధి తీవ్రత కారణంగా ఏదేదో అనేస్తున్నారు. అసలు విషయం ఏమిటో అడిగి కను క్కోండి' అని కొందరన్నారు. ఆ విషయమే ప్రియ సహచరులు ఆయన్ని అడిగితే, "పొండి (ఇక్కడ మీరు గలాటా చేయకండి). ఇప్పుడు నేను ఏ పనిలో నిమగ్నమై ఉన్నానో, అది మీరు అడుగుతున్న దానికన్నా మేలైనది" అని దైవప్రవక్త(స) చెప్పారు. ఆ తరువాత ఆయన(స) తన సహచరమాన్యులకు మూడు విషయాల గురించి తాకీదు చేశారు- 1) బహుదైవారాధకులను అరేబియా ద్వీపం నుండి తీసివేయండి. 2) (వివిధ తెగల తరపున) రాయబారులుగా మీ వద్దకు వచ్చిన వారిని, నేను ఆదరించినట్లుగానే ఆదరించండి. 3) మూడవ విషయాన్ని ఇబ్నె అబ్బాస్ లేదా సయీద్ బిన్ జుబైర్ లేదా సులైమాన్ వివరించలేదు. మరచిపోయా నని అన్నారు.[1]

**292)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) కథనం : ప్రవక్త మహ నీయులు(సఅసమ్)కు మరణ కాలం సమీపించినప్పుడు, అక్కడ- ఇంట్లో- చాలా మంది ప్రియ సహచరులు ఉన్నారు. అప్పుడు దైవప్రవక్త(స) "ఏదన్నా తీసుకురండి, నేను మీ కోసం ఒక దస్తావేజు వ్రాస్తాను. మీరు గనక దాని ప్రకారం నడుచుకుంటే, మీరు మార్గభ్రష్టులు అవ్వరు" అని పలికారు. దానిపై ఉమర్(రజి), 'ప్రస్తుతం దైవప్రవక్త(స) వ్యాధి తీవ్రతరం అయింది. మీ వద్ద ఎలాగూ ఖుర్ఆన్ ఉంది. మన కొరకు దైవగ్రంథం చాలు'[1] అని అన్నారు. పిదప ఇంటి వారి మధ్య గొడవ జరిగింది. 'దైవప్రవక్త(స) కోరినట్లుగా ఏదయినా వ్రాయించే వస్తువు తెచ్చి ఇవ్వండి. ఆయన(స) దానిపై మార్గదర్శక సూచనలు వ్రాయిస్తారు. ఆ తరువాత మీరు

---

291-1. "నా సమాధిని విగ్రహాలయంగా మార్చకండి" అన్నదే ఆ మూడవ పలుకు అని ఉంది. ముఅత్తా ఇమామ్ మాలిక్ దీనిని పొందుపరిచారు.

**ఎన్నటికీ దారి తప్పరు' అని కొంతమంది పట్టుబట్టగా మరికొంతమంది దానికి భిన్నంగా తమ అభిప్రాయం వెల్లడించారు. దాంతో గొడవ మొదలై అరుపులు వినిపించడంతో, "మీరంతా ఇక్కడి నుండి వెళ్ళిపోండి" అని దైవప్రవక్త(స) మంద లించారు. ఉబైదుల్లాహ్ ఇలా అన్నారు : 'జనులు పరస్పరం విభేదించుకుని, గొడవ పడి దైవప్రవక్త(స)కు మార్గదర్శక సూచనలు వ్రాయించనివ్వలేదు. ఇదే పెద్ద సమస్య'[2] అని ఇబ్నె అబ్బాస్(రజి) అంటూ ఉండేవారు.**

**293) విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) వివరించారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) మరణ వ్యాధికి గురైనప్పుడు ఫాతిమా(ర.అ)ను పిలిచి, నెమ్మదిగా ఆమెకు ఏదో మాట చెప్పారు. అది విని ఆమె ఏడ్వసాగింది. తరువాత ఆయన (స) ఆమెకు నెమ్మదిగా మరో మాట చెప్పడంతో ఆమె నవ్వింది. తరువాత**

---

292-1. దైవప్రవక్త(స) తీవ్ర అనారోగ్యానికి గురై ఉన్న సమయంలో, పత్రం లిఖించే ఇబ్బంది ఆయన(స)కు ఎందుకు పెడతారు? అన్నది ఉమర్(రజి) మాటల ఉద్దేశం. దివ్య ఖుర్ఆన్‌లో ఆదేశాలన్నీ స్పష్టంగా ఉన్నాయి కదా, మన కొరకు ఖుర్ఆన్ చాలదా! అని కూడా ఆయన చెప్పదలిచారు. అంత మాత్రాన మనకు హదీసు అవసరం లేదన్నది ఆయన ఉద్దేశం కానే కాదు. అల్లాహ్ శరణు! హజ్రత్ ఉమర్(రజి) అలా అనగలరా?

292-2. మహనీయ ఉమర్(రజి) విజ్ఞులు. మహా మేధావి. రాజనీతిజ్ఞతలో, కార్యదక్షతలో సాటిలేని మేటి. మాటలు తడబడుతున్న క్షణంలో దైవప్రవక్త(స) చేత దస్తావేజు వ్రాయించినట్లయితే ఆ సమయంలో ఆయన(స) నోట ఏదయినా వాక్యం వెలువడి, అది కపటులకు వ్యంగ్యాస్త్రంగా మారవచ్చు. రానున్న కాలంలో అది ఇస్లామ్ పరివ్యాప్తిలో అంతరాయంగా పరిణమించవచ్చు అని ఆయన (రజి) తలపోసి ఉంటారు. హజ్రత్ ఉమర్(రజి) ఉద్దేశం దైవప్రవక్త(స) ఆజ్ఞను ఉల్లంఘించటం కానేకాదు (దేవుని శరణు!) ఈ విధంగా అనుమానించేవాడు అవివేకి. ఇలా అనుమానించేవాడు ఉమర్(రజి) త్యాగనిరతి గురించి, ఆయన సత్య నిబద్ధత గురించి, న్యాయ వర్తనం గురించి బొత్తిగా ఆలోచించలేదనాలి. షైతాన్ మాయా జాలంలో చిక్కుకున్నవాడే ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయగలడు.

ఈ సంఘటన జరిగిన తరువాత మూడు లేక నాలుగు రోజుల వరకూ దైవప్రవక్త(స) జీవించి ఉన్నారు. ఆయన(స) కోరుకుని ఉంటే ఆ తరువాత కూడా ఆ దస్తావేజును వ్రాయించగలిగేవారే. కాగితం, సిరా తీసుకుని రండి అని ఆయన(స) ఆజ్ఞాపించి ఉంటే కాదనే ధైర్యం ఎవరికుంటుంది?

**మేము దీని గురించి ఫాతిమా(ర.అ)ను దర్యాప్తు చేయగా ఆమె ఇలా వివరించారు– 'ఈ మరణ వ్యాధితోనే తాను మరణిస్తానని దైవప్రవక్త(స) చెప్పగానే నాకు ఏడుపు వచ్చింది. రెండవసారి ఆయన(స) నన్ను దగ్గరకు పిలిచి, తన ఇంటివారలలో అందరికన్నా ముందు నేనే ఆయన దగ్గరకు చేరుకుంటానని చెప్పడంతో నేను నవ్వాను'.**

**294) విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) ఉర్వాతో ఇలా అన్నారు: ప్రతి దైవప్రవక్తకూ ప్రపంచం కావాలో, పరలోకం కావాలో ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఇవ్వబడేదని, ఈ ఎంపిక స్వేచ్ఛ ఇవ్వనంతవరకూ వారికి మరణం వచ్చేది కాదని నేను వింటూ ఉండేదానిని. తరువాత ఇదే విషయం నేను మహాప్రవక్త(సఅసమ్) నోట కూడా విన్నాను. మరణ వ్యాధికి గురైన సమయంలో ఆయన కంఠస్వరం బరువెక్కింది. ఆయన(స) ఈ ఆయత్‌ను పారాయణం చేయసాగారు : 'మఅల్లజీన అన్‌అమల్లాహు అలైహిమ్' (వారు అల్లాహ్ అనుగ్రహానికి పాత్రులైన వారితో ఉంటారు) (అన్ నిసా: 69) ఇది విని, ఆయన (స) గారికి కూడా ఎంపిక స్వేచ్ఛ ఇవ్వబడిందన్న నా నమ్మకం దృఢమయింది.[1]**

**295) హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) తన మరణ వ్యాధి సందర్భంగా మాటిమాటికీ ఇలా అనసాగారు: "ఫీ రఫీఖిల్ ఆలా" (ఓ అల్లాహ్! నన్ను నా ఉన్నత మిత్రుల వద్దకు– అంటే దైవ ప్రవక్తల, సిద్దీఖుల వద్దకు చేర్చు).**

**296) హజ్రత్ ఆయిషా(ర.అ) కథనం : ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఆరోగ్యంగా ఉన్న కాలంలో ఇలా అనేవారు– "ఎప్పుడు ఏ దైవప్రవక్త ఆత్మను వశపరచుకున్నా, మొదట ఆయనకు స్వర్గంలో ఆయన నివాస స్థలాన్ని తప్పక చూపించబడేది. ఆ తరువాత ఆయనకు (ప్రపంచం కావాలో, పరలోకం కావాలో కోరుకొమ్మని) ఎంపిక స్వేచ్ఛ ఇవ్వబడేది"– మరి దైవప్రవక్త(స) అస్వస్థతకు గురై, మరణ ఘడియ సమీపించినప్పుడు ఆయన(స) తల నా తొడపై ఉంది. ఆయన**

---

294–1. అంటే ఆయన(సఅసమ్) పరలోకాన్ని ఎంపిక చేసుకున్నారు. వాఖిదీ ఇలా అంటారు: మహాప్రవక్త(స) ప్రపంచంలో ఏతెంచినప్పుడు అన్నింటికన్నా ముందు ఆయన(స) నోట వెలువడిన వాక్యం 'అల్లాహు అక్బర్'. మరణ సమయంలో ఆయన నోట వెలువడిన చివరి వాక్యం 'అల్ రఫీఖుల్ ఆలా' (ఆ పరమోన్నత మిత్రులే కావాలి).

స్పృహ తప్పిపోయారు. కొద్దిగా స్పృహలోకి వచ్చినప్పుడు ఆయన(స) కళ్ళు ఇంటి కప్పుపైకి చూస్తున్నాయి. ఆ క్షణంలో ఆయన(స) అధరాల మీదుగా జాలువారిన వాక్యం యిది: "అల్లాహుమ్మ రఫీఖిల్ ఆలా" (ఓ అల్లాహ్! నన్ను పరమోన్నత మిత్రులతో కలుపు). ఇక దైవప్రవక్త(స) ఈ ప్రాపంచిక జీవితాన్ని ఇష్టపడటం లేదన్న విషయం నాకు అర్థమయింది. ఆయన(స) ఆరోగ్యంగా ఉన్నప్పుడు చెప్పిన హదీసు ఆ క్షణంలో నాకు జ్ఞాపకం వచ్చింది.

**297)** హ(జ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు: (నా సోదరుడు) అబ్దుర్రహ్మాన్ బిన్ అబీ బకర్(రజి) దైవప్రవక్త(సఅసమ్) సేవలో హాజరైనప్పుడు ప్రవక్త(స) నా ఎదకు ఆనుకుని ఉన్నారు. అబ్దుర్రహ్మాన్ చేతిలో ఉన్న పచ్చని మిస్వాక్(పలుదోము పుల్ల)ను ఆయన(స) తదేకంగా చూస్తూ ఉండటంతో, నేను ఆ మిస్వాక్ పుల్లను అతని నుండి తీసుకుని, దానిని నా పల్లతో బాగా నమలి, పిదప దానిని బాగా శుభ్రపరచి ఆయన(స)కు ఇచ్చాను. ఆయన(స) ఆ మిస్వాక్‌ను ఎంత చక్కగా ఉపయోగించారంటే, అంతకుముందెన్నడూ ఆయన(స) అంత చక్కగా ఉపయోగించినట్లుగా నేను చూడలేదు. మిస్వాక్ చేయటం పూర్తయిన తరువాత ఆయన(స) తన చేతిని లేదా తన వ్రేలిని పైకెత్తి "ఫీ రఫీఖిల్ ఆలా" (పరమోన్నత మిత్రులలో కలుపు) అని మూడుసార్లు పలికారు. అంతే, ఆయన మహాప్రస్థానం చేశారు. ఆయిషా(ర.అ) ఇలా అన్నారు: 'దైవప్రవక్త(స) తనువు చాలించినప్పుడు ఆయన(స) శిరస్సు నా కంఠాభరణానికీ, నా చుబుకానికీ మధ్యన ఉంది.'

**298)** హ(జ్రత్ ఆయిషా సిద్దీఖా(ర.అ) తనకు తెలియజేసినట్లుగా ఉర్వా బిన్ జుబైర్ చెప్పారు : దైవప్రవక్త(సఅసమ్) ఎప్పుడయినా అస్వస్థతకు గురైనప్పుడు 'ముఅవ్వజాత్' (సూరయె ఇఖ్లాస్, సూరయె ఫలఖ్, సూరయె నాస్) పఠించి, తన చేతులపై ఊది వాటిని తన శరీరంపై స్పర్శించేవారు. మరి ఆయన(స) మరణ వ్యాధికి గురైనప్పుడు నేనే ఆ సూరాలను పఠించే దానిని. పిదప ఆయన చేతులను ఆయన(స) శరీరంపై త్రిప్పేదానిని.

**299)** హ(జ్రత్ ఆయిషా(ర.అ) అబ్బాద్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్‌తో ఇలా అన్నారు : మరణానికి ముందు నేను దైవప్రవక్త(సఅసమ్) పలుకులను చెవియొగ్గి విన్నాను. ఆ క్షణంలో ఆయన(స) తన వీపును నాకు ఆనించి ఉన్నారు-

ఇలా ప్రార్థించారు: “ఓ అల్లాహ్! నన్ను క్షమించు. నాపై దయజూపు. నన్ను ఉన్నత మిత్రుల సరసన చేర్చు.”

**300)** హజ్రత్ ఆయిషా(ర.అ) ఉర్వా బిన్ జుబైర్‌తో ఇలా అన్నారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) మరణ వ్యాధికి గురైనప్పుడు ఇలా పలికారు– “అల్లాహ్ యూదులను తన కారుణ్యానికి దూరం చేయుగాక! వారు దైవప్రవక్తల సమాధులను సాష్టాంగ ప్రణామ స్థలాలుగా చేసుకున్నారు”– ఆయిషా(ర.అ) ఇంకా ఇలా అన్నారు : “ఈ భయమే గనక లేకున్నట్లయితే ఆయన సమాధి కూడా బహిర్గతంగా ఉంచబడేది. తన సమాధిని జనులు సాష్టాంగ స్థలంగా చేసుకుంటారేమోనన్న చింత ఆయనకు ఉండేది”.

**301)** హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు: ప్రవక్త మహనీయులు(సఅసమ్) తనువు చాలించినప్పుడు ఆయన శిరస్సు నా కంఠాభరణానికీ– నా చుబుకానికీ మధ్యన ఉంది. దైవప్రవక్త(స) మరణ ఘడియలలో అనుభవించిన వేదనను చూసిన తరువాత నేను ఎవరి మరణ వేదనను కూడా చెడుగా భావించను.[1]

**302)** ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు : ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ మైమూనా (ర.అ) ఇంట అస్వస్థతకు గురై, వ్యాధి తీవ్రతరమైనప్పుడు, ఆయన (స) తన (ఇతర) భార్యలను పిలిచి, ఈ స్థితిలో తాను నా ఇంట్లో ఉండదలుస్తున్నానని చెప్పారు. అందుకు వారంతా అనుమతి ఇచ్చారు. ఆయన(స) ఇద్దరు మనుషుల ఆసరాతో కాళ్ళీడ్చు కుంటూ వచ్చారు. ఆ ఇద్దరిలో ఒకరు అబ్బాస్(రజి), మరొకరు మరో వ్యక్తి.

నేను హజ్రత్ ఆయిషా(ర.అ) గారి ఈ హదీసును అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి)కు వినిపించగా, ‘హజ్రత్ ఆయిషా (ర.అ) పేరు ప్రస్తావించని ఆ రెండవ వ్యక్తి ఎవరో మీకు తెలుసా?’ అని అడగ్గా, ‘లేద’ని నేనన్నాను. ‘ఆయన ఎవరో కారు, హజ్రత్ అలీ(రజి)’ అని ఆయన చెప్పారు.

హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అనేవారు: దైవప్రవక్త(స)ను నా కుటీరానికి చేర్చిన తర్వాత ఆయన(స) వ్యాధి మరింత తీవ్ర స్థాయికి చేరుకుంది. అప్పు

---

301–1. మరణ సమయంలో దైవప్రవక్త(స) తీవ్రమయిన బాధకు లోనయ్యారు. ఆయన నీళ్లు తీసుకుని పదేపదే తన ముఖం చల్లుకుంటూ “లా ఇలాహ ఇల్లల్లాహ్– మరణ బాధ కూడా బహు కఠినమైనది” అని అనేవారు.

**డాయన(స), "మూతి బిగించి కట్టబడిన ఏడు నీళ్ళ తిత్తులను తెచ్చి నా మీద కుమ్మరించండి (బహుశా జ్వరం తగ్గుతుందేమో). అప్పుడు నేను జనులకు ఏదయినా వసీయతు చేయగలను" అని ఆదేశించారు. అప్పుడు మేము ఆయన్ని సఫియ్యా (ర.అ) గారి తొట్టెలో కూర్చోబెట్టి ఆయన(స)పై నీరు కుమ్మరించసాగాము. "చాలు చాలు" అని ఆయన(స) సైగ చేశాక మేము నీరు పోయటం ఆపేశాము. తరువాత ఆయన జనుల వద్దకు వెళ్ళి, వారికి నమాజ్ చేయించారు. వారినుద్దేశించి ఉపన్యాసమిచ్చారు.[1]**

**(జుహ్రీ కథనం ప్రకారం) హజ్రత్ ఆయిషా (ర.అ), అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (ర.అ) ఇలా చెప్పారని ఉబైదుల్లాహ్ బిన్ అబ్దుల్లాహ్ ఉతబా తెలిపారు- దైవప్రవక్త(స) జబ్బు తీవ్రమైనప్పుడు, ఆయన(స) తన దుప్పటిని ముఖంపై కప్పుకునేవారు. (ఉక్కపోతతో) ఉక్కిరిబిక్కిరి అయినప్పుడు దుప్పటిని ముఖంపైనుంచి తొలగించేవారు. ఆ వ్యాకుల స్థితిలోనే ఇలా అనేవారు : "యూదులు, క్రైస్తవులు దైవ కారుణ్యానికి దూరం అవుగాక! వారు తమ ప్రవక్తల గోరీలను ప్రార్థనాలయంగా చేసుకున్నారు". ఈ దుష్ట పోకడ నుంచి ఆయన(స) జనులను వారించేవారు.[2]**

---

302-1. ముస్లిమ్‌లోని ఉల్లేఖనంలో ఇలా వుంది: ఈ సంఘటన దైవప్రవక్త(స) పరమపదించడానికి అయిదు రోజుల ముందు జరిగింది. ఆయన(స) తన ప్రసంగంలో ఇలా అన్నారు: "అల్లాహ్ తన ఒక దాసుణ్ణి పరీక్షించాడు. కాని ఆ దాసుడు ప్రపంచాన్ని కాకుండా, పరలోకాన్ని ఇష్టపడ్డాడు". ఇది విని అబూబక్ర్(రజి) దుఃఖంతో విలపిం చారు. ఇలా అన్నారు : '(దైవప్రవక్తా!) మా తల్లిదండ్రులు, మా ధన ప్రాణాలు మీకు అర్పితం'. దీని తరువాత ఆయన(స) మరణం వరకూ ఏ ప్రసంగం కూడా చేయ లేదు.

302-2. ఆయన(స) చిట్టచివరి హితోపదేశం ఇది : "నా సమాధిని మస్జిద్ (సాష్టాంగ ప్రణామ స్థలం)గా చేయరాదు. దానిని విగ్రహంగా చేయకూడదు."

శోచనీయమైన విషయం ఏమిటంటే ఆయన(స) గారి హితబోధకు బహు కొద్దిమంది ముస్లింలు మాత్రమే కట్టుబడి ఉన్నారు. వీరే సిసలైన మువహ్హిద్‌లు (ఏకేశ్వరోపాసకులు). మిగిలిన సోకాల్డ్ ముస్లింల గురించి ఏమని చెప్పేది!? దైవప్రవక్తల సమాధుల సంగతి అలావుంచి, వారు పీర్ల, ముర్షిద్‌ల, గురువుల, గోరీలను కూడా సాష్టాంగ ప్రణామ స్థలాలుగా చేసుకున్నారు. ఆ సమాధుల చుట్టూ ప్రదక్షిణ కూడా చేస్తారు. అక్కడ తమ అర్జీలను వ్రేలాడదీస్తున్నారు- లా హౌల వ లాఖువ్వత ఇల్లా బిల్లాహ్.

అమ్మ ఆయిషా(ర.అ) ఈ విధంగా చెప్పినట్లుగా ఉబైదుల్లాహ్ తనకు తెలిపారని జుహ్రీ ఉటంకించారు : (అబూబక్ర్-రజి-కు ఇమామత్ చేయమని చెప్పండి అన్న) దైవప్రవక్త(స) ఆదేశాన్ని నేను పలుమార్లు దాటవేశాను. ఎందుకంటే ప్రవక్త తదనంతరం ఆయనకు వారసుడు అయ్యే వ్యక్తిని జనులు ప్రేమాభిమానంతో చూడబోరని, పైగా అతనిని దరిద్రునిగా చూస్తారని నేను ఊహించాను. అందుకే దైవప్రవక్త(స) ఈ పని నుండి (అంటే ప్రజల సామూహిక నమాజ్‌కు నేతృత్వం వహించే పని నుండి) అబూబక్ర్(రజి)ను మినహాయించాలని నేను కోరుకున్నాను. ఈ హదీసును అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి), అబూ మూసా అష్అరీ (రజి), ఇబ్నె అబ్బాస్(రజి) కూడా దైవప్రవక్త(స) నుండి ఉల్లేఖించారు.

**303)** అబ్దుల్లాహ్ బిన్ కాబ్ బిన్ మాలిక్ అన్సారీ తెలిపారు : ఈయన తండ్రి కాబ్ బిన్ మాలిక్(రజి) అల్లాహ్ క్షమాభిక్ష పొందిన ముగ్గురిలో ఒకరు (ఈ వృత్తాంతం ఇంతకుముందే వచ్చింది). ఈయన గారికి అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) ఈ విధంగా తెలియజేశారు- దైవప్రవక్త(సఅసమ్) మరణ వ్యాధికి గురైనప్పుడు హజ్రత్ అలీ(రజి) ఆయన(స) నివాస గృహం నుండి బయటికి వచ్చారు. జనులు ఆయన దగ్గరకు వచ్చి, 'అబుల్ హసన్! ఈ రోజు దైవప్రవక్త(స) ఆరోగ్యం ఎలా వుంది?' అని అడిగారు. దానికి ఆయన, 'దైవానికి కృతజ్ఞతలు. ఈ రోజు కాస్త ఫరవాలేదు' అని బదులిచ్చారు. ఇది విని హజ్రత్ అబ్బాస్(రజి) అలీ చేయి పట్టుకుని, 'దైవసాక్షి! నీవు మూడు రోజుల తరువాత బానిసవు కాబోతున్నావు.[1] నేనైతే దైవప్రవక్త(స) అతి త్వరలోనే- ఈ జబ్బులో- కాలం చేయనున్నారని భావిస్తున్నాను. నేను అబ్దుల్ ముత్తలిబ్ పిల్లల ముఖం చూసి తెలుసుకుంటాను- వారు ఎప్పుడు మరణించనున్నారో! చూడు అలీ! నువ్వూ, నేను- ఇద్దరం కలిసి దైవప్రవక్త(స) సన్నిధికి వెళదాం (ఇప్పుడాయన జీవించే ఉన్నారు). మీ తదనంతరం మీ ఖలీఫా ఎవరు? అని ఆయన్ని(స) సూటిగా అడిగేద్దాము. ఒకవేళ ఆయన(స) మనకు (అంటే బనూ హాషిమ్‌కు) ఖిలాఫత్ ఇచ్చినట్లయితే, ఆ విషయం మనకు ముందుగానే స్పష్టమైపోతుంది. ఒకవేళ ఆయన(స) వేరితరులను ఖలీఫాగా చేసే మాటైతే మనం అతనికి విధేయులమవుదాం (అతను

303-1. అంటే మరో వ్యక్తి ఖలీఫా కాబోతున్నాడు. నీవు అతనికి దాసోహం అనక తప్పదు.

**మా పట్ల సద్భావంతో మెలగుతాడు) అని సలహా ఇచ్చారు. దానికి అలీ(రజి) 'వద్దు. మనం ఆయన్ని(స) అడిగిన తరువాత కూడా ఆయన(స) మనకు ఖిలాఫత్ ఇవ్వకపోతే ప్రజలు ఇక ఎన్నటికీ ఆయన తదనంతరం మనకు ఖిలాఫత్‌ను ఇవ్వరు.[2] అదీగాక నేను దైవప్రవక్త(స) సమక్షంలో ఖిలాఫత్ కొరకు అభ్యర్థించలేను' అని చెప్పారు.**

**304) హ్జ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) ఇలా వివరించారు : సోమవారం నాడు ఉదయం జనులు అబూబక్ర్(రజి) సారథ్యంలో నమాజ్ చేస్తున్నారు. అంత లోనే ఆయన ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఎందుకంటే ఆ క్షణంలో దైవప్రవక్త(స) ఆయిషా(ర.అ) కుటీరంలో నుండి తెర ఎత్తారు. ముస్లింలు వరుసలు తీరి నమాజులో నిలబడి ఉండటం గమనించారు. ఈ దృశ్యాన్ని చూసి ఆయన(స) చిరునవ్వు చిందించి, ఆ తర్వాత నవ్వేశారు (అంటే ముస్లింలు నమాజ్‌ను స్థాపిం చిన దృశ్యాన్ని తిలకించి ఆయన ఆనందాతిశయంతో ఉవ్విళ్ళూరారు). ఈ పరిస్థితిని పసిగట్టిన అబూబక్ర్(రజి) దైవప్రవక్త(స) ఏతెంచనున్నారని తలపోసి వెనక్కి జరగబోయారు. అనస్(రజి) ఇలా అన్నారు: ఆ క్షణంలో ప్రవక్త మహో దయులు(స)ను చూసిన ముస్లింలకు కలిగిన సంతోషం అంతా ఇంతా కాదు. వారు ఆ తన్మయత్వంలో నమాజ్‌ను కూడా భగ్నపరిచేలా కనిపించారు. కాని ఆయన(స), "నమాజ్‌ను పూర్తి చేయండి" అంటూ చేత్తో సంజ్ఞ చేశారు. తరువాత దైవప్రవక్త(స) కుటీరంలోనికి వెళుతూ తెర దించేశారు.[1]**

---

303-2. మెజారిటీ ప్రజలు ఖిలాఫత్ వ్యవహారంలో తమకు అనుకూలంగా లేరన్న సంగతి హ్జ్రత్ అలీ(రజి)కి తెలుసు. ఒకవేళ దైవప్రవక్త(స) తమకు ఖిలాఫత్ బాధ్యతను ఇవ్వడానికి నిరాకరించినట్లయితే, ప్రజా బాహుళ్యానికి ఒక ప్రమాణ పత్రం- ఆధారంగా- లభిస్తుంది. దీనికి భిన్నంగా మనం మౌనం వహించినట్లయితే, ఇప్పుడు కాకపోయినా భవిష్యత్తులోనయినా మన బంధుత్వాన్ని, ప్రాధాన్యతను తెలుసుకుని ఖిలాఫత్ ఇవ్వవచ్చు అని చెప్పారు.

మహనీయ అలీ (రజి) గారి ఈ పలుకుల ద్వారా స్పష్టంగా బోధపడేదేమంటే; ఇస్లామీయ ఖిలాఫత్ అనేది తండ్రి తదనంతరం కుమారునికి లభించే వారసత్వ హక్కు కాదు. పైగా ముస్లింలు ఏ వ్యక్తిని ఖిలాఫత్‌కు యోగ్యునిగా భావిస్తారో అతనినే తమ పరిపాలకునిగా చేసుకుంటారు. ఇస్లామీయ ప్రభుత్వం మొదటి నుండే ప్రజాస్వామ్య తరహాలో నెలకొన్నది అన్న విషయం కూడా దీనిద్వారా రూఢీ అవుతోంది. ఈ తరహా

**305)** హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అనేవారు: అల్లాహ్ నాకు చేసిన ఎన్నో మేళ్ళలో ఒక మేలు ఏమిటంటే, ప్రవక్త మహనీయులు(సఅసమ్) నా వంతు రోజునే నా ఇంట్లో పరమపదించారు. మరణ సమయంలో ఆయన(స) శిరస్సు నా ఎదకు-నా చుబుకానికి మధ్యన ఉంది. మరణ ఘడియలో అల్లాహ్ ఆయన(స) లాలా జలాన్ని నా లాలాజలంతో కలిపాడు. ఇంతకీ జరిగిందేమిటంటే, ఆ సమయంలో అబ్దుర్రహ్మాన్ బిన్ అబీబకర్ అక్కడికి వచ్చాడు. అతని చేతిలో మిస్వాక్ (పనుదోము పుల్ల) ఉంది. నేను ఆయన(స) దేహానికి నా శరీరాన్ని ఊతగా ఆనించి ఉన్నాను. ఆయన(స) మిస్వాక్‌ను తదేకంగా తిలకించటం నేను పసిగట్టాను. మిస్వాక్ చేయటం ఆయనకు ఎంత ఇష్టమో నాకు తెలుసు. అందుకే 'ఆ మిస్వాక్‌ను మీ కోసం తీసుకోనా?' అని అడిగాను. "అవున"న్నట్లు సంజ్ఞ చేశారాయన. నేను మిస్వాక్‌ను (అబ్దుర్రహ్మాన్ నుండి) తీసుకుని ఆయన(స)కు ఇచ్చాను. ఆయన(స) వ్యాధి తీవ్రత కారణంగా మిస్వాక్ పుల్లను నమలలేని స్థితిలో ఉన్నారు. 'నేను ఈ పుల్లను మెత్తబరచి ఇవ్వనా?' అని అడిగాను. ఆయన(స) 'అవున'నంటూ తలూపారు. నేను ఆ మిస్వాక్ పుల్లను నమలి ఆయనకు అందించాను. దైవ ప్రవక్త(స) మిస్వాక్ చేశారు. తరువాత ఆయన(స) ముందు నీళ్ళ చెంబు ఉంచ బడింది. ఆయన తన రెండు చేతులను నీళ్ళలో ముంచి ముఖంపై త్రిప్పుకుంటూ "లా ఇలాహ ఇల్లల్లాహ్- మరణ వేదన కూడా ఎంతో కఠినమైనది" అని పలికారు. ఆ తర్వాత, "ఓ అల్లాహ్! నన్ను ఉన్నత మిత్రులలో చేర్చు" అని వేడుకున్నారు. అంతే, ఆయన (స) పవిత్ర ఆత్మ నింగికేగింది. ఆయన(స) చేయి నేల కొరిగింది.

**306)** హజ్రత్ ఆయిషా(ర.అ) కథనం : మహాప్రవక్త(సఅసమ్) మరణ వ్యాధికి గురై ఉన్నప్పుడు, "రేపు నేను ఎక్కడుంటాను? రేపు నేను ఎక్కడుంటాను? అని అడిగేవారు. అంటే ఆయిషా(ర.అ) వంతు ఎప్పుడొస్తుంది? అన్నది ఆయన(స) మాటల్లోని ఉద్దేశం. ఈ పరిస్థితిని చూసి (అంటే ఆయన-సఅసమ్-ఆయిషా ఇంట్లో ఉండగోరుతున్నారని అర్థం చేసుకుని) మీరు ఎక్కడ ఉండదలిస్తే

---

వ్యవస్థ గనక ఉంటే ఇస్లామ్ మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లేది. కాని తర్వాతి కాలంలో అనువంశిక రాజరికం వచ్చేసింది. తండ్రి తరువాత కొడుకును రాజ్యాధికారిగా పట్టం కట్టారు. పతనం అక్కడినుండే మొదలయింది.

304-1. ఆ రోజే ఆయన(స) పరమపదించారని వేరొక ఉల్లేఖనంలో ఉంది.

అక్కడ ఉండవచ్చు అని ఆయన భార్యలు అనుమతిని ఇచ్చేశారు. అప్పటి నుండీ ఆయన(స) నా కుటీరంలోనే ఉండిపోయారు. ఆయన(స) మరణించిన దినం కూడా –యాదృచ్ఛికంగా– నా వంతు దినమే. ఆయన(స) పవిత్ర శిరస్సు నా కంఠాభరణానికి– నా చుబుకానికి మధ్యన ఉన్న సమయంలోనే ఆయన(స) ఆత్మ వశపరచుకోబడింది. అల్లాహ్ ఆయన(స) లాలాజలాన్ని, నా లాలాజలంతో కలిపాడు. అదెలాగంటే, ఆ సమయంలో (నా సోదరుడైన) అబ్దుర్రహ్మాన్ బిన్ అబూబక్ర్ ఒక మిస్వాక్ పుల్లను తీసుకుని వచ్చారు. దానితో ఆయన పల్లు తోము కుంటున్నారు. దైవప్రవక్త(స) ఆ మిస్వాక్‌ను చూశారు. (నేను అర్థం చేసుకుని) ఆ మిస్వాక్‌ను నాకు ఇవ్వమని అబ్దుర్రహ్మాన్‌ను కోరాను. ఆయన నాకు ఇచ్చారు. నేను ఆ పుల్లను చెక్కి, నా దంతాలతో నమలి మెత్తబరిచాను. పిదప దానిని దైవ ప్రవక్త(స)కు ఇచ్చాను. ఆయన(స) నా ఎదకు ఆనుకుని మిస్వాక్ చేశారు.

**307)** విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) నా కుటీరంలో, నా వంతు రోజున, నా కంఠాభరణానికీ– నా చుబుకానికి మధ్యన (శిరస్సు ఉంచి) తనువు చాలించారు. ఆయన(స)కు జబ్బు చేసినప్పుడు, ఆయన (స) కొరకు అల్లాహ్ శరణు వేడటం మా ఆనవాయితీగా ఉండేది. నేను ఆయన(స) కొరకు శరణు వేడటం మొదలెట్టాను (అంటే ముఅవ్వజాత్ సూరాలు పఠించసాగాను). ఆయన తన తలను ఆకాశం వైపునకు ఎత్తి, "దేవా! నన్ను పరమోన్నత మిత్రుల్లో విలీనం చెయ్యి. పరమోన్నత మిత్రుల సరసన చేర్చు" అని పలికారు. ఆ సమయంలోనే అబ్దుర్రహ్మాన్ బిన్ అబూ బక్ర్ అక్కడికి వచ్చారు. ఆయన చేతిలో ఒక పచ్చని మిస్వాక్ పుల్ల ఉంది. దానిపై దైవ ప్రవక్త(స) దృష్టి నిలిచింది. ఆయన(స) మిస్వాక్ పుల్లతో పల్లు తోముకో గోర్తున్నా రని నాకు అర్థమయింది. నేను ఆ మిస్వాక్ పుల్లను తీసుకుని, బాగా నమిలి, పిదప దానిని దులిపి, ఆయన(స) చేతికి అందించాను. ఆయన(స) బహు చక్కగా మిస్వాక్ చేశారు. ఆ తరువాత ఆయన(స) ఆ మిస్వాక్‌ని నాకు తిరిగి ఇస్తున్న సమయంలో ఆయన చేయి క్రిందికి వొరిగిపోయింది. లేదా మిస్వాక్ పుల్ల చేతిలో నుండి క్రిందికి పడిపోయింది. అల్లాహ్ ప్రత్యేక కృప ఏమిటంటే ఆయన(స) గారి ఇహలోకపు తుది దినంలో, పరలోకపు తొలి దినంలో నా లాలాజలాన్ని– ఆయన(స) లాలాజలంలో కలిపాడు.[1]

**308)** హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు: ప్రవక్త మహనీయులు(సఅసమ్) పరమపదించినప్పుడు అబూబక్ర్(రజి) గుర్రంపై స్వారీ అయి తన నివాస గృహం ఉన్న 'సునహ్'[1] నుండి వచ్చారు. గుర్రం నుండి దిగి మస్జిద్‌లో ప్రవేశించారు. అక్కడున్న జనులెవరితోనూ మాట్లాడకుండా సరాసరి నా కుటీరంలోనికి వచ్చారు. దైవప్రవక్త(స) పార్థివ శరీరం వద్దకు వెళ్ళి, ఆయనపై కప్పబడి ఉన్న యమన్ దుప్పటిని తొలగించి ఆయనపై పడి దుఃఖంతో విలపించారు. ఆయన్ని ముద్దాడారు. 'నా తల్లిదండ్రుల్ని మీకు అర్పింతు. అల్లాహ్ మీకు మరోసారి మరణం వొసగడు.[2] అల్లాహ్ మీకు రాసిపెట్టిన ఒక మరణం మీకు సంభవించింది' అని పలికారు.

జుహ్రీ ఇలా అన్నారు: అబూ సలమా నాతో అబ్బాస్ బిన్ అబ్బాస్(రజి) గారి ఉల్లేఖనాన్ని ఇలా ఉటంకించారు- అబూబక్ర్(రజి) దైవప్రవక్త(స) భౌతిక కాయాన్ని సందర్శించి, అక్కడి నుండి బయటకు వచ్చారు. ఆ సమయంలో హజ్రత్ ఉమర్(రజి) జనులతో మాట్లాడుతున్నారు- (దైవప్రవక్త-సఅసమ్- మరణించ లేదని అంటున్నారు).[3] 'మీరు కాస్త ప్రశాంతంగా కూర్చోండి' అని అబూబక్ర్(రజి) ఆయన్ని ఓదార్చారు. కాని ఆయన ఎంతకీ లక్ష్యపెట్టలేదు. జనులు అబూ బక్ర్ (రజి) చుట్టూ చేరారు.

అబూబక్ర్ (రజి) ఇలా ప్రసంగించారు: 'ప్రజలారా! (నేను చెప్పేది వినండి). అమ్మాబాద్! మీలో ఎవరయినా ముహమ్మద్(స)ను పూజించేవాడైతే (అంటే దేవుని మాదిరిగా ముహమ్మద్-సఅసమ్- కూడా సదా జీవించి ఉంటారని నమ్మేవాడైతే) ముహమ్మద్(సఅసమ్) మరణించారని తెలుసుకోవాలి. మరెవరయితే అల్లాహ్‌ను ఆరాధిస్తున్నారో, అల్లాహ్ సదా శాశ్వతంగా జీవించి ఉంటాడన్న సంగతిని తెలుసుకోవాలి. ఆయనకు మరణం అన్నది లేదు. అల్లాహ్ స్వయంగా ఖుర్ఆన్‌లో ఇలా సెలవిచ్చాడు-

"ముహమ్మద్ ఒక ప్రవక్త తప్ప [4] మరేమీ కాడు. అతనికి పూర్వం ఇంకా ఎందరో ప్రవక్తలు గతించారు. అలాంటప్పుడు ఒకవేళ అతను మరణిస్తే లేక హత్య

---

307-1. ఇహలోకంలోనూ, పరలోకంలోనూ ఈ పుణ్య దంపతులిద్దరూ ఒకేచోట ఉంటారన్న విషయం సంకేతప్రాయంగా ఇందులో తెలుపబడింది. మహనీయ అలీ(రజి) ఇలా అన్నారు: "హజ్రత్ ఆయిషా(ర.అ) ఇహపరాలలో ప్రవక్త సతీమణి అన్న సంగతి అల్లాహ్‌కు తెలుసు."

**చెయ్యబడితే మీరు వెనుకంజ వేసి మరలిపోతారా? జ్ఞాపకం ఉంచుకోండి, మరలి పోయేవాడు అల్లాహ్‌కు ఏమాత్రం నష్టం కలిగించలేడు. కాని అల్లాహ్‌కు కృతజ్ఞత చూపే దాసులుగా జీవించే వారిని ఆయన తగువిధంగా బహూకరిస్తాడు." *(ఆలి ఇమ్రాన్- 144)***

**ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అన్నారు: అబూబక్ర్(రజి) ఈ ఆయత్‌ను పఠించి వినిపించినప్పుడు, జనులు అల్లాహ్ ఈ ఆయత్‌ను అప్పుడే అవతరింపజేసి నట్లుగా- ఆశ్చర్యచకితులై- విన్నారు. తరువాత వారు అబూబక్ర్(రజి) నుండి ఈ ఆయత్‌ను (అనేకమార్లు) విని దానిని కంఠస్థం చేసుకున్నారు. ఎవరి నోట విన్నా ఈ ఆయతే. ... హజ్రత్ ఉమర్ (రజి) ఇలా అనేవారు: నేను ఆ ఆయత్‌ను (అంతకుముందు ఎన్నడూ) వినలేదనిపించింది నాకు. అబూబక్ర్ (రజి) నోట ఈ ఆయత్‌ను వినగానే నేను మెత్తబడిపోయాను. (నా ఆవేశం కాస్తా చల్లారింది). భయం చేత నా కాళ్ళు లేవలేదు. నేను ఒక్కసారిగా నేలకొరిగాను. అబూబక్ర్ నోట ఈ ఆయత్‌ను విన్నంతనే, దైవప్రవక్త(స) నిజంగా మరణించారన్న విష యాన్ని నేను అర్థం చేసుకున్నాను.[5]**

---

308-1. 'సునహ్' అనేది మదీనా పురమునకు కాస్త దూరంగా ఎత్తయిన ప్రదేశంలో ఉన్న ఒక వాడ. అక్కడ బనీ హారిబ్ బిన్ ఖజ్రజ్ ప్రజలు నివసించేవారు.

308-2. అబూబక్ర్(రజి) ఈ విధంగా పలికి, మహాప్రవక్త(స) మళ్ళీ బ్రతుకుతారని, కపటుల కాళ్ళు చేతుల్ని నరుకుతారని నమ్మే సహచరుల భావనను ఖండించారు.

308-3. అంటే- దైవప్రవక్త(సఅసమ్) ఇంకా చేయవలసిన పనులున్నాయి. ద్వంద్వనీతి పరులను శిక్షించనంత వరకూ ఆయన(స)కు మరణం రాదు అని చెప్పదలిచారు.

వేరొక ఉల్లేఖనంలో ఇలా వుంది : "ఖబడ్దార్! దైవప్రవక్త(స) చనిపోయారని చెప్పేవాని మెడను ఖడ్గంతో నరికేస్తాను" అని హజ్రత్ ఉమర్(రజి) హెచ్చరించారు- అంటే ఆయన(స)కు మరణం సంభవించలేదని ఉమర్ గట్టిగా నమ్మారు లేదా ఆయన అలా అనటంలో ఏదో గొప్ప పరమార్థం దాగి ఉండవచ్చు! ఖిలాఫత్ వ్యవహారం ఓ కొలిక్కి రానంతవరకూ దైవప్రవక్త(స) మరణ వార్తను ప్రకటించరాదన్నది ఆయన ఉద్దేశ్యమై ఉండవచ్చు. ఎందుకంటే ప్రవక్త(స) మరణవార్తను విన్న కొందరు అవకాశవాదులు వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసే ప్రయత్నం చేయవచ్చు.

308-4. అంటే ఆయన కేవలం ఒక ప్రవక్త మాత్రమే. ఆయన(స) దైవం గానీ, దైవానికి భాగస్వామి గానీ, దేవుని కుమారుడు గానీ కారు.

**309) ఉబైదుల్లాహ్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ ఉతబా గారు ఇబ్నె అబ్బాస్(రజి), ఆయిషా(ర.అ) నుండి ఇలా ఉటంకించారు : దైవప్రవక్త(సఅసమ్) పరమపదించిన తరువాత ఆయన(స)ను అబూబక్ర్(రజి) ముద్దాడారు.**

**310) హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు : దైవప్రవక్త(సఅసమ్)- అస్వస్థతకు గురై ఉన్నప్పుడు మేము ఆయన నోట్లో మందు వేశాము. వద్దంటూ ఆయన(స) సంజ్ఞ చేశారు. సాధారణంగా జబ్బు చేసిన వారందరూ మందు (కషాయం లాంటిది) త్రాగటం పట్ల విసుగు చెందుతారు కదా, ఆయన(స) కూడా అలాగే విసుగు చెందుతున్నారని మేము తలపోశాము. ఆయన(స) జ్వరం కాస్త తగ్గిన మీదట, "నా నోట్లో మందు వేయవద్దని నేను వారిస్తున్నా (వినకుండా) మందు ఎందుకు వేసినట్టు?" అని అడిగారు. దానికి మేము ఇలా విన్నవించుకున్నాము : 'అయ్యా దైవప్రవక్తా! జబ్బు చేసిన వారంతా సాధారణంగా మందు త్రాగడం పట్ల అయిష్టత కనబరిచినట్లే మీరు కూడా అయిష్టత చూపుతున్నారేమో' నని మేము భావించాము'. దానికి ఆయన(స) "ఓహో అదా సంగతి! అలాగయితే ఇప్పుడు ఇంట్లో ఉన్న వారందరి నోట్లో మందు పోయాలి. ఏ ఒక్కరినీ వదలిపెట్టకూడదు. ఇదే మీకు తగిన శిక్ష. కాకపోతే ఒక్క అబ్బాస్‌ను మాత్రం మినహాయించండి" అని పలికారు. ఆ సమయంలో ఆయన ఇంట్లో లేరు.**

**311) అస్వద్ బిన్ యజీద్ కథనం: హజ్రత్ ఆయిషా(ర.అ) సమక్షంలో ఎవరో ఒక వ్యక్తి 'దైవప్రవక్త(సఅసమ్) తన మరణ సమయంలో హజ్రత్ అలీ (రజి)ని తన వారసునిగా (ఖలీఫాగా) చేశారట కదా!' అని ప్రస్తావించగా, ఆమె ఇలా అన్నారు: "అలా అని ఎవరంటున్నారు? నేను స్వయంగా చూశాను. మరణ**

---

308-5. ఇమామ్ అహ్మద్ ఉల్లేఖనంలో ఇలా వుంది : హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు- దైవప్రవక్త(స) మరణించిన పిదప నేను ఆయన భౌతికకాయంపై గుడ్డ కప్పాను. ఆ తరువాత ఉమర్, ముగీరా- ఇద్దరూ వచ్చి లోనికి ప్రవేశించేందుకు అనుమతి కోరారు. నేను వారికి అనుమతి ఇచ్చాను. ఉమర్ ఆయన(స) పార్థివ శరీరాన్ని చూసి, 'అయ్యో! తమరు స్పృహ కోల్పోయారా!' అని పలికారు. 'లేదు. ఆయన పరమ పదించార'ని ముగీరా చెప్పారు. 'లేదు. నీవు అబద్ధీకుడవు. కల్లోలం వ్యాపింపజేయ గోరుతున్నావు. కపట విశ్వాసుల (మునాఫిఖీన్)ను తుదముట్టించే వరకూ దైవప్రవక్త(స)కు మరణం రాదు' అని ముగీరాను మందలిస్తూ సమాధానమిచ్చారు ఉమర్(రజి).

ఘడియల్లో ఆయన(స) నా ఎదపై తలవాల్చి ఉన్నారు. ఆయన(స) నీళ్ళ పాత్రను తెప్పించమని కోరారు. మరి అంతలోనే ఒక వైపునకు ఒరిగిపోయారు (పరమ పదించారు). ఆయన ఆత్మ వశపరచుకోబడిన సంగతి నాకు సయితం తెలియలేదు. మరలాంటప్పుడు ఆయన(స) అలీ(రజి)ని వారసునిగా ఎప్పుడు చేసినట్టు?"

**312)** తల్హా బిన్ ముస్రిఫ్ ఇలా అన్నారు : "దైవప్రవక్త(సఅసమ్) ఎవరి నయినా తన వారసునిగా చేశారా?"[1] అని నేను అబ్దుల్లాహ్ బిన్ అబీ అవ్ఫా (రజి)ను అడిగితే "లేదు" అని ఆయన చెప్పారు. "మరి అలాంటప్పుడు జనులను వారసులుగా ప్రకటించటం ఎలా విధితమయింది?" లేదా "వసీయతు చేసే ఆజ్ఞ ఎట్టిది?' అని నేను ప్రశ్నించగా, 'దైవాజ్ఞ ప్రకారం మసలుకోవలసినదిగా ఆయన (స) వసీయతు చేశార"ని సమాధానం ఇచ్చారు.

**313)** అమ్ర్ బిన్ హారిస్ ఇలా అన్నారు: ప్రవక్త మహనీయులు(సఅసమ్) దీనార్లు గానీ, దిర్హమ్‌లు గానీ, బానిసలను గానీ, బానిస స్త్రీలను గానీ తన ఆస్తిగా వదలిపోలేదు. కాకపోతే తాను స్వారీ అయ్యే ఒక తెల్లని కంచెర గాడిదను, కొన్ని ఆయుధాలను, (ఖైబర్, ఫదక్‌లలోని) కొంత భూమిని వదలిపోయారు. దానిని (ఫలసాయాన్ని) ఆయన తన జీవిత కాలంలో బాటసారుల కొరకు 'వక్ఫ్' చేశారు.

**314)** మహనీయ అనస్(రజి) తెలిపారు : మహాప్రవక్త(సఅసమ్) అస్వస్థత తీవ్ర స్థాయికి చేరుకున్నప్పుడు ఆయన(స) స్పృహ కోల్పోసాగారు. ఆయన(స) కూతురు ఫాతిమా(ర.అ) ఈ పరిస్థితిని చూసి, 'అయ్యో, నా తండ్రిపై ఆవరించే ఈ బాధ ఎట్టిది?' అని తన ఆవేదనను వెళ్ళగ్రక్కితే, "ఈ రోజు తరువాత నీ తండ్రిపై ఎలాంటి బాధ ఉండదమ్మా" అని దైవప్రవక్త(స) చెప్పారు. ఆయన(స) పరమపదించినప్పుడు, హజ్రత్ ఫాతిమా (ర.అ) దుఃఖంతో ఏడుస్తూ 'అయ్యో నా తండ్రీ! మీరు మీ ప్రభువు పిలుపునకు మీ సమ్మతిని తెలిపారా!? అయ్యో నాన్న! మీరు జన్నతుల్ ఫిర్‌దౌస్‌లో మీ నివాస స్థానాన్ని ఏర్పరచుకున్నారా! నాన్నా! ఉండండి, నేను మీ మరణవార్తను జిబ్రీల్(అలైహిస్సలామ్)కు అందజేస్తాను'[1] అనసాగారు. దైవప్రవక్త(స) ఖననం చేయబడిన పిదప, ఫాతిమా(ర.అ) అనస్‌ను సంబోధించి, 'దైవప్రవక్త(స) సమాధిపై మట్టి వేయడానికి అసలు మీకు మనసెలా ఒప్పింది?'[2] అని ప్రశ్నించారు.

---

312-1. లేదా ధనాన్ని దానం చేయటం గురించి తాకీదు చేశారా?

అధ్యాయం : 84

## మరణ సమయంలో దైవప్రవక్త(సఅసమ్) నోట వెలువడిన ఆఖరి మాటలు

**315) హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా వివరించారు : ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఆరోగ్యవంతులుగా ఉన్న కాలంలో, "ఏ ప్రవక్త అయినా సరే, వారి ఆత్మను వశపరచుకునే ముందు స్వర్గంలో వారు నివాసముండే చోటు వారికి చూపించబడింది. పిదప వారికి (ప్రపంచం కావాలో, పరలోకం కావాలో) ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఇవ్వబడింది" అని చెబుతుండేవారు.**

**తరువాత ఆయన(స) అస్వస్థతకు గురైన సమయంలో ఆయన(స) పవిత్ర శిరస్సు నా తొడపై ఉంది. అప్పుడే ఆయన స్పృహ కోల్పోయారు. ఆయన(స)కు స్పృహ వచ్చినప్పుడు, తన దృష్టిని ఇంటి కప్పుపైకి మరల్చి, "అల్లాహుమ్మ ర్రఫీఖుల్ ఆలా" (ఓ అల్లాహ్! నన్ను పరమోన్నత మిత్రుల వద్దకు చేర్చు) అని పలికారు. అంటే నన్ను నీ సన్నిధిలో ఉన్న దైవప్రవక్తలతో, సిద్దీఖులతో కలుపు అని వేడు కున్నారు. నేనప్పుడే అర్థం చేసుకున్నాను- ఆయన(స) ఇక మమ్మల్ని ఇష్టపడటం లేదనీ, పరలోకాన్నే ఇష్టపడుతున్నారని! ఆరోగ్యంగా ఉన్నప్పుడు ఆయన(స) చెప్పిన**

314-1. ఈ ఏడుపు 'నౌహా' (పెడబొబ్బలు పెట్టడం, బట్టలు చింపుకోవడం, శరీరంపై బాదుకోవటం) క్రిందికి రాదు. నౌహా చేయటం ధర్మసమ్మతం కాదు. షరీఅత్ పరిధిలో ఉంటూ విలపించటం, నెమ్మదిగా ఏడ్వటం, కన్నీరు కార్చటం ధర్మసమ్మతమే.

314-2. పితృ వియోగ దుఃఖంలో ఫాతిమా(ర.అ) నోట వెలువడిన మాటలివి. "ఏమయ్యా, మీ గుండెలు రాతి గుండెలైపోయాయా? మీలో కనికరం లేదా? నిన్నటి దాకా మీ మధ్యన ఉన్న మృతుణ్ణి అంత తొందరగా నేలలో పూడ్చిపెట్టడానికి మీ మనసు ఎలా ఒప్పుకుంది?" లాంటి మాటల్ని ఈ రోజుల్లో కూడా మృతుని ఇంటివారు చెబు తుంటారు.

ఇకపోతే, ఫాతిమా(ర.అ) వేసిన ప్రశ్నకు అనస్(రజి)ఏమని జవాబివ్వగలరు. ఆ సమయంలో ఆయన స్వయంగా దుఃఖంతో విలపిస్తూ ఉన్నారు- అందుకే ఆయన ఇలా అన్నారు: 'మట్టి వేయటం అలా ఉంచండి. ఆయన(స) పవిత్ర దేహంపై ఒక వెంట్రుక పడటాన్ని కూడా మేము సహించలేము. కాని ఏం చేసేది? దైవాజ్ఞ ముందు తలవంచక తప్పదు'

ప్రవచనం ఆ క్షణంలో నాకు జ్ఞప్తికి వచ్చింది. హజ్రత్ ఆయిషా(ర.అ) ఇంకా ఇలా అన్నారు : ఆయన(స) మనసు తనువును వీడుతున్నప్పుడు ఆయన అధరాల మీదుగా జాలువారిన చివరి వాక్యం ఇది : “అల్లాహుమ్మర్రఫీఖుల్ ఆలా”

## అధ్యాయం : 85

# మహోదయుని (సఅసమ్) మహాప్రస్థానం గురించి

**316)** అబూ సలమా బిన్ అబ్దుర్రహ్మాన్‌తో హజ్రత్ ఆయిషా(ర.అ), హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అన్నారు : మహనీయ ముహమ్మద్(సఅసమ్)కు దైవదౌత్యం అందిన మీదట పదేండ్ల వరకూ మక్కాలో ఉన్నారు.[1] ఈ కాలంలో ఆయన(స)పై 'వహీ' (దైవవాణి) అవతరిస్తూ ఉండేది. మదీనాలో కూడా ఆయన (స) పదేండ్లు నివాసమున్నారు.

**317)** విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) వివరించారు : “ప్రవక్త మహోదయులు(సఅసమ్) కాలం చేసినప్పుడు ఆయన వయసు అరవై మూడు సంవత్సరాలు”- సయీద్ బిన్ ముసయ్యిబ్ కూడా తనకు ఇదేవిధంగా తెలిపారని ఇబ్నె షిహాబ్ చెప్పారు.

## అధ్యాయం : 86

**318)** హజ్రత్ ఆయిషా(ర.అ) అస్వద్ బిన్ యజీద్‌తో ఇలా అన్నారు : ప్రవక్త మహనీయులు (సఅసమ్) మరణించిన నాడు, ఆయన గారి కవచం ఒకటి ఒక యూదుని వద్ద మూడు 'సా'ల యవలకు బదులుగా తాకట్టు ఉంది.[1]

---

316-1. ఇక్కడ గమనార్హమైన విషయం ఏమిటంటే 'హిరా' గుహలో ఉండగా దైవప్రవక్త(స)కు మొదటిసారి 'వహీ' అందిన మీదట, దాదాపు మూడు సంవత్సరాల వరకూ 'వహీ' నిలిచిపోయింది. ఆ తరువాత 'వహీ' నిరంతరాయంగా అవతరించేది.

318-1. మహనీయ అబూబక్ర్(రజి) ఆ యూదునికి అప్పు చెల్లించి, ఆ కవచాన్ని విడిపించు కున్నారు. వివేచన గల ఏ వ్యక్తి ప్రశాంతంగా ఆలోచించినా ఆయన(స) సత్యవంతుడైన ప్రవక్త అనీ, ప్రపంచంలోని రాజుల మాదిరిగా ఒక రాజు కారని తెలుసుకుంటాడు. ఒకవేళ ఆయన ప్రపంచంలోని ఇతర చక్రవర్తుల మాదిరిగా చక్రవర్తి అయివుంటే తన ఆలుబిడ్డల కోసం లక్షలాది, కోట్లాది రూపాయలు వదిలి వెళ్ళేవారు.

అధ్యాయం : 87

# మరణ వ్యాధికి గుర్రై ఉన్న కాలంలో దైవప్రవక్త(స) ఉసామా బిన్ జైద్ (రజి)ను సేనాధిపతిగా నియమించి పంపటం

**319)** సాలిమ్‌తో ఆయన తండ్రి (అబ్దుల్లాహ్ బిన్ ఉమర్-రజి) ఇలా అన్నారు : ప్రవక్త మహోదయులు (సఅసమ్) ఉసామా బిన్ జైద్(రజి)ను ఒక సైనిక పటాలానికి అధిపతిగా నియమించారు. కొంతమంది సహచరమాన్యులు ఈ నియామకంపై అభ్యంతరం వ్యక్తపరిచారు. ఈ సంగతి తెలుసుకున్న దైవ ప్రవక్త(స), "మీరు ఉసామా (నియామకం) పట్ల అభ్యంతరం తెలిపారని విన్నాను. వాస్తవానికి ఉసామా నాకు అందరికన్నా ప్రియతముడు."[1]

**320)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం : ప్రవక్త మహోదయులు(సఅసమ్) ఒక సైనిక పటాలాన్ని సిద్ధం చేసి, దానికి సేనాధిపతిగా ఉసామా బిన్ జైద్(రజి)ను నియమించారు. జనులలో కొంతమంది ఉసామా నేతృత్వంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై దైవప్రవక్త(స) తన సహచర మాన్యులను సంబోధించి ప్రసంగిస్తూ, "ఈ రోజు మీరు ఇతని నేతృత్వంపై అభ్యంతరం తెలుపుతుంటే, ఇతని తండ్రి (జైద్) నేతృత్వంపై కూడా మీరు అభ్యంతరం తెలిపి ఉన్నారు. అల్లాహ్ సాక్షిగా! ఇతని తండ్రి (జైద్-రజి) నాయకత్వానికి తగినవాడు, నాకు అందరికన్నా ప్రియతముడు. అతని తరువాత ఇతను (ఉసామా) కూడా నాకు అందరికన్నా ప్రియతముడు."

---

319-1. ఆ సైనిక పటాలంలో అబూబక్ర్(రజి), ఉమర్(రజి) లాంటి అగ్రశ్రేణి ముహాజిర్ సహాబా ఉన్నప్పటికీ ఆయన(స) పిన్న వయస్కుడైన ఉసామా (రజి)ను సైన్యాధిపతిగా నియమించటం గమనార్హం. అంతకుముందు ముతా యుద్ధంలో ఉసామా తండ్రి జైద్ బిన్ హారిసా(రజి) అమరగతి నొందారు. తండ్రిని హతమార్చిన శత్రువులపై ప్రతీకారేచ్ఛతో ఉసామా విరుచుకుపడతారని దైవప్రవక్త(స) భావించారు. అదీగాక మానవ అసమానతల్ని, నిమ్నోన్నతా భేదభావాల్ని కూడా ఇలాంటి ఉపమానాల ద్వారా రూపుమాపాలని దైవప్రవక్త(స) తలపోశారు. ఈ సైనిక పటాలం మదీనా పొలిమేరలు దాటుతుండగానే మహాప్రవక్త(స) పరమపదించారు. సైనికులు వెనక్కి తిరిగి వచ్చి అంత్యక్రియలలో పాల్గొన్నారు. ఆ తరువాత మొదటి ఖలీఫా హజ్రత్ అబూబక్ర్(రజి) ఈ సైన్యాన్ని సాగనంపారు. ఉసామా బిన్ జైద్(రజి) తన తండ్రి హంతకుల్ని హతమార్చి, భారీ మొత్తంలో యుద్ధ ప్రాప్తితో సహా విజేతగా తిరిగి వచ్చారు.

### అధ్యాయం : 88

**321)** అబుల్ ఖైర్ గారు సునాబిహీని ఉద్దేశించి, 'మీరు ఎప్పుడు హిజ్రత్ చేశారు?' అని అడిగితే, ఆయన ఇలా వివరించారు : 'మేము హిజ్రత్ ఉద్దేశంతో యమన్ నుండి బయలుదేరాము. జుహ్ఫా అనే ప్రదేశానికి చేరుకునేసరికి మాకు ఒక ప్రయాణీకుడు ఎదురుపడ్డాడు. మేము మదీనా విశేషాలను గురించి అతన్ని వాకబు చేయగా, 'దైవప్రవక్త(స) పరమపదించి అయిదు రోజులయ్యాయ'ని ఆ వ్యక్తి చెప్పాడు. 'నీవు లైలతుల్ ఖద్ర్(ఘనమైన రాత్రి) గురించి ఏదైనా హదీసు విన్నావా?' అని నేనతన్ని అడిగాను. దానికతను, 'అవును. దైవప్రవక్త(స) గారి ముఅజ్జిన్ బిలాల్(రజి) నాకు తెలిపిన దాని ప్రకారం అది రమజాన్ నెల చివరి దశకంలోని ఏడు రాత్రులలో ఒక బేసి రాత్రి అయి ఉంటుంది' అన్నాడు.

### అధ్యాయం : 89

## దైవప్రవక్త(స) మొత్తం ఎన్ని యుద్ధాలు చేశారు?

**322)** అబూ ఇస్‌హాఖ్ ఇలా అన్నారు : "దైవప్రవక్త(సఅసమ్)తో కలసి మీరు ఎన్ని యుద్ధాలలో పాల్గొన్నార"ని జైద్ బిన్ అర్ఖమ్ (రజి)ను నేను అడిగితే, "పదిహేడు" అని ఆయన చెప్పారు. "మరైతే దైవప్రవక్త(స) ఎన్ని యుద్ధాలు చేశారు?" అని నేను ప్రశ్నించగా, "పందొమ్మిది" అని ఆయన సమాధానమిచ్చారు.

**323)** అబూ ఇస్‌హాఖ్ కథనం ప్రకారం బరా బిన్ ఆజిబ్(రజి) ఇలా అన్నారు : "నేను దైవప్రవక్త(స)తో కలసి పదిహేను యుద్ధాలలో పాల్గొన్నాను."

**324)** "తాను దైవప్రవక్త(సఅసమ్)తో కలసి పదహారు యుద్ధాలలో పాల్గొన్నాన"ని బురైదా (రజి) తన కుమారుడు అబ్దుల్లాహ్‌తో చెప్పారు.

అపార కరుణామయుడు పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

# كِتَابُ التَّفْسِيرِ

# 2. ఖుర్ఆన్ వ్యాఖ్యాన ప్రకరణం

## (కితాబుత్తఫ్సీర్)

**అర్రహ్మాన్, అర్రహీమ్ –** ఇవి రెండూ అల్లాహ్ గుణాలు. ఇవి రెండూ 'రహ్మత్' నుండి వెలువడ్డాయి. ఈ రెండింటి అర్థం దాదాపు ఒక్కటే. అంటే అనంత కరుణా మయుడు, అపార కృపాశీలుడు అని అర్థం. అంటే 'అలీమ్','ఆలిమ్' అనే పదాలు రెండింటికీ అర్థం లాంటిదే ఇదీను.★ (అంటే ఎరిగినవాడు, తెలిసినవాడు).

### అధ్యాయం : 1

# 1. ఫాతిహా సూరా వ్యాఖ్యానం

**ఈ సూరాను 'ఉమ్ముల్ కితాబ్' అని కూడా అంటారు. 'ఉమ్మ్' అంటే తల్లి, మాత అని అర్థం. ఎందుకంటే దివ్య ఖుర్ఆన్ ఈ సూరాతోనే ఆరంభమవుతుంది.**

---

★ కొంతమంది ఏమంటారంటే **'రహ్మాన్'**లో అతిశయోక్తి ఉంది. అందుకే **'రహ్మానుద్దునియా వ రహీముల్ ఆఖిరా'** అంటారు. ఎందుకంటే ప్రపంచంలో ఆయన కారుణ్యం అందరిపై సాధారణంగా ఉంటుంది. పరలోకంలో మాత్రం అది విశ్వాసులకే ప్రత్యేకం. మరి కొందరేమంటారంటే **'రహ్మ్'** (దయ)లో అతిశయోక్తి ఉంది. హాఫిజ్ ఇబ్నె హజర్ ప్రకారం రెండింటిలోనూ ఒకింత (ఒక్కో కారణంగా) అతిశయోక్తి ఉంది.

అబ్దుల్లాహ్ బిన్ ముబారక్(రహ్మ) ఇలా అంటారు: అర్థించినప్పుడు ఇచ్చేవాడు **రహ్మాన్.** అర్థించకుండా ఉండటంపై అప్రసన్నుడయ్యేవాడు **రహీమ్**. అల్లాహ్ యొక్క అపారమైన కృప ఏమిటంటే అడగటం పట్ల ఆయన ప్రసన్నుడవుతాడు. అడగకుండా ఉండటం పట్ల అప్రసన్నుడవుతాడు. ఓ రాజాధిరాజా! మేము నిన్ను అర్థించటం వినా మార్గాంతరం లేదు. మేము ఇహంలోని మేలు, పరంలోని సాఫల్యం కొరకు నిన్ను అర్థిస్తూ ఉంటాము.

**నమాజ్‌లో కూడా పారాయణం ఈ సూరాతోనే మొదలవుతుంది. 'అద్దీన్' అనేది ఈ సూరాలోని కీలకమైన పదం. అద్దీన్ అంటే 'ప్రతిఫలం' అని అర్థం– అది మంచిదీ కావచ్చు, చెడ్డదీ కావచ్చు. 'చేసుకున్న దాని ప్రకారం పొందుతారు' అన్న నానుడి సుప్రసిద్ధమే. 'అద్దీన్' అంటే లెక్కతేల్చే దినం అని ముజాహిద్ అంటారు. అల్ మావూన్ సూరాలోని మొదటి ఆయత్ ఆధారంగా ఆయన దీనిని 'శిక్షా బహుమానాల దినం'గా పేర్కొన్నారు. "కల్లా బల్ తుకజ్జిబూన బిద్దీన్" (మీరు శిక్షా బహుమానాలు లేవని తిరస్కరిస్తున్నారు– అల్ ఇన్‌ఫితార్: 9) అనే వాక్యాన్ని కూడా ఆయన తన వ్యాఖ్యానానికి ఆధారంగా తీసుకున్నారు.**

**325) అబూ సయీద్ బిన్ ముఅల్లా (రజి) వివరించారు: నేను మస్జిద్‌లో నమాజ్ చేస్తూ ఉండగా ప్రవక్త మహనీయులు(సఅసమ్) నన్ను పిలిచారు. కాని నేను జవాబు ఇవ్వలేదు. (నమాజ్ అనంతరం నేను ఆయన సన్నిధిలో హాజరై) 'దైవప్రవక్తా! నేను నమాజ్‌లో ఉన్నాను' అని విన్నవించుకున్నాను. దానికి దైవప్రవక్త(స) "ఏమిటి, అల్లాహ్ పిలుపునకూ, ఆయన ప్రవక్త పిలుపునకూ జవాబు పలకండి (అల్ అన్‌ఫాల్ : 24)[1] అని అల్లాహ్ సెలవీయలేదా?" అని అడిగారు. తరువాత ప్రవక్త మహోదయులు(స) ఇలా ప్రవచించారు: "మస్జిద్ నుండి వెడలక ముందే ఈ రోజు నేను నీకు ఒక సూరా గురించి చెబుతాను. అది పుణ్యఫలం రీత్యా ఖుర్ఆన్‌లోని సూరాలన్నింటిలోకీ గొప్పది". ఆయన(స) నా చేతిని తన చేతిలోకి తీసుకుని, మస్జిద్ నుండి బయటికి వెళుతుండగా, 'దైవప్రవక్తా! మస్జిద్ నుండి వెడలక ముందే నీకు ఒక సూరా గురించి చెబుతాను. అది పుణ్యఫలం రీత్యా ఖుర్ఆన్‌లోని సూరాలన్నింటిలోకీ గొప్పది అని తమరు అంటిరి కదా!' అని నేను విన్నవించుకున్నాను. దానికి ఆయన(స), "అదే అల్‌హమ్దులిల్లాహి రబ్బిల్**

---

325–1. ఈ ఆయత్ ఆధారంగానే, దైవప్రవక్త(స) పిలుపుపై వెంటనే హాజరవ్వాలని విద్వాంసులు ఉద్ఘాటించారు. నమాజు స్థితిలో ఉన్నా సరే ఆలస్యం చేయరాదని అన్నారు. అలా హాజరవటం వల్ల నమాజ్ భగ్నమవుతుందా? లేదా? అన్న దానిపై అభిప్రాయ భేదం ఉంది.

నమాజ్ వంటి ఆరాధనను సయితం విడిచిపెట్టి ప్రవక్త పిలుపునకు స్పందించాలన్న ఆదేశం ఉన్నప్పుడు జనులు దాని ప్రాముఖ్యతను ఆకళింపు చేసుకున్నారా? లేదా? అన్నది గమనించాల్సిన విషయం. ప్రజలు తమ షరీఅత్ అన్వయకర్తల (ముజ్తహిదీన్)

**ఆలమీన్ సూరా. అందులో ఏడు ఆయత్‌లు ఉన్నాయి. (అవి ప్రతి రకఅత్‌లో పునరావృతం అవుతుంటాయి) నాకు ప్రసాదించబడిన గొప్ప ఖుర్‌ఆన్ (ఫాతిహా సూరా) ఇదే" అని చెప్పారు.**

## అధ్యాయం : 2

# 'గైరిల్ మగ్‌జూబి అలైహిమ్ వలజ్జాల్లీన్' అన్న దైవ వచనానికి వివరణ

**326) హజ్రత్ అబూ హురైరా(రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా ఉద్బోధించారు: "(నమాజులో) మీ నాయకుడు (ఇమామ్) *'గైరిల్ మగ్‌జూబి అలైహిమ్ వలజ్జాల్లీన్'* అని పలికినప్పుడు మీరు 'ఆమీన్' అని అనండి. ఎందుకంటే ఈ విధంగా (ఆమీన్) పలికిన వాని పలుకు దైవదూతల పలుకుతో అనుసంధానమై, అతని వెనుకటి పాపాలన్నీ క్షమించబడతాయి."**

---

పిలుపుపై వెళుతున్నారు. కాని దైవప్రవక్త(స) హదీసుల వైపునకు మరలటం లేదు. మరి చూడబోతే ఈ శాసనాన్వయకర్తల (ముజ్తహిదీన్ల) మాటను శిరసావహించటం ఫర్జ్ గానీ, సున్నత్ గానీ, నఫిల్ గానీ కాదు. కాని దైవప్రవక్త(స)కు విధేయత చూపటం ఖుర్‌ఆన్ ప్రకారం విధి (ఫర్జ్).

# 2. అల్ బఖరా సూరా వ్యాఖ్యానం

## అధ్యాయం : 1

## "అల్లాహ్ ఆదమ్‌కు అన్ని వస్తువుల పేర్లూ నేర్పాడు" అన్న దైవోపదేశం గురించి...

**327)** ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఈ విధంగా ప్రవచించినట్లుగా హజ్రత్ అనస్(రజి) ఉల్లేఖించారు: "విశ్వాసులు (మోమినీన్) ప్రళయదినాన వ్యాకులతతో ఒకచోట సమావేశమై (పరస్పరం) ఇలా చెప్పుకుంటారు- 'ఈ రోజు మనం మన ప్రభువు సమక్షంలో ఎవరినయినా మన కొరకు సిఫారసు చేసేవానిని పంపితే బావుంటుందేమో!' అలా చెప్పుకుని వారంతా హజ్రత్ ఆదమ్(అలైహిస్సలామ్) దగ్గరకు వెళ్ళి, 'మీరు మానవులందరికీ తండ్రి. అల్లాహ్ మిమ్మల్ని తన స్వహస్తాలతో నిర్మించాడు. మీకు సాష్టాంగ ప్రణామం చేయమని దైవదూతలకు ఆజ్ఞాపించాడు. మీకు వస్తువులన్నింటి పేర్లు నేర్పాడు. కాబట్టి మీరు మా కోసం మీ ప్రభువు సమక్షంలో సిఫారసు చేయండి. తద్వారానే మేము ఈనాటి ఈ విపత్తు నుండి బయటపడగలం' అని విన్నవించుకుంటారు.

ఆదమ్(అ) ఇలా అంటారు: "నేను దానికి తగినవాణ్ణి కాను". ఆయన తన వల్ల జరిగిన తప్పిదాన్ని జ్ఞప్తికి తెచ్చుకుని, తన ప్రభువు దగ్గరకు వెళ్ళడానికి సిగ్గుపడతారు- "మీరు నూహు (అ) దగ్గరకు వెళ్ళండి. (నా తరువాత) అల్లాహ్ ఈ భూలోక వాసుల కొరకు ప్రభవింపజేయబడిన తొలి ప్రవక్త ఆయనే" అని సలహా ఇస్తారు. అప్పుడు అందరూ కలిసి నూహ్(అ) సన్నిధిలో హాజరవుతారు. ఆయన గారు కూడా తాను ఈ పనికి తగినవాణ్ణి కాను అని చెబుతారు. తాను ఒక విషయం గురించి అల్లాహ్‌కు ప్రశ్నించిన దానిని తలచుకుని సిగ్గుతో కుంచించుకు

పోతారు. “మీరు అల్లాహ్ ప్రియ నేస్తం (అలైహిస్సలామ్) వద్దకు వెళ్ళండి” అని సూచిస్తారు.

అప్పుడు వారు మహనీయ ఇబ్రాహీమ్(అ) దగ్గరకు వెళ్ళి తమ గోడు వినిపించుకుంటారు. ఆయన కూడా ఈ పనికి తాను యోగ్యుణ్ణి కానని చెప్పేస్తారు. “మీరంతా మూసా (అలైహిస్సలామ్) దగ్గరకు వెళ్ళండి. అల్లాహ్ ఆయనతో ప్రత్యక్షంగా సంభాషించాడు. ఆయనకు తౌరాత్ గ్రంథాన్ని ఒసగాడు” అని సలహా ఇస్తారు. అప్పుడు వారంతా మూసా (అ) దగ్గరకు వస్తారు. కాని ఆయన కూడా తన ఇబ్బందిని గురించి చెప్పుకుంటారు, నాలో అంత ధైర్యం లేదని అంటారు. ఒకప్పుడు అకారణంగా ఒక వ్యక్తిని హత్య చేసిన సంగతి ఆయనకు జ్ఞప్తికి వస్తుంది. దాంతో ఆయన తన ప్రభువు సమక్షంలోకి వెళ్ళడానికి జంకుతారు. “మీరంతా ఈసా(అలైహిస్సలామ్) దగ్గరకు వెళ్ళండి. ఆయన దైవ దాసుడు, దైవసందేశహరుడు, ఆయన వాక్కు, ఆయన ఆత్మ” అని సూచిస్తారు. కాని ఈసా(అ) కూడా, తనలో అంతటి ధైర్యం లేదని చెబుతూ, “మీరంతా ముహమ్మద్(స) దగ్గరకు వెళ్ళండి. ఆయన(స) అల్లాహ్ వద్ద స్వీకృతి పొందిన దాసుడు. అల్లాహ్ ఆయన(స) వల్ల జరిగిన ముందటి వెనుకటి పొరపాట్లను క్షమించాడు” అని సలహా ఇస్తారు.

అప్పుడు విశ్వాసులందరూ నా దగ్గరకు వస్తారు. నేను వారందరితో కలసి ప్రభువు సన్నిధికి వెళ్ళి అనుమతి కోర్తాను. నాకు అనుమతి లభిస్తుంది. నేను నా ప్రభువును చూడగానే సాష్టాంగపడిపోతాను. అల్లాహ్ కోరినంత సమయం నేను సజ్దాలోనే ఉంటాను. “నీ తల ఎత్తు. ఏం కావాలో అడుగు. నీకు ప్రసాదించబడు తుంది. ఏం విన్నవించుకోదలిచావో విన్నవించుకో. నీ విన్నపాన్ని వినటం జరుగు తుంది. సిఫారసు చెయ్యి. నీ సిఫారసు ఆమోదించబడుతుంది” అని అనబడు తుంది. అప్పుడు నేను నా తల ఎత్తి, అల్లాహ్ నాకు నేర్పిన విధంగా ఆయన్ని స్తుతిస్తాను. ఆ తరువాత సిఫారసు చేస్తాను. కాని సిఫారసుకు ఒక పరిమితి నిర్ధారించబడుతుంది. దాని ప్రకారం (కొందరికి) నేను స్వర్గంలో ప్రవేశం కల్పించి తిరిగి వస్తాను. నా ప్రభువును మొదటిసారి మాదిరిగానే చూసి, సిఫారసు చేస్తాను. ఈసారి కూడా నా కొరకు ఒక హద్దు విధించబడుతుంది. వారిని నేను స్వర్గంలోకి పంపి తిరిగి వస్తాను. మూడవసారి కూడా అలాగే జరుగుతుంది. నాల్గవ సారి

ప్రభువు సన్నిధిలోకి వచ్చి,'ఎవరు నరకంలో శాశ్వతంగా ఉంటారని ఖుర్ఆన్ పేర్కొందో, వారు తప్ప మిగిలిన వారెవరూ నరకంలో లేరు' అని విన్నవించు కుంటాను. నరకంలో సదా శాశ్వతంగా బందీలై ఉండేవారంటే వీరే. వారి కొరకు **'ఖాలిదీన ఫీహా"** అని అనటం జరిగింది.[1]

## అధ్యాయం : 2

**'వ ఇజా ఖలవ్ ఇలా షయాతీనిహిమ్'** (2: 14) అనే ఆయత్పై ముజాహిద్ వ్యాఖ్యానిస్తూ, ఇక్కడ షయాతీన్ అంటే అర్థం కపటులు, బహుదైవారాధకులైన వారి స్నేహితులు, నాయకమన్యులు అన్నారు. **"ముహీతున్ బిల్ కాఫిరీన్"** అంటే అర్థం అల్లాహ్ సత్య తిరస్కారులను సమీకరిస్తాడు. **"అలల్ ఖాషియీన్"** అనే వాక్యం పక్కా విశ్వాసుల నేపథ్యంలో ఉంది. **'లాషియతఫీహా'** (2: 71) అంటే అందులో పూర్తిగా తెలుపు ఉండకూడదు.. **'యసూమూనకుమ్'** అంటే నిన్ను నిత్యం బాధించే వారని అర్థం. **'ఫద్దారతుమ్'** అంటే మీరు పరస్పరం గొడవ పడ్డారని అర్థం (ఇవన్నీ అల్ బఖరా సూరాలో వచ్చిన పదాలు). అలాగే **'రాయినా'** అనే పదం కూడా ఈ సూరాలో వస్తుంది.[1] అరబ్బులు ఎవరినయినా తెలివిలేని మూర్ఖుడు క్రింద జమ కట్టగోరినప్పుడు ఈ పదం వాడేవారు.

## అధ్యాయం : 3

# (ప్రజలారా!) ఇది మీకు తెలిసినప్పుడు ఇతరులను అల్లాహ్‌కు సమానులుగా నిలబెట్టకండి

**328)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) ఇలా అన్నారు : నేను ప్రవక్త మహనీయుల (సఅసమ్)ను, 'అల్లాహ్ దృష్టిలో అన్నింటికన్నా పెద్ద పాపం

---

327-1. విశ్వాసులు ఆదమ్(అలైహిస్సలామ్)తో 'అల్లాహ్ మీకు అన్ని వస్తువుల పేర్లు నేర్పాడు కదా!' అని అంటారు. ఇదే ఈ అధ్యాయంలోని ప్రధానాంశం. దీని ఆధారంగానే ఇమామ్ బుఖారీ (రహ్మ) ఈ హదీసును ఇక్కడ పొందుపరిచారు.

2-1. ఇమామ్ బుఖారీ(రహ్మ) అల్ బఖరా సూరాలోని కొన్ని పదాల వ్యాఖ్యానాన్ని ఇక్కడ పొందుపరిచి, దాని ఆధారంగా వాటి భావార్థాన్ని విశదీకరించారు.

ఇక ఇబ్నె అబ్బాస్(రజి) ఉల్లేఖనం ప్రకారం 'రాయినా' అనేది యూదుల భాషలో ఒక తిట్టు. హజ్రత్ సాద్ బిన్ ముఆజ్ అన్సారీ(రజి) అనే ప్రముఖ సహాబీ, యూదులు పదేపదే దైవప్రవక్త(స) గురించి 'రాయినా' అని అంటుండటం చూసి, 'ఇక మీదట దైవప్రవక్త(స) గురించి అలా అన్నవారి తల నరికేస్తానని హెచ్చరించారు.

**ఏది?' అని అడిగితే, "నిన్ను పుట్టించినవాడు అల్లాహ్‌యే అయినప్పటికీ నీవు అల్లాహ్‌కు సమానులుగా వేరొకరిని కల్పించటం" అని ఆయన(స) చెప్పారు. 'అవును, నిజంగా ఇది ఘోర అపరాధమే' అని నేను అన్నాను. 'ఆ తర్వాత అన్నింటికన్నా మహాపరాధం ఏది?' అని నేను ప్రశ్నించగా, "నీ సంతానం నీతో కలసి తినేస్తుందనే భయంతో సంతాన హత్యకు పాల్పడటం" అని ఆయన(స) సమాధానమిచ్చారు. 'ఆ తర్వాత?' అని నేను సందేహపడగా, "నీవు నీ పొరుగు వాని భార్యతో వ్యభిచరించటం"[1] అని ఆయన(స) చెప్పారు.**

---

328-1. అరబీ మూలంలో 'నిద్' అని ఉంది. నిద్ అంటే జత, సమానం అని అర్థం. 'అందాద్' బహువచనం. అల్లాహ్ తప్ప వేరొకరిని దైవంగా భావించటం ఒక్కటే దీని అర్థం కాదు. అరేబియాలోని చాలామంది ముష్రిక్కులు, ఇతర రాజ్యాలలోని ముష్రిక్ ప్రజలు కూడా 'దేవుడు ఒక్కడే' అని తలపోసేవారు. ఉదాహరణకు ఖుర్‌ఆన్‌లోని ఒక ఆయత్: "ఆకాశాలనూ, భూమినీ సృష్టించినదెవరు?" అని నీవు వారిని అడిగితే, "అల్లాహ్" అని వారు తకీమని చెబుతారు. (31: 25). అలా చెప్పినప్పటికీ అల్లాహ్ వారిని బహుదైవారాధకులుగా ఖరారు చేశాడు. ఎందుచేత? ఎందుచేతనంటే అల్లాహ్ గుణగణాలలో ఉదాహరణకు– అంతా వినేవాడు, అన్నీ ఎరిగినవాడు, అన్నింటినీ పరివేష్ఠించి ఉన్నవాడు– ఈ గుణగణాలను ఎవరయినా ఇతరులకు కూడా కల్పిస్తే, అతడు కూడా అల్లాహ్‌కు సమాన భాగస్వాములుగా చేర్చాడు. ఉదాహరణకు– ఫలానా పీర్ సాబ్ లేదా పైగంబర్ దూరాన ఉన్న వస్తువును కూడా చూడగలుగుతా రని, లేదా దాని గురించి తెలుసుకుంటారని, వారు తలచుకున్నది చేస్తారని అంటే వారు కూడా ముష్రిక్‌లు (బహుదైవారాధకులు) అయిపోతారు. అలాగే ఎవరయినా అల్లాహ్‌ను గాకుండా వేరితరులను పూజిస్తే, వారి పేరు మీద ఉపవాసం పాటిస్తే, వారి పేరున మొక్కుకుంటే, వారి పేరు మీద పశువును కోస్తే, వారి సమాధిపైన గిలాఫులు తొడిగిస్తే, పొద్దస్తమానం వారి పేరును జపిస్తూ ఉంటే– అలాంటివారు కూడా ముష్రిక్కులుగానే పరిగణించబడతారు.

ఇక తౌహీద్ (దేవుని ఏకత్వం, ఏకదైవారాధన) ఏదంటే; అల్లాహ్‌ను తప్ప వేరెవరినీ మొరపెట్టుకోరాదు. వేరితరులను పూజించరాదు. సర్వస్తోత్రములు అల్లాహ్‌కే చెందు నని నమ్మాలి. అందరూ అల్లాహ్ పైనే ఆధారపడి ఉన్నారని, లాభనష్టాలను చేకూర్చే శక్తి, అధికారం అల్లాహ్ చేతుల్లో మాత్రమే ఉందని విశ్వసించాలి. సంతాన భాగ్యం వొసగటం, వర్షం కురిపించటం, ఉపాధిని వికసింపజేయటం, ఒకరిని బ్రతికిం చడం, మరణమొసగటం– అంతా అల్లాహ్ అధీనమై ఉందని గట్టిగా నమ్మాలి.

తౌహీద్‌లోని రెండు రకాలు సదా స్మరించుకోదగినవి. ఒకటి; **'తౌహీదె రుబూబియత్'–**

## అధ్యాయం : 4
# దైవోపదేశం

**మేము మీపై మేఘాల ఛాయను కల్పించాము. మన్న్, సల్వాలను మీ కొరకు ఆహారంగా దించి, "మేము మీకు ప్రసాదించిన వాటిలో పరిశుభ్రమూ, పరిశుద్ధమూ అయిన వస్తువులను తినండి" అని చెప్పాము. (అయినప్పటికీ మీ పూర్వీకులు మా ఆజ్ఞలను ఉల్లంఘించారు) అయితే వారు మాకు ఏ మాత్రం అన్యాయం చేయలేదు. తమకు తామే అన్యాయం చేసుకున్నారు. (2: 57)**

**ఈ దివ్య వచనానికి వ్యాఖ్యానంగా ముజాహిద్ ఇలా అన్నారు: 'మన్న్' అనేది ఒకానొక వృక్షం నుండి వెలువడే జిగట పదార్థం. 'సల్వా' అనేవి పిట్టలు.[1]**

**329) మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ప్రవచించినట్లుగా సయీద్ బిన్ జైద్(రజి) ఉల్లేఖించారు : 'ఖుంబీ' కూడా 'మన్న్' కోవకు చెందిన ఒక పదార్థమే. దాని నీరు కంటి జబ్బును నయం చేస్తుంది.**

## అధ్యాయం : 5

**"గుర్తుకు తెచ్చుకోండి, మేము మీతో ఇలా అన్నాము; "(మీ ముందు ఉన్న) ఈ నగరంలో ప్రవేశించండి. అక్కడ పండే పంటలను మీ ఇష్టానుసారం తృప్తిగా తినండి. కాని వినమ్రులై తలవంచుతూ నగర ద్వారంలో ప్రవేశించాలి. 'హిత్తతున్,**

---

అంటే అల్లాహ్‌ను ప్రభువుగా, సృష్టికర్తగా, యజమానిగా నమ్మి నడుచుకుంటే, ఇది మాత్రమే సరిపోదు... రెండు; **'తౌహీదె ఉలూహియత్'**. అంటే అల్లాహ్‌ను ఏకైక ఆరాధ్య దైవంగా, పూజనీయుడుగా, లోకేశ్వరునిగా నమ్మాలి. సకల ఆరాధనలను ఆ నిజ ఆరాధ్య దైవం కొరకే ప్రత్యేకించుకోవాలి. **'కలిమయె తయ్యిబా'** (లా ఇలాహ ఇల్లల్లాహ్) సారాంశం ఇదే. దైవప్రవక్తలంతా ఈ తౌహీదె ఉలూహియత్' వైపునకే ప్రజలకు పిలుపు ఇచ్చారు.

4-1. అల్లాహ్ బనీ ఇస్రాయీల్‌కు ఎడారి ప్రాంతంలో తినడానికి ఈ రెండింటినీ ఆహారంగా ప్రసాదించాడు. ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అంటారు : 'మన్న్' అనేది వృక్షాలపై పేరుకు పోయేది. దానిని వారు కోరినంతగా తినేవారు. ఖతాదా ప్రకారం, 'మన్న్' మంచు మాదిరిగా కురిసేది. అది పాలకన్నా తెల్లగా, తేనె కన్నా తీయగా ఉండేది.

హిత్తతున్' అంటూ ముందుకు సాగిపోవాలి. అప్పుడు మేము మీరు చేసిన తప్పులను మన్నిస్తాము. సజ్జనులను అత్యధికంగా అనుగ్రహిస్తాము" *(2: 58)*

'రఘదన్' అంటే పుష్టుగా, చాలా ఎక్కువగా అన్న అర్థాలు వస్తాయి.

**330)** హజ్రత్ అబూ హురైరా(రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా ప్రవచించారు : "నగర ద్వారం గుండా వినమ్రులై (వంగి) 'హిత్తతున్' (అల్లాహ్! మా తప్పులను క్షమించు) అంటూ ప్రవేశించండి" అని ఇస్రాయీల్ సంతతి వారికి ఆదేశించబడినప్పుడు, వారు పిరుదుల ఆధారంగా ప్రాకుతూ వెళ్ళారు. 'హిత్తతున్' అని పలకడానికి బదులుగా 'హబ్బతున్ ఫీ షారతిన్' (అంటే గింజ వెన్నులోనే ఉండాలి) అంటూ సాగిపోయారు.[1]

## అధ్యాయం : 6

# ఎవరయితే జిబ్రీల్(అ) పట్ల శత్రుత్వం★ కలిగి ఉంటారో...

**331)** హజ్రత్ అనస్(రజి) కథనం: (యూదుల గొప్ప విద్వాంసుడైన) అబ్దుల్లాహ్ బిన్ సలామ్(రజి), ప్రవక్త మహనీయులు(సఅసమ్) మదీనాకు (హిజ్రత్ చేసి) వచ్చారని విన్నప్పుడు, ఆయన తన తోటలో పండ్లు కోస్తున్నారు. ఈ సమాచారం విన్న వెంటనే ఆయన దైవప్రవక్త(స) సమక్షంలో హాజరై, 'ఒక్క దైవప్రవక్తకు తప్ప మరెవరికీ తెలియని మూడు విషయాలను గురించి మిమ్మల్ని అడుగుతాను. సమాధానం చెప్పండి- 1) ప్రళయ సూచనలలో అన్నిటికన్నా మొదటి సూచన

---

330-1. ఒక్క మాటలో చెప్పాలంటే ఇస్రాయీల్ సంతతి వారు దైవాజ్ఞను వేళాకోళంగా తీసుకున్నారు. తత్ఫలితంగా వారు శిక్షకు గురి అయ్యారు. సుదీర్ఘకాలం పాటు అవమానితులై, కష్టాల పాలయ్యారు.

★ వంచనాశిల్ప నిష్ణాతులైన యూదులు దైవదూత జిబ్రీల్(అ)ను తమ శత్రువుగా తలపోసేవారు. ఎందుకంటే జిబ్రీల్(అ) తమపైన అనేకసార్లు శిక్షను అవతరింపజేశారని అనేవారు. ఆయన(అ) దైవదౌత్య పరంపరను బనీ ఇస్రాయీల్‌లో నుంచి తీసేసి అరబ్బులకు కట్టబెట్టారని కూడా నిందించేవారు. యూదుల రహస్యాలను ఇతరులకు జిబ్రీల్ తెలుపుతారనేది కూడా వారి నిందారోపణల్లో ఒకటి. ఇది వారి మూర్ఖత్వానికి పరాకాష్ఠ. జిబ్రీల్ (అ) నిజాయితీపరుడైన దైవదూత. ఆయన దైవాజ్ఞను ప్రవక్తలకు హెచ్చుతగ్గులు లేకుండా అందజేస్తారు. అలాంటి ఒక దైవదూత పట్ల వైరభారం కలిగి ఉండటమంటే వాస్తవానికి దైవంతో శత్రుత్వం కలిగి ఉండటమే.

ఏది? 2) స్వర్గవాసుల ఆతిథ్యం కొరకు అన్నింటికన్నా ముందు వడ్డించబడే భోజన పదార్థం ఏది? 3) (పుట్టబోయే) శిశువుకు ఎప్పుడు తండ్రి పోలికలు వస్తాయి? ఎప్పుడు తల్లి పోలికలు వస్తాయి?– సమాధానంగా దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "జిబ్రయీల్(అ) ఇప్పుడే వచ్చి నాకు ఈ విషయాలను గురించి చెప్పారు. 'ఏమిటి, జిబ్రీల్ వచ్చి చెప్పారా?' అని అడిగారు అబ్దుల్లాహ్. 'అవున'ని దైవప్రవక్త(స) అనగానే, 'అతను యూదులకు శత్రువు' అని అబ్దుల్లాహ్ అభిప్రాయపడ్డారు. అప్పుడు దైవప్రవక్త(స) ఈ ఆయత్‌ను పఠించారు: "మన్ కాన అదువ్వన్ లి జిబ్ రీల... (2:97) (జిబ్రీల్ పట్ల విరోధం ఉన్న ప్రతివాడూ ఈ యథార్థాన్ని గ్రహించాలి. అల్లాహ్ ఆజ్ఞతోనే ఆయన ఈ ఖుర్‌ఆన్‌ను నీ హృదయ ఫలకంపై అవతరింపజేశాడు. పూర్వం వచ్చిన అన్ని గ్రంథాలనూ అది ధ్రువీకరిస్తుంది...) తరువాత ఆ మూడు ప్రశ్నలకు సమాధానంగా ఆయన (స) ఇలా అన్నారు : 1) ప్రళయ సూచనలలో ఒకటి అగ్ని. అది మనుషులను తూర్పు నుండి పడమర వైపునకు సమీకరిస్తుంది. 2) స్వర్గవాసులకు అన్నిటికన్నా ముందు భోజనంగా వడ్డించబడే ఆహార పదార్థం చేప కార్జంలో (పెరిగివున్న) భాగం. 3) ఇక శిశువు పోలికల విషయానికి వస్తే, పురుషుని వీర్యబిందువు స్త్రీ వీర్య బిందువుపై ఆధిపత్యం వహించినప్పుడు శిశువుకు తండ్రి పోలికలు వస్తాయి. స్త్రీ వీర్య బిందువు పురుషుని రేతస్సుపై ఆధిక్యత వహించినప్పుడు శిశువుకు తల్లి పోలికలు వస్తాయి". ఈ సమాధానం విని అబ్దుల్లాహ్ బిన్ సలామ్(రజి),'అల్లాహ్ తప్ప వేరొక నిజ ఆరాధ్య దైవం లేదని, మీరు దైవ సందేశహరులని నేను సాక్ష్యమిస్తున్నాను' అన్నారు. (ఆ తరువాత ఆయన ఇలా విన్నవించుకున్నారు). 'దైవప్రవక్తా! యూదులు అపవాదులు మోపటంలో ఆరితేరిన జనులు. మీరు నా గురించి వారి అభిప్రాయం అడిగి తెలుసుకునే ముందు, నేను ఇస్లామ్ స్వీకరించానన్న సంగతి వారికి తెలిస్తే, నా మీద ఎన్నో నీలాపనిందలు మోపడానికి వెనుకాడరు'.

తరువాత యూదులు వచ్చినప్పుడు, 'మీ దృష్టిలో అబ్దుల్లాహ్ బిన్ సలామ్ ఎటువంటి వారు?" అని దైవప్రవక్త(స) అడిగారు. దానికి వారు, 'ఆయన మా అందరిలోకీ ఉత్తముడు. మాలో అందరికన్నా ఉత్తముడైనవాని కుమారుడు. ఆయన మా నాయకుడు. మా నాయకుని కుమారుడు' అని సమాధానం ఇచ్చారు. "ఒకవేళ ఆయన ఇస్లామ్ స్వీకరించే మాటైతే, అప్పుడు మీరేమంటారు?" అని దైవప్రవక్త(స) ప్రశ్నించగా, 'దేవుడు ఆయన్ని దాని బారి నుండి రక్షించుగాక!' అని వారు జవా

బిచ్చారు. అంతలోనే అబ్దుల్లాహ్ బిన్ సలామ్(రజి) అందరి సమక్షంలో హాజరై 'అల్లాహ్ తప్ప వేరొక నిజ ఆరాధ్య దైవం లేదని, ముహమ్మద్ దైవప్రవక్త అని నేను సాక్ష్యం పలుకుతున్నాను' అన్నారు. ఈ పలుకు వినగానే అక్కడున్న యూదులు, 'ఇతను మాలో అందరికన్నా అధముడు. అందరికన్నా అధముడైన వాని కుమారుడు' అంటూ ఆయన్ని కించపరచటం మొదలెట్టారు. అప్పుడు అబ్దుల్లాహ్ బిన్ సలామ్(రజి), 'దైవప్రవక్తా! వీళ్ళు ఇలా వ్యవహరిస్తారని నేను ముందు నుంచే భయపడుతూ ఉన్నాను'[1] అన్నారు.

అధ్యాయం : 7

## మేము కోరిన మా ఆయత్‌ను రద్దుపరుస్తాము లేదా మరిపింపజేస్తాము.

**332)** హజ్రత్ ఉమర్(రజి) చెప్పినట్లుగా ఇబ్నె అబ్బాస్(రజి) తెలియజేశారు: మాలో అందరికన్నా బాగా ఖుర్ఆన్‌ను పారాయణం చేసే వ్యక్తి (ఖారీ) ఉబై బిన్ కాబ్(రజి). మాలో అందరికన్నా బాగా న్యాయ నిర్ణయం గైకొనే ప్రతిభ అలీ (రజి)లో ఉంది. అయినప్పటికీ ఉబై బిన్ కాబ్(రజి) చెప్పే 'ఆ మాట'ను మేము అంగీకరించబోము. ఉబై(రజి) ఇలా అనేవారు: దైవప్రవక్త(స) పఠించగా నేను విన్న ఏ ఒక్క ఆయత్‌ను కూడా నేను వదలిపెట్టను'. మరి చూడబోతే అల్లాహ్ స్వయంగా ఇలా సెలవిచ్చాడు: "(ప్రవక్తా!) ఏదేని ఒక ఆయత్‌ను మేము రద్దు పరచినా లేక మరపింపజేసినా (దాని స్థానంలో) దానికన్నా ఉత్తమమైన దానిని లేదా కనీసం దానికి సమానమైన దానిని తీసుకువస్తాము"[1] *(2: 106)*

---

331-1. ఈ హదీసులో దైవదూత జిబ్రీల్(అలైహిస్సలామ్) ప్రస్తావన వచ్చింది. ఇదే ఈ అధ్యాయంలోని ముఖ్యాంశం. జిబ్రీల్(అ)ను తమ విరోధిగా భావించటం యూదుల మూర్ఖత్వానికి నిదర్శనం. నిజానికి దైవాజ్ఞలను యధావిధిగా పాలించటం దైవ దూతల కర్తవ్యం.

332-1. మహనీయ ఉమర్(రజి) పలుకుల్లోని ఆంతర్యం ఏమిటంటే, ఉబై బిన్ కాబ్(రజి) ఎంత గొప్ప 'ఖారీ' అయినప్పటికీ అల్లాహ్ రద్దుపరచిన ఆయత్‌లు కొన్నింటిని ఆయన పారాయణం చేస్తున్నారు. అది మాకు ఆమోదయోగ్యం కాదు. బహుశా సదరు ఆయత్‌లు రద్దు అయిన సంగతి ఆయనకు తెలీదేమో!
ఉమర్(రజి) గారి ఈ పలుకుల ద్వారా బోధపడేదేమంటే, ఒక వ్యక్తి ఎంత గొప్ప పండితుడైనా, అతను చెప్పిన ప్రతి మాట శిరోధార్యం కానవసరం లేదు. ఎందుకంటే

## అధ్యాయం : 8

# "అల్లాహ్ తన కొరకు సంతానం చేసుకున్నాడు" అనే వారి మాటకు అల్లాహ్ అతీతుడు, పరిశుద్ధుడు (2: 116)

**333)** హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహోదయులు(సఅసమ్) ఇలా ప్రవచించారు : అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "ఆదం పుత్రుడు నన్ను అబద్ధీకరించాడు. నిజానికి ఇది అతనికి ఎంతమాత్రం తగదు. అతను నన్ను దూషించాడు. వాస్తవానికి ఇది అతనికి ఏ విధంగానూ శోభించదు. అతను నన్ను అబద్ధీకరించడం అంటే అర్థం; అతను మరణించిన తరువాత మళ్ళీ నేను అతనిని బ్రతికించలేనని ఎద్దేవా చేయటం. ఇక అతను నన్ను దూషించటమంటే అర్థం; నాకు సంతానం కలదని అనటం. నేను నా కొరకు భార్యాపిల్లల్ని కలిగి ఉండటమనే దానికి నేను అతీతుణ్ని, పవిత్రుణ్ణి."[1]

## అధ్యాయం : 9

# అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"ఇబ్రాహీమ్ ఆరాధన కొరకు నిలబడిన ప్రదేశాన్ని శాశ్వతమైన నమాజు స్థలంగా చేసుకోవలసిందని మేము ప్రజలను ఆదేశించాము." *(2: 125)*

**334)** మహనీయ ఉమర్(రజి) చెప్పినట్లుగా అనస్ బిన్ మాలిక్(రజి) తెలియజేశారు : మూడు సందర్భాలలో అల్లాహ్ తరపున అవతరించిన ఆజ్ఞలతో నా అభిప్రాయాలు ముందుగానే సమన్వయం చెందాయి. లేదా నా ప్రభువు మూడు సందర్భాలలో నా అభిప్రాయానికి అనుగుణంగా ఆజ్ఞలను అవతరింపజేశాడు. 'దైవప్రవక్తా! మీరు ముఖామె ఇబ్రాహీమ్‌ను- తవాఫ్ అనంతరం- నమాజ్ స్థలంగా చేసుకుంటే బాగుండేది కదా!' అని నేను విన్నవించుకున్నాను. అప్పుడు అల్లాహ్ **వత్తఖిజూ మిమ్మఖామి ఇబ్రాహీమ ముసల్లా** అనే ఆయత్‌ను అవతరింపజేశాడు. (మరొక

---

మరుపు లేదా పొరపాటు అనేది మానవ సహజమైన దౌర్బల్యం. ఈ బలహీనతకు దైవం, దైవప్రవక్త మాత్రమే అతీతులు.

333-1. నజ్రాన్‌కు చెందిన క్రైస్తవులు మహనీయ ఈసా (ఏసుక్రీస్తు- అలైహిస్సలామ్)ను దేవ కుమారునిగా పేర్కొనేవారు. కాగా; మక్కాలోని బహు దైవారాధకులు దైవదూతలను అల్లాహ్ కుమార్తెలుగా ఖరారు చేశారు. వారి ఈ ఉవాచను ఖండిస్తూ అల్లాహ్ పై వాక్యాన్ని అవతరింపజేశాడు. (2: 116)

సందర్భంలో) నేను, 'దైవప్రవక్తా! మీ ఇంట్లోకి మంచివాళ్ళతోపాటు చెడ్డవారు– రకరకాల జనులు– కూడా వస్తుంటారు. కాబట్టి మీరు విశ్వాసుల మాతలకు (అంటే మీ సతీమణులకు) పరదా పాటించమని ఆజ్ఞాపిస్తే ఎంత బాగుంటుంది?!' అని విజ్ఞప్తి చేశాను. దానిపై అల్లాహ్ హిజాబ్‌కు సంబంధించిన ఆయత్‌ను అవతరింపజేశాడు. ఉమర్(రజి) ఇలా అన్నారు: దైవప్రవక్త(స) తన సతీమణులలో కొందరిపై కినుక వహించి ఉన్నట్లు తెలిసింది. అప్పుడు నేను వారి వద్దకు వెళ్ళి, 'మీరు మీ ఈ ధోరణిని విడనాడండి. లేకుంటే అల్లాహ్ మీకు బదు లుగా మీకన్నా మంచి భార్యలను తన ప్రవక్తకు సమకూరుస్తాడ'ని సలహా ఇచ్చాను. ఆ తరువాత ప్రవక్త సతీమణులలో ఒకామె దగ్గరకు వెళితే ఆమె, 'ఉమర్! దైవప్రవక్త కూడా తన భార్యలకు చేయనన్ని హితవులు మీరు చేస్తున్నారే!' అని నాకు చురక అంటించింది. ఎట్టకేలకు అల్లాహ్ ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు: "ఒకవేళ మీ అందరికీ ప్రవక్త విడాకులిస్తే, అల్లాహ్ మీకు బదులుగా ఆయనకు మీకంటే మంచి భార్యలను ప్రసాదిస్తాడు; వారు నిజమైన ముస్లిమ్‌లుగా, విశ్వాసం కలవారుగా, విధేయత చూపేవారుగా, పశ్చాత్తాపపడేవారుగా, ఆరాధన చేసే వారుగా, ఉపవాసం పాటించేవారుగా ఉంటారు. వారు భర్తృ విహీనులైనా లేదా కన్యలైనా కావచ్చు." *(అత్ తహ్రీమ్–5)*

## అధ్యాయం : 10

# ఇబ్రాహీమ్ (అ) ఇస్మాయీల్ (అ)లు కాబా గోడల్ని ఎత్తే సమయంలో...

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : ఇబ్రాహీము, ఇస్మాయీలు ఈ ఇంటి (కాబా) గోడలను ఎత్తేటప్పుడు ఈ విధంగా ప్రార్థించేవారు: "ఓ మా ప్రభూ! మా ఈ సేవను నీవు దయతో స్వీకరించు. నీవు అందరి మొరలు ఆలకించేవాడవు, అన్నీ తెలిసిన వాడవు." *(2: 127)*

అరబీ మూలంలో **'ఖవాయిద్'** అని ఉంది. ఖవాయిద్ అంటే పునాదులు అని అసలు అర్థం.

**335)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) తనతో ఈ విధంగా చెప్పారని ప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా(ర.అ) అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి)కు తెలియ జేశారు : దైవప్రవక్త(స) ఇలా అన్నారు– "(ఆయిషా!) నీ జాతివారు (ఖురైషులు)

కాబా గృహాన్ని నిర్మించినప్పుడు, ఇబ్రాహీమ్(అ) వేసిన పునాదులకన్నా దానిని తగ్గించారు." దానికి నేను, 'దైవప్రవక్తా! మరైతే మీరు ఇబ్రాహీమ్(అ) వేసిన పునాదుల ప్రకారం కాబా పునర్నిర్మాణం ఎందుకు చేయించరు?" అని విన్నవించు కోగా, "నీ జాతివారు ఇప్పుడిప్పుడే అవిశ్వాస (కుఫ్ర్) స్థితి నుంచి బయటపడ్డారు. లేకుంటే నేను అలాగే చేసి ఉండేవాణ్ణి" అని దైవప్రవక్త(స) చెప్పారు.

అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఇలా అన్నారు: 'అమ్మ ఆయిషా(ర.అ) ఈ హదీసును దైవప్రవక్త(స) నుండి విన్నారంటే బహుశా ఈ కారణంగానే దైవప్రవక్త (స) 'హతీమ్'కు దగ్గరలో ఉన్న ఆ రెండు మూలలను ముద్దాడేవారు కారని నేను భావిస్తున్నాను. ఎందుకంటే ఆ రెండు మూలలు ఇబ్రాహీమ్(అ) పునాదులు వేసిన చోట లేవు.'

## అధ్యాయం : 11

## "మేమంతా అల్లాహ్‌నూ, ఆయన మా వైపునకు పంపిన హితోపదేశాన్ని విశ్వసించాము" అని ప్రకటించండి. *(2: 136)*

**336)** అబూ సలమాతో అబూ హురైరా(రజి) ఇలా అన్నారు : గ్రంథవహులు (యూదులు) తౌరాత్ గ్రంథాన్ని ఇబ్రానీ భాషలో చదివేవారు. కాని ముస్లింలకు దానిని విడమరిచి చెప్పేటప్పుడు అరబీలో చెప్పేవారు. అందువల్ల దైవ ప్రవక్త(సఅసమ్) మాకు ఇలా సూచించారు : "మీరు గ్రంథవహులు (యూదులు) చెప్పే దానిని నిజమని ధ్రువీకరించటం గానీ, అబద్ధీకరించటం గానీ చేయకండి. పైగా మీరిలా అనండి - 'మేము అల్లాహ్‌ను, మా వైపునకు పంపబడిన హితోప దేశాన్ని విశ్వసించాము'[1]

## అధ్యాయం : 12

## దైవోపదేశం

మూర్ఖ జనులు ఇలా అంటారు : "పూర్వం ఏ ఖిబ్లా వైపునకు తిరిగి వారు నమాజు చేసేవారో, దాని నుండి ఇంత అకస్మాత్తుగా మరలటానికి కారణం?" ప్రవక్తా! వారితో ఇలా అను: "ప్రాక్పశ్చిమాలు అన్నీ అల్లాహ్‌వే. అల్లాహ్ తాను కోరిన వారికి రుజుమార్గం చూపుతాడు."[1] *(2: 142)*

---

336-1. అంటే ఖుర్ఆన్ దేవుని అంతిమ గ్రంథం. అది తనకు పూర్వం వచ్చిన గ్రంథా లన్నింటినీ ధ్రువపరుస్తుంది. దివ్య ఖుర్ఆన్ ప్రకారం ఉన్న గ్రంథవహుల మాటల్ని

**337) బరా బిన్ ఆజిబ్(రజి) కథనం : ప్రవక్త మహనీయులు (సఅసమ్) పదహారు లేక పదిహేడు నెలల వరకు (మదీనాలో) బైతుల్ మఖ్దిస్ వైపునకు అభిముఖమై నమాజ్ చేశారు. కాని తమ 'ఖిబ్లా' బైతుల్లాహ్(కాబా) అయి ఉండాలన్న ఆకాంక్ష ఆయనలో మెండుగా ఉండేది. ఎట్టకేలకు ఒకరోజు ఏమయిందంటే ఆయన(స) అస్ర్ నమాజులో ఉండగా ఖిబ్లా మార్పుకు సంబంధించిన దైవాజ్ఞ రాగానే కాబా గృహం వైపునకు తిరిగారు. ఆయన(స) వెనుక ఉన్న జనులు కూడా కాబా వైపునకు తిరిగారు. ఆ నమాజులో పాల్గొన్న ఒక వ్యక్తి మరో మస్జిద్ వైపు నుండి సాగిపోతూ బైతుల్ మఖ్దిస్ వైపు తిరిగి నమాజ్ చేస్తున్నవారినుద్దేశించి, 'దైవసాక్షిగా! నేనిప్పుడే దైవప్రవక్త(స) వెనుక కాబా వైపునకు తిరిగి నమాజ్ చేసి వస్తున్నాన'ని అన్నాడు. ఈ మాట వినగానే ఆ నమాజీలంతా నమాజు స్థితిలోనే మక్కా (కాబా) వైపునకు తిరిగారు. (అంటే వారు మరోసారి నమాజ్ చేయలేదు). తరువాత కొంతమందికి కలిగిన సందేహం ఏమంటే, ఖిబ్లా మార్పుకు పూర్వం ఎంతో మంది నమాజీలు చనిపోయారు కదా! మరి వారి నమాజ్ దైవసన్నిధిలో స్వీకారయోగ్యం అయిందా? లేదా? అప్పుడు దివ్యఖుర్‌ఆన్‌లోని ఈ ఆయత్ అవతరించింది. "అల్లాహ్ మీ విశ్వాసాన్ని వృధా కానివ్వడు. నిశ్చయంగా అల్లాహ్ (తన దాసులైన) మానవుల యెడల అమితమైన ప్రేమ కలవాడు, పరమ కృపాశీలుడు."[1] *(2: 143)***

## అధ్యాయం : 13

# మధ్యస్థ సమాజం

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**ఈ విధంగా మేము మిమ్మల్ని ఒక "మధ్యస్థ సమాజం"గా చేశాము. ఇకపై**

---

అంగీకరించవచ్చు. ఖుర్‌ఆన్‌కు విరుద్ధంగా ఉన్న విషయాలు త్రోసిపుచ్చదగినవి.

12-1. 'రుజుమార్గం' అనేది దేవుని ఏకత్వం (తౌహీద్), సదాచరణ (అమలె సాలెహ్) ఉత్తమ నీతీ నడవడికలతో కూడుకున్నది. దైవప్రవక్తలు, సిద్ధీఖులు, అమరగతులు, సత్పురుషులు ఈ మార్గంపైనే నడిచారు. కాబా గృహాన్ని తమ 'ఖిబ్లా'గా చేసుకోవటం కూడా రుజుమార్గమే అన్న భావం ఇందులో ఇమిడి ఉంది.

337-1. ఈ హదీసు ఇంతకుముందు కూడా 'కితాబుస్సలాత్'లో వచ్చింది. అంటే లోగడ మీరు బైతుల్ మఖ్దిస్ వైపునకు తిరిగి చేసిన నమాజులను అల్లాహ్ వృధా కానివ్వడు. వాటి పుణ్యఫలం మీకు తప్పక లభిస్తుంది.

మీరు సమస్త మానవ జాతికి సాక్షులుగా ఉండటానికి, ప్రవక్త మీకు సాక్షిగా ఉండటానికి. *(2: 142)*

**338)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఈ విధంగా ప్రవచించినట్లుగా అబూ సయీద్ ఖుద్రీ (రజి) ఉల్లేఖించారు: "ప్రళయదినాన నూహ్ (అలైహిస్స లామ్)ను పిలవటం జరుగుతుంది. 'హాజరయ్యాను ప్రభూ! చిత్తం సెలవీయండి' అని విన్నవించుకుంటారాయన. "నీవు నా సందేశాన్ని (నీ జాతి వారికి) చేర వేశావా?" అని సర్వోన్నత ప్రభువు అడుగుతాడు. 'చేరవేశాను మహాప్రభూ!' అని నూహ్ (అ) చెబుతారు. అప్పుడు ఆయన జాతివారినుద్దేశించి, "ఇతను నా సందేశాన్ని మీకు అందజేశాడా?" అని ప్రభువు ప్రశ్నిస్తాడు. దానికి సమాధానంగా వారు, 'మా దగ్గరకు భయబోధ చేసేవాడు (దైవప్రవక్త) ఎవరూ రాలేద'ని అంటారు. అప్పుడు అల్లాహ్ (నూహ్-అ-నుద్దేశించి) "నీవు చెప్పేది నిజమని సాక్ష్యమిచ్చేవారు ఎవరయినా ఉన్నారా?" అని అడుగుతాడు. దానికి ఆయన, 'ముహమ్మద్(స), ఆయన అనుచర సమాజం నా పక్షాన సాక్షులుగా ఉన్నార'ని అంటారు. దైవ సన్నిధిలో, మానవాళి సమక్షంలో సాక్ష్యం అంటే ఇదే- దానినే అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు: "ఈ విధంగా మేము మిమ్మల్ని ఒక 'మధ్యస్థ సమాజం'గా చేశాము. ఇకపై మీరు సమస్త మానవ జాతికి సాక్షులుగా ఉంటారు. ప్రవక్త మీపైన సాక్షిగా ఉంటాడు."

## అధ్యాయం : 14

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"ఎవరు ప్రవక్తను అనుసరిస్తారో, ఎవరు వెనుతిరిగి పోతారో పరీక్షించాలనే మేము పూర్వం మీరు మీ ముఖాన్ని ఏ దిక్కు వైపునకు తిప్పేవారో ఆ దిక్కునే మీ ఖిబ్లాగా నిర్ణయించాము. ఇది నిజంగా ఎంతో కఠినమైన విషయం! కాని అల్లాహ్ సన్మార్గ భాగ్యం కలుగజేసిన వారికి ఇది ఏమాత్రం కష్టతరం కాలేదు. ఈ మీ విశ్వాసాన్ని అల్లాహ్ ఏమాత్రం వృధా కానివ్వడు. మానవుల పట్ల అల్లాహ్‌కు ఎంతో కరుణ, వాత్సల్యం ఉన్నాయనే విషయాన్ని నిశ్చయంగా నమ్మండి." *(2: 143)*

**339)** మహనీయ ఇబ్నె ఉమర్(రజి) కథనం: ప్రజలు మస్జిదె ఖుబాలో ప్రాతఃకాలపు నమాజ్ చేస్తుండగా ఒక వ్యక్తి వచ్చి, 'అల్లాహ్ తన సందేశహరుని (సఅసమ్)పై ఖుర్‌ఆన్‌ను అవతరింపజేస్తూ నమాజులో కాబా వైపునకు

**అభిముఖులు అవండి అని ఆదేశించాడు. కాబట్టి మీరు కూడా కాబా వైపునకు తిరగండి' అని ప్రకటించాడు. అందువల్ల నమాజీలంతా అప్పటికప్పుడే కాబా వైపునకు తిరిగారు.**

## అధ్యాయం : 15

# దైవోపదేశం

**"ప్రవక్తా! నీవు మాటిమాటికీ నీ ముఖాన్ని ఆకాశం వైపునకు ఎత్తటం మేము గమనిస్తూనే ఉన్నాము. ఇదిగో, నీకు అత్యంత ప్రీతికరమైన ఖిబ్లా వైపునకే ఇప్పుడు మేము నిన్ను త్రిప్పుతున్నాము. కాబట్టి నీవు ముఖాన్ని 'మస్జిదె హరామ్' వైపునకు త్రిప్పు. ఇకపై మీరెక్కడున్నా సరే, ముఖాన్ని ఆ వైపునకు పెట్టి నమాజు చెయ్యండి. (ఖిబ్లా మార్పునకు సంబంధించిన) ఈ ఆదేశాన్ని వారి ప్రభువే ఇచ్చాడనీ, అది సత్యం అనీ గ్రంథ ప్రజలకు బాగా తెలుసు. కాని ఇది తెలిసిన తరువాత కూడా, వారు ఏమి చేస్తున్నారో, దానిని అల్లాహ్ గమనించకుండా ఉండటంలేదు". (2: 144)**

**340) మహనీయ అనస్(రజి) ఇలా అన్నారు : నేనొక్కణ్ణి తప్ప రెండు ఖిబ్లాల వైపునకు తిరిగి నమాజ్ చేసిన సహచరమాన్యులలో ఏ ఒక్కరూ (ప్రస్తుతం) జీవించి లేరు.[1]**

## అధ్యాయం : 16

# నీవు వారికి ఏ నిదర్శనం చూపినా...

దైవోపదేశం:

**"గ్రంథ ప్రజలకు నీవు ఏ నిదర్శనం చూపినా, వారు నీ ఖిబ్లాను అనుసరించటం సంభవించదు. వారి ఖిబ్లాను అనుసరించటం నీకూ సాధ్యపడదు. వారిలోని ఏ వర్గం వారు కూడా మరొకరి ఖిబ్లాను అనుసరించటానికి తయారుగా లేరు. నీవు ఈ జ్ఞానం పొందిన తరువాత కూడా, ఒకవేళ నీవు వారి కోరికలను అనుసరిస్తే, నిశ్చయంగా దుర్మార్గులలో చేరిపోతావు."** ***(2: 145)***

---

340-1. దీనినిబట్టి అవగతమయ్యేదేమంటే ప్రవక్త ప్రియ సహచరులలో అందరికన్నా ఆఖరిలో హ్రజత్ అనస్ బిన్ మాలిక్(రజి) మరణించారు. ఇబ్నె అబ్దుల్ బర్ ఇలా అన్నారు: మహనీయ అనస్ (రజి) తరువాత ఏ ఒక్క సహాబీ కూడా ఈ ప్రపంచంలో జీవించి లేరు.

**341)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు : జనులు 'మస్జిదె ఖుబా'లో ఫజ్ర్ నమాజ్ ఆచరిస్తూ ఉండగా ఒక వ్యక్తి (అబ్బాద్ బిన్ బిషర్-రజి) అక్కడకు వచ్చి, 'రాత్రి దైవప్రవక్త(స)పై ఖుర్ఆన్ అవతరించింది. అందులో కాబా వైపునకు తిరిగి నమాజ్ చేయవలసినదిగా ఆజ్ఞాపించటం జరిగింది' అని చెప్పారు. ఆ సమయంలో జనులు సిరియా (బైతుల్ మఖ్దిస్) వైపు అభిముఖమై ఉన్నారు. వారు అప్పటికప్పుడే (నమాజులోనే) కాబా వైపునకు తిరిగారు.

## అధ్యాయం : 17
## గ్రంథం వొసగబడిన వారు[1]

దైవోపదేశం :

"మేము ఎవరికి గ్రంథం ప్రసాదించామో, వారు తమ సంతానాన్ని ఏ విధంగా గుర్తిస్తారో అదేవిధంగా (ఖిబ్లాగా నిర్ణయింపబడిన) ఈ స్థలాన్ని గుర్తిస్తారు. కాని వారిలోని ఒక వర్గం బుద్ధిపూర్వకంగా సత్యాన్ని కప్పిపుచ్చుతోంది. నిస్సందేహంగా ఇది మీ ప్రభువు నుండి వచ్చిన సత్యం. కనుక దీని విషయంలో మీరు ఏమాత్రం సంశయంలో పడకండి" *(2: 146, 147)*

**342)** (వేరొక సనదు ద్వారా అందిన ఇదే హదీసు...) అబ్దుల్లాహ్ బిన్ దీనార్‌తో మహనీయ ఇబ్నె ఉమర్(రజి) ఇలా అన్నారు : జనులు మస్జిదె ఖుబాలో ఫజ్ర్ నమాజ్ చేస్తూ ఉండగా (మదీనా నుండి) ఒక వ్యక్తి (అబ్బాద్ బిన్ బిషర్-రజి) వచ్చి, "ఈ రోజు రాత్రి దైవప్రవక్త(సఅసమ్)పై దివ్య ఖుర్ఆన్ అవతరించింది. అందులో; కాబా గృహం వైపునకు తిరిగి నమాజ్ చేయవలసినదిగా ఆయన(స)కు ఆజ్ఞ అయింది. కాబట్టి మీరు కూడా పవిత్ర కాబా గృహం (మక్కా) వైపునకు తిరిగి నమాజ్ ఆచరించండి" అని చెప్పారు. ఆ సమయంలో వారు సిరియా వైపు తిరిగి నమాజ్ చేస్తున్నారు. ఈ మాట వినగానే వారంతా- నమాజు స్థితిలోనే- కాబా వైపునకు అభిముఖులయ్యారు.

---

17-1. గ్రంథవహులు అయిన ప్రజలకు (యూదులు, క్రైస్తవులకు) అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) రాకడ గురించి బాగా తెలుసు. వారి గ్రంథాలలో ఆ విషయం చాలా స్పష్టంగా చెప్పబడింది. కాని తమలోని ఓర్వలేనితనం, అసూయ కారణంగా వారు సన్మార్గ భాగ్యానికి నోచుకోలేకపోయారు.

## అధ్యాయం : 18

# సత్కార్యాల వైపునకు శీఘ్రత కనబరచాలి

“ప్రతి ఒక్కడికి ఒక దిక్కు ఉన్నది. దాని వైపునకు అతడు తిరుగుతాడు. కనుక మీరు మంచి పనులలో మిన్నగా ఉండటానికి ప్రయత్నించండి. మీరంతా ఎక్కడున్నాసరే అల్లాహ్ మిమ్మల్ని కనుగొంటాడు. ఆయన శక్తికి అతీతమైనది ఏదీ లేదు.” *(2: 148)*

**343)** హజ్రత్ బరా బిన్ ఆజిబ్(రజి) చెప్పగా తాను విన్నానని అబూ ఇస్‌హాఖ్ తెలిపారు: ఆయన (బరా) ఇలా చెప్పారు– “మేము దైవప్రవక్త (సఅసమ్)తో కలసి పదహారు లేక పదిహేడు నెలల వరకూ ‘బైతుల్ మఖ్దిస్’ వైపునకు తిరిగి నమాజ్ చేశాము. తరువాత అల్లాహ్ మాకు ‘కాబా గృహం’ వైపునకు అభిముఖం అవవలసినదిగా ఆజ్ఞాపించాడు.”

“మీరు ఏ ప్రాంతంలో ప్రయాణం చేసినా, మీ ముఖాన్ని (నమాజు సమయంలో) ‘మస్జిదె హరామ్’ వైపునకు త్రిప్పండి. ఎందుకంటే ఇది మీ ప్రభువు చేసిన న్యాయమైన నిర్ణయం. మీ కర్మలను అల్లాహ్ గమనించకుండా ఉండటం లేదు”. *(2 : 149)*

అరబీ మూలంలో **‘షత్‌రహ్’** అనే పదం వచ్చింది. దీనికి ‘ఆ వైపునకు’ అని అర్థం.

**344)** మహనీయ ఇబ్నె ఉమర్(రజి) చెప్పినట్లుగా అబ్దుల్లాహ్ బిన్ దీనార్ వివరించారు : ప్రజలు ‘ఖుబా’లో ప్రాతఃకాలపు నమాజ్ చేస్తూ ఉండగా ఒకాయన వచ్చి ఇలా అన్నారు: “రాత్రి ఖుర్‌ఆన్ అవతరించింది. అందులో కాబా గృహం వైపునకు అభిముఖం అవవలసినదిగా ఆజ్ఞాపించటం జరిగింది. కాబట్టి మీరంతా కూడా కాబా వైపునకు మీ ముఖాలను త్రిప్పుకోండి. మీరు ఏ స్థితిలో ఉంటే ఆ స్థితిలోనే దాని వైపునకు తిరగాలి”. ఇది వినగానే ప్రవక్త సహచరమాన్యులంతా (రజిఅల్లాహు అన్‌హుమ్) కాబా వైపునకు అభిముఖం అయ్యారు. ఆ సమయంలో వారు సిరియా (బైతుల్ మఖ్దిస్) వైపు అభిముఖమై ఉన్నారు.

## అధ్యాయం : 19

# మీరు ఎక్కడి నుండి బయలుదేరినా...

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: “మీరు ఏ ప్రదేశంలో ప్రయాణం చేసినా.

మీ ముఖాన్ని 'మస్‌జిదె హరామ్' వైపునకే త్రిప్పండి. మీరు ఎక్కడున్నాసరే, దాని వైపునకే తిరిగి నమాజు చెయ్యండి. దీనివల్ల మీకు వ్యతిరేకంగా వాదించటానికి ప్రజలకు అవకాశం లభించదు. కాని వారిలో దుర్మార్గులైన వారి నోరు ఎట్టి పరిస్థితులలోనూ ఊరుకోదు. అందుకని వారికి భయపడకండి. నాకు భయపడండి. ఇంకా నేను మీపై నా అనుగ్రహాన్ని పూర్తి చేస్తాను. మీరు నా ఆజ్ఞాపాలన ద్వారా సాఫల్య మార్గం పొందే అవకాశం ఉంది." *(అల్ బఖరా : 150)*

**345)** మహనీయ ఇబ్నె ఉమర్(రజి) తనతో చెప్పినట్లుగా అబ్దుల్లాహ్ బిన్ దీనార్ వివరించారు: 'మస్జిదె ఖుబా'లో ప్రజలు ఫజ్ర్ నమాజ్‌లో నిమగ్నమై ఉన్న సమయంలోనే అక్కడకు వచ్చిన ఒక వ్యక్తి, "రాత్రి ప్రవక్త మహోదయులు (సఅసమ్)పై ఖుర్‌ఆన్ అవతరించింది. కాబా గృహం వైపునకు తిరగవలసినదిగా అందులో ఆయన(స)కు ఆదేశించబడింది. కనుక మీరు కూడా ఆ దిశ వైపునకు మీ ముఖాలను త్రిప్పుకోండి" అని ప్రకటించారు. ఆ సమయంలో సిరియా (బైతుల్ మఖ్దిస్) వైపునకు తిరిగి నమాజ్ చేస్తున్న వారంతా- అప్పటికప్పుడే నమాజ్ స్థితిలోనే కాబా వైపునకు తిరిగారు.

## అధ్యాయం : 20

# షఆయిరిల్లాహ్ (అల్లాహ్ చిహ్నాలు)

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: సఫా మర్వాలు నిశ్చయంగా అల్లాహ్ చిహ్నాలు. కనుక కాబా గృహానికి హజ్ కొరకు లేక 'ఉమ్రహ్' కొరకు పోయేవారు ఈ రెండు కొండల మధ్య 'సయీ' చేస్తే, అది దోషం ఎంతమాత్రం కాదు. స్వచ్ఛందంగా, హృదయపూర్వకంగా ఎవరైనా ఏదైనా సత్కార్యం చేస్తే అది అల్లాహ్‌కు తెలుస్తుంది. ఆయన దానిని ఆదరిస్తాడు." *(అల్ బఖరా : 158)*

**'షఆయిర్'** అంటే చిహ్నాలు, గుర్తులు, ఆనవాళ్ళు అన్న అర్థాలొస్తాయి. అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) ప్రకారం, ఎలాంటి పచ్చిక లేక వృక్షాలు మొలవని రాయిని 'సఫ్వాన్' అంటారు.[1]

**346)** హిషామ్ బిన్ ఉర్వాతో ఆయన తండ్రి (ఉర్వా బిన్ జుబైర్) ఇలా అన్నారు: నేను దైవప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా(ర.అ)ను, (అప్పట్లో నేను

---

20-1. ఇబ్నె అసీర్(రహ్మ) ప్రకారం, ఇక్కడ **'షఆయిర్'** అంటే హజ్జ్ సందర్భంగా చేసే క్రియలు అని అర్థం.

పిన్న వయస్కుణ్ణి) అల్లాహ్ ఖుర్‌ఆన్‌లో 'సఫా మర్వాలు నిశ్చయంగా అల్లాహ్ యొక్క చిహ్నాలు. కనుక కాబా గృహానికి హజ్జ్ కొరకు, ఉమ్రా కొరకు పోయేవారు, ఈ రెండు కొండల మధ్య 'సయీ' చేస్తే, అది దోషం ఎంతమాత్రం కాదు' అని సెలవిచ్చాడు కదా! నా ఉద్దేశంలో ఆ రెండు కొండల మధ్యన సయీ చేయకపోయినా అందులో ఎలాంటి తప్పు లేదన్నమాటే కదా! అని అడిగాను. దానికి ఆయిషా (ర.అ), "(అబ్బాయి!) నువ్వు అనుకుంటున్నది ఎంత మాత్రం సరైంది కాదు. ఒకవేళ నీ అభిప్రాయమే సరైనదైతే ఆ రెండింటి మధ్య 'సయీ' చేయకపోయినా తప్పులేదు అని అనబడేది. అసలు విషయం ఏమిటంటే, ఈ ఆయత్ అన్సార్ల ధర్మ సందేహాన్ని నివృత్తి చేస్తూ అవతరింపజేయబడింది. (ఇస్లామ్‌కు పూర్వం) అన్సార్లు 'మనాత్' విగ్రహం పేరుతో ఇహ్రామ్ కట్టుకునేవారు. ఆ విగ్రహం 'ఖదీర్'[1] అనే స్థలంలో ప్రతిష్ఠించబడి ఉండేది. అన్సార్లు సఫా- మర్వాల మధ్య సయీ చేయడాన్ని అశుభంగా తలపోసేవారు. ఇస్లామ్ ఆవిర్భవించిన తరువాత వారు 'సయీ' గురించి దైవప్రవక్త(స) సమక్షంలో సందేహం వ్యక్తపరచగా, దానిపై ఈ ఆయత్ అవతరించింది- "సఫా మర్వాలు నిశ్చయంగా అల్లాహ్ యొక్క చిహ్నాలు. కనుక కాబా గృహానికి హజ్జ్ కొరకు ఉమ్రా కొరకు పోయేవారు, ఈ రెండు కొండల మధ్య 'సయీ' చేస్తే అది దోషం ఎంతమాత్రం కాదు."

**347)** ఆసిమ్ బిన్ సులైమాన్ ఇలా అన్నారు: సఫా-మర్వాల గురించి నేను మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి)ను ప్రశ్నించగా, ఆయన ఇలా సమాధానమిచ్చారు. మేము సఫా- మర్వాల మధ్య సయీ చేయడాన్ని అజ్ఞాన పోకడగా భావించేవాళ్ళం. అందుకే ఇస్లామ్ వచ్చినప్పుడు మేము దాని నుండి ఆగిపోయాం. అప్పుడు అల్లాహ్ ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు: **"ఇన్నస్సఫా వల్ మర్వత మిన్ షఆయిరిల్లాహ్- ఫమన్ హజ్జల్ బైత అవీ' తమర ఫలా జునాహ అలైహి అఁయ్యత్తవ్వఫ బిహిమా."**

## అధ్యాయం : 21

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

కొందరు అల్లాహ్‌ను కాదని ఇతరులను ఆయనకు సమానులుగా,

346-1. 'ఖదీర్' అనేది మక్కా నగరానికి వెళ్ళే దారిలో ఉన్న ప్రదేశం. 'మనాత్' విగ్రహం అక్కడే ప్రతిష్ఠించబడి ఉండేది.

ప్రత్యర్థులుగా భావిస్తారు. వారు అల్లాహ్ పట్ల కలిగి ఉండవలసిన ప్రేమతో వారిని ప్రేమిస్తారు. ***(2: 165)***

**అరబీ మూలంలో 'అందాదన్' అని ఉంది. ఇది 'నిద్'కు బహువచనం. అంటే సరిసమానులుగా, సహవర్తులుగా అని అర్థం.**

**348)** హ(జత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) ఇలా అన్నారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఒక వచనం పలికారు. నేను నా తరఫున ఒక మాట అంటున్నాను. ప్రవక్త(స) ఏమన్నారంటే, "ఎవరయితే అల్లాహ్‌కు ఎదురుగా వేరితరులను భాగస్వాములుగా కల్పిస్తూ మరణిస్తాడో (షిర్క్ చేస్తాడో) అతను నరకాగ్నికి ఆహుతి అవుతాడు. నేను చెప్పిందేమంటే; "అల్లాహ్‌కు సహవర్తులుగా (సమానులుగా) కల్పించకుండా ఉన్న స్థితిలో ఎవడు మరణిస్తాడో అతను (ఏదో ఒకనాడు) స్వర్గంలో ప్రవేశిస్తాడు."

### అధ్యాయం : 22

## ప్రతీకార న్యాయం (ఖిసాస్) సమాజానికి ఊపిరి

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"విశ్వసించిన ప్రజలారా! హత్యా వ్యవహారాలలో మీ కొరకు ప్రతీకార న్యాయం నిర్ణయించబడింది. హత్య చేసిన వ్యక్తి స్వతంత్రుడయితే, ఆ స్వతంత్రుణ్ణే శిక్షించాలి. బానిస అయితే ఆ బానిసనే వధించాలి. స్త్రీ అయితే ఆ స్త్రీనే చంపాలి. ఒకవేళ హతుని సోదరుడు హంతకుణ్ణి కనికరించదలిస్తే, న్యాయసమ్మతంగా రక్త శుల్క నిర్ణయం జరగాలి. హంతకుడు రక్తధనాన్ని ఉత్తమరీతిలో అతనికి చెల్లించాలి. ఇది మీ ప్రభువు నుండి మీకు లభించే సౌకర్యం, కారుణ్యం. దీని తరువాత కూడా ఈ హద్దులను అతిక్రమించేవారు ఘోర శిక్షకు గురి అవుతారు." ***(2: 178)***

**349)** మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అనేవారు : బనీ ఇస్రాయీల్‌లో (అంటే యూదులలో) ప్రతీకారం తీర్చుకునే రివాజు ఉండేది. కాని రక్తశుల్కం (దియత్) వెసులుబాటు ఉండేది కాదు. అందుచేత అల్లాహ్ ఈ ఉమ్మత్ పట్ల పారదర్శకంగా వ్యవహరిస్తూ ఇలా సెలవిచ్చాడు: 'ముస్లిములారా! హత్యా వ్యవహారాలలో మీ కొరకు ప్రతీకార న్యాయం (ఖిసాస్) నిర్ణయించబడింది. హత్య చేసిన వ్యక్తి స్వతంత్రుడైతే, ఆ స్వతంత్రుణ్ణే శిక్షించాలి. బానిస అయితే ఆ బానిసనే వధించాలి. స్త్రీ అయితే ఆ స్త్రీనే చంపాలి. ఒకవేళ హతుని సోదరుని తరఫున క్షమాభిక్ష

లభించినట్లయితే, అప్పుడు న్యాయసమ్మతంగా రక్తశుల్క (దియత్) నిర్ణయం జరగాలి. (అంటే రక్తశుల్కం అడిగేవారు మితిమీరి వ్యవహరించకూడదు). అలాగే హంతకుడు కూడా ప్రఖ్యాత పద్ధతిననుసరించి రక్తశుల్కం (దియత్) చెల్లించాలి. ఈ రక్తశుల్క ఆజ్ఞ మీ ప్రభువు తరఫు నుండి మీకు లభించే వెసులుబాటు, కనికరం. పూర్వీకులపై కేవలం ప్రతీకార న్యాయం (ఖిసాస్) ఆజ్ఞ ఉండేది. కాగా; రక్త శుల్కం (దియత్) మీ కొరకు ధర్మసమ్మతం గావించబడింది. ఇక దీని తర్వాత కూడా ఎవరయినా హద్దుమీరి ప్రవర్తిస్తే- అంటే రక్తశుల్కం పుచ్చుకున్న మీదట కూడా హంతకుణ్ణి హతమారిస్తే అలాంటి వారికి వ్యధాభరితమయిన శిక్ష విధించబడు తుంది.

**350)** అనస్ బిన్ మాలిక్(రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఇలా ప్రవచించారు : "దైవగ్రంథమైతే ప్రతీకార న్యాయం (ఖిసాస్) గురించి ఆజ్ఞాపిస్తోంది."[1]

**351)** హజ్రత్ అనస్(రజి) తెలిపారు: నా మేనత్త రబీ ఒక అమ్మాయి పల్లు ఊడగొట్టింది. తరువాత క్షమించమని జనులు ఆ అమ్మాయిని అభ్యర్థించారు. కాని ఆ అమ్మాయికి చెందిన తెగవారు క్షమించడానికి సిద్ధంగా లేరు. వారు దైవప్రవక్త (సఅసమ్) సన్నిధిలో హాజరయ్యారు. ప్రతీకారం తీర్చుకోవటం తప్ప మరో సర్దుబాటుకు వారు అంగీకరించలేదు. అందువల్ల ఆయన(స) ప్రతీకారం (ఖిసాస్) తీర్చుకునేందుకు ఆజ్ఞాపించారు. దానిపై అనస్ బిన్ నజర్(రజి) ఇలా విన్నవించు కున్నారు: 'దైవప్రవక్తా! ఏమిటి, రబీ పల్లు ఊడగొట్టబడతాయా?! లేదు. మీకు సత్యం ఇచ్చి పంపినవాని సాక్షిగా చెబుతున్నాను. ఆమె పల్లు ఊడగొట్ట బడవు'. ఇది విని దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: "అనస్! దైవ గ్రంథంలో మాత్రం ప్రతీకార న్యాయం (ఖిసాస్) గురించే ఆజ్ఞాపించబడింది".

అయితే ఎట్టకేలకు ఆ అమ్మాయి తరఫు వారు మెత్తబడ్డారు. ఆమెకు (రబీకి) క్షమాభిక్ష పెట్టారు. ఈ అంగీకారంపై దైవప్రవక్త(స) ఇలా వ్యాఖ్యానించారు : "కొంతమంది దైవదాసులున్నారు. వారెలాంటి వారంటే, వారు అల్లాహ్ పేరు మీద ప్రమాణం చేస్తే అల్లాహ్ వారి ప్రమాణాన్ని సార్థకం చేస్తాడు."[1]

---

350-1. అంటే హతుని వారసులు గనక రక్తశుల్కం (దియత్) పుచ్చుకుని రాజీపడేందుకు సిద్ధంగా లేని పక్షంలో హంతకునిపై ప్రతీకారం తీర్చుకోవటం న్యాయమే.

## అధ్యాయం : 23

# ఉపవాసాలు విధిగా నిర్ణయించబడటం

"విశ్వసించిన ప్రజలారా! ఉపవాసం మీకు విధిగా నిర్ణయించబడింది. ఏ విధంగా మీకు పూర్వం ప్రవక్తలను అనుసరించేవారికి కూడా విధించబడిందో. దీనివల్ల మీలో భయభక్తులు జనించే అవకాశం ఉంది". **(2: 183)**

**352)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు: పూర్వం అజ్ఞాన స్థితిలో మేము 'ఆషూరా దినాన' ఉపవాసం పాటించేవారం. అయితే రమజాన్ నెల ఉపవాసాలు విధితం అయ్యాక దైవప్రవక్త(సఅసమ్) ఇలా ప్రవచించారు: "ఇక నుండి కోరిన వారు ఆషూరా ఉపవాసం ఉండవచ్చు. కోరిన వారు ఉండక పోవచ్చు."

**353)** హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు : రమజాన్ ఉపవాసాల ఆజ్ఞ రాకమునుపు ఆషూరా ఉపవాసం పాటించడం జరిగేది. తరువాత రమజాన్ నెల ఉపవాసాల గురించి ఆజ్ఞ అవతరించిన మీదట దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: "ఇక మీదట ఇష్టమున్నవారు ఆషూరా రోజా ఉండవచ్చు. ఇష్టంలేనివారు ఆ ఉపవాసాన్ని మానుకోవచ్చు."

**354)** అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) తెలిపారు: అష్అత్ బిన్ ఖైస్ ఆయన వద్దకు వచ్చారు. ఆ సమయంలో ఆయన భోజనం చేస్తున్నారు. 'ఈ రోజు ఆషూరా దినం కదా!' అని అష్అత్ సందేహపడగా ఇబ్నె మస్ఊద్(రజి) ఇలా సమాధాన మిచ్చారు : "రమజాన్ నెల ఉపవాసాలు విధితం కాకపూర్వం ఈ రోజు ఆషూరా ఉపవాసం పాటించబడేది. కాని రమజాన్ నెల ఉపవాసాలు విధిగా పాటించాలన్న ఆజ్ఞ అవతరించిన తరువాత ఈనాటి ఉపవాసం విడిచిపెట్ట బడింది. రండి, మీరు కూడా మాతోపాటే భోజనం చేయండి."

**355)** విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా వివరించారు : ఆషూరా దినాన ఖురైషులు– అజ్ఞాన కాలంలో– ఉపవాసం ఉండేవారు. దైవ

351–1. ఉదాహరణకు, అనస్ బిన్ నజర్(రజి) చేసిన ప్రమాణం– ఎట్టి పరిస్థితిలోనూ రబీ పల్లు ఊడగొట్టబడవు అని ఆయన(స) దేవునిపై ఒట్టేసి మరీ చెప్పారు. అటు ఎదుటి పక్షం వారు రాజీపడే పరిస్థితి కనిపించలేదు. కాని జరిగిందేమిటి? దైవకృప వల్ల ఆ అమ్మాయి తరఫు వారసుల మనసు మెత్తబడింది. వారు ప్రతీకారం తీర్చుకోలేదు సరికదా 'క్షమించాము' అని చెప్పారు.

ప్రవక్త(స) కూడా ఆ రోజు ఉపవాసం ఉండేవారు. ఆయన(స) మదీనాకు వచ్చిన తరువాత కూడా ఆ రోజు ఉపవాసం పాటించారు. ఆషూరా ఉపవాసం పాటించమని తన సహచరులకు ఆదేశించారు కూడా. కాని రమజాన్ నెల ఉపవాసాలు విధించబడినట్లుగా ఆజ్ఞ అవతరించిన మీదట రమజాన్ ఉపవాసాలు 'ఫర్జ్' (విధి)గా ఖరారు చేయబడ్డాయి. కాగా; ఆషూరా ఉపవాసం 'ఫర్జ్'గా మిగులలేదు. కాబట్టి కోరినవారు ఈ ఉపవాసాన్ని ఉండవచ్చు. కోరినవారు వదలవచ్చు.[1]

అధ్యాయం : 24

## ఈ ఉపవాసాలు లెక్కించదగిన కొన్ని రోజులు మాత్రమే

దైవోపదేశం-

ఈ ఉపవాసం కొన్ని దినాల వరకే. కాని మీలో ఎవరైనా వ్యాధిగ్రస్తులయితే లేక ప్రయాణంలో ఉంటే, వేరే దినాలలో ఆ ఉపవాస దినాలను పూర్తి చెయ్యాలి. ఉపవాసం ఉండే శక్తి కలవారు (ఒకవేళ దానిని పాటించకపోతే) పరిహారం చెల్లించాలి. ఒక ఉపవాస దినానికి పరిహారం ఒక పేదవానికి భోజనం పెట్టడం. కాని ఎవరైనా సహృదయంతో ఇంకా ఎక్కువ పుణ్యం చేస్తే, అది వారికే మేలు. అయితే మీరు విషయాన్ని గ్రహించగలిగితే, ఉపవాసం ఉండటమే మీకు ఉత్తమం.

***(2: 184)***

అతా బిన్ అబీ రబాహ్ ఇలా అంటారు : అల్లాహ్ సెలవిచ్చినట్లుగా అన్ని రకాల వ్యాధిగ్రస్త స్థితిలో ఉపవాసం ఉండకపోవటం సముచితమే.

హసన్ బస్రీ, ఇబ్రాహీమ్ నఖ్యీ ఏమంటారంటే; శిశువుకు పాలిచ్చే తల్లి లేదా గర్భవతి అయిన మహిళ తనకు లేదా తన శిశువు ప్రాణానికి నష్టం వాటిల్లుతుందన్న భయం ఉంటే ఉపవాస విరమణ చేయవచ్చు. వృద్ధుడైన వ్యక్తి బలహీనత కారణంగా ఉపవాసం ఉండలేకపోతే, అతడు ఫిదియా (పరిహారం) ఇవ్వాలి. హజ్రత్ అనస్ బిన్ మాలిక్(రజి) కూడా వృద్ధాప్యం వచ్చినప్పుడు ఒకట్రొండు సంవత్సరాలు- రమజాన్ మాసంలో- ప్రతి రోజూ ఒక నిరుపేదకు రొట్టె, మాంసం కూర ఇచ్చేవారు. ఉపవాసం ఉండేవారు కారు.[1]

---

355-1. ఆషూరా ఉపవాసం 'విధి' కాకపోయినప్పటికీ దాని ప్రాముఖ్యత, మహత్తు మాత్రం మిగిలి ఉంది.

24-1. వార్ధక్యంతో నీరసించిపోయినప్పుడు అనస్ బిన్ మాలిక్(రజి) ఇలా చేశారు. ఆయన నూట పది సంవత్సరాల ఆయుష్షు పొందినట్లుగా ఉల్లేఖనాల ద్వారా తెలుస్తోంది.

**356)** మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) ఈ విధంగా పారాయణం చేసే వారు: **"వ అలల్లజీన యుతవ్విఖూనహూ ఫిద్యతున్. తఆము మిస్కీన్."** ఈ ఆయత్ రద్దు కాలేదంటారాయన.[1] **'యుతవ్విఖూనహు'** అంటే పండు ముదుసలి అయిన పురుషుడు, పండు ముసలి అయిన స్త్రీ అని అర్థం. అంటే ఉపవాసం ఉండలేనంత బలహీనత ఉన్న వృద్ధులు ఒక రోజాకు బదులుగా ఒక నిరుపేదకు అన్నం తినిపించాలి.

## అధ్యాయం : 25

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"కనుక ఇక నుండి రమజాన్ నెలను పొందే వ్యక్తి ఆ నెల అంతా విధిగా ఉపవాసం ఉండాలి." (2: 185)

**357)** మహనీయ ఇబ్నె ఉమర్(రజి) ఆ ఆయత్‌ను **"ఫిద్యతు తఆము మిస్కీన్"** అని పఠించి, ఇది రద్దు అయింది అన్నారు.[1]

**358)** సలమా బిన్ అక్వా (రజి) వివరించారు: **"వ అలల్లజీన యుతీఖూనహు ఫిద్యతున్ తఆము మిస్కీన్"** (ఉపవాసం ఉండే శక్తి కలవారు– ఒకవేళ దానిని పాటించకపోతే– పరిహారం చెల్లించాలి. ఒక ఉపవాస దినానికి పరిహారం ఒక పేదవానికి భోజనం పెట్టడం) అనే ఆయత్ అవతరించినప్పుడు, ఉపవాసం ఉండగోరని ప్రతి వ్యక్తి, దానికి బదులుగా పరిహారం (ఫిదియా) ఇచ్చి ఊరుకునే వాడు. పిదప దాని తరువాతి ఆయత్ – **ఫమన్ షహిద మిన్‌కుము ష్షహ్‌ర ఫల్ యసుమ్‌హు** (కనుక ఇక నుండి రమజాన్ నెలను పొందే వ్యక్తి ఆ నెల అంతా విధిగా ఉపవాసం ఉండాలి) అనే ఆయత్ అవతరించింది.

## అధ్యాయం : 26

# ఉపవాస కాలంలోని రాత్రి సమయాలలో మీరు మీ భార్యల వద్దకు పోవటం....

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"ఉపవాస కాలంలో రాత్రి సమయాలలో మీరు మీ భార్యల వద్దకు పోవడం

---

356–1. ఇది ఇబ్నె అబ్బాస్(రజి) అభిప్రాయం. కాని ఈ ఆయత్ రద్దయిందని అత్యధిక మంది విద్వాంసులు అంటారు.

357–1. ఇదే పరిగణించదగినది.

**మీ కొరకు ధర్మసమ్మతం చెయ్యబడింది. వారు మీకు దుస్తులు, మీరు వారికి దుస్తులు, మీరు రహస్యంగా ఆత్మద్రోహానికి పాల్పడుతున్నారనే విషయం అల్లాహ్‌కు తెలిసిపోయింది. అయినప్పటికీ ఆయన మీ అపరాధాన్ని క్షమించాడు, మిమ్మల్ని మన్నించాడు. ఇక నుండి మీరు మీ భార్యలతో సంభోగం చేయవచ్చు. అల్లాహ్ మీ కొరకు ధర్మసమ్మతం చేసిన సుఖానుభవాన్ని పొందండి." (2: 187)**

**359) హజ్రత్ బరా బిన్ ఆజిబ్(రజి) తెలిపారు : రమజాన్ నెల ఉపవాసాలను విధిగా నిర్ణయిస్తూ ఆజ్ఞ అవతరించినప్పుడు, ముస్లింలు రమజాన్ మాసమంతా తమ భార్యల వద్దకు పోయేవారు కారు. కాని కొంతమంది ఆత్మద్రోహానికి పాల్పడేవారు. అప్పుడు అల్లాహ్ ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు : "మీరు రహస్యంగా ఆత్మద్రోహానికి (ఖియానత్‌కు) పాల్పడుతున్నారనే విషయం అల్లాహ్‌కు తెలిసిపోయింది. అయినప్పటికీ ఆయన మీ అపరాధాన్ని మన్నించాడు."[1]**

## అధ్యాయం : 27

# అన్నపానీయాలను, కోర్కెలను త్యజించవలసిన సమయం

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**"రాత్రి నలుపురేఖల నుండి ఉషోదయపు ధవళ రేఖలు ప్రస్ఫుటమయ్యే వరకు, మీరు తినండి, త్రాగండి. ఆ తరువాత వీటన్నింటినీ త్యజించి చీకటిపడే వరకు మీ ఉపవాసం పూర్తి చెయ్యండి. కాని మసీదులలో 'ఏతెకాఫ్' పాటించేటప్పుడు మీరు మీ భార్యలతో సంభోగించకండి. ఇవి అల్లాహ్ ఏర్పరచిన హద్దులు. వీటి దరిదాపులకు కూడా పోకండి. ఈ విధంగా అల్లాహ్ తన ఆజ్ఞలను ప్రజలకు స్పష్టం చేస్తాడు. తప్పుడు మార్గాల నుండి వారు తమను తాము రక్షించుకుంటారని ఆశించబడుతోంది" *(2 : 187)***

**360) అదీ బిన్ హాతిమ్(రజి) ఇలా అన్నారు: నేను ఒక తెలుపు దారం, ఒక నలుపు దారం తీసుకుని నిద్రించే సమయంలో నా తలగడ క్రింద ఉంచుకున్నాను. రాత్రి కొంతభాగం గడిచాక వాటిని చూస్తే తేడా ఏమాత్రం కనిపించలేదు. తెల్లవారాక 'దైవప్రవక్తా! నేను నా తలగడ క్రింద తెలుపు దారాన్ని, నలుపు దారాన్ని ఉంచుకుని పడుకున్నాను. కాని వాటివల్ల నేను వ్యత్యాసం ఏమీ కనుగొన**

359-1. అంటే ఇక నుండి మీరు రమజాన్ నెలలోని రాత్రివేళల్లో మీ భార్యలతో సమాగమం జరపవచ్చు. అయితే సహ్రీ సమయం కాగానే మీరు ఆత్మనిగ్రహం పాటించాలి.

**లేకపోయాన'ని విన్నవించుకోగా దైవప్రవక్త(స) నన్ను ఆట పట్టిస్తూ, "అలాగైతే నీ తలగడ చాలా పొడవైనదై ఉంటుంది. అందువల్లనే ఉషోదయపు తెలుపు రేఖ, నలుపు రేఖ దాని క్రింద దాక్కుని ఉంటాయి" [1] అన్నారు.**

**361) అదీ బిన్ హాతిమ్(రజి) కథనం: 'దైవప్రవక్తా! ఆయత్(2: 187)లోని రాత్రి నలుపు రేఖల నుండి ఉషోదయపు ధవళ రేఖలు ప్రస్ఫుటమయ్యే వరకు... మాటలోని మర్మం ఏమిటి? రెండు (నలుపు, తెలుపు) దారాలని దీని అర్థమా?' అని నేను సందేహపడినప్పుడు, "అలాగైతే నీ బుర్ర బహు విశాలమైనది. రాత్రి నీవు ఆ దారాలను చూసి వుంటే అలాగే అనుకోవాల్సి ఉంటుంది" అని దైవప్రవక్త (స) ఛలోక్తి విసిరారు.**

**362) సహ్ల్ బిన్ సాద్(రజి) వివరించారు: "కులూ వష్రబూ హత్తా యతబయ్యన లకుముల్ ఖైయ్‌తుల్ బయ్‌జు మినల్ ఖైయ్‌తిల్ అస్వద్" (రాత్రి నలుపు రేఖల నుండి ధవళ రేఖలు ప్రస్ఫుటం అయ్యేవరకు మీరు తినండి, త్రాగండి) అనే ఆయత్ అవతరించినప్పుడు- అప్పటికి 'మినల్ ఫజ్ర్' అనే వాక్యం ఇంకా అవతరించలేదు- ఉపవాసం సంకల్పం చేసుకున్న చాలామంది తమ రెండు కాళ్ళలో తెలుపు, నలుపు దారాలను కట్టుకునేవారు. ఆ రెండు దారాలు వారి కంటికి స్పష్టంగా కనిపించనంతవరకూ వారు తింటూ త్రాగుతూ ఉండేవారు. తరువాత అల్లాహ్ 'మినల్ ఫజ్ర్' (ఉషోదయపు) అనే వాక్యాన్ని అవతరింపజేశాడు- అప్పుడు వారికి బోధపడింది, నలుపు దారం అంటే రాత్రి అనీ, తెలుపు దారం అంటే పగలు అనీను.**

## అధ్యాయం : 28

# దైవాగ్రహానికి దూరంగా ఉండటమే అసలు సత్కార్యం

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**"మీరు మీ ఇళ్ళల్లోకి వాటి వెనుక భాగం నుండి ప్రవేశించటం సత్కార్యం ఎంతమాత్రం కాదు. దైవాగ్రహానికి దూరంగా ఉండటమే అసలు నిజమైన సత్కార్యం.**

---

360-1. విషయాన్ని అర్థం చేసుకోవటంలో అదీ బిన్ హాతిమ్(రజి) పొరబడ్డారు. రాత్రిపూట ఆవరించి ఉండే నలుపురేఖలను, ఉషోదయాన ప్రస్ఫుటమయ్యే ధవళరేఖలను ఆయన నలుపు, తెలుపు దారాలతో పోల్చుకోవటం సరైనది కాదు. ఉషోదయాన భూమండలంపై ధవళ రేఖ ఆవరించి, నలువైపులా విస్తరిస్తుంది. అది సహ్రీ సమయానికి ఆనవాలు.

కనుక మీరు వాకిళ్ళ నుండే ఇళ్ళల్లోకి ప్రవేశించండి. అయితే అల్లాహ్‌కు భయ పడుతూ ఉండండి. బహుశా మీకు వాస్తవమైన సాఫల్య భాగ్యం కలుగవచ్చు."
***(2 : 189)***

**363)** బరా బిన్ ఆజిబ్(రజి) వివరించారు: పూర్వం అజ్ఞాన స్థితిలో ప్రజలు ఇహ్రామ్ కట్టుకుని ఉన్నప్పుడు, తమ ఇండ్లల్లోకి వాటి వెనుక భాగం నుండి– ఇంటి కప్పుపైకెక్కి– ప్రవేశించేవారు. దానిపై అల్లాహ్ ఈ ఆయత్‌ను అవతరింప జేశాడు: "మీరు మీ ఇళ్ళల్లోకి వాటి వెనుక భాగం నుండి ప్రవేశించటం సత్కార్యం ఎంతమాత్రం కాదు..." ***(2 : 189)***

## అధ్యాయం : 29

# పీడన (ఫిత్నా) అంతమయ్యే వరకు

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"పీడన (ఫిత్నా) అంతమయ్యే వరకు, దైవధర్మం స్థాపించబడేవరకు మీరు వారితో యుద్ధం చేస్తూనే ఉండండి. తరువాత వారు దానిని మానుకుంటే, దౌర్జన్య పరులను తప్ప మరెవ్వరినీ శిక్షించకూడదు." ***(2: 193)***

**364)** ఇబ్నె జుబైర్ (రజి) పరీక్షా ఘడియల్లో ఉన్న కాలంలో (హజ్జాజ్ ఆయనపై దాడి చేసి, మక్కా నగరాన్ని ముట్టడించాడు) ఇద్దరు వ్యక్తులు (అలా బిన్ అరార్, హిబ్బాన్ సులమీ) మహనీయ ఇబ్నె ఉమర్(రజి) వద్దకు వచ్చి, "ప్రజలు పరస్పరం కొట్టుకు చస్తున్నారు. మీరు హజ్రత్ ఉమర్(రజి) కుమారులు, ప్రవక్త ప్రియ సహచరులై ఉండి కూడా ఎందుకు మౌనం వహిస్తున్నారు? ఈ ఉపద్రవాన్ని ఎందుకు సమసిపోయేలా చేయరు?" అని అడిగారు. దానికి ఇబ్నె ఉమర్(రజి) సమాధానమిస్తూ, "నా మౌనానికి కారణం అడుగుతున్నారా? అయితే వినండి! సాటి ముస్లిం ఎవరయినా సరే, అతని రక్తాన్ని అల్లాహ్ నా కొరకు నిషేధించాడు" అని చెప్పారు. "ఏమిటి, ఫిత్నా (పీడన) అంతమయ్యే వరకూ వారితో పోరాడండి అని అల్లాహ్ ఆదేశించలేదా?" అని వారు తిరిగి ప్రశ్నించగా, ఇబ్నె ఉమర్(రజి) ఇలా అన్నారు: "(మనం ఖుర్‌ఆన్ ఆదేశానుసారం) యుద్ధం చేశాము. ఫిత్నా సమసిపోయే వరకూ, అంటే అవిశ్వాసం (కుఫ్ర్), బహుదైవారాధన (షిర్క్) తుద ముట్టించబడే వరకూ పోరాడాము. కడకు దీన్ (దైవధర్మం) కేవలం అల్లాహ్‌కు

చెందిన స్వచ్ఛమైన ధర్మంగా నెలకొన్నది. కాని ఇప్పుడు మీరు కోరేదేమిటి? ఫిత్నా (పీడన) మరోసారి పెల్లుబుకాలని, ఇస్లామ్ బలహీనపడిపోవాలని, అవిశ్వాసులకు గెలుపు చేకూరాలని, దైవానికి ఎదురుగా ఇతరుల ఆజ్ఞ చెల్లాలని మీరు కోరుకుంటున్నారా?"

నాఫె కథనం: ఒక వ్యక్తి (హకీమ్) మహనీయ ఇబ్నె ఉమర్(రజి) సన్నిధికి వచ్చి ఇలా అడిగారు: "ఓ అబూ అబ్దుర్రహ్మాన్! మీకేమైపోయింది? (మీరెందుకిలా నిర్లిప్తంగా ఉండిపోయారు?) మీరు ఒక సంవత్సరం హజ్జ్ చేస్తారు? ఒక సంవత్సరం ఉమ్రా చేస్తారు. కాని దైవమార్గంలో జరిగే సమరంలో పాల్గొనరేమి? దైవ మార్గంలో సాగించవలసిన సమరం గురించి అల్లాహ్ ఎంత గట్టిగా తాకీదు చేశాడో మీకు తెలియనిది కాదు."

సమాధానంగా ఇబ్నె ఉమర్(రజి) ఇలా అన్నారు: "అబ్బాయ్! ఇస్లామ్ పునాది అయిదు ప్రధానాంశాలపై ఉంది- 1) అల్లాహ్‌ను, ఆయన సందేశహరుణ్ణి విశ్వసించటం 2) అయిదుపూటల నమాజ్ చేయటం 3) రమజాన్ నెల ఉపవాసాలు పాటించడం 4) జకాత్ ఇవ్వటం 5) హజ్జ్ చెయ్యటం."

దానికి ఆ వ్యక్తి, "ఓ అబూ అబ్దుర్రహ్మాన్! దైవగ్రంథంలో అల్లాహ్ ఏమని సెలవిచ్చాడో మీకు తెలీదా? 'ముస్లింలలోని రెండు వర్గాలు పరస్పరం సంఘర్షణ పడితే వారి మధ్య సంధి చేయించండి' అని అనబడలేదా? 'వారు దైవాదేశం వైపునకు మరలి వచ్చేదాకా, పీడన సమసిపోయే దాకా వారితో యుద్ధం చేయండి' అని ఆజ్ఞాపించలేదా?" అని గుర్తు చేయగా, ఇబ్నె ఉమర్ (రజి) ఇలా అన్నారు: "దైవప్రవక్త(స) కాలంలో మనం ఈ విధిని నెరవేర్చాము. ఆ కాలంలో ముస్లింలు బహు తక్కువ సంఖ్యలో ఉండేవారు. అవిశ్వాసులు భారీ సంఖ్యలో ఉండేవారు. వారు ముస్లింల ధర్మావలంబనను అడ్డుకునేవారు. కొన్ని చోట్ల ముస్లింలను చంపేసేవారు. కొన్ని చోట్ల వారిని పీడించేవారు. కడకు ముస్లింల జనసంఖ్య పెరిగింది. పీడన (ఫిత్నా) కూడా క్రమేణా అంతరించింది."

అప్పటికీ ఆ వ్యక్తి (ఊరుకోలేదు) ఇలా అడిగాడు: "అది సరేగాని, ఉస్మాన్ (రజి), అలీ (రజి) గురించి మీ అభిప్రాయం ఏమిటి?"

**సమాధానంగా ఇబ్నె ఉమర్(రజి) ఇలా అన్నారు: "చూడు! ఉస్మాన్ (రజి) వల్ల జరిగిన తప్పిదాన్ని అల్లాహ్ క్షమించాడు. కాని నీవు ఆ క్షమాపణను మంచి దిగా తలపోయటం లేదు. ఇక అలీ (రజి) అంటావా, ఆయన దైవప్రవక్త(స) పెత్తండ్రి కుమారుడు, ఆయన(స) అల్లుడు కూడా. చూడు! ఆయన ఇల్లు దైవ ప్రవక్త(స) ఇంటికి ఆనుకుని ఉండేది"[1] అని చేత్తో సైగ చేసి మరీ చూపించారు.**

## అధ్యాయం : 30

# మేలు చేసేవారిని అల్లాహ్ ఇష్టపడతాడు

దైవోపదేశం :

**"అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టండి. చేతులారా మిమ్మల్ని మీరు వినాశం పాలు చేసుకోకండి. మేలు చెయ్యండి. మేలు చేసేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు."**

**(2: 195)**

**365) హుజైఫా (రజి) వివరించారు: "వ అన్‌ఫిఖూ ఫీ సబీలిల్లాహి వలా తుల్‌ఖూ బి అయ్‌దీకుమ్ ఇలత్తహ్‌లుకతి" (దైవమార్గంలో ఖర్చుపెడుతూ ఉండండి. మిమ్మల్ని మీరు చేజేతులా నాశనం చేసుకోకండి) అనే ఆయత్ (ప్రజల్లో) 'ఇన్‌ఫాఖ్'ని ప్రేరేపించడానికి అవతరించింది.**[1]

---

364–1. దారి తప్పిన ఖారిజీలు సతతం హజ్రత్ ఉస్మాన్(రజి)ను తూలనాడుతూ ఉండేవారు. ఆయన (ఉస్మాన్–రజి) ఉహుద్ యుద్ధ సందర్భంగా పలాయన వాదాన్ని అనుస రించారన్నది వారి వాదన. హజ్రత్ అలీ(రజి)ని కూడా వారు విమర్శించేవారు. ఎందుకయ్యా అంటే అలీ(రజి) ముస్లింలపై యుద్ధం చేశారని నిందించేవారు.
ఆ వ్యక్తి ఆక్షేపణను హజ్రత్ ఇబ్నె ఉమర్(రజి) ఉత్తమ రీతిలో తిప్పికొట్టారు.

365–1. అంటే పిసినారితనం చూపి మీ పరలోక జీవితాన్ని పాడు చేసుకోకండి అని అర్థం. ఇమామ్ ముస్లిం తదితరులు అబూ అయ్యూబ్ అన్సారీ(రజి) నుండి ఉటంకించబడిన దాని ప్రకారం ఒక ముస్లిం రోము అవిశ్వాసుల పంక్తుల్లోకి చొచ్చుకుపోయాడు. ఇతను తనను తాను వినాశానికి గురి చేసుకున్నాడని జనులు చెప్పుకున్నారు. అప్పుడు అబూ అయ్యూబ్(రజి), **"వలా తఖ్‌తులూ బిఅయ్‌దీకుమ్..."** (2 : 198) ఆయత్ అర్థం ఇది కాదని, ఈ ఆయత్ అన్సారులమైన మా నేపథ్యంలో అవతరించిందనీ, ముస్లింల సంఖ్య బాగా పెరిగినప్పుడు, మేము ఇండ్లల్లోనే ఉండి మా ఆస్తిపాస్తులను పెంచుకుంటామని చెప్పినప్పుడు అల్లాహ్ ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు. 'వినాశంపాలు చేసుకోకండి' అంటే అర్థం ఇక్కడ ఇంటి పట్టునే ఉండిపోవటం, దైవమార్గంలో సమరం చేయకుండా ఉండటం అని చెప్పారు.

## అధ్యాయం : 31

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

(హజ్జ్ సందర్భంగా) మీలో ఎవరయినా వ్యాధిగ్రస్తులై లేదా తల బాధకు లోనై (ఖుర్బానీ తన స్థానానికి చేరకముందే) శిరోముండనం చేయించుకుంటే దానికి పరిహారంగా ఉపవాసం ఉండాలి లేక దానధర్మాలు చేయాలి లేక ఖుర్బానీ ఇవ్వాలి... *(2: 196)*

**366)** అబ్దుల్లాహ్ బిన్ మాఖిల్ కథనం: నేను కాబ్ బిన్ ఉజ్రా (రజి) సన్నిధికి, ఆ మస్జిద్‌కు వెళ్ళాను. అంటే కూఫాలోని మస్జిద్‌కు వెళ్ళి పరిహారం (ఫిదియా)గా ఉపవాసం ఉండటం గురించి ఆయన్ని అడిగాను. సమాధానంగా ఆయన ఇలా అన్నారు: నేను ఇహ్రామ్ కట్టుకుని ఉన్న స్థితిలో జనులు నన్ను దైవ ప్రవక్త(స) సన్నిధికి తీసుకెళ్ళారు. ఆ సమయంలో నా తలలోని పేలు నా ముఖంపై పడుతూ ఉన్నాయి. అది గమనించి, "నీ పరిస్థితి ఇంత దయనీయంగా తయారవు తుందని నేను ఊహించలేదు. నీవు ఒక మేకను సమర్పించుకోగలవా?" అని దైవ ప్రవక్త(స) అడిగారు. దానికి నేను 'లేదు' అని విన్నవించుకున్నాను. "అలాగైతే మూడు రోజులు ఉపవాసం ఉండు. లేదా ఆరుగురు నిరుపేదలకు అన్నం పెట్టు. ప్రతి నిరుపేదకు 'అర్థ సా' చొప్పున భోజనం తినిపించి శిరోముండనం చేయిం చుకో" అని ఉపదేశించారు మహనీయ ముహమ్మద్(స). కాబ్ బిన్ ఉజ్రా (రజి) ఇంకా ఇలా అన్నారు: 'ఈ ఆయత్ ప్రత్యేకంగా నా గురించి అవతరించింది. అయితే దీని ఆజ్ఞ మీ అందరికీ వర్తిస్తుంది.'

## అధ్యాయం : 32

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"హజ్జ్ కాలం వచ్చేవరకు మీలో ఎవరయినా 'ఉమ్రహ్' చేసినట్లయితే... (2 : 196)

**367)** ఇమ్రాన్ బిన్ హుసైన్(రజి) ఇలా వివరించారు: హజ్జ్‌లో 'తమత్తు' ఆజ్ఞ ఖుర్ఆన్‌లో అవతరించింది. మేము దైవప్రవక్త(స)తో కలసి 'తమత్తు' వెసులు బాటును సద్వినియోగం చేసుకుంటూ హజ్జ్ చేశాము. ఆ తరువాత ఖుర్ఆన్ ఈ వెసులుబాటు నుండి నిరోధించలేదు. కడకు దైవప్రవక్త(స) కూడా తన మరణ కాలం వరకూ దీని నుండి ఆపలేదు. (కనుక హజ్జె తమత్తు ఇప్పటికీ ధర్మసమ్మ

**తమే). కాకపోతే 'ఒకానొక వ్యక్తి' తన స్వంత అభిప్రాయంతో, తాను కోరినది చెప్పుకుంటున్నాడు.[1]**

**అధ్యాయం : 33**

## హజ్జ్ సందర్భంగా దైవానుగ్రహాన్ని అన్వేషిస్తే...

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**"హజ్జ్ యాత్రతోపాటు మీరు అల్లాహ్ అనుగ్రహం అన్వేషిస్తే అందులో దోషం లేదు." (2: 198)**

**368) మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) వివరించారు : అజ్ఞాన కాలంలో ఉకాజ్, మజన్నా, జుల్ మజాజ్ సంతలు (మక్కాలో) ఉండేవి. అందువల్ల (ఇస్లాం తరువాత) హజ్జ్ సీజన్‌లో ప్రవక్త సహచరమాన్యులు వ్యాపారం నిమిత్తం అక్కడకు వెళ్లడాన్ని చెడు విషయంగా తలపోశారు. అప్పుడు ఈ ఆయత్ అవతరించింది. "మీరు హజ్జ్ సీజన్‌లో మీ ప్రభువు అనుగ్రహాన్ని అన్వేషిస్తే అందులో తప్పేమీ లేదు". అంటే హజ్జ్ కాలంలో మీరు వ్యాపార నిమిత్తం ఆ మండీలకు (సంతలకు లేక మార్కెట్లకు) వెళ్ళవచ్చు.**

**అధ్యాయం : 34**

## అరఫాత్‌లో ఆగటమే అసలు హజ్జ్

**"తరువాత ప్రజలంతా ఏ స్థలం నుండి వెనుకకు మరలుతారో, అదే స్థలం నుండి మీరూ మరలండి." (2: 199)**

**369) ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ ఆయిషా సిద్దీఖా (ర.అ) తెలిపారు: ఖురైషులు, వారి అడుగుజాడలలో నడుచుకునే అరబ్బులు (హజ్జ్ కాలంలో) 'ముజ్‌దలిఫా' లోనే విడిది చేసేవారు. దానికి వారు 'హమస్' అని నామకరణం చేశారు. మిగిలిన అరబ్బులు మాత్రం 'అరఫాత్' మైదానంలోనే ఆగేవారు. ఇస్లామ్**

367-1. 'ఒకానొక వ్యక్తి' అంటే హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి). ఆయన అభిప్రాయం 'హజ్జె తమత్తు'కు వ్యతిరేకంగా ఉండేది. హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసైన్(రజి) ఉమర్(రజి) ఆలోచనను ఆయన స్వంత అభిప్రాయంగా ఖరారు చేశారు. అంటే ఖుర్‌ఆన్ హదీసులకు ఎదురుగా దానిని స్వీకరించలేదు. ముఖల్లిదీన్‌లు ఈ సంఘటన నుండి పాఠం నేర్చుకోవాలి. సన్మార్గగాములైన ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) గారి అభిప్రాయాన్ని సైతం ఖుర్‌ఆన్ హదీసులకు ఎదురుగా పరిగణనలోకి తీసుకోలేదు. అలాంటప్పుడు ముజ్తహిదీన్ (షరీఅత్ అన్వయకర్తలు) ఏపాటి?

**వచ్చిన తరువాత అల్లాహ్ తన సందేశహరునికి ఆజ్ఞాపిస్తూ, "మీరు (తొలుత) 'అరఫాత్'కు రావాలి, అక్కడ ఆగాలి, ఆపైన 'ముజ్దలిఫా'కు మరలి రావాలి"[1] అని సెలవిచ్చాడు. అల్ బఖరా సూరా 199వ ఆయత్‌లోని అంతరార్థం ఇదే.**

**370) మహనీయ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) ఇలా వివరించి చెప్పారు: 'తమత్తు' సంకల్పం చేసుకున్నవారు 'ఉమ్రా' చేసిన పిదప ఇహ్రామ్‌ను విడువాలి. వారు హజ్జ్ నిమిత్తం ఇహ్రామ్ కట్టుకోనంత వరకూ బైతుల్లాహ్ ప్రదక్షిణ (నఫిల్‌గా) చేస్తూ ఉండాలి. మరి వారు హజ్జ్ కొరకు ఇహ్రామ్ కట్టుకుని, అరఫాత్‌కు బయలు దేరిన మీదట ఇవ్వగలిగిన ఖుర్బానీ ఇవ్వాలి– అది ఒంటె అయినాసరే లేదా ఆవు లేదా మేక అయినా సరే– ఈ మూడింటిలో తమకు అందుబాటులో ఉన్న పశువును ఖుర్బానీగా సమర్పించుకోవాలి. ఒకవేళ ఖుర్బానీ పశువు లేనివారు హజ్జ్ దినాలలో మూడు రోజులపాటు ఉపవాసం ఉండాలి. అరఫా దినానికి పూర్వం ఒకవేళ చివరి ఉపవాసం అరఫా దినాన వచ్చినా అందులో దోషం ఏమీ లేదు. మక్కా నగరం నుండి అరఫాత్‌కు నడిచి వెళ్ళాలి. అక్కడ (అరఫాత్‌లో) అస్ర్ నమాజ్ మొదలుకుని రాత్రి చీకటి అలుముకునే వరకూ ఆగాలి. ప్రజలు అరఫాత్ నుండి మరలినప్పుడు, వారితోపాటు మరలి రాత్రి ముజ్దలిఫాలో గడపాలి. అల్లాహ్‌ను స్మరిస్తూ, తక్బీర్లు, తహ్లీల్ అత్యధికంగా పలుకుతూ ఉండాలి. తెల్లవారే వరకూ ఇలా గడపాలి. తెల్లవారాక జనులతోపాటే ముజ్దలిఫా నుండి 'మినా'కు తిరిగి రావాలి. అక్కడ (మినాలో) కంకరరాళ్ళు రువ్వే వరకూ అల్లాహ్‌ను అత్యధికంగా స్మరిస్తూ, అల్లాహ్ గొప్పతనాన్ని కీర్తిస్తూ ఉండాలి.**

## అధ్యాయం : 35

# ఇహపరాలలోని మంచిని కోరుతూ ప్రార్థించటం

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: జనులలోని మరి కొందరు ఇలా ప్రార్థిస్తారు:**

---

369–1. అంటే ఖురైషులకు కూడా అరఫాత్ మైదానంలో ఆగాలని ఆజ్ఞాపించటం జరిగింది. 'హుమస్' అంటే ధర్మావలంబనలో దృఢంగా, ఖచ్చితంగా ఉండేవారని అర్థం. ఖురైషులమైన తాము పవిత్ర కాబా సేవకులమని, హరమ్(పుణ్యక్షేత్రం) పరిధులకు అవతల తాము వెళ్ళరాదని, అరఫాత్ మైదానం పుణ్యక్షేత్రం పరిధికి వెలుపల ఉందని వారు తలపోసేవారు. ఖురైషుల ఈ తప్పుడు ఆలోచనలను సంస్కరించటం జరిగింది. హాజీలంతా అరఫాత్‌లో ఆగటం తప్పనిసరిగా ఖరారు చేయటం జరిగింది.

ఇహలోకంలోనూ, పరలోకంలోనూ మాకు మంచిని ప్రసాదించు. మమ్మల్ని నరకబాధ నుండి కాపాడు." **(2: 201)**

**371)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఈ విధంగా వేడుకునే వారని అనస్ బిన్ మాలిక్(రజి) ఉల్లేఖించారు: **"అల్లాహుమ్మ రబ్బనా ఆతినా ఫిద్దున్‌యా హసనతన్ వ ఫిల్ ఆఖిరతి హసనతం వ్వఖినా అజాబన్నార్"** (మా ప్రభూ! మాకు ప్రపంచంలోనూ మేలును ప్రసాదించు. పరలోకంలో కూడా మేలును వొసగు. మమ్మల్ని నరక యాతన నుండి కాపాడు)[1]

## అధ్యాయం : 36
# సత్యానికి బద్ధ విరోధి

దైవోపదేశం :

మానవుల్లోని ఒకడు చెప్పే మాటలు ఇహలోక జీవితంలో నిన్ను ఎంతో రంజింపజేస్తాయి. తన సంకల్పశుద్ధిని గురించి తెలుపడానికి అతడు అల్లాహ్‌ను మాటిమాటికి సాక్షిగా నిలబెడతాడు. కాని వాస్తవానికి అతడు సత్యానికి బద్ధ విరోధి (జగడాల మారి, పేచీకి పెదబాబు) ***(2: 204)***

అతా ఇలా అన్నారు: **"వయుహ్‌లికల్ హర్స వన్నస్‌ల"**- ఇక్కడ **'నస్ల్'** అంటే పశువు అని అర్థం.

**372)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) ప్రవచించినట్లుగా హజ్రత్ ఆయిషా (ర.అ) తెలిపారు: "పచ్చి తగువుల మారి అయిన వ్యక్తి అల్లాహ్ దృష్టిలో అందరి కన్నా అసహ్యించుకోదగిన వాడు."

## అధ్యాయం : 37
# స్వర్గ ప్రవేశం గురించి...

అల్లాహ్ ఏమన్నాడో చూడండి–

"స్వర్గప్రవేశం ఊరకే లభిస్తుందని మీరు అపోహపడుతున్నారా? మీకు పూర్వం విశ్వాసులకు సంభవించినవన్నీ ఇంకా మీకు సంభవించనే లేదే! వారిపై ఆపదలు, ఎనలేని వ్యధలు విరుచుకుపడ్డాయి,వారు కుదిపివేయబడ్డారు. ***(2: 214)***

**373)** ఇబ్నె అబీ ములైకా ఇలా అన్నారు: ఇబ్నె అబ్బాస్(రజి) సూరయె

---

371–1. ఈ దుఆ మహత్‌పూర్వకమైనది. అత్యధికంగా ఇలా వేడుకుంటూ ఉంటే, అది ఇహంలోనూ, పరంలోనూ శుభాలకు దోహదకారి అవుతుంది.

యూసుఫ్‌లోని ఈ ఆయత్‌ను ఇలా పారాయణం చేస్తుండగా విన్నాను- **“హత్తా ఇజస్ తయ్యాసర్రుస్‌లు వ జన్నూ అన్నహుమ్ ఖద్ కుజిబూ”** అంటే ‘కుజిబూ’లో ‘జి’ని వత్తి పలికేవారు కారు. ఈ ఆయత్‌కు ఆయన గ్రహించగలిగిన భావార్థాన్ని గ్రహించారు. ఆ తరువాత ఇలా పఠించేవారు- **“హత్తా యఖూలర్రసూలు వల్లజీన ఆమనూ మఅహు మతా నస్రుల్లాహి- అలా ఇన్న నస్రల్లాహి ఖరీబ్”** **(2: 214).** తరువాత నేను ఉర్వా బిన్ జుబైర్‌ను కలుసుకున్నప్పుడు ఇబ్నె అబ్బాస్(రజి) గారి ‘తఫ్సీర్’ను గురించి ప్రస్తావిం చాను. అది విని ఉర్వా ఇలా వివరించారు: కాని అమ్మ ఆయిషా(ర.అ) మాత్రం ఇలా అనేవారు- “అల్లాహ్ శరణు! అల్లాహ్ సాక్షిగా! అల్లాహ్ తన ప్రవక్తతో చేసిన వాగ్దానం గురించి ప్రవక్తలు ఎన్నడూ అపోహకు గురి కాలేరు (దానిని వారు సరిగ్గానే అర్థం చేసుకున్నారు). మరణానికి పూర్వం అది తప్పక నెరవేరుతుందని వారనుకునేవారు. అసలు విషయం ఏమిటంటే, దైవప్రవక్తలు బాగా పరీక్షించ బడ్డారు. దైవ సహాయం అందడంలో ఆలస్యం అయ్యేసరికి వారు భయపడ్డారు. ఎందుకని? తన జాతి ప్రజలు తమను అబద్ధీకులుగా భావిస్తారేమోనన్న బెంగ వారికి పట్టుకుంది”. అందువల్ల అమ్మ ఆయిషా సూరయె యూసుఫ్‌లోని ఈ ఆయత్‌ను (అంటే **110**వ ఆయత్‌ను) పఠించేటప్పుడు ఇలా పఠించేవారు : **‘వ జన్నూ అన్నహుమ్ ఖద్ కుజ్జిబూ.”**

## అధ్యాయం : 38

# మీ స్త్రీలు మీ పంట పొలాలు

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

“మీ స్త్రీలు మీ యొక్క సేద్యపు భూములు. మీ పొలాలకు మీరు కోరిన విధంగా పోవటానికి మీకు అధికారం ఉంది. కాని మీరు మీ భవిష్యత్తును గురించి తగు జాగ్రత్త వహించండి. అల్లాహ్ ఆగ్రహానికి దూరంగా ఉండండి.” ***(2: 223)***

**374)** నాఫే ఇలా వివరించారు: ఇబ్నె ఉమర్ (రజి) ఒకసారి ఖుర్ఆన్ పారాయణం చేయడం మొదలెట్టారంటే, పారాయణం ముగించే వరకూ (మధ్యలో) ఏ ఒక్కమాట కూడా మాట్లాడేవారు కారు. ఒకరోజు నేను (ఖుర్ఆన్ పట్టుకుని) ఆయన ఎదుట కూర్చున్నాను. ఈయన అల్ బఖరా సూరా పారాయణం చేయ సాగారు. **‘నిసావుకుమ్ హర్‌సున్ లకుమ్...’** (మీ స్త్రీలు మీ యొక్క సేద్యపు భూములు) అనే ఆయత్ వరకు చేరగానే ఆయన ఆగిపోయి, “ఈ ఆయత్ దేని గురించి అవత

**రించిందో నీకు తెలుసా?" అని అడిగారు. నేను 'లేద'న్నాను. "ఫలానా ఫలానా భంగిమ గురించి" (అంటే స్త్రీతో వెనుక వైపు నుంచి రతిక్రీడ సాగించడం గురించి ఈ ఆయత్ అవతరించింది) అని ఆయన విడమరిచి చెప్పారు. "మీ సేద్యపు భూములకు మీరు కోరిన విధంగా రావచ్చు" అనే వాక్యాన్ని ఆయన విశదీకరిస్తూ, "మీరు వెనుక వైపు నుండి కూడా రమించవచ్చు"[1] అన్నారు.**

**375) హజ్రత్ జాబిర్(రజి) చెప్పగా తాను విన్నానని ముహమ్మద్ బిన్ మున్‌కదర్ తెలియజేశారు : జాబిర్(రజి) ఇలా చెప్పారు– "స్త్రీతో సంభోగించడానికి ఎవరయినా వెనుక వైపు నుంచి వస్తే పుట్టే శిశువు వంకరగా ఉంటుంద"ని యూదులు చెప్పేవారు. దానిపై ఈ ఆయత్ అవతరించింది– "మీ స్త్రీలు మీ పంట పొలాలు. మీరు మీ పొలాలకు కోరిన వైపు నుండి రావచ్చు."[1]**

---

374–1. అరబీలో **'అన్నా షీతుమ్'** అని ఉంది. అంటే మీ భార్యలతో మీరు కోరిన భంగిమలో రతిక్రీడ సాగించవచ్చు అని అర్థం. అంటే పడుకోబెట్టి సంభోగం జరిపినా, కూర్చోబెట్టి సమాగమం జరిపినా, నించోబెట్టి రమించినా, వెనుక వైపు నుంచి రమించినా తప్పు లేదు. కాకపోతే ఈ సంభోగం యొక్క అసలు ఉద్దేశం సంతానోత్పత్తి అయి ఉండాలి. ఎట్టి పరిస్థితిలోనూ స్త్రీ 'యోని'లో మాత్రమే పురుషాంగ ప్రవేశం జరగాలి.

యూదుల వాదనను ఖండిస్తూ ఈ ఆయత్ అవతరించింది. వెనుకవైపు నుండి వచ్చి స్త్రీ యోనిలో అంగ ప్రవేశం జరిపితే పుట్టే శిశువు వంకరగా ఉంటుందని యూదులు అనేవారు.

స్త్రీ వెనుక వైపు నుంచి రావటం అంటే ఆమె మల విసర్జనా మార్గం (దుబుర్)లో పురుషాంగం జొప్పించటం అని కొంతమంది వెలిబుచ్చిన అభిప్రాయం తప్పు. సేద్యపు భూమి అనే మాట స్త్రీ 'యోని'కి మాత్రమే వర్తిస్తుంది. మలవిసర్జనా మార్గంలో సంభోగించేవారిపై దేవుని అభిశాపం పడుతుంది. తిర్మిజీలో ఉన్న ఇబ్నె అబ్బాస్(రజి) కథనం ప్రకారం "ఎవరయినా ఒక పురుషుని లేదా స్త్రీ మల విసర్జనా మార్గం (దుబుర్) గుండా రతిక్రీడ సాగించిన వారిని దేవుడు దయా దృష్టితో చూడడు. ఈ చేష్ట అసహజమైనదే కాదు, మానవ మనుగడకు విరుద్ధమైనది కూడాను.

375–1. అంటే పరుండి, నిలబడి, కూర్చుని– ఏ భంగిమలో అయినా సరే మీరు మీ భార్యలతో సమాగమం జరుపవచ్చు. కాకపోతే పురుషుని అంగం స్త్రీ యోనిలో ప్రవేశించాలి. అంతేగాని దుబుర్ (మల విసర్జనా మార్గం) ద్వారా అంగ ప్రవేశం జరపటం హరామ్ (నిషిద్ధం). ఇది మానవ మనుగడకు విరుద్ధమైన చేష్ట. ఈ చేష్టను ఖండిస్తూ అనేక హదీసులు ఉన్నాయి. లూత్ జాతి ప్రజలు పూర్వం పురుషుల ద్వారా ఈ చేష్టకు పాల్పడి దైవాగ్రహానికి గురి అయ్యారు. నేటికీ ఈ ముదనష్టపు చేష్టకు పాల్పడే

## అధ్యాయం : 39
## విడాకులు

**దైవాదేశం-**

**"మీరు మీ స్త్రీలకు విడాకులిచ్చేసిన తరువాత వారు తమ నిరీక్షణా వ్యవధి (ఇద్దత్)ని పూర్తిచేసి, తమ నిశ్చిత భర్తలను ధర్మసమ్మతంగా పరస్పరం ఇష్టపడి వివాహం చేసుకోదలిస్తే, మీరు వారిని ఆటంకపరచకూడదు".** ***(2: 232)***

**376) మాఖిల్ బిన్ యసార్(రజి) ఇలా వివరించారు : నాకొక చెల్లెలు ఉండేది. ఆమెకు ఆమె మాజీ భర్త నికాహ్ సందేశం పంపాడు.**

రెండవ సనదు....

**మాఖిల్ బిన్ యసార్(రజి) చెల్లెలికి ఆమె భర్త విడాకులు ఇచ్చాడు. ఇద్దత్(గడువు) ముగిసిన పిమ్మట అతను మళ్ళీ వివాహ సందేశం పంపాడు. మాఖిల్(రజి) అతని సందేశాన్ని త్రోసిపుచ్చారు (అయితే ఆ స్త్రీ మాత్రం అతనితో నికాహ్ చేసుకోగోరింది). ఆ సందర్భంగానే ఈ ఆయత్ అవతరించింది. "మీరు వారిని ఆటంకపరచకండి" (2: 232) అని.[1]**

## అధ్యాయం : 40
## భర్త చనిపోయిన స్త్రీల ఇద్దత్ (గడువు)

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**"మీలో ఎవరయినా మరణించి, వారి భార్యలు సజీవంగా ఉంటే, వారు**

---

వారున్నారు. 'గే' కల్చర్ క్రమంగా పెరుగుతోంది. ఆధునిక ప్రజాస్వామ్య ప్రభుత్వాలు కూడా ఈ ముదనష్టపు చేష్టకు ఒడిగట్టే వారికి చట్టభద్రతను కల్పించటం విడ్డూరం.

376-1. అంటే స్త్రీలు తమ మాజీ భర్తను నికాహ్ చేసుకోదలిస్తే ఆపకండి అని భావం. ఈ ఆయత్‌లో స్త్రీల సంరక్షకులు సంబోధించబడ్డారు. ఈ ఆజ్ఞ 'తలాఖె రజ్‌యీ' (మరలింపు లేక రుజువుకు ఆస్కారం ఉన్న విడాకుల)కు వర్తిస్తుంది. 'తలాఖె మాబైన్'కి కూడా వర్తించాలంటే మూడు విడాకుల తర్వాత ఆ స్త్రీ షరీఅత్ ప్రకారం మరో పెళ్ళి చేసుకుని, ఆ భర్త నుండి విడాకులు పొంది ఉంటే, అప్పుడు ఆమె తన మాజీ భర్త (మొదటి భర్త)ను తిరిగి మనువాడగలదు. అయితే ఈ తతంగం (హలాలా తతంగం) ఉద్దేశపూర్వకంగా జరగరాదు. ఎందుకంటే 'హలాలా' చేసేవారిని అల్లాహ్ అధిక్షేపించాడు.

**నాలుగు నెలల పదిరోజుల వరకు తమను తాము నిగ్రహించుకోవాలి. ఈ గడువు (ఇద్దత్) పూర్తి అయిన పిదప, వారు తమ కొరకు ఏది ఉచితమో దానిని యుక్తమైన రీతిలో చేసుకోవటానికి స్వేచ్ఛ కలిగి ఉన్నారు. దానికి మీరు బాధ్యులు కారు. మీరు చేసే పనులన్నీ అల్లాహ్‌కు తెలుసు". (2: 234)**

**377)** అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) తెలిపారు : నేను ఈ ఆయత్ గురించి (వల్లజీన యుతవఫ్ఫూన... 2 : 234 గురించి) ఉస్మాన్(రజి)కు విన్నవించుకుంటూ, ఈ ఆయత్‌ను మరొక ఆయత్ రద్దు పరచిందనీ, అందుచేత ఈ ఆయత్‌ను మీ మస్‌హఫ్ (లిఖిత ప్రతి)లో లిఖించకండి లేదా తొలగించండి అని కోరాను. దానికి సమాధానంగా ఉస్మాన్(రజి) ఇలా అన్నారు: "అబ్బాయ్! నేను (ఖుర్‌ఆన్‌లోని) ఒక్క అక్షరాన్ని కూడా నా తరపున తొలగించలేను."[1]

**378)** ఇబ్నె అబీ నజీహ్‌తో ముజాహిద్ ఇలా అన్నారు: **"మీలో ఎవరైనా మరణించి, వారి భార్యలు సజీవంగా ఉంటే..."** అనే ఆయత్ ఎప్పుడు అవతరించిందంటే (అజ్ఞాన కాలంలో మాదిరిగా) ఈ ఇద్దత్ భర్త ఇంట్లోనే గడపటం తప్పనిసరి అయి ఉండేది. తరువాత అల్లాహ్ ఇందులో సడలింపును ఇచ్చాడు : దీని ప్రకారం (2: 234) వారు నాలుగు నెలల పదిరోజుల వరకు తమను తాము నిగ్రహించుకోవాలి. ఈ గడువు పూర్తి అయిన తరువాత వారు తమ కొరకు ఏది సముచితమో దానిని యుక్తమైన రీతిలో చేసుకోవటానికి స్వేచ్ఛ కలిగి ఉన్నారు. దానికి మీరు బాధ్యులు కారు. అంటే నాలుగు నెలల పదిరోజుల గడువు పూర్తి అయిన మీదట వారు తమ భర్త వసీయత్ ప్రకారం అదనంగా మరో ఏడు మాసాల ఇరవై రోజులు కూడా పూర్తి చేయదలచుకుంటే వారి ఇష్టం. ఒకవేళ ఆ స్త్రీ భర్త ఇల్లు వదిలి ఎక్కడికయినా వెళ్ళిపోతే ఆ దోషం మీపైన ఉండదు. అసలు ఇద్దత్ (గడువు) కాలం మాత్రం నాలుగు నెలల పది రోజులే. దానిని ఆమె ఎట్టి పరిస్థితిలోనూ పూర్తి చేయాల్సి ఉంటుంది..

---

377-1. ఇస్లామ్ ఆరంభ కాలంలో ఈ ఆజ్ఞ ఉండేది. దీని ప్రకారం జనులు చనిపోయే ముందు తమ భార్యలను ఏడాది కాలంపాటు ఇంట్లోనే ఉంచి, వారికి భరణం ఇస్తూ ఉండమని మరణ శాసనం చేసేవారు. ఆ తరువాత భర్తను కోల్పోయిన స్త్రీల ఇద్దత్ (గడువు) నాలుగు మాసాల పది రోజులు అన్న ఆదేశం వచ్చింది. దాంతో మొదటి ఆజ్ఞ రద్దు అయింది.

ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అంటారు: “ఈ ఆయత్, స్త్రీ తన భర్త ఇంట్లోనే 'ఇద్దత్' పూర్తి చేయాలన్న ఆచారాన్ని రద్దు చేసింది. ఈ ఆయత్ ఆధారంగా స్త్రీకి తాను కోరిన చోట ఇద్దత్ గడిపే స్వేచ్ఛాధికారం ఇవ్వబడింది. అల్లాహ్ ఈ ఆయత్‌లో **'గైర ఇఖ్‌రాజ్'** అని అనటంలోని భావార్థం ఇదే.

అతా ఇలా అంటారు : స్త్రీ గనక కోరుకుంటే తన భర్త ఇంటి వారల్లోనే ఉండి ఇద్దత్ గడపగలదు. భర్త మరణశాసనాన్ని అనుసరించి అతని ఇంట్లోనే ఉండగలదు. లేదంటే అక్కడి నుండి వెళ్ళిపోవచ్చు. ఎందుకంటే, 'వారు తమ కొరకు ఏది ఉచితమో దానిని యుక్తమైన రీతిలో చేసుకోవటానికి స్వేచ్ఛ కలిగి ఉన్నారు. దానికి మీరు బాధ్యులు కారు' అని అల్లాహ్ స్వయంగా సెలవిచ్చాడు.

అతా ఇంకా ఇలా అన్నారు: తరువాత అన్ నిసా సూరాలో వారసత్వ హక్కుకు సంబంధించిన ఆజ్ఞ అవతరించింది. దాంతో వితంతు స్త్రీని ఇంట్లోనే ఉంచాలన్న ఆజ్ఞ రద్దు చేయబడింది. వితంతు స్త్రీకి స్వేచ్ఛ లభించింది. ఆమె తాను కోరిన చోట ఇద్దత్ పూర్తి చేయగలదు. ఇట్టి పరిస్థితిలో ఇంటి ఖర్చు ఆమెకు ఇవ్వనవసరం లేదు...

**379)** ముహమ్మద్ బిన్ సీరీన్ ఇలా వివరించారు : నేను అన్సార్ల ఒక సదనంలో హాజరయ్యాను. అగ్రశ్రేణి అన్సారులు అక్కడ ఉపవిష్టులై ఉన్నారు. అబ్దుర్రహ్మాన్ బిన్ అబీ లైలా కూడా ఉన్నారు. నేను అక్కడ సుబైయా బిన్తె హారిస్ వ్యవహారంలో అబ్దుల్లాహ్ బిన్ ఉతబా గారి హదీసును గురించి ప్రస్తావించాను. దానికి జవాబుగా అబ్దుర్రహ్మాన్ బిన్ లైలా ఇలా అన్నారు: “అబ్దుల్లాహ్ బిన్ ఉతబా బాబాయి (అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్–రజి) ఆ విధంగా చేయలేరు”. (ముహమ్మద్ బిన్ సీరీన్ ఇలా అన్నారు) 'అంటే నేను, కూఫాలో ఇప్పటికీ సజీవంగా ఉన్న ఒక మహనీయుని గురించి అబద్ధం చెప్పే దుస్సాహసానికి ఒడిగట్టానంటారా?' నా కంఠ స్వరం పెరిగింది. నేను అక్కడి నుండి బయటకు రాగానే మాలిక్ బిన్ ఆమిర్ లేదా మాలిక్ బిన్ ఔఫ్ నాకు తారసపడ్డారు (ఇక్కడ ఉల్లేఖకుడు సందిగ్ధానికి లోనయ్యారు). ఆయన ఇబ్నె మస్ఊద్(రజి) స్నేహితుల్లో ఒకరు. నేనాయన్ని అడిగాను– 'భర్త చనిపోయిన స్త్రీ ఒకవేళ గర్భవతి అయి వుంటే, ఆమె ఇద్దత్(గడువు కాలం) గురించి ఇబ్నె మస్ఊద్ ఏమని ఫత్వా (ధార్మిక తీర్పు) ఇచ్చేవారు?' అని. దానికి ఆయన ఇలా అన్నారు : ఇబ్నె మస్ఊద్(రజి) ఏమనే

**వారంటే; "మీరు ఆ గర్భవతి పట్ల కఠినవైఖరి ఎందుకు అవలంబించాలను కుంటున్నారు? ఆమె పట్ల సౌలభ్యంతో కూడిన విధానాన్ని ఎందుకు అనుస రించరు? చిన్న సూరయె నిసా (సూరయె తలాఖ్) పెద్ద సూరయె నిసా తరువాత అవతరించింది.**[1]

## అధ్యాయం : 41

# అస్ర్ నమాజ్ ప్రాధాన్యత

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**"మీరు మీ నమాజులను సంరక్షించుకోండి– ముఖ్యంగా అత్యుత్తమమైన (మధ్య) నమాజును." (2: 238)**

**380) మహనీయ అలీ (రజి) కథనం : ప్రవక్త మహనీయులు(సఅసమ్) కందక యుద్ధ సందర్భంగా ఇలా అన్నారు : "ఈ అవిశ్వాసులు మనల్ని మధ్యస్థ నమాజ్ (అస్ర్ నమాజ్)ని ఆచరించనివ్వలేదు. అంతలోనే సూర్యాస్తమయం కూడా అయిపోయింది. అల్లాహ్ వారి సమాధుల్ని, ఇండ్లను లేదా వారి పొట్టలను అగ్నితో నింపుగాక!"**

---

379–1. అంటే సూరయె తలాఖ్ చిన్న సూరయె నిసాగా పేర్కొనబడింది. పెద్ద సూరయె నిసా, నిసా సూరాగా ఖరారు చేయబడింది. సూరయె తలాఖ్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: **"గర్భిణీ స్త్రీల నిర్ణీత గడువు వారి కాన్పు అయ్యేవరకు ఉంటుంది"** (65:4). దీనిని బట్టి అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్(రజి) గారి విధానం ఇదేనని తెలుస్తోంది. అంటే గర్భిణీ అయిన వితంతు స్త్రీ ప్రసవించగానే ఆమె ఇద్దత్ ముగుస్తుంది. కాగా; అబ్దుర్రహ్మాన్ బిన్ అబీ లైలా అభిప్రాయం తప్పు అని తేలింది.

అసలేం జరిగిందంటే– సుబైయా భర్త మక్కాలో చనిపోయినప్పుడు ఆమె గర్భవతిగా ఉంది. భర్త చనిపోయిన కొన్ని రోజులకే ఆమె ప్రసవించింది. అప్పుడు సనాబీల్ అనే వ్యక్తి ఆమెను వివాహమాడదలిచాడు. అప్పుడు ఆమె దైవప్రవక్త(స)ను సంప్రతిం చింది. దైవప్రవక్త(స) ఆమెకు పునర్వివాహానికి ఆనతి ప్రసాదించారు. దీనినిబట్టి స్పష్టమయ్యేదేమిటంటే గర్భిణీ స్త్రీ బిడ్డను కనగానే, ఆమె ఇద్దత్ (గడువు) కాలం గడిచిపోతుంది.

ఒకవేళ ఆమె ప్రసవానికి ఇంకా నాలుగు నెలల పదిరోజుల కాలం లేక అంతకన్నా ఎక్కువ కాలం ఉన్నట్లయితే అప్పటివరకూ ఆమె నిరీక్షించాల్సిందే.

## అధ్యాయం : 42

# విధేయులైన దాసులుగా (నిశ్శబ్దంగా) నిలబడటం

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"అల్లాహ్ సన్నిధానంలో విధేయులైన దాసులుగా నిలబడండి"[1] *(2 : 238)*

**381)** జైద్ బిన్ అర్ఖమ్ (రజి) ఇలా వివరించారు : లోగడ మేము నమాజ్ స్థితిలో మాట్లాడుకునేవారం. నమాజ్ చేసే ఏ వ్యక్తి అయినా తోటి సోదరునితో అవసరార్థం మాట్లాడేవాడు. చివరకు ఈ ఆయత్ అవతరించింది : "మీరు మీ నమాజులను కాపాడుకోండి. ముఖ్యంగా మధ్యలో ఉన్న నమాజును. అల్లాహ్ సన్నిధానంలో విధేయులైన దాసులుగా (నిశ్శబ్దంగా) నిలబడండి" (2: 238)- ఈ ఆయత్ ద్వారా నమాజు స్థితిలో నిశ్శబ్దంగా ఉండాలని మనకు ఉపదేశించ బడింది.[1]

## అధ్యాయం : 43

# ప్రమాదం పొంచి ఉన్నప్పుడు...

దైవోపదేశం :

"పరిస్థితులు ప్రమాదకరంగా ఉంటే, నడుస్తూ ఉన్నా లేక స్వారీ చేస్తూ ఉన్నా, ఎలా సాధ్యమైతే అలా నమాజు చెయ్యండి. శాంతిభద్రతలు నెలకొన్న తరువాత అల్లాహ్ మీకు నేర్పిన పద్ధతి ప్రకారం ఆయనను స్మరించండి. ఈ పద్ధతి పూర్వం మీకు తెలియదు." *(2 : 239)*

**382)** నాఫె ఇలా వివరించారు : ప్రమాదకర స్థితిలో నమాజ్ చేయటం గురించి అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి)ని అడిగినప్పుడు ఆయన ఇలా విడమరిచి చెప్పారు : "ఆ సమయంలో ఇమామ్ (నాయకుడు) ముస్లింల ఒక జట్టును

---

42-1. అంటే నమాజు స్థితిలో విధేయుల్లాగా నిశ్శబ్దంగా నిలబడాలి. ప్రాపంచిక విషయాలు మాట్లాడకూడదు.

381-1. **'ఖానితీన్'** అంటే నిశ్శబ్దంగా ఉండే విధేయులు అని అర్థం. ముజాహిద్ ఇలా అంటారు: **'ఖునూత్'** అంటే అశక్తత, అణకువ, వినయం ఉట్టిపడటం. అంటే నమాజులో నిలబడి ఉన్నప్పుడు మర్యాదగా, వినమ్రంగా, నిశ్శబ్దంగా నిలబడి నమాజ్ చేయాలి. చూపులు క్రిందికి ఉండాలి. నమాజు చేస్తున్నప్పుడు దేవుని దర్బారులో అణకువ ఉట్టిపడాలి (ఫత్‌హుల్ బారీ).

తీసుకుని, తాను స్వయంగా ముందుండి ఒక రకఅత్ నమాజ్ చేయించాలి. ఈ సందర్భంగా నమాజ్‌లో పాల్గొనని ముస్లింల మరో జట్టు ఈ నమాజీలకు– శత్రువులకు మధ్యన (గోడలా) నిలబడి ఉండాలి.

ఇమామ్ ఒక రకఅత్ నమాజ్ చేయించిన మీదట, అతనితో కలసి ఒక రకఅత్ నమాజ్ చేసిన వారంతా వెనక్కి వెళ్ళి, ఇప్పటివరకూ నమాజ్ చేయకుండా ఉన్న రెండవ జట్టు స్థానంలో నిలబడాలి. అయితే వారు 'సలామ్' చేయకూడదు. ఇప్పుడు నమాజ్ చేయని వారంతా వచ్చి ఇమామ్ వెనుక (వరుసలు తీరి) నిలబడాలి. ఇమామ్ గారు వారికి కూడా ఒక రకఅత్ సామూహిక నమాజ్ చేయించాలి. ఆ విధంగా ఇమామ్‌కు రెండు రకతులు లభించాయి గనక అతను నమాజ్‌ను విరమిస్తాడు. (ఇప్పుడు ఇమామ్ వెనుక నిలబడి ఒక్కో రకఅత్ చొప్పున నమాజ్ చేసిన ఇరుజట్లు కూడా) తమ మిగిలిన ఒక్కో రకఅత్‌ను– వీలు చూసుకుని పూర్తి చేసుకోవాలి) ఆ విధంగా ఇరు జట్లకు రెండేసి రకతుల నమాజ్ లభిస్తుంది. కాని ప్రమాదం లేక భయోత్పాతం ఇంతకన్నా తీవ్రంగా ఉన్నప్పుడు ప్రతి వ్యక్తీ ఒంటరిగా నమాజ్ చేసుకోవాలి. నడుస్తూ ఉన్నా గాని, వాహనంపై ఉన్నా గాని, ఖిబ్లా వైపు తిరిగి ఉన్నా సరే, లేకున్నా సరే"–

అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) గారు ఈ పలుకులు దైవప్రవక్త(స) ద్వారా విని మనకు విశదీకరించారని నాకు గట్టి నమ్మకం ఉందని నాఫే అన్నారు.

## అధ్యాయం : 44

దైవోపదేశం :

"మీలోని వారెవరయినా మరణించి, వారి భార్యలు సజీవంగా ఉంటే, వారు తమ భార్యలకు ఒక సంవత్సరం వరకు భరణపు ఖర్చులు ఇవ్వాలనీ, వారిని ఇంటినుండి బహిష్కరించరాదనీ ఒక వీలునామా వ్రాయాలి."[1] **(2: 240)**

**383)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) గారు ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి)తో, అల్ బఖరా సూరాలోని **240**వ ఆయత్‌ను ఉదాహరిస్తూ, **"వారు తమంతట తామే వెళ్ళిపోయి తమ విషయంలో ధర్మసమ్మతంగా ఏమి చేసినా దానికి మీరు బాధ్యులు కారు"** అని సెలవీయబడింది. తరువాత మరొక ఆయత్ ద్వారా ఇది

44–1. కాని ఈ ఆజ్ఞ తరువాత రద్దు అయింది.

రద్దు చేయబడింది కదా! మరలాంటప్పుడు, తమరు మీ 'మస్‌హఫ్' (లిఖిత ప్రతి)లో దీనిని ఎందుకు వ్రాయించారు? దీనిని ఎందుకు వదలివేయలేదు?' అని ప్రశ్నించగా ఉస్మాన్(రజి) ఇలా సమాధానమిచ్చారు : "ఓ నా భ్రాతృజుడా! నేను ఏ ఆయత్‌ను కూడా, అది ఉన్న స్థానంలో నుండి తొలగించలేను" లేదా ఇలాంటి మాటే అన్నారని హుమైద్ చెప్పారు.

## అధ్యాయం : 45

# ఇబ్రాహీమ్(అ)కు కలిగిన సందేహం

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

ఇబ్రాహీమ్ ఇలా అడిగాడు : "ఓ నా ప్రభూ! నీవు మృతులను ఏ విధంగా బ్రతికిస్తావో నాకు చూపించు".

**384)** హజ్రత్ అబూ హురైరా(రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు: "సందేహపడే హక్కు మనకు ఇబ్రాహీమ్(అ) కన్నా ఎక్కువే ఉంది- ఇబ్రాహీమ్(అ)కు సందేహం కలిగినప్పుడు) ఇలా విన్నవించుకున్నారు: 'ఓ నా ప్రభూ! నీవు మృతులను ఎలా బ్రతికిస్తావో నాకు చూపించు.' 'ఏమిటి, నీకు విశ్వాసం లేదా?' అని అల్లాహ్ అడిగితే, ఇబ్రాహీమ్ వినయంగా ఇలా విన్నవించుకున్నారు- 'నాకు విశ్వాసం లేక కాదు, ఉంది. కాని మనస్సును తృప్తి పరచటం కోసం అడుగుతున్నాను.[1]

## అధ్యాయం : 46

# జీవితాంతం సదాచరణ చేసి, చివరి దశలో...

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"సతతం నీరు పారే పిల్లకాలువలతో, ఖర్జూరం, ద్రాక్ష మొదలైన సకల ఫలాలతో నిండి పచ్చగా అలరారే తోట మీలో ఎవరికైనా ఉండి, అతడు

384-1. అప్పుడు అల్లాహ్ ఇలా అన్నాడు : "అలాగైతే నాలుగు పక్షులను పట్టుకుని, వాటిని బాగా మచ్చిక చేసుకో. వాటి మాంసాన్ని కలిపి, ఒక్కొక్క దాని భాగాన్ని ఒక్కో కొండపై పెట్టిరా. మళ్ళీ వాటిని రమ్మని పిలువు. అవి నీ వద్దకు పరుగెత్తుకుంటూ వస్తాయి"- అలాగే జరిగింది.

వయోభారంతో క్రుంగి, యోగ్యులు కానటువంటి చిన్నపిల్లలు ఉన్న సంకట సమయంలో ఆ తోట సుడిగాలికి గురిఅయి నశించిపోవటం మీలో ఎవరికైనా సమ్మతమేనా? మీరు యోచించగలందులకు ఈ విధంగా అల్లాహ్ తన సూచనలను విశదపరుస్తాడు". ***(2 : 266)***

**385)** అబ్దుల్లాహ్ బిన్ అబీ ములైకా గారు మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) నుండి ఉటంకించేవారు: ఒకరోజు హజ్రత్ ఉమర్(రజి) ప్రవక్త ప్రియ సహచరులతో, "ఈ ఆయత్(2: 266) ఏ విషయమై అవతరించిందో మీకు తెలుసా?" అని అడిగారు. దానికి వారు, 'అల్లాహ్‌కే బాగా తెలుసు' అని బదులిచ్చారు. ఇది విని హజ్రత్ ఉమర్(రజి) నొచ్చుకున్నారు. "దీని గురించి మీకు తెలుసో లేదో స్పష్టంగా జవాబివ్వండి" అని మళ్ళీ అడిగారు. అప్పుడు ఇబ్నె అబ్బాస్ ఇలా విన్నవించుకున్నారు:'అమీరుల్ మోమినీన్! నా మనసులో ఒక ఆలోచన వచ్చింది'. ఇది విని, "అబ్బాయ్! నువ్వయినా చెప్పు. నిన్ను నీవు చిన్నబుచ్చుకోకు" అన్నారు ఖలీఫా ఉమర్(రజి). అప్పుడు ఇబ్నె అబ్బాస్ (రజి) చెప్పారు– 'ఇందులో ఆచరణకు సంబంధించిన ఉపమానం ఇవ్వబడింద'ని. "ఎటువంటి ఆచరణ?" అని ఉమర్(రజి) ప్రశ్నించగా, 'ఆచరణకు సంబంధించిన ఉపమానం (అంతే, ఇంకేం చెప్పను?)' అన్నారు ఇబ్నె అబ్బాస్. అప్పుడు హజ్రత్ ఉమర్(రజి) ఇలా విడమరిచి చెప్పారు : "దైవ విధేయతను పాటిస్తూ సదాచరణ చేస్తూ ఉండే వ్యక్తి ఉపమానం ఇది. తరువాత అల్లాహ్ షైతాన్‌కు అతనిపై ప్రాబల్యం ఇస్తాడు. దాంతో అతను పాపాల ఊబిలో కూరుకుపోతాడు. తత్ఫలితంగా లోగడ అతను చేసుకున్న సత్కార్యాలన్నీ వ్యర్థమైపోతాయి."[1]

## అధ్యాయం : 47

# అభిమాన ధనులు

పరమ ప్రభువు ఇలా సెలవిచ్చాడు :

"లోకుల వెంటపడి సహాయం చెయ్యండి అని బ్రతిమాలే మనుషులు కారు వారు."[1] **(2: 272)**

---

385–1. వేరొక ఉల్లేఖనం ప్రకారం అతను జీవితాంతం సదాచరణ చేస్తాడు. కాని వృద్ధాప్యానికి చేరుకున్నప్పుడు మరిన్ని సత్కార్యాలు చేయవలసి ఉండగా దుష్కార్యాలు చేయటం మొదలెడతాడు. అందువల్ల అతని సత్కార్యాలన్నీ నాశనమైపోతాయి (ఫత్‌హుల్ బారీ).

**386) అబ్దుర్రహ్మాన్ బిన్ అబీ అమ్రా అన్సారీ ఇలా అన్నారు : మేము అబూ హురైరా (రజి) చెప్పగా విన్నాము. ఆయన, దైవప్రవక్త(స) ప్రవచించినట్లుగా తెలిపారు : "ఒకట్రెండు ఖర్జూర పండ్ల కోసం, ఒకట్రెండు ముద్దల అన్నం కోసం ముష్టెత్తుకుంటూ తిరిగేవాడు నిరుపేద కాడు. అడుక్కునే పనినుండి తనను కాపాడు కునే వాడే సిసలైన నిరుపేద". మీకు ఆధారం కావాలనుకుంటే (ఖుర్ఆన్‌లోని) ఈ ఆయత్‌ను చదువుకోండి– 'లాయస్అలూ నన్నాస ఇల్‌హాఫా'[1] (ప్రజల వెంటపడి యాచించే జనులు కారు వారు). *(2: 273)***

## అధ్యాయం : 48

# వ్యాపారం ధర్మసమ్మతం- వడ్డీ నిషిద్ధం

దైవోపదేశం–

**"అల్లాహ్ వ్యాపారాన్ని ధర్మసమ్మతం (హలాల్) చేశాడు. వడ్డీని నిషిద్ధం (హరామ్) చేశాడు." (2: 275)**

**387) ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ ఆయిషా(ర.అ) మస్రూఖ్‌తో ఇలా అన్నారు: "వడ్డీ వ్యవహారంలో అల్ బఖరా సూరాలోని చివరి ఆయత్‌లు (275–281) అవతరించినప్పుడు దైవప్రవక్త(సఅసమ్) వాటిని ప్రజలకు చదివి వినిపించారు. ఆ తరువాత మద్యపానం (సారాయి) వ్యాపారం కూడా నిషిద్ధంగా ఖరారయింది."[1]**

---

47–1. ఇందులో 'అస్‌హాబె సుఫ్ఫా' ప్రస్తావన ఉంది. వారు అవసరార్థులైఉండి కూడా జనుల ముందు చేయి చాపరు. తమ లేమిని గురించి నలుగురితో చెప్పుకోరు. వారి నిజ స్థితిని గురించి ఎరుగని వారు వారిని అక్కరలేని వారు అనుకుంటారు. వాస్తవానికి సహాయానికి ఎక్కువ అర్హులు వారే.

386–1. సృష్టితాలను అర్థించకుండా సృష్టికర్తను అర్థించాలన్నది దీని అంతరార్థం. మరికొంత మంది ఏమంటారంటే; జనులను అర్థించటం ఆక్షేపణీయం కాదు గానీ, జనుల వెంటపడటమే తప్పు. ఒకసారి తమ బాధ వినిపించాలి. ఇస్తే పుచ్చుకోవాలి. లేకుంటే ఊరుకోవాలి. కేవలం అల్లాహ్‌నే నమ్ముకోవాలి.

387–1. వడ్డీ కూడా ఒక విధమైన వ్యాపారమే కదా, మరలాంటప్పుడు దీనిని ఎందుకు నిషేధించినట్లు? అని ప్రశ్నించిన వారి మాటలను ఖండిస్తూ ఈ ఆయత్ అవతరించింది. వ్యాపారం ద్వారా వచ్చే లాభం ధర్మసమ్మతం (హలాల్) అనీ, వడ్డీ

## అధ్యాయం : 49

# వడ్డీ నశిస్తుంది, దానధర్మాలు వికసిస్తాయి

"అల్లాహ్ వడ్డీని నశింపజేస్తాడు, దానధర్మాలను పెంచి అధికం చేస్తాడు."
**(2: 276)**

**388)** విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) తనతో ఈ విధంగా చెప్పారని మస్రూఖ్ తెలియజేశారు: అల్ బఖరా సూరాలోని చివరి ఆయత్‌లు అవతరించినప్పుడు ప్రవక్త మహనీయులు(సఅసమ్) బయటకు వచ్చి- మస్జిద్‌లో వాటిని చదివి వినిపించారు. ఆ తరువాత సారాయి వర్తకం కూడా నిషిద్ధం (హరామ్) గావించబడింది.

## అధ్యాయం : 50

# హెచ్చరిక

"ఒకవేళ మీరుగాని అలా చెయ్యకపోతే (వడ్డీ లావాదేవీలను విడనాడకపోతే) మీపై అల్లాహ్ తరఫు నుండి యుద్ధ ప్రకటన ఉంది అనే విషయం తెలుసుకోండి".
***(2 : 279)***

**389)** ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు: అల్ బఖరా సూరాలోని (వడ్డీకి సంబంధించిన) చివరి ఆయతులు అవతరించినప్పుడు ప్రవక్త మహనీయులు(సఅసమ్), వాటిని మస్జిద్‌లో చదివి వినిపించారు. సారాయి వర్తకాన్ని నిషిద్ధం (హరామ్)గా ఖరారు చేశారు.

## అధ్యాయం : 51

# ఆనాటి పరాభవం నుండి కాపాడుకోండి

"అల్లాహ్ వద్దకు మీరు మరలి వెళ్ళే రోజున జరిగే పరాభవం నుండి, కలిగే ఆపద నుండి రక్షించుకోండి." ***(2: 281)***

**390)** మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అన్నారు: దైవప్రవక్త (సఅసమ్)పై అవతరించిన చివరి ఆయత్ వడ్డీకి సంబంధించిన ఆయత్.

---

ద్వారా వచ్చే లాభం అధర్మం(హరామ్) అనీ అల్లాహ్ ఈ ఆయత్‌లలో స్పష్టం చేశాడు. వడ్డీ తినేవాడు పరలోకంలో- ఉన్మాది మాదిరిగా లేస్తాడు. రక్తపు కాలువలో అతనిని ముంచటం జరుగుతుంది.

## అధ్యాయం : 52

# అల్లాహ్ అన్నింటిపైన అధికారం కలవాడు

మీరు మీ మనస్సులలో ఉన్న విషయాలను ప్రకటించినా లేక దాచినా, వాటిని గురించి ఎట్టకేలకు అల్లాహ్ లెక్క తీసుకుంటాడు. ఇంకా తాను కోరిన వారిని క్షమించటానికీ, తాను కోరిన వారిని శిక్షించటానికీ ఆయనకు అధికారం ఉంది. ఆయన అన్నింటిపైనా అధికారం కలవాడు. *(2: 284)*

**391)** ప్రవక్త ముహమ్మద్(సఅసమ్) గారి ప్రియ సహచరుడు ఒకరు– అంటే అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) మర్వాన్ అస్ఫర్‌తో ఇలా అన్నారు: "మీరు మీ మనస్సులలో ఉన్న విషయాలను ప్రకటించినా లేక దాచినా వాటిని గురించి ఎట్టకేలకు అల్లాహ్ తెలుసుకుంటాడు..." అనే ఆయత్ రద్దు అయింది.[1]

## అధ్యాయం : 53

# అల్లాహ్‌తో ఒడంబడిక

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"ప్రవక్త తనపై తన ప్రభువు నుండి అవతరించిన దాన్ని విశ్వసించాడు. ఈ ప్రవక్తను విశ్వసించేవారు కూడా దానిని హృదయపూర్వకంగా స్వీకరించారు. వారంతా అల్లాహ్‌నూ, ఆయన దూతలనూ, ఆయన గ్రంథాలనూ, ఆయన ప్రవక్తలనూ విశ్వసిస్తారు. వారు ఇలా అంటారు : "మేము అల్లాహ్ పంపిన ప్రవక్తలలోని ఏ ఒక్కరినీ భేదభావంతో చూడము. మేము ఆదేశం విన్నాము,

---

391–1. ఇమామ్ అహ్మద్ (రహ్మ) ముజాహిద్ నుండి ఇలా వెలికి తీశారు: నేను ఇబ్నె అబ్బాస్ (రజి) దగ్గరకు వెళ్ళాను. ఇబ్నె అబ్బాస్(రజి) ఈ ఆయత్‌ను (**వ ఇన్‌తుబ్‌దూ మా ఫీ అన్ఫుసికుమ్...**(2: 284) పఠించి విలపించసాగారు. ఇబ్నె అబ్బాస్ (రజి) ఇలా అన్నారు: "ఈ ఆయత్ అవతరించినప్పుడు ప్రవక్త ప్రియ సహచరులు (రజి) ఆవేదనకు గురయ్యారు. 'దైవప్రవక్తా! మేము నాశనమైపోయాము.ఎందుకంటే మనసులు మా నియంత్రణలో లేవు. మనస్సులలో రకరకాల ఆలోచనలు వస్తుంటాయి' అని విన్నవించుకున్నప్పుడు, దైవప్రవక్త(స), 'మేము ఆదేశం విన్నాము, శిరసావహించాము' అని పలకండి అని సూచించారు. పిమ్మట, 'ఏ ప్రాణిపైనా అల్లాహ్ దాని శక్తికి మించిన భారం మోపడు' (2: 286) అనే ఆయత్ దీనిని రద్దు పరచింది అని చెప్పారు.

**శిరసావహించాము. స్వామీ! క్షమాభిక్ష పెట్టు అని మేము నిన్ను అర్థిస్తున్నాము. చివరకు మేమంతా నీ దెసకే మరలి వస్తాము." (2: 285)**

**392)** ప్రవక్త మహనీయుల(సఅసమ్) వారి ఒక ప్రియ సహచరుడు– ఇబ్నె ఉమర్(రజి) గారు **వ ఇన్‌తుబ్‌తూ మాఫీ అన్‌ఫుసికుమ్ అవ్ తుఖ్‌ఫూహూ.** ఈ ఆయత్ గురించి ఇలా చెప్పారని మర్వాన్ అస్ఫర్ తెలియజేశారు : "**లా యుకల్లిఫుల్లాహు నఫ్‌సన్ ఇల్లా ఉస్‌అహా**" అవతరించిన మీదట అది రద్దు అయింది.[1]

392–1. ఆంతర్యంలో జనించే ప్రేరణలపై కూడా దైవ సమక్షంలో నిలదీత ఉంటుందన్న ఆయత్‌ను విని ప్రవక్త సహచరమాన్యులు భయపడిపోయారు. ఎందుకంటే ఆంతర్యంలో తరచూ దుష్ప్రేరణలు ఎన్నో రేకెత్తుతుంటాయి. వాటిపై నిలదీత గనక జరిగితే ఎవరూ దైవ సమక్షంలో నెగ్గుకు రాలేరు. తరువాత ఈ సూరాలోని 286వ ఆయత్ (**లా యుకల్లిఫుల్లాహు నఫ్సన్...**) మొదటి ఆయత్‌ను రద్దు పరచింది.

# 3. ఆలె ఇమ్రాన్ సూరా వ్యాఖ్యానం

... ప్రవక్తా! నీపై ఈ గ్రంథాన్ని అవతరింపజేసినవాడు ఆ దేవుడే! ఈ గ్రంథంలో రెండు రకాల ఆయతులు ఉన్నాయి. మొదటివి: 'ముహ్కమాత్' (స్పష్ట మైనవి), అవి గ్రంథానికి పునాదుల వంటివి. రెండోవి: 'ముతషాబిహాత్' (అస్పష్ట మైనవి) *(3: 7)*

ముజాహిద్ ఇలా అంటారు : 'ముహ్కమాత్' అంటే ధర్మాధర్మాల (హలాల్-హరామ్‌ల)కు సంబంధించిన వాక్యాలు. **'వ ఉఖరు ముతషాబిహాత్'** అంటే ఒండొక దానిని పోలిన వచనాలు. అంటే అవి ఒండొక దానిని ధ్రువపరుస్తాయి. ఉదాహరణకు: 1) **వమా యుజిల్లు బిహీ ఇల్లల్ ఫాసిఖీన్.** 2) **వ యజ్‌అలుర్రిజ్‌స అలల్లజీన లా యాఖిలూన్. 3) వల్లజీనహ్‌తదవ్ జాదహుమ్ హుదన్** - ఈ మూడు ఆయత్‌లలో ధర్మాధర్మాలకు సంబంధించిన వివరాలు లేవు గనక ఇవి 'ముతషాబిహాత్' కోవకు చెందిన వాక్యాలుగా పరిగణించబడ్డాయి..

**393)** విశ్వాసుల మాత సయ్యిదా ఆయిషా(ర.అ) తెలిపారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) **'హువల్లజీ అన్‌జల అలైకల్ కితాబ...'"** అనే ఆయత్ పఠించారు. (దాని అర్థం ఇది) ప్రవక్తా! నీపై ఈ గ్రంథాన్ని అవతరింపజేసినవాడు ఆ దేవుడే! ఈ గ్రంథంలో రెండు రకాల ఆయత్‌లు ఉన్నాయి. మొదటివి **ముహ్కమాత్** (స్పష్టమైనవి). అవి గ్రంథానికి పునాదుల వంటివి. రెండోవి, **ముతషాబిహాత్** (అస్పష్టమైనవి). వక్ర మనస్కులు కలతలను రేపేందుకు ఎల్లప్పుడూ **'ముతషాబిహాత్'** వెంటపడి వాటికి అర్థాలు తొడిగే ప్రయత్నం చేస్తారు. కాని వాటి అసలు అర్థాన్ని అల్లాహ్ తప్ప మరెవ్వరూ ఎరుగరు. దీనికి భిన్నంగా, పరిపక్వ జ్ఞానం కలవారు ఇలా అంటారు: "వాటిని మేము విశ్వసించాము. ఇవన్నీ మా ప్రభువు నుండి వచ్చినవే". యథార్థం ఏమిటంటే, ఏ విషయాన్నుండైనా విజ్ఞత గలవారే గుణపాఠం

**నేర్చుకుంటారు (3: 7). ఆయిషా (ర.అ) ఇలా అన్నారు : దైవప్రవక్త(స) ఏమన్నారంటే; "ముతషాబా వచనాల వెనుకపడిన వారిని మీరు గమనించినప్పుడు, అల్లాహ్ ప్రస్తావించిన ఆ వక్ర మనస్కులు వారేనని తెలుసుకోండి. కనుక అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండండి."[1]**

## అధ్యాయం : 1
# మర్యమ్ తల్లి అభ్యర్థన

**"(ప్రభూ) శాపగ్రస్తుడైన షైతాను బారి నుండి రక్షణ కొరకు నేను దీనినీ (మర్యమ్- అలైహస్సలామ్‌ను), దీని సంతానాన్నీ నీకు అప్పగిస్తున్నాను." (3: 36)**

**394) ప్రవక్త మహనీయులు (స) ఈ విధంగా ప్రవచించినట్లుగా హజ్రత్ అబూ హురైరా(రజి) ఉల్లేఖించారు: "ప్రతి శిశువు పుట్టినప్పుడు షైతాన్ ఆ శిశువును ముట్టుకుంటాడు. దాంతో ఆ శిశువు ఏడుస్తుంది. కాని మర్యమ్ విషయంలో, ఆమె కుమారుని (ఈసా-అలైహిస్సలామ్) విషయంలో మాత్రం అలా జరగలేదు"- తరువాత అబూహురైరా(రజి) ఇలా అన్నారు : కావాలనుకుంటే మీరు ఈ ఆయత్ చదువుకోండి- ఇన్నీ ఉయీజుహాబిక వజుర్రియ్యతహా మినష్షయితా నిర్రజీమ్ (3: 36). ఇవి హజ్రత్ మర్యమ్(అలైహిస్సలామ్) మాతృశ్రీ పలుకులు. అల్లాహ్ ఆమె మొరను ఆలకించి, ఆమోదించాడు. మర్యమ్‌ను, ఆమె కుమారుడగు ఈసా(అ)ను షైతాన్ ముట్టుకోకుండా కాపాడాడు.**

## అధ్యాయం : 2
# బాధాకరమైన శిక్షకు గురయ్యేవారు

**ఎవరు అల్లాహ్‌కు చేసిన వాగ్దానాన్ని, తమ ప్రమాణాలను స్వల్పమైన వెలకు విక్రయిస్తారో వారికి పరలోకంలో ఏ భాగమూ లేదు. ప్రళయదినాన అల్లాహ్**

---

393-1. మొదట్లో యూదులు ముతషాబా వచనాల వెనుకపడ్డారు. వారు సూరాల అక్షరాల ఆధారంగా ఈ ఉమ్మత్ గడువును వెలికి తీశారు. ఆ తరువాత ఖారిజీలు పుట్టుకు వచ్చారు. వారు ఖారిజీలని ఇబ్నె అబ్బాస్(రజి) శోధించి చెప్పారు. ఇస్లామ్‌లో పొడసూపిన మొదటి బిద్‌అత్ (కొత్త పోకడ) ఖారిజీలదే అన్నారు ఇబ్నె అబ్బాస్.

దేవుని గుణగణాల గురించి ఉన్న వచనాలలో కూడా వాటి బాహ్య అర్థాన్ని నమ్మటం, వాటికి భాష్యాలు తొడగకుండా ఉండటం, వాటికి సంబంధించిన వాస్తవికతను దైవాధీనం చేయటం తొలికాలపు సజ్జనుల (సలఫె సాలిహీన్) విధానం.

వారిని పలుకరించడు. వారి వైపు చూడడు. వారిని పరిశుద్ధులుగానూ చెయ్యడు. పైగా వారికి బాధాకరమైన శిక్ష పడుతుంది. *(3: 77)*

**395)** ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఈ విధంగా ప్రవచించినట్లుగా అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) అబూ వాయల్‌తో చెప్పారు : "ఎవరయినా ఒక ముస్లిం సొమ్మును స్వాహా చేసే ఉద్దేశ్యంతో (అబద్ధపు) ప్రమాణం చేసే వ్యక్తి అల్లాహ్‌ను కలుసుకున్నప్పుడు, అల్లాహ్ ఆగ్రహోదగ్రుడై ఉంటాడు. తరువాత అల్లాహ్ ఆయన(స) ప్రవచనానికి ధ్రువీకరణగా ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు: **"ఇక ఎవరు అల్లాహ్‌కు చేసిన వాగ్దానాన్ని, తమ ప్రమాణాలను స్వల్పమైన వెలకు విక్ర యిస్తారో, వారికి పరలోకంలో ఏ భాగమూ లేదు. ప్రళయం రోజున అల్లాహ్ వారిని పలుకరించడు. వారి వైపు చూడడు. వారిని పరిశుద్ధులుగానూ చెయ్యడు. పైగా వారికి అత్యంత బాధాకరమైన శిక్ష పడుతుంది"** ***(3: 77)***

అబూ వాయల్ ఇలా అన్నారు: అష్అత్ బిన్ ఖైస్ కిందీ(రజి) వచ్చి, 'అబూ అబ్దుర్రహ్మాన్ (అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్- రజి) మీకు ఏదయినా హదీసును వివరించారా?' అని అడిగారు. దానికి మేము, 'అవును. ఈ రకమైన హదీసు ఒకటి వినిపించార'ని చెప్పాము. దానికి అష్అత్(రజి), 'ఆ ఆయత్ నా గురించే అవతరించింది. నా పినతండ్రి కుమారుని భూమిలో నా బావి ఒకటి ఉండేది. (ఆ బావి వ్యవహారంలో మా ఇద్దరి మధ్య వివాదం తలెత్తింది. కేసు దైవప్రవక్త(స) వద్దకు వచ్చింది). "నువ్వు నీ వాదనకు అనుకూలంగా సాక్ష్యాధారం సమర్పించు. లేదంటే అతని ప్రమాణం ఆధారంగా తీర్పు ఇవ్వబడుతుంద"ని దైవప్రవక్త(స) చెప్పారు. 'దైవప్రవక్తా! అతను చాలా సులభంగా ప్రమాణం చేసేస్తాడు' అని నేను విన్నవించుకున్నాను. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా అన్నారు : "ఎవరయితే తోటి ముస్లిం సొమ్మును కబళించే దురుద్దేశంతో అబద్ధపు ప్రమాణం చేస్తాడో, అతను అల్లాహ్‌ను ఆగ్రహోదగ్రుడై ఉన్న స్థితిలో కలుసుకుంటాడు."[1]

---

395-1. వేరొక ఉల్లేఖనంలో అష్అత్(రజి)కు- ఒక యూదునికి మధ్య తగాదా ఉండేదని ఉంది. అబ్దుల్లాహ్ బిన్ అబీ అవ్ఫా(రజి) ప్రకారం; మార్కెట్టులో సరుకు పెట్టి, దానికి ఇంత వెల లభించేదని అబద్ధపు ప్రమాణం చేసే వ్యక్తి నేపథ్యంలో ఈ ఆయత్ అవత రించింది. ఈ ఆదేశం సర్వసామాన్యం. అబద్ధపు ప్రమాణాలతో ఎదుటి వారిని మోస గించే వారందరికీ ఇది- ఇప్పటికీ- వర్తిస్తుంది. ప్రజలు అబద్ధపు ప్రమాణాన్ని చాలా సులభంగా తీసుకుంటూ ఉంటారు. తస్మాత్ జాగ్రత్త!

**396)** ఇబ్నె అబీ ములైకా కథనం: ఇద్దరు స్త్రీలు ఒక ఇంట్లో లేక కుటీరంలో కూర్చుని మేజోళ్ళు కుట్టేవారు. వారిద్దరిలో ఒకామె బయటకు వచ్చింది. ఆమె చేతికి మేజోళ్ళు కుట్టే సూది గుచ్చబడి ఉంది. ఆమె తన తోటి స్త్రీపై నిందారోపణ చేసింది. ఈ వివాదం ఇబ్నె అబ్బాస్ (రజి) దగ్గరకు వచ్చింది. (అంతా విని) ఆయన ఇలా అన్నారు: ప్రవక్త మహనీయులు(స) ఏమన్నారో తెలుసా!? కేవలం దావా (నిందారోపణ) ఆధారంగా జనుల కోరికను అంగీకరించినట్లయితే ఎంతోమంది రక్తం, ధనం నాశనమైపోతాయి. దావా చేసే ఆమె వద్ద సాక్షులు లేనప్పుడు, నిందారోపణను ఎదుర్కొంటున్న స్త్రీని అల్లాహ్ పేరు మీద భయబోధ చేయండి. ఆమె ముందు ఈ ఆయత్‌ను పఠించండి- **ఇన్నల్లజీన యష్‌తరూన బిఅహ్‌దిల్లాహి...** జనులు ఆ స్త్రీని అల్లాహ్ పేరుతో భయపెట్టేసరికి, ఆమె తన నేరాన్ని అంగీకరించింది. అప్పుడు ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అన్నారు: "దైవ సాక్షిగా! ఒకవేళ నిందితుడు గనక అబద్ధపు ప్రమాణం చేసి, ఎవరి సొమ్మునయినా కబళిస్తే, ఈ ఆయత్‌లో చేయబడిన హెచ్చరిక అతనికీ వర్తిస్తుంద"ని దైవప్రవక్త(స) సెలవిచ్చారు.

**397)** ఇబ్నె అబీ ములైకా కథనం: ఇద్దరు స్త్రీలు ఒక ఇంట్లో లేదా కుటీరంలో కూర్చొని మేజోళ్ళు తయారు చేసేవారు. వారిద్దరిలో నుండి ఒక స్త్రీ బయటకు వచ్చింది. ఆమె చేతిలో మేజోళ్ళు కుట్టే సూది గుచ్చబడి ఉంది. తనతో కలసి పనిచేసే రెండవ స్త్రీ తనకు ఈ హాని కలిగించిందని ఆమె దావా వేసింది. ఈ వివాదం ఇబ్నె అబ్బాస్(రజి) వద్దకు వచ్చింది. ఆయన ఇలా అన్నారు: "కేవలం నిందారోపణ ఆధారంగా ప్రజల డిమాండ్‌ను అంగీకరించే మాటైతే చాలామంది రక్తం, సంపద నాశనమైపోతుందని దైవప్రవక్త(స) వక్కాణించారు. కాబట్టి సాక్ష్యం లేనప్పుడు, నిందితురాలైన స్త్రీకి దైవభీతి గురించి ఉపదేశించండి. ఆమె ముందు ఇన్నల్లజీన యష్‌తరూన బిఅహదిల్లాహి (3: 77) ఆయత్‌ను చదివి వినిపించండి".

అలాగే ప్రజలు ఆమెకు భయబోధ చేస్తే, ఆమె తన అపరాధాన్ని అంగీకరించింది. అప్పుడు ఇబ్నె అబ్బాస్(రజి), "ఈ వ్యవహారంపై దైవప్రవక్త(స) ఏమన్నారో వినండి. నిందితుడు ఒకవేళ అబద్ధపు ప్రమాణం చేసి, సొమ్మును కాజేసినట్లయితే, అతడు ఈ ఆయత్‌లో హెచ్చరించబడిన దాని ప్రకారం దైవాగ్రహానికి గురవుతాడు."

అధ్యాయం : 3

## గ్రంథవహులకు దైవ సందేశం

ప్రవక్తా! ఇలా చెప్పు : "గ్రంథ ప్రజలారా! మాకూ మీకూ మధ్య సమానమైన

ఒక విషయం వైపునకు రండి. (అది ఏమిటంటే) మనం అల్లాహ్‌కు తప్ప మరెవరికీ దాస్యం చెయ్యరాదు. ఆయనకు భాగస్వాములుగా ఎవరినీ నిలబెట్టరాదు." (3: 64)

'సవాయిన్' అంటే మీకూ- మాకూ మధ్యన ఉమ్మడిగా ఉన్న విషయాన్ని ఒప్పుకుందాం అని అర్థం.

**398)** ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా వివరించారు: అబూ సుఫ్యాన్ నాతో ఇలా అన్నారు: నాకూ - దైవప్రవక్త(సఅసమ్)కు మధ్య ఒడంబడిక (హుదైబియా ఒప్పందం) జరిగి ఉన్న కాలంలో నేను వ్యాపారం నిమిత్తం సిరియా వెళ్ళాను. ఆ రోజుల్లోనే దైవప్రవక్త(స) పంపిన లేఖ రోము చక్రవర్తి హెరిక్లస్‌కు అందింది. దిహ్యాకల్బీ (రజి) ఆ ఉత్తరాన్ని తీసుకు వచ్చి బుస్రాకు అందజేశారు. బుస్రా దానిని హెరిక్లస్ వరకు చేరవేశాడు.

అబూ సుఫ్యాన్(రజి) ఇలా అన్నారు : "తనను దైవప్రవక్తగా ప్రకటించుకున్న ఆ వ్యక్తికి చెందిన జాతివారు మన సామ్రాజ్య పరిధిలో ఎవరయినా ఉన్నారా?" అని హెరిక్లస్ అడిగాడు. దానికి అతని దర్బారు జనులు, 'అవును. ఉన్నారు' అని చెప్పారు.

అంతే, నన్ను కొంతమంది ఖురైషు జనులతోపాటు పిలిపించటం జరిగింది. మేము హెరిక్లస్ దర్బారులో హాజరయ్యాము. మమ్మల్ని చక్రవర్తికి ఎదురుగా కూర్చోబెట్టడం జరిగింది.

"తనను దైవ సందేశహరునిగా చెప్పుకుంటున్న ఆ వ్యక్తికి చాలా దగ్గరగా ఉన్నవారు మీలో ఎవరు?" అని హెరిక్లస్ అడిగాడు.

'నేను ఆయనకు చాలా దగ్గరివాణ్ణి' అన్నారు అబూ సుఫ్యాన్.

దర్బారులోని వారు నన్ను చక్రవర్తికి మరీ దగ్గరలో కూర్చోబెట్టారు. నాకు తోడుగా వచ్చిన ఖురైషులను నా వెనుక కూర్చోబెట్టారు. ఆ తరువాత దుబాసీ (అనువాదకుడు) పిలిపించబడ్డాడు. చక్రవర్తి ఆ దుబాసీతో, "ఇతనికి చెప్పు. తనను దైవప్రవక్తగా చెప్పుకుంటున్న ఆ వ్యక్తి గురించి నేను కొన్ని ప్రశ్నలు అడగదలిచాను. ఒకవేళ ఇతను (అబూ సుఫ్యాన్) గనక అబద్ధం చెబితే, మీరు ఇతని అబద్ధాన్ని పట్టుకోవాలి" అన్నాడు.

అబూ సుఫ్యాన్ ఇలా అన్నారు: 'నేను అబద్ధం చెప్పినప్పుడు, నా తోటి సహచరులు నన్ను తప్పు పడతారన్న భయమే గనక లేకుంటే నేను (దైవప్రవక్త గురించి) తప్పకుండా అబద్ధం చెప్పి ఉండేవాణ్ణి.'

తరువాత హెరిక్లస్ తన దుబాసీతో “తనను దైవప్రవక్తగా ప్రకటించుకున్న వ్యక్తి వంశపరంగా ఎలాంటివాడో ఇతన్ని అడుగు” అన్నాడు.

‘అతని వంశం మా అందరిలోకీ గౌరవప్రదమైనది’ అని నేనన్నాను.

“అతని తండ్రీ తాతల్లో ఎవరయినా రాజులు గడిచారా?” అని అతను ప్రశ్నించగా,

‘లేదు’ అని నేనన్నాను.

“దైవదౌత్యం అందక పూర్వం నీవు అతనిపై ఎప్పుడయినా అబద్ధపు ఆరోపణ చేసి ఉన్నావా?” అని అతను ప్రశ్నించగా,

‘లేదు’ అని నేను సమాధానమిచ్చాను.

“అతనిని మర్యాదస్తులు, గౌరవనీయులు ఎక్కువగా అనుసరిస్తున్నారా? లేక బడుగు వర్గాల వారు, అభాగ్యజీవులు అనుసరిస్తున్నారా?”

‘జాతి జనులలోని బలహీనులు, అభాగ్యజీవులు ఎక్కువగా ఆయన అనుయాయులుగా ఉన్నారు’.

“అతనిని అనుసరించేవారి సంఖ్య పెరుగుతోందా? తగ్గుతోందా?”

‘లేదు. నానాటికీ వారి సంఖ్య పెరుగుతూనే ఉంది.’

“ఒకసారి ఆయన ప్రబోధించే మత ధర్మాన్ని విశ్వసించిన మీదట, ఆయన పట్ల అనుమానంతో ఆయన నుండి తిరిగిపోయిన సంఘటన గాని ఎదురయిందా?”

‘అలాంటి సంఘటన ఏదీ నాకు తెలిసినంతవరకు సంభవించలేదు’.

“మీరెప్పుడయినా అతనితో యుద్ధం చేశారా?”

‘అవును. చేశాము.’

“ఆ యుద్ధాల ఫలితం ఎలా ఉండేది?”

‘మా యుద్ధాల ఉపమానం చేదలాంటిది. అది ఒకసారి ఆయన చేతిలో ఉంటే, ఒకసారి మా చేతిలో ఉండేది.’

“అతను మిమ్మల్ని ఎప్పుడయినా మోసగించాడా?”

‘ఇప్పటివరకైతే అలా జరగలేదు. అయితే ప్రస్తుతం ఆయనకూ- మాకూ మధ్యన ఒక ఒప్పందం జరిగి ఉంది. ఈ ఒప్పందం విషయంలో ఆయన వైఖరి ఎలా ఉండబోతుందో ఇప్పుడే ఏమీ చెప్పలేము.’

అబూ సుఫ్యాన్ ఇలా అన్నారు : ‘దైవసాక్షి! పూర్తి సంభాషణలో ఈ ఒక్క

విషయంలో తప్ప ఎందులో కూడా నేను నా తరఫున ఊహాగానం చేయలేక పోయాను.'

"ఇంతకు మునుపు కూడా మీలో ఎవరయినా ఈ విధమైన దావా చేశారా?"

'లేదు'

ఆ తరువాత హెరిక్లస్ తన దుబాసీతో ఇలా అన్నాడు: "ఇతనితో చెప్పు, నేను ఆ ప్రవక్త వంశపరంపర గురించి అడిగితే, అతను మీ అందరిలోకెల్లా గౌరవ నీయుడు, ఉన్నత వంశీయుడుగా భావించబడుతున్నాడని నువ్వే చెప్పావు. దైవ ప్రవక్తలంతా ఇంతే. వారు ఏ జాతిలో ప్రభవింపజేయబడినా ఉన్నత వంశీయులై ఉంటారు".

"అతని తండ్రీ తాతల్లో పూర్వం ఎవరయినా రాజులు గడిచారా? అని నేను నిన్ను అడిగితే, నీవు 'లేద'ని అన్నావు. ఒకవేళ అతని తండ్రీ తాతల్లో ఎవరయినా రాజులు చక్రవర్తులు గడిచి ఉంటే, తన వంశ పరిపాలనను ఈ రకంగా చేజిక్కించు కునేందుకు ఆ వ్యక్తి ప్రయత్నిస్తున్నాడని అనుకోవడానికి ఆస్కారం ఉండేది."

"అతనిని అనుసరించేవారి గురించి నేను నిన్ను అడిగాను– వారు నీ జాతికి చెందిన మర్యాదస్తులా? లేక బలహీనవర్గాలు (ఎక్కువగా) ఉన్నారా? అని దర్యాప్తు చేశాను. బలహీనవర్గాల వారే ఎక్కువగా ఉన్నారని నీవు అన్నావు. ఈ బలహీన వర్గాల వారే అనాదిగా దైవప్రవక్తల అనుయాయులుగా ఉన్నారు."

"దైవదౌత్యం అందకముందు అతను ఎన్నడయినా అబద్ధపు ఆరోపణలను ఎదుర్కొన్నాడా?" అని నేను నిన్ను అడిగాను. నీవు లేదని అన్నావు. దీనిద్వారా నేను అర్థం చేసుకున్నదేమిటంటే, ప్రజల వ్యవహారంలో ఎన్నడూ అబద్ధం చెప్పని వాడు, దేవుని విషయంలో ఎలా అబద్ధం చెప్పగలడు."

"అతను ప్రబోధించే జీవన ధర్మాన్ని ఒకసారి స్వీకరించిన మీదట, అతని పట్ల అనుమానానికి గురై ఎవరయినా అతని మత ధర్మం నుండి మరలిపోయాడా? (ధర్మభ్రష్టుడు అయిపోయాడా?) అని నేను నిన్ను అడిగాను. నీవు దీనిని కూడా నిరాకరించావు. విశ్వాసం ఒకసారి మానవ మనోక్షేత్రంలో గట్టిగా వ్రేళ్లూనుకున్న ప్పుడు, దాని ప్రభావం ఇలాగే ఉంటుంది."

"అతన్ని నమ్మి నడుచుకునే వారి సంఖ్య పెరుగుతున్నదా? లేక తరుగుతున్నదా? అని నేను నిన్ను అడిగాను. వారి సంఖ్య నానాటికీ పెరుగుతూనే ఉందని నీవు అన్నావు. విశ్వాసం (ఈమాన్) సంగతి సదా ఇంతే. కడకు అది పరిపూర్ణతకు చేరుకుంటుంది".

"నీవు ఎప్పుడయినా అతనితో యుద్ధం చేశావా?" అని నేను నిన్ను అడిగాను. చేశానని నీవు అన్నావు. ఫలితం ఎలా ఉండేది? అని అడిగితే ఒక్కోసారి అతను గెలిస్తే ఒక్కోసారి నీవు గెలిచినట్లు చెప్పావు. దైవప్రవక్తల వ్యవహారం కూడా ఇలాగే ఉంటుంది. వారు పరీక్షింపబడతారు. కడకు అంతిమ విజయం వారిదే అవుతుంది."

"అతనెప్పుడయినా మీ పట్ల ఒడంబడికకు విరుద్ధంగా ప్రవర్తించాడా? అని నేను నిన్ను అడిగాను. అలా జరగలేదని నువ్వే అన్నావు. దైవప్రవక్తలు ఎన్నడూ ఒడంబడికకు విరుద్ధంగా వ్యవహరించరు."

"మీ మధ్యన పూర్వం కూడా ఎవరయినా ఈ విధంగా దైవదౌత్యపు ప్రకటన చేశారా? అని నేను నిన్ను అడిగాను. లోగడ ఆ విధంగా ఎవరూ ప్రకటించుకో లేదని నువ్వే చెప్పావు. ఒకవేళ అతనికి పూర్వం ఎవరయినా అలాంటి దావా చేసి ఉంటే ఇతను కూడా ఆ వ్యక్తిని నకలు చేస్తున్నాడని భావించటానికి ఆస్కారం ఉండేది."

అబూ సుఫ్యాన్ ఇంకా ఇలా అన్నారు-

"అతను మిమ్మల్ని ఏ ఏ విషయాల గురించి ఆజ్ఞాపిస్తున్నాడు?" అని హెరిక్లస్ ప్రశ్నించగా

'నమాజ్, జకాత్, బంధుత్వ హక్కు, సౌశీల్యం గురించి ఆజ్ఞాపిస్తున్నార'ని నేనన్నాను.

చివర్లో అతను ఇలా అన్నాడు: "నీవు చెప్పేదంతా నిజమైతే, అతను ఖచ్చితంగా దైవప్రవక్తే. ఆ (అంతిమ) ప్రవక్త త్వరలోనే రానున్నాడన్న విషయం నాకూ తెలుసు. కాని అతను మీ జాతి వారిలో ప్రభవించనున్నాడన్నది తెలియదు. ఒకవేళ నేను ఆయన వరకూ చేరుకోగలనన్నది నిశ్చయమైతే నేను ఆయన్ని తప్పకుండా కలుసుకుంటాను. ఒకవేళ నేను ఆయన సేవలో ఉండి ఉంటే నేను ఆయన పాదాలను కడిగేవాణ్ణి. ఆయన రాజ్యాధికారం నా ఈ రెండు పాదాల వరకూ విస్తరించటం తథ్యం."

అబూ సుఫ్యాన్(రజి) ఇలా అన్నారు: తరువాత హెరిక్లస్ దైవప్రవక్త (సఅసమ్) లేఖను తెప్పించి, చదివాడు. ఆ లేఖలో ఇలా వుంది : "అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను-

దైవప్రవక్త(స) తరఫున, రోమను మహారాజు అయిన హెరిక్లస్ పేర వ్రాయున దేమనగా... సన్మార్గాన్ని అవలంబించే వారిపై శాంతి వర్షించుగాక! అమ్మాబాద్! నేను నిన్ను ఇస్లామ్ వైపునకు పిలుస్తున్నాను. ఇస్లామ్ స్వీకరించినట్లయితే సురక్షితంగా ఉంటావు. దైవ విధేయుడుగా పరివర్తన చెందు. అల్లాహ్ నీకు రెట్టింపు మంచి ప్రతిఫలం వొసగుతాడు. కాని ఒకవేళ నీవు గనక విముఖత ప్రదర్శిస్తే నీ ప్రజల (అవిశ్వాస) భారం కూడా నీ మీదే పడుతుంది– "గ్రంథ ప్రజలారా! మాకూ–మీకూ మధ్య సమానమైన ఒక విషయం వైపునకు రండి. (అది ఏమిటంటే) మనం అల్లాహ్‌కు తప్ప మరెవరికీ దాస్యం చేయరాదు. ఆయనకు భాగస్వాములుగా ఎవరినీ నిలబెట్టరాదు. మనలోని వారెవరూ అల్లాహ్‌ను తప్ప మరెవరినీ తమ ప్రభువుగా చేసుకోరాదు అనేది"– ఈ సందేశాన్ని స్వీకరించటానికి వారు వైముఖ్యం కనబరిస్తే, వారితో స్పష్టంగా ఇలా అను : "మేము ముస్లిములము. (కేవలం అల్లాహ్‌కే దాస్యం చేసేవారము, విధేయత చూపేవారము) అనే విషయానికి మీరు సాక్షులుగా ఉండండి". ***(3: 64)***

హెరిక్లస్ ఉత్తరాన్ని చదవటం పూర్తవగానే దర్బారులో పెద్ద కలకలం రేగింది. తరువాత మమ్మల్ని దర్బారు నుండి బయటకు పంపేశారు. బయటకు వచ్చిన తరువాత నేను నా తోటి వారిని ఉద్దేశించి, 'ఇబ్నె అబీ కబ్‌షా వ్యవహారం ఇప్పుడు ఎంత వరకు వచ్చిందంటే బనీ అస్ఫర్ చక్రవర్తి (హెరిక్లస్) కూడా ఆయనకు భయపడుతున్నాడ'ని అన్నాను.

ఈ సంఘటన తర్వాత నాకు గట్టి నమ్మకం ఏర్పడింది– దైవప్రవక్త (సఅసమ్) ప్రాబల్యం వహించటం తథ్యమని. ఎట్టకేలకు అల్లాహ్ నా మనో క్షేత్రంలో ఇస్లామ్ వెలుగును ప్రసరింపజేశాడు.

జుహ్రీ ఇలా అన్నారు: తరువాత రోము చక్రవర్తి హెరిక్లస్ రాజ్య ప్రముఖులను పిలిచి ఒక ప్రత్యేక గదిలో సమావేశమయ్యాడు– 'రోమనులారా! మీరు సదా శాశ్వతంగా సాఫల్యాన్ని, మేలును కాంక్షిస్తున్నారా? మీ ఈ సామ్రాజ్యం ఎల్లప్పుడూ మీ అధీనంలోనే ఉండాలన్నదే మీ అభిలాష? (మీ అభిలాష అదే అయినట్లయితే మీరు ఇస్లామ్ స్వీకరించండి)– అని అడిగాడు. ఉల్లేఖకుడు ఇలా అన్నారు : ఈ మాట వినగానే వాళ్ళంతా క్రూరమృగాల మాదిరిగా ద్వారం వైపునకు పరుగెత్తారు. కాని ద్వారం మూసి ఉంది. అప్పుడు హెరిక్లస్ సర్దారులందరినీ తన దగ్గరకు పిలిచి, "నేను మీకు పరీక్ష పెట్టానంతే. మీరు మీ ధర్మావలంబనలో (క్రైస్తవంలో) ఎంత

**దృఢంగా ఉంటారో చూడదలిచాను. నేను ఆశించిన ఆ వస్తువును మీలో ప్రత్యక్షంగా తిలకించాను" అన్నాడు. అప్పుడు దర్బారులోని ప్రముఖులంతా అతనికి సాష్టాంగ ప్రణామం చేసి, తమ సంతోషాన్ని వెలిబుచ్చారు.[1]**

## అధ్యాయం : 4

# సత్కార్య స్థాయి

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**(ముస్లిములారా!) మీరు అమితంగా ప్రేమించే వస్తువులను (అల్లాహ్ మార్గంలో) ఖర్చు పెట్టనంత వరకూ మీరు సత్కార్య స్థాయికి చేరుకోలేరు. మీరు ఖర్చు చేసేదంతా అల్లాహ్‌కు బాగా తెలుసు. (3: 92)**

**399) మహనీయ అనస్ బిన్ మాలిక్(రజి) ఇలా వివరించారు: మదీనాలో అబూ తల్హా (రజి) వద్ద అన్సార్లందరికన్నా ఎక్కువ ఖర్జూర చెట్లు ఉండేవి. కాగా; 'బైరుహా' ఖర్జూర తోట ఆయనకు తన తోటలన్నిటికన్నా ప్రీతికరమైనది. ఆ తోట 'మస్జిదె నబవీ'కి చాలా సమీపంలో ఉండేది. ప్రవక్త మహనీయులు(సఅసమ్) సయితం ఆ తోటలోకి వెళ్ళి అందలి తియ్యని, స్వచ్ఛమైన నీరును త్రాగేవారు. మరి, 'మీరు అమితంగా ప్రేమించే వస్తువులను (దైవ మార్గంలో) ఖర్చు పెట్టనంత వరకూ మీరు సత్కార్యస్థాయికి చేరుకోలేరు' అనే ఆయత్ అవతరించినప్పుడు అబూ తల్హా(రజి) నిలబడి, 'దైవప్రవక్తా! మీరు అమితంగా ప్రేమించే వస్తువులను (దైవ మార్గంలో) ఖర్చుపెట్టనంత వరకూ మీరు సత్కార్య స్థాయికి చేరుకోలేర'ని అల్లాహ్**

---

398-1. సుదీర్ఘమైన ఈ హదీసును ఇక్కడ తీసుకురావటంలోని ఔచిత్యం ఏమిటంటే, దైవ ప్రవక్త(స) తమ లేఖలో గ్రంథవహులను ఉద్దేశించిన ఆయత్(3: 64)ను ప్రస్తావించారు. ఈ ఆయత్ ఆధారంగా రోము చక్రవర్తిని ఇస్లామ్ వైపునకు ఆహ్వానించారు. కాని శోచనీయమైన విషయం ఏమిటంటే రోము చక్రవర్తి హెరిక్లస్ సత్యాన్ని తెలుసుకుని కూడా ఇస్లామ్‌ను స్వీకరించలేదు. తన ఆస్థాన ప్రముఖుల మనోరథాన్ని పసిగట్టి, ప్లేటు ఫిరాయించాడు. పరలోక సాఫల్యానికి బదులు ప్రాపంచిక భోగభాగ్యాల వైపునకు, రాజ్యాధికారం వైపునకు మొగ్గాడు.

అబూ సుఫ్యాన్(రజి) దైవప్రవక్త(స)ను ఇబ్నె అబీ కబ్‌షాగా పేర్కొనటం గమనార్హం. అబూ కబ్‌షా దైవప్రవక్త(స)కు పసితనంలో పాలిచ్చిన దాయి హలీమా భర్త పేరు. అందుచేత ఖురైషులు దైవప్రవక్త(స)ను అబూ కబ్‌షాగా కూడా పిలిచేవారు. అబూ కబ్‌షా ఆయన(స)కు క్షీర సంబంధ తండ్రి అవుతాడు.

**సెలవిచ్చాడు కదా! నాకు అత్యంత ప్రీతికరమైన ఆస్తి బైరుహా తోట. దీనిని అల్లాహ్ మార్గంలో సదఖా(దానం)గా సమర్పించుకుంటున్నాను. అల్లాహ్ నుండే నేను దీని పుణ్యఫలాన్ని పొందగలనన్న ఆశాభావం నాకు ఉంది. కనుక ఓ దైవప్రవక్తా! తమరు దీనిని తమకు సముచితమని తోచిన చోట వినియోగించండి' అని విన్న వించుకున్నారు. అది విని దైవప్రవక్త(స), "ఇది భలే లాభసాటి సంపద, ఇది భలే లాభసాటి సంపద. నీవు ఏదయితే నాతో అన్నావో దానిని నేను విన్నాను. నీవు ఈ సంపదను నీ సమీప బంధువుల మధ్యన పంచిపెట్టడం మంచిదని నా అభిప్రాయం" అన్నారు. దానికి అబూతల్హా 'చిత్తం దైవప్రవక్తా! అలాగే చేస్తాను' అని సమాధానమిచ్చారు. అలాగే ఆయన ఆ తోటను తన సమీప బంధువుల, రక్త సంబంధీకుల మధ్యన పంచిపెట్టారు.[1]**

**అనస్ (రజి) ఇంకా ఇలా అన్నారు: అబూ తల్హా ఆ రెండు తోటలను హస్సాన్, ఉబైల మధ్య పంచిపెట్టారు. చూడబోతే నేను వారిద్దరి కన్నా అబూ తల్హా (రజి)కు దగ్గరివాణ్ణి. కాని ఆయన నాకు ఆ తోటలో వాటా ఇవ్వలేదు.[2]**

## అధ్యాయం : 5

# యూదుల ద్రోహబుద్ధి

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**వారిని ఇలా అడుగు; "మీరు (అభ్యంతరం తెలుపుటలో) సత్యవంతులే అయితే తౌరాతును తీసుకురండి."** ***(3: 93)***

---

399-1. హదీసు మూలంలో **'జాలిక మాలున్ రాయిహూన్'** అని ఉంది. దీనికి ఈ సంపద బుద్బుద ప్రాయం, ఇది వేరైపోయేదే' అన్న అర్థం కూడా వస్తుంది.

ఆ కాలంలో కొంతమంది దానధర్మాలు చేసేటప్పుడు నాసిరకం ఆహార వస్తువులను 'అస్హాబె సుఫ్ఫా'కు ఇచ్చేవారు. దానిపై అల్లాహ్ ఈ ఆయత్(3: 92)ను అవతరింప జేశాడు. నాణ్యమైన వస్తువులు తమ వద్ద ఉన్నప్పుడు, నాసిరకం వస్తువులను దానంగా ఇవ్వటం శ్రేయస్కరం కాదన్నది ఈ ఆయత్ భావార్థం.

399-2. కారణం? హజ్రత్ అనస్(రజి) తల్లి అబూ తల్హా(రజి) నికాహ్‌లో ఉండేది. అబూ తల్హా (రజి) అనస్‌ను తన కుమారుని లాగే చూసుకునేవారు. ఆయన్ని పరాయివానిగా భావించేవారు కారు.

**400) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం : కొంతమంది యూదులు తమ తెగకు చెందిన ఒక స్త్రీని, పురుషుణ్ణి దైవప్రవక్త(సఅసమ్) సన్నిధికి తీసుకువచ్చారు. ఆ స్త్రీ పురుషులిద్దరూ వ్యభిచారానికి పాల్పడ్డారు. దైవప్రవక్త(స) యూదు పెద్దలనుద్దేశించి, "మీలో ఎవరయినా వ్యభిచారానికి ఒడిగట్టినట్లయితే వారికి మీరు విధించే శిక్ష ఏమిటి?" అని అడిగారు. దానికి వారు, 'మేము అతని ముఖానికి మసిపూసి, ఎడాపెడా కొడతాము' అని అన్నారు. "ఏమిటి, తౌరాతు గ్రంథంలో శిలాశిక్ష (రాళ్ళు రువ్వే శిక్ష) లేదా?" అని దైవప్రవక్త(స) అడగ్గా, 'మేము తౌరాతులో రాళ్ళు రువ్వే శిక్ష ఉన్నట్లుగా గమనించలేద'ని ఆ యూదులు చెప్పారు. అప్పుడు అబ్దుల్లాహ్ బిన్ సలామ్(రజి) కల్పించుకుని, 'మీరు అబద్ధం చెబుతున్నారు. మీరు మీ వాదనలో సత్యవంతులే అయితే తౌరాతును తెచ్చి చదవండి' అన్నారు. తౌరాతు తీసుకురాబడింది. యూదులలోని ఒక గొప్ప బోధకుడు, తౌరాతు గ్రంథం తీసుకుని చదవసాగాడు. కాని అతను రాళ్ళు రువ్వే శిక్ష ఉన్న వాక్యంపై తన అర చేతిని అడ్డుగా పెట్టి, దానికి ముందు, దాని తరువాత ఉన్న వాక్యాలను చదవటం మొదలెట్టాడు. శిలాశిక్ష ఉన్న వాక్యాన్ని మాత్రం చదవలేదు. అబ్దుల్లాహ్ బిన్ సలామ్ (రజి) అతని చేతిని అక్కడి నుండి జరిపి, 'ఇదేమిటి?' అని అడిగారు. అప్పుడు అక్కడున్న యూదులు అది చూసి, 'ఇది శిలాశిక్ష ఉన్న వాక్యం' అన్నారు. తరువాత దైవప్రవక్త(స) - తౌరాతు గ్రంథాన్ననుసరించి - శిలాశిక్ష విధించమని ఆజ్ఞాపించారు. మస్జిదె నబవీకి సమీపంలో జనాజా (శవ) పేటికలు ఉంచబడే స్థలంలో వారిద్దరికీ శిలాశిక్ష విధించబడింది.[1] ఆ స్త్రీపై రాళ్ళు పడకుండా ఆ పురుషుడు తన శరీరాన్ని వంచి, మాటిమాటికీ అడ్డుగా పెట్టడం నేను గమనించానని ఉల్లేఖకుడు చెప్పారు.**

## అధ్యాయం : 6

# శ్రేష్ఠ సమాజం విధులు, బాధ్యతలు

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**"ఇక నుండి ప్రపంచంలో మానవులకు మార్గం చూపటానికి, వారి సంస్క**

---

400-1. తౌరాతు గ్రంథంలోని ఆజ్ఞలను తారుమారు చేయటం, దైవాజ్ఞలను తమ స్వార్థ ప్రయోజనాలకు అనుగుణంగా మలచుకోవటం యూదులకు అలవాటు. వారు ఇక్కడ కూడా అదే పని చేశారు.

రణకూ రంగంలోకి తీసుకురాబడిన ఉత్తమ సమాజం మీరే. మీరు మంచిని చెయ్యండి అని ఆజ్ఞాపిస్తారు. చెడు నుండి ఆపుతారు. అల్లాహ్‌ను విశ్వసిస్తారు. ***(3: 110)***

**401)** మహనీయ అబూ హురైరా(రజి) **"కుంతుమ్ ఖైర ఉమ్మతిన్ ఉఖ్‌రిజత్ లిన్నాస్"** అనే ఆయత్‌పై వ్యాఖ్యానిస్తూ ఇలా అన్నారు: "మీరు మానవాళి పాలిట వేరితరులకన్నా ఉత్తములు. ఎందుకంటే మీరు (యుద్ధాలలో వారిని ఖైదీలుగా బంధించి) వారి మెడలలో సంకెళ్ళు వేసి తీసుకువస్తారు. వారేమో ఇస్లామ్‌లో ప్రవేశిస్తారు.

## అధ్యాయం : 7
## పిరికితనం బయటపడిన వేళ...

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : మీలోని రెండు వర్గాలు పిరికితనం చూపటానికి సిద్ధపడిన విషయాన్ని జ్ఞాపకం తెచ్చుకోండి.. ***(3: 122)***

**402)** జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ అన్సారీ (రజి) ఇలా వివరించారు : మా గురించి ఈ ఆయత్: "మీలోని రెండు వర్గాలు పిరికితనం చూపటానికి సిద్ధపడిన విషయాన్ని జ్ఞాపకం చేసుకోండి" అవతరించింది. "వాస్తవానికి అల్లాహ్ ఆ రెండు వర్గాల వారికి సహాయకుడుగా ఉన్నాడు"- ఆ రెండు వర్గాలు బనూ హారిసా, బనూ సలమా అని సుఫ్యాన్ పేర్కొన్నారు. యథార్థానికి ఈ ఆయత్‌లో మా బలహీనత ప్రస్తావించబడింది. కాని ఈ ఆయత్ అవతరించకపోతే అది మాకు ఎంతో అయిష్ట కరం అయి ఉండేది. ఎందుకంటే; అల్లాహ్ ఈ రెండు వర్గాలకు సహాయకుడుగా ఉన్నాడని ఇందులో చెప్పబడింది.[1]

## అధ్యాయం : 8
## నిర్ణయాధికారం

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"(ఓ ప్రవక్తా!) నిర్ణయాధికారాలలో నీకు పాత్ర ఏదీ లేదు. వారిని క్షమించే, శిక్షించే అధికారం అల్లాహ్‌కు మాత్రమే ఉంది." ***(3: 128)***

---

402-1. ఇంతకన్నా మాకు కావలసిందేమిటి? మాలో బలహీనత ఉన్న సంగతి నిజమే. కాని దేవుని తోడ్పాటు చాలా గొప్ప విషయం కదా! దాని ముందు మా లోపం బయట పడటం ఏమంత చిన్నబుచ్చుకునే విషయం కాదు.

**403)** ప్రవక్త మహనీయుల(సఅసమ్) ద్వారా తాను విన్నట్లుగా అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు: దైవప్రవక్త ఫజ్ర్ నమాజు రెండవ రకఅత్‌లో రుకూ నుండి తల ఎత్తిన తరువాత, "అల్లాహ్! ఫలానా... ఫలానా అవిశ్వాసులను శపించు" అని పలికారు. **'సమిఅల్లాహు లిమన్ హమిదహ్- రబ్బనాలకల్ హమ్ద్'** తరువాత ఆయన(స) ఆ వ్యక్తులను శపించారు. అప్పుడు అల్లాహ్ ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు– "(ప్రవక్తా!) నిర్ణయాధికారాలలో నీకు ప్రమేయం ఏమీ లేదు. వారిని క్షమించే, శిక్షించే అధికారం అల్లాహ్‌కు మాత్రమే ఉంది. ఎందుకంటే వారు దుష్ట జనులు"[1] **(3: 128).** ఈ ఉల్లేఖనాన్ని ఇస్‌హాఖ్ బిన్ రాషిద్ జుహ్రీ నుండి నకలు చేశారు.

**404)** హజ్రత్ అబూ హురైరా(రజి) వివరించారు : ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఎవరినయినా శపించదలచినప్పుడు రుకూ అనంతరం– "**సమిఅల్లాహు లిమన్ హమిదహ్- అల్లాహుమ్మ రబ్బనా లకల్ హమ్ద్**" తర్వాత– అప్పుడప్పుడూ ఇలా ప్రార్థించేవారు– "అల్లాహ్! వలీద్ బిన్ వలీద్, సలమా బిన్ హిషామ్, అయాష్ బిన్ అబీ రబీయాకు మోక్షం ప్రసాదించు. అల్లాహ్! ముజర్ తెగ వారిని గట్టిగా పట్టుకో. యూసుఫ్ (అలైహిస్సలామ్) కాలంలో వచ్చినటువంటి కరువును వారిపై తీసుకురా". ఆయన(స) హెచ్చు స్వరంతో ఈ దుఆ చేసేవారు. ఒక్కోసారి ఆయన (స) ఫజ్ర్ నమాజ్‌లో ఈ విధంగా దుఆ చేసేవారు– "ఫలానా, ఫలానా వారిని నీ కారుణ్యానికి దూరంగా ఉంచు". అరేబియాలోని కొన్ని ప్రత్యేక తెగల గురించి ఆయన(స) ఈ విధంగా అర్థించేవారు. చివరకు ఈ ఆయత్ అవతరించింది : "**లైస లక మినల్ అమ్రి షయ్‌వున్**" (నిర్ణయాధికారాలలో నీ ప్రమేయం ఏమీ లేదు).

## అధ్యాయం : 9

# మీరు పలాయనం చిత్తగించినప్పుడు...

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"జ్ఞాపకం తెచ్చుకోండి, అప్పుడు మీరు పారిపోతున్నారు. వెనక్కి తిరిగి

---

403–1. ఆయన(స) నలుగురు వ్యక్తుల పేర్లు పెట్టి శపించారు. 1) సఫ్వాన్ బిన్ ఉమయ్యా 2) సుహైల్ బిన్ అమ్ర్ 3) హారిస్ బిన్ హిషామ్ 4) అమ్ర్ బిన్ ఆస్. తరువాత ఆ నలుగురూ ఇస్లామ్ స్వీకరించారు. అల్లాహ్‌కు వారి భవిష్యత్తు గురించి తెలుసు. అందుకే వారిని శపించకూడదని అల్లాహ్ తన ప్రవక్తకు ఆదేశించాడు.

ఎవరినీ చూసే అంత స్పృహ కూడా మీకు లేదు. వెనుక నుండి ప్రవక్త మిమ్మల్ని కేక వేస్తూ ఉన్నాడు. అప్పుడు మీ వైఖరికి ప్రతిఫలంగా అల్లాహ్ మీకు దుఃఖం తరువాత దుఃఖం కలుగజేశాడు. మీరు ఏదైనా పోగొట్టుకున్నా లేదా మీకు ఏదైనా ఆపద కలిగినా మీరు చింతించకుండా ఉండేటందుకు, ఇది భవిష్యత్తులో మీ కొరకు గుణపాఠంగా ఉండాలని. అల్లాహ్‌కు మీరు చేసే పనులన్నీ తెలుసు". *(3: 153)*

**405)** బరా బిన్ ఆజిబ్(రజి) చెప్పగా తాను విన్నానని అబూ ఇస్‌హాఖ్ తెలిపారు: బరా (రజి) ఇలా చెప్పారు: ఉహుద్ యుద్ధ సందర్భంగా దైవప్రవక్త (సఅసమ్) విలుకాండ్ర పదాతి దళంపై అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి)ను అధిపతిగా నియమించారు. తరువాత చాలా మంది ముస్లింలు వెన్ను చూపి పరారయ్యారు. "వెనుక నుండి దైవప్రవక్త మిమ్మల్ని కేకవేస్తూ ఉన్నాడు" (3: 153) అనే ఆయత్ ఆ సందర్భంగానే అవతరించింది. ఆ సమయంలో దైవప్రవక్త(స) వెంట కేవలం 12 మంది సహచరులు తప్ప ఎవరూ లేరు.[1]

### అధ్యాయం : 10

## నిశ్చింత స్థితి (నిద్ర మత్తు) ఆవహించిన వేళ...

**406)** అబూ తల్‌హా (రజి) ఈ విధంగా చెప్పినట్లుగా హజ్రత్ అనస్(రజి) తెలియజేశారు : ఉహుద్ యుద్ధ రంగంలో మేము వరుసలు నిలబడి ఉన్నప్పుడు మాపై నిద్ర మత్తు ఆవరించింది (కాస్తంత కునుకు పట్టింది) ఈ కునికిపాటు కారణంగా నా ఖడ్గం నా చేతి నుండి పదేపదే క్రింద పడేది. దానిని నేను ఎత్తుకునేవాణ్ణి."

### అధ్యాయం : 11

## దైవం మరియు దైవప్రవక్త పిలుపునకు సమాధానం పలికిన విశ్వాసుల ప్రతిఫలం

క్షతగాత్రులయిన తరువాత కూడా అల్లాహ్ పిలుపునకు సమాధానమిచ్చి నటువంటి విశ్వాసుల ప్రతిఫలం - వారిలో సజ్జనులు, భయభక్తులు కలవారు అయిన వ్యక్తుల కొరకు గొప్ప ప్రతిఫలం ఉంది. *(3: 172)*

---

405-1. ఉహుద్ యుద్ధంలో ముస్లింలకు అపారమైన నష్టం వాటిల్లింది. 70 మంది సహాబా అమరగతి నొందారు. దైవప్రవక్త(స) సూచనను విలుకాండ్రు పాటించకుండా తమ స్వంత అభిప్రాయంతో నిర్ణయం గైకొనటం దీనికి ప్రధాన కారణం.

**"మీకు వ్యతిరేకంగా పెద్ద సైన్యాలు మోహరించి ఉన్నాయి. వాటికి భయ పడండి" అని అన్నప్పుడు, దానిని విని వారి విశ్వాసం ద్విగుణీకృతమైంది. వారు ఇలా సమాధానం చెప్పారు: "మాకు అల్లాహ్ చాలు. ఆయనే శ్రేష్టుడైన కార్య సాధకుడు."** ***(3: 173)***

**407) ఇబ్నె అబ్బాస్(రజి) కథనం: ఇబ్రాహీమ్(అలైహిస్సలామ్)ను అగ్నిగుండంలో పడవేస్తున్నప్పుడు, ఆయన "హస్బునల్లాహు వ నీ'మల్ వకీల్" అనే కలిమాను పఠించారు. ప్రజలు, అంటే ఖురైషులు మాకు వ్యతిరేకంగా భారీ సైన్యాన్ని సమీకరిస్తున్నారని జనులు ముస్లింలను భయపెట్టినప్పుడు మహనీయ ముహమ్మద్(స) కూడా సరిగ్గా ఇదే వచనాన్ని పలికారు. ఆ సమయంలో ముస్లింల విశ్వాసం ద్విగుణీకృతం అయింది. వారిలా అన్నారు: "మాకు అల్లాహ్ చాలు. ఆయనే అత్యుత్తమ కార్యసాధకుడు."**

**408) ఇబ్నె అబ్బాస్ (రజి) ఇలా వివరించారు: ఇబ్రాహీమ్ (అలైహిస్స లామ్)ను అగ్నికి ఆహుతి చేస్తున్నప్పుడు, ఆయన నోట వెలువడిన తుది వాక్కు "హస్బియల్లాహు వ నీ'మల్ వకీల్" (నా సహాయం కొరకు అల్లాహ్ ఒక్కడే చాలు. ఆయనే అత్యుత్తమ కార్యసాధకుడు)[1]**

## అధ్యాయం : 12

# పిసినిగొట్టులకు హెచ్చరిక

<u>దైవోపదేశం</u>

**అల్లాహ్ తన అనుగ్రహాన్ని విరివిగా ప్రసాదించినప్పటికీ పిసినారితనం చూపేవారు, ఈ పిసినారితనం తమకు మేలైనదని భావించరాదు.[1] కాదు, ఇది వారి**

---

408-1. శుభప్రదమైన ఈ కలిమాలో దేవుని ఏకత్వం, దైవంపై భరోసా వ్యక్తపరచబడింది. అందుకే ఇది శ్రేష్టమైన కలిమా (వచనం)గా పరిగణించబడింది. దీనిని పలకటం వల్ల కష్టకాలంలో మనిషి సంకల్పం దృఢతరం అవుతుంది. దీనిని తరచూ పఠిస్తూ ఉంటే, దైవ సహాయం వెన్నంటి ఉంటుంది. దేవుని తోడ్పాటు వల్ల ప్రతి కష్టం సులభతరం అవుతుంది.

12-1. అంటే తమకు ప్రాప్తమై ఉన్న సిరిసంపదలు తమ పాలిట శ్రేయస్కరమైనవని ఈ పిసినారులు భావించరాదు. పైగా ఇది వారి పాలిట ఎంతో హానికరం. ప్రళయదినాన ఆ సంపదను కంఠపాశంగా చేసి వారి మెడలలో వేయటం తథ్యం.

కొరకు ఎంతో హానికరమయినది. వారు తమ లోభత్వంతో కూడబెడుతూ ఉన్నదే ప్రళయం నాడు వారి పాలిట కంఠపాశం అవుతుంది. భూమ్యాకాశాల వారసత్వం అల్లాహ్‌కే చెందుతుంది. మీరు ఏదైతే చేస్తారో అది అల్లాహ్‌కు తెలుసు. ***(3: 180)***

**409)** హజ్రత్ అబూ హురైరా(రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఇలా ప్రవచించారు : "ఎవరికయితే అల్లాహ్ సిరిసంపదలు ప్రసాదించినప్పటికీ, అతను జకాత్‌ను ఇవ్వలేదో (పరలోకంలో) అతని సంపద అత్యంత విషపూరితమయిన సర్పం రూపంలో ప్రస్ఫుటం అవుతుంది. దాని కళ్ళ (తల) పైన రెండు టీకాలు ఉంటాయి. ఆ సర్పం అతని కంఠంలో కంఠపాశం మాదిరిగా తొడిగించబడుతుంది. ఆ సర్పం అతని రెండు దవడల్ని పట్టుకుని, 'నేనే నీ సంపదను. నేనే నీ ఖజానాను' అని అంటుంది. తరువాత ఆయన(స) ఈ ఆయత్‌ను పఠించారు : "అల్లాహ్ తన అనుగ్రహాన్ని విరివిగా ప్రసాదించినప్పటికీ పిసినారితనం చూపేవారు, ఈ పిసినారితనం తమకు మేలైనదని భావించరాదు. కాదు, ఇది వారి కొరకు ఎంతో హానికరమయినది. వారు తమ లోభత్వంతో కూడబెడుతూ ఉన్నదే ప్రళయం నాడు వారి పాలిట కంఠపాశం అవుతుంది. భూమ్యాకాశాల వారసత్వం అల్లాహ్‌కే చెందుతుంది. మీరు ఏదైతే చేస్తారో అది అల్లాహ్‌కు తెలుసు"[1] ***(3: 180)***

## అధ్యాయం : 13

# గ్రంథవహుల, ముష్రిక్కుల నోట కష్టం కలిగించే మాటలు విన్నప్పుడు....

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"గ్రంథ ప్రజల నుండీ, ముష్రిక్కుల నుండీ మీరు కష్టం కలిగించే మాటలు అనేకం వింటారు." ***(3: 186)***

**410)** ఉసామా బిన్ జైద్(రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఒక గాడిద వీపుపై ఫదక్‌లో తయారైన ముతక దుప్పటిని పరచి, దానిపై స్వారీ అయ్యారు. ఉసామా బిన్ జైద్(రజి)ను కూడా తన వెనుక కూర్చోబెట్టుకున్నారు.

---

409-1. ధనాన్ని కూడబెట్టి, వెండీ బంగారాలను ప్రోగుచేసి- ధర్మం ప్రకారం- జకాత్ చెల్లించని శ్రీమంతులకు ఈ ఆయత్ హెచ్చరిక వంటిది. వారి ఈ సంపద ప్రళయదినాన విషసర్పంగా మారి వారి మెడలను చుట్టుకుంటుంది.

ఆయన(స) బనూ హారిస్ బిన్ ఖజ్రజ్ వాడకు సాద్ బిన్ ఉబాదా(రజి)ను పరామర్శించడానికి బయలుదేరారు. బద్ర్ సంగ్రామానికి పూర్వం జరిగిన సంఘటన ఇది. దారిలో ఒక సమావేశ స్థలి మీదుగా ఆయన(స) సాగిపోతున్నారు. ఆ సమావేశంలో (కపటి) అబ్దుల్లాహ్ బిన్ ఉబై కూడా ఉన్నాడు. అబ్దుల్లాహ్ బిన్ ఉబై పైకి ఇస్లాం స్వీకరించక పూర్వం జరిగిన వృత్తాంతమిది. ఆ సమావేశంలో ముస్లింలు, విగ్రహారాధకులు, యూదులు కూడా ఉన్నారు. వారిలో అబ్దుల్లాహ్ బిన్ రవాహ (రజి) కూడా ఉన్నారు. వాహనం డెక్కల రాపిడి వల్ల దుమ్మురేగి సమావేశంలో కూర్చున్న వారిపై పడింది. అబ్దుల్లాహ్ బిన్ ఉబై దుప్పటితో తన ముక్కు మూసుకుని, 'మాపై దుమ్ము పడవేయకు' అన్నాడు. అంతలోనే దైవప్రవక్త(స) వారిని సమీపించి, సలామ్ చేశారు. వాహనం నుంచి దిగి, సమావేశమై ఉన్న వారందరినీ అల్లాహ్ వైపునకు ఆహ్వానించారు. ఖుర్‌ఆన్ పారాయణం చేశారు. అది విని అబ్దుల్లాహ్ బిన్ ఉబై ఇలా అన్నాడు : "ఇప్పుడు మీరు చదివి వినిపించిన వాక్కు కన్నా మంచి వాక్కు ఉండదు. ఈ వాక్కు ఎంత మంచిదైనప్పటికీ, తమరిలా మాటిమాటికీ మా సమావేశాలకు వచ్చి, మమ్మల్ని ఇబ్బంది పెట్టకండి. మీరు మీ ఇంటి పట్టునే ఉండండి. మీ దగ్గరకు వచ్చిన వారికి మాత్రమే మీ మాట వినిపిస్తూ ఉండండి."

అప్పుడు (ప్రవక్త ప్రియ సహచరుడైన) అబ్దుల్లాహ్ బిన్ రవాహ (రజి) జోక్యం చేసుకుని, "లేదు, దైవప్రవక్తా! మీరు మా సమావేశాలకు తప్పకుండా రావాలి. మీ రాక మాకు సంతోషదాయకం" అన్నారు. సభికుల మధ్య మాటా మాటా పెరిగింది. వారు పరస్పరం ఘర్షణ పడేవరకూ వచ్చింది వ్యవహారం. కాని ఆయన(స) వారందరినీ శాంతపరిచారు. చివరకు అందరూ శాంతించారు. తరువాత ఆయన(స) తన వాహనంపై కూర్చొని సాద్ బిన్ ఉబాదా (రజి) వద్దకు వెళ్ళారు. సాద్(రజి) ముందు కూడా దైవప్రవక్త(స) జరిగినదంతా ప్రస్తావించి, "సాద్! అబూ హుబాబ్ ఏమన్నాడో నీవు విన్నావా? అతను ఈ విధంగా అన్నాడు" అని చెప్పారు. అది విని సాద్ బిన్ ఉబాదా(రజి) ఇలా అన్నారు: 'దైవ ప్రవక్తా! తమరు అతనిని క్షమించండి. అతనిని పట్టించుకోకండి. మీపైన గ్రంథాన్ని అవతరింపజేసిన వాని సాక్షిగా! అల్లాహ్ మీ వద్దకు సత్యం పంపాడు. ఈ పుర (మదీనా) ప్రజలు మీ రాకకు పూర్వం అతనికి (అబ్దుల్లాహ్ బిన్ ఉబైకి) కిరీటం

తొడిగించి, తలపాగా చుట్టి తమ నాయకునిగా చేసుకుందామని చెప్పుకున్నారు. కాని అల్లాహ్ మిమ్మల్ని సత్యంతోపాటు పంపి, అసత్యాన్ని నిలువరించడంతో అతను చిర్రెత్తి పోయాడు. ఈ రోజు అతను మీ యెడల అవలంబించిన వైఖరికి కారణం ఇదే.'

దైవప్రవక్త (స) అతనిని క్షమించారు. దైవప్రవక్త(స), ఆయన సహచర మాన్యులు, ముష్రిక్కులు, గ్రంథవహుల బాధాకరమైన మాటల్ని విని సహించేవారు. వారి పట్ల సడలింపుల వైఖరిని అవలంబించేవారు. ఈ నేపథ్యంలోనే ఈ ఆయత్ అవతరించింది: "(ముస్లిములారా!) గ్రంథ ప్రజల నుండీ, ముష్రిక్కుల నుండీ మీరు కష్టం కలిగించే మాటలు వింటారు. ఈ పరిస్థితులలో మీరు గనక సహనంతో, భయభక్తులతో నిలకడగా ఉంటే, అది ఎంతో సాహసంతో కూడుకున్న కార్యం." అల్లాహ్ ఇంకా ఇలా సెలవిచ్చాడు : గ్రంథ ప్రజలలోని అనేకులు మిమ్మల్ని మీరు విశ్వసించిన మీదట మళ్ళీ అవిశ్వాసులుగా చెయ్యాలనుకుంటున్నారు..." దైవాదేశానుసారం దైవప్రవక్త(స) సదా అవిశ్వాసుల పట్ల మన్నింపుల వైఖరినే అవలంబించారు. ఎట్టకేలకు అల్లాహ్ అవిశ్వాసులతో యుద్ధం చేసేందుకు ఆయన(స)కు ఆనతిని ప్రసాదించాడు. ఆయన(స) బద్ర్ సంగ్రామానికి సిద్ధమైనప్పుడు అల్లాహ్ ప్రణాళికననుసరించి ఖురైషులలోని అవిశ్వాస ప్రముఖులెందరో వధించబడ్డారు. అప్పుడు అబ్దుల్లాహ్ బిన్ ఉబై, విగ్రహారాధకులైన ముష్రిక్కులు పరస్పరం సంప్రతించుకుని, అందరూ కట్టకట్టుకుని వచ్చి దైవప్రవక్త(స) సమక్షంలో విధేయతా ప్రమాణం చేసి ఇస్లామ్‌లో ప్రవేశించారు.[1]

## అధ్యాయం : 14

# తాము చేయని పనులకు కూడా తమకు జేజేలు లభించాలని కోరుకునేవారు...

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"తాము చేసిన పనులకు సంబరపడేవారు, యథార్థంగా తాము చేయని

410-1. ముష్రిక్కులు, గ్రంథం కల ప్రజలు నిత్యం మిమ్మల్ని కవ్విస్తూ, బాధిస్తూ ఉంటారనీ, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ముస్లిములను సావధానపరచటం జరిగింది. వారి తియ్యని మాటలకు మీరు మోసపోరాదు. పైగా సహనంతో, స్థయిర్యంతో వారి ఎత్తుగడలను తిప్పికొట్టండి, చివరకు విజయం మిమ్మల్నే వరిస్తుంది అని బోధించడం జరిగింది.

**పనులకు కూడా తమకు ప్రశంసలు లభించాలని కోరేవారు శిక్షను తప్పించుకుంటా రని భావించకండి." *(3: 188)***

**411) అబూ సయీద్ ఖుద్రీ (రజి) వివరించారు: దైవప్రవక్త(సఅసమ్) హయాంలో మదీనాలో కొందరు కపట విశ్వాసులు (మునాఫిఖీన్) ఉండేవారు. దైవప్రవక్త(స) దైవమార్గంలో పోరాటానికి వెళ్ళినప్పుడు, వీళ్ళు మదీనాలోనే ఉండిపోయేవారు. తాము అలా వెనుక ఉండిపోయినందుకు సంతోషపడేవారు. కాని దైవప్రవక్త(స) తిరిగి వచ్చిన మీదట ఆయన(స) సమక్షంలో హాజరై ప్రమాణం చేసి మరీ సాకులు చెప్పేవారు. తమ ఈ నిర్వాకానికి గాను అంటే తాము చేయని పనికిగాను తమకు ప్రశంసలు లభించాలని ఆశించేవారు. దీనిపైనే అల్లాహ్ ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు. "తాము చేసిన పనులకు సంబరపడేవారు, యథా ర్థంగా తాము చేయని పనులకు తమకు ప్రశంసలు లభించాలని కోరేవారు శిక్షను తప్పించుకుంటారని భావించకండి. వాస్తవానికి వారి కొరకు బాధాకరమయిన శిక్ష సిద్ధంగా ఉంది."[1] *(3: 188)***

**412) అల్‌ఖమా బిన్ వక్కాస్ అందజేసిన సమాచారం : మర్వాన్ బిన్ హకమ్ (మదీనా గవర్నర్‌గా ఉన్న కాలంలో) తన ఆస్థాన సేవకుణ్ణి పిలిచి, "రాఫే! ఇబ్నె అబ్బాస్(రజి) దగ్గరకు వెళ్ళి అడుగు : 'వలా తహ్‌సబన్నల్లజీన...' (3: 188) అనే ఆయత్ ప్రకారమైతే మనందరికీ శిక్షపడాలి. ఎందుకంటే మనలోని ప్రతి ఒక్కడూ తనకు ప్రాప్తమైన వర ప్రసాదాల పట్ల సంతోషపడుతున్నాడు. తాను చేయని పనులకు కూడా తనకు ప్రశంసలు లభించాలని కోరుకుంటున్నాడు (దీనికి ఆయన ఏమంటారో అడుగు)" అని ఆదేశించాడు.**

**అబూ రాఫే ఇబ్నె అబ్బాస్(రజి) సన్నిధికి వెళ్ళి అడిగితే ఆయన ఇలా బదు లిచ్చారు: 'ముస్లిములైన మీకు ఈ ఆయత్ గురించి అంత బెంగ ఎందుకు? ఇది**

---

411-1. ఇలాంటి ద్వంద్వ స్వభావులు, ప్రదర్శనాబుద్ధి కలవారు నేటికీ మన మధ్యన ఉన్నారు. అడుగడుగునా వారి కపట చేష్టలు వ్యక్తమవుతూ ఉంటాయి. వారు నమాజ్ చేయరు. చేసినా కసమసలాడుతూ చేస్తారు. సొసైటీలోని ప్రముఖులకు చూపించటానికి నమాజ్ చేస్తారు. తమ ప్రవర్తనపై సిగ్గుపడవలసింది పోయి, తమను గొప్ప సదాచార సంపన్నులుగా నిరూపించుకునే యత్నం చేస్తారు. ఇలాంటి వారందరికీ ఈ ఆయత్ వర్తిస్తుంది.

యూదులకు సంబంధించిన వ్యవహారం. దైవప్రవక్త(స) ఒకసారి యూదులను పిలిచి (వారి వద్ద ఉన్న గ్రంథంలోని) ఒక విషయం గురించి ప్రశ్నించారు. దానికి వారు అసలు విషయాన్ని కప్పిపుచ్చి, తప్పుడు విషయాన్ని విశదీకరించారు. అంతటితో ఊరుకోకుండా, దైవప్రవక్త(స) వేసిన ప్రశ్నకు తాము చెప్పిన సమాధానంపై తమకు ప్రశంసలు లభించాలని ఆశించారు. మరోవైపున వారు యథార్థాన్ని కప్పిపుచ్చి కూడా దానిపై సంబరపడ్డారు. ఆ తరువాత ఇబ్నె అబ్బాస్ (రజి) ఈ ఆయత్‌ని పారాయణం చేశారు: "గ్రంథోపదేశాలను ప్రజలలో వ్యాపింప జేయాలని, వాటిని మరుగుపరచరాదని, అల్లాహ్ వారితో చేయించిన ప్రమాణాన్ని కూడా గ్రంథం కల ప్రజలకు జ్ఞాపకం చేయండి. కాని వారు గ్రంథాన్ని తమ వీపుల వెనుక పడవేశారు. స్వల్ప మూల్యానికి దానిని అమ్మివేశారు. వారు చేసే ఈ వ్యాపారం ఎంత చెడ్డది! తాము చేసిన పనులకు సంతోషపడేవారు యథార్థంగా తాము చేయని పనులకు తమకు ప్రశంసలు లభించాలని కోరేవారు శిక్షను తప్పించుకుంటారని భావించకండి." ***(3: 187,188)***

**413)** హుమైద్ బిన్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ కథనం: మర్వాన్ తన ఆస్థాన సేవకుడైన రాఫేతో ఇలా అన్నాడు: తరువాత ఆయన ఇదే హదీసును వివరించారు.

## అధ్యాయం : 15

# విజ్ఞులకు సూచనలు

పరమ ప్రభువు ఇలా సెలవిచ్చాడు :

"భూమీ, ఆకాశాల సృష్టిలో రేయింబవళ్ళు ఒక దాని తరువాత ఒకటి రావడంలో, నిలుచున్నా, కూర్చున్నా, పరుండినా అన్ని వేళలా అల్లాహ్‌ను స్మరించే వారున్నూ, భూమీ, ఆకాశాల నిర్మాణం గురించి చింతన చేసేవారున్నూ అయిన వివేకవంతులకు ఎన్నో సూచనలు ఉన్నాయి." ***(3: 190)***

**414)** మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) తెలిపారు: నేను బాల్యంలో ఉన్నప్పుడు ఒకరాత్రి నా పినతల్లి మైమూనా (రజి అల్లాహు అన్హా) ఇంటికి వెళ్ళాను. దైవప్రవక్త(స) మైమూనాతో కాస్సేపు మాట్లాడి నిద్రపోయారు. రాత్రి చివరి భాగం (మూడవ వంతు రాత్రి) మిగిలి ఉండగా ఆయన(స) లేచి కూర్చున్నారు. తరువాత ఆకాశం వైపు దృష్టిని సారించి, "భూమీ, ఆకాశాల సృష్టిలో, రేయింబవళ్ళు ఒకదాని తరువాత ఒకటి రావటంలో... వివేకవంతులకు ఎన్నో సూచనలు

**ఉన్నాయి." (3: 190) అనే ఆయత్‌ను పఠించారు. ఆ తరువాత ఆయన(స) నిలబడి వుజూ చేశారు. మిస్వాక్ చేశారు. తరువాత 11 రకతుల (తహజ్జుద్, విత్ర్) నమాజ్ చేశారు. బిలాల్ ఫజ్ర్ నమాజ్ కొరకు అజాన్ ఇవ్వగానే ఆయన(స) రెండు రకతుల (సున్నత్) నమాజ్ చేసి మస్జిద్‌కు వెళ్ళారు. (సామూహికంగా) ఫజ్ర్ నమాజ్ చేయించారు.**

## అధ్యాయం : 16

# చింతన చేసేవారు

పరమ పవిత్రుడైన అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"…. వారు నిలుచున్నా, కూర్చున్నా, పరుండినా- అన్ని వేళలా అల్లాహ్‌ను స్మరిస్తారు. భూమ్యాకాశాల సృష్టి గురించి చింతన చేస్తారు." ***(3: 190)***

**415) ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా వివరించారు: నేను ఒక రాత్రి నా పినతల్లి మైమూనా(ర.అన్హా) ఇంట్లో పడుకున్నాను. ఆ రాత్రి ఎలాగయినా సరే దైవప్రవక్త (సఅసమ్) నమాజును చూడాలన్నది నా సంకల్పం. నా పిన్నమ్మ ఆయన (స) కొరకు పరుపు పరిచింది. ఆయన(స) పొడవాటి ఆ దుప్పటిని కప్పుకుని నిద్రించారు. అర్థరాత్రి గడిచిన తరువాత ఆయన(స) మేల్కొన్నారు. తన ముఖారవిందంపై చేతులు స్పర్శించి, నిద్ర మత్తును దూరం చేసుకున్నారు. పిమ్మట ఆలె ఇమ్రాన్ సూరాలోని చివరి పది ఆయత్‌లను పఠించారు. ఆ తర్వాత ఆయన(స) ఒక నీళ్ళ తిత్తి వద్దకు వెళ్ళి, అందులోని నీరు తీసుకుని వుజూ చేశారు. వెంటనే నమాజ్‌కు ఉపక్రమించారు. నేను కూడా ఆయనతోపాటే నిలబడ్డాను. ఆయన చేసిన పనులన్నీ కానిచ్చాను (అంటే తహారత్, వుజూ చేసి నమాజు కొరకు నిలబడ్డాను). ఆయన ప్రక్కనే నమాజులో నిలబడ్డాను. ఆయన(స) తన కుడిచేతిని నా తల మీద నిమిరి, నా చెవిని (వాత్సల్యంతో) పట్టుకుని మెలేశారు. తరువాత ఆయన(స) రెండు రకతుల (తహజ్జుద్) నమాజ్ చేశారు. ఆ తర్వాత మరో రెండు రకతులు చేశారు. ఆ తరువాత మరో రెండు రకతుల నమాజ్ చేశారు. ఆ తరువాత మరో రెండు రకతుల నమాజ్ చేశారు; ఆ తరువాత మరో రెండు రకతుల నమాజ్ చేశారు. ఆ తర్వాత రెండు రకతుల నమాజ్ చేశారు. ఆపైన 'విత్ర్'ను ఆచరించారు (ఆ విధంగా తహజ్జుద్ నమాజులు 12 రకతులు, విత్ర్ ఒక రకఅత్, మొత్తం 13 రకతులు అయ్యాయి).**

## అధ్యాయం : 17

# దుర్వర్తనులకు సహాయకుడు ఉండడు

"ప్రభూ! నీవు ఎవడినైతే నరకంలో పడవేస్తావో వాణ్ణి వాస్తవానికి అధో గతికి, అవమానానికీ గురిచేసినట్లే. ఇక ఇటువంటి దుర్వర్తనులకు సహాయం చేసేవాడెవడూ ఉండడు." *(3: 192)*

**416)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) తన బానిస యగు కురైబ్‌కు ఇలా తెలియజేశారు: తాను ఒకరోజు రాత్రి దైవప్రవక్త(సఅసమ్) సతీమణి అయిన హజ్రత్ మైమూనా(ర.అ) ఇంట ఆగారు. ఆమె గారు ఇబ్నె అబ్బాస్(రజి)కు పినతల్లి. ఇబ్నె అబ్బాస్ ఇలా అన్నారు: నేను పడక వెడల్పు భాగంలో పడు కున్నాను. దైవప్రవక్త(స), ఆయన సతీమణి పరుపు పొడవు భాగంలో శయనిం చారు. తరువాత ఆయన(స) నిద్రించారు. అర్ధరాత్రి లేదా ఇంకాస్త ఎక్కువ సమయం గడిచాక ఆయన(స) మేల్కొని, అరచేతులతో ముఖారవిందాన్ని తుడుచుకుని నిద్ర మత్తును తొలగించారు. తరువాత ఆలె ఇమ్రాన్ సూరాలోని చివరి పది ఆయత్‌లు పారాయణం చేశారు. ఆ తరువాత ఆయన(స) లేచి వ్రేలాడుతున్న నీళ్ళ తిత్తి దగ్గరకు వెళ్ళారు. అందులోని నీటితో ఆయన(స) బహు చక్కగా– నియమాను సారం– వుజూ చేసి, నమాజ్ చేయడానికి నిలబడ్డారు. నేను కూడా ఆయన(స) మాదిరిగానే వుజూ చేసి, నమాజ్ కొరకు వెళ్ళి ఆయన(స) ప్రక్కనే నిలబడ్డాను. దైవప్రవక్త తన కుడి చేతిని నా తలపై ఉంచారు. మరి ఆ చేత్తోనే ప్రేమతో నా చెవిని మెలేశారు. తరువాత ఆయన(స) రెండు రకతుల నమాజ్ చేశారు. తరువాత మరో రెండు రకతులు చేశారు. తరువాత మరో రెండు రకతుల నమాజ్ ఆచరిం చారు. ఆ తరువాత మరో రెండు రకతులు చేశారు. ఆపైన మరో రెండు రకతులు చేశారు. పిదప మరో రెండు రకతుల నమాజ్ చేశారు. చివర్లో విత్ర్ నమాజ్ చేశారు (ఆ విధంగా మొత్తం 13 రకతులు అయ్యాయి). ఈ నమాజ్ చేయటం పూర్తయ్యాక ఆయన(స) కొద్దిసేపు పడుకొని విశ్రాంతి తీసుకున్నారు. తరువాత ముఅజ్జిన్ వచ్చాక ఆయన(స) లేచి రెండు రకతుల తేలికపాటి (ఫజ్ర్ సున్నత్) నమాజు చేశారు. ఫజ్ర్ నమాజ్ కొరకు మస్జిద్‌కు వెళ్ళి, ప్రాతఃకాలపు (సామూహిక) నమాజు చేయించారు.[1]

---

416–1. పై ఉల్లేఖనంలో దైవప్రవక్త(స) తహజ్జుద్ నమాజ్ కొరకు రాత్రి లేవడం, ఆలె ఇమ్రాన్ సూరాలోని చివరి పది ఆయత్‌లు పఠించటం ప్రస్తావించబడ్డాయి. ఇదే ఈ అధ్యాయంలోని ప్రధానాంశం.

## అధ్యాయం : 18

# స్వామీ! మా వల్ల జరిగిన తప్పులను మన్నించు

"ప్రభూ! మేము విశ్వాసం వైపునకు పిలిచేవాని[1] పిలుపు విన్నాము. మీ ప్రభువును విశ్వసించండి అని అతను అనేవాడు. మేము అతని సందేశాన్ని స్వీకరించాము. కనుక మా స్వామీ! మేము చేసిన తప్పులను మన్నించు. మాలో ఉన్న చెడులను దూరం చెయ్యి. సజ్జనులతోపాటు మా జీవితానికి ముగింపు ప్రసాదించు. దేవా! నీవు నీ ప్రవక్తల ద్వారా చేసినటువంటి బాసలను మా విషయంలో నెరవేర్చు. ప్రళయంనాడు మమ్మల్ని పరాభవానికి గురి చెయ్యకు. నిస్సందేహంగా నీవు నీ వాగ్దానాలకు భిన్నంగా వ్యవహరించవు." *(ఆలె ఇమ్రాన్ : 194)*

**417)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) ఇలా తెలియజేశారు: తాను ఒకరోజు రాత్రి దైవప్రవక్త(స) సతీమణి, తన పిన తల్లియగు మైమూనా(రజి) ఇంటికి వెళ్ళారు. ఆయన ఇలా అన్నారు– 'నేను పరుపు వెడల్పు భాగంలో పడుకున్నాను. దైవప్రవక్త(స) మరియు ఆయన సతీమణి పరుపు పొడవు వైపు శయనించారు. ఆయన(స) తొందరగానే నిద్రించారు. అర్ధరాత్రి గడిచాక లేదా దానికన్నా కొంచెం ముందు లేదా దానికన్నా కొంత సమయం తరువాత ఆయన(స) మేల్కొన్నారు. తన ముఖంపైనున్న నిద్ర ప్రభావాన్ని దూరం చేయడానికి తన చేతుల్ని ముఖంపై త్రిప్పుకోసాగారు. ఆలె ఇమ్రాన్ సూరాలోని చివరి పది ఆయత్‌లను పారాయణం చేశారు. ఆ తరువాత ఆయన (స) నీళ్ళ తిత్తి వద్దకు వెళ్ళి, నియమబద్ధంగా బహుచక్కగా వుజూ చేశారు. ఆ తరువాత నమాజ్ కొరకు నిలబడ్డారు. నేను కూడా లేచి, దైవప్రవక్త(స)లాగానే వుజూ చేసి, నమాజు చేసేందుకు ఆయన (స) ప్రక్కనే నిలబడ్డాను. దైవప్రవక్త(స) తన కుడిచేతిని నా తలపై నిమిరారు. (ప్రేమతో) నా చెవిని పట్టుకుని, మెలేయసాగారు. తరువాత ఆయన రెండు రకతుల నమాజ్ చేశారు. ఆ తరువాత రెండు రకతులు చేశారు. ఆ తరువాత మరో రెండు రకతుల నమాజ్ ఆచరించారు. ఆ తరువాత మరో రెండు రకతులు చేశారు. ఆ తరువాత మరో రెండు రకతులు చేశారు. చివర్లో విత్ర్ చేశారు. తరువాత కాస్సేపు పడుకుని విశ్రాంతి తీసుకున్నారు. మరి మౌజన్ తన దగ్గరకు వచ్చిన తరువాత రెండు రకతుల తేలికపాటి (సున్నత్) నమాజ్ ఆచరించారు. పిమ్మట బయటికి– మస్జిద్‌కి– వెళ్ళి ఫజ్ర్ నమాజ్ చేయించారు.

---

18–1. ఇక్కడ 'పిలిచేవాడు' అంటే దైవప్రవక్త ముహమ్మద్(స) అన్నమాట.

# 4. అన్ నిసా సూరా వ్యాఖ్యానం

## అధ్యాయం : 1

## అన్యాయానికి దూరంగా ఉండేందుకు

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

“అనాథులకు న్యాయం చెయ్యలేమనే భయం మీకు కలిగితే, మీకు నచ్చిన స్త్రీలను ఇద్దరేసి గాని, ముగ్గురేసి గాని, నలుగురేసి గాని వివాహం చేసుకోండి. అయితే వారితో న్యాయంగా వ్యవహరించలేమనే భయం మీకుంటే, అప్పుడు ఒకామెనే చేసుకోండి లేదా మీ స్వాధీనంలోకి వచ్చిన స్త్రీలను దాంపత్యంలోకి తీసుకోండి. అన్యాయానికి దూరంగా ఉండేందుకు ఇది ఉత్తమ మార్గం.” *(అన్ నిసా: 3)*

**418)** విశ్వాసుల మాతృమూర్తి హ(జ్రత్ ఆయిషా(ర.అ) వివరించారు: ఒక వ్యక్తి పరిపోషణలో ఒక అనాథ బాలిక ఉండేది. తరువాత ఆ వ్యక్తి ఆ అమ్మాయిని నికాహ్ చేసుకున్నాడు. ఆ అనాథ అమ్మాయి ఆస్తిలో భాగంగా ఒక ఖర్జూరతోట ఉండేది. ఆ తోట కారణంగానే ఆ వ్యక్తి ఆ అమ్మాయి పోషణాభారం వహించేవాడు. నిజానికి అతని మనసులో ఆ అమ్మాయి పట్ల అంతగా ఆసక్తి, ఆకర్షణ లేదు. ఈ నేపథ్యంలోనే ఈ ఆయత్ అవతరించింది: **“అనాథులకు న్యాయం చెయ్యలేమనే భయం మీకు కలిగితే...”**

ఇబ్నె జురైజ్ ఇలా అన్నారు: ఆ అమ్మాయికి ఆ ఖర్జూర చెట్లలోనూ, ఇతర ఆస్తిపాస్తుల్లోనూ ఆ పురుషునితో భాగస్వామ్యం ఉండేది.

**419)** ఉర్వా బిన్ జుబైర్ తెలియజేశారు: ఆయన హ(జ్రత్ ఆయిషా(ర.అ)ను **‘అనాథులకు న్యాయం చెయ్యలేమనే భయం మీకు కలిగితే...’** (4:3) అనే ఆయత్‌కు అర్థం ఏమిటని అడిగితే ఆమె ఇలా అన్నారు: “ఒరేయ్ నా మేనల్లుడా! దీని అర్థం

ఏమిటంటే, ఒక అనాథ బాలిక, ఒక సంరక్షకుని పోషణలో ఉంటే, ఆ అమ్మాయి అతని ఆస్తిపాస్తుల్లో భాగస్వామిని కూడా అయివుంటే, ఆ వ్యక్తికి ఆ అమ్మాయి ఆస్తిపాస్తులు, అందచందాలు నచ్చి ఆమెను వివాహమాడగోరితే న్యాయబద్ధంగా ఆమెకు పూర్తి మహర్ సొమ్మును చెల్లించాలి (అంటే ఇతరులు ఆమెకు ఎంత మహర్ ఇస్తారో అంత సొమ్ము మహర్‌గా ఇవ్వాలి). ఒకవేళ ఇవ్వదలచకపోతే, అల్లాహ్ ఈ అన్యాయాన్ని అరికట్టదలిచాడు. మీ పోషణలో ఉన్న అనాథ బాలికల విష యంలో న్యాయం చేయలేమన్న అనుమానం మీకు ఉన్నప్పుడు అసలు వారిని వివా హమే చేసుకోవద్దు. ఇతర స్త్రీలను వివాహమాడే మార్గం మీ కొరకు ఎలాగూ తెరచుకుని ఉంది.

ఉర్వా కథనం ప్రకారం అమ్మ ఆయిషా (ర.అ) ఇంకా ఇలా అన్నారు: ఈ ఆయత్ అవతరించిన మీదట జనులు దైవప్రవక్త(స) ముందు మరోసారి ధర్మ సందేహం వెలిబుచ్చారు. అప్పుడు అల్లాహ్ ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు: **'వ యస్‌తఫ్ తూనక ఫిన్నిసాయి..'** తరువాత హ(జత్ ఆయిషా(ర.అ) ఖుర్‌ఆన్‌లోని మరో ఆయత్‌ను కూడా ఉదాహరించారు : **'వ తర్‌గబూన అన్ తన్‌కిహూహున్న'** అంటే అందచందాల రీత్యా, ఆస్తీ అంతస్తూ రీత్యా తక్కువగా ఉన్న అనాథ బాలికలను వివాహమాడటం పట్ల మీరు అనాసక్తత కనబరుస్తున్నారు. ఇలాంటి అమ్మాయిలను మీరు నికాహ్ చేసుకోవటం పట్ల ఆసక్తి చూపనప్పుడు అందంలో, ఆస్తిలో మెరుగ్గా ఉన్న అనాథ బాలికలను కూడా మీరు మనువాడకండి. అయితే న్యాయసమ్మతంగా వారి మహర్ చెల్లించే స్థితిలో ఉంటేనే వారిని నికాహ్ చేసుకోండి.

### అధ్యాయం : 2

## అనాథల సంరక్షకుడు పేదవాడై ఉంటే...

ఒకవేళ అనాథల సంరక్షకుడు పేదవాడైతే దాన్ని ధర్మసమ్మతంగా అనుభవిం చాలి. తరువాత వారి ఆస్తిని వారికి అప్పగించేటప్పుడు, దానికి ఇతరులను సాక్షు లుగా పెట్టండి. లెక్క తీసుకోవడానికి అల్లాహ్ చాలు. ***(4: 6)***

**420)** హ(జత్ ఆయిషా (ర.అ) దివ్యఖుర్‌ఆన్‌లోని ఈ ఆయత్: "అనాథల సంరక్షకుడు సంపన్నుడైతే, అతడు వారి సొమ్ముకు దూరంగా ఉండాలి. ఒకవేళ అతడు పేదవాడైతే దానిని ప్రఖ్యాత పద్ధతి (మారూఫ్) ననుసరించి అనుభవించ

వచ్చు." (4: 6)ను ఉదాహరిస్తూ ఇలా అన్నారు– 'ఈ ఆయత్ అనాథ గురించి అవతరించింది. ఒకవేళ అనాథల సంరక్షకుడు పేదవాడైతే, అనాథను పెంచి పోషిస్తున్నందుకు వేతనం క్రింద– ఉత్తమరీతిలో– కొంత సొమ్ము అనాథ ఆస్తిలో నుండి తీసుకోవచ్చు (కాకపోతే ఇక్కడ సంకల్పశుద్ధి ఉండాలి. అనాథ ఆస్తిని హరించే దురుద్దేశం ఉండకూడదు).

అధ్యాయం : 3

## వారు హక్కుదారులు కాకపోయినా సరే...

"ఆస్తి పంపకం జరిగేటప్పుడు ఇతర బంధువులు, అనాథులు, నిరుపేదలు వస్తే, ఆ ఆస్తి నుండి వారికి కూడా కొంత ఇవ్వండి. వారిని మంచి మాటలలో పలకరించండి." *(4 : 8)*

**421)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి), "ఆస్తి పంపకం సమయంలో సమీప బంధువులు, అనాథలు, అగత్యపరులు వస్తే ఆ ఆస్తి నుండి వారికి కూడా కొంత ఇవ్వండి" అనే ఆయత్‌పై వ్యాఖ్యానిస్తూ, 'ఈ ఆయత్ ఒక ఆజ్ఞగా ఉంది. ఇది రద్దు కాలేదు' అని అన్నారు.

**422)** మహనీయ జాబిర్ (రజి) వివరించారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) అబూబకర్(రజి)తోపాటు బనూ సలమా నివసించే వాడ వరకూ నడిచి వచ్చారు. నేను స్పృహ తప్పి పడి ఉండడం ఆయన(స) గమనించి, నీళ్ళు తెప్పించారు. ఆ నీటితో వుజూ చేసి, దానిని నాపై చిలకరించారు. నేను స్పృహలోకి వచ్చాను. వెంటనే, 'దైవప్రవక్తా! నేను నా ఆస్తిపాస్తులను ఏ విధంగా పంచిపెట్టాలో ఆజ్ఞాపించండి' అని విన్నవించుకున్నాను. దానిపై ఈ ఆయత్ అవతరించింది. *"మీ సంతానం విషయంలో అల్లాహ్ మీకు ఇలా ఆదేశిస్తున్నాడు: ఒక పురుషుని భాగం ఇద్దరు స్త్రీల భాగాలకు సమానం. ఒకవేళ (మృతునికి వారసులుగా) ఇద్దరి కంటే ఎక్కువ మంది ఆడపిల్లలు ఉంటే, వారికి మొత్తం ఆస్తిలో మూడింట రెండు భాగాలు ఇవ్వాలి. ఒకే ఆడపిల్ల వారసురాలైతే, ఆస్తిలో అర్థభాగం ఆమెకు చెందుతుంది. మృతుడు సంతానం కలవాడైతే, అతని తల్లిదండ్రులలో ఒక్కొక్కరికి మొత్తం ఆస్తిలో ఆరో భాగం లభించాలి. ఒకవేళ అతడు సంతానం లేనివాడై అతని తల్లి దండ్రులు మాత్రమే అతనికి వారసులైతే, అప్పుడు తల్లికి మూడో భాగం ఇవ్వాలి. మృతుడికి సోదరీ సోదరులు కూడా ఉంటే, అప్పుడు తల్లికి ఆరో భాగం*

*లభిస్తుంది. మృతుడు రాసిన వీలునామా అమలు జరిపి అతనిపై ఉన్న అప్పులు తీర్చిన తరు వాతనే (ఈ భాగాల పంపకం జరగాలి). మీ తల్లిదండ్రులలో, మీ సంతానంలో ప్రయోజనం రీత్యా మీకు ఎవరు ఎక్కువ సన్నిహితులో మీకు తెలియదు. ఈ భాగా లను అల్లాహ్ నిర్ణయించాడు. నిశ్చయంగా అల్లాహ్ యథార్థాలన్నీ తెలిసినవాడు, మర్మాలన్నీ ఎరిగినవాడు." (4: 11)*

అధ్యాయం : 4

## సంతానం లేని భార్యల ఆస్తిలో...

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"మీ భార్యలకు సంతానం లేని పక్షంలో, వారు విడిచిపోయిన ఆస్తిలో మీకు అర్థభాగం లభిస్తుంది." *(4: 12)*

**423)** మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా వివరించారు: ఇస్లామ్ ఆరంభ కాలంలో మృతుని ఆస్తి అంతా సంతానానికి లభించేది. ఇక తల్లిదండ్రులకు ఏదయినా లభిస్తే, మృతుడు వారి కొరకు వీలునామా వ్రాసి పోయినది మాత్రమే లభించేది. తరువాత అల్లాహ్ తాను కోరిన విధంగా దీనిని సవరించాడు. కాబట్టి ఇప్పుడు ఒక పురుషుని వాటా ఇద్దరు స్త్రీల వాటాకు సమానం. మృతుని తల్లిదండ్రులలో ప్రతి ఒక్కరికీ ఆ ఆస్తిలో ఆరవ భాగం చెందుతుంది (మృతునికి సంతానం ఉన్నప్పుడు). కాని మృతునికి సంతానం లేకుండా కేవలం అతని తల్లిదండ్రులే అతని ఆస్తికి వారసులై ఉన్నప్పుడు వారికి మూడింట ఒక వంతు దక్కుతుంది. మృతునికి సంతానం ఉన్నప్పుడు అతని భార్యకు ఎనిమిదవ భాగం లభిస్తుంది. ఒకవేళ సంతానం లేని పక్షంలో భార్యకు 4వ భాగం లభిస్తుంది. సంతానం లేనప్పుడు (మృతురాలి) భర్తకు సగభాగం లభిస్తుంది. సంతానం ఉంటే గనక నాల్గవ భాగం లభిస్తుంది.

అధ్యాయం : 5

## బలవంతంగా స్త్రీలకు వారసులు కావటం...

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"విశ్వసించిన ప్రజలారా! బలవంతంగా స్త్రీలకు వారసులు కావటం మీకు ధర్మసమ్మతం కాదు. ఇంకా, వారిని వేధించి సాధించి మీరు వారికి ఇచ్చిన

**'మహర్'లో కొంత భాగాన్ని కాజేసే ప్రయత్నం చెయ్యటం కూడా ధర్మసమ్మతం కాదు. అయితే వారు గనక బాహాటంగా చెడు నడతకు పాల్పడినట్లయితే, (అప్పుడు వారి పట్ల కఠినంగా ప్రవర్తించే అధికారం మీకు ఉంది). వారితో సద్భావంతో జీవితం గడపండి. ఒకవేళ మీకు వారు నచ్చకపోతే, బహుశా మీకు ఒక వస్తువు నచ్చక పోవచ్చు. కాని అందులోనే అల్లాహ్ ఎంతో మేలును పెట్టి వుండవచ్చు." *(4: 19)***

**424) హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) వివరించారు: (షైబానీ ఇలా అన్నారు– ఈ హదీసును అబుల్ హసన్ అతా సువాయి కూడా వివరించారు. నాకు తెలిసి నంతవరకు ఆయన గారు ఇబ్నె అబ్బాస్– రజి– నుండే ఉటంకించి ఉంటారు) "విశ్వసించిన ప్రజలారా! బలవంతంగా స్త్రీలకు వారసులు కావటం మీకు ధర్మ సమ్మతం కాదు. ఇంకా, వారిని వేధించి సాధించి మీరు వారికి ఇచ్చిన 'మహర్'లో కొంత భాగాన్ని కాజేసే ప్రయత్నం చెయ్యటం కూడా ధర్మసమ్మతం కాదు" (4:19) అనే ఆయత్ గురించి ఆయన వివరిస్తూ, అజ్ఞాన కాలంలో ఏ స్త్రీ భర్త అయినా చనిపోయినప్పుడు, భర్త తరపు బంధువులు ఆ స్త్రీ కొరకు ఎక్కువ హక్కుదారులుగా పరిగణించబడేవారు. వారిలో ఎవరయినా, తాను కోరుకుంటే ఆమెను వివాహ మాడేవాడు. లేదా తాము కోరిన వారికి ఇచ్చి ఆమె పెళ్ళి చేయించేవారు. తాము కోరుకుంటే పునర్వివాహం జరపకుండా అలాగే ఉంచేవారు. ఈ విధంగా ఆ స్త్రీ పుట్టింటి వారికన్నా భర్త తరపు బంధువులు ఆమె పాలిట ఎక్కువ హక్కుదారులుగా భావించబడేవారు. ఈ అన్యాయాన్ని రూపుమాపుతూ ఈ ఆయత్ *(4: 19)* అవతరించింది.[1]**

## అధ్యాయం : 6

# హక్కుదారులు

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**"తల్లిదండ్రులు, దగ్గరి బంధువులు విడిచి వెళ్ళే ప్రతి ఆస్తికి మేము**

---

424-1. ఇస్లామ్ స్త్రీని బానిస స్త్రీగా మార్చిందని వ్యంగ్యాస్త్రాలు సంధించేవారికి ఇది ధీటైన జవాబు. ఒకప్పుడు అరేబియాలో స్త్రీ జాతి తోటి పురుషుని ఒడిలో విలాస వస్తువుగా మారి ఉండేదన్నది నిజమే. కాని ఇస్లామ్ ఆమెకు ఆస్తి హక్కు ఇప్పించింది. వితంతు స్త్రీకి, విడాకులు పొందిన స్త్రీకి తనకు నచ్చిన పురుషుణ్ణి నికాహ్ చేసుకునే స్వేచ్ఛాధి కారం ఇచ్చింది.

**హక్కుదారులను నిర్ణయించాము. ఇక మీరు వాగ్దానం చేసినవారు– వారికి ఇవ్వ వలసిన భాగం వారికి ఇవ్వండి. నిశ్చయంగా అల్లాహ్ అన్నింటినీ కనిపెట్టి ఉన్నాడు.” *(4: 33)***

**425) మహనీయ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) ఇలా వివరించారు: “లికుల్లి జఅల్‌నా మవాలియ” (4: 33) అనే ఆయత్‌లో మవాలియ అంటే అర్థం వారసులు. ఇక “వల్లజీన అఖదత్ అయ్‌మానుకుమ్”కు భావార్థం ఏమిటంటే ముహాజిర్లు మదీనాకు వలస వచ్చినప్పుడు సమీప బంధువులతోపాటు ముహాజిర్లు కూడా అన్సార్‌లకు వారసులుగా భావించబడేవారు. దైవప్రవక్త(స) ముహాజిర్లకు– అన్సార్లకు మధ్యన ఏర్పరచిన సోదర బంధం కారణంగా ఈ వారసత్వ భావన ఉండేది. కాని “లికుల్లి జఅల్‌నా మవాలియ” (4: 33) ఆయత్ అవతరించిన మీదట మొదటి పద్ధతి రద్దయింది. ఇక “వల్లజీన అఖదత్ అయ్‌మానుకుమ్” అంటే అర్థం స్నేహ సంబంధాలు కలిగి ఉంటామని, సహాయం చేస్తామని, శ్రేయోభిలాషతో మసలు కుంటామని వాగ్దానం చేసినవారు. అయితే ఇప్పుడు ఇలాంటి వారందరికీ ఆస్తి సంక్రమణా హక్కు రద్దయింది. కాని వసీయతు ఆజ్ఞ మాత్రం మిగిలి ఉంది.[1]**

## అధ్యాయం : 7

# ఎవరికీ రవ్వంత అన్యాయం జరగదు

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**అల్లాహ్ ఎవరికీ రవ్వంత అన్యాయం కూడా చెయ్యడు. ఎవరయినా ఒక మంచి పని చేస్తే, దానిని అల్లాహ్ రెండింతలు చేస్తాడు. ఇంకా తన తరపు నుండి పెద్ద ప్రతిఫలం కూడా ప్రసాదిస్తాడు. (4: 40)**

**426) మహనీయ అబూ సయీద్ ఖుద్రీ (రజి) తెలిపారు: ప్రవక్త మహనీయుల(సఅసమ్) సహచరమాన్యులు కొంతమంది ఆయన్ని, ‘దైవప్రవక్తా! మేము**

---

425–1. ముహాజిర్ సహాబా మదీనాకు వచ్చినప్పుడు అన్సార్‌లు వారిని తమ దత్త సోదరులుగా చేసుకున్నారు. తమ ఆస్తిపాస్తుల్లో వారిని భాగస్థులుగా చేర్చుకున్నారు. కాని ఆ తరువాత ఆస్తికి హక్కుదారులు కేవలం సంతానం, దగ్గరి బంధువులేనని చెప్ప బడింది. అయితే మూడింట ఒక వంతు ఆస్తిని వీలు వ్రాసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుంది. మృతుడు గనక కోరుకుంటే తన మరణానికి ముందు దత్త సోదరులకు కూడా ఈ విల్లు వ్రాయగలడు.

ప్రళయదినాన మా ప్రభువును చూడగలమా?' అని అడిగారు. దానికి ఆయన(స), "అవును, ఏమిటి, మిట్ట మధ్యాహ్నం సమయంలో మేఘాలు కూడా లేని సూర్యుణ్ణి చూచే విషయంలో మీకేమైనా ఇబ్బంది ఉంటుందా?" అని అడిగారు. దానికి ప్రియ సహచరులు, 'లేదు' అని బదులిచ్చారు. "పోనీ, పున్నమి చంద్రుణ్ణి దర్శించటంలో మీకేమయినా అవరోధం ఉంటుందా? అందులోనూ (ఆకాశంలో) మబ్బులు లేనప్పుడు చంద్రుణ్ణి చూడటంలో ఏమైనా అడ్డంకి ఉంటుందా?" అని తిరిగి అడిగితే, 'లేద'ని సహచరులు జవాబిచ్చారు. అప్పుడు దైవప్రవక్త(స) ఈ విధంగా సెలవిచ్చారు: "సరిగ్గా అదే విధంగా మీరు ఎప్పుడయినా, ఎలాంటి అవరోధం లేకుండా అల్లాహ్‌ను చూడగలుగుతారు. ప్రళయదినాన ప్రకటన చేసేవాడొకడు ప్రకటిస్తాడు- ప్రతి మానవ సముదాయం తన కాల్పనిక (బూటకపు) దేవుళ్ళతో పాటు హాజరవ్వాలని. అప్పుడు అల్లాహ్‌ను తప్ప విగ్రహాలను, రాళ్ళురప్పలను పూజించే వారంతా నరకంలో పడవేయబడతారు.

అప్పుడు కేవలం అల్లాహ్‌ను పూజించేవారు మాత్రమే మిగిలి ఉంటారు- వారు మంచివారు గానీ, చెడ్డవారు గానీ గ్రంథం కలవారిలోని కొందరు గానీ. మొదట గ్రంథవహులైన యూదులు పిలువబడతారు. "మీరు అల్లాహ్‌ను కాకుండా ఎవరిని పూజించేవారు?" అని వారిని అడగటం జరుగుతుంది. 'దైవ కుమారుడైన ఉజైర్‌ను' అని వారంటారు. అప్పుడు అల్లాహ్ వారితో ఇలా అంటాడు: "మీరు అబద్ధీకులు. అల్లాహ్ ఎవరినీ తన భార్యగా గానీ, కొడుకుగా గానీ చేసుకోలేదు. సరే ఇప్పుడు మీరేం కోరుకుంటున్నారు?" దానికి వారు, 'ప్రభూ! మేము దాహంతో ఉన్నాము. మాకు నీరు త్రాపించు' అంటారు. ఏమిటి, అటువైపు నడవరా? అని వాళ్ళను సంజ్ఞ చేయటం జరుగుతుంది. అక్కడ వారికి దూరాన మెరిసే ఇసుక (ఎండమావి) నీరు మాదిరిగా కనిపిస్తుంది. అక్కడికి వెళ్ళండి అని వారితో అనబడుతుంది. అది నరకం అయి ఉంటుంది. అది కొందరిని ముక్కలు ముక్కలుగా కోసి వేస్తూ ఉంటుంది. వారందరినీ ఆ నరకాగ్నికి ఆహుతి చేయటం జరుగుతుంది.

తరువాత నసారా (క్రైస్తవుల)ను పిలవటం జరుగుతుంది. "మీరు ఎవరిని పూజించేవారు?" అని వారిని ప్రశ్నిస్తే 'మేము అల్లాహ్ కుమారుడైన మసీహ్‌ను పూజించేవారము' అని వారంటారు- వారితో కూడా ఇలా అనబడుతుంది: "మీరు అసత్యానికి ఒడిగట్టారు. అల్లాహ్ ఎవరినీ కుమారునిగా చేసుకోలేదు". "సరే ఇప్పుడు

మీరు ఏం కోరుకుంటున్నారో చెప్పండి" - వారి పట్ల కూడా యూదుల మాదిరి వ్యవహారమే జరుగుతుంది. చివరకు అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించేవారు మిగిలి ఉన్నప్పుడు- వారు మంచివారైనా సరే, చెడ్డవారైనా సరే- వారి వద్ద వారి ప్రభువు ఒక రూపంలో తేజరిల్లుతాడు. వారు ఇంతకుముందు చూసిన రూపాన్ని అది కొంత వరకు పోలి ఉంటుంది (అంటే అది ఆ రూపమై ఉండదు). వారితో ఇలా అనబడుతుంది : "ఇప్పుడు మీరు ఎవరి కోసం నిరీక్షిస్తున్నారు? ప్రతి సముదాయం (ఉమ్మత్) తన ఆరాధ్య దైవాలను తీసుకుని వెళ్ళింది". దానికి వారిలా జవాబిస్తారు: 'మేము ప్రపంచంలో అవిశ్వాసానికి ఒడిగట్టిన వారి నుండి వేర్పడినప్పుడు, మేము వారి ముందు అందరికన్నా పేదవారుగా ఉండేవారము. అయినప్పటికీ మేము వారికి తోడుగా నిలబడలేదు. ఇప్పుడు మేము ప్రపంచంలో మేము ఆరాధించిన దైవం కొరకు నిరీక్షిస్తున్నాము'. అప్పుడు అల్లాహ్, "మీ ప్రభువును నేనే" అంటాడు. 'మేము మా ప్రభువుకు భాగస్వాములుగా ఎవరినీ కల్పించము' అని వారు పలుకు తారు. ఈ మాట వారు రెండు లేక మూడుసార్లు పలుకుతారు."[1]

### అధ్యాయం : 8

## ముహమ్మద్(స)ను మానవాళిపై సాక్షిగా నిలబెట్టినప్పుడు

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"(ఓ ముహమ్మద్-స!) మేము ప్రతి సమాజం నుండి ఒక సాక్షిని తెచ్చి, నిన్ను వారికి సాక్షిగా నిలబెట్టినప్పుడు వారి పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించు."

**(4: 41)**

**427)** ప్రవక్త మహనీయులు (సఅసమ్) తనను ఈ విధంగా కోరారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) వివరించారు: "నాకు ఖుర్‌ఆన్ పారా

---

426-1. ఇమామ్ ముస్లిమ్(రహ్మా) ఉల్లేఖనంలో ఇలా వుంది : మొదట ముస్లింలు తమ ప్రభువును గుర్తుపట్టరు. ఎందుకంటే ఆయన మరో రూపంలో తేజరిల్లుతాడు. "నేనే మీ ప్రభువును" అని అల్లాహ్ అన్నప్పుడు, 'మేము నీ నుండి అల్లాహ్ శరణు వేడుతున్నాము' అని ముస్లింలు అంటారు. తరువాత ప్రభువు తన సిసలైన రూపంలో ప్రస్ఫుటమవుతాడు. ఆ రూపంలో ముస్లింలు ఆయన్ని చూసి ఉంటారు. అంతే, ముస్లిములంతా సాష్టాంగ ప్రణామం చేస్తారు. 'నిశ్చయంగా నువ్వే మా ప్రభువువి' అని అంటారు.
సుబ్‌హానల్లాహ్! ఆ సమయం కూడా ఎంత సంతోషకరమైనది!?

యణం చేసి వినిపించు" అని దైవప్రవక్త(స) కోరినప్పుడు 'అయ్యో, ప్రవక్త అయిన మీకు నేను ఖుర్ఆన్ వినిపించటమా? అది మీపైనే అవతరించింది కదా!' అని నేను విన్నవించుకున్నాను (ఆశ్చర్యంతో). దానికి ఆయన (స) "నేను ఇతరుల ద్వారా ఖుర్ఆన్ వినదలిచాను" అన్నారు. అందువల్ల నేను ఆయన(స)కు సూరయె నిసాను పఠించి వినిపించసాగాను. నేను **'ఫకైఫ ఇజాజీ'నా మిన్‌కుల్లి ఉమ్మతిన్ బిషహీదిఁ వ్వ వజీ'నా బిక అలా హావులాయి షహీదా'** (మేము ప్రతి సమాజం నుండి ఒక సాక్షిని తెచ్చి నిన్ను (ఓ ముహమ్మద్!) వారికి సాక్షిగా నిలబెట్టినప్పుడు వారి పరిస్థితి ఎలా ఉంటుందో కాస్త ఆలోచించు) అనే ఆయత్ వరకు వచ్చినప్పుడు "ఆగు, ఆగు" అని ఆయన(స) పలికారు. ఆ క్షణంలో ఆయన(స) కంట కన్నీరొలకటం నేను గమనించాను.'[1]

## అధ్యాయం : 9

# తయమ్ముమ్ ఆదేశం

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"మీరు ఎప్పుడయినా అస్వస్థులైతే లేక ప్రయాణంలో ఉంటే లేక మీలో ఎవరైనా మలమూత్ర విసర్జనం చేసివుంటే లేక మీరు మీ స్త్రీలను తాకి వుంటే, మీకు నీరు లభ్యంకాని పక్షంలో, పరిశుభ్రమైన మట్టిని ఉపయోగించండి, దానితో మీ ముఖాలను, చేతులను రుద్దుకొనండి. నిస్సందేహంగా అల్లాహ్ ఉదార స్వభావుడు, క్షమాగుణం కలవాడు." (అన్ నిసా: 43)

**428)** అమ్మ ఆయిషా (ర.అ) తెలిపారు: తాను అస్మా(ర.అ) వద్ద (అరువుగా) తీసుకున్న కంఠహారం (ప్రయాణ సందర్భంగా) పోయినప్పుడు, దైవప్రవక్త(స) దానిని వెతకటానికి కొంతమంది సహాబాను పంపించారు. కాని మరోవైపు నమాజ్ వేళ కావొచ్చింది. అప్పుడు జనులు 'వుజూ'తో లేరు. అక్కడ నీరు కూడా లేదు. అందుచేత వుజూ లేకుండానే జనులు నమాజ్ ఆచరించారు. అప్పుడు అల్లాహ్ 'తయమ్ముమ్'[1] కు సంబంధించిన ఆయత్‌ను అవతరింపజేశాడు.

---

427-1. ఉమ్మత్ చేసిన పనులపై తాను సాక్ష్యం ఇవ్వాల్సి ఉంటుందనే మాట ప్రస్తావించగానే ఆయన(స) హృదయం కరిగి, కన్నీళ్ళ రూపంలో ప్రవహించింది. మరికొంతమంది ప్రకారం అవి ఆనంద భాష్పాలు. ఎందుకంటే ఆయన(స) ప్రవక్తలందరి అనుచర సముదాయాలకు సాక్షిగా చేయబడ్డారు.

## అధ్యాయం : 10

# విధేయత

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**"విశ్వసించిన ప్రజలారా! విధేయత చూపండి అల్లాహ్‌కు, విధేయత చూపండి ప్రవక్తకు, మీలో అధికారం అప్పగించబడిన పెద్దలకు. మీ మధ్య ఏ విషయంలోనైనా వివాదం తల ఎత్తితే దాన్ని అల్లాహ్‌కు, ప్రవక్తకు నివేదించండి. మీరు నిజంగానే అల్లాహ్ మీద అంతిమ దినం మీదా విశ్వాసం కలవారే అయితే. ఇదే సరియైన పద్ధతి. ఫలితాన్ని బట్టి కూడా ఇదే ఉత్తమమైనది."[1] *(అన్ నిసా : 59)***

**429) సయీద్ బిన్ జుబైర్‌తో అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) ఇలా అన్నారు: "అల్లాహ్‌కు విధేయత చూపండి, ప్రవక్తకు, మీలో అధికారం అప్పగించ బడిన పెద్దలకు విధేయత చూపండి" (4: 59) అనే ఆయత్ అబ్దుల్లాహ్ బిన్ హుజాఫా బిన్ ఖైస్ బిన్ అదీ (రజి) గురించి అవతరించింది. ఆ సమయంలో దైవప్రవక్త(స) ఆయన్ని ఒక సైనిక బృందంపై అధిపతిగా నియమించి పంపారు.[1]**

---

428-1. **'తయమ్ముమ్'** అంటే అసలు 'సంకల్పించుకోవటం' అని అర్థం. ఇక ఇస్లామీయ పరిభాషలో **'తయమ్ముమ్'** అంటే నీరు లభ్యం కానప్పుడు, పరిశుద్ధతనొందే సంకల్పంతో- వుజూకు ప్రత్యామ్నాయంగా- పరిశుభ్రమైన మట్టిని ఉపయోగించటం.

10-1. అంటే మీ మధ్యన ఏ వ్యవహారంలోనయినా విభేదాలు పొడసూపినట్లయితే, దానిని అల్లాహ్, ఆయన ప్రవక్త (స) వైపునకు మళ్ళించండి. అల్లాహ్ వైపునకు మరల్చటం అంటే అర్థం ఖుర్ఆన్ ప్రకారం నడుచుకోవటం. ప్రవక్త(స) వైపునకు మరల్చడమంటే అర్థం దైవప్రవక్త(స) ప్రవచనాలైన హదీసుల ప్రకారం ఆయన(స) నెలకొల్పిన సున్నత్ ప్రకారం నడుచుకోవటం అన్నమాట. ఈ పద్ధతి ప్రకారం మసలుకున్నట్లయితే విభేదాలు చాలా వరకు సమసిపోతాయి.

429-1. దారిలో అబ్దుల్లాహ్ బిన్ హుజాఫా(రజి)కు ఒకానొక విషయంపై కోపం వచ్చింది. అగ్నిని ప్రజ్వలింపజేయమని ఆయన ఆదేశించారు. కట్టెలు బాగా మండిన తరువాత అందరూ అందులోకి దూకండి అని ఆయన ఆజ్ఞాపించారు. ఆయన ఆదేశాన్ని శిరసా వహించాల్సిందేనని కొందరంటే, ఆయన ఆజ్ఞ షరీఅత్‌కు విరుద్ధంగా ఉందని మరికొందరన్నారు. అందుకే ఆయన ఆజ్ఞను శిరసావహించవలసిన అవసరం లేదని వారు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే ఈ ఆయత్ అవతరించింది. ఏదేని విషయంలో అభిప్రాయ భేదం వచ్చినప్పుడు దానిని దైవగ్రంథం, దైవప్రవక్త(స) సున్నత్ వైపునకు మరల్చాలని హాఫిజ్ ఇబ్నె హజర్ దీనికి భావార్థం చెప్పారు.

## అధ్యాయం : 11

# విశ్వాసానికి (ఈమాన్‌కు) ప్రమాణ నికషం

దైవోపదేశం–

"కాదు, ముహమ్మద్! నీ ప్రభువు సాక్షిగా! వారు తమ పరస్పర విభేదాల విషయంలో నిన్ను న్యాయనిర్ణేతగా స్వీకరించనంతవరకు, ఇంకా నీవు ఏ నిర్ణయం చేసినా దానిని గురించి వారి మనస్సులలో కూడా ఏమాత్రం సంకోచం లేకుండా దానిని యథాతథంగా శిరసావహించనంతవరకు వారు నిజమైన విశ్వాసులు కాలేరు." *(అన్ నిసా : 65)*

**430)** ఉర్వా బిన్ జుబైర్ ఇలా వివరించారు: జుబైర్(రజి)కు ఒక అన్సార్ వ్యక్తి (సాబిత్ బిన్ ఖైస్–రజి)తో 'హర్రా' ప్రదేశంలో బోది (లేక పిల్లకాలువ) వద్ద గొడవ జరిగింది (ఎవరి తోటకు ముందు నీరు వదలాలి? అనే విషయంలో వివాదం తలెత్తింది). "జుబైర్! ముందు నీవు నీ తోటను తడుపుకో. తరువాత ఏ మాత్రం ఆలస్యం చేయకుండా నీ పొరుగు వానికి నీరు వదులు" అని దైవ ప్రవక్త(స) ఆజ్ఞాపించారు. ఈ మాట విన్న అన్సార్ సహాబీ 'దైవప్రవక్తా! అంతే లెండి. ఎంతయినా అతను మీ మేనత్త కొడుకు కదా!' అని వ్యాఖ్యానించారు. ఇది విన్న దైవప్రవక్త(స) ముఖారవిందం కందిపోయింది. ఆయన(స) ఇలా అన్నారు: "జుబైర్! నీ తోటను బాగా తడుపుకో. గట్ల వరకూ నీరు వచ్చేదాకా నీరు వదలకు. ఆ తరువాతే నీ పొరుగువానికి నీరు వదులు" (మొదట ఆయన తన తీర్పులో అన్సార్ సోదరుని సాదక బాధకాలను దృష్టిలో పెట్టుకుని సడలింపుల వైఖరిని అవలంబించారు. కాని) ఈసారి ఆయన జుబైర్‌కు పూర్తి హక్కును ఇప్పించారు. ఎందుకంటే అన్సార్ సహాబీ చెప్పిన మాట సంకుచిత బుద్ధితో కూడినది. అందుకే ఆయన సహజంగానే కినుక వహించారు. మొదట ఆయన తన తీర్పును ఉభయ తారకంగా ఇచ్చారు. ఇద్దరికీ రాయితీ ఇచ్చారు. 'నా దృష్టిలో ఈ ఆయత్ ఈ వ్యవ హారంలోనే అవతరించింది' అని జుబైర్(రజి) అభిప్రాయపడ్డారు. "కాదు, ఓ *ముహమ్మద్! నీ ప్రభువు సాక్షిగా! వారు తమ పరస్పర విభేదాల విషయంలో నిన్ను న్యాయ నిర్ణేతగా స్వీకరించనంతవరకు, ఇంకా నీవు ఏ నిర్ణయం చేసినా దానిని*

*గురించి వారి మనస్సులలో కూడా ఏమాత్రం సంకోచం లేకుండా దానిని యథా తథంగా శిరసావహించనంతవరకూ వారు నిజమయిన విశ్వాసులు కాలేరు."*[1]

## అధ్యాయం : 12

# దైవానుగ్రహానికి పాత్రులైనవారు...

**"అల్లాహ్‌కు, ప్రవక్తకు విధేయత చూపేవారు అల్లాహ్ అనుగ్రహానికి పాత్రులైన వారితో ఉంటారు, అంటే ప్రవక్తలు, సత్యసంధులు, షహీదులు, సజ్జనులూను. ఎవరికి దొరికినా ఈ స్నేహితులు ఎంత మంచి వారు"[1]. *(అన్ నిసా: 69)***

**431) దైవప్రవక్త(సఅసమ్) చెప్పగా తాను విన్నానని విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) వివరించారు: ఏ ప్రవక్త అయినా మరణ వ్యాధికి గురై నప్పుడు అతనికి ప్రపంచం కావాలో, పరలోకం కావాలో ఎన్నుకునే స్వేచ్ఛాధికారం ఇవ్వబడుతుంది". అందువల్ల నేను దైవప్రవక్త(స) మరణవ్యాధికి గురై ఉన్న కాలంలో, ఆయన గొంతులో శబ్దం ఇరుక్కుంటున్నప్పుడు ఆయన(స) ఈ విధంగా పలకటం నేను విన్నాను: "అల్లాహ్ అనుగ్రహానికి పాత్రులైన వారితోనే... అంటే ప్రవక్తలు, సిద్దీఖులు, షహీదులు, సాలిహీన్‌లతోపాటే". దానినిబట్టి నేను అర్థం చేసుకున్నదేమిటంటే, ఆయనకు కూడా ఎంపిక స్వేచ్ఛ ఇవ్వబడింది (మరాయనేమో 'అల్లాహుమ్మ బిర్రఫీఖిల్ ఆలా' అంటూ పరలోకాన్నే ఇష్టపడ్డారు).**

---

430-1. ఈ ఆయత్‌లో అల్లాహ్ స్వయంగా తనపై ఒట్టేసుకుని ఉపదేశించటం గమనించదగిన విషయం. విశ్వాసి ప్రధాన కర్తవ్యం ఏమిటంటే, ఒకవేళ అతనికి ప్రామాణికమైన హదీసు అందితే దానిని సంతోషంగా, నిస్సంకోచంగా దాని ప్రకారం ఆచరించాలి. ఒకవేళ ప్రపంచంలోని పండితులు, శాసనాన్వయకర్తలంతా ఏకమై, దానికి వ్యతి రేకంగా చెప్పుకుంటే చెప్పుకోనివ్వండి. తాను తమ ముజ్తహిదీన్‌ల మాటను ఖాతరు చేయటం లేదే! అన్న ఆలోచనను కూడా మనసులో రానివ్వకూడదు. అల్లాహ్ తమకు హదీసును అనుసరించే సద్బుద్ధిని ప్రసాదించినందుకు మనసులోనే ఆనందించాలి.

12-1. ఒక వ్యక్తి దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి ఇలా విన్నవించుకున్నాడు : 'దైవప్రవక్తా! నేను మిమ్మల్ని అమితంగా ప్రేమిస్తున్నాను. ఇంట్లో ఉన్నప్పుడు నా మనసు కుదుట పడటం లేదు. నేను మీ సన్నిధికి వచ్చి, మీ నగుమోమును చూశాక నాకు నెమ్మది లభిస్తోంది. పరలోకంలో మీరు (స్వర్గంలో) ఉన్నత స్థానంలో ఉంటారు. కాని నేనెక్కడుంటానో దైవానికే ఎరుక. మీ ముఖారవిందాన్ని అక్కడ ఎలా చూడగలను?'

అతని ఆవేదనకు ఉపశమనంగా ఈ ఆయత్ అవతరించింది. ఈ ఆజ్ఞ సర్వసాధారణ మయింది. దైవప్రవక్త(స)ను ప్రేమించే ప్రతి ముస్లిం ఈ శుభవార్తకు పాత్రుడు.

## అధ్యాయం : 13

# బాధితులను దుర్మార్గుల చెర నుండి విడిపించటానికి...

దైవోపదేశం-

అసలు మీరు, నిస్సహాయులైన ఆ పురుషులు, స్త్రీలు, పిల్లల కొరకు అల్లాహ్ మార్గంలో పోరాడక పోవటానికి కారణం ఏమిటి? బలహీనులవటం చేత అణచ బడి, వారు "మా ప్రభూ! దుర్మార్గులైన ఈ నగరవాసుల నుండి మాకు విమోచనం కలిగించు. మా కొరకు నీ తరఫు నుండి ఒక సహాయకుణ్ణి, ఒక రక్షకుణ్ణి పంపించు" అని ఫిర్యాదు చేస్తున్నారే! *(4: 75)*

**432)** ఇబ్నె అబ్బాస్(రజి) చెప్పగా తాను విన్నానని ఉబైదుల్లాహ్ వివరిం చారు: ఆయన ఇలా చెప్పారు- **"నా తల్లి ముస్తజ్అఫీన్ (బలహీన స్త్రీ)లలో ఒకరుగా ఉండేవారు."[1]**

**433)** అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి), "నిస్సహాయులైన ఆ పురుషులు, స్త్రీలు, పిల్లల కొరకు మీరు దైవమార్గంలో పోరాడక పోవటానికి కారణం ఏమిటి?" అనే ఆయత్‌ను (4: 75) పఠించి తానూ, తన తల్లి ఆ రోజుల్లో 'నిస్సహాయులు'గా ఉండేవారమని చెప్పారు.

## అధ్యాయం : 14

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"మీకు ఏమయింది, మీ మధ్య కపటులను గురించి రెండు అభిప్రాయాలు ఉన్నాయి? వాస్తవానికి వారు సంపాదించుకున్న దుష్టకర్మల ఫలితంగానే అల్లాహ్ వారిని వెనక్కు (పూర్వపు స్థితికి) మరల్చాడు." *(4: 88)*

**434)** జైద్ బిన్ సాబిత్(రజి) కథనం: **"మీకేమయింది, మీ మధ్య కపటులను గురించి రెండు అభిప్రాయాలు ఉన్నాయి?"** (4: 88) అనే ఆయత్ గురించి చెబుతూ ఆయన ఇలా అన్నారు: పైకి దైవప్రవక్త(స) వెంటనే ఉన్నామని అభినయం చేసే

---

432-1. ఈయన తల్లి పేరు లుబాబా బిన్తె హారిస్(ర.అ) ఈమె హజ్రత్ మైమూనా (ర.అ) సోదరి. వీరిద్దరూ హృదయపూర్వకంగా ఇస్లామ్ స్వీకరించారు. కాని మక్కాలో అవిశ్వాసుల చేతుల్లో చిక్కుకుని ఉండేవారు. హిజ్రత్ చేయలేని పరిస్థితి వారిది. వారి విషయంలోనే ఈ ఆయత్ అవతరించింది.

**కొంతమంది కపట విశ్వాసులు ఉహుద్ యుద్ధ సందర్భంగా (ఆయన్ని విడిచిపెట్టి మార్గమధ్యంలో) తిరిగి వచ్చేశారు. అప్పుడు ఆ మునాఫిఖీన్‌ల గురించి ముస్లింలలో ద్వంద్వాభిప్రాయం పొడసూపింది. వారు రెండు వర్గాలుగా చీలిపోయారు. '(దైవ ప్రవక్తా!) ఆ వంచకులను వధించేందుకు ఆదేశించండి' అని ఒక వర్గం వారంటే, 'వధించటం భావ్యం కాద'ని మరో వర్గం వారన్నారు. అప్పుడు ఈ ఆయత్ (4: 88) అవతరించింది. దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: ఈ మదీనా నగరం 'తయ్యిబా' (పవిత్రమైనది). అగ్ని వెండిలోని కసువును దూరం చేసినట్లే ఈ నగరం మాలిన్యాన్ని దూరం చేస్తుంది."[1]**

## అధ్యాయం : 15

# బాధ్యతా రాహిత్యం

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**వారు ఎక్కడన్నా ఏదయినా సంతృప్తికరమైన వార్త గాని లేదా భయంకరమైన వార్త గాని విన్నప్పుడు దాన్ని వ్యాపింపచేస్తారు. అలాకాక వారు దానిని ప్రవక్తకు, సంఘంలోని బాధ్యతాయుతులైన తమ పెద్దలకు తెలిపి ఉంటే వారిలో, దానిని ఆధారంగా చేసుకుని సరైన నిర్ణయం తీసుకోగలిగే సామర్థ్యం కలవారి దృష్టికి అది వచ్చి ఉండేది." (4: 83)**

## అధ్యాయం : 16

# బుద్ధిపూర్వకంగా ఒక మోమిన్‌ని చంపటం

**దైవోపదేశం**

**బుద్ధిపూర్వకంగా ఒక విశ్వాసి (మోమిన్)ని చంపేవానికి ప్రతిఫలం నరకం. అందులో అతడు సదా ఉంటాడు. అతనిపై అల్లాహ్ ఆగ్రహం, శాపం అవతరిస్తాయి. అల్లాహ్ అతడి కొరకు కఠినమైన శిక్షను సిద్ధపరచి ఉంచాడు. *(4: 93)***

---

434-1. ఉహుద్ యుద్ధ సందర్భంగా నికార్సయిన ముస్లిములెవరో - తప్పొ తాలు సరుకు ఏదో స్పష్టమైపోయింది. కపటులు ఎవరో ముందుకు వచ్చేశారు.

ఇక హదీసు ఉల్లేఖకులైన జైద్ బిన్ సాబిత్ అన్సారీ (రజి) దైవప్రవక్త(స) వారి లేఖకులు (కాతిబ్)గా ఉండేవారు. ఆయన గొప్ప సహాబాలో ఒకరుగా పరిగణించబడతారు. ఖుర్‌ఆన్ క్రోడీకరణలో ఈయన పాత్ర అమోఘం.

**435) సయీద్ బిన్ జుబైర్ చెప్పగా తాను విన్నట్లు ముగీరా బిన్ నోమాన్ తెలియజేశారు- సయీద్ ఇలా చెప్పారు: కూఫా పండితుల మధ్య ఈ ఆయత్ (4: 93) గురించి భేదాభిప్రాయం ఏర్పడింది. అందువల్ల నేను దీని గురించి అడిగి తెలుసుకుందామని ప్రయాణం చేసి అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) సన్నిధికి వెళ్ళాను. నా సందేహానికి సమాధానమిస్తూ ఆయన ఇలా అన్నారు : "బుద్ధిపూర్వ కంగా ఒక విశ్వాసిని చంపేవాని ప్రతిఫలం నరకం.. అనే ఆయత్ ఈ వ్యవహారా నికి సంబంధించిన చివరి ఆయత్. వేరొక ఆయత్ ఏదీ దీనిని రద్దుపరచలేదు."[1]**

## అధ్యాయం : 17
## 'సలామ్' చేసిన తరువాత కూడా...

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**"విశ్వసించిన ప్రజలారా! మీరు అల్లాహ్ మార్గంలో 'జిహాద్' కొరకు బయలుదేరినప్పుడు, మిత్రులు శత్రువుల మధ్య విచక్షణ చేయండి. మీ వైపునకు సలాము చేస్తూ ముందుకు వచ్చేవాణ్ణి, 'నీవు ముస్లిమువు కావు' అని త్వరపడి అనకండి. మీరు గనక ప్రాపంచిక ప్రయోజనాలను పొందగోరితే, అల్లాహ్ వద్ద మీ కొరకు విజయధనాలు సమృద్ధిగా ఉన్నాయి. దీనికి పూర్వం స్వయంగా మీరూ ఇదే స్థితిలో ఉన్నారు కదా! ఆ తరువాత అల్లాహ్ మిమ్మల్ని కనికరించాడు. కనుక వివేచనతో వ్యవహరించండి. మీరు చేసేదంతా అల్లాహ్‌కు బాగా తెలుసు". *(4: 94)***

---

435-1. అకారణంగా ఏ మనిషినయినా చంపటం ఘోరమైన పాపం. ఖుర్ఆన్ ప్రకారం అకారణంగా ఒక మనిషిని చంపినవాడు సమస్త మానవ జాతిని సంహరించినట్లే. అలాంటి వాడు పెద్ద కల్లోల జనకుడు, అత్యాచారిగా పరిగణించబడతాడు. అదే ఒకవేళ ఒక ముస్లిం ప్రాణాన్ని అకారణంగా బలిగొన్నట్లయితే ఖుర్ఆన్ ప్రకారం ఇలాంటి హంతకుడు నరకాగ్నికి ఆహుతి అయి, శాశ్వతంగా అందులోనే మ్రగ్గుతూ ఉంటాడు. ఈ ఆయత్ ప్రకారం సాటి మోమిన్‌ను హత్య చేసిన వ్యక్తి పశ్చాత్తాపం ఆమోదించబడదని అంటారు ఇబ్నె అబ్బాస్(రజి). కాని అల్ ఫుర్ఖాన్ సూరాలోని 70వ ఆయత్ ప్రకారం పశ్చాత్తాపం ఆమోదించబడుతుందని అత్యధిక మంది విద్వాంసులు అభిప్రాయపడుతున్నారు.

ఉల్లేఖకులైన సయీద్ బిన్ జుబైర్ కూఫాకు చెందిన తాబయి. ఈయన అబూ మస్ ఊద్, ఇబ్నె అబ్బాస్, ఇబ్నె ఉమర్, ఇబ్నె జుబైర్ (రజిఅల్లాహు అన్‌హుమ్)ల వద్ద ధర్మజ్ఞానాన్ని ఆర్జించారు.

**436)** **ఇబ్నె అబ్బాస్(రజి) గారు "మీ వైపునకు సలామ్ చేస్తూ ముందుకు వచ్చేవాణ్ణి 'నీవు ముస్లిమ్‌వి కావు' అని త్వరపడి అనకండి"** అనే ఆయత్ గురించి చెబుతూ ఇలా విశదీకరించారు: ఒక వ్యక్తి (పేరు మిర్దాస్) తన గొర్రెల్ని కాస్తూ (ఉన్న ప్రదేశంలో) ఉండగా, అటువైపుగా సాగిపోయే ఒక ముస్లింల బృందం ఆయనకు కనబడింది. ఆయన వారికి 'అస్సలాము అలైకుమ్' అంటూ సలామ్ చేశారు. కాని ఈ వ్యక్తి (ప్రాణభయంతో) అబద్ధం చెబుతున్నాడని భావించి, వారు ఆయన్ని చంపేశారు. ఆయన గొర్రెల్ని వశపరచుకున్నారు. దానిపై అల్లాహ్ ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు.

## అధ్యాయం: 18

# వారు ఉభయులూ సమానులు కారు

మహోన్నతుడగు ప్రభువు ఇలా సెలవిచ్చాడు :

కారణమేదీ లేకుండానే ఇంటివద్ద కూర్చుండిపోయే ముస్లిములు, అల్లాహ్ మార్గంలో తమ ధనప్రాణాలతో "జిహాద్" చేసే ముస్లిములు ఉభయుల స్థానం సమానం కాదు. కూర్చుండిపోయేవారి స్థానం కంటే ధన ప్రాణాలతో "జిహాద్" చేసేవారి స్థానాన్ని అల్లాహ్ సమున్నతం చేశాడు. ప్రతి ఒక్కరికి అల్లాహ్ మేలునే వాగ్దానం చేసిన మాట వాస్తవమే అయినా ఆయన వద్ద ముజాహిద్‌ల సేవలకు లభించే ప్రతిఫలం, కూర్చుండిపోయే వారికి లభించే ప్రతిఫలం కంటే ఎంతో ఎక్కువ. వారి కొరకు అల్లాహ్ తరఫు నుండి ఉన్నత స్థానాలూ ఉన్నాయి. క్షమాభిక్ష, కారుణ్యం కూడా ఉన్నాయి. అల్లాహ్ ఎక్కువగా క్షమించేవాడూ అమితంగా కరుణించేవాడూను." ***(4: 95,96)***

**437)** మహనీయ జైద్ బిన్ సాబిత్(రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) తన చేత ఈ ఆయత్ వ్రాయించారు– *"తగు కారణమేదీ లేకుండానే ఇంటి వద్ద కూర్చుండిపోయే ముస్లిములు, అల్లాహ్ మార్గంలో ధన ప్రాణాలతో 'జిహాద్' చేసే ముస్లిములు– ఉభయుల స్థానం సమానం కాదు..."*

ఈ ఆయత్ లిఖించటం పూర్తి కాకముందే అబ్దుల్లాహ్ ఇబ్నె ఉమ్మె మక్తూమ్ (రజి) వచ్చి, 'దైవప్రవక్తా! దైవసాక్షిగా! నేను జిహాద్‌లో పాల్గొనగలిగితే తప్పకుండా పాల్గొనేవాణ్ణి' అని విన్నవించుకున్నారు. ఆయన అంధులు. అప్పుడు అల్లాహ్ తన

**ప్రవక్తపై 'వహీ'ని అవతరింపజేశాడు. ఆ సమయంలో ఆయన తొడ నా తొడపైన ఉంది. ('వహీ' ఒత్తిడి కారణంగా) దాని బరువు ఎంతగా పడిందంటే, నా తొడ చితికిపోతుందేమోనని భయపడ్డాను. ఈ పరిస్థితి తొలగిపోయిన తరువాత 'గైరు ఊలిజ్జరర్' (తగు కారణం లేకుండా)[1] అనే వాక్యాన్ని అల్లాహ్ అవతరింపజేశాడు.**

**438) బరా బిన్ ఆజిబ్(రజి) తెలిపారు : "లాయస్తవిల్ ఖాయిదూన మినల్ మోమినీన" (4: 95) ఆయత్ అవతరించినప్పుడు, దైవప్రవక్త(సఅసమ్) జైద్ బిన్ సాబిత్(రజి) ను పిలిచి, దానిని వ్రాయించారు. ఆయన దానిని వ్రాయటం పూర్తి కావస్తుండగానే అబ్దుల్లాహ్ ఇబ్నె ఉమ్మె మక్తూమ్(రజి) హాజరై, తన అంధత్వం గురించి సంజాయిషీ ఇచ్చుకున్నారు. అంతలోనే అల్లాహ్ 'గైరు ఊలిజ్జరర్' అనే వాక్యాన్ని అవతరింపజేశాడు (అంటే తగు కారణం ఉన్న వారు క్షంతవ్యులే అని చెప్పటం జరిగింది).**

**439) బరా బిన్ ఆజిబ్(రజి) ఇలా వివరించారు: అన్ నిసా సూరాలోని 95వ ఆయత్ అవతరించినప్పుడు ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఫలానా వ్యక్తిని (జైద్ బిన్ సాబిత్-రజి-ను) పిలిపించండి అని ఆజ్ఞాపించారు. ఆయన (జైద్) తన వెంట సిరాను, పలక లేక తొడ బొమికను తీసుకుని హాజరయ్యారు. అప్పుడు దైవప్రవక్త(స), ఇలా వ్రాసుకో : *"ఇంట్లో కూర్చుండిపోయే ముస్లిములు, అల్లాహ్ మార్గంలో తమ ధన ప్రాణాలతో జిహాద్ చేసే ముస్లిములు- ఉభయుల స్థానం సమానం కాదు..."* అన్నారు. ఆ సమయంలో దైవప్రవక్త(స) వెనుకనే ఉన్న అబ్దుల్లాహ్ ఇబ్నె ఉమ్మె మక్తూమ్(రజి) 'దైవప్రవక్తా! నేను అంధుణ్ణి కదా!' (మరి నా సంగతేమిటి?) అని విన్నవించుకున్నారు. అప్పుడు "తగు కారణమేదీ లేకుండా" అనే వాక్యం అవతరించింది.**

**440) ఇబ్నె అబ్బాస్(రజి) "ఇంట్లో కూర్చుండిపోయే ముస్లిములు...(4: 95)" గురించి వ్యాఖ్యానిస్తూ ఈ ఆయత్ చరిత్రాత్మకమైన బద్ర్ యుద్ధం నేపథ్యంలో అవతరించిందనీ, ఆ ధర్మ యుద్ధానికి వెళ్ళిన ముస్లిములు, తగు కారణమేదీ**

---

437-1. అంటే అంగవైకల్యం కలవారికి ఈ ఆదేశం నుండి మినహాయింపు ఉందని చెప్ప బడింది. ఈ వాక్యం ద్వారా అబ్దుల్లాహ్ ఇబ్నె ఉమ్మె మక్తూమ్(రజి) లాంటి దివ్యాంగు లకు ఊరట లభించింది. వారు ధర్మయుద్ధంలో పాల్గొనకపోయినప్పటికీ ముజాహిద్‌ల కన్నా వారి స్థాయి తక్కువేమీ కాదు.

లేకుండా ఆ యుద్ధంలో పాల్గొనని ముస్లింలు - ఉభయులూ సమానులు కారని ఇందులో చెప్పబడిందని అన్నారు.

## అధ్యాయం : 19

# తమ ఆత్మలకు అన్యాయం చేసుకుంటూ ఉండేవారి గురించి

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

తమ ఆత్మలకు అన్యాయం చేసుకుంటూ ఉండేవారి ప్రాణాలను తీసి, దైవ దూతలు వారిని, "ఇదేమిటి మీ స్థితి ఇలా ఉంది?" అని అడిగారు. అప్పుడు వారు ఇలా సమాధానం చెప్పారు : "మేము భూమిపై బలహీనులుముగా, నిస్సహాయుల ముగా ఉండేవారము". దైవదూతలు "అల్లాహ్ భూమి విశాలంగా లేదా మీరు వలస పోవటానికి?" అని అడిగారు. *(4: 97)*

**441)** ముహమ్మద్ బిన్ అబ్దుర్రహ్మాన్ అబుల్ అస్వద్ ఇలా అన్నారు: (మక్కాలో అబ్దుల్లాహ్ బిన్ జుబైర్-రజి-పరిపాలన ఉన్న కాలంలో) సిరియా వాసులకు వ్యతి రేకంగా ఒక సైన్యాన్ని సంసిద్ధం చేయాలని మదీనా వాసులకు ఆదేశించటం జరిగింది. ఆ సైన్యంలో నా పేరు కూడా వ్రాసి ఉంది. అప్పుడు నేను ఇబ్నె అబ్బాస్ (రజి) గారి బానిస యగు ఇక్రిమాను కలుసుకుని, పరిస్థితుల స్వరూపం గురించి వివరించాను. ఆ సైన్యంలో పాల్గొనరాదని ఆయన నన్ను చాలా గట్టిగా వారిం చారు. ఆయన (ఇక్రిమా) ఇంకా ఇలా అన్నారు: నాకు ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా ఉద్బోధించారు- కొంతమంది ముస్లింలు బహు దైవారాధకులతో కలసి (మక్కాలో) ఉండేవారు. ఆ విధంగా వారు దైవప్రవక్త(స)కు వ్యతిరేకంగా మోహరించిన సైనికుల సంఖ్యను పెంచినవారయ్యేవారు. తమ పక్షంపై బాణం వచ్చినప్పుడు వారు ముందుకు వచ్చేవారు. ఆ బాణం వారికి తగిలి ప్రాణం పోయేది. లేక (పొరపాటున) ఖడ్గపు వ్రేటుకు బలైపోయేవారు. దానిపై అల్లాహ్ ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు: **"తమ ఆత్మలకు అన్యాయం చేసుకుంటూ ఉండేవారి ప్రాణాలను తీసి..." (4: 97).** ఈ ఉల్లేఖనాన్ని లైస్ బిన్ సాద్ కూడా అబుల్ అస్వద్ నుండి సంగ్రహించారు.

**442)** అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి), "అయితే, నిజంగానే నిస్సహాయులై బయలుదేరటానికి ఏ మార్గమూ, ఏ సాధన సంపత్తీ లేని పురుషులనూ, స్త్రీలనూ, పిల్లలనూ అల్లాహ్ క్షమించవచ్చు" **(4: 98)** అనే ఆయత్‌ను ఉదాహరిస్తూ, 'నా తల్లి కూడా నిస్సహాయులైన వారిలో ఒకరు'గా ఉండేవారు అని అన్నారు.

## అధ్యాయం : 20

# అల్లాహ్ అమిత దయాళువు

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

అలాంటి వారిని అల్లాహ్ క్షమించే అవకాశం ఉంది. అల్లాహ్ ఎక్కువగా క్షమించేవాడు, అధికంగా మన్నించేవాడూను. **(4: 99)**

**443)** మహనీయ అబూ హురైరా (రజి) ఇలా వివరించారు: ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఇషా నమాజ్‌లో (రుకూ స్థితి నుండి లేచి నిలబడుతూ) **'సమిఅల్లాహు లిమన్ హమిదహ్'** అన్నారు. తరువాత సజ్దాలోకి వెళ్ళే ముందు ఇలా వేడుకున్నారు: "ఓ అల్లాహ్! అయ్యాష్ బిన్ అబీ రబీయాకు మోక్షం వొసగు. దేవా! సలమా బిన్ హిషామ్‌కు విముక్తిని ప్రసాదించు. అల్లాహ్! వలీద్ బిన్ వలీద్‌కు విముక్తి నొసగు. ఓ అల్లాహ్! నిస్సహాయులుగా ఉన్న విశ్వాసులకు విముక్తిని వొసగు. దేవా! అవిశ్వాసులైన ముజర్ తెగ వారిని కఠినంగా శిక్షించు. దేవా! యూసుఫ్(అలైహిస్సలామ్) కాలంలో వచ్చినటువంటి కరువును వారిపై విధించు."[1]

## అధ్యాయం : 21

# ప్రమత్తత పనికిరాదు

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"వర్షం వల్ల మీకు ఇబ్బందిగా ఉంటే లేక మీరు అస్వస్థులైతే ఆయుధాలను దించటం తప్పు కాదు. అయినప్పటికీ మీ జాగ్రత్తలో మీరు ఉండాలి." *(4: 102)*

---

443-1. మక్కా నగరంలో అవిశ్వాసుల చెరలో చిక్కుకుని ఉన్న నిస్సహాయులైన ముస్లింల కోసం దైవప్రవక్త(స) దుఆ చేశారు. అలాగే ముస్లింలకు తీవ్ర నష్టం కలిగించిన ముజర్ తెగ వారిని ఆయన(స) శపించారు. దీనినిబట్టి ముస్లింలను అకారణంగా హింసించే అవిశ్వాసులను అధిక్షేపించటం సరైనదేనని తెలుస్తోంది.

**444)** అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) తెలిపారు: “వర్షం వల్ల మీకు ఇబ్బందిగా ఉంటే లేక మీరు అస్వస్థులైతే ఆయుధాలను దించటం తప్పు కాదు” అనే ఆయత్ గురించి తెలుపుతూ, ఈ ఆయత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) గాయపడినప్పుడు అవతరించిందని అన్నారు.

## అధ్యాయం : 22

# స్త్రీల వ్యవహారంలో ధార్మిక తీర్పు

దైవోపదేశం :

“ప్రజలు నిన్ను స్త్రీల వ్యవహారంలో ధార్మిక తీర్పు (ఫత్వా) ఏమిటో అడుగుతున్నారు. వారితో ఇలా చెప్పు– “వారి విషయంలో అల్లాహ్ మీకు ధార్మిక తీర్పు ఇస్తున్నాడు. దానితోపాటు పూర్వం నుండీ మీకు ఈ గ్రంథంలో వినిపించబడుతూ వచ్చిన ఉత్తరువులను కూడా జ్ఞాపకం చేస్తున్నాడు. అంటే మీరు హక్కులను నెరవేర్చని, మీరు వివాహం చేయని అనాథ బాలికలకు (దురాశతో స్వయంగా మీరే వారిని వివాహం చేసుకోదలిచారు) సంబంధించిన ఉత్తరువులు.” *(4: 127)*

**445)** విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) గారు, “ప్రజలు నిన్ను స్త్రీల వ్యవహారంలో ధార్మిక తీర్పు అడుగుతున్నారు” **(4: 127)** అనే ఆయత్ గురించి వ్యాఖ్యానిస్తూ ఇలా అన్నారు– ‘ఈ ఆయత్ ఆ వ్యక్తి గురించి అవతరించింది. అతని పోషణలో గనక అనాథ బాలిక ఉంటే, అతను ఆమెకు సంరక్షకుడుగానూ, ఆమె ఆస్తికి వారసుడుగానూ ఉంటే, ఆ అమ్మాయి అతని సొమ్ములో భాగస్వామినిగా కూడా ఉంటే, ఆఖరికి ఖర్జూరపు చెట్లలో కూడా భాగస్వామిని అయి ఉంటే– అట్టి పరిస్థితిలో ఆ వ్యక్తి ఆ అమ్మాయిని వివాహమాడ గోర్తాడు. ఎందుకంటే ఆ అమ్మాయి వివాహం వేరొకరితో జరిగి, ఆమె ఆస్తిలో వేరొకరు భాగస్వాములవటం అతనికి ఇష్టం ఉండదు. అందుకే అతను ఆ అనాథ బాలిక వివాహం వేరొకరితో జరగకుండా అడ్డుకుంటూ ఉంటాడు. ఇలాంటి వ్యక్తి నేపథ్యంలోనే ఈ ఆయత్ అవతరించింది.’[1]

---

445–1. పోనీ అతను ప్రఖ్యాత పద్ధతిననుసరించి, ఆ పిల్లకు తగిన ‘మహర్’ ఇచ్చి నికాహ్ చేసుకుంటాడా అంటే అదీ చేయడు. పైగా ఆమె మహర్ చెల్లింపు విషయంలో దండి కొడతాడు. ఇక్కడ అల్లాహ్ ఆదేశం ఏమిటంటే, అతను పూర్తి మహర్ చెల్లిస్తే సరి. లేదంటే ఆమె వివాహం మరొకరితో జరిగే విషయంలో అడ్డు తగలకూడదు.

**446)** హజ్రత్ ఆయిషా(ర.అ) ఖుర్ఆన్‌లోని ఈ ఆయత్: *"ఒక స్త్రీ భర్త తనను నిరాదరించి, వేధిస్తాడేమో అనీ లేదా విముఖుడై ఈసడించుకుంటాడేమో అని భయపడితే, భార్యాభర్తలిరువురూ పరస్పరం (ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో) సర్దుబాటు చేసుకోవటంలో తప్పులేదు. ఏమైనప్పటికీ సర్దుబాటే ఉత్తమమైనది"* **(4: 128)**ను ఉదాహరిస్తూ, భార్య తన భర్తతో 'నేను నా వంతును వదులుకుంటున్నాను. (నీవు నాకు విడాకులు మాత్రం ఇవ్వకు)' అని చెప్పే నేపథ్యంలో ఈ వచనం అవతరించిందని అన్నారు.[1]

## అధ్యాయం : 23

# కపటుల గమ్యస్థానం

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"తెలుసుకోండి! కపటులు నరకంలో అట్టడుగు ప్రదేశానికి పోతారు. వారికి సహాయం చేసేవాడెవడూ మీకు దొరకడు." ***(4: 145)***

**447)** అస్వద్ కథనం: మేము అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) గారి దర్స్ సమావేశంలో ఉండగా హుజైఫా(రజి) ఏతెంచారు. ఆయన మా దగ్గరే నిలబడి సలామ్ చేశారు. తరువాత ఇలా అన్నారు: "మీకంటే ఉత్తములైన ఒక బృందం- కాపట్యానికి (మునాఫిఖత్‌కు) లోనయింది". అది విని అస్వద్, "సుబ్‌హానల్లాహ్! 'కపటులు నరకంలోని అట్టడుగు ప్రదేశానికి పోతార'ని అల్లాహ్ సెలవిచ్చాడు కదా!" అన్నారు. (ఈ మాటలపై) అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) చిరుమందహాసం చేశారు. హుజైఫా (రజి) మస్జిద్‌లోని ఒక మూలకు వెళ్ళి కూర్చున్నారు. ఆ తర్వాత అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) వెళ్ళిపోయారు. ఆయన శిష్యులు కూడా ఒక్కొక్కరే

---

హజ్రత్ జాబిర్ (రజి) పినతండ్రి కుమార్తె ఒకామె ఉండేది. ఆమె అందగత్తె కాదు. జాబిర్(రజి) ఆమెను వివాహమాడదలచలేదు. ఆమె దగ్గరున్న ఆస్తిపాస్తుల దృష్ట్యా ఆమెను వేరొకరికి ఇచ్చి వివాహం జరపటం కూడా ఆయనకు ఇష్టంలేదు. ఎందుకంటే ఆమెను నికాహ్ చేసుకున్న వ్యక్తి ఆమె ఆస్తిపై అధికారి అవుతాడని భయం. అప్పుడు ఈ ఆయత్ అవతరించింది.

కోమలాంగికి ఎట్టి పరిస్థితిలో కూడా నష్టం జరగరాదని షరీఅత్ చెబుతోంది.

446-1. భార్యాభర్తలు పరస్పరం చర్చించుకుని ఈ రకమైన అవగాహనకు వస్తే అందులో దోషం లేదు.

**అక్కడి నుండి నిష్క్రమించారు. తరువాత హుజైఫా(రజి) నా వైపు కంకరరాళ్ళు రువ్వి, దగ్గరకు రమ్మని సంజ్ఞ చేశారు. నేను ఆయన్ని సమీపించాను. హుజైఫా (రజి) ఇలా అన్నారు: "అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) చిరునవ్వు చిందించటంపై నాకు ఆశ్చర్యమేసింది. నిజానికి నేను చెప్పిన మాటను ఆయన బాగా అర్థం చేసు కునేవారే. నిశ్చయంగా ఒక సమూహం కాపట్యానికి గురైంది. వారు మీకంటే ఉత్తములే. అయితే తరువాత వారు పశ్చాత్తాపపడ్డారు. అల్లాహ్ వారి పశ్చాత్తాపాన్ని ఆమోదించాడు."[1]**

## అధ్యాయం : 24

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:**

**ప్రవక్తా! మేము నీ వైపునకు వహీ (దైవవాణి)ని పంపాము. నూహ్ వైపునకు ఆయన తరువాతి ప్రవక్తల వైపునకు పంపినట్లు. మేము ఇబ్రాహీము, ఇస్మాయీల్, ఇస్హాఖ్, యాఖూబ్, యాఖూబ్ సంతతి, ఈసా, అయ్యూబ్, యూనుస్, హారూన్, సులైమాన్‌ల వైపునకు వహీని పంపాము. *(4: 163)***

**448) అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు: "యూనుస్ బిన్ మత్తయి కన్నా నేను ఉత్తముడనని అనటం ఎవరికీ తగదు."[1]**

**449) ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఈ విధంగా ప్రవచించినట్లుగా**

---

447-1. కపటులు (మునాఫిఖీన్) ముస్లిములమైన మాకంటే ఉత్తములు ఎలా అవుతారు? అన్నది అస్వద్ సందేహం. ఇక హుజైఫా(రజి) చెప్పిన మాటలోని మతలబు ఏమిటంటే, కాపట్యానికి లోనయిన ఆ ప్రజలు సహాబా కాలానికి చెందినవారు. మీరేమో (అస్వద్) తాబయీల కాలానికి చెందినవారు. ఉత్తములైన ఆ జనులు కాపట్య రోగం కారణంగా చెడిపోయారు. ధర్మం (దీన్) నుండి తిరిగిపోయారు. అయితే చివరకు వారు పశ్చాత్తాపపడటంతో, అల్లాహ్ వారి పశ్చాత్తాపాన్ని ఆమోదించాడు.

448-1. పై ఆయత్ (4: 163)లో దైవప్రవక్త హజ్రత్ యూనుస్ (అలైహిస్సలామ్) ప్రస్తావన వచ్చింది. ఇదే అధ్యాయంలోని ప్రధానాంశం.

ప్రవక్త యూనుస్(అ) వల్ల ఒక పొరపాటు జరిగింది. తరువాత అల్లాహ్ యూనుస్ క్షమాపణను ఆమోదించి, ఆయన తప్పును మన్నించి, మళ్ళీ ఆయన్ని ప్రవక్తగా నియమించాడు. ఇకపోతే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) చెప్పిన మాట ఆయనలోని వినమ్రతకు తార్కాణం.

**అబూ హురైరా(రజి) ఉల్లేఖించారు: "నేను యూనుస్ బిన్ మత్తయి కన్నా ఉత్తముణ్ణి అని చెప్పినవాడు అబద్ధీకుడు."**

## అధ్యాయం : 25

# 'కలాలా' విషయంలో ధార్మిక తీర్పు

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**ప్రవక్తా! ప్రజలు నిన్ను 'కలాలా' విషయంలో ధార్మిక తీర్పు అడుగుతున్నారు. అల్లాహ్ మీకు ఈ ధార్మిక తీర్పు ఇస్తున్నాడు అని చెప్పు. ఒక మనిషి గనక సంతానం లేకుండా మరణిస్తే, అతనికి ఒక సోదరి ఉంటే, అప్పుడు ఆమె అతని ఆస్తిలో సగభాగం పొందుతుంది. సోదరి గనక సంతానం లేకుండా మరణిస్తే ఆమె సోదరుడు ఆమెకు వారసుడవుతాడు. ఒకవేళ మృతునికి (వారసులు) ఇద్దరు సోదరీమణులైతే, వారు అతని ఆస్తిలోని మూడింట రెండు భాగాలకు హక్కుదారులు అవుతారు. ఒకవేళ సోదరీ సోదరులు అనేకులు ఉన్నట్లయితే, అప్పుడు స్త్రీలకు ఒక వంతు పురుషులకు రెండు వంతులు లభిస్తాయి. అల్లాహ్ మీ కొరకు తన ఆజ్ఞలను విశదపరుస్తున్నాడు- మీరు మార్గం తప్పి తిరగకుండా ఉండేందుకు. అల్లాహ్‌కు ప్రతి విషయమూ తెలుసు". *(అన్ నిసా: 176)***

**450) బరా బిన్ ఆజిబ్(రజి) తెలిపారు: అన్నిటికన్నా ఆఖరిలో అవతరించిన సూరా బరాత్ సూరా (తౌబా సూరా). వారసత్వ ఆదేశాలకు సంబంధించి ఆఖరిలో అవతరించిన ఆయత్ 'కలాలా' ఆయత్[1] *(అన్ నిసా : 176)***

---

450-1. మహనీయ జాబిర్(రజి) ఇలా అన్నారు: నేను వ్యాధిగ్రస్తుణ్ణి అయి ఉన్నప్పుడు దైవప్రవక్త(స) నా దగ్గరకు వచ్చారు. నేను అపస్మారక స్థితిలో ఉండటం గమనించి ఆయన(స) వుజూ చేసి, ఆ నీరు నాపైన చిలకరించారు. నాకు స్పృహ వచ్చింది. అప్పుడు నేను 'దైవప్రవక్తా! నేను **'కలాలా'** వ్యక్తిని (అంటే తల్లిదండ్రులు గానీ, కొడుకులు, కూతుళ్ళు గానీ లేనివాణ్ణి). మరి నా ఆస్తి ఎలా పంపకం జరగాలి?' అని విన్నవించుకున్నాను. అప్పుడు ఈ ఆయత్ అవతరించింది.

# 5. అల్ మాయిదా సూరా వ్యాఖ్యానం

అధ్యాయం : 1

## ఇస్లామ్ ధర్మం పరిపూర్ణం గావించబడిన రోజు

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

“ఈ రోజు నేను మీ ధర్మాన్ని మీ కొరకు పరిపూర్ణం చేశాను.” *(5: 3)*

**451) తారిఖ్ బిన్ షిహాబ్ గారు ఖైస్ బిన్ అస్లమ్‌తో ఇలా అన్నారు: యూదులు హజ్రత్ ఉమర్(రజి)తో, ‘మీరు (ముస్లింలు) ఒక ఆయత్‌ను పారాయణం చేస్తూ ఉంటారు. ఒకవేళ అది మా వద్ద అవతరించి వుంటే, అది అవతరించిన దినాన మేము పండుగ చేసుకునేవారం’ అన్నారు. దానికి ఉమర్(రజి) “ఆ ఆయత్ (అల్ యౌమ అక్మల్తు లకుమ్ దీనకుమ్) ఎప్పుడు, ఎక్కడ అవతరించిందో నాకు బాగా తెలుసు. అరఫాత్ మైదానంలో ఈ ఆయత్ అవతరించినప్పుడు దైవప్రవక్త ముహమ్మద్(స) ఎక్కడ విడిది చేసి ఉన్నారో కూడా నాకు తెలుసు. దైవసాక్షిగా! ఆ సమయంలో మేము అరఫాత్ మైదానంలోనే ఉన్నాము.”[1] అది శుక్రవారం రోజో లేక మరో రోజో నాకు సందిగ్ధం ఉందని సుఫ్యాన్ సౌరీ చెప్పారు.**

---

451-1. ఖైస్ బిన్ అస్లం గారి మరొక ఉల్లేఖనం ప్రకారం అది ఖచ్చితంగా శుక్రవారం రోజే. ఈ ఆయత్ దైవప్రవక్త(స) వారి ‘హజ్జతుల్ వదా’ సందర్భంగా అవతరించింది. అది అరఫా దినం. శుక్రవారం సాయం సమయం. ఈ ఆయత్ అవతరించిన తరువాత ధర్మాధర్మాల (హలాల్- హరామ్)కు సంబంధించిన మరే ఆయత్ కూడా అవతరించ లేదు.

అంతిమ హజ్జ్ యాత్ర చేసిన మూడు నెలల తర్వాత దైవప్రవక్త(స) పరమపదించారు.

## అధ్యాయం : 2
# తయమ్ముమ్ ఆజ్ఞ

పరమ ప్రభువు ఇలా సెలవిచ్చాడు :

విశ్వసించిన ప్రజలారా! మీరు నమాజు కొరకు లేచినప్పుడు, మీ ముఖాలను, చేతులను మోచేతుల వరకు ప్రక్షాళనం చేసుకోండి; తలపై చేతులతో రాయండి, కాళ్ళను చీలమండ వరకు కడుక్కోండి. మీరు అపరిశుద్ధంగా ఉంటే, స్నానం చేసి పరిశుద్ధులు అవ్వండి. మీరు గనక అస్వస్థులైతే లేక ప్రయాణ స్థితిలో ఉంటే లేక మీలో ఎవరైనా కాలకృత్యాలు తీర్చుకుని వస్తే లేక మీరు స్త్రీలను ముట్టుకుంటే, అప్పుడు నీరు లభించని పక్షంలో పరిశుభ్రమైన మట్టితో విధిని నిర్వహించండి. దానిపై చేతులతో కొట్టి మీ ముఖాలపై, చేతులపై రాయండి. మీకు జీవితాన్ని కష్టతరం చేయటం అల్లాహ్ అభిమతం కాదు. కాని ఆయన మిమ్మల్ని పరిశుద్ధం చేయగోరుతున్నాడు, మీపై తన అనుగ్రహాన్ని పూర్తి చేయగోరుతున్నాడు– మీరు కృతజ్ఞులవుతారేమో అని.” ***(5: 6)***

**452)** దైవప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా(ర.అ) వివరించారు: మేము ఒక ప్రయాణంలో దైవప్రవక్త(సఅసమ్)తోపాటు బయలుదేరాము. మేము ‘బైదా’ లేక ‘జాతుల్ జైష్’ ప్రదేశానికి చేరుకునేటప్పటికి నా కంఠహారం పోయింది. అందుకే దైవప్రవక్త(స) ఆ హారాన్ని వెతికించేందుకు అక్కడే విడిది చేశారు. ఆ పరిసరాల్లో ఎక్కడా నీరు లేదు. ప్రవక్త సహచరుల వెంట కూడా నీరు లేదు. సహాబాల్లో కొంత మంది అబూబక్ర్(రజి) దగ్గరకు వచ్చి, ‘చూశారా! ఆయిషా(ర.అ) మూలంగా ఎంత ఇబ్బంది వచ్చి పడిందో. ఆమె వల్ల దైవప్రవక్త ఇక్కడే ఆగిపోవలసి వచ్చింది. మేము కూడా ఇక్కడే చిక్కుకుపోయాము. చూడబోతే ఇక్కడ ఎక్కడా నీటి వసతి లేదు. మాలో ఎవరి వద్ద కూడా నీరు లేదు’ అని ఫిర్యాదు చేశారు. అప్పుడు అబూ బకర్ (రజి) నా దగ్గరకు వచ్చారు. ఆ సమయంలో దైవప్రవక్త(స) నా తొడపై శిరస్సు ఉంచి నిద్రిస్తున్నారు. ఆయన (నాన్నగారు) నన్ను మందలించారు. నీ మూలంగా దైవప్రవక్తతోపాటు అందరూ ఇక్కడ ఆగిపోవలసి వచ్చిందని కోపగించుకున్నారు. ఆ క్షణంలో అబూబక్ర్(రజి) చాలా కోపంలో ఉన్నారు. అల్లాహ్

తలచినన్ని మాటలు ఆయన నాకు వినిపించారు. తన చేత్తో నా పొత్తి కడుపులో గిల్లసాగారు. దైవప్రవక్త(స)కు నిద్రా భంగం కలగరాదన్న ఉద్దేశ్యంతో నేను నిశ్శబ్దంగా ఉండిపోయాను. తరువాత దైవప్రవక్త(స) మేల్కొన్నారు. తెల్లవారే వరకూ నీటి జాడే లేదు. తరువాత అల్లాహ్ 'తయమ్ముమ్' ఆజ్ఞతో కూడిన ఆయత్‌ను అవతరింపజేశాడు. అప్పుడు ఉసైద్ బిన్ హుజైర్, 'ఓ అబూబక్ర్ కుటుంబీకులారా! ఇది మీ ద్వారా కలిగిన మొదటి శుభం కాదు' అని (ఉద్వేగంతో) చెప్పారు. తరువాత నా వాహనమైన ఒంటెను లేపారు. ఒంటె కూర్చున్న చోటే ఆ కంఠహారం ఉంది.

**453)** హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు: నా కంఠహారం 'బైదా' ప్రదేశంలో ఎక్కడో పడిపోయింది. ఆ సమయంలో మేము మదీనాకు తిరిగి వస్తున్నాము. దైవప్రవక్త(స) అక్కడే తన వాహనంపై నుండి దిగిపోయారు. తరువాత ఆయన(స) తన పవిత్ర శిరస్సును నా ఒడిలో పెట్టి నిద్రించసాగారు. అప్పుడు (నా తండ్రి) అబూబక్ర్(రజి) (గుడారం) లోనికి వచ్చి, నా ఎదపై గట్టిగా కొట్టి, కేవలం ఒక కంఠహారం కోసం దైవప్రవక్త(స) ప్రయాణానికి అంతరాయం కలిగిస్తావా? అని మందలించారు. కాని నేను మాత్రం ఉలుకూ పలుకూ లేకుండా అలాగే నిశ్శబ్దంగా కూర్చుండిపోయాను. నిజానికి ఆయన కొట్టిన దెబ్బ వల్ల నాకు బాధ కలిగించింది. కాని దైవప్రవక్త(స)కు నిద్రాభంగం కలగరాదన్న ఉద్దేశంతో నేను కదలలేదు, మెదలలేదు.

ఎట్టకేలకు దైవప్రవక్త(స) మేల్కొన్నారు. ఉషోదయం అయింది. నీటి కోసం గాలింపు మొదలయింది. కాని పరిసరాలలో ఎక్కడా నీరు లభ్యం కాలేదు. అప్పుడే ఈ ఆయత్ అవతరించింది. **"విశ్వసించిన ప్రజలారా! మీరు నమాజు కొరకు లేచినప్పుడు..... అప్పుడు నీరు లభించని పక్షంలో పరిశుభ్రమైన మట్టితో విధిని నిర్వహించండి..."** ***(అల్ మాయిదహ్-6)***

అప్పుడు ఉసైద్ బిన్ హుజైర్(ర) వచ్చి, 'ఓ అబూబక్ర్ ఇంటివారలారా! అల్లాహ్ మిమ్మల్ని జనుల కొరకు శుభవంతంగా చేశాడు. నిశ్చయంగా ఇది మీ కొరకు శుభప్రదం. మీ హారం పోయింది. దాని కారణంగా అల్లాహ్ 'తయమ్ముమ్' ఆయత్‌ను అవతరింపజేశాడు. ప్రళయం వరకూ ఇది ముస్లింల పాలిట వెసులుబాటు, శుభప్రదం' అన్నారు.

## అధ్యాయం : 3
# యూదుల అవిధేయత

**"(మూసా!) నీవూ, నీ ప్రభువూ- ఉభయులూ పోయి పోరాడండి. మేము ఇక్కడే కూర్చుని ఉంటాము."[1] *(5: 24)***

**454) అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) ఇలా వివరించారు: బద్ర్ సంగ్రామం సందర్భంగా మిఖ్దాద్ బిన్ అస్వద్(రజి) ఇలా అన్నారు: 'దైవప్రవక్తా! బనీ ఇస్రాయీల్ ప్రవక్త మూసా(అ)తో చెప్పిన విధంగా మేము మీతో చెప్పబోము. 'నీవూ, నీ ప్రభువూ ఉభయులూ పోయి పోరాడండి. మేము ఇక్కడే కూర్చుని ఉంటాము' అని చెప్పే రకం కాదు మేము. మీరు పదండి. మేము మీ వెంట ఉండి, ప్రాణాలకు తెగించి పోరాడటానికి సిద్ధంగా ఉన్నాము'. వారు చెప్పిన ఈ మాట విని దైవ ప్రవక్త(స) ఎంతో సంతోషించారు.**

## అధ్యాయం : 4
# దైవాదేశం

**అల్లాహ్‌తో, ఆయన ప్రవక్తతో పోరాడేవారికీ, ధరణిలో కల్లోలాన్ని సృష్టిస్తూ తిరిగేవారికీ శిక్ష ఏమిటంటే, వారిని చంపటం లేదా శిలువ పైకి ఎక్కించటం లేదా చేతులను, కాళ్ళను అభిముఖ దిశలలో ఖండించడం లేదా దేశం నుంచి బహిష్కరించటం. *(5: 33)***

**455) అబూ ఖిలాబా కథనం: ఈయన ఖలీఫా ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహ్మాలై) వెనుకే కూర్చుని ఉన్నారు. (సమావేశంలో ప్రతీకార చర్య గురించి ప్రస్తావన వచ్చింది) 'ఖిసాస్' (ప్రతీకారం) అనివార్యమని, మీకు పూర్వం ఉన్న ఖలీఫాలు కూడా 'ఖిసాస్' తీసుకున్నారని కొంతమంది అభిప్రాయపడ్డారు. తరువాత ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్(రహ్మా) తన వెనుక కూర్చుని ఉన్న అబూ ఖిలాబా వైపునకు తిరిగి, "అబ్దుల్లాహ్ బిన్ జైద్! నీ అభిప్రాయం ఏమిటి?" అని అడిగారు.**

3-1. దేవుడు మీకు వాగ్దానం చేసిన భూభాగం (Promissed Land) లోనికి వెళ్ళి శత్రువుతో పోరాడండి అని దైవప్రవక్త మూసా(అ) బనీ ఇస్రాయీల్‌కు ఆజ్ఞాపించినప్పుడు, వారు చెప్పిన మాటలివి. తత్కారణంగా అల్లాహ్ 40 ఏళ్ల వరకూ సినాయ్ ఎడారిలో తచ్చాడుతూ ఉండే శిక్ష విధించాడు. ఒక దశలో ఇస్రాయీల్ సంతతి వారు, 'మమ్మల్ని ఈజిప్టు రాజ్యం నుండి ఎందుకు తీసుకువచ్చావు?' అని కూడా మూసా(అ)తో నిష్ఠూరంగా అన్నారు.

లేదా “అబూ ఖిలాబా! నువ్వేమంటావ్?” అని అడిగారు. నేనిలా విన్నవించుకున్నాను : ‘నాకు తెలిసినంత వరకు మన ఇస్లామీయ షరీఅత్‌లో (అకారణంగా) ఏ ఒక్కరినీ చంపటం ధర్మసమ్మతం కాదు. అయితే ఎవరయినా వివాహితుడై ఉండి కూడా వ్యభిచారానికి ఒడిగడితే లేదా అకారణంగా ఎవరినయినా చంపితే లేదా దైవంతో, దైవప్రవక్తతో పోరాటానికి దిగితే అలాంటి వ్యక్తికి– ప్రతీకారంగా– మరణదండన విధించవచ్చు. ఇది విన్న అన్‌బస, “అనస్ బిన్ మాలిక్ మాకు ఇలాంటి హదీసునే వినిపించారు. ఆయన ఏమన్నారంటే, దైవప్రవక్త(స) వద్దకు కొంతమంది వచ్చి ‘మాకు మదీనా వాతావరణం సానుకూలంగా లేదు (మేము అస్వస్థతకు గురయ్యాము)’ అని విజ్ఞప్తి చేశారు. దానికి దైవప్రవక్త(స), “అలాగా! మా ఒంటెలు మేత మేయడానికి నగరం వెలుపలి ప్రదేశానికి వెళుతున్నాయి. మీరు కూడా వాటితోపాటే వెళ్ళండి. వాటి పాలు, మూత్రం తాగండి. (మీకు స్వస్థత చేకూరుతుంది)” అని సూచించారు. వారు ఆ ఒంటెల వెనుకే వెళ్లారు. వాటి పాలు, మూత్రం త్రాగారు. ఆరోగ్యవంతులయ్యాక వారి బుద్ధి మారింది. వారు విశ్వాస ఘాతుకానికి పాల్పడుతూ ఒంటెల కాపరిని కిరాతకంగా చంపేపి, ఆ ఒంటెల్ని తోలుకుని తమ ప్రాంతానికి పారిపోసాగారు. అలాంటి విశ్వాస ఘాతకులకు విధించే శిక్ష ఏమై ఉంటుంది? వారు పశువుల కాపరిని హతమార్చారు. అల్లాహ్, ఆయన ప్రవక్తపై యుద్ధం ప్రకటించారు (అంటే వారు ఇస్లాం ధర్మం నుండి తిరిగిపోయారు). దైవప్రవక్తను భయోత్పాతానికి గురి చేశారు. అన్‌బస ఈ హదీసు విని (ఆశ్చర్యచకితులై) ‘సుబ్‌హానల్లా!’ అన్నారు. ‘అన్‌బసా! ఏమిటి, నీవు నన్ను అబద్ధీకునిగా తలపోస్తున్నావా?’ అని నేనడిగితే, ‘లేదు. అనస్(రజి) నాకు ఈ హదీసునే వినిపించారు (దానిపై నాకు ఆశ్చర్యమేసింది. ఇకపోతే, నీకు హదీసు బాగా జ్ఞాపకం ఉంది) అన్నారు. తరువాత అన్‌బసా ఇలా అన్నారు: ‘సిరియా వాసులారా! అబూ ఖిలాబా లేదా ఈయన లాంటి విద్వాంసులను అల్లాహ్ మీలో సజీవంగా ఉంచినంత కాలం మీరు బాగుంటారు.’

అధ్యాయం : 5

## సమస్త గాయాల కొరకు సమానమైన ప్రతీకారం

దైవాజ్ఞ ఈ విధంగా ఉంది :

“తౌరాతు గ్రంథంలో మేము యూదుల కొరకు ఈ ఆజ్ఞను వ్రాశాము:

ప్రాణానికి బదులు ప్రాణం, కన్నుకు బదులు కన్ను, ముక్కుకు బదులు ముక్కు, చెవికి బదులు చెవి, పన్నుకు బదులు పన్ను, ఇలా సమస్త గాయాల కొరకు సమానమైన ప్రతీకారం. కాని ఎవరైనా ప్రతీకారం చెయ్యకుండా క్షమిస్తే, అది అతనికి కఫ్ఫారా (పాప పరిహారం) అవుతుంది. అల్లాహ్ అవతరింపజేసిన శాసనం ప్రకారం తీర్పు చెయ్యని వారే దుర్మార్గులు." ***(5 : 45)***

**456)** అనస్ బిన్ మాలిక్(రజి) ఇలా వివరించారు : అనస్ మేనత్తయగు రబీ ఒక అన్సార్ బాలిక ముందు వరుస పల్లు విరగ్గొట్టింది. ఆ అమ్మాయి కుటుంబీకులు ప్రతీకార న్యాయం (ఖిసాస్) కోరుతూ దైవప్రవక్త(సఅసమ్) సమక్షంలో హాజరయ్యారు. దైవప్రవక్త(స) ఖిసాస్ (ప్రతీకారం తీర్చుకునే) ఆదేశాన్ని జారీ చేశారు. అప్పుడు అనస్ బిన్ మాలిక్ పినతండ్రి యగు అనస్ బిన్ నజర్(రజి) 'లేదు. దైవసాక్షిగా! ఈమె పల్లు విరగ్గొట్టబడవు' అని నిష్కర్షగా చెప్పారు. "అనస్! (ఆవేశపడకు) దైవగ్రంథంలోని ఆజ్ఞ మాత్రం ప్రతీకార న్యాయమే" అని దైవ ప్రవక్త(స) ఆయన్ని సముదాయించారు. కాని అంతలోనే ఆ అమ్మాయి తరఫు వారు క్షమాభిక్ష పెట్టి దియత్ (పరిహారం) పుచ్చుకోవడానికి అంగీకరించారు. దానిపై దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "దైవదాసులలో చాలామంది ఎటువంటి వారంటే, వారు గనక ఒట్టేసుకుంటే అల్లాహ్ వారి ఒట్టును నిజం చేసి చూపుతాడు."

## అధ్యాయం : 6

# సందేశ ప్రదానం : ఆవశ్యకత

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

ప్రవక్తా! నీ ప్రభువు తరఫు నుండి నీపై అవతరించిన దానిని ప్రజలకు అందజెయ్యి. ఒకవేళ నీవు ఆ విధంగా చెయ్యకపోతే, ఆయన ప్రవక్తగా నీవు నీ ధర్మాన్ని నిర్వహించనట్లే. ప్రజల బారి నుండి అల్లాహ్ నిన్ను రక్షిస్తాడు.[1] ***(5: 67)***

6–1. ప్రియశిష్యులు రాత్రి పూట దైవప్రవక్త(స) ఇంటి వద్ద పహరాగా ఉండేవారు. కాని ఈ ఆయత్ అవతరించిన తరువాత దైవప్రవక్త(స) పహరాను ఎత్తివేశారు. "నా ప్రభువు నా రక్షణా బాధ్యత తీసుకున్నాడ"ని చెప్పారు. అల్లాహ్ ఏ విధంగా అడుగడుగునా ఆయన్ని రక్షించాడో, ఆయన(స) పవిత్ర జీవిత చరిత్రలోని ఒక్కొక్క పుట దానికి సాక్షిగా ఉంది.

**457)** అమ్మ ఆయిషా(ర.అ) ఇలా వక్కాణించారు: అల్లాహ్ తన సందేశ హరుని (సఅసమ్)పై అవతరింపజేసిన దానిలో నుంచి ఆయన కొంత దాచిపెట్టా రని చెప్పేవాడు అబద్ధీకుడు. ఎందుకంటే అల్లాహ్ స్వయంగా ఇలా సెలవిచ్చాడు: "ప్రవక్తా! నీ ప్రభువు తరపు నుండి నీపై అవతరించిన దానిని ప్రజలకు అంద జెయ్యి." **(5: 67)**

## అధ్యాయం : 7

# అర్థంలేని ప్రమాణాల గురించి...

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"మీరు చేసే అర్థంలేని ప్రమాణాలను గురించి అల్లాహ్ మిమ్మల్ని పట్టుకోడు. కాని మీరు బుద్ధిపూర్వకంగా చేసే ప్రమాణాలను గురించి ఆయన మిమ్మల్ని తప్పకుండా ప్రశ్నిస్తాడు." ***(5: 89)***

**458)** హజ్రత్ ఆయిషా(ర.అ) దివ్య ఖుర్‌ఆన్‌లోని ఈ ఆయత్‌ను గురించి **"మీరు చేసే అర్థంలేని ప్రమాణాలను గురించి అల్లాహ్ మిమ్మల్ని పట్టుకోడు"**– చెబుతూ, ఒకానొక వ్యక్తి చేసే అనాలోచిత ప్రమాణాల నేపథ్యంలో ఈ ఆయత్ అవతరిం చిందని అన్నారు. ఆ వ్యక్తి మాటిమాటికీ 'వల్లాహ్' **'వ బలా అల్లాహ్'** అని అంటుండే వాడు.

**459)** హజ్రత్ ఆయిషా(ర.అ) కథనం: తన తండ్రి అబూబకర్ సిద్దీఖ్ (రజి) ఎన్నడూ తాను చేసిన ప్రమాణానికి విరుద్ధంగా వ్యవహరించేవారు కారు. కాని అల్లాహ్ ప్రమాణ భంగానికి పరిహారం చెల్లించే ఆయత్‌ను అవతరింపజేసిన తరువాత, ఆయన తన నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. అంటే తాను ఒట్టేసు కున్న దానికన్నా ఉత్తమ మార్గం తన ముందు ఉన్నప్పుడు, ఆ ఉత్తమమైన దాన్ని అనుసరించాలని నిర్ణయించుకున్నానని[1] చెప్పేవారు.

---

459–1. "మీరు చేసే అర్థంలేని ప్రమాణాలను గురించి అల్లాహ్ మిమ్మల్ని నిలదీయడు" (5: 89) అనే ఆయత్ అబూబకర్ (రజి) గురించి అవతరించిందని సాలబా చెప్పారు. అబూబకర్ (రజి) కోపావేశంలో ఉన్నప్పుడు, మిస్తహ్ బిన్ ఉసాసాకు ఆర్థిక సహాయం చేయనని ఒట్టేసుకున్నారు. అమ్మ ఆయిషా(ర.అ)పై అపనింద మోపిన వారిలో ఒకరు ఈ మిస్తహ్.

## అధ్యాయం : 8

# అతివాదం అనర్థదాయకం

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**"విశ్వాసులారా! అల్లాహ్ మీ కొరకు ధర్మసమ్మతం చేసిన పరిశుద్ధ వస్తువులను నిషిద్ధం చేసుకోకండి. హద్దులను అతిక్రమించకండి. హద్దులను అతిక్రమించే వారిని అల్లాహ్ ఏమాత్రం ఇష్టపడడు". *(5 : 87)***

**460) అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (రజి) తెలిపారు: మేము ప్రవక్త మహనీయుల(సఅసమ్)తో కలసి జిహాద్‌లో పాల్గొనేవారం. మా వెంట మా భార్యలు ఉండేవారు కారు. అందుచేత, 'మేము వట్టలు ఎందుకు కొట్టించుకోకూడదు!?' అని సందేహం వ్యక్తపరిచాము. కాని దైవప్రవక్త(స) ఈ చర్య నుండి మమ్మల్ని వారించారు. దీనికి ప్రత్యామ్నాయంగా ఆయన(స) మాకు, ఏదైనా ఒక వస్త్రానికి (లేక మరేదయినా వస్తువుకు) బదులుగా ఎవరయినా ఒక స్త్రీని నికాహ్ చేసుకునేందుకు అనుమతించారు[1]. తరువాత అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (రజి) ఈ ఆయత్‌ను పఠించారు: "విశ్వాసులారా! అల్లాహ్ మీ కొరకు ధర్మసమ్మతం చేసిన పరిశుద్ధ వస్తువులను నిషిద్ధం చేసుకోకండి..."**

## అధ్యాయం : 9

# షైతాను పనులు

**దైవోపదేశం-**

**"విశ్వాసులారా! సారాయి, జూదం, దైవేతర మందిరాలు, పాచికల ద్వారా జోస్యం- ఇవన్నీ అసహ్యాకరమైన షైతాను పనులు. వాటిని విసర్జించండి. మీకు సాఫల్య భాగ్యం కలిగే అవకాశం ఉంది." *(5: 90)***

---

460-1. ఈ హదీసు **'ముతా'** అనే తాత్కాలిక నికాహ్‌ను సమర్థించేదిగా కనిపిస్తుంది. అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) కూడా 'ముతా'కు అనుకూలంగా ఉన్నట్లు విదితమవుతోంది. ఇస్లామ్ ఆరంభ కాలంలో 'ముతా'కు అనుమతి ఉండేది. కాని తరువాతి కాలంలో ఇది నిషేధించబడింది. ఇక ప్రళయం వరకూ ఇది నిషిద్ధమే.

నిర్ణీత వస్తువుకు బదులుగా నిర్ణీత వ్యవధి కొరకు- తాత్కాలికంగా- చేసుకునే నికాహ్‌ను **'ముతా'** అంటారు.

**461)** ఇబ్నె ఉమర్(రజి) తెలిపారు: సారాయి నిషేధాజ్ఞ అవతరించినప్పుడు, మదీనాలో అయిదు రకాల సారాయి ఉపయోగించబడేది. కాని ద్రాక్ష సారాయి ఉపయోగంలో ఉండేది కాదు. (అయినా అది కూడా నిషిద్ధంగా ఖరారయింది).

**462)** అనస్ బిన్ మాలిక్(రజి) వివరించారు : మేము 'ఫజీఖ్' (ఖర్జూరాల ద్వారా తయారు చేయబడిన సారాయి) తప్ప మరొక సారాయిని ఉపయోగించే వారం కాము. దానికే మీరు 'ఫజీఖ్' అనే పేరు పెట్టుకున్నారు. నేను నిలబడి అబూతల్హా (రజి)కు, ఇంకా ఫలానా ఫలానా వ్యక్తులకు సారా త్రాపించేవాణ్ణి. ఒకసారి నేను సారా త్రాపుతుండగా ఒక వ్యక్తి వచ్చి, 'మీకు తెలుసా?' అన్నాడు. 'ఏమిటి?' అని జనులు అడిగితే, 'సారాయి (మద్యపానం) నిషేధించబడింది' అని అతను చెప్పాడు. అంతే, 'అనస్! తక్షణం సారాయి పిడతల్ని కుమ్మరించు' అని వారు ఆజ్ఞాపించారు. ఈ సమాచారం అందిన క్షణం నుండీ వారు ఒక చుక్క సారాయి కూడా అడగలేదని అనస్ తెలిపారు.[1]

**463)** అమ్ర్ బిన్ దీనార్‌కు మహనీయ జాబిర్(రజి) ఇలా వివరించి చెప్పారు : ఉహుద్ యుద్ధదినాన ఉదయం (కొంతమంది) సహాబా మద్యం సేవించారు. ఆ రోజే వారంతా అమరగతినొందారు. అప్పటికి సారాయి హరామ్ (నిషిద్ధం)గా ఖరారు కాలేదు (అందువల్ల ఆ అమరవీరులు పాపాత్ములు కారు).

**464)** దైవప్రవక్త (సఅసమ్) మింబర్ పైనుంచి హజ్రత్ ఉమర్(రజి) చెప్పగా తాను విన్నానని ఇబ్నె ఉమర్(రజి) తెలిపారు: "అమ్మాబాద్! ప్రజలారా! మద్యపానం నిషేధాజ్ఞ అవతరించినప్పుడు అయిదు వస్తువుల ద్వారా మద్యం (సారాయి) తయారు చేయబడేది- ద్రాక్ష, ఖర్జూరం, తేనె, గోధుమలు, యవలు. మనిషి బుద్ధి తికమక పడేలా చేసే ప్రతి పదార్థం సారాయిగానే పరిగణించబడుతుంది.[1]

---

462-1. ప్రవక్త సహచరమాన్యుల విధేయతా భావానికి ఇది మచ్చుతునక. దైవాజ్ఞ రాగానే వారు దాని వైపునకు మరలి వచ్చారు. సిసలైన ఆత్మసమర్పణ అంటే ఇదే.

464-1. నమలి తినే వస్తువులయినా, త్రాగే ద్రవ పదార్థమైనా- అవి గనక మత్తెక్కించేవి అయివుంటే- అవన్నీ దీని క్రిందికే వస్తాయి. ఉదాహరణకు: చరస్, గంజాయి, అఫ్యూన్, భంగ్ వంటి మాదక ద్రవ్యాలు కూడా ఈ కోవలోకే వస్తాయి.

## అధ్యాయం : 10

# మంచి వైపునకు మరలి వచ్చినవారు

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"విశ్వసించి మంచి పనులు చేసేవారిని వారు పూర్వం తిన్న దానిని గురించి, త్రాగిన దానిని గురించి ప్రశ్నించటం జరగదు. కాని వారు ఇక ముందు హరాము చెయ్యబడిన వస్తువులకు దూరంగా ఉండాలి. స్థిరమైన విశ్వాసం కలిగి ఉండాలి. మంచి పనులు చెయ్యాలి. ఇంకా మానుకోవాలని ఆజ్ఞాపించబడిన వస్తువులన్నింటినీ మానుకోవాలి. అల్లాహ్ ఆజ్ఞను అంగీకరించాలి. భయభక్తులతో పాటు సద్వర్తన కూడా కలిగి ఉండాలి. అల్లాహ్ సౌశీల్యవంతులను ప్రేమిస్తాడు." *(5: 93)*

**465)** అనస్ బిన్ మాలిక్(రజి) తెలిపారు: సారాయి నిషేధాజ్ఞ అవతరించిన తరువాత కుమ్మరించబడిన సారాయి పేరు 'ఫజీఖ్'. నేను ప్రవక్త ప్రియ సహచరుల ఒక బృందానికి అబూ తల్హా (రజి) ఇంట్లో సారాయి త్రాపుతూ ఉన్నాను. అంతలోనే మద్యం నిషేధించబడినట్లు ఆజ్ఞ అవతరించింది. దైవ ప్రవక్త(స) దండోరా వేసే వ్యక్తిని పిలిచి, సారాయి నిషేధించబడినట్లుగా ప్రకటించమని ఆదేశించారు. ఆ వ్యక్తి మదీనాలో చాటింపు వేయటం మొదలెట్టాడు. 'బయట ఏదో శబ్దం వినిపిస్తోంది. అదేమిటో చూడు' అని అబూ తల్హా (రజి) నన్ను పురమాయించారు. నేను బయటికి వచ్చి చూస్తే "తస్మాత్ జాగ్రత్త! సారాయి నిషేధించబడింది" అని ఒక వ్యక్తి చాటింపు వేస్తున్నాడు. నేను వెళ్ళి ఈ విషయం చెప్పగానే "వెళ్ళి సారాయిని కుమ్మరించు" అని అబూ తల్హా నన్ను ఆదేశించారు.

ఉల్లేఖకుడు ఇలా అన్నారు: మదీనా వీధుల్లో మద్యం ఏరులై పారింది. ఆ రోజుల్లో **'ఫజీఖ్'** అనబడే మద్యం విరివిగా ఉపయోగించబడేది. సారాయి వీధుల్లో ప్రవహిస్తున్న వైనాన్ని చూసి కొంతమంది, 'అయ్యో! కొంతమంది సారాయిని తమ కడుపుల్లో నింపుకుని ఉన్న స్థితిలో, వారిని (యుద్ధంలో) హతమార్చటం జరిగింది కదా! (మరి వారి పర్యవసానం ఏమిటి?) అని సందేహపడ్డారు. అప్పుడు అల్లాహ్ ఈ ఆయత్‌ని అవతరింపజేశాడు: **"విశ్వసించి మంచి పనులు చేసేవారిని వారు పూర్వం తిన్న దాని గురించి, త్రాగిన దానిని గురించి ప్రశ్నించటం జరగదు..."** *(5: 93)*

## అధ్యాయం : 11

# ఏరి కోరి నష్టాల్లో పడకండి

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**“విశ్వాసులారా! మీకు గనక వివరిస్తే మీకే బాధ కలిగించే విషయాలను గురించి ప్రశ్నించకండి. కాని మీరు వాటిని ఖుర్‌ఆన్ అవతరించే సమయంలో అడిగితే, అవి మీకు విశదం చెయ్యబడతాయి. ఇంతవరకు మీరు చేసిన దానిని అల్లాహ్ క్షమించాడు. అల్లాహ్ క్షమించేవాడు, సహించేవాడూను. మీకు పూర్వం ఒక వర్గం వారు ఇటువంటి ప్రశ్నలనే అడిగారు. వారు ఆ ప్రశ్నల కారణంగానే అవిశ్వాసానికి గురి అయ్యారు.” *(5: 101, 102)***

**466) హజ్రత్ అనస్(రజి) తెలిపారు: ఒకసారి ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) విలక్షణమైన ప్రసంగం చేశారు. ఆయన(స) ఆ విధంగా ప్రసంగించటం నేనెప్పుడూ వినలేదు. ఆయన(స) ఇలా అన్నారు: “నాకు ఏదైతే తెలుసో, అది గనక మీకు తెలిస్తే మీరు చాలా తక్కువగా నవ్వుతారు. చాలా ఎక్కువగా ఏడుస్తారు”. ఇది విని ప్రవక్త ప్రియ సహచరులు తమ ముఖాలను దాచుకున్నారు. వారు ఎంతగా నిగ్రహించుకునే ప్రయత్నం చేసినా, వారు ఎక్కి ఎక్కి ఏడుస్తున్న శబ్దం వినిపించింది. ఇంతకీ జరిగిందేమిటంటే, ‘నా తండ్రి ఎవరు?’ అని ఒక సహచరుడు దైవప్రవక్త(స)ను ప్రశ్నించారు. “ఫలానా వ్యక్తి నీ తండ్రి” అని దైవప్రవక్త(స) సమాధానమిచ్చారు.[1] ఆ సందర్భంగానే ఈ ఆయత్ అవతరించింది : “విశ్వాసులారా! మీకు గనక వివరించి చెబితే మీకే బాధ కలిగించే విషయాలను గురించి (ప్రవక్తను) అడగకండి...” *(5: 101)***

---

466-1. అసలు జరిగిందేమిటంటే, ఒక వ్యక్తి విషయంలో కొంతమందికి సందేహం కలిగింది. అతడు హుజాఫా కొడుకు కాడని ఒకరంటే, హుజాఫా కొడుకే అని ఒకరన్నారు. అందుకే ఆ వ్యక్తి దైవప్రవక్త(స)ను అడిగాడు–ఇంతకీ నా తండ్రి ఎవరు? అని.

ఇక దైవప్రవక్త(స) చేసిన ప్రసంగం పరలోకం నేపథ్యంలో ఉంది. ఆ ప్రసంగ ప్రభావం ప్రియ సహచరులపై ఎంతగా పడిందంటే, వారు దుఃఖంతో అదే పనిగా విలపించసాగారు.

అధిక ప్రశ్నలు వేయటం, అనుచిత ప్రశ్నలు వేయటం మంచిది కాదని కూడా పై ఆయత్‌లో ఉపదేశించటం జరిగింది. వాటికి సంబంధించిన నిజానిజాలను గనక విశదీకరిస్తే, ప్రశ్నించినవారే సిగ్గుతో కుమిలిపోవాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు.

**467)** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా వివరించారు: కొంతమంది దైవప్రవక్త(సఅసమ్)కు వేళాకోళపు ప్రశ్నలు వేసేవారు. 'నా తండ్రి ఎవరు? అని ఒకడు ప్రశ్నిస్తే, తప్పిపోయిన తన ఒంటె గురించి 'ఇప్పుడది ఎక్కడ ఉంది?' అని మరో వ్యక్తి అడిగేవాడు. అలాంటి వారి కోసమే అల్లాహ్ ఈ ఆయత్‌ను అవతరింప జేశాడు : **"విశ్వాసులారా! మీకు గనక వివరిస్తే మీకే బాధ కలిగించే విషయాలను గురించి మీరు (దైవప్రవక్తను) ప్రశ్నించకండి"** *(5: 101)*

## అధ్యాయం : 12

# భ్రమల వలయంలో చిక్కుకున్నవారు

దైవోపదేశం

"అల్లాహ్ 'బహీరా'ను గాని, 'సాయిబా'ను గాని, 'వశీలా'ను గాని, 'హామ్'ను గాని ఎంతమాత్రం నిర్ణయించలేదు. అయినా ఈ అవిశ్వాసులు అల్లాహ్‌పై అప నిందను మోపుతున్నారు. వారిలో చాలామంది బుద్ధిలేనివాళ్ళు." *(5: 103)*

**468)** సయీద్ బిన్ ముసయ్యిబ్ ఇలా వివరించారు :

1) బహీరా : పాలు పితకకుండా వదలివేయబడే ఒంటె. అది దేవతల కోసం ప్రత్యేకించబడిన పశువుగా భావించబడేది. ఇలాంటి ఒంటె పొదుగును ఎవడూ ముట్టుకోడు.

2) సాయిబా : తమ దేవతల పేర అచ్చోసి వదలివేయబడిన ఒంటెను 'సాయిబా' అనేవారు. దానిని వాహనంగా గానీ, బరువు మోయటా నికి గానీ ఉపయోగించేవారు కారు.

ఈ విధంగా దేవతల పేర ఒంటెలను వదలిపెట్టిన మొట్టమొదటి వ్యక్తి అమ్ర్ బిన్ ఆమిర్ ఖుజాయి అని అబూ హురైరా (రజి) ఉల్లే ఖించిన ఒక హదీసు ద్వారా విదితమవుతోంది. దైవప్రవక్త (సఅ సమ్) ఈ విధంగా పలికారు: "నేను అమ్ర్ బిన్ ఆమిర్ ఖుజాయీని చూశాను. అతడు నరకంలో ప్రేవులు లాగుతున్నాడు." *(బుఖారీ– అల్ మాయిదా సూరా వ్యాఖ్యానం).*

3) వసీలా : ఒకసారి ఆడ ఒంటె పిల్లను ఈని, రెండవసారి కూడా ఆడ ఒంటెపిల్లనే ఈనిన ఒంటెను దేవతల పేర వదలిపెట్టేవారు. దానిని 'వసీలా' అని పిలిచేవారు.

**4)** **హామ్ : అనేక ఒంటె పిల్లల పుట్టుకకు కారణంగా నిలిచిన మగ ఒంటె (దీని వీర్యంతో పది ఒంటెపిల్లలు పుట్టి ఉంటే) అటువంటి పోతు ఒంటె చేత వ్యవసాయ పనులు చేయించటం, వాహనంగా ఉపయోగించటం భావ్యం కాదని తలంచి, దానిని దేవతల పేర విడిచిపెట్టేవారు.**

**469)** విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) వివరించారు :"నరకం లోని కొన్ని భాగాలు మరికొన్ని భాగాలను తినేస్తూ ఉండటం నేను చూశాను. ఇంకా నేను అమ్ర్ బిన్ ఆమిర్ దీనార్‌ను కూడా చూశాను. అతడు (నరకంలో) తన ప్రేవులను ఈడ్చుకుంటూ తిరుగుతున్నాడు. అందరికన్నా ముందు అచ్చోసిన ఒంటెలను వదలిపెట్టిన వ్యక్తి అతనే."

## అధ్యాయం : 13

# సాక్ష్యం- మానవాళి సమక్షంలో!

(... ప్రళయదినాన మర్యమ్ కుమారుడగు ఈసా–అలైహిస్సలామ్– తన ప్రభువుకు ఇచ్చుకునే సంజాయిషీ ఇది!) "నేను వారి మధ్యన ఉన్నంత కాలం వరకే నేను వారిని కనిపెట్టి ఉన్నాను. నీవు నన్ను తిరిగి పిలుచుకున్న తరువాత నీవే వారిని కనిపెట్టి ఉంటున్నావు. నీవు సర్వ విషయాలను కనిపెట్టి ఉండే వాడవు." *(5: 117)*

**470)** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు(సఅసమ్) ప్రసంగిస్తూ ఇలా అన్నారు: "ప్రజలారా! మీరు అల్లాహ్ వద్ద సమీకరించబడతారు– నగ్న పాదాలతో, నగ్న శరీరాలతో, సున్నతీ (సుంతీ) చేయని స్థితిలో ఉంటారు. తరువాత ఆయన (స) ఈ ఆయత్‌ను పఠించారు: **"కమా బదాన అవ్వల ఖల్ఖిన్ నుయీదుహూ వాదన్ అలైనా ఇన్నాకున్నా ఫాయిలూన్"** (ఏ విధంగానైతే మేము తొలిసారి పుట్టుక సమయంలో ఆరంభం చేశామో, అదేవిధంగా మేము దానిని మళ్లీ బ్రతికిస్తాము. ఇది మా మీద ఉన్న బాధ్యత. మేము దానిని తప్పకుండా చేస్తాము). తరువాత ఇలా అన్నారు: ప్రళయదినాన ప్రాణులలో అందరికన్నా ముందు ఇబ్రాహీమ్(అలైహిస్సలామ్)కు వస్త్రం తొడిగించబడుతుంది. నా ఉమ్మత్ (అనుచర సముదాయం)లోని కొంతమందిని తెచ్చి, వారిని ఎడమ (నరకం)

వైపునకు తీసుకుపోవటం జరుగుతుంది. అది చూసి నేను, “నా ప్రభూ! వీరు నా అనుచర సమాజం వారు కదా!” అని విన్నవించుకుంటాను. అప్పుడు నాతో ఇలా అనబడుతుంది : “నీకు తెలియదు. వీరు నీ తదనంతరం షరీఅత్‌లో కొత్త పుంతలు తొక్కారు. కొంగ్రొత్త విషయాలను సృష్టించారు.” అప్పుడు నేను సత్పురుషుడైన ఈసా(అ) పలికిన మాటనే పలుకుతాను. ఇలా అంటాను: **“(ప్రభూ!) నేను వారి మధ్యన ఉన్నంతకాలం వరకే నేను వారిని కనిపెట్టి ఉన్నాను. నీవు నన్ను తిరిగి పిలుచుకున్న తరువాత నీవే వారిని కనిపెట్టి ఉండేవాడవు”**– అప్పుడు, “నీవు వారి మధ్య నుండి నిష్క్రమించిన తరువాత వారు ధర్మం (దీన్) నుండి తిరిగి పోయార”ని నాకు తెలియపరచబడుతుంది.[1]

## అధ్యాయం : 14
# క్షమాభిక్ష దైవాధీనం

ఈసా (అలైహిస్సలామ్) విన్నపం :

“ఇప్పుడు ఒకవేళ నీవు వారిని శిక్షించినట్లయితే వారు నీ దాసులు, ఒకవేళ క్షమించినట్లయితే నీవు శక్తిమంతుడవు, వివేకవంతుడవు.” **(5: 118)**

**471)** ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) ఈ విధంగా చెప్పినట్లుగా అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) సయీద్ బిన్ జుబైర్‌కు తెలియజేశారు : “ప్రళయ దినాన మీరంతా సమావేశపరచబడతారు. కొంతమందిని నరకం వైపునకు తీసుకుపోవటం జరుగుతుంది. ఆ సమయంలో నేను సజ్జనుడైన దాసుడు (ఈసా– అలైహిస్సలామ్) పలికిన మాటనే పలుకుతాను– “(ప్రభూ) నేను వారి మధ్యన ఉన్నంతకాలం వరకే నేను వారిని కనిపెట్టి ఉన్నాను. నీవు నన్ను తిరిగి పిలుచుకున్న తరువాత నీవే వారిని కనిపెట్టి ఉండేవాడవు. ఇప్పుడు ఒకవేళ నీవు వారిని శిక్షించినట్లయితే వారు నీ దాసులు, ఒకవేళ క్షమించినట్లయితే నీవు శక్తిమంతుడవు, వివేకవంతుడవు.”

---

470–1. ఇస్లామ్ ధర్మావలంబనలో కొంగ్రొత్త విషయాలను సృష్టించే ‘బిద్అతీల’కు ఈ హదీసు కనువిప్పు కావాలి. ‘బిద్అత్’ ఎంత ప్రమాదకరమైన పోకడో వారు తెలుసుకోవాలి.

# 6. అల్ అన్‌ఆమ్ సూరా వ్యాఖ్యానం

## అధ్యాయం : 1
## కానరాని నిధి నిక్షేపాలు

**దైవోపదేశం-**

**"అగోచరాల తాళం చెవులు ఆయన వద్దనే ఉన్నాయి. వాటిని ఆయన తప్ప ఎవరూ ఎరుగరు."[1] *(6: 57)***

**472) ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఈ విధంగా ప్రవచించినట్లుగా సాలిమ్ బిన్ అబ్దుల్లాహ్‌తో ఆయన తండ్రి (అబ్దుల్లాహ్ బిన్ ఉమర్) చెప్పారు. అగోచరాల తాళం చెవులు అయిదు. 1) ప్రళయం ఎప్పుడు సంభవిస్తుందో నిశ్చయంగా అల్లాహ్‌కే తెలుసు 2) వర్షాన్ని కురిపించేవాడు కూడా ఆయనే[1] 3) మాతృగర్భాశయాలలో ఏముందో ఆయనకే తెలుసు 4) తాను రేపటి రోజున ఏం చేయనున్నాడో ఏ వ్యక్తికీ తెలీదు 5) తాను ఏ భూభాగంలో మరణిస్తాడో ఎవరికీ తెలియదు - నిశ్చయంగా అల్లాహ్‌యే సమస్తం తెలిసినవాడు, అన్నీ ఎరిగినవాడు.**

## అధ్యాయం : 2
## హెచ్చరిక

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**(ప్రవక్తా!) ఇలా చెప్పు: "ఆయన ఏదయినా శిక్షను మీపై నుండి అవతరింప**

---

1-1. అంటే గగన భువనాలలో ఉన్న సమస్త ఖజానాలు అల్లాహ్ అధీనంలోనే ఉన్నాయి. అవి ఎక్కడెక్కడ నిక్షిప్తమై ఉన్నాయో ఆయన సమ్మతి కానంత వరకూ బయల్పడవు.

472-1. వర్షం ఎప్పుడు కురుస్తుందో, ఎక్కడ కురుస్తుందో, ఎంత కురుస్తుందో, మరి ఆ వర్షపు నీరు ఎవరికి లాభదాయకంగా ఉంటుందో, ఎవరికి నష్టం చేకూరుస్తుందో- అంతా అల్లాహ్‌కే ఎరుక.

**జెయ్యగలడు లేదా మీ పాదాల క్రింద నుండి తీసుకురాగలడు లేదా మిమ్మల్ని వర్గాలుగా విభజించి ఒక వర్గం బలాన్ని మరొక వర్గానికి రుచి చూపించగలడు– ఈ శక్తి ఆయనకు ఉంది." *(6: 65)***

**473) మహనీయ జాబిర్(రజి) కథనం: "అల్లాహ్ ఏదయినా శిక్షను మీపై నుండి తీసుకురాగలడు" అనే వాక్యం అవతరించినప్పుడు, 'దేవా! నేను దీని నుండి నీ శరణు వేడుతున్నాను' అని దైవప్రవక్త(స) ప్రార్థించారు. "లేదా మీ పాదాల కింద నుండి తీసుకురాగలడు" అనే వచనం అవతరించిన తరువాత, 'అల్లాహ్! దీని నుండి నేను నీ శరణు వేడుతున్నాను' అని ప్రార్థించారు. "లేదా మిమ్మల్ని వర్గాలుగా విభజించి, ఒక వర్గం బలాన్ని మరొక వర్గానికి రుచి చూపించగలడు" అనే వాక్యం అవతరించిన తరువాత, 'ఇది మొదటి ఆపదలకన్నా తేలికైనది'[1] అని దైవప్రవక్త(స) పలికారు.**

## అధ్యాయం : 3
## రుజుమార్గాన ఉన్నవారు

**అల్లాహ్ ఇలా ఉపదేశించాడు :**

**తమ విశ్వాసాన్ని (ఈమాన్‌ను) 'జులుం'తో[1] కలుషితం చేయనివారికే శాంతి, వారు మాత్రమే రుజుమార్గంపై ఉన్నారు. *(6: 82)***

**474) మహనీయ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) వివరించారు : "తమ విశ్వాసాన్ని 'జులుం'తో కలుషితం చేయని వారికే శాంతి..." అనే ఆయత్ అవతరించి**

---

473–1. అంటే మీరు వర్గాలుగా చీలిపోతారు. మీలో విభేదాలు వస్తాయి. ఒకరింకొకరితో ఘర్షణకు దిగుతారు. ఈ ఘర్షణల్లో కొందరు సురక్షితంగా ఉంటే, కొందరు మరణిస్తారు. కాని దీనికి ముందు పేర్కొనబడిన రెండు విపత్తులు ఇంతకన్నా ప్రమాదకరమైనవి.

వేరొక ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త(స) ఇలా వక్కాణించారు: "నా ఉమ్మత్‌పైన ఆకాశం నుండి రాళ్ళ వాన కురిపించే, భూమిలో కూరుకుపోయేలా చేసే శిక్షలను అల్లాహ్ ఆపి ఉంచాడు. అయితే పరస్పర విభేదాలు, చీలికలు, అనైక్యత వంటి శిక్షను ఉండనిచ్చాడు. సహాబా(రజి) కాలంలో ఈ శిక్ష కూడా ఉండేది కాదు.

3–1. ఇక్కడ **'జులుం'** అంటే అర్థం షిర్క్ (బహుదైవోపాసన). తమ విశ్వాసాన్ని బహుదైవోపాసనతో కలగాపులగం చేయకుండా జాగ్రత్త పడినవారు మాత్రమే రుజుమార్గంపై ఉన్నట్లు లెక్క అని దీని భావం.

**నప్పుడు, 'అయ్యో! మనలో జులుం నుండి తనను కాపాడుకున్నవాడు ఎవడు న్నాడు?' అని సహచరులు పరస్పరం చెప్పుకున్నారు. అప్పుడు "ఇన్నష్షిర్క లజుల్మున్ అజీమ్" (నిశ్చయంగా 'షిర్క్' ఘోరాతిఘోరమైన జులుం) అనే ఆయత్ అవతరించింది.**[1]

## అధ్యాయం : 4

# ప్రవక్తల మధ్య వివక్ష పాటించకూడదు

**దైవోపదేశం–**

**"యూనుస్, లూత్‌కు (సన్మార్గం చూపాము) వారిలో ప్రతి ఒక్కరికీ మేము భూలోక వాసులందరిపై ఘనతను ప్రసాదించాము."** ***(6: 86)***

**475) మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) ఈ విధంగా ప్రవచించినట్లుగా ఇబ్నె అబ్బాస్(రజి) ఉల్లేఖించారు: "నాకు యూనుస్ బిన్ మత్తయి (అలైహిస్స లామ్)పై ప్రాధాన్యతను కల్పించటం ఎవరికీ తగదు."**

**476) మహనీయ అబూ హురైరా(రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహో దయులు ముహమ్మద్(సఅసమ్) ఇలా వక్కాణించారు: "నేను యూనుస్ బిన్ మత్తయి (అ) కన్నా శ్రేష్టుణ్ణి అని అనటం ఎవరికీ తగదు."**

## అధ్యాయం : 5

# మార్గబోధన

**"ప్రవక్తా! వారే (ఆ ప్రవక్తలే) అల్లాహ్ తరఫు నుండి మార్గదర్శకత్వం పొందినవారు. వారి మార్గాన్నే నీవు అనుసరించు."** ***(6: 90)***

**477) ఇబ్నె అబ్బాస్(రజి)తో ముజాహిద్ గారు 'సాద్' సూరాలో 'సజ్దా' ఉందా? అని ప్రశ్నించగా, 'అవును. ఉంది' అని ఆయన(రజి) బదులిచ్చారు. తరు వాత ఆయన "వ వహబ్‌నా" నుండి "ఫబిహుదాహుముఖ్‌తది" వరకు పారాయణం చేశారు. 'దావూద్ (అలైహిస్సలామ్) కూడా ఆ ప్రవక్తలలో ఉన్నార'ని కూడా చెప్పారు.**

---

474–1. ప్రవక్త ప్రియ సహచరులు(రజి) **'జులుం'**ను సాధారణ అర్థం (దుర్మార్గం, అన్యాయం, దౌర్జన్యం, విపరీతం)లో తీసుకున్నారు. కాని ఇక్కడ **'జులుం'** అంటే అర్థం బహుదైవా రాధన అని అల్లాహ్ తేటతెల్లం చేశాడు. మనిషి విశ్వాసంలో రవ్వంత షిర్క్ కలిసినా, అతని విశ్వాసం (ఈమాన్) పూర్తిగా వృధా అయిపోతుంది.

## అధ్యాయం : 6
# బెడిసికొట్టిన తలబిరుసుతనం

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

“యూదు మతం అవలంబించిన వారికి మేము గోళ్ళు ఉన్న అన్ని జంతువులనూ నిషేధించాము. ఆవు, మేకల కొవ్వును కూడా, వాటి వీపునకూ లేక ప్రేవులకూ లేక ఎముకలకూ అంటి వున్నది తప్ప. ఇది మేము వారి తలబిరుసుతనానికి గాను వారికి విధించిన శిక్ష.” ***(6: 146)***

**478)** ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఈ విధంగా పలికినట్లుగా తాను విన్నట్లు జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) తెలిపారు: “అల్లాహ్ యూదులను నాశనం చెయ్య్య. అల్లాహ్ వారి కొరకు మృత జంతువుల కొవ్వును నిషిద్ధం (హరామ్)గా చేసినప్పటికీ, వారు దాని నుండి తైలాన్ని తీసి అమ్ముకోసాగారు. తద్వారా వచ్చిన సొమ్మును తినేవారు.”

## అధ్యాయం : 7
# నీతిబాహ్యతకు దూరంగా ఉండాలి

దైవోపదేశం–

“అశ్లీల విషయాల దరిదాపులకు కూడా పోకండి– బహిరంగమైనవైనా సరే, లేక గోప్యమైనవైనా సరే.” ***(6: 151)***

**479)** అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) వివరించారు : “అల్లాహ్ కన్నా ఎక్కువ పౌరుషం కలవాడు ఎవడూ లేడు. ఈ కారణంగానే ఆయన నీతిబాహ్యమైన పనులను, సిగ్గుమాలిన చేష్టలను నిషిద్ధం (హరామ్)గా ఖరారు చేశాడు– అవి బహిర్గతమైనవి కానివ్వండి, గోప్యమైనవి కానివ్వండి (అవి నిషిద్ధమే). అల్లాహ్‌కు తన స్తుతిస్తోత్రం కన్నా ఇష్టకరమైనది మరొకటి లేదు. ఎందుకంటే ఆయన స్వతహాగా స్తవనీయుడు”. (అమ్ర్ బిన్ ముర్రా ఇలా అంటున్నారు) మీరు ఈ హదీసును స్వయంగా అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) నోట విన్నారా? అని నేను అబూ వాయల్‌ను అడగ్గా, ‘అవును’ అని ఆయన బదులిచ్చారు. ‘మరైతే ఆయన గారు దైవప్రవక్త(స) సౌజన్యంతో ఈ హదీసును విశదీకరించారా?’ అని నేను మళ్ళీ అడిగితే, ‘అవును’ అని ఆయన అన్నారు.

**480) అబూ హురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహోదయులు ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు: "సూర్యుడు పడమటి దిక్కు నుండి ఉదయించనంతవరకూ ప్రళయం సంభవించదు. దానిని ప్రత్యక్షంగా తిలకించినప్పుడు మానవులంతా విశ్వసిస్తారు. కాని అప్పుడు వారి విశ్వాసం వారికి ఏ విధంగానూ లాభదాయకం కాజాలదు."**

**481) అబూ హురైరా (రజి) ఉల్లేఖనం: మహనీయ ముహమ్మద్ (సఅసమ్) ప్రవచనం– "సూర్యుడు పడమటి దిక్కున ఉదయించనంత వరకూ ప్రళయం రాదు. సూర్యుడు పడమటి దిశలో ఉదయించటాన్ని చూసిన జనులంతా (దైవాన్ని) విశ్వసిస్తారు. కాని ఆ క్షణంలో విశ్వసించిన వారి విశ్వాసం (ఈమాన్) ఏ ఒక్కరికీ ప్రయోజనకరం కాజాలదు"– ఇలా పలికిన మీదట దైవప్రవక్త(స) "లా యన్ఫవు నఫ్సన్ ఈమానుహా" అనే ఆయత్‌ను పఠించారు.**

# 7. అల్ ఆరాఫ్ సూరా వ్యాఖ్యానం

అధ్యాయం : 1

## నిషిద్ధమైనవి

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

ప్రవక్తా! వారితో ఇలా అను: "నా ప్రభువు నిషేధించినవి ఇవి: సిగ్గు మాలిన పనులు - బహిరంగమైనవి కాని, లేక గుప్తమైనవి కాని- పాపాలు సత్యానికి వ్యతిరేకంగా మేర మీరటం, అల్లాహ్ ఏ ప్రమాణాన్నీ అవతరింపజేయక పోయినా మీరు ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా కల్పించటం (వాస్తవంగా అల్లాహ్‌యే అన్నాడని), మీకు తెలియని విషయాన్ని మీరు అల్లాహ్ పేరుతో చెప్పటం." *(7: 33)*

**482)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్(రజి) దైవప్రవక్త(స) హదీసును ఉటంకిస్తూ ఇలా అన్నారు: "అల్లాహ్ కన్నా ఎక్కువ పౌరుషవంతుడు ఎవడూ లేడు. అందుచేత ఆయన సిగ్గుమాలిన వాటినన్నింటినీ నిషేధించాడు- అవి బహిరంగ మైన వైనా సరే, గోప్యమైనవైనా సరే. తనను పొగడడాన్ని అల్లాహ్ కన్నా ఎక్కువగా ఇష్టపడేవాడు ఎవడూ లేడు. ఎందుకంటే ఆయన తన గురించి తాను ప్రశంసించు కున్నాడు". ఈ హదీసును విన్న అమ్ర్ బిన్ ముర్రా ఇలా అంటున్నారు: 'ఏమిటి, మీరు ఈ హదీసు అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్(రజి) నోట విన్నారా?' అని నేను అబూ వాయల్‌ను అడగ్గా, 'అవున'ని ఆయన చెప్పారు.

అధ్యాయం : 2

## అల్లాహ్‌తో మూసా (అ) సంభాషించినప్పుడు....

మహోన్నతుడగు అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"మేము నిర్ణయించిన సమయానికి సరిగ్గా మూసా చేరినప్పుడు, అతని

ప్రభువు అతనితో సంభాషించాడు. అప్పుడు అతను ఇలా మనవి చేశాడు : “ప్రభూ! నా చూపునకు బలాన్ని ప్రసాదించు. నిన్ను చూస్తాను.” ఇలా సెలవిచ్చాడు: “నీవు నన్ను చూడలేవు. కొంచెం, ముందున్న ఆ కొండవైపు చూడు. అది తన స్థానంలో స్థిరంగా ఉంటే అప్పుడు నీవు నన్ను చూడగలవు.” ఆ ప్రకారం అతని ప్రభువు ఆ కొండపై తన తేజస్సును ప్రసరింపజేసి దానిని భస్మం చేసేశాడు. మూసా స్పృహ తప్పి పడిపోయాడు. తెలివి వచ్చిన తరువాత ఇలా అన్నాడు : “నీవు పరిశుద్ధుడవు. నేను నీ సన్నిధిలో పశ్చాత్తాపపడుతున్నాను. అందరికంటే మొదట నేనే విశ్వసిస్తున్నాను.” ***(7: 143)***

**483)** అబూ సయీద్ ఖుద్రీ (రజి) ఇలా వివరించారు : ఒక యూదుడు దైవప్రవక్త(సఅసమ్) సన్నిధిలో హాజరయ్యాడు. అతని ముఖంపై ఎవరో కొట్టారు. ‘ఓ ముహమ్మద్! మీ అన్సార్ సహచరులలోని ఒక వ్యక్తి నాకు చెంప దెబ్బ కొట్టాడ’ని ఆ వ్యక్తి ఆరోపించాడు. “అతన్ని పిలిపించండి” అని దైవప్రవక్త(స) ఆదేశించారు. జనులు ఆ సహచరుణ్ణి పిలుచుకువచ్చారు. “నీవు ఇతనికి చెంప దెబ్బ కొట్టావట ఎందుకు?” అని ఆయన(స) ప్రశ్నించగా ఆ అన్సార్ సహచరుడు ఇలా సమాధానం ఇచ్చాడు : ‘దైవప్రవక్తా! నేను యూదులు ఉండే వీధి మీదుగా వెళుతుండగా, ‘మూసా(అలైహిస్సలామ్)కు సమస్త మానవులపై ప్రాధాన్యతను ఇచ్చిన వాని సాక్షిగా!’ అని ఇతను ఒట్టేసి మరీ చెబుతుంటే నాకు కోపం వచ్చింది. ‘ఏమిటి? ముహమ్మద్(స)పైన కూడానా? అని నేను అడిగాను. ఆ కోపంలో అతని చెంప ఛెళ్ళుమనిపించాను.’ అంతా విన్న తరువాత ఆయన(స) ఇలా అన్నారు: “నాకు దైవప్రవక్తలపై ప్రాధాన్యతను కల్పించకండి. ప్రళయదినాన మనుషులంతా స్పృహ తప్పి పడిపోతారు. అందరికన్నా ముందు నేను స్పృహలోకి వస్తాను. అయితే నేను మూసా (అలైహిస్సలామ్)ను చూస్తాను. ఆయన దైవ సింహాసనం (అర్ష్) కాలు ఒక దానిని పట్టుకుని ఉంటారు. ఆయన నా కంటే ముందే స్పృహలోనికి వచ్చారో లేక తూర్ పర్వతంపై ఆయన స్పృహ కోల్పోయిన దానికి బదులుగా ఆయనకు (ప్రళయదినాన) స్పృహ కోల్పోవటం నుండి మినహాయింపు ఇవ్వటం జరిగిందో నాకు తెలియదు.”

## అధ్యాయం : 3

# మన్న్- సల్వా

"మేము వారిపై మన్న్ సల్వాలను దింపాము" (7: 160)

**484)** ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) ఈ విధంగా ప్రవచించి నట్లుగా సయీద్ బిన్ జైద్(రజి) ఉల్లేఖించారు : 'ఖుంబీ' కూడా 'మన్న్' పదార్థానికి చెందినదే. దాని నీరు కళ్లకు వ్యాధి నివారిణి."

## అధ్యాయం : 4

# మానవులారా!

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"మానవులారా! నేను మీ అందరి వైపునకు వచ్చిన అల్లాహ్ సందేశహరుణ్ణి. ఆయన భూమ్యాకాశాల సామ్రాజ్యానికి ప్రభువు. ఆయన తప్ప మరొక దేవుడు లేడు. ఆయనే జీవితాన్ని ప్రసాదిస్తాడు. ఆయనే మృత్యువును ఇస్తాడు. కనుక విశ్వసించండి అల్లాహ్‌ను, ఆయన పంపిన నిరక్షరాస్యుడైన ప్రవక్తను- అతను అల్లాహ్‌ను, ఆయన సూక్తులను విశ్వసిస్తాడు - అతనిని అనుసరించండి, మీరు సరియైన మార్గం పొందుతారేమో" (7: 158)

**485)** మహనీయ అబూ దర్దా (రజి) ఇలా వివరించారు : అబూ బక్ర్ (రజి)- ఉమర్(రజి)ల మధ్య ఏదో విషయంపై వాదన జరిగింది. మాటామాటా పెరిగింది. ఉమర్(రజి) గారు అబూబక్ర్(రజి) ధోరణిపై కినుక వహించి, అక్కణ్ణుంచి వెళ్ళిపోయారు. అబూబక్ర్(రజి) కూడా ఆయన వెనకే నడుస్తూ క్షమాపణ కోరసాగారు. కాని ఉమర్(రజి) మాత్రం ఆయన్ని క్షమించలేదు. (ఇంటికి చేరుకోగానే) లోపలి నుంచి తలుపు మూసేసుకున్నారు.

అబూ దర్దా (రజి) ఇలా అంటున్నారు: ఆ సమయంలో మేము దైవప్రవక్త (స) దగ్గరే కూర్చుని ఉన్నాము. దైవప్రవక్త(స) అబూబక్ర్ రావటం చూసి "మీ మిత్రుడు ఎవరితోనో గొడవ పడినట్టున్నారు" అని చెప్పారు.

ఉల్లేఖకుడు ఇలా అన్నారు : మరోవైపు ఉమర్(రజి) కూడా తన వైఖరిపై

**సిగ్గుపడ్డారు. ఆయన దైవప్రవక్త(స) వద్దకు వచ్చి, సలామ్ చేసి కూర్చున్నారు. తరువాత జరిగినదంతా వివరంగా చెప్పారు.**

**అబూ దర్దా (రజి) ఇలా వివరించారు :**

**అంతా విన్న మీదట ఆయన(స) తన అయిష్టతను వ్యక్తపరిచారు. 'అయ్యా! దైవప్రవక్తా! తప్పు నా తరఫునే జరిగింద'ని అబూబక్ర్(రజి) పదేపదే సంజాయిషీ ఇవ్వసాగారు. (అయినా దైవప్రవక్త సంతృప్తి చెందలేదు). పిదప ఆయన(స) ఇలా అన్నారు : "ఏమిటి, మీరు నన్ను నా సహచరుడి నుండి వేరుపరచగోర్తున్నారా? ఏమిటి, మీరు నా సహచరుణ్ణి నా నుండి దూరం చేయదలుస్తున్నారా? (వినండి!) 'మానవులారా! నేను మీ అందరివైపునకు వచ్చిన అల్లాహ్ సందేశహరుణ్ణి' అని ప్రకటించినప్పుడు, 'నీవు అబద్ధం చెబుతున్నావు' అని మీరన్నారు. అప్పుడు అబూ బక్ర్ ఒక్కడే 'మీరు నిజం చెబుతున్నార'ని (నా దైవదౌత్యాన్ని) ధ్రువీకరించాడు."[1]**

**'అబూ బక్ర్ (రజి) మేలు (మంచి) విషయంలో ముందంజ వేశార'ని అబూ అబ్దుల్లాహ్ వ్యాఖ్యానించారు.**

## అధ్యాయం : 5

# 'హిత్తతున్'

**దైవాదేశం–**

**వారికి ఇలా ఆజ్ఞాపించటం జరిగిన సందర్భాన్ని జ్ఞాపకం తెచ్చుకో: "ఈ పట్టణంలోకి పోయి నివసించండి. దాని పంట ద్వారా మీ ఇష్ట ప్రకారం ఆహారం పొందండి. ఇంకా "హిత్తతున్" "హిత్తతున్" అంటూ వెళ్ళండి. సాష్టాంగ పడుతూ పట్టణ ద్వారంలో ప్రవేశించండి. మేము మీ తప్పులను మన్నిస్తాము. సద్వైఖరి కలిగి ఉండేవారిని అధికానుగ్రహంతో సత్కరిస్తాము." (7: 161)**

**486) మహాప్రవక్త(సఅసమ్) ఈ విధంగా ప్రవచించారని అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు : "వినమ్రులై, వంగి ద్వారం గుండా నగరంలోనికి ప్రవేశిస్తూ, 'హిత్తతున్' (మా తప్పులపై పశ్చాత్తాపపడుతున్నాము. మమ్మల్ని క్షమించు) అని**

485–1. అంటే, నా సందేశాన్ని మీ అందరికన్నా ముందు విశ్వసించిన వ్యక్తి అబూబక్ర్(రజి), కాబట్టి మీరు మీ వరిష్ట సహచరుణ్ణి గౌరవించండి. నాతో అతనికున్న సహచర్యాన్ని కూడా దృష్టిలో ఉంచుకోండి అని దైవప్రవక్త(స) చెప్పదలిచారు. దీని ద్వారా కూడా మహనీయ అబూబక్ర్(రజి) గొప్పదనం స్పష్టమవుతోంది.

పలకండి" అని బనీ ఇస్రాయీల్‌కి ఆదేశించటం జరిగింది. కాని వారు దైవాజ్ఞను మార్చేసి, పిరుదులపై దేక్కుని వెళుతూ, 'మాకు వెన్నుల్లోని గింజ కావాలి' అని పలికారు.[1]

## అధ్యాయం : 6
# ఎవరేమన్నను....

దైవోపదేశం-

"ప్రవక్తా! మృదుత్వం, మన్నింపుల వైఖరిని అవలంబించు. మంచిని ప్రబోధించు. మూర్ఖులతో వాదానికి దిగకు." *(7: 199)*

**487)** మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) కథనం : ఉయైనా బిన్ హిస్న్ బిన్ హుజైఫా ఒకసారి తన భ్రాతృజుడైన హుర్ బిన్ ఖైస్ దగ్గరకు వచ్చి ఆగారు. హజ్రత్ ఉమర్(రజి) సాన్నిహిత్యం పొందినవారిలో ఒకరు హుర్ బిన్ ఖైస్. దివ్య ఖుర్‌ఆన్‌లో పాండిత్యం ఉన్నవారిని, ఖుర్‌ఆన్‌ను మధురాతి మధురంగా పారాయణం చేసేవారిని ఉమర్(రజి) తన సన్నిహితులుగా ఉంచేవారు- అంటే ఇలాంటి విద్వాంసులకే ఉమర్(రజి) సదనాలలో చోటు లభించేది. వారు పిన్న వయస్కులైనా సరే, వయో వృద్ధులైనా సరే (వయో పరిమితి ఉండేది కాదు). ఉయైనా తన భ్రాతృజుణ్ణి ఉద్దేశించి, 'అబ్బాయి! అమీరుల్ మోమినీన్ సమావేశాల్లో నీకు బహు సామీప్యం లభించింది కదా! నేను కూడా వారి మజ్లిస్‌లో హాజరయ్యేందుకు అనుమతి తీసుకో' అని కోరారు. దానికి హుర్ బిన్ ఖైస్, 'సరే. మీ కొరకు నేను అనుమతి కోర్తాను' అన్నారు.

ఇబ్నె అబ్బాస్(రజి) ఇంకా ఇలా అన్నారు:[1] ఉయైనా కోసం కూడా ఆయన అనుమతి కోరారు. ఉమర్(రజి) అనుమతి ప్రదానం చేశారు. ఉయైనా మజ్లిస్‌లోకి వచ్చీరాగానే, 'ఓ ఖత్తాబ్ పుత్రుడా! దైవసాక్షిగా! మీరు మాకు సొమ్ము ఇవ్వటం లేదు. మా పట్ల న్యాయంగా కూడా వ్యవహరించటం లేదు' అని నిందించారు.

486-1. ఇస్రాయీల్ సంతతి వారి వెకిలి చేష్టలలో ఇదీ ఒకటి. దైవాజ్ఞలలో ప్రక్షిప్తాలకు పాల్పడుతూ బనీ ఇస్రాయీల్ (యూదులు) ఏ విధంగా తమ ఆత్మలకు అన్యాయం చేసుకునేవారో చెప్పడానికి ఈ ఒక్క ఉదాహరణ చాలు.

**ఉయైనా మాటలపై హ(జ్రత్ ఉమర్(రజి)కు చాలా కోపం వచ్చింది. ఉమర్ (రజి) ఆయన్ని సమీపించబోతుండగానే హుర్ బిన్ ఖైస్ జోక్యం చేసుకుని ఇలా విన్నవించుకున్నారు: 'అమీరుల్ మోమినీన్! అల్లాహ్ తన ప్రవక్తనుద్దేశించి ఏమన్నాడో తెలుసా? మృదుత్వం, మన్నింపుల వైఖరిని అవలంబించు. మంచిని ప్రబోధించు. మూర్ఖులను పట్టించుకోకు (7: 199) అన్నది అల్లాహ్ ఆజ్ఞ. ఇకపోతే, ఈయన గారి గురించి చెప్పమంటారా! ఈయన గారు కూడా అలాంటి మూర్ఖులలో ఒకరు' అని చెప్పారు. దైవసాక్షి! హుర్ బిన్ ఖైస్ ఖుర్‌ఆన్‌లోని ఈ ఆయత్‌ను చదివి వినిపించగానే ఉమర్(రజి) ఒక్కసారిగా మెత్తబడిపోయారు. దైవగ్రంథం ఆజ్ఞ ముందు ఆయన పరిస్థితి ఇలాగే ఉండేది.**[2]

---

487-1. ఇబ్నె అబ్బాస్(రజి) టీనేజీ కుర్రాడుగా ఉన్నప్పటి నుండే హ(జ్రత్ ఉమర్(రజి) సమావేశాలలో కూర్చునేవారు. ఇతర వరిష్టులపై, వయోవృద్ధులపై ఆయనకు ప్రాధాన్యత లభించేది. హ(జ్రత్ ఉమర్(రజి) పాండిత్యానికి, పండితులకు విలువ ఇచ్చేవారు. ముస్లిం పరిపాలకుడు ఇలాగే ఉండాలి. సదా సర్వదా పాండిత్యానికి విలువ ఇవ్వాలి. విద్వాంసులను ఆదరించాలి. లేకపోతే రాజ్యంలో విజ్ఞానం వికసించదు సరికదా, రాజ్యం అజ్ఞానుల హస్తగతమై పతనమైపోతుంది. శోచనీయమైన విషయం ఏమిటంటే మన కాలంలో పండితులకు కనీసం అజ్ఞానుల వరుసలో కూడా చోటు లభించటం లేదు. పండితులకు లభించవలసిన పదవులు అజ్ఞానులకు లభిస్తున్నాయి.

నేను స్వయంగా ఒక చేదు సంఘటనను ఎదుర్కొన్నాను. కొన్నాళ్ళ పాటు నేను న్యాయాధికారి హోదాలో చిక్కుబడవలసి వచ్చింది. పాండిత్యం, పండితుల విలువ తెలియని వారి మధ్య నేను ఇమడలేకపోయాను. అజ్ఞానం ఆవహించినవారు నాకు ఆ పదవి నుండి ఉద్వాసన పలికారు. ఇక అక్కడ పదవులను అలంకరించినవారి ప్రతిభ గురించి చెప్పాలంటే, నేను వారికి ఏండ్ల తరబడి విద్య నేర్పగలను. పదవీచ్యుతుణ్ణి గావించబడినందుకు సంతోషంతో సజ్దా చేసి, దైవానికి కృతజ్ఞతలు సమర్పించుకున్నాను. (వహీదుజ్జమాఁ)

487-2. దేవ దేవ! ఒకవైపు ఉయైనా అమర్యాద, మరోవైపు ఖలీఫా ఉమర్(రజి) నిగ్రహం, సంయమనం! ఆ దృశ్యాన్ని కాస్త ఊహించుకోండి. ఉమర్(రజి) స్థానంలో వేరెవరయినా ప్రాపంచిక పదవీ వ్యామోహం గల చక్రవర్తి ఉండి ఉంటే, ఉయైనా గారి దురుసు వైఖరిపై కఠినంగా శిక్షించి ఉండేవాడు. ఉయైనా హ(జ్రత్ ఉమర్(రజి)ను అంచనా వేయటంలో పొరబడ్డారు.

**488) మహనీయ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) ఇలా వివరించారు : "మృదుత్వం, మన్నింపుల వైఖరిని అవలంబించు. మంచిని ప్రబోధించు..." అనే ఆయత్ ప్రజల నీతి నడవడికల సంస్కరణకై అవతరించింది.**

**(వేరొక సనదు)**

**అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) ఇలా అన్నారు : "జనుల నైతికతను సంస్కరించే కృషిలో మన్నింపుల వైఖరిని అవలంబించమని అల్లాహ్ తన ప్రవక్తను ఆదేశించాడు లేదా అలాంటి ఆదేశమే ఇచ్చాడు."**

---

రాజ్య ధనాగారానికి ఉమర్(రజి) తనను ఒక ధర్మకర్తగా భావించారు. బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతాన్ని దరికి రానివ్వలేదు. కన్నకొడుకు అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి)ను సయితం ఆయన ఒక సగటు సిపాయిగానే పరిగణించారు. అదీగాక, మహనీయ ఉమర్(రజి)లోని విశిష్టత ఏమిటంటే ఖుర్ఆన్ ఆధారంగా ఆయనకు ఎప్పుడు హితోపదేశం చేసినా దైవాజ్ఞ ముందు సరెండర్ అయిపోయేవారు. – రజిఅల్లాహు అన్హు.

# 8. అల్ అన్‌ఫాల్ సూరా వ్యాఖ్యానం

**పరమ ప్రభువు ఇలా సెలవిచ్చాడు :**

**వారు నిన్ను "అన్‌ఫాల్"ను గురించి అడుగుతున్నారు. ఇలా అను: "ఈ అన్‌ఫాల్ అల్లాహ్‌కూ ఆయన ప్రవక్తకూ చెందుతాయి. కనుక మీరు అల్లాహ్‌కు భయపడండి. మీ పరస్పర సంబంధాలను సంస్కరించుకోండి."★ (8: 1)**

**489) సయీద్ బిన్ జుబైర్ ఇలా అన్నారు: నేను అన్‌ఫాల్ సూరా గురించి ఇబ్నె అబ్బాస్(రజి)ను అడిగితే, ఈ సూరా బద్ర్ యుద్ధ సందర్భంగా అవతరించిందని చెప్పారు.**

### అధ్యాయం : 1

## నీచాతి నీచమైన కోవకు చెందిన జంతువులు

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**తమ బుద్ధిని ఉపయోగించని చెవిటివారూ, మూగ వారూ మాత్రమే అల్లాహ్ దృష్టిలో నీచాతి నీచమైన కోవకు చెందిన జంతువులు *(8: 22)***

**490) "తమ బుద్ధిని ఉపయోగించని చెవిటి వారూ, మూగ వారూ మాత్రమే అల్లాహ్ దృష్టిలో నీచాతి నీచమైన కోవకు చెందిన జంతువులు" (8: 22) అనే ఆయత్**

---

★ హజ్రత్ ఉబాదా బిన్ సామిత్ (రజి) ఇలా అన్నారు: మేము బద్ర్ సంగ్రామంలో పాల్గొన్నాము. అవిశ్వాసులు ఓటమిపాలై పారిపోతున్నప్పుడు ముస్లిం సైనికుల్లోని కొంతమంది, పారిపోయేవారిని వెంబడించారు. మరికొంతమంది యుద్ధ ప్రాప్తి (మాలె గనీమత్)ని పోగు చేయసాగారు. ఇంకా కొంతమంది దైవప్రవక్త(స) రక్షణలో ఉన్నారు. రాత్రి అందరూ ఒకచోట సమావేశమైనప్పుడు, యుద్ధప్రాప్తిని పోగు చేసిన వారు, 'ఇది మా సొత్తు' అని అన్నారు. ఇతరులు కూడా తమ హక్కును గురించి వాదించారు. వారి మధ్య విభేదం తీవ్రతరమైనప్పుడు ఈ 'అన్‌ఫాల్' సూరా అవతరించింది.

బనూ అబ్దుద్దార్ తెగకు చెందిన కొంతమంది[1] గురించి అవతరించిందని ఇబ్నె అబ్బాస్(రజి) తెలిపారు.

## అధ్యాయం : 2
# ప్రవక్త మిమ్మల్ని పిలిచినప్పుడు....

దైవోపదేశం

“విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్ పిలుపునకూ, ఆయన ప్రవక్త పిలుపునకూ జవాబు పలకండి, ప్రవక్త మీకు జీవితాన్ని ప్రసాదించే దాని వైపునకు మిమ్మల్ని పిలిచినప్పుడు. తెలుసుకోండి, అల్లాహ్ మనిషికీ అతని హృదయానికీ మధ్య ఉన్నాడనీ, ఆయన వైపునకే మీరు పోగు చేయబడతారనీ.” *(8: 24)*

**491)** అబూ సయీద్ బిన్ ముఅల్లా (రజి) తెలిపారు: నేను నమాజ్ చేస్తుండగా, దైవప్రవక్త (సఅసమ్) నా దగ్గర నుండి సాగిపోతూ నన్ను పిలిచారు. నేను వెంటనే ఆయన(స) దగ్గరకు వెళ్ళలేకపోయాను. నమాజ్ చేసిన తరువాత ఆయన సన్నిధిలో హాజరయ్యాను. “నీవు రావటంలో ఆలస్యం ఎందుకయింది?” ‘విశ్వసించిన ప్రజలారా! ప్రవక్త మీకు జీవితాన్ని ప్రసాదించే దాని వైపునకు మిమ్మల్ని పిలిచినప్పుడు, మీరు అల్లాహ్ పిలుపునకూ, ఆయన ప్రవక్త పిలుపునకూ జవాబు పలకండి’ అని అల్లాహ్ ఆదేశించలేదా?’ అన్నారు. తరువాత ఆయన(స) “నేను మస్జిద్ నుండి వెడలకముందు నీకు ఖుర్ఆన్‌లోని ఒక గొప్ప సూరాను నేర్పుతాను” అని అన్నారు.

ప్రవక్త సహచరులైన అబూ సయీద్ బిన్ ముఅల్లా (రజి) ఇలా అన్నారు: “ఆ సూరా ‘అల్ హమ్దులిల్లాహి రబ్బిల్ ఆలమీన్”. అందులో ఏడు ఆయత్‌లు ఉన్నాయి. అది ప్రతి నమాజులో పఠించబడుతుంది.[1]

---

490-1. ఖురైషు సత్య తిరస్కారుల్లోని బనూ అబ్దుద్దార్‌కు చెందిన కొంతమంది ఉహుద్ యుద్ధ రంగంలో సత్య తిరస్కారపు (కుఫ్ర్) జెండాను పట్టుకుని ఉన్నారు. అల్లాహ్ వారిని మూగవారు, చెవిటి వారైన జంతువులుగా ఖరారు చేశాడు. వారు తమ పరిణామం గురించి బొత్తిగా ఆలోచించలేదు.

491-1. ఈ హదీసు ఆధారంగా విద్వాంసులేమంటారంటే; మనిషి నమాజులో నిమగ్నుడై ఉన్నప్పటికీ, దైవప్రవక్త(స) పిలిచినప్పుడు తక్షణం లబ్బైక్ అనాలి. దానివల్ల నమాజ్ భగ్నమవదు.

## అధ్యాయం : 3

## దైవప్రవక్త అవిశ్వాసుల మధ్యన ఉన్నంత కాలం...

ప్రవక్తా! అవిశ్వాసులు చెప్పిన ఆ మాటను కూడా వారికి జ్ఞాపకం చెయ్యి. (వారిలా అన్నారు:) "దైవమా! ఇది నిజంగా నీ ప్రభువు నుండి వచ్చిన సత్యమే అయితే, మాపై ఆకాశం నుండి రాళ్ళను కురిపించు. లేదా ఏదయినా బాధాకర మయిన శిక్షను మాపైకి తీసుకురా." *(8: 32)*

**492)** అనస్ బిన్ మాలిక్(రజి) కథనం: అబూ జహ్లా ఇలా అన్నాడు– **"దైవమా! ఇది నిజంగా నీ తరపు నుండి వచ్చిన సత్యమే అయితే, మాపై ఆకాశం నుండి రాళ్ళను కురిపించు లేదా ఏదైనా బాధాకరమైన శిక్షను మాపైకి తీసుకురా."**[1]

దానిపై ఈ ఆయత్ అవతరించింది: **(ప్రవక్తా!) నీవు వారి మధ్యన ఉన్నప్పుడు, అల్లాహ్ వారిపై ఆపదను అవతరింపజెయ్యడు. ప్రజలు క్షమాభిక్ష కొరకు ప్రార్థిస్తూ ఉంటే, వారిని శిక్షించటం అనేది అల్లాహ్ సంప్రదాయం కాదు. కాని ఇప్పుడు ఆయన వారిపై శిక్షను ఎందుకు అవతరింపజెయ్యకూడదు, వారు 'మస్జిదె హరామ్' యొక్క మార్గాన్ని ఆటంక పరుస్తూ ఉన్నప్పుడు?...** *(8: 33,34)*

## అధ్యాయం : 4

## క్షమాభిక్షకై వేడుకున్నట్లయితే...

"(ప్రవక్తా!) నీవు వారి మధ్యన ఉన్నప్పుడు, అల్లాహ్ వారిపై ఆపదను అవత రింపజెయ్యడు. ప్రజలు క్షమాభిక్షకై ప్రార్థిస్తూ ఉంటే, వారిని శిక్షించటం అనేది అల్లాహ్ సంప్రదాయం కాదు." *(8: 33)*

**493)** అనస్ బిన్ మాలిక్(రజి) చెప్పగా తాను విన్నట్లు సాహిబ్ జియాదీ

---

ఫాతిహా సూరా గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "(ఓ ముహమ్మద్!) మేము నీకు ఏడు ఆయత్‌లను ఇచ్చి ఉన్నాము. అవి పదేపదే పునరావృతం అవుతుంటాయి. ఇంకా మహోన్నతమైన ఖుర్‌ఆన్‌ను నీకు ఇచ్చి ఉన్నాము". *(అల్ హిజ్ర్ : 87)*

492–1. అబూ జహ్లా మొర ఆలకించబడింది. అతను బద్ర్ రణరంగంలో అవమానకరమైన చావు చచ్చాడు. పై ఆయత్‌లో చెప్పబడినదేమంటే వారు గనక పశ్చాత్తాప భావంతో దేవుని వైపునకు మరలినట్లయితే అల్లాహ్ తప్పకుండా వారిపై దయ చూపి ఉండే వాడు. కాని వారి జాతకంలో ఇస్లాం అనుగ్రహ భాగ్యం లేదు.

అబ్దుల్ హమీద్ తెలియజేశారు. ఆయన (అనస్) కథనం ప్రకారం అబూ జహ్లో ఇలా వేడుకున్నాడు: "దేవా! ఇది నిజంగా నీ తరఫు నుండి వచ్చిన సత్యమే అయితే, మాపై ఆకాశం నుండి రాళ్ళను కురిపించు లేదా ఏదయినా బాధాకరమైన శిక్షను మాపైకి తీసుకురా". దానిపై ఈ ఆయత్ అవతరించింది: "(ప్రవక్తా!) నీవు వారి మధ్యన ఉన్నప్పుడు, అల్లాహ్ వారిపై ఆపదను అవతరింపజెయ్యడు. ప్రజలు క్షమాభిక్ష కొరకు ప్రార్థిస్తూ ఉంటే, వారిని శిక్షించటం అనేది అల్లాహ్ సంప్రదాయం కాదు. కాని ఇప్పుడు ఆయన వారిపై శిక్షను ఎందుకు అవతరింపజెయ్యకూడదు, వారు 'మస్జిదె హరామ్' మార్గాన్ని ఆటంకపరుస్తూ ఉన్నప్పుడు?" *(8: 34)*

## అధ్యాయం : 5
# పీడన సమసిపోయే వరకూ...

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"పీడన ఏ మాత్రం మిగలకుండా పోయే వరకు, అల్లాహ్ నిర్ణయించిన ధర్మం పూర్తిగా నెలకొల్పబడేవరకు ఈ అవిశ్వాసులతో యుద్ధం చెయ్యండి. తరువాత వారు పీడనను మానుకుంటే, అల్లాహ్ వారి కర్మలను తప్పకుండా గమనిస్తాడు. ఒకవేళ వారు మానకపోతే, అల్లాహ్ మీకు సంరక్షకుడు అని తెలుసుకోండి. ఆయన ఉత్తమ రక్షకుడూ, సహాయకుడూను." *(8: 39,40)*

**494)** హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం: ఒక వ్యక్తి (హిబ్బాన్ లేదా ఉలా బిన్ ఉరార్) అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి)ను, 'అబూ అబ్దుర్రహ్మాన్! మీరు ఖుర్ఆన్‌లోని ఈ ఆయత్‌ను వినలేదా? **"ఒకవేళ విశ్వాసులలోని రెండు వర్గాల వారు పరస్పరం పోట్లాడుకుంటే, వారి మధ్య రాజీ కుదిరించండి. తరువాత, ఒకవేళ వారిలో ఒక వర్గం వారు రెండో వర్గం వారిపై దౌర్జన్యం చేస్తే, దౌర్జన్యం చేసినవారు అల్లాహ్ ఆజ్ఞ వైపునకు మరలేవరకు వారికి వ్యతిరేకంగా పోరాడండి" (49: 9).** ఈ ఆయత్ ఆధారంగా మీరు (అలీ, ముఆవియాలిద్దరితో) ఎందుకు పోరాడటం లేదు? "వారికి వ్యతిరేకంగా పోరాడండి" అని అల్లాహ్ స్వయంగా ఆదేశించాడు కదా!' అని ప్రశ్నించగా, అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఇలా సమాధానమిచ్చారు: "అబ్బాయ్! నేను గనక ఈ ఆయత్‌కు భావాన్వయం చేసు కుంటే ముస్లింలతో పోరాడకుండా ఉండటమే నాకు మంచిదని అనిపిస్తోంది. **'వమన్ యఖ్‌తుల్ మోమినన్**

**ముతఅమ్మిదన్' (ఈ ఆయత్‌లో బుద్ధిపూర్వకంగా ఒక విశ్వాసిని చంపిన దానికి శిక్షగా నరక యాతన ఉంటుందని చెప్పబడింది)లో ఏమనబడిందో సుస్పష్టమే." ఈ సమాధానం విని ఆ వ్యక్తి ఇలా అన్నాడు : 'మరైతే పీడన సమసిపోయే వరకూ... వారితో పోరాడండి అనే ఆయత్ గురించి మీరేమంటారు?' అని సందేహం వ్యక్తపరచగా, అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఇలా అన్నారు: "(వాహ్ వాహ్!) ఇలాంటి యుద్ధం మేము దైవప్రవక్త(సఅసమ్) హయాంలో చేశాము కదా! ఆ కాలంలో ముస్లింలు చాలా అల్ప సంఖ్యలో ఉండేవారు. ఇస్లాం స్వీకరించిన ముస్లింలు వేధింపులకు గురయ్యేవారు. ముస్లింలను (అవిశ్వాసులు) హతమార్చేవారు. వారిని ఖైదు చేసేవారు. ఎట్టకేలకు ఇస్లామ్ బాగా వ్యాప్తి చెందింది. ముస్లింల సంఖ్య బాగా పెరిగింది. ఈ ఆయత్‌లో ప్రస్తావించబడిన ఫిత్నా (ఉపద్రవం, పీడన, కల్లోలం) ఇప్పుడు ఎక్కడుందో చెప్పు."**

**అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఎంతకీ యుద్ధం చేయడానికి అంగీకరించేటట్లు లేరని తెలుసుకున్న మీదట ఆ వ్యక్తి 'సరే, అలాగైతే అలీ(రజి), ఉస్మాన్ (రజి)ల గురించి మీరేమంటారు?' అని ప్రశ్నాస్త్రం సంధించాడు. దానికి ఆయన, "ఓహ్! అదా నీ సంశయం!? అయితే విను. అలీ, ఉస్మాన్‌ల గురించి నా నమ్మకం ఏమి టంటే, (ఉహుద్ యుద్ధంలో ఉస్మాన్-రజి- పలాయనం చిత్తగించారన్నది నీ సందేహం కదూ!) అల్లాహ్ ఉస్మాన్(రజి) తప్పిదాన్ని మన్నించాడు. ఆ మన్నింపును నీవు జీర్ణం చేసుకోలేకపోతున్నావు. ఇక అలీ(రజి) గురించి చెప్పమంటావా (సుబ్‌హానల్లాహ్) ఆయన దైవప్రవక్త(స) పినతండ్రి కుమారుడు, ప్రవక్త అల్లుడు. అదిగో, అది నీవు చూస్తున్న ఆయన నివాస గృహం[1] అని సూటిగా సమాధాన మిచ్చారు.**

---

494-1. అంటే దైవప్రవక్త(స)కు అలీ (రజి) ఎంత దగ్గరివారో, ఆయన ఇల్లు చూస్తేనే తెలిసి పోతుంది. దైవప్రవక్త(స) నివాస గృహం, అలీ నివాస గృహానికి ఆనుకుని ఉండేది. ఇక బంధుత్వ సంబంధం విషయానికి వస్తే అలీ వరుసకు దైవప్రవక్త సోదరుడు, అల్లుడు కూడా. అలాంటి గొప్ప వ్యక్తి గురించి అపనమ్మకం కలిగి ఉండటం దౌర్భా గ్యానికి ఆనవాలు.

ఇక అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) పలుకుల్లోని ఉద్దేశం ఏమిటంటే, దైవప్రవక్త(స) హయాంలో జరిగిన యుద్ధాలు ఇస్లాం, ముస్లిములకు వ్యతిరేకంగా- అవిశ్వాసు లతో- జరిగిన యుద్ధాలు 'పీడన'ను అంతమొందించడానికి, అవిశ్వాసుల పీచ

**495) సయీద్ బిన్ జుబైర్ తెలిపారు: మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) మా వద్దకు వచ్చినప్పుడు, ఒక వ్యక్తి ఆయన్ని, "(ముస్లింల పరస్పర సంఘర్షణల) ఫిత్నా[1] గురించి, యుద్ధాల గురించి మీ అభిప్రాయం ఏమిటి?" అని అడిగాడు. దానికి సమాధానంగా ఆయన, "అసలు 'ఫిత్నా' అంటే ఏమిటో నీకు తెలుసా? ముహమ్మద్(సఅసమ్) బహు దైవారాధకులతో యుద్ధాలు చేసేవారు. ముస్లింలు బహు దైవారాధకుల వద్దకు వెళ్ళి, వారి మధ్యన చిక్కుకుపోవటమే 'ఫిత్నా' అనబడేది. దైవప్రవక్త(స) చేసిన యుద్ధాలు మీ మాదిరిగా రాజ్యం కోసం, రాజ్యాధికారం కోసం చేసిన యుద్ధాలు కావు"[2] అన్నారు.**

## అధ్యాయం : 6
# సహన స్థయిర్యాలతో...

**అల్లాహ్ ఇలా ఆదేశించాడు :**

**ప్రవక్తా! ముస్లిములను యుద్ధానికి పురికొలుపు. మీలో గనక ఇరవై మంది స్థయిర్యం కలవారు ఉంటే, వారు రెండు వందల మందిని జయిస్తారు. ఇంకా అటువంటి వారు వందమంది గనక ఉంటే, వేయి మంది సత్య తిరస్కారులను జయిస్తారు. ఎందుకంటే, వారు బుద్ధిహీనులైన ప్రజలు." *(8: 65)***

---

మణచడానికి, ధర్మ పరిరక్షణ కొరకు అప్పుడు యుద్ధాలు చేయవలసి వచ్చింది. కాని ఇప్పుడు జరుగుతున్న యుద్ధాలు అంతర్యుద్ధాలు. అంతర్యుద్ధాలను ధర్మసంస్థాపన కోసం జరిగే యుద్ధాలని అనలేము. దివ్యఖుర్ఆన్‌లోని ఆయత్‌లను వాటి సమయం సందర్భాల నుండి విడదీసి, భావాన్వయం చేసే ముస్లింలకు అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) పలుకులు కనువిప్పు కలిగించాలి. అలాగే ఖుర్ఆన్ హదీసులకు వక్రభాష్యాలు చెప్పి, తప్పుడు అర్థాలు తొడిగి ముస్లింల మధ్యన చిచ్చుపెట్టే సోకాల్డ్ పండితులు దీని ద్వారా గుణపాఠం నేర్చుకోవాలి.

495–1. ఖుర్ఆన్‌లో "పీడన (ఫిత్నా) ఏ మాత్రం మిగలకుండా పోయేవరకు (8: 39) అని అనబడింది.

495–2. అంటే దైవప్రవక్త(స) ప్రాపంచిక రాజ్యాధికారం కోసమో, పదవీ వ్యామోహంతోనో యుద్ధాలు చేయలేదు. కేవలం సత్యధర్మ సమున్నతి కోసం, ధర్మరక్షణ కోసం యుద్ధం చేశారు. అవిశ్వాసుల వేధింపు నుండి, వారి పీడన నుండి ముస్లింలకు విముక్తి కల్పించడానికి యుద్ధం చేశారు.

**496) ఇబ్నె అబ్బాస్(రజి) తెలిపారు : "మీలో గనక ఇరవైమంది స్థయిర్యం కలవారు ఉంటే, వారు రెండు వందల మందిని జయిస్తారు" అనే ఆయత్ అవతరించినప్పుడు, ఒక విశ్వాసి పది మంది అవిశ్వాసులను ప్రతిఘటించడానికి భయపడి పారిపోకూడదన్న ఆజ్ఞ విధించబడింది.**

**సుఫ్‌యాన్ ఇలా అంటున్నారు : నేను ఈ హదీసును ఈ విధంగా కూడా అనేకసార్లు చెప్పాను- అంటే ఇరవైమంది ముస్లింలు రెండు వందల మంది అవిశ్వాసులకు ఎదురుగా భయపడకూడదని అన్నాను. ఆ తరువాత ఈ ఆయత్ అవతరించింది: "ఇప్పుడు అల్లాహ్ మీ బరువును తేలిక చేశాడు, ఆయనకు తెలుసు, ఇంకా మీలో బలహీనత ఉందని. కనుక మీలో గనక వందమంది సహన స్థయిర్యాలు కలవారు ఉంటే, వారు రెండు వందల మంది అవిశ్వాసులను ప్రతిఘటించడానికి వెరవకూడదు.[1]**

**సుఫ్‌యాన్(రహ్మ) ఇంకా ఇలా అన్నారు: అబ్దుల్లాహ్ బిన్ షుబ్రుమా (కూఫా న్యాయాధిపతి) ఏమనేవారంటే; "అమ్ర్ బిల్ మారూఫ్ నహీ అనిల్ మున్కర్" (మంచిని ఆదేశించటం, చెడుల నుండి నిరోధించటం) విషయంలో కూడా ఇదే ఆజ్ఞ వర్తిస్తుందని నేను భావిస్తున్నాను.[2]**

## అధ్యాయం : 7

# బలహీనత దృష్ట్యా

**ఇప్పుడు అల్లాహ్ మీ బరువును తేలిక చేశాడు. ఆయనకు తెలుసు. ఇంకా మీలో బలహీనత ఉందని. కనుక మీలో గనక వందమంది సహన స్థయిర్యాలు కలవారుంటే, వారు రెండువందల మందినీ,.... అల్లాహ్ సహనం కలవారితో ఉంటాడు. *(8: 66)***

---

496-1. అంటే శత్రువులు రెట్టింపుకన్నా అధికంగా ఉన్నప్పుడు, వెనక్కి తగ్గటం సమంజసమే. అయినప్పటికీ ప్రతిఘటించటం, మొక్కవోని సాహసాన్ని ప్రదర్శించటం శ్రేష్టతరం.

496-2. అంటే వ్యతిరేకులు రెట్టింపు మంది లేక అంతకన్నా ఎక్కువ మంది ఉన్నాసరే సత్యవాక్కును ప్రకటించటంలో జంకకూడదు. అన్యధా పాపం. మంచిని పెంపొందించే మాట పలకటం, చెడు మాట నుండి ఆపటం మంచిది. ఒకవేళ ఈ పనికి కూడా ప్రాణహాని ఉందని అనిపిస్తే మౌనం వహించటం ధర్మసమ్మతమే.

**497)** మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా వివరించారు : "మాలోని ఇరవైమంది ఉన్నాసరే, వారు గనక సహన స్థయిర్యాలు కలవారై ఉంటే వారు రెండు వందల మందిపై ప్రాబల్యం వహిస్తార"న్న ఆయత్ అవతరించినప్పుడు, అది ముస్లింలకు భారంగా తోచింది. ఎందుకంటే ఆయత్‌లో ఈ ఆదేశం వారికి విధి (ఫర్జ్)గా ఖరారు చేయబడింది– అంటే ఒక ముస్లిం తన ముందు పది మంది సత్య తిరస్కారులు ఉన్నాసరే జడుసుకుని పారిపోరాదని చెప్పబడింది. కాని ఆ తరువాత ఈ భారం తేలిక చేయబడింది. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : **"ఇప్పుడు అల్లాహ్ మీ బరువును తేలిక చేశాడు. ఇంకా మీలో బలహీనత ఉందని ఆయన తెలుసుకున్నాడు. కనుక మీలో గనక వంద మంది సహన స్థయిర్యాలు కలవారు ఉంటే, వారు రెండు వందల మందినీ, ఇంకా అటువంటి వారు గనక వేయి మంది ఉంటే, రెండు వేల మందినీ, అల్లాహ్ ఆదేశానుసారం జయించగలరు. అల్లాహ్ సహనం కలవారితో ఉంటాడు."**

ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అన్నారు : "సంఖ్యా నిష్పత్తి ఎంతగా తగ్గిందో, ముస్లింలలో సహన స్థయిర్యాలు కూడా అంతగానే తగ్గాయి."

# 9. అత్ తౌబా సూరా (సూరయె బరాత్) వ్యాఖ్యానం

## అధ్యాయం : 1

## తెగత్రెంపుల ప్రకటన

**అల్లాహ్ తరఫు నుండి, ఆయన ప్రవక్త తరఫు నుండి మీరు ఒడంబడికలు చేసుకున్న ముష్రిక్కులకు విముక్తి ప్రకటించబడుతోంది.** ***(9: 1)***

**498)** బరా బిన్ ఆజిబ్(రజి) చెప్పగా నేను విన్నాను అని అబూ ఇస్‌హాఖ్ తెలిపారు: ఆయన (బరా) ఏమన్నారంటే, అన్నిటికన్నా ఆఖరిలో అవతరించిన ఆయత్ 'కలాలా' ఆయత్. అందులో ఇలా అనబడింది: **ప్రవక్తా! ప్రజలు నిన్ను 'కలాలా' విషయంలో ధార్మిక తీర్పు అడుగుతున్నారు. అల్లాహ్ మీకు ఈ ధార్మిక తీర్పు ఇస్తున్నాడు అని చెప్పు...**

## అధ్యాయం : 2

## తుది గడువు

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

**"కనుక మీరు దేశంలో మరో నాలుగు నెలలపాటు తిరగండి. మీరు అల్లాహ్‌ను అశక్తుడుగా చెయ్యలేరని తెలుసుకోండి. అల్లాహ్ సత్య తిరస్కారులను పరాభవం పాలు చేస్తాడు."**[1] ***(9: 2)***

**499)** అబూ హురైరా (రజి) ఈ విధంగా చెప్పినట్లుగా తనకు హుమైద్ బిన్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ తెలిపారని ఇబ్నె షిహాబ్ వివరించారు : (అబూ

---

2-1. వాగ్దాన భంగానికి, విశ్వాస ఘాతుకానికి ఒడిగట్టిన ముష్రిక్కులకు అల్టిమేటమ్ ఇది. పరిస్థితుల స్వరూపం దృష్ట్యా వారికి వ్యతిరేకంగా ఈ కఠిన చర్య అనివార్యం అయింది.

**హురైరా-రజి ఇలా చెప్పారు:) అది హజ్జ్ యాత్రా సందర్భం (దైవప్రవక్త-స-అబూబక్ర్‌ను ఆ యాత్రకు అమీర్‌గా చేసి పంపారు). అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) నన్ను కూడా ప్రకటన చేసేవారిలో ఒకనిగా నియమించారు. యౌమె నహర్ (ఖుర్బానీ ఇచ్చే రోజు)న మమ్మల్ని చాటింపు వేయడానికి పంపటం జరిగింది. ప్రకటన సారాంశమేమిటంటే, వచ్చే ఏడాది బహుదైవారాధకుడు ఎవరూ హజ్జ్ చేయడానికి రాకూడదు. ఏ ఒక్కరూ నగ్నంగా కాబా గృహ ప్రదక్షిణ చేయకూడదు.**

**హుమైద్ బిన్ అబ్దుర్రహ్మాన్ ఇంకా ఇలా అన్నారు: ఆ తరువాత దైవ ప్రవక్త(స) వెనక నుంచే అలీ (రజి)ని కూడా పంపించారు. సూరయె బరాత్ (తౌబా సూరా)లోని ఆదేశాలను గురించి ప్రకటించమని ఆయనకు ఆదేశమిచ్చి పంపారు.**

**అబూ హురైరా(రజి) ఇలా అన్నారు: అందువల్ల అలీ (రజి) కూడా ఖుర్బానీ ఇచ్చే రోజునే తౌబా సూరాలోని ఆజ్ఞలను వినిపించారు (ప్రకటించారు). 'వచ్చే సంవత్సరం ఏ ఒక్క ముష్రిక్కు కూడా హజ్జ్ చేయరాదు, ఏ ఒక్కరూ నగ్నంగా తవాఫ్ చేయరాదు' (అన్నది ఆ ప్రకటన సారాంశం).[1]**

---

499-1. ఈ అధికారిక ప్రకటన నిమిత్తం దైవప్రవక్త(స) మొదట అబూబక్ర్(రజి)ను నియమించారు. తరువాత ఆయనకు 'వహీ' ద్వారా తెలియజేయబడింది- "అరబ్బు రివాజు ప్రకారం ఇలాంటి కీలకమైన ప్రకటన చేసే చోట దైవప్రవక్త(స) స్వయంగా ఉండటం అవసరం. లేదా ఆయన కుటుంబీకుల్లోని వారైనా సరే ఉండాలి." అందుచేత ఆయన(స) తరువాత హజ్రత్ అలీ(రజి)ని మక్కాకు పంపించారు. అప్పుడు అబూబక్ర్(రజి) అబూ హురైరా(రజి)ను అలీ(రజి)కి తోడుగా చాటింపు వేయడానికి పంపించారు. (ఫత్‌హుల్ బారీ)

ఇక మహనీయ అలీ(రజి) ప్రకటించిన ముఖ్యాంశాలు ఇవి :

★ స్వర్గంలో కేవలం విశ్వాసులు మాత్రమే ప్రవేశిస్తారు.

★ ఇక మీదట ఎవరూ నగ్నంగా కాబా గృహ ప్రదక్షిణ చేయజాలరు.

★ ఇక మీదట ఏ ఒక్క ముష్రిక్ కూడా హజ్జ్ నిమిత్తం ముస్లింలతో కలసి రాలేడు.

★ ఇస్లామ్ తరఫున ఏ వర్గంతోనయినా ఒడంబడిక జరిగి ఉంటే, దాని గడువు పూర్తయ్యే వరకూ ఆ ఒడంబడిక కొనసాగుతుంది.

★ ఒడంబడిక లేని వారికి నాలుగు మాసాల పాటు ఇక్కడ సంచరించడానికి అవకాశం ఇవ్వబడుతుంది. ఈ లోగా వారు ముస్లింలకు వ్యతిరేకంగా ఎలాంటి కుట్రలు పన్నకుండా 'జిమ్మీ'లుగా ఉండటానికి అంగీకరించాలి. అన్యథా వారికి వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించబడుతుంది. *(ఫత్‌హుల్ బారీ- సం.8, పు: 406)*

## అధ్యాయం : 3

# అల్టిమేటమ్

"పెద్ద హజ్ రోజున సమస్త ప్రజలకు అల్లాహ్ తరపు నుండీ, ఆయన ప్రవక్త తరపు నుండీ చెయ్యబడే బహిరంగ ప్రకటన ఏమిటంటే, అల్లాహ్ ముష్రిక్కులకు ఏ విధంగానూ బాధ్యుడు కాడు. అలాగే ఆయన ప్రవక్త కూడా. ఇప్పుడు మీరు గనక పశ్చాత్తాపపడితే అది మీకే మేలు. ఒకవేళ విముఖులైతే మీరు అల్లాహ్‌ను అశక్తుడుగా చెయ్యలేరు అని బాగా అర్థం చేసుకోండి. ప్రవక్తా! తిరస్కరించేవారికి కఠిన శిక్షను గురించిన శుభవార్తను వినిపించు". ***(9: 3)***

**500)** అబూ హురైరా(రజి) ఇలా అన్నారు : అబూబక్ర్(రజి) నన్ను కూడా జుల్‌హిజ్జా పదవ తేదీన ప్రకటన చేసేవారితోపాటు పంపించారు. అంటే హాజీలు ఆగే 'మినా' ప్రదేశంలో ఈ విధంగా ప్రకటించాలని ఆదేశించారు: 'ఈ రోజు తరువాత ఏ ఒక్క బహుదైవారాధకుడు కూడా హజ్జ్ చేసేందుకు రాకూడదు. ఇంకా ఏ ఒక్కరూ ఇక మీదట నగ్నంగా కాబా గృహ ప్రదక్షిణ చెయ్యకూడదు.'

హుమైద్ ఇలా అన్నారు: ఆ తరువాత దైవప్రవక్త(స) అలీ(రజి)ని కూడా పంపి, సూరయె తౌబాను చదివి వినిపించమని ఆదేశించారు. అబూ హురైరా(రజి) ఇంకా ఇలా అన్నారు : తరువాత అలీ(రజి) మాతోపాటే ఉండి జుల్‌హిజ్జా పదవ తేదీన 'మినా' మైదానంలో తౌబా సూరాను చదివి వినిపిస్తూ, వచ్చే ఏడాది ఏ ఒక్క ముష్రిక్కు కూడా హజ్జ్ చేయడానికి రాకూడదనీ, ఏ ఒక్కరూ నగ్నంగా కాబా గృహ ప్రదక్షిణ చేయరాదని ప్రకటించారు: 'అయితే ఒడంబడికలు కుదుర్చుకుని ఉన్న ముష్రిక్కులకు మినహాయింపు ఉంటుంది' (వారు 'జిమ్మీలు'గా వ్యవహరించ బడతారు).

**501)** మహనీయ అబూహురైరా(రజి) తెలిపారు: దైవప్రవక్త(సఅసమ్) ఏ హజ్జ్ సందర్భంగా అబూబక్ర్ (రజి)ను 'అమీర్'గా చేసి పంపారో, ఆ హజ్జ్ హజ్జతుల్ వదాకు (ఒక సంవత్సరం) ముందు - హిజ్రీ 9వ యేట- జరిగింది. ఆ సందర్భంగా చాటింపు వేసే అనేకమందితోపాటు నన్ను కూడా పంపించారు. ఆ ప్రకటనలోని ముఖ్యాంశం ఇది: 'వచ్చే ఏడాది ఏ ఒక్క బహుదైవారాధకుడు కూడా హజ్జ్ చేయడానికి రాకూడదు. ఏ ఒక్కరూ కాబా గృహ ప్రదక్షిణ నగ్నంగా

**చేయకూడదు'– హుమైద్ ఇలా అన్నారు : అబూ హురైరా(రజి) యొక్క ఈ హదీసు ద్వారా అవగతమయ్యేదేమంటే 'యౌమున్నహ్ర్' (పదవ దినం) మాత్రమే పెద్ద హజ్జ్ దినం.[1]**

## అధ్యాయం : 4

# యుద్ధం అనివార్యమైనప్పుడు...

**అవిశ్వాస పతాక ధారులతో యుద్ధం చెయ్యండి. ఎందుకంటే, వారి ప్రమాణాలు ఏమాత్రం నమ్మదగ్గవి కావు. బహుశా (కరవాల శక్తి వల్లనే) వారు మానుకో వచ్చు. *(9: 12)***

**502) జైద్ బిన్ వహబ్ వివరించారు: మేము హుజైఫా బిన్ యమాన్ (రజి) సన్నిధికి వెళ్ళాము. ఆయన ఇలా అన్నారు: "ఈ ఆయత్ *(9: 12)* ఎవరెవరి గురించి అవతరించిందో వారిలో ఇప్పుడు కేవలం ముగ్గురు మాత్రమే జీవించి ఉన్నారు." అంతలో ఒక పల్లెటూరి వ్యక్తి, 'అయ్యా! మీరు దైవప్రవక్త(స) సహచర్యం పొందినవారు కదా! మా ఇండ్లలో కన్నం వేసి మంచి మంచి వస్తువులను దొంగిలించుకుని పోయే వారికి పట్టే గతేమిటో చెప్పండి' అని అడిగాడు. దానికి సమాధానంగా ఆయన, "వారు పరమ అవిధేయులు, పాపాత్ములు. ఆ మునాఫిఖ్ లలో (కపటులలో) నలుగురు తప్ప ఎవరూ బ్రతికి లేరు. వారిలో ఒకడు ఎంత ముసలివాడయ్యాడంటే, అతడు చల్లని నీరు త్రాగినప్పుడు, దాని చల్లదనాన్ని కూడా ఆస్వాదించలేడు"[1] అని చెప్పారు.**

---

501–1. శుక్రవారం నాడు హజ్జ్ దినం వస్తే అది 'పెద్ద హజ్జ్ దినం' అవుతుందన్న విషయం ప్రజా బాహుళ్యంలో సుప్రసిద్ధం అయింది. ఇది సరైనది కాదు. ఈ హదీసు ప్రకారం 'యౌమున్నహ్ర్' (పదవ రోజు) మాత్రమే పెద్ద హజ్జ్ దినం. ఆ రోజునే అబూబక్ర్ (రజి) అక్కడ ప్రసంగించారు. హజ్రత్ అలీ(రజి) తౌబా సూరాను చదివి వినిపించినది కూడా ఆ రోజునే. అది హిజ్రీ 9వ యేట జరిగింది. *(ఫత్హుల్ బారీ)*

502–1. పై ఆయత్(9: 12)లో **'అయిమ్మతల్ కుఫ్ర్'** (సత్య తిరస్కారానికి నాయకత్వం వహించినవారు) అని అనబడింది. వారే అబూ సుఫ్యాన్, అబూ జహ్ల్, ఉతబా, సుహైల్ బిన్ అమ్ర్ తదితరులు. హుజైఫా (రజి) పలుకుల అంతరార్థం ఏమిటంటే, వారంతా చనిపోయారు లేదా చంపబడ్డారు. వారిలో ముగ్గురు మాత్రమే బ్రతికి ఉన్నారు– అంటే అబూ సుఫ్యాన్, సుహైల్ మరొకరెవరో ఒక వ్యక్తి. కాని తరువాత అబూ సుఫ్యాన్, సుహైల్ ముస్లింలుగా ధర్మపరివర్తన చెందారు. ఈ ఆయత్ అవతరించే నాటికి మాత్రం వారు సత్య తిరస్కారానికి (కుఫ్ర్‌కు) నాయకత్వం వహించేవారు.

## అధ్యాయం : 5

# జకాత్ ఇవ్వనివారి పర్యవసానం

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"వెండి బంగారాలను పోగు చేసి వాటిని దైవమార్గంలో ఖర్చుపెట్టని వారికి వ్యథాభరితమైన శిక్ష యొక్క శుభవార్తను అందజెయ్యండి. ఈ వెండి బంగారాలు నరకాగ్నిలో కాల్చబడే ఒక రోజు వస్తుంది. వాటితోనే వారి నొసటిపై, వారి పార్శ్వాలపై, వీపులపై వాతలు వెయ్యబడతాయి- ఇది మీరు మీ కొరకు కూడబెట్టుకున్నది, ఇదిగో, ఇక మీరు కూడబెట్టిన సంపదను రుచి చూడండి". ***(9: 34,35)***

**503)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) ప్రవచించగా, అబూ హురైరా(రజి) విని తనతో చెప్పారని అబ్దుర్రహ్మాన్ ఆరజ్ తెలిపారు: ప్రవక్త(స) ఇలా ప్రవచించారు: మీ సంపదలో దేని జకాత్‌ను మీరు చెల్లించలేదో, ప్రళయదినాన అది విష సర్పం రూపం దాల్చుతుంది."

**504)** జైద్ బిన్ వహబ్ వివరించారు: నేను 'రబజా' ప్రదేశంలో మహనీయ అబూజర్ గిఫ్ఫారీ(రజి) సేవలో హాజరయ్యాను. 'మీరు ఈ అడవి ప్రాంతంలో నివాసమేర్పరచుకోవడానికి కారణమేమిటి?' అని ఆయన్ని అడిగినప్పుడు, ఆయన ఇలా వివరించారు : "మేము సిరియాలో నివసించేవారము (నాకూ- అక్కడి పరిపాలకుడు ముఆవియాకు మధ్య అభిప్రాయ భేదం వచ్చింది) నేను, వెండి బంగారాలను పోగుచేసి, వాటిని దైవమార్గంలో ఖర్చుపెట్టని వారికి వ్యథాభరితమైన శిక్ష యొక్క శుభవార్తను అందజెయ్యండి **(9: 34)** అనే ఆయత్‌ను వినిపించినప్పుడు, 'ఈ ఆయత్ ముస్లిములమైన మన కోసం కాదు, ఇది గ్రంథ వహుల కోసం' అని ముఆవియా (రజి) వ్యాఖ్యానించారు. దానికి నేను, 'ఇది[1] మన కోసం, గ్రంథవహుల కోసం కూడా' అని నిర్దిష్టంగా చెప్పాను."

---

ఇకపోతే హుజైఫా(రజి), ఆయన దైవప్రవక్త(స) అంతరంగికులు. ప్రవక్త రహస్య విషయాలు ఎరిగినవారు. ఆ నలుగురి పేర్లు హుజైఫా (రజి)కు బహుశా తెలిసి ఉంటాయని, తనకు తెలియదని హాఫిజ్ ఇబ్నె హజర్ అభిప్రాయపడ్డారు.

*(ఫత్హుల్ బారీ)*

504-1. అంతే. ఆయనకూ- నాకూ మధ్య సంవాదన జరిగింది. ముఆవియా (రజి) నాపై ఫిర్యాదు చేస్తూ హజ్రత్ ఉస్మాన్ (రజి)కు ఉత్తరం వ్రాశారు. ఆయన నన్ను సిరియా

## అధ్యాయం : 6

# వెండీ బంగారాలు నరకాగ్నిలో కాల్చబడే రోజు

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**"ఈ వెండి బంగారాలు నరకాగ్నిలో కాల్చబడే ఒక రోజు వస్తుంది. వాటి తోనే వారి నొసటిపై, వారి పార్శ్వాలపై, వీపులపై వాతలు వెయ్యబడతాయి– ఇది మీరు మీ కొరకు కూడబెట్టుకున్నది, ఇదిగో, ఇక మీరు కూడబెట్టిన సంపదను రుచి చూడండి". *(9: 35)***

**ఖాలిద్ బిన్ అస్లం తెలిపారు: మేము మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి)తో కలసి బయలుదేరినప్పుడు, ఆయన ఏమన్నారంటే; ఈ ఆయత్ (9: 35) జకాత్ ఆజ్ఞ రాకముందు అవతరించింది. జకాత్ ఆజ్ఞ వచ్చిన తరువాత అల్లాహ్, జకాత్ ద్వారా సిరిసంపదలను పరిశుద్ధపరిచాడు.**

## అధ్యాయం : 7

# సరైన గణన పద్ధతి

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:**

**"యథార్థం ఏమిటంటే, ఆకాశాన్నీ భూమినీ అల్లాహ్ సృష్టించినప్పటి నుండీ, మాసాల సంఖ్య అల్లాహ్ గ్రంథంలో పన్నెండు మాత్రమే. వాటిలో నాలుగు నిషిద్ధ మాసాలు. ఇదే సరియైన గణన పద్ధతి".[1] *(9: 36)***

---

నుండి వెనక్కి పిలిపించారు. నేను మదీనా వచ్చినప్పుడు చాలామంది నా చుట్టూ పోగయ్యారు. జరిగినదంతా నేను ఉస్మాన్(రజి)కు విడమరిచి చెప్పాను. అంతా విన్న మీదట, "మీరు కోరుకుంటే ఈ విభేదాలకు దూరంగా ఉండవచ్చు" అని ఆయన సలహా ఇచ్చారు. అందుకే నేను ఈ ఎడారి ప్రదేశంలో నివాసం ఏర్పరచుకున్నానని అన్నారు.

మహనీయ అబూజర్ గిఫ్ఫారీ (రజి) నిరాడంబర జీవి. ఐహిక అనాసక్తత గల గొప్ప సహాబీ. అందుకే చాలా విషయాలలో ఆయనకు ఇతరులతో పడేది కాదు. తత్కార ణంగా ఆయన ఏకాంత వాసాన్ని ఇష్టపడ్డారు. ఆ స్థితిలోనే మరణించారు.

7–1. హాఫిజ్ ఇబ్నె హజర్ ఇలా అంటారు: అల్లాహ్ భూమ్యాకాశాలను సృష్టించినప్పుడే 12 మాసాల సంవత్సరాన్ని నిర్ధారించాడు. కాని అరేబియాలోని అవిశ్వాసులు తమ స్వలాభాల కోసం ఈ సంవత్సరాన్ని 13–14 మాసాలుగా చేసుకునేవారు. అయితే చాంద్రమానం ప్రకారం ఒక సంవత్సరం 12 నెలలతో మాత్రమే కూడుకుని ఉండేది.

*(ఫత్హుల్‌బారీ– సం. 8, పు. 413)*

**505) అబ్దుర్రహ్మాన్ బిన్ అబూబక్రా (తన తండ్రి అబూబక్రా బిన్ హారిస్-రజి నుండి సంగ్రహించిన దాని ప్రకారం) ప్రవక్త మహనీయులు (సఅసమ్) (అంతిమ హజ్జ్ ప్రసంగంలో) ఇలా అన్నారు: "చూడండి! కాలం తిరిగి తిరిగి అల్లాహ్ భూమ్యాకాశాలను సృష్టించినప్పటి స్థితికి చేరుకుంది. సంవత్సరం పన్నెండు నెలలతో కూడుకుని ఉంటుంది. వాటిలో మూడు నెలలు-అంటే జీఖఅద, జుల్‌హిజ్జా, ముహర్రమ్- వరుసగా వస్తాయి. నాల్గవ మాసమైన రజబ్ జమాదివుల్ ఉఖ్రాకి- షాబాన్‌కి మధ్యన ఉంటుంది."**

## అధ్యాయం : 8

# వారిద్దరూ గుహలో ఉన్నప్పుడు...

**వారిద్దరూ గుహలో ఉన్నప్పుడూ అతడు తన స్నేహితునితో, "విచారపడకు. అల్లాహ్ మనకు తోడుగా ఉన్నాడు"[1] అని అన్నప్పుడూ అల్లాహ్ అతనికి సహాయం చేశాడు. *(9: 40)***

**506) మహనీయ అబూబక్ర్(రజి) తనతో చెప్పినట్లుగా అనస్ బిన్ మాలిక్(రజి) వివరించారు : అబూబక్ర్(రజి) ఇలా చెప్పారు- నేను సౌర్ గుహలో దైవప్రవక్త(సఅసమ్) వెంట ఉన్నాను. నేను అవిశ్వాసుల పాదాలను చూశాను. 'దైవప్రవక్తా! వారిలో ఏ ఒక్కరైనా తమ పాదాలను లేపి క్రిందికి చూస్తే, మేము కనిపిస్తాము' అని నేనన్నాను (ఆందోళన చెందాను). దానికి ఆయన(స), "ఏ ఇద్దరికి తోడుగా మూడవ వానిగా అల్లాహ్ ఉన్నాడో వారి గురించి నువ్వేమను కుంటున్నావ్?" అన్నారు.**

**507) మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అన్నారు: అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి)తో నాకు భేదాభిప్రాయం ఏర్పడింది. నేనన్నాను - 'ఆయన తండ్రి జుబైర్ బిన్ అవ్వామ్(రజి), ఆయన తల్లి అస్మా బిన్తె అబీబక్ర్(రఅ). ఆయన**

---

8-1. ఇమామ్ బుఖారీ(రహ్మ) గానీ, అహ్లె హదీసు వారందరూ గానీ, 'అల్లాహ్ మనకు తోడుగా ఉన్నాడు' అనే వాక్యానికి తీసుకున్న అర్థం ఏమిటంటే, అల్లాహ్ తన 'జ్ఞానం' రీత్యా అందరికీ తోడుగా ఉంటాడు. అయితే ఆయన సహాయం మాత్రం కేవలం విశ్వాసులకు తోడుగా ఉంటుంది.

మహాప్రవక్త(స) సత్య ప్రవక్త అనడానికి సౌర్ గుహలో ఆయన చెప్పిన ఈ ఒక్కమాట చాలు.

**పినతల్లి ఆయిషా(ర.అ). ఆయన తాత అబూబక్ర్ (రజి). ఆయన నాయనమ్మ సఫియా- ర.అ (ఆమె దైవప్రవక్త మేనత్త)'. (అబ్దుల్లాహ్ బిన్ ముహమ్మద్ ఇలా అన్నారు :) ఈ రివాయతుకు సనదు ఏమిటి? అని నేను ఇబ్నె ఉయైనాను అడిగితే, ఆయన చెప్పటం మొదలెట్టి, 'హద్దసనా' అన్నారంతే. అంతలో ఎవరో వ్యక్తి ఆయన్ని వేరే మాటల్లో పడేశారు. ఉల్లేఖకుడు ఇబ్నె జురైజ్ ఈ విషయాన్ని పూర్తిగా చెప్పలేకపోయారు.[1]**

**508) ఇబ్నె జురైజ్ ఉటంకించినట్లుగా ఇబ్నె అబీ ములైకా తెలిపారు : ఇబ్నె అబ్బాస్(రజి)కి- ఇబ్నె జుబైర్(రజి)కి మధ్య 'బయ్అత్' (విధేయతా ప్రమాణం)కు సంబంధించిన గొడవ మొదలయింది. నేను ఉదయమే ఇబ్నె అబ్బాస్(రజి) దగ్గరకు వెళ్ళి, 'ఏమిటి, మీరు అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి)తో యుద్ధం చేయదలుస్తున్నారా? అల్లాహ్ పవిత్రం గావించిన క్షేత్రం అపవిత్రం అవుతుందన్న ధ్యాస కూడా మీకు లేదా?' అని అడిగాను. దానికి ఆయన, "అల్లాహ్ శరణు! దీనిని అల్లాహ్ ఇబ్నె జుబైర్- బనీ ఉమయ్యాల జాతకంలోనే రాసిపెట్టాడు. వారు హరమ్(పవిత్ర స్థలం)లో యుద్ధం చేయటాన్ని ధర్మసమ్మతంగా భావిస్తున్నారు.[1] దైవసాక్షిగా! నేను మాత్రం పుణ్యక్షేత్రాన్ని (యుద్ధం కొరకు) ధర్మసమ్మతంగా చేయను. అంటే అక్కడ ఎట్టి పరిస్థితిలోనూ యుద్ధంలో పాల్గొనను" అని చెప్పారు.**

**ఇబ్నె అబ్బాస్(రజి) ఇంకా ఇలా అన్నారు: "ఇబ్నె జుబైర్ (రజి) సమక్షంలో విధేయతా ప్రమాణం (బయ్అత్) చేయండి అని జనులు నాకు సలహా ఇచ్చారు. దానికి నేనేమన్నానంటే; ఆయన ఖిలాఫత్‌ను శిరసావహించటానికి నాకెలాంటి సంకోచం లేదు.[2] ఆయన తండ్రి (జుబైర్ బిన్ అవ్వామ్-రజి) దైవప్రవక్త(స) ప్రత్యేక హవారీ (సహాయకుడు)[3] గా ఉండేవారు. ఆయన తాత (అబూబక్ర్-రజి)**

---

507-1. అందుచేత ఇమామ్ బుఖారీ (రహ్మ) ఈ హదీసును వేరితర ఆధారాల ద్వారా (ఇబ్నె జురైజ్ నుండే) వెలికి తీశారు.

508-1. బనీ ఉమయ్యా మొదటే కయ్యానికి కాలు దువ్వి, అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ (రజి)ను దిగ్బంధం చేశారు. హరమ్‌లోనికి జొరబడి యుద్ధం మొదలెట్టారు. అయితే అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) వారిని ప్రతిఘటించారు. ప్రతిఘటన అనంతరం బనీ హాషిమ్‌పై **'బయ్అత్'** కొరకు ఒత్తిడి పెంచి, వారిని దిగ్బంధం చేశారు. ఆ విధంగా పుణ్యక్షేత్రంలో యుద్ధ పరంపరకు ఆయన కూడా కారకుడయ్యారు.

508-2. అంటే అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) ఖిలాఫత్‌కు అనర్హుడని నేనెన్నడూ అనను.

**సౌర్ గుహలో దైవప్రవక్త(స) సాహచర్యం పొందినవారు. ఆయన తల్లి అస్మా బిన్తె అబీబక్ర్(ర.అ) 'జాతిన్నితాఖ్'[4] (దుపట్టా గల మహిళ)గా ప్రసిద్ధి చెందింది. ఆయన పినతల్లి హజ్రత్ ఆయిషా(ర.అ) ఆయన మేనత్త ఖదీజా(ర.అ) ఎవరో కాదు, దైవ ప్రవక్త(స) సతీమణులు.[5] ఆయన నాయనమ్మ సఫియా అబ్దుల్ ముత్తలిబ్ కూతురు (ఇవన్నీ ఆయన వంశ పారంపర్య శ్రేష్టతకు తార్కాణం). ఇక ఆయన వ్యక్తిగత సుగుణాల విషయానికి వస్తే, ఆయన స్వయంగా ఇస్లాంలో సదా నిష్కళంకమైన వ్యక్తిగా ఉన్నారు (చెడు విషయాలకు దూరంగా ఉన్నారు). దానికితోడు ఖుర్ఆన్ ఖారీ కూడా.[6] దైవసాక్షిగా! బనీ ఉమయ్యా జనులు ఒకవేళ నా పట్ల సద్వ్యవహారం చేసినట్లయితే అదే వారికి తగినది. ఎందుకంటే వారు నా సమీప బంధువులు.[7] ఒకవేళ వారు నా మీద పెత్తనం చెలాయిస్తే చెలాయించనివ్వండి. వారు గౌరవ మర్యాదల్లో మాకు సమ ఉజ్జీలు. కాని అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ (రజి) చేసిందేమిటి?**

---

508–3. ఇంతకుముందు ఒక హదీసులో గడిచినట్లు "ప్రతి ప్రవక్తకు ఒక 'హవారీ' ఉంటాడు. నా హవారీ మాత్రం జుబైర్ బిన్ అవ్వామ్(రజి)" అని మహాప్రవక్త(స) వక్కాణించారు.

508–4. ఇంతకుముందు కూడా వచ్చినట్లు, హిజ్రత్ సందర్భంగా హజ్రత్ అస్మా (ర.అ) తన నడుము వస్త్రాన్ని రెండు ముక్కలుగా చించి, ఒక దాంతో దైవప్రవక్త(స) కోసం చద్ది మూటను బిగించి కట్టారు. రెండవ ముక్కతో నీళ్ళ తిత్తి మూతిని బిగించి కట్టారు. ఆనాటి నుండీ ఆమె 'జాతిన్నితాఖ్'గా పేరు గాంచారు.

508–5. అంటే ఆయన తండ్రి మేనత్త. ఎందుకంటే హజ్రత్ జుబైర్(రజి) అవ్వామ్ బిన్ ఖువైలిద్ బిన్ అసద్ కుమారుడు. కాగా; హజ్రత్ ఖదీజా(ర.అ) ఖువైలిద్ బిన్ అసద్ కూతురు.

508–6. ఇబ్నె అబీ ఖుసైమా(రహ్మ) తన చరిత్ర పుస్తకంలో ఈ సందర్భంగా– అదనంగా– ఇలా వ్రాశారు : ఈ విషయాలన్నింటి దృష్ట్యా నేను అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) శ్రేయాన్ని అభిలషించాను. ఆయన పక్షాన మాట్లాడాను.

ఆయన సమక్షంలో విధేయతా ప్రమాణం (బయ్అత్) చేయమని ప్రజలను ప్రేరేపించాను కూడా.

అయితే ఆయన ఖలీఫాగా నిలదొక్కుకోగానే ఇబ్నె అబ్బాస్ పట్ల, బనీ హాషిమ్ పట్ల ఉదాసీనత కనబరిచారు. తన వంశం వారిని, అంటే బనీ అసద్ తెగ వారిని మొదట పిలిచేవారు. ఆ తరువాతే బనీ హాషిమ్‌ని, బనీ ముత్తలిబ్‌ని పిలిచేవారు. ఈ ధోరణి ఇబ్నె అబ్బాస్(రజి)కు మనస్తాపం కలిగించింది.

508–7. ఎలాగంటే–హజ్రత్ అబ్బాస్(రజి) అబ్దుల్ ముత్తలిబ్ కుమారుడు... అబ్దుల్ ముత్తలిబ్ ఉమయ్యాకు వరుసకు పినతండ్రి కుమారుడవుతారు. ఈ ఉమయ్యా ఎవరో కాదు,

**ఆయన బనీ అసద్ తెగ శాఖలైన తువైత్, బనీ ఉసామా, హుమైద్ జనులకు మాపై ప్రాధాన్యత ఇచ్చారు. ఇటు చూస్తే ఇబ్నె అబీ ఆస్(అబ్దుల్ మలిక్ బిన్ మర్వాన్) నిరంతరం ముందుకు దూసుకుపోతున్నాడు.[8] మరేమో అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) అతని ముందు తోక ముడుస్తున్నారు.[9]**

**509) ఇబ్నె అబీ ములైకా తెలియజేశారు: మేము ఇబ్నె అబ్బాస్(రజి) దగ్గరకు వెళ్ళినప్పుడు, ఆయన ఇలా అన్నారు- "ఇబ్నె జుబైర్(రజి) ధోరణిపై మీకు ఆశ్చర్యం కలగటం లేదా?! ఆయన ఖలీఫాగా బాధ్యతలు స్వీకరించినప్పుడు, ఆయన కొరకు కష్టపడాలనీ, అబూ బక్ర్, ఉమర్‌ల కోసం కూడా పడనంతగా కష్టపడాలని మనసులో సంకల్పించుకున్నాను. నిజానికి ఆ మహనీయులిద్దరూ ఏ రకంగా చూసినా ఈయన గారికంటే ఉత్తములే. ఈయన దైవప్రవక్త(స) మేనత్త సంతతికి చెందిన వారనీ, జుబైర్ కుమారుడనీ, అబూబక్ర్ మనవడనీ, ఖదీజా అన్న కుమారుడనీ, ఆయిషా(ర.అ) మేనల్లుడనీ ప్రజలకు చెప్పాను. కాని అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) చేసిందేమిటి? ఆయన నా యెడల అహంభావిగా మారి పోయారు. నేను ఆయన ప్రత్యేక ఆంతరంగికుల్లో ఒకడిగా ఉండటాన్ని ఆయన ఇష్టపడలేదు. (నేను మనసులోనే అనుకున్నాను) ఆయన ఇలా వ్యవహరిస్తారని నేను అనుకోలేదు. ఒకవేళ నేను ఆయన ముందు నా నిస్సహాయ స్థితిని వ్యక్త పరచినా ఆయన నా పట్ల ప్రసన్నులవుతారని అనుకోను. నాకు మేలు చేస్తారన్న**

---

మర్వాన్ తాతయ్య. అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి)కు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి, తన ఖిలాఫత్‌ను సుస్థిరపరచుకోవడానికి యత్నిస్తున్న మర్వాన్. ఆ కాలంలో అర్థ భూభాగం అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ అధికారంలో ఉండగా, మిగిలిన అర్థ భూభాగం మర్వాన్ అధికారంలో ఉండేది. మర్వాన్ చనిపోయేవరకు పరిస్థితి ఇలాగే ఉండేది. ఆ తరువాత మర్వాన్ కుమారుడు అబ్దుల్ మలిక్ ప్రాబల్యం వహించాడు. హజ్జాజ్ బిన్ యూసుఫ్‌ను మక్కాకు పంపించి అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి)ను వధించాడు. అప్పటి నుండే అబ్దుల్ మలిక్ తిరుగులేని అధికారం చెలాయించాడు.

508-8. అంటే నానాటికీ అతడు పుంజుకుని, బలవత్తరంగా తయారవుతున్నాడు.

508-9. అంటే ఇబ్నె జుబైర్ తన అసమర్థతను చాటుకున్నారు. అబ్దుల్ మలిక్ ఖలీఫా కాగానే ఇరాక్ భూభాగాన్ని అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) నుండి కైవసం చేసుకున్నాడు. ఆయన సోదరుడు ముస్‌అబ్‌ను వధించాడు. ఆ తరువాత మక్కాను కూడా జయించాడు. అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి) అమరగతి నొందారు. అంటే ఇబ్నె అబ్బాస్ చెప్పినట్లే జరిగింది.

**నమ్మకం కూడా లేదు. సరే, జరగాల్సిందేదో జరిగిపోయింది. ఇప్పుడు నా దాయాదులైన బనీ ఉమయ్యా ఒకవేళ నాపై పెత్తనం చెలాయిస్తే ఇతరులు పెత్తనం చెలాయించటం కన్నా మంచిదని తలపోస్తాను."[1]**

## అధ్యాయం : 9

# హృదయాలను గెలవవలసి ఉన్నవారు

**అల్లాహ్ ఇలా ఆదేశించాడు :**

**"... ఎవరి హృదయాలను గెలుచుకోవడం అవసరమో వారికీ (ఈ జకాత్ ఇవ్వాలి)..." *(9: 60)***

**మహాప్రవక్త (సఅసమ్) కొత్తగా ఇస్లామ్ స్వీకరించిన వారికి కూడా ఎంతో కొంత సొమ్ము ఇచ్చి వారికి ఊరట కలిగించే వారని ముజాహిద్ చెప్పారు.**

**510) మహనీయ అబూ సయీద్ ఖుద్రీ (రజి) వివరించారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) వద్దకు కొంత ధనం వస్తే, దానిని ఆయన(స) నవ ముస్లిములైన నలుగురు వ్యక్తుల మధ్య పంపిణీ చేశారు. "నేను ఈ ధనం ఇచ్చి వారి మనసులను గెలుచుకోదలిచాను"[1] అని ఆయన(స) చెప్పారు. ఇది గమనించిన (బనూ తమీమ్) వ్యక్తి ఒకతను, 'తమరు న్యాయం చేయలేద'ని అన్నాడు. అతని మాటపై "ఈ వ్యక్తి సంతతిలో జన్మించేవారు దీన్ (ధర్మం) పరిధి నుండి బయటికి వెళ్ళిపోతార"ని ప్రవక్త(స) చెప్పారు.**

---

509-1. పైన పేర్కొనబడిన ఈ ఉల్లేఖనాలన్నింటిలో ఏదో ఒక విధంగా మహనీయ అబూబక్ర్(రజి) ప్రస్తావన వచ్చింది. ఈ ఆయత్ క్రింద (9: 40) ఈ హదీసులను సేకరించటం ముఖ్యఉద్దేశం ఇదే. సహాబాకు సంబంధించిన ఇలాంటి ప్రస్తావనలు ఎక్కడ వచ్చినా, వారు కూడా మానవ మాత్రులైన కారణంగా- వారు క్షంతవ్యులే. వారు నిర్దోషులు కారు. వారి వల్ల పొరపాటు అస్సలు జరగదని అనుకోకూడదు. వారందరి కోసం మనం దుఆ చేయాలని ఆదేశించబడింది.

"ఓ ప్రభూ! మమ్మల్ని, మాకు పూర్వం విశ్వసించిన మా సోదరులందరినీ క్షమించు. మా హృదయాలలో విశ్వాసుల పట్ల ఏ కాస్త కల్మషాన్ని కూడా ఉంచకు. మా ప్రభూ! నీవు అమితంగా కనికరించేవాడవు, కరుణామయుడవూను." (59: 10)

510-1. దైవప్రవక్త(స)చే ధన సహాయం పొందిన ఆ నలుగురు వ్యక్తులు : 1) జర్ఆ 2) ఉయైనా 3) జైద్ 4) అల్‌ఖమా. ఈ ధనాన్ని హజ్రత్ అలీ(రజి) బంగారు కడ్డీల రూపంలో పంపారు.

## అధ్యాయం : 10
# హేళన చేసే కుత్సితులు

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"సంతోషంతో, ఇష్టంతో విశ్వాసులు చేసే ధన త్యాగాలను కించపరుస్తూ వారు మాట్లాడుతారు. (దేవుని మార్గంలో ఇచ్చేందుకు) తాము శ్రమకోర్చి ఇచ్చేది తప్ప మరేదీ తమ వద్ద లేనివారిని వారు హేళన చేస్తారు. ఈ హేళన చేసేవారిని అల్లాహ్ హేళన చేస్తున్నాడు. వారికి బాధాకరమైన శిక్ష పడుతుంది. ప్రవక్తా! నీవు అటువంటి ప్రజలను క్షమించవలసినదిగా విజ్ఞాపన చేసినా, చేయకపోయినా (ఒకటే); ఒకవేళ నీవు వారిని క్షమించవలసినదిగా డెబ్బది సార్లు విజ్ఞాపన చేసినా, అల్లాహ్ వారిని ఎంతమాత్రం క్షమించడు. ఎందుకంటే, వారు అల్లాహ్‌నూ ఆయన ప్రవక్తనూ తిరస్కరించారు. అల్లాహ్ దుర్మార్గులైన ప్రజలకు మోక్షమార్గం చూపడు."
**(9: 79,80)**

**'యల్‌మిజూన'** అంటే లోపాలు ఎంచుతారు, ఎత్తి పొడుస్తారని అర్థం. **'జుహ్‌దహుమ్'** అంటే కూలినాలి చేసి, తమ శక్తీ స్థోమతను బట్టి సహాయం చేసేవారని అర్థం.

**511)** అబూ మస్‌ఊద్ అన్సారీ(రజి) ఇలా వివరించారు: దానధర్మాలు చేయండి అని మాకు ఆజ్ఞాపించబడినప్పుడు, మేము కూలి కోసం బరువును ఎత్తే పని చేసేవారం (తద్వారా వచ్చిన వేతనాన్ని సదఖాగా సమర్పించుకునేవాళ్ళం). అబూ అఖీల్ (రజి) తనకు లభించిన కూలితోనే అర్థ 'సా' దానాన్ని తీసుకుని వచ్చారు. మరో సహాబీ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) భారీ మొత్తాన్ని తీసుకు వచ్చారు. దానిపై కపట విశ్వాసులు (మునాఫిఖ్‌లు), 'అల్లాహ్‌కు ఇతగాడి (అబూ అఖీల్) దానమే కావలసి వచ్చిందా?' అన్నారు. అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ గురించి వ్యాఖ్యానిస్తూ, 'ఇతను ప్రదర్శనాబుద్ధితోనే ఇంత పెద్ద దానం చేశాడ'ని అన్నారు. అప్పుడు ఈ ఆయత్ అవతరించింది: *'సంతోషంతో, ఇష్టంతో విశ్వాసులు చేసే ధన త్యాగాలను కించపరుస్తూ వారు మాట్లాడతారు. ముఖ్యంగా (దేవుని మార్గంలో ఇచ్చేందుకు) తాము శ్రమకోర్చి ఇచ్చేది తప్ప మరేదీ తమ వద్ద లేని వారిని వారు హేళన చేస్తారు..."*

**512)** అబూ మస్ఊద్ అన్సారీ (రజి) వివరించారు : "ప్రవక్త మహ నీయులు (స) దానధర్మాల కోసం ప్రేరేపించినప్పుడు, ఆయన సహచరులలోని కొందరు కూలి పని చేసి (అతి కష్టమ్మీద) ఒక 'ముద్' సదఖా ఇవ్వగలిగేవారు. కాని నేడు వారిలో కొందరి పరిస్థితి ఎలా ఉందంటే, వారి వద్ద లక్షల దిర్హమ్‌లు ఉన్నాయి"-బహుశా తనను దృష్టిలో పెట్టుకునే ఆయన (రజి) అలా చెప్పి ఉంటారు.

## అధ్యాయం: 11
# కపటాగ్రేసరుల నేపథ్యంలో

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"ప్రవక్తా! నీవు అటువంటి ప్రజలను క్షమించవలసినదిగా విజ్ఞాపన చేసినా, చేయక పోయినా (ఒకటే); ఒకవేళ నీవు వారిని క్షమించవలసినదిగా డెబ్భై సార్లు విజ్ఞాపన చేసినా, అల్లాహ్ వారిని ఎంతమాత్రం క్షమించదు. ఎందుకంటే, వారు అల్లాహ్‌నూ ఆయన ప్రవక్తనూ తిరస్కరించారు. అల్లాహ్ దుర్మార్గులైన ప్రజలకు మోక్షమార్గం చూపడు."[1] *(9: 80)*

**513)** ఇబ్నె ఉమర్(రజి) కథనం : (కపటాగ్రేసరుడు) అబ్దుల్లాహ్ బిన్ ఉబై మరణించినప్పుడు, అతని కుమారుడు అబ్దుల్లాహ్ బిన్ అబ్దుల్లాహ్ (ఈయన నికార్సయిన ముస్లిం) దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి, 'మీరు మీ చొక్కాను నా తండ్రి కఫన్ వస్త్రంగా ప్రదానం చేయండి' అని అభ్యర్థించారు. దైవప్రవక్త(స) తన చొక్కాను ఆయనకు ప్రదానం చేశారు. 'అయ్యా దైవప్రవక్తా! జనాజా నమాజ్‌కు కూడా తమరే సారథ్యం వహిస్తే బాగుంటుంది' అని కూడా ఆయన విన్నవించు కున్నారు. దైవప్రవక్త(స) అతని నమాజె జనాజా చేయించడానికి ముందుకు వెళు తుండగా, ఉమర్(రజి) దైవప్రవక్త(స)ను ఆలింగనం చేసుకుని, 'దైవప్రవక్తా! మీరు ఇతని నమాజె జనాజా చేయిస్తారా? అల్లాహ్ మిమ్మల్ని ఈ పని నుండి నిరోధిం చిన మీదట కూడా తమరు ఇతని నమాజ్‌కు సారథ్యం వహిస్తారా?' అని ప్రశ్నిం చారు. దానికి సమాధానంగా దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "అల్లాహ్ ఈ వ్యవ

---

11-1. ప్రవక్త(స) హయాంలో పైకి ఇస్లాం సమర్థకులుగా నటిస్తూ, లోపలి నుంచి క్షణం క్షణం ఇస్లాంకు తూట్లు పొడిచే ప్రయత్నంలో ఉన్న ద్వంద్వ నీతిపరుల (మునాఫిఖ్‌ల) నేపథ్యంలో ఈ ఆయత్ అవతరించింది. అబ్దుల్లాహ్ బిన్ ఉబై ఇబ్నె సలూల్ ఈ కపటులకు నాయకత్వం వహించేవాడు.

**హారంలో నాకు 'ఎంపిక స్వేచ్ఛ' ఇచ్చాడు. ప్రవక్తా! నీవు అటువంటి ప్రజలను క్షమించవలసినదిగా విజ్ఞాపన చేసినా, చేయకపోయినా ఒకటే; ఒకవేళ నీవు వారిని క్షమించవలసినదిగా డెబ్బయి సార్లు విజ్ఞాపన చేసినా, అల్లాహ్ వారిని ఎంత మాత్రం క్షమించడు (9: 80). కాబట్టి నేను డెబ్బయి సార్లకంటే ఎక్కువే ఇతని క్షమాపణకై ప్రార్థిస్తాను." 'కాని ఈ వ్యక్తి మునాఫిఖ్ (కపటి)' అని ఉమర్(రజి) చెప్పారు. ఇబ్నె ఉమర్(రజి) ఇలా అన్నారు: కాని ఎట్టకేలకు దైవప్రవక్త(స) అతని నమాజె జనాజా చేయించారు. ఆ తరువాత అల్లాహ్ ఈ ఆజ్ఞను అవతరింప జేశాడు: "ఇక ముందు వారిలో ఎవడయినా మరణిస్తే, అతడి జనాజా నమాజును కూడా నీవు ఎంత మాత్రం చెయ్యకు. ఎన్నడూ అతడి గోరీ వద్ద (ఇస్తిగ్‌ఫార్ కొరకు) నిలబడకు. ఎందుకంటే వారు అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్తనూ తిరస్కరించారు. ఇంకా వారు ద్రోహులుగానే మరణించారు."[1] *(9: 84)***

**514) మహనీయ ఉమర్(రజి) ఇబ్నె అబ్బాస్(రజి)తో ఇలా అన్నారు : అబ్దుల్లాహ్ బిన్ ఉబై ఇబ్నె సలూల్ మరణించినప్పుడు, అతని అంత్యక్రియల నమాజ్ చేయించమని దైవప్రవక్త(స)ను ఆహ్వానించటం జరిగింది. ఆయన(స) నమాజె జనాజా చేయించడానికి నిలబడినప్పుడు నేను వెంటనే ప్రవక్త(స) దగ్గరకు వెళ్ళి, 'యా రసూలల్లాహ్! మీరు (కపటి అయిన) ఇబ్నె సలూల్ అంత్యక్రియల నమాజ్ చేయిస్తారా!? నిజానికి ఇతను ఫలానా ఫలానా రోజున (ఇస్లామ్‌కు వ్యతిరే కంగా) ఈ ఈ రకమైన మాటలు చెప్పి ఉన్నాడు' అని గుర్తు చేశాను.**

**ఉమర్(రజి) ఇంకా ఇలా అన్నారు: నేను అతగాడు చెప్పిన ఒక్కొక్క మాటను వినిపించసాగాను. కాని దైవప్రవక్త(స) చిరుమందహాసం చేస్తూ, 'ఉమర్! నా దగ్గరి**

---

513–1. వేరొక రివాయతు ప్రకారం ప్రవక్త మహనీయులు(స) ఇలా అన్నారు : "నా చొక్కా అతనికేవిధంగానూ ఉపకరించదు. కాకపోతే నా ఈ చర్య వల్ల అతని తెగకు చెందిన వెయ్యి మంది ముస్లింలుగా పరివర్తన చెందే అవకాశం ఉంది."

అలాగే జరిగింది కూడా. అబ్దుల్లాహ్ బిన్ ఉబై తెగకు చెందిన చాలా మంది ముస్లిం లుగా ధర్మపరివర్తన చెందారు. ఆయన సత్ప్రవర్తనకు వారు ఎంతగానో ప్రభావితు లయ్యారు.

మరో ఉల్లేఖనం ప్రకారం అబ్దుల్లాహ్ బిన్ ఉబై జీవించి ఉండగానే దైవప్రవక్త(స)ను పిలిచి, ఆయన చొక్కా ఇవ్వమని అభ్యర్థించాడు. తన మన్నింపు కొరకు ప్రార్థించమని కూడా కోరాడు. దైవప్రవక్త(స) అతని అభ్యర్థనకు సకారాత్మకంగా స్పందించారు.

**నుంచి జరుగు (వెళ్ళి అందరితోపాటే పంక్తిలో నిలబడు) అని చెప్పారు. నేను వద్దని పట్టుబట్టసాగాను. కాని ఆయన(స) ఇలా అన్నారు: "నాకు ఎంపిక స్వేచ్ఛ ఇవ్వబడింది. అందుకే నేను (ఇతని క్షమాపణకై విజ్ఞాపన చెయ్యడానికే, ఇతని నమాజె జనాజా చేయించడానికే) పూనుకున్నాను. ఒకవేళ డెబ్బయి కంటే ఎక్కువ సార్లు ఇతని ఇస్తిగ్‌ఫార్ చేయటం వల్ల ఇతని మన్నింపు జరుగుతుందని నాకు తెలిస్తే, నేను డెబ్బయి కంటే ఎక్కువ సార్లే ఇస్తిగ్‌ఫార్ చేస్తాను"– ఆ విధంగా దైవ ప్రవక్త(స) అతని నమాజె జనాజా చేయించి ఇంటికి తిరిగి వచ్చారు. ఇది జరిగిన కొద్దిసేపటికే బరాత్ సూరాలోని రెండు ఆయత్‌లు అవతరించాయి. ఇలా సెలవీయటం జరిగింది: *"ఇక మీదట వారిలో ఎవడయినా మరణిస్తే, అతడి జనాజా నమాజును కూడా నీవు ఎంతమాత్రం చెయ్యకు. ఎన్నడూ అతని గోరీ వద్ద నిలబడకు. ఎందుకంటే వారు అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తనూ తిరస్కరించారు. ఇంకా వారు ద్రోహులుగానే మరణించారు..."* [1] *(9: 84)***

## అధ్యాయం : 12

## దైవాజ్ఞ

**"(ప్రవక్తా!) ఇక మీదట వారిలో ఎవడయినా మరణిస్తే అతడి జనాజా నమాజును కూడా నీవు ఎంతమాత్రం చెయ్యకు. (క్షమాపణ కొరకు వేడుకోవడానికి) అతడి గోరీ వద్ద నిలబడకు."** ***(9: 84)***

**515) ఇబ్నె ఉమర్(రజి) తెలిపారు: అబ్దుల్లాహ్ బిన్ ఉబై మరణించినప్పుడు అతని కుమారుడు అబ్దుల్లాహ్ దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చారు. దైవ ప్రవక్త(స) ఆయనకు తన చొక్కాను ప్రదానం చేసి, దానిని అతని కఫన్ వస్త్రంగా**

514–1. అల్లాహ్ మహనీయ ఉమర్(రజి) అభిప్రాయానికి అనుగుణంగానే ఆదేశించాడు. మహనీయ ఉమర్(రజి) తన మనోభావాన్ని అభివ్యక్తం చేయడంలో, తన అభిప్రాయాన్ని నిర్దిష్టంగా ప్రకటించే విషయంలో సాటిలేని మేటి. ఇక పరిపాలనా దక్షతలో, రాజకీయ వ్యవహారాలలో కూడా ఆయనకు సమ ఉజ్జీలు ఎవరూ లేరు. ఇక దైవప్రవక్త(స) నిర్ణయం గురించి చెప్పాలంటే, ఆయన(స) దృష్టిలో ఒకానొక ధార్మిక పరమార్థం ఉంది. గడిచిన హదీసు వివరణలో దానిని గురించి చర్చించాము. చివరకు కపటుల అంత్యక్రియలలో పాల్గొనరాదని స్పష్టంగా ఆజ్ఞాపించబడిన తరువాత ఆయన (స) మునాఫిఖీన్‌ల నమాజె జనాజాలో పాల్గొనలేదు.

ఉపయోగించమని సూచించారు. తరువాత ఆయన(స) అతని నమాజె జనాజా చేయించడానికి నిలబడినప్పుడు, ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) దైవప్రవక్త(స)ను పట్టుకుని, 'అయ్యో! తమరు ఇతని జనాజా నమాజ్ చేయిస్తారా? వాస్తవానికి ఇతను ఒక మునాఫిఖ్ కదా! అల్లాహ్ కూడా ఇతని క్షమాపణ కొరకు విజ్ఞాపన చేయరాదని మీకు సూచించాడు కదా!' అని ప్రాధేయపడగా, "అల్లాహ్ నాకు ఎంపిక స్వేచ్ఛ ఇచ్చాడ"ని దైవప్రవక్త(స) చెప్పారు. దైవాదేశం ఇది: "ప్రవక్తా! నీవు అటువంటి ప్రజలను క్షమించవలసినదిగా విజ్ఞాపన చేసినా, చేయకపోయినా ఒకటే; ఒకవేళ నీవు వారిని క్షమించవలసినదిగా డెబ్భయి సార్లు విజ్ఞాపన చేసినా, అల్లాహ్ వారిని ఎంతమాత్రం క్షమించడు."(9: 80). దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "నేను డెబ్భయి సార్లకంటే ఎక్కువే ఇస్తిగ్ఫార్ చేస్తాను". హజ్రత్ ఉమర్(రజి) ఇలా అన్నారు: 'ఎట్టకేలకు ఆయన(స) నమాజ్ చేయించారు (నా సలహాను పట్టించుకో లేదు). మేము కూడా ఆయన(స)తోపాటే నమాజ్ చేశాము. ఆ తరువాత అల్లాహ్ ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు. **"ఇక మీదట వారిలో ఎవడయినా మరణిస్తే, అతడి జనాజా నమాజును కూడా నీవు ఎంతమాత్రం చెయ్యకు. ఎన్నడూ అతడి గోరీ వద్ద నిలబడకు. ఎందుకంటే వారు అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్తనూ తిరస్కరించారు. ఇంకా వారు ద్రోహులుగానే మరణించారు."** ***(9: 84)***

## అధ్యాయం : 13

# కపట నీతి

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"నీవు మరలి వచ్చిన తరువాత వారు నీ ముందు ప్రమాణాలు చేస్తారు. నీవు వారిని ఉపేక్షించాలని. కనుక నీవు వారిని తప్పకుండా ఉపేక్షించు. ఎందు కంటే, వారొక మాలిన్యం వంటివారు. వారి అసలు స్థానం నరకం. అది వారి సంపాదనకు ప్రతిఫలంగా వారికి లభిస్తుంది." ***(9: 95)***

**516)** అబ్దుల్లాహ్ బిన్ కాబ్ బిన్ మాలిక్ (తన తండ్రి) కాబ్ బిన్ మాలిక్ (రజి) ద్వారా తబూక్ యుద్ధంలో పాల్గొనలేకపోయిన సంఘటనను గురించి విన్నారు. కాబ్ బిన్ మాలిక్(రజి) ఇలా తెలిపారు: "అల్లాహ్ సాక్షిగా! సన్మార్గ భాగ్యం పొందిన తరువాత అల్లాహ్ నాకు ప్రసాదించిన గొప్ప బహుమానం ఏదంటే, అది

దైవప్రవక్త(స) సమక్షంలో నిజం చెప్పటమే. అల్లాహ్ నన్ను అబద్ధం చెప్పటం నుండి రక్షించాడు. లేకపోతే నేను కూడా అబద్ధపు సంజాయిషీలు ఇచ్చుకుని నాశనమై పోయిన వారితోపాటే నాశనమైపోయి ఉండేవాణ్ణి.[1] అలాంటి (కుంటి సాకులు చెప్పిన) వారి గురించి అల్లాహ్ అవతరింపజేసిన 'వహీ' ఇది: **"నీవు మరలివచ్చిన తరువాత వారు నీ ముందు ప్రమాణాలు చేస్తారు, నీవు వారిని ఉపేక్షించాలని. కనుక నీవు వారిని తప్పకుండా ఉపేక్షించు. ఎందుకంటే, వారొక మాలిన్యం వంటి వారు. వారి అసలు స్థానం నరకం. అది వారి సంపాదనకు ప్రతిఫలంగా వారికి లభిస్తుంది. వారు నీ సమక్షంలో ప్రమాణాలు చేస్తారు, వారిపట్ల నీవు ప్రసన్నుడవు కావాలని. వాస్తవానికి, ఒకవేళ నీవు వారి పట్ల ప్రసన్నత చూపినా అల్లాహ్ మటుకు అటువంటి విద్రోహుల పట్ల ఎన్నటికీ ప్రసన్నుడు కాడు."**[1] ***(9: 95,96)***

## అధ్యాయం : 14

# తప్పు ఒప్పుకున్నవారు....

"వారు నీ సమక్షంలో ప్రమాణాలు చేస్తారు, వారి పట్ల నీవు ప్రసన్నుడవు కావాలని. వాస్తవానికి, ఒకవేళ నీవు వారి పట్ల ప్రసన్నత చూపినా అల్లాహ్ మటుకు అటువంటి విద్రోహుల పట్ల ఎన్నటికీ ప్రసన్నుడు కాడు." ***(9: 96)***

తమ తప్పులను ఒప్పుకున్నవారు కొందరు ఉన్నారు. వారి ఆచరణ మిశ్రమ మైనది. కొంత మంచీ, కొంత చెడూ. అల్లాహ్ వారిని మళ్ళీ కరుణించటం అనేది అసంభవమేమీ కాదు. ఎందుకంటే, ఆయన మన్నించేవాడూ కరుణించేవాడూను. ***(9: 102)***

**517)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) మాకు ఈ విధంగా చెప్పారని సమురా బిన్ జున్దబ్(రజి) తెలియజేశారు: రాత్రి (కలలో) నా దగ్గరకు ఇద్దరు దైవదూతలు వచ్చారు. వారు నన్ను ఒక నగరానికి తీసుకుపోయారు. వెండి

516-1. ఈ హదీసు **'కితాబుల్ మగాజీ'** (యుద్ధాల ప్రకరణం)లో చాలా వివరంగా వచ్చింది. మొదట కాబ్(రజి) ఆంతర్యంలో షైతాన్ రకరకాల దురాలోచనలను నూరిపోశాడు. ఏదో ఒక కుంటిసాకు చెప్పి తప్పించుకోమని ప్రేరేపించాడు. కాని అల్లాహ్ ఆయన్ని అబద్ధం చెప్పటం నుండి కాపాడాడు. నిజం చెప్పి ఈ తాత్కాలిక ఐహిక జీవితంలో శిక్షను అనుభవించడానికి ఆయన సంసిద్ధం అయ్యారు. ఈ నిజమే ఆయన్ని నికార్స యిన ముస్లింగా చరిత్రలో చిరస్థాయిగా నిలిపింది.

బంగారు ఇటుకలతో నిర్మించబడిన నగరం అది. అక్కడ మాకు కొంతమంది తారసపడ్డారు. వారి శరీరంలోని సగభాగం అత్యంత సుందరంగా ఉంది. ఎంత సుందరంగా ఉందంటే చూసేవారెవరూ అలాంటి సౌందర్యాన్ని చూసి ఉండరు. వారి శరీరంలోని మిగతా అర్ధభాగం అత్యంత అందవికారంగా ఉంది. అలాంటి అంద వికారాన్ని చూసేవారెవరూ చూసి ఉండరు. ఆ ఇద్దరు దైవదూతలు వారి నుద్దేశించి, 'పొండి, పోయి ఆ కాలువలో మునకలు వేయండి" అని పురమాయించారు. వారు వెళ్ళి, ఆ కాలువలో మునిగి వచ్చారు. వారు మమ్మల్ని సమీపిస్తున్న కొద్దీ వారి అంద వికారం తగ్గుతూపోయింది. వారు ఎంతో సుందర స్వరూపులుగా కానరాసాగారు. అప్పుడు ఆ దైవదూతలు నాతో, "ఇది 'జన్నతె అద్న్'. మీ నివాస గృహం ఇక్కడే ఉంది" అని చెప్పారు. ఇక ఆయన(స); ఎవరెవరి శరీర భాగాలు సగం అందంగా, సగం అందవికారంగా ఉండటం చూశారో వారు ప్రపంచంలో మంచీ చెడులు (మిశ్రమంగా) చేసినవారు. కడకు అల్లాహ్ వారికి క్షమాభిక్ష పెట్టాడు.

## అధ్యాయం : 15

## తస్మాత్ జాగ్రత్త!

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు-

ముష్రిక్కులను క్షమించవలసినదిగా ప్రార్థన చెయ్యటం ప్రవక్తకూ, విశ్వాసులకూ తగని పని. ***(9: 113)***

**518)** సయీద్ బిన్ ముసయ్యిబ్‌కు ఆయన తండ్రి (ముసయ్యిబ్ బిన్ హిజ్న్) తెలిపారు: అబూతాలిబ్‌కు మరణ ఘడియలు సమీపించినప్పుడు, ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఆయన దగ్గరకు వెళ్ళారు. ఆ సమయంలో అబూ జహ్ల్, అబ్దుల్లాహ్ బిన్ అబీ ఉమయ్యా కూడా అక్కడే ఉన్నారు. దైవప్రవక్త(స) తన పెత్తండ్రితో "పెదనాన్నా! (మీరు మీ నోటితో ఒక్కసారి కలిమా) **'లా ఇలాహ ఇల్లల్లాహ్'** అని పలకండి. నేను దానినే (మీ మోక్షం కొరకు ఆధారంగా చేసుకుని) అల్లాహ్ సమక్షంలో సమర్పిస్తాను" అన్నారు. దానిపై అబూ జహ్ల్, అబ్దుల్లాహ్ బిన్ అబీ ఉమయ్యా రెచ్చిపోతూ, 'అబూ తాలిబ్! ఏమిటి, మీరు అబ్దుల్ ముత్తలిబ్ మత ధర్మంనుండి తిరిగిపోతారా?' అని అడిగారు (అబూ తాలిబ్ కలిమా పఠించ లేదు సరికదా, 'నేను అబ్దుల్ ముత్తలిబ్ మతంపైనే ప్రాణం విడుస్తాను' అన్నారు).

అప్పుడు దైవప్రవక్త(స), "(పెదనాన్నా!) నేను మీ క్షమాపణ కొరకు వేడుకుంటూనే ఉంటాను. నన్ను వారించనంత వరకూ ప్రార్థిస్తూనే ఉంటాను" అన్నారు. అప్పుడు ఈ ఆయత్ అవతరించింది: **"ముష్రిక్కులను క్షమించవలసినదిగా ప్రార్థన చెయ్యటం ప్రవక్తకూ, విశ్వాసులకూ తగని పని, వారు వారికి బంధువులైనప్పటికీ, ఇంకా వారు నరకానికి అర్హులని వారికి స్పష్టమైనప్పుడు."** ***(9: 113)***

## అధ్యాయం : 16

# దైవ కారుణ్యానికి నోచుకున్న ధన్యజీవులు

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

అల్లాహ్ క్షమించాడు ప్రవక్తనూ, బహు కష్టకాలంలో ప్రవక్తకు తోడ్పడిన ముహాజిరులనూ, అన్సారులనూ. వారిలో కొందరి హృదయాలు వక్రత్వం వైపునకు మొగ్గినప్పటికీ (కాని వారు ఆ వక్రత్వాన్ని అనుసరించకుండా ప్రవక్తకు తోడ్పడినప్పుడు) అల్లాహ్ వారిని క్షమించాడు. నిస్సందేహంగా ఆయన వారి పట్ల వాత్సల్యంతో, కనికరంతో వ్యవహరించాడు. ***(9: 117)***

**519)** అబ్దుల్లాహ్ బిన్ కాబ్ తెలిపారు : (తన తండ్రి) కాబ్ బిన్ మాలిక్ (రజి)కు అంధత్వం వచ్చినప్పుడు, ఆయన కుమారులలో ఈయనే ఆయనకు తోడుగా ఉండి నడిపించేవారు. ఆయన ఇలా అన్నారు : నేను కాబ్ బిన్ మాలిక్ (రజి)ను, *"వ్యవహారం వాయిదా వేయబడిన ఆ ముగ్గురిని"* **(9:118)** గురించి అవతరించిన ఆయత్‌కు సంబంధించి అడిగినప్పుడు, ఆయన ఏమన్నారంటే, తన పశ్చాత్తాపం ఆమోదించబడిన సంతోషంలో తన సంపదనంతటినీ దైవం, దైవప్రవక్త మార్గంలో దానం చేస్తానని నేను (దైవప్రవక్తతో) అన్నప్పుడు, "వద్దు. అందులో కొంత భాగాన్ని నీ దగ్గరే ఉండనివ్వు. ఇదే నీ పాలిట ఉత్తమం" అని దైవప్రవక్త(స) హితవు పలికారు.

## అధ్యాయం : 17

# వ్యవహారం వాయిదా వేయబడిన ఆ ముగ్గురు

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

ఇంకా వ్యవహారం వాయిదా వేయబడిన ఆ ముగ్గురిని కూడా ఆయన క్షమించాడు. ఇంత పెద్ద వైశాల్యం కలిగి ఉండి కూడా, భూమి వారికి ఇరుకై

పోయింది. వారి ప్రాణాలు కూడా వారికి భారమైపోయాయి. అల్లాహ్ నుండి తమను కాపాడుకోవటానికి స్వయంగా అల్లాహ్ కారుణ్యం తప్ప వేరే ఆశ్రయం ఏదీ లేదని వారు తెలుసుకున్నారు. అప్పుడు అల్లాహ్ కనికరంతో వారి వైపునకు మరలాడు, వారు ఆయన వైపునకు మరలి వచ్చేటందుకు. నిశ్చయంగా ఆయన చాలా క్షమించేవాడూ, కరుణించేవాడూను. ***(9: 118)***

**520)** అబ్దుల్లాహ్ వివరించారు : నేను నా తండ్రి కాబ్ బిన్ మాలిక్ (రజి) చెప్పగా విన్నాను- పశ్చాత్తాపం ఆమోదించబడిన ఆ ముగ్గురిలో ఆయన ఒకరు. ఆయన ఇలా అన్నారు: "నేను తబూక్ యుద్ధం, బద్ర్ యుద్ధం తప్ప మరే యుద్ధం లోనూ దైవప్రవక్త(స) వెంట వెళ్ళకుండా ఉండలేదు."

ఆయన ఇంకా ఇలా అన్నారు: ఉదయం చాష్త్ సమయాన దైవప్రవక్త(స) తబూక్ ప్రయాణం నుండి తిరిగి వచ్చినప్పుడు, నేను నిజం చెప్పాలని గట్టిగా సంకల్పించుకున్నాను. ఆయన(స) ప్రయాణం నుండి ఎప్పుడు (మదీనాకు) తిరిగి వచ్చినా, ఉదయం కాస్త పొద్దెక్కుతున్న సమయంలో వచ్చి, అన్నిటికన్నా ముందు మస్జిద్‌లోనికి వెళ్ళి, రెండు రకతుల నమాజ్ చేయటం ఆనవాయితీగా ఉండేది. (మొత్తానికి) ఆయన నన్నూ, నా తోటి మరో ఇద్దరు సహచరులను సంజాయిషీ అడిగిన మీదట, మా ముగ్గురితో ఎవరూ మాట్లాడకూడదని ప్రియ శిష్యులందరికీ తాకీదు చేశారు. మాతో పాటు ఇంకా చాలా మంది యుద్ధంలో పాల్గొనలేదు. (వారు పైకి ముస్లింలుగా అభినయం చేసేవారు. కుంటిసాకులు చెప్పేవారు) అలాంటి వారెవరితో మాట్లాడరాదన్న ఆంక్ష విధించబడలేదు. (కేవలం మా ముగ్గు రికే ఈ శిక్ష). అందువల్ల జనులు మాతో మాట్లాడటం మానేశారు. నేను ఆ బహి ష్కార స్థితిలోనే ఉన్నాను. రోజులు గడ్డుగా గడుస్తున్నాయి. నా బాధల్లా ఒక్కటే- ఒకవేళ (ఈ లోగా) నేను మరణిస్తే దైవప్రవక్త(స) నా జనాజా నమాజ్ చేస్తారా? ఒకవేళ దైవప్రవక్త(స) పరమపదిస్తే అది నా పాలిట ఇంకా బాధాకరం అవుతుంది. ఎందుకంటే జనులు జీవితాంతం నన్ను బహిష్కరిస్తారు. నాతో ఎవరూ మాట్లాడరు. నేను చచ్చిపోతే, నా జనాజా నమాజు ఎవరూ చేయరు.

ఎట్టకేలకు అల్లాహ్ మా పశ్చాత్తాపాన్ని ఆమోదిస్తున్న శుభవార్తను రాత్రి చివరి జామున తన ప్రవక్తకు అవతరింపజేశాడు. ఆ సమయంలో దైవప్రవక్త(స) తన సతీమణి ఉమ్మె సలమా(ర.అ) ఇంట్లో ఉన్నారు. ఉమ్మె సలమా (ర.అ) నా

పట్ల ఉపకార భావంతో మెలగాలని, నాకు సహాయం చేయాలని ఆశించేవారు. దైవప్రవక్త(స) ఆమెతో, "ఉమ్మె సలమా! కాబ్ పశ్చాత్తాపం ఆమోదించబడింది" అని పలికారు. 'మరైతే నేను ఎవరినయినా అతని వద్దకు పంపించి ఈ శుభవార్తను అందజెయ్యమంటారా!' అని ఆమె విన్నవించుకోగా, "వద్దు. ఈ శుభవార్త విన్నం తనే జనులు వచ్చి గుమిగూడతారు. ఇక నీవు నిద్రపోలేవు" అని దైవప్రవక్త(స) వారించారు.

ఉదయం ఫజ్ర్ నమాజ్ తర్వాత దైవప్రవక్త(స), పశ్చాత్తాపం ఆమోదించ బడిన సంగతి ప్రజలకు తెలియపరిచారు. ఆ క్షణంలో ఆయన ముఖారవిందం పున్నమి చంద్రునిలా ప్రకాశమానమై ఉంది. ఖుర్‌ఆన్‌లో ప్రస్తావించబడిన (వ్యవ హారం వాయిదా వేయబడిన) మా ముగ్గురి పశ్చాత్తాపం కూడా ఆమోదించబడింది. ఆ మేరకు దైవాజ్ఞ అవతరించింది. అబద్ధపు సంజాయిషీలు ఇచ్చి తప్పించుకునే ప్రయత్నం చేసిన వారి ప్రస్తావన కూడా వచ్చింది. చాలా చెడ్డ రీతిలో వారు ప్రస్తావించబడ్డారు. అటువంటి చెడ్డ ప్రస్తావన అల్లాహ్ మరెవరి గురించి కూడా చేయలేదు. ఈ విధంగా సెలవిచ్చాడు: *మీరు తిరిగి వారి వద్దకు పోయినప్పుడు, వారు రకరకాల సాకులు చెబుతారు. కాని మీరు స్పష్టంగా ఇలా చెప్పండి :* **"సాకులు చెప్పకండి. మేము మీ ఏ మాటనూ నమ్మం. అల్లాహ్ మాకు మీ పరిస్థితులన్నీ తెలిపాడు. ఇక అల్లాహ్, ఆయన ప్రవక్తా మీ ప్రవర్తనను చూస్తారు. తరువాత మీరు ఆయన వైపునకు మరలింపబడతారు. ఆయన బహిరంగంగా ఉన్నదీ, గుప్తంగా ఉన్నదీ, అంతా ఎరిగినవాడు. మీరు ఏమేమి చేస్తూ ఉండేవారో ఆయన మీకు తెలుపుతాడు."** ***(9: 94)***

## అధ్యాయం : 18

# సత్యవంతులకు తోడుగా ఉండండి

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్‌కు భయపడండి. సత్యవంతులకు తోడ్పడండి. ***(9: 119)***

**521)** అబ్దుల్లాహ్ బిన్ కాబ్ బిన్ మాలిక్ తెలిపారు: ఈయన కాబ్ బిన్ మాలిక్ (రజి)కు (వృద్ధాప్యంలో కంటిచూపు పోయినప్పుడు) ఆయన్ని వెంట బెట్టుకుని తిరిగేవారు. అబ్దుల్లాహ్ ఇలా అన్నారు : నేను కాబ్ బిన్ మాలిక్(రజి)

చెప్పగా విన్నాను. ఆయన తబూక్ యుద్ధంలో పాల్గొనలేకపోయిన వృత్తాంతాన్ని వినిపిస్తూ, 'దైవసాక్షి! నిజం చెప్పినందుకు అల్లాహ్ నాకు ప్రసాదించినంత మంచి ప్రతిఫలం వేరెవరికీ బహుశా ప్రసాదించి ఉండదు. ఈ వ్యవహారంలో నేను దైవ ప్రవక్త(స) సమక్షంలో నిజం చెప్పినప్పటి నుండీ ఈనాటి వరకూ ఎన్నడూ అబద్ధం చెప్పాలన్న సంకల్పం కూడా చేసుకోలేదు. అల్లాహ్ తన ప్రవక్త(స)పై ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు : "అల్లాహ్ క్షమించాడు ప్రవక్తనూ, బహు కష్టకాలంలో ప్రవక్తకు తోడ్పడిన ముహాజిరులనూ, అన్సార్లనూ. వారిలో కొందరి హృదయాలు వక్రత్వం వైపునకు మొగ్గినప్పటికీ (కాని వారు ఆ వక్రత్వాన్ని అనుసరించకుండా ప్రవక్తకు తోడ్పడినప్పుడు) అల్లాహ్ వారిని క్షమించాడు. నిస్సందేహంగా అల్లాహ్ వారి పట్ల వాత్సల్యంతో, కనికరంతో వ్యవహరించాడు. ఇంకా వ్యవహారం వాయిదా వెయ్య బడిన ఆ ముగ్గురిని కూడా ఆయన క్షమించాడు. ఇంత పెద్ద వైశాల్యం కలిగి ఉండి కూడా, భూమి వారికి ఇరుకైపోయింది. వారి ప్రాణాలు కూడా వారికి భారమై పోయాయి. అల్లాహ్ నుండి తమను కాపాడుకోవడానికి స్వయంగా అల్లాహ్ కారుణ్యం తప్ప వేరే ఆశ్రయం ఏదీ లేదని వారు తెలుసుకున్నారు. అప్పుడు అల్లాహ్ కనికరంతో వారి వైపునకు మరలాడు, వారు ఆయన వైపునకు మరలి వచ్చే టందుకు. నిశ్చయంగా ఆయన చాలా క్షమించేవాడూ, కరుణించేవాడూను. విశ్వ సించిన ప్రజలారా! అల్లాహ్‌కు భయపడండి. సత్యవంతులకు తోడ్పడండి.

***(9: 117-119)***

## అధ్యాయం : 19

## ఆ ప్రవక్త ఎటువంటి వాడంటే....

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"చూడండి! మీ వద్దకు ఒక ప్రవక్త వచ్చాడు. ఆయన స్వయంగా మీలోనివాడే. మీరు నష్టానికి గురికావటం అనేది ఆయనకు కష్టం కలిగిస్తుంది. మీ సాఫల్యాన్ని ఆయన తీవ్రంగా కాంక్షిస్తాడు. విశ్వాసులపై ఆయన వాత్సల్యం కలవాడు, కారుణ్యం కలవాడు." ***(9: 128)***

**522)** ప్రవక్త మహనీయుల(సఅసమ్)పై అవతరించే 'వహీ'ని లిఖించే వారిలో ఒకరైన జైద్ బిన్ సాబిత్ అన్సారీ (రజి) ఇలా వివరించారు. (హిజ్రీ 11లో ముసైలిమా కిజ్జాబ్‌తో జరిగిన) యమామా యుద్ధంలో చాలామంది ప్రవక్త ప్రియ

సహచరులు అమరగతి నొందారు. అప్పుడు అబూబక్ర్ సిద్దీఖ్(రజి) నన్ను పిలిపించారు. ఆయన దగ్గర ఉమర్(రజి) కూడా కూర్చుని ఉన్నారు. ఆయన నాతో ఇలా అన్నారు: "ఉమర్ నా దగ్గరకు వచ్చి, యమామా యుద్ధంలో చాలామంది ముస్లింలు వీర మరణం పొందారని, ఈ విధంగా యుద్ధాలలో విద్వాంసులు, ఖుర్ఆన్ కంఠస్థం చేసుకున్నవారు మరణిస్తూపోతే ఖుర్ఆన్‌లోని చాలా భాగం వృధా అయిపోయే ప్రమాదం ఉందన్న భయాందోళనను వ్యక్తపరిచారు. కాబట్టి మన ముందున్న ఏకైక కర్తవ్యం ఏమిటంటే, ఖుర్ఆన్‌ను ఒకచోట సేకరించవలసిన ఆవశ్యకత ఉంది, మీరు తప్పకుండా ఖుర్ఆన్‌ను క్రోడీకరించే పనికి పూనుకోవాల"ని తన అభిప్రాయాన్ని వెల్లడించారు.

"దైవప్రవక్త (స) స్వయంగా చెయ్యని ఈ పనిని నేనెలా చేయగలుగుతాను?" అని నేనాయనతో చెప్పాను. కాని ఉమర్(రజి) 'దైవసాక్షి! ఇది ఓ పుణ్య కార్యం' అని చెప్పారు. ఆ తరువాత ఉమర్(రజి) తరచూ ఈ విషయంపై నాతో చర్చిస్తూ ఉండేవారు. ఎట్టకేలకు ఈ మహత్కార్యం కొరకు అల్లాహ్ నా హృదయాన్ని కూడా విప్పారజేశాడు. చివరకు ఉమర్(రజి) అభిప్రాయమే నా అభిప్రాయం అయింది.

జైద్ బిన్ సాబిత్ అన్సారీ(రజి) ఇలా వివరించారు: ఆ సమయంలో ఉమర్ (రజి) కూడా అక్కడే నిశ్శబ్దంగా కూర్చుని ఉన్నారు. అబూబక్ర్ (రజి) ఇలా అన్నారు- "చూడు, నీవు యువకుడవు. విషయావగాహన కలవాడవు కూడా. మాకు నీ మీద ఎలాంటి సంశయం కూడా లేదు. అదీగాక నీవు దైవప్రవక్త(స)కు అవతరించే 'వహీ'ని లిఖిస్తూ ఉండేవాడివి. కాబట్టి నువ్వే- చెల్లాచెదరుగా ఉన్న- ఖుర్ఆన్‌ను అన్వేషించి దానిని సమీకరించు."

దైవసాక్షి! ఒకవేళ అబూబక్ర్(రజి) నాకు ఒక కొండను ఎత్తుకెళ్ళమని ఆదేశించి ఉంటే, అది నాకు అంత బరువు అనిపించేది కాదేమో! ఖుర్ఆన్‌ను క్రోడీకరించే ఈ బాధ్యత నా పాలిట అంతకన్నా బరువైనది. 'దైవప్రవక్త(సఅసమ్) ఖుద్దుగా పూనుకోని పనిని చేయడానికి మీరెలా సంసిద్ధులయ్యారు?' అని నేను విన్నవించుకున్నాను. దానికి అబూబక్ర్(రజి), "దైవసాక్షి! ఇదొక గొప్ప సత్కార్యం" అన్నారు.

ఈ వ్యవహారంపై నేనాయనతో తర్జన భర్జన చేయసాగాను. కడకు అల్లాహ్ ఈ సేవ కొరకు ఉమర్, అబూబక్ర్‌ల హృదయాన్ని విప్పినట్టే నా హృదయాన్ని కూడా విప్పాడు. అంతే, నేను లేచి నిలబడ్డాను. ఎముకలు, చర్మం, ఖర్జూర ఆకుల ద్వారా (ఆనాటి రివాజు ప్రకారం ఖుర్‌ఆన్ వాటిపై లిఖించబడి ఉండేది) ఖుర్‌ఆన్‌ను క్రోడీకరించడం ప్రారంభించాను. ఖుర్‌ఆన్‌ను కంఠస్థం చేసుకుని ఉన్న సంస్మర్తల (హుఫ్ఫాజ్) సహాయం కూడా పొందాను. సూరయె తౌబాలోని రెండు ఆయత్‌లు ఖుజైమా అన్సారీ (రజి)[1] వద్ద నాకు లభించాయి. ఆయన తప్ప వేరెవరి వద్ద కూడా ఈ రెండు ఆయత్‌లు లభ్యం కాలేదు. ఆ రెండు ఆయత్‌లు ఇవి : **చూడండి! మీ వద్దకు ఒక ప్రవక్త వచ్చాడు. ఆయన స్వయంగా మీలోనివాడే. మీరు నష్టానికి గురికావటం అనేది ఆయనకు కష్టం కలిగిస్తుంది. మీ సాఫల్యాన్ని ఆయన తీవ్రంగా కాంక్షిస్తాడు. విశ్వాసులపై ఆయన వాత్సల్యం కలవాడు, కారుణ్యం కలవాడు - ఇక వారు నీకు విముఖులైతే, ప్రవక్తా! వారితో ఇలా అను : "నాకు అల్లాహ్‌యే చాలు. ఆయన తప్ప ఆరాధ్యుడు ఎవ్వడూ లేడు. ఆయననే నేను నమ్ముకున్నాను. ఆయన మహత్తరమైన అధికార పీఠానికి ప్రభువు."** ***(9: 128, 129)***

ఆ విధంగా తయారైన (సేకరించబడిన) ఖుర్‌ఆన్ ప్రతి అబూబక్ర్(రజి) వద్ద భద్రపరచబడింది. ఆయన పరమపదించిన తరువాత ఆ ప్రతి ఉమర్(రజి) దగ్గర భద్రపరచటం జరిగింది. ఉమర్(రజి) మరణించిన పిదప అది, ఆయన కుమార్తె (ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ హఫ్సా–ర.అ) దగ్గర భద్రంగా ఉంది.

---

522–1. వాస్తవానికి ఈ రెండు ఆయత్‌లు (9: 128, 129) కేవలం ఒక్క ఖుజైమా అన్సారీ (రజి) వద్దనే ఉన్నాయన్నది దాని అర్థం కాదు. నిజానికి ఆ వచనాలు ఎంతోమందికి కంఠస్థమై, వారి మనోఫలకాలపై ముద్రితమై ఉన్నాయి. కాని లిఖిత పూర్వకంగా మాత్రం ఒక్క ఖుజైమా అన్సారీ వద్దనే లభ్యమైనాయి.

# 10. యూనుస్ సూరా వ్యాఖ్యానం

## అధ్యాయం : 1

## ఫిరౌన్ మునిగిపోతున్నప్పుడు

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"మేము ఇస్రాయీల్ సంతతిని సముద్రం దాటించాము. తరువాత ఫిరౌనూ, అతని సైన్యాలూ హింసించే ఉద్దేశ్యంతో, అణచివేసే ఉద్దేశ్యంతో వారిని వెంబడించారు. చివరకు ఫిరౌన్ మునిగిపోతున్నప్పుడు ఇలా అరవసాగాడు: "ఇస్రాయీలు సంతతి వారు విశ్వసించిన దేవుడే నిజమైన దేవుడు అనీ, ఆయన తప్ప మరొక దేవుడు ఎవడూ లేడు అనీ నేనూ విశ్వసించాను. నేను కూడా విధేయతతో శిరస్సు వంచేవారిలోని వాడనే." ఇలా (జవాబు ఇవ్వబడింది): "ఇప్పుడు విశ్వసిస్తున్నావా! వాస్తవానికి ఇంతవరకు నీవు అవిధేయత చూపుతూ ఉండేవాడివి. ఇంకా కల్లోలాన్ని రేకెత్తించేవారిలో కూడా ఉన్నావు. ఇప్పుడు మేము కేవలం నీ శవాన్ని మాత్రమే రక్షిస్తాము, నీవు వచ్చే తరాల వారికి గుణపాఠం గుర్తుగా ఉండేటందుకు. కాని చాలా మంది మానవులు మా సూచనలను నిర్లక్ష్యం చేస్తారు." ***(10: 90-92)***

**523)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసమ్) మదీనాకు విచ్చేసినప్పుడు, యూదులు ఆషూరా దినాన ఉపవాసం ఉండటం గమనించారు. "ఈ రోజునే మూసా (అలైహిస్సలామ్)కు ఫిరౌన్‌పై విజయం లభించింది" అని వారు చెప్పారు. అప్పుడు దైవప్రవక్త(స) తన సహచరులతో "మనం మూసా (అలైహిస్సలామ్)కు వారికంటే కూడా ఎక్కువ సన్నిహితులం. కనుక మీరు కూడా (ఈ రోజున) ఉపవాసం ఉండండి"[1] అని బోధించారు.

523-1. ఆ తరువాత యూదులను పోలినట్లు ఉండరాదని, ఆషూరా దినపు ఉపవాసంతో పాటు దానికి ఒకరోజు ముందు (9వ తేదీ) లేక ఒక రోజు తర్వాత (ముహర్రమ్ 11వ తేదీన) కూడా ఉపవాసం పాటించమని ప్రవక్త(స) సూచించారు.

# 11. హూద్ సూరా వ్యాఖ్యానం

## అధ్యాయం : 1

## గుండెల్లోని గుట్టును సయితం ఎరిగినవాడు

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

“చూడండి! వారు తమ వక్షములను తిప్పుకుంటారు, అతని నుండి దాక్కుందామని. జాగ్రత్త! వారు బట్టలతో తమను తాము కప్పుకున్నప్పటికీ, అల్లాహ్ వారి గుప్త విషయాలనూ ఎరుగును, వారి బహిరంగ విషయాలనూ ఎరుగును. ఆయన హృదయాలలో ఉన్న రహస్యాలను కూడా ఎరుగును.” (11: 5)

**524)** ముహమ్మద్ బిన్ అబ్బాద్ బిన్ జాఫర్ తెలిపారు: ఆయన ఇబ్నె అబ్బాస్ (రజి) ఈ ఆయత్ (11: 5)ను ఈ విధంగా పఠించగా విన్నారు: “**అలా ఇన్నహుమ్ తస్‌నౌనీ సుదూరు హుమ్...**” నేను ఈ ఆయత్‌ను గురించి ఇబ్నె అబ్బాస్‌ను అడిగితే ఆయన ఇలా అన్నారు : కొంతమంది ఈ విషయంలో సిగ్గుతో కుంచించు కుపోయేవారు. బహిర్ భూమిలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు కూర్చోవటంలో, ఆకాశం కనబడేలా బట్టలు విప్పడంలో, తమ భార్యతో రతిక్రీడ సాగించటంలో సిగ్గిల్లేవారు. అలాంటి వారి గురించే ఈ ఆయత్ అవతరించింది. “**చూడండి! వారు తమ వక్షములను తిప్పుకుంటారు, అతని నుండి దాక్కుందామని. జాగ్రత్త! వారు బట్టలతో తమను తాము కప్పుకున్నప్పటికీ, అల్లాహ్ వారి గుప్త విషయాలనూ ఎరుగును, వారి బహిరంగ విషయాలనూ ఎరుగును. ఆయన హృదయాలలో ఉన్న రహస్యాలను కూడా ఎరుగును.**” ***(11: 5)***

**525)** ముహమ్మద్ బిన్ అబ్బాద్ బిన్ జాఫర్ తెలిపారు: ఇబ్నె అబ్బాస్ (రజి), “**అలా ఇన్నహుమ్ తస్‌నౌనీ సుదూరహుమ్**” అని పారాయణం చేసేవారు. ‘ఓ

**అబూ అబ్బాస్! దీని అర్థం ఏమిటి?' అని ఆయన్ని అడిగితే, ఆయన ఇలా విడమరిచి చెప్పారు : "కొంతమంది తమ భార్యతో సమాగమం జరపడానికి సిగ్గు పడేవారు. బహిర్ భూమిలో (దొడ్డికి) కూర్చోవడానికి కూడా సిగ్గుపడిపోయేవారు. అలాంటి వారి గురించే ఈ ఆయత్ అవతరించింది. అలా ఇన్నహుమ్ తస్‌నౌనీ సుదూరుహుమ్....**

**526)** అమ్ర్ బిన్ దీనార్ వివరించారు : ఇబ్నె అబ్బాస్(రజి) ఈ ఆయత్‌ను **(11: 5)** ఈ విధంగా పఠించేవారు– **'అలా ఇన్నహుమ్ యస్‌నూన సుదూరహుమ్ అలయ్య అలా హీన యస్తగ్‌షూన సియాబహుమ్'.** అమ్ర్ బిన్ దీనార్ తప్ప మిగిలిన వారు ఏమన్నారంటే, ఇబ్నె అబ్బాస్ ప్రకారం **'యస్తగ్‌షూన'** అంటే, వారు తమ తల దాచుకునేవారు. సియాబహుమ్ అంటే, అతను తన జాతి వారిని శంకించాడు **'వజాఖబిహిమ్'** అంటే తన అతిథులను చూసి దురనుమానానికి గురయ్యాడు. అంటే తన జాతి వారు వాళ్ళను కూడా వేధిస్తారేమోనని శంకించాడు. **'బిఖితియిన్ మినల్లైలి'**– అంటే రాత్రి చీకటిలో. **'ఉదీబు'** అంటే మరలుతున్నాను అని అర్థమని ముజాహిద్ అభిప్రాయపడ్డారు.

### అధ్యాయం : 2

## దైవ సింహాసనం నీటిపై ఉండేది (11: 7)

**527)** అబూ హురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహోదయులు ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు: అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు– "నా దాసులారా! (మీరు నా మార్గంలో) ఖర్చుపెడితే నేను కూడా మీపైన ఖర్చుపెడ తాను". ఇంకా ఇలా అన్నారు: 'అల్లాహ్ చేతి నిండా ఉంది. రేయింబవళ్ళు ఖర్చు పెట్టినా అందులో ఏ లోటూ రాదు'. ఇంకా ఇలా అన్నారు: 'మీరు చూడటం లేదా, అల్లాహ్ భూమ్యాకాశాలను సృష్టించినప్పటి నుండి ఎలా ఖర్చు చేస్తున్నాడో! కాని ఆయన చేతిలో ఎలాంటి కొరతా ఏర్పడలేదు. ఆయన సింహాసనం నీళ్ళపై ఉండేది. ఆయన చేతిలో న్యాయం, సమత్వం, సమతూకాల ధర్మకాటా (త్రాసు) ఉంది. దానిని ఆయన వంచుతూ లేపుతూ ఉంటాడు.[1]

---

527–1. అంటే ఆయన తాను కోరిన వారి ఉపాధిని పెంచుతూ ఉంటాడు. తాను కోరిన వారికి పరిమితంగా ఇస్తూ ఉంటాడు. ఉపాధిని వికసింపజేయటం, కుంచింపజేయటం– రెండూ ఆయన చేతిలో ఉన్నాయి. బుద్ధివివేకాలు, విజ్ఞానం, ఉత్పత్తి కారకాలు– వీటిలో ఏవయినా సరే అల్లాహ్ కోరనంత వరకూ ఫలించవు.

అధ్యాయం : 3

## తమ ప్రభువుకు అబద్ధాన్ని అంటగట్టినవారు

అల్లాహ్‌కు అబద్ధం అంటగట్టే వాడికంటే పరమ దుర్మార్గుడెవడు? అటు వంటి వారు అల్లాహ్ సమక్షంలో హాజరవుతారు. తమ ప్రభువునకు అబద్ధాన్ని అంటగట్టినవారు వారే అని అపుడు సాక్షులు సాక్ష్యం చెబుతారు. విను! దుర్మార్గుల మీద దేవుని శాపం పడుతుంది. ***(11: 18)***

**528)** సఫ్వాన్ బిన్ ముహ్‌రిజ్ కథనం : ఇబ్నె ఉమర్(రజి) తవాఫ్ చేస్తూ ఉండగా ఒక వ్యక్తి ఆయనకు ఎదురుగా వచ్చి, 'ఓ అబూ అబ్దుర్రహ్మాన్!' లేదా 'ఓ ఇబ్నె ఉమర్!' అన్నాడు. మీరు దైవప్రవక్త(స) ద్వారా 'సమాలోచన' గురించి (అంటే ప్రళయదినాన అల్లాహ్ తన దాసునితో ఊసులాడే విషయం గురించి) ఏమైనా విన్నారా? అని ఆ వ్యక్తి అడిగాడు. దానికి ఆయన ఇలా అన్నారు : "విశ్వాసి (మోమిన్) తన ప్రభువుకు చాలా దగ్గరలో తీసుకురాబడతాడు. చివరకు అల్లాహ్ తన ఒక భాగాన్ని అతనిపై ఉంచి, 'నీవు చేసిన ఫలానా పాపం నీకు గుర్తుందా?' అని అడిగి, అతనిచేత తప్పు ఒప్పిస్తాడు. దాసుడు ఇలా అంటాడు: 'గుర్తుంది, నా ప్రభూ! నాకు గుర్తుంది' అని రెండుసార్లు తన అపరాధాన్ని అంగీకరిస్తాడు. అప్పుడు అల్లాహ్ ఇలా అంటాడు : "చూడు! నేను ప్రాపంచిక జీవితంలో నీ పాపాలను మరుగుపరచాను. ఈ రోజు కూడా నిన్ను క్షమిస్తాను". ఆ తరువాత సత్కార్యాల దస్త్రం చుట్టివేయబడుతుంది. కాని ఇతర జనులు లేదా అవిశ్వాసులు హష్ర్ మైదానంలో (నిస్సహాయులుగా) నిలబడి ఉంటారు. వారి గురించి, "అల్లాహ్‌కు అబద్ధాన్ని అంటగట్టిన వారు వీరే" అని అనబడుతుంది.

అధ్యాయం : 4

## ప్రభువు ఒక దుర్మార్గపు నగరాన్ని శిక్షించ దలిస్తే...

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"నీ ప్రభువు ఒక దుర్మార్గపు నగరాన్ని శిక్షించదలిస్తే, ఆయన శిక్ష (పట్టు) ఇలాగే ఉంటుంది. నిజంగానే ఆయన శిక్ష (పట్టు) బహుకఠినమైనది. బహు బాధాకరమైనది." **(11: 102)**

**529)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఈ విధంగా ప్రవచించినట్లుగా అబూ మూసా(రజి) ఉల్లేఖించారు: "అల్లాహ్ దుర్వర్తునికి ప్రపంచంలో కొన్నాళ్ళ పాటు గడువు ఇస్తూ ఉంటాడు. కాని అతనిని పట్టుకోదలిస్తే మాత్రం ఇక విడిచి పెట్టడు". ఉల్లేఖకుడు ఏమన్నారంటే, ఆ తరువాత ఆయన(స) ఈ ఆయత్‌ను పఠించారు: "నీ ప్రభువు ఒక దుర్మార్గపు నగరాన్ని పట్టుకోదలిస్తే, ఆయన పట్టు ఇలాగే ఉంటుంది. నిజంగానే ఆయన పట్టు మా గట్టిది. అత్యంత బాధాకరమైనది."

***(11 : 102)***

## అధ్యాయం : 5

# సత్కార్యాలు దుష్కార్యాలను దూరం చేస్తాయి

దైవోపదేశం-

"చూడు! నమాజును స్థాపించు. పగటి యొక్క రెండు సరిహద్దు సమయాలలోనూ, కొంత రాత్రి గడిచిన తరువాతనూ. వాస్తవానికి సత్కార్యాలు దుష్కార్యాలను దూరం చేస్తాయి. అల్లాహ్‌ను జ్ఞాపకం ఉంచుకునే వారికి ఇది ఒక జ్ఞాపిక."[1]

***(11: 114)***

**530)** ఇబ్నె మస్ఊద్ (రజి) కథనం: ఒక వ్యక్తి ఒక పరాయి స్త్రీని ముద్దు పెట్టుకుని దైవప్రవక్త(సఅసమ్) సన్నిధిలోకి వచ్చి, తనంతట తానుగా తన తప్పును ఒప్పుకున్నాడు. అప్పుడు ఈ ఆయత్ అవతరించింది: "నమాజును స్థాపించు- పగటి యొక్క రెండు సరిహద్దు సమయాలలోనూ, కొంత రాత్రి గడిచిన తరువాతనూ. వాస్తవానికి సత్కార్యాలు దుష్కార్యాలను దూరం చేస్తాయి. అల్లాహ్‌ను జ్ఞాపకం ఉంచుకునే వారికి ఇది ఒక జ్ఞాపిక." ఆ వ్యక్తి ఈ ఆయత్ కేవలం నా కొరకేనా? (అంటే 'సత్కార్యాలు దుష్కార్యాలను దూరం చేస్తాయి' అన్న ఆయత్ నా కోసమేనా?) అని అడిగితే, "దీనికి కట్టుబడిన నా ఉమ్మత్‌లోని ప్రతి వ్యక్తికీ ఇది వర్తిస్తుంది"[1] అని దైవప్రవక్త(స) చెప్పారు.

---

5-1. ఒక వ్యక్తి ఒక పరాయి స్త్రీ చేతిని తాకే లేక కేవలం ఆమెను ముద్దుపెట్టుకునే చేష్టకు ఒడిగట్టాడు. ఆ నేపథ్యంలో ఈ ఆయత్ అవతరించింది.

530-1. అంటే తప్పు జరిగినప్పుడు సిగ్గుతో కుంచించుకుపోవాలి. నిష్కల్మషమైన మనసుతో పశ్చాత్తాపపడాలి. నమాజును నెలకొల్పాలి. అప్పుడు అల్లాహ్ అతని పాపాన్ని క్షమిస్తాడు. పగటి యొక్క రెండు సరిహద్దులు అంటే ఫజ్ర్ మగ్రిబ్ నమాజులు. రాత్రి అంటే ఇషా నమాజ్. ఇక జుహ్ర్, అస్ర్‌ల ప్రస్తావన వేరితర ఆయత్‌లలో ఉంది.

# 12. యూసుఫ్ సూరా వ్యాఖ్యానం ★

## అధ్యాయం : 1

## నిశ్చయంగా నీ ప్రభువు సర్వజ్ఞుడు, మహా వివేకి

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

**నీ ప్రభువు నిన్ను (తన పని కొరకు) ఎన్నుకుంటాడు. నీకు విషయాల లోతును అందుకోవటం నేర్పుతాడు. నీకూ యాఖూబ్ సంతతికీ తన అనుగ్రహాన్ని పూర్తిగా ప్రసాదిస్తాడు. ఇంతకు పూర్వం ఆయన నీ పెద్దలైన ఇబ్రాహీముకూ, ఇస్హాఖుకూ పూర్తిగా ప్రసాదించినట్లు. నిశ్చయంగా నీ ప్రభువు సర్వజ్ఞుడు, మహా వివేకి. *(12 : 6)***

**531)** అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు : **"కరీమ్ బిన్ కరీమ్ బిన్ కరీమ్ బిన్ కరీమ్ - యూసుఫ్ బిన్ యాఖూబ్ బిన్ ఇస్హాఖ్ బిన్ ఇబ్రాహీమ్."** (గౌరవనీయుడు, గౌరవనీయుని కుమారుడు, గౌరవనీయుని మనవడు, గౌరవనీయుని ముని మనవడు యూసుఫ్) **- ఆయన యాఖూబ్(అ) కుమారుడు, మరాయనేమో ఇస్హాఖ్(అ) కుమారుడు, మరాయనేమో ఇబ్రాహీమ్(అ) కుమారుడు- వీరంతా దైవప్రవక్తలే.**

---

★ ఈ సూరా మక్కాలో అవతరించింది. ఇందులో 111 ఆయత్‌లు ఉన్నాయి. 'యూసుఫ్ (అలైహిస్సలామ్) గురించి మీకేం తెలుసో చెప్పండి?' అని యూదులు (ముష్రిక్కుల చేత) ప్రవక్త ముహమ్మద్(స)ను అడిగించారు. అప్పుడు ఈ సూరా పూర్తిగా - ఒకేసారి- అవతరించింది. యాఖూబ్(అ) తన కుమారుడు యూసుఫ్(అ)ను అమితంగా ప్రేమించేవారు. ఈ ప్రేమే ఆయన సోదరుల అసూయకు కారణమైంది.

## అధ్యాయం : 2
# గొప్ప సూచనలు

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**"యథార్థానికి యూసుఫ్, అతని సోదరుల గాథలో అడిగే వారికి గొప్ప సూచనలు ఉన్నాయి." *(12 : 7)***

**532) మహనీయ అబూహురైరా(రజి) తెలిపారు: ఒక వ్యక్తి దైవప్రవక్త (సఅసమ్)ను, 'అందరికన్నా ఎక్కువ ఆదరణీయుడు ఎవరు?' అని అడిగారు. దానికి ఆయన(స), "అందరికన్నా ఎక్కువగా దైవానికి భయపడేవాడే అందరికన్నా ఎక్కువ ఆదరణీయుడు" అని చెప్పారు. అప్పుడు ప్రియ సహచరులు, 'మా ప్రశ్నలోని ఉద్దేశం అది కాదండి!' అని విన్నవించుకోగా, "అలాగైతే అందరికన్నా అధికంగా గౌరవ మర్యాదలు కలవారు యూసుఫ్ (అలైహిస్సలామ్). ఆయన దైవప్రవక్త. దైవప్రవక్త కుమారులు. దైవప్రవక్త మనవడు, దైవప్రవక్త ముని మనవడు" అని ప్రవక్త మహనీయులు(స) వివరించి చెప్పారు. 'మా ప్రశ్నలోని ఉద్దేశం అది కూడా కాదండి' అని ప్రియశిష్యులు విన్నవించుకోగా, "ఓహెూ! మీరు అరబ్బు కుటుంబీకుల గురించి తెలుసుకోదలుస్తున్నారా!?" అని అడిగారు. 'అవునండీ' అని ప్రియ శిష్యులు చెప్పగా, ఆయన(స) ఇలా వివరించారు: "ఇస్లామ్ రాకపూర్వం (అజ్ఞాన కాలంలో) ఎవరు గౌరవాదరణలు కలవారుగా భావించబడేవారో, ఇస్లామ్ వచ్చిన తర్వాత కూడా వారే గౌరవాదరణలకు అర్హులు. కాకపోతే వారికి ధర్మావగాహన[1] అబ్బి ఉండాలి".**

## అధ్యాయం: 3
# అత్యుత్తమ సహనం

**(కుమారుల కట్టుకథను విని) వారి తండ్రి ఇలా అన్నాడు: "మీ దుష్ట మనస్సులు మీచేత ఒక ఘోరకార్యాన్ని చాలా తేలికగా చేయించాయి. సరే,**

532-1. గౌరవ మర్యాదలకు అర్హులు ఎవరంటే దేవుని పట్ల భయభక్తులు, ధర్మం (దీన్) పట్ల సదవగాహన కలవారే. ఒక వ్యక్తి సయ్యిదీగా, లీడర్‌గా పిలువబడినంత మాత్రాన అతడు సిసలైన గౌరవ పాత్రుడు కాదు. మరో విషయం ఏమిటంటే ఒక వ్యక్తి ధర్మ జ్ఞాని అయి ఉండటం వేరు, ధర్మం పట్ల మంచి అవగాహన కలిగి ఉండటం. కేవలం జ్ఞానం ఉంటే సరిపోదు; దీన్ (ధర్మం)లో **'తఫఖ్ఖుహు'** కలిగి ఉండటం చాలా అవసరం.

ఓర్చుకుంటాను. బాగా ఓర్చుకుంటాను. మీరు కల్పిస్తున్న మాటల విషయంలో సహాయం కోసం అల్లాహ్‌నే అర్థించాలి." *(12: 18)*

**533)** ఉర్వా బిన్ జుబైర్, సయీద్ బిన్ ముసయ్యిబ్, అల్ఖమా బిన్ వక్కాస్, ఉబైదుల్లాహ్ బిన్ అబ్దుల్లాహ్‌ల ద్వారా జుహ్రీ విన్న కథనం- మహాప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా(ర.అ)పై మోపబడిన అపనింద సంఘటన గురించి వారు విన్నారు. అపనింద మోపేవారు ఆమెపై అపనిందను మోపినప్పుడు, అల్లాహ్ ఆమె సౌశీల్యాన్ని (గురించి ఆయత్‌లు) అవతరింపజేశాడు- వీరంతా ఆ సంఘటనకు సంబంధించిన ఒక్కొక్క భాగాన్ని తనకు వినిపించారని ఉల్లేఖకుడు అన్నారు: దైవప్రవక్త (తన భార్య ఆయిషా-ర.అతో) ఇలా అన్నారు: "ఒకవేళ నీవు గనక శీలవతివి అయివుంటే అల్లాహ్ త్వరలోనే నీ సౌశీల్యాన్ని చాటే విషయం అవతరింప జేస్తాడు. కాని నీ వల్ల గనక తప్పు జరిగివుంటే, క్షమాపణకై అల్లాహ్‌ను వేడుకో. ఆయన సన్నిధిలో పశ్చాత్తాప పడు."

(ఆయిషా-ర.అ-ఇలా అన్నారు) అది విని నేనిలా అన్నాను- "దైవసాక్షిగా! నా ఉపమానం, మీ ఉపమానం యూసుఫ్ (అలైహిస్సలామ్) తండ్రి లాంటిది.[1] (ఆ సందర్భంగా ఆయన చెప్పిన మాటల్నే నేను చెబుతాను) **'సరే, ఓర్చుకుంటాను. బాగా ఓర్చుకుంటాను. మీరు కల్పిస్తున్న మాటల విషయంలో సహాయం కోసం అల్లాహ్‌నే అర్థించాలి."** *(12: 18)*

ఆ తరువాత అల్లాహ్ ఆయిషా(ర.అ) సౌశీల్యం, పారిశుధ్యం గురించి నూర్ సూరాలోని పది ఆయత్‌లను అవతరింపజేశాడు (ఈ అభాండాన్ని సృష్టించి తీసుకువచ్చినవారు, మీలోని ఒక వర్గం వారే... 24: 11-20)

**534)** ఉమ్మె రూమాన్(ర.అ) తనతో చెప్పినట్లుగా మస్రూఖ్ బిన్ అజ్దా తెలియజేశారు : ఆమె ఆయిషా(ర.అ) తల్లి. ఆమె ఇలా అన్నారు- "ఆయిషా(ర.అ)

---

533-1. ఇమామ్ బుఖారీ (రహ్మ) ఈ హదీసును ఇక్కడ తీసుకురావటంలోని ముఖ్య ఉద్దేశం, హజ్రత్ యూసుఫ్(అ) తండ్రి వృత్తాంతం ఇందులో ప్రస్తావనకు రావటమే. తీవ్రమైన దుఃఖానికి లోనై ఉన్న ఆయిషా(ర.అ)కు ఆ సమయంలో యూసుఫ్(అ) తండ్రి యాఖూబ్(అ) పేరు జ్ఞప్తికి రాలేదు. అందుకే ఆమె గారు 'యూసుఫ్ తండ్రి' అని అన్నారు.

**కూర్చుని ఉండగానే ఒక్కసారిగా ఆమెకు జ్వరం తీవ్రమయింది." "నలువైపులా వ్యాపిస్తున్న వదంతుల కారణంగా బహుశా ఇలా అయి ఉంటుంద"ని దైవ ప్రవక్త(స) అభిప్రాయపడ్డారు. నేను 'అవున'[1] న్నాను. ఆ తర్వాత ఆయిషా(ర.అ) కూర్చుని ఇలా అన్నారు: "నేనూ మరియు మీ ఉపమానం యాఖూబ్ (అలైహిస్సలాం), ఆయన కొడుకుల వంటిది. యాఖూబ్ ఇలా అన్నారు: 'మీ దుష్ట మనస్సులు మీచేత ఒక ఘోర కార్యాన్ని చాలా తేలికగా చేయించాయి. సరే, ఓర్చుకుంటాను. బాగా ఓర్చుకుంటాను. మీరు కల్పిస్తున్న మాటల విషయంలో సహాయం కోసం అల్లాహ్‌నే అర్థించాలి.'**

## అధ్యాయం : 4

# అన్యాయ వర్తనులు సాఫల్యం పొందలేరు

**అతను (యూసుఫ్) ఉంటున్న ఇంటిలోని స్త్రీ అతని కోసం వల పన్న సాగింది. ఒక రోజున తలుపులు మూసి "వచ్చెయ్యి!" అని అన్నది. యూసుఫ్ ఇలా అన్నాడు: "నేను అల్లాహ్ శరణు వేడుకుంటున్నాను. నా ప్రభువు నాకు మంచి స్థానం ప్రసాదించాడు. (నేను ఈ పని ఎలా చెయ్యను?) అటువంటి దుర్మార్గులు ఎన్నటికీ సాఫల్యం పొందలేరు."** ***(12: 23)***

**535) అబూ వాయల్ ఇలా అన్నారు: అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్(రజి) పై ఆయత్‌ను పారాయణం చేస్తూ "హైతలక" అని చదివారు. 'హైతలక' అంటే 'రా. వచ్చేసేయ్' అని అర్థం. ఈ పదాన్ని ఇలాగే పలకాలని తమకు నేర్పటం జరిగిందనీ, కనుక తాము ఇలాగే పలుకుతామని ఇబ్నె మస్‌ఊద్ (రజి) చెప్పారు.**

**536) అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్(రజి) మస్రూఖ్‌తో ఇలా అన్నారు: ఖురైషులు దైవప్రవక్త(సఅసమ్)ను విశ్వసించడంలో తాత్సారం చేయడంతో ఆయన(స) వారిని అధిక్షేపిస్తూ ఇలా ప్రార్థించారు: 'దేవా! యూసుఫ్(అ) కాలంలో ఏడు సంవత్సరాల కరువు వచ్చినట్లుగా వీరిపైన కూడా ఏడు సంవత్సరాల కరువు**

---

534-1. ఆయిషా(ర.అ) తల్లి ఉమ్మె రూమాన్(ర.అ) దైవప్రవక్త(స) పరమపదించిన తరువాత కూడా చాలా కాలం వరకు జీవించి ఉన్నారు. అందుచేతనే తాబయి అయిన మస్రూఖ్ ఈ హదీసును ఆమె ద్వారా విన్నారు. ఉమ్మె రూమాన్ దైవప్రవక్త(స) కాలంలోనే మరణించారన్న ఉల్లేఖనం సరైనది కాదు.

విధించు". ఆ తర్వాత వారిపై ఎటువంటి కరువు వచ్చిపడిందంటే, అంతా సర్వ నాశనమైపోయింది. చివరకు ఖురైషులు ఎముకలను చప్పరించవలసిన దుస్థితి దాపురించింది. వారిలోని ఏ వ్యక్తి అయినా ఆకాశం వైపు దృష్టిని సారిస్తే పొగ మాదిరిగా కానవచ్చేది (ఆకలి మూలంగా నీరసం ఆవహించి అలా అనిపించేది). అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: **"సరే, స్పష్టమైన పొగను ఆకాశం తీసుకుని వచ్చే దినం కొరకు నిరీక్షించండి. అది ప్రజలను కమ్ముకుంటుంది. ఇదే, వ్యథాభరితమైన శిక్ష."** (అద్ దుఖాన్ : 10,11) అల్లాహ్ ఇంకా ఈ విధంగా కూడా సెలవిచ్చాడు: **"మేము శిక్షను కొంచెం తొలగిస్తే మీరు పూర్వం చేస్తూ ఉన్నదానినే మళ్ళీ చేస్తారు."** ***(44: 15)***

ఇక్కడ 'శిక్ష' అంటే అర్థం 'కరువు కాటకాల శిక్ష' అని ఇబ్నె మస్ఊద్(రజి) వ్యాఖ్యానించారు. ఎందుకంటే పరలోక శిక్ష అవిశ్వాసుల నుండి తొలగిపోదు.[1]

## అధ్యాయం : 5

# విషయం తేటతెల్లమైనప్పుడు...

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

**రాజు ఇలా అన్నాడు: "అతనిని నా వద్దకు తీసుకురండి." కాని రాజదూత యూసుఫ్ వద్దకు వెళ్ళినప్పుడు యూసుఫ్ ఇలా అన్నాడు: "నీ ప్రభువు వద్దకు తిరిగి వెళ్ళు. తమ చేతులను కోసుకున్న నారీమణుల వ్యవహారం గురించి అతనిని అడుగు. నా ప్రభువునకు వారి జిత్తులను గురించి బాగానే తెలుసు". ఆపై రాజు ఆ స్త్రీలను ఇలా విచారించాడు: "మీరు యూసుఫ్‌ను మోహింపజెయ్యటానికి ప్రయత్నించినప్పుడు మీకు కలిగిన అనుభవం ఎటువంటిది?" వారందరూ ఏకవాక్యంగా ఇలా అన్నారు: "హాషాలిల్లాహ్! (దేవుడు మమ్మల్ని రక్షించుగాక) మేము అతనిలో దోష లేశాన్ని కూడా చూడలేదు."** ***(12: 50,51)***

---

536-1. ఈ హదీసులో దైవప్రవక్త యూసుఫ్(అ) ప్రస్తావన రావటం వల్ల దీనిని ఈ అధ్యాయం క్రింద పొందుపరచవలసి వచ్చింది. ఖుస్తులానీ ప్రకారం మరో ఉల్లేఖనం ఇలా వుంది: ఖురైషులపై కరువు కాటకాలు తీవ్రతరమైనప్పుడు, అబూ సుఫ్యాన్ దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి 'తమరు బంధువులను ఆదుకోమని ఆజ్ఞాపిస్తారు కదా! మీ జాతి జనులు ఆకలితో చస్తున్నారు. వారి కొరకు ప్రార్థించండి' అని విన్నవించుకున్నాడు. అప్పుడు ఆయన(స) వారి కోసం ప్రార్థించారు. మహనీయ యూసుఫ్(అ) తన సోదరులను క్షమించినట్లే ఖురైషుల తప్పును క్షమించారు-

**537)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఈ విధంగా ప్రవచించినట్లుగా అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు: "అల్లాహ్ లూత్ (అలైహిస్సలామ్)పై తన కరుణను వర్షింపజేయుగాక! ఆయన ఒక పటిష్టమైన ఆశ్రయం కావాలని కోరుకున్నారు. ఇక యూసుఫ్(అలైహిస్సలామ్) విషయమంటారా, ఆయన కారాగారంలో ఉన్నన్ని రోజులు నేను ఉండి ఉంటే, పిలిచేవాడు నన్ను పిలిచినప్పుడు నేనతని పిలుపును త్రోసిపుచ్చేవాణ్ణి కాను. ఇక సందేహపడే విషయానికి వస్తే, ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) కన్నా ఎక్కువగా సందేహపడటం మాకు శోభాయమానమే. "(ఇబ్రాహీమ్!) నీకు నమ్మకం లేదా?" అని అల్లాహ్ అడిగినప్పుడు, 'ఎందుకు లేదు? నమ్మకం ఉంది. కాని ఆత్మ తృప్తి కోసం ఇలా అడుగుతున్నాను' అని ఇబ్రాహీమ్(అ) సమాధానమిచ్చారు.

### అధ్యాయం : 6

## చివరకు ప్రవక్తలు ప్రజలను గురించి నిరాశ చెందినప్పుడు

దైవోపదేశం–

చివరకు ప్రవక్తలు ప్రజలను గురించి నిరాశ చెందినప్పుడు, ప్రజలు కూడా తమకు అబద్ధం చెప్పబడిందని భావించినప్పుడు, అకస్మాత్తుగా మా సహాయం ప్రవక్తలకు చేరింది. అటువంటి సమయం ఆసన్నమైనప్పుడు, మా సంప్రదాయం ఏమిటంటే, మేము కోరిన వారిని రక్షించుకుంటాము. కాని మా శిక్షను దోషులపై పడకుండా తొలగించటం సాధ్యం కాదు. ***(12 : 110)***

**538)** ఉర్వా బిన్ జుబైర్ కథనం: **"హత్తా ఇజస్‌తయ్ అసర్రుసులు"** (చివరకు ప్రజలను గురించి ప్రవక్తలు నిరాశ చెందినప్పుడు) ఆయత్ గురించి నేను హజ్రత్ ఆయిషా(ర.అ)ను అడిగాను. ఉర్వా ఇంకా ఇలా అన్నారు : ఈ ఆయత్ (12: 110)లో **'కుజిబూ'** అనేది సరైనదా? లేక **'కుజ్జిబూ'** అనేది సరైనదా? అని కూడా నేను అడిగాను. 'కుజ్జిబూ' అనేదే సరైనది అని ఆమె చెప్పారు. దానిపై నేనిలా సందేహం వ్యక్తపరిచాను: 'తమ జాతి జనులు తమను అబద్ధీకరిస్తారన్న విషయం ప్రవక్తలకు తెలిసిందే కదా? మరలాంటప్పుడు 'జన్నూ' అంటే అర్థం ఏమిటి? అని

నేనడిగితే, "నా జీవితంపై ఒట్టు. నిశ్చయంగా ప్రవక్తలకు అలా జరుగుతుందన్న నమ్మకం ఉండేది" అని ఆయిషా(ర.అ) చెప్పారు. 'కుజిబూ' అని (ఒత్తి పలక కుండా) పలకటంలో దోషం ఏముంది? అని నేను మళ్ళీ అడిగితే, "మా జల్లాహ్! దైవప్రవక్తలు ఎన్నడయినా తమ ప్రభువు గురించి తమతో అబద్ధం చెప్పబడిందని అనుమానించగలరా?" అని ఆమె చెప్పారు. 'మరైతే ఈ ఆయత్ అర్థం ఏమి టమ్మా?' అని నేను అడిగితే, హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా విడమరిచి చెప్పారు: "దీని అర్థం ఏమిటంటే, దైవప్రవక్తలను కొంతమంది విశ్వసించి, వారిని సత్య వంతులని ధ్రువీకరించారు. కాని ఒక సుదీర్ఘ కాలం వరకు కష్టాలు వస్తూనే ఉండటంతో, దైవ సహాయం అందటంలో ఆలస్యం అవుతూ ఉండడంతో తమను అబద్ధీకరించిన జనుల గురించి ప్రవక్తలు నిరాశ చెందారు. అంటే తమను నమ్మి నడుచుకునే జనులు కూడా తమను ఎక్కడ అబద్ధీకులుగా భావిస్తారోనన్న అనుమానం వారికి వచ్చింది. అప్పుడు దైవ సహాయం అందింది."

# 13. అర్రాద్ సూరా వ్యాఖ్యానం

## అధ్యాయం : 1

## అల్లాహ్ సర్వజ్ఞాని

**అల్లాహ్‌కు ప్రతి గర్భిణీ యొక్క గర్భాన్ని గురించి తెలుసు; అందులో తయారయ్యేది కూడా ఆయనకు తెలుసు; అందులో జరిగే హెచ్చు తగ్గులను గురించి కూడా ఆయనకు తెలుసు. ఆయన వద్ద ప్రతి వస్తువు కొరకు ఒక పరిమాణం నిర్ణయమై ఉన్నది. ఆయన గోప్యంగా ఉన్నటువంటి, బహిరంగంగా ఉన్నటువంటి ప్రతి వస్తువును గురించీ తెలిసిన పండితుడు, ఆయన గొప్పవాడు". *(13: 8,9)***

**539) అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు: "అగోచరాలకు సంబంధించిన అయిదు తాళం చెవులు ఉన్నయ్. వాటిని గురించి అల్లాహ్‌కు తప్ప మరెవరికీ తెలీదు.**

- ★ **రేపు ఏం జరగనున్నదో అల్లాహ్‌కు తప్ప మరెవరికీ తెలీదు.**
- ★ **మాతృ గర్భాశయాలలో జరిగే హెచ్చుతగ్గుల గురించి అల్లాహ్‌కు తప్ప మరెవరికీ తెలీదు.**
- ★ **వర్షం ఎప్పుడు కురుస్తుందో అల్లాహ్‌కు తప్ప మరెవరికీ తెలీదు.**
- ★ **తనను మృత్యువు ఎప్పుడు కబళిస్తుందో ఏ వ్యక్తికీ తెలీదు.**
- ★ **ప్రళయం ఎప్పుడు సంభవిస్తుందో అల్లాహ్‌కు తప్ప మరెవరికీ తెలీదు."[1]**

---

539-1. అగోచర విషయాల జ్ఞానం కేవలం అల్లాహ్‌కే ప్రత్యేకం అని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. వేరితరులకు ఈ జ్ఞానం ఉందన్న నమ్మకం కలిగి ఉన్నవాడు అబద్ధీకుడు. దైవప్రవక్తలకు సయితం అగోచర విషయాల జ్ఞానం లేదు. కాకపోతే అల్లాహ్ 'వహీ' ద్వారా తాను కోరిన ప్రవక్తకు దానిని తెలియపరుస్తాడు.

# 14. ఇబ్రాహీమ్★ సూరా వ్యాఖ్యానం

## అధ్యాయం : 1
## మేలు జాతి చెట్టు ఉపమానం

**పరిశుద్ధ వాక్కును అల్లాహ్ ఏ వస్తువుతో పోల్చాడో మీరు గమనించటం లేదా? దాని పోలిక ఇలా వుంది: ఒక మేలు జాతి చెట్టు వుంది. దాని వేరు భూమిలో లోతుగా నాటుకుపోయింది. కొమ్మలు ఆకాశాన్ని అంటాయి. ప్రతి క్షణం అది తన ప్రభువు ఆజ్ఞానుసారం తన పండ్లను ఇస్తోంది. ప్రజలు గుణపాఠం నేర్చుకోవాలని అల్లాహ్ ఇటువంటి ఉపమానాలను ఇస్తున్నాడు. *(14: 24, 25)***

**540) ఇబ్నె ఉమర్(రజి) వివరించారు : మేము ప్రవక్త మహోదయుల (సఅసమ్) సన్నిధిలో ఉండగా, ఆయన మమ్మల్ని ఉద్దేశించి, "ముస్లిం మాదిరిగా ఎల్లకాలం ఫలాలనిచ్చే వృక్షం ఏదో నాకు చెప్పండి" అని అడిగారు.**

**ఇబ్నె ఉమర్ (రజి) ఇలా అంటున్నారు: 'అది ఖర్జూర చెట్టు అయి ఉంటుందన్న ఆలోచన నా మనసుకు తట్టింది. కాని ఆ సమయంలో అక్కడ అబూబక్ర్(రజి), ఉమర్(రజి) వంటి ఉద్దండులు ఉపవిష్ఠులై ఉండటం మూలంగా నేను సమాధానం ఇవ్వలేకపోయాను. ఆ పెద్దవారి ముందు మాట్లాడటం సమంజసం కాదని నాకు అనిపించింది. వారెవరూ సమాధానం ఇవ్వకపోవటం వల్ల**

★ ఈ సూరా మక్కాలో అవతరించింది. ఇందులో 52 ఆయత్‌లు ఉన్నాయి. మహనీయ ఇబ్రాహీమ్(అలైహిస్సలామ్) ప్రపంచంలోనే గొప్ప చరిత్ర కల వ్యక్తి. ఆయన ద్వారా రెండు కుటుంబాలు ఉనికిలోకి వచ్చాయి. వాటిలో ఒకటి బనీ ఇస్రాయీల్‌గా, రెండవది బనీ ఇస్మాయీల్‌గా స్మరించబడుతోంది. యూదులు, క్రైస్తవులు, ముస్లింలు ఈయన్ని తమ పితామహునిగా భావిస్తారు. ఇస్మాయీల్ సంతతి నుండి వచ్చిన చిట్టచివరి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్).

**దైవప్రవక్త(స) స్వయంగానే చెప్పేశారు– 'అది ఖర్జూర చెట్టు' అని. ఆ సమావేశం నుండి నిష్క్రమించడానికి మేము లేచి నిలబడినప్పుడు, 'నాన్నా! దైవసాక్షిగా! అది ఖర్జూర చెట్టు అని నేను చెప్పాలనుకున్నాను' అని మా నాన్నగారితో అన్నాను. 'మరి నువ్వు ఎందుకు చెప్పలేదు?' అని ఆయన అడిగితే, 'మీలో ఎవరూ చెప్పలేదు కదా! అందుకే పెద్దల ముందు నేను సమాధానం ఇవ్వటం భావ్యం కాదనుకున్నాను' అని చెప్పాను. దానికి మా నాన్న గారు, 'అయ్యో, నీవు గనక సమాధానం ఇచ్చి వుంటే నాకు ఇన్ని (ఎర్రని ఒంటెలు) సిరిసంపదలు ప్రాప్తించటం కన్నా ఎక్కువ సంతోషం కలిగి ఉండేది'[1] అన్నారు.**

## అధ్యాయం : 2

# స్థిరమైన వాక్కు ఆధారంగా

**ఒక స్థిరమైన వాక్కు ఆధారంగా ఇహలోకంలోనూ, పరలోకంలోనూ విశ్వాసులకు అల్లాహ్ నిలకడను ప్రసాదిస్తాడు. *(14: 27)***

**541) బరా బిన్ ఆజిబ్(రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహోదయులు ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు: ఒక ముస్లిం గోరీలో ప్రశ్నించబడి నప్పుడు, అతనిలా సాక్ష్యమిస్తాడు : "అష్హదు అంల్లా ఇలాహ ఇల్లల్లాహు వ అన్న ముహమ్మదర్రసూలుల్లాహ్ (అల్లాహ్ తప్ప వేరొక నిజ ఆరాధ్యదైవం లేదు. ఇంకా ముహమ్మద్–సఅసమ్– అల్లాహ్ సందేశహరుడు)". అలాగే అల్లాహ్ ఈ ఆయత్లో ఏమని సెలవిచ్చాడంటే– "ఒక స్థిరమైన వాక్కు ఆధారంగా ఇహలోకంలోనూ, పరలోకంలోనూ విశ్వాసులకు అల్లాహ్ నిలకడను ప్రసాదిస్తాడు."[1]**

---

540–1. దైవప్రవక్త(స) ఈ వృక్షం యొక్క మరో మూడు లక్షణాలను కూడా వివరించారు. అవేమంటే దాని పండ్లు (పంట) ఎన్నటికీ అంతమవవు. దాని నీడ ఎన్నటికీ చెరిగి పోదు. దాని ప్రయోజనం ఎన్నటికీ నిర్మూలితం అవదు. ఈ హదీసును ఇమామ్ బుఖారీ(రహ్మ) ఈ అధ్యాయం క్రింద తీసుకురావటంలోని ఉద్దేశమేమంటే, ఈ ఆయత్లో పేర్కొనబడిన మేలు జాతి వృక్షం ఖర్జూర చెట్టే. నాసిరకం వృక్షం (తీగ) అంటే, అది వెర్రిపుచ్చకాయ చెట్టు (తీగ). అది చేదుగా, వగరుగా ఉంటుంది.

541–1. అంటే అల్లాహ్ నిజమైన విశ్వాసి (ముస్లిం)కి సాక్ష్యవచనం పలికే విషయంలో ప్రాపంచిక జీవితంలోనూ, పరలోక జీవితంలోనూ స్థిరత్వాన్ని ప్రసాదిస్తాడు. ఈ స్థిరత్వం, నిలకడ ఎవరికి లభించినా అతను సౌభాగ్యవంతుడే.

అధ్యాయం : 3

## మేలును మరచిన వారి పర్యవసానం

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**"అల్లాహ్ అనుగ్రహాన్ని పొంది, దానికి మారుగా కృతఘ్నతను చూపిన వారిని నీవు చూశావా? వారు(తమతో పాటు) తమ జాతిని కూడా వినాశ గృహం లోకి- అంటే నరకంలోకి త్రోసివేశారు. అందులో వారు కాలిపోతారు. అది అతి ఘోరమైన నివాస స్థలం.** ***(14: 28,29)***

**542) ఇబ్నె అబ్బాస్(రజి) చెప్పగా అతా బిన్ అబీ రబాహ్ విన్నారు: "అలమ్‌తర ఇలల్లజీన" (14: 28) ఆయత్‌లో ప్రస్తావించబడిన 'కుఫ్రన్' (కృతఘ్నతను చూపినవారు, మేలును మరచినవారు) ఎవరో కాదు, మక్కాలోని అవిశ్వాసులే.**[1]

542-1. వారు దైవానుగ్రహమైన 'ఇస్లామ్' విలువను తెలుసుకోలేదు. ఈమాన్(విశ్వాస) భాగ్యానికి నోచుకోలేకపోయారు. చేజేతులా తమను వినాశంలో పడవేసుకున్నారు. వారిలో కొంతమంది బద్ర్ రణరంగంలో వధించబడ్డారు. మరికొంతమంది 'మక్కా విజయం' తర్వాత ముస్లింలుగా ధర్మపరివర్తన చెందారు.

# 15. అల్ హిజ్ర్ సూరా వ్యాఖ్యానం

## అధ్యాయం : 1

ఇది మేము చేసిన పని. మేము ఆకాశంలో దృఢతరములైన ఎన్నో కోటలను నిర్మించాము. చూపరుల కోసం వాటిని (నక్షత్రాలతో) అలంకరించాము. శాపగ్రస్తుడైన ప్రతి షైతాన్ నుండి వాటిని సురక్షితం చేశాము. షైతాను ఎవడైనా వాటిలోకి పోలేడు, దొంగచాటుగా ఏదైనా వినటం తప్ప. దొంగచాటుగా వినే ప్రయత్నం వాడు చేసినప్పుడు అగ్నిజ్వాల ఒకటి వాణ్ణి వెంటాడుతుంది. ***(15: 16-18)***

**543)** అబూ హురైరా (రజి) కథనం : మహాప్రవక్త(సఅసమ్) ప్రవచనం- "అల్లాహ్ ఆకాశంలో ఏదయినా నిర్ణయం గైకొన్నప్పుడు, ఆయన ఆజ్ఞపై దైవ దూతలు కడు వినమ్రతతో తమ రెక్కలతో కొట్టుకుంటారు.[1] నున్నని రాయిపై సంకెళ్ళు కొట్టినప్పుడు వచ్చే ధ్వనిలా ఉంటుంది ఆ ధ్వని..తరువాత అల్లాహ్ తన ఆదేశాన్ని దైవదూతల వరకు చేరవేస్తాడు. వారి హృదయాలపైనుండి భయాందోళన తగ్గుతుండగా, దూరాన ఉన్న దైవదూతలు దగ్గరలోఉన్న దైవదూతలతో, 'ప్రభువు విధించిన ఆజ్ఞ ఏమిటి?' అని అడుగుతారు. దానికి దగ్గరలో ఉన్న దైవదూతలు, 'సమంజసమైన ఆజ్ఞనే జారీ చేశాడు. అది ఎంతో ఉన్నతమైనది. గొప్పది'[2] అని చెబుతారు. దైవదూతల ఈ సంభాషణను దొంగచాటుగా ఎగరేసుకుపోయే షైతానులు (కొంత భాగం) పొందుతారు. ఈ మాటలను ఎగరేసుకుపోయే షైతానులు పైభాగంలో ఉంటారు. సుఫ్యాన్ తన కుడిచేతి వ్రేళ్లను విప్పి వాటిని ఒక దానిపైన ఒకటిగా పేర్చి, ఈ విధంగా షైతానులు పైకి ఎగబాకుతారని వివరించి చెప్పారు- ఒక్కోసారి ఏం జరుగుతుందంటే - ఈ విషయం తెలుసుకున్న దైవ దూతలు అగ్నిజ్వాలను విసురుతారు. ఈ సమాచారాన్ని తన్నుకుపోయే షైతాన్‌ను ఆ అగ్నిజ్వాల కాల్చి భస్మం చేసేస్తుంది. ఒక్కోసారి ఏం జరుగుతుందంటే అగ్నిజ్వాల

**తనపై వచ్చి పడకముందే పైన ఉన్న షైతాను క్రింద ఉన్న షైతాన్‌కు ఆ సమాచారాన్ని అందజేసేస్తాడు. అతనేమో తనకన్నా క్రింద ఉన్న వానికి దానిని చేరవేస్తాడు. ఈ విధంగా నింగిలోని సమాచారం నేలవరకూ వచ్చేస్తుంది. తరువాత ఆ విషయం జ్యోతిష్కుని చెవిన వేయటం జరుగుతుంది. అతను ఒక్కగానొక్క విషయంలో నూరు అబద్ధాలు కల్పించి తన తరఫున జనులకు వివరిస్తాడు. అతడు చెప్పిన దానిలో ఏదయినా ఒక విషయం నిజమని తేలితే, 'చూశారా! ఆ జ్యోతిష్కుడు ఫలానా రోజున, ఇలా జరుగుతుందనీ, అలా జరుగుతుందనీ చెప్పినది నిజమయింది'[3] అని జనులంటారు. ఇది వాస్తవానికి ఆకాశం నుండి దొంగిలించ బడిన విషయమై ఉంటుంది."**

## అధ్యాయం : 2

# దైవాగ్రహానికి పాత్రులైన వారి బస్తీల నుండి సాగిపోతున్నప్పుడు...

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు,**

**"హిజ్ర్ ప్రజలు కూడా ప్రవక్తలను అబద్ధీకరించారు." (15: 80)**

**544) మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) హిజ్ర్ ప్రజల గురించి చెబుతూ, "ఆ జాతి జనులు నివసిం**

543-1. అంటే- చిత్తం ప్రభూ! నీ ఆజ్ఞను మేము శిరసావహిస్తున్నాము అని వారు తెలియజేస్తారు.

543-2. తరువాత దైవదూతలు ఆ దైవాజ్ఞ గురించి పరస్పరం చర్చించుకుంటారు. తిబ్రానీలోని ఒక రివాయతు ప్రకారం; అల్లాహ్ తన 'వహీ'ని పంపడానికి సంభాషించినప్పుడు ఆకాశం వణికిపోతుంది. ఆకాశంలో ఉన్నవారు ఆ సంభాషణను విని స్పృహ తప్పి పడిపోతారు. తరువాత సాష్టాంగ ప్రణామం చేస్తారు. అందరికన్నా ముందు జిబ్రీల్(అ) తల ఎత్తినప్పుడు, ప్రభువు తాను కోరిన దానిని వారికి సెలవిస్తాడు. వారు అల్లాహ్ మాటను విని, తామున్న చోటు నుండి బయలుదేర్తారు. వారు వెళ్ళిన చోటల్లా 'అల్లాహ్ ఏమని సెలవిచ్చాడు?' అని దైవదూతలు అడుగుతుంటారు. దానికి వారు, **"సరైన సమాధానమే దొరికింది. ఆయన మహిమాన్వితుడు, మహోన్నతుడూను" అని చెబుతారు** (సబా: 23)

543-3. వారు చెప్పే నూరు అబద్ధాలలో నిజమని తేలే ఆ ఒక్క విషయం కూడా వారు చెప్పింది కాదు. అది ఆకాశాలలో దొంగిలించబడిన విషయం. అయితే బలహీన విశ్వాసం కల వారిని జ్యోతిష్కులు ఆ ఒక్క మాటతోనే బోల్తా కొట్టిస్తుంటారు. అజ్ఞానులు, మూర్ఖులు, బలహీన విశ్వాసం కలవారు మాత్రమే జ్యోతిష్కులను అనుసరిస్తారు.

చిన బస్తీ గుండా సాగిపోవలసి వస్తే దుఃఖంతో విలపిస్తూ సాగిపోండి. ఒకవేళ విలపిస్తూ సాగిపోవటం మీకు చేతకాకపోతే, అటువైపుగా వెళ్ళకండి. జాగ్రత్త! వారిపై వచ్చిపడిన ఆపదే మీపైన కూడా వస్తుందేమో!" అని ఉద్బోధించారు.

అధ్యాయం : 3

# పదేపదే పఠించబడే ఏడు వచనాలు

"(ప్రవక్తా!) నిశ్చయంగా మేము నీకు ఏడు ఆయత్‌లను ఇచ్చాము. అవి మాటిమాటికీ పఠించదగినవి. ఇంకా నీకు మహత్తరమైన ఖుర్ఆన్‌ను ప్రసాదించాము." *(15: 87)*

**545)** అబూ సయీద్ బిన్ ముఅల్లా (రజి) తెలియజేశారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) నా సమీపం నుండి సాగిపోతూ నన్ను పిలిచారు. ఆ సమయంలో నేను నమాజ్ చేస్తూ ఉన్నాను. నమాజ్ చేయటం పూర్తయ్యాక నేను ఆయన(స) సన్నిధిలో హాజరయ్యాను. "నేను పిలవగానే నీవు ఎందుకు రాలేదు?" అని దైవప్రవక్త(స) అడిగితే, 'నేను నమాజ్‌లో ఉన్నాన'ని విన్నవించుకున్నాను. దానికి ఆయన(స), **"ఏమిటి, అల్లాహ్ ఏమని ఆదేశించాడో తెలీదా? అల్లాహ్ ఆదేశం ఇది: "విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్ పిలుపునకూ, ఆయన ప్రవక్త పిలుపునకూ జవాబు పలకండి, ప్రవక్త మీకు జీవితాన్ని ప్రసాదించే దాని వైపునకు పిలిచినప్పుడు". (8: 24)**

తరువాత ఆయన(స) "ఈ రోజు మస్జిద్ నుండి వెడలక ముందే నేను నీకు ఖుర్ఆన్‌లోని ఏడు మహత్తర వచనాల గురించి చెప్పనా?" అని సెలవిచ్చారు. (చెప్పక ముందే) ఆయన మస్జిద్‌నుండి వెడలిపోవడానికి లేచినప్పుడు, నేనా విషయం గుర్తు చేశాను. అప్పుడాయన(స) ఇలా అన్నారు: "అది అల్‌హమ్దులిల్లాహి రబ్బిల్ ఆలమీన్ సూరా. ఇవి **'సబ్‌వుల్ మసానీ'** (అంటే పదే పదే పఠించబడే ఏడు వచనాలు). ఇదే నాకు ప్రసాదించబడిన మహత్తరమైన ఖుర్ఆన్."

**546)** మహాప్రవక్త (సఅసమ్) ఈ విధంగా ప్రవచించినట్లుగా హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు : "ఉమ్ముల్ ఖుర్ఆన్ (అంటే సూరె ఫాతిహా)యే సబ్‌వుల్ మసానీ, మహత్తరమైన ఖుర్ఆన్."

## అధ్యాయం : 4
# విభేద కారకుల వైపునకు పంపబడిన హెచ్చరిక

**దైవోపదేశం–**

**ఇది తమ ఖుర్ఆన్‌ను తుత్తునియలుగా చేసిన విభేద కారకుల వైపునకు మేము పంపిన హెచ్చరిక వంటిదే.[1] *(15: 90,91)***

**547) అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) కథనం: "ఖుర్ఆన్‌ను ముక్కలు ముక్కలుగా చేసి ఉంచినవారు" అనే ఆయత్ గురించి ఆయన వ్యాఖ్యానిస్తూ, 'వారు గ్రంథం కల (యూదు) ప్రజలనీ, వారు గ్రంథాన్ని ముక్కలు ముక్కలుగా చేసి వేశారనీ, తౌరాతుకు అనుగుణంగా ఉన్న విషయాలను అంగీకరించి, దానికి వ్యతిరేకంగా ఉన్న దానిని తిరస్కరించారనీ' అన్నారు.**

## అధ్యాయం : 5
# మరణం తథ్యం

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : "(ప్రవక్తా!) నిశ్చయంగా వచ్చే ఆ ఘడియ వరకూ నీ ప్రభువు దాస్యం చేస్తూ ఉండు." (15: 99)**

**నిశ్చయంగా వచ్చే ఆ ఘడియ అంటే అర్థం 'మరణం' అని సాలిమ్ చెప్పారు.[1]**

---

4–1. అంటే, ఖుర్ఆన్ మాదిరిగా వారికి ఇవ్వబడిన గ్రంథాన్ని వారు ముక్కలు ముక్కలుగా చేశారు. అందులోని ఒక భాగాన్ని అనుసరిస్తే, మరొక భాగాన్ని విస్మరించారు.

5–1. దీనిని ఇస్‌హాఖ్ బిన్ ఇబ్రాహీమ్, ఫర్‌యాబీ, అబ్ద్ బిన్ హుమైద్ వసల్ చేశారు. మర్ఫూ హదీసు ద్వారా కూడా దీనికి సమర్థన లభిస్తోంది. దైవప్రవక్త(స) ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ (రజి) మరణంపై **"అమ్మా హువ ఫఖద్ జాహుల్ యఖీనీ"** అని పలికారు. ఇక సూఫీలు ఈ ఆయత్‌కు తొడిగిన అర్థం విచిత్రంగా ఉంది. దాసుడు తనను తాను దైవానికి సమర్పించుకునే స్థాయికి చేరేవరకు నమాజ్, రోజాలు, సాధన చేస్తే చాలనీ, ఆ తరువాత ఆరాధన (దాస్యం) చేయాల్సిన అవసరం లేదని సూఫీలు అంటారు. వారి ఈ పలుకు తప్పు. గురువులకే గురువు అయిన హజ్రత్ షిహాబుద్దీన్ సహర్‌వర్దీ (రహ్మ) "అవారిఫ్'లో ఏమని వ్రాశారంటే, 'ఈ విధంగా తలపోసేవాడు నాస్తికుడు. ఆరాధనలు, ధార్మిక విధులు మరణం వచ్చేవరకూ ఏ ఒక్కరి బాధ్యత నుండీ తొలగిపోవు– మతి చలిస్తే తప్ప'.

సూఫీల ధోరణి కడు విచిత్రం. దైవప్రవక్త(స), ఆయన ప్రియ సహచరులు సయితం మరణం వచ్చేవరకూ దైవారాధనలో నిమగ్నులై ఉన్నారు. మహనీయులైన వారికి సయితం లభించని ఆ అంతస్తు, అధమ స్థాయి దాసులైన మీకు ఎలా లభించింది? లాహౌల వలా ఖువ్వత ఇల్లా బిల్లాహ్. ఇది కేవలం షైతాన్ ప్రేరణ మాత్రమే. దీనిపై పశ్చాత్తాపపడటం అవశ్యం.

# 16. అన్ నహ్ల్ సూరా వ్యాఖ్యానం

## అధ్యాయం : 1

## అతి నికృష్టమైన వయస్సు

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**చూడండి, అల్లాహ్ మిమ్మల్ని పుట్టించాడు. తరువాత ఆయన మీకు మృత్యువును కలుగజేస్తాడు. మీలో ఒకడు అతి నికృష్టమైన వయస్సుకు చేర్చబడతాడు. అంతా తెలిసిన తరువాత కూడా ఏమీ తెలియనివాడుగా అయ్యేందుకు, సత్యం ఏమిటంటే అల్లాహ్ మాత్రమే జ్ఞానంలో కూడా పరిపూర్ణుడు, శక్తిలో కూడా. (16: 70)**

**548)** ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఈ విధంగా వేడుకునే వారని హ్రజత్ అనస్ బిన్ మాలిక్ (రజి) తెలిపారు: **"అవూజు బిక మినల్ బుఖ్‌లి, వల్ కసలి, వ అర్జలిల్ ఉమురి, వ అజాబిల్ ఖబ్రి, వ ఫిత్న తిద్దజ్జాలి, వ ఫిత్నతిల్ మహ్యా వల్ మమాతి" (దేవా! పిసినారితనం నుండి, బద్ధకం నుండి, అతి నికృష్టమైన వయసు నుండి, సమాధి శిక్ష నుండి, దజ్జాల్ ఉపద్రవం నుండి, జీవన్మరణాల పరీక్ష నుండి నేను నీ శరణు వేడుతున్నాను.)**[1]

---

548–1. అతి నికృష్టమైన వయసులో మనిషి నీరసించి, కృశించి, మతిమాలినవాడై పోతాడు. కాకపోతే ఇది ఆయా వ్యక్తుల ఆరోగ్యంపై, పరిస్థితులపై కూడా కొంతవరకు ఆధారపడి ఉంటుంది. జీవితం ప్రతి ఒక్కరి పాలిట ఒక పరీక్ష. మనిషి ప్రాపంచిక వ్యాపకాల్లో లీనమైపోయి దైవాన్ని విస్మరిస్తే, విధుల పట్ల, షరీఅత్ ఆదేశాల పట్ల అశ్రద్ధ వహిస్తే అది అతని దౌర్భాగ్యానికి నిదర్శనం. మరణ పరీక్ష 'సకరాత్'తోనే మొదలైపోతుంది. ఆ క్షణంలో షైతాన్ మనిషిని పెడత్రోవ పట్టించజూస్తాడు. అందుకే పై హదీసులో పేర్కొనబడిన 'దుఆ'ను పఠిస్తూ ఉండాలి.

# 17. బనీ ఇస్రాయీల్ సూరా వ్యాఖ్యానం

**549)** అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (రజి) సూరె బనీ ఇస్రాయీల్, సూరయె కహ్ఫ్, సూరయె మర్యమ్ గురించి చెబుతూ, "ఇవి ప్రథమ శ్రేణికి చెందిన చాలా స్పష్టమైన సూరాలు అనీ, తాను మొదట్లో కంఠస్థం చేసుకున్న సూరాలు" అనీ అన్నారు.

అధ్యాయం : 1

## అల్లాహ్ తన శక్తి సూచనలను తన ప్రవక్తకు చూపించడానికి

దైవోపదేశం-

కొన్ని నిదర్శనాలను చూపటానికి తన దాసుణ్ణి ఒక రాత్రి మస్జిదె హరామ్ నుండి, దూరంగా ఉన్న మసీదు వద్దకు తీసుకుపోయిన ఆయన పరిశుద్ధుడు. ఆ మసీదు పరిసరాలను ఆయన శుభవంతం చేశాడు. నిజానికి ఆయనే అన్నీ వినే వాడూ, అన్నీ చూసేవాడూను. *(17: 1)*

**550)** మహనీయ అబూహురైరా (రజి) కథనం: ఏ రాత్రి సమయాన దైవ ప్రవక్త (సఅసమ్)ను బైతుల్ మఖ్దిస్ వైపునకు తీసుకుపోవటం జరిగిందో (అంటే ఇస్రా-మేరాజ్ సందర్భంగా) అప్పుడు, దైవప్రవక్త(స) ముందు రెండు పాత్రలు సమర్పించబడ్డాయి- ఒకటి మద్యం ఉన్న పాత్ర, రెండవది పాల పాత్ర. ఆయన

(స) ఆ రెండింటినీ చూసి, పాల పాత్రను తీసుకున్నారు. అది గమనించిన జిబ్రీల్(అ) "మీకు ప్రకృతి ధర్మం (ఇస్లామ్) వైపునకు మార్గదర్శకత్వం వహించిన అల్లాహ్‌కే అభివందనాలు. ఒకవేళ మీరు గనక మద్యం పాత్రను తీసుకుని ఉంటే, మీ ఉమ్మత్ (సముదాయం) మార్గం తప్పేది" అని పలికారు.

**551)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) చెప్పగా తాను విన్నానని జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ అన్సారీ (రజి) తెలియజేశారు : ప్రవక్త(స) ఇలా చెప్పారు– "మేరాజ్ సంఘటనపై ఖురైషు తిరస్కారులు నన్ను అబద్ధీకరించినప్పుడు నేను కాబా యొక్క 'హిజ్ర్' స్థానం (హతీమ్) వద్ద నిలబడ్డాను. నా ముందు బైతుల్ మఖ్దిస్ ప్రత్యక్ష పరచబడింది. నేను దానిని తిలకిస్తూ, దాని ఒక్కో చిహ్నాన్ని వివరిస్తూ పోయాను."

అధ్యాయం : 2

## మానవుడు గౌరవనీయుడు

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"మేము ఆదమ్ సంతతికి గౌరవం (పెద్దరికం) ప్రసాదించాము." **(17: 70)**

అధ్యాయం : 3

## దైవ సంప్రదాయం

దైవోపదేశం–

మేము ఒక పట్టణాన్ని నాశనం చెయ్యదలచుకున్నప్పుడు, అందలి స్థితి మంతులకు మొదట ఒక ఆజ్ఞను పంపుతాము. వారు ఆ ఆజ్ఞ విషయంలో అవిధేయతకు పాల్పడతారు. అప్పుడు శిక్షా నిర్ణయానికి ఆ పట్టణం అర్హమవుతుంది. మేము దానిని సర్వనాశనం చేసివేస్తాము. ***(17: 16)***

**552)** అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) తెలిపారు: అజ్ఞాన కాలంలో ఏ తెగ వారి జనసంఖ్య అయినా బాగా పెరిగిపోయినప్పుడు మేము 'అమిర బనూ ఫులానిన్' (ఫలానా వ్యక్తి వంశం బాగా పెరిగిపోయింది) అని అనేవారం.

అధ్యాయం : 4

## కృతజ్ఞుడుగా మెలగిన మా దాసుడు నూహ్ (అ)

నూహుతో పాటు మేము (ఓడలో) ఎక్కించిన వారి సంతానమా! అతడు

(నూహు) మాత్రం కృతజ్ఞతా పూర్వకంగా మెలగిన మా దాసుడు (అన్న సంగతిని తెలుసుకోండి). *(17: 3)*

**553)** మహనీయ అబూ హురైరా (రజి) ఇలా వివరించారు : ప్రవక్త మహనీయుల (సఅసమ్) సమక్షంలో మాంసం ముంగాలి భాగం సమర్పించబడింది. ఆయన(స) తన దంతాలతో దానిని ఒకసారి కొరికారు. ఆయన(స)కు ముంగాలి మాంసం ఎంతో ఇష్టం. తరువాత ఆయన(స) ఇలా అన్నారు: "ప్రళయదినాన నేను మానవులందరికీ నాయకునిగా ఉంటాను. ఆ దినం ఏదో మీకు తెలుసా? ఆ రోజున ప్రపంచం ఆది నుండి ప్రళయం వరకూ పుట్టిన ప్రాణులంతా ఒక చదునైన మైదానంలో సమీకరించబడతారు. ఒక పిలిచేవాని పిలుపు అందరి చెవుల వరకూ చేరుకుంటుంది. ఒక్క చూపులో అందరినీ చూడగలిగే సన్నివేశమది. సూర్యుడు అతి సమీపంలో ఉంటాడు. జనుల వ్యాకులత, ఆందోళనకు హద్దు ఉండదు. అది భరించ శక్యం కానిదిగా ఉంటుంది.

జనులు పరస్పరం తమ పరిస్థితి గురించి చర్చించుకుంటారు. 'మన పరిస్థితి ఎలా ఉందో మీరు గమనించటం లేదా? పవిత్రుడైన అల్లాహ్ సన్నిధిలో మీ గురించి సిఫారసు చేసే స్వీకృతి పొందిన దాసుడు ఎవడూ లేడా?'- ఇలా చెప్పుకుని అందరూ ఆదమ్(అలైహిస్సలామ్) సన్నిధిలో హాజరవుతారు. 'అయ్యా! తమరు మానవులందరికీ తండ్రి. అల్లాహ్ మిమ్మల్ని తన స్వహస్తాలతో సృష్టించాడు. తన తరఫున ప్రత్యేకంగా మీలో ప్రాణం పోశాడు. మీకు ప్రణమిల్లమని దైవదూతలను ఆజ్ఞాపించాడు. వారంతా మీకు సాష్టాంగ ప్రణామం చేశారు. కాబట్టి తమరు మా కోసం ప్రభువు సమక్షంలో సిఫారసు చేయండి. మా పరిస్థితి ఎలా ఉందో మీరు చూస్తూనే ఉన్నారు కదా!' అని విన్నవించుకుంటారు.

దానికి ఆదమ్ (అలైహిస్సలామ్) ఇలా అంటారు: 'ఈ రోజు నా ప్రభువు ఆగ్రహోదగ్రుడై ఉన్నాడు. ఇంతకుముందెన్నడూ ఆయన ఇంతటి ఆగ్రహ స్థితిలో లేడు. ఈ రోజు తరువాత కూడా ఇంతటి ఆగ్రహ స్థితిలో ఉండదు. ప్రభువు నన్ను ఒక వృక్షం నుండి ఆపాడు. కాని నేను ఆయన మాట వినలేదు. నఫ్సీ... నఫ్సీ... నఫ్సీ... ఈ రోజు నాకు నా గురించిన చింతన వేధిస్తోంది. కాబట్టి మీరు మరొకరి వద్దకు వెళ్ళండి. అవును, నూహ్ (అలైహిస్సలామ్) దగ్గరకు వెళ్ళండి' అని సలహా ఇస్తారు.

దాంతో వారంతా నూహ్ (అలైహిస్సలామ్) సన్నిధిలో హాజరై 'అయ్యా నూహ్! తమరు భూమండలం వైపునకు పంపబడిన మొట్టమొదటి ప్రవక్త కదా! మీకు అల్లాహ్ 'కృతజ్ఞుడైన దాసుడు *(అబదన్ షకూరా – 17: 3)* అనే బిరుదు ఇచ్చాడు. కాబట్టి తమరు మా గురించి దైవ సన్నిధిలో సిఫారసు చేయండి. మా పరిస్థితి ఎలా ఉందో మీరు చూస్తూనే ఉన్నారు కదా!' అని విజ్ఞప్తి చేస్తారు.

దానికి నూహ్ (అలైహిస్సలామ్) ఇచ్చే జవాబు ఇది : 'ఈ రోజు నా ప్రభువు మునుపెన్నడూ లేనంత కోపావేశంలో ఉన్నాడు. ఈ రోజు తరువాత ఆయన మరెన్నడూ ఇంతటి కోపావేశంలో ఉండడు. నేను చేసే ఒక ప్రార్థన ఆమోదించబడుతుందని నాకు నమ్మబలకటం జరిగింది. నేను నా జాతి వారికి వ్యతిరేకంగా దానిని ఉపయోగించుకున్నాను. కనుక నఫ్సీ... నఫ్సీ... నఫ్సీ. ఈ రోజు నాకు నా స్వయం గురించే బెంగ పట్టుకుంది. మీరు నా బదులు మరొకరి వద్దకు వెళ్లండి. అన్నట్టు, ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) దగ్గరకు వెళ్ళండి.'

అప్పుడు అందరూ కలసి ఇబ్రాహీమ్(అ) దగ్గరకు వెళతారు. 'ఓ ఇబ్రాహీమ్! మీరు దైవ సందేశహరులు, దైవానికి ప్రియ నేస్తం కూడా. భూలోకం కొరకు ప్రత్యేకంగా ఎంపిక చేయబడినవారు. తమరు మా కొరకు సిఫారసు చేయండి. మేము ఎంత దుర్భర స్థితిలో ఉన్నామో మీరు చూస్తూనే ఉన్నారు' అని విన్నవించుకుంటారు.

ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) కూడా అదే అంటారు. 'ఈ రోజు నా ప్రభువు ఆగ్రహోదగ్రుడై ఉన్నాడు. ఇంత ఆగ్రహం ఆయన ఇంతకుముందు కూడా చెందలేదు. ఇకపైన కూడా చెందడు. అదీగాక నేను మూడు అబద్ధాలు చెప్పి ఉన్నాను. (ఉల్లేఖకులైన అబూ హయ్యాన్ తన ఉల్లేఖనంలో ఆ మూడింటినీ ప్రస్తావిం చారు). నఫ్సీ.. నఫ్సీ... నఫ్సీ... నాకు నా గురించే దిగులు పట్టుకుంది. నా బదులు మరొకరి వద్దకు వెళ్ళండి. ఒక పని చెయ్యండి, మూసా దగ్గరకు వెళ్ళండి' అని సూచిస్తారు.

వారంతా కలసి మూసా (అలైహిస్సలామ్) సమక్షంలో హాజరవుతారు. 'ఓ మూసా! మీరు దైవ సందేశహరులు. అల్లాహ్ మీకు తన రిసాలత్ ద్వారా, మీతో సంభాషణ జరపటం ద్వారా మీకు ప్రాధాన్యతనొసగాడు. కాబట్టి మీరు దైవ సమక్షంలో మా కొరకు సిఫారసు చేయండి. మేము ఏ స్థితిలో ఉన్నామో మీరు చూస్తూనే ఉన్నారు కదా!' అని తమ కష్టాన్ని ఏకరువు పెడతారు.

దానికి మూసా(అలైహిస్సలామ్) 'ఈ రోజు అల్లాహ్ చాలా కోపంలో ఉన్నాడు. ఎంత కోపంలో ఉన్నాడంటే, ఇంతకు మునుపు ఆయన అంత కోపంలో ఎన్నడూ లేదు. ఇక మీదట కూడా అంత కోపంలో ఉండదు. అదీగాక నేను ఒక వ్యక్తిని హతమార్చి ఉన్నాను. నిజానికి అల్లాహ్ నాకు ఆ మేరకు ఆజ్ఞాపించలేదు. నఫ్సీ... నఫ్సీ... నఫ్సీ. ఈ రోజు నాకు నా గురించే భయాందోళన ఉంది. నా బదులు మీరు మరొకరి దగ్గరకు వెళ్ళండి. ఈసా వద్దకు వెళ్ళండి' అని సలహా ఇస్తారు.

అందరూ కలసి ఈసా (అలైహిస్సలామ్) సన్నిధిలో హాజరవుతారు. 'ఓ ఈసా! మీరు దైవ సందేశహరులు, దైవ వాక్కు కూడా. దానిని (ఆ వాక్కును) అల్లాహ్ మర్యమ్ (అలైహస్సలామ్)పై వేశాడు. అల్లాహ్ తరఫున మీరు ఆత్మ. మీరు బాల్యంలో తల్లి ఒడిలో ఉండి జనులతో సంభాషించారు. కాబట్టి మీరు మా కొరకు సిఫారసు చేయండి. మేము ఎటువంటి స్థితిలో ఉన్నామో మీరు గమనించవచ్చు' అని విన్నవించుకుంటారు.

ఈసా (అలైహిస్సలామ్) ఇలా అంటారు: 'ఈ రోజు నా ప్రభువు చాలా కోపావేశంలో ఉన్నాడు. ఇంతకు మునుపు ఆయన ఎన్నడూ ఇంతటి కోపావేశంలో లేదు. ఇక మీదట కూడా ఇంతటి కోపావేశంలో ఉండదు'. ఆయన తనలోని ఏ పొరపాటును గురించి కూడా ప్రస్తావించరు. కేవలం నఫ్సీ... నఫ్సీ... నఫ్సీ.. అంటారు. 'నన్ను వదలండి. నా బదులు మరొకరి వద్దకు వెళ్ళండి. ముహమ్మద్ (సఅసమ్) దగ్గరకు వెళ్ళండి' అని సలహా ఇస్తారు.

అప్పుడు వారందరూ కలసి ముహమ్మద్(సఅసమ్)సన్నిధిలో హాజరవుతారు. 'ఓ ముహమ్మద్! మీరు దైవసందేశహరులు. చిట్టచివరి దైవప్రవక్త. అల్లాహ్ మీ మునుపటి వెనుకటి తప్పులన్నింటినీ క్షమించాడు. కాబట్టి మీరు మీ ప్రభువు సమక్షంలో మా కొరకు సిఫారసు చేయండి. మేము ఎలాంటి (నికృష్ట) స్థితికి చేరుకున్నామో మీరు చూస్తూనే ఉన్నార'ని విన్నవించుకుంటారు.

ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఇలా అన్నారు: "చివరకు నేను ముందుకు వెళతాను. దైవ సింహాసనం (అర్ష్) క్రిందికి వెళ్ళి ప్రభువు సమక్షంలో సాష్టాంగ ప్రణామం చేస్తాను. అప్పుడు అల్లాహ్ నా కొరకు స్తుతిస్తోత్రాల ద్వారం తెరుస్తాడు. నాకంటే ముందు ఎవరికీ ఆ స్తుతిస్తోత్రాల పద్ధతి నేర్పబడి ఉండదు. ఆ తరువాత

**ఈ విధంగా సెలవీయబడుతుంది : "ఓ ముహమ్మద్! తల ఎత్తు. ఏం కావాలో అడుగు, ఇవ్వబడుతుంది. సిఫారసు చెయ్యి. నీ సిఫారసు ఆమోదించబడుతుంది."**

**అప్పుడు నేను నా తల ఎత్తి 'ఓ ప్రభూ! నా ఉమ్మత్. నా ప్రభూ! నా ఉమ్మత్‌పై దయజూపు' అని విన్నవించుకుంటాను. అప్పుడు ఇలా సెలవీయబడు తుంది: "ఓ ముహమ్మద్! నీ ఉమ్మత్‌లోని ఎవరెవరిపై లెక్కల బాధ్యత లేదో, వారికి స్వర్గం కుడి ద్వారం గుండా ప్రవేశం కల్పించుకో. వారి ఇష్టం. వారు కోరిన ద్వారం గుండా ఇతరులతో కలసి (స్వర్గంలో) ప్రవేశించవచ్చు". తరువాత ప్రవక్త మహ నీయులు(స) ఇలా అన్నారు: 'ఎవరి అధీనంలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షిగా! స్వర్గ ద్వారం రెండు అంచుల మధ్య ఎంత అంతరం ఉందంటే మక్కా నగరానికి- హిమైర్ ప్రదేశానికి మధ్య ఉన్నంత అంతరం లేదా మక్కా- బుస్రాల మధ్యన ఉన్నంత అంతరం ఉంది'.**[1]

---

553-1. ఈ హదీసులో **'షఫాఅతె కుబ్రా'** ప్రస్తావన ఉంది. అది కేవలం అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స)కే ప్రాప్తమయింది.

ఇక అధ్యాయంలో వచ్చిన ఆయత్‌లో దైవప్రవక్త నూహ్ (అలైహిస్సలామ్) ప్రస్తావన వచ్చింది. ఇమామ్ బుఖారీ (రహ్మ) సుదీర్ఘమైన ఈ హదీసును ఈ అధ్యాయం క్రింద తీసుకురావటంలోని ముఖ్య ఉద్దేశం అదే. దైవప్రవక్త నూహ్(అలై) **'అబదన్ షకూరా'** (కృతజ్ఞుడైన దాసుడు)గా పేర్కొనబడ్డారు. ఆదమ్(అ) తరువాత దైవదౌత్య బాధ్యత నూహ్(అ)కు ఇవ్వబడింది. ఆయన్ని 'రెండవ ఆదమ్'గా కూడా పేర్కొనటం జరిగింది. ఎందుకంటే నూహ్ కాలంలో వచ్చిన తుఫాను తర్వాత మనుజ జాతికి మహోన్నత వారసుడు ఆయనే. ఆయనకు నలుగురు కొడుకులు. వారిలో ఒకడు సామ్. అతని సంతతి ద్వారానే అరబ్, పర్షియన్, హింద్, సింధ్ తదితర ప్రదేశాలు ఉన్నాయి. యాఫస్ సంతతి ద్వారా రష్యా, తుర్కీ, చైనా, జపాన్, తాతార్ ప్రాంతాలు ఉనికిలోకి వచ్చాయి. హామ్ సంతతి ద్వారా ఇథియోపియా, ఆఫ్రికా ఖండంలో అధికాంశ భాగాలు ఏర్పడ్డాయి. నోష్ సంతతి ద్వారా బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఆస్ట్రేలియా, అటాలియా, ఈజిప్ట్, గ్రీకు దేశాలున్నాయి. ఈ వాస్తవం రీత్యానే ఆయన్ని ప్రవక్తల్లో ప్రథముడుగా పేర్కొనడం జరిగింది. అన్యథా ఆయనకు ముందు కూడా ప్రవక్తలు వచ్చి ఉన్నారు. కాని వారి పరిధి చాలా పరిమితం.

ఇక ఇబ్రాహీమ్ (అ) ద్వారా పలకబడిన మూడు అబద్ధాల గురించి, 1) ఆయన విగ్రహారాధనకు సంబంధించిన ఉత్సవ సందర్భంగా **'నా ఆరోగ్యం బాగాలేదు'** (సాఫ్ఫాత్ : 89) అన్నారు. 2) విగ్రహాలను విరగ్గొట్టినప్పుడు, ఆయన్ని నిలదీసి

## అధ్యాయం : 5

# జబూర్ గ్రంథం

**దైవోపదేశం-**

**"మేము దావూద్‌కు జబూర్ గ్రంథాన్ని[1] ఇచ్చాము." *(17: 55)***

**554) అబూ హురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా ప్రవచించారు : "దావూద్ (అలైహిస్సలామ్) కొరకు జబూర్ గ్రంథం సులభతరం చెయ్యబడింది- అంటే దాని పారాయణం ఆయనకు సులభం చెయ్యబడింది. ఆయన గుర్రానికి జీను కట్టమని ఆదేశించేవారు. జీను కట్టేలోగానే జబూర్ పారాయణాన్ని పూర్తి చేసేవారు.[1]**

## అధ్యాయం : 6

# వారు నిస్సహాయులు

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**వారితో ఇలా అను : "మీరు దేవుణ్ణి కాదని (మీ పనులు నెరవేర్చే వారుగా) భావించి ఆరాధించే వారిని పిలిచి చూడండి. వారు మీ ఏ ఆపదనూ మరల్చనూ లేరు, మార్చనూ లేరు". ఈ ప్రజలు మొరపెట్టుకుంటున్న వారే స్వయంగా తమ**

---

అడిగితే, **'వాస్తవానికి వాటి నాయకుడే ఇదంతా చేసి ఉంటాడు'** (అంబియా- 63) అని చెప్పారు. 3) ఇక మూడవ అబద్ధం గురించి- ప్రయాణ సందర్భంగా ఈజిప్టు చక్రవర్తి కీడు నుండి తన భార్యను కాపాడుకోవడానికి (ఒకే ధర్మాన్ని విశ్వసించే ధార్మిక సోదరీ సోదరులు అన్న భావంలో) సారాను తన చెల్లిగా చెప్పుకున్నారు. పైకి ఇవన్నీ అబద్ధాలుగా కనిపిస్తాయి. కాని వాస్తవికత రీత్యా అబద్ధాలు కావు. అయినప్పటికీ తన ప్రభువు గనక పట్టుకోదలిస్తే ప్రతి చిన్న విషయంపై పట్టుకోగలడు. ఆ భయంతోనే మహనీయ ఇబ్రాహీమ్ (అ) ప్రభువు సన్నిధిలోకి వెళ్ళి, ప్రజల క్షమాపణకై సిఫారసు చేయడానికి సాహసించలేకపోయారు.

5-1. **'జబూర్'** అనేది కీర్తనలు, వేడుకోళ్ళ పవిత్ర సమాహారం. ఇది దైవప్రవక్త దావూద్ (అలైహిస్సలామ్)కు అవతరింపజెయ్యబడింది.

554-1. దైవప్రవక్త దావూద్ (అలైహిస్సలామ్) ఈ విధంగా పారాయణం చెయ్యటం ఒక అద్భుతం (మౌజిజా). కాగా; దివ్య ఖుర్ఆన్‌ను మూడు రోజులకంటే తక్కువ వ్యవధిలో పూర్తిగా పఠించటం ధర్మసమ్మతం కాదు.

ప్రభువు సాన్నిధ్యాన్ని పొందటానికి మార్గాన్ని వెతుకుతున్నారు. ఒకరితో ఒకరు పోటీపడుతున్నారు. వారు, ఆయన కారుణ్యాన్ని ఆశిస్తున్నారు. ఆయన శిక్షకు భయపడుతున్నారు. నిజానికి నీ ప్రభువు శిక్షే భయపడదగినటువంటిది. *(17: 56, 57)*

**555)** అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్(రజి) **'ఇలా రబ్బిహిముల్ వసీలా'** (వారే స్వయంగా ప్రభువు సాన్నిధ్యాన్ని పొందటానికి మార్గాన్ని వెతుకుతున్నారు) అనే ఆయత్ అవతరణా నేపథ్యాన్ని గురించి చెబుతూ ఇలా అన్నారు: "ప్రజలలో కొంత మంది జిన్నుల్ని పూజించేవారు. కాని ఆ జిన్నులు తరువాతి కాలంలో ముస్లింలుగా పరివర్తన చెందారు. కాని (దౌర్భాగ్యులైన) ఈ బహు దైవారాధకులు ఇప్పటికీ వారినే పూజిస్తూ అజ్ఞాన పద్ధతిపై ఉన్నారు"– ఉబైదుల్లాహ్ అష్‌జయీ ఈ హదీసును సుఫ్‌యాన్ నుండి ఉటంకించారు. ఆమష్ ఆయన నుండి సంగ్రహించి విశదీకరిం చారు. అందులో **'ఖులిద్‌వుల్లజీన'** అవతరణా నేపథ్యం ఇదేనని ఉంది.

## అధ్యాయం : 7
# వీరూ బలహీనులే, వారూ బలహీనులే

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"ఈ ప్రజలు మొరపెట్టుకుంటున్నవారే స్వయంగా తమ ప్రభువు సాన్నిధ్యాన్ని పొందటానికి మార్గాన్ని వెతుకుతున్నారు." *(17: 57)*

**556)** అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్(రజి), "మీరు నిజ దేవుణ్ణి కాదని ఆరాధించే వారిని పిలిచి చూడండి" (17: 56) అనే ఆయత్‌కు వ్యాఖ్యానం చెబుతూ, ప్రజలలో కొందరు జిన్నులను పూజించే వారని, తరువాత ఆ జిన్నులు ముస్లిములుగా పరివర్తన చెందారని అన్నారు.

## అధ్యాయం : 8
# శపించబడిన వృక్షం

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"(ప్రవక్తా!) మేము నీకు (మేరాజ్ రాత్రి) చూపించిన దానినీ, ఖుర్‌ఆన్‌లో శపించబడిన వృక్షాన్నీ మేము వారికి ఒక పరీక్షగా చేశాము."[1] *(17: 60)*

---

8–1. అంటే దీనిని ఎంతో మంది ధ్రువీకరించి **'విశ్వాసులు'** అవగా, మరెంతో మంది అబద్ధీకరించి 'అవిశ్వాసులు' అయ్యారు.

**557)** అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) వివరించారు: **"వమా జఅల్ నర్రూయా"** **(17:60)..** ఆయత్‌లో **'రూయా'** అంటే అర్థం కళ్ళతో ప్రత్యక్షంగా చూడటమనీ (అది కలలో చూడటం కాదని) అన్నారు. అంటే మేరాజ్ రాత్రి దైవప్రవక్త(స)కు అది ప్రత్యక్షంగా చూపించటం జరిగింది. 'శపించబడిన వృక్షం' అంటే 'జఖ్ఖూమ్ వృక్షం' అని అర్థం.[1]

### అధ్యాయం : 9

## దైవదూతలు హాజరయ్యే సమయం

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

'ప్రాతః కాలంలో ఖుర్‌ఆన్ పారాయణం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించు, ఎందు కంటే ప్రాతః కాలపు ఖుర్‌ఆన్ పారాయణం సాక్ష్యంగా ఉంటుంది." ***(17: 78)***

**558)** అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా ఉద్బోధించారు: "ఒంటరిగా నమాజ్ చేయటం కన్నా జమాఅత్‌తో కలసి నమాజ్ ఆచరించటం ఇరవై అయిదు రెట్లు ఎక్కువ ప్రాధాన్యత గలది. ప్రాతః కాలపు నమాజ్‌లో రేయింబవళ్ళు దైవదూతలు కలుసుకుంటారు."

అబూ హురైరా(రజి) ఇలా అన్నారు : 'మీరు గనక కోరుకుంటే ఈ ఆయత్ పఠించగలరు– **వ ఖుర్‌ఆనల్ ఫజ్రి ఇన్న ఖుర్‌ఆనల్ ఫజ్రి కాన మష్‌హూదా–** అంటే 'ఫజ్ర్

---

557–1. **'మేరాజె నబవీ'** మేల్కొని ఉన్న స్థితిలో జరిగిందన్న విషయంలో అహ్లె సున్నత్ వారి మధ్య ఏకాభిప్రాయం ఉంది. మక్కా నుండి బైతుల్ మఖ్దిస్ వరకు గల ప్రయాణం (ఇస్రా) గురించి ఖుర్‌ఆన్‌లో ఉంది. అక్కడి నుండి గగన యాత్ర గురించి ప్రామాణిక హదీసులలో వివరంగా చర్చించటం జరిగింది. అహ్లె హదీసు వర్గం వారు ఈ రెండింటినీ విశ్వసిస్తారు.

ఇక **'జఖ్ఖూమ్ వృక్షం'** గురించి; అది నరకంలో మొలకెత్తుతుంది. అగ్నిలో మొక్క ఎలా మొలుస్తుంది? అని బహుదైవారాధకులు ఆశ్చర్యంగా ప్రశ్నిస్తారు. అసలు విషయం ఏమిటంటే వారు నిజ ప్రభువు శక్తిని గురించి యోచించలేదు. సముద్రంలో ఒక పురుగు ఉంది. అది అగ్నిలో ఉల్లాసమొందుతుంది. మనిషి గాలిలో, చేప నీటిలో ఆహ్లాదం చెందినట్లే అది అగ్నిలో హాయి నొందుతుంది. నిప్పు కోడి నిప్పు రవ్వలను, వేడి ఇనుప ముక్కలను మింగేస్తుంది. దానికి ఎలాంటి బాధ ఉండదు.

**సమయంలో ఖుర్‌ఆన్ పారాయణం సుదీర్ఘంగా చేయండి. ఎందుకంటే ఇది దైవదూతలు హాజరయ్యే (డ్యూటీ మారే) సమయం.**

## అధ్యాయం : 10

# మఖామె మహ్‌మూద్

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**"(ఓ ముహమ్మద్-సఅసమ్) త్వరలోనే నీ ప్రభువు నిన్ను ప్రశంసనీయమైన ఉన్నత స్థానంలో ప్రతిష్ఠింపజెయ్యటం అసంభవం ఏమీ కాదు."** ***(17: 79)***

**559) ఇబ్నె ఉమర్ (రజి) తెలిపారు: ప్రళయదినాన మానవ సముదాయాలు (ఉమ్మత్‌లు) వేర్వేరు గుంపులుగా నడుస్తాయి. ప్రతి సముదాయం తన ప్రవక్త వెనుక ఉంటుంది. వారు తమ ప్రవక్తలలో 'ఓ ఫలానా! ప్రవక్తా! మా కొరకు సిఫారసు చెయ్యి' అని విజ్ఞప్తి చేస్తారు (కాని వారంతా సిఫారసు చేయడానికి నిరాకరిస్తారు). చివరకు వారంతా సిఫారసు కోసం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) వద్దకు వస్తారు. అల్లాహ్ తన ప్రవక్త(స)కు ప్రశంసనీయమైన ఉన్నత స్థానం (మకామె మహ్‌మూద్) ప్రసాదించే రోజు అదే.**

**560) ప్రవక్త మహోదయులు (సఅసమ్) ఈ విధంగా ప్రవచించినట్లుగా జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ అన్సారీ (రజి) ఉల్లేఖించారు. ఎవరయితే అజాన్ విన్న మీదట "అల్లాహుమ్మ రబ్బ హాజిహిద్దావ తిత్తామ్మతి వస్సలాతిల్ ఖాయిమతి ఆతి ముహమ్మద నిల్ వసీలత వల్ ఫజీలత వబ్ అస్‌హు మఖామమ్ మహ్‌మూద నిల్లజీ వ అద్‌తహు." (ఓ అల్లాహ్! ఈ సంపూర్ణ పిలుపుకు ప్రభువా! నెలకొనబోయే నమాజ్‌కు స్వామీ! ముహమ్మద్(సఅసమ్)కు నీవు వాగ్దానం చేసిన సామీప్యాన్ని, విశిష్ట స్థానాన్నీ ప్రసాదించు. ప్రశంసాత్మకమైన ఉన్నత స్థానంపై ప్రతిష్టింపజెయ్యి) అని పలుకుతాడో ప్రళయదినాన అతని కొరకు నా సిఫారసు తప్పనిసరి అవుతుంది.[1] ఈ హదీసును**

---

560-1. వేరొక ఉల్లేఖనం ప్రకారం 'మఖామె మహ్‌మూద్' అంటే అర్థం ఏమిటంటే, అల్లాహ్ మహాప్రవక్త ముహమ్మద్(స)ను తన సింహాసనంపై కూర్చోబెట్టుకుంటాడు. **'మఖామె మహ్‌మూద్'**కు మరో అర్థం సిఫారసు చేసే స్థానం. స్వర్గంలో ఆయన(స) కొరకు నిర్మించబడిన అత్యున్నత మేడ అన్నది కూడా ఒక అర్థమే- మొత్తానికి 'మఖామె మహ్‌మూద్' అనేది ఒక సమగ్రమైన పదం.

హమ్జా బిన్ అబ్దుల్లాహ్ కూడా తన తండ్రి (అబ్దుల్లాహ్ బిన్ ఉమర్-రజి) నుండి ఉటంకించారు. ఆయన దైవప్రవక్త(స) చెప్పగా విన్నారు.

అధ్యాయం : 11

## అసత్యం ఏనాటికైనా సమసిపోయేదే

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

(ప్రవక్తా!) ఇలా ప్రకటించు: "సత్యం వచ్చేసింది. అసత్యం నశించింది. అసత్యం నశించక తప్పదు." *(17: 81)*

**561)** అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) కథనం : మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) మక్కా విజయానంతరం (కాబా ప్రాంగణంలో) ప్రవేశించినప్పుడు, కాబా గృహం నలువైపులా **360** విగ్రహాలు ఉన్నాయి. ఆయన(స) తన చేతిలోని బెత్తంతో ఒక్కో విగ్రహాన్ని కొడుతూ ఇలా పఠించసాగారు: **వజా అల్ హఖ్ఖు వజ హాఖల్ బాతిలు ఇన్నల్ బాతిల కాన జహూఖా** (సత్యం వచ్చేసింది. అసత్యం నిష్క్రమించింది. అసత్యం ఏనాటికైనా నిష్క్రమించక తప్పదు) **"జాఅల్ హఖ్ఖు వమా యుబ్దీయుల్ బాతిలు వమా యుయీద్."**

అధ్యాయం : 12

## ఆత్మ గురించి

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"(ప్రవక్తా!) ఈ ప్రజలు నిన్ను ఆత్మను గురించి ప్రశ్నిస్తున్నారు. ఇలా అను: "ఈ ఆత్మ నా ప్రభువు ఆజ్ఞానుసారం వస్తుంది. కాని మీకు ప్రసాదించబడిన జ్ఞానం బహు స్వల్పమైనది." *(17: 85)*

**562)** అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) వివరించారు. నేను ప్రవక్త మహనీయుల(సఅసమ్) వెంట ఒక పొలంలో ఉన్నాను. ఆయన(స) ఆ సమయంలో ఒక ఖర్జూర బొద్దుకు ఆనుకుని (కూర్చుని) ఉన్నారు. అదే సమయంలో కొంత మంది యూదులు అటువైపు నుంచి నడచిపోతున్నారు. అంతలో ఒక యూదు వ్యక్తి తన సహచరునితో, 'ఆత్మ గురించి ఈయన గారిని అడగండి' అన్నాడు.

**'అలా ఎందుకంటున్నావ్?' అని వారిలోని ఒక వ్యక్తి అన్నాడు. 'మీకు ఇష్టంలేని మాట ఏదయినా అంటారేమో? (అడిగితే పోలా?)' అని అతను బదులిచ్చాడు. ఆ విధంగా వారు పరస్పరం కూడబలుక్కుని ఆత్మ గురించి దైవప్రవక్త(స)ను ప్రశ్నించాలనే నిర్ణయించుకున్నారు. ఆత్మ గురించి ప్రశ్న వేసినప్పుడు ఆయన (స) కాస్సేపటివరకు వారి ప్రశ్నకు జవాబు ఇవ్వలేదు- మౌనం వహించారు. నాకు అర్థమైపోయింది- ఆ క్షణంలో ఆయన(స)పై దివ్యావిష్కృతి జరుగుతుందని. అందుకే నేను అక్కడే నిలబడిపోయాను. 'వహీ' అవతరణ పూర్తయిన తరువాత ఆయన(స) ఈ ఆయత్ పఠించారు: ఈ ప్రజలు నిన్ను ఆత్మను గురించి ప్రశ్నిస్తున్నారు. ఇలా అను: "ఈ ఆత్మ నా ప్రభువు ఆజ్ఞానుసారం వస్తుంది.[1] కాని మీకు ప్రసాదించబడిన జ్ఞానం బహు స్వల్పమైనది."** ***(17: 85)***

## అధ్యాయం : 13

# మధ్యే మార్గాన్ని అవలంబించండి

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**"మీరు నమాజు చేసేటప్పుడు కంఠాన్ని మరీ పెంచకండి. మరీ తగ్గించకండి. ఈ రెంటికీ మధ్య సగటు స్థాయిలో ఉండే స్వరంతో నమాజు చేయండి."** ***(17: 110)***

---

562-1. **'రూహ్'** (ఆత్మ) ప్రభువాజ్ఞగా పేర్కొనటం జరిగింది. కాని దాని వివరాలు తెలియజేయబడలేదు. ఎందుకంటే మునుపటి ప్రవక్తలు కూడా దీని వాస్తవికతను వివరించలేదు. ఇలా ప్రశ్నించటంలో యూదుల మతలబు వేరు. ఆత్మ గురించి, దాని వాస్తవికతను విశదీకరించకుండా ఉంటే ఈయన నిజమైన ప్రవక్త అనీ, ఒకవేళ ఏదయినా చెబితే మాత్రం ఈయన ప్రవక్త కాదనీ, కేవలం ఒక తత్వవేత్త అని తేల్చాలనుకున్నారు.

ఇబ్నె కసీర్ ఇలా అంటారు: రూహ్(ఆత్మ) అనేది ఒక పదార్థం. అది కోమలమైన గాలి మాదిరిగా శరీరంలోని ప్రతి అవయవంలో ప్రవేశించి ఉంది. పచ్చని చెట్టులో నీరు ఉన్నట్లే ఉంటుంది. ఇది పాశవిక ఆత్మ వాస్తవికత. ఇక మానవీయ ఆత్మ, అంటే 'నఫ్సె నాతిఖా' శరీరాన్ని పెనవేసుకుని ఉంటుంది. దైవాజ్ఞానుసారం మరణం వచ్చినప్పుడు ఈ సంబంధం తెగిపోతుంది. వివరాల కోసం ఇమామ్ ఇబ్నె ఖయ్యిమ్ (రహ్మా) పుస్తకం 'అర్రూహ్'ను అధ్యయనం చేయవచ్చు.

**563)** **ఇబ్నె అబ్బాస్(రజి) బనీ ఇస్రాయీల్ సూరాలోని 110వ ఆయత్ (మీరు నమాజు చేసేటప్పుడు కంఠాన్ని మరీ పెంచకండి. మరీ తగ్గించకండి) గురించి చెబుతూ ఇలా అన్నారు : ఈ ఆయత్ మక్కాలో ఇస్లాం తొలికాలంలో అవతరించింది. దైవప్రవక్త(స) తన సహచరులతో కలసి నమాజ్ చేస్తున్నప్పుడు హెచ్చు స్వరంతో ఖుర్ఆన్ పారాయణం చేసేవారు. ఇది విని బహు దైవారాధకులు ఖుర్ఆన్‌ను దూషించటంతోపాటు దానిని అవతరింపజేసిన వానినీ, దానిని తీసుకు వచ్చిన వానిని కూడా దూషించేవారు. అందుకే అల్లాహ్ తన ప్రవక్త(స)కు,"మరీ అంత బిగ్గరగా పారాయణం చేయకూడదనీ సూచించాడు. ఎందుకంటే బహు దైవారాధకులు దానిని దూషిస్తారు. అలా అని నీ సహచరులకు వినబడనంత మెల్లగా కూడా పఠించకు. సగటు స్థాయిలో ఉండే స్వరంతో పారాయణం చెయ్యి" అని ఉపదేశించాడు.**

**564)** **హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు : "వలా తజ్‌హర్ బి సలాతిక వలా తుఖాఫిత్ బిహా...** ఆయత్ **(17: 110) దుఆ నేపథ్యంలో అవతరించింది."[1]**

---

564-1. తబ్రీ ఉల్లేఖనంలో ఇలా వుంది: **'తషహ్హుద్'** (ఖాయిదా)లో చేయబడే వేడుకోలు నేపథ్యంలో బహుశా కావచ్చు. ఈ ఆయత్ రెండుసార్లు అవతరించి ఉండవచ్చు అనేది కూడా సంభవమే- ఒకసారి పారాయణం (ఖిరాత్) గురించి, రెండవసారి వేడుకోలు (దుఆ) గురించి. రెండు ఉల్లేఖనాలు కూడా 'విషయం'తో సమన్వయం చెందుతున్నాయి.

# 18. సూరతుల్ కహ్ఫ్ ★ వ్యాఖ్యానం

## అధ్యాయం : 1

## మానవుడు పరమ జగడాల మారి

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:**

**"మానవుడు పరమ జగడాల మారి."** ***(18: 54)***

**565) మహనీయ అలీ (రజి) తనకు తెలియజేసినట్లుగా హుసైన్ బిన్ అలీ (రజి) చెప్పారు : అలీ (రజి) ఇలా తెలియజేశారు– ఒక రోజు రాత్రి ప్రవక్త మహనీయులు (సఅసమ్) తాను, ఫాతిమా(ర.అ) వద్దకు (తమ ఇంటికి) వచ్చి "మీరు తహజ్జుద్ నమాజ్ చేయరా?" అని అడిగారు. దానికి అలీ (రజి), 'దైవ ప్రవక్తా! మా ప్రాణాలు దైవాధీనమై ఉన్నాయి. ఆయన తాను కోరినప్పుడు మమ్మల్ని మేల్కొలుపుతాడు' అని సమాధానమిచ్చారు. ఇది విని ఆయన(స) తక్షణం తిరిగి**

---

★ దివ్య ఖుర్‌ఆన్‌లోని అత్యంత ప్రముఖమైన అధ్యాయాలలో సూరతుల్ కహ్ఫ్ ఒకటి. ఇది మక్కాలో అవతరించింది. ఇందులో 110 ఆయత్‌లు ఉన్నాయి. ఈ సూరా విశిష్టత గురించి పలు హదీసులు ఉల్లేఖించబడ్డాయి. ముఖ్యంగా శుక్రవారం నాడు ఈ సూరాను పారాయణం చేయటం ఎక్కువ పుణ్యప్రదం.

'కహ్ఫ్' అంటే ఆశ్రయం పొందే గుహ అని అర్థం. కొంతమంది యువకులు తమ ధర్మాన్ని, విశ్వాసాన్ని కాపాడుకోవటం కోసం ఒక పర్వత గుహలో తలదాచు కున్నారు. చివరకు వారు ప్రళయదినం వరకూ అక్కడే– శాశ్వతంగా– నిద్రిస్తారు. వారిని 'అస్‌హాబె రఖీమ్' అని కూడా అంటారు. 'రఖీమ్' అనేది గుహ వారు తలదాచుకున్న పర్వత లోయ పేరు అని ఇబ్నె అబ్బాస్ (రజి) అన్నారు. కాగా, 'రఖీమ్' అనేది ఒక పలక అనీ, దానిపై ఆ యువకుల పేర్లు లిఖించబడ్డాయని సయీద్ వ్యాఖ్యానించారు. ఆ పలక ఆ కొండ గుహ వద్ద తగిలించబడింది.

వెళ్ళిపోయారు. ఏమీ అనలేదు. కాని వెళుతూ తన తొడపై చేత్తో చరచి, 'వకానల్ ఇన్సానుఅక్సర షయ్యిన్ జదలా' (మానవుడు అన్నిటికీ మించిన జగడాల మారి) అని పలకసాగారు.

## అధ్యాయం : 2
# ఖిజర్ వృత్తాంతం

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

(మూసాకు సంబంధించిన గాథను వారికి వినిపించు) అప్పుడు మూసా తన సేవకునితో ఇలా అన్నాడు : "రెండు నదుల సంగమ స్థలానికి చేరనంతవరకు, నేను నా ప్రయాణాన్ని ఆపను. లేకపోతే నేను సుదీర్ఘ కాలం నడుస్తూనే ఉంటాను. తరువాత వారు వాటి సంగమ ప్రదేశానికి చేరినప్పుడు, తమ చేప విషయంలో అశ్రద్ధ వహించారు. (18: 60,61)

**566)** సయీద్ బిన్ జుబైర్ తెలిపారు : నేను ఇబ్నె అబ్బాస్(రజి) ముందు నౌఫ్ బికాలీ గురించి ప్రస్తావిస్తూ; 'ఖిజర్ (అలైహిస్సలామ్)ను కలుసుకున్న మూసా బనీ ఇస్రాయీల్ ప్రవక్త మూసా (అలైహిస్సలాం) కార'ని అతనంటున్నాడు కదా! అని చెప్పినప్పుడు ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అన్నారు : "ఆ దైవ విరోధి చెప్పింది నిజం కాదు. ప్రవక్త మహనీయులు(సఅసమ్) చెప్పగా తాను విన్నట్లు ఉబై బిన్ కాబ్(రజి) నాతో అన్నారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఇలా చెప్పారు : మూసా (అలైహిస్సలామ్) ఇస్రాయీల్ సంతతి వారికి ఉపదేశించడానికి నిలబడినప్పుడు, 'మానవుల్లో అందరికన్నా ఎక్కువ జ్ఞానం ఎవరికుంది?' అని ఆయన్ని ప్రశ్నించటం జరిగింది. దానికి ఆయన 'నాకే' అన్నారు. దానికి అల్లాహ్ ఆయనపై ఆగ్రహించాడు. ఎందుకంటే అందరికన్నా గొప్ప జ్ఞాని అల్లాహ్యే అని ఆయన చెప్పలేదు. అందుకే అల్లాహ్ ఆయన వైపునకు 'వహీ' పంపుతూ, "రెండు సాగరాల సంగమం వద్ద నా దాసుడొకడు ఉన్నాడు. అతను నీకన్నా పెద్ద జ్ఞాని" అని సెలవిచ్చాడు. 'ప్రభూ! నేను ఆయన దగ్గరకు ఎలా చేరుకోవాలి' అని మూసా(అ) విన్నవించుకోగా "ఒక చేపను నీ వెంట జోలెలో ఉంచుకో. అది నీ నుండి తప్పించుకుపోయిన చోటే, నా దాసుడు ఉంటాడు" అని సెలవిచ్చాడు.

ఆయన ఒక చేపను జోలెలో పెట్టుకుని బయలు దేరారు. ఆయన వెంట

ఆయన సేవకుడు యోషె బిన్ నూన్ కూడా ఉన్నాడు. వారిద్దరూ ఒక చట్టుబండ వద్దకు వచ్చినప్పుడు, ఆ బండకు తల ఆనించి నిద్రలోకి జారుకున్నారు. అదే సమయంలో చేప జోలెలో నుండి గిలగిలా కొట్టుకుంటూ సముద్రంలో తన దారిని చేసుకుంది. చేప క్రింద పడిన చోట అల్లాహ్ జల ప్రవాహాన్ని స్తంభింపజేశాడు. నీటిలో అది దారి చేసుకున్న చోట ఒక ధార మాదిరిగా కనిపించింది (ఈ దృశ్యాన్ని యోషే బిన్ నూన్ వీక్షించారు కూడా). కాని మూసా(అ) మేల్కొన్న తరువాత యోషే చేప సంగతి చెప్పటం మరచిపోయారు. అందుచేత వారిద్దరూ ఒక పగలు, ఒక రేయి నడుస్తూనే ఉన్నారు. మరునాడు మూసా(అ) తన సేవకునితో, "మా భోజనం తీసుకురా. ఈ ప్రయాణం మమ్మ్మి బాగా అలసి పోయేలా చేసింది" అన్నారు.

ప్రవక్త మహనీయులు(స) ఇలా అన్నారు : "అల్లాహ్ సూచించిన ప్రదేశాన్ని దాటిపోయే వరకూ మూసా(అ) అలసిపోలేదు."

మూసా (అ) సేవకుడు ఇలా విన్నవించుకున్నాడు : 'అయ్యో! మనం చట్టుబండ దగ్గర ఆగినప్పుడు చేప సంగతి చెప్పటం మరచిపోయాను. షైతాన్ నన్ను మరుపునకు గురి చేశాడు. చేప విచిత్రమైన పద్ధతిలో దారి చేసుకుని (సముద్రంలోకి) వెళ్ళిపోయింది.'

మహాప్రవక్త(స) ఇలా అన్నారు : "చేప తన దారిన తాను వెళ్ళిపోయింది. అయితే చేప జలాశయంలో దారి చేసుకుని వెళ్ళిన చిహ్నాన్ని మూసా, ఆయన సేవకుడు చూసి ఆశ్చర్యపోయారు."

"అయ్యో! మనం వెతుకుతున్న స్థలం అదే కదరా బాబు!" అని మూసా(అ) పలికారు.

తరువాత వారిద్దరూ వచ్చిన దారే, తమ పాద చిహ్నాల ఆధారంగా, వెనక్కి తిరిగి వచ్చారు. ఎట్టకేలకు వారు ఆ చట్టుబండ వద్దకు వచ్చారు. అక్కడ ఒక పెద్ద మనిషి– వస్త్రంలో చుట్టబడిన వ్యక్తి (ఖిజర్– అలైహిస్సలామ్) వారికి కనిపించారు. మూసా(అ) ఆయనకు 'సలామ్' చేశారు. దానికి ఖిజర్(అ) 'ఎవరు మీరు? మీ దేశంలో సలామ్ ఆచారం ఎలా వచ్చింది?' అని ప్రశ్నించారు.

దానికి ఆయన, "నేను మూసాను" అన్నారు.

"ఏమిటి, బనీ ఇస్రాయీల్ (వైపునకు పంపబడిన) మూసావా?" అని ఖిజర్ అడిగితే, "అవున"ని మూసా బదులిచ్చారు.

"మార్గదర్శకత్వానికి సంబంధించిన ఏ విద్య మీకు వొసగబడిందో, దానిని మీ వద్ద ఉండి ఆర్జించే ఉద్దేశ్యంతో వచ్చాన"ని మూసా(అ) విన్నవించుకోగా,

"మూసా! మీరు నా వెంట ఉండి ఓర్పు వహించలేరు. నాకు అల్లాహ్ తరఫున ఒక ప్రత్యేక జ్ఞానం ప్రసాదించబడింది. దానిని మీరెరుగరు. అలాగే అల్లాహ్ మీకు ప్రసాదించబడిన జ్ఞానం ఏదో నేనెరుగను" అని ఖిజర్(అ) చెప్పారు.

దానికి మూసా (అ), "దైవ చిత్తమయితే మీరు నన్ను సహనశీలునిగా కనుగొంటారు. ఏ విషయంలో కూడా నేను మీకు వ్యతిరేకంగా వ్యవహరించను" అని మాటిచ్చారు.

"సరే, అలాగైతే మీరు నా వెంట రావచ్చు. కాని ఒక షరతు. నేను స్వయంగా విడమరచి చెప్పనంత వరకూ ఏ విషయం గురించి కూడా నన్ను ప్రశ్నించకూడదు" అన్నారు ఖిజర్(అ).

వారిద్దరూ కలసి సముద్ర తీరంలో నడవసాగారు. అంతలో ఒక పడవ వారి ముందు నుండి సాగిపోతూ కనిపించింది. తమను కూడా పడవలో ఎక్కించు కోమని వారు అభ్యర్థించారు. పడవ యజమానులకు ఖిజర్(అ) సుపరిచితులే. అందుకే ప్రయాణ చార్జీలు తీసుకోకుండానే వారిద్దరినీ పడవ ఎక్కించుకున్నారు. ఇద్దరూ పడవలో కూర్చున్న తరువాత ఖిజర్ (అ), గొడ్డలితో పడవ చెక్క పలకనొక దానిని ఊడదీశారు. అది చూసి మూసా (అ), "అయ్యో! పాపం వీళ్ళు మన నుండి ప్రయాణ ఛార్జీలు కూడా తీసుకోకుండా పడవ ఎక్కించుకున్నారు. అటువంటి వాళ్ళ పడవలోనే మీరు లోపం ఏర్పరుస్తారా? ప్రయాణీకులందరినీ ముంచి వేయాలన్నదా మీ ఉద్దేశ్యం!? ఏది ఏమయినా మీరు చేసిన ఈ పని సహించరానిది" అన్నారు. దానికి ఖిజర్(అ), "మీరు నా వెంట ఉండి ఓపిక పట్టలేరని ముందే చెప్పాను కదా" అన్నారు. సమాధానంగా మూసా(అ) ఇలా అన్నారు: "నేను మరచిపోయిన విషయంపై నన్ను పట్టుకోకండి, దయచేసి నన్ను క్షమించండి. నా వ్యవహారంలో కఠినంగా వ్యవహరించకండి" అని అభ్యర్థించారు.

మహాప్రవక్త ముహమ్మద్(స) ఇలా అన్నారు: "మూసా (అ) వల్ల జరిగిన మొదటిసారి మరుపు ఇది."

ఉల్లేఖకుడు ఇలా అన్నారు: అంతలో ఒక పిచ్చుక వచ్చి పడవ అంచుపై వాలి సముద్రంలోంచి తన ముక్కుతో నీరు తీసుకుని త్రాగింది. అది గమనించిన ఖిజర్(అ) మూసా (అ)తో, "అల్లాహ్ జ్ఞానంతో పోల్చుకుంటే మీ జ్ఞానం, నా జ్ఞానం ఈ పిచ్చుక సముద్రం నుండి తీసుకున్న నీరు అంతటిదే" అన్నారు.

తరువాత వారిద్దరూ పడవ దిగి సముద్ర తీర ప్రాంతంలో నడచిపోసాగారు. అక్కడ కొంతమంది పిల్లలతో కలిసి ఆడుకుంటున్న ఒక అబ్బాయిని ఖిజర్ (అ) చూశారు. ఆయన ఆ అబ్బాయి తలను అతని మొండెం నుంచి వేరు చేసేశారు. ఆ విధంగా ఆ అబ్బాయిని చంపేశారు. అది చూసిన మూసా(అ) ఓర్చుకోలేక, 'అకారణంగా మీరు ఒక నిరపరాధి అయిన అబ్బాయి ప్రాణం తీసేశారు. మీరు చేసిన ఈ పని ఎంతో ఏహ్యమైనది" అని రుసరుసలాడారు. దానికి ఖిజర్ (అ), "మీరు నా వెంట ఉండి నిగ్రహం పాటించలేరని ముందే చెప్పాను" అన్నారు.

హదీసు ఉల్లేఖకుల్లో ఒకరైన సుఫ్యాన్ బిన్ ఉయైనా 'ఈ పని మొదటి చేష్టకన్నా తీవ్రమైనది' అని అభిప్రాయపడ్డారు.

మూసా (అలైహిస్సలామ్) ఈసారి కూడా క్షమాపణ కోరుకున్నారు. "ఇప్పటికే మీరు రెండుసార్లు నా సంజాయిషీని విన్నారు. ఇక మీదట కూడా నేను మిమ్మల్ని ప్రశ్నిస్తే మీరు నన్ను మీ వెంట ఉండనీయకండి" అని ప్రాధేయపడ్డారు.

తరువాత వారిద్దరూ మరింత ముందుకు సాగిపోయారు. చివరకు వారు ఒక ఊరికి వెళ్ళి, తమను అతిథులుగా స్వీకరించమని ఊరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాని ఊరి ప్రజలు వారికి ఆతిథ్యం ఇచ్చేందుకు నిరాకరించారు. అంతలో ఆ ఊరిలో వారికి ఒక గోడ కనిపించింది. ఆ గోడ కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. ఖిజర్(అ) నిలబడి ఆ గోడను తన చేత్తో తిన్నగా నిలబెట్టారు. "మనం ఈ ఊరికి వచ్చి భోజనం పెట్టమని ఇక్కడి వారికి అభ్యర్థించాము. కాని ఈ ఊరి జనులు మనకు ఆతిథ్యం ఇవ్వడానికి నిరాకరించారు. అలాంటప్పుడు మీరు ఈ గోడను మరమ్మతు చేసినందుకు గాను వేతనం తీసుకోవచ్చు కదా!' అని మూసా (అ) సూచించగా, "చాలు. చాలు. మీకూ - నాకూ మధ్య ఇక వేర్పాటు జరిగి పోయింది. ఇక మీరు సహనం వహించలేకపోయిన ఆ విషయాల తత్వాన్ని మీకు వివరిస్తాను. ఆ పడవ వృత్తాంతం ఏమిటంటే, అది నదిలో కష్టపడి పని చేసుకునే

**కొందరు నిరుపేదలది. నేను దానిలో లోపం కల్పించాలని ఎందుకు అనుకొన్నా నంటే ప్రతి పడవను బలవంతంగా వశపరచుకునే ఒక రాజుకు చెందిన ప్రాంతం ముందు రాబోతోంది. ఇక ఆ బాలుని విషయం– అతని తల్లిదండ్రులు విశ్వాసులు. అతడు తన తలబిరుసుతనం వల్ల, తన అవిశ్వాసం వల్ల, వారిని వేధిస్తాడనే భయం మాకు కలిగింది. ఈ కారణంగా మేము కోరుకున్నదేమిటంటే, వారి ప్రభువు అతనికి మారుగా, నడవడికలో అతనికంటే మంచివాడునూ, రక్త సంబంధీకులను ఎక్కువగా కనికరిస్తాడని ఆశించదగిన వాడునూ అయిన మరొక బిడ్డను వారికి ఇవ్వాలి. ఇక గోడ విషయం ఏమిటంటే, అది ఈ పట్టణంలోనే నివసిస్తున్న ఇద్దరు అనాథ బాలురిది. ఆ గోడ క్రింద ఈ బాలుర కోసం ఒక నిధి పాతి పెట్టబడి ఉన్నది. వారి తండ్రి చాలా మంచివాడు. అందుకని ఈ ఇద్దరు బాలురూ యుక్త వయస్కులైన పిమ్మట తమ నిధిని తాము తీసుకోవాలని నీ ప్రభువు సంకల్పించాడు. ఇదంతా నీ ప్రభువు కారుణ్యం మూలంగా నేను చేశాను. నా అంతట నేను చేయ లేదు. నీవు సహనం చూపలేని విషయాల వాస్తవికత ఇది." *(18: 78–82)***

**ప్రవక్త మహనీయులు(స) ఇలా అన్నారు: "మూసా (అలైహిస్సలామ్) గనక ఓపిక పట్టి ఉంటే, అల్లాహ్ మనకు ఖిజర్(అ)కు సంబంధించిన మరిన్ని విషయా లను తెలియపరచి ఉండేవాడు.[1]**

---

566–1. సుదీర్ఘమైన ఈ హదీసు ద్వారా హజ్రత్ మూసా(అలైహిస్సలామ్), హజ్రత్ ఖిజర్ (అలైహిస్సలామ్)లకు సంబంధించిన ఎన్నో సంఘటనలు మన ముందుకు వచ్చాయి. వాటి వివరాల్లోకి పోదలిస్తే వ్యాఖ్యాన గ్రంథాలను చదవవలసి ఉంటుంది.

హదీసు ఆరంభంలో **'నౌఫ్ బికాలీ'** ప్రస్తావన వచ్చింది. అతను ముస్లిమే. కాని హదీసుకు వ్యతిరేకంగా మాట్లాడినందుకు, హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) అతనిని దైవ విరోధిగా పేర్కొన్నారు. దీనినిబట్టి విదితమయ్యే ఒక ముఖ్య విషయం ఏమిటంటే, హదీసులను త్రోసిపుచ్చి, వాటికి విరుద్ధంగా నడుచుకునే వారిని దైవ విరోధులుగా పేర్కొనవచ్చు.

ఈ హదీసు ద్వారా స్పష్టమైన ఇంకొక విషయం ఏమిటంటే, 'జ్ఞానం' చాలా గొప్పది. ఖిజర్(అ) గొప్ప జ్ఞాని అని తెలిసినంతనే, ఆయన సాంగత్యం కొరకు దైవప్రవక్త మూసా(అ) సుదీర్ఘ ప్రయాణం చేసి వెళ్ళటం గమనించదగిన విషయం. జ్ఞానార్జన నిమిత్తం మనిషి తూరుపు నుండి పడమర వరకు ప్రయాణం చేసినా తక్కువే.

## అధ్యాయం : 3

# రెండు నదుల సంగమ స్థలానికి చేరనంత వరకూ...

**"రెండు నదుల సంగమ స్థలానికి చేరనంత వరకు నేను నా ప్రయాణాన్ని ఆపను... తీరా వారు వాటి సంగమ ప్రదేశానికి చేరినప్పుడు, తమ చేప విషయంలో మరుపునకు గురయ్యారు. అది నదిలోకి సొరంగం గుండా పోయినట్లు దూసుకు పోయింది". *(అల్ కహ్ఫ్ - 61)***

**567) సయీద్ బిన్ జుబైర్ కథనం : మేము ఇబ్నె అబ్బాస్(రజి) ఇంటికి వెళ్ళినప్పుడు, "ధార్మిక విషయాలు ఏవైనా నన్ను అడగండి" అని ఆయన కోరారు. దానికి నేను, 'అబూ అబ్బాస్! అల్లాహ్ నన్ను మీ కొరకు అర్పింతుగాక! కూఫాలో నౌఫ్ అనే ఒక వ్యక్తి ఏమంటున్నారంటే; ఖిజర్‌ను కలుసుకున్న మూసా, బనీ ఇస్రాయీల్ వద్దకు పంపబడిన దైవప్రవక్త మూసా(అ) కారట!..' అని అన్నాను. ఇది విని ఇబ్నె అబ్బాస్(రజి), "ఆ దైవ విరోధి అబద్ధం చెప్పాడు" అన్నారు. తరువాత ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అన్నారు: దైవప్రవక్త(సఅసమ్) ఈ విధంగా ప్రవచించినట్లుగా ఉబై బిన్ కాబ్(రజి) నాతో చెప్పారు :**

**మూసా (అ) దైవప్రవక్త. ఒక రోజాయన జనులనుద్దేశించి (అంటే ఇస్రాయీల్ సంతతి వారిని ఉద్దేశించి) ఉపన్యసిస్తున్నప్పుడు ప్రజల కంట కన్నీరొలికింది. వారి హృదయాలు కరిగిపోవడంతో, మూసా (అ) వెనుతిరిగి వెళ్ళసాగారు. ఆ సమయంలో ఒక వ్యక్తి ఆయన్ని సంబోధించి, 'ఓ దైవప్రవక్తా! ఈ ప్రపంచంలో మిమ్మల్ని మించిన జ్ఞాని ఎవరూ లేరా?' అని ప్రశ్నించాడు. దానికి ఆయన "లేదు" అని సమాధానమిచ్చారు. అప్పటికప్పుడే మూసా (అ)ను మందలిస్తూ దివ్యవాణి అవతరించింది. ఎందుకంటే; 'దేవుడే గొప్పజ్ఞాని' అని మూసా(అ) అనలేదు. "మూసా! నీకన్నా గొప్ప జ్ఞాని ఉన్నాడ"ని ఆయనకు సందేశం అందింది. "ప్రభూ! ఆ జ్ఞాని ఎక్కడున్నాడు?" అని మూసా(అ) విన్నవించుకోగా, "పర్షియన్- రోము జలసంధులు రెండూ సంగమం అయ్యే చోట"**

---

ఈ హదీసుకు వ్యాఖ్యానంగా విద్వాంసులు ఏమంటారంటే ప్రవక్త హజ్రత్ మూసా (అ)కు షరీఅత్ పరిజ్ఞానం ఉంటే, హజ్రత్ ఖిజర్(అ)కు వాస్తవిక జ్ఞానం ఉండేది. కాగా; అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స)కు ఈ రెండు విద్యలు కూడా ప్రసాదించ బడ్డాయి.

అని సెలవీయబడింది. "ప్రభూ! నేను ఆ ప్రదేశాన్ని చేరుకునేందుకు ఏదైనా చిహ్నం చూపెట్టమ"ని మూసా విన్నవించుకోగా, "నీ చేప నీ బుట్టలోనుంచి జారి, తప్పించుకుని పోయే చోట అతనుంటాడు" అని ప్రభువు సెలవిచ్చాడు.

యాలా ఈ హదీసులో ఈ విధంగా అన్నారు : "చనిపోయిన చేపను వెంట తీసుకెళదాం. ఆ చేప ఎక్కడ ప్రాణం పోసుకుంటుందో అక్కడే మనం ఆగుదాం" అని వారు (మూసా, అతని శిష్యుడు) చెప్పుకున్నారు. మూసా ఒక చేపను తన బుట్టలో వేసుకుని, 'ఈ చేప తప్పించుకుపోయినప్పుడు నాకు చెప్పు' అని తన సహచరుడు యోషేకు సూచించారు. దానికి అతను, 'అదేమంత పెద్ద పనీ' అన్నాడు.

హదీసు ఉల్లేఖకుడు సయీద్ బిన్ జుబైర్(రజి) తన ఉల్లేఖనంలో యోషే పేరు ప్రస్తావించలేదు. ఇలా వివరించారు: తరువాత మూసా(అ) ఒక చట్టుబండ నీడలో సేద తీరారు. అక్కడ తేమ ఉంది. అప్పుడు చేప గిలగిలా తన్నుకుంటూ– విచిత్రంగా– నదిలోనికి వెళ్ళిపోయింది. ఆ సమయంలో మూసా(అ) నిద్రిస్తూ ఉన్నారు. అందువల్ల ఆయన్ని లేపటం సమంజసం కాదని యోషే అనుకున్నాడు. కాని మూసా(అ) మేల్కొన్న తరువాత ఆ చేప నదిలోకి వెళ్ళిన సంగతి చెప్పటం మరిచిపోయాడు. ఆ చేప నదిలోకి వెళ్ళిన స్థలంలో నీరు ప్రవహించకుండా అల్లాహ్ ఆపేశాడు. తత్కారణంగా అది ఏ రాతిపై నుండి నీటి లోపలికి వెళ్ళిందో అక్కడ, దారి చేసుకుని వెళ్ళిన గుర్తులు అలాగే ఉండిపోయాయి. ... నిద్ర మేల్కొన్న తరువాత మహనీయ మూసా(అ) మిగిలిన ఒక పగలూ, ఒక రేయి గడిచే వరకూ నడుస్తూనే ఉన్నారు. తరువాత ఇలా అన్నారు: "ఈ ప్రయాణం మమ్మల్ని బాగా అలసిపోయేలా చేసింది". దానికి ఆయన సేవకుడు, 'అల్లాహ్ మీ అలసటను దూరం చేశాడు (అంటే మీరు లక్ష్యాన్ని చేరుకునే సమయం ఆసన్నమయింది)' అని అన్నాడు.

తరువాత మూసా(అ), అతని సేవకుడు వెళ్ళిన దారే వెనుతిరిగి వచ్చి ఖిజర్(అ)ను కలుసుకున్నారు. ఖిజర్(అ) నది మధ్యన (ఒక దిబ్బపై) ఒక పచ్చని నేలపై కూర్చుని ఉన్నారు.

సయీద్ బిన్ జుబైర్(రజి) ఇలా అన్నారు: ఆయన తన శరీరమంతటినీ ఒక వస్త్రంతో చుట్టుకుని ఉన్నారు. వస్త్రం ఒక అంచు ఆయన కాలి క్రింద, మరొక అంచు ఆయన తల క్రింద ఉంది. మూసా(అ) ఆయన దగ్గరకు వెళ్ళి 'సలామ్'

చేశారు. ఖిజర్ తన తలపైని గుడ్డ తొలగించి, 'నా ఈ ప్రదేశంలో సలామ్ చేసే ఆచారం ఎలా వచ్చింది? ఇంతకీ మీరెవరు?' అని అడిగారు. దానికి మూసా, "నేను మూసాను" అన్నారు. 'ఏమిటి బనీ ఇస్రాయీల్‌లోని మూసావా?' అని అడగ్గా, "అవును" అని ఆయన చెప్పారు. 'ఇంతకీ మీ రాకలోని ఉద్దేశం ఏమిటి?' అని ఖిజర్ అడిగితే, "అల్లాహ్ మీకు మార్గదర్శకత్వానికి సంబంధించిన ఏ జ్ఞానం ప్రసాదించాడో, దానిని నాకూ నేర్పండి. నేర్చుకోవటానికే నేను మీ వద్దకు వచ్చాను" అన్నారు మూసా(అ). దానికి ఖిజర్, 'నా వద్ద ఉన్న విద్యను మీరు పూర్తిగా నేర్చు కోవటం మీకు సమంజసం కాదు. అలాగే మీకు ప్రసాదించబడిన జ్ఞానాన్ని నేను ఆర్జించటం నాకూ సమంజసం కాదు' అన్నారు.

అంతలోనే ఒక పిచ్చుక వచ్చి నదిలో నుంచి నీరు తన నోట్లోకి తీసుకుని త్రాగింది. ఖిజర్ ఆ పిచ్చుక దృష్టాంతం ఇస్తూ, 'దైవసాక్షిగా! మీ దగ్గర, నా దగ్గర ఉన్న జ్ఞానం అల్లాహ్ జ్ఞానంతో పోల్చుకుంటే ఈ పిచ్చుక నదిలోనుంచి తీసుకున్న నీరు కన్నా ఎక్కువేమీ కాదు' అన్నారు.

పడవ ఎక్కేటప్పుడు ఆయన, ఈ దరి నుండి ఆ దరి వరకు జనులను చేర్చి వచ్చే చిన్న చిన్న పడవలను కూడా చూశారు. పడవ నడిపేవారు ఖిజర్(అ)ను గుర్తుపట్టారు. 'ఈయన దేవుని సజ్జన దాసులు. అందుచేత మేము ఈయన నుండి ప్రయాణ ఛార్జీలు తీసుకోము' అని చెప్పారు. కాని ఖిజర్(అ) మాత్రం ఆ పడవలో లోపం ఏర్పరిచారు (అంటే ఒక్క చెక్క పలకను ఊడదీశారు). ఆ స్థానంలో మేకులు కొట్టారు. అది చూసిన మూసా(అ), ఓర్చుకోలేకపోయారు. "ఏమిటి, ఈ పడవ ప్రయాణీకులందరినీ ముంచి వేయాలన్నదేనా మీ ఉద్దేశ్యం? ఏది ఏమైనా మీరు చేసిన ఈ పని సహించరానిది" అని చెప్పారు. దానికి ఖిజర్, 'మీరు నా వెంట ఉండి నిగ్రహం పాటించలేరని ముందే చెప్పాను కదా!' అన్నారు.

మూసా (అ) వేసిన మొదటి ప్రశ్న మరుపు వల్ల వేయబడింది. కాని రెండవ అభ్యంతరం ఆయన స్వయంగా విధించుకున్న షరతు (ఉల్లంఘన). ఇక మూడవ అభ్యంతరం ఆయన కావాలని వెల్లడించినదే. మూసా (అ) ఇలా అన్నారు: "అయ్యా! నేను మరుపు కారణంగా వెల్లడించిన అభ్యంతరంపై నన్ను నిలదీయ కండి. నా వ్యవహారంలో కఠినంగా వ్యవహరించకండి."

తరువాత వారికి ఒక అబ్బాయి కనిపించాడు. ఖిజర్ ఆ అబ్బాయిని చంపేశారు.

సయీద్ బిన్ జుబైర్(రజి) చెప్పిన దాని ప్రకారం, కొంతమంది పిల్లలు ఆడుకుంటూ ఉండగా చూసిన ఖిజర్, వారిలోని ఒక పిల్లవాణ్ని పట్టుకున్నారు. ఆ అబ్బాయి దేవుని అవిశ్వాసి, అవిధేయుడు. ఖిజర్ ఆ పసివాణ్ణి పడుకోబెట్టి కత్తితో అతని కుత్తుక కోసివేశారు. దానిపై మూసా, "మీరు అభం శుభం తెలియని ఒక అమాయక బాలుణ్ణి– అతడు ఏ తప్పూ చేయకపోయినప్పటికీ – అన్యాయంగా చంపేశారు" అని అన్నారు.

తరువాత ఆ మహనీయులు ఇద్దరూ ముందుకు సాగిపోయారు. పడిపోవటానికి సిద్ధంగా ఉన్న ఒక గోడపై వారి దృష్టి పడింది. ఖిజర్(అ) తృటిలో ఆ గోడను– తన చేత్తో సంజ్ఞ చేసి– నిటారుగా నిలబెట్టారు.

"తమరు కోరుకుంటే ఈ పనికిగాను వేతనం తీసుకోగలిగేవారు కదా! దాంతో మనం భోజనం చేసేవారం కదా!" అన్నారు.

ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా విశదీకరించారు: ఆ పడవ సాగిపోతున్న ప్రదేశంలో ఒక రాజు ఉండేవాడు (ఆ రాజు దృష్టిని పడవ ఆకర్షించకుండా ఉండాలన్న ఉద్దేశంతో అందులో లోపం ఏర్పరచటం జరిగింది). ఆ రాజు పేరు హుదద్ బిన్ బుదద్ అని కూడా ఉల్లేఖకులు పేర్కొన్నారు. ఖిజర్ ద్వారా హతమార్చబడిన ఆ బాలుని పేరు జైస్వర్ అని పేర్కొనబడింది.

(ఖిజర్(అ) ఇలా అన్నారు:) 'ఆ రాజు తనకు కనిపించిన ప్రతి కొత్త పడవను బలవంతంగా లాక్కునేవాడు. పడవలో ఉన్న లోపాన్ని చూసి దాన్ని లాక్కోకుండా ఉంటాడని నేను భావించాను. ఆ తరువాత వారు ఆ పడవను మరమ్మత్తు చేసుకుని ఉపయోగంలోకి తెచ్చుకుంటారు.'

కొంతమంది ఏమన్నారంటే, వారు సీసం పోసి ఆ రంధ్రాన్ని మూసేశారు. మరికొంత మంది ప్రకారం, వారు డాంబరు వేసి ఆ లోపాన్ని కప్పిపుచ్చారు.

(ఇక ఆ బాలుని హత్య విషయం). 'అతని తల్లిదండ్రులు విశ్వాసులు. కానీ ఆ పిల్లవాడు (అల్లాహ్ విధివ్రాత ప్రకారం) అవిశ్వాసి. వాడు (పెద్దవాడై) తన తల్లిదండ్రుల్ని కూడా అవిశ్వాస వైఖరికి ఒడిగట్టేలా చేస్తాడేమోనని మాకు భయ

మేసింది. పుత్ర వాత్సల్యం వల్ల వారు తమ జీవన విధానం పట్ల వైముఖ్యం కనబరుస్తారేమోనని అనుమానం కలిగింది. అందువల్ల ఆ అబ్బాయి బదులు అల్లాహ్ వారికి సజ్జన సంతానాన్ని ప్రసాదించాలని మేము కోరుకున్నాము.'

## అధ్యాయం : 4
# చేప విచిత్రంగా నదిలోకి వెళ్ళిన వేళ...

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు-

ముందుకు పోయిన తరువాత, మూసా తన సహచరునితో ఇలా అన్నాడు, "మా ఉదయ భోజనం తీసుకుని రా. ఈనాటి ప్రయాణంలో మేము బాగా అలసిపోయాము." సేవకుడు ఇలా అన్నాడు : "చూశారా ఏమయిందో! మనం ఆ రాయి వద్ద విశ్రాంతికై ఆగి ఉన్న సమయంలో నాకు చేప విషయమే జ్ఞాపకం లేకుండా పోయింది. షైతాన్ నన్ను ఏమరుపాటుకు గురిచేశాడు. నేను దాని ప్రస్తావనను (మీతో చెయ్యటం) మరచిపోయాను. చేప విచిత్రమైన రీతిలో బయటపడి నదిలోకి వెళ్ళిపోయింది". దానికి మూసా, "అయ్యో, మనం అన్వేషిస్తూ వచ్చినది దాని కొరకే కదా!" అన్నాడు. *(అల్ కహ్ఫ్ 62-64)*

**568)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) ప్రవచించినట్లుగా ఉబై బిన్ కాబ్ (రజి) వివరించారు : మూసా (అలైహిస్సలామ్) ఇస్రాయీల్ సంతతికి హితబోధ చేయడానికి నిలబడ్డారు. అంతలో, 'అందరికన్నా గొప్ప జ్ఞాని ఎవరు?' అని ఆయన్ని ప్రశ్నించటం జరిగింది. "నేనే" అని మూసా(అ) సమాధానమిచ్చారు. మూసా ఇచ్చిన సమాధానంపై అల్లాహ్‌కు కోపం వచ్చింది. ఎందుకంటే "అల్లాహ్ మహా జ్ఞాని" అని ఆయన చెప్పలేదు. ఆయన వద్దకు వహీ పంపబడింది- "నా దాసులలోని ఒక దాసుడు రెండు సాగరాల సంగమం వద్ద ఉంటున్నాడు. అతను నీ కంటే గొప్ప జ్ఞాని" అని. "ప్రభూ! నేను ఆయన్ని కలుసుకునే మార్గమేది?" అని మూసా(అ) విన్నవించుకోగా, "ఒక చేపను బుట్టలో వేసుకో. మరి ఆ చేప కనుమరుగైన చోటే ఆయన్ని వెతుకు" అని ప్రభువు సెలవిచ్చాడు.

మూసా (అ) బయలుదేరారు. ఆయన వెంట ఆయన సహచరుడు యోషే బిన్ నూన్ కూడా ఉన్నారు. చేప కూడా వారితోపాటే ఉంది. వారిద్దరూ ఒక చట్టుబండ వద్దకు చేరుకుని విశ్రాంతి తీసుకున్నారు. చట్టుబండకు ఆనుకుని

మూసా(అ) నిద్రించారు. ఆ చట్టుబండ క్రింద ఒక నీటి ఊట ఉంది. అది 'హయాత్'గా పిలువబడేది. దాని నీరు ఏ వస్తువుపై పడినా అది ప్రాణం పోసు కునేది. దాని నీరు చేపపై చిమ్మగానే చేపకు ప్రాణం వచ్చింది. అంతే, అది తన బుట్టలో నుండి బయటపడి, నదిలోకి వెళ్ళిపోయింది. మూసా(అ)కు మెలకువ రాగానే,"మా ఉదయ భోజనం తీసుకురా" అని తన సహచరునితో అన్నారు.

ఆ నిర్ణీత స్థలాన్ని దాటిపోయే వరకూ మూసా(అ)కు అలసట కలగలేదు. సహచరుడైన యోషే బిన్ నూన్, "చూశారా, ఎంత పనయిందో! మనం ఆ చట్టుబండ చాటున కూర్చున్నప్పుడు, చేప సంగతి చెప్పటం మరచిపోయాను" అన్నాడు. వారిద్దరూ వెళ్ళిన దారే, వెనక్కి తిరిగి వచ్చారు. చేప నదిలోకి వెళ్ళిన స్థలానికి చేరుకున్నప్పుడు, ఆ చేప దారి చేసుకుని వెళ్ళిన స్థలం ఒక సొరంగం మాదిరిగా కనిపించింది. చేప ఎలాగూ నదిలోకి వెళ్ళిపోయింది. కాని అక్కడ నీరు నిలిచి ఉండటం చూసి, యోషే బిన్ నూన్‌కు ఆశ్చర్యం కలిగింది.

అప్పుడు చట్టుబండ వద్ద ఒక పెద్ద మనిషి వస్త్రం కప్పుకుని కూర్చుని ఉన్నారు. మూసా(అ) ఆయనకు సలామ్ చేశారు. అది విని, "అవునూ, మీ ప్రదేశంలో ఈ 'సలామ్' ఆచారం ఎలా వచ్చింది?" అని అడిగారు ఆ పెద్దమనిషి. దానికి "నేను మూసాను" అన్నారాయన. "ఏ మూసా? బనీ ఇస్రాయీల్ వైపునకు పంపబడిన మూసాయేనా?" అని అడగ్గా, "అవును ఆ మూసానే" అని ఆయన బదులిచ్చారు.

"దేవుడు మీకు ప్రసాదించిన సన్మార్గ విద్యను నేర్చుకునే నిమిత్తం నేను మీ సాంగత్యంలో ఉండగలనా?" అని మూసా(అ) విన్నవించుకోగా, "అల్లాహ్ మీకు ప్రసాదించిన జ్ఞానం గురించి నాకు తెలియదు. అలాగే అల్లాహ్ వద్ద నుండి నాకు వొసగబడిన జ్ఞానం గురించి మీకు తెలీదు" అన్నారు ఖిజర్(అ). "కాని నేను మీ సహచర్యంలో (కొంతకాలం) ఉండగోరుతున్నాను" అన్నారు మూసా(అ).

"ఒకవేళ మీరు నా సహచర్యంలో ఉండాలన్నదే మీ అభిలాష అయితే, నేను స్వయంగా మీకు విడమరచి చెప్పనంత వరకూ మీరు దేని గురించి కూడా నన్ను ప్రశ్నించకూడదు" అని షరతు విధించారు ఖిజర్(అ).

ఆ తరువాత వారిద్దరూ నదీ తీరాన నడవసాగారు. వారి సమీపం నుండే ఒక పడవ వెళుతోంది. పడవ నడిపేవారు మహనీయ ఖిజర్(అ)ను గుర్తుపట్టి,

వారిని తమ పడవలో ఎక్కించుకున్నారు. వారి నుండి ప్రయాణ చార్జీలు కూడా తీసుకోలేదు. అంతలోనే ఒక పిచ్చుక పడవ అంచుపై వాలింది. అది తన ముక్కును నీటిలో ముంచి నీరు త్రాగింది. అది గమనించిన ఖిజర్(అ) మూసా(అ)తో, "నాకూ, మీకూ, సమస్త ప్రాణులకు ఉన్న జ్ఞానాన్ని దైవజ్ఞానంతో పోల్చుకున్నప్పుడు మనందరి జ్ఞానం ఈ పిచ్చుక నది నుండి తీసుకున్న నీరంతటిది కూడా కాదు" అన్నారు.

తరువాత హజ్రత్ ఖిజర్(అ) బడితె తీసుకుని, పడవ చెక్కనొక దానిని ఊడగొట్టారు. మూసా(అ) ఆ వైనాన్ని చూసి, "ఈ పడవ వారు మననుండి ప్రయాణ చార్జీలు కూడా తీసుకోకుండా పడవ ఎక్కించుకున్నందుకు వీరికి మీరిచ్చే ప్రతిఫలం ఇదేనా? మీరు పడవనే చీల్చివేస్తారా? ప్రయాణీకులందరినీ ముంచి వేయాలన్నదే మీ ఉద్దేశ్యమా? ఖచ్చితంగా మీరు చేసిన ఈ పని అనుచితమైనది" అన్నారు.

తరువాత వారిద్దరూ ముందుకు సాగిపోయినప్పుడు ఒక చోట ఒక పిల్లవాడు, తన తోటి పిల్లలతో కలసి ఆడుకుంటున్నాడు. హజ్రత్ ఖిజర్ అతని తల నరికేశారు. అది చూసిన మూసా (అ), "మీరు అకారణంగా నిర్దోషి అయిన ఒక పసివాణ్ణి చంపేశారు. ఇది చాలా చెడ్డ విషయం" అని చెప్పారు. దానికి ఖిజర్(అ), "మీరు నా వెంట ఉండి సహనం వహించలేరని ముందే చెప్పలేదా?" అన్నారు.

తరువాత వారిద్దరూ ముందుకు సాగిపోయారు. చివరకు ఒక పట్టణానికి చేరుకున్నారు. అక్కడి ప్రజలను అన్నం పెట్టమని అర్థించారు. కాని వారు వీరిద్దరికీ ఆతిథ్యమివ్వటానికి నిరాకరించారు. అక్కడ వారు కూలిపోనున్న ఒక గోడను చూశారు. ఖిజర్(అ) ఆ గోడను తన చేత్తో స్పర్శించి తిన్నగా నిలబెట్టారు. అప్పుడు మూసా(అ) ఇలా అన్నారు : "మనం ఈ పట్టణానికి వచ్చినప్పుడు, ఇక్కడి ప్రజలు మనకు ఆతిథ్యమివ్వటానికి నిరాకరించారు. మనకు పట్టెడన్నం కూడా పెట్టలేదు. మీరు గనక కోరుకుంటే, ఈ గోడను నిలబెట్టిన పనికిగాను వేతనం తీసుకోవచ్చు కదా!"

దానికి ఖిజర్(అ) "ఇంక చాలు. మీరూ- నేనూ వేరు అయ్యే సమయం వచ్చేసింది (మీ దారి మీది, నా దారి నాది). మీరు ఏఏ విషయాలపై ఓర్చుకోలేక పోయారో, వాటికి సంబంధించిన కారణాలను వివరిస్తాను" అన్నారు.

**మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఇలా అన్నారు : "మూసా గనక ఓపిక పట్టి ఉంటే అల్లాహ్ ఖిజర్‌కు సంబంధించిన మరిన్ని సంఘటనలను మనకు తెలియపరచి ఉండేవాడు."**

## అధ్యాయం : 5

# నష్టపోయిన వారు

**ప్రవక్తా! వారితో ఇలా అను: తాము చేసిన పనుల విషయంలో అందరి కంటే ఎక్కువగా విఫలులయ్యేవారు ఎవరో, నష్టపోయే వారెవరో మేము మీకు తెలుపమంటారా? వారెవరంటే, ప్రాపంచిక జీవితంలో వారి ప్రయత్నాలు అన్నీ రుజుమార్గం నుండి వైదొలగి ఉంటాయి. అయినా వారు తాము చేసేదంతా సవ్యం గానే ఉందని భావిస్తారు. వారు తమ ప్రభువు వాక్యాలను నమ్మకుండా తిరస్కరించినవారు. ఆయన సాన్నిధ్యంలో హాజరు కావలసి ఉన్నదనే విషయాన్ని విశ్వసించనివారు. ఇందువల్ల వారి కర్మలన్నీ వృధా అయిపోయాయి.**

***(అల్ కహ్ఫ్ : 103- 105)***

**569) ముస్అబ్ బిన్ సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ ఇలా అన్నారు: నేను నా తండ్రి (సాద్ బిన్ అబీ వఖ్ఖాస్-రజి)ను, 'ఖుల్ హల్ నునబ్బివుకుమ్ బిల్ అఖ్సరీన ఆమాలా' (కహ్ఫ్-103) ఆయత్‌ను ప్రస్తావించి, 'ఇంతకీ నష్టపోయిన వీరు ఎవరు? వారు ఖారిజీ వర్గీయులా?' అని అడిగాను. దానికి ఆయన, "లేదు. వారు యూదులు, నసారాలు. యూదులు ముహమ్మద్(స)ను అబద్ధీకరించగా, క్రైస్తవులు స్వర్గాన్ని తిరస్కరించారు. స్వర్గంలో తినే త్రాగే భౌతిక వస్తువులు ఏమీ ఉండవు అని క్రైస్తవులన్నారు. ఇక ఖారిజీలంటావా, 'వారు అల్లాహ్ విధించిన నిబంధనను ఉల్లంఘించినవారు' అని అన్నారు. సాద్ బిన్ అబీ వఖ్ఖాస్(రజి) వారిని 'అవిధేయులు' అని అనేవారు.**[1]

---

569-1. ఖారిజీలనే 'హర్‌వరియా వర్గం' అని కూడా అంటారు. వీరు మహనీయ అలీ(రజి)పై తిరుగుబాటు చేశారు. కూఫా నగరానికి సమీపంలోనున్న 'హర్వర్' గ్రామంలో సమావేశమై విద్రోహ కుట్ర పన్నారు. ఇబ్నె కవాజూ అనేవాడు ఈ ఖారిజీలకు నాయకుడు. అతడు హజ్రత్ అలీ(రజి)ని **'బిల్ అఖ్సరీన ఆమాలా'** అనేది ఎవరికి వర్తిస్తుంది? అని అడిగాడు. దానికి ఆయన, 'దౌర్భాగ్యులైన ఈ హర్‌వరాలు కూడా

## అధ్యాయం : 6

# వారి కర్మలన్నీ వృధా

**"వారు తమ ప్రభువు వాక్యాలను నమ్మకుండా తిరస్కరించినవారు. ఆయన సాన్నిధ్యంలో హాజరు కావలసి ఉన్నదనే విషయాన్ని నిరాకరించినవారు. అందువల్ల వారి కర్మలన్నీ వృధా అయిపోయాయి."** ***(అల్ కహ్ఫ్ : 105)***

**570) మహనీయులు ముహమ్మద్ (సఅసమ్) ప్రవచించినట్లుగా హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు : "నిశ్చయంగా ప్రళయదినాన ఒక బాగా లావెక్కిన మనిషి వస్తాడు. కాని అల్లాహ్ సన్నిధిలో అతనికి ఒక దోమకు సమానమైన విలువ కూడా ఉండదు." కావాలంటే ఈ ఆయత్‌ను చదువుకోండి. 'ఫలా నుఖీము లహుమ్ యౌమల్ ఖియామతి వజ్‌నా" (ప్రళయ దినాన మేము వాటికి ఎలాంటి విలువ నీయము.)**

---

ఈ కోవకు చెందినవారే' అన్నారు. 'స్వర్గం కేవలం ఆధ్యాత్మిక రుచులను ఆస్వాదించే స్థలం' అని క్రైస్తవులు అంటారు. వాస్తవానికి వారి ఈ మాట అసత్యం. పరలోకంలోని సుఖదుఃఖాలు, శిక్షా బహుమానాలు ప్రాపంచిక సుఖదుఃఖాల మాదిరిగానే ఉంటాయని ఖుర్ఆన్‌లో చాలా స్పష్టంగా చెప్పటం జరిగింది. దీనిని కాదనేవాడు ఖుర్ఆన్‌ను తిరస్కరించిన వాడవుతాడు.

# 19. మర్యమ్ సూరా వ్యాఖ్యానం

## అధ్యాయం : 1
## మనోవేదన

దైవోపదేశం–

“ప్రవక్తా! దుఃఖం తప్ప మార్గాంతరం ఉండని తీర్పు దినం గురించి సత్య తిరస్కారులను భయపెట్టు.” **(19: 39)**

**571)** మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ఈ విధంగా ప్రవచించినట్లుగా అబూ సయీద్ ఖుద్రీ(రజి) వివరించారు : “ప్రళయదినాన మృత్యువు వెల్లకిల పడద్రోయబడిన ఒక పొట్టేలు రూపంలో ప్రత్యక్షపరచబడుతుంది. ప్రకటన గావించే ఒక దైవదూత ‘ఓ స్వర్గవాసులారా!’ అని పిలుస్తాడు. స్వర్గవాసులంతా తలెత్తి అటువైపు చూస్తారు. అప్పుడు ఆ పిలిచే దూత, ‘స్వర్గవాసులారా! మీరు ఈ పొట్టేలును గుర్తుపట్టారా?’ అని అడుగుతాడు. దానికి వారు, ‘అవును, ఇది మృత్యువు. ప్రతి వ్యక్తీ దాని రుచి చూశాడ’ని అంటారు. తరువాత ఆ ప్రకటించేవాడు, ‘ఓ నరకవాసులారా! అని ఎలుగెత్తి పిలుస్తాడు. దానికి ఆ నరకవాసులంతా మెడ ఎత్తి ఆ దృశ్యాన్ని చూస్తారు. ‘మీరు ఈ పొట్టేలును గుర్తుపట్టారా?’ అని ఆ దైవదూత ప్రశ్నించగా, ‘అవును. గుర్తు పట్టాము. ఇది మృత్యువు. ప్రతి మనిషీ దాని వాతన పడ్డాడు’ అని వారంటారు. తరువాత ఆ పొట్టేలు జిబహ్ చేయబడుతుంది. అప్పుడు ప్రకటించేవాడు స్వర్గవాసులనుద్దేశించి, ‘ఇక నుంచి మీ జీవితం శాశ్వతం. ఇక ఎన్నడూ మిమ్మల్ని మృత్యువు కబళించదు’ అంటాడు. తరువాత (నరకవాసుల నుద్దేశించి) ‘ఓ నరక వాసులారా! మీరు కూడా కలకాలం ఇలాగే ఉంటారు. మీకు కూడా ఇక మృత్యువు అన్నదే రాదు’ అని అంటాడు. తరువాత ఆయన(స) ఈ

ఆయత్‌ని పఠించారు : **"వ అన్‌జిర్ హుమ్ యౌమల్‌హస్రతి..."** (ప్రవక్తా! వారిని దుఃఖం తప్ప మార్గాంతరమే ఉండని తీర్పుదినం గురించి భయపెట్టు. వారు ఏమరుపాటులో ఉన్నారు. విశ్వసించటానికి సిద్ధంగా లేరు.)[1]

## అధ్యాయం : 2

# దైవాజ్ఞతోనే దైవదూతల అవతరణ

దైవోపదేశం-

"ప్రవక్తా! మేము నీ ప్రభువు ఆజ్ఞ లేకుండా క్రిందికి దిగి రాము." *(19: 64)*

**572)** సయీద్ బిన్ జుబైర్‌తో ఇబ్నె అబ్బాస్(రజి) ఇలా అన్నారు : "మీరు నన్ను కలుసుకోవడానికి వస్తున్నారు (బాగానే ఉంది). కాని ఇంతకన్నా ఎక్కువసార్లు ఎందుకు రాకూడదు?" అని దైవప్రవక్త (సఅసమ్) జిబ్రీల్(అ)ని అడిగినప్పుడు ఆయనపై ఈ ఆయత్ అవతరించింది : **"ప్రవక్తా! మేము నీ ప్రభువు ఆజ్ఞ లేకుండా క్రిందికి దిగిరాము. మా ముందు ఉన్న దానికీ, మా వెనుక ఉన్న దానికీ, ఈ రెండింటి మధ్యన ఉన్న దానికీ, ప్రతి దానికీ ప్రభువు ఆయనే."**[1] ***(19: 64)***

## అధ్యాయం : 3

# సత్య తిరస్కారి అయిన ఆ వ్యక్తి

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

మా ఆయతులను తిరస్కరించి, "నేను సంపదతోనూ, సంతానంతోనూ అనుగ్రహింపబడుతూనే ఉంటాను" అని ప్రగల్భాలు పలికే వ్యక్తిని నీవు చూశావా? అగోచర విషయమేమైనా అతనికి తెలిసిపోయిందా లేక కరుణామయుడి నుండి అతడేమైనా వాగ్దానం పొంది ఉన్నాడా?" ***(19: 77)***

**573)** ఖబ్బాబ్ బిన్ అరత్(రజి) చెబుతూ ఉండగా తాను విన్నానని

---

571-1. మహనీయ అబూ సయీద్ ఖుద్రీ (రజి) అసలు పేరు సాద్ బిన్ మాలిక్ అన్సారీ. హదీసుల సంస్మర్త (హాఫిజె హదీస్)గా సుప్రసిద్ధులు. 84 ఏండ్ల వయసులో హిజ్రీ 74లో మరణించారు. జన్నతుల్ బఖీలో ఖననం చేయబడ్డారు.

572-1. అంటే- దైవదూతలమైన మేము దైవాజ్ఞకు లోబడి ఉన్నాము. మాకు ఆజ్ఞాపించబడినప్పుడే మేము వస్తాము. మాకంటూ స్వయం నిర్ణయాధికారం ఏదీ లేదు.

**మస్రూఖ్ బిన్ అజ్దా తెలిపారు: (ఖబ్బాబ్ ఇలా చెప్పారు) నేను నాకు రావలసిన హక్కును రాబట్టడానికి ఆస్ బిన్ వాయల్ దగ్గరకు వెళ్ళాను. 'నీవు ముహమ్మద్(స) సందేశాన్ని తిరస్కరించనంత వరకూ నీ కూలిని ఇవ్వను గాక ఇవ్వను' అని ఆస్ బిన్ వాయల్ తెగేసి చెప్పాడు. దానికి నేను, 'అసంభవం. నీవు చచ్చి బ్రతికించబడి నప్పటికీ ఇది జరగని పని' అన్నాను. దానికి అతను, 'ఏమిటి, నేను చచ్చినాక మళ్ళీ బ్రతికించబడతానా?' అని అడిగాడు. 'ఖచ్చితంగా' అని నేనన్నాను. 'మరి అలాగైతే అప్పుడు కూడా నా దగ్గర సిరిసంపదలు, సంతాన భాగ్యమూ ఉంటాయి. నీ కూలి అక్కడే చెల్లిస్తానులే' అని బదులిచ్చాడు ఆస్. దానిపై ఈ ఆయత్ అవతరించింది – 'అఫర అయ్‌తల్లజీ కఫర...' (మా ఆయతులను తిరస్కరించి, 'నేను సంపద తోనూ, సంతానంతోనూ అనుగ్రహింపబడుతూనే ఉంటాను' అని ప్రగల్భాలు పలికే వ్యక్తిని నీవు చూశావా?...)[1] ఈ హదీసును సుఫ్యాన్ సౌరీ, షూబా, హఫ్స్, అబూ ముఆవియా, వకీ ప్రభృతులు కూడా ఆమష్ నుండి ఉటంకించారు.**

## అధ్యాయం : 4

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**ఏమిటి, అగోచర విషయమేమైనా అతనికి తెలిసి పోయిందా? లేక కరుణామయుడి నుండి అతడేమైనా వాగ్దానం పొంది ఉన్నాడా? *(19: 78)***

**574) ఖబ్బాబ్ బిన్ అరత్(రజి) మస్రూఖ్‌తో ఇలా అన్నారు: నేను మక్కాలో వడ్రంగి పని చేసేవాణ్ణి. ఆస్ బిన్ వాయల్ సహ్మీ కోసం నేను ఒక ఖడ్గం తయారు చేశాను. నాకు అతను కూలి బాకీ పడ్డాడు. కూలి డబ్బుల కోసం నేనొక రోజు అతని దగ్గరకు వెళ్ళాను. కాని నేను ముహమ్మద్(స)తో తెగతెంపులు చేసుకోనంత వరకు కూలి డబ్బులు ఇవ్వనని అతనన్నాడు. 'అది జరగని పని. అల్లాహ్ నిన్ను చంపి, తిరిగి బ్రతికించే వరకూ నేను ముహమ్మద్(స)ను విడిచిపెట్టడం జరగదు' అని నిర్దిష్టంగా చెప్పేశాను. 'ఓహ్ అలాగా! అల్లాహ్ నన్ను చంపి, తిరిగి బ్రతికించి**

---

573-1. ఖబ్బాబ్ బిన్ అరత్(రజి) వడ్రంగి పని చేసేవారు. అవిశ్వాసి అయిన ఆస్ బిన్ వాయల్ ఆయన చేత ఒక ఖడ్గం చేయించాడు. కాని దాని కూలి చెల్లించలేదు. కూలి డబ్బులు అడగటానికే ఖబ్బాబ్ అతని దగ్గరకు వెళ్ళారు. ఆ సందర్భంగా జరిగిన సంభాషణ ఇది. సుప్రసిద్ధ సహాబీ అమ్ర్ బిన్ ఆస్ అతని కుమారుడే. ఇది మక్కాలో జరిగిన సంఘటన.

నప్పుడు కూడా నా దగ్గర సిరిసంపదలు, సంతాన భాగ్యం ఉంటుందిలే (అప్పుడు నా నుండి నీ కూలి డబ్బులు తీసుకుందువుగాని)' అని చెప్పాడు ఆస్ బిన్ వాయల్. దానిపై అల్లాహ్ ఈ ఆయత్‌లను అవతరింపజేశాడు, "మా ఆయతులను తిరస్కరించి, 'నేను సంపదతోనూ, సంతానంతోనూ అనుగ్రహింపబడుతూనే ఉంటాను' అని ప్రగల్భాలు పలికే వ్యక్తిని నీవు చూశావా? అగోచర విషయమేమైనా అతనికి తెలిసిపోయిందా లేక కరుణామయుడి నుండి అతనేమైనా వాగ్దానం పొంది ఉన్నాడా?" *(19: 77,78)*

'అహద్' అంటే గట్టి వాగ్దానం, హామీ అని అర్థం. ఉబైదుల్లాహ్ అష్జయీ కూడా ఈ హదీసును సుఫ్యాన్ సౌరీ నుండి ఉల్లేఖించారు. కాని అందులో 'ఖడ్గం' ప్రస్తావన గానీ, 'అహద్' వ్యాఖ్యానం గానీ లేదు.

## అధ్యాయం : 5
# అంతా లిఖించబడుతుంది

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు.

ఎంతమాత్రం కాదు, అతడు వాగే దానిని మేము వ్రాసుకుంటున్నాము. అతడి శిక్షను మరింత పెంచుతాము. *(19: 79)*

**575)** ఖబ్బాబ్ బిన్ అరత్(రజి) తనతో ఈ విధంగా చెప్పినట్లుగా మస్రూఖ్ తెలియజేశారు : నేను అజ్ఞాన కాలంలో వడ్రంగి పని చేసేవాణ్ణి. ఆస్ బిన్ వాయల్ నాకు కొంత సొమ్ము బాకీ పడ్డాడు. నా అప్పు చెల్లించమని అడగటానికి నేను అతని దగ్గరకు వెళ్ళాను. నీవు ముహమ్మద్(సఅసమ్)ను తిరస్కరించే వరకూ నీ వేతనం నీకు లభించదు' అని ఆస్ చెప్పాడు. నేనతని మాటకు జవాబుగా, 'దైవ సాక్షిగా! ఎట్టి పరిస్థితిలోనూ నేను ఆయన్ని(స) తిరస్కరించను. దేవుడు నీకు మరణమొసగి, మళ్ళీ నిన్ను బ్రతికించే వరకూ ఇది జరగని పని' అన్నాను. దానికి ఆస్, 'అవునా! అలాగైతే నేను చనిపోయే వరకూ నీ కూలి గురించి అడగకు. చచ్చిన తరువాత నేను మళ్ళీ బ్రతికించబడినప్పుడు, నాకు సంపద, సంతానం ప్రాప్తిస్తాయి. అప్పుడు నీ అప్పు చెల్లిస్తాను' అని అన్నాడు. దానిపై ఈ ఆయత్ అవతరించింది: **'అఫరఅయ్‌తల్లజీ కఫర బి ఆయాతినా వ ఖాల లవూతయన్న మాలన్ వ్వ వలదా."**

## అధ్యాయం : 6

# వట్టి చేతులతో మా సమక్షంలో హాజరవుతాడు

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

అతడు ప్రస్తావించినటువంటి వస్తు సామగ్రీ, మందీ మార్బలమూ, అంతా తిరిగి మా వద్దకే చేరిపోతుంది. అతడు ఒక్కడే ఒంటరిగా మా ముందు హాజరవు తాడు. *(19 : 80)*

**576)** ఖబ్బాబ్ బిన్ అరత్(రజి) వివరించారు: మొదట్లో నేను వడ్రంగి పని చేసేవాణ్ణి. ఆస్ బిన్ వాయల్ నాకు బాకీ పడ్డాడు. సొమ్ము అడగటానికి నేనతని దగ్గరకు వెళ్ళినప్పుడు, 'నీవు ముహమ్మద్(స) జీవన విధానాన్ని తిరస్కరించే వరకూ నీ బాకీ నీకు చెల్లించను' అన్నాడు. దానికి నేను, 'ముహమ్మద్(స) ధర్మాన్ని నేను ఎట్టి పరిస్థితిలోనూ తిరస్కరించను. అల్లాహ్ నీకు మృత్యువు వొసగి, మళ్ళీ నిన్ను బ్రతికించే వరకూ ఇది జరగని పని' అన్నాను. 'ఏమిటీ, నేను చచ్చినాక మళ్ళీ బ్రతికించబడతానా? అలాగైతే సంపద, సంతాన భాగ్యం కూడా నాకు ప్రాప్త మవుతాయి. అప్పుడు నీ అప్పు తీరుస్తానులే' అని ఆస్ చెప్పాడు. ఈ నేపథ్యంలోనే ఈ దివ్య వచనాలు అవతరించాయని ఉల్లేఖకుడు అన్నారు : **ఇంకా, మా ఆయతు లను తిరస్కరించి, "నేను సంపదతోనూ, సంతానంతోనూ అనుగ్రహింపబడుతూనే ఉంటాను" అని ప్రగల్భాలు పలికే వ్యక్తిని నీవు చూశావా? అగోచర విషయమేమైనా అతనికి తెలిసిపోయిందా లేక కరుణామయుడి నుండి అతడేమైనా వాగ్దానం పొంది ఉన్నాడా- ఎంతమాత్రం కాదు, అతడు వాగే దానిని మేము వ్రాసుకుంటాము, అతడి శిక్షను మరింత పెంచుతాము. అతడు ప్రస్తావిస్తున్నటువంటి వస్తు సామగ్రి, మందీ మార్బలమూ, అంతా తిరిగి మా వద్దకే చేరిపోతుంది. అతడు ఒక్కడే ఒంటరిగా మా ముందు హాజరవుతాడు.** *(19: 77-80)*

# 20. తాహా సూరా వ్యాఖ్యానం

## అధ్యాయం : 1

## ఆదమ్- మూసాల సంవాదన

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**(ఓ మూసా!) నేను నిన్ను నా కోసం ప్రత్యేకంగా ఎన్నుకున్నాను. (20: 41)**

**577) మహాప్రవక్త ముహమ్మద్(సఅసమ్) ప్రవచించినట్లుగా అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు : ఆదమ్– మూసాలిద్దరూ ముఖాముఖి అయినప్పుడు, మూసా (అలైహిస్సలామ్) ఆదమ్ (అలైహిస్సలామ్)తో, "జనులను ఇబ్బంది పెట్టి (అంటే వారిని వ్యయప్రయాసలకు గురి చేసి) వారిని స్వర్గంలో నుండి బయటికి తీసిన ఆదమ్ మీరే కదూ!" అన్నారు. దీనికి సమాధానంగా ఆదమ్(అ) "అల్లాహ్ తన సందేశం కొరకు ఎంపిక చేసుకుని, ప్రత్యేకంగా తన కొరకు ఎన్నుకుని తౌరాతు గ్రంథాన్ని అవతరింపజేసిన వ్యక్తి మీరే కదూ!" అని అడిగారు. "అవును" అని మూసా(అ) అన్నారు, "మరైతే మీరు తౌరాతులో చదవలేదా? నేను పుట్టక పూర్వమే అల్లాహ్ నా జాతకంలో ఈ విషయం రాసి పెట్టాడన్నది నిజం కాదా?" అని ఆదమ్(అ) ప్రశ్నించగా, "అవును, ఈ విషయం తౌరాతులో ఉంది" అని మూసా (అ) నిర్ధారించారు– ఈ విధంగా ఆదమ్(అ) విధివ్రాత వ్యవహారంలో మూసా (అ)పై ఆధిక్యత వహించారని మహాప్రవక్త(స) స్పష్టం చేశారు.[1]**

---

577–1. మహనీయ ఆదమ్(అలైహిస్సలామ్) ఆది మానవుడు. మానవులందరి మూల పురుషుడు. కాగా; మహనీయ మూసా(అలైహిస్సలామ్) దేవునిచే ప్రత్యేకంగా ఎన్నుకోబడిన వారు. స్థాయి, అంతస్తు దృష్ట్యా ఆదమ్ మూసా కన్నా తక్కువే కావచ్చు. కాని పెద్దవారు కదా! ఆయన ఇచ్చిన సమాధానం విని మూసా(అ) నిశ్శబ్దంగా ఉండి పోవాల్సి వచ్చింది.

## అధ్యాయం : 2

# ఆషూరా ఉపవాసం

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

**మేము మూసాకు వహీ ద్వారా ఇలా తెలిపాము, "ఇక రాత్రికి రాత్రే నా దాసులను తీసుకుని బయలుదేరు, వారి కొరకు సముద్రంలో పొడిబాటను ఏర్పాటు చెయ్యి, ఎవరైనా వెంటాడుతారేమో అనే భయం నీకు ఏమాత్రం వద్దు, (సముద్రం మధ్యగా పోతున్నప్పుడు) భయపడనూ వద్దు." వెనుక నుండి ఫిరౌన్ తన సేనలతో అక్కడకు చేరాడు. తరువాత సముద్రం వారిని క్రమ్ముకుంది, క్రమ్ముకోవలసిన విధంగా. ఫిరౌన్ తన జాతి ప్రజలను మార్గభ్రష్టులుగానే చేశాడు, వారికి సరియైన మార్గదర్శకత్వాన్ని ఇవ్వలేదు.** ***(20: 77-79)***

**578)** మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) వివరించారు: **మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) మదీనాకు వచ్చినప్పుడు, యూదులు ఆషూరా దినాన ఉపవాసం ఉండటం గమనించి, దాని వెనుక ఉన్న కారణమేమిటని అడిగారు. దానికి వారు, 'ఆ రోజు మూసా (అలైహిస్సలామ్) ఫిరౌన్‌పై ప్రాబల్యం వహించార'ని చెప్పారు. అప్పుడు ఆయన(స) ఇలా అన్నారు : "అలాగైతే మేము వారికన్నా ఎక్కువగా మూసా(అలైహిస్సలామ్) హక్కుదారులము. ముస్లిములారా! మీరు కూడా ఆ రోజున ఉపవాసం ఉండండి" (తరువాత ఆయన-సఅసమ్- యూదుల పోలిక ఉండరాదన్న ఉద్దేశంతో మరో రోజు అదనంగా ఉపవాసం పాటించాలని సూచించారు. ఇప్పటికీ ముస్లింలు ఆ సంప్రదాయానికి కట్టుబడి ఉన్నారు)**[1]

## అధ్యాయం : 3

# షైతాన్ మీ బహిరంగ శత్రువు

దైవోపదేశం-

**"చూడు! ఇతడు (ఈ షైతాన్) నీకూ, నీ భార్యకూ శత్రువు. కనుక జాగ్రత్త! ఇతడు మీ ఇద్దరినీ స్వర్గం నుండి వెళ్ళగొడతాడేమో! మీరు కష్టాల పాలవుతారేమో."** ***(20: 117)***

---

578-1. అంటే- ముహర్రమ్ నెల 10వ తేదీ ఉపవాసంతోపాటు, ఆ నెల 9వ తేదీన గానీ, 11వ తేదీనగానీ- ఒకరోజు అదనంగా- ఉపవాసం పాటించడం.

**579) ప్రవక్త మహనీయులు ముహమ్మద్(సఅసమ్) ఈ విధంగా ప్రవచించినట్లుగా అబూ హురైరా (రజి) తెలియజేశారు : మూసా (అలైహిస్స లామ్) ఆదమ్ (అలైహిస్సలామ్)తో వాదించారు. 'మీరు చేసిన ఒక పొరపాటు ఫలితంగా మనుషులందరినీ స్వర్గం నుండి తీసేసి, వారిని కష్టాలపాలు చేసినది మీరే కదూ!' అన్నారు. దానికి జవాబుగా ఆదమ్ (అ), 'ఓ మూసా! అల్లాహ్ మిమ్మల్ని తన దౌత్యం కొరకు ఎంపిక చేసుకున్నాడు. తనతో సంభాషించే సౌభాగ్యాన్ని మీకు వొసగాడు. ఏమిటి, అల్లాహ్ నా పుట్టుకకు పూర్వమే నా కొరకు నియమించిన ఒకానొక విషయంపై మీరు నన్ను నిందిస్తున్నారా?' అని చెప్పారు. ఆ విధంగా మూసా(అ)తో జరిగిన సంవాదనలో ఆదమ్(అ) ప్రాబల్యం వహించారని మహాప్రవక్త(స) చెప్పారు.**

# 21. అల్ అంబియా ★ సూరా వ్యాఖ్యానం

**580)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) ఇలా అన్నారు: (మక్కాలో అవతరించిన) బనీ ఇస్రాయీల్, అల్ కహ్ఫ్, మర్యమ్, తాహా, అల్ అంబియా సూరాలు- ఇవి ఎంతో సుబోధకమైన సూరాలు. వీటిని నేను తొలి కాలంలోనే కంఠస్థం చేసుకున్నాను.

## అధ్యాయం : 1

## "అది మా బాధ్యత"

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

మేము మొదట్లో సృష్టిని చేసినట్లే మళ్ళీ దానిని చేస్తాము. ఇది మాపై బాధ్యతగా ఉన్న ఒక వాగ్దానం. మేము ఈ పనిని ఎలాగైనా చేయవలసే ఉంది. ***(21: 104)***

**581)** మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఒక రోజు ప్రసంగిస్తూ ఇలా అన్నారు- మీరు ప్రళయదినాన అల్లాహ్ సమక్షంలో నగ్నపాదాలతో, నగ్న శరీరాలతో, సున్నతీ (సుంతీ) చేయని స్థితిలో సమీకరించబడతారు. అల్లాహ్ ఈ విధంగా ఉపదేశించిన విషయం విదితమే కదా! 'మేము మొదట్లో సృష్టిని చేసినట్లే మళ్ళీ దానిని చేస్తాము. ఇది మాపై బాధ్యతగా ఉన్న ఒక వాగ్దానం. మేము ఈ పనిని ఎలాగైనా చేయవలసే ఉంది- తరువాత అందరికన్నా ముందుగా ప్రళయదినాన ఇబ్రాహీమ్(అ)కు దుస్తులు తొడిగించటం జరుగుతుంది. వినండి! నా సముదాయానికి చెందిన కొంతమంది తీసుకురాబడ తారు. దైవదూతలు వారిని పట్టుకుని ఎడమ వైపున ఉన్న నరకం వైపునకు

★ ఈ సూరా మక్కాలో అవతరించింది. ఇందులో 112 ఆయత్‌లు ఉన్నాయి.

**తీసుకుపోతారు. అప్పుడు నేను, 'ప్రభూ! వీరు నా ఉమ్మతీలు కదా!' అని విన్నవించు కుంటాను. సమాధానంగా ఇలా సెలవీయబడుతుంది : "(ముహమ్మద్!) నీ తదనం తరం వీళ్లు ఎలాంటి ఘోరాలకు పాల్పడ్డారో నీకు తెలియదు". ఆ సమయంలో నేను, దేవుని ఒక సజ్జన దాసుడు– ఈసా (అలైహిస్సలాం)– చెప్పిన మాటే చెబుతాను– 'నేను వారి మధ్యన ఉన్నంత కాలం వరకే నేను వారిని కనిపెట్టి ఉన్నాను. నీవు నన్ను తిరిగి పిలుచుకున్న తరువాత నీవే వారిని కనిపెట్టి ఉంటు న్నావు. నీవు సర్వ విషయాలను కనిపెట్టి ఉండేవాడవు.' (అని ఈసా చెప్పారు). అప్పుడు ఇలా సెలవీయబడుతుంది– "నీవు మరణించిన తరువాత వీరు తమ కాలి మడమలపై ఇస్లామ్ నుండి తిరిగిపోయారు."[1]**

---

581–1. దౌర్భాగ్యులైన రాఫిజీలు కొందరు ఈ హదీసుకు పెడర్థాలు తొడిగించారు– బహు కొద్ది మంది సహాబా తప్ప– అంటే జాబిర్ బిన్ అబ్దుల్లాహ్, మిఖ్దాద్ బిన్ అస్వద్, సల్మాన్ ఫార్సీ (రజిఅల్లాహు అన్‌హుమ్)లు తప్ప– మిగిలిన వారంతా దైవప్రవక్త(స) మరణానంతరం ఇస్లామ్ నుండి తిరిగి పోయారని అన్నారు.

ఇది పచ్చి అబద్ధం. నిజం ఏమిటంటే దైవప్రవక్త సహచరమాన్యులంతా ఇస్లాంపై స్థిరంగా ఉన్నారు. మరీ ముఖ్యంగా భువిలోనే స్వర్గలోక శుభవార్తను అందుకున్న 'అష్రె ముబష్షిరా'. దైవప్రవక్త(స) వాగ్దానం అసత్యం కాజాలదు. దివ్య ఖుర్‌ఆన్ ఆద్యంతం ఆ మహనీయుల త్యాగాలతో నిండి ఉన్నది. అసంఖ్యాకమైన హదీసులు ఆ మహనీయుల మహిమోన్నతులకు సంబంధించి ఉన్నాయి.

అది అలా ఉంచితే ప్రవక్త మినహా మిగిలిన సహచర మాన్యులెవరూ నిర్దోషులు, విమర్శకు అతీతులు కారు. వారు గైకొనే నిర్ణయాలలో పొరపాటు జరగటం సహజం. అలాగే వారి ద్వారా శాసనాన్వయ కృషిలో జరిగిన పొరపాటు (ఇజ్తెహాదీ ఖతా) కూడా క్షంతవ్యమే. ముజ్తహిద్ ద్వారా జరిగిన పొరపాటుపై కూడా ఒకింత పుణ్యం లభిస్తుందని హదీసు ద్వారా రూఢీ అవుతోంది.

# 22. అల్ హజ్జ్ సూరా వ్యాఖ్యానం★

## అధ్యాయం : 1

## ప్రళయం నాటి భూకంపం

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"వతరన్నాస సుకారా."[1]

**582)** హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) కథనం ప్రకారం మహనీయులు (సఅసమ్) ఇలా ప్రవచించారు :

"అల్లాహ్ ప్రళయదినాన ఆదమ్(అలైహిస్సలామ్)తో, 'ఓ ఆదమ్!' అని పిలుస్తాడు. దానికి ఆయన(అ), 'ప్రభూ! నేను హాజరయ్యాను. చిత్తం. నీ ఆజ్ఞాపాలనకు సిద్ధంగా ఉన్నాన'ని అంటారు. అప్పుడు ప్రభువు ఇలా అంటాడు (లేదా దైవదూత ద్వారా ప్రకటించబడుతుంది) : 'నీ సంతానంలో నుండి నరక వాసుల జట్టును తీసుకో'. 'ప్రభూ! ఎంత మందిని తీసుకోవాలి?' అని ఆదమ్(అ) విన్నవించుకోగా, 'ప్రతి వెయ్యి మందిలో నుండి 999 మందిని తీసుకో' అని సెలవీయబడుతుంది (అంటే ప్రతి వెయ్యి మందిలో స్వర్గవాసి ఒక్కడే ఉంటాడు). ఆ సమయం ఎంత భీకరంగా ఉంటుందంటే, ప్రతి గర్భిణీ యొక్క గర్భం పడిపోతుంది. ప్రతి పసిపిల్లవాడు (భీతిల్లి) ముసలివాడైపోతాడు. ప్రళయదినాన జనులు నీకు మత్తులో తూలుతున్నట్లు కనిపిస్తారు. నిజానికి వారు మత్తులో ఉండరు. కాని అల్లాహ్ శిక్షయే అంత తీవ్రంగా ఉంటుంది."

---

★ ఇది మదీనాలో అవతరించిన సూరా. ఇందులో 78 ఆయత్‌లున్నాయి.

1–1. అంటే– ప్రజలు మీకు మత్తులో ఉన్నట్టు కనిపిస్తారు. వాస్తవానికి వారు త్రాగి ఉండరు. కాని అల్లాహ్ శిక్షయే అంత తీవ్రంగా ఉంటుంది.

**ఈ హదీసును వినిపిస్తున్నప్పుడు, అక్కడ హాజరై ఉన్న సహచరమాన్యులకు ఇది చాలా కఠినంగా తోచింది. (భయంతో) వారి ముఖ కవళికలు మారి పోయాయి. అప్పుడు దైవప్రవక్త(స) వారిని ఓదారుస్తూ, 'మీరెందుకంతగా ఆందోళన చెందుతారు? అవిశ్వాసులైన యాజూజ్ మాజూజ్‌ల జనసంఖ్యతో పోల్చుకున్నప్పుడు మీరు 999లో ఒక్కరే అయి ఉంటారు. అంటే పునరుత్థాన దినాన (నరకానికి పోయే) జనులతో పోల్చి చూసినప్పుడు, తెల్లని ఎద్దు ఒంటిపై ఒక నల్లని వెంట్రుక ఉన్నట్లు మీరు కానవస్తారు లేదా నల్లని ఎద్దు శరీరంపై ఉన్న ఒకట్రొండు తెల్లని వెంట్రుకల్లా కనిపిస్తారు. మీరు మొత్తం స్వర్గవాసులలో నాల్గో వంతు ఉంటారని నేనాశిస్తున్నాను (మిగిలిన మూడు వంతులలో ఇతర సముదాయాలకు చెందినవారు ఉంటారు)" అని వివరించారు. ఇది విని మేము 'అల్లాహు అక్బర్' అని నినదించాము. పిదప ఆయన(స) ఇలా అన్నారు : 'లేదు. మీరు మూడింట ఒక వంతు ఉంటారు'. మేము 'అల్లాహు అక్బర్' అని మరోసారి నినాదం చేశాము. 'లేదు. మీరు స్వర్గవాసులలో సగం మంది అయి ఉంటార'ని దైవప్రవక్త(స) చెప్పారు (అంటే మిగిలిన సగం మంది ఇతర సముదాయాలకు చెందినవారై ఉంటారు). అప్పుడు మేము మరోసారి తక్బీర్ నినాదం చేశాము.[1]**

---

582-1. తిబ్రానీ ఉల్లేఖనం ప్రకారం ఉమ్మతె ముహమ్మదీకి చెందిన స్వర్గవాసుల సంఖ్య మూడింట రెండొంతులు అని తెలుస్తోంది. తిర్మిజీ ప్రకారం "స్వర్గవాసుల పంక్తులు 120 వరకూ ఉంటాయి. వాటిలో 80 పంక్తులు మీవే" అంటే మూడింట రెండొంతులు మీరే. మిగిలిన ఒక వంతు ఇతర సముదాయాలకు చెందినవారు."

ప్రభూ! నీకు ఎంతగా కృతజ్ఞతలు తెలిపినా తక్కువే. నీవు మాకు సిరిసంపదలిచ్చావు. సంతాన భాగ్యం ప్రసాదించావు. ఆరోగ్య సంపదనిచ్చావు. సౌందర్యం వొసగావు. సంస్కారం ఇచ్చావు. ఈ వరప్రసాదాల తరువాత నీవు పరలోకంలో మమ్మి పరాభవం పాల్జేస్తావా? లేదు లేదు. పరలోకంలో కూడా నీవు మమ్మల్ని అనుగ్రహిస్తావని ఆశిస్తున్నాము. నీ క్రోధంపై నీ కారుణ్యం ప్రాబల్యం వహించగలదని మేము గట్టిగా నమ్ముతున్నాము. దేవా! నీవే మా సహాయకుడవు. నీ ఆసరాతోనే, నీ అనుగ్రహ భాగ్యంపై ఆశతోనే బ్రతుకు బండిని లాగుతున్నాము. ప్రభూ! అసూయా పరులు, శత్రువులు ఈ ప్రపంచంలో మా బ్రతుకుల్ని దుర్భరం చేయజూశారు. కాని నీవు వారి బారి నుండి అడుగడుగునా మమ్మల్ని కాపాడావు. అలాగే మరణ సమయంలో కూడా మమ్మల్ని షైతాన్ కీడు నుండి కాపాడు. విశ్వాస స్థితిలోనే మమ్మల్ని ఈ లోకం నుండి లేపుకో. ఆమీన్ యా రబ్బల్ ఆలమీన్.

అధ్యాయం : 2

## మార్గ విహీనతకు పరాకాష్ఠ

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు-

ప్రజలలో ఒకడు (విశ్వాసం) అంచులపై నిలబడి అల్లాహ్‌కు దాస్యం చేసే వాడు ఉన్నాడు; ఒకవేళ లాభం కలిగితే తృప్తి పొందుతాడు; కాని ఏదైనా ఆపద సంభవిస్తే విముఖుడవుతాడు. అతనికి ఇహమూ దక్కదు, పరమూ దక్కదు. స్పష్టమైన నష్టం అంటే ఇదే. అతను అల్లాహ్‌ను కాదని, తనకు నష్టం గాని, లాభం గాని కలిగించలేని వారిని వేడుకుంటున్నాడు. ఇది మార్గభ్రష్టత్వానికి పరాకాష్ఠ. ***(22: 11,12)***

**583)** ఇబ్నె అబ్బాస్ (రజి), **"వ మినన్నాసి మఁయ్యాబుదుల్లాహ అలా హర్ఫిన్..."** (ప్రజలలో ఒకడు విశ్వాసం అంచులపై నిలబడి అల్లాహ్‌ను ఆరాధించే వాడు ఉన్నాడు) అనే ఆయత్‌ను గురించి ప్రస్తావిస్తూ ఇలా అన్నారు : కొంతమంది మదీనా నగరానికి వచ్చి తాము ఇస్లామ్ స్వీకరిస్తున్నట్లు ప్రకటించే వారు. ఆ తరువాత అతని భార్యకు అబ్బాయి పుడితే, గుర్రం ఈనితే, "అబ్బ! ఈ (ఇస్లామ్) ధర్మం ఎంత మంచిదో!" అనేవాడు. ఒకవేళ అతనికి మగ సంతానం కలగక పోతే, గుర్రం కూడా పిల్ల పెట్టకపోతే 'ఈ ధర్మం మంచిది కాద'ని అనేవాడు. ఈ నేపథ్యంలోనే ఈ ఆయత్ అవతరించింది.

అధ్యాయం : 3

## ప్రభువు గురించి రెండు వర్గాల మధ్యన వివాదం

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

అవి రెండు వర్గాలు, వాటి మధ్య తమ ప్రభువును గురించి వివాదం తలెత్తింది. వారిలో అవిశ్వాసులైన వారి కొరకు అగ్ని వస్త్రాలు కత్తిరించబడి ఉన్నాయి. వారి శిరస్సులపై మరిగే నీరు పోయబడుతుంది. ***(22: 19)***

**584)** మహనీయ అబూజర్(రజి) ప్రమాణం చేసి మరీ ఆ ఆయత్ **(22: 19)** గురించి ఇలా అనేవారు : వారు ఇరువర్గాల వారు. వారు తమ ప్రభువు గురించి తగాదా పడ్డారు. హమ్జా, ఆయన సహచరులు (అలీ బిన్ అబీ తాలిబ్,

ఉబైదా బిన్ హారిస్) ముస్లింల పక్షాన ఉండగా, ఉతబా, షైబా, వలీద్ బిన్ ఉతబా బహుదైవారాధకుల పక్షాన ఉన్నారు. వారు బద్ర్ రణరంగంలో పరస్పరం సవాలు విసిరినప్పుడు ఈ ఆయత్ అవతరించింది.

**585)** "కరుణామయుడైన అల్లాహ్ సమక్షంలో ప్రళయదినాన రెండు మోకాళ్ళపై కూర్చుని (ప్రత్యర్థికి వ్యతిరేకంగా) దావా చేసే మొదటి వ్యక్తిని నేనే అయి వుంటాను" అని మహనీయ అలీ (రజి) అన్నారు. ఖైస్ ఇలా అన్నారు– "అవి రెండు వర్గాలు, వాటి మధ్య తమ ప్రభువును గురించి వివాదం తలెత్తింది" అనే ఆయత్ అవతరించినది వీరి విషయంలోనే. బద్ర్ రణరంగంలో ఈ రెండు వర్గాలు ముఖాముఖి అయి సవాలు విసురుకున్నారు. అంటే అలీ, హమ్జా, ఉబైదా (ర.అన్హుమ్) ముస్లింల వైపున ఉండగా; సత్య తిరస్కారుల వైపున షైబా, ఉతబా, వలీద్ ఉన్నారు.

# 23. అల్ మోమినూన్ సూరా★

**ఈ సూరాలోని ముఖ్యమైన పదాలకు అర్థాలు–**

| | | |
|---|---|---|
| **సబ్అ తరాయిఖ** | : | **సప్తాకాశాలు** |
| **వజిలతు** | : | భయపడేవారు |
| **హైహాత్, హైహాత్** | : | **దూరాన ఉంది, దూరాన ఉంది అనే అర్థం వస్తుందని ఇబ్నె అబ్బాస్ (రజి) అభిప్రాయపడ్డారు.** |
| **కాలిహూన్** | : | **ముఖం చిట్లించటం, పాడు ముఖం పెట్టుకోవటం.** |
| **సులాలా** | : | **నలుసు, రేతస్సు** |
| **జిన్నతు, జునూన్** | : | **ఉన్మాదం, పిచ్చి, మతిస్థిమితం లేకపోవటం** |
| **తుస్హరూన్** | : | **చేతబడి వల్ల అంధులై పోతున్నారు.** |

★ ఇది మక్కాలో అవతరించిన సూరా. ఇందులో 118 ఆయత్‌లు ఉన్నాయి.

# 24. అన్ నూర్ సూరా★ వ్యాఖ్యానం

## అధ్యాయం : 1
## లియాన్ (శాప ప్రమాణం)

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

ఎవరయినా తమ భార్యలపై (అక్రమ సంబంధపు) నింద మోపినప్పుడు, వారిద్దరూ తప్ప ఇతరులెవ్వరూ సాక్షులుగా వారి వద్ద లేని పక్షంలో, వారిలో ఒక వ్యక్తి సాక్ష్యం ఏమిటంటే, తాను నాలుగు సార్లు అల్లాహ్‌పై ప్రమాణం చేసి, తన నిందారోపణ సత్యమని తాను సాక్ష్యం పలకాలి. ***(24: 6)***

**586)** సహ్లా బిన్ సాద్(రజి) కథనం :

ఉవైమిర్ బిన్ హారిస్ బిన్ జైద్(రజి) గారు ఆసిమ్ బిన్ అదీ(రజి) దగ్గరకు వెళ్ళారు. ఆసిమ్ బనీ అజ్లాన్ తెగ నాయకుడు. ఆయన ఆసిమ్‌తో, "ఎవరయినా ఒక వ్యక్తి తన భార్యతో పరాయి మగవాడు కులుకుతూ ఉండగా చూసి ఏం చేయాలి? అతన్ని చంపేయాలా? అలా చంపిన వాణ్ణి మీరు ప్రతీకారం (ఖిసాస్)గా హతమారుస్తారా? ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొన్న మనిషి ఏం చేయాలో చెప్పండి. దయచేసి మీరు దీనిని గురించి దైవప్రవక్త(స)కు వివరించి, ఆయన(స) ఏమంటారో నాకు చెప్పండి" అని అభ్యర్థించారు.

అందువల్ల ఆసిమ్(రజి) దైవప్రవక్త(స) సన్నిధిలో హాజరై 'దైవప్రవక్తా! (ఇలాంటి సమస్య ఎదురైనప్పుడు ఏం చేయాలి?) అని అడిగారు. "ఇలాంటి వాటిపై ప్రశ్నోత్తరాలు జరపటం మంచిది కాద"ని దైవప్రవక్త(స) చెప్పారు.

---

★ ఈ సూరా మదీనాలో అవతరించింది. ఇందులో 64 ఆయత్‌లు ఉన్నాయి.

ఉవైమిర్(రజి) అడిగినప్పుడు కూడా ఆసిమ్ ఆ మాటే అన్నారు- దీనిపై చర్చించడానికి దైవప్రవక్త(స) ఇష్టపడలేదని. 'అలాగైతే నేను స్వయంగా వెళ్ళి అడుగుతాన'న్నారు ఉవైమిర్(రజి). ఎట్టకేలకు ఆయన దైవప్రవక్త(స) సమక్షంలో హాజరై 'తన భార్యతో పరాయి మగాడు అక్రమ సంబంధం ఏర్పరచుకుని ఉండగా చూసినప్పుడు ఆ వ్యక్తి ఏం చేయాలి? అతన్ని చంపేయాలా? ఆనక తమరు ప్రతీకారం (ఖిసాస్) క్రింద ఆ హంతకుణ్ణి చంపేస్తారా? ఇంతకీ ఇలాంటి పరిస్థితి ఎదురైనప్పుడు ఏం చేయాలి?' అని ప్రశ్నించారు ఉవైమిర్. దానికి సమాధానంగా దైవప్రవక్త(స), "అల్లాహ్ నీ వ్యవహారంలో, నీ భార్య వ్యవహారంలో ఖుర్ఆన్‌లో దివ్య వచనాన్ని అవతరింపజేశాడు" అని చెప్పారు.

తరువాత ఆయన (స) ఖుర్ఆన్ నిర్దేశించిన పద్ధతి ప్రకారం 'లియాన్' చేయించమని ఆజ్ఞాపించారు. ఉవైమిర్ (రజి) తన భార్యకు ఎదురుగా శాప ప్రమాణం (లియాన్) చేశారు. ఆ తరువాత, 'దైవప్రవక్తా! ఇంత జరిగాక కూడా నేను నా భార్యను ఆపి ఉంచుకుంటే దౌర్జన్యపరుణ్ణి అవుతాను" అన్నారు. అందుచేత ఉవైమిర్(రజి) ఆమెకు విడాకులిచ్చేశారు. ఈ శాప ప్రమాణం జరిగిన మరుక్షణం నుంచే ఆ భార్యాభర్తల మధ్య వేర్పాటు జరిగిపోయింది.

ఆ తరువాత దైవప్రవక్త(స) ఇలా సూచించారు: "ఆ స్త్రీకి పుట్టబోయే పిల్లవాడు ఎలా ఉంటాడో గమనిస్తూ ఉండండి. ఒకవేళ ఆ పిల్లవాడు నల్లవాడుగా, నల్లని కన్నులు కలవాడుగా, లావుపాటి తొడలు ఉన్నవాడుగా, లావుపాటి పిక్కలు ఉన్నవాడుగా ఉంటే ఉవైమిర్ తన నిందారోపణలో సత్యవంతుడు. ఒకవేళ ఆ పిల్లవాడు ఎర్రని ఊసరవెల్లి మాదిరిగా ఉంటే (ఉవైమిర్ అలాగే ఉండేవారు), ఉవైమిర్ తన భార్యపై అభాండం మోపాడని అనుకుంటాను" అన్నారు. ఎట్టకేలకు ఆ స్త్రీ ప్రసవించినప్పుడు పిల్లవాణ్ణి చూస్తే దైవప్రవక్త(స) వర్ణించినట్లుగానే ఆ పిల్లవాడు (నల్లగా, నల్లని కనులు కలవాడుగా) ఉన్నాడు. దాంతో ఉవైమిర్(రజి) తన నిందారోపణలో సత్యవంతులని తేలిపోయింది. అందువల్ల ఆ పిల్లవాడి వంశం తల్లి వంశంతోనే కలపబడింది.[1]

---

586-1. భర్త తన భార్యను పరాయి మగవానితో అక్రమ సంబంధం ఏర్పరచుకుని ఉండగా కళ్ళారా చూసినప్పటికీ ఆ దృశ్యాన్ని ఇతరులకు చూపించడానికి ఇష్టపడడు. కాగా; ఇటు షరీఅత్‌లో వ్యభిచార ఆదేశాలు ఎంత కఠినంగా ఉన్నాయో దాని శిక్ష కూడా

## అధ్యాయం : 2

# నేనే గనక అబద్ధీకుడనైతే...

**"ఐదోసారి, ఒకవేళ నేను నా నిందారోపణలో అబద్ధీకుడనై ఉంటే, నాపై అల్లాహ్ శాపం పడుగాక!" అనాలి. *(24: 7)***

**587) సహ్ల్ బిన్ సాద్(రజి) కథనం:**

**ఒక వ్యక్తి (ఉవైమిర్-రజి) దైవప్రవక్త(సఅసమ్) సన్నిధికి వచ్చి, 'ఓ దైవ ప్రవక్తా! తన భార్య పరాయి మగవాడితో అక్రమ సంబంధం ఏర్పరచుకుని**

---

అంతే కఠినం. అలాగే దానికి సంబంధించిన సాక్ష్యాధారాలను సమర్పించటం కూడా చాలా కష్టమే. న్యాయశీలురైన నలుగురు సాక్షులు స్త్రీ పురుషులను అక్రమ సంబంధం పెట్టుకుని ఉండగా తాము కళ్ళారా చూసినట్లుగా స్పష్టంగా సాక్ష్యం ఇచ్చినప్పుడే షరీఅత్ శిక్ష విధిస్తుంది. ఒకవేళ ఎవరయినా మరొకరిపై వ్యభిచార నింద మోపి, దానికి సంబంధించిన సాక్ష్యాధారాలను సమర్పించలేకపోతే అతనికి కూడా కఠిన శిక్ష విధించబడుతుంది. ఇలాంటి పరిస్థితిలో పౌరుషం గల ఒక భర్త తన భార్యను పరాయి మగనితో కులుకుతుండగా చూస్తే అతని పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారవుతుంది. నలుగురు సాక్షులను తెచ్చే వ్యవధీ అతనికి దొరకదు. మరోవైపు అతను ఆ దుశ్చేష్టను జీర్ణించుకోనూ లేడు. తగు సాక్ష్యాధారాలు లేకుండా అతను తన భార్యపై నిందారోపణ చేస్తే శిక్షార్హుడవుతాడు. ఒకవేళ అతడు మౌనం వహిస్తే అది కూడా నీతిబాహ్యతను ప్రోత్సహించినట్లే. ఒకవేళ అతను చట్టాన్ని తన చేతిలోకి తీసుకుని, అతను స్వయంగా క్షణికావేశంలో ఏదయినా చేష్టకు ఒడిగట్టినట్లయితే శాసనోల్లంఘనకు పాల్పడిన శిక్షను అనుభవించాల్సి వస్తుంది. అలాంటి ఒక సంఘటనే దైవప్రవక్త(స) హయాంలో ఎదురయింది. అట్టి పరిస్థితిలో భర్త తన భార్యతో ఇస్లామీయ న్యాయస్థానానికి వచ్చి 'లియాన్' చేయాలని ఖుర్ఆన్ పరిష్కార మార్గం చూపెట్టింది.

ఒక న్యాయాధిపతి సమక్షంలోనో లేదా రాజ్యాధికారి సమక్షంలోనో నాలుగుసార్లు అల్లాహ్‌పై ప్రమాణం చేసి, తన భార్య అక్రమ సంబంధం ఏర్పరచుకుని ఉండగా తాను కళ్ళారా చూశానని, తాను చెప్పేది పూర్తిగా నిజం అని భర్త చెప్పాలి. ఒకవేళ తాను చెప్పేది అబద్ధమైన పక్షంలో తనపై అల్లాహ్ శాపం పడుగాక! అని పలకాలి. ఇటు భార్య కూడా తన భర్త పలికిన సాక్ష్యానికి సమాధానంగా నాలుగుసార్లు దేవునిపై ప్రమాణం చేసి, అతను చెప్పేది అబద్ధమని పలకాలి. అయిదవసారి- ఒకవేళ తన భర్త నిందారోపణలో సత్యవంతుడైతే (నేను చెప్పేది అబద్ధమైతే), నాపై దైవాగ్రహం

**ఉండగా ప్రత్యక్షంగా చూసిన వ్యక్తి గురించి తమరేమంటారు? అతను వాణ్ణి హతమార్చాలా? అదే జరిగినట్లయితే, తమరు హంతకుణ్ణి 'ఖిసాస్' (ప్రతీకారం) క్రింద హతమారుస్తారా? ఇంతకీ ఆ వ్యక్తి (బాధిత భర్త) ఏం చేయాలి?' అని విన్నవించుకున్నారు. ఆ వ్యక్తి నేపథ్యంలోనే అల్లాహ్ ఈ రెండు ఆయత్‌లను (24: 6,7) అవతరింపజేశాడు. వీటిలో 'లియాన్' (శాప ప్రమాణం) ప్రస్తావన ఉంది. అప్పుడు దైవప్రవక్త(స) ఆయనతో ఇలా అన్నారు: "నీకూ- నీ భార్యకు మధ్యన అల్లాహ్ తీర్పు చేశాడు."**

**ఉల్లేఖకుడు ఇలా అన్నారు: తరువాత ఆ భార్యాభర్తలిరువురూ 'లియాన్' (శాప ప్రమాణం) చేశారు. ఆ సమయంలో నేను దైవప్రవక్త(స) దగ్గరే వున్నాను. అనంతరం ఆయన(స) వారిద్దరి మధ్యన వేర్పాటు చేయించారు. ఆ తరువాతి కాలంలో 'లియాన్' చేసిన దంపతుల మధ్యన ఇలాగే వేర్పాటు చేసే పద్ధతి చెలామణిలోనికి వచ్చింది.**

**లియాన్ చేసే సమయంలో ఆ స్త్రీ గర్భవతిగా ఉంది. కాని ఆమె ఆ విష యాన్ని కూడా నిరాకరించింది. తీరా ఆవిడ ప్రసవించిన మీదట ఆ శిశువును ఆమె పేరుతోనే పిలవటం జరిగింది. వారసత్వ హక్కు విషయంలో కొడుకు తన తల్లికి వారసుడవుతాడు. కాగా; తల్లి దేవుడు నిర్ణయించిన వాటా ప్రకారం తన కొడుకుకు వారసురాలవుతుంది.**

## అధ్యాయం : 3

# భార్య శిక్ష నుండి తప్పించుకోవాలంటే..

**భార్యకు శిక్ష ఎలా తప్పుతుందంటే, ఆమె నాలుగుసార్లు అల్లాహ్‌పై ప్రమాణం చేసి, ఈ వ్యక్తి (తన నిందారోపణలో) అబద్ధం చెబుతున్నాడని సాక్ష్యమివ్వాలి.**

---

విరుచుకుపడుగాక! అని పలకాలి. ఇట్టి పరిస్థితిలో ఆమె వ్యభిచార శిక్ష నుండి తప్పిం చుకోగలదు. ఈ 'లియాన్' (శాప ప్రమాణం) తరువాత వారిద్దరి మధ్య శాశ్వతంగా వేర్పాటు జరిగిపోతుంది. ఈ పద్ధతిని శాప ప్రమాణం అని ఎందుకన్నారంటే- ఇందులో ఇరువురు వ్యక్తులూ(భార్యాభర్తలు) తాము చెప్పేది అబద్ధమైన పక్షంలో తాము దేవుని శాపానికి పాత్రులం అని ప్రకటిస్తారు. అంతిమ దైవప్రవక్త(స) కాలంలో ఇలాంటి సంఘటనలు కొన్ని ఎదురయ్యాయి. ఆ సంఘటనలే ఈ దైవాదేశాల అవతరణకు కారణభూతం అయ్యాయి.

ఐదోసారి, ఒకవేళ అతడు (తన నిందారోపణలో) సత్యవంతుడే అయితే, తనపై అల్లాహ్ ఆగ్రహం విరుచుకుపడుగాక!' అని ఆమె అనాలి. *(24: 8,9)*

**588)** మహనీయ ఇబ్నె అబ్బాస్(రజి) కథనం: హిలాల్ బిన్ ఉమయ్యా (రజి) ప్రవక్త మహనీయుల(సఅసమ్) సన్నిధికి వచ్చి, తాను తన భార్యను షరీక్ బిన్ సమ్‌హాతో ఉండగా చూశానని ఆరోపించారు. దానికి ఆయన(స), "దీనికి సంబంధించిన సాక్ష్యాధారాలు తీసుకురా. లేకుంటే నీ వీపుపై కొరడా దెబ్బలు పడతాయి" అని చెప్పారు. అప్పుడు ఆ సహాబీ, 'దైవప్రవక్తా! ఏ వ్యక్తి అయినా తన భార్యను పరాయి మగవానితో కులుకుతుండగా చూసి ఆ స్థితిలో సాక్షుల్ని వెతకడానికి వెళ్ళగలడా?!' అని విన్నవించుకున్నారు. కాని దైవప్రవక్త(స) మాత్రం "సాక్షుల్ని తీసుకురా. అన్యథా నీ వీపుపై కొరడా దెబ్బలు పడతాయి" అనే అనసాగారు. దానిపై హిలాల్(రజి) ఈ విధంగా విన్నవించుకున్నారు : 'అయ్యా! మీకు సత్యం ఇచ్చి పంపిన వాని సాక్షిగా చెబుతున్నాను. నేను నిజం చెబుతున్నాను. అల్లాహ్ స్వయంగానే ఏదయినా ఆయత్‌ను అవతరింపచేస్తాడు. దాంతో నాకు శిక్ష పడకుండా ఉంటుంది'. అంతలోనే జిబ్రీల్(అలైహిస్సలామ్) ఈ ఆయత్‌ను తీసుకుని వచ్చారు. **వల్లజీన యర్మూన అజ్‌వాజహుమ్..- ఇన్నహూ లమినస్సాదిఖీన్** **(24: 6).** (ఈ ఆయత్‌లో లియాన్ ఆజ్ఞ ఉంది). వహీ అవతరణ పూర్తయ్యాక, దైవప్రవక్త(స) హిలాల్‌ను పిలిపించారు. ఆయన వచ్చి, ఆయత్‌లో ఆదేశించబడిన దాని ప్రకారం నాలుగు సార్లు అల్లాహ్‌పై ప్రమాణం చేశారు. ఆ సందర్భంగా దైవప్రవక్త(స), "మీ ఇద్దరిలో ఒకరు అబద్ధీకులన్న సంగతి అల్లాహ్‌కు తెలుసు. మరైతే వారు (అబద్ధీకులు) పశ్చాత్తాపపడేందుకు సిద్ధంగా లేరా?" అని అడిగారు.

ఆ తరువాత హిలాల్ భార్య కూడా లేచి నిలబడి, నాలుగుసార్లు దైవంపై ప్రమాణం చేసింది. అయిదవ సారి కూడా ఆమె ప్రమాణం చేయబోయినప్పుడు, జనులు ఆమెను వారించేందుకు ప్రయత్నించారు. 'చూడు! నువ్వు గనక అబద్ధీకురాలివై ఉంటే నీపై దైవాగ్రహం విరుచుకుపడుతుంద'ని కూడా హెచ్చరించారు. ఈ మాట విని ఆమె కాస్త ఊగిసలాడిందని ఇబ్నె అబ్బాస్(రజి) చెప్పారు. ఆమె తన వాదనను ఉపసంహరించుకుంటుందని మేము తలపోశాము. కాని ఆమె, 'నేను నా జాతి వారిని అవమానపరచలేన'ని అంటూ అయిదవసారి కూడా ప్రమాణం చేసేసింది. తరువాత దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "ఆమెను గమనిస్తూ

ఉండండి. ఒకవేళ ఆమెకు బాగా నల్లని కళ్ళు, లావుపాటి పిరుదులు, లావైన పిక్కలు కల పిల్లవాడు పుడితే, ఆ పిల్లవాడు షరీక్ బిన్ సమ్హా అబ్బాయే అవుతాడు"- చివరకు ఆమె ప్రసవించినప్పుడు ఆ పిల్లవాడు అచ్చం అతని రూపురేఖలు కలవాడే అయి ఉన్నాడు."[1]- దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "ఒకవేళ దైవగ్రంథం ఆజ్ఞ రాకుండా ఉంటే, నేనా స్త్రీని కఠినంగా శిక్షించి ఉండేవాణ్ణి."

## అధ్యాయం : 4
# ఐదోసారి స్త్రీ ప్రమాణం

ఐదోసారి, ఒకవేళ అతడు (తన నిందారోపణలో) సత్యవంతుడే అయితే, తనపై అల్లాహ్ ఆగ్రహం విరుచుకుపడుగాక! అని ఆమె అనాలి. ***(24: 9)***

**589)** అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తనతో ఇలా చెప్పారని నాఫే తెలిపారు: తన ఇల్లాలు పరాయి మగవానితో అక్రమ సంబంధం పెట్టుకుందని ఒక వ్యక్తి (ఉవైమిర్) నిందారోపణ చేశాడు. ఆమె గర్భంలో ఉన్న నలుసు తన రేతస్సుతో ప్రాణం పోసుకోలేదని కూడా ఆరోపించాడు. ప్రవక్త మహనీయుల(సఅసమ్) కాలంలో జరిగిన సంఘటన ఇది. ఆయన(స), ఆ భార్యాభర్తలిద్దరూ 'లియాన్' (శాప ప్రమాణం) చేయవలసినదిగా ఆజ్ఞాపించారు: వారిద్దరూ లియాన్ చేశారు. తరువాత ఆయన(స) ఆ పిల్లవాణ్ని ఆ స్త్రీకి ఇప్పించి, ఆ దంపతులిద్దరి మధ్య వేర్పాటు చేయించారు.

## అధ్యాయం : 5
# చాలా పెద్ద అబద్ధం

ఈ అభాండాన్ని సృష్టించి తీసుకువచ్చినవారు, మీలోని ఒక వర్గం వారే. ఈ సంఘటనను మీ విషయంలో కీడుగా భావించకండి. పైగా ఇది మీకు మేలైనదే. ఎవడు ఇందులో ఎంత పాత్ర వహించాడో, వాడు అంతే పాపాన్ని మూట గట్టుకున్నాడు. ఇంకా ఈ బాధ్యతలో పెద్ద భాగాన్ని తన నెత్తిపై వేసుకున్న వ్యక్తికి

---

588-1. చాలా మంది వ్యాఖ్యాతలు ఈ ఆయత్(24: 6) హిలాల్ బిన్ ఉమయ్యా(రజి) విషయంలోనే అవతరించిందని అభిప్రాయపడ్డారు.

పెద్ద శిక్షే పడుతుంది.[1] *(24: 11)*

**590)** ఉర్వాతో అమ్మ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు : "ఎవడు ఇందులో ఎంత పాత్ర వహించాడో, వాడు అంతే పాపాన్ని మూట కట్టుకున్నాడు" అనే వాక్యం అబ్దుల్లాహ్ బిన్ ఉబై గురించి అవతరించింది."

## అధ్యాయం : 6

# అతి పెద్ద అభాండం (ఇఫ్క్ సంఘటన)

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

దానిని వినగానే మీరు "ఇటువంటి విషయాన్ని నోటితో అనటం మాకు శోభించదు. అల్లాహ్ పరిశుద్ధుడు, ఇది పెద్ద అభాండం" అని ఎందుకనలేదు. *(24: 16)*

వారు (తమ నిందారోపణకు రుజువుగా) నలుగురు సాక్షులను ఎందుకు తీసుకురాలేదు? వారు ఇప్పుడు సాక్షులను తీసుకురాలేదు కాబట్టి, అల్లాహ్ దృష్టిలో వారే అసత్యవాదులు. *(24: 13)*

**591)** అబద్ధాగ్రేసరులు అమ్మ ఆయిషా(ర.అ)పై అపనింద మోపి కట్టుకథ అల్లినప్పుడు అల్లాహ్ ఆ అబద్ధపు కల్పనల నుండి హజ్రత్ ఆయిషా(ర.అ)ను నిర్దోషిగా, శీలవతిగా ప్రకటించాడు. ఉర్వా బిన్ జుబైర్, సయీద్ బిన్ ముసయ్యిబ్, అల్ఖమా బిన్ వక్కాస్, అబ్దుల్లాహ్ బిన్ ఉతబా బిన్ మస్ఊద్ ప్రభృతులు దైవప్రవక్త సహధర్మచారిణి ఆయిషా(ర.అ)పై మోపబడిన అపనింద సంఘటనకు సంబంధించిన హదీసును పూసగుచ్చినట్లుగా వివరించారు. ఈ నలుగురు ఉల్లేఖకులలో కొందరి జ్ఞాపకశక్తి మరి కొందరి జ్ఞాపకశక్తి కన్నా ఎక్కువగా ఉన్నప్పటికీ, హదీసుకు సంబంధించి వారు చెప్పిన ఒక్కొక్క ముక్క మిగిలిన వారి మాటల్ని ధ్రువీకరించేదిగా ఉంది–

వీరు నలుగురూ ఉటంకించిన దాని ప్రకారం అమ్మ ఆయిషా(ర.అ) ఇలా వివరించారు :

ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఎప్పుడు ప్రయాణ సంకల్పం చేసుకున్నా తన సతీమణుల పేరిట చీటీలు వేసి, ఎవరి పేరు వస్తే వారిని తన ప్రయాణంలో

---

5–1. విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ)పై మోపబడిన అపనింద (ఇఫ్క్) సంఘటన నేపథ్యంలో ఈ ఆయత్ అవతరించింది.

తోడుగా ఉంచటం ఆనవాయితీ. ఒక యుద్ధ ప్రయాణ సందర్భంగా ఆయన(స) చీటీలు వేసినప్పుడు, నా పేరు వచ్చింది. అందువల్ల నేను దైవప్రవక్త(స)తోపాటు ప్రయాణానికి బయలుదేరాను. పరదా ఆజ్ఞ వచ్చిన తరువాత జరిగిన ప్రయాణ మది. అందువల్ల నన్ను ఒంటె తొట్లతో సహా లేపి- ఒంటెపై ఉంచి- స్వారీ చేయిం చటం జరిగేది. తొట్లతో సహా దింపటం జరిగేది. ఆ విధంగా మేము ప్రయాణానికి బయలుదేరాము. యుద్ధ లక్ష్యం నెరవేరిన తరువాత దైవప్రవక్త(స) తిరుగు ప్రయాణమయ్యారు. మదీనా నగరం కొంత దూరాన ఉండగా మేము ఒకచోట విడిది చేశాము. రాత్రిపూటే అక్కడి నుండి బయలుదేరాలని దైవప్రవక్త(స) ప్రకటన చేయించారు. ప్రకటన విన్నంతనే నేను లేచి బిడారు ఆగి ఉన్న స్థలానికి కొంత దూరం వెళ్ళి, కాలకృత్యాలు తీర్చుకుని, నా వాహనం ఉన్న చోటికి తిరిగి వచ్చాను. అక్కడికి చేరుకునే సమయానికి 'జుఫార్' (యమన్‌లోని ఒక ప్రదేశం పేరు)లో తయారు చేయబడిన నా కంఠహారం కనిపించలేదు. నేను మళ్ళీ ఆ హారాన్ని వెతుక్కుంటూ వెళ్ళాను. ఈ అన్వేషణలో ఆలస్యం అయిపోయింది. ఈ లోగా నేను కూర్చునే తొట్లను లేపి ఒంటెపై ఉంచేవారు వచ్చి నా ఒంటెపై ఉంచారు.

ఆ రోజుల్లో స్త్రీలు తేలిగ్గా, బక్కపలచగా ఉండేవారు. వారి శరీరాలపై ఎక్కువ మాంసం ఉండేది కాదు. ఎందుకంటే వారికి ఆహారం స్వల్పంగానే లభ్యమయ్యేది. అందువల్ల తొట్లను లేపే సేవకులు దానిని లేపినప్పుడు, దాని బరువు విషయంలో వారు వ్యత్యాసాన్ని తెలుసుకోలేకపోయారు. అదీగాక ఆ రోజుల్లో నేను నవ యువతిని. ఆ విధంగా వారు ఒంటెను లేపి ప్రయాణమైపోయారు. బిడారు అక్కడి నుండి వెళ్ళాకగాని నా కంఠహారం దొరకలేదు. నేను నా గుడారం వద్దకు వచ్చే సమయానికి అక్కడ ఎవరూ లేరు. పిలిచేవారూ లేరు. పిలుపునకు జవాబిచ్చే వారూ లేరు. అందుకే నేను నా గుడారం వద్దకు వచ్చి ఆగాను. నేను లేనన్న సంగతి తెలియగానే నన్ను తీసుకెళ్ళడానికి వారు తప్పకుండా తిరిగి వస్తారని భావించి, అక్కడే కూర్చున్నాను. ఆ నిరీక్షణలోనే నాకు నిద్రపట్టేసింది.

సఫ్వాన్ బిన్ ముఅత్తల్ సులమీ (రజి) బిడారు వెనుక వచ్చేవారు. ఎందు కంటే సైనికులు మరిచిపోయిన వస్తువులను సేకరించే బాధ్యత ఆయనకు అప్ప గించబడింది. ఆయన నిద్రిస్తున్న ఒక మనిషి నీడను చూసి నన్ను సమీపించారు. ఆయన నన్ను గుర్తుపట్టారు. పరదా ఆజ్ఞ అవతరించక పూర్వం ఆయన నన్ను

చూసి ఉన్నారు. నన్ను గుర్తుపట్టగానే ఇన్నాలిల్లాహి... పఠించసాగారు. ఆ శబ్దానికి నాకు మెలకువ వచ్చింది. తక్షణం నేను నా దుప్పటిని ముఖంపై కప్పుకున్నాను. అల్లాహ్ సాక్షిగా! నేనాయనతో ఒక్క మాట కూడా మాట్లాడలేదు. 'ఇన్నాలిల్లాహి...' అనే మాట తప్ప మరొకటి నా నోట వెలువడలేదు. ఆయన ఒంటె దిగి, దాని ముంగాలిని మడతపెట్టి కూర్చోబెట్టారు. నేను వెంటనే లేచి ఒంటెపై స్వారీ అయ్యాను. ఆయన ఒంటె పగ్గం పట్టుకుని– ముందుండి– నడక సాగించారు. మేము పయన బృందాన్ని చేరుకునే సమయానికి మధ్యాహ్నం అయింది. పయన బృందం విడిది చేసి ఉంది.

విశ్వాసుల మాత ఇలా అన్నారు: జరిగింది మాత్రం ఇది. అయితే నాశన మవవలసినవాడు నాశనమయ్యాడు. ఈ అపనిందకు సారథ్యం వహించినవాడు (కపటాగ్రేసరుడు) అబ్దుల్లాహ్ బిన్ ఉబై. అతను ఈ అభాండం గురించి చర్చించే వాడని, తన సమావేశాలలో ఈ సంఘటనను ప్రస్తావించేవాడని, దానిని ధ్రువపరిచే వాడని, చాలా శ్రద్ధతో వినేవాడని, దీనిని వ్యాపింపజేయడానికి కూపీలు లాగేవాడని ఉర్వా చెప్పారు– ఈ అపనిందలో పాల్గొన్నవారిలో చాలామంది ఉన్నప్పటికీ ఉర్వా తన సనదులో మిస్తహ్ బిన్ ఉసాసా, హస్సాన్ బిన్ సాబిత్, హమ్నా బిన్తె జహ్ష్ తప్ప వేరితరుల పేర్లు ప్రస్తావించలేదు. ఈ అపనిందను మోపినవారు చాలామంది ఉన్నారని అల్లాహ్ స్వయంగా సెలవిచ్చాడు. కాని ఈ వ్యవహారంలో అందరికన్నా ఎక్కువగా పాపం పంచుకున్నవాడు అబ్దుల్లాహ్ బిన్ ఉబై బిన్ సలూల్. ఉర్వా ఇలా అన్నారు: అయినప్పటికీ అమ్మ ఆయిషా(ర.అ) ఈ పాపంలో పాలుపంచుకున్న వారి గురించి ఆచితూచి మాట్లాడేవారు. మరీ ముఖ్యంగా హస్సాన్ బిన్ సాబిత్(రజి)ను గురించి ఎవరయినా చెడుగా ప్రస్తావిస్తే, ఆమె వారించేవారు. "(అయ్యో! ఆయన గురించి అలా అనకండి). నా తండ్రి, నా తండ్రికి తండ్రి, నా గౌరవం, ముహమ్మద్(స) గౌరవ రక్షణ నిమిత్తం 'డాలు'గా ఉంటాయి అని కవిత్వం చెప్పింది హస్సానే కదూ!" అనేవారు.

ఆయిషా(ర.అ) ఆ సంఘటనను గురించి ఇలా వివరించారు : తరువాత మేము మదీనా చేరుకున్నాము. ఇంటికి చేరుకున్న తరువాత నేను అస్వస్థతకు గురయ్యాను. దాదాపు నెల రోజుల వరకూ అనారోగ్యంతో మంచం పట్టాను. ఈ లోగా అపనిందను మోపినవారు ప్రజల మధ్యన ఏవేవో చెప్పుకున్నారు. కాని

నాకు అదేమీ అర్థం కాలేదు. కాకపోతే ఒక విషయం నన్ను బాగా సంశయానికి లోను చేసేది. అదేమిటంటే లోగడ నాకు జబ్బు చేసినప్పుడు, దైవప్రవక్త(స) నా ఆరోగ్యం పట్ల చూపినంత శ్రద్ధ ఈసారి చూపటం లేదు. ఆయన ఇంట్లోకి వచ్చినప్పుడు సలామ్ చేసి, 'ఆరోగ్యం ఎలా ఉంది?' అని మాత్రం అడిగేవారు. ప్రవక్త మహనీయుల(స) వారి ఈ వైఖరి నన్ను అనుమానంలో పడవేసేది. కాని (నలువైపులా) వ్యాపించిన కీడు గురించి నాకేమీ తెలీదు.

అయితే ఆరోగ్యం కాస్త కుదుట పడిన తరువాత నేను ఉమ్మె మిస్తహ్‌తో కలసి (మదీనా జనావాసానికి దూరంగా ఉన్న) 'మనాసీ' ప్రదేశానికి వెళ్ళాను. అది మా ఆడవాళ్ళకు బహిర్భూమిగా ఉండేది. కేవలం రాత్రివేళల్లోనే మేము అక్కడికి వెళ్ళేవారం. మరుగుదొడ్లు మా ఇండ్లకు దగ్గరలో నిర్మించబడక పూర్వం జరిగిన సంఘటన ఇది– ఆ కాలంలో మేము కాలకృత్యాలు తీర్చుకోవటానికి ఊరి బయటికి వెళ్ళేవారము. ఇది మాకు ఇబ్బందికరంగానే ఉండేది. నేనూ, ఉమ్మె మిస్తహ్– ఇద్దరం కలసి బహిర్ ప్రదేశానికి వెళ్ళాము. ఉమ్మె మిస్తహ్ ఎవరో కాదు, ఆమె అబూ రహమ్ బిన్ ముత్తలిబ్ బిన్ అబ్దె మునాఫ్ కూతురు. ఆమె తల్లి సఖ్ర్ బిన్ ఆమిర్ కుమార్తె. ఆమె అబూబక్ర్ సిద్దీఖ్(రజి)కు పినతల్లి అవుతుంది. ఆమె కుమారుడే మిస్తహ్ బిన్ ఉసాసా(రజి).

నేనూ, ఉమ్మె మిస్తహ్ కాలకృత్యాలు తీర్చుకున్న మీదట ఇంటికి తిరిగి వస్తుండగా ఉమ్మె మిస్తహ్ తన దుప్పట్లో చిక్కుబడ్డారు. అంతే, ఆ క్షణంలో ఆమె నోట 'మిస్తహ్ పాడుగాను!' అన్న మాట వెలువడింది. దానికి నేను, 'అయ్యో! అలా అంటారేమిటి? బద్ర్ సంగ్రామంలో సయితం పాల్గొన్న సహాబీ గురించి అలా చెడుగా మాట్లాడవచ్చునా?' అన్నాను. దానికి ఆమె '(అయ్యో! మహాతల్లి!) నీ గురించి మిస్తహ్ ఏమంటున్నాడో నీవు వినలేదా?' అన్నది. 'ఏమన్నారేమిటి?' అని నేను అడగ్గా, ఆమె వివరంగా చెప్పింది. తరువాత ఆమె, అపనింద మోపిన వారి మాటల్ని కూడా వినిపించింది. ఆ మాటలు విన్న క్షణం నుంచి నా జబ్బు మరింత తీవ్రతరమయింది. నేను ఇంటికి వెళ్ళిన తర్వాత దైవప్రవక్త(స) నా కుటీరానికి వచ్చి సలామ్ చేశారు. ఆరోగ్యం ఎలా ఉంది? అని అడిగారు. 'కొన్నాళ్ళపాటు నా తల్లిదండ్రుల వద్దకు వెళ్ళగోరుతున్నాను. అనుమతి ప్రదానం చేయండి' అని కోరాను. ఈ అపనింద సంగతి తల్లిదండ్రులకు తెలియపరిచి నిజానిజాల గురించి

కనుక్కోవాలనుకున్నాను. దైవప్రవక్త(స) నాకు అనుమతి ప్రదానం చేశారు. మా అమ్మ దగ్గరకు వెళ్ళి నగరంలో వ్యాపిస్తున్న ఈ వదంతుల గురించి దర్యాప్తు చేశాను. 'అమ్మా! దుఃఖించకు. దైవసాక్షి! ఒక అందగత్తె అగు స్త్రీని ఒక భర్త అమితంగా ప్రేమిస్తుండగా, ఆమెకు సవతులు కూడా ఉంటే ఆమెపై ఇలాంటి నీలాపనిందలు మోపబడకుండా ఉండటం, ఆమె తప్పులెన్నకుండా ఉండటం అనేది బహు అరుదు' అంది అమ్మ. 'సుబ్‌హానల్లాహ్! (ఈ సంఘటనతో నా సవతులకు సంబంధం ఏమిటి?) ఈ చర్చ జరుగుతున్నది బయట ప్రజల్లో కదా!' అన్నాను.

ఆమె ఇంకా ఇలా అన్నారు: ఆ క్షణం నుంచీ నా ఏడుపు ఆగలేదు. రాత్రంతా ఏడుస్తూనే ఉన్నాను. తెల్లవారింది. కాని నా కన్నీటి ప్రవాహం ఆగలేదు. నిద్ర కూడా పట్టడం లేదు.

మరోవైపు దైవప్రవక్త(స) అలీ బిన్ అబీ తాలిబ్(రజి), ఉసామా బిన్ జైద్ (రజి)లను పిలిపించి, తన భార్యను తన నుండి వేరుపరిచే విషయమై సంప్రతించారు. ఎందుకంటే అప్పటివరకూ ఈ వ్యవహారం గురించి ఆయన(స)పై వహీ (దైవవాణి) అవతరించలేదు. ఉసామా బిన్ జైద్(రజి) తనకు తెలిసిన దానిని దైవప్రవక్త(స)కు చెప్పారు. '(దైవప్రవక్తా!) నేను మీ సతీమణిలో మేలు తప్ప మరొకటి చూడలేద'ని సాక్ష్యమిచ్చారు ఉసామా. కాని మహనీయ అలీ(రజి) ఇలా అన్నారు : 'దైవప్రవక్తా! అల్లాహ్ మీపై ఎలాంటి ఇబ్బందినీ ఉంచలేదు. మీరు కోరుకుంటే లోకంలో ఇంకా చాలామంది స్త్రీలు ఉన్నారు'. తరువాత దైవప్రవక్త(స) బరీరా (ర.అ)ను పిలిచి, దర్యాప్తు చేశారు. "ఆయిషా (ర.అ)పై అనుమానం వచ్చే విషయం ఏదయినా నీవు గమనించావా?" అని అడిగారు. దానికి ఆమె, 'మీకు సత్యం ఇచ్చి పంపిన వాని సాక్షిగా! నేనామెలో చెడు విషయమేదీ చూడలేదు. కాకపోతే చిన్న పిల్ల కదా! పిండి నానబెట్టి నిద్రపోతుంది. అంతలో మేక వచ్చి ఆ పిండి తినేసిపోతుంది' అని చెప్పింది.

హజ్రత్ ఆయిషా(ర.అ) ఇంకా ఇలా అన్నారు: ఆ రోజు దైవప్రవక్త(స) తన సహచరమాన్యులనుద్దేశించి ప్రసంగించారు. వేదికనెక్కి (కపటి) అబ్దుల్లాహ్ బిన్ ఉబై వైఖరి గురించి ప్రస్తావించారు. "ఓ ముస్లింలారా! ఏ వ్యక్తి ఆగడాలైతే ఇప్పుడు నా భార్య వ్యవహారం వరకూ చేరాయో అతని బారి నుండి నాకు తోడ్పడేవారెవరు? దైవసాక్షిగా! నేను నా భార్యలో మంచి తప్ప మరొకటి ఎరుగను.

వారు ఏ వ్యక్తి గురించి చెబుతున్నారో (అమ్మ ఆయిషా-ర.అ-ను ఒంటెపై ఎక్కించు కుని వచ్చిన సఫ్వాన్ బిన్ ముఅత్తల్-రజి) అతనిలో కూడా నేను మంచి తప్ప మరొకటి ఎరుగను. అతనెప్పుడు మా ఇంటికి వచ్చినా నాతోపాటే వచ్చాడు" అని చెప్పారు.

ఈ ప్రసంగం విని బనీ అష్హల్ తెగ సోదరుడు సాద్ బిన్ ముఆజ్(రజి) లేచి, 'దైవప్రవక్తా! నేను మీకు తోడ్పడతాను. ఒకవేళ అతను ఔస్ తెగవాడై ఉంటే నేనతని మెడ నరికేస్తాను. ఒకవేళ అతను మా తెగవాడై ఉంటే, మీరేమని ఆజ్ఞాపిస్తే దానిని మేము శిరసావహిస్తాము' అన్నారు. ఇది విని ఖజ్రజ్ తెగకు చెందిన ఓ వ్యక్తి లేచి నిలబడ్డారు. హస్సాన్ తల్లి ఆ వ్యక్తికి వరుసకు చెల్లి అవు తుంది. అంటే సాద్ బిన్ ఉబాదా(రజి)! ఆయన ఖజ్రజ్ తెగ నాయకుడు. అంత వరకూ ఆయన ఎంతో సౌజన్యశీలుడుగా, నిజాయితీపరుడుగా ప్రసిద్ధి చెందారు. కాని ఆ క్షణంలో ఆయనపై వర్గ తెగల దురభిమానం ఆధిపత్యం వహించింది. ఆయన సాద్ బిన్ ముఆజ్(రజి)ను ఉద్దేశించి, 'దైవసాక్షి! నీవు అబద్ధీకుడవు. నీవు అతనిని చంపలేవు. నీలో అంత దమ్ము లేదు లే. ఒకవేళ ఆ వ్యక్తి నీ తెగవాడై ఉంటే, అతని హత్య ఊసి కూడా ఎత్తి ఉండేవాడవు కావు' అన్నారు. దాని మీదట సాద్ బిన్ ముఆజ్ బాబాయి కుమారుడైన ఉసైద్ బిన్ హుజైర్ లేచి, సాద్ బిన్ ఉబాదాతో, 'అల్లాహ్ సాక్షిగా! నీవు అబద్ధీకుడవు. మేమతన్ని అవశ్యంగా కడతేరు స్తాము. నీవు కూడా ఒక కపటివి అనటంలో సందేహం లేదు. ఎందుకంటే నీవు మునాఫిక్‌ల కొమ్ము కాస్తున్నావు' అన్నారు. అంతే ఔస్- ఖజ్రజ్ తెగల మధ్య వాతావరణం వేడెక్కింది. పరస్పరం కత్తులు దూసుకుంటారేమో అన్నట్టుంది పరిస్థితి. అప్పటివరకూ వేదికపైనే ఉన్న దైవప్రవక్త(స) అందరినీ శాంతపరిచారు. దాంతో అందరూ నిశ్శబ్దంగా ఉండిపోయారు. దైవప్రవక్త(స) కూడా అక్కడినుండి నిష్క్రమించారు.

హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు : ఆ రోజంతా నేను ఏడుస్తూనే గడిపాను. నా కన్నీళ్ళు ఆగలేదు. కునుకు పట్టలేదు. ఏడ్చి ఏడ్చి నా గుండె బద్ద లయ్యేలా ఉంది. ఉదయం పూట నా తల్లిదండ్రులు నా దగ్గరకు వచ్చారు. అప్పటికి రెండు రాత్రులు, ఒక పగలు ఏడ్పులోనే గడిచిపోయాయి. అంతలో ఒక అన్సార్ మహిళ నా దగ్గరకు రావడానికి అనుమతి కోరింది. ఆమె కూడా నాతోపాటు

కూర్చుని ఏడ్వసాగింది. మేము ఆ స్థితిలో ఉండగానే దైవప్రవక్త(స) విచ్చేశారు. సలామ్ చేసి కూర్చున్నారు. నా మీద అపనింద మోపబడినప్పటి నుండి దైవ ప్రవక్త(స) నా దగ్గర కూర్చోలేదు. నెల రోజులు పూర్తిగా గడిచిపోయాయి. నా సౌశీల్యం గురించి 'వహీ' ద్వారా ఆయన(స)కు సమాచారం ఏదీ అందలేదు. నా దగ్గర కూర్చున్న తర్వాత ఆయన(స) సాక్ష్య వచనం (కలిమయె షహాదా) పఠించి, ఇలా అన్నారు : "అమ్మాబాద్! ఆయిషా! నీ గురించి నాకు ఈ విధమైన సమాచారం అందింది. నీవు గనక ఈ వ్యవహారంలో నిర్దోషివి, శీలవతివి అయివుంటే, అల్లాహ్ ఖుద్దుగా నీ సౌశీల్యాన్ని ప్రకటిస్తాడు. కాని ఒకవేళ నీవు ఏదయినా పాప సంకల్పం చేసుకుని ఉంటే క్షమాపణకై అల్లాహ్‌ను ప్రార్థించు. ఆయన సన్నిధిలో పశ్చాత్తాపపడు. ఎందుకంటే దాసుడు తన తప్పులను ఒప్పుకుని, దైవ సన్నిధిలో క్షమాపణ కోరినప్పుడు అల్లాహ్ అతని పశ్చాత్తాపాన్ని ఆమోదిస్తాడు."

విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) ఇలా అంటున్నారు : ప్రవక్త మహనీయులు(సఅసమ్) తన మాటను పూర్తి చేసిన తరువాత నా కన్నీళ్ళు పూర్తిగా ఇంకిపోయాయి. ఒక్క చుక్క కన్నీరు కూడా కళ్ళలో ఉన్నట్టు అనిపించలేదు. 'నా తరఫున మీరు దైవప్రవక్త(స)కు సమాధానం ఇవ్వండి' అని నేను మొదట నా తల్లిదండ్రులను కోరాను. 'దైవసాక్షి! దైవప్రవక్త(స)కు సమాధానం ఏమివ్వాలో నాకు అర్థం కావటంలేద'ని నాన్న చెప్పారు. 'దైవప్రవక్త(స) చెప్పిన మాటలకు జవాబు ఇవ్వండి' అని అమ్మను అభ్యర్థించాను. 'అయ్యో! నేను దైవప్రవక్త(స)కు ఏం చెప్పాలో నాకేమీ పాలుపోవటంలేద'ని అమ్మ చెప్పింది. అందువల్ల నేను స్వయంగా విన్నవించుకోవలసిన పరిస్థితి ఏర్పడింది– నిజానికి నేనప్పటికి చిన్న పిల్లనే. ఖుర్ఆన్ కూడా అప్పటికి నేను ఎక్కువగా చదువుకోలేదు. (నేనిలా అన్నాను:) 'అల్లాహ్ సాక్షిగా! మీరంతా కూడా ఇలాంటి వదంతుల్ని వింటున్నారనీ, విషయం మీ మనస్సుల్లో నాటుకుందనీ, మీరంతా దానిని నిజమని నమ్మారని నాకు అర్థమవుతోంది. ఆ అపనిందతో నాకెలాంటి సంబంధం లేదని నేను చెప్పినా మీరు దానిని నమ్మరు. ఒకవేళ నేను తప్పు ఒప్పుకుంటే– నేనే పాపం చేయలేదన్న సంగతి అల్లాహ్‌కు బాగా తెలుసు. కాని– మీరంతా దానిని నమ్మేస్తారు. కాబట్టి దైవసాక్షిగా! నా ఉపమానం, మీ దృష్టాంతం యూసుఫ్(అలైహిస్సలామ్) తండ్రి లాంటిది. ఆ సమయంలో ఆయన, 'సరే. ఓర్చుకుంటాను. బాగా ఓర్చుకుంటాను.

మీరు కల్పిస్తున్న మాటల విషయంలో సహాయం కోసం అల్లాహ్‌నే అర్థించాలి' అన్నారు.

నేను మరోవైపు ముఖం త్రిప్పుకుని పడకపై మేను వాల్చాను. ఈ వ్యవహారంలో నేను నిర్దోషినన్న సంగతి దైవానికి తెలుసు. ఆయన స్వయంగా నా నిర్దోషిత్వాన్ని ప్రకటిస్తాడని భావించాను. ఎందుకంటే నేను ముమ్మాటికీ నిర్దోషిని. కాని అల్లాహ్ సాక్షిగా! ఆయన 'వహీ' (దైవవాణి) ద్వారా ఖుర్‌ఆన్‌లో నా నిర్దోషిత్వాన్ని ప్రకటిస్తాడని మాత్రం నేను ఊహించలేదు. ఎందుకంటే, నా గురించి అల్లాహ్ 'వహీ'ని అవతరింపజేసేంతటి స్థాయి నాకు లేదని భావించాను. దైవ ప్రవక్త(స) కల గంటారని, ఆ కలలో దేవుడు నా పవిత్రతను గురించి ఎరుక పరుస్తాడని మాత్రమే అనుకున్నాను.

కాని దైవసాక్షిగా! దైవప్రవక్త(స) అక్కడి నుంచి లేవకముందే, ఇంటి సభ్యుల్లో కూడా ఎవరూ అక్కడి నుండి నిష్క్రమించకముందే ఆయన(స)పై దైవవాణి (వహీ) అవతరణ ప్రారంభమైంది. ఆ క్షణంలో ముత్యాల్లా ఆయన(స) ఒంటిపైనుండి చెమట బిందువులు రాలసాగాయి. నిజానికి అది తీవ్రమైన చలికాలం. 'వహీ' అవతరించినప్పుడే ఆయన(స)పై ఆ స్థితి ఆవరించేది. ఈ పరిస్థితి తొలగిపోయిన తరువాత ఆయన పెదవులపై చిరునవ్వు చిందింది. ఆ క్షణంలో ఆయన(స) నోట వెలువడిన మొట్టమొదటి మాట, "ఆయిషా! అల్లాహ్ నీ నిర్దోషిత్వాన్ని అవతరింప జేశాడు". అప్పుడు మా అమ్మ ఎంతో ఆనందోత్సాహంతో, 'అమ్మాయి! వెళ్ళి, దైవప్రవక్త(స) సమక్షంలో నిలబడు' అంది. దానికి నేను, 'దైవసాక్షి! నేనాయన సమక్షంలో నిలబడటమేమిటి? నేను గౌరవోన్నతుడైన అల్లాహ్‌కు తప్ప వేరెవరికీ కృతజ్ఞతలు తెలుపను (ఎందుకంటే, ఆయనే నా నిర్దోషిత్వాన్ని ప్రకటించాడు)' అని పలికాను. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

*"ఈ అభాండాన్ని సృష్టించి తీసుకువచ్చినవారు, మీలోని ఒక వర్గం వారే. ఈ సంఘటనను మీ విషయంలో కీడుగా భావించకండి. పైగా ఇది మీకు మేలైనదే. ఎవడు ఇందులో ఎంత పాత్ర వహించాడో, వాడు అంతే పాపాన్ని మూట గట్టుకున్నాడు. ఇంకా ఈ బాధ్యతలో పెద్ద భాగాన్ని తన నెత్తిపై వేసుకున్న వ్యక్తికి పెద్ద శిక్షే పడుతుంది." (అన్ నూర్ : 11)*

ఈ సంఘటన నేపథ్యంలో మొత్తం పది ఆయత్‌లు అవతరించాయి. నూర్ సూరాలోని ఈ ఆయత్‌లు అవతరించినప్పుడు అబూబక్ర్ సిద్దీఖ్(రజి) తన కుమార్తెపై అపనింద మోపేవారితో కుమ్మక్కు అయిన మిస్తహ్ బిన్ ఉసాసాపై కోపంతో, ఇక మీదట నేనతని ఖర్చుల నిమిత్తం డబ్బు ఇవ్వనని ఒట్టేసుకున్నారు. (మిస్తహ్ పేదవారు, పైగా అబూబక్ర్‌కు బంధువు కూడా. ఈ కారణంగా ఆయన మిస్తహ్‌కు ఆర్థిక సహాయం చేసేవారు). దానిపై అల్లాహ్ ఈ ఆయత్‌ను అవతరింప జేశాడు :

*"మీలోని ప్రముఖులు, స్థితిపరులు తమ బంధువులకూ, నిరుపేదలకూ, అల్లాహ్ మార్గంలో వలస వచ్చిన ప్రజలకూ, సహాయం చేయకూడదని ప్రమాణం చేయరాదు. వారిని క్షమించాలి, వారి (తప్పుల)ని ఉపేక్షించాలి. మిమ్మల్ని అల్లాహ్ క్షమించాలని మీరు కోరుకోరా? అల్లాహ్ గుణం ఏమిటంటే, ఆయన క్షమించే వాడూ, కరుణించేవాడూను. (నూర్ : 22)*

ఈ ఆయత్ అవతరించినప్పుడు అబూబక్ర్(రజి) చలించిపోయారు. 'దైవసాక్షిగా! అల్లాహ్ నా తప్పుల్ని మన్నించాలన్నదే నా ఆకాంక్ష' అని పలికారు. మిస్తహ్‌కు చేసే ఆర్థిక సహాయాన్ని తిరిగి కొనసాగించారు. 'దైవసాక్షిగా! నేనతనికి ఇచ్చే భృతిని ఇక ఎన్నటికీ ఆపను' అని కూడా చెప్పారు.

అమ్మ ఆయిషా(ర.అ) ఇంకా ఇలా అన్నారు: దైవప్రవక్త(స) నా గురించి ఉమ్ముల్ మోమినీన్ జైనబ్ బిన్తె జహ్షా(ర.అ)ని కూడా సంప్రతించారు. "ఆయిషా గురించి నీకు ఏం తెలుసు? నీవు ఆమెలో గమనించిన విషయం ఏమిటి?" అని ఆయన(స) అడిగినప్పుడు, 'దైవప్రవక్తా! (నేనామెకు వ్యతిరేకంగా సాక్ష్యం ఇవ్వటం నుండి) నేను నా కళ్ళు చెవులను కాపాడుకుంటున్నాను. దైవసాక్షిగా! నేను ఆమెలో మంచి తప్ప మరొకటి ఎరుగను' అని ఆమె చెప్పారు. ప్రవక్త సతీమణులలో నాకు సమఉజ్జీ కాగల వారెవరయినా ఉన్నారంటే జైనబ్ బిన్తె జహ్షా మాత్రమే. కాని అల్లాహ్ ఆమెలోని భయభక్తుల మూలంగా, సౌశీల్యం కారణంగా ఆమెను (ఉపద్రవం నుండి) సురక్షితంగా ఉంచాడు. కాకపోతే ఆమె సోదరి హమ్నా మాత్రం నాశనమయ్యే వారితోపాటు నాశనమయ్యింది.

ఈ హదీసు ద్వారా ప్రముఖుల నుండి అందిన సమాచారం ఇదేనని ఇబ్నె షిహాబ్ తెలిపారు.

అమ్మ ఆయిషా(ర) ఈ విధంగా చెప్పినట్లు కూడా ఉర్వా ఉటంకించారు: "అల్లాహ్ సాక్షిగా! ఏ సహాబీతోపాటు ఈ అపనిందను అంటగట్టడం జరిగిందో, ఆయన దీనిని గురించి, 'సుబ్‌హానల్లాహ్! ఎవరి చేతిలో నా ప్రాణముందో ఆ ప్రభువు సాక్షిగా! అసలు ఈ రోజు వరకూ నేను ఏ స్త్రీ వస్త్రం కూడా విప్పలేదు' అనేవారు. ఈ సంఘటన జరిగిన కొన్నాళ్ళకే ఆయన దైవమార్గంలో పోరాడి అమరగతినొందారు."

## అధ్యాయం : 7

# దైవ కృప ఉండకపోతే...

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

మీపైన ప్రపంచంలోనూ, పరలోకంలోనూ అల్లాహ్ అనుగ్రహం, ఆయన కారుణ్యం, కృప ఉండకపోతే, మీరు ఏ విషయాలలోనైతే పడిపోయారో, ఆ విషయాల పర్యవసానంగా ఒక పెద్ద శిక్ష మిమ్మల్ని పట్టుకుని ఉండేది. **(24: 14)**

**592)** ఉమ్ముల్ మోమినీన్ ఆయిషా(ర.అ) తల్లి ఉమ్మె రూమాన్ (ర.అ) ఇలా అన్నారు : తనపై మోపబడిన అపనింద వార్త వినగానే ఆయిషా(ర.అ) స్పృహ తప్పి పడిపోయింది.

## అధ్యాయం : 8

# అల్లాహ్ దృష్టిలో ఇది చాలా పెద్ద విషయం

(కాస్త ఆలోచించండి, అప్పుడు మీరు ఎంత ఘోరమైన తప్పు చేశారో) అప్పుడు మీ నాలుకలు ఒక దాని నుండి మరొకటి ఆ అబద్ధాన్ని అందుకుంటూ పోయాయి. మీరు మీకు తెలియని దానిని మీ నోటితో అంటూ పోయారు. మీరు దానిని మామూలు విషయంగా భావించారు. వాస్తవానికి అల్లాహ్ దృష్టిలో అది చాలా పెద్ద విషయం. ***(24: 15)***

**593)** ఇబ్నె అబీ ములైకా ఇలా అన్నారు: అమ్మ ఆయిషా (ర.అ) గారు నూర్ సూరాలోని **15**వ ఆయత్‌ను ఈ విధంగా పఠిస్తూ ఉండగా నేను విన్నాను- **"ఇజ్ తలిఖూనహూ బి అల్‌సినతికుమ్..."**

## అధ్యాయం : 9

# వినగానే దానిని ఎందుకు ఖండించలేదు?

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**మీరు దానిని (ఆ అపనిందను గురించి) వినగానే, "అయ్యో, ఇటువంటి విషయాన్ని నోటితో అనటం మాకు శోభించదు. ఓ అల్లాహ్! నీవు పరిశుద్ధుడవు. ఇదైతే పెద్ద అభాండం" అని ఎందుకు అనలేదు? *(24: 16)***

**594) ఇబ్నె అబీ ములైకా కథనం: అమ్మ ఆయిషా(ర.అ) మరణానికి ముందు– ఆమె గారు మరణ బాధలో ఉండగా– ఇబ్నె అబ్బాస్(రజి) ఆమెను పరామర్శించడానికి వచ్చి లోనికి వచ్చేందుకు అనుమతి కోరారు. అప్పుడామె, 'అయ్యో! ఆయన గారు నన్ను పొగడ్తల్లో ముంచేస్తారన్న భయం నాకు ఉంది' అని పలికారు. 'ఆయన దైవప్రవక్త(స) బాబాయి కుమారుడు కదా! అంతేకాదు, ఆయన స్వతహాగా గౌరవనీయుడు కూడా (కాబట్టి మీరు ఆయనకు అనుమతి ప్రదానం చేయటం సమంజసం)' అని ఎవరో సలహా ఇవ్వగా, 'సరే. అలాగైతే ఆయన్ని లోనికి పిలవండి' అని అమ్మ ఆయిషా(ర.అ) పలికారు.**

**ఇబ్నె అబ్బాస్(రజి) లోనికి రాగానే,'మీరు ఎలా ఉన్నారు?' అని కుశల ప్రశ్నలడిగారు. దానికి ఆమె,'అల్లాహ్ దృష్టిలో నేను మంచిదాన్ని అయితే అంతా మంచే జరుగుతుంది' అని సమాధానమిచ్చారు. 'ఇన్‌షాఅల్లాహ్! మీరు (సదా) మంచివారుగానే ఉంటారు. మీరు దైవప్రవక్త పవిత్ర సతీమణిగా ఉన్నారు. మీరు తప్ప కన్యగా ఉన్న మరే స్త్రీనీ దైవప్రవక్త మనువాడలేదు. మీ నిర్దోషిత్వం గురించి ఆకాశం నుండి వహీ అవతరించింది' అని ఇబ్నె అబ్బాస్(రజి) ప్రస్తుతించారు.**

**ఇబ్నె అబ్బాస్(రజి) వెళ్ళిన తరువాత ఆమె వద్దకు అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ (రజి) వచ్చారు. అప్పుడామె ఇలా అన్నారు: 'ఇందాకే ఇబ్నె అబ్బాస్ వచ్చి నా గురించి పొగిడారు. నేను మరపింపజేయబడిన దాన్నిగా (ప్రస్తావించదగ్గ వస్తువు కాకుండా) ఉంటే బాగుండేదే!' అని నాకు అనిపిస్తోంది.[1]**

---

594–1. గొప్పవారి వినయ గుణం ఇలాగే ఉంటుంది. హజ్రత్ ఆయిషా(ర.అ) ఎన్నడూ తన పేరు ప్రఖ్యాతులను, పొగడ్తలను ఇష్టపడలేదు.

**595)** ఖాసిమ్ బిన్ ముహమ్మద్ కథనం : ఇబ్నె అబ్బాస్(రజి) గారు హజ్రత్ ఆయిషా(ర.అ)ను పరామర్శించడానికి వచ్చేందుకు అనుమతి కోరారు- తరువాత ఉల్లేఖకుడు పైహదీసు (594) మాదిరిగానే అంతా వివరించారు. అయితే ఉల్లే ఖకుడు 'మరపింపజేయబడిన దానిని' అనే వాక్యాన్ని ప్రస్తావించలేదు.

## అధ్యాయం: 10

# హెచ్చరిక

ఇక ముందు ఎన్నడూ ఇటువంటి చేష్ట చేయకూడదని అల్లాహ్ మీకు ఉపదేశిస్తున్నాడు. (24: 17)

**596)** మస్రూఖ్ కథనం: అమ్మ ఆయిషా(ర.అ) వద్దకు రావటానికి హస్సాన్ బిన్ సాబిత్(రఅ) అనుమతి కోరారు. 'అమ్మా! మీరతనికి అనుమతి ఎందుకు ప్రదానం చేస్తారు? (మీపై అపనింద మోపిన వారికి మద్దతు తెలిపిన వారిలో అతను కూడా ఒకడు కదా!)' అని నేను సందేహపడగా, 'ఏమిటి, దానికి తగిన శాస్తి అతనికి జరగలేదా?' అని అమ్మ ఆయిషా(ర.అ) చెప్పారు. తరువాత హస్సాన్(రజి) ఆమెనుద్దేశించి పలికిన కవిత ఇలా ఉంది :

"శీలవతి, వివేకవంతురాలు ఆమె

ఆమె గురించి ఎవరికీ ఎలాంటి సంశయం ఉండదు

ఆమె అమాయికలు, సౌశీల్యవతులైన స్త్రీల మాంసం తినరు (అంటే పరోక్ష నిందకు పాల్పడరు)".

ఈ కవిత విని, "కాని మీరు మాత్రం అలా మసలుకోలేదు" అని చురక అంటించారు అమ్మ ఆయిషా.[1]

## అధ్యాయం : 11

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

అల్లాహ్ మీకు స్పష్టమైన ఉపదేశాలు ఇస్తున్నాడు; ఆయన జ్ఞాని, వివేక వంతుడూను. *(24: 18)*

---

596-1. మహనీయ హస్సాన్ బిన్ సాబిత్(రజి)కు కంటిచూపు పోయింది. దీనిని దృష్టిలో పెట్టుకునే 'ఆయనకు తగిన శాస్తి జరిగింద'ని హజ్రత్ ఆయిషా(ర.అ) చెప్పారు. ఇకపోతే అమ్మ ఆయిషా(ర.అ) హస్సాన్ సేవలను తరచూ కొనియాడేవారు. ముఖ్యంగా సత్యతిరస్కారుల విమర్శలను దైవప్రవక్త(స) తరఫున హస్సాన్ తిప్పికొట్టిన సందర్భాలను ఆమె గుర్తు చేసేవారు.

**597) మస్రూఖ్ కథనం : హస్సాన్ బిన్ సాబిత్(రజి) అమ్మ ఆయిషా(ర.అ) వద్దకు వచ్చి ఈ కవిత చెప్పారు :**

**"శీలవతి, వివేకవంతురాలు ఈమె**

**ఈమె సౌశీల్యం గురించి ఎవరికీ ఏ మాత్రం సంశయం కలగదు**

**ఈమె అమాయికలు, సౌశీల్యవతుల మాంసం**

**ఎంతమాత్రం తినదు (అంటే వారి చాడీలు చెప్పదు)".**

**ఈ కవిత విన్న మీదట ఆయిషా(ర.అ), "నీవు మాత్రం అలాంటి వాడివి కావు కదా!" అన్నారు.**

**ఆ తరువాత నేను ఆమె గారితో, 'అసలు అలాంటి వ్యక్తిని మీ దగ్గరకు ఎందుకు రానిస్తారమ్మా? అల్లాహ్ (ఇలాంటి వాళ్ళ నేపథ్యంలో) ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు కదా! 'ఎవడు ఇందులో ఎంత పాత్ర వహించాడో, వాడు అంతే పాపాన్ని మూటకట్టుకున్నాడు. ఇంకా ఈ బాధ్యతలో పెద్ద భాగాన్ని తన నెత్తిపై వేసుకున్న వ్యక్తికి పెద్ద శిక్షే పడుతుంది' (24: 11) అని చెప్పగా, హజ్రత్ ఆయిషా (ర.అ),'కంటి చూపు పోవటంకన్నా పెద్ద శిక్ష ఇంకేముంటుంది?' అని అన్నారు. ఆ తరువాత ఆమె ఇంకా ఇలా అన్నారు : 'హస్సాన్ దైవప్రవక్త(స) తరఫున సత్య తిరస్కారుల దుర్విమర్శలను తిప్పి కొట్టేవారు (ఈ గౌరవం ఆయనకు సరిపోదా?)'[1]**

**అధ్యాయం : 12**

## అశ్లీలత వ్యాపించాలని కోరే వారి పర్యవసానం

**దైవోపదేశం–**

**విశ్వాసుల వర్గంలో అశ్లీలత వ్యాపించాలని కోరేవారు, ప్రపంచంలోనూ,**

597–1. అమ్మ ఆయిషా(ర.అ) గారి ఈ పలుకుల్లోని అంతరార్థం ఏమిటంటే, హస్సాన్ వల్ల ఒక తప్పు జరిగిన సంగతి వాస్తవమే అయినప్పటికీ, ఆయనలో ఉన్న మరో నైపుణ్యం ఇస్లాం, ఇస్లామ్ ప్రవక్తకు తోడ్పడింది. ఈ ప్రతిభ కారణంగా ఆయన తప్పు మన్నించబడవచ్చు.

వేరొక హదీసు ప్రకారం దైవప్రవక్త(స) హస్సాన్‌తో ఇలా అన్నారు : "(హస్సాన్!) నీవు దైవం, దైవప్రవక్త(స) తరఫున సత్య తిరస్కారుల దుర్విమర్శలను తిప్పికొడుతున్నంత సేపూ పరిశుద్ధాత్మ (జిబ్రయీల్) నీకు అండగా ఉంటారు."

**పరలోకంలోనూ వ్యధాభరితమైన శిక్షకు అర్హులు. అల్లాహ్ ఎరుగును, మీరు ఎరుగరు. ఒకవేళ అల్లాహ్ అనుగ్రహం, ఆయన కృపా కటాక్షాలు మీపైన లేకపోతే, అల్లాహ్ వాత్సల్యం కలవాడు, కరుణామయుడు అయి ఉండకపోతే, (ఇప్పుడు మీ మధ్య వ్యాపింపజేయబడిన విషయం దారుణమైన ఫలితాలకు కారణభూతమై ఉండేది). *(24: 19,20)***

**మీలోని ప్రముఖులు, స్థితిపరులు తమ బంధువులకూ, నిరుపేదలకూ, అల్లాహ్ మార్గంలో వలస వచ్చిన ప్రజలకూ, సహాయం చేయకూడదని ప్రమాణం చేయరాదు. వారిని క్షమించాలి, వారి (తప్పులను)ని ఉపేక్షించాలి. మిమ్మల్ని అల్లాహ్ క్షమించాలని మీరు కోరుకోరా? అల్లాహ్ గుణం ఏమిటంటే, ఆయన క్షమించేవాడు, కరుణించేవాడూను.[1] *(24: 22)***

**598) ఉర్వా బిన్ జుబైర్ కథనం ప్రకారం హ్రజత్ ఆయిషా(ర.అ) ఆయనతో ఇలా అన్నారు :**

**నా గురించి జనులు నేను ఊహించనయినా లేని మాటలు చెప్పుకుంటున్నప్పుడు దైవప్రవక్త(స) ప్రసంగించడానికి వేదిక ఎక్కి నిలబడ్డారు. ఆయన సాక్ష్యవచనాల అనంతరం అల్లాహ్ స్థాయికి తగ్గట్టుగా స్తుతిస్తోత్రాలు చేశారు. పిదప ఇలా అన్నారు: "అమ్మాబాద్! నా భార్య గురించి లేనిపోని మాటలు చెప్పి అప్రతిష్ట పాల్జేస్తున్న వారి గురించి మీరు నాకు సలహా ఇవ్వండి. అల్లాహ్ సాక్షిగా! నేను నా భార్యలో ఎలాంటి చెడును చూసి ఎరుగను. ఏ మగవాని (సఫ్వాన్ బిన్ ముఅత్తల్)తో ఆమెకు సంబంధం అంటగట్టారో అతనిని కూడా నేను ఎరుగుదును. దైవసాక్షిగా! అతనిలో కూడా నేను ఎలాంటి చెడుగును చూడలేదు. అతను నా**

---

12–1. ఈ ఆయత్ మహనీయ అబూబక్ర్(రజి) గురించి అవతరించింది. ఆయన అపనింద (ఇఫ్క్) సంఘటనకు ప్రభావితులై మిస్తహ్(రజి)కు ఆర్థిక సహాయం చేయటం మానేశారు. కాని ఈ విషయం అల్లాహ్‌కు నచ్చలేదు. ఈ ఆయత్‌ను వినగానే అబూ బక్ర్(రజి) గుండె కరిగిపోయింది. 'దేవా! నిశ్చయంగా నేను నీ క్షమను కోరుకుంటు న్నాను. ఈ క్షణం నుంచే నేను మిస్తహ్‌కు ఆర్థిక సాయం చేయటం మొదలెడతాన'ని అన్నారు.

ఆశావహ దృక్పథాన్ని కలిగించే దైవగ్రంథంలోని ఆయత్‌లలో ఈ ఆయత్ ఒకటని మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ముబారక్ అభిప్రాయపడ్డారు.

ఇంటికి ఎప్పుడు వచ్చినా నేనున్న సమయంలోనే వచ్చాడు. నేనెప్పుడయినా ప్రయాణ కారణంగా మదీనాలో లేకుంటే అతను కూడా ఉండడు. అతను ఎల్లప్పుడూ– ప్రయాణంలో– నాతో పాటే ఉంటాడు."

ఈ ప్రసంగం తరువాత సాద్ బిన్ ముఆజ్(రజి) నిలబడి, 'దైవప్రవక్తా! తమరు మాకు ఆనతినిస్తే అలాంటి మగవాళ్ళ మెడలు నరుకుతాం' అన్నారు. ఆ తరువాత ఖజ్రజ్ తెగకు చెందిన ఒక వ్యక్తి (సాద్ బిన్ ఉబాదా) లేచి నిలబడ్డారు. హస్సాన్ బిన్ సాబిత్ తల్లి కూడా ఖజ్రజ్ తెగకు చెందినదే. ఆ వ్యక్తి (సాద్) నిలబడి, 'నీవు అబద్ధం చెబుతున్నావు. నిందారోపణ చేసే వ్యక్తులు గనక ఔస్ తెగవారై ఉంటే నీవు వారి మెడలు నరకటాన్ని ఎన్నటికీ సహించవు' అన్నారు. ఇరు తెగల వారి మధ్యన మాటామాటా పెరిగింది. మస్జిద్‌లోనే ఆ రెండు తెగల వారు పరస్పరం ఘర్షణ పడే ప్రమాదం కనిపించింది. ఆ గొడవ గురించి నాకేమీ తెలియదు.

ఆ రోజు రాత్రే నేను కాలకృత్యాలు తీర్చుకోవడానికి బహిర్ ప్రదేశానికి వెళ్ళాను. మిస్తహ్ తల్లి కూడా నాతోపాటు వచ్చింది. ఆమె దారిలో క్రింద జారి పడింది. ఆ క్షణంలో అప్రయత్నంగా ఆమె నోట, 'అల్లాహ్ మిస్తహ్‌ను నాశనం చెయ్య' అనే మాట వెలువడింది. 'అయ్యో, నీవు సాక్షాత్తూ నీ కొడుకునే అధిక్షేపి స్తున్నావా?' అని నేనన్నాను. ఆమె మౌనం వహించింది. రెండవసారి కూడా ఆమె అలాగే జారి క్రింద పడింది. ఆ సమయంలో కూడా ఆమె నోట అదే మాట– 'అల్లాహ్ మిస్తహ్‌ను నాశనం చెయ్య' అని వెలువడింది. ఈసారి కూడా నేను ఆమె మాటలకు అడ్డు తగులుతూ, 'నీ కన్న కొడుకును అధిక్షేపిస్తావా?' అన్నాను. మూడవసారి జారి పడినప్పుడు కూడా నేనామె మాటలకు అడ్డు తగిలాను. దానికి ఆమె,'అయ్యో తల్లీ! నీ విషయంలోనే కదా నేనతనికి శాపనార్థాలు పెట్టేది' అని చెప్పింది. 'నాకు సంబంధించిన ఏ విషయంలో నీవు అతనికి శాపనార్థాలు పెడు తున్నావు?' అని సూటిగా అడిగేసరికి, ఆ తుఫాను గురించి పూర్తిగా వినిపించింది. 'ఏమిటి, వాళ్ళు నిజంగానే నా గురించి ఇలా చెప్పుకుంటున్నారా?' అని అడిగితే, 'అవును. దైవసాక్షిగా! వాళ్ళు ఈ విధంగా చెప్పుకుంటున్నార'ందామె.

ఈ సంగతి తెలియగానే నాకు కలిగిన దుఃఖం అంతా ఇంతా కాదు.

వెళ్ళిన పని ఏమిటో కూడా పట్టించుకోకుండా నా ఇంటికి తిరిగి వచ్చేశాను. నాకు తీవ్రంగా జ్వరం వచ్చింది. 'నన్ను నా తండ్రి దగ్గరకు చేర్చండి' అని దైవ ప్రవక్త(స)తో అన్నాను. ఆయన(స) నా వెంట ఒక పిల్లవాణ్ణి పంపారు. నేను నా ఇంటికి వెళ్ళినప్పుడు, నా తల్లి ఉమ్మె రూమాన్ (ర.అ) క్రింది భాగంలోనే ఉంది. నాన్న అబూబక్ర్(రజి) పైభాగంలో కూర్చుని ఖుర్ఆన్ పారాయణం చేస్తున్నారు. ఈ సమయంలో ఇలా వచ్చావేమిటమ్మా? అని అడిగితే, జరిగినదంతా వివరించి చెప్పాను. ఈ సంఘటన కారణంగా నాకు కలిగినంత ఆవేదన నా తల్లికి కలగలేదని గ్రహించాను. పైగా ఆమె ఇలా అంది: 'అమ్మాయి! ఎందుకంతగా చింతిస్తున్నావ్? ఒక అందగత్తె అయిన భార్య ఒక పురుషుని దాంపత్యంలో ఉండగా, ఆ పురుషుడు ఆమెను అమితంగా ప్రేమిస్తూ ఉండగా, ఆమెకు సవతులు కూడా ఉండగా వారు ఆమెపై అసూయతో తప్పులెన్నకుండా ఎలా ఉంటారు?' ఈ అపనింద ప్రభావం నాపైన పడినంతగా ఆమెపై పడలేదని నేను అర్థం చేసుకున్నాను. 'ఈ సంగతి నాన్న గారికి కూడా తెలుసా?' అని అడిగితే, 'అవున'ని చెప్పింది అమ్మ. 'దైవప్రవక్త(స)కు కూడా ఈ విషయాలన్నీ తెలుసా?' అని అడిగాను. 'అన్ని విషయాలు ఆయన(స)కు తెలుసు' అని చెప్పింది. ఇది వినగానే నేను వలవలా ఏడ్వసాగాను. నా ఏడుపు విని, ఖుర్ఆన్ పారాయణం చేస్తున్న నాన్న (అబూబక్ర్) గారు క్రిందికి దిగి వచ్చారు. 'ఇంతకీ ఈమెకేమయింది? ఎందుకు ఏడుస్తోంది?' అని ఆయన మా అమ్మను అడిగారు. ఈమె గురించి లోకులు చెప్పుకుంటున్న మాటలన్నీ ఈమెకు తెలిసిపోయాయని చెప్పింది మా అమ్మ. అంతే, ఆయన కళ్ళు కూడా చెమర్చాయి. 'అమ్మా! దైవసాక్షిగా చెబుతున్నాను. నీవు వెంటనే నీ ఇంటికి వెళ్ళిపో' అని నాన్న గారు సూచించారు. దాంతో నేను తిరిగి వెళ్ళిపోయాను. ఆ సమయంలో దైవప్రవక్త(స) కుటీరంలోనే ఉన్నారు. సేవకురాలైన బరీరాను, నా గురించి విచారణ జరుపుతున్నారు. ఆమె ఇలా అంది: 'కాదు. దైవసాక్షిగా చెబుతున్నాను. నేనామెలో ఏ లోపాన్నీ చూడలేదు. కాకపోతే చిన్నపిల్ల అయిన కారణంగా పిండి నానబెట్టి నిద్రలోకి జారుకుంటూ ఉంటుంది. అంతలోనే మేక వచ్చి నానబెట్టిన పిండి కాస్తా తినేసిపోతుంది.'

ప్రవక్త సహచర మాన్యులు కొందరు (ముఖ్యంగా మహనీయ అలీ-రజి-

పేరు వచ్చింది) ఆమెను గట్టిగా మందలిస్తూ, 'మాట సూటిగా చెప్పు. డొంక తిరుగుడుగా మాట్లాడవద్దు' అని అనేసరికి బరీరా ఇలా అంది : 'సుబ్‌హానల్లాహ్! ఒక స్వర్ణకారునికి మేలిమి బంగారం గురించి ఎలా తెలుసో నాకు ఆయిషా(ర.అ) గురించి అలాగే తెలుసు (ఆమె మేలిమి బంగారం)'.

ఇక ఏ వ్యక్తితో ఆమెకు సంబంధం అంటగట్టడం జరిగిందో ఆ వ్యక్తికి ఈ విషయం తెలిసినప్పుడు, 'సుబ్‌హానల్లా! అల్లాహ్ సాక్షిగా చెబుతున్నాను. ఈనాటి వరకూ నేను ఏ స్త్రీ బట్టలూ విప్పలేదు' అని చెప్పారు. తరువాత ఆ వ్యక్తి దైవ మార్గంలో అమరగతి నొందారని హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు.

ఆమె ఇంకా ఇలా అన్నారు : ప్రభాత సమయాన నా తల్లిదండ్రులు నా దగ్గరకు వచ్చి, నా దగ్గరే ఉండిపోయారు. అస్ర్ నమాజ్ చేసిన తరువాత దైవప్రవక్త(స) నా దగ్గరకు వచ్చారు. నా తల్లిదండ్రులు నా ఇరువైపులా కూర్చుని ఓదారుస్తూ ఉన్నారు. దైవప్రవక్త(సఅసమ్) అల్లాహ్‌ను స్తుతించిన మీదట, "అమ్మాబాద్! ఆయిషా! నీవు నిజంగానే ఏదయినా తప్పు చేసి, నీ ఆత్మకు అన్యాయం చేసుకుని ఉంటే దైవసన్నిధిలో పశ్చాత్తాపపడు. ఎందుకంటే అల్లాహ్ తన దాసుల పశ్చాత్తాపాన్ని ఆమోదిస్తాడు" అని అన్నారు.

ఆయిషా(ర.అ) ఇలా అన్నారు: ఒక అన్సార్ మహిళ కూడా ఆ సమయంలో అక్కడకు వచ్చి, గుమ్మం వద్ద కూర్చుని ఉంది. 'కనీసం ఈ మహిళ ఇక్కడ కూర్చుని ఉందన్న ధ్యాస కూడా మీకు లేదా? ఆమె (తనకు అర్థమైన రీతిలో) బయట చెప్పు కుంటూ తిరగదా!?' అని నేనన్నాను.

తరువాత దైవప్రవక్త(స) నాకు హితోపదేశం చేశారు. నేను నా తండ్రి వైపు తిరిగి, 'దీనికి మీరే సమాధానం చెప్పండి' అన్నాను. 'నేనేమని చెప్పను?' అని అన్నారాయన. ఆ తర్వాత నేను నా తల్లితో, 'నువ్వయినా చెప్పమ్మా' అన్నాను. ఆమె కూడా అదే అంది- 'ఏం చెప్పాలో నాకు తోచటంలేద'ని. ఎవరూ నా తరపున ఏమీ చెప్పకపోవడంతో నేనే స్వయంగా చెప్పాల్సివచ్చింది. సాక్ష్య వచనం తర్వాత అల్లాహ్ ఘనత్వానికి తగిన విధంగా ఆయన్ని కీర్తించాను. అనంతరం ఇలా అన్నాను- 'అమ్మాబాద్! అల్లాహ్ సాక్షిగా! నేను ఇలాంటి పనేది చేయలేదని మీతో చెప్పినా (నేను నా సాక్ష్యంలో సత్యవంతురాలినన్న విషయం అల్లాహ్‌కు

బాగా తెలుసు) మీ అభిప్రాయం మారదు. ఎందుకంటే ఈ విషయం మీ నరనరాల్లో పెనవేసుకుపోయింది. ఒకవేళ నేను ఈ చేష్టకు ఒడిగట్టానని అంటే (నేను ఆ పని చేయలేదన్న సంగతి అల్లాహ్‌కు బాగా తెలుసు), ఆమె స్వయంగా తన నేరాన్ని అంగీకరించిందని మీరంతా అంటారు. దైవసాక్షిగా! నా ఉపమానం, మీ ఉపమానం యూసుఫ్ (అలైహిస్సలామ్) తండ్రి లాంటిది. ఆ సందర్భంగా ఆయన ఇలా అన్నారు: 'సహనం వహించటమే మంచిది. మీరు కల్పించే మాటలపై నేను అల్లాహ్ సహాయాన్నే అర్థిస్తాను.' ఆ సమయంలో నేను మహనీయ యాఖూబ్(అలైహిస్సలామ్) పేరును జ్ఞప్తికి తెచ్చుకోవడానికి చాలా ప్రయత్నించాను. కాని మానసిక క్షోభ వల్ల నాకు ఆయన పేరు జ్ఞప్తికి రాలేదు. సరిగ్గా ఆ సమయం లోనే ప్రవక్త మహనీయుల(సఅసమ్)పై 'వహీ' అవతరించటం మొదలయింది. మేమందరం నిశ్శబ్దంగా ఉండిపోయాం. వహీ అవతరణ పూర్తవగానే, ఆయన(స) ముఖారవిందంపై సంతోషం వ్యక్తం కావటం నేను గమనించాను. ఆయన(స) తన నుదుటికి పట్టిన శ్వేత బిందువులను తుడుచుకుంటూ, "ఆయిషా! నీకు శుభం. అల్లాహ్ నీ సౌశీల్యం గురించి ప్రకటన అవతరింపజేశాడు" అని చెప్పారు. ఆ క్షణంలో నేను చాలా కోపావేశంలో ఉన్నాను. 'అమ్మా! దైవప్రవక్త(స) సమక్షంలో నిలబడు' అని నా తల్లిదండ్రులు సూచించారు. 'దైవసాక్షిగా! నేను ఈయన సమక్షంలో నిలబడటం గానీ, ఈయనకు కృతజ్ఞతలు తెలుపుకోవటం గానీ చేయను. మీకూ కృతజ్ఞతలు తెలుపను. నా నిర్దోషిత్వం గురించి వహీ (దైవవాణి) అవతరింపజేసిన అల్లాహ్‌కు మాత్రమే కృతజ్ఞతలు అర్పిస్తాను. (ఎందుకంటే) మీరంతా ఈ వదంతుల్ని విన్నప్పుడు వాటిని ఖండించలేకపోయారు. కనీసం వాటికి తెరదించేందుకు కూడా ప్రయత్నించలేద'ని అన్నాను.

ఆయిషా(ర.అ) ఇంకా ఇలా అన్నారు: జైనబ్ బిన్తె జహ్ష్(ర.అ)ను అల్లాహ్, ఆమె ధర్మనిష్ఠ కారణంగా ఈ ఉపద్రవంలో పడకుండా కాపాడాడు. నా గురించి ఆమె మంచి విషయం తప్ప మరో మాట అనలేదు. కాకపోతే ఆమె సోదరి హమ్నా నాశనమయ్యే వారి పంచన చేరి నాశనమైపోయింది. ఈ ఉపద్రవాన్ని వ్యాపింప జేయటంలో మిస్తహ్, హస్సాన్, కపట విశ్వాసి అబ్దుల్లాహ్ బిన్ ఉబై తమ వంతు పాత్ర పోషించారు. అబ్దుల్లాహ్ బిన్ ఉబై అయితే కూపీలు లాగే ప్రయత్నం చేస్తూ,

**దానికి లేనిపోని వ్యాఖ్యలు కూడా జోడించేవాడు. ఈ మొత్తం ఉపద్రవానికి మూల కారకుడు అతనే. "ఈ బాధ్యతలో పెద్ద భాగాన్ని తన నెత్తిపై వేసుకున్న వానికి పెద్ద శిక్షే పడుతుంది" అనే వాక్యం అబ్దుల్లాహ్ బిన్ ఉబైతో పాటు హమ్నా బిన్తె జహ్షుకు వర్తిస్తుంది.**

**హజ్రత్ ఆయిషా(ర.అ) ఇంకా ఇలా అన్నారు: మిస్తహ్ బిన్ ఉసాసాకు ఇక మీదట ఎన్నడూ ఆర్థిక సాయం అందించబోనని అబూబక్ర్(రజి) ఒట్టేసుకున్నారు. దానిపై ఈ ఆయత్ అవతరించింది: "మీలోని ప్రముఖులు, స్థితిపరులు తమ బంధువులకూ, నిరుపేదలకూ, అల్లాహ్ మార్గంలో హిజ్రత్ చేసిన ప్రజలకూ...". ఇందులో 'ప్రముఖులు, స్థితిపరులు' అనే వాక్యం అబూబక్ర్(రజి)కు వర్తిస్తుంది. 'బంధువులు, నిరుపేదలు' అనేది మిస్తహ్‌కు వర్తిస్తుంది. "మిమ్మల్ని అల్లాహ్ క్షమించాలని మీరు కోరుకోరా? అల్లాహ్ గుణం ఏమిటంటే ఆయన క్షమించేవాడు, కరుణించేవాడూను" అనే వాక్యం విని అబూబక్ర్(రజి) ఇలా అన్నారు : 'అవును, దైవసాక్షిగా! మా ప్రభూ! నీవు మమ్మల్ని క్షమించాలన్నదే మా అభిలాష'- ఆ తర్వాత ఆయన మునుపటి వలెనే మిస్తహ్‌కు ఆర్థిక సహాయం చేయసాగారు.[1]**

## అధ్యాయం : 13

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

**(ప్రవక్తా! విశ్వసించిన మహిళలకు ఇలా చెప్పు) వారు తమ వక్ష స్థలాలను ఓణీ అంచులతో కప్పుకోవాలి. (24: 31)**

**599) అమ్మ ఆయిషా(ర.అ) ఉర్వాతో ఇలా అన్నారు : మొదటి హిజ్రత్**

---

598-1. దైవప్రవక్త(సఅసమ్)కు అగోచర విషయాల జ్ఞానం లేదన్న దానికి ఈ హదీసు ప్రబల తార్కాణం. ఆయన(స)కు అగోచర జ్ఞానం ఉందని చెప్పేవారు తమ మాటల్లో అతిశయిల్లుతున్నారు. ఆయనకే గనక అగోచర విషయాల జ్ఞానం ఉండి ఉంటే, వదంతులు వ్యాపించిన మొదటి రోజే ఆ అబద్ధాన్ని ఖండించి శత్రువుల నోరు మూయించేవారు. కాని ఈ వ్యవహారంలో ఆయన అనేక రోజులపాటు దైవసందేశం (వహీ) కొరకు నిరీక్షించవలసి వచ్చింది. చివరకు సూరయె నూర్ అవతరించింది. అల్లాహ్ హజ్రత్ ఆయిషా(ర.అ) సౌశీల్యాన్ని గురించి ప్రళయ దినం వరకూ ఆయత్‌లను ఖుర్‌ఆన్‌లో భద్రపరిచాడు.

**చేసిన మహిళలపై అల్లాహ్ దయజూపు గాక! "వారు తమ వక్ష స్థలాలను తమ ఓణీ అంచులతో కప్పుకోవాలి" అనే ఆయత్‌ను అల్లాహ్ అవతరింపజేసినప్పుడు, వారు తమ దుప్పట్లను చించి వాటిని వోణీలుగా చేసుకున్నారు.**

**600) సఫియ్యా బిన్తె షైబాతో అమ్మ ఆయిషా(ర.అ) ఇలా అన్నారు : "వారు తమ వక్ష స్థలాలను తమ ఓణీ అంచులతో కప్పుకోవాలి" అనే దైవ వచనం అవతరించినప్పుడు, అన్సార్ స్త్రీలు తమ శరీర వస్త్రాల ఇరువైపుల అంచులను చింపి, వాటిని వోణీలుగా చేసుకున్నారు.**[1]

---

600-1. అరబ్బు మహిళలు చొక్కాలు తొడిగేవారు. వాటి ముందు భాగం విచ్చుకుని ఉండటం వల్ల వక్ష స్థలాలపై దృష్టి పడేది. అందువల్ల ఓణీలతో వాటిని కప్పుకోవలసిందిగా ఆజ్ఞాపించడం జరిగింది.